శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

రెండవ భాగము

విషయసూచిక

చతుర్థాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమం బగు ధర్మంబు సెప్పుట	12 - 168 - 2	505
మేధావి యను బ్రాహ్మణకుమారుఁడు దన తండ్రితోఁ జేసిన సంవాదము	12 - 169 - 2	513
భీష్ముఁడు ధర్మజునకు మంకి యను బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట	12 - 171 - 4	521
అజగరచరితవ్రతము	12 - 172 - 2, 3	526
భీష్ముఁడు ధర్మరాజునకుఁ బృథివ్యాది భూతోత్పత్తి క్రమం బెఱింగించుట	12 - 175 - 5	536
భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన వర్ణాశ్రమాచారక్రమము	12 - 181 - 1	543
భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱింగించుట	12 - 186 - 2	550
ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట	12 - 188 - 1	555
యమకాలమృత్యుభూసురేక్ష్వాకుల సంవాదము	12 - 189 - 6	556
కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయిన సంవాదము	12 - 192 - 2, 3	561
కౌశికేక్ష్వాకులు బ్రహ్మపదప్రాప్తు లగుట	12 - 193 - 18	572
మను బృహస్పతి సంవాదము	12 - 194 - 2	575
బృహస్పతి మనువున కుపదేశించిన మాయాప్రకారము	12 - 198 - 1, 2	582
భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్ర ప్రభావంబు తెఱం గెఱింగించుట	12 - 200 - 3	590
భీష్ముండు ధర్మజున కధ్యాత్మ విద్యాప్రకారం బెఱింగించుట	12 - 203 - 1, 2	611
భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్రప్రభావం బెఱింగించుట	12 - 204 - 7, 8	617
భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱింగించుట	12 - 209 - 1, 2	631

పంచశిఖుం డను విప్రుండు జనకునకుఁ దత్త్వోపదేశంబు సేయుట	12 - 211 - 6, 8	639
ఇంద్ర ప్రహ్లాద సంవాద ప్రకారము	12 - 212 - 3	647
ఇంద్ర బలిచక్రవర్తి సంవాద ప్రకారము	12 - 216 - 2	654
ఇంద్ర నముచి సంవాద ప్రకారము	12 - 219 - 1, 2	662
ఇంద్ర బలి సంవాద ప్రకారము	12 - 220 - 6	665

పంచమాశ్వాసము

శ్రీ శక్ర సంవాద ప్రకారము	12 - 221 - 3	679
దేవల జైగీషవ్య సంవాద ప్రకారము	12 - 222 - 34	685
ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాద ప్రకారము	12 - 223 - 23	688
వ్యాసుఁడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము	12 - 224 - 6	690
చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము	12 - 224 - 18	692
దానగుణంబు సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట	12 - 226 - 14, 15	703
వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మ ప్రాప్తిసాధన ప్రకారము	12 - 231 - 3	710
బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబని చెప్పుట	12 - 234 - 12	718
వ్యాసుఁడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము	12 - 237 - 27, 28	724
ఇంద్రియనిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట	12 - 242 - 1, 2	734
భీష్ముఁడు ధర్మరాజునకు మృత్యుదేవత తెఱం గెఱిఁగించుట	12 - 148 - 7	742
జాజలి తులాధారుల సంవాద ప్రకారము	12 - 252 - 1	750
తులాధారుఁడు జాజలికిం జెప్పిన బ్రహ్మగీతలు	12 - 256 - 7	758
చిరకారి యను మునికుమారుని చరిత్ర	12 - 258 - 2	762
కపిల గో సంవాద ప్రకారము	12 - 260 - 5	773
కపిలుఁడు సూర్యమరీచికి వేదంబులు ముఖ్యప్రమాణంబులుగాఁ జెప్పుట	12 - 262 - 14, 1	782
కుండధారుం డను దేవానుచరుని వృత్తాంతము	12 - 263 - 2	787
నారద ప్రవర్తితం బగు నితిహాసము	12 - 264 - 2	792
భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట	12 - 268 - 2	793

జనకరాజ మాండవ్య మహామునుల సంవాద ప్రకారము	12 - 268 - 3	797
పితాపుత్ర సంవాదము	----------	799
హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము	12 - 269 - 2	804
వృత్రగీత	12 - 270 - 13	806
ఇంద్రవృత్రాసురుల యుద్ధప్రకారము	12 - 272 - 7	813
దక్షముఖ ధ్వంసంబు నప్పుడు శివునివలన జ్వరం బుద్భవించిన ప్రకారము	12 - 274 - 4	819
శాస్త్రతత్త్వం బెఱుంగని వాఁడు సేయవలసిన విధము	12 - 276 - 3	822
అరిష్టనేమి యను ముని సగరున కుపదేశించిన ధర్మప్రకారము	12 - 277 - 2	826
శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము	12 - 278 - 4	829
జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మప్రకారము	12 - 279 - 3	832
జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము	12 - 280 - 12	843
హంసగీత	12 - 288 - 1, 2	850
భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్రప్రకారము చెప్పుట	12 - 289 - 2	859
భీష్ముఁడు ధర్మజునకు సాంఖ్యస్వరూప నిరూపణంబు సేయుట	12 - 290 - 3	867
ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము	12 - 290 - 80, 81	873

షష్ఠాశ్వాసము

భీష్ముని ధర్మజుండు ప్రశంసించి యక్షరక్షరంబుల నడుగుట	12 - 291 - 1	883
వసిష్ఠ జనకరాజ సంవాద ప్రకారము	12 - 291 - 7	886
వసిష్ఠుఁడు జనకున కక్షరక్షర తత్త్వంబుల తెఱం గెఱింగించుట	12 - 291 - 13	893
విద్యావిద్యల ప్రకార నిరూపణము	12 - 295 - 1	899
యాజ్ఞవల్క్య జనకరాజ సంవాద ప్రకారము	12 - 298 - 3	910
అధ్యాత్మాధిభూతాధిదైవత ప్రకారము	12 - 301 - 1	914
యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణసూచకంబులఁ జెప్పుట	12 - 305 - 7	925
విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డుపదేశించిన తత్త్వ ప్రకారము	12 - 306 - 30	930
భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు సెప్పుట	12 - 308 - 3	941

జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట	12 - 308 - 95, 96	948
వేదవ్యాసుఁడు శుకున కుపదేశించిన వైరాగ్య ప్రకారము	12 - 309 - 2	958
భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు సెప్పుట	12 - 310 - 1	966
జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మ ప్రకారము	12 - 313 - 9	976
శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట	12 - 314 - 2	982
నారదుఁడు శుకున కుపదేశించిన తత్త్వప్రకారము	12 - 316 - 5	990
వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున నదృశ్యం డగుట	12 - 320 - 2, 3	997
భీష్ముఁడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు సెప్పుట	12 - 321 - 7	1003
ఏకతద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట	12 - 323 - 19	1010
శ్వేతద్వీపవాసి యగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము	12 - 326 - 10, 11	1016
విష్ణుఁ డదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హితప్రకారము	12 - 327 - 47,48,49	1026
భగవన్నామ నిర్వచన ప్రకారము	12 - 318 - 3	1032
శివకేశవుల పరస్పర కోప ప్రసాదముల విధము	12 - 309 - 2	1041
నరనారాయణ నారద సల్లాప ప్రకారము	12 - 331 - 36	1045
హయగ్రీవదేవ మాహాత్మ్యాభివర్ణనము	12 - 335 - 9, 10	1050
వైశంపాయనుఁడు జనమేజయున కేకాంతికధర్మ మెఱింగించుట	12 - 336 - 8	1056
వేదవ్యాసునకు నారాయణనందనత్వంబు గలిగిన ప్రకారము	12 - 336 - 24	1063
ఇంద్రునకు నారదుడు సెప్పిన భృగునామక విప్రుని చరిత్రము	12 - 340 - 4, 5	1071
భృగుం డను విప్రుండు పద్ముం డను సర్పరాజుం గనవచ్చుట	12 - 343 - 2	1077
పద్ముఁ డను సర్పరాజు భృగు డను విప్రుం గానవచ్చుట	12 - 349 - 2, 3	1087
ఉంఛవృత్తిమహిమ	12 - 350 - 8	1091

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీశ్రిత వక్షస్థల! గౌ । రీశ్రిత వామాంగ! సుభగ రేఖా సంప
త్త్యశ్రాన్త తనూలలిత! స । మాశ్రిత జన నిత్య ఫలిత! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= హరిహరనాథుడా!; శ్రీ= లక్ష్మిచేత; శ్రిత= ఆశ్రయించబడిన; వక్షస్థల!= రొమ్ము భాగం కలవాడా!; గౌరీ= పార్వతిచేత; శ్రిత= ఆశ్రయించబడిన; వామ+అంగ!= ఎడమ శరీరం కలవాడా!; సుభగ= ఇంపైన; రేఖా= (సౌందర్య) రేఖల; సంపత్తి= సంపదచేత; అశ్రాన్త= వాడిపోని; తనూ= శరీరముచే; లలిత= సుకుమారమైనవాడా!; సమ్+ఆశ్రిత జన= బాగుగా ఆశ్రయించిన (శరణుజొచ్చిన) జనులకు; నిత్య= ఎల్లప్పుడు; ఫలిత!= ఫలితమైన (ప్రయోజనకరమైన)వాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: వక్షస్థలాన లక్ష్మిని, వామభాగాన గౌరిని ధరించి ఇంపైన రేఖాసంపదలతో శరీర సౌకుమార్యం వాడని వాడా! ఆశ్రితజనులకు నిత్యమూ ఫలితాలు అందించేవాడా! హరిహరనాథ దేవా!

విశేషం: కావ్యాలను అంకితం చేసినవారు, అంటే కవులు, తమ కావ్యస్వీకర్త లను అంకితం గ్రహించినవారిని సంబోధించిన తరువాతే ఆశ్వాస ప్రారంభంగాని, ఆశ్వాస సమాప్తిగాని చేయాలి. కావ్యమంతటిని ఆ స్వీకర్తకు వినిపిస్తున్నట్లుగా పేరుపెట్టి పిలిచి ఆ తరువాత కథా ప్రారంభం చేస్తారు కవులు.

భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమంబగు ధర్మంబు సెప్పుట (సం. 12-168-2)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు బహు ప్రకారంబుల శాంతనవుండు వివరింప రాజధర్మంబులు విని ధర్మనందనుండు దమ్ములుం దానును బ్రియం బందె; నమ్మందాకినీ నందనుం డతనితో 'నా యెఱింగిన తెఱంగునం బ్రజ్ఞాకరంబులగు వాక్యప్రకరంబు లుపన్యసించితి; నింకనేమి విన నిచ్ఛ సేసెద?' వనిన నా దేవవ్రతునకు నన్నరదేవోత్తముండు వినయం బెసఁగ వినతుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడు అనే పేరుగల వ్యాస శిష్యుడయిన ఋషి; జనమేజయునకున్= జనమేజయుడు అనే మహారాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; బహు ప్రకారంబులన్= అనేక విధాలుగా; శాంతనవుండు= శంతనుడి తనయుడు - భీష్ముడు; వివరింపన్= వివరంగా చెప్పగా; రాజధర్మంబులు= రాజుయొక్క విధులు; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్ముడి (యముడి) తనయుడు ధర్మరాజు; తమ్ములున్+తానును= తమ్ములూ, తానూ; ప్రియంబు+అందెన్= ప్రీతిని పొందాడు; ఆ+మందాకినీ నందనుండు= ఆ గంగానది తనయుడు - భీష్ముడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; నా+ఎఱింగిన తెఱంగునన్= నేను తెలిసికొన్న విధంగా; ప్రజ్ఞాకరంబులు+అగు= బుద్ధిని కలిగించెడి; వాక్యప్రకరంబులు= మాటల సమూహాలను; ఉపన్యసించితిన్= తెలియ బలికాను; ఇంకన్= ఇంకా; ఏమి వినన్+ఇచ్ఛ+చేసెదవు?= ఏమి వినటానికి కోరుచున్నావు?; అనినన్= అనగా; ఆ దేవవ్రతునకున్= ఆ దేవవ్రతుడు అనే పేరుగల

భీష్ముడికి; ఆ+నరదేవ+ఉత్తముండు= ఆ రాజులలో శ్రేష్ఠుడు; వినయంబు+ఎసఁగన్= అణకువ కనుపించగా; వినతుండు+ఐ= నమస్కరించినవాడై.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! పూర్వకథ అనంతరం మళ్ళీ ఆ వైశంపాయన ఋషి తన ఎదుటగల జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు. ఆ విధంగా అనేక విధాలయిన రాజధర్మాలను భీష్మ పితామహుడు వివరించి చెప్పగా, ధర్మరాజూ, అతని తమ్ములూ విని సంతోషించారు. తరువాత మళ్ళీ ఆ తాతగారు మనుమడితో 'నాకు తెలిసినంతవరకు ప్రజ్ఞను పెంచే మాటలు అనేకం నీకు వినిపించాను. ఇంకా ఏమి వినటానికి ఉత్సహిస్తున్నావు?' అని అన్నాడు. దానికి బదులుగా ఆ ధర్మరాజు అణకువతో నమస్కరించి తిరిగి తన కోరికను ఇట్లా పేర్కొంటున్నాడు.

క. 'రాజోచిత ధర్మంబుల । యోజ విశదభంగిఁ జెప్పి తుజ్జ్వల విసర
త్తేజోధన! నాకు సకల । భూజన పరమ హిత ధర్మముం దెలుపు దయన్. 3

ప్రతిపదార్థం: ఉత్+జ్వల విసరత్+తేజస్+ధన!= బాగుగా ప్రకాశించే, వ్యాపించే, కాంతియే ధనంగా కలవాడా!; రాజ+ఉచిత ధర్మంబుల(న్)= రాజులకు తగిన ధర్మాలను; ఓజన్= క్రమంగా; విశదభంగిన్= స్పష్టమైన రీతిలో; చెప్పితి(వి)= పలికితివి; నాకున్= రాజునైన నాకు; సకల భూజన పరమహిత ధర్మమున్= ఎల్ల పుడమి జనులకు మిక్కిలి మేలు అయిన ధర్మమును; దయన్= దయతో; తెలుపు(ము)= తెలియజెప్పుము.

తాత్పర్యం: ఉజ్జ్వలమై వ్యాపించే తేజస్సుతో వెలుగుతున్న ఓ పితామహా! ఇంతవరకు రాజునైన నాకు రాజోచితధర్మాలు స్పష్టంగా క్రమంగా వినిపించావు. ఇపుడు నేను ఈ సకల భూజనులకూ గొప్ప మేలు కలిగించగల ధర్మమేదో, దానిని తెలిసికొనాలి అనుకొంటున్నాను. దయతో దానిని తెలియజెప్పుము.

క. ఉత్తమ మెయ్యది?' నావుడు । నత్తటినీ నందనుఁడు సమాదర సమ్య
క్చిత్తుఁ డగుచు నక్కురు భూ । పోత్తమునకు నిట్టు లనియె నుర్వీనాథా! 4

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; ఉత్తమము+ఏ+అది= శ్రేష్ఠము ఏది?; నావుడున్= అనిన అనంతరం; ఆ+తటినీ నందనుఁడు= ఆ నదీతనయుడు భీష్ముడు; సమ్+ఆదర సమ్యక్+చిత్తుఁడు+అగుచున్= మంచి ఆదరంతో తిన్ననైన మనస్సు కలవాడై; ఆ+కురుభూప+ఉత్తమునకున్= ఆ కురురాజులలో శ్రేష్ఠునకు - ధర్మరాజునకు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఏది సర్వోత్తమ ధర్మం?' అనే ధర్మజుడి ప్రశ్న విన్న వెంటనే ఆ గంగాతనయుడైన భీష్ముడు మంచి ఆదరంతో తన మనస్సును తేటపరచుకొని ఆ కురురాజశ్రేష్ఠుడితో ఇట్లా అన్నాడు. ఓ రాజా!

తే. 'వినుమనేక విధంబుల విస్తరిల్లు । ధర్మములయం దొకండును దలఁప నిష్ఫ
లంబు లే; దాత్మ మోక్షావలంబి యైన । ధర్మ ముత్తమ మండ్రు తత్త్వజ్ఞు లధిప! 5

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; వినుము= ఆలకింపుము; అనేకవిధంబులన్= అనేక పద్ధతులతో; విస్తరిల్లు= వ్యాపించే; ధర్మములఅందున్= విధి నిషేధ రూపమైన ఆచార వ్యవహారాలలో; ఒకండును= ఒక్కటికూడా; తలఁపన్= ఆలోచించగా; నిష్ఫలంబు లేదు= ఫలితంలేనిది లేదు; తత్త్వజ్ఞులు= ధర్మముల స్వరూప స్వభావాలు తెలిసినవారు; ఆత్మమోక్ష+అవలంబి+ఐన ధర్మము= తన మోక్షంకొరకు అవలంబించిన ధర్మం; ఉత్తమము+అండ్రు= శ్రేష్ఠం అంటారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. ధర్మం అనేక విధాలుగా విస్తరిల్లి ఉన్నది. దానిలో ఎంతగా వైవిధ్యమున్నా, మరెంతగా విస్తృతి ఉన్నా, మొత్తంమీద సర్వమూ ఆచరణయోగ్యమే. దానిలో ఒక్కటి కూడా ఫలితం సాధించలేనిది లేదు. కాని, ధర్మతత్త్వం తెలిసినవారు మాత్రం తమకు ముక్తిని ప్రసాదించగలదే శ్రేష్ఠధర్మమని పలుకుతారు.

విశేషం: ధర్మాలు సమయ సందర్భాలనుబట్టి దేశకాలానుబట్టి అనేక విధాలుగా ఉంటూ ఉంటాయి. కొన్ని సందర్భాలలో వాటిలో భేదాలు, మరికొన్ని సందర్భాలలో సాదృశ్యాలూ కనిపించవచ్చును. ఏది ఎట్లా ఉన్నా ధర్మమన్న ప్రతిదీ ఆచరణకు ఉద్దిష్టమైనదే. ఆచరిస్తే తప్పక ఫలితాన్ని అందించేదే. నిష్ప్రయోజనమైన ధర్మం ఉండదు. అయితే ఆ ప్రయోజనాలలో హెచ్చు తగ్గులు ఉండవచ్చును. ఆ దృష్టితో చూచినప్పుడు అన్ని ప్రయోజనాలకు చివరిదైన మోక్షమనే దాన్ని ఒసగగల ధర్మమే శ్రేష్ఠం.

క. ప్రియములు నప్రియములును హృ । దయమునఁ బొరయమియ మోక్షదంబగు ధర్మం
బయమహితా! తద్బోధ వి । షయ మగు నితిహాసముం బ్రసన్నాకృతిగన్. 6

ప్రతిపదార్థం: అయమహితా!= శుభములచే మహనీయుడా!; ప్రియములున్= ఇష్టములును; అప్రియములును= అనిష్టములును; హృదయమునన్= మనస్సునందు; పొరయమి+అ= కలుగకుండుటయే; మోక్షదంబు+అగు= మోక్షమును ఇచ్చేది అయిన; ధర్మంబు= ధర్మం - విధినిషేధరూపమైన ఆచారం; తద్+బోధ విషయము+అగున్= ఆ జ్ఞానము గోచరించెడిదగు; ఇతిహాసమున్= పూర్వచరిత్రను; ప్రసన్న+ఆకృతిగన్= స్పష్టమైన రూపం కలిగేటట్లుగా.

తాత్పర్యం: ఓ రాజా! ఇష్టానిష్టాలను హృదయంలో కలుగకుండా చూడగలగటమే మోక్షప్రదమయిన ధర్మం. శుభకరమైన కార్యాల యెడ ప్రీతిగల ఓ ధర్మనందనా! ప్రియాప్రియాలు మనస్సులో కలుగకుండా జీవించటం ఎట్లా సాధ్యమో, ఎప్పుడు అటువంటి మానసిక స్థైర్యం మానవుడికి సిద్ధిస్తుందో తెలియజేసే పూర్వకథ ఒకటి స్పష్టంగా వినిపిస్తాను.

విశేషం: చెప్పటానికి సులభంగా ఉన్నదిగాని, ఈ ధర్మం ఆచరణలో అత్యధిక జనులకు అసాధ్యం. శుభాశుభాలు, ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు వంటి ద్వంద్వాలు సృష్టిలో జీవరాశులన్నిటికి వలె మానవునకూ సంక్రమిస్తాయి. అయితే జ్ఞానబలంగల విశిష్ట మానవుడు మాత్రం ఈ ద్వంద్వాలకు అతీతంగా తన మనస్సును నిలుపగలుగుతాడు.

వ. చెప్పెద నాకర్ణింపుము. సేనజితుం డనురాజు పుత్రశోకార్తుం డయి యున్నయెడఁ దదాప్తుండగు విప్రుం డతని కిట్లనియె. 7

ప్రతిపదార్థం: చెప్పెదన్= పలికెదను; ఆకర్ణింపుము= వినుము; సేనజితుండు+అనురాజు= సేనజితుడు అనే పేరుగల రాజు; పుత్రశోక+ఆర్తుండు+అయి= కొడుకు ఎడబాటువలన దుఃఖంతో బాధనొందినవాడై; ఉన్న+ఎడన్= ఉన్న సమయాన; తద్+ఆప్తుండు+అగు= అతడి స్నేహితుడయిన; విప్రుండు= బ్రాహ్మణుడు; అతనికిన్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సేనజితుడనే రాజు పుత్రమరణంతో కలిగిన శోకంతో ఆర్తిగొని ఉన్న సమయాన అతడి స్నేహితుడైన ఒక బ్రాహ్మణుడు, ఆతడికి ఇట్లా హితబోధ చేశాడు.

క. 'ఇది యేమి? శోకమున వం । దెదు? పుట్టిన వారి కెల్లఁ దెరు వారయఁగా
నిదియె; భవత్సుతుఁ డొకనికె? । వదలు వనట; మూఢునట్ల వనరం దగునే?' 8

ప్రతిపదార్థం: ఇది+ఏమి?= ఈ స్థితి ఎందుకు?; శోకమునన్= ఎడబాటువలన దుఃఖంతో; వందెదు?= చింతించెదవు?; పుట్టినవారికి+ఎల్లన్= పుట్టినట్టి అందరికీ; తెరువు= పద్ధతి, గతి; ఆరయఁగాన్= పరిశీలిస్తే; ఇదియె= ఇదే; భవత్+సుతుఁడు+ఒకనికె?= నీ కొడుకు ఒక్కనికేనా?; వనట= దుఃఖం; వదలు= విడువుము; మూఢు+అట్ల= తెలివిలేనివాడివలె; వనరన్= దుఃఖించగా; తగునే?= తగునా?

తాత్పర్యం: శోకంతో విలపించటం ఏమిటిది? ఈ సృష్టిలో పుట్టిన ఎల్లవారికీ తప్పనిసరి గతి ఇది - ఆలోచించి చూస్తే అటువంటప్పుడు ఈ గతి నీ కొడుకుకు ఒక్కడికే ఈ భూమిమీద జరిగినట్లు బాధపడటం మూఢత్వమౌతుంది. దుఃఖించటం మానుము. దుఃఖం ఈ సందర్భాన యుక్తమా! ఆలోచించుము.'

వ. అనిన విని యజ్జనపతి 'నీ వేమిటంజేసి వగపు వారిం?' తనవుడు నతం డతని కిట్లనియె. 9

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ రాజు; నీవు+ఏమిటన్+చేసి= నీవు ఏ పద్ధతితో; వగపు= దుఃఖం; వారింతు(వు)?= తొలగింతువు?; అనవుడున్= అనిన వెంటనే; అతండు= ఆ విప్రుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ రాజునకు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సేనజితుడు ఆ విప్రుడి మాటల తీరుచూచి ఆశ్చర్యపడి అతడిని ప్రశ్నించాడు. 'నీవు ఏ విధంగా ఈ శోకాన్ని తొలగించుకొన్నావు? మరణమెంత సహజమో, శోకమూ అంతే సహజం ఈ రాజు దృష్టిలో. కాబట్టి నీకు ఈ శోక బాధ ఎట్లా తప్పింది?' అని ప్రశ్నించాడు. దానికి ఆ విప్రుడి సమాధాన మిది.

క. 'కదియుం గాష్ఠముఁ గాష్ఠము । నదిలో మఱికొంత సేపునకుఁ బాయును నె
మ్మది నట్లుగఁ దలఁపఁగ వల । వదె పితృ పుత్రాది బంధు వర్గము నధిపా! 10

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నదిలోన్= నదియందు; కాష్ఠమున్= కర్ర; కాష్ఠము= కర్ర; కదియున్= సమీపిస్తుంది; మఱికొంత సేపునకున్= మరల కొంత సమయం తరువాత; పాయును= విడిపోతుంది; నెఱ+మదిన్= నిండుమనసులో; పితృపుత్ర+ఆదిబంధు వర్గమున్= తండ్రి కొడుకు మొదలైన బంధువుల సమూహమును అట్లుగన్= ఆ విధంగా; తలఁపఁగన్= ఆలోచించగా; వలవదు+ఎ?= వద్దా?; (అట్లు తలపవద్దా?)

తాత్పర్యం: 'రాజా! నది ప్రవహిస్తూ ఉండగా, ఆ ప్రవాహంలో ఒక కర్రను మరొక కర్ర చేరుకొంటుంది. ఆ చేరిక ఆ ప్రవాహవేగం అనుమతించినంతవరకే. కొంతసేపటికి ఆ చేరిన కర్రలు రెండూ విడిపోతాయి. కలయిక ఎంత సహజంగా జరిగిందో, ఎడబాటూ అంతే సహజంగా జరుగుతుంది. నిండు మనస్సుతో భూమిమీద సంబంధ బాంధవ్యాలను కూడా అవి తండ్రి కొడుకులకు చెందినవైనా, ఆలుమగలకు చెందినవైనా అట్లాగే ఆ ప్రవాహంలోని కర్రల కలయికవలెనే చూడాలి. కలయికలూ ఎడబాటులూ యాదృచ్ఛికంగా మన ప్రమేయం లేకుండా జరిగిపోతాయి.

విశేషం: ఇక్కడ నదీప్రవాహం కాలం. కాలంకూడా నిరంతరం గమనశీలమై, ఆగకుండా సాగిపోతూనే ఉంటుంది. కాలప్రవాహంలో కాష్ఠాలు అంటే కట్టెలు ఈ జీవులు. కాష్ఠమనేమాట శరీరాన్ని దాని అశాశ్వతత్వాన్ని స్ఫురింపజేయటానికి వాడబడింది. నదిలో కర్రలవలెనే కాలగమనంలో తండ్రి కొడుకులు కలిసికొంటారు. ఆ కలయికకు వారి ప్రమేయం లేదు. కర్రలు నదిలో తాము కావాలని కలవవు. అట్లాగే సంబంధ బాంధవ్యాలుకూడా కాల ప్రవాహంలో యాదృచ్ఛికంగా జరిగేవే కాబట్టి వాటికోసం శోకించరాదు.

క. తనకుం దా నెర వనినను । విను బంధులు సతమె? య న్వివేకంబున నే
జనులపయిఁ జేయ నర్మిలి । నను వగ వొంద దది కారణముగ నరేంద్రా! 11

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= నరులకు అధిపతి - రాజా!; వినుము= ఆలకించుము; తనకున్= తనకు (ఎల్లవారికి, నీకు, నాకు, ఇతరునకు); తాన్= తాను; ఎరవు= అన్యము; అనినను= అనగా; బంధులు= చుట్టములు; సతమె?= శాశ్వతమా?; అన్+వివేకంబునన్= అనే పరిజ్ఞానంలో; నే= నేను; జనులపయిన్= ఇతర జనులమీద; అర్మిలిన్= ప్రేమను; చేయను= చేయను; అది కారణముగన్= ఆ కారణంచేత; ననున్= నన్ను; వగ= దుఃఖము; పొందదు= చేరదు.

తాత్పర్యం: రాజా! వినుము. నాలో ఒక గట్టి జ్ఞానం ఉన్నది. అదేమిటంటే మానవుడికి ఎవనికయినా, తనకు తానే అన్యం. శాశ్వతం కాదు. అటువంటప్పుడు తనవారు, తన సంతానం, బంధువులు ముక్తిప్రాప్తికి కారణం కానేకారు. ఈ వివేకంతో నేను నాకు భిన్నులయిన జనులమీద ప్రేమను పెంచుకోను. ప్రేమ లేనప్పుడు వియోగంవలన శోకమూ ఏర్పడదు. కాబట్టి నన్ను ఏ దుఃఖమూ దరిచేరదు.

విశేషం: మానవుడికి మనస్సే సుఖదుఃఖాలను అనుభవానికి తెస్తుంది. ఈ అర్థాన్నే 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోఃʼఅనే ఉపనిషత్సూక్తి వివరిస్తుంది. జ్ఞానాజ్ఞానాలు మనస్సునకు చెందినవే. కాబట్టి మనస్సులో ఇతరజనులయెడ వారు ఎవరైనా సరే స్వసంతానమైనా బంధువులైనా ప్రేమే ఏర్పడకుండా నిగ్రహించుకొనగలిగితే వారితో ఎడబాటు కలిగినప్పుడు శోకమూ కలుగదు. దానికి 'తనకు తానే మార్గముʼ అనే జ్ఞానం మూలంగా నిలుస్తుంది. ఆ మూలజ్ఞానాన్ని మనస్సున నిల్పుకొనగలిగితే ముక్తి సులభం.

క. నరనాథ! సుఖము దుఃఖముఁ । బరువడిమెయిఁ బొరయుఁ గాక! పన్నుగ నరునిం
బొరయునె యం దొక్కటి? యవి । పొరసిన వల దూఁద మోదమును ఖేదంబున్. 12

ప్రతిపదార్థం: నరనాథ!= మానవులకు అధిపతీ! ఓ రాజా!; సుఖము దుఃఖమున్= సుఖంగాని, దుఃఖంగాని; పరువడిమెయిన్= క్రమంతో; పొరయున్+కాక= కలుగును కాక; పన్నుగన్= ఒప్పగా; నరునిన్= మానవుడిని; పొరయునె?= పొందునా?; అందున్= ఆ రెంటిలో, సుఖదుఃఖములలో; ఒక్కటి= ఒక్కటైనా పొందునా? (పొందలేడని తాత్పర్యం); అవి= ఆ సుఖదుఃఖాలు; పొరసినన్= కలిగితే; మోదమును= సంతోషమును; ఖేదంబున్= సంతాపమును; ఊఁదన్= వహించగా; వలవదు= కూడదు.

తాత్పర్యం: రాజా! వివేచించి చూస్తే మానవుడికి లోకాన సుఖదుఃఖాలు క్రమంగా కలుగుతాయి. అంతే కాని సుఖదుఃఖాలలో ఏ ఒక్కటీ నరుడిని తాకదు. కాబట్టి సుఖదుఃఖాలు పొందినపుడు సంతోషాన్నిగాని, సంతాపాన్నిగాని పొందకుండా ఉండాలి.

విశేషం: ఈ పద్యానికి మూలం:

సుఖస్యానన్తరం దుఃఖం దుఃఖస్యానన్తరం సుఖమ్,
సుఖ దుఃఖే మనుష్యాణాం చక్రవ త్పరివర్తతఃʼ.
సుఖా త్త్వం దుఃఖ మాపన్నఃʼ పునరాపత్స్యసే సుఖమ్,
న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్.

క. ఇది నాయది యను నూఁత । న్మది నెయ్యది పట్టుకొల్పినను వాసితమై
తుదిఁ జేటునొంది వానికి । నది శోకము నావహించు నత్యంతంబున్. 13

ప్రతిపదార్థం: ఇది= ఈ పదార్థం; నా+అది= నాది; అను= అనెడి; ఊఁతన్= అండను; మదిన్= మనస్సునందు; ఏ+అది= ఏది; పట్టుకొల్పినను= నెలకొల్పినా; వాసితమై= వాసన కలిగినదై; తుదిన్= చివరకు; చేటును+ఒంది= నాశనాన్ని పొంది; వానికిన్= దానిని మనస్సున నెలకొల్పుకొన్నవానికి; అది= ఆ పదార్థం; శోకమున్= ఎడబాటు వలన దుఃఖమును; అతి+అంతంబున్= అత్యధికంగా; ఆవహించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: మానవుడు 'ఇది నాది' అనే భావంతో ఏ పదార్థాన్ని తన మనస్సులో నిలుపుకొంటాడో - ఆ పదార్థం, అది చేతనమైనా అచేతనమైనా అనేక వాసనలను భావనాజనితమైన సంస్కారాలను అతడి మనస్సులో కలిగిస్తుంది. ఆ తరువాత అది నశిస్తుంది - సహజంగానే. అపుడు ఆ మానవుడు అత్యధికంగా శోకించక తప్పదు.

విశేషం: ఈ పద్యంలో 'వాసితము' అనే పదం ప్రయుక్తమై ఉన్నది. దానికి అర్థం తెలిసికొని ఉన్నాం. వాసన అనేమాట పారమార్థిక చర్చలో సామాన్యం. ఆత్మ ఈ వాసనల కారణంగానే పునఃజన్మిస్తుందని కొందరి విశ్వాసం. ఈ వాసనలనే కొందరు సంస్కారాలు అంటారు. పూర్వజన్మవాసన. సంస్కారం అంటూ ఈ రెండు పదాలూ పర్యాయాలుగానే వాడుతున్నాం. ఈ వాసనలు, సంస్కారాలు మనస్సు నంటుకొంటాయి. దానికి హేతువు 'ఇది నాయది అను ఊఁత'. ఇది నాది అనే గాఢమైన భావన మనస్సున నెలకొన్నప్పుడు, ఆ పదార్థం నశించినా, ఆ వాసనలు మనస్సును వీడవు. కర్పూరం తొలగినా, అది కట్టిన గుడ్డ గుబాళిస్తూనే ఉంటుంది కదా! మనస్సూ అంతే. ఆ కారణంగానే ఆయా పదార్థాల నాశనం, అనివార్యమై జరిగినప్పుడు మానవుడు తల్లడిల్లిపోతాడు.

క. వినుము, పురాతన జన్మం । బునఁ జేసిన యట్టి కర్మముల ఫలములు ప్రా
జ్ఞునినైనఁ బొందు వానికి । మనుజేశ్వర! మందు ధైర్యమహిమయ చుమ్మీ. 14

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= మానవులకు అధిపతీ! రాజా!; వినుము= ఆలకించుము; పురాతన జన్మంబునన్= పూర్వజన్మలో; చేసిన+అట్టి కర్మముల ఫలములు= చేసినటువంటి కర్మల ఫలితాలు; ప్రాజ్ఞునిన్+ఐనన్= పండితుడినికూడా; పొందున్= చెందును; దానికిన్= ఆ కర్మల ఫలితములకు; మందు= నివారణౌషధం; ధైర్యమహిమ+అ= ధీరత్వపు గొప్పతనమే; చుమ్మీ= (చూడుమీ) సుమీ.

తాత్పర్యం: రాజా! వినుము. పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితాలు మిగిలి ఉంటే, అవి తప్పక ఈ జన్మలో నరుడిని చేరుతాయి. ఈ కర్మఫలాల అనుభవం విషయంలో పామరుడైనా, పండితుడైనా ఒక్కటే. పండితుడికి మినహాయింపు లేదు. 'అయితే మరి, ఆ కర్మ ఫలితాల అనుభవానికి నివారణౌషధమే లేదా!' అంటావా? ఉంది గొప్ప ధీరత్వంతో వాటిని స్వీకరించటమే ఆ నివారణమార్గం.

విశేషం: కర్మఫలానుభవానికి నివారణ మార్గం లేదు. ధైర్యంగా అంగీకరించి అనుభవించటమే ఎంత పండితుడైనా చేయవలసిన పని. కారణకార్య సంబంధాన్ని ఎవరూ ఆపలేరు. కారణం కర్మ అయితే కార్యం ఫలితం. గంటకొట్టి శబ్దం రాకుండా నిరోధించలేము. చేసిన పనికి ఫలితం అనుభవించవలసిందే.

క. పరమ సుఖము దృష్ణ యుడుగు । టరయఁగ ని ట్లగుట పింగళాలాపములం
బరిబోధితమగు ధరణీ । శ్వర! చెప్పెదఁ దెలియ వినుము వాని తెఱంగున్. 15

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూమికి అధిపతివైన రాజా!; అరయఁగన్= పరిశీలించగా; తృష్ణ+ఉడుగుట= అత్యాశను విడుచుట; పరమసుఖము= మిక్కిలి సుఖం; ఇట్లు+అగుట= ఈ విధంగా అగుట (తృష్ణ ఉడుగుట); పింగళా+ఆలాపములన్= పింగళ అనే వేశ్యయొక్క మాటలచేత; పరిబోధితము+అగున్= బాగుగా తెలియబడింది అగును; చెప్పెదన్= చెప్పుతాను; తెలియన్= తెలిసేటట్లుగా; వాని తెఱంగున్= ఆ మాటల విధమును; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: రాజా! పరిశీలించిచూస్తే గొప్ప సుఖ మనేది వాంఛను వదలిపెట్టటంలోనే ఉన్నది. అ దెట్లాగు? అంటావా? ఈ సత్యం పింగళ అనే వేశ్య స్వానుభవంతో పలికిన పలుకులలో వ్యక్తమై అర్థమవుతుంది. తెలియజెప్పుతాను-వినుము.

విశేషం: తృష్ణ అనే మాట బౌద్ధవాఙ్మయంలో ప్రచురంగా కనిపిస్తుంది. ఆశించి దొరకలేదని దుఃఖించటం కంటె అసలు ఆశనే వదలుకుంటే అదే ఆనందమనే భావన ప్రథమంగా బౌద్ధంనుండి వెలువడి ఉండవచ్చును అనే వాదమూ ఉన్నది.

వ. పింగళయను వేశ్యదన కూర్చువాని రాక వార్చి పెద్దయుం బ్రొద్దు వోవునంతకు నుండి వాఁడు రాకుండుటయును. **16**

ప్రతిపదార్థం: పింగళ+అను వేశ్య= పింగళ అనే పేరుగల వెలయాలు; తన కూర్చువాని రాక= తనకు ఇష్టుడగు వాని రాకను; వార్చి= ఎదురుచూచి; పెద్దయును+ప్రొద్దు= ఎక్కువ కాలం; పోవునంతకున్= కడచునంతవరకు; ఉండి= నిలిచి; వాఁడు= ఆ ఇష్టుడైనవాడు; రాక+ఉండుటయును= రాకుండా ఉండగా.

తాత్పర్యం: పింగళ అనే వేశ్య తన ప్రియుడికొరకు ఎదురుచూస్తూ చాలా సమయం గడిపింది. అయినా అతడు రాలేదు. అప్పుడు ఆ వేశ్య ఆత్మగతంగా ఇట్లా తలపోసింది.

ఆ. 'ఏను వేఁదు అగుడు వాని నివ్వేదుఱ । పట్టఁ జదురుగలదె! భ్రాంతి దొఱఁగి
యొంటి కంబ మొప్పు నింటి వాకిళులు దొ । మ్మిదియు నెఱయమూసి నిదురవోదు. **17**

ప్రతిపదార్థం: ఏను= నేను; వేఁదుఱు+అగుడున్= వెర్రిని అయిన వెంటనే; వానిన్= అతడిని (తాను ఎదురుచూచే ప్రియుడిని); ఈ+వేదుఱు+అ= ఈ వెర్రియే; పట్టన్= పట్టుకొనే; చదురు= రీతి; కలదె?= ఉన్నదా?; భ్రాంతిన్= భ్రమను; తొఱఁగి= విడిచి; ఒంటికంబము= ఒక స్తంభం; ఒప్పు= తగు; ఇంటి వాకిళులు= ఇంటియొక్క వాకిళ్ళు - ద్వారములు; తొమ్మిదియున్= తొమ్మిదింటిని; నెఱయన్ మూసి= నిండుగా మూసివేసి; నిదుర+పోదున్= నిద్రపోతాను.

తాత్పర్యం: 'నేను నా ప్రియుడి కొరకు పిచ్చిదాన్ని అయ్యాను. అయితే నాకే పిచ్చిపట్టిన వెంటనే నా ప్రియుడికీ ఈ పిచ్చి పట్టే వీలుందా! లేదు. కాబట్టి ఈ భ్రమను వదలుకొని ఒంటి కంబంతో ఒప్పి ఉన్న ఈ నా (శరీరమనే) ఇంటిలోని తొమ్మిది వాకిళ్ళూ బాగా మూసికొని నిద్రపోతాను.

విశేషం: పింగళ వేశ్య. ప్రియుడికోసం పరితపిస్తూ వెర్రిదై నిరీక్షించింది. ఇంకా నిరీక్షించింది. ఎంతసేపో నిరీక్షించింది. అపుడు ఆమె మనస్సులో ఈ భావం కలిగింది. 'నాకు పట్టిన ఈ వెర్రి వాడే కావాలి, రావాలి అనే పిచ్చితనం నాకు కలిగినట్టే వాడికీ కలుగుతున్నది అని నియమం లేదు. అయినా నేను నిరీక్షిస్తున్నాను. ఇది భ్రాంతి. లేనిదానిని ఉన్నట్లుగ తలచి, మేల్కొని ఉండటం మానుకుంటాను. నే నుండే ఈ ఇంటి వాకిలేగాకుండా నిజమైన నేను (ఆత్మ) ఉండే ఈ దేహమనే, ఇంటి వాకిళ్ళు తొమ్మిదీ (నవరంధ్రాలు - కళ్ళు, ముక్కులు, చెవులు మొ॥నవి) గట్టిగా మూసేసి నిద్రిస్తాను - ప్రశాంతంగా అని ఇంకా ఆ వేశ్య తన తలంపును ఇట్లా కొనసాగిస్తున్నది.

క. పొంతకు వచ్చిన వానిన । కాంతునిగాఁ గొనుచు నొరునిఁ గాంక్షింపక యే
నెంతయు నూఱడి మనమునఁ । జింత యొకఁడు లేకయున్నఁ జెందు సుఖంబుల్. **18**

ప్రతిపదార్థం: పొంతకున్= చెంతకు; వచ్చినవానిని+అ= చేరిన వ్యక్తినే; కాంతునిగాన్= ప్రియుడిగా; కొనుచున్= స్వీకరిస్తూ; ఒరునిన్= ఇతరుని; కాంక్షింపక= కోరక; ఏను= నేను; ఎంతయున్= ఎంతగానో, ఎక్కువగా; ఊఱడి= తృప్తిచెంది; మనమునన్= మనస్సునందు; చింత+ఒకఁడున్= దిగులు ఒక్కటికూడా; లేక+ఉన్నన్= లేకుండా ఉన్నట్లయితే; సుఖంబుల్= సుఖాలు; చెందున్= కలుగుతాయి.

తాత్పర్యం: చెంతకు చేరినవాడే ప్రియుడు అనుకొని ఇతరుడిపై కోరికమాని, తృప్తితో మనస్సున ఏ దిగులూ లేకుండా ఉంటే సుఖాలు నన్ను చేరుకొంటాయి.

విశేషం: సుఖపడాలంటే మనిషికి రెండు గుణాలు ఉండాలి. 1). తృప్తి; 2). నిగ్రహం. ఇక్కడ చేరినవాడే ప్రియుడు అనుకొనటం తృప్తి. మనస్సున చింతలేమి నిగ్రహం. ఆ వేశ్య తలపులు ఇంకా ఈ విధంగా కొనసాగినాయి.

క. ఆశయ యింద్రియ జయము వి । నాశముఁ బొందించుఁ గావునం దొఱఁగెద నే
నాశను; సౌఖ్యము నిచ్చు ని । రాశయ' యని పలికి యట్టిదై నిద్రించెన్.' 19

ప్రతిపదార్థం: ఆశ+అ= ఆశయే; ఇంద్రియ జయమున్= ఇంద్రియముల గెలుపును; వినాశమున్= చేటును; పొందించున్= కలిగించును; కావునన్= కాబట్టి, నేను; ఆశను= కోరికను; తొఱఁగెదన్= విడిచెదను; నిర్+ఆశ+అ= ఆశ లేకుండుటయే; సౌఖ్యమున్= సుఖమును; ఇచ్చున్= ఈయగలదు; అని; పలికి= చెప్పి; అట్టిదై= ఆ విధంగలదై, ఆశ ఉడిగినదై; నిద్రించెన్= నిద్రపోయింది.

తాత్పర్యం: ఆలోచించిచూస్తే ఆశే ఇంద్రియలోలుని చేసి మనిషిని క్రుంగదీస్తుంది. మనిషి ఓటమి పాలు కావటానికి కోరికే కారణం. మనిషి వినాశానికీ ఆశ ఒక్కటే హేతువు. కాబట్టి నేను ఆశను వదలుకొని ఇంద్రియాలను జయించి, వినాశానికి దూరంగా సుఖంగా జీవిస్తాను. సౌఖ్యప్రదాయి నిరాశ ఒక్కటే' అని పలికి, పలుకునకు తగిన మనఃప్రవృత్తితో శాంతంగా నిద్రించింది - పింగళ.'

విశేషం: ఆశా నిరాశలు రెండింటి కేంద్రమూ మనస్సు ఒకటే. కాబట్టి దాన్ని నిగ్రహించటమే సౌఖ్యానికి సోపానం.

వ. అని విప్రుం డుపదేశించిన వాక్యంబులం గలంకదేఱి సేనజిత్తు సుఖి యయ్యెఁ; నీవును నందలి తాత్పర్యం బను సంధించి శాంతినొందు మని చెప్పినఁ గుంతీ తనయాగ్రజుండు శాంతనవుతో 'భూతక్షయావహంబగు కాలం బతిక్రాంతం బగుచున్నయది; యట్లుండ జనంబుల కెయ్యది కర్తవ్యంబు లుపదేశింపు' మనిన నమ్మనుజపతిం బ్రీతిం గనుంగొని 'యమ్మహితాత్ముండు పితాపుత్ర సంవాదంబను నితిహాసంబు గల దాకర్ణింపుము; దాన నీ యడిగినయది దేటపడు' నని పలికి యిట్లనియె. 20

ప్రతిపదార్థం: అని= పలికి; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉపదేశించిన వాక్యంబులన్= బోధించిన మాటలతో; కలంక+తేఱి= కలత తొలగి; సేనజిత్తు= సేనజితుడనే రాజు; సుఖి+అయ్యెన్= సుఖం కలవాడైనాడు; నీవునున్= నీవుకూడా; అందలి= ఆ ఉపదేశము నందలి; తాత్పర్యంబు= నిజమైన అర్థమును; అనుసంధించి= గ్రహించి; శాంతిని+ఒందుము= శాంతిని పొందుము; అని చెప్పినన్= అని పలుకగా; కుంతీ తనయ+అగ్రజుండు= కుంతికుమారులలో మొదట జన్మించినవాడు - ధర్మరాజు; శాంతనవుతోన్= శంతనుడి తనయుడితో, భీష్ముడితో; భూతక్షయ+ఆవహంబు+అగు= జీవులకు నాశనం కలిగించెడిదగు; కాలంబు= యుగాంతరమైన కాలము; అతిక్రాంతంబు= జరిగిపోయేదిగా; అగుచున్న+అది= ఔతున్నది; అట్లు+ఉండన్= ఆ విధంగా ఉన్నప్పుడు; జనంబులకున్= ప్రజలకు; ఏ+అది= ఏది; కర్తవ్యంబు= చేయవలసినది; ఉపదేశింపుము= బోధించుము; అనినన్= పలుకగా; ఆ+మనుజపతిన్= ఆ మానవుల అధిపతిని రాజును; ప్రీతిన్= ప్రేమతో; కనుంగొని= చూచి; ఆ+మహిత+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మకలవాడు - భీష్ముడు; పితాపుత్ర సంవాదంబు+అను= తండ్రీకొడుకుల సంవాదం అనే; ఇతిహాసంబు= పూర్వచరిత్ర; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీవు అడిగిన అంశం; తేటపడున్= స్పష్టపడుతుంది, తెలియును; అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా పింగళావృత్తాంతాన్ని విప్రుడిద్వారా విన్న సేనజిత్తు మనస్సు కలత తీరి సుఖంగా జీవించాడు. నీవు కూడా ఆ కథలోని అంతరార్థాన్ని గ్రహించి మనఃక్లేశం మాని శాంతితో జీవించుము - అని తాత మనుమడికి

చెప్పాడు. తరువాత ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు. 'జీవరాశులు నశించిపోయే కాలం దాపురించింది. ఈ పరిస్థితులలో ప్రజలు ఏమి చేయాలి? బోధించుము.' ఆ ప్రశ్నతో ఆ మహాత్ముడైన భీష్ముడు ఆ రాజును ప్రేమతో చూస్తూ 'తండ్రీ కొడుకుల సంవాదం' అనే పూర్వకథ ఒకటి ఉన్నది వినుము. దాని వలన నీ ప్రశ్నకు సమాధానం తెలుస్తుంది' అని ఇట్లా అన్నాడు.

మేధావియను బ్రాహ్మణకుమారుఁడు దన తండ్రితోఁ జేసిన సంవాదము (సం. 12-169-2)

సీ. 'వేదవిదుం డగు విప్రనందనుఁడు మే । ధావి నామకుఁడు మేధావివరుఁడు
సత్సమయంబున జనకుతో 'నాయువు । జనులకు వేగంబ చనుచునుండు;
దీనిపైఁ గనువెట్టి ధీరత దలకొల్పి । మేలు వాటిల్ల నెమ్మెయిఁ జరించు
వా రొకో?' యనవుడు వానికి ని ట్లనుఁ । దండ్రి 'యాలును నపత్యంబు గలుగు

ఆ. తెఱఁగు నడపి యజ్ఞతృప్తనిర్జరుఁ డయి । శమము నొంది కాననమున కేఁగి
సౌమ్యవృత్తి ముక్తి సాధించి మృత్యువు । నలఘునియతి గెలువవలయు ననఘ! 21

ప్రతిపదార్థం: వేదవిదుండు+అగు= వేదముల నెరిగినవాడైన; విప్రనందనుఁడు= బ్రాహ్మణ కుమారుడు; మేధావి వరుఁడు= తెలివిగల వారిలో శ్రేష్ఠుడు; మేధావి నామకుఁడు= మేధావి అను పేరుకలవాడు; సత్ సమయంబున(న్)= మంచి (అనువైన) కాలమునందు; జనకుతోన్= తండ్రితో; ఆయువు= బ్రతికి ఉండేకాలము; జనులకున్= ప్రజలకు; వేగంబు+అ= త్వరగానే; చనుచున్+ఉండున్= కడచిపోతూ ఉంటుంది; దీనిపైన్= ఈ అంశంమీద; కను+పెట్టి= కన్ను ఉంచి (చూపు నిలిపి); ధీరత= ధైర్యం; తలకొల్పి= నెలకొల్పి; మేలు= మంచి; పాటిల్లన్= కలుగునట్లుగా; ఏ+మెయిన్= ఏ విధంగా; చరించువారు+ఒకో!= ప్రవర్తిస్తారో (నడచుకొనవలసినవారో); అనవుడున్= అనిన వెంటనే; వానికిన్= ఆ కుమారునికి (మేధావికి); తండ్రి= అతని తండ్రి; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికెను; అనఘ!= పాపరహితుడా!; ఆలును= భార్యయు; అపత్యంబు= బిడ్డ; కలుగు తెఱఁగు= కలిగే విధం; నడపి= ఏర్పరచి; యజ్ఞతృప్త నిర్జరుఁడు+అయి= యాగాలతో తృప్తిపరచబడిన దేవతలు కలవాడై; శమమున్= శాంతిని; ఒంది= పొంది; కాననమునకున్= అడవికి; ఏఁగి= వెళ్ళి; సౌమ్యవృత్తిన్= మృదువైన నడతతో; ముక్తి= మోక్షం; సాధించి= వశపరచుకొని; మృత్యువున్= మరణాన్ని; అలఘు నియతిన్= గొప్ప నియమంతో; గెలువన్+వలయున్= జయించాలి.

తాత్పర్యం: మేధావి అనే పేరుగల బ్రాహ్మణకుమారు డొకడు ఉన్నాడు. అతడు వేదాలు తెలిసినవాడు. మేధావులలో శ్రేష్ఠుడు. అతడు ఒకనాడు మంచి సమయంలో తన తండ్రిని ఇట్లా ప్రశ్నించాడు. 'లోకంలో ప్రజలకు ఆయువు త్వరత్వరగా గడచిపోతూ ఉంటుంది. ఆ విషయం తెలిసికొని వారు ఏ పద్ధతిలో ఏ మార్గాన చరించి మేలు పొందగలుగుతారు?' ఆ ప్రశ్నకు అతడి తండ్రి ఇచ్చిన సమాధాన మిది. 'ఓ పాపరహితుడా! పెండ్లిచేసికొని భార్యను పొంది, సంతతిని కని, యజ్ఞాలతో దేవతలను తృప్తిపరచి ఆ తరువాత శాంతిని పొంది, సంసారాన్ని చాలించి, అడవికి వెళ్ళి ప్రశాంతజీవనం సాగిస్తూ మోక్షాన్ని సాధించాలి. ఆ విధంగా మృత్యువును మానవుడు గెలువగలడు' అని.

విశేషం: తనయుడి ప్రశ్న, దానికి తండ్రి ఇచ్చిన సమాధానం రెండూ మానవజీవన ప్రయోజనానికి సంబంధించినవి. నశ్వరమైన ఈ దేహంద్వారా అనశ్వరమైన శాశ్వతసౌఖ్యప్రదాయకమైన ముక్తిని పొందే మార్గమేమిటి? - అనేది ప్రశ్న. దాని సమాధానం సంప్రదాయబద్ధంగా ముందు గృహస్థ స్థితినీ, ఆ తరువాత వానప్రస్థ ఆశ్రమాన్ని ముగించి, అనంతరం ముక్తిని పొందాలి - అని ఈ గతానుగతికమైన సమాధానాన్ని ఆ మేధావి స్వీకరించే స్థితిలో లేడు. అందువలన అతడు తండ్రితో తిరిగి ఇట్లా సంవదిస్తున్నాడు.

వ. అనిన విని మేధావి తండ్రి కి ట్లనియె. 22

ప్రతిపదార్థం: అనినన్= (తండ్రి) పలుకగా; విని= ఆలకించి; మేధావి= ఆ పేరు గల బ్రాహ్మణ కుమారుడు; తండ్రికిన్; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఆ తండ్రి సమాధానం విన్న తనయుడు మేధావి తిరిగి తన తండ్రితో ఇట్లా అన్నాడు.

సీ. 'నిక్కమ కాలంబు నీకుఁ గొంత గలట్లు । వలికెదు; నీవు గర్భంబు సొచ్చి
నప్పటి నుండియు ననవేషణము సేయుఁ । గొనిపోవుటకు మృత్యు వని యెఱుంగు;
మివిరెడు నీటి మీనవు గావె? దారపు । త్రాదిసక్తుండగు నతనిఁ గాన
నమున సుప్తుండైన నరుఁ బులి గొనిపోవు । నట్టులు సూ మృత్యు వపహరించుఁ;

తే. జేసినది సేయుచున్నది సేయవలయు । నది యనంగల కార్యంబులందుఁ దగులు
వాని మృత్యు వేపునఁ దన వశముఁ జేయుఁ । గాన కాలంబు నేమనఁ గాదు తండ్రి! 23

ప్రతిపదార్థం: తండ్రి!= ఓ జనకా!; నిక్కము+అ= నిజముగానే; కాలంబు= ఆయువు; నీకున్ (ప్రతి మానవుడికి) కొంత+కల+అట్లు= కొంత ఉన్న విధంగా; పలికెదు= మాట్లాడుతున్నావు; మృత్యువు= మరణం; నీవు (ప్రతి మనిషి - ప్రాణి) గర్భంబు+చొచ్చిన+అప్పటి నుండియున్= కడుపున ప్రవేశించిన వేళనుండి కూడా; కొనిపోవుటకున్= తీసికొనివెళ్ళుటకు; అన్వేషణము+చేయున్= వెదకుట చేయును; అని; ఎఱుంగుము= తెలిసికొనుము; ఇవిరెడు= ఇంకిపోయెడి; నీటి= నీటి యందలి; మీనవు+కాదె?= చేపవు కావా?; దారపుత్ర+ఆది సక్తుండు+అగు+అతనిన్= భార్య, కొడుకు మొదలగు వారియెడ ఆసక్తుడయ్యే వాడిని; కాననమునన్= అడవిలో; సుప్తుండు+అయిన నరున్= నిద్రించిన మనిషిని; పులి; కొనిపోవు+అట్టులు= తీసికొనిపోవు విధంగా; మృత్యువు= మరణము; అపహరించున్ సూ= దొంగిలించును (కొనిపోవును) సుమా!; చేసినది= చేసివేసినది (భూతకాలికం); చేయుచున్నది= చేస్తూ ఉన్నది (వర్తమాన కాలికం); చేయన్ వలయునది= చేయవలసి ఉన్నది (భవిష్యత్కాలికం); అనన్+కలకార్యంబులందున్= అని మూడు విధాల ఉన్న పనులలో; తగులువానిన్= ఆసక్తుడయినవాడిని; మృత్యువు= మరణం; ఏపునన్= బలంతో; తన వశమున్= తనకు లోబడినవాడినిగా; చేయున్= చేస్తుంది; కానన్= కాపున; కాలంబున్= కాలాన్ని; ఏమి+అనన్+కాదు= ఏమీ అనటానికి (వీలు) కాదు.

తాత్పర్యం: 'తండ్రీ! నిజంగా కాలం కొంత నీ అధీనంలో ఉన్నట్లు పలుకుతున్నావు. కాని, మానవుడు తల్లి కడుపున పడిన మరుక్షణం నుండే మృత్యువు అతడిని వెన్నంటి వేటాడుతూ తీసికొనిపోవటానికి యత్నిస్తూ ఉంటుంది. అని తెలిసికొమ్ము. ఇగిరిపోయే నీటిలోని చేపవు నీవు. నీ జీవితం నీ అధీనంలో లేదు. ఆలుబిడ్డలు అంటూ తాపత్రయ పడే మనిషిని మృత్యువు అడవిలో ఆదమరిచి నిద్రించే నరుని పులి కొనిపోయే అంత సులభంగా అపహరిస్తుంది. మానవుడికి జీవితంలో మూడు విధాలయిన కార్యాలుంటాయి - 1). చేసినది - ఇది భూతకాలానికి చెందినది; 2). చేస్తూ ఉన్నది - ఇది వర్తమాన కాలానికి చెందినది; 3) చేయవలసి ఉన్నది - ఇది భవిష్యత్కాలానికి చెందినది - ఈ మూడు కార్యాలలో మనిషి నిమగ్నుడై ఉంటాడు. అయితే ఈ మూడూ ఒక కాలం యొక్క మూడు అంశాలే. ఈ మూటిలో మనిషి ఉన్నా, మృత్యువు నిర్దయగా అతడిని కబళిస్తుంది. కాబట్టి కాలాన్ని మనిషి ఏమీ చేయజాలడు, ఏమీ అనజాలడు, కాలానికి మనిషి అధీనుడే గాని మనిషికి కాలం అధీనం కాదు.

విశేషం: తండ్రి సమాధానం పరంపరాగతమైన సాంప్రదాయకమైన రీతిలో ఉన్నది. దానిని తనయుడు ప్రశ్నించాడు. తొలుత గార్హస్థ్యం, ఆ పిదప వానప్రస్థం, తరువాత మోక్షం అన్నాడు తండ్రి. ఆ క్రమం తప్పకుండా సాగిపోతుంది - అనే ధైర్యం, కాలమహిమ

తెలిస్తే నిలువదు అంటున్నాడు తనయుడు. నిన్ను తీరికగా నీ కార్యక్రమ నిర్వహణకై విడిచిపుచ్చి ఊరుకోదు కాలం. అది అజేయమూ, అప్రతివిధేయమూ అయినది. ప్రాణుల జీవితమంతా కేవలం కాలాధీనమే. అయినపుడు ఆలుబిడ్డలు, యజ్ఞనిర్వహణం వంటి ఈ సాంప్రదాయిక పథాన మోక్షాన్వేషణ చేయటంకంటె వేరే మార్గాన్ని కనుగొనవలసిన అవసరం ఉన్నదని బోధ కలిగే విధంగా తనయుడు తన వాదాన్ని కొనసాగిస్తున్నాడు.

క. భీరుఁడు శూరుఁడు జడుఁడు వి । శారదుఁ డబలాత్మకుండు సబలుండన లే
దేరినయిన మృత్యువు దు । ర్వారంబై యపహరించు వైదికవర్యా! 24

ప్రతిపదార్థం: వైదికవర్యా!= వేదం చదివినవారిలో శ్రేష్ఠుడా!; భీరుఁడు= పిరికివాడు; శూరుఁడు= శౌర్యవంతుడు; జడుఁడు= చలనంలేనివాడు (అజ్ఞాని); విశారదుఁడు= ప్రవీణుడు; అబల+ఆత్మకుండు= బలహీనమైన శరీరం కలవాడు; సబలుండు= బలంతో కూడినవాడు; అనన్= అనుటకు; లేదు= (వీలు) ఉండదు; ఏరిని+అయినన్= ఎవరినైనా; మృత్యువు= మరణం; దుర్వారంబు+అయి= అడ్డులేనిదై; అపహరించున్= కొనిపోవును.

తాత్పర్యం: మృత్యువు ఎదురులేని బలంకలది. దాని ముందు అందరూ సమానులే. అది పిరికివాడినీ, నిర్భయుడినీ, అజ్ఞానినీ, విజ్ఞానినీ, అబలుడినీ, సబలుడినీ - అందరినీ ఒకే విధంగా కబళిస్తుంది. కాలం ముందు ప్రాణులన్నీ సమానులే.

విశేషం: జీవితంలో మనిషి గుణగణాలకూ అజ్ఞానవిజ్ఞానాలకూ బలదౌర్జన్యాలకూ, ఇతరులముందు అంటే తోడి మానవులలో, ప్రాణులలో విలువ ఉండవచ్చునుగాని, మృత్యు రూపమైన కాలం ముందు సర్వమానవులూ సమానులే. వారు భీరువులయినా శూరులైనా దాని ముందు తలవంచవలసినదే. కాల మహిమ అప్రతివిధేయం.

క. వినుఁ సంసృతి మృత్యువు ప । ట్టనఘా! నిస్సంగవృత్తి యమరగృహము నె
ట్టన ని ట్లగుటం గనికొని । తునుముము సంసారరజ్జు దురితవిదూరా! 25

ప్రతిపదార్థం: దురిత విదూరా!= పాపానికి మిక్కిలి ఎడమైనవాడా! వినుము; సంసృతి= సంసారం; మృత్యువు పట్టు= మరణమునకు నిలయం; అనఘా!= పాపరహితుడా!; నిస్+సంగవృత్తి= ఆసక్తి లేకుండా జీవించటం; అమరగృహము= దేవతలఇల్లు (స్వర్గం); నెట్టనన్= చక్కగా; ఇట్లు+అగుటన్= ఈ విధంగా ఉండుటను; కనికొని= గ్రహించి; సంసార రజ్జున్= సంసారము అనే త్రాటిని; తునుముము= తెగవేయుము.

తాత్పర్యం: పాపాకార్యాలకు దూరంగా జీవించే ఓ తండ్రీ! వినుము. ఆలోచిస్తే ఈ సంసారం మరణానికి ఆటపట్టు. దీనికి వ్యతిరేకంగా, అనాసక్తంగా కోరిక లేకుండా జీవించటం స్వర్గం. ఈ జ్ఞానంతో నీ సంసారమనే త్రాటిని తెంచుకొమ్ము.

విశేషం: మన వేదాంత గ్రంథాలు సంసారాన్ని ఘోర సముద్రంగా చిత్రించాయి. నిజానికి మోక్షమంటే కుటుంబజంబాలం నుండి బయటపడటమే అన్నట్లు పేర్కొంటాయి. ఈ పద్యమూ ఆ భావాన్నే తలపింపజేస్తుంది. ఆసక్తితోడి జీవితమే సంసారం. అది మృత్యుమార్గమట! దానికి వ్యతిరిక్తమైన అనాసక్త జీవితం స్వర్గద్వారమట!

క. అమృతము మృత్యువు నన స । త్యము మోహము గాన వినుఁ మహాత్మా! యే స
త్యమునన మృత్యువు గెల్చెద । సమసుఖదుఃఖుండ నగుచు శాంతిపరుఁడనై. 26

ప్రతిపదార్థం: మహాత్మా!= గొప్ప మనస్సు కలవాడా!; వినుము; అమృతము= చావులేమి; మృత్యువున్= చావూ; అనన్= అనగా; సత్యము= నిజం; మోహము= భ్రాంతి; కానన్= కావున; ఏన్= నేను; సమ సుఖదుఃఖుండన్+అగుచున్= సమానమైన సుఖమూ,

దుఃఖమూ కలవాడనై; శాంతిపరుఁడను+ఐ= శాంతియందు ఆసక్తుడనై సత్యమునన్+అ= సత్యంతోడనే; మృత్యువున్=మరణాన్ని; గెల్చెదన్= జయిస్తాను;

తాత్పర్యం: మహాత్మా! పరికించి చూస్తే సత్యమే అమృతం - మరణరాహిత్యం. మోహమే మృత్యువు - చావు. కాబట్టి అమృతం-మృత్యువు అనేవి జ్ఞానసంబంధి సాంకేతికాంశాలు మాత్రమే. నేను సత్యం ద్వారా మృత్యు విజేతనయ్యాను. ఆ తరువాత సుఖదుఃఖాలు రెండూ నాకు సమానమే అవుతాయి. కేవలం శాంతి మాత్రం నాకు మిగులుతుంది.

విశేషం: అమృతం అనేది మనిషికి అనాదిగా ఉన్న గొప్ప కోరిక. ప్రతిప్రాణికీ మృతి తప్పనిసరి. ఆ తప్పనిదానిని తప్పించుకొనటమే అమృతం. దానికొరకే మానవాన్వేషణ నిరంతరంగా కొనసాగుతూ వస్తూ ఉన్నది. ఆ కొనసాగే దశలో ఒకనాడు మనిషి అమృతమంటే ఏమనుకున్నాడో ఈ పద్యం వివరిస్తుంది. సత్యమే అమృతమట! సత్యానికి వ్యతిరిక్తమైనది మోహం; అదే మృత్యువట! కాబట్టి సత్యమార్గాన మోహం నుండి బయటపడితే అమృతాన్ని అందుకొన్నట్లే! అపుడు లోకాన దుఃఖమూ, అశాంతీ ఉండవు - కనీసం ఆ మహామానవుడి దృష్టిలో. మనిషికి సంతతి ఒక విధంగా కొనసాగింపే కాబట్టి సంతానం ద్వారా చావులేమి (అమృతత్వం) సాధ్యమేకదా! అని వాదిస్తావేమో అది సరికాదంటున్నాడు - (క్రింది పద్యంలో)

తే. నాకుఁ బ్రజ గతి నిచ్చు ననంగవల వ; । దేన ప్రజనయి పొడమెదఁ గాన యేను
నన్నుఁ గనుచున్న నది మోక్షణంబు సేయు । నాశపడ; నట్టులగుటఁ బ్రజాభియుక్తి. 27

ప్రతిపదార్థం: నాకున్= మానవుడికి; ప్రజ= సంతతి; గతిన్+ఇచ్చున్= మోక్షాన్ని ఇస్తుంది; అనంగన్+వలవదు= అనటం వద్దు; ఏను+అ= నేనే; ప్రజన్+అయి= సంతతినై; పొడమెదన్= పుట్టుతాను; కాన= కావున; ఏను= నేను; నన్నున్ కనుచున్నన్= కంటుండగా (ప్రసవిస్తుండగా); అది= ఆ సంతతి; మోక్షణంబు+చేయు+ఆశపడను= మోక్షం కలిగించేందుకు ఆశపడను (మోక్షం కలిగిస్తుందని ఆశించలేను); అట్టులు+అగుటన్= ఆ విధంగా ఆశించటం; ప్రజా+అభియుక్తి= సంతతిమీద (వ్యాజ్యం - నేరం మోపటం.)

తాత్పర్యం: 'సంతతిద్వారా అమృతత్వం, అదే మోక్షం' అని అనుకొంటే అది చెల్లదు. ఎందుకంటే, నేనే సంతతిగా పుట్టటం జరుగుతుంది తప్ప వేరుగాదు. నన్ను నేను జన్మింపజేసికొంటూ ఆ సంతతినుండి మోక్షాన్ని ఆశించటం ఉచితం కాదు. పైగా ఆ విధంగా ఆశించటం సంతతిమీద నేరం మోపటం అవుతుంది. సంతతి ప్రయోజనం ఆత్మమోక్షమే అనటం సంతానం మీద అభియోగం నెరపటమే.

విశేషం: సంతతి మోక్షదాయకం కాజాలదు. ఎందుకంటే 'ఆత్మా వై పుత్రనామాసి' అంటూ తానే తనకు జన్మనిచ్చుకొంటున్నాడు తప్ప వేరుకాదు. సంతానం మోక్షహేతువని అనుకొని సంతతినుండి ముక్తికై నిరీక్షించటం ఒక విధంగా సంతతిపై వ్యాజ్యం నెరపటం వంటిది. ఒకవేళ యజ్ఞం ద్వారా ముక్తి లభిస్తుందేమో అనే సందేహాన్ని తీరుస్తూ క్రింది పద్యాన్ని ప్రారంభిస్తున్నాడు.

క. వినుఁ పశుయజ్ఞము హింసన । మనంతఫలదంబు గా; దహంకృతిసహితం
బనఘా! వాఙ్మనసనియమ । మను యాగం బిచ్చు నవ్యయానందంబున్. 28

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; వినుఁ= ఆలకించుము; పశుయజ్ఞము= పశువులతో చేసే యాగం; హింసనము= హింస; అనంతఫలదంబు= అంతంలేని ఫలితాన్ని ఇచ్చేది; కాదు= కాజాలదు; అహంకృతి సహితంబు= అహంకారంతో కూడింది; వాక్+మనస నియమము= మాటను మనస్సును నిగ్రహించటం; అను యాగంబు= అనే యజ్ఞం; అవ్యయ+ఆనందంబున్= నశించని ఆనందాన్ని; ఇచ్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ తండ్రీ! ఆలకించుము. పశువులతో యజ్ఞం చేసి మోక్షాన్ని పొందలేవు. పైగా అది హింస. అందువలన గొప్ప ప్రయోజనాన్ని ఫలితాన్ని యజ్ఞ నిర్వహణంద్వారా అందుకొనలేవు. యజ్ఞనిర్వహణలో అహంకారం వ్యక్తమవుతుంది. ఆలోచించి చూస్తే కొత్త యజ్ఞం ఒకటుంది. అది మాటను, మనసును నిగ్రహించుకొనటం. ఈ వాఙ్మనసనియమరూపమైన యజ్ఞం ద్వారా శాశ్వతానందం కొత్తగా లభిస్తుంది.

విశేషం: పరంపరగా కొనసాగుతూ వస్తున్న యజ్ఞం హింస తప్ప అన్యం కాదు. హింస అనంతఫలితాలను ఇవ్వలేదు. పైగా అది అహంకార సూచనగా కూడా కనిపిస్తుంది. నిజమైన యజ్ఞమంటే వాక్కునూ మనస్సునూ నిగ్రహించుకొనటమే. నిగ్రహం ద్వారానే శాశ్వతానందం లభిస్తుంది. ఇది కొత్త యజ్ఞం. ఇక వాదాన్ని ముగిస్తూ.

వ. కావున నీవును. 29

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నీవును= నీవు కూడా.

తాత్పర్యం: కాబట్టి నీవు కూడా.

క. కామ క్రోధాద్యములగు । నీ మానస వికృతు లుడిపి యేకాంత గుహా
రాముఁడవై నిను వెదకుట । సూ మే; లొండెల్ల నుడుగు సులభవివేకా!' 30

ప్రతిపదార్థం: సులభవివేకా!= సుఖంగా లభించే వివేకం కలవాడా!; కామక్రోధ+ఆద్యములు+అగు= కామం, క్రోధం మొదలైన; ఈ మానస వికృతులు= ఈ మనస్సునకు చెందిన వికారాలను; ఉడిపి= మాన్పి; ఏక+అంత గుహా+ఆరాముడవు+ఐ= ఏకాంతమైన గుహయందు ఆనందించువాడవు అయి; నినున్= (నీలోని) నిన్ను; వెదకుట= పరికించి తెలిసికొనుట; మేలు= ఉత్తమము; సూ= సుమా; ఒండు+ఎల్లన్= ఇతరమంతయును; ఉడుగుము= త్యజించుము, విసర్జించుము.

తాత్పర్యం: నీవు అమృతార్థివైతే నీ మానసవికారాలయిన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం - అనే దుర్గుణాలను విసర్జించుము. ఏకాంత ప్రదేశాన నిశ్చల మనస్కుడవై నిన్ను నీవు అన్వేషించుకొమ్ము. అదే మేలు. ఇతర వ్యవహారాలు అన్నిటినీ త్యజించుము.'

విశేషం: ఇక్కడ సులభవివేకా! - అని సంబోధించాడు. వివేకం అందరికీ సులభం కాదు. కొందరి కయితే అది ఎప్పటికీ దుర్లభమే. సంస్కారం కారణంగా కొందరికి వివేకం వెంటనే కలుగుతుంది. ఇక్కడ తనయుడు తండ్రి స్వభావాన్ని గుర్తించి, వెంటనే వివేకంతో తాను తెల్పిన జ్ఞానమార్గాన పయనించి ఆత్మజ్ఞతతో ముక్తిని పొందుమంటున్నాడు. ముక్తిప్రాప్తికి వికారరహిత మనస్సు అవసరమనీ, ఏకాంతవాసమూ అభిలషణీయమనీ తనయుడి కథనం.

ఈ ఇతిహాసమే విలక్షణంగా ఆలోచింపజేసేదిగా ఉన్నది. తండ్రి శ్రోత తనయుడు ఉపదేష్ట. తండ్రి సంప్రదాయవాది ఆనాటికి, తనయుడు ప్రయోగవాది. ప్రయోగానిది సంప్రదాయం మీద పైచేయిగా నిరూపితం కావటం మంచిలక్షణం. లేకుంటే మానవ ప్రగతి ఆగిపోతుంది మరి!

క. అని పుత్రుం డుపదేశిం । చిన జనకుం డట్ల చేసి చెందె సుఖంబున్
మనుజేంద్ర! యవ్విధము గని । కొని యూఁదుము సత్యధర్మ కుశలత్వంబున్.' 31

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పుత్రుండు= కొడుకు; ఉపదేశించినన్= బోధించగా; జనకుండు= తండ్రి; అట్లు+అ= ఆ విధంగానే; చేసి; సుఖంబున్= సౌఖ్యాన్ని; చెందెన్= పొందాడు; మనుజ+ఇంద్ర!= నరులకు అధిపతీ!; ఆ+విధము= ఆ పద్ధతిని; కని కొని= పొంది; సత్యధర్మ కుశలత్వంబున్= సత్యమందును, ధర్మమందును నేర్పరితనమును; ఊఁదుము= వహించుము.

తాత్పర్యం: ఈ విధంగా కొడుకు ఉపదేశించగా తండ్రి కొడుకు ఉపదేశాన్ని గ్రహించి, ఆ విధంగానే చేసి శాశ్వత సౌఖ్యాన్ని అందుకొన్నాడు. కాబట్టి ఓ రాజా! (ధర్మనందనా!) నీవూ ఆ మేధావి ఉపదేశాన్ని అర్థం చేసికొని ఆచరించి సత్యప్రవర్తనలోనూ, ధర్మ నిర్వహణంలోనూ నేర్పరివి కమ్ము.'

వ. అని చెప్పిన విని యజాతశత్రుండు శంతనుపుత్రునితో 'జగంబున ధనవంతులు నధనులుం గలిగి యుండుదురు. వారలలోన సుఖు లెవ్వరు? దుఃఖు లెవ్వ?'రని యడిగిన నక్కురుపితామహుండు 'శమ్యాకుం డను నొక్కశాంతిపరాయణ బ్రాహ్మణుండు సంసారంబు వదలవిడిచి కూడు సీరకు నవసియుండునట్టివాఁడు; దొల్లి నాకడకు వచ్చి గోష్ఠీప్రసంగంబున నుపదేశించిన వచనంబులు గలవు. వాని వినుమవి భవత్ప్రశ్నంబునకు నుత్తరంబులై యుండు' నని పలికి యిట్లనియె. 32

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= (పుట్టని శత్రువులు కలవాడు) ధర్మరాజు; శంతను పుత్రునితోన్= శంతనుడి కొడుకు భీష్ముడితో; జగంబునన్= లోకమందు; ధనవంతులున్= ధనం కలవారు; అధనులును= ధనంలేనివారును; కలిగి+ఉండుదురు= ఉంటున్నారు; వారలలోనన్= అట్టి ఆ ఇరుతెగలవారిలో; సుఖులు+ఎవ్వరు?= సుఖం కలవారు ఎవరు?; దుఃఖులు+ఎవ్వరు?= దుఃఖం కలవారు ఎవరు?; అని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+కురుపితామహుండు= ఆ కురువంశపు తాత(గారు); శమ్యాకుండు+అను నొక్క శాంతి పరాయణ బ్రాహ్మణుండు= శమ్యాకుడు అనే పేరుగల ఒక శాంతిని ఆశించే బ్రాహ్మణుడు; సంసారంబు= కుటుంబం; వదలన్+విడిచి= తొలగేటట్లు త్యజించి; కూడు+చీరకున్= కూటికి గుడ్డకు కూడా; నవసి+ఉండునట్టివాఁడు= కొరవడి ఉండేవాడు; తొల్లి= ముందు; నా కడకున్= నా దగ్గరకు; వచ్చి= ఏతెంచి; గోష్ఠీ ప్రసంగంబునన్= చర్చా సందర్భంలో; ఉపదేశించిన= బోధించిన; వచనంబులు= మాటలు; కలవు= ఉన్నవి; వానిన్= ఆ మాటలను; వినుము= ఆలకించుము; అవి= ఆ మాటలు; భవత్ ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు, ఉత్తరంబులు+ఐ= సమాధానాలై; ఉండున్= ఉంటాయి; అని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ మేధావి వృత్తాంతం విన్న తరువాత ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు: 'లోకంలో ధనవంతులు, నిర్ధనులు అని రెండు విధాలుగా జనులు కనిపిస్తుంటారు. వారిలో సుఖవంతు లెవరు? దుఃఖభాజను లెవరు?' అనగా దానికి ఆ కురువంశపితామహుడు ఇట్లా సమాధాన మిచ్చాడు. శమ్యాకుడు అనే శాంతికాముకుడైన బ్రాహ్మణుడు ఒకడు కుటుంబాన్ని త్యజించి కూడుగుడ్డకు కూడా కటకటపడుతూ పూర్వ మొకనాడు నా దగ్గరకు వచ్చి నాతో గోష్ఠినెరపుతూ ప్రసంగవశాన పలికిన పలుకులు కొన్ని ఉన్నాయి. ఆ పలుకులలో నీ ప్రశ్నకు సమాధానాలు దొరుకుతాయి' అంటూ ఇట్లా చెప్పాడు.

విశేషం: లోకంలో ధనమే సుఖశాంతులకు మూలమనే గట్టి ఆభిప్రాయ మొకటి ప్రాచీనకాలంనుండి పాతుకుపోయి ఉన్నది. ఆ అభిప్రాయంలోని సత్యాసత్యాలను తెలియజెప్పటానికి ఉద్దిష్టమైన దీ వృత్తాంతం.

తే. 'ధనము కలిమియు లేమియుఁ ద్రాసునందు । నిలిపి యెత్తంగ ములు సూపె నిర్ధనత్వ మెక్కుడై; దాని దిక్కున నెట్టలన్న । వినుము గుణదోషముల భంగి విస్తరింతు. 33

ప్రతిపదార్థం: ధనము కలిమియున్= డబ్బు కలిగి ఉండటం; లేమియున్= (ధనం) లేకుండటం; త్రాసునందున్= కాటాలో; నిలిపి= ఉంచి; ఎత్తంగన్= పైకి లేపగా; నిర్ధనత్వము= డబ్బులేమి; ఎక్కుడు+ఐ= అధికమై; దాని దిక్కునన్= ఆ లేమి వైపునకు; ములు+చూపెన్= ముల్లు (త్రాసులోని భారాన్ని నిర్ణయించే పరికరం) జరిగినది - త్రాసు వంగింది; ఎట్టలు+అన్నన్= ఏ విధంగా అనినచో; వినుము= ఆలకించుము; గుణదోషముల భంగి= గుణాల దోషాల తీరు; విస్తరింతున్= వివరిస్తాను.

తాత్పర్యం: కలిమి, లేమి - అనే ఈ రెంటిలో ఏది సుఖకరమైనది? అనే ప్రశ్నకు సమాధానంకొరకు ఆ రెంటిలో ఏది ఉత్తమమో నిర్ణయించటం కొరకు ఆ రెంటిని త్రాసులో పెట్టి తూచగా త్రాసులోని ముల్లు లేమివైపునకే మొగ్గింది. లేమి కలిమి కన్నా ఎట్లా ఉత్తమం? అంటావా? వినుము. ఆ రెండింటిలోగల గుణదోషాలను వివరిస్తాను.

విశేషం: చూచేవాడినిబట్టి చూడబడే వస్తువు అనేక విధాలుగా అగుపిస్తుంది. చూచే వ్యక్తి సామాన్యుడయినప్పుడు చూడబడే వస్తువూ సామాన్య రీతిలోనే గోచరిస్తుంది. అట్లా కాకుండా అసామాన్యుడైనప్పుడు ఆ వస్తువూ అసామాన్యంగా కొత్తగా భాసించే వీలున్నది. ఇక్కడ అదే జరిగినది.

క. ధనము గలవాఁడు మృత్యు వ । దనమున నున్నట్లు భయము దన చిత్తమునం
దనుకగ నుల్లల నుడుకును । విను శిఖి చోరాదిముఖ్య విషయాపదకున్. 34

ప్రతిపదార్థం: ధనము కలవాఁడు= ధనవంతుడు; మృత్యువదనమునన్= మరణం యొక్క నోటియందు; ఉన్నట్లు= ఉన్న విధంగా; భయము= భీతి; తన చిత్తమునన్= మనస్సునందు; తనుకగన్= తాకగా; శిఖి చోర+అది ముఖ్య విషయ+ఆపదకున్= అగ్ని, దొంగలు మున్నగు ముఖ్య వస్తువుల వలన విపత్తుకు; ఉల్లలన్= ఉల్ ఉల్ అంటూ (ఉడికేటప్పుడు వచ్చే ధ్వని); ఉడుకును= తాపంపొందును; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ధనవంతుడు ధనం కారణంగానే మృత్యుముఖంలో ఉన్నట్టుగా నిత్యం భయభ్రాంతులకు లోనౌతూ నిప్పువలననో, దొంగలవలననో, కాకపోతే మరొక విధంగానో తన డబ్బు ఎప్పుడు నశిస్తుందో అనే తల్లడపాటుతో సుఖశాంతులకు దూరమై జీవనం సాగిస్తూ ఉంటాడు.

విశేషం: నరుడు సుఖశాంతుల కోసమే ధనార్జన చేస్తాడు. ప్రారంభదశలో ధనంవలన సుఖమూ, తద్ద్వారా శాంతీ లభిస్తాయి. అయితే ఈ ఆర్జనాపరమైన ఆశ పెరిగిపోతూ ధనం కూడా అమితంగా ఒనగూడినప్పుడు వ్యతిరేక ఫలితాలు వస్తాయి. అంటే ఆ ధనమే నరుడి సుఖశాంతులకు హానికరంగా పరిణమిస్తుంది.

క. కోపంబును లోభంబును । నేపారి మనంబు గలఁప నెప్పుడుఁ జింతా
తాపంబు నొందు సధనుం । డాపదగా కవ్విధము సుఖావహమగునే? 35

ప్రతిపదార్థం: సధనుండు= ధనంతోఉన్నవాడు; కోపంబును= కోపమూ; లోభంబునున్= పేరాసయు; ఏపారి= పెరిగి; మనంబు= మనస్సు; కలఁపన్= కలచివేయగా; ఎప్పుడున్= ఎల్లప్పుడు; చింతా తాపంబున్= దిగులువలన కలిగే, ఉడుకును; ఒందున్= పొందుతాడు; ఆ+విధము= ఆ పద్ధతి; ఆపద+కాక= దుఃఖకర పరిస్థితి కాక; సుఖ+ఆవహము+అగునే?= సుఖాన్ని కలిగించేది అవుతుందా? (కాదు).

తాత్పర్యం: డబ్బు కారణంగా నరుడు కోపానికీ, అత్యాశకు లోనై ముందు మనస్సు పాడుచేసికొంటాడు. మనస్సు నిరంతరం కలతతో ఉన్నప్పుడు దిగులూ విచారం తప్పవు. ఈ స్థితి, దుఃఖం కాకుండా సుఖమా?

విశేషం: సుఖశాంతులు అనేవి మనస్సుకు చెందిన అనుభవాలు. డబ్బు పెరిగినప్పుడు మానవసంబంధాలలో మార్పులు వస్తాయి. కోపతాపాలు అధికమౌతాయి. పైగా ఈ ధనం కూడే కొద్దీ లోభమూ పెరుగుతూ ఉంటుంది సాధారణంగా. దానితో మనస్సు కలత చెంది వేదనలు మిగులుతాయి. ఇది ధనవంతుడి స్థితి. దీనిని సుఖమని ఒప్పుకోలేము.

ఇక నిర్ధనుడి స్థితిగతులను వివరిస్తున్నాడు.

క. ఎచ్చోటనైన నధనుఁడు । విచ్చలవిడి నుండు; లేదు వెఱ పించుకయుం;
బొచ్చెపుఁజందం బొల్లఁడు; । మెచ్చరె సురలైనఁ? బలుకు మృదువై యుండున్. 36

ప్రతిపదార్థం: అధనుఁడు= డబ్బులేనివాడు; ఏ+చోటన్+ఐనన్= ఏ స్థలంలోనైనా; విచ్చలవిడిన్= అధిక స్వేచ్ఛతో; ఉండున్= నిలుచును; వెఱపు+ఇంచుకయున్= భయం కొంచెం కూడా; లేదు= ఉండదు; పొచ్చెము+చందంబు= కపటపద్ధతి; ఒల్లఁడు= అంగీకరించడు; పలుకు= మాట; మృదువు+ఐ= మెత్తనిదై; ఉండున్= ఉంటుంది; సురలైనన్= దేవతలయిననూ; మెచ్చరె?= పొగడరా?

తాత్పర్యం: నిర్ధనుడు ఎక్కడైనా స్వేచ్ఛగా ఉండగలడు. కొంచెం కూడా భయముండదు. కపటప్రవర్తన అంగీకరించడు. మాట మృదువుగా ఉండటంతో జనప్రియుడుగా మారే వీలుంటుంది. ఇన్ని సుగుణా లున్నప్పుడు దేవతలైనా ఆ నిర్ధనుడిని మెచ్చుకోవలసిందే!

విశేషం: ధనాశలేని కారణాన జీవితంలో కపటప్రవృత్తికి అవసరం ఉండదు. మాటలో మార్దవంవలన బ్రతుకు సుఖమయంగా ఉంటుంది.

క. లోకము చందము గనికొని । యీ కానఁగ నగు ధనాదు లెల్లను గాల
వ్యాకులతఁ బొందఁ గలయవి । గాకుండమి యెఱిఁగి విడుపు గడుఁ జదు రెందున్. 37

ప్రతిపదార్థం: లోకము చందమున్= లోకము యొక్క తీరు తెన్నులు; కనికొని= గ్రహించి; ఈ కానఁగన్+అగు= ఈ కనిపించే; ధన+ఆదులు+ఎల్లను= డబ్బు మొదలైనవి అన్నీ; కాలవ్యాకులతన్= కాలంవలన నాశనమును; పొందన్+కల+అవి+కాక+ఉండమి= చెందేవికాకుండా ఉండలేని స్థితి (చెందే తీరవలసిన స్థితిని); ఎఱిఁగి= గ్రహించి; విడుపు= ఎడబాటు-ధనంనుండి; ఎందున్= ఎక్కడైనా; కడున్= మిక్కిలి; చదురు= నేర్పు.

తాత్పర్యం: లోకంలోని తీరు తెన్నులు గ్రహించి, మన ఈ కన్నులకు అగుపించే డబ్బూదస్కం మొత్తం చివరకు కాలప్రభావాన నశించక తప్పనివే అనే జ్ఞానంతో డబ్బునుండి ముక్తి పొందటం ఎప్పుడైనా ఎక్కడైనా నేర్పరితనమే.

విశేషం: సృష్టిలో పుట్టిన ప్రతిదీ గిట్టేదే. కాలం దేనినీ మిగల్చదు. అటువంటప్పుడు మనిషి నశిస్తున్నాడు. ఇది లోకస్థితి. ఈ చందం గమనించి నరు డార్జించే డబ్బుకూ కాలంచేతిలో నాశనం తప్పదు అనే జ్ఞానం కలిగి డబ్బుకు దూరంగా జీవించటం నేర్పు. చివరకు పిండితార్థ ప్రతిపాదకంగా ఒక పద్యం.

క. ధనవత్త్వము దుఃఖకరం । బని కని తత్కాంక్ష విడుచు నతని కధనతా
జనితాత్మాధీనత్వం । బనుపమ సౌఖ్యంబు సేయు నక్షీణముగన్.' 38

ప్రతిపదార్థం: ధనవత్త్వము= డబ్బుగలవాడితనం; దుఃఖకరంబు+అని= దుఃఖాన్ని కలిగించేది అని; కని= తెలిసి; తద్ కాంక్ష= ఆ కోరిక; విడుచు+అతనికిన్= వదలేవానికి; అధనతా జనిత+ఆత్మ+అధీనత్వంబు= నిర్ధనత్వం వలన కలిగిన తనకు (తాను)లోబడిన తనం; అక్షీణముగన్= నశించకుండా; అనుపమ= సాటిలేని; సౌఖ్యంబు+చేయున్= సుఖం కలిగిస్తుంది.

తాత్పర్యం: నరుడు డబ్బుకలిగి ఉండటం దుఃఖహేతువు - అనే జ్ఞానం కలిగి, డబ్బు మీది కోరికను విడిచిపెట్టినప్పుడు ఆ లేమి కారణంగా తన అధీనంలో తాను ఉండగలడు. ఈ ఆత్మాధీనత్వ మనేది ధనవంతుడికి అసాధ్యం. ముందుగా అతడు ధనానికి అధీనుడైతే తప్ప ఆ ధనవత్త్వం కొనసాగదు మరి! కాగా ఈ ఆత్మాధీనత్వ మనే ఒక్క లక్షణంవలన సాటిలేని సుఖశాంతులు మనిషి పొందగలుగుతాడు.'

విశేషం: ఇక్కడి ఆత్మాధీనత్వమనే ఈ లక్షణం నరులలో చాలా అరుదుగా కనిపిస్తుంది. ప్రయోజనాకాంక్షిగా ఉన్న ప్రతివాడూ ఆత్మాధీనత్వాన్ని తనకు తాను అధిపతిగా ఉండగలిగినతనాన్ని వదులుకోవలసినవాడే. ప్రయోజనాలన్నీ లోకాన సామాన్యంగా ధనానికి ప్రతిరూపాలే. కాబట్టి ధనాశ వదలితే ఇక వదిలించుకొనవలసింది ఏదీ మిగులదు.

భీష్ముఁడు ధర్మజునకు మంకి యను బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట (సం ॥ 12-171-4)

వ. అని చెప్పె ననిన విని ధర్మతనయుండు పితామహుతో 'ధన తృష్ణాభిభూతుండగు పురుషుం డేమిట సుఖియగు?' ననుటయు నయ్యమరనదీనందనుండు 'ధనార్జనంబుతోడి విసువుటం బుట్టిన విడుపున సుఖంబు గలుగు నయ్యర్థంబుఁ దెలిపెడునది యొక్క యితిహాసంబు గలదు వినుమ'ని యిట్లనియె.39

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పెన్= శమ్యాకుడు పలికాడు; అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; పితామహుతోన్= తాతతో; ధనతృష్ణా+అభిభూతుండు+అగు= డబ్బుమీది పేరాసచేత (ఆక్రమించబడిన); పురుషుండు= నరుడు; ఏమిటన్= దేనితో; సుఖి+అగున్= సుఖం కలవాడు ఔతాడు?; అనుటయున్= అనగా; ఆ+అమర నదీనందనుండు= ఆ దేవతల నది (గంగా) కొడుకు (భీష్ముడు); ధన+ఆర్జనంబుతోడి విసువుటన్= డబ్బు సంపాదించటంతో (కలిగే) విసుగుదల వలన; పుట్టిన= కలిగిన; విడుపునన్= ఎడబాటుతో; సుఖంబు+కలుగున్= సౌఖ్యం సిద్ధిస్తుంది; ఆ+అర్థంబున్= ఆ విషయమును; తెలిపెడు+అది= తెలియజేసేది; ఒక్క= ఒక; ఇతిహాసంబు= జరిగిన కథ; కలదు= ఉన్నది; వినుము= ఆలకించుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా శమ్యాక వచనాలు విన్న తరువాత, ధర్మరాజు మరొక ప్రశ్న తన తాతకు వేశాడు. 'డబ్బుమీద పేరాసకు లోనైనవాడు ఎప్పుడు ఏ విధంగా సుఖం పొందుతాడు?' అనేది ఆ ప్రశ్న. దానికి తాతగారి సమాధానం చాలా సూటిగా ఉన్నది. 'ఏమీ లేదు! ధనార్జనలో విసిగివేసారి దానినుండి ముక్తిని (ఎడబాటు) పొందినపుడే వాడి కిక సుఖం లభిస్తుంది. ఈ అంశాన్ని తెలిపే కథ ఒకటి ఉన్నది వినుము.' అంటూ ఇట్లా అన్నాడు.

విశేషం: ఆశ వేరు, పేరాస వేరు. ఆశ అవసరమే, పేరాశ - తృష్ణ మనిషిని దుఃఖంలో ముంచుతుంది. తృష్ణ అంటే దాహం, అది తీరని దాహం. దానినుండి విడివడటమే సుఖం.

సీ. మంకి నాఁ బరఁగు బ్రాహ్మణుఁడు ధనేచ్ఛమై । వర్తించు శిక్షింపవలయునట్టి
గుజ్జుదోయిని జట్టిగొని ప్రీతి లంకించి । యుండ లంకియతోన గండు మీఱి
పాఱె నక్కోడియల్ పడియున్న గనపలో । ట్టేనుంగు పై నది యెగసి పఱవ
నుభయ పార్శ్వంబుల నురిపోసిన ట్లవి । వ్రేలి చచ్చినఁ జూచి విప్రుఁ డడలి

తే. 'రత్నములుఁ బోని వత్సతరంబు లకట! । వ్రేలుచున్నవి లొట్టేన్గు వెంటఁ దవిలి'
యనుచు నిర్వేద మొంది యిట్లనియెఁ దన్నుఁ । గరుణతోడఁ గనుంగొను నరులతోడ. 40

ప్రతిపదార్థం: మంకినాన్= మంకి అనగా; పరఁగు= ఉండు; బ్రాహ్మణుఁడు= విప్రుడు; ధన+ఇచ్ఛమైన్= డబ్బుమీది కోర్కెతో; వర్తించున్= ప్రవర్తిస్తాడు; శిక్షింపన్+వలయు+అట్టి= (పనిపాటులు) నేర్పవలసినట్టి; గుజ్జుదోయిని= కోడెల జంటను; జట్టిన్+కొని= అమ్మకంలో కొని; ప్రీతిన్= ప్రేమతో; లంకించి+ఉండన్= (ఒకదానితో మరొకటి) జతచేసి ఉండగా - కట్టుత్రాటితో కట్టివేసిఉండగా; లంకియతోన= కట్టు త్రాటితోనే; ఆ+కోడియల్= ఆ కోడెదూడలు; గండు మీఱి= సామర్థ్యం హెచ్చి; పడి+ఉన్న= పడుకొనిఉన్న; గనప= పెద్ద; లొట్టె+ఏనుంగుపై= ఒంటెపై - మీదుగా; పాఱెన్= పరుగెత్తింది; అది= ఆ ఒంటె; ఎగిసి= లేచి; పఱవన్= పరుగెత్తగా; ఉభయపార్శ్వంబులన్= (దాని) రెండువైపులా; ఉరిపోసినట్లు= ఉరివేసినట్లుగా; అవి= ఆ కోడెలు రెండు; వ్రేలి= వ్రేలాడి; చచ్చినన్= చావగా; చూచి= కని; విప్రుఁడు= బ్రాహ్మణుడు; అడలి= భయపడి;రత్నములున్+పోని= రత్నాలవంటి; వత్సతరంబులు=

కోడెదూడలు; అకట!= అయ్యో!; లొట్టె+ఏన్గు వెంటన్= ఒంటెవెంట తగుల్కొని; వ్రేలుచున్నవి= వ్రేలాడుతున్నాయి; అనుచున్= అనుకొంటూ; నిర్వేదము+ఒంది= విరక్తి చెంది; తన్నున్= తనను; కరుణతోడన్= దయతో; కనుంగొను నరులతోడన్= చూచే మనుష్యులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మంకి అనే పేరుగల బ్రాహ్మణు డొకడు ధనాశతో జీవిస్తూ ఉండేవాడు. ధనార్జనకొరకే, అతడు పనిపాటులు నేర్పవలసిన కోడెదూడలను కొని, రెంటిని ఒకే తాటితో (మెడలకు) కట్టి ఉంచాడు. ఆ దూడలు చురుకుపుట్టి హఠాత్తుగా రెండూ కలిసి పరుగెత్తుతూ త్రోవలో పడుకొని ఉన్న పెద్ద ఒంటెమీదుగా ఒంటెకు అటు ఒకటి ఇటు ఒకటిగా దాటబోయాయి. వాటి అలజడికి ఆ ఒంటె కూడా పైకి లేచి పరుగెత్తటం మొదలు పెట్టింది. ఆ ఎత్తైన ఒంటెకు ఇరువైపులా ఈ కోడెల జంట మెడకున్న పలుపుత్రాటితో పైకి లేచింది. మెడకున్న పలుపే ఉరికాగా కోడెలు రెండూ చచ్చి వ్రేలాడాయి. క్షణాలలో ఇదంతా జరిగిపోవటంతో ఆ మంకి విప్రుడు 'అయ్యో! రత్నాలవంటి కోడెలు క్షణంలో శవాలుగా మారిపోయి ఒంటెకు అటూ ఇటూ వ్రేలాడుతున్నాయే!' అని మనస్సున నిర్వేదం పుట్టగా, తనను దయతో జాలితో చూస్తున్న జనాన్ని ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: నరుడు వాంఛించింది ధనాన్ని, సిద్ధించింది అతడికి పెద్ద నష్టం. దీనిలో అతడి ప్రమేయ మేమీ లేదు. అంతా దైవనిర్ణయమే.

తే. సారమతిఁ బరికింపంగఁ బౌరుషంబు । కంటె దైవంబు ముఖ్యంబు గార్యసిద్ధి;
కెచట నేనియుఁ బౌరుష మెసకమెసఁగె । నేని యది దైవదత్తంబ యింత నిజము. 41

ప్రతిపదార్థం: సారమతిన్= శ్రేష్ఠమైన బుద్ధితో; పరికింపఁగన్= పరీక్షించగా; కార్యసిద్ధికిన్= పని నెరవేరటానికి; పౌరుషంబు కంటెన్= పురుష ప్రయత్నంకంటె; దైవంబు= భాగ్యం, అదృష్టం; ముఖ్యంబు= ప్రధానం; ఎచటన్+ఏనియున్= ఎక్కడైనా; పౌరుషము= పురుషకారము; ఎసకము+ఎసఁగెన్+ఏని= ప్రకాశించినదేని; అది= అట్లవటం; దైవదత్తంబు+అ= భాగ్యంచేత ఈయబడిందే; ఇంత= ఇది; నిజము= సత్యం.

తాత్పర్యం: తొందరపాటు, పక్షపాతం లేకుండా శ్రేష్ఠమైన బుద్ధితో ఆలోచించి చూస్తే కార్యసిద్ధి జరగాలంటే మానవ యత్నంకంటే దైవబలమే ముఖ్యం. ఎక్కడయినా ఎప్పుడయినా మానవయత్నం ఫలించినట్లు కనిపించినా నిజానికి అది దైవానుగ్రహమే తప్ప అన్యం కాదు.

విశేషం: నరుడు కరణం, దైవం కర్త. (కరణం= ఉపకరణం పనిముట్టు. కర్త= చేసేవాడు.)

వ. కావున. 42

తాత్పర్యం: కాబట్టి. (కార్యసిద్ధికి మానవయత్నంకంటే దైవబలమే ప్రధానం కాబట్టి.)

క. మనమునకు సుఖము గోరెడు । జనులకు నర్థక్రియా విశారద భంగుల్
పానుపడ విడిచి భరము లే । కునికియ యూహించి చూడ నుర వెబ్భంగిన్.' 43

ప్రతిపదార్థం: మనమునకున్= మనస్సుకు; సుఖము+కోరెడు జనులకున్= సౌఖ్యం కాంక్షించే నరులకు; అర్థక్రియా విశారద భంగుల్= వ్యవహారాలలో, చేష్టలలో సమర్థమైన తీరులను (గొప్ప యత్నాలను); పానుపడన్= తగ్గించి; విడిచి= వదలి; భరము లేక+ఉనికి+అ= భారము (బరువు) లేకుండా ఉండటమే; ఊహించి చూడన్= ఆలోచించి చూస్తే; ఏ+భంగిన్= ఏ విధంగానైనా; ఉరవు= శ్రేష్ఠం, ఉచితం.

తాత్పర్యం: సుఖమే పరమార్థమైనపుడు ఆ సుఖం దైవదత్తం తప్ప పురుషప్రయత్నం వలన సాధ్యంకాదని తేలిపోయినప్పుడు, నరుడు తన సర్వకార్యక్రమాలను, చేష్టలను, నైపుణ్యాలను పక్కకుపెట్టి, భారమంతా దైవం మీదే మోపి, తాను బరువు తీరి ఏ భారం మీదవేసికొనకుండా ఉండటమే ఉచితం.'

విశేషం: చేసినా చేయకపోయినా ఒకటే, అనే స్థితిలో పెద్దగా ప్రయత్నం చేయకపోవటమే ఉచితం. మనస్సు భారం లేకుండా తేలికగా ఉంటుంది. దైవదత్తమైనది నరుడిని చేరి తీరుతుంది.

వ. అని పలికి యుద్దామంబైన కామంబు విడుపువడకున్నఁ జిత్తంబునకు నిర్వ్యతి గలుగునే? యను విచారంబు పుట్టి తదీయోత్సారణం బూహించి యా చిత్తధర్మంబు నుద్దేశించి. 44

ప్రతిదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఉద్దామంబు+ఐన= తీవ్రమైన; కామంబు= కోరిక; విడుపు+పడక+ఉన్నన్= వదలిపోకున్నచో; చిత్తంబునకున్= మనస్సునకు; నిర్వ్యతి= ఆహ్లాదం; కలుగునే?= ఏర్పడునా?; అను విచారంబు= అనే ఆలోచన; పుట్టి= కలిగి; తదీయ+ఉత్సారణంబు= దాని తొలగింపు; ఊహించి= యోచించి; ఆ+చిత్త ధర్మంబును= ఆ మనస్సుయొక్క స్వభావమును; ఉద్దేశించి= లక్షించి, లక్ష్యంగా ఉంచుకొని.

తాత్పర్యం: మనస్సుకు ఆహ్లాదం కలగాలంటే తప్పకుండా అది కోర్కెల తీవ్రతతో నిండి ఉండకూడదు. కోర్కెల తీవ్రతను మనస్సునుండి తోసివేయాలంటే ఏమి చేయాలి? - అనే ఆలోచనతో ఆ మంకి బ్రాహ్మణుడు తన మనస్సును గుర్తించి దానితో ఇట్లా ప్రసంగించబోతున్నాడు.

విశేషం: 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అనేది ఉపనిషద్ వాక్యం. సుఖ దుఃఖాలు మనోధర్మాలు. కాగా మనస్సును స్వాధీనపరచుకొంటె సుఖదుఃఖాలూ స్వాయత్తమైనట్లే!

క. 'నీ మూలం బే నెఱిఁగితిఁ । గామమ! సంకల్పమునన కలిగెదు సంక
ల్పామర్శరహితమగు చే । తోముద్రం దాల్తు నేను దుది యది నీకున్. 45

ప్రతిపదార్థం: కామమ!= ఓ కోరికా!; నీ మూలంబు= నీ కారణము; ఏన్= నేను; ఎఱిఁగితిన్= తెలిసికొన్నాను; కామమ!= ఓ కోరికా!; సంకల్పమునన్+అ= భావనచేతనే; కలిగెదు= పుట్టెదవు; సంకల్ప+ఆమర్శ రహితము+అగు= భావన స్పర్శ లేనిదగు; చేతన్+ముద్రన్= మనస్సుయొక్క స్థితిని; నేను; తాల్తున్= ధరిస్తాను - వహించెదను; అది= ఆ మనోముద్ర; నీకున్= (కామమునకు); తుది= చివర సమాప్తి నాశనం.

తాత్పర్యం: మంకి తన మనస్సుతో ప్రసంగిస్తున్నాడు: 'ఓ కోరికా! నీ మూలాన్ని కనుగొన్నాను. నీవు సంకల్పం నుండి జన్మిస్తున్నావు. కాబట్టి నేను సంకల్ప స్పర్శ ఉండని మనోముద్రను వహించి నిన్ను నశింపజేస్తాను.'

విశేషం: మనస్సును సంకల్పరహితంగా చేయగలిగితే ముక్తి సిద్ధించినట్లే.

వ. అని కామం బనునది గోర్కి గావునఁ గోర్కి యొప్పమి దేటపఱుపం దలంచి. 46

ప్రతిపదార్థం: అని= అని పలికి; కామంబు+అనునది= కామము అని పిలువబడేది; కోర్కి+కావున్= కోరిక కాబట్టి; కోర్కి+ఒప్పమి= కోర్కెయొక్క అనౌచిత్యము - తగనితనము; తేటపఱుపన్= స్పష్టపడేటట్లుగా చేయటానికి; తలంచి= ఆలోచించి.

తాత్పర్యం: కోర్కె ఏ విధంగా అనుచితమో స్పష్టపరచే అభిప్రాయంతో తన ఆలోచనను కొనసాగిస్తున్నాడు.

తే. సొమ్ము గోరినయంతన సుఖము గలుగ; । దది యుపార్జింపఁగా సిద్ధియగుట నిజమె?
కలిగెనేని యనేక చింతల నొనర్చుఁ । జెడుట చావుతోఁ దుల్య మయ్యెడుమ యేల? 47

ప్రతిపదార్థం: సొమ్ము= ధనమును; కోరిన+అంతన్+అ= కోరినంతనే; సుఖము= సౌఖ్యం; కలుగదు= పుట్టదు; అది= ఆ సొమ్ము; ఉప+ఆర్జింపఁగాన్= సాధించగా ; సిద్ధి+అగుట= నెరవేరుట; నిజము+ఎ?= సత్యమా? (సందేహము); కలిగెను+ఏని= సిద్ధించెనేని; అనేకచింతలన్= పెక్కు వెతలను; ఒనర్చున్= ఒనగూర్చును - తెచ్చిపెట్టును; చెడుట= సిద్ధింపకుండటం; చావుతోన్= మరణంతో; తుల్యము= సమానము; ఆ+ఇడుమ+ఏల?= ఆ కష్టం ఎందుకు?

తాత్పర్యం: సుఖప్రాప్తికి ధనం మూలం గావచ్చును. అయితే ఆ ధనం కోరినంతనే సిద్ధించదు. దానికై యత్నించాలి. యత్నిస్తే సిద్ధిస్తుందని నిశ్చయముండదు. సిద్ధిస్తే సిద్ధించవచ్చును. లేకుంటే లేకపోవచ్చును. అయితే సిద్ధిస్తే, ఆ ధనంతోపాటు ఎన్నో వెతలూ వెన్నంటి ఉంటాయి. అసలు సిద్ధించలేదంటే ఆ ఓటమి చావుతో సమానం. కాబట్టి ముందూవెనుకా అటూ ఇటూ అన్నివైపులా దుఃఖాలనే కలిగించే సొమ్ముకై సంకల్పించట మెందుకు?

విశేషం: కేవలం కోర్కెతో సుఖం లేదు. నిజమే. అది అందరికీ తెలిసిందే. ఇక్కడ మంకి చెప్పదలచిందేమిటంటే కోర్కెను నెరవేర్చుకోవటంలోనూ నిజంగా సుఖం ఉండదని, పైగా యత్నించి ఓడితే ఆ ఓటమి మరణం వంటిది. నిజమే మరి!

వ. ఇచ్ఛా నిరసనంబు సుఖం'బని వెండియు. 48

ప్రతిపదార్థం: ఇచ్ఛా నిరసనంబు= కోర్కెను తిరస్కరించటం; సుఖంబు+అని= సంతోషమని; వెండియున్= మరియు.

తాత్పర్యం: కోర్కెను తిరస్కరించటంలోనే నిజమైన సుఖమున్నది. కోర్కెలు లేని మనస్సు ముక్తమే - అనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'శోకశ్రమ తృష్ణలకున్ । నీ కలిమియ యోల మగుట నీ కగపడు వాఁ
డే కర్తవ్యము గానం । డో కామమ! నిన్ను దొఱఁగి యుండెద సుఖినై. 49

ప్రతిపదార్థం: ఓ కామమ!= ఓ కోరికా!; శోక శ్రమ తృష్ణలకున్= ఇష్టనాశనంవలన దుఃఖానికి, అలసటకు, పేరాసకు - ఈ మూడిటికీ; నీ కలిమి+అ= (నీవు ఉండుటే) నీ ఉనికియే; ఓలము+అగుటన్= రహస్య స్థావరం కాబట్టి; నీకున్; అగపడువాఁడు= గోచరించేవాడు-నీ పాలిటబడినవాడు; ఏ కర్తవ్యము= ఏ చేయవలసిన పనినీ; కానండు= చూడడు; నిన్నున్; తొఱఁగి= వదలి; సుఖినై= సుఖం కలవాడనై; ఉండెదన్= జీవిస్తాను.

తాత్పర్యం: (మంకి ఇంకా కామంతోనే మాట్లాడుతున్నాడు.) 'ఓ కామమా! లోకంలో ఇష్టనాశనంవలన కలిగే దుఃఖానికి, ధనార్జనకై పడే శ్రమకీ, ఆర్జితమైన దానితో తృప్తిపడక ఇంకా ఇంకా ఆర్జించాలనే తపనకీ నీవే మూలస్థానానివి. నీవు ఆవహించిన వాడిని మరేదీ పట్టదు. కాబట్టి నిన్ను విడవటంలోనే సుఖం లభిస్తుంది.

విశేషం: శోకమూ దుఃఖమే అయినా, రెంటికీ భేదం ఉన్నది. ఇష్టజనం ఎడబాటువలన కలిగే దుఃఖం శోకం. ఆశ ముదిరితే తృష్ణగా మారుతుంది. ఆశ లేకుండా జీవించటం ఎట్లా సాధ్యమనిపిస్తుంది గాని, తృష్ణతో బ్రదకటం మాత్రం దురంతమైన అనుభవం.

క. నీ వాస పఱుప ధనములు । గావించెదఁ బో వినాశకముల నుడుపఁగా
నీ వశమె? కాన నీ చెడు । టే వగపుం దేదు పెనుపదే ధైన్యంబున్? 50

ప్రతిపదార్థం: నీవు= (కామాన్ని ఉద్దేశించిన పలుకు) ఓ కామమా! నీవు; ఆస పఱుపన్= ఆశపెట్టగా; ధనములు= సంపదలు; కావించెదన్+పో= సంపాదించితిని పో; వినాశకములన్= చేటులను; ఉడుపన్+కాన్= నశింపజేయటం; నీ వశము+ఎ?= నీ అధీనమా? (నీకు సాధ్యమా) కాదు; కానన్= కావున; నీ చెడుట= నీ యొక్క నశింపు; ఏ వగపున్+తేదు= ఏ దుఃఖాన్ని కలిగించదు; ఏ దైన్యంబున్= ఏ దీనత్వాన్ని, దిక్కులేనితనాన్ని; పెనుపదు= పెంచదు.

తాత్పర్యం: నీవు ఆశపెట్టిన కారణాన, తీవ్రంగా కష్టించి సొమ్ము ఆర్జించినా అనంతరం దాపురించే కష్టపరంపర దానిని దాచటానికి రక్షించటానికి పడవలసిన పాట్లు మిగిలే ఉంటాయి. ఈ కామం, ఆ కష్టపరంపర నుండి చేటులనుండి నరుడిని రక్షించలేదు. కాబట్టి నిన్ను నిరసించటంవలన ఏ దుఃఖమూ ఏర్పడదు. కొత్తగా ఏ దుర్దశా, దైన్యమూ ఆవహించదు.

విశేషం: కామానికి తల ఒగ్గితే ఒక దుఃఖం అదనంగా నరుని చేరటం తప్ప సుఖముండదు. దుఃఖంనుండి దుఃఖాన్ని చేరుకొనటంకంటె అసలు ఆ కామాన్నే త్రోసిరాజంటే సుఖంగా ఉండవచ్చును.

చ. సులభమొ దుర్లభంబొ యని చూడ నెఱుంగవు గన్నదానిపై
నలముదు కామమా! యిడుమ లందఁగఁ జేయుదు నిండు టేమిటం
గలుగదు నీకు నీతెఱఁ గగాధ రసాతల భంగి నీవు స
న్నొలమునఁ బోవకుండ నినుఁ బుచ్చెద బచ్చెన రూపు పోకలన్. 51

ప్రతిపదార్థం: కామమా!= ఓ కోరికా!; సులభమొ= సుఖంగా లభించేదో; దుర్లభంబొ= దుఃఖంతో లభించేదో; అని చూడన్+ఎఱుంగవు= అని గమనించటం తెలియవు; కన్నదానిపైన్= చూచిన దానిమీద; అలముదు(వు)= చుట్టుకొందువు; ఇడుములు+అందఁగన్+చేయుదు(వు)= కష్టములు పొందేటట్లు చేస్తావు; నీకున్; ఏమిటన్= దేనితోడనూ; నిండుట= పూర్తి కావటం; కలుగదు= ఉండదు; నీ తెఱఁగు= నీ పద్ధతి; అగాధ రసాతలభంగి= లోతైన పాతాళం వంటిది; నీవు చన్+పొలమునన్= నీవు వెళ్ళే చోట; పోవక+ఉండన్= వెళ్ళకుండ; నినున్= నిన్ను; బచ్చెనరూపు పోకలన్= రంగు (తోడి) ఆకారపు రీతులలో; పుచ్చెదన్= పెరికెదను, తొలగిస్తాను.

తాత్పర్యం: ఓ కామమా! నీ దృష్టి నీదిగాని, నీ కన్నుపడిన వస్తువు సులభమో కాదో నీవు పట్టించుకొనవు. అమాంతంగా దానిని ఆక్రమించి స్వాధీనపరచుకొనాలని చూస్తావు. ఆ విధంగా నరుడిని కష్టాలపాలు చేస్తావు. అగాధమైన పాతాళ లోకంవలె నీవు ఎన్ని కబళించినా నిండవు. ఇంకా పూర్తి కావలసింది మిగిలే ఉంటుంది. కాబట్టి నీవు వెళ్ళేదారిలో వెళ్ళకుండా, నీకు దూరంగా ఉండి, నిన్ను రంగుతో ఏర్పడిన ఆకారాన్ని తొలగించినట్లు తొలగించి రూపుమాపుతాను.

విశేషం: కామం పూరించే కొద్దీ మళ్ళీ ప్రకోపిస్తూనే ఉంటుంది. అందువలననే అంటారు పెద్దలు "న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి" అని. కామం కోర్కెల అనుభవాలతో ఎప్పటికీ తీరదని పై మాట తాత్పర్యం. రంగుతో ఒక ఆకారాన్ని ఏర్పరచినపుడు తిరిగి ఆ ఆకారాన్ని రూపుమాపటమూ సంకల్ప బలమున్నప్పుడు సాధ్యమే. కామాన్ని ఆ విధంగా నశింపజేస్తాడట మంకి. స్థిర సంకల్పు డతడు.

తే. ధనము చేటున వసివి నామనము నిన్ను। నెడలవిడిచెనో కామమ! యేను శాంతి
దాంతి సత్యక్షమాభూతదయలఁ జెంది। నాఁడ; లోభాదు లందవు నన్ను నింక. 52

ప్రతిపదార్థం: ఓ కామమా!= ఓ కోరికా!; ధనము చేటునన్= సొమ్ము నాశనంతో (కోడెదూడల చావు); వసివి= విసిగి, అలసటచెంది; నా మనము= నా మనస్సు; నిన్నున్; ఎడలన్ విడిచెన్= తొలగ వదలింది; ఏను= నేను; శాంతి దాంతి సత్యక్షమా భూతదయలన్=

కోపం లేమిని, కర్మేంద్రియ నిగ్రహాన్ని, నిజమును, ఓర్పును, ప్రాణులయెడ కరుణను - ఈ అన్నిటిని; చెందినాఁడన్= పొందినవాడను; ఇంకన్= ఇకమీదట; నన్నున్; లోభ+ఆదులు= లోభం మొదలైనవి; అందవు= పొందవు.

తాత్పర్యం: ఓ కామమా! నీవెంట పరుగెత్తి దైవం ప్రతికూలించిన కారణాన ధననాశనం పొంది, విసిగి వేసారి ఉన్న నేను నిన్ను సంపూర్ణంగా తిరస్కరించాను. కామతిరస్కారంతో నాలోని కోపం నశించింది. ఇంద్రియ నిగ్రహం కలిగింది. ఓర్పు నెలకొన్నది. ప్రాణులయెడ కరుణ పాదుకొన్నది. కాబట్టి ఇకపై నన్ను నీ తోబుట్టువులైన లోభము యొక్క గుణాలు కూడా స్పృశించలేవు.

విశేషం: కామమొక్కటి తొలగిపోతే మిగిలిన చెడుగులన్నీ స్వయంగా దూరీకరించబడతాయి. కామమే సర్వదోషాలకూ నిలయం.

తే. కామ సుఖ దివ్య సుఖములు కాంక్ష దొఱఁగు । మేలి షోడశాంశంబునఁ బోలలేవు
గాన కామమ! నిను శత్రు కరణిఁ జంపి । బ్రహ్మపురమున నుండెద రాజుఁ బోలె.' 53

ప్రతిపదార్థం: కామమ!= ఓ కోరికా!; కామ సుఖ దివ్య సుఖములు= కోర్కెవలన సౌఖ్యం, దేవలోక సౌఖ్యము ఈ రెండు సౌఖ్యాలు; కాంక్ష+తొఱఁగు మేలి షోడశాంశంబునన్= కోర్కెను విడవటం (అనే సుఖం) యొక్క గొప్ప పదహారవ భాగంతో; పోల లేవు= సరితూగలేవు; కానన్= కావున; నిను= నిన్ను; శత్రుకరణిన్= పగవాడినివలె; చంపి= నశింపచేసి; బ్రహ్మపురమునన్= పరబ్రహ్మ నగరాన; రాజు+పోలెన్= రాజువలె; ఉండెదన్= వసిస్తాను.

తాత్పర్యం: కోర్కెలు ఈడేరటంవలన కలిగే సుఖం, స్వర్గంలో లభించే సుఖం - ఈ రెండు సుఖాలూ పోల్చిచూచినపుడు నిన్ను త్యజించటంవలన కలిగే సుఖం ముందు దిగదుడుపే. కాబట్టి నిన్ను శత్రువువలె చంపి, పరబ్రహ్మయొక్క నగరంలో రాజువలె జీవిస్తాను.'

విశేషం: కాంక్షలు అనేకం. ఒకటి తరువాత మరొకటి అట్లా పుట్టుకొస్తూనే ఉంటాయి పదులు వందల సంఖ్యలో అవి. కాని కాంక్షాపరిత్యాగం ఒకటే. అది అద్వితీయం. అంటే రెండోది లేనిది అని అర్థం. కాబట్టి విలువలో కూడా ఆ వ్యత్యాసముండక తప్పదు మరి! అందుకే మంకి చివరకు నిష్కర్షగా కాంక్షాపరిత్యాగసుఖం ముందు మిగిలిన సుఖాలన్నీ అత్యల్పాలు అని ప్రకటించాడు అనుభవపూర్వకంగా.

అజగరచరిత వ్రతము (సం. 12-172-2,3)

వ. అని పలికి యివ్విధంబునం గోడెలు సచ్చినం బుట్టిన నిర్వేదంబున సకలకామంబులం బరిత్యజించి దేవసముండై యుండె'నని చెప్పిన విని పాండవాగ్రజుం 'డేమి వర్తనంబున నరుండు వీత శోకుం డగుచుఁ జరించు? నెద్దానం జేసి పరమగతి వడయు?' ననుటయు ననిమిషనదీనందనుం డజగరచరితంబను నితిహాసంబు వినుము దాన నీ యడిగిన యర్థంబు దేటపడు. దానిం జెప్పెద; నజగర నామధేయుం డగు నొక్కబ్రాహ్మణునిఁ బ్రహ్లోదుండు శమప్రకారం బుపదేశింపుమని యభ్యర్థించిన నతం డతని కిట్లనియె. 54

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఈ+విధంబునన్= ఈ పద్ధతిలో; కోడెలు= కోడెదూడలు; చచ్చినన్= చనిపోగా; పుట్టిన నిర్వేదంబునన్= కలిగిన రోతతోడి దుఃఖంతో; సకల కామంబులన్= ఎల్లకోర్కెలను; పరిత్యజించి= దిగవిడిచి; దేవసముండు+ఐ= దేవతతో సమానమైనవాడై; ఉండెన్= నివసించాడు; అని చెప్పినన్= అని పలుకగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఏమి వర్తనంబునన్= ఏ ప్రవర్తనతో, నడతతో; నరుండు= మానవుడు; వీతశోకుండు+అగుచున్= నశించిన శోకంగలవాడుగా; చరించున్?= నడచును?; ఏ+దానన్+చేసి= దేనివలన; పరమగతి= పరమపదము, మోక్షం; పడయున్= పొందుతాడు?; అనుటయున్= అనగా; అనిమిష నదీ నందనుండు= దేవనది తనయుడు భీష్ముడు; అజగర

చరితంబు+అను= అజగర చరితం అనే పేరుగల; ఇతిహాసంబు= చరిత్ర, జరిగిన కథ; వినుము= ఆలకించుము; దానన్= దానివలన; నీ అడిగిన+అర్థంబు= నీవు ప్రశ్నించిన విషయం; తేటపడున్= స్పష్టపడుతుంది; దానిన్+చెప్పెదన్= దానిని పలుకుతాను; అజగర నామధేయుండు+అగు= అజగరుడు అనే పేరుగలవాడగు; ఒక్క బ్రాహ్మణునిన్= ఒక విప్రుడిని; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడనే రాక్షసరాజు; శమప్రకారంబు= శాంతి పద్ధతి; ఉపదేశింపుము= బోధించుము; అని; అభి+అర్థించినన్= ప్రార్థించగా; అతండు= ఆ అజగరుడు; అతనికిన్= ఆ ప్రహ్లాదుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా దైవవశాన కోడెదూడలు హఠాత్తుగా మరణించగా మంకి ధనాశమీద విరక్తి కలిగి, కామాన్నే మొత్తంగా పరిత్యజించి, సుఖంగా దేవసమానంగా జీవించాడు' అని భీష్ముడు పలుకగా విని ధర్మజుడు - 'నరుడు ఏమి చేస్తే అతడి శోకం నశిస్తుంది? ఏ మార్గాన అతడు మోక్షాన్ని పొందగలడు?' అని ప్రశ్నించాడు. సమాధానంగా భీష్ముడు అజగర చరిత్ర అనే ఇతిహాసం అతడి ప్రశ్నలకు సమాధానం కాగలదని ఆ ఇతిహాసాన్ని వివరించటం ప్రారంభించాడు. రాక్షసరాజయిన ప్రహ్లాదుడు అజగరుడనే పేరుగల బ్రాహ్మణుడిని సమీపించి, తనకు శాంతి పద్ధతిని ఉపదేశించు మనగా, ఆ అజగరుడు ప్రహ్లాదుడితో ఇట్లా అన్నాడు.

క. 'అనిమిత్తము భూతంబుల । జననం బవి రూపు సెడుట సంపన్నములై
యునికి విషాదము మోదం । బును జేయఁగ లే వనిత్యములుగ నెఱిఁగినన్. 55

ప్రతిపదార్థం: అనిత్యములుగన్= శాశ్వతమైనవి కానివిగా- అశాశ్వతాలుగా; ఎఱిఁగినన్= తెలిసికొంటే; భూతంబుల జననంబు= ప్రాణుల పుట్టుక; అనిమిత్తము= నిష్కారణం; అవి= ఆ ప్రాణులు; రూపు+చెడుట= నశించటం; సంపన్నములై+ఉనికి= సంపదలతో కూడినవై ఉండుట (క్రమంగా); విషాదమున్= దుఃఖమును; మోదంబును= సంతోషమును; చేయఁగన్+లేవు= కలిగింపజాలవు.

తాత్పర్యం: 'సృష్టిలో ప్రాణిజాలం పుట్టుక నిష్కారణంగా జరుగుతుంది. అవి సమృద్ధితో ఉండటంగాని, లేక నశించిపోవటంగాని నరుడికి (అతడూ ఒక ప్రాణి మాత్రుడు) మోదాన్నో, ఖేదాన్నో కలిగించవలసిన పని లేదు. ఎందుకంటే ప్రాణులు శాశ్వతమైనవి కావు. నశింపు వాటి సహజలక్షణం.

విశేషం: భూతము అంటే ప్రాణి - పుట్టుక కలిగినది. పుట్టుక ఉన్నప్పుడు గిట్టుట తప్పదు. జన్మం, మరణం - ఈ రెండూ ఒక వస్తువుయొక్క మొదలు, తుది వంటివి. తప్పనిసరిగా ఉండేవి. కాబట్టి అపరిహార్యమైన అంశాన శోకించటం ఏల? అని అజగరుడి బోధ.

తే. వరదఁ గాష్ఠముల్ గూడిన వడువు బంధు । సంగమం బవి వాసిన చాడ్పు తద్వి
యోగ మింత సూచిన వాని నుమ్మలికము । పొరయనేరదు దానవవరతనూజ! 56

ప్రతిపదార్థం: దానవ వర తనూజ!= దనుజ రాజకుమారా!; వరదన్= వరదలో, ప్రవాహంలో; కాష్ఠముల్+కూడిన వడువు= కట్టెలు దగ్గరైన విధంగా; బంధు సంగమంబు= బాంధవుల కలయిక; అవి= ఆ కట్టెలు; పాసిన చాడ్పు= విడిపోయిన విధం; తద్+వియోగము= ఆ బంధువుల ఎడబాటు; ఇంత+చూచినవానిన్= ఈ విధంగా గ్రహించిన నరుడిని; ఉమ్మలికము= దుఃఖము; పొరయన్+నేరదు= పొందజాలదు.

తాత్పర్యం: రాక్షస రాజకుమారా! ప్రవాహం సాగిపోతూ ఉన్నపుడు అందులో అపుడపుడు కొన్ని కట్టెలు తేలుతూ వచ్చి, ఒకదానితో ఒకటి కలుస్తుంటాయి. సృష్టిలో చుట్టాల, బంధువుల కలయిక కూడా అటువంటిదే. ప్రవాహంలో ఆ కట్టెల కలయిక, కట్టెల ఇష్టంమీద ఆధారపడి జరగలేదు. అవి విడిపోవటంకూడా వాటితో నిమిత్తం లేకుండానే

జరిగిపోతుంది. అదంతా ప్రవాహ వేగం, దిశ - వంటి వాటిమీద ఆధారపడి జరిగిపోతూ ఉంటుంది. అట్లాగే బంధువుల కలయికలూ, ఎడబాటులూ లోకంలో జరుగుతూ ఉంటాయి. ఆ కలయికలకు గాని, ఎడబాటుకు గాని నరుడి ప్రమేయం ఉండదు. ఈ విధంగా సృష్టిలోని మానవుల సంబంధ బాంధవ్యాల యథార్థస్థితిని గ్రహించినవాడిని దుఃఖం దరిచేరలేదు.

విశేషం: అలం: ఉపమ. మన ప్రమేయంలేకుండా సృష్టిధర్మాలుగా జరిగిపోయేవాటికి మన ప్రమేయాన్ని ఆపాదించుకొని వేదనలు పడటం తత్త్వ దర్శనం లేకపోవటంవలన జరుగుతుంది. ఇక్కడ అజగరుడు ప్రహ్లాదుడికి తత్త్వదర్శనం కల్పిస్తున్నాడు.

వ. ఈ తెఱంగు లే నెఱుంగుదు; నాదెసఁ బ్రశాంతిం గనికాదె నీవు శమోపదేశం బర్థించితివి. వినుము. 57

ప్రతిపదార్థం: ఈ తెఱంగులు= ఈ పద్ధతులు - పైన తెలిపినవి; ఏను= నేను; ఎఱుంగుదున్= తెలియుదును; నా దెసన్= నా యందు; ప్రశాంతిన్= అధికమైన శాంతిని; కని= చూచి; నీవు; శమ+ఉపదేశంబు= శాంతి కొరకైన బోధ; అర్థించితివి కాదె!= యాచించావు కదా!

తాత్పర్యం: నేను వివరించినట్లుగా మానవుల సంబంధబాంధవ్యాల తత్త్వం నేను గ్రహించాను. కాబట్టే నాలో ఇంతటి ప్రశాంతి నెలకొన్నది. దానిని చూచే కదా నీవు నా దరిచేరావు - శాంతి బోధకొరకు! కాబట్టి వినుము.

విశేషం: వాఙ్మయంనుండి గ్రహించటంవేరు, అనుభవంనుండి తెలిసికొనటం వేరు. అజగరుడి వివేకం అనుభవజన్యమైనది. కాబట్టే అతడు అంతగా ప్రశాంతుడు.

క. మే లర్థింపను గీడును । జాలింబడి తొలఁగఁ ద్రోవ సరిఁ దూష్ణీం భా
వాలంబిమనస్కుఁడనై । యాలంబుగఁ జేసి నడతు నయ్యిరుదెఱఁగున్. 58

ప్రతిపదార్థం: మేలు= క్షేమము; అర్థింపను= కోరను; కీడునున్= చేటువలన; జాలిన్+పడి= మనస్సునందు కష్టం చెంది; తొలఁగన్+త్రోవన్= తొలగునట్లు త్రోసివేయగా (కీడును); సరిన్= సమానంగా; తూష్ణీంభావ+ఆలంబిమనస్కుఁడను+ఐ= ఊరక ఉండుటను అవలంబించిన మనస్సుకలవాడనై; ఆ+ఇరుతెఱఁగున్= ఆ రెండు పద్ధతులను; ఆలంబుగన్= ఉపేక్షగ; చేసి= మార్చివేసి; నడతున్= ప్రవర్తింతును.

తాత్పర్యం: మేలు కావాలి అని కోరను, కీడు దాపురిస్తే దుఃఖించి దానినుండి బయటపడటానికి యత్నిస్తాను. మేలు కీళ్ళు రెండిటినీ సరిసమానంగా చూస్తూ (ఊరక, సాక్షిగా చూచే) మనస్సులో ఆ రెంటియెడ ఉపేక్ష వహించి జీవిస్తుంటాను.

విశేషం: నరునికి మేలుగాని కీడుగాని కలిగినప్పుడు అతడి ప్రవృత్తి భిన్నంగా ఉంటుంది. అయితే సృష్టితత్త్వ దర్శనంచేసి ప్రాణుల సంబంధాల అంతరార్థం అవగతమైన మనస్సును మోదంగాని, ఖేదంగాని స్పృశింపలేదు. అజగరుడు ఆ స్థితిలో తాను అనుభోక్తగా కాకుండా సాక్షిగా జరిగే దానిని చూచేవాడుగా మాత్రం జీవయాత్ర సాగిస్తున్నాడు.

క. సరసాన్నము పిణ్యాకము । సరిగాఁగ భుజింతు మృదుల శయ్యా తలమున్
ధరణియు శయనరుచికి నా । కరయంగా నొక్కరూప! యసురప్రవరా! 59

ప్రతిపదార్థం: అసుర ప్రవరా!= రాక్షస శ్రేష్ఠా!; సరస+అన్నము= రుచికరమైన ఆహారము; పిణ్యాకము= తెలికపిండి; సరిగాఁగన్= సమానముగా; భుజింతున్= తినెదను; మృదులశయ్యా తలమున్= మెత్తనైన పడక ప్రదేశము; ధరణియున్= భూమీ; శయన రుచికిన్= పడక (కొరకైన) కోర్కెకు, నాకున్; అరయంగాన్= పరిశీలింపగా; ఒక్కరూపు+అ!= ఒకటే! సమానమే.

తాత్పర్యం: ఓ రాక్షసరాజా! నా జీవన సరళిని వివరిస్తున్నాను. నాకు రుచిగల ఆహారమైనా, రుచిహీనమైన తెలికపిండి అయినా సమానంగానే ఉంటాయి. రెంటినీ సమభావంతో భుజిస్తాను. అట్లాగే మెత్తని పడకైనా, గట్టి భూభాగమైనా పరుండటానికి నాకు సమానంగానే ఉంటాయి. రెండు చోట్లా సమమైన ఆదరంతో శయనిస్తాను.

విశేషం: ఆహార నిద్రలు శరీరమాత్రరక్షణానికి ఉద్దిష్టాలని గ్రహించి, ఆత్మజ్ఞుడు వాటికి ప్రాముఖ్యాన్ని ఇవ్వడు. తాను శరీరమాత్రుడను గాననే జ్ఞానం కారణంగా ఆ ఉపేక్షాభావం అతడిలో నెలకొంటుంది. ఇక వస్త్రధారణపై తన పద్ధతిని వివరిస్తున్నాడు - అజగరుడు.

ఆ. నారచీరయేనిఁ జారు చీనాంబరం । బైనఁ గట్టికొనినయపుడు హృదయ
మొప్ప దొప్పు ననక యుండు రూపాదుల । నలమికొనవు చక్షురాదికములు.' 60

ప్రతిపదార్థం: నారచీర+ఏనిన్= చెట్టుపట్టగాని; చారు చీన+అంబరంబు+ఐనన్= అందమైన చీనాంబరము (వెలగల పట్టువస్త్రము) అయినా; కట్టికొనిన+అపుడు= ధరించినపుడు; హృదయము= మనస్సు; ఒప్పదు= అంగీకరించదు(అంతేకాక); ఒప్పున్= అంగీకరించును; అనక= అనకుండా; ఉండున్= (ఒకటిగా) ఉంటుంది; చక్షున్+ఆదికములు= కన్ను మొదలయినవి (ఇంద్రియములు- చెవి ముక్కు మొదలగునవి); రూప+ఆదులన్= ఆకారము మొదలయిన వానిని, అలమికొనవు= వ్యాపించవు.

తాత్పర్యం: వస్త్రధారణ విషయంలో మానసంరక్షణమే ధ్యేయం కాబట్టి, దానికి మించి నేను గుడ్డలకు ప్రాముఖ్యమీయను అని చెట్టుపట్టగాని, చీనాంబరంగాని - రెంటిని సమభావంతోనే ధరిస్తాను. నారచీర కట్టినపుడు మనస్సు అంగీకరించకపోవటం, చీనాంబరం కట్టినపుడు మనస్సు ఆహ్లాదపడటం ఉండవు. నాకు రెండూ సమానమే. ఎందుకంటే నా కన్నులు మొదలైన ఇంద్రియాలు ఆకారంమొదలైన విషయాలను పట్టించుకొనవు.'

విశేషం: ఇంద్రియాలు అజగరుని అధీనంలో ఉన్నాయిగాని అజగరుడు ఇంద్రియాల అధీనంలో లేడు. కాబట్టి ఉపేక్ష, సమభావం సాధ్యమైనాయి.

వ. అని వెండియు. 61

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

ఆ. చలనమేది పుట్టుఁ జావునుం బిరువెట్టి । యామిషార్థిజనుల నపహసించు
చెలిమితోడ లేమికలిమి వాటింపని । రమణ నునికి యజగరవ్రతంబు. 62

ప్రతిపదార్థం: చలనము+ఏది= కదలిక (లేకుండ) నశించి; పుట్టున్+చావునున్= పుట్టుకను, చావునూ; పిరు+పెట్టి= నిరాదరణచేసి (వెనుకకు నెట్టి); ఆమిష+అర్థిజనులన్= (మాంసమును) కోరెడి ప్రజలను; అపహసించు= పరిహసించే; చెలిమితోడన్= స్నేహంతో (ఆహారంలో రుచులు భోగాలు కోరేవారిని చూచి నవ్వగలిగిన స్థితిలో); లేమి, కలిమి= దారిద్ర్యం, సంపద - రెంటినీ; పాటింపని= ఆదరించని, రమణన్= పద్ధతితో; ఉనికి= ఉండటం; అజగర వ్రతంబు= అజగరుడి జీవన విధానం.

తాత్పర్యం: కదలిక లేకుండా ఒకచోట పడి ఉండి, చావుపుట్టుకలను పట్టించుకొనకుండా భోగభాగ్యాలు ఆశించి ప్రాకులాడే జనసామాన్యాన్ని చూచి నవ్వుకొంటూ, కలిమిలేములు రెండింటినీ సమానంగా చూస్తూ, జీవనం కొనసాగించటం అజగరవ్రతమౌతుంది.

విశేషం: అజగరం అంటే కొండచిలువ. పెద్దగా కదలిక లేకుండా పడి ఉండే పెద్దపాము. దేహధారణకొరకు తినటం తరువాత నిద్రించటం దాని పద్ధతి అంటారు. అదే విధంగా కామత్యాగం చేసిన యోగి శరీరధారణమాత్రం కొరకే ఆహారం స్వీకరిస్తూ మిగిలిన ప్రాపంచికవిషయాలలో అనాసక్తుడై ఉంటాడు. అతడే అజగవరవ్రతుడు.

ఆ. అనియతంబు లైన యాహార విహరణ । శయనముల విధాతృ సంప్రయుక్త
భంగిఁ బరఁగు నంతరంగ నిర్భార వ । ర్తనము కలిమి యజగరవ్రతంబు. 63

ప్రతిపదార్థం: అనియతంబులు+ఐన= నియమించబడినవిగాని; ఆహార విహరణ శయనములన్= తినటం, తిరుగటం, పరుండటంతో; విధాతృ సంప్రయుక్త భంగిన్= బ్రహ్మచేత చక్కగా ప్రయోగించబడిన విధంగా (బ్రహ్మ నిర్దేశానుకూలంగా); పరఁగు= ఒప్పు; అంతర్+అంగ నిర్+భార వర్తనము= మనస్సున బరువులేని (బాధ్యతలేని) ప్రవృత్తి; కలిమి= కలిగి ఉండటం; అజగరవ్రతంబు= అజగరవ్రతం.

తాత్పర్యం: నియమ నిబంధనలకు లోనుగాకుండా భుజిస్తూ, సంచరిస్తూ, శయనిస్తూ, బ్రహ్మనిర్దేశాన్ని పాటిస్తూ అంతరంగాన ఏ బరువు బాధ్యతలూ లేకుండా ఉండటం అజగరవ్రతం.

విశేషం: సామాన్యులకు ఆహారవిహారాదులలో నియమనిబంధనలు తప్పవు. అజగరవ్రతుడు అసామాన్యుడు, అలౌకికుడు, అంతర్ముఖుడు. కాబట్టి అతడికి లోకమర్యాదలు పాటించవలసిన అవసర ముండదు. కేవలం బ్రహ్మనిర్దేశానికి తప్ప ఇతరానికీ అతడు బద్ధుడుకాడు. బ్రహ్మనిర్దేశం ప్రాణికి అవశ్యం అనుసరణీయం. అజగరుడూ జీవించి ఉన్నంత కాలం ప్రాణి మాత్రుడే!

ఆ. నిత్య తృప్తి శౌచనిరతి తాల్మి సమత్వ । మారఁ గలిగి చిత్ సుఖానుభవము
ప్రచుర మగుట యజగరవ్రత మిది విను । యజ్ఞదుర్లభంబు ప్రాజ్ఞభూమి.' 64

ప్రతిపదార్థం: నిత్య తృప్తి= ఎల్లప్పుడూ తనివినొందటం; శౌచనిరతి= శుభ్రతయెడ ఆసక్తి; తాల్మి= ఓర్పు; సమత్వము= సమానత్వం; ఆరన్+కలిగి= నిండుగా ఉండి; చిత్ సుఖ+అనుభవము= చిదానందానుభూతి; ప్రచురము+అగుట= అధికమవటం; అజగరవ్రతము+ఇది= ఇదీ అజగరవ్రతమంటే; వినుము= ఆలకించుము (ఇది); యజ్ఞ దుర్ లభంబు= యాగంవలన (దుఃఖంతో లభించేది) లభించనిది; ప్రాజ్ఞభూమి= పండితుల స్థలం.

తాత్పర్యం: నిత్యతృప్తి, శుభ్రత, ఓరిమి, సమభావం - ఈ లక్షణాలను నిండుగా కలిగి ఉండి, చిదానందానుభవం పొందుతూ ఉండటం అజగరవ్రతం. ఇది యజ్ఞంవలన లభించేదిగాదు. యజ్ఞనిర్వహణం కంటె గొప్పదైన వ్రతమిది. వ్రతమంటే జీవనం. ఈ జీవనవిధానం పండితమాత్ర స్వీకార్యం. అన్యులకు ఇది ఆచరణయోగ్యం కాజాలదు'.

విశేషం: ఇంద్రియాలు ప్రాపంచికవిషయాలనుండి మరలి, అంతర్ముఖాలైనపుడు మనస్సు ఏకాగ్రమౌతుంది. అదే చిత్ సుఖం లేక చిదానందం. ఆ ఆనందమయ జీవనం కారణంగానే అజగరుడు లౌకిక విషయాలయెడ అనాసక్తుడై తూష్ణింభావంతో ఉంటున్నాడు.

వ. ఇది శమప్రకారం బనియె' నని చెప్పి భీష్ముండు. 65

ప్రతిపదార్థం: ఇది= ఈ పై బోధించింది; శమప్రకారంబు= శాంతి పద్ధతి; అనియెన్= అన్నాడు; అని; చెప్పి= పలికి; భీష్ముండు= పితామహుడు.

తాత్పర్యం: శాంతికి మార్గమిది - అజగరవ్రత ఆచరణమే - అని అజగరుడు పలికా' డని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు. మళ్ళీ భీష్ముడు ఇట్లా ప్రసంగించాడు.

క. 'అజగర చరితము దనకును । నిజముగ నలవఱుప నేర్చు నిర్మలమతికిన్
వృజిన భయ మన్యు శోకము । లజేయములు గావు, మోక్ష మాయత్తమగున్.' 66

ప్రతిపదార్థం: అజగర చరితము= అజగరవ్రతము (అజగరుడి వంటి నడత); తనకును= తనకు కూడా; నిజముగన్= సత్యంగా; అలవఱుపన్= అలవాటుచేసికొనుటకు; నేర్చు= నేర్చిన; నిర్మలమతికిన్= మలినంలేని బుద్ధిగలవానికి; వృజిన భయమన్యు శోకములు= పాపం, భీతి, కోపం, బంధునాశంవలన దుఃఖాలు; అజేయములు= జయించవీలుగానివి; కావు= కాజాలవు; మోక్షము= ముక్తి; ఆయత్తము+అగున్= అధీనం అవుతుంది.

తాత్పర్యం: 'అజగరుడి నడతను ఆచరించగల నరుడికి పాపం, భీతి, కోపం, శోకంవంటి మానసిక క్షోభలు నిర్వేదాన్ని కలిగించలేవు. వాటిని అతడు జయించగలడు. ఆపైన ముక్తీ అతడికి లభిస్తుంది.'

విశేషం: జీవన్ముక్తుడే అజగరవ్రతాన్ని నిజంగా ఆచరించగలడు. పద్యంలోని 'నిజముగన్' అనే క్రియావిశేషణం అందుకే ప్రయుక్తమైనది. సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా జీవించగలగటమంటే ముక్తిని అందుకొనటమే.

వ. అనిన విని యజాతశత్రుండు 'బంధుమత్త్వ కర్మవిత్త ప్రజ్ఞలయం దెయ్యది నరునకు సుప్రతిష్ఠం జేయు?' నని యడిగిన నాపగాతనయుం డతని కిట్లనియె. 67

ప్రతిపదార్థం: అనిన(న్)= అనగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు కలవాడు - ధర్మరాజు; బంధుమత్త్వ కర్మ విత్త ప్రజ్ఞలఅందున్= బంధువులు కలిగి ఉండటం, కర్మం, ధనం, బుద్ధిబలం అన్నింటిలో; ఏ+అది= ఏది; నరునకున్= మానవుడికి; సుప్రతిష్ఠన్= మంచికీర్తిని; చేయున్?= కలిగిస్తుంది?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆపగాతనయుండు= నదీసుతుడు- భీష్ముడు; అతనికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అజగరవచనాలను, ఆపైన భీష్ముడి పలుకులను ఆలకించిన ధర్మరాజు తిరిగి భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు; 'బంధువుల కలిమి, కర్మం, ధనం, బుద్ధిబలం అనే ఈ నాలుగింటిలో దేనివలన నరుడికి గొప్ప కీర్తి కలుగుతుంది?' అని. ఆ ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు ధర్మజుడితో ఇట్లా అన్నాడు.

క. 'ప్రజ్ఞయ ప్రతిష్ఠ, లాభము । ప్రజ్ఞయ, నాకం బనంగఁ బ్రజ్ఞయ చువ్వే,
ప్రజ్ఞయ కైవల్యంబును, । ప్రజ్ఞాసాధ్యములు గాని పనులుం గలవే? 68

ప్రతిపదార్థం: 'ప్రజ్ఞ+అ= బుద్ధియే; ప్రతిష్ఠ= కీర్తి; లాభము= ప్రాప్తి, ఆదాయం; ప్రజ్ఞ+అ= బుద్ధియే; నాకంబు= స్వర్గము; అనంగన్= అనగా; ప్రజ్ఞ+అ= బుద్ధియే; చువ్వే= సుమా!; ప్రజ్ఞ+అ= బుద్ధియే; కైవల్యంబును= మోక్షంకూడా; ప్రజ్ఞాసాధ్యములు+కాని= ప్రజ్ఞతో సాధించనలవిగాని; పనులున్= పనులుకూడా; కలవు+ఏ?= ఉన్నవా? (లేవు).

తాత్పర్యం: ప్రజ్ఞ ఒక్కటే కీర్తికరం, అదే ఆదాయం. నిజానికి స్వర్గమన్నా బుద్ధే కదా! ఇంతెందుకు? చివరకు ముక్తి కూడా ప్రజ్ఞయే తప్ప అన్యం కాదు. బుద్ధివలన సాధ్యంకాని పనులు లేవు.

విశేషం: జీవితాన సర్వాంతర్యామి ప్రజ్ఞ. జీవనంలోని సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, సర్వజీవనవ్యాపారాలూ ప్రజ్ఞాజనితాలే. కాబట్టి ప్రజ్ఞ కీర్తికర మనటం నిశ్చయం.

వ. బలి ప్రహ్లాద మంకి ప్రభృతులు ప్రజ్ఞన కాదె సమాధాన సంపన్నులయిరి; కాశ్యప నామధేయుం డగు ధరణీ సురోత్తముం డొక్క యుద్ధత పురుషుని రథంబు దాఁకి పడి తదవమానదూయమాన మానసుండై యసుపరిత్యాగ పరవ్యవసాయుం డగుటయు నింద్రుండు సృగాలరూపంబున నమ్మహాద్విజుని పాలికి వచ్చి ప్రజ్ఞాసంబోధకం బగు సంవాదంబునం జిత్తప్రసాదంబు కావించె నని విందు; మెల్లభంగులఁ బ్రజ్ఞ యుత్తమాధికారం' బనిన విని ధర్మతనయుండు. 69

ప్రతిపదార్థం: బలిప్రహ్లాద మంకి ప్రభృతులు= బలిచక్రవర్తి, ప్రహ్లాద కుమారుడు, మంకి బ్రాహ్మణుడు మొదలైనవారు; ప్రజ్ఞన కాదు+ఎ!= ప్రజ్ఞవలననే కదా!; సమాధాన సంపన్నులు= సమాధానమును పొందినవారు; అయిరి?= కాగలిగారు?; కాశ్యప నామధేయుండు+అగు= కాశ్యపుడను పేరుగలవాడైన; ధరణీసుర+ఉత్తముండు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఒక్క+ఉద్ధత పురుషుని

రథంబు= ఒక గర్వితుడైన నరుడి (రథము) తేరు; తాఁకి= తగిలి; పడి= క్రిందపడి; తద్+అవమాన దూయమాన మానసుండు+ఐ= అవమానంవలన బాధచెందే మనస్సు కలవాడై; అసు పరిత్యాగపర వ్యవసాయుండు+అగుటయున్= ప్రాణాన్ని వదలుటయందు ఆసక్తమైన ప్రయత్నం కలవాడు కాగా; ఇంద్రుండు= దేవేంద్రుడు దేవతలరాజు; నృగాలరూపంబునన్= నక్క ఆకారంలో; ఆ+మహాద్విజుని పాలికిన్= ఆ గొప్ప బ్రాహ్మణుని చెంతకు; వచ్చి; ప్రజ్ఞా సంబోధకంబు+అగు= బుద్ధికి ఉపదేశించెడిదైన; సంవాదంబునన్= సల్లాపంతో, మంచి పలుకుతో, ప్రసంగంతో; చిత్త ప్రసాదంబు= మనస్సుయొక్క ప్రసన్నతను; కావించెన్= కలిగించాడు; అని విందుము= అని వింటాం; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ప్రజ్ఞ= బుద్ధి; ఉత్తమ+అధికారంబు= శ్రేష్ఠమైన ఆశ్రయము; అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మతనయుండు.

తాత్పర్యం: బలి, ప్రహ్లాదుడు, మంకి మొదలైనవారు ప్రజ్ఞవలననే సమాధానాన్ని పొందారు. కాశ్యపుడు అనే పేరుగల బ్రాహ్మణోత్తముడు ఒక గర్వితుడి రథం తగిలి పడిపోయాడు. దానిని అవమానంగా భావించి బాధపడి ప్రాణత్యాగానికి ప్రయత్నించాడు. ఇంద్రుడు నక్కరూపంలో ఆ బ్రాహ్మణుడి వద్దకు వచ్చి, ప్రజ్ఞను గురించిన ప్రబోధాన్ని చేసే సంభాషణవలన మనశ్శాంతిని కలిగించాడు - అని వింటాం. అన్ని విధాలా ప్రజ్ఞయే ఉత్తమాశ్రయం' అనగా విని ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరవర! దానముఁ దపమును । గురుశుశ్రూషయును యజ్ఞకోటియు నెట్టై
పరిణతిఁ బొందం గలయవి । పురుషున? కత్తెఱఁగు దెల్లముగ వినవలతున్.' 70

ప్రతిపదార్థం: నరవర!= మానవులలో శ్రేష్ఠుడా!; పురుషునకున్= నరునకు; దానమున్= ఇచ్చుట - ఈవి; తపమును= తపస్సు; గురుశుశ్రూషయు= పెద్దల సేవా; యజ్ఞ కోటియున్= యజ్ఞసమూహమూ; ఎట్లు+ఐ= ఏ విధంగా; పరిణతిన్= మార్పును ఫలితరూపమైన మార్పును; పొందన్+కల+అవి= పొందగలవు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; తెల్లముగన్= స్పష్టంగా; వినన్+వలతున్= వినుటకు ఇచ్చగిస్తాను.

తాత్పర్యం: 'ఓమానవ శ్రేష్ఠా! నరుడు దానం, తపస్సు, పెద్దలసేవ, యజ్ఞాలవలె చేస్తుంటాడు. అయితే అతడు చేసిన ఈ పనులన్నీ ఏ విధంగా మార్పు చెందుతాయి? వాటి పర్యవసానం ఆ నరునికి ఎట్లా చెందుతుంది? వాటి ఫలితాన్ని అతడు ఎట్లా అందుకొంటాడు? స్పష్టంగా వినటానికి కుతూహలపడుతున్నాను'.

విశేషం: కార్యకారణ సిద్ధాంతం ప్రకారం పని జరిగినపుడు ఫలితం ఉండాలి. కాని, నిజజీవితాలలో దానం మొదలైన కార్యాలు నిర్వహించబడినా, వాటి ఫలితాలు కొన్ని సందర్భాలలో వెంటనే బయల్పడక, రూపాంతరం చెంది కనిపిస్తాయనే విశ్వాసం ఆధారంగా ఈ ప్రశ్న వేయబడినట్లు ఉన్నది.

వ. అనుటయు దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 'మేలు లనుబంధించు మేలులట్ల కీళ్కును ననుస్యూతంబులయి తొడరు నాకర్ణింపుము. 71

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; దేవవ్రతుండు= భీష్ముడు (నిజమైన నామమిది); ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లు పలికాడు; మేలులు= క్షేమాలు, శుభాలు; మేలుల(న్)= శుభాలను; అనుబంధించు(న్)= అనుసరించును; అట్లు+అ= ఆ విధంగానే; కీళ్కును= కీళ్ళుకూడా; అనుస్యూతంబులు+ఐ= అనుసరించేవై; తొడరున్= కలుగుతాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మజుని ప్రశ్న విన్న వెంటనే భీష్ముడు 'లోకంలో మేళ్ళు, కీళ్ళు అనేవి ఒకదానిని మరొకటి వెన్నంటి వస్తున్నట్లుగా వరుసగా శుభం వెంట శుభమూ, అశుభం వెంట అశుభమూ ఎడం లేకుండా వచ్చి పడుతూ ఉంటాయి. వినుము.

విశేషం: నరుడి పనుల పరిణతిని గూర్చి ప్రశ్నిస్తే శుభాశుభాలు అనుస్యూతంగా వెన్నంటి వస్తుంటా యని సమాధానం. వాటి పరిణామరీతి అట్లా అనిపిస్తుందన్నమాట.

క. కఱవుపయిఁ గఱవు వొరయుచు । వెఱపు పయిన్ వెఱపుఁ దోప విడువని యిడుమం
దొఱఁగమిపైఁ బురుషుఁ డిడుమఁ । దొఱఁగమిఁ జేడ్పడుచు నడచు దుష్కర్మములన్.' 72

ప్రతిపదార్థం: కఱవుపయిన్= కాటకంమీద; కఱవు= కాటకం - క్షామం; పొరయుచు(న్)= కలుగుతూ; వెఱపు పయిన్= భీతిమీద; వెఱపున్+తోఁప(న్)= భీతి ఏర్పడగా; విడువని= తొలగని; ఇడుమన్= కష్టమును; తొఱఁగమిపైన్= తొలగకపోవటం మీద; పురుషుఁడు= నరుడు; ఇడుమన్= కష్టమును; తొఱఁగమిన్= తొలగకపోవటం వలన; చేడ్పడుచు(న్)= చేటు పడుతూ - కష్టపడుతూ; దుస్+కర్మములన్= చెడు పనులతో; నడచున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: మానవలోకంలో కరవు కాటకాలు ఒకదాని మీద ఒకటి వచ్చిపడినట్లుగా వరుసగా వస్తుంటాయి. అట్లాగే భయం మీద భయం వెన్నంటి మనిషిని క్రుంగదీస్తుంది. చేటుమీద చేటు, కీడుమీద కీడు పరుగు పరుగున వచ్చిపడినట్లుగా మనిషిని క్రమ్ముకొంటాయి. ఈ స్థితిలో నరుడు ఒక కీడునుండి మరొక కీడును ఎదుర్కొంటూ, చెడుపనుల బారిన పడి చెడుగై మిగులుతాడు'.

విశేషం: నరుడిలో పరిసరాలకు అనుగుణంగా స్పందించే లక్షణం ఉన్నది. బహుశః దానివలననే కావచ్చును - అతడు చెడుగులలో చెడుగుగా మారిపోవటం జరుగుతుంటుంది.

వ. అని మఱియును. 73

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (ఇట్లా అంటున్నాడు).

ఆ. 'ఉత్సవంబుమీఁద నుత్సవ మందుచు । సుఖముమీఁద సుఖము సొప్పడంగఁ
బుణ్యపదము మీఁదఁ బుణ్య పదంబున । కరుగు నరుఁడు సుకృతియైన నధిప! 74

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నరుఁడు= మానవుడు; సుకృతి+ఐనన్= పుణ్యవంతుడైతే; ఉత్సవంబు మీఁద(న్)= మేలుమీద; ఉత్సవము+అందుచు(న్)= మేలును పొందుతూ; సుఖముమీఁద(న్)= సౌఖ్యంమీద; సుఖము= సౌఖ్యం; చొప్పడంగన్= చోటుచేసికొనగా; పుణ్యపదము మీఁదన్= ధర్మమార్గంమీదుగా; పుణ్యపదంబునకున్= ఉత్తమ లోకానికి; అరుగున్= వెళ్ళుతాడు.

తాత్పర్యం: నరుడు ధర్మాత్ముడై పుణ్యంచేసి ఉంటే అతడు మేలుమీద మేలు అందుకుంటూ సుఖం మీద సుఖం పొందుతూ ధర్మమార్గాన, పుణ్యలోకం చేరుకుంటాడు.

విశేషం: నరుడిని ధర్మం మరొక ధర్మానికి నడిపించి అతడికి శుభపరంపర ఒనగూడేటట్లు చేస్తుంది. అదే అధర్మమయితే వ్యతిరేకదిశలో సాగి, ఫలితాలూ వ్యతిరిక్తంగానే ఉంటాయి.

క. పులుఁగులలోఁ బూత్యండక । ములు సారములైన ధాన్యములలోనం బొ
ల్లులు బోలెను జూవె మను । ష్యులలో ధర్మరహితాత్ము లుర్వీనాథా! 75

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా! మనుష్యులలోన్= నరులలో; ధర్మరహిత+ఆత్ములు= ధర్మంలేని ఆత్మకలవారు ఉంటారు, పులుఁగులలోన్= పక్షులలో; పూతి+అండకములు= చెడ్డ కంపుగల చిన్న గ్రుడ్లు (పిల్లలుగాని చెడుగ్రుడ్లు); సారములైన ధాన్యములలోనన్= గట్టి ధాన్యపుగింజలలో; పొల్లులు+పోలెన్= తాలులువలెను (తాలు గింజలు); చూవె!= సుమా!

తాత్పర్యం: రాజా! నరులలో పాపాత్ములు ఎట్లా ఉంటూంటారంటే పక్షులలో చెడిన గ్రుడ్లవలె, గట్టి ధాన్యరాశిలో తాలుగింజలవలె సారహీనంగా ఉంటూంటారు. వారి ఉనికి రాశికే గాని వాసికి గాదు.

క. చనినఁ జను నున్న నుండు । న్మనుజుఁ డొకటి సేయఁ జేయు నరనాయక! తో
డన తగిలి నీడవోలెను । విను చేసిన కీడు మేలు విడువవు వానిన్. 76

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా!; మనుజుఁడు= నరుడు; చేసిన= ఒనర్చిన; కీడు= పాపం; మేలు= పుణ్యం; చనినన్= (నరుడు) వెళ్ళిపోతే; చనున్= (తానుకూడా పాపంగాని, పుణ్యంగాని) వెళ్ళిపోతుంది (పరలోకానికి); ఉన్నన్= (జీవించి) ఉన్న యెడల; ఉండున్= (నిలిచి) ఉంటుంది; ఒకటి+చేయన్= ఒకదానిని చేస్తే; చేయున్= (తాను కూడా బదులు) చేస్తుంది; నీడ+పోలెను= నీడవలె; తోడన్+అ= తోడనే, వెంటనే; తగిలి= తగుల్కొని, వెన్నంటి; వానిన్= ఆ చేసిన నరుడిని; విడువవు= వదలవు.

తాత్పర్యం: రాజా! నరుడు చేసిన పాపపుణ్యాలు అతడిని నీడవలె వెన్నంటి ఉంటూ, అతడు చనిపోతే అవీ అతడిని అనుసరించి పరలోకాలకు వెళ్ళుతాయి. అతడు జీవించి ఉంటే అవీ అతనితోపాటే జీవిస్తూ, అతడు చేసే ప్రతిపనిమీదా తమ ప్రాభవాన్ని నెరపుతూ ఉంటాయి. ఫలితార్థ మేమిటంటే, నరుడు బ్రతికినా, చనిపోయినా అతడు చేసిన పాపపుణ్యాలు మాత్రం అతడిని వదలవు. వెన్నంటి ఉంటూనే ఉంటాయి. తమ ప్రభావం చూపుతూనే ఉంటాయి.

విశేషం: అలం: ఉపమ. పాపపుణ్యాలు మానవజీవితంలో అవిభాజ్యాలుగా కొనసాగుతూ తమ ప్రభావాన్ని తత్కర్తపైన నెరపుతుంటాయి. కర్మసిద్ధాంతానికి కూడా పాపపుణ్యాలే మూలమంటారు. పని ఉన్నప్పుడు దాని ఫలితం తప్పదు మరి!

క. సమయం బైనను గుసుమ ఫ । లము లెట్టులు దోఁచుఁ దరువులం దటితోఁ గ
ర్మములం బొడమున్ సుఖదుఃఖము । లట్టుల నిష్ప్రయత్న కలితోద్భూతిన్. 77

ప్రతిపదార్థం: తరువులన్= చెట్లయందు; సమయంబు+ఐనను= తరుణం, ఋతువు వచ్చినప్పుడు; కుసుమ ఫలములు= పువ్వులు పండ్లు; ఎట్టులు= ఏ విధంగా; తోఁచున్= కనిపించునో; అట్టుల(న్)= ఆ విధంగా; తటితోన్= సమయంతో; కర్మములన్= పుణ్య పాపకర్మలయందు; సుఖదుఃఖములు= సౌఖ్యాలు, కష్టాలూ; నిస్+ప్రయత్నకలిత+ఉద్భూతిన్= ప్రయత్నరహితంగా కలిగిన పుట్టుకతో; పొడమున్= ఏర్పడుతాయి.

తాత్పర్యం: ఋతువులకు అనుగుణంగా చెట్లలో చిగుళ్ళూ, పూలూ, పండ్లూ ఏర్పడినట్లే నరుడు చేసిన పుణ్య పాప కర్మలు కూడా పరిపక్వమై, సమయం వచ్చినప్పుడు అకారణంగా పుట్టుకొచ్చినట్లుగా సుఖదుఃఖాలను కలిగిస్తాయి.

విశేషం: అలం: ఉపమ. చెట్లు కుసుమించి ఫలించటం సహజలక్షణం. దానికి ఇతర ప్రమేయం ఉండదు. అట్లాగే మానవుడు చేసిన కర్మకూడా తప్పక ఫలిస్తుంది. అయితే సమయం సమాసన్నం కావాలి. కర్మ నరుడిని వదలదు - ఎక్కడైనా.

క. తెలిసికొనఁ బడయ రొరు లా । ర్యుల పోయెడి తెరవు లరసియును జదలం బ
క్షులు నీళ్ళలోన మీనం । బులు వోయెడు త్రోవ లెఱుఁగఁ బోలునె? యధిపా! 78

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; ఒరులు= ఇతరులు; ఆర్యుల పోయెడి తెరువులు= పూజ్యులు నడిచే త్రోవలు; అరసియును= చూచికూడా; తెలిసికొనన్+పడయరు= గ్రహింపలేరు - ఎట్లంటే; చదలన్= ఆకాశాన; పక్షులు= పిట్టలు; నీళ్ళలోన(న్)= నీళ్ళయందు; మీనంబులు= చేపలు; పోయెడు త్రోవలు= వెళ్ళేదారులు; ఎఱుఁగన్+పోలునె?= తెలియనగునా? (తెలియలేమనుట).

తాత్పర్యం: లోకాన ఆర్యజనులు ఎపుడూ ధర్మమార్గాన చరిస్తూ ఋజువర్తనులై ఉంటారు. వారిని చూచి కూడా ఇతరులు వారి ధర్మప్రవృత్తిని, ఆర్జవాన్ని తెలిసికొనలేరు. అది తమ చేతగాని పనిగా వారు భావిస్తారు. అదెట్లంటే ఆకాశాన పిట్టలూ, నీళ్ళల్లో చేపలూ సంచరిస్తూ ఉంటాయి గాని వాటి సంచారవిధానం ఇతరులకు అర్థమవుతుందా? (కాదు).

విశేషం: లోకాన మంచివారున్నంత మాత్రాన చెడ్డవారు లేకుండా పోరు. మంచివారిని చూచి చెడ్డవారు అందరూ మారరు. చెడ్డవారికి, అధిక సంఖ్యాకులకు వారిలోకమే వారిది. మంచిని వారు గ్రహించలేరు.

క. ఐనను గాఢ నిరూపణ । మానసుఁడై యార్యజనుల మహిత వచనముల్
వీనుల నినుచుచు ధర్ముము । లైనవి సేయంగఁ దప్ప కగుఁ దత్ఫలముల్.' 79

ప్రతిపదార్థం: ఐనను= పైన చెప్పినట్లు ఆర్యజనుల ప్రవృత్తి ఇతరులకు సులభగ్రాహ్యం కాకపోయినా (నరుడు); గాఢ నిరూపణ మానసుఁడు+ఐ= గట్టిగా చూడటంలో మనస్సు కలవాడై; ఆర్యజనుల= పూజ్యమానవుల; మహిత వచనముల్= గొప్ప మాటలు; వీనులన్= చెవులయందు; నినుచుచున్= ఉంచుతూ; ధర్ములు+ఐనవి= పుణ్యములైనవి; చేయంగన్= చేసినట్లయిన; తద్+ఫలముల్= వాటి ఫలితాలు; తప్పక+అగున్= తప్పక కలుగుతాయి.

తాత్పర్యం: ఆర్యజనులు ఇతరులకు సులభంగా అర్థం కాకపోయినా ఇతరులు నిరుత్సాహపడకుండా ఆర్యుల గొప్ప మాటలు వింటూ, గట్టిగా చూపు నిలిపే మనస్తత్త్వం కలిగి, ధర్మకార్యాలు నిర్వహిస్తే ఆ ధర్మం ఫలితాన్ని తప్పకుండా ఇస్తుంది.

విశేషం: ఇక్కడ 'గాఢ నిరూపణ మానసత్వం' చాలా ముఖ్యమైనది. విధి నిర్వహణకు ఆ స్వభావమే మూలం. అది 'అగాఢంగా' ఉంటే విధి నిర్వహణం అసమాప్తంగానే ఉండిపోతుంది'.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'భూతసృష్టి యెవ్వానివలన నెబ్భంగినైనయది? యెఱిఁగింపు' మనవుడు నతం 'డిదియును మఱియునుం గొన్ని యర్థంబులు భరద్వాజుం డడిగిన భృగుండు సెప్పె నప్పరిపాటి యుపన్యసించెద నాకర్ణింపు' మని యతని కిట్లనియె. 80

ప్రతిపదార్థం: అనిన(న్)= అనగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీతనయులలో పెద్దవాడైన ధర్మరాజు; శాంతనవునితోన్= శంతనుడి తనయుడైన భీష్ముడితో; భూత సృష్టి= ప్రాణుల పుట్టుక; ఏ+వాని వలనన్= ఎవడి వలన; ఏ+భంగిన్= ఏ విధంగా; ఐన+అది= అయినది; ఎఱిఁగింపుము= తెలియజేయుము; అనవుడున్= అనినవెంటనే; అతండు= ఆ భీష్ముడు; ఇదియును= ఈ విషయమును; మఱియున్= ఇంకను; కొన్ని+అర్థంబులు= కొన్ని విషయములు, ఇతర విషయములు; భరద్వాజుండు= భరద్వాజ మహర్షి; అడిగిన(న్)= ప్రశ్నించగా; భృగుండు+చెప్పెన్= భృగుమహర్షి చెప్పాడు; ఆ+పరిపాటి= ఆ క్రమం; ఉపన్యసించెదన్= ప్రసంగిస్తాను; ఆకర్ణింపుము= వినుము; అని; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: నరుడి పాపపుణ్య పరిపాక క్రమాన్ని గురించి పితామహుడినుండి గ్రహించిన ధర్మజుడు అనంతరం 'సృష్టిని ఎవరు ఏ విధంగా కలిగించారు తెలుపు'మని అర్థించాడు. దానికి బదులుగా భీష్ముడు 'నీ వడిగిన దానితోపాటుగా మరికొన్ని ఇతర అంశాలు కూడా, ముందు భరద్వాజ ఋషి కోరికపై భృగుమహర్షి వివరించి ఉన్నాడు. వాటిని క్రమంగా వివరిస్తాను విను'మని ప్రారంభించాడు.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బృథివ్యాది భూతోత్పత్తిక్రమం బెఱిఁగించుట (సం. 12-175-5)

సీ. 'కైలాసశైలశిఖరమునఁ దేజో వి । రాజితు భృగు భరద్వాజుఁ డధిక
వినయంబుమైఁ జేరి, 'మునినాథ! భూత సృ । ష్టి ప్రకారము నాకుఁ జెప్పు' మనిన
నమ్మహితాత్ముఁ డిట్లను 'విను నారాయ । ణుం డవ్యయుం డనంతుండు భూత
సృజనంబు దలఁచి మున్ సృజియించెఁ దనదు స । హస్రాంశకమున నవ్యక్తుఁ డనఁగ

తే. మనసునన యజరామరు ననుపమాను । నతనివలన మహత్తత్త్వ మావహిల్లె;
నతఁడు దివ్యతేజోమయం బైన పద్మ । మొకటి గలిగింప బ్రహ్మ యం దుద్భవించె. 81

ప్రతిపదార్థం: కైలాస శైలశిఖరమునన్= కైలాస పర్వతపు పైభాగాన; తేజస్+విరాజితున్= కాంతితో ప్రకాశించెడు; భృగున్= భృగు మహర్షిని; భరద్వాజుఁడు= భరద్వాజ ఋషి; అధిక వినయంబు మైన్= ఎక్కువ అణకువతో; చేరి= సమీపించి; మునినాథ!= ఋషులలో శ్రేష్ఠుడా!; భూతసృష్టి ప్రకారము= ప్రాణుల జన్మవిధానం; నాకున్, చెప్పుము, అనినన్; ఆ+మహిత+ఆత్ముఁడు= ఆ గొప్ప ఆత్మకలవాడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అనెను; వినుము= ఆలకించుము; నారాయణుండు= విష్ణువు; అవ్యయుండు= నాశనం లేనివాడు; అనంతుండు= అంతం లేనివాడు; భూత సృజనంబు= భూమి మొదలైన ఐదు మూల పదార్థాల పుట్టుకను; తలఁచి= తలంచి; మున్= ముందు; తనదు= తనయొక్క; సహస్ర+అంశకమునన్= వెయ్యోభాగంతో; అవ్యక్తుఁడు+అనఁగన్= అవ్యక్తుడు (వ్యక్తం (స్పష్టం) కానివాడు) అనే; అజరామరున్= ముదిమి, మరణం లేనివాడిని; న+ఉపమానున్= పోలికలేనివాడిని; మనసునన్+అ= మనస్సునందే; సృజియించెన్= సృష్టించాడు; అతనివలనన్= ఆ అవ్యక్తుడి వలన; మహత్+తత్త్వము= (బుద్ధి తత్త్వం) గొప్ప ప్రకృతి; ఆవహిల్లెన్= కలిగింది; అతఁడు= ఆ అవ్యక్తుడు; దివ్యతేజస్+మయంబు+ఐన= దేవసంబంధమైన కాంతి నిండిన; పద్మము+ఒకటి= తామరపువ్వు నొకదానిని; కలిగింపన్= పుట్టించగా; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; అందున్= ఆ పద్మమందు; ఉద్భవించెన్= పుట్టాడు.

తాత్పర్యం: కైలాస పర్వతశిఖరంమీద తేజస్సు నిండిన భృగుమహర్షిని భరద్వాజముని గొప్ప వినయగుణంతో దరిచేరి, 'ఓ ఋషిశ్రేష్ఠా! భూమి మొదలయిన పంచభూతాలు, ఇతర ప్రాణులు ఏర్పడిన విధానం తెలుపు'మని అర్థించాడు. భృగువు అతడితో అన్నాడు 'విష్ణువు నాశనం, అంతం లేనివాడు. అతడు మనస్సులో సృష్టిని నిర్మించదలచి ముందుగా తనలోని వెయ్యోవంతుతో అవ్యక్తుడనే వాడిని పుట్టించాడు. ఆ అవ్యక్తుడు జరామరణాలు లేనివాడు, సాటిలేనివాడు. అతడివలన ప్రకృతితత్త్వం కలిగింది. అతడు దివ్యకాంతితో నిండిన పద్మమొకటి కలిగించాడు. ఆ పద్మంనుండి బ్రహ్మ పుట్టాడు.

తే. అతని తలఁపునఁ బ్రభవించె నాకసంబు; । దానియందు జలంబు లుద్భవము నొందె;
సలిలమున నగ్ని మారుత జనన మొనరె; । ననల పవన యోగమున మేదిని జనించె. 82

ప్రతిపదార్థం: అతని తలఁపునన్= ఆ బ్రహ్మదేవుడి ఆలోచనతో; ఆకసంబు= ఆకాశం; ప్రభవించెన్= పుట్టింది; దానిఅందున్= ఆ ఆకాశంలో; జలంబులు= నీళ్ళు; ఉద్భవమున్+ఒందెన్= పుట్టుకను పొందాయి; సలిలమునన్= నీటిలో; అగ్ని మారుత జననము= నిప్పు, గాలుల పుట్టుక; ఒనరెన్= కలిగింది; అనల పవన యోగమునన్= అగ్ని, గాలుల కలయికతో; మేదిని= భూమి; జనించె(న్)= కలిగింది.

తాత్పర్యం: ఆ బ్రహ్మదేవుడి సంకల్పంవలన ఆకాశం, ఆకాశంనుండి నీరు, నీటినుండి నిప్పు, గాలి జన్మించాయి. ఆ తరువాత నిప్పు గాలుల కలయికతో భూమి పుట్టింది.

వ. ఆబ్రహ్మయఖిలభూతాత్మకుండెట్లనిన నతనికి శైలంబు లస్థులు; మేదిని మేదోమాంసంబులు; సముద్రంబులు రుధిరం; బాకాశం బుదరంబు; పవనుండు నిశ్వాసం; బగ్ని తేజంబు; సరిత్తులు సిరలు; రవిచంద్రులు నయనంబు; లూర్ధ్వలోకంబు శిరంబు; పాతాళంబు పాదంబులు; దిశలు బాహువు; లి ట్లనంతాత్మకుండగువాఁడు విష్ణుం డిత్తెఱంగున విశ్వంబు విష్ణునివలనం గలిగెననిన విని భరద్వాజుం డాకాశాది భూతంబులేనింటి ప్రమాణంబులు నడిగిన భృగుం డవి యనంతంబులు దేవతలకుం గొలఁది వెట్టరాకుండు నొక్కచోటు నిరూపించి యీ భూతం బింతటనుండి యట లేదనరాదు పంచభూతంబులు నిరవధికంబు లది యిత్తెఱంగనిన విష్ణునకు గౌణంబై యనంతుం డను నామంబుగలదు గాదె! విష్ణుండు జగన్మూర్తి విష్ణు తనుభూతంబయిన మహాభూత పంచకం బప్రమేయంబుగాక తక్కునే?' యని యెఱింగించిన. 83

ప్రతిపదార్థం: ఆ బ్రహ్మ= ఆ బ్రహ్మదేవుడు; అఖిల భూత+ఆత్మకుండు= ఎల్లభూతముల (భూమి, నీరు మొదలగువాని) స్వరూపమైనవాడు; ఎట్లు+అనినన్= అదెట్లు అంటే; అతనికి(న్)= ఆ బ్రహ్మకు; శైలంబులు= కొండలు; అస్థులు= ఎముకలు; మేదిని= భూమి; మేదస్+మాంసంబులు= కొవ్వు మాంసమును; సముద్రంబులు= సముద్రాలు; రుధిరంబు= రక్తం; ఆకాశంబు= ఆకాశం; ఉదరంబు= పొట్ట; పవనుండు= గాలి; నిశ్వాసంబు= ఊరుపు; అగ్ని= నిప్పు; తేజంబు= కాంతి; సరిత్తులు= నదులు; సిరలు= రక్తవాహికలు; రవిచంద్రులు= సూర్యచంద్రులు; నయనంబులు= కన్నులు; ఊర్ధ్వలోకంబు= పై లోకాలు; శిరంబు= తల; పాతాళంబు= పాతాళలోకము; పాదంబులు= అడుగులు; దిశలు= దిక్కులు; బాహువులు= చేతులు; ఇట్లు= ఈ విధంగా; అనంత+ఆత్మకుండు+అగు+వాఁడు= అంతంలేని శరీరం కలవాడగు వాడు; విష్ణుండు= విష్ణుమూర్తి; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; విశ్వంబు= లోకం; విష్ణునివలనన్= విష్ణువువలన; కలిగెన్= పుట్టింది; అనినన్; విని; భరద్వాజుండు= ఆ పేరుగల ఋషి-ప్రస్తుత అంశానికి శ్రోత; ఆకాశ+ఆది భూతంబులు+ఏనింటి ప్రమాణంబులున్= ఆకాశం మొదలయిన భూతాలు ఐదింటి కొలతలును; అడిగినన్= ప్రశ్నించగా; భృగుడు= భృగుమహర్షి; అవి= భూతాల ప్రమాణాలు; అనంతంబులు= చివరలు లేనివి; దేవతలకున్= సురలకుకూడా; కొలఁది+పెట్టరాకుండున్= కొలత పెట్టటానికి వీలులేకుండా ఉంటాయి; ఒక్కచోటు= ఒక్క స్థలం; నిరూపించి= చూపించి; ఈ భూతంబు= ఈ (ఫలానా) భూతం (భూమి మొదలగునవి); ఇంతటన్= ఇంతవరకు; ఉండి= కలిగి; అటన్= అక్కడ; లేదు+అనరాదు= లేదు అనటానికి (వీలు)గాదు; పంచభూతంబులు= ఐదు భూతాలు (భూమి, నీరు, వెలుతురు, గాలి, ఆకాశం); నిర్+అవధికంబులు= హద్దులు లేనివి; అది= హద్దులు లేకుండటం; ఏ+తెఱంగు?= ఏ విధము?; అనినన్= అన్నచో; విష్ణునకున్= విష్ణుమూర్తికి; గౌణంబు+ఐ= గుణసంబంధమైనదై; అనంతుఁడు+అను= అనంతుడనే; నామంబు= పేరు; కలదు= ఉన్నది; కాదె!= కాదా!; విష్ణుండు= నారాయణుడు; జగత్+మూర్తి= లోకమే ఆకారంగా కలవాడు; విష్ణు తనూభూతంబు+అయిన= విష్ణువు శరీరంనుండి పుట్టిన; మహాభూత పంచకంబు= గొప్పభూతములు ఐదు; అప్రమేయములు= కొలువరానివి; కాక= కాకుండా; తక్కునే?= పోయేది అగునా?; అని; ఎఱింగించిన(న్)= తెలియజేయగా.

తాత్పర్యం: ఆ బ్రహ్మ ఎల్లభూతాలూ అంటే భూమి మొదలయినవి ఇతరాలు కూడా తన శరీరంగా ధరించి ఉంటాడు. అదెట్లాగంటే ఆ బ్రహ్మశరీరానికి సృష్టిలోని పర్వతాలు ఎముకలు, భూమి కొవ్వూ మాంసమూ, సముద్రాలు నెత్తురు, ఆకాశం పొట్ట, గాలి ఊర్పు, నిప్పు వెలుతురు, నదులు రక్తవాహికలయిన నరాలు, ఈ విధంగా సూర్యచంద్రులు కళ్ళు, పై లోకం తల, పాతాళలోకం కాళ్ళ అడుగులు, దిక్కులు చేతులు - ఇట్లాఅంతంలేని శరీరంగలవాడు నారాయణుడు. ఈ విధంగా ఈ లోకం నారాయణుడివలన పుట్టింది' అనగా విని శ్రోత అయిన భరద్వాజుడు భృగుమహర్షిని ప్రశ్నించాడు 'ఆకాశం మొదలయిన గొప్ప మూలపదార్థాలు ఐదు కలవు కదా! వాటి కొలతలు ఎంత?' అని. దానికి ఆ మహర్షి 'అవి గొప్పవి, తుదిలేనివి, సురలు కూడా వాటి హద్దులు నిర్ణయించలేకపోయారు. ఒక చోటును చూపి ఈ భూతం (పదార్థం) ఇంతవరకు కలదు, అక్కడ లేదు అనరాదు.

పంచభూతాలు హద్దులు లేనివి. వస్తువు ఒకటి ఉన్నదన్న తరువాత దాని కొలతలు లేవు అనట మెట్లంటావా? సమాధాన మిది. విష్ణువును అతడి గుణాన్ని స్వభావాన్నిబట్టి అనంతు డంటారు. జగన్మూర్తి అయిన విష్ణువునుండి జన్మించినవి కాబట్టి పంచభూతాలు కూడా విష్ణుడివలెనే అనంతాలు' అని తెలియజేయగా.

విశేషం: ఇక్కడ విజ్ఞాన వికాసాలకు మూలభూతమైన తార్కిక దృష్టి ఉన్నది. 'పంచమహాభూతాల కొలత లేమి?' అని భరద్వాజు డడిగితే, భృగువు 'వాటి పరిమాణం కొలతల కందనిది' అని అంటూ తన మాటను సమర్థించుకొనటానికి ఒక తర్కాన్ని ఆవిష్కరించాడు. ఈ పంచమహాభూతాలు కార్యాలు, కర్త నారాయణుడు. అతడు అనంతుడు. కాబట్టి కారణగతమైన అనంతత్వం కార్యంలోనూ ప్రతిఫలించింది. కాబట్టి ఇక్కడ కారణకార్య సంబంధం వ్యక్తమైనదన్నమాట.

సీ. విని భరద్వాజుండు 'మునినాథ! పుష్కరం । బునఁ బుట్టె నన్నప్డ పుష్కరంబు
బ్రహ్మకు నాదినాఁ బట్టయ్యె నెట్టొకో?' । నావుడు 'విష్ణుమానసభవుండు
బ్రహ్మ యాద్యుఁడు పుష్కరము దదాసన రూప । ముగఁ గల్పితంబయ్యె మున్ను పిదప
నను నిశ్చయంబు లే కునికిఁ బద్మజుఁ డన । వలసియు నుండు నయ్యలఘుతేజుఁ

తే. బద్మ మది భూతధాత్రి యప్పద్మమునకు । గగన మూర్ధితమగు మేరునగము రుచిర
చారుకర్ణిక యందుండి సకల జంతు । సృజన ధుర్యత్వమహిమ నయ్యజుఁడు వెలుఁగు. 84

ప్రతిపదార్థం: విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజముని; మునినాథ!= ఋషుల రాజా! ఓ భృగూ!; పుష్కరంబునన్= పద్మమునందు; పుట్టెన్+అన్న+అప్డు+అ= పుట్టెను అన్నప్పుడే; పుష్కరంబు= పద్మం; బ్రహ్మకున్= బ్రహ్మదేవుడికి కూడా; ఆదినాన్= మొదటి దనగా; పట్టు+అయ్యెన్= స్థానమైనది; ఎట్టు+ఒకో?= ఎట్లో?; నావుడున్= అనినవెంటనే; విష్ణుమానసభవుండు= విష్ణువు మనస్సునుండి పుట్టినవాడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఆద్యుఁడు= మొదటివాడు; పుష్కరము= పద్మం; తద్+ఆసన రూపముగన్= ఆతని పీఠము ఆకారంగా; కల్పితంబు+అయ్యెన్= నిర్మించబడినది అయినది; మున్ను పిదపన్= ముందు వెనుక; అను నిశ్చయంబు లేక+ఉనికిన్= అనే నిర్ణయం లేకుండటంవలన; పద్మజుఁడు= పద్మం నుండి పుట్టినవాడు; అనన్+వలసి+ఉండున్= అనవలసి ఉంటుంది; ఆ+అలఘు తేజున్= ఆ గొప్పకాంతిగల వాడిని; పద్మము+అది= ఆ తామరపువ్వు; భూతధాత్రి= (ప్రాణులను పెంచెడిది) భూమి; ఆ+పద్మమునకున్= ఆ తామర పువ్వునకు; గగనమూర్ధితము+అగు= ఆకాశం తలగా గల; మేరునగము= మేరు పర్వతం; రుచిరచారు కర్ణిక= ప్రకాశించెడి సుందరమైన దుద్దు (పువ్వులోని నడిమి భాగం); అందున్+ఉండి= ఆ తామరదుద్దు నుండి; సకల జంతు సృజన ధుర్యత్వమహిమన్= ఎల్ల ప్రాణుల సృజించే భారం వహించే గొప్పతనంతో; ఆ+అజుండు= ఆ బ్రహ్మ; వెలుఁగు(న్)= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: భృగుమహర్షి కథనాన్ని విన్న భరద్వాజుడు 'ఓ ఋషిశ్రేష్ఠా! బ్రహ్మదేవుడు పద్మంనుండి పుట్టాడు - అని అన్నప్పుడు, ఆ పద్మం బ్రహ్మకు ముందు పుట్టినదైనట్లు కాదా?' అని ప్రశ్నించాడు. దానికి భృగువు సమాధానమిది: - 'బ్రహ్మ విష్ణుమానస పుత్రుడు, కాబట్టి బ్రహ్మ మొదటివాడు. తరువాత ఆ బ్రహ్మకు పీఠంగా పద్మం నిర్మించబడింది. అయితే ఈ కార్యక్రమం జరిగినప్పుడు ముందూ - వెనుకా అనే నిర్ణయం లేదు కాబట్టి బ్రహ్మను పద్మజుడు (పద్మం నుండి పుట్టినవాడు) అనీ అనవలసి ఉంటుంది. ఇంతకూ ఆ పద్మం ఏమి టనుకొంటున్నావు! అది భూమి. దానికి ఆకాశమే శీర్షంగా గల మేరుపర్వతం అందమైన కర్ణిక. అక్కడనుండి ఆ బ్రహ్మదేవుడు సకల చరాచర జంతుసమూహాన్ని సృజించే భారాన్ని వహిస్తూ ప్రకాశిస్తున్నాడు.

విశేషం: పై వచనంలో బ్రహ్మ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ అక్కడ మేదిని బ్రహ్మశరీరంలోని మేదోమాంసమని వివరించబడింది. ఇక్కడేమో బ్రహ్మదేవుని ఆసనంగా నిర్మితమైన పద్మమే భూతధాత్రిగా భూమిగా చెప్పబడుతూ ఉన్నది. దీనిని బట్టి మనం

గ్రహించవలసినదేమిటంటే ప్రాచీనతమకాలాన నరుడు ఈ సృష్టి ఏర్పడినవిధానాన్ని గూర్చి అనేక ఆలోచనలు చేసి ఉన్నాడు. వాటిలో కొన్ని తర్కసహమైనవిగా ఉన్నవి అనుకొన్నవి, ఇక్కడ చోటుచేసికొనటం జరిగింది.

వ. అని భృగుండు సెప్పిన విని భరద్వాజుండు 'భూతంబు లై దగుట యేమిట?' నని యడిగిన నతం డతని కి ట్లనియె. 85

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; భృగుండు= భృగుముని; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ఋషి; భూతంబులు= మహా పదార్థాలు; ఐదు+అగుట+ఏమిటన్?= ఐదు కావటం దేనివలన? (ఎక్కువ తక్కువలు ఏల లేవు?); అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భృగువు; అతనికిన్= ఆ భరద్వాజమునికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భృగువచనం విన్న భరద్వాజుడు ప్రశ్నించాడు. 'మహాపదార్థాలు భూతాలు ఐదే దేనివలన అయినట్లు? ఏ కారణాన అవి అయిదుగా రూపుదాల్చినవి?' అని. దానికి సమాధానం మహాజ్ఞాని అయిన భృగువు ఇట్లా ఇస్తున్నాడు.

క. వాయువు చేష్టా రూపము, । మ్రోయునెడ నభంబు, ద్రవము మునివర! జల మూ
ష్మాయిత మనలము; గాఠి । న్యాయితము ధరిత్రి; యిట్టు లైదు దెఱంగుల్. 86

ప్రతిపదార్థం: మునివర!= ఓ ఋషిశ్రేష్ఠా! భరద్వాజా!; చేష్టా రూపము= చైతన్యరూపం; వాయువు= గాలి; మ్రోయునెడన్= శబ్దించే చోట; నభంబు= ఆకాశం; ద్రవము= స్రవించేది, పారునది; జలము= నీరు; ఊష్మాయితము= వేడిమి చెందింది; అనలము= నిప్పు; కాఠిన్యాయితము= గట్టితనం చెందినది; ధరిత్రి= భూమి; ఇట్టులు= ఈ విధంగా; ఐదు తెఱంగుల్= ఐదు విధాలు.

తాత్పర్యం: సృష్టిలో చేష్టలు, శబ్దాలు, స్రావాలు, వేడిమి, గట్టితనం ఏర్పడటానికై పంచమహాభూతాలు ఆవిష్కరించబడ్డాయి. చేష్టలు వాయురూపాన, శబ్దాలు ఆకాశం ద్వారా, స్రావాలు నీటివలన, వేడిమి నిప్పు నుండి, గట్టితనం భూమివలన కలిగాయి. కాబట్టి పంచభూతాల అవసరం ఆ విధంగా ఏర్పడినది.

విశేషం: ఇక్కడకూడా శ్లోకలోని తార్కిక దృష్టి వ్యక్తమైనది. ఆదిలో అయిదు భూతాలే ఎందుకు ఏర్పడవలసి వచ్చినది? అనేది మౌలిక ప్రశ్న. దానికి సంతృప్తికరమైన సమాధానం భృగువు అందించాడు.

వ. ఈ యయిదింటన కాదె జంగమంబులు స్థావరంబులు నైనయవి!' యనుటయు భరద్వాజుండు 'స్థావరంబుల యందు భూతగుణంబు లేమిటం గంటి?' మని యడిగిన భృగుం డిట్లనియె. 87

ప్రతిపదార్థం: ఈ+అయిదింటన్+అ= ఈ ఐదింటివలననే; కాదె= కదా; జంగమంబులు= తిరుగాడెడివి; స్థావరంబులున్= కదలనివి; ఐన+అవి!= కలిగినవి!; అనుటయున్= అనగా; భరద్వాజుండు= భరద్వాజముని; స్థావరంబులఅందున్= నిలిచి ఉండువాటియందు; భూతగుణంబులు= పంచభూతాల లక్షణములు; ఏమిటన్= ఏ విధంగా; కంటిమి?= చూచితిమి?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; భృగుండు= భృగుమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ పంచభూతాలకారణంగానే సృష్టిలో కనిపించే రెండు విధాలయిన పదార్థాలు 1. తిరుగాడేవి, 2. నిలిచి ఉండేవి (క్రమంగా జంగమాలు, స్థావరాలు) ఏర్పడ్డాయి. సృష్టి సర్వస్వమూ ఈ జంగమ స్థావరాత్మకమే.' అని భృగువు పలికితే భరద్వాజుడు మళ్ళీ ప్రశ్నిస్తున్నాడు - 'పంచభూతాల లక్షణాలు స్థావరాలలో ఎట్లా గమనించగలం?' అని. దానికి భృగువు సమాధానం ఇట్లా ఇచ్చాడు.

సీ. 'అశని నిర్ఘోషంబు నాకర్ణనము లేక । వికృతి నెట్టులు వొందు వృక్ష? మాక
సముశక్తి సూవె శ్రోత్రము నిదాఘంబు సోఁ । కునవాడుఁ జోఁ కెఱుంగుట సమీర
శక్తి మార్గముఁ గని చాఁగెడుఁ గనుట తే । జశ్శక్తి పాదపసంజ్ఞఁ బరఁగుఁ
బాదజిహ్వలఁ గొని బానంబు సేయుట । జలశక్తి జిహ్వ నైజంబు లైన

తే. కుసుమ ధూపాది గంధముల్ గొనుట నెలమిఁ । దాల్చు నని చెప్పుఁ దరువు వేదంబు ఘ్రాణ
ముర్విశక్తి యి ట్లయిదును నుల్లసిలుట । ననఘ! భూజంబు పంచభూతాత్మకంబు. 88

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; అశని నిర్ఘోషంబున్= పిడుగు శబ్దమును; ఆకర్ణనము లేక= వినటంలేకుండా; వృక్షము= చెట్టు; వికృతిని= వికారమును, మార్పును; ఎట్టులు+పొందున్?= ఏ విధంగా చెందుతుంది?; ఆకసము శక్తి+చూవె= ఆకాశం యొక్క శక్తి సుమా!; శ్రోత్రము= చెవి; వృక్షము= చెట్టు; నిదాఘంబు సోఁకునన్= వేడిమి తాకిడివలన; వాడున్= వాడిపోతుంది; చోఁకు+ఎఱుంగుట= స్పర్శ (తాకు) తెలిసికొనటం; సమీరశక్తిన్= గాలి ప్రభావంవలన; వృక్షము; మార్గమున్+కని= దారిని చూచి; చాఁగెడున్= సాగుతుంది; కనుట= చూడటం; తేజస్+శక్తిన్= వెలుతురు ప్రభావంవలన; వృక్షము; పాదప సంజ్ఞన్= పాదపము అనే పేరుతో; పరఁగున్= ఒప్పుతుంది; పాదజిహ్వలన్= వేళ్ళు అనే నాల్కలతో; కొని= స్వీకరించి; పానంబు+చేయుట= త్రాగుట చేయటం - త్రాగటం; జలశక్తిన్= నీటి ప్రభావంవలన; జిహ్వ నైజంబులు= నాల్క స్వభావాలు; ఐనన్= కాగా, ఈ విధంగా నాలుగు భూత లక్షణాలు నిరూపితాలు కాగా; కుసుమ ధూప+ఆది గంధముల్= పూవులు, పాగలు మొదలైన వాటి వాసనలు; కొనుటన్= స్వీకరించటం; తరువు= చెట్టు; ఎలమిన్= బాగుగా; తాల్చును+అని= వహించును, ధరించును అని; వేదంబు= వేదం; చెప్పున్= పలుకును; ఘ్రాణము= వాసన చూచే ఇంద్రియం, ముక్కు; ఉర్విశక్తిన్= భూమిశక్తివలన; ఇట్లు= ఈ విధంగా; అయిదును= ఐదు భూతముల లక్షణాలను; ఉల్లసిలుటన్= ప్రకాశిస్తూ ఉండటంవలన; భూజంబు= చెట్టు (భూమినుండి పుట్టినది); పంచభూత+ఆత్మకంబు= ఐదు భూతాల స్వరూపం గలది.

తాత్పర్యం: పాపరహితుడవయిన ఓ భరద్వాజా! స్థావరమైన చెట్టులో పంచభూతాల లక్షణాలు ఎట్లా వ్యక్తమౌతున్నాయో చూడుము. చెట్టు పిడుగుపాటుకు వికృతిని పొందుతుంది. పిడుగు శబ్దాన్ని వినకుండా వికారాన్ని ఎట్లా చెందుతుంది? కాబట్టి శబ్దాన్ని గ్రహిస్తున్నదంటే దానికి ఆకాశలక్షణమైన శ్రవణేంద్రియం చెవి ఉన్నట్లే. వేడిమి సోకితే వాడిపోతుంది. స్పర్శను గ్రహించటమంటే వాయువు లక్షణాన్ని ధరించినట్లే. దారి చూచుకొని సాగుతుంది, పెరుగుతుంది. చూచుట అనే క్రియ తేజశ్శక్తికి చెందింది కాబట్టి వెలుతురు గ్రహించే నేత్రమున్నట్లే. చెట్టును పాదపం అంటారు. అనగా పాదజిహ్వలతో, వేళ్ళ రూపంలోని నాలుకలతో పానం చేస్తుంది. ఇక్కడ జలశక్తిని ధరించినట్లు కాగా, చెట్టు, పూవులు, పాగలు మొదలైనవాటి వాసనలు గ్రహిస్తుంది - అని వేదం పలుకుతున్నది. కాగా చెట్టు ఆఘ్రాణిస్తున్నట్లే. ఇది భూమి లక్షణం. ఈ విధంగా స్థావరమైన వృక్షంలో కూడా ప్రాథమికాలయిన పంచభూతాల లక్షణాలు గోచరిస్తున్నాయి కాబట్టి చెట్టు పంచభూతాత్మక మైనదిగా అంగీకరించవలసిందే.

విశేషం: తరువులో ఘ్రాణలక్షణం తప్ప మిగిలిన అన్ని లక్షణాలూ సహజంగానే ప్రత్యక్ష ప్రమాణాలతోనే నిరూపితమైనాయి. ఘ్రాణలక్షణం - వాసన చూచే గుణం దగ్గరకు వచ్చేసరికి ప్రత్యక్షప్రమాణం చాలదు. అందుకని అక్కడ వేదాన్ని ప్రమాణంగా చూపాడు భారతకర్త. వేదప్రామాణ్యాన్ని అంగీకరించకపోతే ఆస్తిక్యమే దెబ్బతింటుంది కాబట్టి అది తిరుగులేని ప్రమాణ మన్నమాట.

వ. శైలాదుల యందు నిట్ల యూహింపఁ బెఱ భంగులం గలిగియుండుఁ; బంచభూతాత్మకంబు గాని భూతంబు లేదనుట వేదనిశ్చయం' బనిన విని భరద్వాజుండు. 89

ప్రతిపదార్థం: శైల+ఆదులయందున్= కొండలు మొదలయినవాటియందును; ఇట్లు+అ= ఈ విధంగానే; ఊహింపన్= ఆలోచించగా; పెఱభంగులన్= ఇతర విధాలను, పద్ధతులను; కలిగి+ఉండున్= వహించి ఉండును; పంచభూత+ఆత్మకంబు+కాని= పంచభూతాలతో ఏర్పడినది కాని; భూతంబు= (కలిగినది) వస్తువు, ప్రాణి, పదార్థం; లేదు+అనుట= లేదనటం; వేదనిశ్చయంబు= వేదంయొక్క నిర్ణయం; అనినన్= అనగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ముని.

తాత్పర్యం: కొండలు మొదలైనవాటిలో కూడా ఇదే విధంగా ఆలోచించగా, పంచభూతాలలో ఏర్పడని ప్రాణి లేదన్నది వేదం నిర్ణయించిన విషయం' అనగా విన్న భరద్వాజుడు.

విశేషం: ఇక్కడ పూర్వ లక్షణాన్ని చెలరేగకుండా చేసే ఉద్దేశంతోనే భృగువు 'ఇది వేద నిశ్చయంబు' అని చివరిమాటగా పలికినట్లున్నాడు.

క. 'భూముఖ్యం బగు భూత । గ్రామంబు గుణంబు లైన గంధాదులఁ దే
జోమహిత యనుభవించుట । యేమెయి? నెద్దాని కావహిల్లుచునుండున్.' 90

ప్రతిపదార్థం: తేజస్+మహిత!= గొప్పతేజస్సుగలవాడా!; భూముఖ్యంబు+అగు= భూమి మొదలైన; భూతగ్రామంబు గుణంబులు+ఐన= భూతాల సమూహం యొక్క స్వభావాలైన; గంధ+ఆదులన్= వాసన మొదలైనవాటిని; అనుభవించుట= పొందటం; ఏ మెయిన్= ఏ విధంగా; ఏ+దానికిన్= దేనికి; ఆవహిల్లుచున్+ఉండున్?= కలుగుతూ ఉంటుంది?

తాత్పర్యం: 'ఓ తేజస్వీ! భూమి మొదలయిన పంచభూతాలకు గంధం మొదలయిన లక్షణాలున్నాయి. ఆలక్షణాలను, స్వభావాలను ఏ విధంగా ఎవరు అనుభవిస్తారు? ఆ అనుభవం అనేది ఏ క్రమంలో ఎవరికి చెందుతుంది'.

విశేషం: సృష్టి అంతా పంచభూతాత్మకం. ఇతరమైన దేదీ లేదు. అయినప్పుడు అనుభోక్తా, అనుభుక్తమూ రెండూ సాంకేతికంగా ఒకటే. అందుకని అనుభవాన్ని గురించిన క్రమపరిణామాన్ని వివరించవలసి వచ్చింది.

తే. అనిన భృగుఁ డిట్టులను 'విషయములు నింద్రి । యములు మనసును గ్రమసాధనములు గాఁగ
నంతరాత్మ ప్రదర్శి యై యనుభవించి । తత్కృతము లగు మోదఖేదములఁ బొందు. 91

ప్రతిపదార్థం: అనినన్= భరద్వాజుడు అనగా; భృగుఁడు= భృగుమహర్షి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; విషయములున్= పదార్థాలును; ఇంద్రియములున్= కన్నులు మొదలైన ఇంద్రియాలూ; మనసును= మనస్సు; క్రమసాధనములు+కాఁగన్= వరుసగా ఉపకరణాలు అవుతుండగా; అంతర్+ఆత్మ= లోపలి జీవుడు; ప్రదర్శి+ఐ= చూచేవాడై; అనుభవించి= అనుభవాన్ని పొంది; తద్+కృతములు+అగు= ఆ అనుభవముచేత చేయబడిన (కలిగిన); మోదఖేదములన్= సుఖదుఃఖాలను; పొందున్= చెందును.

తాత్పర్యం: భృగువు సమాధానమిది - 'పదార్థాలు, వాటిని గ్రహించే ఇంద్రియాలు, ఇంద్రియాలను నియంత్రించే మనస్సూ - ఈ మూడూ వరుసగా అనుభవక్రియకు సాధనాలు. అనుభోక్త లోపలి జీవుడు. అతడే అంతరాత్మ. అతడు పై మూడింటిని చూస్తూ పంచభూతాల స్వభావాలను అనుభవిస్తాడు. అనుభవించి, తత్ఫలితంగా సుఖాన్నో లేక దుఃఖాన్నో పొందుతాడు. కాబట్టి అనుభోక్త అంతరాత్మ. అతడి క్రింద మనస్సు, దాని అధీనంలో ఇంద్రియాలు, ఇంద్రియాల దగ్గర పదార్థాలు - ఇదీ క్రమం క్రిందినుండి చూస్తే.

విశేషం: ఇక్కడ వివరించిన వాటిలో విషయాలు - పదార్థాలు, ఇంద్రియాలు కనిపించేవి రెండు. మనస్సు, అంతరాత్మ కనిపించనివి రెండు. కనిపించకపోయినా వస్తువులుండవచ్చు - అనేది మన అనుభవంలోని విషయమే. మనస్సు ఉనికిని గ్రహించవచ్చును. మనం చూస్తూకూడా ఒక్కొక్కసారి ఎదుటి వస్తువును గ్రహించలేము. కారణం మనస్సు అక్కడ లేక. కాబట్టి ఇంద్రియాలతోపాటుగా మనస్సుకూడా అనుభవానికి అవసరమే.

వ. అప్పురుషుండు. **92**

తాత్పర్యం: ఆ మానవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భారతీయ వేదాంత శాస్త్రాలలో ఈ పురుషశబ్దానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రకృతి, పురుషుడు వంటి వాడుకలో పురుష శబ్దాన్ని పర్యాయశబ్దాలతో ప్రయోగించరు. అట్లాగే పురుషోత్తముడంటే విష్ణువు. నరోత్తముడంటే ఆ అర్థం రాదుమరి! పురుషసూక్తమనే వాడుక తప్ప మానవ సూక్తంవంటి మాటలు లేవు. ఆ దృష్టిలో ఇక్కడి పురుష శబ్దం అంతరాత్మకు పర్యాయంగా ప్రయుక్తమైనట్లు ఉన్నది.

క. క్షేత్రజ్ఞుం డనఁగ నిఖిల । గాత్ర వ్యాప్తత్వమహిమ గలిగి సమీరా
సూత్రణమున జీవుండును । గోత్రమునై సర్వవర్తకుం డగుచుండున్. **93**

ప్రతిపదార్థం: క్షేత్రజ్ఞుండు+అనఁగన్= క్షేత్రజ్ఞ డనే పేరుతో; నిఖిలగాత్రవ్యాప్తత్వ మహిమ+కలిగి= మొత్తం శరీరంలో వ్యాపించి ఉండెడి గొప్పతనం వహించి; సమీర+ఆసూత్రణమునన్= (ప్రాణం) గాలి యొక్క ప్రవేశం వలన; జీవుండును= ప్రాణమూ; గోత్రమును+ఐ= వంశమునూ అయి; సర్వవర్తకుండు+అగుచున్+ఉండున్= అన్నింటా ఉండెడివాడు అవుతూ ఉంటాడు.

తాత్పర్యం: సృష్టిలోని ఖేదమోదాలకు పాత్రమై ఉండే ఆ పురుషుడు క్షేత్రజ్ఞుడనే సంజ్ఞతో శరీరమంతా నిండి ఉండే గొప్పతనం కలిగి, ప్రాణవాయువుతో కలిసి ఉండటంవలన జీవుడని పిలువబడుతూ తానే వంశం కూడా అయి అన్నింటా వ్యాపించి ఉంటాడు.

విశేషం: క్షేత్రమంటే శరీరం; క్షేత్రజ్ఞుడు అంటే జీవాత్మ - క్షేత్రాన్ని ఎరిగినవాడు అని అర్థం. ప్రాణమనే వాయువుతో ఉండటంవలన ప్రాణికి - జీవుడు; అయితే అంతమాత్రమే కాకుండా వంశలక్షణమూ జీవలక్షణమూ ధరించి సర్వవ్యాపకుడై కూడా ఉంటాడు.

క. అగు నీతత్త్వము సత్త్వా । దిగుణత్రయ వికృతి కత్యతీతంబై పూ
ర్వ గురుత్వంబునకుం జన । విగతత్వంబునకు నెలవు విమలవిచారా! **94**

ప్రతిపదార్థం: విమలవిచారా!= నిర్మలమైన ఆలోచన కలవాడా!; ఈ తత్త్వము= ఈ క్షేత్రత్వం; సత్త్వ+ఆది గుణత్రయ వికృతికి(న్)= సత్త్వం మొదలైన త్రిగుణాల వికారానికి; అతి+అతీతంబు+ఐ= మిక్కిలిగా గడచిపోయినదై, దూరమైనదై; పూర్వగురుత్వంబునకున్= మొదటి గొప్పతనానికి; చనన్= వెళ్ళుటకు, చేరుటకు; విగతత్వంబునకు(న్)= బొత్తిగా పోయిన తనమునకు, మిక్కిలి లేమికి; నెలవు= స్థానం.

తాత్పర్యం: ఈ క్షేత్ర క్షేత్రజ్ఞతత్వం, సత్వరజస్తమోగుణాలు - అనే ఈ మానవస్వభావ వికారాలకు మిక్కిలి దూరమై ఆత్మ ఈ జన్మపరంపరల చక్రాన తగుల్కొనక, ముందున్న కైవల్యానికి నిలయమైనది.

విశేషం: ఈ క్షేత్రజ్ఞతత్వం ప్రకారం ఆత్మ స్వతఃముక్తం; ఆనందమయం; అయినా జన్మ పరంపరలు అనే చక్రాన తగుల్కొని పరిభ్రమిస్తూ తనను తాను మరచి వ్యవహరిస్తూ, చివరకు తన నెలవును - కైవల్యాన్ని చేరుకొంటుంది.

ఆ. బుధుఁడు సూక్ష్మ విమల బుద్ధి నప్పురుషుని । నరసి కాంచి యతని యంద మనసు
దిగ్గ విడిచి, యెగ్గు లగ్గును బొందక । శుద్ధశాంతిఁ బరమసుఖము పొందు. **95**

ప్రతిపదార్థం: బుధుఁడు= పండితుడు; సూక్ష్మవిమల బుద్ధిన్= ఆధ్యాత్మమయిన నిర్మలమైన తెలివితో; ఆ+పురుషునిన్= ఆ క్షేత్రజ్ఞుడిని; అరసి= వెదకి; కాంచి= చూచి; అతనియందున్+అ= ఆ క్షేత్రజ్ఞుడి యందే; మనస్సు= హృదయము; దిగ్గ విడిచి=

దిగవిడిచి, వదలిపెట్టి; ఎగ్గు(న్)+లగ్గును= కీడును, మేలును; పొందక= చెందక; శుద్ధశాంతిన్= పరిశుభ్రమైన శాంతితో; పరమ సుఖము= గొప్ప సంతోషం; పొందున్= చెందుతాడు.

తాత్పర్యం: పండితుడు అధ్యాత్మచింతనతో, నిర్మలమతితో కేవలుడైన ఆ పురుషుడిని అన్వేషించి, దర్శించి ఆతడి యందే తన మనస్సును లగ్నంచేసి, ఇతరమైన దేనినీ చూడక, కేవలప్రశాంతితో సుఖాలనన్నిటిని మించిన ఆ పరమసుఖాన్ని పొందుతాడు.

విశేషం: పండితుడు క్షేత్రజ్ఞదర్శనంతో పరమసుఖాన్ని పొందగలడు - అంటే పరిశేషన్యాయంతో అపండితుడు దానికి విరుద్ధంగా గతానుగతికంగా జన్మచక్రంలో పడి తిరుగుతూనే ఉంటాడని కూడా అర్థం.

వ. అని వెండియు. **96**

తాత్పర్యం: అని పలికి మరలా. (తరువాతి పద్యంతో అన్వయం).

భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన వర్ణాశ్రమాచారక్రమము (సం. 12-181-1)

సీ. 'ఆగమ సత్యధర్మాచార తపముల । కునికి పట్టులుగాఁగ వనజభవుఁడు
గలిగించె మును బ్రాహ్మణుల మఱి కల్పించె । నృప వైశ్య శూద్రుల నిర్మలాత్మ
బ్రాహ్మణాదికముగఁ బరఁగు నన్నాలుగు । జాతుల యుజ్జ్వలచ్ఛాయ లోలి
సొంపారుఁ దెలుపును గెంపును బసుపు చా । యయుఁ గప్పు నయ్యు నండ్రాండ్ర వర్ణ

ఆ. లాత్మకర్మ మెడలి యనులోమ వృత్తి నె । జ్జాతి సొచ్చు నన్యజాతి పనికి
దాని కట్టిభంగి దలకొనుఁ బెక్కులు । పనులఁ జేసి జారతనము వచ్చు. **97**

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మ!= మలినంలేని ఆత్మకలవాడా! భరద్వాజా!; వనజభవుఁడు= బ్రహ్మదేవుడు; ఆగమ సత్యధర్మాచార తపములకున్= వేదాలకు, సత్యానికి, ధర్మానికి, ఆచారానికి, తపస్సునకు - ఈ అన్నిటికి; ఉనికి పట్టులుగాఁగన్= స్థానాలు అయ్యేటట్లుగా; మును= ముందుగా; బ్రాహ్మణులన్= బ్రాహ్మణజాతిని; కలిగించె(న్)= పుట్టించాడు; మఱి= తరువాత; నృప వైశ్య శూద్రులన్= క్షత్రియ వైశ్య శూద్రులను; కల్పించె(న్)= పుట్టించాడు; బ్రాహ్మణ+ఆదికముగన్= బ్రాహ్మణులు మొదలుగా; పరఁగు= ఒప్పు; ఆ+నాలుగు జాతుల= ఆ నాలుగు వర్ణాల; ఉత్+జ్వల+ఛాయలు= బాగుగా ప్రకాశించే మేని రంగులు; ఓలి(న్)= క్రమంగా; సొంపు+ఆరు= విలసిల్లునటువంటి; తెలుపును= తెల్లదనమూ; కెంపును= ఎర్రదనము; పసుపుచాయయున్= పసుపు (పచ్చని) రంగూ; కప్పున్= నల్లదనమూ; ఐ= అయి; అని; ఆర్యులు= పెద్దలు; అందురు= అంటారు; ఆత్మకర్మము= తనపని; అనులోమవృత్తిన్= ఆరోహణ క్రమానుగతమైన బ్రతుకు దెరువును; ఎడలి= విడిచి; ఏ+జాతి= ఏ వర్ణము; అన్యజాతిపనికిన్= ఇతర వర్ణపు వృత్తికి; చొచ్చున్= ప్రవేశిస్తుందో; దానికిన్= ఆ జాతికి; అట్టి భంగి= ఆ పద్ధతి; తలకొనున్= కలుగుతుంది; పెక్కులు పనులన్+చేసి= అనేకములయిన పనులవలన; జారతనము= వ్యభిచారం, రంకుతనం; వచ్చున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ నిర్మలాత్మా! భరద్వాజా! బ్రహ్మదేవుడు మొదటగా వేదాలకూ, సత్యధర్మ ఆచారాలకూ, తపస్సులకూ నెలవులుగా ఉంటారని బ్రాహ్మణులను సృజించాడు. తరువాత క్షత్రియ వైశ్య శూద్రులను పుట్టించాడు. బ్రాహ్మణులు మొదలు శూద్రుల వరకు గల నాలుగు వర్ణాలవారి మేని రంగులు క్రమంగా తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు- (అంటారు ఆర్యులు.) ఈ నాలుగు వర్ణాలవారిలో ఏ జాతి వారయినా, తమ వృత్తులు వదలి అన్యుల వృత్తులు స్వీకరిస్తే వారికి ఆ వృత్తి ఏర్పడుతుంది. అయితే అటువంటి ప్రవర్తనవలన లోకాన రంకుతనం కలుగుతుంది.

క. సిత రక్త పీత నీలము । లతులమతీ! మొదలు దొడఁగి యంతంతకు హీ
నతఁ దాల్చుఁ గాన యెఱిఁగిం । చితి నీ పరిపాటిఁ గర్మశీలతకొఱకున్.' 98

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధిగలవాడా!; సిత రక్త పీత నీలములు= తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు; మొదలు+తొడఁగి= మొదలుకొని; అంతకున్+అంతకున్= అంతకంతకు క్రిందికి పోయేకొలదీ; హీనతన్= తక్కువ తనమును; తాల్చున్= ధరించును; కాన= కావున; కర్మశీలత కొఱకున్= కర్మల స్వభావాల కొరకు; ఈ పరిపాటిని= ఈ క్రమాన్ని; ఎఱిఁగించితిన్= తెలిపాను.

తాత్పర్యం: ఓ భరద్వాజా! తెలుపు ఎరుపు పసుపు నలుపు లనే ఈ వర్ణాలు మొదటినుండి క్రిందికి వచ్చే కొలది తక్కువతనాన్ని వహిస్తాయి. తెలుపుకంటె ఎరుపు తక్కువ, అంటే బ్రాహ్మణుడికంటె క్షత్రియుడు హీనుడు. ఈ విధంగా ఈ వర్ణాలలో హెచ్చు తగ్గుల క్రమాన్ని ఆయా వర్ణాల స్వభావాల ఎరుకకొరకు నీకు తెలియజేశాను'.

విశేషం: వర్ణం అనేమాటకు రంగు అని అర్థం. మొట్టమొదట ఈ వర్ణభేదం మానవశరీర వర్ణాల కారణంగానే ఏర్పడి, అనంతరం పెద్దకాలానికి కులంగా స్థిరపడిపోయి ఉంటుంది. గ్రంథం ప్రాచీనం కాబట్టి ఆ మొదటి లక్షణాలు గ్రంథస్థాలుగా నిలిచాయి.

వ. అని మఱియును. 99

ప్రతిపదార్థం: అని= పలికి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా ప్రసంగిస్తున్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సత్యము బ్రహ్మము దపమును । సత్యము ప్రజలను సృజించు సత్యము లోక
స్థిత్యాధానముఁ జేయును । సత్యం బనృతంబుచేత సంపిహిత మగున్. 100

ప్రతిపదార్థం: సత్యము+అ= సత్యమే; బ్రహ్మము= వేదం; తపమును= తపశ్చర్య కూడా; సత్యము= సత్యమే; ప్రజలన్= జనులను; సృజించు(న్)= పుట్టిస్తుంది; సత్యము= సత్యమే; లోకస్థితి+ఆధానమున్= జగత్తుయొక్క ఉనికిని స్థాపించుటను; చేయున్= చేస్తుంది; సత్యంబు= సత్యం; అనృతంబుచేత(న్)+అసత్యంచేత; సంపిహితము= బాగుగా కప్పబడింది; అగున్= అవును.

తాత్పర్యం: సత్యమే వేదం, సత్యమే తపస్సు, సత్యవ్రతాన్ని పాటిస్తే తపస్సు చేసినట్లే. సృష్టిలో ప్రజాసంతతిని సత్యమే సృష్టిస్తున్నది. లోకం నిలిచి ఉండటానికి సత్యమే కారణం. ఈ విధంగా లోక సృష్టికి, లోకస్థితికి ఆధారమైన ఈ సత్యం అసత్యం వలన కప్పబడిపోతుంది.

విశేషం: సత్యశబ్ద వ్యుత్పత్తి గ్రహించదగింది. 'సత్'కి చెందింది సత్యం. ఈ 'సత్' అనే శబ్దం వేదాంత పరిభాషలో ఎక్కువసార్లు వస్తుంటుంది. సత్= ఉనికి; సత్తా అనే సంస్కృతశబ్దం కూడా ఇటువంటిదే. 'సత్'కి వ్యతిరిక్తం 'అసత్'. అసత్తునుండి సత్తుకు చేరుకోవాలని ఉపనిషత్తుల ఉద్ఘోష.

వ. అట్లుంగాక ధర్మాధర్మంబు లనఁ బ్రకాశతమంబు లన బోధాజ్ఞానంబు లన స్వర్గ నరకంబు లన సుఖదుఃఖంబు
లనఁ బరఁగు బుధజన వ్యావహారిక శబ్దంబులకు నర్థంబులై సత్యానృతంబులు ప్రవర్తిల్లుం గావున. 101

ప్రతిపదార్థం: అట్లున్+కాక= ఆ విధంగానే కాకుండా; ధర్మ+అధర్మంబులు+అనన్= పుణ్యం పాపం అనగా; ప్రకాశ తమంబులు+అనన్= కాంతి, చీకటి అనగా; బోధ+అజ్ఞానంబులు+అనన్= జ్ఞానం అజ్ఞానం అనగా; స్వర్గ నరకంబులు+అనన్= పుణ్యలోకం పాపలోకం అనగా; సుఖదుఃఖంబులు+అనన్= సంతోషం, ఏడుపు అనగా; పరఁగు= ఒప్పెడు; బుధజన వ్యావహారిక శబ్దంబులకున్= పండిత జనుల పలుకులలోని పదాలకు; అర్థంబులై= శబ్దార్థాలై తెలియపరచే శబ్దాలై; సత్య+అనృతంబులు= సత్యం అసత్యం అనేవి; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తాయి; కావున(న్)= కాబట్టి.

తాత్పర్యం: లోకాధారమైన సత్యం అసత్యంచేత కప్పబడటమే కాదు, లోకంలో పుణ్యపాపా లని, వెలుతురు చీకట్లని, జ్ఞాన అజ్ఞానా లని, పుణ్యలోక పాపలోకా లని, సుఖదుఃఖా లని, ఆర్యులు వ్యవహరించే మాటల కర్థాలు కూడా క్రమంగా సత్య అసత్యాలే. అంటే సత్యమంటే ధర్మం, కాంతి, జ్ఞానం, స్వర్గం సుఖం - అని అర్థాలు. ఆ విధంగానే అసత్యమంటే పాపం, చీకటి, తెలివి తక్కువతనం, నరకం, దుఃఖం - అని గ్రహించాలి. లోకంలోని మంచిమొత్తం సత్యం, చెడుగంతా అసత్యం - ఇదీ ఫలితార్థం.

క. అనఘా! దుఃఖాత్మకమగు । నృతం బడఁగించుటకుఁ బ్రయత్నమున సుధీ
జను లాచరింతు రనిశం । బును మోహవిభ్రాంతి నియమములు నిష్ఠమెయిన్. 102

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; సుధీజనులు= పండితులు; దుఃఖ+ఆత్మకము+అగు= దుఃఖస్వరూపమైన; న+ఋతంబు= అసత్యం; అడఁగించుటకు(న్)= అణచుటకు; ప్రయత్నమున(న్)= గొప్ప యత్నంతో; అనిశంబును= ఎల్లప్పుడును; మోహవిభ్రాంతి నియమములు= మానసిక విభ్రాంతిని చంపు కట్టుబాట్లు; నిష్ఠమెయిన్= దీక్షతో; ఆచరింతురు= ఆచరణలో పెట్టుతారు.

తాత్పర్యం: పాపమెరుగని ఓ భరద్వాజా! దుఃఖస్వరూపమైన ఈ అసత్యాన్ని అణచగోరి, పండితులు గొప్ప యత్నంతో పొరపాట్లను తొలగించే కట్టుబాట్లను ఎప్పుడూ దీక్షతో ఆచరిస్తూ ఉంటారు.

విశేషం: సత్యాసత్యాలు యథార్థంగా ఉన్నవి ఉన్నట్లుగా కనిపిస్తే నరులు సామాన్యంగా సత్యాన్నే ఎన్నుకొంటారు. అయితే అసత్యం సత్యంవలె భ్రాంతి కలిగిస్తుంది. ఆ భ్రాంతిని నిర్మూలించే ప్రయత్నం సుధీజనులే చేయాలి. సామాన్యులకు అది అలవిమాలిన పని.

క. ఒలయు జరావ్యాధి ప్రభృ । తులు శారీరములు గాఢ తోదక శోకా
దులు మానసములు; దుఃఖం । బులు రెండు విధముల నిట్లు పురుషు నలంచున్. 103

ప్రతిపదార్థం: ఒలయు= కలిగెడు; జరావ్యాధి ప్రభృతులు= ముసలితనం, రోగం మొదలైనవి; శారీరములు= ఒడలికి, శరీరానికి చెందినవి; గాఢ తోదక= బాధించే; శోక+ఆదులు= గట్టి (మానసిక) బాధ, బంధునాశంవలన దుఃఖం మొదలయినవి; మానసములు= మనస్సునకు చెందినవి; దుఃఖంబులు= బాధలు; రెండు విధములన్= రెండు రీతులలో; ఇట్లు= ఈ విధంగా; పురుషున్= మానవుడిని; నలంచున్= బాధిస్తాయి.

తాత్పర్యం: మానవజీవితంలో దాపురించే బాధలు రెండు విధాలుగా ఉంటాయి. ఒకటి శారీరక దుఃఖాలు, ముసలితనం, రోగం మొదలైనవి. రెండు - మానసిక బాధలు, బంధునాశం మొదలైనవాటి వల్ల కలిగేవి

క. శారీర మానసములగు । నీ రెండు విధములు దన్ను నేఁపక యుండం
గోరికొని నియమములఁ బ్రతి । కారం బొనరింపఁగా సుఖం బొందు నరున్. 104

ప్రతిపదార్థం: శారీర మానసములు+అగు= శరీరానికి, మనస్సునకు చెందినవైన; ఈ రెండు విధములు= పైన తెలిపిన రెండు రకాలయిన రోగాలు; తన్ను(న్)= తనను (నరుడిని); ఏఁపక+ఉండన్= బాధించకుండా ఉండుటను; కోరికొని= తనకై అభిలషించి; నియమములన్= కట్టుబాట్లతో; ప్రతికారంబు+ఒనరింపఁగాన్= ప్రతిక్రియ చేస్తే; నరున్= మానవుడిని; సుఖంబు+ఒందున్= క్షేమం పొందుతుంది.

తాత్పర్యం: శారీరకంగా, మానసికంగా దాపురించే రోగాలను శారీరకమైన మానసికమైన నియమ నిష్ఠలతో నియంత్రించ గలిగితే అవి నరుడిని బాధించవు. అట్టి ఆ నరుడు సుఖిస్తాడు.

విశేషం: పద్యంలోని 'తన్ను నేఁపక యుండంగోరికొని' అనే మాటలు గమనించదగ్గవి. కోరుట వేరు, కోరుకొనుట వేరు. కోరుకొనుట అంటే తనకొరకు కోరటం. అంటే గట్టిగా సంకల్పించుకొని ఆ సంకల్పబలంతో ఒక నిర్ణయానికి రావటం. అట్లా గట్టి నిర్ణయం జరిగితే దుఃఖనివారణ సాధ్యమే నంటున్నాడు భృగువు.

క. వినుఁ దుఃఖంబులఁ దెగఁ దోఁ । చిన పురుషుఁడు సౌఖ్య సక్తచిత్తుఁడు గా కా
రిన వైరాగ్యముఁ జెందిన । ననుపమ మగు పరమపదము నమ్మెయి సేర్చున్?' 105

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; దుఃఖంబులన్= శారీరక మానసిక వ్యాధి - ఆధులను; తెగన్+తోఁచిన పురుషుఁడు= ఛేదించి నెట్టివేసిన నరుడు; సౌఖ్యసక్త చిత్తుఁడు= సుఖమునందు తగుల్కొన్న మనస్సు కలవాడు; కాక= కాకుండా; ఆరిన వైరాగ్యమున్= శాంతించిన విరాగి తనమును-విషయవాంఛలు లేకుండుటను; చెందినన్= పొందినచో; న+ఉపమము+అగు= సాటిలేనిదగు; పరమ పదమున్= గొప్పస్థానాన్ని, మోక్షాన్ని; ఆ+మెయిన్= ఆ విధముగా; చేర్చున్= పొందించును.

తాత్పర్యం: సైన వివరించినట్లుగా సంకల్పబలంతో, స్థిరనిశ్చయంతో వ్యాధి - ఆధులను దూరీకరించుకొన్న నరుడు ఆ జయంతో, మళ్ళీ సుఖసంతోషాల వెంటబడిన సామాన్యనరుడివలె ప్రవర్తించకుండా, విషయవాంఛలు శాంతించినవాడై ప్రశాంతమైన వైరాగ్యాన్ని స్వీకరించాలి. అపుడు ఆ వైరాగ్యమార్గం అతడిని ముక్తికి చేర్చుతుంది'.

విశేషం: ఆధివ్యాధుల నిరోధంతో నరుడి మనశ్శరీరాలు రెండూ పరిశుభ్రపడి కాంతిమంతములౌతాయి. అయితే ఆ స్థితిలో నరుడు మళ్ళీ పాతత్రోవలో ప్రపంచ సుఖాల వెంటబడి పరుగెత్తితే ప్రయోజనముండదు. కథ మళ్ళీ మొదటికి వచ్చినట్లే. అందువలన మనశ్శరీరారోగ్యాలు ఉజ్జ్వలంగా ఉన్నపుడు ప్రశాంతచిత్తుడై విరాగిగా బ్రతకగలిగితే మోక్షాన్ని చేరుకోగలుగుతాడు నరుడు.

వ. అనిన విని భరద్వాజుం 'డాశ్రమధర్మ ప్రకారంబులు సువ్యక్తంబులుగా నెఱింగింపు' మనుటయు భృగుం
డిట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ముని; ఆశ్రమ ధర్మ ప్రకారంబులు= బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాస ఆశ్రమముల యొక్క నీతి నియమాలు; సువ్యక్తంబులుగాన్= బాగుగా స్పష్టపడే విధంగా; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుటయున్= అనగా; భృగుండు= భృగుమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా దుఃఖనివారణ మార్గాన్ని భృగువునుండి గ్రహించిన భరద్వాజుడు 'ఆశ్రమధర్మాలు - బ్రహ్మచారిగా, గృహస్థుడుగా, వానప్రస్థుడుగా, సంన్యాసిగా నరుడు ఆచరించవలసిన ధర్మాలను సుస్పష్టంగా తెలుపు'మనగా, సరి అని ఆ భృగుమహర్షి భరద్వాజుడిని ఉద్దేశించి ఈ విధంగా పలికాడు.

సీ. గురునకు భక్తుఁడై పరమాదరమున వే । దాభ్యాస మెప్పుడు నాచరించు
చును, శౌచశీలత వినయంబు త్రిషవణ । స్నానంబు భాస్కరానలసపర్య
పాటించుచుండుట బ్రహ్మచారికి వృత్తి; । ధనధాన్యములు గర్హితములు గాని
తెరువునఁ బడసి యతిథిపూజ మున్నుగా । నన్నపానాది భోగానుభవముఁ

తే. బొందువాఁడు గృహస్థుండు; గందమూల । శాక ఫలము లాహారంబు శయ్యభూమి
వననివాసికి నిస్సంగవర్తనమున । భిక్ష బ్రదుకుగ యతి శాంతిఁ బేర్చియుండు. 107

ప్రతిపదార్థం: బ్రహ్మచారికిన్= బ్రహ్మచర్యం - విద్యార్థిత్వం అనే ఆశ్రమంలో ఉన్నవాడికి; గురునకున్= చదువు నేర్పే అధ్యాపకుడికి; భక్తుఁడు+ఐ= శ్రద్ధకలవాడై; పరమ+ఆదరమున(న్)= గొప్ప అభిమానంతో; వేద+అభ్యాసము= వేదములను అభ్యసించుట-

నేర్చుకొనుట; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఆచరించుచున్= చేయుచు; శౌచశీలత= శుభ్రతతోడి స్వభావం; వినయంబు= అణకువ; త్రి+సవన= మూడు హోమములయందు; స్నానంబు= స్నానము చేయుట; భాస్కర+అనల సపర్య= సూర్యుడి, అగ్ని సేవను; పాటించుచుండుట= క్రమంగా చేస్తూఉండటం; వృత్తి= ధర్మం - బ్రహ్మచారికి పై విధులు పాటించటం ధర్మమనుట; ధనధాన్యములు= డబ్బు, గింజలు; గర్హితములు+కాని= నిందితముకాని; తెరువునన్= పద్ధతియందు; పడసి= పొంది; అతిథిపూజ= అతిథుల - భోజనసమయానికి ఇంటికి వచ్చిన వ్యక్తుల సత్కారం; మున్ను+కాన్= మొదట జరుగుచున్నట్లుగా; అన్నపాన+ఆది భోగ+అనుభవమున్= భోజనం, పానీయం మొదలగు భోగములను అనుభవించటాన్ని; పొందువాఁడు= స్వీకరించేవాడు; గృహస్థుండు= గేస్తు - గృహస్థ ఆశ్రమంలో ఉన్నవాడు; వననివాసికిన్= వానప్రస్థ ఆశ్రమంలో ఉన్నవాడికి; కందమూల శాకఫలములు= గడ్డలు, దుంపలు, కూరలు, పండ్లు; ఆహారంబు= భోజనం; శయ్య= పడక; భూమి= నేల; యతి= సన్యాసి; నిస్+సంగవర్తనమున(న్)= ఆసక్తిలేని ప్రవృత్తితో; భిక్ష= బిచ్చం; బ్రతుకుగన్= జీవనంగా; బ్రతుకు దెరువుగా; శాంతిన్= శాంతితో; పేర్చి+ఉండున్= అతిశయించి ఉండును.

తాత్పర్యం: బ్రహ్మచర్యం నాలుగు ఆశ్రమాలలో మొదటిది. బ్రహ్మచారి గురుభక్తి కలిగి, వేదాభ్యాసం నిరంతరం చేస్తూ ఉండాలి. శుభ్రత పాటించే గుణంతో అణకువతో మూడు (ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం) హోమాలు చేసే సమయంలో స్నానం చేస్తూ సూర్యుడిని అగ్నిని క్రమం తప్పక ఆరాధిస్తూ ఉండాలి. ఇదీ బ్రాహ్మణధర్మం. మూడు పూటలా హోమం చేయాలి వటువు. ధనధాన్యాలు నిందారహితంగా ధర్మమార్గాన పొంది ముందుగా అతిథి సత్కారంచేసి, ఆ పిదప భోజనపానీయాదులు స్వీకరిస్తూ ఉండటం గృహస్థుడి ధర్మం. వానప్రస్థ ఆశ్రమానికి ఆహారం కందమూలాలు, కూరలు, పండ్లు మాత్రమే. అతడికి పడక నేలమీద. ఇక చివరి ఆశ్రమం సన్యాసం. సన్యాసి అనాసక్త ప్రవృత్తితో బిచ్చమే జీవనంగా శాంతితో వెలుగుతూ ఉంటాడు.

విశేషం: మానవ జీవనకాలాన్ని నాలుగుగా విభజించి - బాల్యంలో, యౌవనంలో, ముదిమి మొదటి దశలో, అనంతరదశలో చేయదగిన పనులను క్రమంగా నిర్దేశించటమే ఈ ఆశ్రమధర్మ వివరణం. జీవనవిధానంలో ఒక క్రమపరిణతి వ్యక్తమౌతుంది.

క. ఫలకాంక్షి గాక నియతిం । జలిపిన నీయఖిల కర్మజాతంబును నిర్మల మోక్షపదముఁ జేర్చుట । గలుగు నవశ్యంబుఁ బుణ్యకరణప్రవణా!' 108

ప్రతిపదార్థం: పుణ్య కరణ ప్రవణా!= ధర్మం చేయటంలో ఆసక్తికలవాడా! - ఓ భరద్వాజా!; ఈ అఖిల కర్మజాతంబును= ఈ పైన వివరించిన మొత్తం ధర్మముల సమూహాన్ని; నియతిన్= నియమంతో; ఫలకాంక్షి గాక= ఫలాన్ని కోరేవాడు కాకుండా; చలిపినన్= చేసినచో; నిర్మల మోక్ష పదమున్= మలినంలేని ముక్తి స్థానాన్ని; అవశ్యము= తప్పక; చేర్చుట కలుగున్= పొందించటం జరుగుతుంది.

తాత్పర్యం: ధర్మాచరణ పరాయణుడవైన ఓ భరద్వాజా! పైన వివరించిన ఆశ్రమ ధర్మాలు నాలుగింటిని క్రమంగా నియమంతో ప్రయోజన కాంక్షతో కాకుండా ఆచరిస్తే తప్పకుండా ముక్తిపదం లభిస్తుంది'.

విశేషం: ఆశ్రమధర్మం నిర్వహణం సామాన్యంగానే చేయవచ్చును. అయితే ఆ చేయుటకు భృగువు ఒక క్రియావిశేషణంగా వాడాడు. 'ఫలకాంక్షిగాక' అని. ప్రయోజన కాంక్షతో గాక, సహజంగా ఆ ఆచరణ జరగాలి. అపుడే ముక్తి మరి!

వ. అనిన విని భరద్వాజుండు 'పరలోకంబున నొండు గలదం; ద్రీ లోకంబునకును నాలోకంబునకును విశేషం బెట్టిది? యెఱింగింపవే?' యని యడిగిన భృగుం డతని కిట్లనియె. 109

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజముని; పరలోకంబు+అన(న్)= ఇతరలోకం అనగా; ఒండు= ఒకటి; కలదు+అండ్రు= ఉన్నది అంటారు; ఈ లోకంబునకును= ఈ మన లోకానికీ; ఆ లోకంబునకును=

ఆ పరలోకానికీ; విశేషంబు+ఎట్టిది= భేదం ఏ విధమైనది; ఎటింగింపవే?= తెలియజేయవా?; అని; అడిగినన్= ప్రశ్నించగా; భృగుండు= భృగుమహర్షి; అతనికిన్= ఆ భరద్వాజుడికి; ఇట్లు+అనియె(న్)= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భృగుమహర్షి మాటలు విన్న భరద్వాజుడు 'పరలోకమని, మరొక లోకం ఉన్నది అంటారు. ఆ లోకానికీ ఈ లోకానికీ భేద మేమిటి? తెలుపు'మన్నాడు.

క. ఇది కర్మభూమి భోగా । స్పద; మా లోకంబు ధర్మపరులకు సులభం;
బది సత్యశౌచ సౌజ । న్య దయాదులు లేనివారి కప్రాప్య మగున్. 110

ప్రతిపదార్థం: ఇది= ఈ ఇహలోకం; కర్మభూమి= కర్మలకు పనిపాటులకు ఉద్దిష్టమైన నేల; ఆ లోకంబు= ఆ పరలోకం; భోగ+ఆస్పదము= సుఖ అనుభవాలకు నిలయము; అది= ఆ పరలోకం; ధర్మపరులకున్= ధర్మ ఆచరణ పరాయణులకు; సులభంబు= సుఖంగా దొరికేది; సత్యశౌచ సౌజన్య దయా+ఆదులు= నిజం చెప్పటం, పరిశుభ్రత, మంచితనం, కరుణ మొదలైన గుణాలు; లేనివారికిన్= కలుగనివారికి; ఆప్రాప్యము+అగున్= పొందరానిది ఔతుంది.

తాత్పర్యం: ఈ లోకం కర్మభూమి. ఇక్కడ నరుడు కర్మలు చేస్తాడు. కేవలం కర్మాచరణకే ఉద్దిష్టమైనది ఈ లోకం. పరలోకం కర్మల ఫలితాల అనుభవాలకు నిలయమైనది. కాబట్టి అది భోగభూమి అనవచ్చును. అయితే ఆ భోగభూమిలో ప్రవేశం ధర్మాచరణ పరులయిన నరులకే పరిమితం. సత్యవ్రతపాలన, శుభ్రత పాటించటం, మంచితనంతో వ్యవహరించటం, దయగలిగి ఉండటం మొదలైన మంచి లక్షణాలు లేనివారు ఆ పరలోకాన్ని పొందలేరు.

విశేషం: ప్రాక్తన కాలాన, నరుడు లోకవ్యవహారనిర్వహణమంతా కార్యకారణ సంబంధబద్ధమై ఉన్నదని భావించి, ఆ భావనకు విరుద్ధమైన సంఘటనలను గమనించినపుడు ఈ కర్మభూమి భోగభూమి - ఆలోచన కలిగి ఉండాలి. ఒక విధంగా ఈ ఆలోచన కూడా కార్యకారణ శృంఖలను, జగద్వ్యవహారాలహేతుబద్ధతను సమర్థించటానికి ఉద్దిష్టమైనదే.

క. ఈ లోకము దుఃఖబహుళ, । మా లోకము భూరిసుఖ నిరంతర; మం దే
జాలియును లేక యొండొరు । తో లెస్సగఁ బొంది యుండుదురు జను లనఘా! 111

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; ఈ లోకము= ఈ ఇహలోకం; దుఃఖబహుళము= కష్టాలతో నిండినది -ఎక్కువ కష్టనష్టాలకు పాత్రమైనది; ఆ లోకము= ఆ పరలోకం; భూరిసుఖ నిరంతరము= గొప్ప సౌఖ్యాలతో నిండినది; అందున్= ఆ పరలోకాన; ఏ జాలియును= ఏ చింతయు; లేక= ఉండక; జనులు= ప్రజలు; ఒండు+ఒరుతో(న్)= పరస్పరం - ఒకరితో ఒకరు; లెస్సగన్= బాగుగా; పొంది+ఉండుదురు= పొందిక, కూడిక కలిగి ఉంటారు.

తాత్పర్యం: ఈ లోకం కష్టనష్టాలకు చీకు చింతలకు ఆలవాలమై ఉండగా, ఆ లోకం దీనికి విరుద్ధంగా కేవలం సుఖాలకూ, క్షేమాలకూ, శుభాలకూ నిలయం. అక్కడి జనులకు ఏ ఖేదమూ ఉండదు. అందరూ పరస్పరం కలిసి మెలసి సుఖమయమైన జీవనం సాగిస్తూంటారు.

తే. హస్తి మశకాంతరము గల దరసి చూడ । వాస గృహ శయనాసన వసన గంధ
మాల్య తౌర్యత్రికారామ మానినీజ । నాది సుఖసాధనములకు నందు నిందు. 112

ప్రతిపదార్థం: అందున్= ఆలోకంలోనూ; ఇందున్= ఈ లోకంలోనూ; వాసగృహ= ఉండే ఇళ్ళు; శయన= పడకలు; ఆసన= పీటలు - కూర్చొనుటకు ఉపయోగించే పరికరాలు; వసన= గుడ్డలు; గంధ= (మంచి) వాసనలు; మాల్య= పూల దండలు; తౌర్యత్రిక= సంగీత నృత్యవాద్యము లను మూడు; ఆరామ= ఉద్యానవనాలు; మానినీ జన+ఆది= స్త్రీజనం మొదలైన; సుఖసాధనములకున్=

సౌఖ్యమును కలిగించే పరికరాలకు; అరసి చూడన్= పరిశీలించి చూడగా; హస్తి మశక+అంతరము= ఏనుగు, దోమల భేదం; కలదు= ఉన్నది.

తాత్పర్యం: ఇహలోక సుఖాలను పరలోక సుఖాలతో పోల్చిచూస్తే దోమకూ, ఏనుగుకూ ఉన్నంత భేదం కనిపిస్తుంది. నరుడికి సుఖసాధనాలయిన నివాసగృహాలు, పడకలు, ఆసనాలు, బట్టలు, సుగంధ ద్రవ్యాలు, పూలమాలికలు, సంగీత నృత్యవాద్యాలు, ఉద్యాన వనాలు, స్త్రీలు - ఈ అన్నింటా ఆ భేదం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పరలోక సుఖం ఏనుగైతే (హస్తి), ఇహలోక సుఖం దోమ (మశకం). కాబట్టి పరలోక సుఖమే ఉత్కృష్టమైనది.

విశేషం: నరుడి జీవితాన తృప్తి ముఖ్యం. అది అనుభూతిద్వారానే కాక, ఆశ ద్వారా కూడా లభిస్తుంది. రాబోయే సుఖాలకై నిరీక్షణలో కూడా తృప్తి నిక్షిప్తమై ఉంటుంది. పరలోక సుఖానుభవం ఆ విధమైన తృప్తిని కలిగిస్తూ నరుడిని శాంతింపజేస్తుంది.

వ. అని వెండియు. **113**

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'ఇవి పుణ్యలోక విషయ । వ్యవసిత వచనంబు లధమమగు లోకము ధ
ర్మవిదూరజనులు పొందుదు । రవిరత బహుదుఃఖ నిలయ మది విప్రవరా! **114**

ప్రతిపదార్థం: విప్రవరా!= బ్రాహ్మణ శ్రేష్ఠా!; ఇవి= ఈ పైన చెప్పినవి; పుణ్యలోక విషయ వ్యవసిత వచనంబులు= ధర్మలోకాలకు చెందిన నిశ్చితాలైన మాటలు; అధమము+అగు లోకము= హీనమైన లోకమును; ధర్మవిదూరజనులు= పుణ్యానికి ఎడమైన ప్రజలు; పొందుతారు= చెందుదురు; అది= ఆ తక్కువలోకం; అవిరత బహు దుఃఖ నిలయము= ఎల్లప్పుడు ఎక్కువగా దుఃఖాలకు స్థానం.

తాత్పర్యం: 'భరద్వాజా! ఇపుడు నేను వివరించినవి పుణ్యలోక సంబంధాలైన విషయాలు. కాని, వాటికి విరుద్ధంగా పాపలోకం కూడా ఉన్నది. ఆ లోకానికి ధర్మానికి, నీతికి, మంచికి దూరమై జీవించే జనులు చేరుతారు. ఆ లోకం ఎప్పుడూ ఎక్కువ దుఃఖాలకు స్థానంగా నిలుస్తుంది.

విశేషం: నరుడి మానసిక తృప్తికి, శాంతికి పుణ్యలోక స్థితి ఎంత అవసరమో, పాపలోకపు ఉనికీ అంతే అవసరం. ఈ లోకాన దుష్కర్మల అకృత్యాల, పాపాల ఫలితాలు పొందకుండానే గతించినవారు, తప్పించుకొనవీలులేకుండా అక్కడ మరొక అధమలోకం ఉండాలి మరి! కర్మఫలితం అనివార్యంగా నరుడికి చెందాలి - అని నరుడు నమ్మినపుడు ఈ లోకాలసృష్టి దేవుడికి తప్పదు.

క. వినుము మమకార వివర్జిత । మనస్కులకుఁ బుణ్యపాపమార్గంబులు లే
మిని లోకంబులఁ ద్రిమ్మర । రనఘా! పొందుదురు శాశ్వతానందంబున్.' **115**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా! భరద్వాజా!; వినుము= ఆలకించుము; మమకార వివర్జిత మనస్కులకున్= నాది అనే భావం వదలిన మనస్సులు కలవారికి; పుణ్య పాప మార్గంబులు= ధర్మ అధర్మ గతులు; లేమిని(న్)= లేకుండుటవలన; లోకంబులన్= లోకాలలో, ఈ పుణ్యపాపలోకాలలో; త్రిమ్మరరు= తిరుగాడరు; శాశ్వత+ఆనందంబున్= నిత్యమైన సుఖాన్ని; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: భరద్వాజా! 'నాది' అనే అభిమానం, మోహం లేనివారు ఈ పుణ్యపాపమార్గాన ప్రయాణించరు. వారి త్రోవ వేరు. వారికి ఈ స్వర్గనరక లోకాలలో తిరుగాడే అవసరం రాదు. వారు నిత్యనిర్మల కేవల ఆనందాన్ని అందుకొంటారు'.

విశేషం: 'మమకారం' అనే ఒక్క దినుసును దూరీకరించగలిగితే నరుడు కేవలుడుగా మిగులుతాడు. కేవలుడి భావమే కైవల్యం, మోక్షం.

వ. అని చెప్పి భృగుండు బ్రహ్మవిహితంబులగు ధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి' ననిన భరద్వాజుండు ప్రముదితాత్ముం డగుచు నమ్మహాత్ముం బ్రశంసించి వినతుండై వీడ్కొనియె; నతనిచేత విన్నంతవట్టును నీకుం జెప్పితి; నీ వింక నెయ్యది వినవల తనుటయు ననిమిషనదీనందనుతో ధర్మనందనుం 'డాచార విధి వినువాంఛ నా మనంబునం బేర్చియుండు' ననవుడు నతం డతని కిట్లనియె. 116

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; భృగుండు= భృగుమహర్షి; బ్రహ్మవిహితంబులు+అగు= బ్రహ్మచేత చేయబడినవి అగు; ధర్మంబులు= విధులు; సంక్షేప రూపంబునన్= కుదించిన రీతిలో; ఎఱింగించితిన్= తెలిపితిని; అనినన్= అనగా; భరద్వాజుండు= భరద్వాజముని; ప్రముదిత+ఆత్ముండు+అగుచున్= సంతుష్టమైన మనస్సు కలవాడు ఔతూ; ఆ+మహా+ఆత్మున్= ఆ గొప్ప హృదయం కలవాడిని - భృగుమహర్షిని; ప్రశంసించి= పొగడి; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; వీడ్కొనియెన్=వెడలిపోయాడు; అతనిచేతన్= ఆ భరద్వాజుడి నుండి; విన్న+అంత+పట్టును= విన్న అంత విషయాన్ని; నీకున్= ధర్మరాజువైన నీకు; చెప్పితిన్= చెప్పాను; నీవు; ఇంకన్= మరియును; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?= వినుటకు ఇష్టపడతావు?; అనుటయున్= అనగా; అనిమిషనదీనందనుతోన్= గంగానదీ పుత్రుడైన భీష్ముడితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆచారవిధిన్= ఆచార నియమాలను; వినువాంఛ= ఆలకించే కోర్కె; నా మనంబునన్= నా మనస్సులో; పేర్చి= అతిశయించి; ఉండున్= ఉన్నది; అనవుడున్= అనిన వెంటనే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మజునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా భృగుమహర్షి బ్రహ్మ విధించిన ధర్మాలను సంక్షిప్తంగా నీకు తెలియజేశాను'. అని భరద్వాజుడితో అనగా, భరద్వాజుడు సంతోషించి, భృగువును స్తుతించి నమస్కరించి వెడలిపోయాడు. 'ఆ భరద్వాజుడి నుండి నేను విన్నంతవరకు ఆ ధర్మవిశేషాలను నీకు వినిపించాను. నీవు ఇంకా ఏమి వినాలని ఇష్టపడుతున్నావు?' అని భీష్ముడు ధర్మజుడితో అనగా, ధర్మరాజు తనకు ఆచారవిధులను వినాలనే కోరిక ఎక్కువగా ఉన్నదన్నాడు. దానికి బదులుగా భీష్ముడు ఆచారవిధిని ఇట్లా వినిపించాడు.

భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱింగించుట (సం. 12-186-2)

సీ. 'సజ్జనులం దురాచారవంతుల దురా । చారంబు గష్టత్వకారి యట్లు
గావున నాచారగతి వింట గడు లెస్స; । రాజమార్గంబున రచ్చ మంద
మూత్రపురీష విమోక్షంబు సేయమి, । శౌచియై వార్చి నిష్ఠను జలంబు
సొచ్చుట, సంధ్యల సూర్యు సేవించుట, । యర్కోదయాస్తమయముల నిద్ర

తే. వోవకుండుట, పంచార్ధభావ మొంది । కుడుచు టన్నంబు దెగడమి, తడిపదములు
గలుగ నిదురకుఁ జొరమి సత్కర్మవేది । నారదుఁడు వివరించె నాచారములుగ. 117

ప్రతిపదార్థం: సత్+జనులన్= మంచి ప్రజలలో; దుర్+ఆచారవంతులన్= చెడ్డ నడవడి గలిగిన వారిలో; దుర్+ఆచారంబు= చెడునడత; కష్టత్వకారి= దుఃఖాన్ని కలిగిస్తుంది; అట్లు+కావునన్= ఆ విధం కాబట్టి; ఆచారగతిన్= నడవడితీరును, ఆచారముల విధాన్ని; వింట= వినుట; కడు లెస్స= మిక్కిలి మంచిది; రాజమార్గంబునన్= రాజవీధిలో; రచ్చన్= సభయందు; మందన్= పశువుల సమూహంలో; మూత్ర పురీష విమోక్షంబు+చేయమి= మూత్రం మలం విడవకుండటం; శౌచి+ఐ= శుచిత్వం, శుభ్రత గల వాడై; వార్చి= ఆచమించి, ఆచమనము (నీటిని నోటినుంచి ఉమియుట) చేసి; నిష్ఠను= నిలుకడతో; జలంబు+చొచ్చుట=

నీట ప్రవేశించుట; సంధ్యలన్= సంధ్య వేళలందు; సూర్యు సేవించుట= సూర్యదేవుని పూజించటం (అర్ఘ్యమివ్వటం); అర్క+ఉదయ+అస్తమయములన్= సూర్యుడి పొడుపు క్రుంకు (సమయా)లలో; నిద్ర+పోవక+ఉండటం= నిద్రపోకుండా ఉండటం; పంచ+ఆర్ద్ర భావము= ఐదు తడిసినతనములు, పాద్య, అర్ఘ్య. స్నాన, ఆచమనీయ, నిర్మాల్యములు ఈ అన్నింటా జలస్పర్శ; ఒంది= పొంది; కుడుచుట= భుజించటం; అన్నంబు+తెగడమి= తినుదానిని తిట్టకుండటం; తడిపదములు+కలుగన్= తడిసిన కాళ్ళు ఉండగా; నిదురకున్= నిద్రకు చొరమి= ఉపక్రమించకుండటం; సత్+కర్మవేది= మంచి పనులు తెలిసిన; నారదుఁడు= నారదమహర్షి; ఆచారములుగన్= నడతలుగా; వివరించెన్= విశదపరచాడు.

తాత్పర్యం: చెడునడత అనేది సజ్జనులనూ, దుర్జనులనూ ఇరువురినీ కష్టపెట్టుతుంది. కాబట్టి నడతను గురించి వినటం మిక్కిలి మంచిది. రాజమార్గంలో, సభలో, పశువుల మందలో మలమూత్రవిసర్జన చేయకుండటం, శుచిగా ఆచమించి నిలకడగా నీటమునగటం, సంధ్యవేళలలో సూర్యుడికి అర్ఘ్యమిచ్చి పూజించటం, సూర్యుడు పొడిచేటప్పుడు, క్రుంకేటప్పుడు నిద్రపోకుండ ఉండటం, పాద్య అర్ఘ్యస్నానాదికాలు ముగిసిన పిదప భుజించటం, అన్నాన్ని నిందించకుండటం, తడి కాళ్ళతో నిద్రకు ఉపక్రమించకుండటం - ఇవి ఆచారాలని సత్కర్మలు తెలిసినవాడైన నారదుడు వివరించాడు.

విశేషం: ఆచారం ధర్మానికి మూలం. కాబట్టే 'ఆచార ప్రభవో ధర్మః' అనే సూక్తి ఏర్పడింది. ఇది అనూచానంగా పరంపరగా మానవసమూహంలో ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంవలె అందుతూ ఉంటుంది. అయితే ఈ సుదీర్ఘ కాలవాహినిలో కొన్ని ఆచారాలు కాలంచెల్లి అసందర్భాలుగా అసంగతాలుగా కూడా మారుతూ ఉంటాయి. వివేకి అయిన నరుడు కాలానుగుణమైన మార్పుతో ఆచారాన్ని స్వీకరించాలి.

తే. ఉదయమగు సూర్యుఁ గనుఁగొను టొప్పఁ; దన్య । వనిత నగ్నమై యుండంగ వలదు చూడఁ;
దన పురీషంబు సూచుట ధరణినాథ! । కీడు; నిజపాపగుప్తి యక్కృత్య మరయ. 118

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓ రాజా!; ఉదయము+అగు సూర్యున్= పొడిచే సూర్యుడిని; కనుఁగొనుట= చూడటం; ఒప్పదు= కూడదు; అన్యవనిత= ఇతర స్త్రీ; నగ్న+ఐ= వివస్త్ర అయి; ఉండంగన్= ఉన్నప్పుడు; చూడన్+వలదు= చూడటం తగదు; తన పురీషంబు+చూచుట= తన మలమును చూడటం; కీడు= చెడు; నిజపాపగుప్తి= తన పాపాన్ని దాచటం; అరయన్= పరిశీలించగా; అకృత్యము= చేయరానిది.

తాత్పర్యం: రాజా! ఉదయించే సూర్యుడిని చూడరాదు. ఇతరస్త్రీ వివస్త్రగా ఉన్నప్పుడు చూడకూడదు. అట్లాగే తన మలాన్ని తాను చూస్తే కీడు కలుగుతుంది. ఈ మూడూ చూడరానివి. ఇక తన పాపాన్ని తాను దాచిపెట్టటం చేయదగ్గ పని కాదు - ఆలోచిస్తే.

విశేషం: ఇక్కడ చూడరానివి మూడు; చేయరానిది ఒకటి చెప్పాడు భీష్ముడు. అయితే చివరిది 'నిజపాపగుప్తి' వాస్తవానికి నిజపాపం చూడవలసినది తప్పకుండా తానే గాక ఇతరులూ దాన్ని చూచే వీలు కల్పించాలి - అనే భావాన్ని ఆ మాటలో ఇమిడ్చిన్నట్లున్నాడు వక్త. అంటే చూడరానివి మూడు అని చెప్పుతూ, తప్పకుండా చూడవలసినది మాత్రం స్వకీయ పాపప్రవృత్తి అని సూచిస్తున్నాడువక్త.

క. సురతంబు గుప్తమగుటయు, । గురుశుశ్రూషయును, బ్రహ్మకుల భజనము నా
యురవాప్తిఁ జేయు లక్ష్మీ । కరంబులగు నూర్ధ్వలోక గతుల నొనర్చున్.' 119

ప్రతిపదార్థం: సురతంబు= సంభోగ క్రియ; గుప్తము+అగుటయున్= దాచబడినదిగా ఉండటం; గురుశుశ్రూషయును= గురువుల, పెద్దల, విద్యాదాతల సేవా; బ్రహ్మకుల భజనము= బ్రాహ్మణులను కీర్తించటం; ఆయుః+అవ+ఆప్తిన్= ఆయుస్సును (జీవన కాలమును) పొందుటను; చేయున్= కలిగించును; లక్ష్మీకరంబులు+అగు= సంపదను కలిగించెడు; ఊర్ధ్వలోక గతులన్= పై లోకముల చేరికలను; ఒనర్చున్= చేయును, ఒనగూర్చును.

తాత్పర్యం: సంభోగక్రియను గుప్తంగా ఉంచటం, గురువును సేవించటం, బ్రాహ్మణులను కీర్తించటం నరుడి ఆయుస్సు పెంచుతాయి. పైగా వీటివలన నరుడు సంపత్కరమైన పై లోకాలకు కూడా చేరుకొనగలుగుతాడు.'

విశేషం: 'శుశ్రూష' అనే మాటకు అసలైన అర్థం - 'శ్రోతుమ్: ఇచ్ఛా' వినుటకు కోరిక అని. భాషలకు లిపులులేనపుడు కూడా విద్యాభ్యాసం కొనసాగేది. అపుడు విద్యార్థి గురుడిచెంత జేరి, ఆయన మాటలను విని విద్య గరచేవాడు. ఆనాడు కేవల శ్రవణేంద్రియ మొక్కటే, నోటికి తోడుగా విద్యార్జనలో ఉపయోగపడేది. కంటి ఉపయోగం లిపుల ఆవిర్భావం తరువాత వచ్చినది. కాగా ఈ 'శుశ్రూష' ఆ నాటిది. ఆ నాడు విద్యార్థి వినికిడి ద్వారానే విద్యను ఆర్జించేవాడు. అపుడు దగ్గరచేరి (గురువుకు) విన కోరిక గలిగి ఉండటం విద్యార్థి లక్షణం. క్రమంగా ఆ లక్షణం గురుసన్నిధిలో గురుసేవా నిర్వహణం చేసే విద్యార్థి లక్షణంగా పరిణమించి, చివరకు గురుసేవకు పర్యాయపదంగా 'శుశ్రూష' స్థిరపడినది.

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డధ్యాత్మ విద్య వినవలతుం జెప్పవే'యనిన నతనికి దేవవ్రతుం డిట్లనియె.120

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అధి+ఆత్మవిద్య= ఆత్మకు చెందిన వేదాంత జ్ఞానం; వినన్+వలతున్= వినగోరెదను; చెప్పవే?+అనినన్= చెప్పుము అనగా; అతనికి(న్)= ఆ ధర్మరాజుకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆచారవిధులు విన్న ధర్మరాజు, అనంతరం తాను ఆధ్యాత్మవిద్యను గూర్చి వినగోరుతున్నట్లు తెలుపగా భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'జలధి తరంగల చాడ్పునఁ బొడముచు । నడఁగుచు నుండు భూతాత్మునందు
భూమి ప్రభృతిభూతములు వాని గుణములు । గంధాదు లింద్రియ గ్రాహ్యకోటి
యనఘ! శ్రోత్రం బాదియగు నింద్రియశ్రేణి । దర్వియుఁ బోలె సాధనత నొందు
మనసింద్రియములకుఁ బెనుఁ బ్రాపు బుద్ధి త । న్ముఖమున నిశ్చయంబునకుఁ దేరఁ

తే. బురుషుఁ డవ్విషయంబులఁ బొందు నిట్లు । గాకయుండ నింద్రియములఁ గ్రమ్మఱించి
మనసుతోఁ గూర్చి బుద్ధిలోనన యడంప । బుద్ధి నిర్విషయస్థితిఁ బురుషు నొందు. 121

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; జలధి తరంగల చాడ్పునన్= సముద్రపు అలల మాదిరిగా; పొడముచున్= పుట్టుతూ; అడఁగుచున్= సమసిపోతూ; ఉండు= ఉన్న; భూత+ఆత్మునందున్= జీవాత్ముడియందు; భూమిప్రభృతి భూతములు= భూమి మొదలైన పంచభూతాలు (నీరు, వెలుతురు, గాలి, ఆకాశం, భూమి= 5); వాని గుణములు= ఆ భూతముల స్వభావాలు; గంధ+ఆదులు= వాసన మొదలయినవి; ఇంద్రియ గ్రాహ్యకోటి= ఇంద్రియములచేత గ్రహించదగిన సమూహం; శ్రోత్రంబు+ఆది+అగు= చెవి మొదలైన; ఇంద్రియశ్రేణి= ఇంద్రియాల వరుస; దర్వియున్+పోలెన్= తెడ్డువలె; సాధనతన్+ఒందున్= పరికరత్వమును పొందును; మనసు= మనస్సు; ఇంద్రియములకున్= చెవి మొదలగు ఇంద్రియాలకు; పెను+ప్రాపు= గొప్ప ఆధారం; బుద్ధి= తెలివి; తద్+ముఖమునన్= దాని (మనస్సు) ద్వారా; నిశ్చయంబునకున్= నిర్ణయానికి; తేరన్= చేరగా; పురుషుఁడు= నరుడు; ఆ+విషయంబులన్= ఆయా వస్తువులను, జ్ఞానములను; పొందున్= చెందుతాడు; ఇట్లు+కాక+ఉండన్= ఈ విధంగా కాకుండా ఉండేటట్లు; ఇంద్రియములన్= ఇంద్రియాలను (కన్ను, ముక్కు, చెవి, తోలు, నోరు); క్రమ్మఱించి= మరల్చి; మనస్సుతోన్+కూర్చి= మనస్సుతో కలిపి; బుద్ధిన్= తెలివిని; లోనన్+అ= లోపలనే; అడంపన్= అణచగా; బుద్ధినిర్విషయస్థితి= బుద్ధికి (జ్ఞానమునకు) లోనుకాని - గోచరించని దశ; పురుషున్= నరుడిని; ఒందు(న్)= చెందును.

తాత్పర్యం: జీవాత్మ, కడలి కెరటాలవలె పుట్టుతూ గిట్టుతూ ఉంటుంది. భూమి, నీరు, కాంతి, గాలి, ఆకాశం అనేవి పంచభూతాలు. వాటి స్వభావాలయిన వాసన, ద్రవం, తేజస్సు, చలనం, శబ్దం - అనేవి ఇంద్రియాల ద్వారా గ్రహింపునకు వస్తాయి. చెవి, ముక్కు, నోరు, తోలు, కన్ను - అనే ఈ ఇంద్రియాలు వాసనాది పంచభూతాల గుణాలు అనుభవానికి రావటానికి తెడ్డువలె ఉపకరణాలుగా పనిచేస్తాయి. అయితే ఈ ఉపకరణాల ద్వారా అనుభవం కలగటానికి ఆ సాధనాలకు పెద్ద ఆధారభూమి మనస్సు. ఆ మనస్సుద్వారానే విషయజ్ఞానం - అనుభవం నరుడిని చేరుకొంటుంది. ఈ విధంగా ప్రాపంచిక విషయజ్ఞానం మానవుడిలో ప్రవృత్తిని రేకెత్తించి ఈ జననమరణ చక్రంలో పడవేసి త్రిప్పుతుంటుంది. ఆ చక్రభ్రమణం నుండి బయటపడాలంటే ముందుగా ఇంద్రియాలను మళ్ళించి మనస్సుతో వాటిని చేర్చితే, బుద్ధిని (తెలివిడి) లోలోననే అణచివేయవచ్చును. ఆ విధంగా పురుషుడు అంతర్ముఖుడైనపుడు అతడిలో బుద్ధి గోచరించని స్థితి కలుగుతుంది.

విశేషం: ఇంద్రియనిగ్రహం ద్వారా మనస్సును స్వాధీనపరచుకొని ప్రాపంచిక విషయపరాఙ్ముఖుడై పురుషుడు తరిస్తాడు.

క. వినుఁ మాత్ముఁడు క్షేత్రజ్ఞుం ।ఁడన భూతాత్ముఁ డనఁ బురుషుఁ డనఁ బరమేశుం
ఁడన బుద్ధిసాక్షి యనఁగా ।ఁ జననరహితుఁ డనఁగఁ బరఁగు శాంతిప్రవణా! 122

ప్రతిపదార్థం: శాంతిప్రవణా!= శాంతియందు ఆసక్తుడా! - శాంతిని కాంక్షించే ఓ ధర్మరాజా!; వినుము= ఆలకించుము; ఆత్ముఁడు= ఆత్మ; క్షేత్రజ్ఞుండు+అనన్= క్షేత్రజ్ఞుడు అనే పేరుతో; భూతాత్ముఁడు+అనన్= భూతాత్ముడు అనే పేరున; పురుషుఁడు+అనన్= పురుషనామంతో; పరమ+ఈశుండు+అనన్= పరమేశ్వరుడు అనే పేరుతో; బుద్ధి సాక్షి+అనఁగన్= బుద్ధిసాక్షి అనే పేరుతో; జనన రహితుఁడు+అనన్= పుట్టుకలేనివాడు అనగా; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: ఆత్మ జీవంతో చేరి భూతాత్ముడనీ, శరీరతత్త్వం తెలిసి క్షేత్రజ్ఞుడనీ, శరీరం తాను గానని తెలిసి పురుషుడనీ, పరమేశ్వరుడనీ, బుద్ధికి ఎడంగా నిలిచి 'బుద్ధిసాక్షి' అనీ, తత్త్వదర్శనంతో జననరహితుడనీ పిలువబడుతూ ఉంటాడు.

విశేషం: 'ఆత్మ' పరమాత్మగా, నరుడు ఈశ్వరుడుగా పరిణతిచెందే దశలను స్ఫురింపజేస్తూ ఆత్మకు గల ఇతర వ్యపదేశాలను-పేర్లను వివరించాడు.

క. తనయంద తోఁచు విషయము ।లనుభవగోచరము లగుట యవి మాయాసం
జనిత స్వప్నంబై యా ।త్మునికిం దను గాన లేమి మోసము దెచ్చున్. 123

ప్రతిపదార్థం: తనయందున్+అ= తనలోనే; తోఁచు= గోచరించే; విషయములు= వస్తువులు, జ్ఞానములు మొదలైనవి; అనుభవ గోచరములు+అగుట= ఇంద్రియాల ద్వారా తెలియరావటం; అవి= ఆ విషయాలు; మాయాసంజనిత స్వప్నంబు+ఐ= మాయవలన కలిగిన కలఅయి; ఆత్మునికిన్= ఆత్మకు; తను= తనను; కానలేమి= చూడలేకపోవటం; మోసము+తెచ్చున్= వంచనను కలిగిస్తుంది.

తాత్పర్యం: 'ఆత్మ' పరమేశ్వరు డయినపుడు అతడు విశ్వమయుడు. సృష్టి అంతా అతడిలో గోచరించేదే. అదే సృష్టి తిరిగి ఆత్ముడికి ఇంద్రియానుభవం ద్వారా గోచరిస్తున్న దంటే అర్థం అదంతా మాయవలన స్వప్నసదృశమైన అయథార్థం మిథ్య తప్ప అన్యంగాదు. మాయ కారణంగానే 'ఆత్మ' తనను తాను కాంచలేక, మోసానికి గురిఅయి పరమాత్మకు వెలియై అలమటిస్తున్నది.

విశేషం: పరిణతప్రజ్ఞుడైన ధూర్జటి మహాకవి కూడా 'అంతా మిథ్య తలంచి చూచినన్' అంటాడు శ్రీకాళహస్తీశ్వర శతకంలో. జ్ఞాన నేత్రం ద్వారా చూస్తే ఈ మిథ్యావాదం గోచరిస్తుందంటారు తత్త్వజ్ఞులు.

క. విను గుణములు మాయకు నొడ । లని యెఱిఁగి, తమోరజస్సు లడఁచి, సుసత్త్వం
బున నిలిచి సద్వివేకం । బున నదియుం ద్రోచి విమల బోధాత్ముఁ డగున్. 124

ప్రతిపదార్థం: గుణములు= త్రిగుణాలు - సత్త్వం, రజస్సు, తమము అనేవి; మాయకున్= మిథ్యాజ్ఞానానికి; ఒడలు+అని= శరీరం అని; ఎఱిఁగి= తెలిసి; తమస్+రజస్సులు= తమోగుణాలను, రజోగుణాలను; అడఁచి= నశింపజేసి; సుసత్త్వంబునన్= మంచి సత్త్వగుణమునందు; నిలిచి= స్థిరపడి; సత్+వివేకంబునన్= మంచి జ్ఞానంతో; అదియున్= ఆ సత్త్వగుణాన్ని కూడా; త్రోచి= తొలగించి; విమల బోధ+ఆత్ముఁడు+అగున్= నిర్మలమైన జ్ఞానంగల ఆత్మకలవాడు ఔతాడు; విను(ము)= ఆలకించుము.

తాత్పర్యం: మిథ్యాజ్ఞానమే మాయ. మాయకు నరుడిలోని గుణత్రయం (సత్త్వరజస్తమములు) శరీరం. కాబట్టి మాయ తత్త్వం గ్రహించి, మొదట తమస్సును, ఆ పిదప రజస్సును వదలివేయాలి. అపుడు ఆత్మ శుద్ధసత్త్వరూపంతో వెలుగుతూ ఉంటుంది. అటు తరువాత ఆ సత్త్వాన్ని కూడా తొలగించుకొనాలి. అపుడు కేవలం జ్ఞానం - విమల బోధ కలిగి ఆత్మ పరమాత్మగా పరిణమిస్తుంది.

విశేషం: గుణత్రయ రాహిత్యమే కైవల్యం.

తే. అరసి చూడ సత్త్వంబు సుఖాత్మకంబు । సాంద్రదుఃఖమయంబు రజస్సు, బోధ
మాంద్యమూర్తి తమస్సు, సమత్వ మూఁది । యీ యవస్థలఁ బొరయమి మాయపోక. 125

ప్రతిపదార్థం: అరసి చూడన్= పరీక్షించిచూస్తే; సత్త్వంబు= సత్త్వం అనే గుణం; సుఖ+ఆత్మకంబు= సుఖం ఆత్మగా గలది, సుఖమయమైనది; రజస్సు= రజోగుణం; సాంద్ర దుఃఖమయంబు= దట్టమైన దుఃఖంతో నిండినది; తమస్సు= తమోగుణం; బోధ మాంద్యమూర్తి= జ్ఞానమందత ఆకారంగా గలది - మందజ్ఞానం తమస్సు లక్షణం; సమత్వము+ఊఁది= సమభావం వహించి; ఈ+అవస్థలన్= పైన వివరించిన దశలను, స్థితులను; పొరయమి= పొందకుండటం; మాయ పోక= మాయ నశించటం.

తాత్పర్యం: పరీక్షించి చూస్తే సత్త్వగుణం సుఖమయమైనది. రజస్సు నిరంతర దుఃఖనిలయం. ఇక చివరిదైన తమస్సు జ్ఞాన మాంద్యరూపంతో దర్శనమిస్తుంది. అయితే సమతాదృష్టితో ఆయా గుణాలను, వాటి స్వభావాలను దూరీకరించగలిగితే మాయను పోద్రోలినట్లే. గుణత్రయరాహిత్యమే మాయానాశనం'.

వ. అని యధ్యాత్మప్రకారంబు నిర్దేశించి భీష్ముండు వెండియు 'యోగంబు సెప్పెద నాకర్ణింపు'మని యమ్మనుజపతి కిట్లనియె. 126

ప్రతిపదార్థం: అని= పై విధంగా పలికి; ఆధి+ఆత్మ ప్రకారంబు= ఆత్మకు సంబంధించిన విధానాన్ని; నిర్దేశించి= తెలియజెప్పి; భీష్ముండు; వెండియున్= మరలా; యోగంబు= యోగవిద్యను; చెప్పెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఆ+మనుజ పతికిన్= రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అధ్యాత్మవిద్యను వివరించిన భీష్మపితామహుడు, అనంతరం 'అధ్యాత్మవిద్యకు ఉపకరించే యోగవిద్యను వివరిస్తాను వినుమని ధర్మజుడితో ఇట్లా అన్నాడు.

ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట (సం. 12-188-1)

సీ. తెలివొంది మనసు నిశ్చలవృత్తి నేకాగ్ర । మై యున్కి గోరి నిష్ఠాతిశయము
కలిమి కృత్యంబు మేఘంబున మెఱుఁగును । నలిన పత్రంబున సలిలకణముఁ
బోలె మంతవ్యంబు పాంతఁ జరించు మ । నంబు దానికిఁ బవనంబు గతియ
గతిగాన హితము మారుత ధారణము పవ । మానంబు గ్రమమునఁ గాని నిలువ

ఆ. దలయ విసువఁగాదు తలకొని యమ నియ । మాదు లెనిమిదియును నభ్యసింపఁ
గా విచార మొలయుఁ గలుగు వితర్కంబు । మఱి వివేక మనిలు నెఱికిఁదెచ్చు. 127

ప్రతిపదార్థం: మనసు= హృదయం; తెలివి+ఒంది= జ్ఞానం పొంది; నిశ్చల వృత్తిన్= చలనంలేని నడతతో; ఏక+అగ్రమై= ఒక విషయమున లగ్నమైనదై; ఉన్కి= ఉండటాన్ని; కోరి= అభిలషించి; నిష్ఠ+అతిశయము కలిమి= నిశ్చయపు ఆధిక్యం ఉండటం; కృత్యము= చేయవలసినది; మేఘంబునన్= మబ్బునందు; మెఱుఁగును= మెరుపూ; నలిన పత్రంబునన్= తామర ఆకున; సలిలకణమున్+పోలెన్= నీటిబిందువువలె; మంతవ్యంబు పాంతన్= ఆలోచన దగ్గర; మనంబు= మనస్సు; చరించున్= తిరుగుతూ; దానికిన్= ఆ మనస్సునకు; పవనంబు గతియ= గాలియొక్క నడకయే; గతి= నడక; కాన= కావున; మారుత ధారణము= గాలిని ధరించటం, నియమించటం; హితము= మేలు; పవమానంబు= గాలి; క్రమంబునన్+కాని= (ఒక) వరుసలోగాని; నిలువదు= ఆగదు, నియమించబడదు; అలయన్= ఆయాసపడుటకు; విసువన్= విసుగుచెందుటకు; కాదు= కాదు; తలకొని= సంకల్పించి; యమ నియమ+ఆదులు+ఎనిమిదియును= యమము, నియమము మొదలగు ఎనిమిదింటిని; అభ్యసింపఁగాన్= నేర్వగా; విచారము= ఆలోచన; ఒలయున్= కరగును; వితర్కంబు= సంశయం; కలుగున్= ఏర్పడును; మఱి= పిదప; వివేకము= జ్ఞానం; అనిలున్= గాలిని; నెఱికిన్+తెచ్చున్= వరుసకు, క్రమమునకు తెస్తుంది.

తాత్పర్యం: మనస్సు చలించకుండా, ఏకాగ్రమై నిలిచి ఉండాలి అంటే గట్టి నిశ్చయం అవసరం. మబ్బులో మెరుపువలె, తామరాకున నీటి బిందువువలె మనస్సులో ఆలోచన సహజంగా ఉంటుంది. మనస్సు ప్రసరించే తీరు, గాలి వీచే పద్ధతి ఒకటే. గాలి కారణంగానే మనస్సు చలిస్తుంది. కాబట్టి ఆ వాయువును (మన శరీరంలోని దానిని) నివారించాలి - మనోనిగ్రహం కొరకు. వాయువును నిగ్రహించటం సులభంకాదు. అది క్రమక్రమంగా సాగాలి. ఆయాసపడటంగాని, విసుగు చెందటంగాని కుదరదు - వాయునిరోధ ప్రయత్నంలో. స్థిరమైన సంకల్పంతో యమనియమాదులైన ఎనిమిది సాధనాలతో వాయు నిరోధానికై యత్నించాలి. ఆ ప్రయత్నంలో ముందుగా ఆలోచనలు కరిగిపోతాయి. తరువాత సందేహం కలుగుతుంది. ఆ పిదప జ్ఞానం వాయువును క్రమబద్ధం చేయగలుగుతుంది.

విశేషం: మనశ్చాంచల్యానికి వాయువు శరీరాంతర్గతమైనది కారణం కాబట్టి మనస్సు నిగ్రహించదలిస్తే వాయునిరోధం తప్పనిసరి. దానికి యమ నియమాది సాధన అనివార్యం.

క. వినుమంతర్నాడిం జనఁ । బనుపడి పవనంబు బ్రహ్మపద మొందఁగ శాం
తి నిరూఢమైన చిత్తము । గను నానందంబునంద కలియుం బదపన్.' 128

ప్రతిపదార్థం: పవనంబు= గాలి; అంతర్+నాడిన్+చనన్= లోపలి నాడి (వాయు ప్రయాణమార్గం) గుండా వెళ్ళగా; పనుపడి= అలవాటు పడి; బ్రహ్మపదము+ఒందఁగన్= బ్రహ్మస్థానమును పొందగా; శాంతినిరూఢమైన చిత్తము= శాంతిని బాగుగా వహించిన

మనస్సు; ఆనందంబున్+కనున్= ఆనందమును - బ్రహ్మానందమును పొందుతుంది; అందున్+అ= ఆ ఆనందమందే; పిదపన్= ఆ తరువాత; కలియున్= లీనమగును; విను(ము)= ఆలకించుము.

తాత్పర్యం: క్రమబద్ధమైన వాయువు శరీరాంతర్గతనాడులగుండా ప్రయాణంచేస్తూ శరీరంలోని బ్రహ్మస్థానాన్ని చేరుకొంటుంది. అపుడు మనస్సు నిశ్చలమై శాంతిపూర్ణమై బ్రహ్మానందాన్ని అందుకొంటుంది. ఆ తరువాత ఆ ఆనందంలోనే లీనమైపోతుంది'.

విశేషం: బ్రహ్మానందానికి శాంతి, శాంతికి నిశ్చలమనస్కత, నిశ్చలమనస్కతకు పవనగతి నిరోధం, తన్నిరోధానికి యమనియమాది అష్టవిధసాధన, తత్సాధన ప్రారంభానికి స్థిరసంకల్పం కావాలి.

వ. అనిన విని కురుపతి కురుపితామహునితో 'జపవిధి ప్రకారంబును, జపశీలురగువారు పోవుగతియును నెఱింగింపవే?' యనుటయు నమ్మహీవిభునకు నమ్మహాత్ముం డిట్లనియె. 'జప్యంబు విషయంబుగా యమకాలమృత్యు భూసురేక్ష్వాకులకు సంవాదంబు ప్రవర్తించె; నయ్యితిహాసంబునుం జెప్పెద; మున్ను నా యెఱింగిన తెఱంగునుం జెప్పెద; నాకర్ణింపుము.' 129

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కురుపతి= కురువులరాజు ధర్మజుడు; కురుపితామహునితోన్= కురువంశపు తాతతో; జపవిధి ప్రకారంబును= జపమును చేసే పద్ధతిని; జపశీలురు+అగువారు= జపంచేసే స్వభావం కలవారు; పోవుగతియున్= పొందే ఫలితమును; ఎఱింగింపవు+ఏ?= తెలియజేయవా?; అనుటయున్= అనగా; ఆ+మహీవిభునకున్= ఆ రాజునకు; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్ప మనస్సుగలవాడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; జప్యంబు= జపం చేయదగినది; విషయంబుగాన్= శీర్షికగా, చర్చా అంశంగా; యమకాల మృత్యు భూసుర+ఇక్ష్వాకులకున్= యమధర్మరాజునకు; కాలపురుషునకు, మృత్యుదేవతకు, బ్రాహ్మణుడికి, ఇక్ష్వాకు వంశరాజునకు; సంవాదంబు= మంచి ప్రసంగం; ప్రవర్తించెన్= జరిగింది; ఆ+ఇతిహాసంబునున్= ఆ చరిత్రను; చెప్పెదన్= పలికెదను; మున్ను= ముందుగా; నా+ఎఱింగిన తెఱంగునున్= నేను గ్రహించిన విధమును కూడా; చెప్పెదన్= పలికెదను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'జపంచేసే విధానాన్నీ, జపంచేసేవారు పొందే ఫలితాన్నీ తెలుపుము' అని కోరగా ఆయనతో భీష్ముడు ఇట్లా అన్నాడు: 'జపించదగిన అంశాన్ని గురించి యమధర్మరాజుకూ, కాలపురుషుడికీ, మృత్యుదేవతకూ, బ్రాహ్మణుడికీ, ఇక్ష్వాకువంశరాజుకూ సంవాదం జరిగింది. ఆ ఇతిహాసాన్ని వినిపిస్తాను. ముందుగా నాకు తెలిసింది చెప్పుతాను వినుము!

యమ కాల మృత్యు భూసురేక్ష్వాకుల సంవాదము (సం. 12-189-6)

సీ. వేదాంతవిదు లనుమోదించు నట్టిది । జపకర్మ మత్యంత శౌచశాలి
యై కుశాస్తీర్ణ సమావనీతలమునఁ । గుశముష్టి సేకొని విశదచిత్త
వృత్తి నింద్రియములు విషయసక్తంబులు । గాకుండ నిలిపి తదేకపరత
మత్సరాహంకార మాన దంభాపగ । మంబును బ్రహ్మచర్యంబుఁ గలిగి

తే. జపము సెల్లించు పురుషుండు సర్వలోక । విజయ నిస్పృహ మగు జపవిధి విశోక
హర్ష రాగాదికంబును నవ్యయంబు । నైన పదముఁ బొందించు నృపాగ్రగణ్య! 130

ప్రతిపదార్థం: నృప+అగ్రగణ్య!= రాజులలో మొదట లెక్కించదగినవాడా! ధర్మరాజా!; జపకర్మము= జపవిధి, జపం చేయటం; వేద+అంత విదులు= వేదాంత విద్యను ఎరిగినవారు; అనుమోదించునట్టిది= ఆమోదించేది, సంతోషంతో అంగీకరించేది; అతి+అంత శౌచశాలి+ఐ= చాలా ఎక్కువ శుభ్రతతో ప్రకాశించేవాడై; కుశ+ఆస్తీర్ణ సమ+అవనీతలమునన్= దర్భలచేత వ్యాప్తమైన, మిట్టపల్లాలులేని, భూమి ప్రదేశాన; కుశముష్టిన్= దర్భల పిడికిలిని; చేకొని= స్వీకరించి; విశదచిత్త వృత్తిన్= నిర్మలమైన మనస్సు యొక్క నడతతో; ఇంద్రియములు= జ్ఞాన, కర్మ ఇంద్రియాలను పదింటిని; విషయ సక్తంబులు+కాక+ఉండన్= విషయములయందు తగుల్కొన్నవి కాకుండేటట్లుగా; నిలిపి= స్థిరీకరించి; తద్+ఏకపరతన్= ఆ ఒక్కదానిఅందలి ఆసక్తితో; మత్సర+అహంకార మాన దంభ+ అపగమంబును= ఓర్వలేనితనం, గర్వం, అభిమానం, ఆటోపాల తొలగింపును; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్య వ్రతాన్ని; కలిగి= వహించి; పురుషుండు= నరుడు; జపము= జపించటాన్ని, నామ మంత్ర ఉచ్చారణం చేయటాన్ని; చెల్లించున్= నిర్వహిస్తాడు; సర్వలోక విజయ నిస్పృహము+అగు= ఎల్లలోకాల గెలుపునందును ఆశలేనిది అగు; జపవిధి= జపవిధానం, జపం నిర్వర్తించటం; విశోక హర్షరాగ+ఆదికంబునున్= గతించిన, నశించిన శోకం, సంతోషం, ప్రేమ మున్నగు భావాలు గలదియు; న+వ్యయంబును= నాశంలేనిదియు; ఐన= అగునట్టి; పదమున్= స్థానాన్ని, కైవల్యాన్ని; పొందించున్= సిద్ధింపజేస్తుంది.

తాత్పర్యం: ఓ రాజశ్రేష్ఠా! ధర్మరాజా! జపవిధిని వేదాంతవేత్తలు ఆమోదిస్తారు. దానికి పూర్వరంగ మిది. అత్యధిక శుభ్రతతో వెలుగొందుతూ, దర్భలతో వ్యాప్తమై పూతమైన ఒక సమతలంపై పిడికెడు దర్భల ధరించి ఆసీనుడై జ్ఞానేంద్రియాలనూ, కర్మేంద్రియాలనూ అన్యవిషయాలలో సక్తంగాకుండా నిగ్రహించి, ఏకాగ్రచిత్తుడై, మాత్సర్యం, గర్వం, దర్పం, దంభం - వీటిని తొలగించుకొని, జపంచేయటానికి ఉద్యుక్తుడు కావాలి పురుషుడు. ఆ విధంగా జపవిధిని నిర్వహిస్తాడు నరుడు. ఆ విధంగా నిష్ఠాభరితంగా నిర్వర్తితమైన జపం ఎల్లలోకాల గెలుపును కూడా కోరనిదిగా మారి - సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు అతీతమైన శాశ్వతమైన స్థానాన్ని - మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: ఇంద్రియాలు - జ్ఞాన కర్మభేదంతో మొత్తం పదిగా అధ్యాత్మవిధులు లెక్కిస్తారు. జ్ఞానేంద్రియాలు 1- కన్ను, ముక్కు, చెవి, త్వక్కు, నోరు; కర్మేంద్రియాలు 5 - వాక్, పాణి, పాద, పాయూపస్థలు. ఈ పదింటిపై అదుపు సాధించినవాడే జితేంద్రియుడు.

క. శౌచాది గుణము లెడలుట । నీచత్వము వాటిలంగ నిశ్చలమతి దు
ష్టాచరితమైన జపవిధి । నా చెప్పిన సుగతి లేదు నరకముఁ దెచ్చున్.' 131

ప్రతిపదార్థం: శౌచ+ఆది గుణములు= శుభ్రత మొదలైన గుణాలు; ఎడలుట= వెలి కావటంవలన; నీచత్వము= తక్కువతనం; పాటిలంగన్= కలిగే విధంగా; నిశ్చలమతిన్= చలనం లేని బుద్ధితో; దుష్ట+ఆచరితము+ఐన= చెడుగా నిర్వహించబడినదైన; జపవిధిన్= జపవిధానం, జపం చేయడంవలన; నా చెప్పిన= నేను పలికిన; సుగతి= మోక్షం; లేదు= ఉండదు, కలుగదు; నరకమున్+తెచ్చున్= నరకలోకాన్ని పొందించును.

తాత్పర్యం: జపవిధానం సరిగా ఆచరితమైతే మోక్షప్రదాయి. సందేహంలేదు. అయితే అదే జపం శౌచం మొదలయిన లక్షణాలు లోపించి నైచ్యానికి పాల్పడే రీతిలో చెడుగా ఆచరించబడితే మాత్రం దానివలన ముక్తి రాదు - సరిగదా నరకం వస్తుంది'.

విశేషం: లక్ష్యం, మార్గం - రెండూ ఉన్నతంగా పరిశుభ్రంగా ఉండాలి. ఉన్నప్పుడే ఫలితమూ ఆనందప్రదమౌతుంది. కానినాడు చివరకు మిగిలేది దుఃఖమే.

వ. అని చెప్పి వెండియు నిట్లనియె. 132

ప్రతిపదార్థం: అని; చెప్పి= పలికి; వెండియున్= మరియును; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి, ఇంకా ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వేద వేదాంగ సంవేది గౌశికుఁ డను । ధరణీసురుఁడు సంహితాజపంబు
విహితశీలతఁ జేయ వేయి వత్సరములు । సనిన సావిత్రి యమ్మునివరునకుఁ
బొడసూపి తనుఁ జెప్పఁ గడుభక్తితో నతం । డెఱఁగిన 'నిచ్చెద నిష్ట' మడుగు
మనిన నాతండు జపాతినిష్ఠయ కోర । నది యిచ్చి, దేవి 'నీ కత్యుదాత్త

తే. గతియు నగు; ధర్మ మర్థి నీకడకు వచ్చు; । యముఁడు గాలుండు మృత్యువు నరుగుదెంతు
రనఘ! నీకును వారికి నావహిల్లు । వాద' మని చెప్పి చనియె భూవరవరేణ్య! 133

ప్రతిపదార్థం: భూవర వరేణ్య!= రాజశ్రేష్ఠా! ఓ ధర్మరాజా!; కౌశికుఁడు+అను= కౌశికుడు అనేపేరుగల; ధరణీసురుఁడు= బ్రాహ్మణుడు; వేద వేద+అంగసంవేది= వేదాలను, వేద అంగాలయిన శిక్ష, వ్యాకరణం మొదలయిన ఆరు శాస్త్రాలను బాగుగా ఎరిగినవాడు; సంహితాజపంబున్= వేద జపమును; విహిత శీలతన్= విధించబడిన స్వభావంతో; చేయన్= ఒనరింపగా; వేయి వత్సరములు= వేయి ఏండ్లు; చనినన్= కడవగా; సావిత్రి= మంత్ర అధిదేవత; ఆ+ముని వరునకున్= ఆ ముని శ్రేష్ఠుడికి; పొడ+చూపి= కనిపించి; తనున్= తనను; చెప్పన్= తెలియజెప్పగా; కడు భక్తితోన్= అధిక భక్తితో; అతండు= ఆ కౌశికుడు; ఎఱఁగినన్= నమస్కరించగా; ఇచ్చెదన్+ఇష్టము+అడుగుము= ఇస్తాను కోరిన దానిని అడుగుము; అనినన్+అనగా (సావిత్రి); అతండు= ఆ కౌశికుడు; జప+అతినిష్ఠ+అ= జపంలో ఎక్కువ శ్రద్ధయే; కోరన్= కోరుకొనగా; అది= దానిని ఆ జపాతినిష్ఠనే; ఇచ్చి= ఒసగి; దేవి= సావిత్రీదేవి; నీకున్= జపకర్మకే అంకితమైన నీకు; అతి+ఉత్+ఆత్త గతియున్= మిక్కిలి గొప్పపదముకూడ; అగున్= కలుగును; ధర్ముము= ధర్మదేవత; అర్థిన్= కోరికతో; నీ కడకున్= నీ వద్దకు; వచ్చున్= చేరును; యముఁడున్= యమధర్మరాజు కూడా; కాలుండున్= కాలపురుషుడును; మృత్యువున్= మరణదేవతకూడా; అరుగుదెంతురు= వస్తారు; అనఘ!= ఓ పాపరహితుడవైన కౌశికా!; నీకును; వారికిన్= ఆ వచ్చినవారికిని; వాదము= సంవాదం, చర్చ; ఆవహిల్లును= కలుగుతుంది; అని; చెప్పి= పలికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: వేదాలు, వేదభాగాలయిన శాస్త్రాలు తెలిసిన కౌశికుడనే బ్రాహ్మణుడు జపాన్ని చేయవలసిన విధంగా చేసేవాడు. ఆ బ్రాహ్మణుడు ఆ విధంగా జపకర్మను నిష్ఠతో వేయి వత్సరాలు చేయగా, ఆ జపానికి అధిదేవత అయిన సావిత్రీదేవి ఆయనకు ప్రత్యక్షమై, తనను తాను పరిచయం చేసికొన్నది. ఆ బ్రాహ్మణుడు ఆ దేవికి నమస్కరించాడు. ఆ దేవి ఆ జపతత్పరుడిని, నీ అభీష్టం నెరవేరుస్తాను కోరుకో'మ్మని అడిగింది. దానికి ఆయన ఆ జపకర్మలోని నిష్ఠనే వరంగా అర్థించాడు. అతడి శ్రద్ధకు సంతసించిన ఆ దేవి ఆ వరాన్ని ప్రసాదించి, 'నీకు మిక్కిలి గొప్ప స్థానం కలుగుతుంది. ధర్మదేవత, యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యుదేవత - వీరందరూ నీ దగ్గరకు వచ్చి, నీతో సంభాషణ నెరపి సంవాదం చేస్తారు' అని కూడా ఆతడికి తెలియజేసి అంతర్హిత అయింది.

విశేషం: వేదాలు నాలుగు: ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము. వేద అంగాలు ఆరు: శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, నిరుక్తం, కల్పం. వీటినే షట్ శాస్త్రాలు అని కూడా వ్యవహరిస్తారు. జపకర్మకే అంకితుడైన ఆ కౌశికుడి వృత్తాంతాన్ని వివరిస్తున్నాడు భీష్ముడు.

క. ధరణీసురుఁడును జప త । త్పరుఁడై దివ్యాబ్దములు శతంబు గడపె న
ప్పురుషవరు కడకు ధర్ముము । పరమప్రీతిఁ జనుదెంచెఁ బౌరవముఖ్యా! 134

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠా!-ధర్మరాజా!; ధరణీ సురుఁడును= బ్రాహ్మణుడుకూడా-ఆ కౌశికుడు; జపతత్పరుఁడు+ఐ= జపకర్మయందు ఆసక్తుడై; దివ్య+అబ్దములు= దేవలోక సంవత్సరాలు; శతంబు= నూరు; కడపెన్= గడపాడు; ఆ+పురుషవరు కడకున్= ఆ నరశ్రేష్ఠుడి దగ్గరకు; ధర్ముము= ధర్మదేవత; పరమప్రీతిన్= ఎక్కువ ప్రేమతో; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ కౌశిక బ్రాహ్మణుడు దేవీవరలబ్ధమైన తీవ్రనిష్ఠతో జపకర్మను నిర్వహిస్తూ నూరు దేవలోక సంవత్సరాలు గడిపాడు. అపుడు ఎక్కువ మక్కువతో ధర్మదేవత ఆ కౌశికుడి చెంతకు చనుదెంచింది.

విశేషం: అర్థి అయినవాడు దేవతలను తాను ఆశ్రయిస్తాడు, అర్థి కాని తపశ్శీలుడిని దేవతలే ఆశ్రయిస్తారు. అర్థిత్వానికి అనర్థిత్వానికి అంత భేదం ఉన్నది.

తే. అట్లు సాకారమై వచ్చి యతనితోడ । 'నీ జపంబున సిద్ధించె నిరతిశయము
లైన పుణ్యలోకములు; నీ వందుఁ జనుము । తనువుఁ జిత్తంబు విడిచి యుత్సవ మెలర్ప.' 135

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; స+ఆకారము+ఐ= ఆకృతి కలిగినదై; వచ్చి= చేరి; అతనితోడన్= ఆ బ్రాహ్మణుడితో; నీ జపంబునన్= నీ జపకర్మవలన; నిర్+అతిశయములు= అధికమైనవి లేనివి; ఐన; పుణ్యలోకములు= ధర్మాచరణంవలన లభించే ఊర్ధ్వలోకాలు; సిద్ధించెన్= లభించాయి; నీవు; అందున్= ఆ లోకాలకు; ఉత్సవము+ఎలర్పన్= సంతోషం అతిశయిల్లగా; తనువున్= దేహాన్ని; చిత్తంబు= మనస్సును; విడిచి= వదలి; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: స్వతః ఆకారంలేని ధర్మం ఈ కౌశికుడి కారణాన ఆకారం ధరించి వచ్చి, 'ఓ కౌశికా! నీ జపకర్మ ఫలితంగా తమను మించినవి లేని గొప్ప పుణ్యలోకాలు నీకు లభించినవి. సంతోషంతో నీ వాక, నీ శరీరాన్ని మనస్సును విడిచి ఆ లోకాలకు చేరుకొమ్ము'. అన్నది.

వ. అనిన విని యమ్ముని ధర్మంబున కిట్లనియె. 136

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+ముని= ఆ కౌశిక ఋషి; ధర్మంబునకున్= ధర్మదేవతకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అనగా విని ఆ కౌశిక ఋషి ఈ విధంగా అన్నాడు.

క. 'తనువు దొఱఁగి సను లోకము । లనఘా! యే నొల్ల మేల యైనను దుఃఖం
బున కోర్చి నా తపంబున । కనుగుణమై యుండ దీని నగునె తొఱంగన్?' 137

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; ఏను= నేను; తనువు= శరీరం; తొఱఁగి= విడిచి; చనులోకములు= వెళ్ళెడి (ఊర్ధ్వ) లోకాలు; మేలు+అ+ఐనను= శ్రేష్ఠమైనవే అయినా; ఒల్లన్= అంగీకరించను; దీనిన్= ఈ శరీరాన్ని; దుఃఖంబునకున్= కష్టానికి; ఓర్చి= సహించి; నా తపంబునకున్= నేను చేసే జపరూపమైన తపస్సునకు; అనుగుణమై= అనుకూలమై; ఉండన్= ఉండగా, నిలిచి ఉండగా; తొఱంగన్= విడుచుటకు; అగునె?= అర్హం, ఉచితము, అగునా? (కాదు).

తాత్పర్యం: 'పాపస్పర్శలేని ఓ ధర్మమా! ఊర్ధ్వలోకాలు ఉత్తమమైనవే అయినప్పటికీ నేను ఈ నా శరీరాన్ని దిగవిడిచి వెళ్ళవలసి వస్తే, ఆ లోకాలను అంగీకరించజాలను. ఎందుకంటే ఈ శరీరం నా జపకర్మకు - అది దుఃఖకరమే అయినా సహించి అనుగుణంగా ఉంటున్నది. అటువంటి ఈ అనుకూలదేహాన్ని విడిచిపుచ్చి వెళ్ళటం ఉచితమా?'

విశేషం: కౌశికుడికి ఊర్ధ్వలోక గమనం అనిష్టంగాదు. అతడికి ఇష్టంగానిది - ఇంతకాలం తన తపశ్చర్యకు సాధనమైన శరీరాన్ని దిగవిడిచి పోవటం.

వ. అనుటయు ధర్మంబు. 138

ప్రతిపదార్థం: అనుటయున్= కౌశికుడు ఆ విధంగా పలుకగా; ధర్మంబు= సాకారమైన ధర్మం- (ఇట్లా ప్రతిభాషించింది).

తాత్పర్యం: దీనికి ధర్మదేవత ఇట్లా సమాధానం ఇచ్చింది.

క. 'ఒడ లెట్లు విడువవలదే? । కడు రమ్యము నాక మింత గానవొకో?' నా
వుడు 'మేను వెలిగ నటవో । నొడఁబడ' నని పలికె బ్రాహ్మణోత్తముఁ డధిపా! 139

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా ఒడలు= శరీరం; ఎట్లున్= ఏ విధంగానైనా; విడువన్‌వలదు+ఏ?= వదలివేయవద్దా?; నాకము= స్వర్గం; కడు రమ్యము= మిక్కిలి సుందరం; ఇంత= ఈ మాత్రం; కానవు+ఒకో?= గమనించలేవా?; నావుడున్= అన్నవెంటనే; బ్రాహ్మణ+ఉత్తముఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడయిన ఆ కౌశికుడు; మేను= శరీరం; వెలిగన్= వెలుపలగాగా - వెంటరాకుండ నిలువగా; అటన్= ఆ స్వర్గానికి; పోన్+ఒడఁబడన్= వెళ్ళటకు అంగీకరించను; అని; పలికెన్= అన్నాడు;

తాత్పర్యం: 'ఏ విధంగానైనా ఎప్పటికైనా శరీర పరిత్యాగం తప్పదు కదా! స్వర్గలోకం ఎంతో అందమైనది. ఈ మాత్రం గ్రహించలేవా? కౌశికా!' అని ధర్మమంటే, శరీరాన్ని విడిచి ఆ లోకాలకు వెళ్ళటానికి తాను అంగీకరించనని భూసురుడు సమాధానం చెప్పాడు ధర్మరాజా!

వ. అని పలికిన ధర్మం బతనితో 'నీ వొడలు విడువనొల్లవుపో యమకాల మృత్యువులు వీరె వచ్చిరి; చూడు' మనియె; నయ్యవసరంబున వారలు వచ్చి యమ్మహీసురవరు ముందఱ నిలిచి, తమ్ముం బేర్కొని; రాతని నుద్దేశించి యముండు నీ జపంబు ఫలంబు సిద్ధించె' ననియుఁ, గాలుండు 'నీకు నాకలోకారోహణంబునకుం గాలంబైనం దోఁచితి' ననియును మృత్యువు 'కాలచోదితనై నిన్ను నేఁడు గొనిపో వచ్చితి' ననియుం బలుకుటయు, నమ్మాటలు గీటునం బుచ్చుచు వారల వదనంబులు విలోకించి సవినయ వ్యాహృత స్వాగతుండయి యవ్విప్రుం'డేను మీకు నెప్పని సేయువాఁడ?' నని పలికె; నట్టి యెడఁ దీర్థయాత్రా పరుండైన యిక్ష్వాకుం డచ్చటికి నేతెంచి వార లందరకుం బ్రణతుండై బ్రాహ్మణుం డతిథిగా నిరూపించి యాదర భరితుండై. 140

ప్రతిపదార్థం: అని పై విధంగా; పలికినన్= చెప్పగా; ధర్మంబు= సాకారమైన ధర్మదేవత; అతనితోన్= ఆ కౌశికుడితో; నీవు; ఒడలు= శరీరం; విడువన్= వదలుటకు; ఒల్లవుపో= అంగీకరించవు పోనిమ్ము; యమకాల మృత్యువులు= యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యుదేవత, ఈ మువ్వురు; వీరె= వీరలె (ఈ కనుపించేవారే అని చూపుతూ); వచ్చిరి= నిన్ను చేరారు; చూడుము+అనియెన్= చూడుము అనెను; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; వారలు= ఆ మువ్వురు; వచ్చి= చేరి; ఆ+మహీసురవరు ముందఱన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడి ఎదుట; నిలిచి= నిలువబడి; తమ్మున్= తమను; పేర్కొనిరి= తెలుపు[9] కొన్నారు; ఆతనిన్+ఉద్దేశించి= ఆ కౌశికుడితో; యముఁడు= యమధర్మరాజు; నీ జపంబు ఫలంబు= నీవు చేసే జపకర్మయొక్క ఫలితం; సిద్ధించెన్+అనియున్= ఫలించింది అనీ; కాలుండు= కాలపురుషుడు; నీకున్; నాకలోక+ఆరోహణంబునకున్= స్వర్గలోకమున కెక్కుట కొరకు; కాలంబు+ఐనన్= సమయము కాగా; తోఁచితిన్+అనియును= కనిపించాను అనీ; మృత్యువు= మరణదేవత; కాలచోదితను+ఐ= కాలుడిచేత ప్రేరేపించబడినదాననై; నిన్నున్; నేఁడు= ఈ దినం; కొనిపోవన్+వచ్చితిన్+అనియున్= తీసికొనిపోవటానికి చేరాను అనీ; పలుకుటయున్= అనగా; ఆ+మాటలు= ఆ పలుకులు, ఆ ముగ్గురి వాక్కులు; గీటునన్+పుచ్చుచున్=

తిరస్కారానికి లోనుచేస్తూ; వారల వదనంబులు= ఆ ముగ్గురి మొగాలు; విలోకించి= చూచి; సవినయ వ్యాహృత స్వాగతుండు+అయి= అణకువతో పలికిన స్వాగతవచనం కలవాడై - వారికి స్వాగతం పలికి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఏను= నేను; మీకున్= మీ ముప్పురకు; ఏ+పని= ఏ కార్యం; చేయువాఁడను?= చేయగలవాడను?; అని; పలికెన్= అన్నాడు; అట్టిఎడన్= అట్టి సమయాన; తీర్థయాత్రాపరుండు+ఐన= తీర్థయాత్రలలో ఆసక్తుడయిన; ఇక్ష్వాకుండు= ఇక్ష్వాకుడు అనే మహారాజు; అచ్చటికిన్+ఏతెంచి= ఆ స్థలానికి వచ్చి; వారలు+అందఱకున్= ఆ అందరకు, నల్వురకు కూడా; ప్ర+నతుండు+ఐనన్= బాగా నమస్కరించినవాడు కాగా; బ్రాహ్మణుండు= ఆ నల్వురిలోని కౌశికుడు; అతిథిన్+కాన్= అతిథిత్వమునకు అర్హుడిగా (రాజును); నిరూపించి= గ్రహించి; ఆదరభరితుండు+ఐ= గౌరవంతో నిండినవాడై.

తాత్పర్యం: 'కౌశిక ధర్మదేవతల సంవాదంలో ధర్మదేవత కౌశికుడితో 'నీవు శరీర త్యాగం చేయవు సరే! అరుగో యముడు, అతడి వెంట కాలపురుషుడు, అతడి వెంట మృత్యువు - ముప్పురూ వచ్చారు చూడుము' అన్నది. ఆ సమయాన ఆ ముప్పురూ అక్కడకు చేరి, తమను తాము పరిచయం చేసికొని, ఆ కౌశికుడి ముందు నిలిచారు. ముందుగా యముడు 'నీ జపఫలితం సిద్ధించిన'దని పలుకగా, అనంతరం కాలుడు 'నీవు స్వర్గాన్ని అధిరోహించవలసిన సమయం సమీపించి నేను వచ్చా'నని తెల్పాడు. చివరగా మృత్యువు తాను కాలునిచే ప్రేరణబొంది కౌశికుడిని తీసికొని వెళ్ళుటకు వచ్చినట్లు తెలియపరచినది. అయితే ఆ ముగ్గురి మాటలనూ తిరస్కరిస్తూ ఆ బ్రాహ్మణుడు వారి ముఖాలు చూచి అణకువతో అందరకూ స్వాగతం పలికి 'నేను మీకు ఏ పని చేసి పెట్టగలను?' అని విన్నవించుకొన్నాడు. సరిగా అదే సమయాన తీర్థయాత్రలు చేస్తూ ఇక్ష్వాకుమహారాజు ఆ ప్రదేశానికి ఏతెంచి ఆ నల్గురికీ నమస్కరించాడు. వారిలో కౌశికుడు ఆ రాజును అతిథిగా భావించి గౌరవంతో అతడిని ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: నరుడికి అతని వృత్తి - ప్రవృత్తి విశ్వాసాన్ని కలిగిస్తాయి. దాన్నే ఆత్మవిశ్వాసం అంటారు. అది సమృద్ధిగా సక్రమంగా ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తి ప్రాముఖ్యం ముందు తలవంచవలసిన అవసరం ఉండదు. ఇక్కడ కౌశికుడిలో ఆ ఆత్మవిశ్వాసమే-జపనిష్ఠాతత్పరతవలన సిద్ధించిన విశ్వాసమే అతడిని యమకాలమృత్యువులముందు నిర్భయంగా నిలబెట్టగలిగినది. వారిమాటను సరకు చేయకపోయినా కౌశికుడు కుశలంగా ఉండగలిగాడంటే కారణం వృత్తిపరంగా సిద్ధించిన అజేయమైన ఆత్మప్రత్యయం. అదే ఆత్మశక్తి.

కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయిన సంవాదము (సం. 12-192-2, 3)

క. 'నా కలిమితోడ నిచ్చెద । నీ కెయ్యది యిష్ట?' మనిన నృపతి 'నృపులు దా
నైకపరులు గొనువారలె? । యే కామ్యములయిన నిత్తు నీ వడుగు తగన్.' 141

ప్రతిపదార్థం: నా కలిమితోడన్= నా సంపదనుబట్టి; ఇచ్చెదన్= ఇస్తాను; నీకున్= అతిథివి అయిన నీకు; ఏ+అది= ఏది; ఇష్టము?= కోరబడినది?; అనినన్= అనగా; నృపతి= ఇక్ష్వాకు మహారాజు; నృపులు= రాజులు; దాన+ఏకపరులు= ఇవ్వటంలో మాత్రమే ఆసక్తులు; కొనువారలు+ఎ?= గ్రహించేవారా?; ఏ కామ్యములు+అయినన్= ఏ కోరికలయినను; ఇత్తున్= తీరుస్తాను; నీవు= బ్రాహ్మణుడవైన నీవు; తగన్= ఉచితంగా; అడుగు= అర్థించుము.

తాత్పర్యం: అతిథిపట్ల గౌరవంతో కౌశికుడు ఇక్ష్వాకువును ఉద్దేశించి, 'నాకున్న దాని కనుగుణంగా ఇవ్వగలను. నీ అభీష్టమేమిటి?' అని అన్నాడు. ఆ మాటకు బదులుగా ఆ రాజు విప్రుడితో 'రాజులు దానశీలురు, దానకర్తలు గాని, దానగ్రహీతలు కాగలరా?' అని, 'నీవు అర్థించుము, నీ కామ్యాలు తీరుస్తాను' అన్నాడు.

విశేషం: కొత్తగా ఇల్లు చేరినవాడు తెలియనివాడైనా అతిథి. అతిథిని దేవుడిగా భావించి పూజించుమని మన ఆమ్నాయాల నిర్దేశం. 'అతిథి దేవో భవ' అనే మాట అదే. కౌశికుడు ఆ దృష్టితోనే కొత్తగా వచ్చినవాడిని అతిథిగా భావించి సత్కరించబోయాడు- అభీష్టార్థ ప్రదానంతో.

వ. అనిన విని విప్రుం డవ్విభున కిట్లనియె. 142

ప్రతిపదార్థం: అనినన్= ఇక్ష్వాకుడు పలుకగా; విని= ఆలకించి; విప్రుండు= బ్రాహ్మణుడు - కౌశికుడు; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇక్ష్వాకుమహారాజు అట్లు అనగా విని, బ్రాహ్మణుడు ఈ విధంగా అన్నాడు.

క. 'కొనువారు ప్రవృత్తులు గా । క నివృత్తులు గొందురయ్య? కామ్యంబులు నా
మనమున లే; వే నేమియుఁ । గొన; నిత్తున కాన యధిప! కోరుము తగఁగన్. 143

ప్రతిపదార్థం: అధిప!= ఓ ఇక్ష్వాకు మహారాజా!; కొనువారు= (దానం) గ్రహించేవారు; ప్రవృత్తులు+కాక= ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు కాకుండా; నివృత్తులు= నివృత్తి మార్గంలో ఉన్నవారు; కొందురు+అయ్య= (దానం) స్వీకరిస్తారటయ్యా?; కామ్యంబులు= కోరికలు; నా మనమునన్= నా మనస్సునందు; లేవు= ఉన్నవి కావు; ఏను= నేను; ఏమియున్= దేనినీ; కొనన్= గ్రహించను; ఇత్తును+అ= ఇస్తాను తప్పక; కాన= కావున; తగఁగన్= ఉచితంగా, అర్హంగా; కోరుము= అర్థించుము.

తాత్పర్యం: సంసారచక్రాన బడి వివిధ క్రియలలో ప్రవర్తించేవారు దానాలు స్వీకరిస్తారు తప్ప, సంసారాన్ని దూరంగా నివృత్తిమార్గాన ప్రాపంచిక విషయాలనుండి మరల్చి జీవించేవారు దానం గ్రహిస్తారా? నా మనస్సున ఏ కోరికలూ లేవు. కాగా నేను కోరను, కాని ఈయగలవాడను. తప్పక ఇస్తాను నీవే తగినట్లు కోరుకొమ్ము.

విశేషం: ప్రవృత్తి × నివృత్తి. ప్రాపంచిక విషయాల జోలికి వెళ్ళి, వాటిలో తలదూర్చి, వివిధ ఆలోచనలలో క్రియలలో పాల్గొనటం ప్రవృత్తి. ఇది జనసామాన్య జీవనవిధానం. దీనికి విరుద్ధంగా ప్రాపంచిక విషయాలనుండి ఇంద్రియాలనూ, మనస్సునూ మరల్చి, నిగ్రహించి, ఆత్మజ్ఞానం కొరకు యత్నించటం నివృత్తి. ఇక్కడ బ్రాహ్మణుడు నివృత్తుడు. క్షత్రియుడు ప్రవృత్తుడు.

వ. పూజారూపంబున నిచ్చిన యది యతిథి గైకొనుట యెగ్గుగా' దనుటయు నమ్మనుజపతి 'నీ విచ్చువాఁడవయేని
నీ సకల జపంబు ఫలంబును ని' మ్మనిన నమ్మహీదేవుండు. 144

ప్రతిపదార్థం: పూజారూపంబునన్= సత్కారరూపాన్ని; ఇచ్చిన+అది= ఈబడినది; అతిథి= ఆగంతకుడు; కైకొనుట= స్వీకరించటం; ఎగ్గు+కాదు= కీడు కాదు; అనుటయున్= అన్న తరువాత; ఆ+మనుజపతి= ఆ రాజు; నీవు; ఇచ్చువాఁడవు+అ+ఏని= ఇచ్చేవాడివే అయితే; నీ సకల జపంబు ఫలంబును= నీ మొత్తం జపముయొక్క ఫలితాన్ని; ఇమ్ము= ఇచ్చివేయుము; అనినన్= అనగా; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు.

తాత్పర్యం: సత్కారరూపాన (యాచనకు బదులుగా కాకుండా) ఇచ్చినది స్వీకరిస్తే స్వీకర్తకు ఏ కీడూ ఉండదు' అని కౌశికుడు పలికాడు. కౌశికుడి నిర్బంధంతో ఆ రాజు 'నీవు కేవలం దాతవే అయితే, నీ మొత్తం జపఫలితం నాకిమ్ము' అన్నాడు. దానికి బదులుగా ఆ బ్రాహ్మణుడు (ఇట్లా అన్నాడు).

విశేషం: దానాలు రెండు విధాలుగా ఉండవచ్చును. అర్థించిన తరువాత ఇచ్చేది లోకంలో ప్రసిద్ధమైన దానం. అర్థనతో నిమిత్తం లేకుండా గౌరవపురస్సరంగా పూజోపహారంగా ఇచ్చేది అసామాన్య దానం. దీనిలో గ్రహీతకు, దాన స్వీకర్తకు ఏ ప్రమేయమూ ఉండదు కాబట్టి ఏ కీడూ ఒనగూడే వీలులేదు. ప్రయోజనకాంక్షతో చేసే దానాలు స్వీకరించేవారికి అటువంటి అభయం ఉండ దంటారు పెద్దలు.

క. 'జపఫలమున సగ మిచ్చెద । నృప! యంతయు నైనఁ గొనుము నీ' వనవుడు 'న
జ్జపము ఫలం బెయ్యది?' యని । నృపుఁ డడిగిన నాతఁ 'డేను నిరపేక్షుండన్.' 145

ప్రతిపదార్థం: నృప!= రాజా!; జపఫలమునన్= జపం ఫలితంలో; సగము+ఇచ్చెదన్= సగపాలు ఇస్తాను; అంతయున్+ఐనన్= అంతటినైననూ; నీవు; కొనుము= తీసికొనుము; అనవుడున్= అన్నవెంటనే; ఆ+జపము ఫలంబు= ఆ నీ జపముయొక్క ఫలితం; ఏ+అది?= ఏది, ఏ విధమైనది?; అని; నృపుఁడు= రాజు; అడిగినన్= ప్రశ్నించగా; ఆతఁడు= ఆ కౌశికుడు; ఏను= నేను; నిర్+ఆపేక్షుండన్= కోరిక లేనివాడను.

తాత్పర్యం: 'నీ సకల జపంబు ఫలంబును ఇమ్ము' అన్న ఇక్ష్వాకుమహారాజునకు కౌశికుడి సమాధానమిది - 'జపఫలితంలో సగమిస్తాను రాజా! మొత్తం ఫలితం కావాలి - అన్నా తీసికొమ్ము' అని. దానికి రాజు 'ఇంతకూ ఈ నీ జపఫలితం ఏమిటి?' అని ప్రశ్నించాడు. కౌశికుడి సమాధానం - 'నేను కోరికలు లేనివాడిని' అంటూ ప్రారంభించి కొనసాగిస్తున్నాడు.

విశేషం: రాజు కౌశికుడి నిర్బంధదాతృత్వానికి విసిగినట్లుగా కౌశికుడి జపఫలితం మొత్తం ఇమ్మన్నాడు. విప్రుడు తనమాట మొదట సగమిస్తానని, మళ్ళీ అంతా అయినా తీసికొనుమన్నాడు. ఈ విధంగా ఇక్కడి దాత, గ్రహీత, ఇరువురూ ఒకింత భావావేశంతో వ్యవహరిస్తున్నట్లు తోస్తున్నది.

క. కావున ఫల మిట్టిది యని । భావింప; నెఱుంగ నొరులఁ బనివడి యడుగన్;
నీ వాఫలంబు గొను మది । దా వినఁబడుఁ బిదప ధర్మతత్త్వజ్ఞులచేన్.' 146

ప్రతిపదార్థం: కావున= (కోరికలు లేనివాడను) కాబట్టి; ఫలము= (జపముయొక్క) ఫలితం); ఇట్టిది+అని= ఈ విధమైనది అని; భావింపన్= ఊహించగా; ఎఱుంగన్= తెలియను; ఒరులన్= ఇతరులను; పని+పడి= పనిగట్టుకొని, ప్రయత్నపూర్వకంగా; అడుగన్= ప్రశ్నించను; నీవు; ఆ ఫలంబు= ఆ నా జపఫలితం; కొనుము= గ్రహించుము; అది= ఆ ఫలితమెట్టిదో - అను నీ ప్రశ్నకు సమాధానం; తాన్= స్వయంగా; పిదపన్= అనంతరం; ధర్మతత్త్వజ్ఞులచేన్= ధర్మ స్వభావం ఎరిగినవారిచేత; వినఁబడున్= వినవచ్చును.

తాత్పర్యం: నేను నిరపేక్షకుడను కాబట్టి నా కా జపఫలితపు స్వరూపస్వభాలను గురించిన భావనే కలుగలేదు. ఆ కారణాననే నేను ఇతరు లెవరినీ పనిగట్టుకొని జపఫలిత మేమిటి? - అని అడిగి తెలిసికొనలేదు, ఫలిత మిట్టిది అని తెలియకున్నా దాన్ని స్వీకరించుము. ఆ తరువాత ధర్మతత్త్వవేత్తలు ఆ జపఫలిత మిట్టిది, ఇంతటిది - అని వివరిస్తారు'.

విశేషం: మొదటి నుండి ఈ దాత గ్రహీతలలో సౌముఖ్యం కొరవడినట్లుగా అనిపిస్తుంది. ఇపుడు అదేమిటో తెలియకుండానే దానిని గ్రహించమంటున్నాడు దాత. మరి గ్రహీత ఏ విధంగా స్పందిస్తాడో చూడాలి. గ్రహీత అయినా, తొలుత కోరినపుడు లేని సంశయాన్ని అనంతరం దానసమయాన వెలువరించటం ఎందుకో? మొత్తంమీద దానస్వీకారం చేసేటప్పుడు ముందు వెనుకలు చూడవలసిన అవసరం ఎంతో ఉన్నట్లుగా వీరి వ్యవహారశైలిని బట్టి మనం గ్రహించాలి.

వ. అనుటయు నయ్యినతనయుండు 'ఫలం బిట్టి దని యెఱుఁగ వేనిం గొననొల్ల' ననవుడు నతం డితని కిట్లనియె. 147

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా, అన్న తరువాత; ఆ+ఇనతనయుండు= ఆ సూర్యవంశపు ఇక్ష్వాకు మహారాజు; ఫలంబు+ఇట్టిది+అని= ఫలితం ఇటువంటిది అని; ఎఱుంగవు+ఏనిన్= తెలియవేని; కొనన్+ఒల్లన్= తీసికొనుటకు

అంగీకరించను; అనవుడున్= అన్న పిదప; అతండు= ఆ కౌశికుడు; ఇతనిని= ఈ ఇక్ష్వాకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కౌశికుని సమాధానం విన్న ఇక్ష్వాకుడు ఫలితం తెలియరాని దానిని తాను స్వీకరించటానికి అంగీకరించ నన్నాడు. తరువాత ఆ కౌశికుడు ఇక్ష్వాకుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'నీ వడిగి తేను నిచ్చితి । భూవల్లభ! యింక సత్యమున కూనము గా
దే వరియింపమి?' నావుడు । నా వసుధాధీశుఁ డద్ధరామరవరుతోన్. 148

ప్రతిపదార్థం: భూవల్లభ!= ఓ రాజా!; నీవు= అర్థివైన నీవు; అడిగితి(వి)= అర్థించావు; ఏను= నేను; ఇచ్చితిన్= ఇచ్చాను; ఇంకన్= ఇకమీదట, ఇంత జరిగిన తరువాత; వరియింపమి= ఇష్టపడకుండుట (దానస్వీకారానికి); సత్యమునకున్= సత్యవ్రతానికి; ఊనము+కాదే?= తక్కువ - కొరతకాదా?; నావుడున్= అన్న తరువాత; ఆ+వసుధా+అధి+ఈశుఁడు= ఆ భూమికి అధిపతియైన ఇక్ష్వాకుడు; ఆ+ధరా+అమర వరుతోన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో.

తాత్పర్యం: కౌశికుడు ఇక్ష్వాకుడి తిరస్కారాన్ని తప్పుపట్టుతున్నాడు. 'ఓ రాజా! నీవు అడిగావు. నేను ఇచ్చాను. ఈ అడుగుట, ఇచ్చుట అనే ఈ రెండు క్రియలు జరిగిపోయిన తరువాత ఈ దశలో నీవు - నే నొల్లను అనుట సత్యవ్రత పాలనకు హానికరం కాదా? అట్లా తిరస్కరించటం సత్యానికి కొరత గావించటం కాదా?' అన్నాడు కౌశికుడు. దానికి బదులుగా ఆ మహారాజు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో ఇట్లా పలికాడు.

వ. 'రాజులకు యుద్ధంబు సుకర్మంబు గావున నీతో వివాదయుద్ధంబు సేసితి' ననిన నతండు 'నీవేమి సేసితేమి? యది యట్లుండనిమ్ము.' 149

ప్రతిపదార్థం: రాజులకున్= క్షత్రియులకు; యుద్ధంబు= కయ్యం; సుకర్మంబు= మంచిపని, చేయదగింది; కావునన్= కాబట్టి; నీతోన్= పండితుడవైన నీతో; వివాద యుద్ధంబు= తగవులాడుట అనే కయ్యం; చేసితిన్= చేశాను; అనినన్= అనగా; అతండు= ఆ కౌశికుడు; నీవు; ఏమి+చేసితి(వి)+ఏమి= ఏ దానిని చేశావో ఏమిటో; అది= ఆ చేసింది; అట్లు+ఉండన్+ఇమ్ము= ఆ విధంగానే చేసినది చేసినట్లుగానే ఉండనిమ్ము.

తాత్పర్యం: కౌశికుడి ప్రశ్నకు రాజు సమాధాన మిది: తాను క్షత్రియుడు కాబట్టి క్షత్రియులకు యుద్ధం చేయదగ్గపని కాబట్టి తాను కౌశికునితో తగవులాడుట అనే కయ్యాన్ని చేశాడు. ఈ సమాధానానికి ఆ కౌశికుడి ప్రతివచనమిది: 'నీవు ఏమి చేశావో ఏమో, అది అట్లా ఉండనిమ్ము'.

విశేషం: బ్రాహ్మణ కౌశికుడు, క్షత్రియ ఇక్ష్వాకువు - ఇరువురూ ధర్మకర్మతత్పరులే. ఇరువురకూ పరస్పర గౌరవాదరభావాలు ఉన్నవి. అయినా దానప్రదానం, దానస్వీకారం అనే విషయంమీద వివాద పడుతున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు తమ ధోరణిని సమర్థించుకొనజూస్తున్నారు. క్షత్రియధర్మం ప్రకారం కయ్యం కార్యమే కాబట్టి వాఙ్మయమైన కయ్యం చేశా నంటున్నాడు రాజు.

క. వినుము మిచ్చెద ననియు మియుఁ, । గొనియెద ననియు పలికి పిదపఁ గొనకునికియు, న
త్యనృతంబులు సత్యవ్రత । మునకుం దొలగంగ మనకు భూవర! తగునే? 150

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; ఇచ్చెదను+అని= ఇస్తాను అని పలికి; ఈమియున్= ఈయకుండుటా; కొనియెదను+అని= తీసికొంటాను అని; పలికి= చెప్పి; పిదపన్= ఆ తరువాత; కొనక+ఉనికియున్=

తీసికొనకుండా ఉండటం; అతి+అనృతంబులు= మిక్కిలి అసత్యాలు; మనకున్= గొప్ప రాజుగైన నీకు, మంచి బ్రాహ్మణుడనైన నాకు ఇద్దరికీ; సత్యవ్రతమునకున్+తొలఁగంగన్= సత్యమును పాటించుటనుండి తప్పుకొనుట; తగునే?= ఉచితమా?

తాత్పర్యం: ఓ రాజా! నీవేదో వివాదయుద్ధం చేశాను అంటున్నావు. అయితే ఇది వినుము. ఇస్తానని ఈయకుండటం, తీసికొంటానని తీసికొనకుండా ఉండటం - ఈ రెండు పనులూ మిక్కిలి అసత్యాలు. సద్బ్రాహ్మణుడ నైన నేనూ, క్షత్రియుడవైన నీవూ - ఇద్దరం ఈ విధంగా సత్యవ్రతపాలనకు దూరంగా జరిగిపోవటం తగునా?

విశేషం: 'తగునా?' అనేమాట ఈ పద్యంలో సార్థకం. 'తగు' అనే మాటనుండే 'తగవు' - వ్యవహారంలో 'తగువు' వచ్చాయి. ఉచితమగు అనే అర్థంలో ఈ మాటను ప్రయోగిస్తాం. వాదవివాదాలలో వాక్‌ప్రాగల్భ్యానికి పోయి, ఉచితానుచితాలు మరచే ప్రమాదముంది. ఆ ప్రమాదపుటంచున నిలబడి ఉన్నామని కౌశికుడి హెచ్చరిక.

క. సత్యమ తపమును యజ్ఞము, । సత్యమ వేదంబు దాంతిశాంతులు నగుటన్
సత్యము దొఱఁగుట నిర్మల । నిత్యానుష్ఠానములును నిష్ఫలము లగున్.' 151

ప్రతిపదార్థం: సత్యము+అ= సత్యమే; తపమును= తపస్సూ; యజ్ఞము= యాగం కూడా; సత్యము+అ= సత్యమొక్కటే; వేదంబు= వేదం, జ్ఞానం; దాంతి శాంతులున్= దమనం, నిగ్రహం, కామక్రోధలోభ మోహ మదమాత్సర్యాలు లేకుండటం; అగుటన్= కాబట్టి; సత్యము= సత్యమునే; తొఱఁగుట= విడుచుట; నిర్మల నిత్య+అనుష్ఠానములును= మలినంలేని, ఎప్పుడూ చేసే కర్మకాండలు, జపహోమపూజాదులు కూడా; నిస్+ఫలములు+అగున్= ఫలం, ప్రయోజనం లేనివి ఔతాయి.

తాత్పర్యం: సత్యం సర్వోన్నతమైనది. సత్యవ్రతపాలన చేస్తే తపస్సు చేసినట్లే, యజ్ఞంచేసినట్లే, వేదం తెలిసినట్లే. సత్యవ్రతపాలనే నరుడిలో నిగ్రహాన్ని, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాన్ని జయించగల శాంతినీ కలిగిస్తుంది. అటువంటి సకలధర్మాచరణకు మూలకందమైన సత్యాన్ని విడిచిపెడితే ఇక జపహోమ పూజాపురస్కారాలవంటి నిత్యానుష్ఠానాలూ నిష్ఫలమే అవుతాయి'.

విశేషం: నేల విడిచి సాముచేయలేనట్లే, సత్యవ్రతపాలనలేక మిగిలిన సకల ధర్మకార్య నిర్వహణమూ అసాధ్యమే. కాదని మొక్కుబడిగా, గుడ్డిగా ఇతర సత్కార్యాలూ, ధర్మకార్యాలూ నిర్వహించినా, సత్యవ్రత మొక్కటి లేనప్పుడు మిగిలినవన్నీ నిష్ఫలాలే! ఎందుకంటే సర్వధర్మమూలమూ సత్యమే కాబట్టి.

వ. అనిన విని ధర్మంబు వారల నుద్దేశించి యమాదులు విన 'వీరికి వివాదంబు వలదు. విప్రుండు దానఫలంబును రాజు సత్యఫలంబును బొందువా' రనియె. నట్టియెడ నాకంబు నరాకృతి దాల్చి వచ్చి తన్నెఱింగించి యయ్యిరువుర నాలోకించి 'వాదేల? మీరిద్దఱుం దుల్యఫలప్రాప్తుల రయ్యెద రిట్లు సేయుం'డని పలికె నవ్విభుం 'డట్లేని నితండును నా యిచ్చునది గొనవలయు? ననుటయు నమ్ముని 'యేను దపస్స్వాధ్యాయనిరతుండం బరిగ్రహవిధి యందు విరతుండ.' 152

ప్రతిపదార్థం: అనినన్= కౌశికుడు అట్లు పలుకగా; విని= ఆలకించి; ధర్మంబు= ధర్మాధిదేవత; వారలన్= ఆ కౌశిక, ఇక్ష్వాకులను; ఉద్దేశించి= లక్ష్యముగాజేసి; యమ+ఆదులు= యముడు మొదలగువారు; వినన్= వినునట్లుగా; వీరికిన్= ఈ ఇరువురకు; వివాదంబు= తగవు; వలదు= అక్కరలేదు; విప్రుండు= బ్రాహ్మణుడు - కౌశికుడు; దానఫలంబును= దానము యొక్క ఫలితమును; రాజు= క్షత్రియుడు - ఇక్ష్వాకువు; సత్యఫలంబును= సత్యవ్రతపాలనయొక్క ఫలితమును; పొందువారు+అనియెన్= చేకొనువారు అని పలికెను; అట్టి+ఎడన్= ఆ సమయాన; నాకంబు= స్వర్గము; నర+ఆకృతి= నరుని ఆకారము; తాల్చి= ధరించి; వచ్చి=

చేరి; తన్నున్= తనను; ఎఱింగించి= తెలియపరచి; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరినీ; ఆలోకించి= చూచి; వాదు+ఏల?= వాదము, తగవు ఎందుకు?; మీరు+ఇద్దరున్= మీరు ఇరువురూ; తుల్యఫల ప్రాప్తులరు+అయ్యెదరు= సమానమైన ఫలితమును పొందువారు కాగలరు; ఇట్లు= ఈ విధంగా; చేయుండు+అని= చేయండి అని; పలికెన్= చెప్పెను; ఆ+విభుండు= ఆ రాజు; అట్లు+ఏని= అట్లయితే; ఇతండును= ఈ బ్రాహ్మణుడు కూడా; నా+ఇచ్చునది= నేను ఇచ్చేది; కొనన్+వలయున్= గ్రహించవలెను; అనుటయున్= అన్న పిదప; ఆ+మునిన్= ఆ ఋషి, కౌశికుడు; ఏను= నేను; తపన్+స్వ+అధ్యాయ నిరతుండను= తపస్సునందు, చదువునందు ఆసక్తుడను; పరిగ్రహణవిధియందున్= (దానమును) స్వీకరించు పనియందు; విరతుండన్= విరక్తుడను, అనాసక్తుడను.

తాత్పర్యం: కౌశికుడి పలుకు లాలకించిన ధర్మదేవత ఆ వివాదగ్రస్తులను ఇరువురనూ ఉద్దేశించి యముడు, కాలుడు, మృత్యువు వింటుండగా - వీరికి ఈ తగవులాట వద్దనీ, బ్రాహ్మణుడు దానఫలితాన్ని, క్షత్రియుడు సత్యవ్రత ఫలితాన్ని పొందగలరని పలికాడు. ఆ సమయాన స్వర్గం మానవరూపంలో అక్కడికి వచ్చి తనను తాను తెలియపరచుకొని, ఆ ఇద్దరినీ చూచి 'మీకు తగ వేల? మీరిద్దరూ సమానంగా ఫలితాలను పొందగల'రని చెప్పి ఈ విధంగా చేయు'మన్నది. ఆ రాజు 'అట్లాగయితే ఈ బ్రాహ్మణుడు కూడా నేనిచ్చే దానాన్ని స్వీకరించాలి' అనగా, ఆ విప్రుడు తాను తపస్సు, అధ్యయనం - ఈ రెంటియందే ఆసక్తుడననీ, దానపరిగ్రహణంలో విరక్తుడననీ తన అభ్యంతరాన్ని తెలిపాడు.

క. అనవుడు నరనాథుఁడు 'నా । కును నీకును సరియ కాఁగఁ గోరెద సత్క
ర్మ నిరూఢి మత్సుకృతఫల । మనఘా! కొనవే? యనుగ్రహంబు దలిర్పన్.' 153

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న తరువాత; నరనాథుఁడు= రాజు - ఇక్ష్వాకుడు; నాకును= క్షత్రియుడనైన నాకూ; నీకును= బ్రాహ్మణుడవైన నీకూ; సరి+అ+కాఁగన్= సమానమే అయ్యేటట్లుగా; కోరెదన్= కోరుకొందును; అనఘా!= ఓ పాపరహితుడా! కౌశికుడా!; సత్కర్మనిరూఢిన్= మంచిపనియందలి నిర్ధారణతో; మత్ సుకృతఫలము= నా పుణ్యఫలితము; అనుగ్రహము= దయ; తలిర్పన్= వ్యక్తమగునట్లుగా; కొనవే?= తీసికొనవా? - గ్రహించవా?

తాత్పర్యం: కౌశికుడి అభ్యంతరాన్ని విన్న రాజు కౌశికుడి నుద్దేశించి 'ఓ పాపరహితుడా! నేను నాకూ నీకూ సమత్వం చెడకుండా జాగ్రత్తగా కోరబోతున్నాను. నీవూ మంచిపని అనే నిర్ధారణతో నా పుణ్యఫలాన్ని దయతో దానంగా స్వీకరించుము'. (అని ప్రార్థించాడు.)

విశేషం: రాజు దానగ్రహీతగా, విప్రుడు దానకర్తగా మిగలటం క్షత్రియ ధర్మపరిపాలకుడైన ఇక్ష్వాకునకు మింగుడు పడటంలేదు. అందుకే అతడు బ్రతిమిలాడైనా ఆ విప్రుడిని దానగ్రహీతగా మార్చటానికి యత్నిస్తున్నాడు.

వ. అని ప్రార్థించె నప్పుడు వికృతవేషులగు పురుషు లిరువురు దమలో వివాదంబు సేయుచు వచ్చి 'యవ్విభుండు మనల శాసింప నొడయం' డనుచు నిక్ష్వాకు ముందఱ నిలిచిరి. వారి తెఱంగు వినుము. 154

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ప్రార్థించెన్= వేడుకొనెను; అప్పుడు= ఆ సమయాన; వికృత వేషులు+అగు= వికారమైన దుస్తులు, నగలు గలవారగు; పురుషులు= నరులు; ఇరువురు= ఇద్దరు; తమలోన్= పరస్పరం; వివాదంబు+చేయుచున్= వాదులాడుకొంటూ; వచ్చి= చేరి; ఆ+విభుండు= ఆ రాజు; మనలన్= మన ఇరువురను; శాసింపన్= ఆజ్ఞాపించగా; ఒడయండు= అధిపతి; అనుచున్= అని పలుకుతూ; ఇక్ష్వాకు ముందఱన్= ఇక్ష్వాకు మహారాజు ఎదుట; నిలిచిరి= ఆగారు; వారి తెఱంగు= వారి విధం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: రాజు విప్రుడిని తాను స్వీకరించే దానానికి బదులుగా అతడూ తననుండి దానాన్ని స్వీకరించవలెనని వేడుకొంటూ ఉన్న సమయాన ఇరువురు నరులు వికృతమైన దుస్తులూ నగలూ ధరించి పరస్పరం వాదులాడుకొంటూ ఆ రాజును చూచి 'ఆఁ! ఈ రాజు మనకు శాసకుడు' అంటూ అతడి చెంతకు చేరి ఎదుట నిలబడ్డారు. వారి కథ ఇది.

విశేషం: ఇక్కడ కౌశిక ఇక్ష్వాకు లిరువురూ సమానమైన వాదబలంతో తర్కవితర్కాలతో వివాదంలో మునిగి ఉన్నారు. వారికి జ్ఞానోదయం కావాలి - అంటే మాటలతో సరిగాదని తేలిపోయింది. కాబట్టి ఒక విచిత్రసంఘటన ద్వారా వారివివాదాన్ని పరిష్కార మార్గంవైపు మరలించబోతున్నాడు వక్త.

తే. ఒకఁడు గోదాన మొనరింప నొక్కరుండు । తత్ఫలము వేఁడఁ బ్రీతి నాతండు నొసఁగఁ
గొనినవాఁ డిది దక్కువ దనకు నని త । లంచి యుత్తమ గోయుగళంబు విలిచి. 155

ప్రతిపదార్థం: ఒకఁడు= ఆ ఇరువురిలో ఒకడు; గోదానము+ఒనరింపన్= ఆవును దానం చేయగా; ఒక్కరుండు= మరొకడు; తద్+ఫలము= ఆ గోదాన ఫలితాన్ని; వేఁడన్= అర్థించగా; ప్రీతిన్= ప్రేమతో; ఆతండున్= ఆ గోదాన కర్తకూడా; ఒసఁగన్= ఈయగా; కొనినవాఁడు= స్వీకరించినవాడు; ఇది= ఈ ఫలితం; తనకున్= స్వీకరించిన తనకు; తక్కువ= చాలినది కాదు; అని; తలంచి= ఆలోచించి, ఉత్తమ గోయుగళంబు= మంచి ఆవుల జంటను; విలిచి= కొని.

తాత్పర్యం: వారిలో ఆ తగవులాడుకొనువారిలో ఒకడు గోదానం చేశాడు. మరొకడు ఆ గోదానఫలితం తన కిమ్మన్నాడు. దానకర్త ప్రేమతో దానఫలాన్ని ఆ అర్థికి ధారపోసి ఇచ్చాడు. అయితే ఆ అర్థి తనకు ఆ ఫలితం చాలినదికాదు అనే భావనతో తాను మంచి ఆవుల జంటను కొన్నాడు. (బహుశః దానం కొరకే కావచ్చు.)

వ. సత్ పాత్ర దానక్రియ నిర్వర్తించి తత్ఫలంబు మున్ను దనకు గోదాన ఫలం బిచ్చిన యతని కిచ్చువాఁ డయిన
నతండు గొనువాఁ డయి యుండి కొనక యెడసేసి తిరుగం దిరుగ నప్పుడు ముట్టం బట్టిన వాదు పుట్టిన
వచ్చినవారై; రత్తెఱం గెల్ల నుక్తి ప్రత్యుక్తుల నప్పుడమిరేనికి నేర్పడం జెప్పి; రట్లు సెప్ప వినిన యవ్విభుతోడఁ
దొలుత నొసంగినవాఁ 'డితం డడిగిన నెమ్మిం బ్రతిగ్రహింపఁగా నొసంగితిఁ బ్రతిగ్రహంబొల్లని నన్ను నితండు
నిర్బంధింపం దగునే?' యని చెప్పినఁ బదపటి యాతం 'డితండు గొనియెద నని యొడంబడి కొనమి పాతకం
బగుట కర్మకాండవిదు లెల్ల నెఱుంగుదు' రనవుడుఁ గౌశికుం డిక్ష్వాకు నుద్దేశించి 'వింటె? యప్పురుషుని
వచనంబు'లని పలికి వెండియు. 156

ప్రతిపదార్థం: సత్ పాత్ర దానక్రియ= మంచి అర్హునకు దానమిచ్చుటను; నిర్వర్తించి= చేసి; తద్+ఫలంబు= ఆ దానఫలితాన్ని; మున్ను= పూర్వం; తనకున్; గోదాన ఫలంబు= గోవును దానం చేయగా లభించిన ఫలితమును; ఇచ్చిన+అతనికిన్= తనకిచ్చినవాడికి; ఇచ్చువాఁడు+అయినన్= (తాను) దానం ఇచ్చేవాడు కాగా; అతండు= ఆ తనకు ఇచ్చినవాడు; కొనువాఁడు+అయి+ఉండి= తీసికొనబోయేవాడయి ఉండి; కొనక= తీసికొనకుండా; ఎడ+చేసి= దూరంచేసి; తిరుగన్+తిరుగన్= తిరుగగా తిరుగగా; అప్పుడు= ఆ సమయాన; ముట్టన్+పట్టినన్= నిర్బంధముగా పట్టుకోగా; వాదుపుట్టినన్= (ఇద్దరికీ) తగవులాట పుట్టగా; వచ్చినవారు+ఐరి= చేరినవారైనారు; ఆ+తెఱంగు+ఎల్లన్= ఆ పద్ధతి మొత్తం; ఉక్తి+ప్రతి+ఉక్తులన్= మాట, (దానికి) బదులు మాటలతో; ఆ+పుడమిరేనికిన్= ఆ రాజునకు; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పిరి= తెలిపిరి; అట్లు= ఆ విధంగా; చెప్పన్= చెప్పగా; వినిన ఆ+విభునితోడన్= విన్న ఆ రాజుతో; తొలుతన్+ఒసంగినవాఁడు= మొదట ఇచ్చినవాడు; ఇతండు= ఇతడు (రెండవవాడిని

ఉద్దేశించి); అడిగినన్= అర్థింపగా; నెమ్మిన్= ప్రీతితో; ప్రతిగ్రహింపఁగాన్= స్వీకరించటానికి; ఒసంగితిన్= ఇచ్చాను; ప్రతిగ్రహంబు= దాన స్వీకారం; ఒల్లని నన్నున్= అంగీకరించని నన్ను; ఇతండు= నా దానఫలితమును ప్రతిగ్రహించిన ఈ ఎదుటి నరుడు; నిర్బంధింపన్+తగునే?= బలవంత పెట్టటం ఉచితమా?; అని చెప్పినన్= అని పలుకగా; పిదపటి+ఆతండు= తరువాతివాడు (మొదట గోదాన ఫలగ్రహీత); ఇతండు= ఈ నరుడు; కొనియెదన్+అని= తీసికొంటాను (గోదాన ఫలితాన్ని) అని; ఒడంబడి= అంగీకరించి; కొనమి= గ్రహించకుండటం; పాతకంబు+అగుట= పాపము అగుట; కర్మకాండవిదులు+ఎల్లన్= కర్మకాండలు, యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, వ్రతాలు మొదలయిన పనుల పద్ధతులు తెలిసినవారు అందరూ; ఎఱుంగుదురు= తెలియుదురు; అనవుడున్= అన్న తరువాత; కౌశికుండు= కౌశిక బ్రాహ్మణుడు; ఇక్ష్వాకుని+ఉద్దేశించి= ఇక్ష్వాకు మహారాజును గురించి; ఆ+పురుషుని వచనంబులు= ఆ నరుడి మాటలు; వింటే?= విన్నావా?; అని; పలికి= చెప్పి; వెండియున్= మరలా.

తాత్పర్యం: గోదాన ఫలగ్రహీత, గోదాన ఫలంగా తనకు లభించినది అల్పమని భావించి తాను స్వయంగా రెండు ఆవులను కొని, అర్ఘ్యుడిని ఎన్నుకొని ఆ ఆవుల జంటను అతడికి దానం చేసి, ఆ దానఫలాన్ని తనకు ముందు గోదానఫలాన్ని అర్పించినవాడికి ఈయబోగా అతడు స్వీకరిస్తానని అంగీకరించి, తరువాత స్వీకరించక తప్పించుకొని తిరుగసాగాడు. ఆ తప్పించుక తిరుగాడేవాడిని ఒకనాడు ఆ ఈయదలచినవాడు గట్టిగా పట్టుకొని, గోదాన ఫలాన్ని స్వీకరించుమని నిర్బంధించగా వారిద్దరికీ వాదు పుట్టి, దానిని తీర్చుమని ఈ ఇక్ష్వాకు మహారాజును ఆశ్రయించారు. వారిద్దరూ రాజు దగ్గర తమవృత్తాంతాన్ని జరిగినదాన్ని జరిగినట్లుగా విన్నవించుకొనగా ఆ రాజు వారి వివాదచరిత్రను మొత్తాన్ని విన్నాడు. అపుడు ఆ ఇరువురిలో మొదటివాడు రాజుతో 'ఈతడు అర్థిస్తే, నా గోదానఫలాన్ని తీసికొమ్మని అర్పించాను. నాకు మళ్ళీ ప్రతిగ్రహించే అభిప్రాయం లేదు. అయినపుడు ఈతడు నన్ను నిర్బంధించవచ్చునా?' అని అన్నాడు. ఇక రెండవవాడు 'ఇతడు తీసికొంటాను అని అంగీకరించి, తరువాత ఆ గోదానఫలాన్ని తీసికొనకపోవటం పాపమే అవుతుంది - అని కర్మకాండ తెలిసిన వారందరూ ఎరిగిన విషయమే.' అన్నాడు. ఆ సమయాన కౌశికుడు రాజు నుద్దేశించి 'రాజా! విన్నావా ఆ నరుడి మాటలు?' అని పలికి, ఇంకా ఈ విధంగా అనబోతూ ఉన్నాడు.

విశేషం: వాస్తవానికి ఇది కౌశిక ఇక్ష్వాకుల వివాదాన్ని పరిష్కరించే ఆశయంతో కల్పితమైన కథ. వీరి వివాదపు పోలికలే ఇపుడా ఇరువురు పురుషుల (గోదానఫల గ్రహణప్రతిగ్రహణ సంబంధులు) వాదులోనూ ఉన్నాయి. కాబట్టి ఇక్కడి పరిష్కారమే అక్కడి పరిష్కారం కూడా.

క. 'నృప! నీవు మదీయంబగు । జపము ఫలం బడిగి; తేను సమ్మతి నీఁగా
విపరీత ఫణితు లాడిన । శపియింతుఁ జుమీ! యెఱుంగఁ జాటితి నీకున్.' 157

ప్రతిపదార్థం: నృప!= రాజా!; నీవు; మదీయంబు+అగు= నాకు చెందినదగు; జపము ఫలంబు= జపముయొక్క ఫలితమును; అడిగితి(వి)= అర్థించావు; ఏను= నేను; సమ్మతిన్= అంగీకారంతో; ఈఁగాన్= ఈయగా; విపరీత ఫణితులు= వ్యతిరేకమైన మాటలు; ఆడినన్= పలికినచో; శపియింతున్+చుమీ= శపిస్తాను సుమా!; నీకున్= విపరీతపు మాటలాడే నీకు; ఎఱుంగన్= తెలిసేటట్లుగా; చాటితిన్= ప్రకటించాను.

తాత్పర్యం: 'ఓ రాజా! ఇక్ష్వాకూ! నీవు నా జపఫలితం మొత్తమిమ్మని అర్థించావు. నేను అంగీకారంతో ఈయబోతే ఇపుడు ఏవో వ్యతిరేకమైన మాటలు పలుకుతున్నావు. నీకు ఇదే చాటుతున్నాను - నీవు నా జపఫలాన్ని గ్రహించకపోతే నిన్ను నేను శపిస్తాను సుమా!'

విశేషం: ఇక్కడ 'విపరీతఫణితులు' అనే మాట నేటి మనవ్యవహారంలోవలె 'ఎక్కువ' అనే అర్థంలో వాడబడలేదు. 'వాడు విపరీతంగా కొట్టాడు' వంటి వ్యవహారంలో 'విపరీత' శబ్దాన్ని ఎక్కువ అనే అర్థంలోనే వాడుతున్నాం. కాని, ఆ మాటకు నిజమైన అర్థం వ్యతిరేకం అని. సుఖం × దుఃఖం. ఇక్కడ నీవు గ్రహించుమంటే నీవూ గ్రహించుమని అనటం వ్యతిరేక భాషితమన్నమాట.

తే. అనిన నాతఁడు భయమంది యాత్మలోన । 'నొరుల యీగికి నకట చే యొడ్డకుండు
నట్టి నా కిది వలసెనే!' యనుచుఁ గరము । సాఁచె నవ్విప్పు దెసకు నిశ్చయముతోడ. 158

ప్రతిపదార్థం: అనినన్= అనిన పిదప; ఆతఁడు= ఆ ఇక్ష్వాకు మహారాజు; భయము+అంది= భయపడి; ఆత్మలోనన్= మనస్సులో, తనలో; ఒరుల+ఈగికిన్= ఇతరుల దానమునకు; చేయి+ఒడ్డక+ఉండునట్టి నాకున్= చేయి చాచక ఉండే నాకు; అకట!= అయ్యో!; ఇది= ఈ దాన పరిగ్రహణం; వలసెనే!= చేయవలసి వచ్చెనే!; అనుచున్= పలుకుతూ; ఆ+విప్రుదెసకున్= ఆ బ్రాహ్మణుడి వైపునకు; నిశ్చయముతోడన్= గట్టితలంపుతో; కరము= చేయి (దాన స్వీకారం కొరకు); చాఁచెన్= సారించాడు.

తాత్పర్యం: కౌశికుడి శాపప్రకటనతో ఆ రాజు భయపడి తనలో 'అయ్యో! ఇతరుల దానానికి ఏనాడూ చేయి చాచి ఎరుగని నాకు ఈనాడు ఇతడి నుండి దానప్రతిగ్రహణం కొరకు చేయి చాచవలసివచ్చెనే' అని అనుకొంటూ ఆ బ్రాహ్మణుడివైపు స్థిరసంకల్పంతో తన చేతిని చాచాడు - దాన మిమ్మని.

విశేషం: దాతచేయి పైనా, గ్రహీత చేయిక్రిందా ఉండటం దానక్రియలో తప్పనిసరి. దాత దానాన్ని ప్రకటించి, దానిని తాను వదలుకొంటున్నట్లు గుర్తుగా జలధారను (గ్రహీతచేతిలో) పోసి, ఆ దత్తమైనదానియెడ తన అధికారాన్ని త్యజిస్తాడు. 'నీళ్ళు వదలుట' అంటే స్వత్వాన్ని, అధికారాన్ని వదలటమే - అనే అర్థం - ఈ దానక్రియలోని ఈ ప్రక్రియనుబట్టే వచ్చి ఉంటుంది.

వ. అతండు 'ననేక వర్షంబులు సేసిన జపఫలంబంతయు నీకిచ్చితి' ననుచు ధారవోసిన నమ్మహీసురువరు నాననం బాలోకించి భూపాలుండు 'నా కరంబున జలంబులు వడియె మనకు నిద్దఱకును సత్కర్మ సమత్వంబు గలుగవలదే? నాయదియైన యాగఫలం బేనును నీ కిచ్చెదఁ గైకొను'మని పలికె. నట్టియెడ వికృతవేషులగు నవ్వురుషు లిరువురు నన్నరనాథు నుద్దేశించి 'యేము కామక్రోధులము. ధర్మయమాదులచేతను మాచేతను మీరిద్దఱుం బరీక్షితులరైతి రింతియ కాని యిచ్చుటయుఁ గొనుటయును నివి దైవాచరితంబులు మీకుం బనిగా' దని పలికిన విని యవ్విప్రుండు భూవిభునితో నిట్లనియె. 159

ప్రతిపదార్థం: అతండున్= ఆ కౌశికుడును; అనేక వర్షంబులు= పెక్కు ఏళ్ళు; చేసిన= ఒనర్చిన; జపఫలంబు+అంతయున్= జపముయొక్క ఫలితం మొత్తమును; నీకున్= అర్థివి అయిన నీకు; ఇచ్చితిన్+అనుచున్= దానం చేశాను అంటూ; ధార+పోసినన్= (నీటి చాలును) ధారను విడువగా; ఆ+మహీసురవరు+ఆననంబు= ఆ బ్రాహ్మణుడి మొగము; ఆలోకించి= చూచి; భూపాలుండు= రాజు; నా కరంబునన్= నా చేతియందు; జలంబులు= నీళ్ళు; పడియెన్= పడినవి; మనకున్+ఇద్దఱకును= మన ఇద్దరకూ; సత్+కర్మసమత్వంబు= పుణ్యం సమానమై ఉండటం; కలుగన్+వలదే?= కలుగవద్దా?; నా+అది+అయిన= నాదైన - నాకు చెందిన; యాగఫలంబు= యజ్ఞఫలితము; ఏనును= నేను కూడా; నీకున్+ఇచ్చెదన్= నీకు అర్పిస్తాను; కైకొనుము= తీసికొనుము-స్వీకరింపుము; అని; పలికెన్= అనెను; అట్టి+ఎడన్= ఆ సమయాన; వికృత వేషులు+అగు= వికారమైన గుడ్డలు నగలు మొదలగునవి గల; ఆ+పురుషులు+ఇరువురున్= ఆ నరులు ఇద్దరును; ఆ+నరనాథున్= ఆ రాజును; ఉద్దేశించి= గురించి - లక్ష్యంగాచేసి; ఏము= మేము; కామక్రోధులము= కామం (కోరిక) క్రోధం (కోపం) అనే దుర్గుణాలందు; ధర్మయమ+ఆదులచేతను= ధర్మదేవత, యమధర్మరాజు మొదలైన వారిచేతను; మాచేతను= కామక్రోధులమైన మా ఇరువురిచేతను; మీరు+ఇద్దఱున్= మీరలు ఇరువురూ; పరి+ఈక్షితులరు+ఐతిరి= పరిశోధితులు అయ్యారు; ఇంతి+అ+కాని= ఇంతేకాని; ఇచ్చుటయున్= దానమును; కొనుటయున్=

స్వీకారమును; ఇవి= ఈ రెండు క్రియలూ; దైవ+ఆచరితంబులు= దైవంచేత చేయబడినవి; మీకున్+పని+కాదు+అని= మీకు పనులు కావు అని; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; భూ విభునితోన్= రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రాజు దానస్వీకారం కొరకు చేయిచాచి నిలబడగా బ్రాహ్మణుడు 'పెక్కుఏండ్లు చేసిన జపఫలితం మొత్తం నీకిచ్చా'నంటూ, తనచేతి నీటిని రాజుచేతిలో ధారగా పోశాడు. అప్పుడు రాజు ఆ బ్రాహ్మణుడి మొగం చూచి, 'నాచేతిలో నీళ్ళు పడ్డాయి. నేను దానం తీసికొన్నాను. మరి మన ఇరువురి పుణ్యం సమానంగా ఉండవద్దా? కాబట్టి నేను చేసిన యజ్ఞపు ఫలితాన్ని నేనూ నీ కిస్తాను తీసికొమ్ము' అన్నాడు. ఆ సమయాన ఆ వికృతవేషులయిన నరులిద్దరూ ఆ రాజును ఉద్దేశించి - తాము కామక్రోధాలనే నరుడి అంతశ్శత్రువులు ఆర్గురిలో తొలి ఇద్దరమనీ, తామూ, ధర్మదేవత, యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యు దేవతా -ఈ అందరూ కలిసి ఆ కౌశిక ఇక్ష్వాకులను ఇద్దరినీ పరీక్షించామనీ తెలిపి, ఇదంతా పరీక్షకొరకు సంఘటిల్లినదే తప్ప నిజానికి దానప్రతిగ్రహణాలు అనేవిదైవం చేసే చేష్టితాలు గాని, మానవక్రియలు కాబోవని పలికారు. ఆ పలుకులు విని, కౌశికుడు ఆ రాజుతోఇట్లా అన్నాడు.

విశేషం: దాత చేసే దానాన్ని గ్రహించేవాడు ఆ దానంతోపాటు దాత దుష్కృత్యాల ఫలితాన్నీ తీసికొనవలసి ఉంటుందని ఒక విశ్వాసం. ఎక్కువ దానాలు పాపపరిహారం కొరకే ఉద్దిష్టమైనాయి. మరి పాపం పరిహృతం కావటం ఎట్లు? దాతనుండి గ్రహీతకు అవి సంక్రమిస్తాయని విశ్వసించేవారు. అందుకనే ఈ దానధర్మాలు స్వీకరించకుండా ఉండటం మంచి గొప్ప లక్షణంగా 'అపరిగ్రహ' వ్రతంగా భావించేవారు. దానగ్రహీతలు జపతప ఉపవాసాది క్రియలతో ఆ సంక్రాంతమైన పాపాలనుండి విముక్తులయ్యేవారట!

ఆ. 'శ్రద్ధయును బలంబు జపవిధియందు సా । విత్రి నాకు నిచ్చె వేఱజపము
నాచరింపఁ దగునె? యైనను నిందఱ । యెదుర నీవు గోరి తివ్విధంబు. 160

ప్రతిపదార్థం: సావిత్రి= జపాధిదేవత; నాకున్= జపశీలినయిన నాకు; జపవిధియందున్= జపం అనే పనిలో; శ్రద్ధయును= ఎక్కువ ఆదరమూ; బలంబున్= శక్తి; ఇచ్చెన్= ఇచ్చింది; వేఱు+అ= వేరుగా, విడిగా; జపమున్= జపక్రియను; ఆచరింపన్= చేయటం; తగును+ఎ?= ఉచితమా? - కాదు; ఐనను= కాకపోయినా; ఇందఱ+ఎదురన్= ఇంత మంది ఎదుట, ధర్మయమకాల ప్రముఖుల ముందర; నీవు= నా దానమును స్వీకరించినట్టి నీవు; ఈ+విధంబు= ఈ పద్ధతిగా (పుణ్యాలు సమానాలు కావాలి అంటూ); కోరితి(వి)= అర్థించావు.

తాత్పర్యం: 'నేను జపాధిదేవత సావిత్రీదేవినుండి శ్రద్ధను, శక్తిని జపనిర్వహణ కొరకు దానంగా స్వీకరించి ఉన్నాను. ఇక ఇపుడు వేరుగా జపక్రియ చేయవలసిన పనీ లేదు. నా కోరికలు, యాచనలు, అక్కరలు ఏవైనా ఉంటే, అవి అన్నీ జపంకొరకు ఉద్దిష్టమైనవే. ఆ జపం అవసరమే తీరిన నాకు దానగ్రహణ అవసరమూ ఉండదు. అయినా ఇందరు పెద్దలముందర నీవు మన పుణ్యాలు సమానంగా ఉండవద్దా? - అంటూ నాకు దానమీయ సంకల్పించి అర్థించావు.

విశేషం: లోకంలో కూడా ఎన్నో మొండిగా ఆగిపోయిన పనులు కూడా, కొందరు ప్రముఖుల సమ్ముఖాన ఇట్టే జరిగిపోతూ ఉండటం మనం గమనిస్తాం. అట్లాగే ఇక్కడ కూడా. ఎప్పటినుండో తిరస్కృతమౌతూ వస్తున్న రాజు కోరిక అతడికి అభీష్టమయిన క్రియ, ఇపుడు ఈ ఎదుట పెద్దదేవతల సమక్షాన తీరబోతున్నట్లుగా అనిపిస్తున్నది. కొందరు పెద్దల సమ్ముఖమూ ప్రయోజనకారి మరి!

క. కావునఁ బ్రార్థన సెఱుపం । గా వెఱచెద నట్ల కాక! గైకొంటి ధరి
త్రీవల్లభ! నీ సుకృతం । బే వెంటం దిగిచె నరుగు మీ వగ్గతికిన్.' 161

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ప్ర+అర్థన= గొప్ప కోరిక; చెఱుపన్+కాన్= భంగపరచుటకు; వెఱచెదన్= భయపడతాను; అట్లు+అ= అట్లే, నీవన్నట్లే; కాక!= అగుగాక!; ధరిత్రీవల్లభ!= ఓ రాజా!; నీ సుకృతంబు= నీ పుణ్యం; కైకొంటిన్= స్వీకరించాను; ఈవు= నీవు; ఏ వెంటన్= ఏ మార్గము(న); తిగిచెన్= లాగెనో, ఆకర్షించెనో; ఆ+గతికిన్= ఆ మార్గాన; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ రాజా! నా అవసరంతో నిమిత్తంలేకుండా ఇందరి ఎదుట అర్థించిన నీ కోరికను భంగపరచటానికి వెరచి, నీ పుణ్యాన్ని నేను గ్రహించాను. ఇక నీవు నీకు అభీష్టమైన మార్గాన వెళ్ళుము'. (అన్నాడు కౌశికుడు.)

విశేషం: మొత్తం మీద బ్రాహ్మణ క్షత్రియు లిరువురూ తమతమ అభీష్టాలను నెరవేర్చుకొనగలిగారు. ఒకరు ఆలోచన మెదడు, మరొకరు శక్తి - నిర్వహణ. ఈ రెండూ ఘర్షణపడటం దేశానికి మేలుకాదు. ఘర్షణవైపుగా పయనించినా చివరకు సమన్వయపూర్వకంగా ముగియటమే మేధాభుజశక్తులకు ఉచితం.

వ. అనియె నయ్యిరువుర సత్కర్మనిష్ఠావిశేషంబునం బ్రీతులయి బ్రహ్మాదిదేవతలు వారల మీఁదం బుష్పవృష్టి గురియించుచు నయ్యెడకు నరుగుదెంచి యభినందించిరి; దేవతూర్యంబులు మొరయ నప్సరోగణంబు లాడుచుం బాడుచు నుల్లసిల్లె; నయ్యవసరంబునఁ గౌశికు నిక్ష్వాకు నుద్దేశించి నాకం బిట్లనియె.162

ప్రతిపదార్థం: అనియెన్= అనెను; ఆ+ఇరువుర సత్+కర్మనిష్ఠా విశేషంబునన్= ఆ ఇద్దరి మంచి పనులయెడ (గల) శ్రద్ధాతిశయానికి; ప్రీతులు+అయి= సంతసించినవారై; బ్రహ్మ+ఆది దేవతలు= బ్రహ్మ మొదలగు సురలు; వారల మీఁదన్= ఆ ఇద్దరి మీదా; పుష్ప వృష్టి= పూలవాన; కురియించుచున్= కురిసేటట్లు చేస్తూ; ఆ+ఎడకున్= ఆ స్థలానికి; అరుగు+తెంచి= వచ్చి; అభినందించిరి= ప్రశంసించారు; దేవతూర్యంబులు= దేవతల వాద్యాలు; మొరయన్= మ్రోగగా; అప్సరస్+గణంబులు= అప్సరసల సమూహాలు; ఆడుచున్= నాట్యం చేస్తూ; పాడుచున్= గానం చేస్తూ; ఉల్లసిల్లెన్= ఒప్పారాయి; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; కౌశికున్+ఇక్ష్వాకున్+ఉద్దేశించి= కౌశికుడినీ, ఇక్ష్వాకువునూ గురించి; నాకంబు= స్వర్గం; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణ క్షత్రియు లిద్దరూ ధర్మపుణ్యకార్య నిర్వహణంలో కనబరచిన అరుదైన శ్రద్ధాసక్తులకు బ్రహ్మ మొదలైన దేవతలు సంతోషించి, వారిమీద పూలవాన కురిపిస్తూ అక్కడకు వచ్చి, వారిని అభినందించారు. దేవతల వాద్యాలు మ్రోగాయి. అప్సరసలు వేడుకగా ఆడారు, పాడారు కూడా. ఆ సమయాన స్వర్గం (మానవాకారంతో వారిచెంతనే ఉన్నది ఇంతవరకు) ఆ కౌశికుడినీ, ఇక్ష్వాకువునూ ఉద్దేశించి ఇట్లా అన్నది.

తే. 'అనఘులార! సంసిద్ధుల రయితి రింకఁ । దడయనేటికి? నిర్మలోదాత్తగతికి
నుత్సహింతురుగా' కన్న మత్సరాది । బంధకంబులఁ బోఁ ద్రోచి బ్రాహ్మణుండు. 163

ప్రతిపదార్థం: అనఘులార!= ఓ పాపరహితులారా!; సంసిద్ధులరు+అయితిరి= మంచి సిద్ధిని పొందినవారు అయ్యారు; ఇంకన్= ఇకపై; తడయన్= ఆలసించటం, జాగుచేయటం; ఏటికిన్?= ఎందుకు?; నిర్మల+ఉదాత్తగతికిన్= మలినంలేని గొప్ప గమనానికి-మహాప్రస్థానానికి; ఉత్సహింతురు గాక!= ఉత్సాహం చూపుదురు గాక! - తొందర పడెదరు గాక!; అన్నన్= అనగా; బ్రాహ్మణుండు= కౌశికుడు; మత్సర+ఆది బంధకంబులన్= ఈర్ష్య మొదలైన ముడులను; బంధాలను; పోన్+త్రోసి= తొలగ నెట్టి.

తాత్పర్యం: 'ఓ పాపరహితులారా! మీరిద్దరూ గొప్ప సిద్ధిని పొందారు. ఇక ఆలసించటం ఎందుకు? మహాప్రస్థానానికి-నిర్మలమైన చిట్టచివరి గొప్ప ప్రయాణానికి ఆయత్తం కండి' అని స్వర్గం పలికినవెంటనే బ్రాహ్మణుడు తన ఈర్ష్యాది బంధనాలు తెగనరికికొని, అంతిమయాత్రకు ఉద్యుక్తుడయ్యాడు.

వ. ధర్మయమాదులను నాదిత్య సంఘంబును సవినయ ప్రణామ సహితంబుగా నామంత్రితులం జేసి.164

ప్రతిపదార్థం: ధర్మయమ+ఆదులను= ధర్మదేవత, యముడు మొదలైన వారిని; ఆదిత్యసంఘంబును= దేవ సమూహమును, తమను అభినందింప వచ్చిన వారిని; సవినయ ప్రణామ సహితంబుగాన్= అణకువతో కూడిన నమస్కారాలతో కూడినట్లుగా; ఆమంత్రితులన్+చేసి= వీడ్కొనేవారినిగా చేసి.

తాత్పర్యం: తమను పరీక్షించిన ధర్మదేవతనూ, తదనుయాయులయిన యమకాల మృత్యుదేవతలనూ, తమను అభినందించిన దేవగణాన్నీ అణకువతో నమస్కరిస్తూ వీడ్కొలిపాడు.

కౌశికేక్ష్వాకులు బ్రహ్మపదప్రాప్తి లగుట (సం. 12-193-18)

క. వాయువుల నియతవృత్తి మ । నో యంత్రణ బొమలనడుమ నూల్కొల్పి విచే
ష్టాయిత శరీరుఁడై మూ । ర్ధా యోజితములుగఁ జేసి యత్తలఁ జేర్చెన్. 165

ప్రతిపదార్థం: వాయువులన్= శరీరంలోని గాలులను, ప్రాణ, అపాన, సమానములను; నియతవృత్తిన్= స్థిరమైన వర్తనతో; మనస్+యంత్రణన్= మనస్సును నిగ్రహించటంవలన; బొమల నడుమన్= కనుబొమ్మల మధ్యభాగాన; నూల్కొల్పి= నిల్పి; విచేష్టాయిత శరీరుఁడు+ఐ= చేష్టలు ఉడిగిన దేహం కలవాడై; మూర్ధ+ఆయోజితములుగన్+చేసి= శీర్షమునకు (తలకు) చేర్చబడినవిగా చేసి (గాలులను); ఆ+తలన్= ఆ తలను, తలయందు, కొనభాగాన; చేర్చెన్= చేర్చాడు.

తాత్పర్యం: శరీరంలోని వాయువులను (హృదయాన ప్రాణం, గుదమున అపానం, నాభియందు సమానం) స్థిరమైన నడకతో కనుబొమల నడుమకు తెచ్చి (యోగం ద్వారా), మనస్సును అదుపుచేసి, చేష్టలు ఉడిగిన శరీరంతో, ఆ వాయువులను శీర్షానికి చేర్చి, అక్కడినుండి శీర్షం అగ్రభాగానికి కొనిపోయాడు కౌశికుడు. (యోగవిద్య ద్వారా శరీరపరిత్యాగం చేస్తున్నాడు అన్నమాట. శీర్షాగ్ర భాగం నుండి వాయువులు బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని బయటపడతాయి. అదే శరీరపరిత్యాగం.)

వ. అప్పుడు తదీయ బ్రహ్మరంధ్రోద్గతుండును మహాజ్యోతిర్జ్వాలాకృతియుం బ్రాదేశ మాత్రుండును నగు పురుషు
నెదుర్కొని పరమేష్ఠి సమాధానంబున 'వచ్చితే?' యని పలికి వెండియు. 166

ప్రతిపదార్థం: అప్పుడు= కౌశికుడు శరీరాంతర్గత వాయువులను శిరస్సు అగ్ర భాగానికి చేర్చినప్పుడు; తదీయ బ్రహ్మ రంధ్ర+ఉద్గతుండును= అతడిదైన బ్రహ్మరంధ్రం, మాడుపట్టునుండి పైకెగసినవాడూ; మహాజ్యోతిర్+జ్వాలా+ఆకృతియున్= గొప్ప కాంతియొక్క శిఖ ఆకారం వంటి ఆకారం కలవాడూ; ప్రాదేశ మాత్రుండును= లొడితెడు - చూపుడు వ్రేలిని బొటనవ్రేలిని చాచిపట్టిన కొలత మాత్రం కలవాడు; అగు పురుషున్= అయిన నరుడిని; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; ఎదుర్కొని= ఎదురుగా వచ్చి; సమ్+ఆధానంబున్= అంగీకారంతో; వచ్చితి+ఏ?= వచ్చావా?; అని; పలికి= మాట్లాడి; వెండియున్= మరియును.

తాత్పర్యం: శరీరాంతర్గతవాయువు శిరస్సును చేరి బ్రహ్మరంధ్రంగుండా బయల్వెడలగా, వెంటనే ఆ రంధ్రంనుండి గొప్ప కాంతిశిఖరంవంటి ఆకారంతో లొడితెడు కొలతగల పురుషుడు (ఆత్మ) బయటికి వచ్చాడు. ఆ వచ్చినవాడిని బ్రహ్మదేవుడు ఎదురేగి అంగీకార పూర్వకంగా 'వచ్చావు కదా!' అని పలకరించి, ఇంకా ఇట్లా ప్రసంగించాడు.

విశేషం: శరీరం కంటే భిన్నంగా ఆత్మ ఉన్నదని నమ్మేవారు, ఆ ఆత్మ రూపురేఖల గురించిన వివరాలూ ఇచ్చారు. అవే ఇక్కడ చెప్పబడ్డాయి. ఆత్మ కొలత - లొడితెడు. ఆకారం; జ్యోతిశ్శిఖ - వెలుగుకొన; దానికే పురుషనామం కూడా ఉంటుంది.

తే. జాపకులకు యోగులకును సమమ పుణ్య । గతివిశేషంబు ప్రత్యక్ష కలితమందు
జాపకులు నిర్భరోత్థానశక్తి నధికు । లనుచు వక్త్రంబు విచ్చి రమ్మనియె నధిప! 167

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; జాపకులకున్= జపం చేసేవారికీ; యోగులకును= యోగంచేసేవారికీ; పుణ్యగతివిశేషంబు= పుణ్యంవలన కలిగే విశేషగతులు - గొప్ప పదాలు; సమము+అ= సమానమే; ప్రతి+అక్షకలితము= కన్నుల ఎదుట (ప్రత్యక్షంగా) నిరూపితం; అందున్= ఆ ఇరువురిలో; జాపకులు= జపశీలురు; నిర్భర+ఉత్థాన శక్తిన్= భారరహితంగా పైకెగసే శక్తితో; అధికులు= యోగులకంటె మిన్న అయినవారు; అనుచున్= అంటూ; వక్త్రంబు విచ్చి= నోరు తెరచి; రమ్ము+అనియెన్= 'రా' అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మ జపశీలురకూ యోగులకూ గల సామ్య, ఆధిక్యాలను వివరిస్తున్నాడు కౌశికుడికి. శరీరపరిత్యాగ అనంతరం జపశీలురూ, యోగులూ ఇద్దరూ సమానమైన పుణ్యగతులనే పొందుతారు. అక్కడ భేదం లేదు. అయితే జపశీలురు భారరహితంగా పైకెగసే శక్తికలిగి, యోగులకంటె మిన్నగా నిలుస్తారు. అని అంటూ, 'కౌశికా రమ్ము' అంటూ తన నోటిని తెరిచాడు బ్రహ్మదేవుడు.

వ. అనుటయు. 168

తాత్పర్యం: అనిన పిదప.

తే. బ్రహ్మరంధ్ర నిర్గతుఁడైన బ్రాహ్మణుండు । బ్రహ్మవదనంబు సొచ్చె భూపతియు నట్ల
వెడలి తద్వక్త్ర మెప్పటి వికసనంబుఁ । బొంద నందుఁ బ్రవేశించె భూపవర్య! 169

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠా! ఓ ధర్మరాజా!; బ్రహ్మరంధ్ర నిర్+గతుఁడు+అయిన= బ్రహ్మరంధ్రంనుండి బయల్వెడలిన; బ్రాహ్మణుండు= కౌశికుడు; బ్రహ్మవదనంబు= బ్రహ్మనోరు; చొచ్చెన్= ప్రవేశించాడు; భూపతియున్= రాజుకూడా-ఇక్ష్వాకు మహారాజు కూడా; అట్లు+అ= అట్లే, ఆ విధంగానే, కౌశికునివలెనే; వెడలి= బయటికి (శరీరంనుండి) వచ్చి; తద్+వక్త్రము= అతడి- ఆ బ్రహ్మనోరు; ఎప్పటి వికసనంబు= ఎప్పటివలె తెరచికొనుటను; పొందన్= చెందగా - తెరచికొనగా; అందున్= ఆ నోటిలో; ప్రవేశించెన్= చొరబడ్డాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడి మాట ననుసరించి బ్రాహ్మణుడు ముందుగా బ్రహ్మనోట దూరి, అతడిలో ఐక్యమయ్యాడు. ఆ తరువాత ఇక్ష్వాకుమహారాజుకూడా కౌశికుడివలెనే శరీరాన్ని విడిచి, అతడివలెనే బ్రహ్మనోట దూరి బ్రహ్మైక్యం పొందాడు. ఈ విధంగా చివరకు ఇరువురూ బ్రహ్మలో లీనమయ్యారు.

విశేషం: జనవ్యవహారంలో కూడా 'బ్రహ్మైక్యం కావటం' వంటి మాటలు ఉన్నాయి. ఆ విధానమే వివరించినట్లయినది ఇక్కడ.

క. దేవత లచ్చెరువడి య । ద్దేవుని నయ్యిరువురను నుతించి రజుఁడు సం
భావించె ధర్మమును నవ । నీవర! యప్పరమ విభుఁడు నిరుపమలీలన్. 170

ప్రతిపదార్థం: అవనీవర!= ఓ రాజా!; దేవతలు= సురలు; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; ఆ+దేవునిన్= ఆ బ్రహ్మదేవుడినీ; ఆ+ఇరువురను= ఆ బ్రాహ్మణ క్షత్రియులిద్దరినీ; నుతించిరి= పొగడిరి; అజుఁడు= బ్రహ్మదేవుడు; ధర్మమును= ధర్మదేవతను; సంభావించెన్= గౌరవించాడు; ఆ+పరమ విభుఁడు= ఆ గొప్ప దొర బ్రహ్మదేవుడు; నిర్+ఉపమలీలన్= పోలికలేని రీతిలో. (అనంతర వాక్యానికి అన్వయం.)

తాత్పర్యం: ఈ నరులిద్దరూ బ్రహ్మైక్యం కావటమన్న మొత్తం ప్రక్రియను చూచిన దేవతలు ఆశ్చర్యపోయారు. ఆ బ్రహ్మదేవుడినీ, ఆయనలో లీనమైపోయిన కౌశిక ఇక్ష్వాకువులనూ వారు ప్రస్తుతించారు. అనంతరం బ్రహ్మదేవుడు ధర్మదేవతను - ఈ కార్యక్రమసర్వస్వానికీ ఆదిని నిలిచి నడిపించినదానిని గౌరవపురస్సరంగా వీడ్కొన్నాడు.

వ. తదనంతరంబ యంతర్హితుం డయ్యెఁ; దక్కినవారును నిజస్థానంబుల కరిగిరి; జాపక ప్రకారంబును దదీయ సుగతి విశేషంబులు నెఱింగించితి; నీ వింక నెయ్యది వినవల తనవుడు నాపగాసుతునితోడం గుంతీతనయాగ్రజుండు 'నిరతిశయ జ్ఞానయోగంబు విధంబు వినువాంఛ నాకుం గలదు. సెప్పవే!' యనిన నప్పురుషుం డప్పారవోత్తమున కిట్లనియె. 'మను బృహస్పతి సంవాదం బను నితిహాసంబుగల దది నీయడిగిన యర్థంబునకు బోధకంబయి యుండు నాకర్ణింపుము. మను వాత్మీయగురుం డగు దేవగురునకుం బ్రణమిల్లి యిట్లనియె. 171

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= దానివెంటనే - ధర్మదేవతను వీడ్కొనిన వెంటనే; అంతర్హితుండు= మాయమైనవాడు; అయ్యెన్= ఆయెను; తక్కినవారును= మిగిలినవారు కూడా - ధర్మము, యముడు, కాలం, మృత్యువు, స్వర్గం, కామం, క్రోధం అనే వారు కూడా; నిజస్థానంబులకున్= తమ స్థానాలకు; అరిగిరి= వెళ్ళారు; జాపక ప్రకారంబును= జపం చేసేవారి పద్ధతీ; తదీయ సుగతి విశేషంబులున్= వారి ముక్తి వివరాలూ; ఎఱింగించితిన్= తెలిపాను; నీవు; ఇంకన్= ఇంకనూ; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?+అనవుడున్= వినుటకు ఇష్టపడెదవు?-అన్న పిదప; ఆపగాసుతునితోడన్= నది కుమారుడైన భీష్ముడితో; కుంతీతనయ+అగ్రజుండు= కుంతి కుమారులలో పెద్దవాడు ధర్మరాజు; నిర్+అతిశయ జ్ఞానయోగంబు విధంబు= మించుటలేని (తానే అన్నింటిని మించినదైన) జ్ఞానయోగముయొక్క పద్ధతిని; వినువాంఛ= వినే కోరిక; నాకున్= ధర్మరాజునైన నాకు; కలదు= ఉన్నది; చెప్పవు+ఏ?= చెప్పవా?; అనినన్= అనగా; ఆ+పురుషుండు= ఆ నరుడు - భీష్ముడు; ఆ+పౌరవ+ఉత్తమునకున్= ఆ పురువంశ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; మను బృహస్పతి సంవాదంబు+అను= మను బృహస్పతి సంవాదం అనే పేరుగల; ఇతిహాసంబు= (జరిగిన) చరిత్ర; కలదు= ఉన్నది; అది= ఆ సంవాదం; నీ+అడిగిన+అర్థంబునకున్= నీవు ప్రశ్నించిన జ్ఞానయోగానికి; బోధకంబు+అయి= తెలియజెప్పునదిగా; ఉండున్= ఉండగలదు; ఆకర్ణింపుము= వినుము; మనువు= ధర్మశాస్త్రకర్త అయిన మానవుల ఆదిపురుషుడు; ఆత్మీయగురుండు+అగు= తనకు గురువయిన; దేవగురునకున్= దేవతల గురువైన బృహస్పతికి; ప్రణమిల్లి= నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు ధర్మదేవతకు వీడ్కోలుపలికి, వెంటనే పోలికలేని రీతిలో మాయమైపోయాడు. మిగిలినవారూ తమ తమ స్థానాలకు చేరుకొన్నారు. ఈ విధంగా జపం చేసేవారి పద్ధతీ వారు పొందే ముక్తివిశేషాలు నీకు తెలియపరిచాను. ఇంకా ఏమి వినాలని అభిలషిస్తున్నావు? - అని భీష్ముడు తన మనుమడైన ధర్మరాజును ప్రశ్నించాడు. దానికి బదులుగా ధర్మరాజు తాను జ్ఞానయోగాన్ని - సర్వయోగాలనూ అతిక్రమించిన దానిని వినటానికి ఉవ్విళ్ళూరుతున్నట్లు చెప్పాడు. ఆ మాటకు ఆయన ధర్మరాజుతో 'మను బృహస్పతి సంవాదం' అనే పేరుతో ఒక ఇతిహాసం ఉన్నది. అది నీ ప్రశ్నకు సమాధానంగా ఉపయోగపడుతుంది. వినుము.' అంటూ మను బృహస్పతి సంవాదాన్ని వివరించబోతున్నాడు.

విశేషం: 'యోగము' అనే మాట 'యుజ్' ధాతువునుండి పుట్టినది. దానికి కలుపుట అని అర్థం. వేదాంత పరిభాషలో ఈ యోగశబ్దం ఎక్కువగా వాడబడుతూ ఉంటుంది. దేవుడిని, ముక్తిని పొందే మార్గాలలో కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనే మూడు మార్గాలు సుప్రసిద్ధాలు. కర్మల - యజ్ఞజపతపః ప్రభృతులద్వారా చేరితే కర్మయోగం; భక్తి - భజన - సేవ - కైంకర్యంద్వారా చేరితే భక్తి యోగం; జ్ఞానం - తెలివి - వివేకం ద్వారా, కేవలం బుద్ధివికాసంద్వారా చేరితే జ్ఞానయోగం. ఈ మూడింటిలో జ్ఞానయోగం

దుష్కరమనీ, దుర్గ్రహమని, ఒక పట్టాన అర్థం కానిది అని అంటారు తాత్త్వికులు. దానిని మిగిలిన రెండింటినీ మించిన దానినిగా కూడా పరిగణిస్తారు వారు. అందుకనే ఇక్కడ జ్ఞానయోగ శబ్దానికి నిరతిశయ అనే విశేషణం వాడబడినది.

'ఇతి+హ+ఆస' అనేది ఇతిహాస శబ్ద వ్యుత్పత్తి. దానికి 'అని కదా ఉండెను' అని అర్థం. ఎపుడో జరిగిన సంఘటనను పరంపరగా యథాతథంగా చెప్పుకొచ్చే పద్ధతిలో ఈ శబ్దం రూపుదాల్చినది. జరిగిన సంఘటన కాబట్టి దీనిని చరిత్ర శబ్దానికి పర్యాయంగా కూడా వాడటం జరుగుతున్నది. భారతంలో ఎన్నో ఇతిహాసాలను మనం ఇంతవరకు వింటూ వస్తున్నాం.

మను బృహస్పతి సంవాదము (సం. 12-194-2)

సీ. 'జ్ఞానయోగము కృపాసంపన్న బుద్ధి నా । కెఱిఁగింపవే!' యన్న నెలమి నాతఁ
డతని కిట్లను 'ననఘ! సత్కర్మ యో । గ శ్రద్ధ దానికిఁ గారణం బ
నిష్టంబు ద్రోవను నిష్టంబు దేరను । నరుఁడు కర్మాచరణం బొనర్చు
నెయ్యవి సుఖము లొక్కింత కాలమునకు । నవియు దుఃఖంబులై యావహిల్లు;

ఆ. నింత యెఱిఁగి ఫలమునెడ నిరపేక్షుఁడౌ । నతఁడు సౌఖ్యదుఃఖయమముఁ ద్రోచి
కామముఖ్య విపదకంపిత జ్ఞాన వి । శేషబుద్ధిఁ బరమసిద్ధిఁ బొందు.' 172

ప్రతిపదార్థం: జ్ఞాన యోగము= జ్ఞానం ద్వారా దేవుడి ముక్తిని చేరే మార్గం; కృపా సంపన్న బుద్ధిన్= దయతో కూడిన బుద్ధితో; నాకున్= జ్ఞానార్థినైన నాకు; ఎఱిగింపవు+ఏ?= తెలియజేయవా?; అన్నన్= అనగా; ఎలమిన్= ప్రీతితో; అతఁడు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ మనువునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అనఘ!= ఓ పాపరహితుడా!; సత్+కర్మయోగ(శ్రద్ధ= మంచి కర్మయోగమునందలి శ్రద్ధ; దానికిన్= ఆ జ్ఞానయోగానికి; కారణంబు= హేతువు - కలుగుటకు మూలం; అనిష్టంబు= ఇష్టము కానిది; త్రోవను; త్రోసివేయుటకు; ఇష్టంబు= కోరబడినది; తేరను= తెచ్చుటకు; నరుఁడు= మానవుడు; కర్మ+ఆచరణంబు= పనులను చేయటానికి; ఒనర్చున్= చేయును; ఒక్క+ఇంతకాలమునకున్= అతి స్వల్ప సమయమునకు; ఏ+అవి= ఏవి; సుఖములు= సౌఖ్యాలు - ఆనందమును కలిగించునవో; అవి+అ= అవియే - ఆ సుఖములే; దుఃఖంబులు+ఐ= బాధలై - కష్టములై; ఆవహిల్లును= కలుగును - పరిణమించును; ఇంత= ఈ మాత్రం; ఎఱిఁగి= తెలిసి; ఫలము+ఎడన్= ప్రయోజనం దెస; నిర్+అపేక్షుఁడౌ= అనాసక్తుడౌ- కోరికలేనివాడగు అతఁడు= వాడు; సౌఖ్య దుఃఖమయమున్= సుఖం-దుఃఖం అనే జంటను-ద్వంద్వమును; త్రోచి= తొలగించుకొని; కామ= కోరిక; ముఖ్య= మొదలగు; విపద్= ఆపదలనుండి; అకంపిత= చలించని, కదలని; జ్ఞాన విశేష బుద్ధిన్= గొప్ప జ్ఞానంతోడి బుద్ధితో; పరమసిద్ధిన్= గొప్ప సిద్ధిని, ముక్తిని; పొందున్= చెందును.

తాత్పర్యం: 'మనువు తన గురువైన బృహస్పతికి నమస్కరించి, 'కృపతో నాకు జ్ఞానయోగాన్ని, జ్ఞానంద్వారా ముక్తిని పొందే మార్గాన్ని తెలుపవా?' అని ప్రార్థించాడు. బృహస్పతి తెలుపుతున్నాడు. 'ఓ పాపరహితుడవైన మనూ! జ్ఞానయోగానికి మూలం మంచి కర్మయోగమే. అనిష్టాన్ని తొలగించుకొనటానికి, ఇష్టాన్ని అందుకొనటానికి మానవుడు కర్మ చేస్తాడు. ఏవి సుఖాలుగా అందుతాయో, అవే అనంతరకాలాన దుఃఖాలుగా పరిణమిస్తాయి. ఈ మాత్రం తెలిసికొని ఏ నరుడు తాను చేసే కర్మను ఫలం ఆశించకుండా తన విధిగా మాత్రమే చేస్తాడో - అతడు సుఖదుఃఖ ద్వంద్వాన్ని త్రోసేసి కామక్రోధాది అరిషడ్వర్గంనుండి వాటిల్లే విపత్తులనుండి చెదరని గొప్ప జ్ఞానంద్వారా గొప్ప సిద్ధిని ముక్తిని పొందుతాడు'.

విశేషం: మన తాత్త్వికులు నరుడికి అంతశ్శత్రువులు ఆరుగురు ఉన్నారని అంటారు. ఆ ఆరుగురు శత్రువులకూటమిని వారు 'అరిషడ్వర్గము' అని వ్యవహరిస్తారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు - ఆ ఆరుగురు విరోధులట! ఇవి నరుడిలోని భావాలు కాక భావావేశాలు. ఇవే నరుడిని ముక్తికి దూరంగా ఉంచుతాయని, వీటి విజయమే ముక్తికి సోపానమని బోధిస్తారు. ఇక్కడ 'కామముఖ్య' విపత్తులు ఆ అరిషడ్వర్గం వలన ఏర్పడేవే. జ్ఞానం కలగాలి - అంటే అరిషడ్వర్గ విదూరుడు కావాలి.

వ. అని వెండియు. 173

తాత్పర్యం: అని చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అసమాలంబ మశబ్దము । రసగంధ స్పర్శరూప రహితం బగుటం
బ్రసరించు నింద్రియములకు । వసంబుగా దొందఁ బరమవస్తువు పుత్రా! 174

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; పరమవస్తువు= గొప్ప పదార్థం-బ్రహ్మతత్త్వం - పరమాత్మతత్త్వం; అసమ+ఆలంబము= సాటిలేని ఆధారము-ప్రాపు; అశబ్దము= శబ్దరహితమైనది ఆకాశ లక్షణం లేనిది; రసగంధరూప రహితంబు= రసం,గంధం,రూపం-ఇవి లేనిది; అగుటన్= అగుటవలన; ప్రసరించు= పనిచేసెడి; ఇంద్రియములకున్= కన్ను ముక్కు వంటి జ్ఞానేంద్రియాలకు; ఒందన్= పొందగా, పొందుటకు; వసంబు+కాదు= శక్యం కాదు.

తాత్పర్యం: 'కుమారా! పరబ్రహ్మతత్త్వం సాటిలేనిది, పోల్చి చెప్పటానికి వీలులేనిది, ఆత్మ ఉనికికి ఆధార భూతమైనది-మూలమైనది. అయితే దానిలో పాంచభౌతికమైన-ఐదు మూలపదార్థాలకు చెందిన లక్షణాలు-శబ్దంగాని, ద్రవంగాని, వాసనగాని, స్పర్శగాని, ఆకారంగాని ఏవీ ఉండవు. అందువలన దానిని చెవి, నోరు, ముక్కు, చర్మం, కన్ను-అనే ఈ ఇంద్రియాలు గ్రహించలేవు.

విశేషం: పరతత్త్వం పంచభూతాలతో ఏర్పడినదిగాదు. కాబట్టి నరుడి జ్ఞానేంద్రియాలకు అది అలభ్యం. దాని ఉనికి, ప్రకృతికి-పాంచభౌతికమైన దానికి వెలుపల. అందుకనే దాన్ని గ్రహించటం సులభం కాదు.

క. స్త్రీపుం నపుంసకత్వము । లా పరతత్త్వమున లేమి నది విను తత్త
ద్వ్యాపారాపేతంబయి । దీపించుచునుండు బోధదేహత్వమునన్. 175

ప్రతిపదార్థం: విను; ఆ పరతత్త్వమునన్= ఆ పరబ్రహ్మస్వభావంలో; స్త్రీ పుం నపుంసకత్వములు= ఆడతనం, మగతనం, ఆ రెండూగాని పేడితనములు; లేమిన్= లేకపోవటంవలన; అది= ఆ పరబ్రహ్మం; తద్+తద్+వ్యాపార+అప+ఇతంబు+అయి= ఆయా పనులనుండి - ఆడ, మగ, పేడిపనులనుండి తొలగినదై; బోధదేహత్వమునన్= జ్ఞానం అనే శరీరం (కలిగిన తనం)తో; దీపించుచున్= ప్రకాశిస్తూ; ఉండున్= నిలిచి ఉంటుంది.

తాత్పర్యం: ఆ పరమవస్తువులో ఆడ, మగ, పేడి స్వభావాలు లేవు. ఈ స్వభావాలన్నీ ప్రకృతిలోనివి. అది ప్రకృతికి అతీతం కాబట్టి, ఆయా పనులకు, అంటే ఆడ, మగ, పేడి పనులకు దూరంగా 'జ్ఞానం' అనే దేహంతో వెలుగుతూ ఉంటుంది.

విశేషం: వస్తువును గుర్తించటానికి ఆకారం ముఖ్యం. ఆకారం లేని వస్తువు గోచరించదు. పరబ్రహ్మ నిరాకారమే అయినా, దాని తత్త్వాన్ని వ్యక్తీకరించటానికి, దానికీ ఒక ఆకారమున్నట్లు ఉత్ప్రేక్షించి చెప్పుతున్నాడు బృహస్పతి - స్పష్టమైన అవగాహనకొరకు. అట్లా చెప్పక తప్పదు మరి!

తే. వెలు గుచుండెడి దీపంబు వేఱ వస్తు । వులఁ బ్రకాశింపఁజేయున ట్లలఘునిత్య
బోధన జ్యోతి యింద్రియంబులను మాన । సమును దన ప్రభ విగతజాడ్యములఁ జేయు. 176

ప్రతిపదార్థం: అలఘు నిత్య బోధన జ్యోతి= గొప్ప శాశ్వతమైన జ్ఞానమనే వెలుతురు; ఇంద్రియంబులను= కన్ను, ముక్కు మొదలైనవాటిని; మానసమును= మనస్సును; తన ప్రభన్= తన వెలుగుతో; వెలుగుచుండెడి దీపంబు= ప్రకాశించే దీపం; వేఱ

వస్తువులన్= ఇతర పదార్థాలను; ప్రకాశింపన్+చేయు+అట్లు= కనుపించేటట్లు చేసే విధంగా; విగత జాడ్యములన్+చేయున్= తొలగిన మాంద్యం కలవాటినిగా చేయును.

తాత్పర్యం: ఈ జ్ఞానజ్యోతి గొప్పది, శాశ్వతమైనది. అది తన కాంతితో ఇంద్రియాలను మనస్సునూ వెలిగే దీపం ఇతర వస్తువులను ప్రకాశింపజేసేటట్లుగా - చైతన్యంతో కదిలేటట్లుగా చేస్తుంది. ఇంద్రియాలలోని, మనస్సులోని మాంద్యాన్ని తొలగిస్తుంది.

విశేషం: అలం: ఉపమ. ప్రకాశానికి దీపం కారణమైనట్లుగా నరుడిలోని చేతనాశక్తికి జ్ఞానజ్యోతి మూలం. అదే ఇంద్రియాలనూ, మనస్సునూ నడుపుతుంది.

క. వినుఁ పురుషున కింద్రియములు । మనంబు గలిగించుఁ గ్రియల మనుజేశునకుం
దన తన తెఱఁగునఁ గార్యము । లనేకములు సూపు సచివు లట్టుల వత్సా!' 177

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా!; వినుఁ= ఆలకించుము; మనుజ+ఈశునకున్= రాజునకు; తన తన తెఱఁగునన్= తన తన ధోరణిలో; అనేకములు= పెక్కులు; కార్యములు= పనులు; చూపు= చూపెట్టే; సచివులు+అట్టులన్= మంత్రులవలె; పురుషునకున్= ఆత్మకు; ఇంద్రియములు= కన్ను ముక్కు మొదలైన ఇంద్రియాలూ; మనంబు= మనస్సు; క్రియలన్= పనులను; కలిగించున్= ఏర్పరచును, కలిగేటట్లు చేస్తాయి.

తాత్పర్యం: బిడ్డా! మానవుడు కార్యోన్ముఖుడు కావటానికి అతడి ఇంద్రియాలూ మనస్సూ కారణాలుగా గ్రహించుము. రాజునకు మంత్రులు - ఆతడు నిర్వహించవలసిన విధులను ఎరుకపరచే విధంగా ఇంద్రియాలూ, మనస్సూ నరుడికీ ఏయే పనులు ఎపుడెపుడు చేయాలో తెలియపరుస్తాయి.

విశేషం: పురుషుడు ఆత్మ. అతడు అధిపతి; ఇంద్రియాలూ మనస్సూ అతని ఉపకరణాలు. అతడికి లోబడి ప్రవర్తించి, అతడి చెప్పుచేతలలో నిలువవలసి ఉన్నది'. అలంకారం: ఉపమ.

వ. అని మఱియును. 178

తాత్పర్యం: అని ఇంకా (ఈ విధంగా అన్నాడు.)

చ. 'అనలము దోఁచునే తరువునందుఁ గుఠారముఖంబు లైన సా
ధనములఁ ద్రెవ్వ? సజ్జనహితా! తగఁ ద్రచ్చినఁ గాక; యట్ల యి
త్తనువు నలంగఁ జేసి పరతత్వముఁ గాంతు మనంగ రాదు; వి
న్ననువున నాగమోక్తమథనం బొనరించినఁ గాని యారయన్. 179

ప్రతిపదార్థం: సత్+జనహితా!= మంచిజనులకు మిత్రుడా! ఓ మనూ!; తరువునందున్= చెట్టునందు; తగన్= ఉచితంగా, తగునట్లుగా - చేయవలసిన రీతిలో; త్రచ్చినన్+కాక= మథిస్తే తప్ప; కుఠారముఖంబులు+ఐన= గండ్రగొడ్డలి మొదలైన; సాధనంబులన్= పరికరాలతో; త్రెవ్వన్= పెకలించినట్లయితే; అనలము= నిప్పు; తోఁచును+ఏ?= కనుపించునా? (కనుపించదు); అట్లు+అ= అట్లే ఆ విధంగానే; ఈ తనువున్= ఈ శరీరమును; విన్న+అనువునన్= నేర్పుతో; ఆగమ+ఉక్త మథనంబు= వేదంలో చెప్పబడ్డ; త్రచ్చుటను= తరచి తరచి చూడటం; ఒనరించినన్+కాని= చేస్తే తప్ప; అరయన్= పరిశీలించగా; నలంగన్+చేసి= నలగునట్లుగా చేసి - బాధపెట్టి; పరతత్వమున్= పరమమైన జ్ఞానమును; కాంతుము= పొందెదము; అనంగన్+రాదు= అనుటకు (వీలు) కాదు.

తాత్పర్యం: 'సజ్జనమైత్రిని నెరపే ఓ మనూ! చెట్టులో నిప్పు నిక్షిప్తమై ఉన్నట్లుగా ఈ శరీరంలో పరతత్త్వం గుప్తంగా ఉన్నది. దానిని తగినట్లుగా పద్ధతి తెలిసి గ్రహించాలి తప్ప, తోచినట్లుగా చేస్తే ప్రయోజనం ఉండదు. కర్రలో నిక్షిప్తమై ఉన్న నిప్పును కర్రను కర్రతో మథిస్తే కనిపిస్తుందే తప్ప గొడ్డలితో నరికితేను, పెకలిస్తేనూ కనిపిస్తుందా? ఆ విధంగానే ఈ శరీరంలో దాగి ఉన్న పరతత్త్వాన్ని వేరొక విధానంతో తరచి తరచి చూచి గ్రహించాలి తప్ప, శరీరాన్ని బాధించి, హింసించి గ్రహించలేము.

విశేషం: అలం: నిదర్శనం. ఒక క్రొత్త విషయం గ్రహింపునకు రావటానికి ముందు మళ్ళీ మళ్ళీ ప్రయత్నించవలసిరావచ్చును. మనస్సులో లోపల తరచి తరచి చూడవలసిరావచ్చును. ఈ లోపల తరచి చూచే ప్రక్రియనే 'అంతర్మథనం' అంటుంటాం. దీనికి 'లోపల త్రచ్చుట' అని శబ్దార్థం. ఈ పద్యంలో కూడా 'మథనం' అనే శబ్దమే ప్రయుక్తమై, ఆ అర్థాన్నే స్ఫురింపజేస్తున్నది.

క. డెందమున కింద్రియములకు । నొందఁ గ రాకున్న లేకయున్నే తత్త్వం
బెందు? నపరభాగంబునఁ । బొందవు చూడ్కు లది లేకపోవునె? సుమతీ! 180

ప్రతిపదార్థం: సుమతీ!= మంచి బుద్ధికలవాడా! - మనూ!; డెందమునకున్= మనస్సునకూ; ఇంద్రియములకున్= కన్ను, ముక్కు మున్నగు ఇంద్రియాలకూ; ఒందఁగన్+రాక+ఉన్నన్= పొందరాకుంటే; తత్త్వంబు= ఆ పరతత్త్వం; లేక+ఉన్నే= లేకుండాఉంటుందా?- లేకుండా పోతుందా? (పోదు); చూడ్కులు= చూపులు; అపరభాగంబునన్= ఆవలివైపున, వస్తువునకు వెనుక వైపునకు; పొందవు= చేరవు, అంతమాత్రాన; అది= ఆ ఆవలి భాగం వస్తువుయొక్క వెనుక భాగం; లేకపోవును+ఎ?= లేకుండా పోతుందా? (పోదు).

తాత్పర్యం: ఓ సుమతీ! మనూ! ఆలోచించి చూడుము. మనస్సునకూ, ఇంద్రియాలకూ అందనంతమాత్రాన, ఈ శరీరంలో ఆ పరతత్త్వంలేదు అనటం యుక్తిసహం కాదు. ఎందుకంటే, మన చూపులు వస్తువుయొక్క ఎదుటి భాగాన్నే చూడగలవు తప్ప, అవతలి వెనుకవైపును చూడలేవు. అంతమాత్రాన ఆ వస్తువునకు ఆవలివైపు లేదు అనగలమా? అన్నంతమాత్రాన, అది లేకుండా పోతుందా?

విశేషం: అలం: నిదర్శన.

క. వల యురి యోదము గాలము । గలిగి గదా మృగము పక్షి గజము ఝషము ద
క్షులు వట్టుదు! రట్టుల తద్। జ్ఞులు విజ్ఞానంబుకలిమిఁ జూతురు పురుషున్. 181

ప్రతిపదార్థం: దక్షులు= సమర్థులు; వల= జంతువులను పట్టటానికి ఉపయోగించే త్రాటితో చేసిన సాధనం-వాగుర; ఉరి= ఉచ్చు- కంఠమును బిగించి చంపే సాధనం; ఓదము= ఏనుగును పట్టుటకై త్రవ్విన గుంట (పైకి నేలమట్టంగా కనిపిస్తూ లోన పల్లం గలిగింది); గాలము= చేపలను పట్టే సాధనం - త్రాడు కర్రలతో చివరను ఎరగల్గిన సాధనం (వీటిని అన్నిటిని); కలిగి= సంపాదించి (క్రమంగా); మృగము= పశువును; పక్షి= పులుగును; గజము= ఏనుగును; ఝషము= చేపను; పట్టుదురు కదా!= పట్టుకొంటారు కదా!; అట్టులు+అ= ఆ విధంగానే; తద్+జ్ఞులు= తత్త్వం తెలిసినవారు; విజ్ఞానంబు కలిమిన్= ఎక్కువ జ్ఞానం కలిగి ఉండటంతో; పురుషున్= పరతత్త్వమును, పరమాత్మను; చూతురు= చూస్తారు.

తాత్పర్యం: పరతత్త్వాన్ని వెదికి గ్రహించాలి - అనే సంకల్పమున్నప్పుడు, దానికి అర్హమైన ప్రయత్నం ఉండాలి. అది ఎట్లంటే, నరుడు పశువును బంధించాలంటే వలను, పక్షిని పట్టుకొనాలంటే ఉచ్చును, ఏనుగును పట్టాలంటే పై భాగాన గ్రాసం మొలచిన, లోపల శూన్యంగా ఉన్న గుంటను (ఓదము), చేపను పట్టాలంటే గాలాన్ని సాధనంగా గ్రహిస్తున్నాడు. సరైన సాధనం లేకపోతే లక్ష్యాన్ని సాధించలేడు. అదే విధంగా పరతత్త్వాకారమైన పరమపురుషుడిని దర్శించగలగాలి - అంటే తప్పకుండా నరుడికి జ్ఞానసంపత్తి కావాలి - అని తత్త్వం తెలిసినవారు పలుకుతారు.

విశేషం: అలం: యథాసంఖ్యం, ఉపమ. కార్యసిద్ధికి కర్త అవసరం ఎంత ఉన్నా, కరణం - క్రియాసిద్ధికి ఎక్కువ ఉపకరించే సాధనం కూడా తప్పనిసరి. కరణం లేకుండా కార్యాన్ని సాధించలేము. పరతత్త్వగ్రహణానికి జ్ఞానయోగం తప్పనిసరైన సాధనం. సాధనం లేకుండా సాధ్యం చేరజాలము.

క. పా మెఱుఁగుఁ బాము కాళులు; । ధీమంతుం డెఱుఁగ నేర్చు ధీసాక్షిత్వ
శ్రీమంతుఁ బరమపురుషుని । ధీ మల నిర్మోచనంబు తెఱఁగు నెఱిఁగినన్. **182**

ప్రతిపదార్థం: పాము= పాము; పాము కాళులు= పాముయొక్క కాళ్ళను; ఎఱుఁగున్= తెలియును; (అట్లే) ధీమంతుండు= బుద్ధిమంతుడు; ధీసాక్షిత్వ శ్రీమంతున్= బుద్ధికి సాక్షితనం అనే సంపదగల - బుద్ధికి సాక్షీభూతుడై నిలిచే; పరమపురుషుని(న్)= పరతత్త్వమును, పరబ్రహ్మమును; ధీమల నిర్మోచనంబు తెఱఁగున్= బుద్ధియొక్క మురికిని వదిలించే మార్గమును; ఎఱిఁగినన్= గ్రహించినచో; ఎఱుఁగన్+నేర్చున్= తెలిసికొనగలడు.

తాత్పర్యం: పాము కాళ్ళు పామే గ్రహించగలుగుతుంది. (నిజానికి పాముకు కాళ్ళు ఉన్నట్లు కనిపించవు. కాని నడుస్తుంది కాబట్టి కాళ్ళు ఉన్నట్లే, అయితే ఇతరులకు తెలియవు. పామునకే ఆ ఎరుక - తెలివి ఉంటుంది.)అదే విధంగా, బుద్ధిమంతుడే - జ్ఞానవంతుడే బుద్ధికి సాక్షిగా నిలిచే ఆ పరవస్తువును గ్రహించగలుగుతాడు. ఆ విధంగా గ్రహించగలగాలంటే అతడు (ఆ బుద్ధిమంతుడు) బుద్ధిలోని మురికిని వదిలించే మార్గం తెలిసినవాడై ఉండాలి.

విశేషం: అలంకారం: నిదర్శన. వాస్తవానికి జ్ఞానోదయమనేది వైయక్తికమైన సాధన ద్వారా ఎవరికి వారు పొందవలసినది. అక్కడ బయటివారి ప్రమేయం పరిమితం. కర్మలను ఒకే విధంగా నిర్వహింపజేసినట్లుగా జ్ఞానాన్ని ఒకే విధంగా కలిగించలేము.

క. కలుగుం దోఁపమి యమవసఁ । గలుగునె యంతటన? యమృతకరునకు నాశం
బలఘుతర వస్తువునకుం । గలదె యభావంబు మనసు గానని కలుచన్? **183**

ప్రతిపదార్థం: అమవసన్= అమావాస్యనాడు; తోఁపమి= కన్పింపకుండటం; కలుగున్= జరుగును (అమృతకరునకు); అంతటన్+అ= అంతమాత్రాన; అమృతకరునకున్= చంద్రుడికి; నాశంబు కలుగునె?;= లోపం (కనబడకపోవటం) ఏర్పడుతుందా?; మనసు= (నరుడి) మనస్సు; కానని కలుచన్= చూడ(లే)ని దోషాన; అలఘుతర వస్తువునకున్= మిక్కిలి గొప్ప (పరమమైన) పదార్థమునకు- పరతత్త్వానికి; అభావంబు= లేకపోవటం - ఉండకపోవటం - లేమి; కలదు+ఎ?= ఉన్నదా? (లేదు.)

తాత్పర్యం: అమావాస్యనాడు చంద్రుడు కనిపించడు. అంతమాత్రాన చంద్రుడు లేడు అనగలమా? ఆ మాత్రానికే చంద్రుడి ఉనికికి భంగం కలుగుతుందా? కేవలం నరుడి మనస్సు చూడలేని దోషం కారణంగా ఆ పరతత్త్వమే లేదని ఆ మహావస్తువునకే అభావాన్ని (లేనితనాన్ని) ఆపాదించటం కూడదు.

విశేషం: అలం: నిదర్శన. గ్రహించటం అనే క్రియ ఇక్కడ మనస్సునకు చెందింది. మనస్సు గ్రహించలేకపోతే అది దాని దోషమే తప్ప, అవతలి వస్తువుయొక్క లేమిని తెలపటం కాబోదు.

క. రవిబింబము రాహువు పయిఁ । గవిసినఁ బాసినను దోఁపకయుఁ దోఁచియు నుం
డు విధమ యజ్ఞానంబున । యవిరతి విరతుల యధీనుఁ డగు టాత్మునకున్. **184**

ప్రతిపదార్థం: ఆత్మునకున్= పరమాత్ముడికి; అజ్ఞానంబునన్= జ్ఞానంలేకపోవటంవలన; అవిరతి విరతుల+అధీనుఁడు+అగుట= ఉండటం, ఉండకపోవటాలకు లోబడినవాడగుట (ఎట్లంటే); రవిబింబము= సూర్యబింబం; రాహువు= రాహుగ్రహం; పయిన్+కవిసినన్= పైబడినపుడు; పాసినను= విడిచినపుడూ; తోఁపకయున్= కనిపించక; తోఁచియున్= కనిపిస్తూ; ఉండు విధము+అ= ఉండే విధమే.

తాత్పర్యం: సూర్యబింబాన్ని రాహువు కప్పివేసినప్పుడు అది కనిపించదు. రాహుగ్రహం విడిచిపెట్టినప్పుడు అది కనిపిస్తుంది. ఇక్కడ సూర్యబింబం ఎప్పుడూ ఉన్నది. అది కనిపించటం, కనిపించకపోవట మన్నది దానిని కప్పిన రాహువువలన జరుగుతున్నది. అదే విధంగా అజ్ఞానం కప్పివేసినప్పుడు ఆత్మ కనిపించదు. అది విడిచినపుడు కనిపిస్తుంది. అంతే తప్ప, ఆత్మ శాశ్వతమైనది. ఎప్పుడూ ఉండేదే.

విశేషం: తత్త్వదర్శనం, సమ్యగ్‌దర్శనం అనే మాటలు మనం వింటుంటాం. కేవల దర్శనం వేరు. కనిపించేది నిజం కావలసిన పనిలేదు. ఆ విషయం మనకు దూరపు కొండలు మొదలైన చోట్ల తెలుస్తూనే ఉన్నది. అందుకనే తత్త్వదర్శనం, సమ్యగ్‌దర్శనం కావాలి. నిజమైన దాన్ని చూడటమే అది. ఆ తత్త్వదర్శనానికి ఆటంకాన్ని ఉపమానపూర్వకంగా వివరించాడు వక్త. అలంకారం- నిదర్శన.

క. వినుఁ మానస ప్రసన్నతఁ । దనుఁ గను పురుషుండు గలుషతం గానఁడు దే
తిన నీట రూపు సూడఁగ । ననువై కలఁక నది లేని యట్టుల పోలెన్. 185

ప్రతిపదార్థం: తేటిన నీటన్= మురికిని వదలిన నీటిలో; రూపు= ఆకారం; చూడఁగన్= చూడటానికి; అనువు+ఐ= వీలయి; కలఁకన్= మురికియందు (మురికినీటిలో); అది= ఆ 'చూడగ'నవు - చూచుటకు వీలు; లేని+అట్టుల పోలెన్= లేనట్లుగా; పురుషుండు= ఆత్ముడు; మానస ప్రసన్నతన్= మనస్సుయొక్క నిష్కల్మషత్వమునందు, మనస్సు కలతలేక నిర్మలంగా ఉన్నప్పుడు; తనున్= తనను; కనున్= చూస్తాడు; కలుషతన్= కల్మషత్వమున, కలత చెందినప్పుడు; కానఁడు= చూడలేడు; వినుఁ= ఆలించుము.

తాత్పర్యం: జ్ఞానయోగం మానసిక ప్రక్రియ. ఆత్మజ్ఞత, అనాత్మజ్ఞత - రెండూ మానసిక చర్యలే. అందువలన మనస్సు కలతదేరి, కల్మషానికి దూరమై, నిర్మలంగా ఉన్నప్పుడు పురుషుడు ఆత్మజ్ఞుడు కాగలడు. తనను తాను గ్రహించగలడు. అయితే అదే మనస్సు కలతతో, క్షుభితమై ఉన్నప్పుడు మాత్రం అతడు ఆత్మజ్ఞానాన్ని పొందలేడు. అనాత్మజ్ఞుడుగా, అజ్ఞానిగా మిగిలిపోతాడు. అది ఎట్లంటే, తేరిన నీటిలో రూపు కనిపిస్తుందిగాని, మురికి నీట కనిపించదు కదా!.

విశేషం: అలం: ఉపమ.

తే. ఇంద్రియంబులు దమ యిచ్చ నిట్టనట్టుఁ । దిరిగె నేనియు దుఃఖముల్ దెచ్చు నవియ
కట్టువడి సుఖ మొనరించుఁ గాన యాత్మఁ । గావ వలయు నింద్రియచోరగణము వలన. 186

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు ఐదు - కర్మేంద్రియాలు ఐదు - వెరసి పది ఇంద్రియాలు: కన్ను ముక్కు మొదలయినవి, కాలు, చేయి లోనయినవి - రెండు విధాలయినవి; తమ ఇచ్చన్= తమ తమ కోరికతో; ఇట్టున్+అట్టున్= ఇట్లా, అట్లా-ఎట్లా కావాలంటే అట్లా అదుపు ఆజ్ఞా లేకుండా; తిరిగెన్+ఏనియున్= తిరిగితే-వాటి వాటి పనులలో మునిగిపోతే; దుఃఖముల్+తెచ్చున్= కష్టాలను తోడ్కొని వస్తాయి; అవి+అ= అవే ఆ ఇంద్రియాలే; కట్టు+పడి= (ఆత్మ) ఆజ్ఞకు లోబడి; సుఖము+ఒనరించున్= సంతోషం కలిగిస్తాయి; కానన్= కాబట్టి; ఆత్మన్= ఆత్మను; ఇంద్రియ చోర గణమువలనన్= ఇంద్రియాలు అనే దొంగలముఠా నుండి; కావన్+వలయున్= రక్షించాలి.

తాత్పర్యం: ఇంద్రియాలు (నరుడి) అదుపు ఆజ్ఞలలో ఉండక, స్వేచ్ఛగా నిరాటంకంగా తమతమ పనులు తాము చేసికొంటూ పోతే చివరకు దుఃఖాలు కష్టాలు, వెతలు, వేదనలూ తప్పవు. అయితే అవే ఇంద్రియాలు నిగృహీతాలై- అదుపు చేయబడినవై సంచరిస్తే సుఖాలూ, సంతోషాలూ, శాంతి సౌభాగ్యాలూ కలిగిస్తాయి. అందువలన ఆత్మను ఇంద్రియాలు - అనే దొంగల ముఠాబారిన పడకుండా రక్షించుకొనాలి.

విశేషం: అలం: కావ్యలింగం.

క. పాప క్షయమున బోధం । బాపాదింపఁబడి మెఱుఁగుటద్దము కరణిం
జూపునకు వచ్చుఁ దనుఁ దా । నా పురుషుఁడు గాంచు పనికినై తన్మయతన్. 187

ప్రతిపదార్థం: పాపక్షయమునన్= పాపం, చెడుపనులు, ఊహలు నశించటంవలన; బోధంబు= జ్ఞానం; ఆపాదింపఁబడి= సంపాదించబడి (కలిగి); మెఱుఁగు+అద్దము కరణిన్= మెరిసే (నిర్మలమైన అద్దంవలె; ఆ పురుషుఁడు= ఆ పరమాత్మ (నరుడిలో అంతర్లీనంగా ఉన్నవాడు); తనున్= తనను; తాన్= తాను; కాంచు పనికిన్+ఐ= దర్శించే కార్యం కొరకై చూచేటందుకై; తద్+మయతన్= ఆ పరమాత్మతో ఐక్యమొందినదై; చూపునకున్+వచ్చున్= (కంటి) చూడ్కికి వీలౌతుంది - అగుపడుతుంది.

తాత్పర్యం: పాపాలు నశిస్తే జ్ఞానం కలిగి, మెరుగుటద్దంవలె ప్రకాశిస్తూ ఉంటుంది. అపుడు ఈ శరీరంలోని ఆత్మ తనను తాను దానిలో చూచుకొనగలుగుతుంది - జ్ఞానం ఆత్మలో ఐక్యమౌతుంది.

విశేషం: అలం: ఉపమ. పాపపుణ్యాలు రెండూ కర్మజన్యాలు - కర్మలవలన ఏర్పడేవి. కర్మలు ఇంద్రియజన్యాలు - ఇంద్రియాలద్వారా జరిగేవి. కాబట్టి పాపక్షయం కావాలంటే నరుడి క్రియలు నిష్కల్మషాలు కావా లన్నమాట. ఆ స్థితి ఇంద్రియనిగ్రహానికి తార్కాణం.

తే. ధ్యానయోగ నిశ్చల మగు నంతరంగ । మెడలవిడుచు గుణంబుల నిద్ధశాంత
మైన నిర్గుణవస్తువునందుఁ గలయుఁ । బరమపద మది; దానికిఁ బరము లేదు.' 188

ప్రతిపదార్థం: ధ్యాన యోగ నిశ్చలము+అగు= ధ్యానయోగంతో చలనం లేనిదైన; అంతర్+అంగము= లోపలి అవయవం, మనస్సు; గుణంబులన్= తమస్సు, రజస్సు, సత్త్వం - అనేమూడు సహజగుణాలను - స్వభావాలను; ఎడలన్+విడుచున్= దూరంగా వదలును; (తరువాత) ఇద్ధ శాంతము+ఐన= దీప్తమైనది - ప్రకాశించేదీ శాంతిని పొందినదీ అయిన; నిర్+గుణ వస్తువునందున్= గుణ రహితమైన (పరమాత్మ) పదార్థమున; కలయున్= చేరుతుంది; అది= ఆ కలయిక; పరమ పదము= శ్రేష్ఠమైన స్థితి; దానికిన్= ఆ స్థితికంటె; పరము= అవతలిది - శ్రేష్ఠమైనది; లేదు= ఉండదు.

తాత్పర్యం: నరుడి లోపలి అవయవమే అంతరంగం. అది సహజంగా చలనశీలి. అయితే ధ్యానయోగం ద్వారా ఆ అంతరవయవాన్ని - మనస్సును వశపరచుకొని, దాని చలనాన్ని నిరోధించగలిగితే అపు డది నరుడి స్వభావాలైన తమస్సు, రజస్సు సత్త్వం - అనే గుణాలు మూడింటినీ విడిచిపెట్టి, తాను పరతత్త్వంలో శాంతమై దీపించే ఆ పరమాత్మలో లీనమైపోతుంది. అదే పరమపదం. దానిని మించిన దేదీ లేదు'.

విశేషం: మనస్సు నిశ్చలత్వాన్ని పొందటమంటే పరమాత్మలో లీనమవటంకంటె వేరుగాదు. ఆ నిశ్చలత్వం ధ్యానంద్వారా సాధ్యమంటున్నాడు బృహస్పతి. అనంతర వృత్తాంతాన్ని వివరిస్తున్నాడు - మరొక ప్రసంగానికి ముందుమాట పలుకుతున్నాడు వక్త.

వ. అని పలికి సమ్యగ్జ్ఞానంబునకు మాయ మాటు గావున దాని మొఱంగు తెఱంగు దేటపఱుపం దలంచి యిట్లనియె. 189

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సమ్యక్+జ్ఞానంబునకున్= సరియైన తెలివికి (జ్ఞానయోగానికి); మాయ= అవిద్య; మాటు+కావునన్= చాటు కాబట్టి; దాని మొఱంగు తెఱంగు= దాని వంచన పద్ధతి - మోసగించే తీరు; తేటపఱుపన్+తలంచి= స్పష్టపరిచేటందుకు యోచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: జ్ఞానయోగ ప్రసంగ మిది. జ్ఞానం ఆభాస రూపాన కూడా ఉండవచ్చును. అపు డది జ్ఞానం కాజాలదు. అందుకని మంచి జ్ఞానం పొందాలంటే దానికి ముందుగా జ్ఞానాన్ని దాచే లక్షణంగల మాయను గురించి వివరించాలి.

మాయ నరుడిని వంచించే తీరుతెన్నులు తేటగా తెలియజెప్పాలని బృహస్పతి సంకల్పించి, మనువుతో ఇట్లా ప్రసంగించాడు.

బృహస్పతి మనువున కుపదేశించిన మాయాప్రకారము (సం. 12-198-1,2)

క. 'వినుము మాయావిధ మిట్టిది । యని యారయ వెరవుగలుగ దవనిం జరణం
బనఘా! మోపని జంతువు । సను చొ ప్పరయంగ రాని చందం బొందున్. 190

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా! మనూ!; వినుము= ఆలకించుము; మాయావిధము= మాయయొక్క - అవిద్యయొక్క పద్ధతి; ఇట్టిది+అని= ఈ విధమైనది అని; ఆరయన్= పరిశీలింపగా; వెరవు= ఉపాయము; కలుగదు= లేదు; అవనిన్= భూమిని; చరణంబు= కాలు; మోపని= ఆనించని; జంతువు+చను చొప్పు= మృగం వెళ్ళే తీరు; అరయంగన్+రాని= చూడరాని; చందంబు= పద్ధతి, ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: 'మాయ ఈ తీరున ఉంటుంది, ఇట్లా సంచరిస్తుంది - అనటానికి, అని తేల్చి చెప్పటానికి మార్గమే- ఉపాయమే లేదు. భూమిమీద కాలుమోపని జంతువు నడకను ఏమని ఎంతగా వర్ణించగలమో ఈ మాయ తీరుతెన్నులనూ ఆ విధంగా, అంతగా వివరించగలం.

విశేషం: అలం: ఉపమ. మాయ లీలలు వర్ణనాతీతమైనవి. అనుభవైకవేద్యాలే తప్ప అవి ప్రకటనలకు అనువైనవీ లోబడినవీ కావుమరి!

క. గుణమూర్తి మాయ దానిని । గణుతించెద నన్నఁ దెగడు; గ్రాహ్యత్వంబున్
గుణములఁ బెడఁబాపంగా । గణనాతీతమగు వెలుఁగు గనుఁ దాన తనున్. 191

ప్రతిపదార్థం: మాయ= అవిద్య; గుణమూర్తి= గుణములు (తమస్సు, రజస్సు, సత్త్వములు) ఆకారంగా కలది; దానిని= ఆ మాయను; గణుతించెదను+అన్నన్= లెక్కిస్తాను అనినచో- లెక్కలోనికి తీసికొనబోతే; గ్రాహ్యత్వంబున్= గ్రహించదగిన తనమును; తెగడున్= తిరస్కరిస్తుంది (మాయ కర్త); గుణములన్= ఆ మూడు గుణాలను; పెడన్+పాపన్+కాన్= పెడగా - ప్రక్కగా తొలగించినచో; తనున్= తన్ను; తాను+అ= తానే; గణన+అతీతము+అగు వెలుఁగు= లెక్కకు మించినదైన కాంతిని; కనున్= చూస్తుంది, పొందుతుంది.

తాత్పర్యం: మాయ లీలలు వర్ణనకు లొంగనివే అయినా, దానికి ఆకారమున్నది. నరుడిలోని మూడు గుణాలు- తమస్సు, రజస్సు, సత్త్వము అనేవే దాని శరీరం. వాస్తవాన్ని గుర్తించి దానిని పరిగణనలోనికి తీసికొందామనుకొంటే వీలుపడదు. ఎందుకంటే తనను ఇతరులు గ్రహించటాన్ని అది అంగీకరించదు. ఫలితంగా మనం దానిని గ్రహించలేము. అయితే ఆ మూడు గుణాలను దూరంగా నెట్టివేయగలిగితే లెక్కకురాని గొప్పవెలుగును చూడవచ్చును.

విశేషం: 'మాయ' విడిగా ప్రత్యేకంగా ఉండదు. అది నరుడిని అంటికొని అతడిలో భాగంగానే ఉంటుంది. అతడి భావంలో, భాషలో, పనిలో కనిపిస్తూ ఉంటుంది. దానినుండి బయటపడటమంటే, మూడు గుణాలనుండి ముక్తి పొందటమే.

తే. వినుము నృప! సత్త్వమును రజస్సును దమస్సు । ననఁగ గుణములు ముప్పిరిగొనుచు నాత్మఁ
జుట్టుకొను నొండుమొయిఁ దెగ విట్టలముగ । నొలయు వైరాగ్య మను కొడవలిన కాని.' 192

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; సత్త్వమును= ఆ పేరుగల ఒక గుణమూ (ఇది తెల్లనిదనీ, మిగిలిన రెండు గుణాలకంటే ఉత్తమమనీ తాత్త్వికులు పల్కుతారు); రజస్సును= ఆ పేరుగల మరొక గుణమూ (ఇది ఎర్రనిదనీ, చివరి దానికంటే మంచిదనీ వారే అంటారు); తమస్సున్= ఆ పేరుగల చివరి మూడవ గుణమూ (ఇది నల్లనిదనీ, మిగిలిన రెండింటికంటె

తక్కువదనీ వారే చెప్పుతారు); అనఁగన్= అనే; గుణములు= మానవ స్వభావాలు; ముప్పిరికొనుచున్= మూడు పరస్పరం పెనవేసికొంటూ; ఆత్మన్= ఆత్మను పురుషుడిని; చుట్టుకొనున్= ఆవరించుకొంటాయి; ఇట్టలముగన్= ఎక్కువగా; ఒలయు= అతిశయించే; వైరాగ్యము+అను కొడవలిని+అ= విరాగితనం, కోరికలు లేని తనం అనే కొడవలితో; కాని= తప్ప; ఒండు మెయిన్= ఒక విధంగా; మరొక విధంగా; తెగవు= తెగిపోవు - నశించవు - ఆ మూడు గుణాలు అనే తాళ్ళు.

తాత్పర్యం: ఓ రాజా! మనూ! వినుము. ఆత్మను మాయ ఆవరించి ఉన్నది. ఎట్లంటే, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు మూడు పురులుగా కలిసి ఆత్మను చుట్టుకొని ఉన్నాయి. ఆ ముప్పిరి (మూడు పురులు) తెగవేయాలంటే గొప్ప వైరాగ్యమనే కొడవలి కావాలి. దానితో తప్ప ఇతర విధాల ఆ మాయను తెగటార్చజాలము'.

విశేషం: అలం: రూపకం.

వ. అని నిర్దేశించి వెండియు. **193**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; నిర్దేశించి= ఉపదేశించి; వెండియున్= మరలా.

తాత్పర్యం: అని ఉపదేశించి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'మణిమయములుఁ గనకమయములు రజతమ । యములు మఱియు మృణ్మయాదికములు
నైన పెక్కుపూసలందుఁ ద్రాడున్నట్లు । భూతకోటియందుఁ బురుషుఁ డుండు. **194**

ప్రతిపదార్థం: మణి మయములు= మణులతో, విలువైన రాళ్ళతో చేయబడినవి; కనక మయములు= బంగారంతో ఏర్పడినవి; రజత మయములు= వెండితో నిండినవి; మఱియున్= ఇంకను; మృత్+మయ+ఆదికములున్= మట్టితోడివీ మొదలైనవి; ఐన= అగు; పెక్కు= బహువిధములయిన; పూసలందున్= పూసలలో; త్రాడు+ఉన్న+అట్లు= (మధ్యన) త్రాడు (ఆధారంగా) ఉన్న విధాన; భూతకోటియందున్= జీవ సమూహమునందు; పురుషుఁడు= ఆత్ముడు; ఉండున్= నివసిస్తాడు.

తాత్పర్యం: హారాలు అనేక విధాలుగా ఉంటాయి. మణిహారాలు, బంగారు గొలుసులు, వెండి హారాలు, మట్టివీ-గొలుసులు రకరకాల ఆకారాలలో రంగులలో బరువులలో ఉంటాయి. అయితే ఈ అన్నింటా ఒకటి సామాన్యంగా సమానంగా ఉంటూనే ఉంటుంది. అది దారం- సూత్రం. ఈ మణులూ, బంగారాలూ, వెండులూ, మట్టీ గొలుసుగా ఏర్పడటానికి ఒక ఆధారం ఆ దారం - తాడు. అది లేకుండా ఇవి తమ తమ ఆకారాలతో ఉండలేవు. అదే విధంగా సృష్టిలోని జీవరాసులు అన్నింటా ఆత్మ సంధానకర్తగా ఉంటుంది. ఆత్మ లేకుండా జీవులకు ఉనికి లేదు, మనికీ ఉండదు.

విశేషం: అలం: ఉపమ. హారం రూపుదాల్చటానికి సూత్రం కారణం. జీవుల ఆకారచేష్టలు అన్నిటికీ ఆత్మ ఆధారం. సూత్రం లేకుండా హారమూ, ఆత్మ లేకుండా జీవులూ ఉండటానికి వీలులేదు.

క. ఏకరసమయ క్షేత్ర మ । నేకౌషధి రసమయం బయినయట్లు సుమీ
యేకవిధమైన బుద్ధి య । నేకము లగు కర్మములమెయిం బోక నృపా! **195**

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా! మనూ!; ఏకరసమయ క్షేత్రము= ఒక ద్రవం (నీరు)తోడి భూమి - పొలము; అనేక+ఓషధి రసమయంబు+అయిన+అట్లు= పెక్కు ఔషధ ద్రవాలతోడిది అయిన చందాన; ఏక విధము+ఐన బుద్ధి= ఒకే తీరు గల తెలివి-మితి; అనేకములు+అగు= పెక్కులైన; కర్మముల మెయిన్= పనులతో పనులవెంట; పోక= పోవటం; సుమీ!= సుమా!

తాత్పర్యం: మాయ తనను తాను వ్యక్తపరచుకొనే తీరు నరుడి కర్మలలో కనిపిస్తుంది. ఆ కర్మలు బుద్ధిద్వారా జరుగుతాయి. బుద్ధి ఒకటే అయినా, అది నిర్వహించే కర్మలు కొల్లలు. ఆ విధంగా ఒక్క బుద్ధి పెక్కు కర్మల వెంటపడి, వాటిని నెరవేర్చుకుంటూ పోయే తీరును బృహస్పతి ఒక పోలికతో తెలియపరుస్తున్నాడు. పొలాన ఒక ద్రవమే ఉంటుంది. ఆ ద్రవం నీరే. అయితే ఆ నీటిద్వారా ఏర్పడే చెట్లుచేమల ద్రవాలు అనేకం. ఇక్కడ ఏక రసంతోడి పొలం అనేక ఓషధుల చెట్లుచేమల రసాలను ఏర్పరచినట్లుగా నరుడి ఒకే బుద్ధి పెక్కులైన అతడి కర్మలకు కారణంగా అవి కొనసాగటానికి ఆధారంగా నిలుస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

అ. జలము పృథివికంటె, జలముకంటెను దేజ, । మంతకంటె వాయు, వాకసంబు
దానికంటెఁ బెద్ద; వాని కెల్లను బెద్ద । మనసు; బుద్ధి పెద్ద మనసుకంటె. 196

ప్రతిపదార్థం: పృథివికంటెన్= భూమికంటె; జలము= నీరు; జలముకంటెను= నీటికంటె కూడా; తేజము= కాంతి; అంతకంటె= ఆ కాంతికంటె; వాయువు= గాలి; దానికంటెన్= ఆ గాలికంటె; ఆకసంబు= ఆకాశం; పెద్ద= పెద్దది, ఘనమైనది, విశాలమైనది; వానికి+ఎల్లను= ఆ అన్నిటికంటెను; మనసు= నరుడిలోని మనస్సు; పెద్ద= పెద్దది; మనసుకంటెన్= ఆ ఎక్కువ పెద్దదైన మనసుకంటెకూడా; బుద్ధి= నరుడి మతి - తెలివితేటల నెలవు; పెద్ద= పెద్దది, గొప్పది.

తాత్పర్యం: సృష్టిలో మూలద్రవ్యాలు ఐదు ఉన్నాయని - అవి నేల, నీరు, కాంతి, గాలి, ఆకాశాలని తాత్వికులు పలుకుతారు. ఆ అయిదూ సృష్టిలో మిగిలిన అన్నిటికంటె పెద్దవే. అయినా, వాటిలో మళ్ళీ తారతమ్యాలు, హెచ్చుతగ్గులు ఉన్నాయి. నేలకంటె నీరూ, నీటికంటె కాంతీ, కాంతికంటె గాలీ, గాలికంటె ఆకాశం - ఒక దానిని మించి ఒకటి పెద్దవి. అయితే ఈ మిక్కిలి పెద్దవైన పంచభూతాలకంటె కూడా పెద్దదైనది నరుడిలోని మనస్సు. ఆ మనస్సుకంటె పెద్దది ఈ బుద్ధి. ఇదీ నరుడిలోని భాగమే.

విశేషం: కనిపించే పంచభూతాలు ఒకదానిని ఒకటి మించి పెద్దవిగా ఉండగా, అసలు దృష్టికే అందని మనస్సూ, బుద్ధీ వాటికంటె పెద్దవి కావటం విచిత్రం. మళ్ళీ ఆ మనోబుద్ధులు రెండింటిలో బుద్ధి మనస్సును మించింది కావటమూ విశేషమే.

తే. ధరణి మొదలయిన పంచభూతములకంటె । మనసుకంటెను బుద్ధికంటెను మహత్త
రంబు గాలంబు; గాలతత్త్వంబు మిగిలి । యుండు విభుఁ డిజ్జగంబుల కొడయుఁ డతఁడు. 197

ప్రతిపదార్థం: ధరణి మొదలయిన= భూమి మొదలుగా గల; పంచభూతములకంటెన్= ఐదు మూల పదార్థాలకంటె (నేల, నీరు, కాంతి, గాలి, ఆకాశాలు); మనసుకంటెను= మనస్సు అనే జీవుల అంతరంగం - లోపలి అవయవాలకంటె; బుద్ధికంటెను= మతి అనే, జీవుల కర్మశీలతకు కారణమైన తెలివికంటె; కాలంబు= కాలం - క్షణాలు, నిమిషాలు, గంటలు, దినాలు, నెలలు, సంవత్సరాల రూపాన తెలియవచ్చే ప్రొద్దు; మహత్+తరంబు= ఎక్కువ పెద్దది; విభుఁడు= ప్రభువు, దేవుడు; కాలతత్త్వంబు= కాలము యొక్క స్వభావమును, పెద్దరికమును; మిగిలి+ఉండున్= మించి ఉంటాడు; అతఁడు= ఆ ప్రభువు; ఈ+జగంబులకున్= ఈ లోకాలకు; ఒడయుఁడు= అధిపతి.

తాత్పర్యం: (సృష్టిలో పెద్దవి, ఇంకా పెద్దవీ, వాటికంటెకూడా పెద్దవీ అయిన పదార్థాలను క్రమంగా చెప్పుకొంటూ వచ్చే బృహస్పతి ఇపుడు అన్ని విధాలయిన పెద్దరికాలనూ చివరగా ప్రకటిస్తున్నాడు.) పంచభూతాలకంటె మనస్సు,

మనస్సుకంటె బుద్ధీ పెద్దవి కాగా, ఈ అన్నిటినీ మించిన పెద్దరికం కాలానిది. అయితే అద్దానినికూడా మించినవాడు దేవుడు. అతడు సర్వోన్నతుడూ. సర్వాతిశాయీ అయిన ప్రభుడే ఈ లోకాలన్నిటికీ అధిపతి.

విశేషం: సృష్టిలో పెద్దరికాలు, చిన్నరికాలు సర్వసామాన్యం. అయితే దేవుడు మాత్రం అన్నింటికంటే, అందరికంటే గొప్పవాడు, పెద్దవాడు. అతడితో ఈ పెద్దరికాలను గూర్చిన వాదం సమసిపోతుంది. అతడిని మించిన పెద్దతనం ఇక లేదు. అందువలననే అతడు ఈ లోకాలకు ఏలిక.

క. ఆదియు మధ్యము నంతము । నా దేవేశునకు లేమి నవ్యయుఁ డతఁ డీ
వేదములకు నానావిధ । వాదములకుఁ జేరుగడ భవక్షేపి నృపా! 198

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా! - మనూ!; ఆ దేవ+ఈశునకున్= ఆ దేవతల అధిపతికి; ఆదియున్= మొదలూ; మధ్యమున్= నడుమూ; అంతమున్= చివరా; లేమిన్= లేకపోవటంచేత; అతఁడు= ఆ దేవేశుడు; అవ్యయుఁడు= నాశనం లేనివాడు; వేదములకున్= ఋక్, యజుస్, సామ, అధర్వములనే నాలుగు వేదాలకూ; నానావిధవాదములకున్= అనేక విధములయిన - దేవుడి ఉనికికి, ఆత్మ ఉనికికీ చెందిన పెక్కు మతాలకు - అభిప్రాయాలకు; చేరుగడ= శరణం - ఆధారం; భవక్షేపి= సంసారమును తిరస్కరించేవాడు.

తాత్పర్యం: ఓ రాజా! మనూ! నేను చెప్పిన ఆ దేవదేవుడు ఆది మధ్య అంతరహితుడు. కాబట్టి నాశనం లేనివాడతడు. అంతే కాదు, ఆతడే లోకంలోని జ్ఞానవిజ్ఞానఖనులని భావించబడే నాలుగువేదాలకూ, ఆత్మ - అనాత్మ, ఆస్తిక - నాస్తిక, మతాలకూ ఆధారభూతమై వెలుగొందేవాడు. సంసారాన్ని దూరీకరించే శక్తిని ఇచ్చేవాడూ అతడే.

విశేషం: ఒక వస్తువునకు 'ఆది' ఉంటే తప్పక 'అంతమూ' ఉంటుంది. ఉండక తప్పదు. జన్మ మరణాలు ఆ విధంగా జీవికి ఆది - అంతాలు. ఆ రెండూ ఉన్నపుడు 'మధ్యమూ' ఉన్నట్లే. ఇవన్నీ స్పష్టమైన ఏర్పరచబడ్డ పదార్థాల లక్షణాలు. ఇక్కడ దేవేశుడిగా వర్ణితమైన శక్తి - సృష్టము - కల్పితం కాదు. సృష్టికి - కల్పనకు హేతువు. కాబట్టి అక్కడ మొదట - తుద పుట్టుక - చావు వంటి పరిభాషలు చెల్లవు. ఆ చెల్లనితనమే అవ్యయత్వమంటే. అది ఎప్పటికీ ఉంటుంది. మారకుండా ఉంటుంది.

క. అనుభవము మ్రింగు శాంతిం । గనునది నిర్భేద సత్ప్రకాశం బది దా
విను తలఁపునకును బలుకున । కు నగమ్యము, గర్మముల కగోచర మనఘా! 199

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; వినుము= ఆలకించుము ఓ మనూ!; (అతఁడు= పరతత్త్వం) అనుభవమున్= ప్రత్యక్షం మొదలైన జ్ఞానమును; మ్రింగున్= లోగొంటుంది - తనలో ఇముడ్చుకొంటుంది; శాంతిన్= శాంతిని, శమమును, నిశ్చలమైన స్థితిని; కనున్= పొందుతుంది; అది= ఆ శాంతి; నిర్ భేద సత్ ప్రకాశంబు= భేదంలేని మంచి వెలుగు; తాన్= తాను, ఆ శాంతి; తలఁపునకును= ఆలోచనకూ; పలుకునకున్= మాటకూ - భాషకూ; అగమ్యము= పొందరానిది; కర్మములకున్= పనులకు; అగోచరము= కనిపించనిది.

తాత్పర్యం: (ఆ పరత్వతత్త్వాన్ని అవాఙ్మానసగోచరమంటూనే వివరించటానికి యత్నించారు మన తాత్త్వికులు. ఇక్కడి భావాలు అట్లాంటివే. ఆ దేవేశుడే పరతత్త్వం.) ఆ పరతత్త్వం ప్రపంచంలో మనం జ్ఞానమని అనుకొనే సర్వాన్ని లోగొంటుంది. తరువాత శాంతిని పొందుతుంది. ఆ శాంతి భేదంలేని మంచి గొప్ప వెలుగు. నిజానికి ఆ శాంతిని వర్ణించి చెప్పటం అసాధ్యం. ఎందుకంటే అది ఆలోచనకూ, భాషకూ అందదు. ఇతర కర్మలద్వారా కూడా దానిని పొందలేము.

విశేషం: వర్ణనకు అలవిగాదు - అనటమూ ఒక వర్ణనమే. వర్ణనకు భాష ఆధారం. భాషకు ఆలోచన - భావం మూలం. భావానికీ భాషకూ అందనిది కర్మలకూ చిక్కదు. అయినా మనిషి మానడు. దానిని తెలియచెప్పటానికి యత్నిస్తూనే ఉంటాడు. భావం,

భాష, కర్మ - అనేవి క్రమంగా ఒకదానికంటె ఒకటి స్థూలమైనవి. విలోమక్రమంలోనయితే అవి క్రమంగా ఒక దానికంటె ఒకటి సూక్ష్మమయినవి. వీటినే మనం మనస్సు, వాక్కు, కర్మ అని అంటాం.

క. మనసు గొని, మనసు బుద్ధిం । గొని, బుద్ధిని దర్శనంబు గొని, దర్శనమున్
వినుఁ క్రమమున నొదిఁగించినఁ । గను బుధుఁ డక్షరుని విష్ణు ఘనబోధమయున్. 200

ప్రతిపదార్థం: మనసు= మనస్సును; కొని= గ్రహించి - లోగొని; మనసున్= మనస్సును; బుద్ధిన్+కొని= బుద్ధిని లోగొని-లోబరచుకొని; బుద్ధిని= బుద్ధినీ - మతినీ; దర్శనంబు+కొని= చూపును - జ్ఞానమును లోగొని; దర్శనమున్= చూపును - జ్ఞానమును; క్రమమునన్= వరుసగా, ఒకటొకటిగా; ఒదిఁగించినన్= తొలగిస్తే, లీనము చేసికొన్నచో; వినుఁ= ఆలకించుము ఓ మనూ!; బుధుఁడు= పండితుడు; అక్షరునిన్= నాశనంలేనివాడిని; ఘనబోధమయున్= గొప్ప జ్ఞానమయమైనవాడిని; విష్ణున్= విష్ణువును - పరతత్త్వ స్వరూపమును; కనున్= చూస్తాడు, పొందుతాడు.

తాత్పర్యం: మనస్సూ, బుద్ధీ, (లోక) జ్ఞానమూ - ఈ మూడూ నరుడినుండి తొలగిపోతే తప్ప, అతడికి ఆ శాశ్వత సర్వవ్యాపి జ్ఞానమయతత్త్వం, పరమేశ్వర స్వరూపం గోచరించదు. అయితే ఆ మూడూ త్రిపుటి తొలగే మార్గ మేది? తత్త్వజ్ఞులకు అది సులభమే - ఎట్లంటే మనస్సుతోనే మనస్సును లోబరచుకొనాలి, తరువాత తొలగించుకొనాలి, బుద్ధితోనే బుద్ధిని లోగొని అనంతరం లీనం చేయాలి. అటు తరువాత జ్ఞానాన్ని పరతత్త్వేతరమైన తెలివితేటలు- అన్నిటినీ జ్ఞానం (పారమార్థికమైనది) తోనే వశపరచుకొని పిదప ఒదగజేయాలి-తొలగించుకొనాలి. ఈ విధంగా పరతత్త్వాన్ని అందుకొనాలి.

విశేషం: మనస్సుతో మనస్సును గ్రహించట మేమిటి? సరిగా ఉండని మనస్సును సరైన మనస్సుతో లోబరచుకొనాలి. అట్లాగే సమ్యక్ సంకల్పంతో బుద్ధితో దుర్బుద్ధిని, సమ్యక్ దృష్టితో ఇతర దృష్టినీ లోగొనాలి. ఇట్లా మనస్సు, బుద్ధి, దృష్టి-మూడూ సరిగా సమీచీనంగా సాగితే పరతత్త్వప్రాప్తి జరుగుతుంది.

క. అమృతం బచ్యుత మమలం । బమేయ మవ్యయ మనంత మవ్వెలుఁగు యమా
ద్యముల నలవడిన చిత్తము । శమాతిరేకమునఁ బొంద సంవేద్య మగున్. 201

ప్రతిపదార్థం: ఆ+వెలుఁగు= ఆ పరతత్త్వం; అమృతంబు= మరణం లేనిది; అచ్యుతము= చ్యుతి, భ్రంశం, జారుడు లేనిది; అమలంబు= మురికి లేనిది; అమేయము= కొలత లేనిది; అవ్యయము= నాశం లేనిది; అనంతము= చివర లేనిది; యమ+ఆద్యములన్= యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణములను; అలవడిన= అభ్యసించిన; చిత్తము= మనస్సు; శమ+అతిరేకమునన్= శాంతి (యొక్క) ఆధిక్యంతో; పొందన్= గ్రహించగా-అందుకొనగా (ఆ వెలుగు); సంవేద్యము+అగున్= బాగుగా తెలియదగినది ఔతుంది.

తాత్పర్యం: ఆ పరతత్త్వం గొప్ప వెలుగు. ఆ వెలుగు మృతి లేనిది; చ్యుతి లేనిది; మలినం లేనిది, కొలత లేనిది; నాశం లేనిది; చివర లేనిది, దానిని యమనియమాది సాధన సంపత్తితో ప్రశాంతమై నిలిచిన చిత్తంద్వారా గ్రహించవచ్చును. అప్పుడే ఆ పరతత్త్వం నరుడి అనుభవానికి అందుతుంది.

విశేషం: ఈ పరతత్త్వం అవాఙ్మానస గోచరమంటూ మన తాత్త్వికులు వర్ణిస్తుంటారు; వదలరు. వర్ణన ఊహ ద్వారా కూడా చేయవచ్చును. అయితే అనుభవం, ఊహ రెండూ ఒకటి కావలసిన అగత్యముండదు. ఊహను మరచి ఒక విషయం అనుభవానికి వచ్చినప్పుడు ఆ అనుభూతి విశేషాన్ని ఎట్లాగైనా వ్యక్తపరచి తీరవలసిందే అన్న పట్టుదలతో చేసిన వర్ణన కావచ్చును ఇది.

క. అని గురుఁ డుపదేశించిన । విని మనువు కృతార్థుఁ డయ్యె విద్వన్నుత! నీ
వును నలవరింపుమీ మన । ముల నివ్వాక్యముల యర్థముం దత్పరతన్.' 202

ప్రతిపదార్థం: విద్వత్+నుత!= పండితులచే పొగడబడినవాడా! - ఓ ధర్మరాజా!; అని= పై ప్రకారంగా; గురుఁడు= బృహస్పతి; ఉపదేశించినన్= జ్ఞానబోధ చేయగా; విని= ఆలకించి; మనువు= మను మహారాజు; కృత+అర్థుఁడు+అయ్యెన్= నెరవేరిన ప్రయోజనం కలవాడు అయ్యెను; నీవును= నీవుకూడా; మనమునన్= మనస్సులో; ఈ+వాక్యముల+అర్థమున్= ఈ బృహస్పతి మాటల సారాన్ని; తత్పరతన్= దానియందలి శ్రద్ధతో; అలవరింపుము+ఈ= అలవాటు చేసికొమ్ము-మననం ద్వారా గ్రహించి, అభ్యసించటానికి యత్నించుము.

తాత్పర్యం: పండిత ప్రశంసలు అందుకొన్న ఓ ధర్మరాజా! ఈ విధంగా బృహస్పతి మనువునకు ఉపదేశించగా విని ఆ మనువు కృతార్థుడైనాడు. అతడి ప్రయోజనం సిద్ధించింది. నీవూ ఈ బృహస్పతి మాటల అర్థాన్ని శ్రద్ధతో గ్రహించి, మనస్సులో మననం చేసి, ఆ పరతత్త్వప్రాప్తికై మనస్సును అభ్యాసమార్గాన ఉంచి యత్నించుము'.

విశేషం: ఉపదేశం వాఙ్మాత్రంగా మిగిలిపోతే నిష్ప్రయోజనమే. దానికి ఆచరణ ముఖ్యం. ఆచరణ మనస్సున కెక్కితేగాని కుదరదు. అందుకనే 'తత్పరత'తో గ్రహించి, మనస్సును జ్ఞానమార్గానికి అలవరచుకొ మ్మనే సూచన అవసరమైనది.

వ. అనిన విని పరమహర్షంబునం బాండవాగ్రజుండు పితామహుం బ్రశంసించి 'మహాత్మా! మహనీయుండగు కృష్ణుని మాహాత్మ్యంబు వినవలతుం జెప్పవే?' యని యడిగిన నతం డమ్మహీపతితో 'నారద జామదగ్న్య మార్కండేయ వ్యాస వాల్మీకి ప్రభృతి మునీంద్రులు సెప్ప వినిన తెఱం గెఱిఁగించెద నాకర్ణింపు' మని యిట్లనియె. 203

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మజుడు; పరమహర్షంబునన్= గొప్ప సంతోషంతో; పితామహున్= తాతను భీష్ముడిని; ప్రశంసించి= పొగడి; మహా+ఆత్మా!= గొప్ప మనస్సు కలవాడా!; మహనీయుండు+అగు= పూజించవలసినవాడవగు; కృష్ణుని మాహాత్మ్యంబు= కృష్ణుడి గొప్పతనం; వినన్+వలతున్= వినగోరెదను; చెప్పవే?+అని+అడిగినన్= చెప్పవా? అని వేడగా; అతండు= ఆ భీష్ముడు; ఆ+మహీపతితోన్= ఆ రాజు అయిన ధర్మరాజుతో; నారద జామదగ్న్య మార్కండేయ వ్యాస వాల్మీకి ప్రభృతి ముని+ఇంద్రులు= నారదుడు, జామదగ్న్యుడు, మార్కండేయుడు, వ్యాసుడు, వాల్మీకి మొదలైన మునిశ్రేష్ఠులు; చెప్పన్= పలుకగా; వినిన తెఱంగు= విన్న విధం; ఎఱిఁగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: బృహస్పతి మనువుకొరకు చేసిన మాయను గురించిన ఉపదేశాన్ని విన్న ధర్మరాజు ఎంతో సంతసించి, తన తాతను మెచ్చుకొని, మళ్ళీ ఇట్లా అర్థించాడు. 'మహాత్మా! నాకు పూజ్యుడైన కృష్ణపరమాత్మ గొప్పదనం వినాలని కోరిక ఉన్నది. చెప్పవే?' అని, దానికి భీష్ముడు 'నారదాది మహామునులు స్వయంగా చెప్పగా విన్న విధాన మిది. నీవూ విను'మంటూ కృష్ణమాహాత్మ్యాన్ని వినిపించటం ప్రారంభించాడు.

విశేషం: భారతకథలో భీష్ముడు శ్రీకృష్ణభక్తుడిగా కనిపిస్తాడు. కాబట్టి కృష్ణతత్త్వ వర్ణన తాను చేస్తే అందులో భక్తి ప్రపత్తుల ఆధిక్యం గోచరించవచ్చును. అందువలన తాను ప్రస్తుతం వివరించబోయేది తాను నారదాది మహామునులనుండి విన్నది మాత్రమే అంటూ తన తాటస్థ్యాన్ని నిరూపించుకొన్నాడు పితామహుడు.

క. 'కృష్ణుఁడు ప్రభవిష్ణుం డగు । విష్ణుం; డనిలాగ్నితోయవియదిలలఁ గ్రియా
నిష్ణాతత్వ వినోదన । తృష్ణం గల్పించెఁ దనదు దివ్యవిభూతిన్. 204

ప్రతిపదార్థం: కృష్ణఁడు= నల్లనయ్య; ప్రభవిష్ణుండు+అగు= ప్రభావవంతుడైన; విష్ణుండు= విష్ణువు; తనదు దివ్యవిభూతిన్= తన లోకాతీతమైన ఐశ్వర్యంతో, శక్తితో; అనిల+అగ్ని తోయ వియత్+ఇలలన్= గాలి నిప్పు నీరు ఆకాశం నేలలను (పంచభూతాలను); క్రియా నిష్ణాతత్వ వినోదన తృష్ణన్= పనులలోని నేర్పరితనంతో వినోదించే ఆశతో; కల్పించెన్= చేసెను.

తాత్పర్యం: కృష్ణుడు ప్రభావశాలి అయిన విష్ణువే. అతడే తన దివ్యశక్తితో తానూ కర్మనిర్వహణ నైపుణ్యంతో వినోదించాలనే ఆశతో ఈ సృష్టికి మూలపదార్థాలైన పంచభూతాలను - గాలి నిప్పు నీరు ఆకాశం నేల అనేవాటిని కల్పించాడు.

తే. అట్లు కల్పించి జలములయందు భవ్య । తల్పగతుఁ డైన నాభిఁ బద్మంబు దోఁచె;
నం దజుఁడు పుట్టి సృజియించె నందనుల మ । నంబునన సప్తసంఖ్యుల నరవరేణ్య! 205

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ రాజా!; అట్లు= ఆ విధంగా; కల్పించి= చేసి, పంచభూతాల సృష్టిచేసి; జలముల అందున్= నీళ్ళలో; భవ్య తల్పగతుఁడు+ఐనన్= శుభమైన పడకను చేరినవాడు కాగా - పరుండి ఉండగా; నాభిన్= బొడ్డునందు; పద్మంబు+తోఁచెన్= తామరపువ్వు పుట్టింది; అందున్= ఆ పువ్వునందు; అజుండు= బ్రహ్మ; పుట్టి= కలిగి; మనంబునన్+అ= మనస్సులోపలనే; సప్తసంఖ్యులన్= ఏడుగురు; నందనులన్= కుమారులను; సృజియించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: ఆ విధంగా పంచభూతసృష్టిచేసి, నీటిలో శుభకరమైన పడకమీద పరుండి ఉండగా (విష్ణువు కర్త) విష్ణువు బొడ్డున తామరపువ్వు పుట్టింది. దానినుండి బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మ మనస్సులోనే ఏడుగురు కుమారులను కన్నాడు. (వీరినే బ్రహ్మమానసపుత్రులు అంటారు.)

వ. మరీచియు నత్రియు నంగిరసుండును బులస్త్యుండును బులహుండును క్రతువును దక్షుండు ననం బరఁగువారలయందు మరీచికిం గశ్యపప్రజాపతి జన్మించె; అతనివలన సురాసుర గరుడ నాగాదిజాతి సంభవంబునుం గలిగె; నతనికి సూర్యుండును నత్రికి సోముండును నుదయించి, రాజవంశంబులకుఁ గవాటస్థులైరి; సూర్య సోమాన్వయ జాతులైన నృపతు లనేకు లనేక దేశంబు లేలిరి; దేశకాల విశేషంబుల నృపకులంబులు బహుశాఖంబులై వర్ధిల్లువాని నెల్లం దన వలసిన యప్పుడు విష్ణుండు పరస్పర విరోధజనిత సంగ్రామంబులు నిమిత్తమాత్రంబులుగాఁ గల విశేషప్రకారంబుల నుపసంహరించుచు నద్దేవుండు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధాత్మకంబు లగు చతుర్విధ దివ్యస్వరూపంబులు గలిగి జగద్భరణం బాచరించుచు నిట్లు లీలా జన్మంబులం బొంది క్రీడ సలుపు నని కృష్ణునిం జూపి 'ఈ భూతేశ్వరు మానుషసామాన్య దృష్టిం జూచుట యజ్ఞానంబు గృష్ణుండు భక్తపరతంత్రతం జేసి యుత్కృష్ట చరితుల యారాధనంబునకు భాజనంబయి భోగమోక్షంబులు గరుణామయ కటాక్షంబుల నొసంగు' ననినం బ్రీతుండై భీష్మునకుం బ్రణమిల్లి యుధిష్ఠిరుండు. 206

ప్రతిపదార్థం: మరీచియున్= మరీచీ; అత్రియున్= అత్రీ; అంగిరసుండును= అంగిరసుడూ; పులస్త్యుండును= పులస్త్యుడూ; పులహుండును= పులహుడూ; క్రతువును= క్రతువూ; దక్షుండును= దక్షుడూ; అనన్+పరఁగువారలఅందున్= అనగా వర్ధిల్లే ఆ బ్రహ్మమానస పుత్రులలో; మరీచికిన్= మొదటివాడు మరీచికి; కశ్యప ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; జన్మించెన్= పుట్టాడు; అతని వలనన్= ఆ కశ్యపబ్రహ్మవలన; సుర+అసుర గరుడ నాగ+ఆది జాతి సంభవంబునన్= దేవతలు రాక్షసులు గరుడులు నాగులు మొదలగు జాతుల పుట్టుక కూడా; కలిగెన్= జరిగినది; అతనికిన్= ఆ కశ్యపబ్రహ్మకు; సూర్యుండును= సూర్యభగవానుడూ; అత్రికిన్= అత్రికి; సోముండును= చంద్రుడును; ఉదయించి= పుట్టి; రాజవంశంబులకున్= క్షత్రియుల వంశాలకు; కూటస్థులు+ఐరి=

మూల పురుషులు అయినారు; సూర్య సోమ+అన్వయ జాతులు+ఐన= సూర్యుడి, చంద్రుడి వంశాలలో పుట్టినవారైన; నృపతులు+అనేకులు= రాజులు పెక్కండ్రు; అనేక దేశంబులు+ఏలిరి= పెక్కు దేశాలను పాలించారు; దేశకాల విశేషంబులన్= దేశముయొక్క, కాలముయొక్క భేదముల యందు - భిన్న భిన్న దేశాలలో - భిన్న భిన్న కాలాలలో; నృపకులంబులు= రాజవంశాలు; బహుశాఖంబులు+ఐ= పెక్కు తెగలు కలవిగా; వర్తిల్లున్= ఉంటాయి; వానిని+ఎల్లన్= ఆ వంశాలను అన్నిటిని; విష్ణుడు= కృష్ణుడు; తన వలసిన+అప్పుడు= తనకు కావలిసిన సమయాన; పరస్పర విరోధ జనిత సంగ్రామంబులు= అన్యోన్యం కలహించటంవలన కలిగిన యుద్ధాలు; నిమిత్త మాత్రంబులుగాన్= కారణ మాత్రాలుగా అగునట్లు - ఆ నెపంతో; కల విశేష ప్రకారంబులన్= ఉన్న వివిధ రీతులలో; ఉపసంహరించున్= ముగించును - నశింపజేయును; ఆ+దేవుండు= ఆ శ్రీకృష్ణ దేవుడు; వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న+అనిరుద్ధ+ఆత్మకంబులు+అగు= కృష్ణుడు (వసుదేవుడి కొడుకు), బలరాముడు, మన్మథుడు, మన్మథ తనయుడు- అనేవారి శరీరాలు కలవి అగు; చతుర్విధ దివ్యస్వరూపంబులు= నాలుగు విధాలయిన లోకోత్తర ఆకారాలు; కలిగి= ధరించి; జగత్+భరణంబు= లోకాన్ని భరించటం; ఆచరించుచున్= చేస్తూ; ఇట్లు= ఈ విధంగా; లీలాజన్మంబులన్= వినోదం కొరకైన పుట్టుకలను; పొంది= వహించి; క్రీడ+చలుపున్= ఆట ఆడును; అని= అని పలికి; కృష్ణునిన్+చూపి= శ్రీకృష్ణుడిని చూపి; ఈ+భూత+ఈశ్వరున్= ఈ ప్రాణుల అధిపతిని; మానుష సామాన్య దృష్టిన్= నరుల సాధారణమైన చూపుతో; చూచుట= కనుగొనటం; అజ్ఞానంబు= తెలివిలేని తనం; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; భక్తపరతంత్రతన్+చేసి= భక్తులకు సేవకుడగుటచేత; ఉత్కృష్ట చరితుల+ఆరాధనంబునకున్= గొప్ప నడతలుగలవారి పూజనానికి; భాజనంబు+అయి= పాత్రమై; భోగ మోక్షంబులు= సుఖానుభవం, మోక్షం అనే రెండూ; కరుణామయ కటాక్షంబులన్= దయామయమైన క్రీగంటి చూపుతో; ఒసంగున్= ఇస్తాడు; అనినన్= అని పలుకగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; భీష్మునకున్= భీష్మాచార్యుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు.

తాత్పర్యం: బ్రహ్మమానస పుత్రులు ఏడుగురు. వారు వరుసగా మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు. వారిలో మరీచికి కశ్యప ప్రజాపతి జన్మించాడు. ఆ కశ్యపుడివలన దేవతలు, రాక్షసులు, గరుడులు, నాగులు మొదలైన జాతులు జనించాయి. ఆ కశ్యపుడికే సూర్యుడు జన్మించగా, అత్రికి చంద్రుడు కలిగి, ఆ సూర్యచంద్రులిద్దరూ క్షత్రియవంశాలకు మూల పురుషులయ్యారు. ఆ సూర్యచంద్ర వంశాలకు చెందిన రాజులు పలువురు పెక్కుదేశాలు ఏలారు. భిన్నభిన్న కాలాలలో భిన్నభిన్న దేశాలలో ఈ క్షత్రియవంశాలు అనేక శాఖోపశాఖలుగా వర్ధిల్లాయి. ఈ నానావిధ క్షత్రియవంశాలను, శ్రీకృష్ణుడు తనకు కావలసినపుడు వారిలో వారికి సంభవించే యుద్ధాలను నిమిత్తమాత్రంగా గ్రహించి, నశింపజేస్తూ ఉంటాడు. ఆ దేవుడు శ్రీకృష్ణరూపంతోపాటుగా బలరామ, మన్మథ, అనిరుద్ధ రూపాలను ధరించి ఈ జగత్తును భరిస్తూ వినోదంకొరకు జన్మలెత్తి ఆటలాడుకొంటూంటాడు' - అని భీష్ముడు పలుకుతూ ఎదుటనున్న శ్రీకృష్ణుడిని చూపి 'ఈ జగత్పతిని సామాన్య మానవుడిగా చూడటం అజ్ఞానం. శ్రీకృష్ణుడు భక్తులకు సేవకుడు కాబట్టి గొప్ప నడతగలవారికి ఆరాధనాభాజనమైనవాడు. నరులకు కావలసిన భోగభాగ్యాలనుగాని, ముక్తినిగాని కేవలం తన కరుణాకటాక్షమాత్రాన ఈయగలవాడు' అని పలుకగా ధర్మరాజు సంతసించి, పితామహుడికి నమస్కరించి. (మళ్ళీ ఈ విధంగా ప్రశ్నించాడు).

క. 'మునిజన వినుత చరిత్రా! । మనుజుం డెవ్వనిఁ దలంచి మహనీయ నిరం
జన సిద్ధిఁ బొందఁ గను? నే । యనువు దలఁపు నలవరించు?' నని యడుగుటయున్. 207

ప్రతిపదార్థం: మునిజన వినుత చరిత్రా!= ఋషిజనులచేత పొగడబడ్డ నడతగలవాడా! ఓ పితామహా!; మనుజుండు= నరుడు; ఎవ్వనిన్= ఏ వాడిని; తలంచి= చింతించి; మహనీయ నిరంజన సిద్ధిన్= గొప్పదైన పరమాత్మయొక్క ప్రాప్తిని; పొందన్+కనున్?= పొందగలుగును?; ఏ+అనువు= ఏ ఉపాయం; తలఁపున్+అలవరించున్= చింతనను మననమును అలవడజేయును?; అని+అడుగుటయున్= అని ప్రశ్నించిన పిదప.

తాత్పర్యం: 'మునులు కొనియాడదగ్గ నడతగల ఓ పితామహా! ఏ వాడిని స్మరించి నరుడు గొప్పదైన పరమాత్మ స్థితిని పొందగలడు? ఏ మార్గాన దైవధ్యానం అలవడుతుంది?'

భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్రప్రభావంబు తెఱం గెఱిఁగించుట (సం. 12-200-3)

వ. ఆ ధర్మతనయుతోడ నద్దేవవ్రతుం డిట్లను; 'నారదునిచేత వినిన తెఱంగు వివరించెద నాకర్ణింపుము. 208

ప్రతిపదార్థం: ఆ ధర్మతనయుతోడన్= ఆ ధర్మరాజుతో; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు (దేవవ్రతుడు - భీష్ముడి మొదటి నామం); ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; నారదునిచేతన్= నారదమునినుండి; వినిన తెఱంగు= విన్న విధం; వివరించెదన్= వివరంగా, విస్తారంగా, చెప్పెదను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'నీ ప్రశ్నకు సమాధానం నేను పూర్వం నారదమునీంద్రుడి నుండి విని ఉన్నాను. దానిని నీకు వివరిస్తాను విను'మన్నాడు భీష్ముడు.

తే. పరము నక్షరు విష్ణునిఁ బ్రస్తుతించి । నారద మునీంద్రుఁ డంజలి నమితమైన
మస్తకముఁ జేర్చి భక్తిసమగ్రచిత్త । వృత్తి నల్లన యిట్లని విన్నవించె. 209

ప్రతిపదార్థం: పరమున్= శ్రేష్ఠుడిని; అక్షరున్= నాశనంలేనివాడిని; విష్ణునిన్= విష్ణువును; ప్రస్తుతించి= పొగడి; నారదముని+ఇంద్రుఁడు= నారదుడనే మునిశ్రేష్ఠుడు; అంజలి= దోసిలి; నమితము+ఐన= వంగినదైన; మస్తకమున్= తలను; చేర్చి= ఉంచి; భక్తి సమగ్ర చిత్తవృత్తిన్= భక్తితో పరిపూర్ణమైన మనస్సుయొక్క వర్తనతో; అల్లన= మెల్లగా; ఇట్లు+అని= ఈ విధంగా; విన్నవించెన్= విజ్ఞప్తిచేశాడు.

తాత్పర్యం: సర్వశ్రేష్ఠుడూ, నాశరహితుడూ అయిన విష్ణుమూర్తిని నారదమునీంద్రుడు స్తుతించి, వంచిన శిరస్సున అంజలిని నిలిపి, భక్తిప్రపత్తులతో, పరిపూర్ణమైన మనస్సుతో మెల్లగా విన్నవించాడు. (ఈ విధంగా చెప్పబోయేది ఆ ముని విన్నపం.)

విశేషం: అర్థి - యాచకుడు, దాతను దరిచేరేటప్పుడు ఎట్లా ఏ భంగిమలో ఉండాలో అతడి మానసిక స్థితి ఏ తీరున ఉంటే కార్యసిద్ధి జరిగే వీలున్నదో ఈ పద్యం వివరిస్తున్నది.

క. 'దేవా! మోక్షార్థి జనము । లే వెరవున నిన్నుఁ దలఁతు? రే జప్యము సం
భావింతురు? నా కానతి । యీవే? భక్తపరతంత్ర! యేర్పడఁ గరుణన్. 210

ప్రతిపదార్థం: దేవా!= ఓ ప్రభూ! భక్త పరతంత్ర! భక్తులకు లొంగినవాడా!; మోక్ష+అర్థి జనములు= ముక్తిని యాచించే ప్రజలు; ఏ వెరవునన్= ఏ పద్ధతితో; నిన్నున్= మోక్షదాతవైన నిన్ను; తలఁతురు?= చింతిస్తారు?; ఏ జప్యము= ఏ జపం కొరకైన మంత్రాన్ని (జపింప దగిన దానిని); సంభావింతురు?= గౌరవిస్తారు; స్వీకరిస్తారు?; నాకున్= అర్థినైన నాకు; ఆనతి+ఈవే= ఆజ్ఞ ఈయవా?, తెలుపవా?

తాత్పర్యం: 'భక్తులకు లొంగే ఓ ప్రభూ! ముక్తిగోరే జనులు నిన్ను ఏ విధాన తలచుకొంటారు? (అంటే) నిన్ను ఏమని స్మరిస్తుంటారు వారు? వారు జపించే మంత్రమేది? దయతో నాకు ఆనతి ఈయవా ప్రభూ!' అని దీనంగా అర్థించాడు నారదుడు.

తే. అనిన నద్దేవముని పలు కాదరించి । వరదుఁ డగు విష్ణుఁ డిట్లనుఁ బరమభక్తి
నిర్మల శ్రద్ధ యింద్రియనిగ్రహంబు । మన్మయ ధ్యానమునకు నమాత్యకోటి. 211

ప్రతిపదార్థం: అనినన్= (నారదుడు ఆ విధంగా) అన్న తరువాత; ఆ+దేవముని పలుకు= ఆ దేవఋషి మాట - అర్థన; ఆదరించి= మన్నించి; వరదుండు+అగు విష్ణుఁడు= వరము లిచ్చే విష్ణుమూర్తి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మత్+మయ ధ్యానమునకున్= (నా విష్ణుమయమైన) నాతో నిండిన ధ్యానమునకు - స్థిరమైన తలపునకు; పరమభక్తి= గొప్ప భక్తిభావం; నిర్మల శ్రద్ధ= స్వచ్ఛమైన శ్రద్ధ - ఆదరం; ఇంద్రియ నిగ్రహంబు= ఇంద్రియాల అణచివేత - కన్ను నోరు వంటి ఇంద్రియాలను లోబరచుకొనటం అనే ఈ లక్షణాలు మూడూ; అమాత్యకోటి= మంత్రిమండలి - ఉపకారకాలు.

తాత్పర్యం: నారదుడి అభ్యర్థనకు సమాధానంగా వరదుడైన విష్ణుమూర్తి ఇట్లా అన్నాడు. 'నన్ను ధ్యానించదలచినవారు ముందుగా గొప్పభక్తిని, నిష్కల్మషమైన శ్రద్ధను, ఆపై ఇంద్రియ నిగ్రహాన్ని అలవరచుకొవాలి. ఈ మూడు లక్షణాలూ విష్ణుధ్యానపరుడికి ఉండవలసినవి. విష్ణుధ్యానక్రియకు అవి సహకారకాలు.

విశేషం: అమాత్యుల ద్వారా రాజును చేరినట్లు, భక్తి శ్రద్ధ నిగ్రహాలద్వారా విష్ణుధ్యానాన్ని అందుకొనవచ్చును. ధ్యానమనే గమ్యం చేరటానికి ఈ మూడూ అనుసరించవలసిన మార్గాలు.

క. వినుఁ, వీతకల్మషన కవి । పనుపడుఁ; గల్మషము లెల్లఁ బాపఁగ నా మె
చ్చిన యట్టి పరమసాధన । మనుస్మృతి జపించునది నియతిమెయి దానిన్. 212

ప్రతిపదార్థం: వినుఁ= ఓ నారదా! ఆలకించుము; వీత కల్మషనకున్= తొలగిన పాపం కలవాడికి; అవి= ఆ మూడు లక్షణాలు- భక్తి శ్రద్ధా నిగ్రహాలు; పనుపడున్= అలవాటు అగును; కల్మషములు+ఎల్లన్= పాపాలు అన్నిటిని; పాపఁగన్= తొలగించటానికి; నా మెచ్చిన+అట్టి పరమ సాధనము= నేను మెచ్చుకొన్న గొప్ప ఉపకరణం; అనుస్మృతి= అనుసరించి స్మరించుట - మరల మరల తలంచటం; దానిన్= ఆ అనుస్మృతిని; నియతిమెయిన్= నియమ పూర్వకంగా; జపించునది= జపం చేయవలసింది.

తాత్పర్యం: (విష్ణుధ్యాన మలవడాలంటే భక్తి, శ్రద్ధ, నిగ్రహం కావాలని వివరించిన దేవుడు ఇపుడు అవి ఆ సద్గుణాలు ఎట్లా కలుగుతాయో వివరిస్తున్నాడు.) పాపరహితుడికి ఆ మూడు గుణాలూ అలవడతాయి. మరి ఆ పాపపరిహార మార్గమేది? - అంటే పాపాలు అన్నీ నశింపజేయటానికి విష్ణువు నంతటి దేవుడు మెచ్చిన పద్ధతి- అనుస్మృతి - మరల మరల తలచటం నిరంతరమననం. నియమపూర్వకంగా అనుస్మృతిని పాటించాలి- అనుస్మృతినే జపించాలి.

విశేషం: ఈ 'అనుస్మృతి' ఒక ఆరాధన ప్రక్రియగా కనిపిస్తున్నది. దేవుడి దయను పొందటానికి భక్తుడు చేసే నిరంతరస్మరణ ఇది. దీనికి ఒక ఆకారంకూడా ఏర్పడి ప్రచురితమైనట్లు ఈ సందర్భాన్నిబట్టి గమనించవచ్చును.

తే. ప్రణవ పూర్వకమగు నమః పదము పొంత । షడ్గుణైశ్వర్య వాచక సర్వవసన
నిర్వచన శబ్దములు గ్రమనిష్ఠ మెయిఁ జ । తుర్థిఁ గూర్పంగ మంత్రంబు తోఁచు బెరసి. 213

ప్రతిపదార్థం: ప్రణవ పూర్వకము+అగు= ఓంకారం ముందు గలదైన; నమః+పదము పొంతన్= 'నమః' అనే పదం దగ్గర; షట్+గుణ+ఐశ్వర్యవాచక సర్వవసన నిర్వచన శబ్దములు= ఆరుగుణాలను ఈశ్వర స్వభావాలను చెప్పెడి శబ్దాలు (మాహాత్మ్యం, ధైర్యం, యశస్సు, శ్రీ జ్ఞానం, వైరాగ్యం) మొత్తం గృహవాచకశబ్దాలు, (మొత్తం) నిందారహిత శబ్దాలు - ఈ మూడు విధాలయిన శబ్దజాలాన్ని (1. ఈశ్వర వాచకాలు, 2.వసన గృహవాచకాలు, 3. నిర్వచన వాచకాలు); క్రమనిష్ఠ మెయిన్= వరుసగా నిలుకడతో; చతుర్థిన్= నాలుగవ విభక్తిని కొఱకు, కై అనే ప్రత్యయాలను, (సంస్కృతంలో మంత్రాలు చతుర్థి అంతాలుగా ఓం వాసుదేవాయనమః- అన్నట్లుగా ఉంటాయి) మంత్రాలు తెలుగున ఉండవు కాబట్టి ఇక్కడ సంస్కృత చతుర్థిని - జే) అనే దానిని గ్రహించాలి; కూర్పంగన్= చేర్పగా; బెరసి= కలిగి, ఏర్పడి; మంత్రంబు= జనయోగ్యమైన మంత్రం; తోఁచున్= సిద్ధిస్తాయి.

తాత్పర్యం: ఓంకారాన్ని ముందునిల్పి, అనంతరం నమశ్శబ్దాన్ని జోడించి, ఆ తరువాత ఈశ్వర స్వభావాలయిన మాహాత్మ్యం, ధైర్యం, యశస్సు మొదలయిన గుణాలను తెలిపే శబ్దాలను క్రమంగా శ్రద్ధతో చేర్చుకొంటూ, ఆ శబ్దాలకు చతుర్థీవిభక్తిని కలిపితే "ఓం నమో వాసుదేవాయ" "ఓం నమో మహాయశసే" వంటి మంత్రాలు రూపుదిద్దుకొంటాయి.

విశేషం: దేవుడు సర్వాత్మకుడు కాబట్టి సృష్టిలోని సర్వశబ్దాలూ దేవవాచకాలుగా చెల్లుతాయి. విష్ణు సహస్రనామం మొదలయిన చోట్ల ఈ సూత్రం అన్వయిస్తుంది.

క. తొలి తొలి యిమ్మంత్రము ని । శ్చల మానసుఁడై జపించి జపియింపంగా
వలయు; ననుస్మృతి దానం । గలుగుఁ జతుర్వర్గ సాధకత పురుషునకున్.' 214

ప్రతిపదార్థం: తొలి తొలి= ముందు ముందు - మొట్టమొదట; ఈ+మంత్రము= ఈ పైన చెప్పిన మంత్రమును; నిస్+చలమానసుఁడు+ఐ= చలనంలేని మనస్సుగలవాడై (నరుడు); జపించి= జపము చేసి (అనంతరం); అనుస్మృతిన్= అనుస్మృతిని - ఆ పేరగల స్తోత్రమును; జపియింపంగాన్+వలయున్= జపించవలయును; దానన్= దానివలన - అట్లు చేయుటవలన; పురుషునకున్= నరుడికి; చతుర్ వర్గ సాధకత= నాలుగు వర్గాలను, ధర్మ అర్థ కామ మోక్షములను సాధించేవాడి తనం - సాధించే సామర్థ్యం; కలుగున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: పైన చెప్పిన మంత్రాన్ని ముమ్మందు నిశ్చలమనస్కుడై నరుడు జపించాలి. ఆ తరువాత 'అనుస్మృతి' పేరగల స్తోత్రాన్ని జపించాలి. అట్లా చేస్తే - ముందుగా మంత్రజపమూ, పిదప అనుస్మృతి స్తోత్రపఠనమూ చేస్తే నరుడికి ధర్మ - అర్థ - కామ - మోక్షాలను సాధించే సామర్థ్యం కలుగుతుంది'.

విశేషం: చిత్తానికి చంచలత్వం సహజలక్షణం. నీటికి ప్రవహించటం, నిప్పునకు పైకెగయటం ఎట్లాంటిదో మనస్సుకు చాంచల్యం అటువంటిది. ఆ చాంచల్యాన్ని నిరోధించగలిగితే ఆధ్యాత్మవిద్యలో సగభాగాన్ని అనుభవానికి తెచ్చుకొన్నట్లే. పూజాపురస్కారాలు, జపతపః ప్రభృతులూ - అన్నీ ఆ లక్ష్యంవైపు - మనశ్చాంచల్య నిరోధంవైపు సాగే సాధనాలే.

క. అని మఱియు 'దయ ననుస్మృతి । యనుపేరం గలుగుదాని నమ్మునిపతి కి
ట్లని చెప్పె నచ్యుతుఁడు నిజ । మనఃప్రియం బైన యట్టి మహితస్తవమున్. 215

ప్రతిపదార్థం: అని= అని పలికి; మఱియున్= ఇంకనూ; దయన్= దయతో; ఆ+మునిపతికిన్= ఆ మునిరాజునకు - నారదుడికి; అనుస్మృతి అనుపేరన్= అనుస్మృతి అనే పేరుతో; కలుగుదానిన్= ఉన్నదానిని; అచ్యుతుఁడు= చ్యుతుడు కానివాడు - విష్ణువు; నిజమనః ప్రియంబు+ఐన+అట్టి మహిత స్తవమున్= తన మనస్సునకు ప్రియమైన ఆ గొప్ప స్తోత్రాన్ని - అనుస్మృతిని; ఇట్లు+అని చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మంత్ర జపం తరువాత అనుస్మృతిని జపించుమన్న భగవంతుడు, దయతో ఆ నారదమునీంద్రుడికి తన మనస్సుకు ప్రీతిపాత్రమైనదీ, గొప్ప శక్తిమంతమయినదీ అయిన 'అనుస్మృతి'ని ఇట్లని చెప్పటం ప్రారంభించాడు.

సీ. 'అవ్యక్తు శాశ్వతు నఖిల ప్రభవ భూమి । భక్తివత్సలు విష్ణుఁ బరమపురుషు
నక్షయుఁ బ్రాంజలియై యాశ్రయించెదఁ । బుండరీకాక్షుని భువనసాక్షి
నిత్యుఁ బురాణు వర్ణించెదఁ బరు సహ । స్రాక్షు నక్షరుని లోకైకనాథు
భవ్యుఁ గొల్చెద భూతభవ్య భవత్ప్రభు । సర్వతోముఖు భూతసంప్రవర్తి

ఆ. నమృతు నచ్యుతుని ననంతు హృషీకేశు । రవిసహస్రనిభు హిరణ్యగర్భు
నబ్జనాభు సత్యు నాద్యంతరహితు భూ । గర్భుఁ బ్రభువు భక్తిగమ్యుఁ దలఁతు. 216

ప్రతిపదార్థం: అవ్యక్తున్= ప్రకటంకాని వాడిని; శాశ్వతున్= నిత్యమైన వాడిని; అఖిల ప్రభవ భూమిన్= అన్నింటి పుట్టుకకు ఆధారమైన వాడిని; భక్తవత్సలున్= భక్తులయెడల ప్రేమ గలవాడిని; విష్ణున్= వ్యాపకుడిని - విశ్వమును వ్యాపించి ఉండేవాడిని; పరమపురుషున్= గొప్ప పురుషుడిని; అక్షయున్= నాశనములేనివాడిని; ప్ర+అంజలి+ఐ= దోసిలి పట్టినవాడినై; ఆశ్రయించెదన్= శరణు జొత్తును; పుండరీక+అక్షునిన్= తెల్లదామరలవంటి కన్నులు గలవాడిని; భువనసాక్షిన్= లోకాలకు సాక్షిఅయినవాడిని; నిత్యున్= శాశ్వతమైన వాడిని - నిరంతరం ఉండేవాడిని; పురాణున్= ప్రాచీనుడిని; వర్ణించెదన్= కొనియాడుతాను; పరున్= పరమాత్మను; సహస్ర+అక్షున్= వేయి కన్నులు గలవాడిని; అక్షరునిన్= నాశంలేనివాడిని; లోక+ఏకనాథున్= జగత్తునకు ఒకడే అధిపతి అయినవాడిని; భవ్యున్= శుభకరమైనవాడిని; కొల్చెదన్= సేవించెదను; భూత భవ్య భవత్+ప్రభున్= జరిగిన, జరగగల, జరుగుచున్న కాలాలకు త్రికాలాలకు అధిపతిని; సర్వతఃముఖున్= అన్ని వైపులా మోము - చూపుగలవానిని; భూత సంప్రవర్తిన్= ప్రాణులను ప్రవర్తింపజేసేవాడిని; అమృతున్= మృతి - మరణం లేనివాడిని; అచ్యుతునిన్= చ్యుతి - జారుట - నాశములేనివాడిని; అనంతున్= అంతము- చివరలేనివాడిని; హృషీక+ఈశున్= ఇంద్రియాలకు అధిపతిని; రవి సహస్ర నిభున్= వేయి సూర్యుల వంటివాడిని; హిరణ్యగర్భున్= బంగారు కడుపు గలవాడిని; అబ్జనాభున్= పద్మం బొడ్డునగలవాడిని; సత్యున్= నిజమైన వాడిని; ఆది+అంతరహితున్= మొదలు తుదిలేనివాడిని; భూగర్భున్= పుడమి కడుపువాడిని; ప్రభువున్= అధిపతిని; భక్తిగమ్యున్= భక్తిచేత చేరదగినవాడిని; తలఁతున్= తలుస్తాను - ధ్యానిస్తాను.

తాత్పర్యం: (ఇది అనుస్మృతి.) నిరంతర స్మరణరూపమైన స్తుతి. దేవుడి లీలలను, ఆకారాలను, చేష్టలను వర్ణించే స్తోత్రం. కనబడనివాడిని, ఎప్పుడూ ఉండేవాడిని, అన్నింటి పుట్టుకకు ఆస్పదమైనవాడిని, భక్తులయెడ ప్రీతి గలవాడిని, విశ్వమంతా వ్యాపించి ఉండేవాడిని, గొప్ప పురుషుడిని, నాశంలేనివాడిని దోసిలి ఒగ్గి సేవిస్తాను - ఆశ్రయిస్తాను. తెల్లతామరలవంటి కన్నులు గలవానిని, లోకాలను (సాక్షిగా) చూస్తుండేవాడిని, ఎప్పుడూ నిలిచి ఉండేవాడిని, ప్రాతవాడిని వర్ణిస్తాను - కొనియాడుతాను. పరమాత్మ స్వరూపుడిని, వేయి కన్నుల వేల్పును, జారుట - నశింపులేనివాడిని, లోకాలకు తానొక్కడే అధినాథుడైనవాడిని, మంగళకరుడిని సేవిస్తాను. జరిగిన, జరగబోయే జరుగుతున్న మూడు కాలాలకూ అధిపతి అయినవాడిని, అన్నింటా ఉండేవాడిని, ప్రాణుల ప్రవృత్తికి కారణమైన వాడిని, మృతిచ్యుతి లేనివాడిని, తుదలేనివాడిని, ఇంద్రియాలకు అధీశుడిని, వేయి సూర్యులతో సమానుడిని, బంగరు కడుపుగలవాడిని, పద్మము నాభిని గలవాడిని, సత్యమైనవాడిని, మొదలు తుదిలేనివాడిని, పుడమి కడుపుగా గలవాడిని, అధిపతిని, భక్తితో చేరదగ్గవాడిని స్మరిస్తాను, ధ్యానిస్తాను.

విశేషం: విష్ణు సహస్రనామ శ్రవణం చేసేవారికి ఈ పదాలూ, ఇట్లాంటి పదాలూ జ్ఞప్తికి వస్తాయి. అంతా తానే అయి, తాను ఏమీ కాని తత్త్వాన్ని ఏ విధంగా వర్ణించినా చెల్లుతుంది. సహస్రనామాలంటే - సరిగా వేయి పేర్లని అర్థంగాదు. అన్ని పేర్లూ ఆయనవే. అన్నీ అందరూ అంతా తానే అయిన దేవుడికి పేరు గాని దేముంటుంది? సహస్ర శబ్దానికి తాత్పర్యార్థం అనంతమని లెక్కకు మిక్కిలి- అని ఇది వ్యవహారంలోనూ ఉన్నదే - 'వేయి చెప్పు నేను వినను' - వంటి మాటలలో 'వేయి' కూడా ఇటువంటిదే.

తే. అచలు సూక్ష్ము వరేణ్యు సహస్రశీర్షు । నభయకారి నశీర్షు నారాయణుని స
నాతనుని యోగమూర్తి లోకాతిరిక్తు । ధ్రువుని నీశ్వరు హరి భక్తితోడఁ గొలుతు. 217

ప్రతిపదార్థం: అచలున్= చలించని - కదలనివాడిని; సూక్ష్మున్= స్థూల దృష్టికి అందనివాడిని వరేణ్యున్= శ్రేష్ఠుడిని; సహస్రశీర్షున్= వేయి తలలవాడిని; అభయకారిన్= భయంలేమిని చేసేవాడిని - అభయమిచ్చేవాడిని; ఆశీర్షున్= తలలేనివాడిని; నారాయణునిన్=

విష్ణువును; సనాతనునిన్= సదాతనుని; యోగమూర్తిన్= యోగమే ఆకారంగా గలవాడిని; లోక+అతిరిక్తున్= లోకాలకు మించిన వాడిని; ధ్రువునిన్= శాశ్వతుడిని; ఈశ్వరున్= అధిపతిని; హరిన్= శ్రీహరిని; భక్తితోడన్= భక్తితో; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: స్థిరమైనవాడిని, ఆధ్యాత్మమైనవాడిని, సర్వశ్రేష్ఠుడిని, వేయితలలతో అభయమిచ్చేవాడిని, మొదలు లేనివాడిని, విష్ణువును, ప్రాచీనుడిని, యోగవిద్య ఆకారంగా గలవాడిని, లోకాలకు వెలిగా ఉన్నతంగా ఉండేవాడిని, శాశ్వతుడిని, అధీశ్వరుడిని అయిన హరిని భక్తితో సేవిస్తాను.

విశేషం: సహస్రశీర్షుడూ ఆయనే - అశీర్షుడూ ఆయనే. ఆయనకు విశేషంగా వాడదగని పద మేదీ ఉండదు. సర్వమయుడూ ఆయనే సర్వాతీతుడూ ఆయనే మరి! అందుకనే ఆయన 'సూక్ష్ముడు'.

క. ఎవ్వఁడు సచరాచర గురుఁ, । డెవ్వని నాభీసరోజ మీనె విధాతన్,
నివ్వటిలు జగములన్నియు । నెవ్వనిచే నమ్ముకుందు నెప్పుడుఁ గొలుతున్. 218

ప్రతిపదార్థం: ఏ+వాఁడు= ఏ దేవుడు; సచర+అచర గురుఁడు= కదిలేవాటికి, కదలనివాటికి, అన్నిటికి పెద్ద - ఏలిక; ఎవ్వడి నాభీ సరోజము= ఏ దేవుని బొడ్డున తామరపూవు; విధాతన్= బ్రహ్మదేవుడిని; ఈనెన్= కనెనో; జగములు+అన్నియున్= లోకాలు అన్నీ; ఎవ్వనిచేన్= ఏ దేవుడిచేత - ఎవడికారణంగా; నివ్వటిలున్= కలుగునో; ఆ+ముకుందున్= ఆ విష్ణువును; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలో అనంతమైన భేదాలున్నా, మొత్తం సృష్టిని రెండే రెండు విధాలుగా - భాగాలుగా - భేదాలుగా చేయవచ్చును. ఒకటి కదిలేవి, రెండు కదలనివి. ఈ రెండింటికీ అధిపతి ఆ విష్ణువే. ఆ దేవుని బొడ్డు తామరనుండే సకలసృష్టికీ కర్త బ్రహ్మ పుట్టుకొచ్చాడు. ఆ దేవుడివలననే ఎల్లలోకాలూ ఏర్పడుతున్నాయి - కాగా అట్టి దేవుడిని సదా సేవిస్తాను.

తే. స్థావరములు జంగమములు ధాత లోను । గాఁగఁ బ్రళయంబు నొందిన కాలమునను
నిలుచు నెవ్వఁ డొకండ యానిత్యసత్య । లలితు శార్ఙిఁ బ్రపన్నుఁ గాఁ గొలుతు నియతి. 219

ప్రతిపదార్థం: స్థావరములు= చలనంలేనివి; జంగమములు= తిరిగెడివి; ధాత లోనుగాఁగన్= బ్రహ్మ లోనైనది (సర్వమును); ప్రళయంబున్+ఒందిన కాలమునను= వినాశనం పొందిన సమయాన; ఎవ్వఁడు+ఒకండు+అ= ఏవాడు ఒకడే; నిలుచున్= నశించక నిలబడి ఉంటాడో; ఆ నిత్య సత్య లలితున్= అట్టి నిత్యమైన నిజమైన సుకుమారుడిని; శారిన్= విష్ణువును; ప్రపన్నుగాన్= శరణుకోరిన వాడినిగా (నేను); నియతిన్= నియమంతో; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలోని లోకాలన్నిటికీ ప్రళయం - చివరి వినాశం - తప్పదు. అపుడు సృష్టిలో సర్వస్వమూ కదిలేవీ కదలనివీ, బ్రహ్మ మొదలు పిపీలిక (చీమ) వరకు లయమై పోయినా, ఏ ఒక్కడు మాత్రం నశించక నిలిచి ఉంటాడో, ఆ శాశ్వతుడిని, సత్యుడిని, సుకుమారుడిని, శ్రీ మహావిష్ణువును శరణు కోరుతూ నియమంతో సేవిస్తాను.

విశేషం: పుట్టినది ఏదైనా గిట్టక మానదు. బ్రహ్మ పుట్టినవాడేగాబట్టి ప్రళయకాలాన ఆయనకూ గిట్టుట తప్పదు. ఇక్కడ బ్రహ్మకూడా లయమౌతాడని చెప్పటంలో తాత్పర్యమేమిటంటే నిజానికి ఆయనే సకలసృష్టికర్త. ఆయనే నశిస్తే ఆయన సృష్టివిషయంలో చెప్పవలసిన పనిలేదు.

క. కాలముఁ బర్జన్యుండును । నేలయు సస్యంబుఁ గ్రియయు నిష్క్రియయును ధ
ర్మాలోకమునై మహిమన్ । లీల సలుపు వాసుదేవునిం బ్రణుతింతున్. 220

ప్రతిపదార్థం: కాలమున్= క్షణాలూ, గంటలూ, దినాలూ - మాసాలు - వత్సరాల రూపంలో ఉండే కాలమూ; పర్జన్యుండును= మేఘుడును - పంటలకు అధిదేవతయూ; నేలయున్= భూమీ - పంటలకు ఆధారం; సస్యంబున్= పంటా; క్రియయున్= పంటకు-ఇతరానికి హేతువయిన పనీ; నిష్క్రియయును= పని లేకుండుటా; ధర్మ+ఆలోకమును+ఐ= ధర్మం యొక్క వెలుతురు కూడా (తాను) అయి; మహిమన్= గొప్పదనముతో; లీల+చలుపు= వినోదం చేసే; వాసుదేవునిన్= వసుదేవుడి తనయుడిని- శ్రీకృష్ణుడిని; ప్ర+నుతింతున్= కీర్తిస్తాను.

తాత్పర్యం: శ్రీకృష్ణతత్వం మహిమోపేతం. వాసుదేవుడే సృష్టిలో కాలం. అతడే పంటలు పండించే మేఘుడు కూడా. పంటలకు ఆధారమైన నేలా ఆతడే. అంతేకాదు స్వయానపంటకూడా తానే. ఆ పంటకు కావలసిన పనిపాటలూ శ్రీకృష్ణుడే! అంతేకాదు ఏ పనీ లేని స్థితీ శ్రీకృష్ణతత్వమే. చివరకు ధర్మానికి వెలుతురూ శ్రీకృష్ణుడే, ఇట్లా అంతా తానే అయి, తన మహిమతో సృష్టివినోదాన్ని నెరపే వాసుదేవుడిని కొనియాడుతాను.

విశేషం: భగవతత్వానికి, భగవల్లీలకు వెలి అయిన దేదీ సృష్టిలో లేదు. అంతా భగవన్మయ మీ సృష్టి.

క. అనలునకు రవికిని శశాం । కునకును గ్రహ తారకములకును దేజం బె
వ్వనివలన నావహిల్లెడు । ననుపాధిక తేజఁ గొల్తు నవ్విశ్వాత్మున్. 221

ప్రతిపదార్థం: అనలునకున్= అగ్నికి; రవికిని= సూర్యుడికీ; శశ+అంకునకును= కుందేలు గుర్తుగా కలవాడికి - చంద్రుడికీ; గ్రహ తారకములకును= (ఆకాశంలోని ప్రకాశించే) గ్రహాలకూ, చుక్కలకూ; ఎవ్వనివలనన్= ఏ దేవుడివలన; తేజంబు= కాంతి; ఆవహిల్లెడున్= కలుగునో; న+ఉపాధిక తేజున్= కారణం లేకయే తేజస్సు కలవాడిని; ఆ+విశ్వ+ఆత్మున్= ఆ విశ్వమే శరీరంగా కలవాడిని; కొల్తున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలో సూర్యచంద్రులూ, అగ్నీ, గ్రహాలూ, నక్షత్రాలూ - ఇవన్నీ తేజస్సులు చిమ్ముతూ వెలగటానికి ఏ సహజతేజస్సు కారణమో, ఆ విశ్వమయుడిని సేవిస్తాను.

విశేషం: సృష్టిలో తేజస్సమూహమంతా సోపాధికమే - సకారణమే - భగవత్తేజస్సు కారణంగా ఆ తేజస్సులు జ్వలిస్తున్నాయి. కాని, భగవత్స్వరూపమైన తేజస్సు మాత్రం సహజం. ఇతర తేజస్సులకు అది కారణమే కాని, దానికి కారణం మరిలేదు. అదే 'అనుపాధిక తేజము'. దేవుడు తేజోరూపుడనుట.

తే. నాలుగింటను వెండియు నాలుగింటఁ । రెంట నైదింట మఱియును రెంట వేల్చి
యజ్ఞశీలు రారాధించునట్టి విష్ణుఁ । డిష్టదాయి ప్రసన్నుఁ డయ్యెడును నాకు. 222

ప్రతిపదార్థం: నాలుగింటను= నాలుగు అక్షరాలతో - 'ఆశ్రావయ' అనే మంత్రంతో (దీనిలో నాలుగు అక్షరాలున్నాయి); వెండియున్= మరలా; నాలుగింటన్= నాల్గు అక్షరాలతో -'అస్తుశ్రౌషట్' అనే మంత్రంతో (దీనిలోనూ నాలుగు అక్షరాలే); రెంటన్= రెండు అక్షరాలతో-'వషట్' అనే మంత్రంతో (రెండు వర్ణాలు గలది); ఐదింటన్= ఐదు వర్ణాలతో -'యే యజామహే' అనే మంత్రంతో (ఐదు అక్షరాలు); మఱియును= ఇంకనూ; రెంటన్= రెండు వర్ణాలతో - 'వషట్' మంత్రంతో; వేల్చి= అర్చించి - యజనం చేసి; యజ్ఞశీలురు= యజ్ఞాలు (చేసే) స్వభావం కలవారు; ఆరాధించునట్టి= సేవించునట్టి; విష్ణుడు= విష్ణుదేవుడు; ఇష్టదాయి= ఇష్టమును ఇచ్చేవాడు; నాకున్= ఈ అనుస్మృతిని పలికే నాకు; ప్రసన్నుఁడు+అయ్యెడును= అనుగ్రహం గలిగినవాడు అగుగాక! నన్ను అనుగ్రహించు గావుత!

తాత్పర్యం: యజ్ఞనిర్వహణంలో మంత్ర పూర్వకంగా దేవతలను తృప్తి పరచటం జరుగుతుంది. అట్టిచో విష్ణుదేవుడికి ప్రియమైన మంత్రాలను సంఖ్యానిర్దేశంతో తెల్పుతూ ఆయా మంత్రాలతో యాజులు ఆరాధిస్తే ఇష్టాలు ఒనగూర్చే

విష్ణుదేవుడు నా యెడకూడా ప్రసన్నుడౌగాక - అని భక్తుడు వేడుకొంటున్నాడు. ఇక విష్ణుప్రీతికి పాత్రమైన మంత్రాలు 'ఆశ్రావయ' 'అస్తుశ్రౌషట్', 'యేయజామహే', ' వషట్' అనేవి.

విశేషం:. యజ్ఞశబ్దానికి మొదటి అర్థం 'పూజ'. అనంతరం అది ఒక పెద్ద 'క్రతువు'గా రూపొందింది.

ఆ. యజ్ఞధరుఁడు పంచయజ్ఞుండు లక్ష్మికి । నునికిపట్టు యోగమునకు నెలవు
సర్వమునకు నిష్టసదనంబుగా నొప్పు । వాని నాశ్రయింతు వరదుఁ బరము. 223

ప్రతిపదార్థం: యజ్ఞధరుఁడు= యజ్ఞమును ధరించినవాడు; పంచయజ్ఞుఁడు= ఐదు యజ్ఞములు - వేదపఠనం, వైశ్వదేవం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి కలవాడు; లక్ష్మికిన్= సిరికి; ఉనికిపట్టు= నివాస స్థానం; యోగమునకున్= యోగ విద్యకు; నెలవు= తావు - ఆవాసము; సర్వమునకున్= అంతటికీ; ఇష్టసదనంబు గాన్= ప్రియమైన ఇల్లుగా - అన్నిటికీ ఆస్పదమైనవాడుగా; ఒప్పు= వెలుగు; వానిన్= అతడిని - ఆ దేవుడిని; వరదున్= వరాలు ఇచ్చేవాడిని; పరమున్= పరమాత్మను; ఆశ్రయింతున్= శరణు పొందుతాను.

తాత్పర్యం: విష్ణుమూర్తి యజ్ఞధారి - యజ్ఞగర్భుడు, వేదపఠనం మొదలైన ఐదు యజ్ఞాల స్వరూపం తాల్చినవాడు. లక్ష్మికి నివాసమైనవాడు, యోగానికీ, ఇంకా ఎన్నింటికో ఉత్తమమైన, కోరదగిన అన్నింటికీ ఆస్పదమైనవాడు, వరాలకు దాత - పరమాత్మ; అతడిని ఆశ్రయిస్తాను.

క. అగమనునిం బాంథు నఖిల । జగద్భరణపరు నమూర్తి సాగరనిభ బో
ధ గరిష్ఠుఁ బంచకాల । జ్ఞు గుణాత్మకు నిర్గుణత్వ శోభితుఁ గొలుతున్. 224

ప్రతిపదార్థం: అగమనునిన్= గమనం-నడకలేనివాడిని; పాంథున్= బాటసారిని (నడిచేవాడిని); అఖిల జగత్+భరణపరున్= మొత్తం లోకమును భరించటంలో ఆసక్తుడిని - భరించేవాడిని; అమూర్తిన్= ఆకారం లేనివాడిని; సాగరనిభ బోధ గరిష్ఠున్= సముద్రంతో సమానమైన జ్ఞానంతో మిక్కిలి గొప్పవాడిని; పంచకాలజ్ఞున్= ఐదు కాలాలను ఎరిగిన వాడిని; గుణ+ఆత్మకున్= గుణములు ఆత్మయందు కలవాడిని; నిర్గుణత్వ శోభితున్= గుణరహితతత్వంతో ప్రకాశించేవాడిని; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: భగవల్లీలలు విచిత్రంగా ఉంటాయి. వాటిలో వైరుద్ధ్యాలు గోచరిస్తాయి - స్థూలదృష్టికి, దేవుడు నడక లేనివాడయి కూడా గమనశీలిగా పాంథుడిగా భాసిస్తాడు. లోకాలు మొత్తం మోస్తూ కూడా తాను ఆకారమే లేకుండా ఉంటాడు. సముద్రమంత తెలివితో అందరికంటె గొప్పవాడు. ఐదు కాలాలూ తెలిసినవాడు. (ప్రాతఃకాలం, సంగమకాలం, మధ్యాహ్నకాలం, అపరాహ్ణకాలం, సాయంకాలాలు ఆయనకు తెలుసును.) ఎట్లంటే - స్వయంగా ఆయన కాలస్వరూపుడు మరి! గుణగణాలకు నిలయమైనవాడూ ఆయనే - నిర్గుణుడూ ఆయనే. అటువంటి గొప్పదేవుడిని సేవిస్తాను.

విశేషం: భగవద్వర్ణనలోని విరోధాలన్నీ నిజానికి ఆభాసమాత్రాలు. వాస్తవాలు కావు. స్థూల దృష్టికి విరోధం. సూక్ష్మదృష్టికి ఆభాసం-అయథార్థం.

క. వ్యక్తమునకుఁ బ్రభవం బ । వ్యక్తం బాతత్త్వమునకు నవల యను వచో
యుక్తికిఁ బరాయణం బగు । భక్తపరాధీను భవ్య భావ్యు నుతింతున్. 225

ప్రతిపదార్థం: వ్యక్తమునకున్= వ్యక్తమైన - ప్రకటితమైన - కనిపించేదానికి; ప్రభవంబు= కారణం; అవ్యక్తంబు= వ్యక్తం కానిది; ఆ తత్త్వమునకున్= ఆ అవ్యక్తతత్త్వానికి కూడా; అవల= అటువైపు - ఆవలితనము; అను వచన్+యుక్తికిన్= అనే మాట తీరునకు;

పరాయణంబు+అగు= ఆశ్రయమైన; భక్తపర+అధీనున్= భక్తులకు లోబడినవాడిని; భవ్యభావ్యున్= శుభమునకై భావించదగ్గవాడిని; నుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: సృష్టి వ్యక్తరూపం; దానికి మూలం అవ్యక్తం - వ్యక్తంకానిది. అయితే ఆ అవ్యక్తానికి కూడా అందక దానికి ఆవల ఉండేది విష్ణుతత్త్వం. అంత గంభీరమైనది అది. అట్టి సర్వోన్నతతత్త్వానికి ఆశ్రయమైనవాడు అయినా భక్తులకు మాత్రం బానిస అయిన ఆ దేవుడు శుభకామనగల ఎల్లవారికీ భావింపదగ్గ, సేవింపదగ్గవాడు. అతడిని స్తుతిస్తాను.

విశేషం: విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం కలిసే స్థలాలు అక్కడక్కడా అపుడపుడు తటస్థపడుతుంటాయి. ఇక్కడ అది జరిగినట్లుంది. అవ్యక్తం నుండి వ్యక్తం ఉద్భవిస్తుం దంటుంది తత్త్వశాస్త్రం. దీనితో వైజ్ఞానికులు విభేదించరు. ఎందుకంటే అవ్యక్తం శూన్యం కాదు కాబట్టి.

క. జ్ఞాన ధ్యాన పరాయణు । లైన మహాత్ములు జితేంద్రియత్వ మహితు లె
వ్వానిం బొందిన మరలరు । వాని శరణుఁ జొచ్చి బ్రదుకువాఁడ సుకృతినై. 226

ప్రతిపదార్థం: జ్ఞాన ధ్యాన పరాయణులు+ఐన= జ్ఞానంలో, ధ్యానంలో (మాత్రం) ఆసక్తులయిన; మహా+ఆత్ములు= గొప్ప ఆత్మలు కలవారు; జిత+ఇంద్రియత్వ మహితులు= ఇంద్రియాలను జయించినతనంతో పూజ్యులు; ఏ వానిన్= ఏ దేవుడిని; పొందినన్= చేరినచో; మరలరు= తిరిగిరారో; వానిన్= అట్టి దేవుడిని; శరణు+చొచ్చి= శరణు - ఆశ్రయం పొంది; సుకృతిని+ఐ= పుణ్యాత్ముడనై; బ్రదుకువాఁడన్= జీవిస్తాను.

తాత్పర్యం: లోకంలో అసాధారణు లయిన మహాత్ము లున్నారు. వారికి జ్ఞానం, ధ్యానం - ఈ రెండే నిత్యకృత్యాలు. వారు ఇంద్రియాలను జయించి, పూజలందుకొనే గొప్పవారు. అట్టి మహాత్ములు ఏ దేవుడిని చేరి పునర్జన్మ లేకుండా ముక్తిని పొందుతారో - ఆ గొప్ప దేవుడిని - విష్ణుమూర్తిని పుణ్యాత్ముడనై ఆశ్రయించి జీవిస్తాను.

విశేషం: ఈ దేశాన వేదాంతులు కోరే చివరి దశ మోక్షం. ఆ మాటకు అర్థం ఎడబాటు - విడివడుట అని. ఎడబాటు దేనినుండి? జన్మ పరంపర నుండి. పునర్జన్మ లేకుండా ఉండగలగటమే ముక్తి. అది ఇక్కడి పురుషప్రయోజనాలలోకూడా చివరిది, గొప్పది.

క. లోకం బంతయు నెవ్వం । డేకాంశంబునన నిర్వహించుచు నగ్రా
హ్యాకారుండై వెలుఁగు ద । యాకరు నప్పద్మనాభు నభివర్ణింతున్. 227

ప్రతిపదార్థం: ఎవ్వండు= ఏ దేవుడు; లోకంబు+అంతయున్= జగత్తు మొత్తాన్ని; ఏక+అంశంబునన్+అ= (తన) ఒక అంశం-భాగంతోనే; నిర్వహించుచున్= మోస్తూ - జరిపిస్తూ; అగ్రాహ్య+ఆకారుండు+ఐ= గ్రహించనలవిగాని స్వరూపం కలవాడై; వెలుఁగు= ప్రకాశించునో; దయాకరున్= దయను చేసే (చూపే)వాడిని; ఆ+పద్మనాభున్= పద్మం బొడ్డునగలవాడిని - విష్ణువును; అభివర్ణింతున్= బాగా పొగడుతాను.

తాత్పర్యం: ఈ కనిపించే లోకం చాలా పెద్దది. ఇంత పెద్ద లోకాన్నంతటినీ తనలోని ఒక చిన్న అంశతోనే నడుపుతూ, తాను మాత్రం అగుపించకుండా, తన ఆకారాన్ని గ్రహించటానికి వీలులేనిదానినిగా అమర్చుకొన్న ఆ తేజోమయుడిని, దయాశాలిని - విష్ణుమూర్తిని అభివర్ణిస్తాను.

తే. అయిదు దెఱఁగులఁ బ్రకృతిఁ బంచాననముల । ననుభవించు క్షేత్రజ్ఞు సత్త్వాది గుణ చ
యంబు లీల భుజించు మహత్త్వ కలితు । సంశ్రయింతు మదాత్మ ప్రసక్తిఁ గోరి. 228

ప్రతిపదార్థం: అయిదు తెఱఁగులన్+ప్రకృతిన్= ఐదు విధాలయిన మూల సృష్టిని; పంచ+ఆననములన్= ఐదు ముఖాలతో; అనుభవించు క్షేత్రజ్ఞున్= చవిచూచే ఆత్మ స్వరూపుడిని; సత్త్వ+ఆది గుణచయంబున్= సత్త్వం మొదలయిన గుణాల సమూహాన్ని; లీలన్= వినోదంగా, విలాసంగా; భుజించు= భక్షించు - మ్రింగివేయు; మహత్త్వ కలితున్= గొప్పతనంతోకూడిన వాడిని; మత్+ఆత్మ ప్రసక్తిన్+కోరి= నా ఆత్మయొక్క చొరబాటును అభిలషించి; సంశ్రయింతున్= ఆశ్రయిస్తాను.

తాత్పర్యం: సృష్టికికర్త దేవుడు; దానికి భోక్త కూడా ఆయనే. తుదకు వినాశకర్త కూడా ఆయనే. పంచభూతాలతోడి ఈ ప్రకృతిని దేవుడు తన ఐదు ముఖాలతో అనుభవిస్తూ క్షేత్రజ్ఞుడుగా వెలుగుతున్నాడు. సృష్టిలోని జీవజాలాల ప్రవృత్తులకు కారణభూతాలైన సత్త్వరజస్తమోగుణాలను చివరకు ఆయనే తనలో లీనం చేసికొంటున్నాడు. అట్టి గొప్పతనంతో కూడిన భగవంతుడిని నా ఆత్మ ఏకాగ్రతకొరకు ఆశ్రయిస్తాను.

విశేషం: మన ఆరాధనలు, పూజలు, పురస్కారాలు - అన్నీ చిత్త ఏకాగ్రతకొరకు ఉద్దిష్టమైనవి. మనస్సు ఏకాగ్రమైతే, నరుడు నారాయణుడు కావచ్చునని మన తాత్త్వికుల బోధ.

క. మతి గల సాంఖ్యులు, యోగా । న్వితులు నగుమహాత్ము లెవ్వనిం గని పున రా
గతిలేని సుగతి వడయుదు । రతర్క్య వైభవునిఁ దలఁతు నప్పరమాత్మున్. 229

ప్రతిపదార్థం: మతిగల= బుద్ధిగల; సాంఖ్యులు= సాంఖ్యయోగులు - పంచభూతాలు - వాటి పంచ గుణాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి, జీవుడు మున్నగు ఇరవై ఐదు తత్త్వాలతోడి పరమాత్మ ధ్యానమును చేసేవారు; యోగ+అన్వితులున్= యోగవిద్యతో కూడినవారూ; అగు మహా+ఆత్ములు= ఐన గొప్ప మనస్సులు కలవారు; ఎవ్వనిన్+కని= ఏ దేవుడిని చూచి (పొంది); పునఃఆగతి లేని= మరలి రావటం లేని; సుగతి+పడయుదురు= మోక్షాన్ని పొందుతారో; ఆ+పరమ+ఆత్మున్= ఆ పరమాత్మ - పరబ్రహ్మ స్వరూపుడిని; అతర్క్య వైభవునిన్= ఊహించరాని విభవం - సంపత్తి గలవాడిని; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: బుద్ధిమంతులైన సాంఖ్యయోగులూ, ఇతర యోగవిద్యాప్రవీణులూ అయిన మహాత్ములు ఏ దేవుడిని చేరిన పిదప, ఇక మరలిరాని ముక్తిని - పునర్జన్మ రాహిత్యాన్ని పొందుతారో, ఆ పరబ్రహ్మ స్వరూపుడిని, ఊహకందని గొప్ప వైభవముగల ఆ దేవదేవుడిని స్మరిస్తాను.

విశేషం: సాంఖ్యమనేది ఒక యోగానికి పేరు. సంఖ్యా శబ్ద నిష్పన్నం సాంఖ్యం. ఈ యోగవిద్య సంఖ్యమీద ఏర్పడినట్లుగా ఉంటుంది. పంచభూతాలు - పంచగుణాలు, పంచ ఇంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనో బుద్ధి అహంకార ప్రకృతి జీవులు ఐదు- ఇట్లా ఈ 5×5= 25 తత్త్వాలతోడి శాస్త్రమిది. మనకున్న దర్శనాలలో ఒక ముఖ్యమైనది.

క. ఇనునడుమ వెలుంగుచు సో । ముని మధ్యమునం జలత్వముం బొందని ని
ప్పున వెలయు దీప్తి యగు వా । ని నిరంజను నంతరాత్మునిం బాటింతున్. 230

ప్రతిపదార్థం: ఇను నడుమన్= సూర్యుడి మధ్యభాగాన; వెలుంగుచున్= ప్రకాశిస్తూ; సోముని మధ్యమునన్= చంద్రుడి నడిమి భాగాన; జలత్వమున్+పొందని= నీటితనమును చెందనివానిని; నిప్పునన్= అగ్నియందు; వెలయు= వెలిగే; దీప్తి+అగువానిన్= కాంతి - ప్రకాశము అయినవాడిని; నిరంజనున్= పరమాత్మను; అంతర్+ఆత్మునిన్= లోపలి (నరుడిని) ఆత్మయైనవాడిని; పాటింతున్= (స్మరిస్తాను) గౌరవిస్తాను.

తాత్పర్యం: విష్ణుతత్వం తేజోమయం. విష్ణువు సూర్యుడి నడుమ వెలుగుతుంటాడు. చంద్రుడిలో కూడా విష్ణుడు నడుమ నిలిచి, ఆ చల్లదనానికి నీరుగాకుండా నిలిచి ఉంటాడు. నిప్పులోని వెలుగూ వైష్ణవమే. ఈ విధంగా సర్వ తేజస్సులకూ తేజస్సుగా నిలిచిన అంతరాత్మస్వరూపుడైన ఆ పరమాత్మను గౌరవిస్తాను.

విశేషం: సృష్టమైనదేదీ సూర్యచంద్ర అగ్నులలో నిలిచి ఉండలేదు. స్రష్టకే (సృష్టిని చేసేవాడు బ్రహ్మ) స్రష్ట గాబట్టి విష్ణువు ఆ మూడు మహాతేజస్సుల నడుమ నిలిచి ఉన్నాడు.

క. సోమార్కాగ్నిమయముఁ దా । రామయమును నిత్య సుస్థిరంబును నగు తే
జోమయతత్త్వము నాత్మా । రామత్వంబున నిరంతరంబును జూతున్. 231

ప్రతిపదార్థం: సోమ+అర్క+అగ్ని మయమున్=చంద్రుడు, సూర్యుడు, అగ్నితో నిండినదానిని; తారామయమును= నక్షత్రాలతో నిండినదియు; నిత్య సుస్థిరంబును+అగు= ఎల్లప్పుడూ గట్టిగా నిలిచి ఉండేదీ అగు; తేజస్+మయతత్త్వము= కాంతితో నిండిన బ్రహ్మమును; ఆత్మ+ఆరామత్వంబునన్= ఆత్మయందే విహరించే శీలంతో; నిర్+అంతరంబును= ఎడం లేకుండా - ఎల్లప్పుడూ; చూతున్= చూస్తాను.

తాత్పర్యం: విష్ణుతత్త్వం తేజోమయం. చంద్రుడిలో, సూర్యుడిలో, అగ్నిలో ఉన్నది విష్ణువే. నక్షత్రాలలోని వెలుగూ వైష్ణవమే - విష్ణువునకు చెందినదే. ఈ వైష్ణవతేజస్సు నిత్యమైనది, సుస్థిరమైనది కూడా. ఇట్టి ఈ కాంతిమయ తత్త్వాన్ని అంతర్‌దృష్టితో ఆత్మలోనే నిరంతరం దర్శిస్తుంటాను.

విశేషం: ఈ దైవతత్త్వం ఎవరెన్ని విధాల వర్ణించి చెప్పినా, చివరకు అనుభవైకవేద్యమే. ఎందుకంటే, మాటలకు ఆలోచనలకు ఎంత విస్తృతి ఉన్నా కాని, పరిమితులూ, పరిధులూ ఉన్నాయి. అవి (వాక్కు మనస్సు) చెల్లని చోటులు లోకానుభవంలోనే మనకు ఎదురవుతుంటాయి. ఉదా: 'బెల్లం తియ్యగా ఉంటుంది'. 'తియ్యగా' అంటే ఏమిటి? తియ్యన ఒక రకంగా గుర్తించగలమే గాని, ఎదుటివానికి స్వానుభవానికి దూరంగా ఎరుకపరచగలమా? ఈ స్వల్ప విషయమే ఇట్లా ఉంటే, దైవతత్త్వం మహా దొడ్డది - దాని విషయం వేరే చెప్పాలా? అయినా నరుడి ప్రయత్నాలు దైవతత్త్వవర్ణనలో కొనసాగుతూనే ఉన్నాయి.

క. గుణములకు నాదియై ని । ర్గుణమ్ములకు నాద్యుఁడగు నరూపుని లక్ష్మీ
ప్రణయవరు నజుని సూక్ష్మునిఁ । బ్రణుతింతుఁ బ్రసన్నుఁగాఁ బరము సర్వగతున్. 232

ప్రతిపదార్థం: గుణములకున్= (సృష్టిలోని) వస్తువులలోని ధర్మములకు; ఆది+ఐ= మొదలై; నిర్+గుణమ్ములకున్= గుణముల లేమికి కూడా; ఆద్యుఁడు+అగు= మొదటివాడగు; అరూపునిన్= రూపంలేని వాడిని; లక్ష్మీ ప్రణయవరున్= లక్ష్మీదేవి ప్రేమను పొందినవాడిని; అజునిన్= పుట్టుకలేనివాడిని; సూక్ష్మునిన్= ఆధ్యాత్మమైన వానిని; పరమున్= పరమాత్మను; సర్వగతున్= అంతటా ఉండేవాడిని; ప్రసన్నున్+కాన్= అనుగ్రహించేవాడగుటకు; ప్ర+నుతింతున్= బాగుగా పొగడుతాను.

తాత్పర్యం: విష్ణుతత్త్వం విచిత్రంగా ఉంటుంది. విష్ణువు సృష్టిలోని వస్తుగత గుణగణాలు అన్నిటికీ మొదటివాడు. అయినా స్వయంగా గుణాతీతుడుగా గుణరహితుడుగా కూడా ఉంటాడు. ఆయనకు స్వరూపమే లేదు - అంతటా అన్నిటా ఉండేవాడికి ఒక్క స్వరూపం ఎట్లా ఉంటుంది మరి! అయినా విష్ణువు శ్రీలక్ష్మీప్రణయాన్ని అందుకొన్నవాడు- అంటే సాకారుడన్నమాట. నిరాకారుడూ అతడే; సాకారుడూ అతడే. విష్ణువు పుట్టుక లేనివాడు, ఆధ్యాత్మికమైన ఉనికి కలవాడు. అంతా వ్యాపించి ఉండేవాడు విష్ణువు. పరమాత్ముడతడు. అట్టి దేవుడిని అనుగ్రహం కొరకు నుతిస్తాను.

విశేషం: గుణాలు వ్యక్తినిష్ఠాలు - వ్యక్తిలో ఉండేవి. వ్యక్తి ఆత్మకు నిలయం. ఆత్మ పరమాత్మకు రూపాంతరం. కాబట్టి గుణాలకు ఆద్యుడే దేవుడు. పరమాత్మ సర్వవ్యాపకమైనది. సర్వప్రాణిగతమైనది కూడా. కాబట్టి ఈ సర్వగతత్వమున్నచోట ఏకవ్యక్తి గుణాల ఉనికి అసంభవం. కాగా నిర్గుణుడూ ఆయనే. ఈ విధంగా తర్కసహాయంతో ఈ విశేషణాలను సమర్థించుకొనాలి.

క. కలయంగ నెల్లయెడలం । దలలును లోచనములును వదనములు నగు ని
ర్మలు నిర్వికారు నిన్నుం । గొలిచెద సర్వైకసాక్షి గోవింద హరీ! 233

ప్రతిపదార్థం: గోవింద!= ఓ విష్ణుమూర్తీ!; హరీ!= ఓ నారాయణా!; కలయంగన్= బాగుగా; ఎల్ల+ఎడలన్= అన్ని ప్రదేశాలలో; తలలును= శిరస్సులూ; లోచనములును= కన్నులూ; వదనములున్= మోములూ; అగు నిర్మలున్= కల మలినరహితుడిని; నిర్వికారున్= వికారాలు లేనివాడిని; సర్వ+ఏక సాక్షిన్= అన్నింటికీ ఒక్కడే సాక్షిఅయినవాడిని; నిన్నున్= నిన్ను హరిని; కొలిచెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: ఓ శ్రీహరీ! నీది విశ్వరూపం. అన్ని ఎడలా నీ శీర్షాలే, నీ లోచనాలే, నీ ముఖాలే, అయినా మలిన మంటని వాడవు. సృష్టి నిజానికి వికృతిమయం. కాని, నీవు వికృతులు లేనివాడవు. సృష్టిసర్వస్వానికి ఏకసాక్షిగా నిలిచే నిన్ను సేవిస్తాను దేవా!

క. నిను నెఱుఁగకున్న సంసా । ర నిమగ్నత వోదు; గోచరము గావు మనం
బునకు నఖిలేంద్రియములకు । నను నేమనువాఁడ నిఁక నారాయణుఁడా! 234

ప్రతిపదార్థం: నారాయణుఁడా!= ఓ నారాయణస్వామీ!; నినున్= సర్వవ్యాపకుడవైన నిన్ను; ఎఱుఁగక+ఉన్నన్= తెలియకుండా ఉంటే; సంసార నిమగ్నత= సంసారమున (కుటుంబమున) మునిగి ఉండటం; పోదు= తొలగదు; (నీవు) మనంబునకున్= మనస్సునకు గాని; అఖిల+ఇంద్రియములకున్= ఎల్ల ఇంద్రియాలకూ - కన్ను ముక్కు వంటివాటికి; గోచరము కావు= కనిపించవు-తెలియవు; ఇంకన్= ఇకమీదట - ఈ స్థితి ఇట్లా కొనసాగగా; ననున్= శక్తిహీనుడనైన నన్ను; ఏమి+అనువాఁడన్= ఏమి నిందించుకొంటాను? (నన్ను నేను ఏమని నిందించుకొనేది దేవా!)

తాత్పర్యం: దేవా! నీ తత్త్వం గ్రహిస్తే తప్ప ఈ సంసారబంధం విడిపోదు. నీ వేమో ఎల్ల ఇంద్రియాలకు కాదు కదా, మనస్సుకూ కనిపించవు, తెలియరావు. ఇక నన్ను నేను ఏమనుకోవాలి? (నన్ను నేను ఏమని అనాలి!)

విశేషం: దైవజ్ఞానం లోకజ్ఞానంకంటె భిన్నమైనది. లోకజ్ఞానానికి ఇంద్రియాలూ, మనస్సు చాలు. కాని, దైవజ్ఞాన - అవాప్తికి ఈ రెండూ యథాతథంగా - ఉన్నవి ఉన్నట్లుగా పనికిరావు. అందుకనే 'నీవు గోచరించనందుకు నన్ను నేను ఏమనాలి?' అని నిర్వేదం వెలువరిస్తున్నాడు భక్తుడు.

క. రోషముఁ గామము రాగ । ద్వేషములును లేక భక్తి తిరమై యేకా
శ్లేషిణిగాఁ గొలుతు రవి । శ్లేష మనోనిలయ వృత్తి సిద్ధులు నిన్నున్. 235

ప్రతిపదార్థం: సిద్ధులు= సిద్ధిపొందినవారు; రోషమున్= కోపమూ; కామమున్= కోరికా; రాగద్వేషములును= ప్రేమా, పగా ఇవన్నీ; లేక= ఉండకుండా; భక్తి= భజనభావం; తిరము+ఐ= స్థిరమై; ఏక+ఆశ్లేషిణి+కాన్= ఒకటే (తాను) సంసక్త మౌనట్లుగా; అవిశ్లేష మనస్+నిలయ వృత్తిన్= విడిపోని మనస్సు అనే ఇంట ఉండటంవలన; నిన్నున్= పరమాత్మవైన నిన్ను; కొలుతురు= సేవిస్తారు.

తాత్పర్యం: సిద్ధిని - వాంఛితార్థాన్ని పొందినవారు మాత్రం నిన్ను చూడగలుగుతున్నారు. కొలువ గలుగుతున్నారు. వారు కోపం, కోరిక, ప్రేమ, పగ వంటి వికృత భావాలను విడిచిపెట్టి, కేవలం భక్తినే ఆశ్రయించి, నిరంతరం ఆ భావంనుండి బయటపడక, వారి మనస్సులనే ఇళ్ళలో కాపురముండే నిన్ను చూడగలుగుతున్నారు, సేవిస్తున్నారు.

విశేషం: దైవతత్త్వ దర్శనానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో భక్తి మార్గం సుగమం. అందరికీ అందుకొనదగ్గది. దాన్ని వివరించాడు ఇక్కడ.

క. ఫలములు గోరక కర్మం । బులు నడపుచు వాని విమలబోధాగ్నిహతిం
బొలియించుచు నిర్ద్వంద్వత । నెలకొను నేకాంతిజనులు నినుఁ గండ్రు హరీ! 236

ప్రతిపదార్థం: హరీ!= ఓ విష్ణూ!; ఫలములు= ఫలితాలు; కోరక= ఇచ్చగించక; కర్మంబులు= పనులు; నడపుచు(న్)= నిర్వహిస్తూ; వానిన్= ఆ ఫలితాలను - పనులవలన ఒనగూడే ప్రయోజనాలను; విమల బోధ+అగ్నిహతిన్= నిర్మలమైన జ్ఞానం అనే నిప్పు తాకిడితో; పొలియించుచున్= నశింపజేస్తూ; నిర్ద్వంద్వత= ద్వంద్వములు - సుఖదుఃఖములు, మంచి చెడులు, ప్రేమ, ద్వేషం వంటి సహజములైన జంటలు లేకుండటం; నెలకొను= స్థిరపడిన - ఏర్పడిన; ఏక+అంతిజనులు= చిత్త ఏకాగ్రతగలవారు; నినున్= సర్వవ్యాపివయిన నిన్ను; కండ్రు= చూస్తారు.

తాత్పర్యం: ఓ విష్ణూ! నీ విశ్వరూప సందర్శనం కావాలంటే నరులు వారి నడతలు, ఆలోచనలు మార్చుకొనాలి. ఫలితాలు ఆశించకుండా పనులు నిర్వహించుకుంటూ పోయి, తుదకు ఆ కర్మఫలాలను నిర్మలజ్ఞానమనే నిప్పు తాకుతో హరించివేసికొని, సుఖదుఃఖాలు, ప్రేమద్వేషాలువంటి ద్వంద్వాలకు అతీతంగా ఏకాగ్రచిత్తులై నిలువగలిగిన ఘనులే నిన్ను దర్శించగలరు.

విశేషం: మనవేదాంత పరిభాషలో ముక్తి, మోక్షం అనే మాటలకు జన్మరాహిత్యం తాత్పర్యం. తిరిగి పుట్టకపోవటమే - జన్మచక్రం నుండి బయటపడటమే ముక్తి. పునర్జన్మలకు వాసనలు మూలమంటారు. ఆ వాసనలు కర్మఫలాలనుండి, వాటికై పడే తాపత్రయాల నుండి ఏర్పడుతాయట. అందుకని ఫలంతో ప్రమేయంలేకుండా, అసలు ఆ కోరికే లేకుండా కర్మనిర్వహణం చేయాలని మన వేదాంతశాస్త్రం బోధిస్తుంది. కోరిక లేకపోతే వాసన ఉండదు. వాసన లేక జన్మ లేదు. అలంకారం - రూపకం.

క. దేహస్థ నదేహు నఖిల । దేహసమున్ నిన్ను భక్తిఁ దెలుతురు దురిత
వ్యూహమ్ముఁ బుణ్యచయము న । మోహత నిరసించు యోగిముఖ్యులు కృష్ణా! 237

ప్రతిపదార్థం: కృష్ణా!= ఓ కృష్ణమూర్తీ! దేవా!; దేహస్థున్= దేహంలో ఉన్నవాడిని; అదేహున్= దేహంలేనివాడిని; అఖిల దేహిసమున్= అందరు దేహధారులకు - అన్ని ప్రాణులకు సమానుడయిన వాడిని; నిన్నున్= విశ్వరూపివైన నిన్ను; దురిత వ్యూహమ్మున్= పాపముల సమూహమును; పుణ్యచయమున్= పుణ్యాల ప్రోగును; అమోహతన్= మోహం (తీవ్రకాంక్ష) లేనితనంతో; నిరసించు= తిరస్కరించే; యోగిముఖ్యులు= శ్రేష్ఠులయిన యోగులు; భక్తిన్= భక్తి భావంతో; తెలుతురు= మ్రొక్కుదురు.

తాత్పర్యం: విష్ణువు దేహాన ఉన్నవాడు, కాని, దేహం (స్వయంగా) లేనివాడు. ఎల్ల జీవజాలమూ ఆ దేవుడికి సమానమే. అట్టి ఆ దేవుడిని తెలియగలవారు - గ్రహించగలవారు మాత్రం యోగిశ్రేష్ఠులు. వారు పాపాలనూ పుణ్యాలనూ రెంటినీ తిరస్కరించి, కేవలం భక్తితో ఆ దేవదేవుడికి నమస్కరిస్తారు.

విశేషం: ముక్తిసాధనలో తొలుత పాపపరిహారం కర్తవ్యం. తరువాత పుణ్యసంచయనం కార్యం. ఆ తరువాత, పాపపుణ్య ద్వంద్వ తిరస్కారం ఆచరణీయం.

చ. ప్రకృతియు, బుద్ధ్యహంకృతులు, భావము, భూతచయంబు, నింద్రియ
ప్రకరముఁ గేశవా! భవదుపాశ్రయ భాసిత వర్తనంబు; లా
సకలమునందు నీవును బ్రసన్నత ని; ల్తవి నీకు, నీవు వా
నికి నిలువంగఁ బట్టగుట నిక్కముగా నిటులై వెలుంగవే? 238

ప్రతిపదార్థం: కేశవా!= ఓ విష్ణూ!; ప్రకృతియున్= స్వభావమును; బుద్ధి+అహంకృతులున్= బుద్ధి, అహంకారం అనేవీ; భావమున్= మనస్సూ; భూతచయంబున్= ప్రాణికోటి; ఇంద్రియ ప్రకరమున్= ఇంద్రియాల - కన్ను ముక్కు లోనగు జ్ఞానేంద్రియాల, కాలు చేయి లోనగు కర్మేంద్రియాల సమూహమూ; భవత్+ఉప+ఆశ్రయ భాసిత వర్తనములు= నీ ప్రాపువలన ప్రకాశించే (కలిగే) ప్రవృత్తులు గలవి; ఆ సకలమునందున్= ఆ అన్నింటియందు - ప్రకృతి మొదలు ఇంద్రియాల వరకు గల ఎల్లవానియందును; నీవును= నీవు కూడా; ప్రసన్నతన్= అనుగ్రహంతో; నిల్తు(వు)= నిలుస్తావు - ఉండెదవు; అవి= ఆ అన్నీ - ప్రకృతి మొదలు ఇంద్రియాలవరకు గల మొత్తం; నీకున్= నీకూ; నీవు= విష్ణుడవైన నీవు; వానికిన్= ఆ అన్నింటికీ; నిలువంగన్= నిలుచుటకు-ఉండటానికి - ప్రవర్తించటానికి; పట్టు+అగుటన్= ఆధారమవటంవలన; నిక్కముగాన్= నిజంగా; ఇటులు+ఐ= ఈ విధంగా అయి; వెలుంగవే?= ప్రకాశించవా? - ప్రకాశిస్తావు కదా!

తాత్పర్యం: ఓ విష్ణూ! ఈ కనుపించే ప్రకృతి, కనుపించని బుద్ధి, అహంకారం, మనస్సు సృష్టిలోని ప్రాణిలోకం, జ్ఞాన, కర్మ ఇంద్రియాలు, ఇవన్నీ నీ ప్రాపుతో నీ అదుపాజ్ఞలకు లోబడి ప్రవర్తించేవే! నిజానికి ఆ అన్నింటియందు ప్రసన్నుడవై నీవే నివసిస్తూ ఉంటావు. అవి నీకూ, నీవు వాటికీ పరస్పరం ఆధార - ఆధేయ భావం కలిగి ఉండటం వాస్తవం. ఈ విధంగా సృష్టిలోని అన్నింటా నీవు, నీలో సృష్టి సర్వస్వం - ఒదిగి ఉండటం విచిత్రం! అంతా నీవై ప్రకాశిస్తున్నావు దేవా!

విశేషం: తత్త్వదర్శనం జరిగితే, ద్రష్ట, దృష్టి, దృశ్యమూ మూడు ఒకటే అని భారతీయవేదాంతం ప్రకటిస్తుంది. ఆత్మ పరమాత్మ అనీ, దానికే పరబ్రహ్మ నామాంతరమనీ కొన్ని భారతీయదర్శనాల ప్రబోధం.

క. ఏకత్వం బన్యత్వ మ । నేకత్వము గలుగు నీ మహిమ చందం బా
లోకింప నిపుణులగు సు । శ్లోకులకుం బరమపదము సులభము శార్ఙ్గీ! 239

ప్రతిపదార్థం: శార్ఙ్గీ!= ఓ విష్ణూ!; ఏకత్వంబు= ఒంటితనం - ఒకటిగా ఉండటం; అన్యత్వము= పెరతనం - మరొకటిగా ఉండటం; అనేకత్వము= పెక్కుతనం - ఎక్కువగా - ఒకటికంటె అధికంగా ఉండటం; కలుగు= ఉన్న; నీ మహిమ చందంబు= నీ గొప్పదనపు తీరు; ఆలోకింపన్= చూచుటకు; నిపుణులు+అగు= నేర్పరులగు; సుశ్లోకులకున్= మంచి కీర్తిగల వారికి; పరమపదము= మోక్షం; సులభము= సుఖంగా లభించేది.

తాత్పర్యం: (ఇపుడు విష్ణుతత్త్వంలోని మరొక విశేషాన్ని వర్ణిస్తున్నాడు.) విష్ణువు ఏకత్వ మహిమ గలిగినవాడు. తాను తప్ప మరేదీ లేనివాడు. అతడే అన్యత్వ మహిమ గలవాడు కూడా - తాను ఇతరుడు కూడా కాగలడు. ఈ రెండింటితో - ఏకత్వ అన్యత్వాలతో విరాజిల్లే విష్ణుదేవుడు అనేకత్వంగలవాడూ అయినాడు. ఈ గొప్పదనపు తీరు చూడగల ఉత్తమనరులు కైవల్యాన్ని సులభంగా అందుకొనగలరు.

విశేషం: వస్తువు ఒకటే అయి, ఒకటిగా అగుపడటం వింత కాదు. అది స్వత్వాన్ని కోల్పోయి, అన్యంగా అగుపించటం, అంతటితో ఆగక, అనేకంగా కూడా కనిపించటం తప్పక మహిమగా గుర్తించవలసిందే. అయితే ఆ గుర్తింపు పొందగలిగినవారు ముక్తిని పొందటానికి అర్హులే అయి ఉంటారట!

తే. అచరములును జరంబులు నైన భూత । సముదయంబులు మణులు సూత్రమున నున్న
కరణి నీ యంద యున్నవి గాన సమత । నేక భక్తి నేఁ గోరెద నిమ్ము దేవ! 240

ప్రతిపదార్థం: దేవా!= ఓ విష్ణూ!; అచరములును= తిరుగాడనివీ; చరంబులును+ఐన= తిరుగాడెడివీ అయిన; భూత సముదయంబులు= ప్రాణుల సమూహాలు; నీ+అందున్+అ= నీయందే' - నీ లోపలే; మణులు= రత్నాలు; సూత్రమునన్= దారమందు; ఉన్న కరణిన్= ఉన్న విధంగా; ఉన్నవి= కలవు; కాన= కావున; సమతన్= సమభావాన్నీ; ఏకభక్తిన్= కేవలం భక్తిని, అనన్య భక్తిని; కోరెదన్= కాంక్షిస్తాను; ఇమ్ము= ఒసగుము.

తాత్పర్యం: దేవా! సూత్రంలో మణులు నిలిచి ఉన్నట్లుగా, నీలో ఈ సృష్టిలోని చరాచర ప్రాణికోటి ఇమిడి ఉన్నది. కాబట్టి నీకు అవతల మరేమీ లేదు. నీవు కానిది ఏదీ లేదు. అందువలన నిన్ను నేను సమభావాన్నీ, కేవలం భక్తినీ అర్థిస్తున్నాను. నా అభ్యర్థనను ఈడేర్చుము ప్రభూ!

విశేషం: అలం: ఉపమ.

క. హేతురహితుఁడవు, కర్తవు, । భూతస్రష్టవు, సమస్తభోక్త, వతత్త్వం
బై తత్త్వము నగుదు జగ । న్నేతవు కూటస్థుఁడవును నీవ ముకుందా! 241

ప్రతిపదార్థం: ముకుందా!= ఓ విష్ణూ!; హేతురహితుఁడవు= కారణం లేనివాడవు; కర్తవు= చేసేవాడవు; భూత స్రష్టవు= ప్రాణులను సృజించేవాడవు; సమస్త భోక్తవు= ఎల్లవాటిని భుజించేవాడివి; అతత్త్వంబు+ఐ= తత్త్వంగానిదై; తత్త్వమును+అగుదు(వు)= తత్త్వమూ అవుతావు; జగత్+నేతవు= లోకానికి అధిపతివి; కూటస్థుఁడవును= పరమాత్మవు కూడా; నీవు+అ!= నీవే!

తాత్పర్యం: ఓ విష్ణూ! నీ మహిమ ఊహ కందదు. అన్నిటికి కారణమైన నీకు కారణం లేదు. అన్నిటికీ నీవే కర్తవు. ప్రాణుల, భూమి నీరు వెలుగు గాలి ఆకాశాల సృష్టి చేసినవాడవు నీవే. అట్లాగే ఆ అన్నిటి భోక్తవూ నీవు. తత్త్వానివీ, అతత్త్వానివీ, సత్యానివీ, అసత్యానివీ నీవే! జగత్తుకు అధిపతివి నీవు. తుదకు పరమాత్మవూ నీవే దేవా!

విశేషం: తత్త్వ శబ్దాన్ని మనం సాధారణంగా ఆంగ్లంలోని 'ఫిలాసఫీ' అనే మాటకు బదులుగా వాడుతున్నాం. వ్యుత్పత్తి దృష్టితో చూస్తే ఈ రెండు శబ్దాలకూ పోలికే లేదు. తత్త్వశబ్దం 'తద్' అనే ప్రాతిపదిక మీద భావార్థంలో 'త్వ' ప్రత్యయం చేర్చగా ఏర్పడినట్టిది. దానికి ఉన్న అర్థం 'దాని తనము' అని. ఈ తత్త్వశబ్దాన్ని సత్యార్థంలోనూ, స్వభావార్థంలోనూ కూడా వాడుతున్నాం. ఇక ఆంగ్లంలోని 'ఫిలాసఫీ' కి జ్ఞానాన్వేషణమని స్థూలంగా అర్థం చెప్పవచ్చును. ఇక్కడ తత్త్వశబ్దం సత్యార్థంలోనే ప్రయుక్తమైనది.

సీ. ద్వేష్యంబుఁ బ్రియ మను వేర్పాటు లేదు, భూ । తములయం దెల్లను సముఁడ నాకు
భూతసంయోగంబు బుద్ధ్యహంకార యు । క్తియు గుణత్రయసంగతియును లేవు
ప్రారంభణంబు ధర్మాధర్మములు నింద్రి । యముల పొందును విషయాభిరతియుఁ
బరిహృతంబులు జరామరణమోక్షార్థి నై । శరణంబు వేఁడెదఁ గరుణ నాదు

తే. ఘ్రాణజిహ్వలు మహి నుదకమున దృక్కు। త్వక్కు దేజంబునందును వాయువునను
శ్రోత్ర మాకాశమునఁ గ్రమసూత్రితముగఁ । బొందఁ జేసి గోవింద! యానంద మిమ్ము. 242

ప్రతిపదార్థం: గోవింద!= ఓ కృష్ణా!; (నాకు) ద్వేష్యంబు= ద్వేషించ దగ్గది; ప్రియము= ఇష్టమైనది; అను వేర్పాటు= అనే భేదం; లేదు= ఉండదు; భూతముల అందున్+ఎల్లన్= అన్ని ప్రాణులయందును; సముఁడన్= సమానమైన భావంకలవాడను - హెచ్చుతగ్గు భావాలు లేనివాడను; నాకున్= విష్ణు భక్తుడనైన నాకు; భూత సంయోగంబు= పంచభూతాలతో - కలయిక; బుద్ధి+అహంకార యుక్తియున్= బుద్ధి (మతి) 'నేను' అనే భావం, అభిమానం - వీటితోడి కలయిక; గుణత్రయ సంగతియును= సత్త్వరజ స్తమస్సు లనే మూడు గుణాల కూడిక; లేవు= ఉండవు; ప్ర+ఆరంభణంబు= ప్రయత్నం - కర్మం - పని; ధర్మ+అధర్మములున్=

పుణ్యపాపాలూ; ఇంద్రియముల పొందు= జ్ఞాన కర్మ ఇంద్రియాలతోడి పొత్తు; విషయ+అభిరతియున్= ప్రాపంచిక లౌకిక అంశాలపట్ల ప్రీతి; - (ఇవన్నీ) పరిహృతంబులు= పరిహరించబడినవి - తొలగించబడినవి; జరా మరణ మోక్ష+అర్థిన్+ఐ= ముసలితనం, చావులనుండి ముక్తిని కోరేవాడనై; శరణంబు వేఁడెదన్= శరణు అర్థిస్తున్నాను; కరుణన్= దయతో; నాదు ఘ్రాణ జిహ్వాలు= నా ముక్కు నాల్కలు; (క్రమంగా) మహిన్= నేలయందు; ఉదకమునన్= నీటియందు; దృక్కు, త్వక్కు= చూపు, చర్మం (క్రమంగా); తేజంబునందును= కాంతిలోనూ; వాయువునను= గాలిలోను; శ్రోత్రము= చెవి; ఆకాశమునన్= ఆకసమున; క్రమసూత్రితముగన్= వరుసగా ఏర్పరచబడినట్లుగా; పొందున్+చేసి= చేరేటట్లు చేసి; ఆనందము+ఇమ్ము= ఆహ్లాదాన్ని ఒసగుము.

తాత్పర్యం: ఓ విష్ణుమూర్తీ! ఈ సృష్టిలో నాకు పగకు గాని ప్రేమకుగాని, పాత్రమైన దేదీ లేదు. నేను సకల ప్రాణులయెడ సమభావం కలవాడను. నాకు సృష్టిలోని పంచభూతాలతో పొత్తు లేదు. బుద్ధి, అహంకారం, సత్త్వరజస్తమోగుణాలూ లేవు. నాకు కర్మకోసం ప్రయత్నంగాని, పుణ్యపాపాలుగాని, ఇంద్రియాలతోడి పొత్తుగాని లేవు. లౌకికవిషయాలయెడ ఆసక్తీ లేదు. అన్నిటినీ వదలించుకొని, ఇప్పుడు నేను జరామరణాలనుండి విడుదలకొరకు నిన్ను వేడుకొంటూ నీ శరణు కోరి నీ దరి చేరాను. దయతో నా ముక్కు నాల్కలు నేలలో నీటిలో, చూపు చర్మాలు కాంతిలో గాలిలో, చెవి ఆకాశంలో, వరుసగా క్రమం తప్పకుండా లీనంచేసి, నాకు నిరంతరానందాన్ని ప్రసాదించుము దేవా!

విశేషం: ఇక్కడ మోక్షార్థి లక్షణాలన్నీ ఉదాహృతాలై ఉన్నాయి. అతడు రాగద్వేషాలకు, పుణ్యపాపాలకూ అతీతుడు. లౌకిక మానవ లక్షణాలన్నీ పరిహరించుకొన్నవాడు. సర్వసంస్కారాలకూ, సకల వాసనలకూ విదూరుడు.

సీ. ఇల జలంబుల జలంబులు, శిఖి శిఖి, వాయు । వున వాయు, వంబరంబునను నంబ
రంబు, చిత్తమునఁ జిత్తం, బహంకృతి నహం । కృతి, బుద్ధిఁ దగ నొదిఁగించి యింత
వట్టును గూడ నవ్యక్తంబుఁ జేర్చి య । వ్యక్తంబు నిజభంగి యైనఁ బ్రిగుణ
సామ్యవ్యవస్థితి సడిసన్నఁ గారణ । భూత తన్మాత్రలు పాదువకుండఁ

తే. దొలఁగఁ బెట్టుట దొరకొనవలయు దానఁ । బరమమున కేవలము నగు పదము గలిగి
యేన నీ వను నైక్యంపు టెఱుక వొడముఁ । గాత గమనాగమనములు గ్రాఁగి పోవ. 243

ప్రతిపదార్థం: ఇలన్= భూమిపై; జలంబులన్= నీళ్ళయందు; జలంబులు= నీళ్ళు; శిఖిన్= నిప్పునందు; శిఖి= నిప్పు; వాయువునన్= గాలియందు; వాయువు= గాలి; అంబరంబుననను= ఆకాశమునందు; అంబరంబు= ఆకాశం; చిత్తమునన్= మనస్సునందు; చిత్తంబు= మనస్సు; అహంకృతిన్= అహంకారమునందు; అహంకృతి= అహంకారం; బుద్ధిన్= బుద్ధిని (బుద్ధియందు); తగన్= సరిగా; ఒదిఁగించి= ఇమిడేటట్లు చేసి - తొలగేటట్లుచేసి; ఇంతవట్టును+కూడన్= ఈ అంతటినీ; అవ్యక్తంబున్= మూల ప్రకృతిని; చేర్చి= చెందించి; అవ్యక్తంబు= మూల ప్రకృతి; నిజభంగి+ఐనన్= స్వత్వ పద్ధతి - స్థితిని చెందగా; త్రిగుణసామ్య వ్యవస్థితి=మూడు గుణాల - సత్త్వరజస్తమస్సుల సమానత్వ స్థితి; సడిసన్నన్= సద్దుమణగగా; కారణభూత తన్మాత్రలు= (జగత్తు పుట్టుకకు) మూలమైన శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదును; పాదువకుండన్= క్రమ్మకుండగా - ఏర్పడకుండా; తొలఁగన్+పెట్టుట= ప్రక్కకు నెట్టటం; దొరకొనవలయున్= మొదలు పెట్టాలి; దానన్= అందువలన; పరమమును= ఉత్తమగతి; కేవలమున్+అగు పదము= ఒకటే అగు స్థానం - కైవల్య పదం; కలిగి= ఏర్పడి; ఏను+అ= నేనే; నీవు+అను= నీవు అనే; ఐక్యము+ఎఱుక= ఒకతనమునకు (ఆత్మ పరమాత్మల ఏకత్వం) చెందిన జ్ఞానం; గమన+ఆగమనములు= రాకపోకలు - లోకానికి రావటం (జన్మ) లోకంనుండి పోవటం (చావు) అనే రెండు క్రియలు; క్రాఁగిపోవన్= నశించి పోయేటట్లుగా; పొడమున్+కాతన్= కల్గుగావుత.

తాత్పర్యం: సృష్టి పంచభూతాలతో నేల, నీరు, వెలుగు (కాంతి), గాలి, ఆకాశం - అనే ఐదు మూల పదార్థాలతో ఏర్పడినది. కాబట్టి సృష్టిలో భాగమైన నరుడూ పంచభూతాత్మకమైనవాడే. కాబట్టి అతడి శరీరంలోని ఆయా మూల

పదార్థాలకు చెందిన అవయవాలన్నీ ఆయా మూలప్రకృతిలో లీనమైపోవాలి. 'జలాలలో జలాలు' ఒదిగించటం అంటే నీటిలో నాలుకను లీనంచేయటం; అట్లాగే నిప్పులో నిప్పును కలుపుట అంటే, నిప్పులో చూపును ఉంచటం, గాలిలో గాలి - గాలిలో చర్మం; ఆకాశాన ఆకాశం - ఆకాశాన చెవి; ఈ విధంగా పంచేంద్రియాలనూ పంచ భూతాలలో లీనం చేయాలి. ఆ తరువాత నరుడిలో మనస్సున్నది. దానిని మనస్సుననే అణచివేయాలి. అట్లాగే (నరుడి) అహంకారాన్నికూడా అహంకారంలో లీనంచేయాలి. బుద్ధిని బుద్ధిలో కలపాలి - నశింపజేయాలి- ఈ విధంగా ముందు పాంచభౌతిక ధర్మాలను, ఆ పిదప - మనస్సు, బుద్ధి, అహంకారాలనూ నశింపజేయాలి. ఈ సామగ్రినంతటినీ మూలప్రకృతిలోనికి చేర్చాలి. ఆ మూలప్రకృతికి అవ్యక్త మని పేరు. అది తన నిజస్థితిని తాను చెందిన తరువాత, సత్త్వ రజస్తమోగుణాలూ నశిస్తాయి. అటు తరువాత, జగత్తు ఆవిర్భావానికి ఆదికారణా లయిన పంచతన్మాత్రలు - రూప రస గంధ స్పర్శ శబ్దాలు ఏర్పడకుండా పక్కకు నెట్టటానికి మొదలు పెట్టాలి. ఈ విధంగా ఈ పాంచభౌతిక స్థితినుండే మనోబుద్ధి అహంకారాలనుండీ, పంచతన్మాత్రలనుండి బయటపడ్డ ఆత్మకు సర్వోన్నతమూ, సర్వశ్రేష్ఠమూ అయిన కైవల్యపదం అందుతుంది. ఆ పదంలో ఉండగా, 'నేనే నీవు' అనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అపు డిక జనన మరణాలు అనే ఈ లోకాన జీవకోటికి సంభవించే రాకపోకలు (రాక - జన్మ, పోక - మరణం) నశిస్తాయి.

విశేషం: ఇక్కడ పంచభూతాత్మకుడయిన పురుషుడు, కైవల్యపదం చేరే దారి చూపబడింది. ఆ మార్గాన అక్కడక్కడ మజిలీలు, మార్పులు జరుగుతుంటా యని కూడా తెలియవచ్చింది. ఇది పరమాత్మకు అభిముఖంగా ఆత్మ సాగించే ప్రయాణపు వివరాల సూచిక.

క. హరియం దేనును నాయం । దరయంగా హరియుఁ గలము; హరి నాకును నా
హరి కేను ననశ్వరులము । హరిప్రసాదోదయము మహత్తర మహిమన్. **244**

ప్రతిపదార్థం: హరియందున్= విష్ణువునందు; ఏనును= నేనూ; నాఅందున్= నాలో; అరయంగాన్= పరిశీలించగా; హరియున్= విష్ణువూ; కలము= ఉన్నాము; హరి= విష్ణువు; నాకును= నరుడనైన నాకూ; ఆ హరికిన్= ఆ నారాయణుడికీ; ఏనును= నరుడ నైన నేనూ; అనశ్వరులము= నశించే స్వభావం లేనివారం; మహత్తర మహిమన్= మిక్కిలి గొప్పతనంతో; హరిప్రసాద+ఉదయము= విష్ణువు యొక్క అనుగ్రహపు పుట్టుక (కలుగుతుంది).

తాత్పర్యం: నరుడికి నారాయణుడికీ భేదం లేని స్థితి కలిగింది. నారాయణుడిలో నేను ఉన్నాను. నాలో నారాయణుడు ఉన్నాడు. నా కొరకు నారాయణుడూ, నారాయణుడికొరకూ నేనూ నశించకుండా ఉంటాం. గొప్ప మహిమతో మాత్రమే విష్ణువు అనుగ్రహం కలుగుతుంది. మానవ ప్రయత్నాలకు అన్నిటికీ అతడిలోని బుద్ధి చైతన్యాలే కారణం. కాగా ఆ రెండు, ఏ ప్రయత్నం చేసి, ఏమి సాధించాలో సూచిస్తున్నాడు.

తే. బుద్ధియును బ్రాణమును నిన్నుఁ బొరయఁ జేయఁ । జాలు భక్తి నా కొసఁగుము జలధిశయన!
పూర్వ కర్మఫలంబులు పొందుఁగాక!; । యవి ఋణంబులు గడతేఱుటై సుఖింతు. **245**

ప్రతిపదార్థం: జలధిశయన!= సముద్రాన పరుండేవాడా - ఓ విష్ణూ!; బుద్ధియును= తెలివీ; ప్రాణమును= ఊపిరీ; నిన్నున్+పొరయన్+చేయన్+చాలు= నిన్ను పొందజేయగల; భక్తి= భక్తి భావం - కొలిచే, సేవించే స్వభావం; నాకున్= నరుడనైన నాకు; ఒసఁగుము= ఇమ్ము; (అట్లే) పూర్వకర్మఫలంబులు= ప్రాచీన (జన్మలలోని) కర్మఫలితాలు; పొందున్+కాక!= చెందునుగాక

నన్ను చేరుకోనిమ్ము; అవి= ఆ కర్మఫలాలు (చేరుట); ఋణంబులు= అప్పులు; కడతేఱుట+ఐ= తీరుట కాగా; సుఖింతున్= సుఖపడెదను.

తాత్పర్యం: సముద్రాన శయనించే ఓ స్వామీ! బుద్ధినీ, చైతన్యాన్నీ నిన్ను పొందుటకుగల కేవలభక్తినీ నాకు ప్రదానం చేయుము. నా ధీశక్తినీ, చేతనాశక్తినీ, నిన్ను చేరే మార్గాన్ని నిర్దేశించగల భక్తిభావంవైపు మళ్ళించుము. అదే విధంగా, నా పూర్వజన్మల కర్మల ఫలితాలు నన్ను చేరుకొనేటట్లు చూడుము. అవి ఆ విధంగా నన్ను చేరితే, ఆ ఫలితాల నన్నిటినీ అనుభవించి, నేను ఋణవిముక్తుడనైనట్లుగా ఆనందిస్తాను.

విశేషం: కర్మ, ఫలం అనేవి కారణకార్యాలు. కర్మకు ఫలితం ఈనాడు కాకున్నా మరొకనాడు పొంది తీరవలసిందే. అది అనివార్యం. లోకన్యాయం - అప్పు తీర్చటంవలె కర్మఫలమూ అనుభోక్తవ్యమే.

తే. నిన్ను నెప్పుడుఁ దలఁచెద; నన్ను నీవు । వత్సలుఁడ వయి వీఁడు నావాఁ డనంగ
వలయుఁ జుమ్మయ్య! మఱవక వాసుదేవ! । దేవ దేవ! మునీశ్వర భావనీయ! 246

ప్రతిపదార్థం: వాసుదేవ!= వసుదేవుడి తనయుడా!; దేవదేవ!= దేవతలకు దేవుడైనవాడా!; ముని+ఈశ్వర భావనీయ!= మునిశ్రేష్ఠులచేత భావించదగ్గ, స్మరించదగ్గవాడా!; నిన్నున్= జగన్నేతవైన నిన్ను; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; తలఁచెదన్= స్మరిస్తాను; నన్నున్= నీ భక్తుడనైన నన్ను; నీవు= నా ఆరాధ్యదైవ మయిన నీవు; వత్సలుఁడవు+అయి= దయకలవాడవై; మఱవక= మరచిపోక; అయ్య= స్వామీ!; వీఁడు= ఈ నరుడు; నా వాఁడు+అనంగన్+వలయున్+చుమ్ము= నా వాడు అనవలె సుమా!

తాత్పర్యం: ఓ వసుదేవ తనయా! దేవసమూహానికి దేవుడా! మునీశ్వరుల భావనలలో నిలిచే స్వామీ! నేను నిన్ను అన్ని కాలాలలో స్మరిస్తుంటాను. నీవూ నాపై దయ గలిగి 'వీడు నావాడు' అనాలి సుమా! మరవవద్దు.

క. తనుఁ దనయంద నిలిపి పే । రనువున బుద్ధికడ వెలుఁగు నచ్యుతుని సనా
తను నగ్రాహ్యునిఁ జిన్మయు । ననుస్మరించునది యపునరావృత్తికినై. 247

ప్రతిపదార్థం: తనున్= తనను; తనయందున్+అ= తనయందే; నిలిపి= ఉంచి; పేరు+అనువునన్= గొప్పనేర్పుతో; బుద్ధికడన్= బుద్ధిచెంత; వెలుఁగు+అచ్యుతునిన్= ప్రకాశించే విష్ణువును; సనాతనున్= శాశ్వతుడైనవాడిని; అగ్రాహ్యునిన్= గ్రహించరానివాడిని- తెలియరానివాడిని - పట్టుకొనరానివాడిని; చిత్+మయున్= జ్ఞానమయుడిని - జ్ఞానాకారుని; అపునర్+ఆవృత్తికిన్+ఐ= మరల రావటం (లోకంలోనికి) (పుట్టుక) లేకుండటానికై - జన్మరాహిత్యమునకై; అనుస్మరించునది= అనుస్మృతిని - నిరంతరస్మరణను చేయాలి.

తాత్పర్యం: తనలో తాను ఉంటూ, గొప్పనేర్పుతో బుద్ధికి సమీపాన వెలిగే శ్రీ మహావిష్ణువును, శాశ్వతమైనవాడిని, తెలియరాని, పట్టుకొనరానివాడిని, జ్ఞానమయుడిని జన్మరాహిత్యంకొరకు (అనుస్మరించాలి. అనుస్మృతి ద్వారా నిరంతరం ఉచ్చరిస్తూ స్మరణను గావించాలి. జపించాలి.)

విశేషం: ధ్యానానికిగాని, జపానికిగాని, పూజకుగాని, పురస్కారానికిగాని నరుడిలో ఏకాగ్రత అవసరం. ఏకాగ్రత ఏ సాధనలోనైనా అవసరమైన మానసిక స్థితి.

క. పరమాత్ముని నారాయణుఁ । జిరంతనుని భక్తశేముషీనిష్ఠా స్వీ
కరణైకాయనుని నమ । స్కరణంబునఁ దలఁతు నతుల షడ్విధభూతిన్.' 248

ప్రతిపదార్థం: పరమ+ఆత్మునిన్= గొప్ప ఆత్మగలవాడిని, పరమాత్మ స్వరూపుడిని; నారాయణున్= విష్ణువును; చిరంతనునిన్= శాశ్వతమైనవాడిని; భక్తశేముషీనిష్ఠా స్వీకరణ+ఏక+అయనునిన్= భక్తుడి బుద్ధి నిలకడ (ఏకాగ్రత)ను స్వీకరించటం ఒక మార్గంగా గలవాడిని - భక్తుడి బుద్ధి నిలుకడను ఒక చోటుగా చేసికొన్నవాడిని; అతులషట్+విధ భూతిన్= సాటి లేని ఆరు విధాలయిన ఐశ్వర్యాలుకలవాడిని; నమస్+కరణంబునన్= నమస్కారంతో; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: పరమాత్మ స్వరూపుడిని, నారాయణమూర్తిని, శాశ్వతుడిని, భక్తుల ఏకాగ్రచిత్తం ద్వారా చేరదగ్గ ఉనికి గలవాడిని, ఆరువిధా లయిన ఐశ్వర్యాలతో భక్తుల ననుగ్రహించే దేవుడిని నమస్కరిస్తూ స్మరిస్తాను'.

తే. అని జపించి సర్వావస్థలందు ననువి । శిష్టభక్తి ననుస్మరించిన యతండు
సకల పాపంబులను బాసి శాంతి నొంది । యవ్యయానంద పదమున నతిశయిల్లు. 249

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; జపించి= జపం చేసి; సర్వ+అవస్థలందున్= అన్ని స్థితులలోను - దశలలోను; ననున్= పరమాత్మనైన నన్ను; విశిష్టభక్తిన్= అతిశయించిన భక్తితో; అనుస్మరించిన+అతఁడు= అనుస్మృతి చేసిన - నిరంతర స్మరణం చేసినవాడు; సకలపాపంబులను= ఎల్ల కల్మషములను; పాసి= వదలి; శాంతిని+ఒంది= శాంతిని పొంది; అవ్యయ+ఆనందపదమునన్= నశించని ఆనందమయమైన చోటున; అతిశయిల్లున్= విలసిల్లును.

తాత్పర్యం: పైన నిర్దేశించిన తీరున అన్ని స్థితిగతులలో, దశలలో మిక్కిలి భక్తితో ఈ అనుస్మృతిని జపించినవాడు ఎల్ల పాపాలనుండి ముక్తుడౌతాడు. తరువాత శాంతిని పొంది శాశ్వతానందమయ మైన స్థితిని - ముక్తిని పొంది అతిశయిస్తాడు.

విశేషం: ముక్తిప్రాప్తికి ముందు పాపపరిహారం ఒక తప్పనిసరైన అంశమన్నమాట.

తే. వైష్ణవియుఁ గల్మషవ్రజధ్వంసినియును । నైన యీ యనుస్మృతి ప్రాజ్ఞుఁ డైన నజ్ఞుఁ
డైన నెవ్వాఁడు పఠియించు యజ్ఞదాన । సమయముల వాఁడు తత్ఫలశతము వడయు. 250

ప్రతిపదార్థం: వైష్ణవియున్= విష్ణుసంబంధీ; కల్మషవ్రజ ధ్వంసినియును= పాప సమూహాల నశింపజేసేదీ; ఐన+ఈ+అనుస్మృతి= అగు ఈ అనుస్మృతి స్తోత్రం; ప్రాజ్ఞుఁడు+ఐనన్= మహాపండితుడైనా; అజ్ఞుఁడు+ఐనన్= అజ్ఞాని - పామరుడైనా; యజ్ఞదాన సమయములన్= యజ్ఞ నిర్వహణ సమయంలో, దానంచేసే కాలంలో; ఏ+వాఁడు= ఏ నరుడు; పఠియించున్= చదువునో; వాఁడు= ఆ నరుడు; తద్+ఫలశతము+పడయున్= వాని ఆ యజ్ఞము యొక్క దానము యొక్క ఫలితాల నూటిని - నూరు ఫలితాలను పొందుతాడు.

తాత్పర్యం: ఈ అనుస్మృతి స్తోత్రం విష్ణుసంబంధి. పాపపుంజాన్ని ధ్వంసం చేస్తుంది. మహా పండితుడుగాని, పామరుడుగాని - ఎవడైనా ఈ అనుస్మృతిని యజ్ఞసమయానగాని, దానంచేసే టప్పుడుగాని, పఠిస్తే అతడికి ఆ యజ్ఞఫలంగాని, దానం ఫలంగాని నూరింతలు లభిస్తుంది.

విశేషం: యజ్ఞం చేయడం, దానంచేయడం గొప్పపనులు. వ్యయప్రయాసలు కొల్లలుగా వాటి నిర్వహణలో ఎదురౌతాయి. అటువంటి యజ్ఞఫలితాలు, దాన ఫలితాలూ నూరురెట్లు అధికంగా లభించాలంటే మాత్రం కేవలం అనుస్మృతి పఠనం చాలును. అంతటిది దాని మహిమ!

క. సురపితృపూజలఁ బావక । పరిచర్యలయందు నన్ను భక్తిఁ దలఁచుచుం
బరమనియతి నివ్వాక్యో । త్కరముఁ బఠించిన యతండు గనుఁ బుణ్యగతిన్. 251

ప్రతిపదార్థం: సురపితృపూజలన్= దేవతల, పితరుల, పితృదేవతల పూజాసందర్భాలలో; పావక పరిచర్యలయందున్= అగ్ని సేవలయందు, అగ్ని కార్యాలలో, హోమాలు, యజ్ఞాలలో; నన్నున్= శ్రీ మహావిష్ణువునైన నన్ను; భక్తిన్= భక్తితో; తలఁచుచున్= స్మరిస్తూ; పరమనియతిన్= గొప్ప నియమంతో; ఈ+వాక్య+ఉత్కరమున్= ఈ మాటల (స్తోత్రంలోనివి) ప్రోగును; పఠించిన+అతఁడు= చదివినవాడు; పుణ్యగతిన్= పుణ్యసిద్ధిని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ అనుస్మృతిని దేవతాపూజలలో, వ్రతాలలో, పితృదేవతల తర్పణ సమయాలలో, అగ్నికార్యాలలో విష్ణుభక్తితో, నియమపాలనతో, ఎవరు చదువుతారో, వారు పుణ్యసముపార్జన చేయగలుగుతారు.

విశేషం: ఇక్కడ కూడా ఆయా పూజావ్రతాదుల ఫలితాలు సిద్ధించిన తరువాత, అదనంగా పుణ్యార్జనకు ఈ అనుస్మృతి పఠనం కారణమౌతుంది.

క. వినుపించునది యనుస్మృతి । నను భక్తిం గొలుచు బహుజనముల కమావా
స్యను బున్నమ బారసిని స । వినయంబుగ దాననెల్ల విభవము గలుగున్. 252

ప్రతిపదార్థం: ననున్= విష్ణువునైన నన్ను; భక్తిన్= భక్తితో; కొలుచు బహుజనములకున్= సేవించే పెక్కు ప్రజలకు; అమావాస్యను= అమావాస్యనాడు; పున్నమన్= పున్నమినాడు; బారసిని= ద్వాదశినాడు; సవినయంబుగన్= వినయంతో - అణకువతో; అనుస్మృతిన్= ఈ అనుస్మృతి స్తోత్రమును; వినిపించునది= వినిపించాలి; దానన్= అట్లు వినిపించటంవలన; ఎల్ల విభవము= సర్వసంపద; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఈ అనుస్మృతి స్తోత్రాన్ని సామాన్యులయిన జనసమూహాలకు, నన్ను భక్తితో సేవించేవారికి, అమావాస్య, పున్నమి, ద్వాదశి తిథులలో వినిపించాలి. ఈ మూడు తిథులు ఈ అనుస్మృతి శ్రవణానికి యోగ్యమైనవి. అట్లా వినిపించటంవలన, వినుటవలన సకలసంపదలు సిద్ధిస్తాయి.

విశేషం: ఈ దేశాన వివేకం మాట ఎట్లా ఉన్నా, విద్య అక్షర రూపమైనది, అందరికీ అందుబాటులో ఉండేది గాదు. స్వయంగా చదువలేని ఆ అధికసంఖ్యాకజనుల పుణ్యాన్ని ఉద్దేశించి, ఈ 'వినిపించే' కార్యక్రమం వివరించబడినది.

క. జనము లనుస్మృతిఁ జదువఁగ । విని మ్రొక్కిన యంత్యజునకు విశ్రుతగతి గ
ల్గు ననిన సద్భక్తి జపిం । చిన యుత్తమజాతిజునకుఁ జెప్పఁగ నేలా? 253

ప్రతిపదార్థం: జనములు= భక్తజనులు; అనుస్మృతిన్= అనుస్మృతి స్తోత్రాన్ని; చదువఁగన్= పఠిస్తూ ఉండగా; విని= ఆలకించి; మ్రొక్కిన= నమస్కరించిన; అంత్యజునకున్= చివరి కులమువాడికి; విశ్రుతగతి= పుణ్యగతి; కల్గున్+అనినన్= సిద్ధిస్తుందనగా; సత్+భక్తిన్= మంచిభక్తితో; జపించిన= జపంచేసిన; ఉత్తమ జాతిజునకున్= శ్రేష్ఠకులంలో పుట్టినవాడికి (కలిగే పుణ్యగతిని గూర్చి); చెప్పఁగన్+ఏలా?= చెప్పటం ఎందుకు? (అనవసరం అని తాత్పర్యం. ఎంతో గొప్ప ఫలితం తప్పకుండా సిద్ధిస్తుంది అని భావం.)

తాత్పర్యం: ఈ అనుస్మృతి పఠన శ్రవణ మహిమ గొప్పది. భక్తజనులు పఠిస్తుండగా, ఈ అనుస్మృతిని విని నమస్కరించిన చండాలుడికే పుణ్యగతి గలుగుతుంది. అటువంటప్పుడు, ఇక ఈ అనుస్మృతిని భక్తితో జపించే ఉత్తమజాతి నరుడికి కలిగే ఫలితాన్ని గురించి వేరే చెప్పటమెందుకు? (తప్పక గొప్ప ఫలితాన్ని వారికి అందిస్తుంది- ఈ అనుస్మృతి పఠనం).

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. సంస్కృతంలో 'కైముతిక' న్యాయమని ఒకటుంది. 'కిమ్+ఉత' అనే శబ్దాలతో ఏర్పడ్డది ఆ న్యాయం. ఇది లోకవ్యవహార జన్యమయినమాట. జనవ్యవహారంలోని "పెద్ద ఏనుగులనే పరుగెత్తించే ఆ గాలివేగంలో ఇక దోమల సంగతి చెప్పేదేమిటి?" - వంటి మాటలు ఈ న్యాయానికి మూలం. 'కిమ్+ఉత' అంటే 'ఇంకేమిటి?' (చెప్పేది) అని తాత్పర్యం. ఈ పద్యంలోని 'చెప్పగనేలా?' అనే మాట అట్టిది. అంత్యజుడికే పుణ్యగతి కల్గుతుంటే ఇక అగ్రజుడి సంగతి చెప్పగనేలా? - అని కైముతికన్యాయం అన్వితమై ఉన్నది.

ఆ. అఖిల కర్మఫలము నంతవంతంబు మ । ద్భక్తులకు ననంతపదము గలుగు
నట్టు లగుటఁ దలపు మమర మునీంద్ర! ని । న్నది మదీయపదమహోర్థిఁ జేయు. 254

ప్రతిపదార్థం: అమరముని+ఇంద్ర!= దేవఋషిశ్రేష్ఠా!; అఖిల కర్మ ఫలమున్= మొత్తం కర్మయొక్క ఫలితం కూడా; అంతవంతంబు= చివర - తుది కలిగినది - ముగిసిపోయేది; మత్+భక్తులకున్= నా భక్తులకు; అనంత పదము= చివర తుదిలేని స్థానం - ముగిసిపోని ప్రయోజనం - ముక్తి; కలుగున్= సిద్ధించును; అట్టులు+అగుటన్= ఆ విధంగా అగుటను నా భక్తులకు మాత్రం అనంతపదప్రాప్తి జరుగుటను; తలఁపుము= స్మరించుము; అది= ఆ స్మరణం; నిన్నున్= దేవర్షివైన నిన్ను; మదీయ పదమహా+అర్థిన్+చేయున్= నాకు చెందిన స్థానానికి, నా సాన్నిధ్యానికి గొప్ప యాచకుడినిగా చేస్తుంది-నా సాన్నిధ్యాన్ని కోరుకుంటావు.

తాత్పర్యం: ఓ దేవమునీ! లోకాన ఎల్ల కర్మల ఫలితాలూ చివరకు ముగిసిపోయేవే! అయితే నా భక్తులకు మాత్రం ఈ అనుస్మృతి జపకర్మవలన ఫలితం ముగింపులేని పదమును-ముక్తిని కలిగిస్తుంది. ఆ విషయం నీవు స్మరించుకొంటే, నీవూ నా సాన్నిధ్యాన్ని కోరే పరమభక్తుడవుగా మారిపోతావు.

క. జ్ఞానము గేవలకృప న । జ్ఞానికి నుపదేశ విధిఁ బ్రజనితము సేయం
గా నది సకలధరిత్రీ । దానంబునకంటె నధికతరఫలద మగున్. 255

ప్రతిపదార్థం: కేవలకృపన్= ఒక్కదయతో - దయతో మాత్రమే; అజ్ఞానికిన్= జ్ఞానం లేనివాడికి; జ్ఞానము= జ్ఞానం - దేవుడిని-ముక్తిని గురించిన తెలివిని; ఉపదేశ విధిన్= బోధించటంతో; ప్రజనితము+చేయంగాన్= కలిగినదిగా చేయగా, కల్గించగా, కలిగించినచో; అది= ఆ ఉపదేశ క్రియ; సకలధరిత్రీదానంబునకంటెన్= భూమినంతా దానంచేయటం కంటె; అధికతర ఫలదము+అగున్= ఎక్కువ ఫలితం ఇచ్చునది ఔతుంది.

తాత్పర్యం: కేవలం దయతో అజ్ఞానికి జ్ఞానాన్ని బోధించి, అతడిలో దేవునిగూర్చిన మోక్షాన్ని గూర్చిన, తెలివితేటలను ఏర్పరచగలిగితే. ఆ జ్ఞానబోధ గొప్ప దానంగా పరిణమిస్తుంది. ఆ విధంగా జ్ఞానదానం చేస్తే, ఆ దానంవలన ఫలితం, మొత్తం నేలను దానం చేయగా వచ్చే ఫలితాన్ని మించి ఉంటుంది.

విశేషం: అట్లా కాకుండా వ్యావహారికార్థంలోనయినా, జ్ఞానం ఇతర సకలకార్యకలాపాలకు మూలం. కాబట్టి జ్ఞానదానం ఇతర దానాలను మించినదే.

క. కావున నీకేఁ జెప్పిన । యీ విధ మంతయును శుద్ధహృదయులకుఁ గృపా
శ్రీ వెలయఁ జెప్పుమీ! పు । ణ్యావహశీలురకు సులభమగు సర్వంబున్. 256

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి - జ్ఞానదానం అన్ని దానాలకంటె మిన్న కాబట్టి; నీకున్= నా భక్తుడవైన నీకు; ఏన్= నేను; చెప్పిన+ఈ విధము+అంతయును= తెలిపిన ఈ విధానం సర్వమూ; శుద్ధహృదయులకున్= నిర్మలమైన హృదయం కలవారికి; కృపాశ్రీ వెలయన్= దయ అనే సంపద స్పష్టపడగా; చెప్పుమీ!= ఎరిగింపుమా!; పుణ్య+ఆవహశీలురకున్= ధర్మమును స్వీకరించే స్వభావంగలవారికి; సర్వంబున్= అంతయూ; సులభము+అగున్= సుఖంగా పొందదగింది అవును.

తాత్పర్యం: జ్ఞానదానం సర్వదానాలనూ అతిశయిస్తుంది కాబట్టి ఓ దేవమునీ! నేను నీకు ఉపదేశించిన ఈ అనుస్మృతి జపవిధిని మొత్తాన్ని, పవిత్ర హృదయులయిన భక్తులకు నీలోని దయాగుణం ప్రకటితమయ్యే విధంగా తిరిగి బోధించుము. ధర్మస్వభావంగల వారికి అంతా సులభసాధ్యమే అవుతుంది.

తే. అశ్వమేధ సహస్రంబు లాచరించి । పడయరాని మహోన్నత పదము నస్మ
దీయ భక్తిరసైక పరాయణుండు । వడయనేర్చు సుకరముగ బ్రహ్మపుత్ర! 257

ప్రతిపదార్థం: బ్రహ్మపుత్ర!= బ్రహ్మతనయుడా! - నారదమహర్షీ!; అశ్వమేధ సహస్రంబులు= అశ్వమేధం అనే యజ్ఞాలు వేలు; అచరించి= చేసి; పడయన్+రాని= పొందరాని; మహా+ఉన్నత పదమున్= గొప్ప ఉత్తమ స్థితిని; అస్మదీయ భక్తిరస+ఏకపరాయణుండు= నా భక్తిభావమున మాత్రము ఆసక్తుడైనవాడు; సుకరముగన్= సులభంగా; పడయన్+నేర్చున్= పొందగలడు.

తాత్పర్యం: ఓ బ్రహ్మమానసపుత్రా! నారదమహర్షీ! వేలకొలదిగా అశ్వమేధయజ్ఞాలు చేసి కూడా పొందజాలని పరమపదాన్ని, కేవలం నా భక్తియందు ఆసక్తుడైన నరుడు సులభంగా అందుకొనగలుగుతాడు.

విశేషం: యజ్ఞ నిర్వహణం కంటె చిత్తశుద్ధిగల విష్ణుభక్తి మిన్న.

సీ. అని చెప్పె నిట్టు లయ్యనిమిష మునిపతి । యడుగంగ శంభుఁ డెయ్యది సమాద
రంబున నెఱిఁగించె రాజవంశోత్తమ! । తెల్లంబుగా నది యెల్ల నీకుఁ
జెప్పితి; నేకాగ్రచిత్తుండవై పర । మాత్ము న న్నారదునట్ల భక్తి
సంభృత శ్రద్ధానుషంగ తాత్పర్యంబు । తోఁ దలంపుము కృతార్థుండ వగుదు;

తే. పరమ వరద రహస్యానుభావ పూజ్య । మానమూర్తి యనుస్మృతి దీనిజపము
బుద్ధిఁ బెనుచు, దుఃఖంబులఁ బోవఁ ద్రోచు, । బంధములఁ బాపు, నిత్యశుభంబు నొసఁగు.' 258

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పెన్= ఉపదేశించాడు (ఈ మాట పూర్వపద్యంతో అన్వయిస్తుంది); రాజవంశ+ఉత్తమ!= క్షత్రియ కులంలో శ్రేష్ఠుడా! ఓ ధర్మరాజా!; ఇట్టులు= ఈ విధంగా; ఆ+అనిమిష మునిపతి= ఆ దేవముని శ్రేష్ఠుడు - నారదుడు; అడుగంగన్= అర్థించగా; శంభుఁడు= శివుడు; సమ్+ఆదరంబునన్= మంచి ప్రేమభావంతో; ఏ+అది= ఏది; ఎఱిఁగించెన్= తెలియజేశాడో; అది+ఎల్లన్= అది అంతా; తెల్లంబుగాన్= స్పష్టంగా; నీకున్= చెప్పకోరిన నీకు; చెప్పితిన్= తెలియజేశాను; ఏక+అగ్ర చిత్తుండవు+అయి= లగ్నమయిన మనస్సు కలవాడవయి; ఆ+నారదుని+అట్లు+అ= ఆ నారదుడివలెనే; పరమాత్మున్= పరబ్రహ్మమును; భక్తి సంభృత శ్రద్ధా+అనుషంగ తాత్పర్యంబుతోన్= భక్తితో నిండిన శ్రద్ధతో కూడిన ఆసక్తితో; తలంపుము= స్మరించుము, ధ్యానించుము; కృత+అర్థుండవు+అగుదు(వు)= నెరవేరిన ప్రయోజనం కలవాడవు కాగలవు; పరమ= గొప్ప; వరద= వరాలిచ్చేడి; రహస్య+అనుభావ= గోప్యమైన శక్తిగల; పూజ్య= ఆరాధనకు అర్హమైన; మాన= గౌరవంగల; మూర్తి= స్వరూపంకలది; అనుస్మృతి= అనుస్మృతి స్తోత్రము; దీని జపము= ఈ అనుస్మృతియొక్క జపం; బుద్ధిన్+పెనుచున్= తెలివిని పెంచును; దుఃఖములన్+పోవన్+త్రోచున్= కష్టములను వెడలగొట్టుతుంది; బంధములన్+పాపున్= (భవ) బంధాలను, సంసారపు ముడులను తొలగిస్తుంది; నిత్యశుభమున్+ఒసఁగున్= ఎల్లప్పుడూ శుభాన్ని కలిగిస్తుంది.

తాత్పర్యం: క్షత్రియవంశశ్రేష్ఠుడవైన ఓ ధర్మనందనా! ఆ దేవర్షి నారదుడు అర్థించగా, భగవంతుడైన విష్ణుమూర్తి దేనిని ఆదరంతో తెలియజేశాడో, ఆ అనుస్మృతిని స్పష్టంగా నీకు ఎరుకపరిచాను. నీవు కూడా నారదమహర్షివలె ఏకాగ్రచిత్తంతో, భక్తి భరితమైన శ్రద్ధాసక్తులతో ఆ పరమాత్ముడిని అనుస్మరించుకొనుము. నీ కోరిక ఈడేరుతుంది.

ఈ అనుస్మృతి గొప్ప స్తోత్రమంత్రం. వరాలను ఈయగల శక్తిగలది. గోప్యమైన సామర్థ్యం గలది. ఆరాధనకు అర్హమైన రీతిలో జపించటానికి వీలైన ఆకారంతో ఉన్నది. దీనిని జపిస్తే నరుడి బుద్ధి పెరుగుతుంది, దుఃఖాలు తొలగిపోతాయి, సంసారబంధాలు తెగిపోతాయి. నిరంతరం శుభం కలుగుతుంది'.

క. అని భీష్ముం డుపదేశిం । చిన విని యానందభరిత చిత్తుండై పాం
డు నృపాత్మజుఁ డప్పుణ్యా । త్మునకుం బ్రణమిల్లె వినయమునఁ దనువొప్పన్. 259

ప్రతిపదార్థం: అని= పై విధంగా; భీష్ముండు= భీష్మపితామహుడు; ఉపదేశించినన్= బోధించగా; పాండు నృప+ఆత్మజుఁడు= పాండురాజు కొడుకు - ధర్మరాజు; విని= ఆలకించి; ఆనందభరిత చిత్తుండు+ఐ= ఆనందంతో నిండిన మనస్సుకలవాడై; వినయమునన్= అణకువతో; తనువు+ఒప్పన్= శరీరం ప్రకాశించగా; ఆ+పుణ్య+ఆత్మునకున్= ఆ ధర్మస్వరూపుడికి - సర్వధర్మవేత్త అయిన పితామహుడికి; ప్రణమిల్లెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: ఈ విధంగా విష్ణుదేవప్రోక్తమైన అనుస్మృతిని, దాని మహిమను ధర్మస్వరూపుడైన భీష్ముడు ఉపదేశించగా, ఆలకించిన ధర్మరాజు ఆనందభరిత మనస్కుడై, వినయంతో వంగి భీష్మాచార్యుడికి నమస్కరించాడు.

విశేషం: నమశ్శబ్దం 'నమ' ధాతు జనితం. దానికి 'వంగుట' అర్థం. వినయాన్ని తెల్పుతూ వంగడమే నమస్కారం. అయితే అనుష్ఠానంలో, ఆచరణలో వంగడంతో పనిలేకుండానే చేతుల జోడింపుకై ఈ నమశ్శబ్దం పరిమితమై పోయింది.

వ. ఇట్లు ప్రణామంబు సేసి యాధరణీవరుండు గురుపితామహుతో 'మోక్షమార్గ బోధన ప్రపంచం బుపదేశింపవే?'
యని యడిగిన నతండు వార్ష్ణే యాధ్యాత్మం బను నితిహాసంబుగల 'దా తంత్రంబు నీ యడిగినదియైయుండు'
నని పలికి 'వినుము వార్ష్ణే య నామధేయుం డగువాఁడు. 260

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రణామంబు+చేసి= నమస్కారంచేసి; ఆ ధరణీవరుండు= ఆ రాజు - ధర్మరాజు; కురుపితామహుతోన్= కురువంశపు తాతతో - భీష్ముడితో; మోక్షమార్గ బోధన ప్రపంచంబు= ముక్తిమార్గంయొక్క జ్ఞాన విస్తృతి- ముక్తిని చేరే దానిని గూర్చిన అధిక జ్ఞానం; ఉపదేశింపవే?+అని= బోధించవే? అని; అడిగినన్= అర్థించగా; అతఁడు= ఆ భీష్ముడు; వార్ష్ణే య+అధి+ఆత్మంబు+అను+ఇతిహాసంబు= వార్ష్ణే యాధ్యాత్మం అనే వృత్తాంతము; కలదు= ఉన్నది; ఆ తంత్రంబు= ఆ విషయం; నీ+అడిగినది+ఐ+ఉండున్= నీవు అర్థించినదై ఉంటుంది - నీ కోరికకు సమాధానంగా ఉంటుంది; అని పలికి= అని చెప్పి; వినుము= ఆలకించుము; వార్ష్ణే య నామధేయుండు+అగువాఁడు= వార్ష్ణే యుడు అనే పేరుగలవాడైన ఒకడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా వినయంతో భీష్ముడికి నమస్కరించి, తనకు మోక్షమార్గాన్ని ఉపదేశించుమని అర్థించాడు. అప్పుడు ఆ పితామహుడు, 'వార్ష్ణే యాధ్యాత్మము' అనే ఇతిహాసమొకటి ఉన్నది. అది నీ ప్రశ్నకు కోరికకు సమాధానంగా ఉపయుక్తమౌతుంది. వినుమ' మంటూ ప్రారంభించాడు.

భీష్ముండు ధర్మజున కధ్యాత్మ విద్యా ప్రకారం బెఱిఁగించుట (సం. 12-203-1,2)

క. మానితముని యొకఁడు సుఖా । సీనుండై యున్న నతని శిష్యుఁడు వినయం
బూని నిలిచి 'మోక్షము తెరు । వానతి యీవే దయామయా! నా'కనుచున్. 261

ప్రతిపదార్థం: (వార్ష్ణే య నామధేయుడైన) మానితముని+ఒకఁడు= గౌరవించబడ్డ ఋషి ఒకరు; సుఖ+ఆసీనుండు+ఐ= సుఖంగా కూర్చున్నవాడై; ఉన్నన్= ఉండగా; అతని శిష్యుఁడు= ఆ ఋషి శిష్యుడు; వినయంబు+ఊని= అణకువతో; నిలిచి= నిలబడి;

దయామయా!= దయతో నిండినవాడా!; నాకు= నీ శిష్యుడనైన నాకు; మోక్షము తెరువు= ముక్తియొక్క మార్గం; ఆనతి+ఈవే?= (తెలియ జెప్పవా) ఆజ్ఞ ఈయవా? - సాధికారంగా వక్కాణించవా?; అనుచున్= అంటూ.

తాత్పర్యం: వార్ష్ణేయుడు అనే పేరుగల గౌరవాస్పదముని ఒకడు సుఖంగా కూర్చొని ఉన్నప్పుడు, అతడి శిష్యుడొకడు అణకువతో లేచి నిలబడి, 'ఓ దయామూర్తీ! గురుదేవా! నాకు మోక్షమార్గాన్ని ఉపదేశించవా?' అని అంటూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. పాదములకుం బ్రణమిల్లినఁ బ్రబోధమహితాత్ముం డగు నమ్మహాత్ముండు. 262

ప్రతిపదార్థం: పాదములకున్= కాళ్ళకు; ప్రణమిల్లినన్= నమస్కరించగా; ప్రబోధమహిత+ఆత్ముండు+అగు= గొప్పజ్ఞానంతో పూజ్యమైన మనస్సుకలవాడగు; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్పముని.

తాత్పర్యం: ఆ శిష్యుడు మోక్షానికి మార్గదర్శనం చేయుమంటూ ఆ వార్ష్ణేయముని కాళ్ళకు నమస్కరించాడు. గొప్పజ్ఞాన నిధియైన ఆ మునీశ్వరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'భక్తి గలవు నాకుఁ బ్రజ్ఞాన ఘనుఁడ; వ । ట్లవుట నీవు యోగ్యుఁడవు కుమార!

సదుపదేశమునకు సమవధానుండవై । వినుము నాదువాక్యవృత్తి తెఱఁగు.' 263

ప్రతిపదార్థం: కుమార!= పుత్రా!; నాకున్= నా యెడ; భక్తి+కలవు= భక్తి కలవాడవు; ప్రజ్ఞాన ఘనుఁడవు= ఎక్కువ జ్ఞానంతో గొప్పవాడవు (శరీరంతో కాదు); అట్లు+అగుటన్= ఆ విధంగా అగుటవలన - నీకు భక్తి, జ్ఞానం రెండూ ఉండటంవలన; సత్+ఉపదేశమునకున్= మంచి ఉపదేశానికి - జ్ఞానబోధనకు; యోగ్యుఁడవు= అర్హుడవు; సమ్+అవధానుండవు+ఐ= మంచి ఏకాగ్రత కలవాడవై; నాదు వాక్యవృత్తి తెఱఁగు= నా యొక్క మాటల భావాల తీరు - నా మాటల తాత్పర్యం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కుమారా! నీవు నా యెడ భక్తిగలవాడవు, జ్ఞానసంపన్నుడవు కూడా. కాబట్టి నీవు మంచి జ్ఞానబోధకు అర్హమైనవాడవు, ఏకాగ్రచిత్తంతో నేను చెప్పేమాటల భావాలను గ్రహించుము'.

విశేషం: విద్యార్థికి గురుడియెడ భక్తి, జ్ఞానమంటే ఆసక్తీ - రెండూ కావాలి. అతడే జ్ఞానదానానికి యోగ్యుడు.

వ. అని పలికి యిట్లనియె. 264

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని, ఈ విధంగా చెప్పాడు.

తే. 'కాలచక్రంబు నిరవధికంబు; దీని । సర్గములుఁ బ్రళయంబులుఁ జనుచునుండుఁ;

బ్రళయమునఁ బరమాత్ముఁడు ప్రకృతిఁ బొంది । యఖిలమును సృజియించుఁ గల్పాదియందు. 265

ప్రతిపదార్థం: కాలచక్రంబు= కాలం అనే చక్రం; నిర్+అవధికంబు= అవధి హద్దు - ఎల్ల లేనిది; దీని సర్గములున్+ప్రళయంబులున్= ఈ కాలచక్రం యొక్క సృష్టులు - పుట్టుకలు, నాశనములు కూడా; చనుచున్+ఉండున్= వెళ్ళుతూ - నడుస్తూ ఉంటాయి- సృష్టిలయాలు జరుగుతుంటాయి; పరమ+ఆత్ముడు= పరమాత్మ అనేవాడు - చావు పుట్టుకలు లేనివాడు; ప్రళయమునన్= ప్రళయ- వినాశకాలాన; ప్రకృతిన్+పొంది= స్వభావం చెంది; కల్ప+ఆదియందున్= సృష్టి ఆది - మొదలునందు; అఖిలమును= అంతటిని; సృజియించున్= పుట్టిస్తాడు.

తాత్పర్యం: ఈ కాల మనేది చక్రం వంటిది. గుండ్రంగా తిరుగుతూ ఉంటుంది. దీనికి అవధిలేదు, అంతంలేదు. ఈ కాలచక్రభ్రమణంలోనే సృష్టులూ ప్రళయాలూ ఏర్పడుతూ ఉంటాయి. ప్రళయకాలంలో పరమాత్మ మాత్రం స్వభావంతో నిలిచి, మళ్ళీ సృష్టిప్రారంభాన అంతటిని అన్నిలోకాలను - భూతాలను కల్పిస్తూ ఉంటాడు.

విశేషం: సృష్టి అంతా నష్టమౌతుంది ప్రళయాన. పరమాత్మ సృష్టి వస్తువు కాదు కాబట్టి తనకు నష్టి ఉండదు.

తే. భూతజాలంబుతో మునిపుంగవులును । దోఁచి మును ప్రళయంబునఁ దోఁ పడంగి
చనిన సర్వవేదంబులు శాస్త్రములును । బడసి రద్దేవు దివ్యానుభావమునను. 266

ప్రతిపదార్థం: మును= పూర్వం; భూతజాలంబుతోన్= ప్రాణులసమూహాలతో; మునిపుంగవులును= ఋషిశ్రేష్ఠులు కూడా; తోఁచి= కలిగి; ప్రళయమునన్= ప్రళయకాలాన - సర్వమూ నశించే సమయాన; తోఁపు+అడంగి= తోచుట - కలుగుట - పుట్టుట నశించి; చనినన్= పోగా; ఆ+దేవు దివ్య+అనుభావమునను= ఆ దేవుడి యొక్క (విష్ణువుయొక్క) దివ్య శక్తివలన; సర్వవేదంబులు= ఎల్ల వేదాలూ; శాస్త్రములును= ఎల్ల శాస్త్రాలూ; పడసిరి= పొందారు.

తాత్పర్యం: పూర్వం ఋషులూ మునులూ కూడా ఇతర ప్రాణసమూహాలతోపాటే సృష్టి ఆదిలో పుట్టారు. అయితే ప్రళయకాలాన ఇతర సృష్టితోపాటు వారూ నశించారు. అయితే ఆ దేవుడి దివ్యశక్తివలన ఎల్లవేదాలూ అన్ని శాస్త్రాలూ తిరిగి పొందారు వారు.

క. న్యాయా ద్యనేక తంత్రము । లా యంచితమతు లొనర్చి యఖిల జనాను
ష్ఠేయాచారములుఁ బరి । జ్ఞేయములుగ విశదభంగిఁ జేసిరి పుత్రా! 267

ప్రతిపదార్థం: పుత్రా!= ఓ కుమారా! శిష్యా!; ఆ+అంచితమతులు= ఆ ఒప్పిన బుద్ధిగలవారు; న్యాయ+ఆది+అనేక తంత్రములు= న్యాయము మొదలైన పెక్కు శాస్త్రాలు; ఒనర్చి= చేసి; అఖిలజన+అనుష్ఠేయ+ఆచారములు= ఎల్ల జనులు అనుష్ఠించవలసిన ఆచారములను - ప్రవర్తనకు చెందిన నియమ నిబంధనలను; విశదభంగిన్= స్పష్టమైన రీతిలో; పరిజ్ఞేయములుగన్+చేసిరి= బాగుగా తెలియదగినవిగా చేశారు.

తాత్పర్యం: ఆ మునిపుంగవులు ఆ దేవుడినుండి వేదాలు శాస్త్రాలు పొందిన తరువాత తమ మంచి బుద్ధులతో న్యాయం మొదలైన అనేక శాస్త్రాలను నిర్మించి లోకంలోని ఎల్లజనులూ ఆచరించదగ్గ నియమ నిబంధనలు స్పష్టంగా తెలియపరిచారు.

క. అవి వినఁగ నెఱుఁగఁ జేయను । నవుఁ బరమబ్రహ్మబోధ; మమరులకు ముని
ప్రవరులకును దుర్లభ మ । య్యవగతము జనార్దనునక యలవడియుండున్. 268

ప్రతిపదార్థం: అవి= ఆ న్యాయాది శాస్త్రాలు; వినఁగన్= వింటే; ఎఱుఁగన్= తెలిస్తే; చేయను= చేస్తే; పరమబ్రహ్మబోధము= పరబ్రహ్మను గూర్చిన జ్ఞానం; అవున్= కలుగుతుంది; ఆ+అవగతము= ఆ (శాస్త్రాల) పరిజ్ఞానం; అమరులకున్= దేవతలకూ; ముని ప్రవరులకును= ఋషిశ్రేష్ఠులకూ; దుర్లభము= సులభంకాదు; జన+అర్దనునకున్+అ= విష్ణువునకు మాత్రం; అలవడి+ఉండున్= అలవాటయి (తెలిసినదై) ఉంటుంది.

తాత్పర్యం: ఆ మునిపుంగవులు రచించి ఇచ్చిన న్యాయాదిశాస్త్ర సముచ్చయాన్ని విన్నా, తెలిసికొన్నా, ఆచరించినా పరబ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అయితే ఆ శాస్త్రాల పరిజ్ఞానం మాత్రం దేవతలకుగాని, ఋషులకుగాని సులభం కాదు. ఒక్క విష్ణువుకు మాత్రం వాటినిగూర్చిన పరిజ్ఞానం అలవడి ఉన్నది.

ఆ. సకల దుఃఖ భేషజం బగు నత్తెరు । వప్పురాణపురుషు నగ్గలంపుఁ
గరుణ నతనివలనఁ గనిరి మునీంద్రులు । గ్రమముతోడ నర్హగమ్య మయ్యె. 269

ప్రతిపదార్థం: సకల దుఃఖ భేషజంబు+అగు= ఎల్ల దుఃఖాలకూ మందైన; ఆ+తెరువు= ఆ పద్ధతి (ఆ న్యాయాది శాస్త్రాల పరిజ్ఞానం); ఆ+పురాణ పురుషు+అగ్గలము+కరుణన్= ఆ ప్రాచీన పురుషుడిని (విష్ణుదేవుడి) మిక్కుటమైన దయతో; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; కనిరి= పొందారు; క్రమముతోడన్= ఆ మునీంద్రుల వరుసతో - వారి నుండి, వారి శిష్య సంతతికి, వారినుండి వారి సంతతికి - ఇట్లా; అర్హగమ్యము+అయ్యెన్= తగినవారికి పొందదగ్గది అయింది (ఆ పరిజ్ఞానం).

తాత్పర్యం: దుఃఖాలన్నిటికీ ఔషధమైన ఆ శాస్త్రపరిజ్ఞానం, ఆ పురుషోత్తముడి అగ్గలమైన దయవలన మునీంద్రులు పొందగలిగారు. ఆ తరువాత ఆ మునీంద్రులనుండి వారి శిష్యసంతతికి, వారినుండి వారి శిష్యపరంపరకు - ఇట్లా ఆ పరిజ్ఞానం అర్హులకు లభిస్తూ వస్తున్నది.

క. చైతన్యశక్తిఁ బురుష స । మేతత్వవిశేషమున వహించుఁ బ్రకృతి; త
జ్జాత యగును బుద్ధి; తదు । ద్భూత మహంకార; మదియుఁ బొరయుం జిత్తున్. 270

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి - గాలి, ఆకాశం మొదలయిన మొదటి సృష్టి; పురుష సమేతత్వ విశేషమునన్= పురుషుడితో కూడుకొన్న అతిశయంతో - (పురుషుడితో కూడికతో); చైతన్యశక్తిన్= చేతనా శక్తిని - కదిలే - కదిలించేశక్తిని; వహించున్= ధరించును; తద్+జాత= దాని నుండి (ఆ ప్రకృతి పురుషుల కలయిక నుండి) పుట్టినది; బుద్ధి= బుద్ధి అనే మూల పదార్థం (తెలివి); అగును= అవుతుంది; అహంకారము= అహంకారం - 'నేను' అనే భావం; తద్+ఉత్+భూతము= దాని నుండి పుట్టినది; అదియున్= ఆ అహంకారం; చిత్తున్= చైతన్య రూపమైన ఆత్మను; పొరయున్= పొందును.

తాత్పర్యం: పురుష సమ్మేళనం కారణంగా ప్రకృతి చైతన్యాన్ని పొందుతుంది. చైతన్యజన్యమైనది బుద్ధి. బుద్ధి నుండి అహంకారం పుట్టింది. ఆ అహంకారం ఆత్మను చేరుతుంది.

క. కలిగె వినుమహంకారము । వలన నభము, దానఁ జేసి వాయువు, గ్రమసం
కలిత జననములఁ దేజము । జలము నిలయుఁ దత్తదాత్త జన్యత్వమునన్. 271

ప్రతిపదార్థం: వినుము= ఓ శిష్యా! - ఆలకించుము; అహంకారమువలనన్= 'అహంకారం' అనే మూలపదార్థంవలన; నభము కలిగెన్= ఆకాశం పుట్టింది; దానన్+చేసి= దాని (ఆకాశం)వలన; వాయువు= గాలి; క్రమ సంకలిత జననములన్= క్రమంగా - వరుసగా జరిగిన జన్మలలో; తేజము= కాంతి; జలము= నీరు; ఇలయున్= భూమి; తద్+తద్+ఆత్త జన్యత్వమునన్= (ఒకదాని నుండి ఒకటి) పొందబడ్డ పుట్టుకతో కలిగినవి.

తాత్పర్యం: శిష్యా వినుము. అహంకారం వలన ఆకాశం, ఆకాశంవలన వాయువు, వాయువువలన తేజస్సు, తేజస్సువలన నీరు, నీటివలన భూమి - ఇట్లా ఒకదాని నుండి ఒకటి కలుగుతూ పంచభూతాలు ఏర్పడ్డాయి. అహంకారమే ఈ భూతపంచకానికి మూలం.

వ. బుద్ధికి మహ త్తను తత్త్వనిర్దేశంబును గలిగియుండు. 272

ప్రతిపదార్థం: బుద్ధికిన్= బుద్ధి అనే మూలపదార్థానికి; మహత్తు+అను= 'మహత్తు' అనే; తత్త్వ నిర్దేశంబును= తాత్త్వికమైన - వేదాంతపరమైన; నిర్దేశంబును= పేరు కూడా; కలిగి+ఉండున్= ఏర్పడి ఉన్నది.

తాత్పర్యం: బుద్ధి అనే మూలపదార్థానికి మహత్తు అనే తాత్త్వికమైన పేరు కూడా ఏర్పడి ఉన్నది.

క. వికృతులు మహదాదిక స ।ప్తక ముభయ విధేంద్రియములు పదియు విషయ పం
చకమును మనసును గూడఁగ । వికారషోడశక మిది వివేకాభ్యర్థీ! 273

ప్రతిపదార్థం: వివేక+అభ్యర్థీ!= జ్ఞానాన్ని కోరేవాడా!; మహత్+ఆదిక సప్తకము= మహత్తు (బుద్ధి) మొదలగు ఏడు; వికృతులు= వికారములు - ప్రకృతికి భిన్నమైనవి; ఉభయవిధ+ఇంద్రియములు= రెండు విధాలయిన (జ్ఞానకర్మ భేదంతో రెండుగా ఉన్న) ఇంద్రియాలు - కన్ను కాలు మొదలయినవి; పదియున్= పదీ; విషయపంచకమును= విషయాలు - పంచేంద్రియాలకు గోచరించేవి- (శబ్దస్పర్శ రూపరస గంధాలు) ఐదూ; మనసును+కూడఁగన్= మనస్సును కలిపితే; ఇది ఈ పదార్థ సముదాయమంతా; వికారషోడశకము= వికృతుల పదియారు - పదహారు వికృతులు.

తాత్పర్యం: బుద్ధి (మహత్తు) మొదలయిన ఏడింటినీ తత్త్వశాస్త్రంలో వికృతులు అంటారు - జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు - వెరసి పదీ ఇంద్రియాలు. విషయాలు జ్ఞానేంద్రియాలకు, గోచరించే పదార్థాలు ఐదు, ఈ పదిహేనుకు తోడుగా మనస్సును కలిపి లెక్కిస్తే మొత్తం ఈ పదహారూ వికారాలు అనబడుతాయి.

క. ఈ సర్వము దేహత్వా । భాసిత; మిది దేహియైన పరమాత్ముని వి
న్యాసమునకుఁ గా నొదవి యు । పాసించుం గరణరూపమై యా కర్తన్. 274

ప్రతిపదార్థం: ఈ సర్వము= ఈ పదార్థాల మొత్తం; దేహత్వ+ఆభాసితము= శరీరత్వంగా అగుపించే; ఇది= ఈ ఆభాస; దేహి+ఐన= దేహంగల శరీరం దాల్చిన; పరమ+ఆత్ముని= పరబ్రహ్మయొక్క; విన్యాసమునకున్+కాన్= ఉనికికొరకు; ఒదవి= ఏర్పడి; కరణరూపము+ఐ= సాధన రూపంగా (పనిముట్టవలె); ఆ కర్తన్= ఆ చేసేవాడిని - పరమాత్మను; ఉపాసించున్= సేవిస్తుంది.

తాత్పర్యం: పైన వివరించిన ప్రకృతులు, వికృతులు - అన్నీ ఆ పరమాత్మ నివాసంకొరకు శరీరంవలె అగుపిస్తూ, ఈ అన్నింటికీ ఆదికర్త అయిన ఆ పరమాత్మకే సాధనాల రూపంగా ఉపకరిస్తూ, అతడినే సేవిస్తుంటాయి.

విశేషం: భాసం వేరు 'ఆభాస' వేరు. భాసమంటే కాంతి. అది నిజం. 'ఆభాస' అంటే అగుపించటం నిజం కానిది. ఉన్నట్లు అగుపిస్తుంది- ఉండదు. 'రసాభాస' మొదలయిన వ్యవహారంలోనిది ఇదే. ఇక్కడ శరీరం కూడా ఆభాస మాత్రం.

తే. పుత్ర! వినుము నవద్వార పుణ్యపురము । నం దచింత్య సంవ్యాపకుఁ డై శయించు
నీ సమస్త భావంబుల నెనసి యట్టు । లగుటఁ బురుషుండు నాఁ జను నవ్విభుండు. 275

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; వినుము= ఆలకించుము; నవద్వార పుణ్యపురమునందున్= తొమ్మిది వాకిళ్ళుగల పుణ్యనగరంలో (శరీరంలో); ఆ+విభుండు= ఆ ప్రభువు - పరమాత్మ; అచింత్య సంవ్యాపకుఁడు+ఐ= ఊహించరాని వ్యాప్తిగలవాడై; ఈ సమస్త భావంబులన్= ఈ అన్ని తత్త్వాలను గుణాలను; ఎనసి= పొంది; శయించున్= పరుండి ఉంటాడు; అట్టులు+అగుటన్= అట్లు ఆ శరీరాన పరుండుటవలన; పురుషుండు నాన్+చనున్= 'పురుషుడు' (పురమున శయనించేవాడు) అనబడతాడు.

తాత్పర్యం: కుమారా! వినుము. ఈ శరీరం తొమ్మిది ద్వారాలున్న పుణ్యపురం. ఈ పురాన ఆ పరమాత్మ ఊహాతీతమైన వ్యాప్తిశక్తితో నిండి, అన్ని భావాలను, స్వభావాలను, గుణాలను పొంది, శయనించి ఉన్నాడు. అందువలననే ఆ పరమాత్మను 'పురుషుడు' అంటారు. అంటే పురాన శయనించేవాడని ఆ పదానికి వ్యుత్పత్తి- "పురి శేతే" - ఇతి పురుషః.

విశేషం: ఇక్కడ విద్యార్థిని - శిష్యుడిని గురువు 'పుత్రా!' అంటున్నాడు. ప్రాచీనకాలాన గురుకులాలు విద్యాసంతతికి నిలయాలుగా ఉండేవి. వంశసంతతివలెనే విద్యాపరమైన సంతాన పరంపర కొనసాగుతుండేది. అందువలన ఆనాటి శిష్యులు గురువులకు పుత్రులే!

క. అమరుం డవ్యయుఁ డజరుం । డమేయుఁ డమలస్వభావుఁ డప్పురుషుఁడు దే
హమున మహీజమునం దన । లమున్న గతి నుండు మథనలక్ష్యం డగుచున్. 276

ప్రతిపదార్థం: ఆ+పురుషుఁడు= ఆ పరమాత్మ స్వరూపుడై శరీరంలో కాపురముండే నరుడు; అమరుఁడు= మరణం లేనివాడు; అవ్యయుఁడు= నాశనం లేనివాడు; అజరుండు= ముసలితనం లేనివాడు; అమేయుఁడు= కొలువరానివాడు; అమలస్వభావుఁడు= నిర్మల స్వభావం కలవాడు; దేహమునన్= శరీరాన; మహీజమునందున్= చెట్టునందు; అనలము+ఉన్నగతిన్= నిప్పు ఉన్న విధంగా; మథన లక్ష్యుండు+అగుచున్= తరచుటచేత గుర్తించదగినవాడై; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: ఆ పురుషుడు నిజానికి మరణం, నాశనం, ముసలితనం, కొలతలు, మలినాలు - ఇవేవీ లేనివాడు. నరుడికి ఇవన్నీ ఉన్నట్లు మనం చూస్తున్నాం. ఇదంతా ఆభాసమాత్రమే. దేహాన ఆ పురుషు డున్న తీరు ఎటువంటి దంటే, చెట్టులో నిప్పు దాగి ఉన్నట్లే. చూస్తే కనిపించని నిప్పు చెట్టును మథిస్తే కనిపిస్తుంది. బహిరింద్రియాల ద్వారా తెలియరాని ఆ పరమాత్మస్వరూపు డైన ఆ పురుషుడు, యోగమథనంద్వారా కనిపిస్తాడు. ఆత్మజ్ఞానానికి అంతర్మథనం అవసరం.

విశేషం: అలం: ఉపమ.

ఆ. వినుము! యోగమథనమునఁ దోఁచు నత్తేజ; । మది ప్రబోధసాంద్ర, మఖిల భూత
గణసమాశ్రయంబు గావున శ్రవణ ద । ర్శన ముఖక్రియాకరంబు దాన. 277

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆ+తేజము= ఆ పరమాత్మ స్వరూపమైన కాంతి; యోగమథనమునన్= యోగం ద్వారా త్రచ్చుటతో; తోచున్= కనిపించును; ఆ+తేజము= ఆ పరమాత్మ స్వరూపమైన కాంతి; అది= ఆ కాంతి; ప్రబోధ సాంద్రము= ప్రజ్ఞానంతో - గొప్పజ్ఞానంతో దట్టమైనది; అఖిల భూతగణ సమ్+ఆశ్రయంబు= ఎల్లప్రాణుల సమూహాలకూ ఆధారమైనది; కావునన్= కాబట్టి; శ్రవణ దర్శన ముఖ క్రియాకరంబు= వినటం, చూడటం మొదలైన పనులచేసేది; దానన్= దానియందే (ఈ చివరి పదం అనంతర పద్యంతో అన్వయిస్తుంది).

తాత్పర్యం: యోగవిద్యాభ్యాసంతో మథిస్తే కనిపించే ఆ పరమాత్మ స్వరూపుడైన పురుషుడు తేజోరూపాన ఉంటాడు. తేజస్సే అతడు. ఆ తేజస్సు జ్ఞానంతో నిండి ఉంటుంది. ఆ జ్ఞానమయతేజస్సు సకలప్రాణిసామాన్యంగా అన్నింటికీ ఆధారంగా వెలుగుతుంటుంది. అన్ని ప్రాణులలో ఉంటుంది కాబట్టి-వినటం, చూడటం మొదలయిన పనులన్నిటినీ నిర్వహిస్తుంది కూడా.

క. భూతము లవ్యక్తంబున । జాతములగు; నంద పెరుఁగు సమయుఁ; దదీయ
స్ఫీతత్వమునన పురుషుం । డే తద్విధ సాక్షితాసమిద్ధుఁడు వత్సా! 278

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా! కుమారా! (దానన్= ఆ తేజస్సునందే); భూతములు= ప్రాణులు; అవ్యక్తంబునన్= మూలప్రకృతినుండి; జాతములు+అగున్= కలిగినవి అవుతున్నాయి; అందున్+అ= దానియందే - ఆ తేజస్సునందే; పెరుఁగున్= పెద్దవౌతాయి; తదీయ స్ఫీతత్వమునన= దాని ఆధిక్యమునందే; సమయున్= నశిస్తాయి; పురుషుఁడు= పరమాత్మరూపుడై తేజోమయంగా ప్రాణులలో ఉండేవాడు; ఏతద్+విధ సాక్షితా సమ్+ఇద్ధుఁడు= ఈ విధమైన సాక్షిత్వంతో వెలుగొందేవాడు.

తాత్పర్యం: ఆ తేజోరూప పరమాత్మనుండే ఈ సృష్టిలో ప్రాణిలోకమంతా పుట్టుతుంది. ఆ తేజస్సునందే పెరుగుతుంది. చివరకు ఆ తేజస్సమృద్ధిలోనే సమసిపోతుంది. ఈ సృష్టిస్థితిలయలు మూడూ జరుగుతుండగా, ఆ అన్నింటికీ సాక్షీభూతుడుగా దేహస్థుడైన పురుషుడు మిగులుతున్నాడు.

భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్రప్రభావం బెఱిఁగించుట (సం. 12-204-7,8)

ఆ. వ్యక్త సప్తధార మవ్యక్త నాభంబు । షోడశకవికార సుపరిమండ
లంబు ధ్రువ మధిష్ఠితం బాత్మచేతఁ జ । క్రంబు దిరుగుచుండుఁ గాలవశత. 279

ప్రతిపదార్థం: వ్యక్త సప్తధారము= వెల్లడిఅయిన ఏడు అంచులు గలది (బుద్ధి మొదలైన ఏడు వికృతులు కాలచక్రానికి అంచులు); అవ్యక్తనాభంబు= మూలప్రకృతి నాభిగా (బొడ్డుగా)గలది; షోడశకవికార సుపరిమండలంబు= పదహారు వికారాలు - జ్ఞాన కర్మ ఇంద్రియాలు లోనైనవి మంచి వలయాలుగా గలిగినది; ధ్రువము= శాశ్వతమైనది; ఆత్మచేతన్= ఆత్మచేత; అధిష్ఠితము= అధిష్ఠించబడినది - కూర్చొనబడినది, అయిన; చక్రంబు= చక్రం - గుండ్రంగా తిరిగే గుండ్రని వస్తువు; కాలవశతన్= కాలవశంవలన - కాలమహిమవలన - కాలానికి లోబడి; తిరుగుచుండున్= పరిభ్రమిస్తుంటుంది.

తాత్పర్యం: కాలం ఒక చక్రం. దానికి బుద్ధి మొదలయిన వికృతులు ఏడూ అంచులు. ఆ అంచులు కనిపిస్తూ ఉంటాయి. దాని నాభి - కేంద్రస్థానం - అవ్యక్తం. అంటే మూలప్రకృతి కేంద్రంగా కలది కాలచక్రం. ఆ చక్రానికి జ్ఞానకర్మ ఇంద్రియాలు పదహారు వికారాలూ వలయాలు. ఆ చక్రంమీద ఆత్మ అధిష్ఠితుడై ఉన్నాడు. అది శాశ్వతమైనది. భ్రమణశీలం కలది. గుండ్రంగా తిరుగుతుంటుంది.

విశేషం: కొన్ని సంఘటనలు సృష్టిలో ఒక నియమం ప్రకారం మళ్ళీ మళ్ళీ జరుగుతున్నట్లు కనిపించినపుడు, ఆది మానవుడు ఆ ఆవృత్తిని చక్రభ్రమణంతో పోల్చికొని ఉండవచ్చును. ఉదా: ఋతువులు, పగళ్ళు రాత్రులు, ఉదయాలూ సాయంకాలాలూ. అటు తరువాత ఆ ఊహాచక్రానికి ఇతర అవయవాలు అమర్చి, ఒక సంపూర్ణ దృశ్యాన్ని నిర్మించుకొని గ్రంథస్థం చేశా డతడు.

క. ఈ చక్రంబున సకల చ । రాచరమయ మైన లోక మవశానిష్ఠా
గోచరమై చరియించుట । సూచికొనన్ వలయుఁ దత్త్వశోధన దృష్టిన్. 280

ప్రతిపదార్థం: ఈ చక్రంబునన్= ఈ కాలచక్రంలోపల; సకల చర+ఆచరమయము+ఐన లోకము= మొత్తము కదిలే, కదలని వాటితోడిదైన జగత్తు; అవశ+అనిష్ఠా గోచరము+ఐ= వశంగాని, నిలకడలేని స్థితి కలదై; చరియించుట= తిరుగుతుండటం; తత్త్వశోధన దృష్టిన్= సత్యమును వెదకే చూపుతో; చూచికొనవలయున్= చూచుకొనాలి.

తాత్పర్యం: ఆ కాలచక్రమహిమను చూచి గ్రహించవలసిందే. ఆ చక్రంలోనే ఈ సకల చరాచరమయిన జగత్తంతా వశం తప్పి, నిలకడలేక నిలిచి తిరుగుతూ ఉన్నది. సత్యశోధన దృష్టితో - ఆంతరమైన జ్ఞానదృష్టితో ఈ దృశ్యాన్ని దర్శించవలసి ఉంటుంది.

తే. పొందు సత్త్వరజస్తమంబులు విశుద్ధ । నంతరాత్మఁ బాంసువ్రాత మనిలుఁ జెందు
నట్లు సద్వివేకమునఁ దదంతరంబు । బుధుఁడు గాంచి యగ్గుణములఁ బొరయకుండు. 281

ప్రతిపదార్థం: పాంసువ్రాతము= దుమ్ము ప్రోవు; అనిలున్+చెందునట్లు= గాలిని చేరేవిధంగా; సత్త్వరజస్+తమంబులు= సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు; విశుద్ధున్= పరిశుభ్రమైన; అంతర్+ఆత్మున్= లోపలి ఆత్మను - పరమాత్మను; పొందున్=

చేరును; బుధుఁడు= పండితుడు; సత్+వివేకమునన్= మంచి జ్ఞానంతో; తద్+అంతరంబు= వాటి భేదం; కాంచి= చూచి - గ్రహించి; ఆ+గుణములన్= ఆ మూడు గుణాలను; పొరయక+ఉండున్= పొందకుండా ఉంటాడు.

తాత్పర్యం: దుమ్ము, ధూళి పోగులుగా నిర్మలవాయువులో కలిసినట్లుగా, సత్త్వము, రజస్సు, తమము అనే త్రిగుణాలు విశుద్ధుడైన అంతరాత్మలో చేరుతున్నాయి. పండితుడైనవాడు మంచివివేకంతో ఆ గుణాల భేదాలు గ్రహించి, వాటికి దూరంగా ఉంటాడు. ఆ గుణాలు తనను అంటుకొననివ్వడు.

విశేషం: అలం: ఉపమ. విద్యవలన వివేకం కలగవచ్చును. అయితే ఈ విద్య ఉన్న ప్రతిచోటా వివేకం ఉండాలనే నియమం లేనట్లుగా లోకవృత్తాంత పరిశీలన వలన గ్రహించవచ్చును. కాబట్టి "విద్యచే భూషితుండయి వెలయుచున్నఁ దొడరి వర్జింపనగుఁ జుమీ దుర్జనుండు" వంటి సూక్తులు పుట్టాయి. వివేకం విషయంలో అటువంటివి ఏమీ వినిపించవు. కాగా వివేకం విద్యను మించినది.

క. వేదాంతవిదుఁడు దుర్లభుఁ । డాదరము ప్రవృత్తి లక్షణాన్వితమగు ధ
ర్మోదయమంద కలుగు నది । లే దరయ నివృత్తి సౌఖ్య లీనత్వమునన్. 282

ప్రతిపదార్థం: వేదాంతవిదుఁడు= వేదాంతం - తత్త్వం తెలిసినవాడు; దుర్లభుఁడు= కష్టంతో లభించేవాడు - అరుదుగా దొరికేవాడు; ఆదరము= అభిమానం; ప్రవృత్తి లక్షణ+అన్వితము+అగున్= ప్రవర్తించటం అనే గురుతుతో కూడినది అగును - ప్రవృత్తికి కారణ మగును; అందున్+అ= దానియందే - ఆ ప్రవృత్తియందే; ధర్మ+ఉదయము= పుణ్యపు పుట్టుక; కలుగున్= ఏర్పడుతుంది; అరయన్= పరిశీలించగా; నివృత్తి సౌఖ్యలీనత్వమునన్= నివృత్తి (ప్రవృత్తికి వ్యతిరిక్తమైనది)వలన సౌఖ్యమున మగ్నమగుటలో; అది= ఆ ధర్మోదయం - పుణ్యం కలగటం; లేదు= ఉండదు.

తాత్పర్యం: భూమిమీద తత్త్వవేత్త అరుదుగా లభిస్తాడు. తత్త్వవేత్తలు కానివారిలో ప్రకృతి సహజలక్షణాలు ఉంటాయి. వారు సత్త్వరజస్తమోగుణాలు గలవారై ఉంటారు. వారిలో ఉండే ఆదరం - అంటే వస్తువులయెడ, వ్యక్తులయెడ ఉండే అభిమానం వారిని లోకవ్యవహారాలలో ప్రవర్తించేటట్లు చేస్తుంది. ఆ ప్రకృతి లక్షణం ఒక విధంగా ఉత్తమమే. ఎందుకంటే ప్రవృత్తిమార్గంలో ఉన్నపుడే నరుడు పుణ్యాన్ని ఆర్జించగలడు. ప్రవృత్తిమార్గానికి భిన్నమైనది నివృత్తిమార్గం-అంటే లోకవ్యవహారాలకు దూరంగా వాటినుండి మరలి ఉండటం. ఆ విధంగా అంతర్ముఖుడై ఉన్న నరుడికి పుణ్యార్జన చేసే వీలు ఉండదు.

క. ఆర్యులుఁ బ్రవృత్తి లక్షణ । కార్యంబులచేతఁ జేసి గ్రాహ్యము నగు త
ద్ధుర్యత్వ మందు విడువర । నార్యములగు మదనమద భయక్రోధాదుల్. 283

ప్రతిపదార్థం: ఆర్యులున్= పూజ్యులు కూడా - మంచివారును; ప్రవృత్తి లక్షణ కార్యంబులచేతన్+చేసి= ప్రవృత్తికి గుర్తు అయిన క్రియల కారణాన; గ్రాహ్యమున్+అగు= గ్రహింపదగ్గదే అయిన; తద్+ధుర్యత్వమందున్= ఆ కార్యభారం వహించేవాని తనంలో- కార్యభారం వహించే సందర్భాన; అనార్యములు+అగు= మంచివి కానివి అగు; మదన+మద భయక్రోధ+ఆదుల్= మన్మథ (వికారం), మదం, భయం, క్రోధం, మొదలైనవాటిని; విడువరు= వదలిపెట్టరు.

తాత్పర్యం: నరులు పూజ్యులే అయినా, వారు ప్రవృత్తిమార్గాన పయనిస్తున్నపుడు వివిధ విధినిషేధాలను పాటిస్తూ పెక్కుకార్యాలు నిర్వహిస్తూ ఉండవలసి వస్తుంది. ఆయా కార్యభారాలను వహించే సందర్భాలలో వారు, చెడ్డవి అని తెలిసికూడా మన్మథవికారాలను గాని, మత్తునుగాని, భయక్రోధాది భావాలను గాని విడిచిపెట్టలేరు. అవి వారి కార్యభారవహనసమయాన తప్పక కావలసివస్తాయి.

తే. వినుము దేహాభిమానికి వీని నెల్లఁ । దొఱఁగ దొరకొన దెంత శాంతునకునైనఁ
గాన ఏమిట దేహాభిమాన మెడలు । నట్టి చూ పభ్యసించు వేదాంతవిదుఁడు. 284

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఎంత శాంతునకున్+ఐనన్= ఎంతగా శాంతిని పొందినవానికైనా; దేహ+అభిమానికిన్= శరీరంపట్ల ప్రేమగలవాడికి; వీనిని+ఎల్లన్= వీటిని అన్నింటిని - మదన మదభయ క్రోధాదులను; తొఱఁగన్+దొరకొనదు= విడువ వీల్పడదు; కాన= కాబట్టి; వేదాంత విదుఁడు= తత్త్వవేత్త; ఏమిటన్= దేనిచేత; దేహ+అభిమానము= శరీరం పైన ఆదరం; ఎడలున్= తొలగునో; అట్టి చూపు= ఆ విధమైన (శరీరాభిమానాన్ని దూరంచేసే) చూడ్కి; అభ్యసించున్= నేర్చుకొంటాడు.

తాత్పర్యం: ఎంత శాంతిని వహించినవాడైనా, శరీరంమీద అభిమానం ఉన్నంత కాలం, అతడు ఈ పరిత్యాజ్యా లయిన మదనమదభయక్రోధాది దుర్లక్షణాలను విడిచిపెట్టలేడు. కారణం శరీరాభిమానమే. కాబట్టి తత్త్వవేత్త అయినవాడు, ముందుగా దేనిద్వారా ఈ దేహాభిమానం తొలగించవచ్చునో - ఆ పద్ధతిని అలవరచుకొనాలి. ఆ విధమైన చూపు అతడిలో రావాలి.

ఆ. అడవి సొచ్చి యంతకంతకు నవులకు । నతికుతూహలమున నరిగి యరిగి
చూచుచుండునట్లు సూవె సంసార కా । ననము నందుఁ దిరుగు జనుల నడపు. 285

ప్రతిపదార్థం: సంసార కాననమునందున్= కుటుంబము అనే అడవిలో; తిరుగు= సంచరించు; జనుల నడపు= ప్రజల నడత; అడవి+చొచ్చి= అరణ్యాన ప్రవేశించి; అంతకున్+అంతకున్= అంతకంటె, అంతకంటె; అవులకున్= ఆవల ప్రదేశానికి - అవతలి స్థలానికి; అతికుతూహలమునన్= ఎక్కువ ఉత్కంఠతో; అరిగి+అరిగి= నడచి నడచి; చూచుచున్+ఉండునట్లు+చూవె!= చూస్తూ ఉండునట్లు సుమా!

తాత్పర్యం: ఈ సంసారం ఒక అరణ్యం. సంసారాన పడి జీవించటమంటే - అడవిలో పడి నడవటం. అడవిలోపడి నడచేవాడు. ఒకచోట ఆగక, అంత కంతకు పైపైకి నడిచివెళ్ళుతూ ఉత్కంఠతో ఆయా దృశ్యాలను' చెట్లు చేమల, పక్షులు సరీసృపాల, సాధు క్రూరజంతువుల వింత వింత తీరుతెన్నులను చూస్తూ తిరుగుతూనే ఉంటాడు. ఈ లోకాన సంసారీ అంతే. సంసారంలో ఒక దశనుండి మరొక దశకు, ఒక స్థితినుండి మరొక స్థితికి చేరుకొంటూ నిరంతరం పరిభ్రమిస్తూ విస్తుపోతూనే ఉంటాడు. అతడికి నిజమైన సుఖమూ శాంతీ లభించవు.

విశేషం: అలం: రూపకానుప్రాణితోపమ.

క. విను తెవు లుడుపఁగ భేషజ । మునకుం దలకొనిన చందమున మది సత్యం
బును శౌచము శమమును దమ । మును నెలకొలుపంగవలయు మోహచ్యుతికిన్. 286

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; తెవులు= రోగం; ఉడుపఁగన్=పోగొట్టుకొనటానికై; భేషజమునకున్= మందుకొరకు; తలకొనిన చందమునన్= ప్రయత్నించిన విధాన; మదిన్= మనస్సునందు; సత్యంబును= సత్యవ్రతం - నిజం చెప్పటం - చెప్పింది చెయ్యడంవంటి నియమపాలన; శౌచము= శుచిత్వం - పరిశుభ్రత; శమమును= శాంతిని; దమమును= దాంతిని - ఇంద్రియ నిగ్రహాన్ని; మోహ చ్యుతికిన్= శరీరంమీది వ్యామోహం జారిపోవటానికి; నెలకొలుపంగన్+వలయున్= ఏర్పరచుకొనాలిస్థాపించుకొనాలి.

తాత్పర్యం: రోగం పోవటానికి మందు కావాలి. మందుకొరకు యత్నించి పొందవలసి ఉంటుంది. ఆ విధంగానే శరీరంమీది వ్యామోహమూ ఒక రోగమే. దానిని పారద్రోలాలంటే నరుడు తన మనస్సులో సత్యాన్ని, పరిశుభ్రతను, నిగ్రహాన్ని, శాంతిని నెలకొల్పుకొనాలి. ఈ సద్గుణాలన్నీ భేషజంవలె పనిచేసి, నరుడికి శరీరాభిమానం నుండి ముక్తిని ప్రసాదిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. భూమి మొదలుగఁ గల భూతములకు నింద్రి । యముల కన్నింటికిని సత్త్వ మాదియైన
గుణములకు నెల్ల జగములకును దదీశ్వ । రునకు నరయ నహంకార మునికిపట్టు. 287

ప్రతిపదార్థం: భూమి మొదలుగన్+కల= భూమి మొదలయిన; భూతములకున్= మూలపదార్థాలకు - నీరు, తేజస్సు, గాలి, ఆకాశాలకు; ఇంద్రియములకున్+అన్నిటికినిన్= కన్ను, ముక్కు, లోనైన ఇంద్రియాలన్నింటికీ; సత్త్వము+ఆది+ఐన= సత్త్వం మొదలయిన; గుణములకున్= రజస్సు తమస్సు అనే ప్రాథమికమైన గుణములకు; ఎల్ల జగములకును= అన్నిలోకాలకూ; తద్+ఈశ్వరునకున్= ఆ లోకాల అధిపతులకూ; అరయన్= ఆలోచించగా; అహంకారము= 'నేను అనే భావం' అహంకారం; ఉనికిపట్టు= నివాసస్థలం.

తాత్పర్యం: ఈ సర్వసృష్టి పంచభూతాత్మకం. అయితే ఆ పంచభూతాలకూ, ప్రాణులకున్న ఇంద్రియాలకూ, ప్రాథమికమైన సత్త్వరజస్తమోగుణాలు మూడింటికీ - ఇంతెందుకు ఎల్లలోకాలకూ, ఆ లోకాలను ఏలే అధిపతులకూ ఆవాసస్థానం అహంకారం. ఒక్క అహంకారంవలన ఈ లోకాలు, ప్రాంతాలు లోకేశ్వరులూ ఈ సర్వమూ ప్రవర్తిల్లుతున్నవి. అన్నిటికీ మూలం అహంకారం.

తే. స్మృతియు సంప్రీతియును బ్రసన్నతయు మఱియు । నీదృశములును సత్త్వగుణోదితములు
రాగలోభ రోషాదులు రాజసములు । దర్పశోక ప్రముఖములు దామసములు. 288

ప్రతిపదార్థం: స్మృతియున్= స్మరణం - తలచుట; సంప్రీతియును= మంచి సంతోషం; ప్రసన్నతయున్= కలతలేకుండా ఉండటం; మఱియున్= ఇంకను; ఈదృశములును= ఇటువంటివీ; సత్త్వగుణ+ఉదితములు= సత్త్వం అనే గుణం వలన కలిగినవి; రాగలోభ రోష+ఆదులు= ఆసక్తి, పేరాస, క్రోధం మొదలయినవి; రాజసములు= రజోగుణ సంబంధులు; దర్ప శోక ప్రముఖములు= పొగరు, ఏడుపు మొదలయినవి; తామసములు= తమోగుణ సంబంధి లక్షణాలు.

తాత్పర్యం: స్మరణం, సంతోషం, కల్మషరాహిత్యం ఇంకా ఇటువంటి సల్లక్షణాలు సత్త్వగుణంవలన కలిగేవి. ఆసక్తి, పేరాస, క్రోధం మొదలయిన లక్షణాలు రజోగుణంవలన ఏర్పడేవి. పొగరు, ఏడ్పు మొదలయినవి చివరిదైన తమోగుణం నుండి కలుగుతాయి.

క. జ్ఞానమునకు నగ్గుణసం । తానం బడ్డంబుగాన తత్ప్రతిహతికై
పూని మును సాత్త్వికమునను । మానస మూన్పంగ వలయు మహనీయధృతిన్. 289

ప్రతిపదార్థం: జ్ఞానమునకున్= ముక్తి సంబంధమైన తెలివికి; ఆ+గుణ సంతానంబు= ఆ (మూడు) గుణాల సమూహం; అడ్డంబు= అవరోధం; కాన= కాబట్టి; తద్+ప్రతిహతికై= దాని (ఆ అడ్డం) తొలగింపునకై ప్రతిక్రియకొరకు; మును= ముందుగా; పూని= యత్నించి; మానసము= మనస్సు; మహనీయ ధృతిన్= ఆరాధించదగ్గ ధైర్యంతో; సాత్త్వికమునను= సాత్త్విక గుణమునందు; ఊన్పంగన్+వలయున్= నిలుపవలెను.

తాత్పర్యం: లౌకికమైన తెలివితేటలు విజ్ఞానమనీ, అలౌకికమైన ఆధ్యాత్మమైన తెలివితేటలు జ్ఞానమని విజ్ఞులంటారు. ఆ జ్ఞానం కలుగటానికి ఈ సత్త్వరజస్తమోగుణాలు అడ్డంగా ఉంటాయి. ఆ అడ్డు తొలగించుకొనాలంటే ముందుగా ఆ గుణాలలో ఉత్తమమైన సత్వగుణాన్ని మనస్సున ప్రయత్నపూర్వకంగా ప్రతిష్ఠించుకొనాలి. ఆ విధంగా మనస్సును సత్త్వగుణంతో నింపాలంటే నరుడికి ఇతరులు ఆరాధించదగ్గ గొప్ప ధైర్యబల ముండాలి.

విశేషం: సంసారంలో ఉంటూ సత్త్వగుణాన్ని మనస్సున నిల్పి వ్యవహరించగలగటం, నిజంగా ఎంతో ఆరాధనాభాజనమైన ధైర్యం ఉంటే గాని కుదరదు. ఎందుకంటే చుట్టూ విరుద్ధవాతావరణం ఉంటుంది. ఏ పాటిగా పూనిక తప్పినా రజస్సునకో, తమస్సునకో జారిపోయే ప్రమాదముంటుంది. అందుకనే 'పూని', 'మహనీయధృతి' అంటూ నొక్కిచెప్పవలసి వచ్చింది.

క. వినుఁ సాత్త్వికములు మది నెల । కొని రాజసతామసములకును వినతత్వం
బొనరించుఁ బదంపడి స । త్వనిరూఢత బోధసంపదకు హేతు వగున్. 290

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; సాత్త్వికములు= సత్త్వగుణ సంబంధి లక్షణాలు; మదిన్= మనస్సును; నెలకొని= పాదుకొని; రాజస తామసములకును= రజస్తమోగుణాలకు చెందిన లక్షణాలకు కూడా; వినతత్వంబు= లొంగిపోయినతనమును; ఒనరించున్= కలిగిస్తాయి; పదంపడి= ఇంకను; సత్త్వనిరూఢత= సత్త్వగుణం గట్టిగా నెలకొని ఉండటం; బోధ సంపదకున్= జ్ఞానసంపత్తికి; హేతువు+అగున్= కారణమగును.

తాత్పర్యం: మనసున సత్త్వగుణసంబంధమైన లక్షణాలు నెలకొన్నట్లయితే - అవి ఇతర రాజసమైన, తామసమైన లక్షణాలు వీగిపోయేటట్లు చేయగలవు. పైగా మనస్సు సత్త్వగుణ సంభరితమై ఉండటం జ్ఞానావిర్భావానికి కారణంగా కూడా పరిణమిస్తుంది.

తే. క్రియ లహంకారమునఁ గల్గుఁ గ్రియలవలన । దేహసంబంధ మెడలక తిరుగవలయు
జన్మపర్యాయములయందు జన్మ మనఁగ । మిళితనవశుక్లశోణితకలితవృత్తి. 291

ప్రతిపదార్థం: అహంకారమునన్= అహంకారం - నేను అనే భావం వలన; క్రియలు= కార్యాలు - పనులు; కల్గున్= ఏర్పడతాయి; క్రియలవలనన్= పనుల కారణాన; దేహసంబంధము= శరీరంతోడి చుట్టరికం; ఎడలక= తొలగక; జన్మపర్యాయములఅందున్= పుట్టుకల క్రమంలో; తిరుగన్+వలయున్= తిరుగవలసి ఉంటుంది; జన్మము+అనఁగన్= పుట్టుక అంటే; మిళిత నవ శుక్ల శోణిత కలిత వృత్తి= కలిసిన కొత్త ఇంద్రియ రక్తములతోడి బ్రతుకు - ఇంద్రియరక్తములు కొత్త కొత్తగా కలుస్తుంటే, పుట్టుతూ ఉండాలి.

తాత్పర్యం: అహంకారం సకల లోకాలకే కాక లోకేశ్వరులకూ ఉనికిపట్టని గ్రహించి ఉన్నాం. ఆ అహంకారమే జీవుల సకల కార్యాలకూ మూలం. ఆ కార్యనిర్వహణం జరుగుతున్నంతవరకు, ఆ కార్యకలాపాల ఫలితాలుగా పాపపుణ్యాలు కలుగుతూనే ఉంటాయి. ఆ పాపపుణ్యాల అనుభవంకొరకు ప్రాణి దేహం ధరించి, జననమరణ చక్రానపడి, క్రిందికీ మీదికీ తిరుగుతుండటం తప్పనిసరి. ఇంతకూ జననమంటే, పురుషుడి శుక్లం, స్త్రీ శోణితాల కలయికతో రూపుదిద్దుకొనటమే.

ఆ. మూత్రమునఁ బురీషమున నూనుచును గర్భ । మునఁ బ్రవర్ధనమ్ముఁ బొంది వెడలి
సంతతానుబంధ సంసార దుఃఖ ని । ర్మగ్నుఁ డగుచు నుండు మానవుండు. 292

ప్రతిపదార్థం: మానవుండు= నరుడు; మూత్రమునన్= నీరుడితో; పురీషమునన్= మలంతో; ఊనుచును= ఆనుచు-అంటుకొంటూ; గర్భమునన్= కడుపునందు; ప్రవర్ధనమ్మున్+పొంది= పెరుగుటను 'చెంది' - పెరిగి; వెడలి= బయటపడి; సంతత+అనుబంధ సంసార దుఃఖ నిర్మగ్నుఁడు= ఎల్లప్పుడు వెన్నంటి ఉండే సంసారమనే దుఃఖాన మునిగినవాడై; అగుచున్= ఔతూ; ఉండున్= జీవిస్తాడు.

తాత్పర్యం: నరుడి జన్మ దుఃఖమయమేగాదు, రోతగొల్పునది కూడా. మలమూత్రాల నడుమ గర్భాన పెరిగి, బయటపడి, ఇక అప్పటినుండి నిరంతరం సంసారంతో బద్ధుడైపోయి, తొలుత శిశువుగా, తనయుడుగా దానిలో చేరిన తాను చివరకు ముదుసలిగా తాతగా మారేంతవరకు దుఃఖంలో కూరుకొనిపోతున్నాడు.

విశేషం: తాత్త్విక దృష్టితో చూచినపుడు సాంసారిక జీవనం కేవలం గతానుగతికంగానే కాక, సారహీనంగా దుఃఖమయంగా కూడా కనిపిస్తుంది.

క. ఇంతకు మూలము దృష్ణా । తంతులతయ వత్స! వినుము దానికి నడరం
గాంతాజనంబు దొలు ప్రాఁ । కింత యెఱిఁగి తృష్ణ తొఱఁగు టిచ్చు విముక్తిన్. 293

ప్రతిపదార్థం: వత్స!= బిడ్డా! ధర్మనందనా!; ఇంతకున్= ఈ అంతటికిని; మూలము= హేతువు; తృష్ణాతంతులత+అ= పేరాస అనే తీగే; వినుము= ఆలకించుము; దానికిన్= ఆ తీగకు; అడరన్= అతిశయించగా; కాంతాజనంబు= స్త్రీజనం; తొలుప్రాఁకు= పాకుడు కొరకు నిలువుగా కొట్టిన కొయ్య - ఆలంబనం - ఊతం; ఇంత+ఎఱిఁగి= ఈ విధం గ్రహించి; తృష్ణ+తొఱఁగుట= పేరాసను వదలటం; విముక్తిన్= మోక్షమును - సంసారబంధమునుండి ఎడబాటును; ఇచ్చున్= ఒసగును.

తాత్పర్యం: ఈ నిరంతర సంసారబంధానికి, ఎడతెరపి లేక తిరిగే జనన మరణ చక్రానికి ఏకైక మూలం ఆశ అనే తీగ. ఆ ఆశాలత ఎగబ్రాకటానికి పాకుడు కొయ్యగా సంసారంలోని స్త్రీజనం ఉపయోగపడుతున్నది. ఈ నిజం తెలిసి, ఆశను విడిచిపుచ్చగలిగితే, సంసారబంధం నుండి, జనన మరణ చక్రభ్రమణం నుండి బయట పడవచ్చును.

విశేషం: అలం: రూపకం.

క. జ్ఞానాజ్ఞానంబులకుం । దాన యుపాశ్రయము బుద్ధి తత్త్వాహంకా
రానూన లక్షణాఢ్యం । బైన యెఱుక దాని జీవుఁ డని చెప్పు శ్రుతుల్. 294

ప్రతిపదార్థం: బుద్ధి= నరుడి మతి; జ్ఞాన+అజ్ఞానంబులకున్= జ్ఞానానికీ, అజ్ఞానానికీ - రెండింటికీ; తాను+అ= తానే; ఉప+ఆశ్రయము= ఆలంబనం - ఆధారం; తత్త్వ+అహంకార+అనూన లక్షణ+ఆఢ్యంబు+ఐన= సత్యం అహంకారం (నేను అనే భావం) అనే గొప్ప లక్షణాలతో సంపన్నమైన (కూడిన); ఎఱుక= పరిజ్ఞానం - తెలివి; దానిన్= ఆ ఎరుకను; శ్రుతుల్= వేదాలు; జీవుఁడు+అని చెప్పున్= జీవి అని పేర్కొంటాయి.

తాత్పర్యం: (ఇక్కడ బుద్ధినీ, జీవుడినీ విడివిడిగా వాటి లక్షణాలతో ప్రదర్శిస్తున్నాడు.) బుద్ధి జ్ఞానానికి, అజ్ఞానానికి - రెండింటికీ ఆధారం. బుద్ధివేరు, జీవుడు వేరు. ఇక జీవుడి లక్షణాలు ఏమిటంటే - అతడే తత్త్వం, సృష్టిలోని చిట్టచివరి సత్యం; అతడే అహంకారం కూడా. ఈ అహంకారం కారణంగానే అహంకారలక్షణంతో ఉన్నన్నాళ్ళు సంసారయాత్ర సాగిస్తున్నాడు జీవుడు. అతడే తత్త్వలక్షణసంపన్నుడైతే ముక్తుడైపోతాడు.

ఆ. అతఁడు కాలకలిత మైన కర్మమున సం । సార వర్తనంబు సల్పుచుండు
స్వప్న సంప్రవృత్తి సలిపెడు నరుమాడ్కి । నింద్రియములతోడ నెనయ బెరసి. 295

ప్రతిపదార్థం: అతఁడు= ఆ జీవుడు; కాలకలితము+ఐన= కాలంచేత సంపాదితమైన - కూడబెట్టబడిన; కర్మమునన్= కర్మవలన; సంసార వర్తనంబు= కుటుంబ జీవనం; స్వప్న సంప్రవృత్తి= కలలో ప్రవర్తనను; చలిపెడు= చేసెడు; నరుమాడ్కిన్= మానవుడివలె; ఇంద్రియములతోడన్= జ్ఞాన కర్మ ఇంద్రియాలతో; ఎనయన్+బెరసి= కలయవ్యాపించి; చలుపుచున్+ఉండున్= చేస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ జీవుడు కాలసంపాదితమైన కర్మ కారణాన సంసారం చేస్తూ ఉంటాడు. సంసారంలోని వివిధ కార్యాలు నిర్వహిస్తూ ఉంటాడు. అయితే నిజానికి తత్త్వరూపుడైన అతడు సంసారి కాజాలడు. అయినా కర్మవశాన

సంసారజీవనం తప్పదు. అందువలన జీవుడు చేసే ఈ సాంసారిక ప్రవర్తనలు ఎట్లాంటి వంటే కలలో నరుడు చేసే క్రియలవంటివి. క్రియల నిర్వహణకు ఇంద్రియాల తోడ్పాటు తప్పదు కాబట్టి, ఆయా ఇంద్రియాలతో కలిసి ఆయా కర్మలు స్వప్నంలోవలె చేస్తూ ఉంటాడు అతడు.

విశేషం: అలం: ఉపమ.

క. రాగ పరిలిప్తమానస । యోగంబున నింద్రియంబు లుల్లసితము లై
భోగు లగుట యుడిపిన నప । రాగత సంసార దుర్విరామము సేయున్. 296

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= జ్ఞాన - కర్మ ఇంద్రియాలు; రాగపరిలిప్తమానస యోగంబునన్= అనురాగంతో పూయబడిన మనస్సు యొక్క కలయికతో; ఉత్+లసితములు+ఐ= బాగా ఆడబడినవై (క్రీడించినవై); భోగులు+అగుట= భోగించునవిగా అగుట(ను); ఉడిపినన్= మాన్పినచో; అపరాగత= తొలగిన అనురాగం; సంసార దుర్+విరామము= సంసారముయొక్క చెడు ముగింపును; చేయున్= కలిగించును.

తాత్పర్యం: నరుడి ఇంద్రియాలు అనురాగపు పుంత కలిగిన మనస్సుతో కలిసి భోగాలలో ప్రవర్తిస్తూ, భోగులుగా అనుభోక్తలుగా మారుతున్నాయి. వాటి ఆ భోగలాలసను మాన్పగలిగితే, నరుడిలో అపరాగత్వం - అనురాగరాహిత్యం - అనురాగం తొలగిపోవటం ఏర్పడుతుంది. ఆ అపరాగత్వం వలన సంసారం నుండి విముక్తి పొందవచ్చును.

క. పురుషు లఖిల భూతములను । బురుషులలో భూమిసురులు భూమిసురులయం
దరయంగ మంత్రవేదులు । వరు లధికులు బోధయుతులు వారలకంటెన్. 297

ప్రతిపదార్థం: అఖిల భూతములను= ఎల్ల ప్రాణులలో; పురుషులు= నరులు; పురుషులలోన్= నరులలో; భూమిసురులు= బ్రాహ్మణులు; భూమిసురులఅందున్= బ్రాహ్మణులలో; అరయంగన్= పరిశీలిస్తే; మంత్రవేదులు= మంత్రం తెలిసినవారు - వేదం చదివినవారు; వరులు= శ్రేష్ఠులు; వారలకంటెన్= ఆ మంత్రవేత్తలకంటె; బోధయుతులు= జ్ఞానవంతులు; అధికులు= ఎక్కువైనవారు - ఉత్తములు.

తాత్పర్యం: సృష్టిలోని ప్రాణిజాతు లన్నింటా మానవులు శ్రేష్ఠులు. మానవులలో బ్రాహ్మణులు ఉత్తములు. బ్రాహ్మణులలో మంత్రవేత్తలు అధికులు. వారికంటెను జ్ఞానవంతులు ఉత్తములు. (సృష్టిలో సర్వోన్నతమూ, సర్వోత్కృష్టమూ అయిన పదార్థం జ్ఞానమన్నమాట.)

క. జ్ఞానంబు దృష్టి నరునకుఁ । గాన నయనహీను నడపు కరణి యగుటఁ బ్ర
జ్ఞాన విహీనుని నడవడి । దీని నెఱుఁగ వలయు నెఱుక దెచ్చికొనంగన్. 298

ప్రతిపదార్థం: నరునకున్= మానవుడికి; దృష్టి= చూపు; జ్ఞానంబు= జ్ఞానం - (తెలివి); కాన= కావున; ప్రజ్ఞాన విహీనునిన్= నడవడి- జ్ఞానం లేనివాడి నడత; నయన హీను నడపు కరణి+అగుటన్= కన్నులు లేనివాడి నడత వంటిది అగుటచేత; ఎఱుక+తెచ్చికొనంగన్= జ్ఞానం సంపాదించటానికి; దీనిన్= ఈ విషయమును - జ్ఞానహీనుడు నయనహీనుడను విషయమును; ఎఱుఁగన్+వలయున్= తెలిసికొనవలెను.

తాత్పర్యం: మానవుడికి నిజమైన చూపు జ్ఞానమే గాని, కన్ను కాదు. కాబట్టి జ్ఞానహీనుడి నడత గుడ్డివాడి నడకవంటిది. జ్ఞానార్థిఅయినవాడు జ్ఞానార్జనకు ముందుగా ఈ విషయాన్ని గ్రహించాలి.

విశేషం: అలం: ఉపమ.

క. క్షమయును సత్యంబును శౌ । చమును సుధర్మములు! బ్రహ్మచర్యం బత్యు
త్తమ ధర్మము; వానికిఁ జి । త్తము నలవఱుపంగవలయు ధైర్యము పేర్మిన్. 299

ప్రతిపదార్థం: క్షమయును= ఓర్పూ; సత్యంబును= సత్యవ్రతమూ - సత్యం చెప్పడం, సత్యంగా ప్రవర్తించటం; శౌచమును= శుచిత్వము - శుభ్రత - శారీరక మానసిక పరిశుద్ధత - ఈ మూడూ; సుధర్మములు= మంచి ధర్మాలు; బ్రహ్మచర్యంబు= బ్రహ్మచారి తనం - గార్హస్థ్యానికి ముందు ఆచరించే ధర్మం; అతి+ఉత్తమ ధర్మము= మిక్కిలి శ్రేష్ఠమైన ధర్మం; వానికిన్= ఆ ధర్మాల - క్షమా, సత్య శౌచ బ్రహ్మచర్య ధర్మాలకొరకు - వాటి ఆచరణకై; ధైర్యము పేర్మిన్= ధైర్యము - ధీరుడి స్వభావంయొక్క అతిశయంతో; చిత్తమున్= మనస్సును; అలవఱుపంగన్+వలయున్= అలవాటు చేయాలి.

తాత్పర్యం: జ్ఞానార్జనకు ముందు నరుడు ధర్మాధర్మవివేకంతో ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాలలో ఓర్పు, సత్యం, బహిరంతశ్శుభ్రత ఉత్తమమైనవి. ఆ తరువాత బ్రహ్మచర్యం అతిశ్రేష్ఠధర్మం. ఈ ధర్మాలయెడ మనస్సును అనుకూలంగా మలచటానికి నరుడిలో గొప్ప ధైర్యం కావాలి. మనస్సును ఈ ధర్మాల ఆచరణకు క్రమంగా అలవాటు చేయాలి.

విశేషం: సద్ధర్మాచరణకు ధైర్యం తప్పనిసరి. సామాన్యులు ధర్మాన్ని సాధారణంగా ఆచరిస్తూనే ఉంటారు. కాని, పరీక్షా సమయాలలో కీలకమైన సన్నివేశాలలో ధైర్యశాలి తప్ప ఇతరులు ధర్మానికి కట్టుబడి ఉండలేరు.

క. పరిహాసము భాషణమును । నిరీక్షణము లోనుగాఁగ నింద్యంబులు సుం
దరులయెడ దీని కేమని । చొరఁదగ దట్లైన మనసు సొత్తురు సుదతుల్. 300

ప్రతిపదార్థం: సుందరుల ఎడన్= అందమైన వనితలతోడి వ్యవహార సందర్భాన; పరిహాసము= గేలి; భాషణము= మాట్లాడుట; నిర్+ఈక్షణము= ఎదురుచూడటం; లోనుగాఁగన్= లోనైనవి (క్రియలు-చేష్టలు); నింద్యములు= నిందించదగ్గవి - పరిహరించదగ్గవి; దీనికిన్= ఈ మాత్రపు చిన్న పనికి; ఏమి+అని= (తప్పు) ఏమిటి అని; చొరన్+తగదు= ప్రవేశించకూడదు; అట్లు+అయినన్= అట్లు (ఏమీలేదులే అనికొని చొరబడి) పోతే పోయినచో; సుదతుల్= స్త్రీలు; మనసు+చొత్తురు= మనస్సున (నరుడి) ప్రవేశిస్తారు.

తాత్పర్యం: సౌందర్యవతులయిన వనితలయెడ బ్రహ్మచారి అతిజాగరూకుడై మెలగాలి. వారితో పరిహాసం, సంభాషణం, వారికొరకు ఎదురుచూపు లోనైన చేష్టలు కూడవు. ఆఁ, దీనికేమైనది! దీనిలో తప్పు ఏమిటి? అన్న భావంతో వారిలోనికి చొచ్చుకుపోతే, వారు బ్రహ్మచారి మనస్సులోనికి ప్రవేశిస్తారు.

విశేషం: ఈ జాగరూకత, రోగం కలిగిన తరువాత ఔషధసేవనం కంటె, ముందుగానే అసలు రోగ ఆవిర్భావమే లేకుండా చూచుకొనే అభిప్రాయంతో తీసికొనవలసినది.

క. వినుఁ మాంసాస్థిమయం బని । వనితాంగము సద్వివేక వైభవమునఁ గాం
చిన నందు మది దగుల; దా । పనికిని నాడీ విశుద్ధి ప్రాపగుఁ బుత్రా! 301

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; వినుఁ= ఆలకించుము; వనితా+అంగము= స్త్రీ శరీరం; మాంస+అస్థిమయంబు+అని= మాంసంతో, ఎముకలతో నిండినది అని; సత్+వివేకవైభవమునన్= మంచి విచక్షణా జ్ఞానంతో; కాంచినన్= చూస్తే; మది= మనస్సు; తగులదు= చిక్కుకొనదు - స్త్రీయెడ; ఆ పనికిని= ఆ క్రియకు - ఆ విధంగా చూడటానికి; నాడీ విశుద్ధి= నాడుల - శరీరంలోని రక్తాన్ని ధరించి శరీరమంతా ప్రాకి ఉండే నరాల వంటివాటి విశుద్ధత్వం - వాటి పరిశుభ్రత; ప్రాపు+అగు(న్)= ఆధారమౌతుంది.

తాత్పర్యం: వనితల శరీరనిర్మాణాన్ని గమనించి, వాస్తవాన్ని గుర్తిస్తే వారియెడ ఆకర్షణ కలుగదు. మాంసపుటెముకల మూట తప్ప అన్యంగాదు ఆ శరీరము అనే మంచి వివేకంతో స్త్రీని దర్శిస్తే, బ్రహ్మచారి మనస్సు స్త్రీని స్పృశించదు. అయితే ఆ దృష్టి ఏర్పడాలంటే, ముందుగా అతడికి శరీరనిర్మాణంలో ప్రధాన భాగాలయిన నాడుల పరిశుద్ధత ఆలంబనంగా ఉండగలదు.

క. శారీరస్థితికిఁ బ్రథమ । కారణమై యుండు నాడికాదశకము; సం
చారిక లగు నింద్రియముల । కారయ నాడికలు మఱియు నై దమలమతీ! 302

ప్రతిపదార్థం: అమలమతీ!= నిర్మలమైన బుద్ధి కలవాడా! - ధర్మరాజా!; శారీర స్థితికిన్= శరీరముయొక్క ఉనికికి; నాడికా దశకము= నాడుల పది - పది నాడులు; ప్రథమ కారణము+ఐ= మొదటి కారణమై; ఉండున్= కలవు; ఆరయన్= పరిశీలించగా; సంచారికలు+అగు= సంచారశీలములయిన - తిరుగాడే స్వభావంగల; ఇంద్రియములకు - పంచజ్ఞాన ఇంద్రియాలకు; మఱియున్= ఇంకను; ఐదు నాడికలు= ఐదు నాడులు (కలవు).

తాత్పర్యం: ఓ నిర్మలబుద్ధీ! ధర్మరాజా! శరీరనిర్మాణంలో ఆదికారణాలుగా పదినాడులు ఉన్నాయి. సంచరించే స్వభావంగల జ్ఞానేంద్రియాలకు అదనంగా మరి ఐదు నాడికలు ఉన్నాయి. మొత్తం ఈ పదిహేను నాడులూ శరీరాన్ని నిలుపుతున్నాయి, నడుపుతున్నాయి కూడా.

విశేషం: యోగవిద్యాభ్యాసంలో ఈ నాడీపరిజ్ఞానం ఆవశ్యకంగా భావిస్తారు. ఇంద్రియనిగ్రహం నాడీపరిజ్ఞానంతో ముడిపడి ఉన్నట్లు భావిస్తారు.

తే. స్థూల భంగులు పదియును సూక్ష్మభంగు । లైదు నివి; వీనికంటె నత్యంత సూక్ష్మ
భంగి హృదయంబు నడుముగాఁ బరఁగియున్న । నాడియది సర్వగత యగుఁ జూడఁ జూడ. 303

ప్రతిపదార్థం: స్థూలభంగులు= బలసిన (పెద్ద) విధముగలవి - పెద్దవి; పదియును= పదీ - పైన చెప్పినవి; సూక్ష్మభంగులు= సన్నని విధం గలవి - వెదికితేగాని కనిపించనివి; ఐదును= ఐదూ (ఇంద్రియాలకు చెందినవి); ఇవి= ఈ పై వివరించబడినవి; వీనికంటెన్= ఈ పదిహేనింటికంటె; అతి+అంత+సూక్ష్మ భంగి= మిక్కిలి సన్ననైన విధంగలది; హృదయంబు= మనస్సు; నడుముగాన్+పరఁగి+ఉన్న= మధ్యభాగంగా ఒప్పే; నాడి+ఆది= ఆ నాడి - ఆ ప్రసిద్ధమైన నాడి; చూడన్+చూడన్= చూడగా చూడగా; సర్వగత+అగున్= అంతటను ఉండేది - శరీరమంతా వ్యాపించి ఉండేది ఔతుంది.

తాత్పర్యం: శరీరనిర్మాణానికి ప్రథమకారణాలుగా పేర్కొనబడ్డ నాడులు పది - స్థూలమైనవి. ఆ తరువాత పంచేంద్రియాలకు ఆధారమైన నాడికలు (చిన్న నాడులు) ఐదూ సూక్ష్మమైనవి. చూచినంత మాత్రాన కనిపించేవి కావు అవి. ఈ రెండు విధాలయిన నాడులు - స్థూలసూక్ష్మ రూపాలలో ఉండేవి కాకుండా, మరొక అతిసూక్ష్మనాడి ఉన్నది. దానికి మనస్సు మధ్యభాగంగా ఉంటుంది. ఆ అతిసూక్ష్మనాడి హృదయగతమైనది. దానిని చూస్తూ చూస్తూ పోతే అది అంతటా వ్యాపించి, అంతా తానే అయి ఉంటుంది.

క. ఆ చూపు మరిగి చిత్తం । బే చవికిం బోదు; పోయె నేని మరలుపన్
గోచరమగు వెలిచవులం । బాచిన లోచవిన నిలిచి పరమాత్మఁ గనున్. 304

ప్రతిపదార్థం: ఆ చూపు= (పైన విరించిన) హృదయగతనాడిపై చూపు - అంతర్ దృష్టి; మరిగి= అలవాటుపడి; చిత్తంబు= మనస్సు; ఏచవికిన్= ఏ రుచికొరకూ; పోదు= వెళ్ళదు; పోయెను+ఏని= (ఒకవేళ) వెళ్ళినట్లయితే; మరలుపన్= మరలించగా-

తిరిగి అంతర్ దృష్టివైపునకు త్రిప్పగా; గోచరము+అగు= అనుభూతాలయిన; వెలిచవులన్= బయట రుచులను; పాచినన్= విసర్జించగా - వదలివేసిన పిదప; లోచవిని+అ= లోపలి రుచియందే; నిలిచి= నిలబడి - స్థిరమై; పరమ+ఆత్మన్= పరబ్రహ్మ స్వరూపమైన దానిని; కనున్= చూస్తుంది.

తాత్పర్యం: హృదయం మధ్యభాగంగా కలిగి, సర్వాంతర్యామిగా ఉండే ఆ సూక్ష్మతమ నాడిపై దృష్టి నిలిపిన చిత్తం ఇక దేనినీ కోరక, దేనినీ పట్టించుకొనక ఆ అంతర్ దృష్టితో అట్లాగే ఉండిపోతుంది. ఇతర అంశాలజోలికి పోదు. ఒకవేళ పోయినా, దానిని తిరిగి మరలించి యథాపూర్వస్థితిలో నిల్పినపుడు ఆ చిత్తం తన అనుభవానికి వచ్చిన వెలిచవులను విసర్జించి, సూక్ష్మతమ నాడిపై దృష్టి నిలిపి, అనుభవించిన లోచవిని తిరిగి స్వీకరించి, దానియందే నిలిచి పరమాత్మను చూడగలుగుతుంది.

క. ఆ విధము శుక్లగతి గను । భావమునకుఁ గాని పట్టువడదు; వినుము! శు
క్లావేశము సంకల్పజ । మావాసము శుక్లమునకు నఖిలాంగకముల్. 305

ప్రతిపదార్థం: ఆ విధము= ఆ పరమాత్మను కనగల్గిన 'లోచవి'; శుక్లగతి+కను భావమునకున్+కాని= ఇంద్రియపు పోక(ను) పొందే స్థితికిగాని; పట్టు+పడదు= అలవడదు - అనుభవానికి రాదు; వినుము= ఆలకించుము; శుక్ల+ఆవేశము= ఇంద్రియపు ప్రవేశం; సంకల్పజము= ఆలోచనవలన పుట్టేది; అఖిల+అంగకముల్= ఎల్ల అవయవములు; శుక్లమునకున్= ఇంద్రియానికి; ఆవాసము= నివాసం - ఉనికిపట్టు.

తాత్పర్యం: ఆ విధంగా 'లోచవి'తో పరమాత్మను దర్శించగలగటం నరుడిలో ఇంద్రియపు పోకడ ఏర్పడేనాటికిగాని అలవడదు. ఇంద్రియపు ఉద్రేకమనేది సంకల్పంవలన జనిస్తుంది. నరుడి సకల అవయవాలూ శుక్లానికి ఉనికిపట్టులే- ఉత్పత్తి హేతువులే.

క. అరయఁగ సంస్పర్శనమునన । తిరుగుడువడు శుక్ల మనుట తెఱఁగే? సంక
ల్పరతింగలదే? చోఁకెడఁ । జరింపకుండంగ వలయు సంకల్పంబుల్. 306

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; శుక్లము= ఇంద్రియం; సంస్పర్శనమునను+అ= బాగా తాకటంవలననే; తిరుగుడు+పడున్= స్థలనమౌతుంది; అనుట= అనటం - అట్లా అనటం; తెఱఁగు+ఏ?= పద్ధతా? తగునా? (తగదు); సంకల్పరతిన్= ఊహయందలి రతియందు; చోఁకు= స్పర్శ; కలదు+ఏ?= ఉన్నదా?; సంకల్పంబుల్= ఊహలు; ఎడన్+చరింపక+ఉండంగన్+వలయున్= హృదయంలో తిరుగాడక ఉండాలి.

తాత్పర్యం: పరిశీలిస్తే స్పర్శవలననే ఇంద్రియస్థలనం జరుగుతుంది - అనే మాట సరిగా కనబడదు. ఎందుకంటే నరుడు ఊహాలోకంలో విహరిస్తూ కేవలం సంకల్పమాత్రాన రతిసుఖానుభూతిని ఇంద్రియస్థలనంద్వారా పొందుతున్నాడు. మరి అక్కడ ఆ సంకల్పమాత్ర రతిలో స్పర్శకు తావేది? కాబట్టి నరుడి ఎడదలో సంకల్పాలు తిరుగాడకుండా ఉండాలి.

తే. అత్రిముని యింద్ర దైవత్య మని జనులకుఁ । దెలిపె; నది కారణముగ నింద్రియ మనంగఁ
బరఁగుఁ జూవె నృబీజంబు పరమ మెల్ల । ధాతువుల కది విను పుత్ర! దాని విధము. 307

ప్రతిపదార్థం: పుత్ర!= కుమార!; అత్రిముని= అత్రి అనే పేరుగల ఋషి; నృబీజంబు= నరుడి విత్తనమును - శుక్లమును; ఇంద్ర దైవత్యము= ఇంద్రదేవతకు చెందింది; అని జనులకున్= అని ప్రజలకు; తెలిపెన్= ఎరుకపరచాడు; అది= ఆ తెల్పటం;

కారణముగన్= హేతువుగా; ఇంద్రియము+అనంగన్= ఇంద్రియం అనగా; పరఁగున్+చూవె!= ఒప్పును సుమా!; అది= ఆ ఇంద్రియం; ఎల్ల ధాతువులకున్= అన్ని మూలపదార్థాలకంటె (మానవ శరీర నిర్మాణ మూలపదార్థాలు); పరమము= గొప్పది - శ్రేష్ఠము; దాని విధము= ఆ ఇంద్రియపు వైనం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కుమారా! ధర్మరాజా! వినుము. పూర్వం అత్రిముని నరుడిలో ఈ బీజాన్ని ఇంద్రదేవతకు చెందినదానినిగా జనులకు తెలియజేశాడు. అప్పటినుండి ఈ శుక్లాన్ని ఇంద్రియమని వ్యవహరిస్తున్నారు. ఈ ఇంద్రియం నరుడి శరీరంలోని మూలపదార్థాలు అన్నింటికంటె శ్రేష్ఠమైనది.

ఆ. శుక్లమునకు మనసు సూక్ష్మరూపము; మనో । బలము నిల్వరింపఁ బక్వబుద్ధి
యోపుఁ; దరుణవృద్ధు లోప రజ్ఞాన దౌ । ర్బల్య మూఢ వికలభావు లగుట. 308

ప్రతిపదార్థం: శుక్లమునకున్= ఇంద్రియానికి; మనస్సు= చిత్తం; సూక్ష్మరూపము= అతిగా సన్నని చిన్నని ఆకారం; మనస్+బలము= చిత్తముయొక్క శక్తిని; నిల్వరింపన్= నిగ్రహించటానికి - అదుపు చేయటానికి; పక్వబుద్ధి= పండిన మతిగలవాడు - వివేకవంతుడు; ఓపున్= సమర్థుడగును - చాలును; తరుణ వృద్ధులు= యువకులు, ముదుసలులు; అజ్ఞాన దౌర్బల్య మూఢవికల భావులు+అగుటన్= (క్రమంగా) జ్ఞానం లేకపోవటంచేత (యువకులు) బలం చాలకపోవటంచేత (ముదుసలులు) తెలియని కలతచెందిన భావాలు కలవారు కాబట్టి; ఓపరు= సమర్థులు కారు - చాలరు (మనస్సును నిల్వరించటానికి).

తాత్పర్యం: ఈ ఇంద్రియానికి సూక్ష్మరూపం మనస్సే. కాబట్టి ఇంద్రియ నిగ్రహమంటే మనోనిగ్రహమనే గ్రహించాలి. మనశ్శక్తిని నిల్వరించాలి - అంటే పరిపక్వమైన బుద్ధిగల వివేకవంతులకే అది సాధ్యమౌతుంది. ఇతరులకు, యువకులకుగాని వృద్ధులకుగాని మనోబలాన్ని నిగ్రహించే శక్తి చాలదు. ఎందుకంటే యువకులు అజ్ఞానంవలన తెలియని భావాలతో ఉంటారు. ముదుసలులు దౌర్బల్యంవలన కలతచెందిన భావాలతో ఉంటారు. యువకులు అజ్ఞానమూఢులు కాగా, వృద్ధులు దౌర్బల్యవికలులు. కాబట్టి యౌవనవార్ధక్యాల నడిమి దశలోనివారే మనస్సును నిగ్రహించగలరు.

క. కావున శుక్ల స్థితికిం । గావించినయట్టి పుణ్యకర్మము లగు స
త్సేవిత యమనియమాదుల । త్రోవ సారఁగవలయు విషయ దూరాత్మకుఁడై. 309

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి - ఇంద్రియ నిగ్రహం అవశ్య ఆచరణీయం కాబట్టి; శుక్ల స్థితికిన్= ఇంద్రియపు నిలకడకు; కావించిన+అట్టి= ఏర్పరచినట్టి; పుణ్యకర్మములు+అగు= ధర్మకార్యములయిన; సత్+సేవిత యమ నియమ+ఆదుల త్రోవ= మంచివారిచేత ఆచరించబడ్డ యమము, నియమము మొదలయిన ఎనిమిది నియములయొక్క దారిని; విషయదూర+ఆత్మకుఁడు+ఐ= విషయాలకు - కన్ను ముక్కు లోనైనవాటికి తెలియవచ్చేవానికి, ఎడమైన మనస్సుగలవాడై; చొరఁగన్+వలయున్= ప్రవేశించాలి.

తాత్పర్యం: ఇంద్రియనిగ్రహం జ్ఞానార్జనకు, తద్ద్వారా మోక్షప్రాప్తికీ కారణం కాబట్టి వీర్యపు నిలకడకొరకు ఏర్పరచబడ్డవీ, సజ్జనులు ఆచరించేవీ అయిన యమనియమాది ఎనిమిది నియమాలూ నరుడు పాటించాలి. జ్ఞానేంద్రియాలకు గోచరించే విషయాలకు దూరంగా మనస్సును కట్టడిచేసి, ఈ యమనియమాదుల మార్గాన ప్రవేశించాలి. అపుడు మనో నిగ్రహం, తద్ద్వారా శుక్లస్థితి చేకూరే వీలుంది.

క. అరయఁగ విషయము లెంతయు । దురంతములు; వానియందుఁ దొడరినఁ జేటుం
బొరయుదురు దొడరకున్నం । బరమపదవి యమ్మహానుభావులకు నగున్. 310

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; విషయములు= పంచజ్ఞానేంద్రియాలకు గోచరించే అంశాలు - పదార్థాలు;ఎంతయున్= అమితంగా - అధికంగా; దుర్+అంతములు= దుఃఖం, చెడు అంతాన గలవి - చివరకు దుఃఖాన్ని, చెడును కలిగించేవి;వానియందున్= ఆ విషయాలలో (విషయ సుఖాలలో); తొడరినన్= లగ్నమైనచో; చేటున్= కీడును; పొరయుదురు= పొందుదురు; తొడరక+ఉన్నన్= లగ్నం కాకుండా ఉన్నచో; ఆ+మహా+అనుభావులకున్= అట్టి తొడరని గొప్పశక్తి సంపన్నులకు; పరమపదవి= గొప్పస్థితి - ముక్తి; అగున్= కలుగును.

తాత్పర్యం: పరిశీలనగా చూస్తే జ్ఞానేంద్రియాలద్వారా మనస్సును చేరే విషయాలు, చాలా దుఃఖాన్ని, కీడును చివరకు మిగిల్చేవిగా ఉంటాయి. కాబట్టి ఆ విషయాలలో తగుల్కొంటే (ఆ విషయసుఖాలకు లోనైతే) చివరకు చేటు కలుగకమానదు. అట్లా కాకుండా ఆ విషయాలకు దూరంగా ఉండి, విషయ సుఖాలకు లోనుగాని మహానుభావులు పరమపదాన్ని (ముక్తిని) అందుకొనగలుగుతారు.

క. జననము జరయును మరణం । బును మొదలుగఁ గలుగు దుఃఖములు లోకమునం
గనుఁగొని బుధుండు మోక్షం । బున కుద్యోగించు నియతిఁ బూతహృదయుఁ డై. 311

ప్రతిపదార్థం: బుధుండు= పండితుడు - బుద్ధిమంతుడు; లోకంబునన్= జగత్తులో; జననము= పుట్టుక; జరయును= ముసలితనమూ; మరణంబును= చావూ; మొదలుగన్+కలుగు దుఃఖములు= మొదలైన ఎపుడూ ఉండే దుఃఖాలను; కనుఁగొని= చూచి; నియతిన్= నియమంతో - నిగ్రహంతో; పూత హృదయుఁడు+ఐ= పవిత్రమైన మనస్సు కలవాడై; మోక్షంబునకున్= ముక్తికొరకు; ఉద్యోగించున్= ప్రయత్నిస్తాడు.

తాత్పర్యం: లోకవ్యవహారాన్ని పరిశలించిన పండితుడు, లోకంలో నిరంతరం ఎపుడూ ఆగకుండా జరిగిపోయే పుట్టుకలూ, చావులూ, మీదపడే ముసలితనం మొదలైన దుఃఖపరంపరను చూచి, నియమపాలనతో మనస్సునుపవిత్రీకరించుకొని ఈ జగత్తునకు, దానిలోని దుఃఖసమూహానికీ దూరంగా పోయే ఉద్దేశంతో మోక్షంకొరకుప్రయత్నిస్తాడు.

విశేషం: గతానుగతమైన జీవనం చేయటం పామరుడి లక్షణం. పరిశీలించి ఉత్తమ మార్గాన బ్రతకటం పండితుడి లక్షణం.

తే. వాఙ్మనఃకాయములు శౌచవంతములుగఁ । జేసికొని యనహంకారశీల శాంత
బుద్ధియై నిరపేక్షతఁ బొంది యఖిల । భూతదయ గల్గి మెలఁగంగ బోధ మొందు. 312

ప్రతిపదార్థం: వాక్+మనస్+కాయములు= మాట, మనస్సు, శరీరం - ఈ మూడూ; శౌచవంతములుగన్= శుభ్రతతో కూడినవిగా; చేసికొని= కావించుకొని; న+అహంకారశీల శాంత బుద్ధి+ఐ= అహంకారంలేని - 'నేను' అనే గర్వంలేని స్వభావంతో శాంతించిన బుద్ధిగలవాడై; నిర్+అప+ఈక్షతన్= కోరికలేనివాడితనమును - కోరికలు లేని స్థితిని; పొంది= చెంది; అఖిల భూతదయ= ఎల్ల ప్రాణులయెడ జాలి - కరుణ; కల్గి= ఉండి - వహించి; మెలఁగంగన్= ప్రవర్తిస్తే - జీవిస్తే; బోధము= జ్ఞానం; ఒందున్= చెందును.

తాత్పర్యం: నరుడు మాటలో, మనస్సులో, పనిలో పరిశుభ్రతను పాటిస్తూ, సహజమైన అహంకారభావాన్ని విడనాడి శాంత స్వభావుడై ఉన్నపుడు, అతడిలో కోర్కెలు సన్నగిల్లి, అంతరించిపోతాయి. ఆ స్థితిలో లోకంలోని ప్రాణి సమూహమంతటినీ అతడు కరుణతో ఆదరించగలుగుతాడు. పరిశుభ్రమైన జీవనం, అహంకారం లేని శీలం, కోర్కెలకు దూరమైన మనస్సూ - ఈ మూడిటికి తోడుగా భూతదయ కలిగి ఉన్నవాడికి జ్ఞానం కలిగితీరుతుంది.

క. మనసును వాక్కును గాయం । బు నియంత్రితములుగఁ జేసి పొందుదురు ధనం
బునకై మ్రుచ్చులు దానిం । గనుఁగొనఁ గావలదె మోక్షకాంక్షికి? వత్సా! 313

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా! ధర్మసుతా!; మ్రుచ్చులు= దొంగలు - అధ్యాత్మ విద్యలోనివారు; మనసును= చిత్తమును; వాక్కును= మాటను; కాయంబున్= శరీరాన్ని; ధనంబునకై= ధనంకొరకు - ధనార్జనకై; నియంత్రితములుగన్+చేసి= నియమించబడిన - నిగ్రహించబడిన వాటినిగా చేసి; దానిన్= ఆ ధనాన్ని; పొందుదురు= అందుకొంటారు; మోక్షకాంక్షికిన్= ముక్తిని కోరేవాడికి; కనుఁగొనఁగాన్+వలదే?= చూడవద్దా? (ఆ విషయం).

తాత్పర్యం: అన్ని విద్యలనువలెనే ఈ ఆధ్యాత్మవిద్యనూ దుర్వినియోగంచేసే దొంగలున్నారు. అట్టివారిని ముక్తిని కోరేవాడు గమనించాలి. ఆ మునిమ్రుచ్చులు ధనంకొరకు, మనోవాక్కాయాలను నియంత్రించికొని, తత్ప్రదర్శనద్వారా దాన్ని ఆర్జించి ఆధ్యాత్మవిద్యా కాలుష్యానికి కారకులవుతున్నారు. ఈ విధమైన దురుపయోగం నుండి ఆధ్యాత్మవిద్య రక్షితం కావాలి.

ఆ. బుద్ధిఁ గొని మనంబు వోనీక నిలిపి మ । నోభయుక్తి నింద్రియముల నాఁగి
విషయసమితి నెడల విడిచిన వానికి । ననిమిషులు ప్రసన్ను లగుదు రనఘ! 314

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుద్ధిన్+కొని= మతినిపట్టి - నిగ్రహించి; మనంబు= మనస్సును; పోన్+ఈక= పోనీయక- దానిని నిలిపి; మనస్+అభియుక్తిన్= చిత్తముయొక్క పూనికతో; ఇంద్రియములన్= కన్ను ముక్కు లోనైన జ్ఞానేంద్రియాలను; ఆఁగి= అడ్డగించి- నిగ్రహించి; విషయసమితిన్= విషయ (వాసనల) సమూహాన్ని - లౌకిక ప్రవృత్తులను; ఎడలన్+విడిచినవానికిన్= దూరాన వదలిన వాడికి; అనిమిషులు= రెప్పపాటులేనివారు - దేవతలు; ప్రసన్నులు+అగుదురు= అనుగ్రహించినవారు అవుతారు.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన ధర్మరాజా! బుద్ధిని అదుపులో ఉంచుకొని, మనస్సును నిగ్రహించుకొని, పూనికతో ఇంద్రియాలను నిరోధించి, తద్వారా విషయవాసనలను విడిచిపుచ్చిన వాడిని దేవతలు అనుగ్రహిస్తారు.

క. వినుఁ దేవతాప్రసాదం । బున నిర్మల యోగతంత్రములు పనుపడు న
య్యనువున నిశ్చలమతి ని । ల్చునది శిథిలితాన్నపాన సుఖతృష్ణం డై. 315

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; దేవతా ప్రసాదంబునన్= దేవతల అనుగ్రహంవలన; నిర్మల యోగ తంత్రములు= స్వచ్ఛమైన యోగకార్యాలు; పనుపడున్= అలవాటౌతాయి; ఆ+అనువునన్= ఆ సౌకర్యంతో - ఆ ఉపాయముతో; నిశ్చలమతిన్= చలనంలేని బుద్ధితో; శిథిలిత+అన్నపాన సుఖతృష్ణుండు+ఐ= తినటం తాగటం సుఖములయెడ సడలిన ఆశగలవాడై- అన్నపానాలయెడ, సుఖాలయెడ ఆశ సన్నగిల్లినవాడై; నిల్చునది= నిలబడాలి.

తాత్పర్యం: దేవతల అనుగ్రహంవలన మలినరహితమైన యోగకార్యాలు నరుడికి అలవడుతాయి. ఆ యోగవిద్యల సహాయంతో నిశ్చలబుద్ధితో అన్నపానాలు, ఇతర సుఖాలయెడ ఆసక్తి సన్నగిల్లి, ఏకాగ్రతతో నరుడు నిలబడాలి.

క. శాక కణ మూల ఫల పి । ణ్యాకాదుల భైక్షమైన యన్నంబున ని
శ్శోకత నాఁకలివుచ్చుచు । లోకాలోకంబున నచలుఁడు గావలయున్. 316

ప్రతిపదార్థం: శాక కణ మూల ఫల పిణ్యాక+ఆదులు= కూరలు, నూకలు, కందములు (భూమిలోపల పెరిగే ఆహారాలు), పండ్లు, తెలికపిండులు మొదలయిన వాటియొక్క; భైక్షము+ఐన= బిచ్చంగా వచ్చిన; అన్నంబునన్= ఆహారంతో; నిస్+శోకతన్= దుఃఖంలేని భావంతో; ఆఁకలి+పుచ్చుచున్= ఆకలిని తీర్చుకుంటూ; లోక+ఆలోకంబునన్= జగత్తునుచూచుటలో - పరిశీలించుటలో (నరుడు); అచలుఁడు= చలనంలేనివాడు - స్థాణువు - స్థిరమైనవాడు; కాన్+వలయును= కావలెను.

తాత్పర్యం: అన్నపానాలమీద, సుఖసంతోషాలమీద ఆశ సన్నగిల్లిన తరువాత, సాధకుడు భిక్షగా దొరకిన ఆహారం అది ఏదైనా - కూర నారగాని, నూకలుగాని, కందమూలాలుగాని, పండ్లుగాని, తెలికపిండివంటి పదార్థాలుగాని, దుఃఖంలేకుండా స్వీకరించి, ఆకలి తీర్చుకొంటూ, జగత్తును పరీక్షిస్తూ అచలుడై నిలవాలి. తన సాధననుండి చలించక స్థాణువువలె నిలబడాలి.

క. జ్ఞానమ యింధనముగ వి । జ్ఞానాగ్నిం బ్రబలఁజేయ జరయు మరణమున్
నానావిధ దుఃఖంబులు । లేని యమృత మక్షరంబు లెస్సై తోఁచున్. 317

ప్రతిపదార్థం: జ్ఞానము+అ= జ్ఞానమే; ఇంధనముగన్= వంట కట్టెగా - నిప్పు రగిల్చే సాధనంగా; విజ్ఞాన+అగ్నిన్= విజ్ఞానం - అధికమైన జ్ఞానం అనే నిప్పును; ప్రబలన్+చేయన్= పెరిగేటట్లు చేస్తే; జరయున్= ముసలితనమూ; మరణమున్= చావూ; నానా విధ దుఃఖంబులు= అనేక విధాలయిన ఇతర దుఃఖాలూ; లేని= ఉండని - కలగని; అమృతము= మరణరహితమైన; అక్షరంబు= జారుడులేని స్థితి - ముక్తి; లెస్స+ఐ= బాగై - బాగుగా; తోఁచున్= గోచరిస్తుంది.

తాత్పర్యం: నరుడు తనలోని జ్ఞానాన్నే వంటచెరకుగా వాడుకొంటూ, విజ్ఞానాగ్ని రగుల్కొనేటట్లు చేసి ప్రజ్వలింపచేయగలిగితే అతడికి జరామరణాలకు, ఇతర లౌకిక దుఃఖపరంపరలకూ దూరమైన అమృతత్వసిద్ధి కలుగుతుంది. అతడు ధ్రువమైన మోక్షస్థితిని చేరుకొంటాడు.

క. విని నిద్రాదోషంబునఁ । గను కలల రజస్తమో వికారంబులచే
మనసు దిరుఁగఁబడఁగాఁ గఱు । చినవి మఱచి యపుడు దుష్టశీలుండ యగున్. 318

ప్రతిపదార్థం: విని= ఆలకించి - ఇతరుల ప్రసంగాలలోని విషయాలు చెవిని వేసికొని; నిద్రాదోషంబునన్= నిద్ర అనే దోషంవలన - (సాధకుడు మితిమీరి నిద్రించటం తప్పు కాబట్టి అది దోషం); కను కలలన్= (నిద్రలో) చూచే కలలలో; రజస్+తమస్+వికారంబులచేన్= రజోగుణంయొక్క, తమోగుణంయొక్క వికృతులవలన; మనసు= చిత్తం; తిరుగన్+పడఁగాన్= తిరుగబడగా - వ్యత్యస్తం కాగా- సాధన నుండి మరలినది కాగా; కఱచినవి= నేర్చినవి - అప్పటివరకు శ్రద్ధగా అలవరచుకొన్న సాధనలు; మఱచి= మరలిపోయి; అపుడు+అ= అప్పుడే - ఆ క్షణమే; దుష్టశీలుండు+అ= దుర్మార్గమైన స్వభావం గలవాడుగా; అగున్= ఔతాడు.

తాత్పర్యం: సాధకుడు సాధనదశలో ఉండగా నిత్యజాగరూకత అవసరం. అతడి భాషణం, శ్రవణం - ఇవన్నీ నిర్దుష్టంగా విషయవిదూరంగా పవిత్రంగా ఉండాలి. విషయాలకు సమీపంగా వెళ్ళి లౌకిక ఆసక్తితో కూడని విషయాలను వింటే, అవి అతడికి నిద్రలో అవే కలలుగా కనిపించి, అతడి చిత్తాన రజస్తమోగుణాలను ప్రకోపింపజేస్తాయి. ఆ కారణంగా సాధకుడి చిత్తం తిరుగబడి, సాధననుండి వెనుకకు మరలుతుంది. అంతవరకు అలవడిన సాధనలను మరచి, వెంటనే సాధకుడు దుర్మార్గాన పడిపోయి దుష్టశీలుడుగా మారిపోవచ్చును.

వ. అది యోగి కొప్పదు గావున. 319

ప్రతిపదార్థం: అది= సాధననుండి జారి, దుష్టుడుగా మారటం; యోగికిన్= యోగవిద్యాభ్యాసికి; ఒప్పదు= కూడదు- తగదు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: సాధన దశలో మధ్యలో యోగభ్రష్టుడై నశించటం తగదు కాబట్టి, సాధకుడైనవాడు ఏమి చెయ్యాలంటే. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుతజ్ఞానాభ్యాసం । బున సమధిక జాగరత్వముం బడసి సకృ
జ్జనితం బగు నిద్రాభర । మునుఁ బొందును యోగి యదియుఁ బోఁ ద్రోచుఁ దుదిన్.' 320

ప్రతిపదార్థం: యోగి= యోగమును అనుష్ఠించేవాడు; వినుతజ్ఞాన+అభ్యాసంబునన్= పొగడబడ్డ జ్ఞానార్జనయందు - ఆ సమయాన; సమ్+అధిక జాగరత్వమున్+పడసి= మిక్కిలి మెలకువను పొంది - మేల్కొని ఉంటూ; సకృత్+జనితంబు+అగు= స్వల్పంగా కలిగినదైన; నిద్రాభరమును= నిద్దురయొక్క మోతను - నిద్రాభారాన్ని; పొందును= చెందుతాడు; (పిదప); అదియున్= దానిని కూడా ఆ సకృత్తుగా కలిగే నిద్రను కూడా; తుదిన్= చివరకు; త్రోచున్= త్రోసివేస్తాడు.

తాత్పర్యం: జ్ఞానార్జనకై యోగాభ్యాసం చేపట్టిన సమయాన సాధకుడు ఎక్కువ మెలకువతో ఉంటాడు. ఎక్కువ కాలం మేల్కొని ఉంటూ, ఎపుడో ఒకసారి మాత్రం నిద్రాభారానికి లొంగిపోతాడు. ఈ స్థితి అభ్యాస దశలోనే. చివరకు ఆ కొద్దిపాటి నిద్రను కూడా దూరీకరించి, నిత్యజాగరూకు డౌతాడు యోగి'.

వ. అని వెండియు. 321

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా వివరించి; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఇట్లా పలికి, మళ్ళీ (ఇట్లా అన్నాడు).

భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱిఁగించుట (సం. 12-209-1, 2)

క. 'విలయం బింద్రియములకుం । గలుగఁగ విషయానుభవము గలిగిన భంగిన్
మెలఁగును స్వప్నంబున మెయి । గల యట్టుల దేహి భావగతి యెయ్యదియో. 322

ప్రతిపదార్థం: ఇంద్రియములకున్= కన్ను, ముక్కు వంటి ఇంద్రియాలకు; విలయంబు= విశ్రాంతిని (పనిచేయకపోవటం); కలుగఁగన్= (నిద్రలో) ఏర్పడగా; దేహి= దేహంగలవాడు - దేహస్థుడు - ఆత్మ; విషయ+అనుభవము= విషయములయొక్క, దృశ్యాలు, నాదాలు మొదలయినవాటియొక్క అనుభూతి; కలిగిన భంగిన్= కలిగినట్లుగా; స్వప్నంబునన్= కలయందు; మెయి+కల+అట్టులన్= శరీరం ఉన్నప్పటివలె - మేల్కొని శరీరం తన పనులు తాను చేస్తున్నపుడు వలె; మెలఁగును= ప్రవర్తిస్తాడు; భావగతి= మనస్సుయొక్క పోకడ; ఏ+అదియో!= ఏదో, ఏమిటో!

తాత్పర్యం: 'నిద్రాస్థితిలో ఇంద్రియాలు విశ్రాంతిచెంది, ప్రవర్తించటం మానివేసిన తరువాత ఆత్మ స్వప్నంలో విషయానుభూతిని పొందుతున్నాడు. మేల్కొని ఉన్నప్పటివలె అతడి అనుభవం ఇంద్రియాలద్వారానే అవుతున్నది. మనస్సు పోకడ ఎటువంటిదో! ఏమిటో!

విశేషం: అనుభూతి ఇంద్రియ మాత్రజన్యం. ఇంద్రియాలు నిజానికి నిద్రావస్థలో విశ్రమించి ఉంటాయి. అయినా స్వప్నాన, బాహ్య జగత్తులోవలె మేల్కొని ఉన్నప్పటివలె క్రియలు, స్పర్శలు, ధ్వనులు - అన్నీ అనుభూత మౌతాయి. కాబట్టి మనస్సు గతి ఏమిటో అని ఆశ్చర్యపడటం సబబే.

క. అని యి ట్లొలయు వితర్కం । బునెడ హృషీకేశుఁ డైన పురుషోత్తము ద
ర్శనమును గ్రమమున నెఱిఁగిన । ముని వర్గము శిష్యవర్గమున్ బోధించున్. 323

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ఇట్లు+ఒలయు= ఈ ప్రకారం కలిగే; వితర్కంబు+ఎడన్= సందేహం విషయంలో; హృషీక+ఈశుఁడు+ఐన= ఇంద్రియాలకు అధిపతి అయిన; పురుష+ఉత్తము= శ్రేష్ఠమానవుడి - శ్రీ విష్ణువుయొక్క; దర్శనమును=

చూపును - జ్ఞానమును; క్రమమునన్= వరుసగా విద్యా సంతతిద్వారా; ఎఱిఁగిన= గ్రహించిన; మునివర్గము= ఋషి సంఘం; శిష్యవర్గమున్= (తమ) శిష్యుల సమూహమును; బోధించున్= ఉపదేశిస్తుంది.

తాత్పర్యం: ఇంద్రియాలు విశ్రాంతిలో ఉన్నప్పుడు కూడా ఇంద్రియక్రియలు స్వప్నాన జరిగిపోవటం ఏ విధంగా సంభవం? - అనే సంశయానికి సమాధానంగా ఋషీశ్వరులు, ఇంద్రియాలకు అధీశ్వరుడైన విష్ణుమూర్తినుండి జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానజ్యోతిని విద్యాసంతతిద్వారా అనగా శిష్యపరంపర ద్వారా అందిస్తూ వస్తున్నారు.

క. శ్రమమున నింద్రియములు లీ । నము లగునది నిద్ర కలయనం దత్సంస్కా
రము మిథ్యావిషయ ప్రా । ప్తమగుట యప్పుడును దేహి దా సాక్షి యగున్. 324

ప్రతిపదార్థం: శ్రమమునన్= శ్రమ - అలసటవలన; ఇంద్రియములు= జ్ఞాన, కర్మ ఇంద్రియాలు; లీనములు+అగున్= దాగినవి-విరమించినవి ఔతాయి; అది= ఆ ప్రక్రియ; నిద్ర= నిద్దుర (ఔతుంది); కల+అనన్= కల అనగా; తద్+సంస్కారము= వాటి - ఆ ఇంద్రియాలయొక్క పూర్వానుభవపు తలపు; మిథ్యావిషయ ప్రాప్తము+అగుట= అసత్యమైన విషయాలతో లభించటం; అప్పుడును= ఆ స్థితియందుకూడా; దేహి= దేహం కలవాడు - ఆత్మ; తాన్= తాను; సాక్షి+అగున్= జరుగునది చూచువాడిగా (అవును) ఉంటాడు.

తాత్పర్యం: అలసట కారణాన ఇంద్రియాలు విశ్రాంతితో ఆగిపోవటం నిద్ర. మరి కల అనగా ఆ ఇంద్రియాల పూర్వానుభవం మిథ్యావిషయంగా వచ్చిచేరటం. ఆ సమయంలో కూడా దేహి ఆ కలలో జరిగే దానిని అంతటినీ చూచే సాక్షిగా మిగిలి ఉంటాడు.

తే. అనిలముఖ దోషములను సత్త్వాదిగుణ వి । కారముల జాగరంబునఁ గలుగునట్టి
తోఁపు బెరయంగఁ గల యయి తోఁచు; నది శు । భాశుభములకు సూచక మనియుఁ గలదు. 325

ప్రతిపదార్థం: జాగరంబునన్= మేల్కొని ఉన్నప్పుడు; అనిలముఖ దోషములను= గాలి మొదలైన దోషాలవలన; సత్త్వ+ఆది గుణ వికారములన్= సత్త్వం మొదలైన గుణాలయొక్క వికృతులవలన; కలుగు+అట్టి తోఁపు= కలిగే తలంపు; బెరయంగన్= చేరగా- వచ్చి చేరగా; కల+అయి= కలగా మారి; తోఁచున్= గోచరిస్తుంది; అది= ఆ కల; శుభ+అశుభములకున్= మంచి చెడులకు (రాబోవువాటికి); సూచకము= సూచిక - ప్రకాశకం - ముందుగా తెలిపేది; అనియున్= అని కూడా; కలదు= ఉన్నది.

తాత్పర్యం: జాగ్రదవస్థలో గాలి, మొదలయిన దోషాలవలనగాని, సత్త్వరజస్తమోగుణాల వికారాలవలన గాని కలిగే తలంపే, నిద్రలో కలగా వచ్చి చేరుతుంది. ఆ కల శుభాశుభాలకు సూచకమని అనటం కూడా ఉన్నది.

విశేషం: ఆధునికులు, మానసికశాస్త్ర అధ్యయనం తరువాత కనుగొన్నామని చెప్పే విషయాలకు సన్నిహితంగా ప్రాచీనులు కలకు ఇచ్చిన నిర్వచనం ఉన్నది.

క. స్వాపావస్థం బ్రకృతి క । దీపిత వాటిల్లు నపుడుఁ దెలి వెడలక తా
దీపించుఁ బురుషుఁ డిమ్మెయి । చూపు ప్రబోధంబు పరమసూక్ష్మత పుత్రా! 326

ప్రతిపదార్థం: పుత్రా!= బిడ్డా!; స్వాప+అవస్థన్= నిద్రావస్థలో; ప్రకృతికిన్= స్వభావానికి; అదీపిత= కాంతిలేని స్థితి-ప్రకాశంలేకపోవుట; పాటిల్లున్= కలుగుతుంది- ఏర్పడుతుంది; అపుడున్= ఆ సమయంలో కూడా - ప్రకృతి దీపించకుండా ఉన్నప్పుడు కూడా; పురుషుఁడు= దేహి అయిన ఆత్మ; తెలివి+ఎడలక= తెలివి నశించకుండా; తాన్= తాను; దీపించున్= ప్రకాశిస్తాడు; ఈ+మెయిన్= ఈ విధంగా; పరమ సూక్ష్మతన్= మిక్కిలి సూక్ష్మత్వంతో - చాలా సూక్ష్మమార్గాన; ప్రబోధంబు= ప్రజ్ఞానం - గొప్ప తెలివిని (పురుషుడు) చూపున్= ప్రదర్శిస్తాడు.

తాత్పర్యం: నిద్రావస్థలో నరుడి స్వభావం ప్రకాశరహితంగా ఉంటుంది. అయితే దేహస్థుడైన పురుషుడు మాత్రం, తాను ప్రకాశాన్ని కోల్పోకుండా మేల్కొనే ఉంటూ, ఈ విధంగా మిక్కిలి సూక్ష్మమార్గాన తన ప్రబోధాన్ని ప్రకటిస్తున్నాడు.

తే. తెలియ మేల్కని యుండుట, గలలు, నిద్ర । యను నవస్థాత్రయంబును, నవులఁబెట్టఁ
జాలు విజ్ఞాననిర్మల సత్యబోధ । రూప నిర్భరానందస్వరూపుఁ డనఘ! 327

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; తెలియన్= గ్రహించగా; మేల్కని+ఉండుట= మేల్కొని ఉండటం - జాగ్రదవస్థ; కలలు= స్వప్నాలు - స్వప్నావస్థ; నిద్ర= నిద్దుర పోవటం - నిద్రావస్థ; అను+అవస్థాత్రయంబును= అనే మూడు స్థితులనూ కూడా; అవులన్+పెట్టన్+చాలు= ఆవల పెట్టగల; విజ్ఞాన= విశేషమైన జ్ఞానం; నిర్మల= మలినంలేని; సత్యబోధరూప= నిజమైన ఎరుక అనే ఆకారంతో; నిర్భర= పరిపూర్ణ; ఆనంద స్వరూపుఁడు= ఆనందమే స్వరూపంగా కలవాడు ('పురుషుడు' అని పూర్వపద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఓ పాపరహితుడా! నరుడి జీవన సర్వస్వమూ మూడు అవస్థలతో నిండి ఉన్నది. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ - ఆ మూడు. నిజానికి దేహస్థుడైన ఆ పురుషుడు ఈ మూడు అవస్థలను ఆవలకు నెట్టి, స్వయంగా నిర్మలమూ సత్యమూ అయిన జ్ఞానాన్ని ఆకారంగా స్వీకరించి, పరిపూర్ణానందమయుడుగా ఉండగలవాడే.

విశేషం: పై పద్యాన 'బోధరూప. . . ఆనంద స్వరూపుడు' అనే మాట కొంత దురవగాహంగా అనిపించవచ్చును. 'బోధ', 'ఆనందం' రెండూ 'రూప' స్వరూపాలు'గా రూపింపబడటం వలన ఆ స్థితి కలుగవచ్చును. అయితే బోధ - జ్ఞానమే. ఆనందం. ఆనందమే ఆత్మస్వరూపమని సమన్వయించుకొనాలి.

తే. వ్యక్త మవ్యక్తమును రెండు నవగతములు । గాక మోక్షంబు మార్గంబు గానరాదు;
వ్యక్త మది మృత్యు వవ్యక్త మమృత మనియె । నతుల విజ్ఞాన ఘనుఁడు నారాయణుండు. 328

ప్రతిపదార్థం: వ్యక్తము= గోచరించేది; అవ్యక్తమును= మూల ప్రకృతి; రెండున్= ఈ రెండూ; అవగతములు+కాక= తెలిసినవిగాక - తెలియకుండా; మోక్షమార్గంబు= ముక్తికి దారి; కానన్+రాదు= కనబడదు; వ్యక్తము+అది= ఆ వ్యక్తమనేది - గోచరించే సర్వస్వమూ; మృత్యువు= మరణం - చావు - చావుకు లోనైనది; అవ్యక్తము= మూలప్రకృతి; అమృతము= మరణంలేనిది - చావనిది (అని); అతుల విజ్ఞాన ఘనుఁడు= పోలికలేని విశేషజ్ఞానంతో గొప్పవాడు అయిన; నారాయణుండు= విష్ణువు; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: జగాన వ్యక్తం, అవ్యక్తం అని పదార్థాలు రెండు ఉన్నాయి. అవి తెలిస్తే తప్ప ముక్తికి దారి కనపడదు. వ్యక్తమంటే చావు; అవ్యక్తమంటే అమృతం - అని విజ్ఞానఘనుడైన విష్ణువు పలికాడు.

విశేషం: వ్యక్తమంటే గోచరించేది. గోచరించేది సర్వమూ సృష్టపదార్థమే. సృష్టిని పొందిన దేదైనా నష్టికి లోను గావలసిందే, అవ్యక్తమంటే అగోచరం; అసృష్టం - సృష్టి లేనిదానికి నష్టీ ఉండదు. అదే అమృతత్వమంటే.

క. అనఘా! వినుమవ్యక్తం । బనునది త్రైలోక్యమునకు నాధారము; దా
ని నివృత్తి లక్షణం బగు । ననుపమ ధర్మ మని చాటు నాగమఫణితుల్. 329

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; వినుము= ఆలకించుము; అవ్యక్తంబు+అనునది= అవ్యక్తమనేది - మూలప్రకృతి అనేది; త్రైలోక్యమునకున్= ముల్లోకాలకూ; ఆధారము= ఆలంబనం; దాని నివృత్తి లక్షణంబు= ఆ అవ్యక్తముయొక్క 'నివృత్తి' అనే లక్షణం; అ+ఉపమ ధర్మము= సాటిలేని ధర్మం - ఆచరించదగ్గ నియమం; అగున్+అని= ఔతుందని; ఆగమ ఫణితుల్= శాస్త్రాల వాక్యాలు; చాటున్= ప్రకటిస్తాయి.

తాత్పర్యం: ఓ పాపరహితుడా! వినుము. అవ్యక్తమనబడే మూలప్రకృతి ముల్లోకాలకూ ఆలంబనమైనది. దానినుండే లోకాలన్నీ జన్మించి, దానిలోనే పెరిగి, చివరకు దానియందే లయమౌతున్నాయి. ఆ అవ్యక్తం నివృత్తి లక్షణం కలది. ఆ నివృత్తిమార్గం సాటిలేని గొప్ప ధర్మమని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

తే. వినుము బ్రహ్మోదితంబు ప్రవృత్తిధర్మ । మది గతాగతవ్యాప్తుల నావహించు
బ్రహ్మమండ్రు; నివృత్తిధర్మంబు నమ్మ । హాశ్రయము మోక్షదం బను నాగమములు. 330

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ప్రవృత్తి ధర్మము= ప్రవర్తన స్వరూపమైన ధర్మం; బ్రహ్మ+ఉదితంబు= బ్రహ్మనుండి పుట్టినది; అది= ఆ ప్రవర్తన ధర్మం; గత+అగత వ్యాప్తులన్= గతంయొక్క (కడచిన దాని), అగతంయొక్క (కడవని దాని) ప్రసరణలను - (భూత భవిష్యత్తుల) వ్యాప్తులను; ఆవహించు= కలిగించే; బ్రహ్ముము+అండ్రు= బ్రహ్మ అంటారు. భూత భవిష్యత్కాలాలకు వ్యాపించి ఉంటుంది - ప్రవృత్తి ధర్మం, ప్రవర్తన, వర్తమానకాలాన జరుగుతున్నా, దాని మూలాలు భూతాన, అవశేషాలు. భవిష్యత్తున ఉండవచ్చుననుట; నివృత్తి ధర్మంబున్= నివృత్తి రూపమైన ధర్మం; ఆ+మహా+ఆశ్రయము= ఆ గొప్ప ఆధారం - ఆ నివృత్తిధర్మం; మోక్షదంబు= మోక్షమును ఇచ్చేది (అని); ఆగమములు= శాస్త్రాలు; అనున్= పలుకుతాయి.

తాత్పర్యం: పైన తెలిపిన నివృత్తిమార్గానికి వ్యతిరిక్తమైనది ప్రవృత్తి మార్గం. నివృత్తి అంటే మరలడం - సంసారంనుండి. ప్రవృత్తి అంటే పాల్గొనటం - సంసారంలో. ప్రవృత్తిమార్గం బ్రహ్మనుండి పుట్టినది. ఈ ప్రవృత్తిమార్గం నిజానికి ప్రస్తుతకాలానికి చెందినట్లుగా కనిపిస్తున్నా, అది భూతభవిష్యత్కాలాలకూ వ్యాపించి ఉండే లక్షణం గలది. ఎందుకంటే ప్రవర్తన - ప్రవృత్తి అనగా కర్మలు చేయటమే, చేసిన కర్మల ఫలితాలు ముందు వెనుకలుగా అనుభవానికి రావచ్చును. ముందుగా అనుభవానికి రావటమంటే భూతకాలాన సంచితమై ఉన్నది వస్తున్నట్లుగా అర్థం చేసికొనాలి. అట్లాగే వెనుకగా అనుభవానికి రావటమంటే భవిష్యత్కాలాన రావటానికై దాచబడినదై అనంతరజన్మలో రాబోయేదిగా అర్థం చేసికొనాలి. ఈ విధంగా వర్తమానకాలానికే చెందినట్లున్నా, భూతభవిష్యత్తులకు కూడా వ్యాపించి ఉండే బ్రహ్మస్వరూపమే ప్రవృత్తిమార్గమని విజ్ఞులంటారు. జగత్తంతా బ్రహ్మవిలాసమే - వాస్తవానికి. అయితే నివృత్తిమార్గాన్ని మోక్షాన్ని ఈయగల దానినిగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

క. కట్టిన చీరయునుం, బైఁ । బెట్టిన చీరయును, మౌళి బిగి యారంగాఁ
జుట్టిన చీరయుఁ బోలెను । నెట్టన పొదివినది దేహిని గుణత్రయమున్. 331

ప్రతిపదార్థం: గుణత్రయమున్= గుణాలు మూడు - సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలూ; దేహిని= దేహం కలవానిని; కట్టిన చీరయున్= కట్టుకొన్న వస్త్రంవలె (ఒకటి); పైన్+పెట్టిన చీరయును= శరీరంమీద వేసికొన్న వస్త్రంవలె (మరొకటి రెండోది); మౌళిన్= తలను; బిగి+ఆరంగాన్= బిగువు స్పష్టపడే విధంగా; చుట్టిన చీరయున్+పోలెను= చుట్టిన వస్త్రంవలెనూ (మూడోది); నెట్టనన్= నిండుగా; పొదివినది= కమ్ముకొన్నది.

తాత్పర్యం: దేహస్థుడు ఆత్మ. అతడిని ప్రాకృతికాలయిన సత్త్వరజస్తమో గుణాలు మూడూ, కట్టుకొన్న చీరవలె ఒకటీ, పైన వేసికొన్న వస్త్రంవలె మరొకటీ, తలకు గట్టిగా చుట్టుకొన్న గుడ్డవలె ఇంకొకటీ, నిండుగా కమ్ముకొన్నాయి. ఆత్మ నిజస్వరూపం కానరాకుండా, ఈ క్రొత్త బాహ్యరూపాన్ని ఈ గుణాలు మూడూ కలిగించా యన్నమాట.

క. వినుఁ సత్త్వరజస్తమముల । పెనఁకువ కవుల వెలుఁగొందు పెంపు గలుగు తు
ర్య నిరంజనతత్త్వము పర । మనఘా! యది భావనీయ మను వేదంబుల్. 332

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపంలేనివాడా!; వినుఁ= ఆలకించుము; సత్త్వరజస్+తమముల పెనఁకువకున్= సత్త్వం (తెల్లనిది) రజస్సు (ఎఱనిది); తమముల= తమస్సు (నల్లనిది)ల మేళనమునకు; అవులన్= ఆవల - అవతల; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; పెంపు+కలుగు= గొప్పదనం ఉన్న; తుర్య= నాలుగవ; నిరంజన తత్త్వము= పరబ్రహ్మతత్త్వం; పరము= ముఖ్యం; వేదంబుల్= వేదాలు; అది= ఆ పరబ్రహ్మతత్త్వం; భావనీయము+అనున్= భావించవలసినది - అంటాయి.

తాత్పర్యం: దేహిని కమ్ముకొని ఉన్న ఈ మూడు - సత్త్వరజస్తమోగుణాల కలయికకు అవతల వెలుగొందే నాల్గో తత్త్వం ఒకటిఉన్నది. అదియే పరబ్రహ్మతత్త్వం. ఆ పరబ్రహ్మతత్త్వాన్నే భావించవలసి ఉన్నదని వేదాలు పలుకుతున్నాయి.

విశేషం: పరబ్రహ్మతత్త్వమనేది దృష్టికి గోచరించేదికాదు. మనసా భావించి గ్రహించవలసినది. అందువలననే దానిని జ్ఞానానందమయ మని యోగులు గుర్తించారు.

క. వాకును మనసును గాయము । నేకాయన వృత్తి శౌచ మెడలని తపముం
జేకొనునది యది బోధ । శ్రీకి ఘృతంబునకు వెన్నక్రియ జనక మగున్. 333

ప్రతిపదార్థం: వాకును= మాటా; మనసును= మనస్సూ; కాయమున్= దేహమూ; ఏక+అయన వృత్తిన్= ఒకే పోకడగల నడతతో; శౌచము+ఎడలని= శుభ్రత నశించని; తపమున్= తపస్సును; చేకొనునది= ఆచరించాలి; అది= ఆ తపస్సు; బోధశ్రీకిన్= జ్ఞాన సంపత్తికి; ఘృతంబునకున్= నేతికి; వెన్నక్రియన్= వెన్నవలె; జనకము= కారకం - కలిగించేది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: వాచా మనసా కర్మణా ఒకే ప్రవృత్తితో - మాటలో, ఆలోచనలో, క్రియలో ఏకత్వం పాటిస్తూ, ఆలోచించినదే చెప్పుతూ, చెప్పినదే చేస్తూ, పరిశుభ్రత కొరవడని తపస్సును ఆచరించాలి. ఆ ప్రవృత్తీ, ఆ తపస్సూ, జ్ఞానసంపత్తి ఏర్పడటానికి, నేయి కలగటానికి వెన్నవలె ఆధారమౌతాయి.

విశేషం: వెన్నకు రూపాంతరమే నేయి. త్రికరణ శుద్ధి (మనోవాక్కాయాలు - మూడు త్రికరణాలు) తోడి నిర్మల తపశ్చరణమే జ్ఞానానికి పూర్వరూపం.

తే. బ్రహ్మచర్య మహింస నాఁ బరఁగు పరమ । ధర్ములు రెండు సువ్వె యుత్తమ తపంబు;
దానిఁ గలవాఁడు నిర్మల జ్ఞానయోగ । వంతుఁడై చూడనేర్చు సర్వంబు ననఘ! 334

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; బ్రహ్మచర్యము= బ్రహ్మమందు - యోగమునందు - వేదాధ్యయనమందు చరించటం; అహింస= హింస చేయకుండటం; నాన్= అనగా; పరఁగు= చెలగెడు; పరమధర్ములు= గొప్పధర్మాలు; రెండు+చువ్వె= రెండు సుమా!; ఉత్తమ తపంబు= శ్రేష్ఠ తపస్సు; దానిన్= ఆ తపస్సును - బ్రహ్మచర్య వ్రతపాలన, హింసమాని జీవించటం - ఈ రెండింటిని; కలవాఁడు= కలిగినవాడు; నిర్మల జ్ఞాన యోగవంతుఁడు+ఐ= మలిన రహితమైన జ్ఞానమూ, యోగమూ కలవాడై; సర్వంబున్= అంతటిని - జగత్తు లోపలి బయటి వాటిని మొత్తమును; చూడన్+నేర్చున్= చూడగలుగుతాడు.

తాత్పర్యం: బ్రహ్మచర్యం, అహింస అనేవి రెండూ గొప్ప ధర్మాలు. ఆ రెండింటిని ఆచరించటమే ఉత్తమ తపస్సు. ఆ తపస్సు చేసేవాడికి నిర్మలజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞాననేత్రంతో అతడు ఈ లోకపు అంతర్బహి స్స్వరూపాలను సరిగా చక్కగా చూడగలడు.

విశేషం: సంస్కృతంలో 'బ్రహ్మన్' శబ్దానికి 'తత్త్వ తపోవేద యోగాదులు' అర్థంగా ఉన్నాయి. అయితే వ్యవహారంలో 'బ్రహ్మచారి' అనేమాట, సంసారానికి దూరంగా ఆధ్యాత్మవిద్య అభ్యసించేవారికి - వాచకంగా స్థిరపడింది. బ్రహ్మచారి ప్రవృత్తే బ్రహ్మచర్యం.

ఇక్కడి అర్థం కూడా వ్యవహారంలో ఉన్నదే. ప్రాచీనకాలాన అధ్యయనశీలురైన బాలురు గురుకులాలలో చేరి, చదువులు కొనసాగించేవారు. కాబట్టి బ్రహ్మచారి పదం, చదువుకొనే బాలుడు అనే అర్థానికీ వాచకమే. సబ్రహ్మచారి - తోడ చదువుకొనేవాడు.

క. ఆతత సంసారము తృ । ష్ణాతంతు స్మృతిబంధనంబున దృఢమై
చేతస్సంగతిఁ బాయమి । కాతెఱఁగు తపంబు పుత్ర! యౌషధము సుమీ! 335

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; ఆతత సంసారము= విశాలమైన (ఈ) సంసారం; తృష్ణాతంతు స్మృతి బంధనంబునన్= ఆశ అనే దారపు కుట్టు ముడితో; దృఢము+ఐ= గట్టిదై; చేతస్+సంగతిన్= మనస్సు యొక్క పొత్తును; పాయమికిన్= వదలకుండటానికి; విడువక ఉండటానికి; ఔషధము= మందు; ఆ తెఱఁగు తపంబు= ఆ విధమైన తపస్సు; చుమీ!= సుమా!

తాత్పర్యం: కుమారా! కనిపించే ఈ సువిశాల సంసారం, ఆశాతంతువుల కుట్టుడు ముడులతో గట్టిపడి, మనస్సును విడిచిపెట్టదు. మానవుడిని వదలదు. అందువలన ఈ తపశ్చర్య అవసరమైనది. ఈ తపస్సు ఆ సంసారం నుండి మనస్సును మరల్చడానికి ఔషధంవలె ఉపయోగపడుతుంది.

విశేషం: తంతువులు ఒకదానితో ఒకటి పెనవేసుకొని గట్టిపడి బంధనంగా మారుతాయి. ఆశలు కూడా అంతే. ఒక ఆశకు మరొక ఆశ ఆలంబనం. ఈ ఆశాసంతతి పరస్పరం సమ్మిశ్రితమై సంసారాన్ని దృఢతరంగా మారుస్తాయి. (ఆశ= తంతువు.)

క. వికసిత తృష్ణాలతికకు । న కుటిలమగు తపము దాత్రమై నఱకంగా
వికృతులఁ బ్రకృతినిఁ బురుషుని । నకలంక జ్ఞాన దృష్టి నవలోకించున్. 336

ప్రతిపదార్థం: వికసిత తృష్ణాలతికకున్= వికసించిన ఆశ అనే తీగకు; అకుటిలము+అగు= వంకర లేనిది అగు; తపము= తపస్సు; దాత్రము+ఐ= కొడవలి అయి; నఱకంగాన్= నరకగా-ఖండించగా (అపుడు); వికృతులన్= వికారాలను; ప్రకృతినిన్= స్వభావాన్ని-స్వభావరూపమైన ప్రకృతిని; పురుషునిన్= ఆత్మస్వరూపుడైన పురుషుడిని; అకలంక జ్ఞాన దృష్టిన్= మరక లేని, జ్ఞానమనే చూపుతో; అవలోకించున్= చూస్తాడు.

తాత్పర్యం: లోకంలోని జీవనవ్యవహారాన తృష్ణ ఒక తీగ. అది బహుభంగుల ప్రవర్ధమానమై వికసించి, నరుడిని ఆకర్షిస్తుంది. తనలో ఇముడ్చుకొంటుంది. అతడిచుట్టూ జిగిబిగిగా అల్లుకొని, బంధించివేస్తుంది. ఆ అల్లికనుండి బయటపడాలంటే - బ్రహ్మచర్యం, అహింస అనే ధర్మాల ఆచరణ రూపమైన తపశ్చర్య అనే కొడవలి కావాలి. ఆ తపోరూపదాత్రంతో తృష్ణారూప లతికాబంధాన్ని తెగనరకవచ్చును. తృష్ణ తెగిపడిన వెంటనే నరుడిలో, నిర్మల జ్ఞానమనే క్రొత్త చూడ్కి ఏర్పడుతుంది. ఆ క్రొత్త చూపుతో అతడు తనలోని తనవెలుపలి వికృతులనూ, ప్రకృతినీ చూడగలడు. అంతేగాదు - తన అంతరాత్మరూపుడైన 'పురుషుడిని' కూడా అపుడే గుర్తించగలడు.

విశేషం: అలం: రూపకం.

క. అని యమ్ముని పలుదెఱఁగులఁ । దను బోధించినఁ గృతార్థతం బొందెఁ దపో
ధనుఁ డా శిష్యుండు నీవును । గనికొను మేతద్వచో నికాయార్థంబుల్.' 337

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; ఆ+ముని= ఆ ఋషి; పలు+తెఱఁగులన్= అనేక విధాలుగా; తనున్= తనను; బోధించినన్= ఉపదేశించగా - తెలియపరచగా; తపస్+ధనుఁడు= తపస్సే ధనంగా కలవాడు అయిన; ఆ శిష్యుఁడు= ఆ అతడి శిష్యుడు; కృత+అర్థతన్+పొందెన్= నెరవేరిన ప్రయోజనం కలవానితనమును చెందాడు - ప్రయోజనం నెరవేరినవాడైనాడు; నీవును= నీవు కూడా (ఓ ధర్మరాజా! నీవూ); ఏతద్+వచస్+నికాయ+అర్థంబుల్= ఈ మాటల ప్రోగుల అర్థాలను; కనికొనుము= గ్రహించుము.

తాత్పర్యం: ఆ విధంగా ఆ ముని నానావిధాలుగా తన శిష్యుడికి జ్ఞానబోధ చేయగా, తపోమాత్రధనుడైన ఆ శిష్యుడూ కృతార్థుడైనాడు. ఓ ధర్మరాజా! నీవు కూడా ఆ మునిమాటల అర్థతాత్పర్యాలను గ్రహించి, నీ జన్మను చరితార్థం చేసికొమ్ము'.

తే. అనిన విని ప్రీతుఁడై పాండవాగ్రజున్కుఁ । డాపగాసూనుతో 'మిథిలాధినాథుఁ
డైన జనకుండు మోక్షంబు ననఘ! యేమి । కృత్యమునఁ గాంచె?' నది యెఱిఁగింపు మనుడు. 338

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; ప్రీతుఁడు+ఐ= ప్రీతి చెందినవాడై; పాండవ+అగ్రజున్కుఁడు= పాండవులలో మొదట పుట్టినవాడు - ధర్మరాజు; ఆపగాసూనుతోన్= నదీతనయునితో - భీష్ముడితో; అనఘ!= పాపంలేనివాడా!; మిథిలా+అధినాథుఁడు+ఐన= మిథిలానగరానికి అధిపతిఅయిన; జనకుండు= జనకమహారాజు; మోక్షంబున్= ముక్తిని; ఏమి కృత్యమునన్= ఏ కర్మవలన; కాంచెన్?= పొందాడు?; అది= ఆ విషయం; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్= అన్నవెంటనే.

తాత్పర్యం: పై ప్రకారంగా భీష్ముడు పలుకగా విని ఆనందించిన ధర్మజుడు తిరిగి భీష్మాచార్యుడితో 'ఓ పాపంలేని పితామహా! మిథిలానగరాధీశ్వరుడు జనకమహారాజు ఏ కర్మవలన ముక్తిని పొందగలిగాడు? ఆ విషయం ఎఱిగించుము' అన్నాడు. ఆ తరువాత.

వ. అతం డతని కిట్లనియెఁ 'దత్సంబంధియైన యితిహాసంబు సెప్పెద. 339

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; తద్+సంబంధి+ఐన= దానికి చెందిన; ఇతిహాసంబు= చరితమును; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ధర్మజుడి ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు 'దానికి సంబంధించిన చరితాన్ని చెప్పుతాను' (అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.)

క. వినుఁ మాచార్యులు నూర్వురు । జనకనృపాలునకు; వారు సతతంబును న
జ్జనపతి వినిపింతురు త । త్త్వ నిరూపక శాస్త్రమును పృథగ్విధములుగన్. 340

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆచార్యులు= గురువులు; జనక నృపాలునకున్= జనక రాజునకు; నూర్వురు= వందమంది; వారు= ఆ నూరుగురు; సతతంబునున్= ఎల్లప్పుడునూ; ఆ+జనపతిన్= ఆ రాజుకు; తత్త్వ నిరూపక శాస్త్రమును= సత్యమును నిరూపించే శాస్త్రమును; పృథక్+విధములుగన్= వేరు వేరు తీరులుగా; వినిపింతురు= వినిపిస్తారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆలకించుము. ఆ జనకరాజుకు నూర్గురు ఆచార్యులున్నారు. వారు సత్యనిరూపక పరమాత్మస్వరూపమైన శాస్త్రాన్ని ఆయనకు వినిపించేవారు. అయితే వారు ఆ శాస్త్రార్థాలను వేరు వేరు విధాలుగా వివరించేవారు.

విశేషం: సత్య మొకటైనపుడు, దానిని గూర్చి కథనమూ ఒకటిగా ఉంటే సమస్యలుండవు. కాని మానవ స్వభావం విచిత్రం. ఒకే అంశాన్ని బహుభంగుల వివరించటం మొదటినుండి మానవ చరిత్రలో ఉన్నదే. అందువల్లనే "ఏకం సత్ విప్రా బహుధా వదన్తి" వంటి ఉపనిషద్వాక్యం పుట్టి ఉంటుంది.

క. ఏవాఁ డెమ్మెయిఁ జెప్పిన । నా వసుధాధిపుఁడు దాని ననుమోదించున్
భావము సంతోషశ్రీ । భావిత మగుచుండఁ గురునృపాలప్రవరా! 341

ప్రతిపదార్థం: కురున్నపాల ప్రవరా!= కురురాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఆ వసుధా+ఆధిపుఁడు= ఆ రాజు; ఏవాఁడు= ఎవడు; ఏ మెయిన్= ఏ విధంగా; చెప్పినన్= ఉపదేశించినా; దానిన్= ఆ ఉపదిష్టాంశాన్ని; భావము= మనస్సు; సంతోషశ్రీ భావితము+అగుచున్+ఉండన్= ఆనందసంపదతో ప్రభావితం కాగా; అనుమోదించున్= అనుగుణంగా ఆమోదిస్తాడు.

తాత్పర్యం: ఆ నూర్వురు ఆచార్యులలో ఎవరు దేనిని ఏ విధంగా ఉపదేశిస్తే, ఆ మహారాజు దానిని ఆ విధంగానే మనస్సు సంతోషంతో నిండిపోగా, అనుమోదిస్తూ ఉండేవాడు.

విశేషం: (ఉపదేష్ట అభిప్రాయాన్ని శిష్యుడు యథాతథంగా గౌరవించి ఆమోదిస్తూ ఉండేవాడన్నమాట.) బోధితుడికి (శిష్యునకు) బోధకుడితో అభిప్రాయభేదమనే భావనే ఉత్పన్నం కాని తీరున అక్కడ బోధన జరిగినది. ఈ జనకుడి జ్ఞానార్జన విధానం సమన్వయమార్గానికి సర్వధర్మసమానత్వ భావనకు మార్గదర్శకంగా భాసిస్తున్నది. బహుశః సమన్వయ విధానం ఆర్షధర్మాన కలదనే వాదంలోని సారాంశమదే కావచ్చును.

వ. అట్టియెడఁ దత్త్వజ్ఞానఘనుండును నిర్ద్వంద్వుండును సంశయరహితుండును నగు పంచశిఖుండను మునివరుండు మహిం బిరుగుచుండి మిథిలకుం జనుదెంచె; నతండు కపిలాభిధాన యగు గురుకుటుంబిని చన్ను గుడిచి పెరిఁగిన వాఁ డగుటం గాపిలేయుండు ననంబరఁగు; నమ్మహాత్ముండు హేతుమద్వాక్య విశేషంబుల నయ్యాచార్యుల నూర్వుర నయ్యుర్వీపతి సన్నిధిన నిరుత్తరులంజేసిన, నాతం డతని విశేషజ్ఞత యెఱింగి వారల విడిచి తన్నుం బ్రబోధించుటకై ప్రార్థించి యతనికిం బ్రణతుఁ డైన నమ్మానవీయుం డనూన దయాయత్తచిత్తుండు గావున నా భూవల్లభునకు మోక్షోపాధి బోధప్రదంబులగు వాక్యంబు లిట్లని యుపదేశించె. 342

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన; తత్త్వజ్ఞాన ఘనుండును= సత్యజ్ఞానంవలన గొప్పవాడును; నిర్+ద్వంద్వుండును= రెండవవాడును లేనివాడును - ఒంటరి (జ్ఞానంలోను, జీవితంలోను); సంశయరహితుండును= సందేహం లేనివాడును; అగు= అయిన; పంచశిఖుండు+అను= పంచశిఖుడు అనే పేరుగల (ఐదు శిఖలు - జడలు గలవాడని వ్యుత్పత్తి. పేర్లకు వ్యుత్పత్తి ఉండబనిలేదు గాని తెలియవచ్చినంత తెల్పుట ఇది); మునివరుండు= ఋషిశ్రేష్ఠుడు; మహిన్= భూమిపై; తిరుగుచున్+ఉండి= తిరుగాడుతూ ఉండి; మిథిలకున్= మిథిలానగరానికి; చనుదెంచెన్= వచ్చాడు; అతండు= ఆ పంచశిఖుడు; కపిల+అభిధాన+అగు= కపిల అనే పేరుగల; గురుకుటుంబిని చన్ను= గురుపత్నియొక్క రొమ్ము; కుడిచి పెరిఁగినవాఁడు+అగుటన్= త్రాగి పెరిగినవాడు కావటంవలన; కాపిలేయుండును+అనన్= కపిలాతనయుడు అనగా (గూడ); పరఁగున్= ఒప్పును; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మగలవాడు-పంచశిఖుడు; హేతుమత్+వాక్యవిశేషంబులన్= కారణాలతో కూడిన విశిష్టవాక్యాలతో; ఆ+ఆచార్యులన్= ఆ గురువులు; నూర్వురన్= వందమందినీ; ఆ+ఉర్వీపతి సత్+నిధిని+అ= ఆ రాజు దగ్గరనే; నిర్+ఉత్తరులన్= సమాధానం లేనివారినిగా; చేసినన్= చేయగా; ఆతండు= ఆ రాజు జనకుడు; అతని విశేషజ్ఞత= ఆ పంచశిఖుని విశిష్టజ్ఞానము (కలిగియున్నతనమును); ఎఱింగి= గ్రహించి; వారలన్= ఆ నూర్వురు ఆచార్యులను; విడిచి= వదలి; తన్నున్= తనను (రాజును) ప్రబోధించుటకై= ఉపదేశించటానికై; ప్రార్థించి= యాచించి; ఆతనికిన్= ఆ పంచశిఖుడికి; ప్ర+నతుండు+ఐనన్= నమస్కరించినవాడు కాగా; ఆ+మహనీయుండు= ఆ పూజ్యుడు; న+ఊనదయా+ఆయత్త చిత్తుండు= తక్కువగాని దయకు లొంగిన మనస్సు కలవాడు; కావునన్= కాబట్టి; ఆ భూవల్లభునకున్= ఆ రాజునకు; మోక్ష+ఉపాధి బోధ ప్రదంబులు+అగు= ముక్తికి కారణమైన జ్ఞానాన్ని ఇచ్చెడివి అయిన; వాక్యంబులు= మాటలు; ఇట్లు+అని= ఈ విధంగా; ఉపదేశించెన్= బోధించాడు.

తాత్పర్యం: ఆ విధంగా జనకరాజు నూర్వురు ఆచార్యులనుండి భిన్నభిన్న విధాలయిన ఆధ్యాత్మవిద్యాబోధనలు వింటూ, సంతోషిస్తూ, ఆ అందరి అభిప్రాయాలనూ గౌరవిస్తూవస్తున్న సమయాన పంచశిఖుడనే విప్రుడొకడు ఆయన

ఆస్థానాన ప్రవేశించాడు. అతడు సత్యజ్ఞానంతో గొప్పవాడు, ఒంటరి. సంశయాలు తీరినవాడు, భూమిపై సంచరిస్తూ యాదృచ్ఛికంగా మిథిలానగరప్రవేశం చేసి, రాజును చూచాడు. అతడిని కాపిలేయుడు అని కూడా అంటారు. ఎందుకంటే అతడు కపిల అనే గురుపత్ని చన్నుగుడిచి పెరిగినవాడు. ఆ మహాత్ముడు జనకుడి ఆస్థానాన, రాజు సన్నిధిలోనే తన హేతుపూర్వక వాక్యవిన్యాసాలతో జనకుడి నూర్వురు ఆచార్యులనూ వాదంలో జయించి వారిని నిరుత్తరులను చేశాడు. ఆ జనకుడు ఆ పంచశిఖుడి విశేషపరిజ్ఞానాన్ని గ్రహించి, తన గురుశతాన్ని విడిచి, అతడిని ఆశ్రయించి, తనకు తత్త్వోపదేశం చేయుమని అర్థిస్తూ ప్రణమిల్లాడు. ఆతడు కూడా గొప్పదయకు లొంగిన మనస్సుతో ఆ రాజునకు మోక్షానికి కారణమైన జ్ఞానాన్ని ఈయగల మాటలను ఈ విధంగా ఉపదేశించటం ప్రారంభించాడు.

పంచశిఖుండను విప్రుండు జనకునకుఁ దత్త్వోపదేశంబు సేయుట (సం. 12-211-6,8)

ఆ. వినుఁ మవిద్య గామమునకుఁ గామము గర్మ । మునకుఁ బుట్టఁబట్టు లనఘ! యింత
వట్టుఁ గారణముగ వచ్చుఁ బునర్జన్మ । మండ్రు తత్త్వవేదు లైన మునులు. 343

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! జనకమహారాజా!; వినుము= ఆలకించుము; అవిద్య= మాయ (అజ్ఞానం); కామమునకున్= కోరికకు; కామము= కోరిక; కర్మమునకున్= క్రియకు - ప్రవృత్తికి - పనికి; పుట్టన్+పట్టులు= పుట్టుటకు స్థానాలు; ఇంతవట్టున్= ఇంతవరకు - ఈపై తెల్పినవి; కారణముగన్= హేతువుగా; పునర్+జన్మ= మరల పుట్టుట; వచ్చున్= కలుగుతుంది (అని); తత్త్వవేదులు+అయిన మునులు= సత్యము నెరిగినవారైన ఋషులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పాపంలేని ఓ జనక మహారాజా! వినుము. మాయ కోరికకు కారణం, ఆ కోరిక కర్మకు కారణం, కర్మ పాపపుణ్యాలకు మూలం. ఆ పాపపుణ్యాల అనుభవంకొరకు ప్రాణికి పునర్జన్మ అవసరమౌతుంది. ఈ విషయం తత్త్వవేత్తలైన మునులు చెప్పుతారు.

ఆ. ఒలసి లోభమోహములు దోషసంసేవ । నం బొనర్పఁగా ఘనత్వగాఢ
యగు నవిద్య భూమియై బహుకర్మ బీ । జముల కంకురాది శక్తు లొసఁగు. 344

ప్రతిపదార్థం: అవిద్య= మాయ; ఒలసి= అతిశయించి; లోభమోహములు= పేరాస, అపజ్ఞానములు (ఒకదానిని మరొకటిగా గ్రహించటం); దోష సంసేవనంబు= తప్పుల యొక్క ఉపాసనం - గౌరవంతో పరిచర్యచేయటం; ఒనర్పఁగాన్= చేయగా; ఘనత్వగాఢ+అగున్= గట్టిదనంతో దిట్టయైనది అగును - గట్టిపడును; బహుకర్మబీజములకున్= అనేక కర్మలు అనే విత్తనములకు; భూమి+ఐ= ఆధారమై - క్షేత్రమై; అంకుర+ఆది శక్తులు= మొలకెత్తటం మున్నగు సామర్థ్యాలను; ఒసఁగున్= ఇచ్చును.

తాత్పర్యం: మాయ పేరాస, అపజ్ఞానం చేసే తప్పులు కారణంగా బలపడి దట్టంగా రూపుదాలుస్తుంది. ఆ తరువాత అదే అనేక కర్మలు అనే విత్తనాలకు పొలంగా మారి, ఆ కర్మబీజాలు మొలకెత్తటం, మారాకు తొడగటం పెరగటం పుష్టించటం, ఫలించటంవంటి వివిధశక్తులతో విస్తరించటానికీ కారణమౌతుంది. మాయకు లోభమోహాలు దోహదపడగా, అదే బహుకర్మలకు ఆధారం భూమిగా మారి, నరుడిని జననమరణ చక్రాన పడవేసి తిప్పుతుంటుంది- అని ఫలితార్థం.

క. ప్రియములు నప్రియములును హృ । దయమును జిక్కువడఁ దివ్వఁ దత్తదనేక
క్రియలకుఁ జొచ్చు నరుఁడు మేన్ । వ్రయమగు టెఱుగఁడు వితత జరావ్యాధులచేన్. 345

ప్రతిపదార్థం: నరుఁడు= మానవుడు; హృదయమును= మనస్సును; ప్రియములున్= ఇష్టమైన విషయాలు; అప్రియములును= అనిష్టమైన విషయములును; చిక్కు+పడన్+తివ్వన్= (కలిసి) చిక్కుపడేటట్లు లాగగా; తద్+తద్+అనేక క్రియలకున్= ఆయా పెక్కు కర్మలకు; చొచ్చున్= ప్రవేశించును - పాల్పడును; వితత జరావ్యాధులచేన్= విరివిఅయిన ముసలితనం, రోగాలతో; మేన్= దేహం; వ్రయము+అగుట= నశించుట; ఎఱుఁగఁడు= గ్రహించడు.

తాత్పర్యం: మనస్సు ఇష్టానిష్టాలతో చిక్కువడి అటూ ఇటూ లాగుతూ ఉండగా నరుడు ఆయా కర్మలు అనేకాలు చేయ మొదలుపెడతాడు. చేస్తూ జీవిస్తూ ఉంటాడే తప్ప అతడికి తన శరీరం జరావ్యాధులకు లోనై క్రుంగి నశించబోయే విషయం బోధపడదు.

క. ధనములు బంధులు భోగము । లనియెడు నస్థిరము లెల్ల నాత్మ కెరవు సే
సిన శాంతి యలవడును మన । మున శాంతిశ్రీ సమృద్ధి మోక్షము నిచ్చున్.' 346

ప్రతిపదార్థం: ధనములు= సంపదలు; బంధులు= చుట్టపక్కాలు; భోగములు= అనుభవాలు (క్రియల ఫలితాలు); అనియెడు+అస్థిరములు+ ఎల్లన్= అనే మూడు విధాలయిన అశాశ్వత విషయాలను అన్నింటిని; ఆత్మకున్= జీవుడికి; ఎరవు+చేసినన్= వేరు చేస్తే; మనమునన్= మనస్సునందు; శాంతి+అలవడును= శాంతి అలవాటు అవుతుంది - ఏర్పడుతుంది; శాంతిశ్రీ సమృద్ధి= శాంతి అనే సంపద యొక్క పెంపు; మోక్షమును+ఇచ్చున్= ముక్తిని కలిగిస్తుంది.

తాత్పర్యం: నరుడు సంపదలు చుట్టపక్కాలు అనుభవాలు - అనే ఈ అశాశ్వత విషయాలు అన్నిటినీ జీవుడికి దూరంగా ఉంచగలిగితే అతడి మనస్సులో శాంతి ఏర్పడుతుంది. మిగిలిన సంపదలు సమృద్ధులు నశించగా ఏర్పడిన ఈ శాంతిసంపద పెరిగి, తుదకు అతడికి ముక్తిని చేకూర్చి పెట్టుతుంది.

వ. అనిన విని జనకజనవల్లభుం డమ్మునివల్లభునితోడ. 347

ప్రతిపదార్థం: అనినన్= అని పంచశిఖముని పలుకగా; విని= ఆలకించి; జనక జనవల్లభుండు= జనకరాజు; ఆ+ముని వల్లభునితోడన్= ఆ మునిరాజుతో.

తాత్పర్యం: పంచశిఖప్రవచనాన్ని ఆలకించిన జనకరాజు ఆ మునిరాజుతో (ఇట్లా అన్నాడు).

క. 'కేవల వైరాగ్యము మో । క్షావహ మగునేని యట్టులైన విరక్తిన్
భావమున నరుఁడు దాల్చెడిఁ । బో వాఁ డవ్యయ పదంబుఁ బొందునె? యనుడున్. 348

ప్రతిపదార్థం: కేవల వైరాగ్యము= వైరాగ్య మొక్కటే; మోక్ష+ఆవహము+అగును+ఏని= ముక్తిని కలిగించేది అయినచో; అట్టులు+ఐనన్= అట్లా అయితే; నరుఁడు= మనుజుడు; భావమునన్= మనస్సునందు; విరక్తిన్= వైరాగ్యమును; తాల్చెడిన్+పో= ధరించును పో - ధరించుననుకొమ్ము; వాఁడు= ఆ విరాగి - ఆ విరక్తిని దాల్చినవాడు; అవ్యయపదంబున్= నశించని స్థానమును-ముక్తిని; పొందును+ఎ?= చెందునా?; అనుడున్= అన్న వెంటనే.

తాత్పర్యం: కేవలం వైరాగ్య మొక్కటే ముక్తిని కలిగించగలిగితే నరుడు తన మనస్సున ఆ వైరాగ్యాన్ని వహించాడు-అనుకొమ్ము. అపుడు అతడు ముక్తిని పొందుతాడా? అని ప్రశ్నించిన వెంటనే.

వ. అవ్విప్రవరుం డతని కిట్లనియె. 349

ప్రతిపదార్థం: ఆ+విప్రవరుండు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు - ఆ పంచశిఖముని; అతనికిన్= ఆ జనక రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: రాజు ప్రశ్నకు విప్రుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. వినుము నృప! హర్షంబు ప్రియం। బనూన సుఖయుక్తి నిర్భరానందము శాం
తినిరూఢి యనఁగ మనమునఁ। బనిగొనునవి సాత్త్వికాఖ్య భావంబు లగున్. 350

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; హర్షంబు= సంతోషం; ప్రియంబు= ప్రీతి; న+ఊన సుఖయుక్తి= తక్కువగాని-గొప్పదైన సుఖముయొక్క కలయిక; నిర్భర+ఆనందము= నిండైన ఆనందము; శాంతినిరూఢి= శాంతియొక్క గట్టితనం; అనఁగన్= అనగా; మనమునన్= మనస్సునందు; పని+కొనునవి= నియోగించేవి - సంచరించెడివి; సాత్త్విక+ఆఖ్య భావంబులు+అగున్= సాత్త్వికాలు - అనే పేరుగల భావాలు అవుతాయి.

తాత్పర్యం: ఓ రాజా! వినుము, సంతోషం, ప్రీతి, గొప్పసుఖంతోడి ఆనందం, నిశ్చలశాంతీ మనస్సును ఏలేవి సాత్త్వికాలు అనే ఈ భావాలు. సత్త్వగుణంవలన కలిగే భావ పరంపర ఇది.

క. పరితాప మనభితోషము। నరేశ్వరా! శోచనము జనవ్యాపారా
దర మక్షమ యనియెడు నివి। యరయంగా రాజసంబు లగు భావంబుల్. 351

ప్రతిపదార్థం: నర+ఈశ్వరా!= ఓ రాజా!; పరితాపము= సంతాపం-దుఃఖం; న+అభితోషము= సంతోషంలేమి; శోచనము= ఏడ్చుట; జనవ్యాపార+ఆదరము= జనుల కర్మలయందు ప్రేమ-అభిమానము; అక్షము= ఓర్వలేని తనం-అసూయ; అనియెడు+ఇవి= అనే ఇవి-ఈ భావాలు (మనో వికారాలు); అరయంగాన్= పరిశీలించగా; రాజసంబులు+అగు= రజోగుణసంబంధులు అగు; భావంబుల్= మనోభావాలు.

తాత్పర్యం: సంతాపం చెందటం, అవకాశమున్నా సంతోషించకుండా ఉండటం, ఏడుపు, జనుల క్రియలలో అభిమానం ప్రదర్శించటం, ఓర్వలేనితనం - ఈ భావాలు రజోగుణంవలన కలిగేవి.

క. తలఁపులు గ్రందుగఁ బొడముట। గల గను టేమఱుట భ్రమము గదురుట జాడ్యం
బలసత యను నీ భావం। బులు దామసకోటి యండ్రు బుధులు నరేంద్రా! 352

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ఓ రాజా! జనకా!; తలఁపులు= ఆలోచనలు; క్రందుగన్= (అతిశయంగా) ఉపద్రవంగా; పొడముట= కల్గటం; కల+కనుట= కలగాంచటం; ఏమఱుట= ప్రమాదపడటం - పొరబడటం; భ్రమము= భ్రాంతి - ఒకదానిని మరొకటిగా తలచుట; కదురుట= విజృంభించటం; జాడ్యంబు= జడత్వం - చురుకులేనితనం; అలసత= ఆలస్యం - సోమరితనం; అను+ఈ భావంబులు= అనే ఈ భావాల వరుస; బుధులు= పండితులు; తామసకోటి= తమోగుణ సంబంధిఅయిన (భావ) సమూహం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఓ జనక రాజా! ఇపుడు తామసభావాలు వివరిస్తున్నాను. ఉపద్రవరూప ఆలోచనలు కలుగుతూ ఉండటం, కలలు రావటం, ఏమరుపాటు ఒకదానిని మరొకటిగా గ్రహిస్తూ వ్యవహరించటం, చురుకుదనం లేకుండా మందగించి ఉండటం, సోమరితనం - అనే ఈ మనోవికారాలన్నీ తమోగుణజన్యాలు - అని పండితులు పలుకుతారు.

క. కారణము గలిగియును ని। ష్కారణ కలితంబులయ్యు జనియించు ధరి
త్రీరమణ! మూఁడు తెఱఁగులు। నారయ నివి యస్థిరంబులై తిరుగఁబడున్. 353

ప్రతిపదార్థం: ధరిత్రీరమణ!= రాజా!; మూఁడు తెఱఁగులు= మూడు విధాలు - సత్త్వ రజస్తమోజనిత భావాలు మూడు; కారణము+కలిగియును= కారణం ఉండీ; నిఃకారణ కలితంబులు+అయ్యున్= కారణం లేకా (కారణములేమితో కూడినవై

కూడా); జనియించున్= కలుగుతాయి; ఆరయన్= పరిశీలించగా; ఇవి= ఈ మూడు విధాలయిన భావాలు; అస్థిరంబులు+ఐ= స్థిరం కానివై - చంచలములై; తిరుగన్+పడున్= తిరగబడతాయి - తారుమారౌతాయి.

తాత్పర్యం: ఓ రాజా! ఈ సత్త్వరజస్తమోగుణ జన్యాలయిన మూడు విధాల భావాలూ ఒకసారి కారణం ఉండి కలగవచ్చును. ఒక్కొక్కసారి నిష్కారణంగానే పొటమరించవచ్చును. ఈ భావపరంపర స్థిరంగా నిలువదు. చంచలంగా మారుతుంటుంది. ఒక్కొక్కసారి ఈ మనోవికారాలు తిరగబడతాయి కూడా.

చ. జనవర! సౌఖ్యముం బొరసి సాత్త్వికభావ సముద్గమంబు సు
మ్మనియును దుఃఖముల్ గదిరినప్పుడు రాజసభావభంగి సు
మ్మనియు జడత్వసంగసమయంబునఁ దామసభావవృత్తి సు
మ్మనియును ద్రోచి వానఁ బడ కాత్మరతిన్ నిలు పిచ్చు మోక్షమున్. 354

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; సౌఖ్యమున్+పొరసి= సుఖాన్ని పొంది; సాత్త్వికభావ సమ్+ఉత్+గమంబు= సత్త్వగుణ సంబంధి భావాల మంచి పుట్టుక; సుమ్ము+అనియును= సుమా అనీ; దుఃఖముల్+కదిరిన+అప్పుడు= దుఃఖాలు - దుఃఖమయమైన భావాలు పైకొన్నపుడు; రాజసభావ భంగి= రజోగుణసంబంధి భావాలతీరు; సుమ్ము+అనియును= సుమా అనీ; జడత్వ సంగసమయంబునన్= జాడ్యంతోడి కలయిక కలిగినపుడు; తామసభావవృత్తి= తమోగుణ సంబంధి భావాల ప్రవృత్తి; సుమ్ము+అనియున్= సుమా అనీ; త్రోచి= ప్రక్కకు నెట్టి - ఆ భావాల జోరులో పడి కొట్టుకొనిపోకుండా - వాటిని నెట్టివేసి; వానన్= ఆ భావాలలో; పడక= పడిపోకుండా; ఆత్మరతిన్ నిలుపు= తనయందు (తాను) సంతోషించటం - బహిఃకారణాలతో పనిలేకుండా - తనలో తాను సంతసించుటయందు నిల్చుట; మోక్షమున్= ముక్తిని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఓ రాజా! నరుడు తాను సౌఖ్యాన్ని చవిచూస్తున్నప్పుడు అది సత్త్వగుణ సంజనితమైన భావాలవలన కలిగినట్లూ, దుఃఖాన్ని అనుభవిస్తున్నప్పుడు అది రజోగుణం కారణంగా ఏర్పడినట్లూ, జడత్వంతో స్తబ్ధంగా సోమరితనం పైబడినప్పుడు అది తమోగుణ ఫలితమయినట్లూ గ్రహించి, ఆయా భావాలనూ, వాటి ఫలితా లయిన సుఖదుఃఖ జడత్వాలనూ విడిచిపుచ్చి, తనలో తాను ఆనందించే స్థైర్యాన్ని అందుకొనగలగాలి. అపుడే ముక్తి లభిస్తుంది. ఆ ఆత్మరతి స్థైర్యమే ముక్తిని ఈయగలదు.

వ. ఇవ్వెరవునకు వైరాగ్యంబు మూలం బని చెప్పి వెండియు. 355

ప్రతిపదార్థం: ఈ+వెరవునకున్= ఈ పద్ధతికి; వైరాగ్యంబు= విరక్తి; మూలంబు+అని= కారణం అని; వెండియున్= మరియును.

తాత్పర్యం: ఈ ఆత్మరతి స్థైర్యసిద్ధికి కారణం విరక్తి ఒక్కటే - అని పలికి, ఇంకనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వినుము సత్త్వాదిగుణముల ననఘ! యాత్మ । తత్త్వమున లీనములఁ జేయఁ దన్మయత్వ
దర్శనము దాన నవి మహోదధి నడంగు । నేఱు లట్టుల రూపఱు వేఱులేక. 356

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! జనకరాజా!; వినుము= ఆలకించుము; సత్త్వ+ఆదిగుణములన్= సత్త్వం మొదలైన గుణములను - రజస్తమోగుణాలను కూడా; ఆత్మతత్త్వమునన్= ఆత్మయొక్క జీవుడి యొక్క తత్త్వమునందు - స్వభావమునందు - సహజసత్వస్థితియందు; లీనములన్+చేయన్= లయించిన - కలిసిపోయిన వానినిగా చేయగా; తద్+మయత్వ దర్శనము= దానిలో - ఆ ఆత్మలో భాగమైపోయిన స్థితి అగుపడుట (జరుగును); దానన్= ఆ ఆత్మయందు; అవి= ఆ సత్త్వ గుణాలు; మహా+ఉదధిన్= పెద్ద సముద్రాన; అడంగు= లయమైపోయే; ఏఱులు+అట్టులు+అ= కాల్వలవలెనే; వేఱులేక= విడిగా ఉండక; రూపు+అఱున్= రూపు నశించును - ఆకారం లేకుండా ఆ ఆత్మలో అంతర్భవిస్తాయి.

తాత్పర్యం: ఓ పాప మెరుగని పాలకుడా! జనకమహారాజా! వినుము. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు మూడింటినీ ఆత్మతత్త్వంలో - జీవుడి నిజస్వభావాన లీనం చేయాలి. అపుడు అవి ఆత్మలో కలిసిపోయి, విడిగా ఉండక - సముద్రాన కలిసిపోయే ఏరులవలె నిరాకారంగా సాంతమైన ఉనికిలేకుండా అయిపోతాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. నరుఁడు సుఖదుఃఖములవెంటఁ బొరయ నీక । మలచి యాత్మునిఁ జేర్చిన మానసంబు
లీనమగు నంద జలములలోన నిడిన । లవణకణము చందమ్మున నవనినాథ! 357

ప్రతిపదార్థం: అవనినాథ!= ఓ రాజా!; నరుఁడు= మానవుడు (కర్త); మానసంబు= మనస్సు (కర్మ); సుఖదుఃఖములవెంటన్= సంతోషం సంతాపములవెంట; పొరయన్+ఈక= వెడలనీయకుండా - వాటితో పాటుగా పడిపోకుండా; మలచి= త్రిప్పి - అంతర్ముఖంచేసి; ఆత్మునిన్= జీవాత్ముడిని; చేర్చినన్= పొందించినట్లయితే - కలిపినట్లయితే; అందున్+అ= దానియందే - ఆ ఆత్మయందే; జలములలోనన్ - నీళ్ళలో; ఇడిన= వేసిన - ఉంచిన; లవణకణము చందమ్మునన్= ఉప్పుగల్లు విధాన; లీనము+అగున్= లీనమై - కలిసినదై పోవును.

తాత్పర్యం: ఓ రాజా! నరుడు తన మనస్సును లౌకికా లయిన సుఖదుఃఖాల వెంటబడిపోకుండా అంతర్ముఖంగా త్రిప్పివేసి, ఆత్మలో చేర్చగలగాలి. ఆ విధంగా ఆత్మలో చేర్చబడ్డ మనస్సు ఆ ఆత్మలోనే నీళ్ళను చేర్చిన ఉప్పుగల్లువలె కలిసిపోయి తన ఆకారాన్ని కోల్పోతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. తోలు దిగవిడిచి నాగము । లీలఁ బొలుచు మాడ్కిఁ గర్మలేపముఁ దనతోఁ
గీలుకొననీక వెలుఁగు ని । రాలంబన బోధఘనుఁడు రాజవరేణ్యా! 358

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= ఓ రాజశ్రేష్ఠా!; నాగము= పాము; తోలు= చర్మం (కుబుసం); దిగవిడిచి= తీసివేసికొని; లీలన్+పొలుచు మాడ్కిన్= విలాసంతో ఒప్పినవిధాన; నిర్+ఆలంబన బోధఘనుఁడు= ఆధారంలేని (స్వతః ప్రకాశమానమైన) జ్ఞానంతో గొప్పవాడైనవాడు (నరుడు) కర్మలేపమున్= కర్మం అనే పూతను (ఒంటికి రాసుకొనే ద్రవం); తనతోన్= తనతో; కీలుకొనన్+ఈక= ముడిపడనీయకుండా - అంటుకొనకుండా; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఓ రాజశ్రేష్ఠా! కుబుసం విడిచిన పాము విలాసంగా ప్రకాశిస్తుంది. ఆ విధంగానే, కర్మసంపర్కం వదలిన ఆత్మ, నిరాధారమై స్వతఃప్రకాశవంతమైన జ్ఞానంతో ప్రజ్వలిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

వ. అని బోధించె; నిట్లు పంచశిఖునిచేత బోధితుండై కాదె! జనకుండు దన పురంబైన మిథిల గాలునప్పుడు దుఃఖంబులం బొరయమింజేసి తన కేమియుం గాలదని పలికెం గొంతేయాగ్రజా! యాకర్ణింపుము.359

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; బోధించెన్= ఉపదేశించెను; ఇట్లు+ ఈ విధంగా; పంచశిఖునిచేతన్= పంచశిఖుడనే ఋషిశ్రేష్ఠుడిచేత; బోధితుండు+ఐ= ఉపదిష్టుడై - ఉపదేశించబడినవాడై; కాదె= కదా!; జనకుండు= జనక మహారాజు; తన పురంబు+ఐన= తన పట్టణమైన; మిథిల= మిథిలా నగరం; కాలునప్పుడు= కాలిపోయే సమయాన; దుఃఖంబులన్= పరితాపాలను-ఖేదములను; పొరయమిన్+చేసి= పొందకపోవటంవలన; తనకున్+ఏమియున్+కాలదు= (నిర్లిప్తుడైన) తనను ఏమీ దహించదు;

అని పలికెన్= అని అన్నాడు; కౌంతేయ+అగ్రజా!= కుంతీనందనులలో మొదట పుట్టినవాడా! ధర్మరాజా!; ఆకర్ణింపుము= వినుము, (ఈ చివరిమాట అనంతర వాక్యంతో అన్వయిస్తుంది.)

తాత్పర్యం: పై ప్రకారం పంచశిఖమహర్షి జనకమహారాజునకు ఉపదేశించాడు. ఆ పంచశిఖుడి బోధ జనకుడిపై తన ప్రభావం నెరపి, అతడిని నిజంగానే విరక్తుడిని చేసింది. అందువలననే జనకుడు తన నగరం మిథిల కాలిపోతూ ఉంటే, తాను దుఃఖానికి దూరంగా నిలిచి తన కేమీ కాల్పు అంటదని పలికాడు.

క. అమలం బగు నీ యితిహా । సము భక్తిఁ బఠించినం బ్రశాంతి యొలసి దుఃఖములం దొఱఁగి మనుష్యుం । డమృతత్వావాప్తి మహితుఁడై వెలుఁగొందున్.' 360

ప్రతిపదార్థం: మనుష్యుండు= నరుడు; అమలంబు+అగు= మలినంలేనిదైన; ఈ ఇతిహాసము= ఈ వృత్తాంతం; భక్తిన్= భక్తితో; పఠించినన్= చదివితే; ప్రశాంతి= మిక్కిలి శాంతి; ఒలసి= కలిగి; దుఃఖములన్+తొఱఁగి= ఖేదాలను వదలి; అమృతత్వ+అవాప్తి మహితుఁడు+ఐ= మృత్యువులేనితనం లభించటంతో పూజ్యుడై; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: నిర్మలమైన ఈ వృత్తాంతాన్ని భక్తితో పఠిస్తే, నరుడికి మనశ్శాంతి ప్రాప్తిస్తుంది. దుఃఖాలు తొలగిపోతాయి. తుదకు మరణంలేని ముక్తిని కూడా పొంది పూజ్యుడై అతడు లోకాన వెలుగొందుతాడు'.

వ. అనిన విని ధర్మతనయుండు దేవవ్రతుతో 'నెట్టివాఁడు సుఖియును మంగళవంతుండును నిర్భయుండునునై వర్తించు?' నని యడిగిన నప్పుడమిఱేని కప్పురుషవరుం డిట్లను 'దమసంపన్నునకు నీ చెప్పిన చందంబుగలుగు నాకర్ణింపుము. 361

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; దేవవ్రతుతోన్= భీష్ముడితో; ఎట్టివాఁడు= ఏ విధమైన నరుడు; సుఖియును= సుఖంకలవాడూ; మంగళవంతుండును= శుభంకలవాడూ; నిర్+భయుండును= భయంలేనివాడూ; ఐ వర్తించున్= అయి ప్రవర్తిస్తాడు - జీవిస్తాడు; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజునకు; ఆ+పురుషవరుండు= ఆ నరశ్రేష్ఠుడు - భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; దమసంపన్నునకున్= ఇంద్రియనిగ్రహం కలవాడికి; నీ చెప్పిన చందంబు= నీవు పలికిన విధం - సుఖం శుభం కలిగి నిర్భయంగా జీవించగల లక్షణం; కలుగున్= ఉంటుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పితామహుడి పలుకులు విన్న ధర్మరాజు మరొక ప్రశ్న అడిగాడు. 'ఎట్టివాడు సుఖంతోనూ, శుభంతోనూ కూడి నిర్భయుడై జీవించగలడు?' అని. ఆ ప్రశ్నకు భీష్ముడు ధర్మజుడితో, 'దాంతి - ఇంద్రియ నిగ్రహం కలవాడు నీ ప్రశ్నకు సమాధానంగా నిలుస్తాడు. వినుమంటూ తన ప్రవచనాన్ని కొనసాగించాడు.

తే. సర్వవర్ణాశ్రమములకు శమము దమముఁ । గలిగియునికి విశిష్ట ప్రకార మగుట బ్రాహ్మణునకు విశేషించి రాజవర్య! । దమసమాహిత వృత్తి పెద్దయును వలయు. 362

ప్రతిపదార్థం: రాజవర్య!= ఓ రాజశ్రేష్ఠా!; సర్వ వర్ణ+ఆశ్రమములకున్= ఎల్ల వర్ణములకు - బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు; ఎల్ల ఆశ్రమములకు - బ్రహ్మచర్య, గృహస్థ వానప్రస్థ సన్న్యాస ఆశ్రమవాసులకు; శమము= శాంతి; దమము= నిగ్రహం; కలిగి+ఉనికి= కలిగి ఉండటం; విశిష్ట ప్రకారము+అగుటన్= విశేషంతో కూడిన పద్ధతి కాబట్టి; విశేషించి= అధికంగా; బ్రాహ్మణునకున్= బ్రాహ్మణవర్ణజునకు; దమసమాహిత వృత్తి= దమంతో - నిగ్రహంతో సమాధానసహితమైన నడత; పెద్దయును= ఎక్కువగా; వలయున్= కావాలి.

తాత్పర్యం: లోకంలో అన్ని వర్ణాలవారికీ, అన్ని ఆశ్రమాలవారికీ శాంతి, దాంతి కలిగి ఉండటం విశిష్ట పద్ధతి. విశేషించి బ్రాహ్మణులకు దాంతితోడి జీవనవిధానం ఎక్కువగా కావలసి ఉంటుంది.

వ. దమంబు సద్గుణంబులరాశి; యవి యెయ్యవి? యంటేని. 363

ప్రతిపదార్థం: దమంబు= నిగ్రహంబు; సత్+గుణంబుల రాశి= మంచి గుణాల ప్రోవు; అవి= ఆ సద్గుణాలు; ఏ+అవి?= ఏవి? అంటి(వి)+ఏని= అంటివేని - అంటే.

తాత్పర్యం: దమ మొక్కటి సద్గుణాల ప్రోవు. ఆ సద్గుణాలు ఏమిటి? - అంటావా? (వినుము.)

సీ. శౌచ, మక్రోధంబు, సంతోష, మార్జవ, । మనసూయ, విగతదైన్యత్వవృత్తి,
యప్రమాదంబు, దురభిమానరాహిత్య, । మతివాదవర్జన, మఖిలభూత
దయ, గురుపూజ, నిందాస్తుతి ప్రవణతా । త్యాగం, బపైశునత్వంబు, సాధు
జనసంగమం, బమృషాభాషణంబు, ని । స్పృహత, యహింస, సుశీలభావ,

తే. మింద్రియగ్రామజయ మివి యెల్ల దమము । నాకృతులు; వీనిఁ గల పుణ్యుఁ డభయుఁ డైహి
కములవలనను నాముష్మికముల వలన । శాంతిమంగళ నిధి బోధ సౌమ్యమూర్తి.' 364

ప్రతిపదార్థం: శౌచము= శుచిత్వం - పరిశుభ్రత; అక్రోధము= కోపం లేకుండటం; సంతోషము= ఆనందం; ఆర్జవము= ఋజుభావం - కపటంలేమి; న+అసూయ) అనసూయ= అసూయ - ఈర్ష్యలేకుండటం; విగత దైన్యత్వ వృత్తి= పోయిన దీనత్వంతోడి జీవనం- దైన్యంలేని బ్రదుకు; అప్రమాదంబు= పరాకు లేకుండటం; దుర్+అభిమాన రాహిత్యము= చెడు అభిమానం లేకుండటం; అతివాద వర్జనము= ఎక్కువ మాట్లాడటం మానటం; అఖిలభూతదయ= ఎల్లప్రాణులయెడ దయ; గురుపూజ= పెద్దలయెడ గౌరవం; నిందాస్తుతి ప్రవణతా త్యాగంబు= నిందయందుగాని, స్తోత్రమునందుగాని ఆసక్తుడై ఉండటాన్ని వదలటం - ఎక్కువగా తెగడటం పొగడటం రెండూ మానటం; అపైశునత్వంబు= కొండెములు చెప్పే గుణం లేకుండటం; సాధుజన సంగమంబు= సజ్జనుల తోడి కలయిక; అమృషాభాషణంబు= అబద్ధములాడకుండటం; నిస్పృహత= ఆశ లేకుండటం; అహింస= హింస లేకుండటం; సుశీల భావము= మంచి సహజ స్వభావం; ఇంద్రియ గ్రామజయము= ఇంద్రియాల సమూహమును జయించటం; ఇవి+ఎల్లన్= ఇవి అన్నీ; దమము+ఆకృతులు= దమముయొక్క ఆకారాలు - స్వరూపాలు; వీనిన్= ఈ సద్గుణాలను; కల పుణ్యుఁడు= కలిగిన ధన్యజీవి; ఐహికముల వలనను= ఇహలోకానికి చెందిన విషయాల నుండిగాని; ఆముష్మికముల వలనను= పరలోకానికి చెందిన విషయాలనుండి గాని; అభయుఁడు= భయంలేనివాడు; శాంతి మంగళ నిధి= శాంతికీ, శుభానికీ స్థానమైనవాడు; బోధసౌమ్యమూర్తి= జ్ఞానంవలన ప్రశాంతమైన ఆకారం కలవాడు.

తాత్పర్యం: దమము అనే ఒక్క లక్షణంలో ఎన్నో సద్గుణాలు ఇమిడిపోతాయి. ఆ సద్గుణాలు ఇవి: పరిశుభ్రత- బయటి లోపలి మలినాలు తొలగించుకొనటం, కోపంలేకుండా, కపటమూ అసూయా లేకుండా దైన్యానికి దూరంగా జీవించటం, పరాకుపడటం దురభిమానం అధికప్రసంగం - వీటిని త్యజించటం, ఎల్ల ప్రాణులయెడ దయ, పెద్దలయెడ గౌరవం కలిగి ఉండటం, నిందించటం స్తుతించటంలలో నిమగ్నుడు కాకపోవటం, కొండెములు చెప్పకుండా ఉండటం, సజ్జనసాంగత్యం చేయటం, అబద్ధాలు ఆడకుండటం, ఆశలకు లోనుగాక, హింసకు పాల్పడక, మంచి శీలం కలిగి ఉండటం, ఇంద్రియాలను జయించటం - ఇవన్నీ వాస్తవానికి దమముయొక్క రూపాంతరాలే. ఈ లక్షణాలు గల ధన్యజీవికి ఇహలోక విషయాలవలనగాని, పరలోక విషయాల వలనగాని ఎట్టి భయమూ ఉండదు, ఏర్పడదు. అతడు శాంతికీ శుభానికీ నిలయమైనవాడు. జ్ఞానంవలన సౌమ్యమైన ఆకారంతో వెలుగొందేవాడు'.

విశేషం: దమధాతుజన్యమైన కృదన్త రూపమిది. ఆ ధాతువునకు అణచుట అని అర్థం. ఇంద్రియాలను అణచుట దమమౌతుంది. ఇంద్రియ విజయమొకటి సిద్ధిస్తే సకల సద్గుణాలూ లభించినట్లే.

వ. అనినం బితామహునితోఁ బాండవేయాగ్రజుండు 'వ్రతస్థు లొక్కొక్కయెడ భోజనంబులు సేయుదురు. వారలకు వ్రతహానిలేకుండునే?' యని యడిగిన నతనితో నతండు. 365

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; పితామహునితోన్= తాతతో; పాండవేయ+అగ్రజుండు= పాండుతనయులలో పెద్దవాడు-ధర్మరాజు; వ్రతస్థులు= వ్రతంలో ఉన్నవారు; ఒక్క+ఒక్క+ఎడన్= ఒక్కొక్కచోట, ఒక్కొక్క సమయాన; భోజనంబులు+చేయుదురు= భుజించుటలు చేస్తారు; వారలకున్= ఆ విధంగా వ్రతంలో ఉండీ భోజనాలు చేసేవారలకు; వ్రతహాని= వ్రత భంగం; లేక+ఉండును+ఏ?= లేకుండా ఉంటుందా?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనితోన్= ఆ ధర్మజుడితో; అతండు= ఆ భీష్ముడు (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధర్మరాజు 'దమవంతుడు సకల సద్గుణరాశి' అని భీష్ముడినుండి విన్న పిదప, పితామహుడిని 'వ్రత నిర్వహణంలో ఉండి కూడా కొందరు అపుడపుడు అక్కడక్కడ భోజనాలు చేస్తూ ఉంటారు. వారికి వ్రతభంగం వాటిల్లదా?' అని ప్రశ్నించగా, దానికి సమాధానంగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

తే. 'వినుము విప్రకామార్థ భోజనములోను । గాఁగఁ గలుగు వేదోక్త ప్రకార భోజ
నములు వ్రతహాని సేయవు నరవరేణ్య!' । యని నిరూపించి పలికి యిట్లనియె మఱియు. 366

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; విప్రకామ+అర్థభోజనము= బ్రాహ్మణుడి కోరికయే ప్రయోజనంగా గల భోజనం - గృహస్థుడి కోర్కెతీర్చడానికై చేసే భోజనం; లోనుగాఁగన్= లోనైన - మొదలయిన; కలుగువేద+ఉక్త ప్రకార భోజనములు= ఉన్న, వేదంలో చెప్పబడ్డ విధానంగల భోజనాలు - వేదానుమతమైన భోజనాలూ; వ్రతహాని+చేయవు= వ్రతభంగం చేయవు - కలిగించవు; అని= అంటూ; నిరూపించి= నిరూపణ చూపి; పలికి= చెప్పి; మఱియున్= ఇంకనూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'విప్రుల కోరికమేర చేసే భోజనాలూ, ఇంకా ఇటువంటివే అయిన వేదోక్తాలయిన భోజనాలూ వ్రతస్థులు చేసినా, వాటివలన వ్రతహాని జరుగదు' అని గట్టిగా ప్రకటించి, భీష్ముడు ఇంకా ఈ విధంగా ప్రవచించాడు.

వ. 'సదోపవాసియు, సదాబ్రహ్మచారియు, నమాంసభోజియు, విఘసాశనుండును, నమృతాశియు, నస్వప్నుండునుం గావలయుఁ దత్స్వరూపంబు లెట్టి వంటేని. 367

ప్రతిపదార్థం: సదా+ఉపవాసియున్= ఎల్లప్పుడూ ఉపవసించేవాడూ; సదాబ్రహ్మచారియున్= ఎల్లప్పుడూ బ్రహ్మచర్య వ్రతం పాటించేవాడూ; అమాంస భోజియున్= మాంసం భుజించనివాడూ; విఘస+అశనుండును= దేవతల అతిథుల భుక్తశేషాన్ని తినేవాడూ; అమృత+ఆశియును= అమృతమును తినేవాడూ; అస్వప్నుఁడునున్= నిదురలేనివాడునూ; కావలయున్= కావాలి (నరుడు-సాధకుడు); తద్+స్వరూపంబులు+ఎట్టివి?= వారి ఆకారాలు ఏవిధమైనవి; అంటి(వి)+ఏనిన్= అంటివేని - అన్నచో.

తాత్పర్యం: మోక్షార్థియైన సాధకుడు, సదా ఉపవాసిగా బ్రహ్మచారిగా ఉండాలి. మాంసాన్ని భుజించనివాడుగా, దేవతల అతిథుల భుక్తశేషాన్ని భుజించేవాడుగా, అమృతాన్ని భుజించేవాడుగా కూడా ఉండాలి. నిదురపోనివాడుగా కూడా ఉండాలి. వీరి స్వరూపాలు ఏ విధంగా ఉంటాయి? అని అడుగబోతున్నావా? (వినుము).

సీ. 'ఇరు ప్రొద్దు గుడుచుచు నెడనెడఁ గుడవక । యుండునాతండు సదోపవాసి;
ఋతుకాలమున నాత్మసతియంద రతిసల్పు । భవ్యశీలుఁడు సదా బ్రహ్మచారి;
దేవ పిత్రతిథి పూజావిధులం దిడి । మఱి నంజు పురుషుఁ డమాంస భోజి;
దనయట్లు పంక్తివారును భుజింప భుజించు । నంచితాత్ముఁడు విఘసాశనుండు;

తే. భృత్య వర్గంబు గుడిచిన పిదపఁ గుడుచు । నాతఁ డమృతాశి; దివసంబునందు నిదుర
వోని పుణ్యుఁడస్వప్నుఁ; డిప్పాలములగు మ । హాధిక వ్రతములు దేహ బాధకములు.' 368

ప్రతిపదార్థం: ఇరుప్రొద్దు= రెండు పూటల; కుడుచుచున్= తింటూ; ఎడన్+ఎడన్= మధ్య మధ్య; కుడువక= తినక; ఉండు+ఆతండు= ఉండేవాడు; సదా+ఉపవాసి= నిత్యోపవాసి - ఎప్పుడూ ఉపవసించేవాడే; ఋతుకాలమునన్= ఋతుమతి అయినపుడు; ఆత్మసతియందున్= తన భార్యయందు; రతి+చల్పు= సంభోగంచేసే; భవ్యశీలుఁడు= ఉత్తమ స్వభావంకలవాడు; సదాబ్రహ్మచారి= నిత్యబ్రహ్మచారి; దేవ పితృ+అతిథి పూజా విధులందున్= దేవతల పితరుల అతిథుల పూజాకార్యాలలో; ఇడి= ఉంచి; మఱి= తరువాత; నంజు పురుషుఁడు= తినే నరుడు; అమాంస భోజి= మాంసం భుజించనివాడు; తన+అట్లు= తనవలెనే; పంక్తివారును= బంతిలోనివారూ - తనతో కూర్చొని భుజించేవారుకూడా; భుజింపన్= తినగా; భుజించు+అంచిత+ఆత్ముఁడు= తినే మంచి మనస్సు కలవాడు; విఘస+అశనుండు= దేవభుక్తశేషాన్ని భుజించేవాడు; భృత్యవర్గంబు= సేవకుల సమూహం; కుడిచిన పిదపన్= తిన్న తరువాత; కుడుచు+ఆతఁడు= తినేవాడు; అమృతాశి= అమృతం భుజించేవాడు; దివసంబునందున్= పగటివేళ; నిదుర+పోని పుణ్యుఁడు= నిద్రపోని ధన్యుడు; అస్వప్నుఁడు= నిద్రపోనివాడు; ఈ+పాలములు+అగు= అ విధాలయిన; మహా+అధిక వ్రతములు= గొప్ప పెద్ద వ్రతాలు; దేహబాధకములు= శరీరాన్ని బాధించేవి.

తాత్పర్యం: రోజుకు రెండు పూటల మాత్రం భోజనంచేస్తూ మధ్యమధ్య ఏమీ తిననివాడు సదోపవాసి, ఋతుకాలాన మాత్రం ధర్మపత్నితో సంగమించే సచ్ఛీలుడు సదాబ్రహ్మచారి, దేవతల పితరుల అతిథులకొరకు వండి వడ్డించి ఆ పిదప మాత్రం భుజించేవాడు అమాంసభోజి. తనతో తన పంక్తిని వారు కూడా ఆరగిస్తుండే వారివలెనే సమానంగా మాత్రమే భుజించేవాడు విఘసాశనుడు - భుక్తశేషభోజి. సేవకులందరూ భుజించిన తరువాత మాత్రమే తాను భుజించే పుణ్యాత్ముడు అమృతాశి. పగటిపూట నిద్రపోనివాడు అస్వప్నుడు - నిద్రపోనివాడు ఇటువంటివారి మహా వ్రతాలన్నీ శరీరబాధకాలే'.

ఇంద్ర ప్రహ్లాద సంవాద ప్రకారము (సం. 12-212-3)

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితోడఁ 'గర్మంబులు సంస్కారయోగంబున శుభాశుభంబులం బురుషుం బొందించు వానికిం గర్త యప్పురుషుండ యగుట గాకుండుట నిశ్చయింపరాకుండు. నాకేర్పడం జెప్పవే?' యనుటయు నప్పుణ్యుం డక్కురువరేణ్యున కిట్లను 'నింద్ర ప్రహ్లాద సంవాద సమాకర్ణనంబున నది దేటపడు నాకర్ణింపుము. సత్వస్థుండును, సంయమనిరతుండును, ననహంకారుండును, నమర్షక్రోధ దూరుండును, దుల్యనిందాస్తుతియును, సమలోష్టకాంచనుండును, నారాయణధ్యాన పరాయణుండును నగు ప్రహ్లాదుం డొక్కయెడ నొక్కరుండ యాసీనుండై యుండ నింద్రుం డతని యంతరంగం బారయ వేఁడి చేరంబోయి. 369

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో పెద్దవాడు - ధర్మజుడు; శాంతనవునితోడన్= శంతనుడి కుమారుడితో - భీష్ముడితో; కర్మంబులు= కర్మలు-నరులు చేసే అన్ని పనులూ; సంస్కారయోగంబునన్= పూర్వానుభవపు కలయికతో; శుభ+అశుభంబులన్= మంచిచెడులను; పురుషున్= నరుని; పొందించున్= ప్రాప్తింపజేస్తాయి - పొందజేస్తాయి; వానికిన్= ఆ కర్మలకు; కర్త= చేసేవాడు; ఆ+పురుషుండు+అ= ఆ నరుడే; అగుట+కాక+ఉండుట= కావటం, కాకపోవటం; నిశ్చయింపన్+రాక+ఉండున్= నిర్ణయించ (వీలు) కాకుండా ఉంటుంది; నాకున్= సందేహంతో ఉన్న నాకు; ఏర్పడన్+చెప్పవే?= స్పష్టంగా తెల్పవా?; అనుటయున్= అన్న తరువాత; ఆ+పుణ్యుండు= ఆ పుణ్యాత్ముడు- భీష్ముడు; ఆ+కురువరేణ్యునకున్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఇంద్రప్రహ్లాద సంవాద సమ్+ఆకర్ణనంబునన్=

ఇంద్రుడి ప్రహ్లాదుడి సంభాషణమును బాగుగా వినటంవలన; అది= నీ వడిగిన సందేహం; తేటపడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము; సత్త్వస్థుండును= సత్త్వగుణమున ఉన్నవాడును; సంయమ నిరతుండును= నిగ్రహమునందు ఆసక్తుడును; న+అహంకారుండును= అహంకార రహితుడును; అమర్షక్రోధ దూరుండును= అసహనం తీవ్ర కోపములకు దూరమైనవాడును; తుల్యనిందాస్తుతియును= సమానమైన తెగడుట పొగడుటలు గలవాడును; సమలోష్టకాంచనుండును= సమానమైన మట్టిగడ్డ, బంగారం కలవాడును; నారాయణధ్యాన పరాయణుండును= విష్ణుమూర్తిని ధ్యానించటంలో ఆసక్తుడైనవాడూ; అగు= అయిన; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడు - హిరణ్యకశిపుడి తనయుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; ఒక్కరుండు+అ= ఒక్కడే; ఆసీనుండు+ఐ+ఉండన్= కూర్చొన్నవాడై ఉండగా; ఇంద్రుండు= ఇంద్రుడనే దేవతలరాజు; అతని+అంతర్+అంగంబు= ఆ ప్రహ్లాదుడి మనస్సును; ఆరయన్= పరిశీలించుటకు; వేఁడి= అర్థించి; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మసూక్ష్మాలు పితామహుడినుండి విన్న తరువాత, ధర్మరాజు భీష్ముడిని ఒక జటిల ప్రశ్నవేశాడు. 'కర్మలు, సంస్కారవశాన నరుడికి మంచిచెడులు కలిగిస్తూ ఉంటాయి. అయినప్పుడు ఆ కర్మలకు కర్త నరు డౌనో కాడో నిర్ణయించలేకుండా ఉన్నాను. నాకు స్పష్టంగా నిస్సందేహంగా తెలుపవా?' అని అర్థించాడు. దానికి బదులుగా భీష్ముడు ధర్మజుడితో 'ఇంద్రప్రహ్లాద సంభాషణమనే వృత్తాంతాన్ని వింటే నీ సందేహం తీరుతుంది. విను'మంటూ ఆ వృత్తాంతాన్ని వివరించటం ప్రారంభించాడు. 'సత్త్వగుణంలో నిలిచి ఉన్నవాడూ, నిగ్రహశీలుడూ, అహంకార రహితుడూ అసహనాన్ని క్రోధాన్ని దూరీకరించినవాడూ, తెగడ్తలను పొగడ్తలను సమంగా భావించేవాడూ, మట్టిబెడ్డను బంగారాన్ని ఒకటిగా చూచేవాడు, విష్ణుమూర్తిధ్యానమగ్నుడూ అయిన ప్రహ్లాదుడు ఒకచోట ఒంటరిగా కూర్చొని ఉండగా, ఇంద్రుడు అతడి మనస్సును పరిశీలించి పరీక్షించే సంకల్పంతో, కోరి అతడిని చేరి.

క. 'సంపద లేమికి మది శో । కింపవు; శత్రువుల చేతికిని లోనగు టూ
హింపవు; నీ కూరకునికి । పెంపని పాటించె; దిట్టి బేలవు గదవే!' 370

ప్రతిపదార్థం: సంపద లేమికిన్= సంపత్తి లేకపోవటానికి; మదిన్= మనస్సున; శోకింపవు= ఏడ్వవు; శత్రువులచేతికిని= విరోధుల చేతికి కూడా; లోను+అగుట= లొంగిపోవటం; ఊహింపవు= తలంచవు; ఊరక+ఉనికి= నిష్క్రియగా - ఏ పనీ పాటూ లేకుండా ఉండుట; నీకున్= ఒంటరివైన నీకు; పెంపు+అని= ఎక్కువ అని - మేలని; పాటించెదు= గ్రహిస్తావు; ఇట్టి బేలవు+కదవే!= ఇంతటి వెర్రివాడవు అయినావే!

తాత్పర్యం: 'సంపదలు లేవు నీకు. అయినా దుఃఖించవు, శత్రువులచేతికి లొంగిపోతానని, అయినా ఆలోచించవు. ఉపేక్షాభావంతో ఊరక ఉండటమే నీకు మేలని గ్రహిస్తావు. ఇంత అమాయకుడవు అయినా వేమిటి? ఈ నిష్క్రియత్వ మెందుకు?'

వ. అనిన విని హిరణ్యకశిపునందనుం డప్పురందరున కిట్లనియె. 371

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; హిరణ్య కశిపు నందనుండు= హిరణ్యకశిపుడి తనయుడు - ప్రహ్లాదుడు; ఆ+పురందరునకున్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దీనికి ప్రహ్లాదుడు ఇంద్రుడికి ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

ఆ. 'కలిమిలేమి యనఁగఁగల వొకరెం డవి । యత్నగౌరవము వియత్నతయును
గలుగ వచ్చు ననుట గాదది సూ బేల । తనము వినుము తెలియ ననిమిషేంద్ర! 372

ప్రతిపదార్థం: అనిమిష+ఇంద్ర!= దేవతల రాజా!; తెలియన్= తెలియునట్లుగా; వినుము= ఆలకించుము; కలిమిలేమి+అనఁగన్= కలుగుట, కలుగకుండుట అనే; ఒక రెండు= ఒక రెండు ((క్రియలు); కలవు= ఉన్నవి; అవి= ఆ కలిమిలేములు (ఏవి? అంటే); యత్నగౌరవము వియత్నతయును= ప్రయత్నమనే బరువు, ప్రయత్నంలేకుండటం (అంతేగాని సంపద - దారిద్ర్యం కావు - కలిమిలేములకు అర్థాలు); కలుగన్= ప్రయత్నముంటే; వచ్చును+అనుట= (కలిమి) సిద్ధిస్తుంది అనటం; కాదు= కుదురదు- చెల్లదు; అది= యత్నిస్తే వస్తుంది అనుట; బేలతనము సూ= అమాయకత్వం - మౌఢ్యము సుమా!

తాత్పర్యం: ఓ దేవతలరాజా! కలిమిలేముల గురించి ప్రసంగించావు. అది సరిగాదు. నిజానికి కలిమి, లేమి- అనేవి రెండూ లోకాన ఉన్నాయి. కలిమి - ఉండుట - ప్రయత్నముండుట; లేమి - లేకుండుట - ప్రయత్నం లేకుండుట- అనేవే అవి. అయితే యత్న మున్నంత మాత్రాన సంపద సిద్ధిస్తుంది అనటానికి వీలులేదు. ఆ విధంగా అనటమే బేలతన మౌతుంది సుమా!

విశేషం: ఇంద్రుడు ప్రహ్లాదుడిని 'బేలవు - తెలియని మూఢుడవు లేక అమాయకుడవు' అంటే, ప్రహ్లాదుడు తిరిగి ఇంద్రుడిని అదే పదం ప్రయోగించి బోధిస్తూ అతడి మౌఢ్యాన్ని అతడికి ఎరుకపరుస్తున్నట్లున్నాడు. 'నిజమైన బేలతనం నీదే సుమా!' అని హెచ్చరిస్తున్నాడు.

క. తేరక యుండఁగఁ జేరుం । దేరంగాఁ బొలియు విధి యధీనంబులు గా
కారయ విత్తంబులు పురు । షారంభాయత్తములె? మహా బుద్ధినిధీ! 373

ప్రతిపదార్థం: మహాబుద్ధినిధీ!= గొప్ప ధీశక్తికి నిధానమైనవాడా! ఇంద్రా!; విత్తంబులు= సంపదలు; తేరక+ఉండఁగన్= తేకుండా- తీసికొనిరాకుండా ఉంటే; చేరున్= కూడతాయి; తేరంగాన్= తేగా, తీసికొనిరాగా; పొలియున్= నశిస్తాయి; ఆరయన్= పరిశీలించగా; విధి+అధీనంబులు+కాక= విధికి లొంగినవిగాకుండా; పురుష+ఆరంభ+ఆయత్తములు+ఎ?= పురుష ప్రయత్నానికిలొంగేనా?

తాత్పర్యం: ఓ మహాధీశాలీ! ఇంద్రా! సంపదలు యత్నించి ఆర్జించకున్నా తమంత తాముగా వచ్చి పడతాయి. ప్రయత్నించి సమార్జించి తెచ్చి ఉంచితే ఊరక నశించిపోతాయి. కాబట్టి పరిశీలించి చూస్తే అవి విధికి లొంగి ఉండేవేగాని నరుడి ప్రయత్నానికి లొంగినవి మాత్రం కావు.

క. శత్రుజనులు చెఱుచుటయును, । మిత్రులు బ్రతికించుటయును మిన్నక యాప
త్పాత్రతయును సంపదయు వి । ధాతృఁడు సంధించుఁ జూవె తఱితోఁ బురుషున్. 374

ప్రతిపదార్థం: శత్రుజనులు= విరోధి నరులు; చెఱుచుటయున్= చెడునట్లు చేయటం - నశింపజేయటం; మిత్రులు=స్నేహితులు; బ్రతికించుటయును= బ్రతికేటట్లు చేయటం - క్షేమాలు కలిగించటం; మిన్నక= ఊరక- అనుకొనకుండా - నిష్కారణంగా; ఆపద్+పాత్రతయును= ఆపదలకు కష్టనష్టాలకు పాత్రమవటం; సంపదయును= (ఊరకనే) సంపత్తి కలగటం - ఇవి అన్నీ; తఱితోన్= సమయంతో - కాలంతో; పురుషున్= నరుడిని; విధాతృఁడు= చేసేవాడు- బ్రహ్మదేవుడు; సంధించున్+చూచె!= కలుపుతాడుసుమా!

తాత్పర్యం: జీవితంలో నరుడికి అనేక ఆనంద ఖేదకర సంఘటనలు ఎదురౌతూ ఉంటాయి. మిత్రులు శుభాలు గలిగిస్తుంటే, శత్రువులు నాశనాలు కలిగిస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి ఊరకనే తన ప్రమేయ మేమీ లేకుండానే నరుడిమీద కష్టనష్టాలు వచ్చి పడతాయి. ఆ విధంగానే సుఖసంతోషాలూ హఠాత్తుగా మానవుడిని ముంచెత్తుతుంటాయి. ఇవన్నీ ఈ విధంగా ఎందుకు జరుగుతున్నాయి? ఎవరు జరిపిస్తారు? ఆయా సహాయం సమీపించినపుడు స్వయంగా విధాతే నరుడికి ఆయా ఖేదమోదాలతో, ఆపత్సంపదలతో, పరాజయవిజయాలతో సంధానం కుదురుస్తూ ఉంటాడు. ఇదంతా ఆయన ఆడించే ఆట తప్ప అన్యం కాదు.

విశేషం: ఈ పద్యంలో ప్రాసమైత్రి విశేషం గమనించదగినది. సంయుక్తాక్షరమైన 'త్ర'కును, 'తృ'కును ప్రాసమైత్రి చెల్లింపబడినది. ఇది 'సంయుతాసంయుతప్రాసము. రేఫ లకారములతో ఏర్పడినప్పుడే చెల్లుతుంది. 'పాఁడి ద్రచ్చఁగ నిమ్ము నా తండ్రి కృష్ణ వేఁడుకొనియెద నందాఁకఁ బండ్లు దినుము.'

ఆ. భావములు నిజస్వభావంబునన తోఁచు । నడఁగునట్లు గాన యస్థిరతకు
నెలవు లని యెఱుంగ నేర్చిన భావంబు । లందుఁ దగులు నెట్లు డెంద మనఘ! 375

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా -సురేంద్రా!; భావములు= అభిప్రాయాలు - మనోవికారాలు; నిజస్వభావమునను+అ= తన స్వభావమునందే; తోఁచున్= పుట్టుతాయి; అడఁగున్= నశిస్తాయి; అట్లు+కానన్= ఆ విధము కాబట్టి (భావాలు); అస్థిరతకున్= చంచలత్వానికి - నిలకడలేనితనానికి; నెలవులు+ఐ= స్థానాలు అని; ఎఱుంగ నేర్చినన్= తెలిసికొనగలిగితే; డెందము= మనస్సు; భావంబులందున్= భావాలలో - మనస్సులో నుండే కలిగే అభిప్రాయాలలో; ఎట్లు= ఏ విధంగా; తగులున్= తగుల్కొంటుంది?-చిక్కుకొంటుంది? (తగుల్కొనదు.)

తాత్పర్యం: కర్మలకు పూర్వరూపాలయిన భావాలు నరుడి స్వభావం లోపలినుండి పుట్టుకొస్తున్నాయి. మళ్ళీ ఆ స్వభావంలోనే కలిసి నశించిపోతున్నాయి. కాబట్టి ఈ మనోవికారరూపమైన భావాలకు నిలకడ ఉండదు. అవి చంచలత్వానికి నెలవులు. ఈ విషయం గ్రహించగలిగితే, ఇక నరుడి మనస్సు భావాలలో ఎందుకుతగుల్కొంటుంది? ఆ గ్రహింపు లేకపోవటం వలననే మనస్సు, భావాలు ఆడించినట్లు ఆడుతున్నది గాని, లేకపోతే, మనస్సు నిగ్రహంతో ఉండగలుగుతుంది.

ఆ. ఏను గర్త ననుట యెఱుఁగమి దాఁ గర్త । యేని నేమి ఫలము నెడలకుండ
నఖిలకర్మములును నాచరించుచు నున్న । వాఁడె కాన కర్తగాఁడు దాను.' 376

ప్రతిపదార్థం: ఏను= నేను; కర్తను+అనుట= చేసేవాడను అనటం; ఎఱుఁగమి= అజ్ఞానం; తాన్= తాను (నరుడు); కర్త+ఏనిన్= చేసేవాడైతే; ఏమిఫలమున్= ఏ ఫలితమూ - ఏ ప్రయోజనమూ; ఎడలకుండన్= క్రింద పడకుండా - ఏర్పడకుండానే; అఖిల కర్మములును= ఎల్ల కర్మలను (విడువకుండా); ఆచరించుచున్+ఉన్నవాఁడు+ఎ= చేస్తూ ఉన్నవాడే (అయినాడు నరుడు); కాన= కాబట్టి పై కారణంవలన; తాను= నరుడు; కర్త+కాఁడు= చేసేవాడు కాడు; (అనగా చేసేవాడు విధాతే గాని, నరుడుకాదు.)

తాత్పర్యం: నేను కర్తను-అని అనటం అజ్ఞానం. నిజంగా తాను కర్త అయితే ఏ లాభమూ ఏర్పడకుండానే అన్ని పనులనూ చేస్తున్నవాడే కాబట్టి, ఈ కారణంవలన చేసేది అంతా విధాతే అవుతాడు. అంతేగాని నరుడు కానేరడు'

వ. అని పలికి వెండియు. 377

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఆ విధంగా ప్రవచించి, మళ్ళీ (ఆ అంశాన్నే వివరిస్తున్నాడు.)

క. 'అనఘా! విధివిహితంబుం । దన చేతఁగఁ దలఁపఁ ఫలము దగులు నహంకా
ర నిరూఢున కనహం కా । రునకది లేమి ఫలయుక్తిఁ ద్రోవం జాలున్. 378

ప్రతిపదార్థం: అనఘా! ఓ పాపరహితుడవైన దేవేంద్రా!; అహంకార నిరూఢునకున్= అంహకారమున గట్టిపడినవాడికి - అహంకారం గలవాడికి; విధివిహితంబు= విధియొక్క పనిని; తనచేతఁగన్= తన పనిగా; తలఁపన్= తలచగా; ఫలము+తగులున్= ఫలితం

అంటుకొనును; న+అహంకారునకున్= అహంకారం లేనివాడికి; అది= తనచేతగా భావించటం; లేమిన్= లేకపోవటంవలన; ఫలయుక్తిన్= ఫలితము యొక్క కలయికను - చేరికను; త్రోవన్+చాలున్= (అతడు) త్రోసివేయగలుగును.

తాత్పర్యం: ఓ పాప మెరుగని దేవేంద్రా! నరుడు అహంకారిగా జీవించేటప్పుడు, విధిచేష్టితాన్ని కూడా, తన చేతగానే (పనిగానే) భావించి ఆ కర్మఫలితంలో తగుల్కొంటాడు. ఆ తగుల్కొనటానికి అతడి అహంకారమే మూలం. అయితే అహంకారానికి లొంగని నరుడు మాత్రం విధిచేతను తనదిగా భావించడు కాబట్టి, అతడికి ఆ కర్మఫలితాన్ని త్రోసివేసే శక్తి ఉంటుంది. ఆ శక్తి అతడి అనహంకార శీలంవలన లభించింది.

విశేషం: ప్రహ్లాదుడి బోధన ప్రకారం చేష్టితాలు - కర్మలు అన్నీ విధి చేసేవే. అయితే అహంకారి నరుడు తనను కర్తగా భావించుకొని ఫలితాలూ అనుభవిస్తాడు. అనహంకారుడైన నరుడు మాత్రం తద్విరుద్ధంగా కర్తృత్వంతోపాటు ఫలితాన్ని త్రోసి రాజంటాడు.

క. వినుఁ విధికృత్యము లూరక । కనుఁగొనుచును సిద్ధసిద్ధికల్పిత సుఖదుఃఖ నిరూఢిఁ బొందకుండఁగ । మనముం దొలఁగించు వెరవు మహనీయ మగున్. 379

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; విధి కృత్యములు= విధి (చేసే) పనులు; ఊరక= ఉపేక్షాభావంతో, పట్టించుకొనకుండా; కనుఁగొనుచును= చూస్తూ; సిద్ధి+అసిద్ధి కల్పిత సుఖదుఃఖ నిరూఢిన్= నెరవేరటం, నెరవేరకపోవటం వలన (కలిగే) సంతోష ఖేదాల గట్టిదనమును - ఆ సుఖదుఃఖాలను; పొందక+ఉండఁగన్= చెందకుండా ఉండేటట్లుగా; మనమున్= మనస్సును; తొలగించు వెరవు= ప్రక్కకు నెట్టు ఉపాయం; మహనీయము+అగున్= గొప్పది ఔతుంది.

తాత్పర్యం: కర్త విధి కాబట్టి, ఆ విధి చేసే కర్మలను ఉపేక్షాభావంతో ఊరకనే చూస్తూ ఉండాలి. ఆ కర్మలు సిద్ధించినపుడు సుఖాన్నీ, సిద్ధించనపుడు దుఃఖాన్నీ పొందకుండా ఉండటంకొరకు నరుడు తన మనస్సును విషయాలనుండి తొలగించే ఉపాయం కనుగొనాలి. ఆ విధమైన ఉపాయం గొప్పది.

క. కావున భూతానిత్యత । భావించుట యెపుడుఁ గలిగి బంధచ్ఛేద ప్రావీణ్యము సంపరితో । షావహముగ నున్నవాఁడ నమరప్రవరా! 380

ప్రతిపదార్థం: అమర ప్రవరా!= సురశ్రేష్ఠా! దేవేంద్రా!; కావున= కాబట్టి; మనస్సును విషయాల నుండి తొలగించేఉపాయం ఎరిగినవాడను కాబట్టి; ఎపుడున్= ఎల్లప్పుడూ; భూత+అనిత్యతన్= ప్రాణుల అశాశ్వతత్వాన్ని - నశించే స్వభావాన్ని; భావించుట= తలంచటం; కలిగి= ఉండి; బంధచ్ఛేద ప్రావీణ్యము= (భవ) బంధాలను ఛేదించే నేర్పు; సంపరితోష+ఆవహముగన్= మంచిదీ, అధికమైనదీ అయిన ఆనందాన్ని కలిగించేది కాగా; (ఆ నేర్పు కర్త) ఉన్నవాఁడన్= ఉన్నాను - జీవిస్తున్నాను.

తాత్పర్యం: ఓ దేవతల రాజా! నేను మనస్సులో ఎపుడూ సృష్టిలోని ప్రాణి సంఘాల అశాశ్వతత్వాన్ని భావిస్తూ ఉంటాను. ఆ భావన నాలో భవబంధాలను ఛేదించే నేర్పు కలిగించింది. ఆ నేర్పు నాలో నిరంతరమూ అపరిమితమూ అయిన ఆనందాన్ని ఆవిర్భవింపజేస్తూ ఉండగా, నేను ఇట్లా నిలిచి ఉన్నాను.

క. దాంతుఁడుఁ బ్రజ్ఞావంతుఁడు । శాంతుఁడు నగువాని మానసం బాయాస శ్రాంతముగా దెమ్మెయి ని । శ్చింతుఁడనై యుండుదును విశిష్ట విచారా!' 381

ప్రతిపదార్థం: విశిష్ట విచారా!= విశేషించిన ఆలోచనలు కలవాడా! సురేంద్రా!; దాంతుఁడున్= దమము కలవాడు(ఇంద్రియ నిగ్రహం కలవాడు); ప్రజ్ఞావంతుఁడున్= జ్ఞానం కలవాడు; శాంతుఁడున్= శాంతిని పొందినవాడు; అగువాని మానసంబు= అయిన నరుడి

చిత్తం; ఏ+మెయిన్= ఏ విధంగానూ; ఆయాస శ్రాంతము+కాదు= శ్రమతో - పరితాపంతో అలసినది కాదు (కాగా); నిస్+చింతుఁడను+ఐ= చింతలు లేనివాడనై; ఉండుదును= ఉంటాను.

తాత్పర్యం: విశిష్ట ఆలోచనలు గల ఓ దేవతలరాజా! నరుడు దాంతి, శాంతి, ప్రజ్ఞ కలిగినవాడైనపుడు అతడి చిత్తం ఏ విధంగానూ ఆయాసంతో అలసిపోదు. నేను అట్టివాడను కాబట్టి ఈ విధంగా చింతారహితంగా ఉండగలుగుతున్నాను'.

క. అనవుడు ననిమిషపతి 'యే । యనువున నీ శాంతి నీకు నగపడియె మహా
జనపూజ్య!' చెప్పవే? నా । కని యడిగిన నిట్టులనియె నతఁ డాతనితోన్. 382

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న తరువాత; అనిమిషపతి= రెప్పపాటులేనివారి (దేవతల) నేత - ఇంద్రుడు; ఏ+అనువునన్= ఏ ఉపాయంతో; ఈ శాంతి= ఈ విధమైన ప్రశాంతి; నీకున్+అగపడియెన్= నీకు కనిపించినది? - లభించినది?; మహాజనపూజ్య!= గొప్పజనంచేత పూజింప దగ్గవాడా! ప్రహ్లాదా!; నాకున్= అర్థించే నాకు; చెప్పవే;= తెలుపవా?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; ఆతనితోన్= ఆ ఇంద్రుడితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ప్రహ్లాదుడు తన నిశ్చింతతను నిరూపించి తెలుపగా విన్న దేవేంద్రుడు 'ఏ ఉపాయంతో నీకు ఈ ప్రశాంతి లభించింది? ఓ మహాజనపూజ్యా! ప్రహ్లాదా! అర్థినైన నాకు తెలుపవా?' అని వేడగా, ప్రహ్లాదుడు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు.

తే. 'ఆర్జవంబు ప్రసన్నత యాత్మవత్త్వ । మప్రమాదంబు వృద్ధసేవాభినిరతి
మేలుసేయుఁ బ్రజ్ఞాశాంతిశాలి యగుట । కాలపాకంబుతోఁ దాన కలుగు ననఘ!' 383

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! ఇంద్రుడా!; ఆర్జవంబు= ఋజుభావం - నిష్కాపట్యం; ప్రసన్నత= దయగలతనం; ఆత్మవత్త్వము= ఆత్మను కలిగిన తనం; అప్రమాదంబు= పరాకులేనితనం; వృద్ధసేవా+అభినిరతి= పెద్దలను సేవించుటలో మంచి ఆసక్తి - ఈ గుణాలు; మేలు+చేయున్= శ్రేయస్సును కలిగిస్తాయి; ప్రజ్ఞాశాంతిశాలి+అగుట= జ్ఞానంతో శాంతితో ప్రకాశించేవాడు కావటం; కాలపాకంబుతోన్= కాలం పరిపక్వం కావటంతో; తాను+అ= తానే - స్వయంగా; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: 'నిష్కపట మైన ప్రవృత్తి, దయాగుణం, తాను శరీరంగాదు - ఆత్మను అనే భావం, పరాకులేకుండా జాగరూకతతో వ్యవహరించటం, పెద్దల పరిచర్యలలో నిజమైన ఆసక్తి - ఈ సద్గుణాలు నరుడికి శుభాన్ని కలిగిస్తాయి. ఇక జ్ఞానం, శాంతి అనేవి, కాలపరిపాకంతో క్రమంగా తమంత తామే నరుడిలో చోటుచేసికొంటాయి.

విశేషం: నరుడిలో జ్ఞానం, శాంతి సద్యోజాతాలుగా ఏర్పడేవిగావు. అవి కలగటానికి నిజంగా కాలపరిపాకమూ అవసరమే. ఆ రెండూ పరిణతమైన మానవలక్షణాలు. పరిణతి అనేది తప్పనిసరిగా కాలంతో ముడిపడి ఉన్నదే! తొందరపడితే కలిగేవి కావవి. పైగా ఒక విధంగా స్వయంభువులు - తమంతట తాము పొడచూపేవి.

క. అనిన విని విస్మయము నె । మ్మనమునఁ దలకొత్తగా నమరపతి యభివం
దన మొనరించి పొగడుచుం । జనియె నిజావాసమునకు జగతీనాథా!' 384

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధర్మరాజా!; అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; అమరపతి= దేవతలరాజు; నెఱ+మనమునన్= నిండుమనస్సునందు; విస్మయము= ఆశ్చర్యం; తళుకు+ఒత్తగాన్= మెరవగా, ప్రకాశించగా; అభివందనము+ఒనరించి= నమస్కారం చేసి; పొగడుచున్= స్తుతిస్తూ ((ప్రహ్లాదుడిని); నిజ+ఆవాసమునకున్= తన నివాసానికి; చనియెన్= పోయాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రహ్లాదుడి ఆ ప్రవచనాన్ని ఆలకించి, మనస్సున విస్మయం పొడమగా, వినమ్రతతో అతడికి నమస్కరించి, తన నివాసానికి చేరాడు. ధర్మరాజా! ఇదీ ఇంద్రప్రహ్లాద సంవాదం'.

వ. అని చెప్పిన విని యప్పాండవాగ్రజుండు 'భూపాలునకు లక్ష్మీభ్రంశం బేమిటఁ గలుగు?' ననుటయు నయ్యాపగా నందనుం డతని కిట్లనియె. 385

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు-ధర్మజుడు; భూపాలునకున్= రాజకునకు; లక్ష్మీభ్రంశంబు= సిరి జారిపోవటం; ఏమిటన్= ఏ కారణాన; కలుగున్?= జరుగును?; అనుటయున్= అన్న పిదప; ఆ+ఆపగానందనుండు= ఆ నదీతనయుడు - భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రప్రహ్లాద సంవాదప్రకారాన్ని ఆలకించిన ధర్మరాజు పితామహుడితో 'రాజు సిరిని ఏ కారణాన కోల్పోతాడు?' అని ప్రశ్నించాడు. దానికి బదులుగా భీష్ముడు ధర్మజుడితో ఇట్లా పలికాడు.

తే. 'వాసవునకును బలికి సంవాద మనఘ! । కలిగె నయ్యితిహాసంబు గర్ణగోచ
రంబు సేయుము నీ దగు ప్రశ్నమునకు । నుత్తరం బిది సెప్పెదఁ జిత్తమలర. 386

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; వాసవునకును= ఇంద్రుడికీ; బలికిన్= బలిచక్రవర్తికీ; సంవాదము= సంభాషణం; కలిగెన్= ఏర్పడింది; ఆ+ఇతిహాసంబు= ఆ వృత్తాంతం; కర్ణగోచరంబు+చేయుము= (నీ) చెవిని పడేటట్లు చేయుము; నీది+అగు= నీయొక్క; ప్రశ్నమునకున్= ప్రశ్నకు; అది= ఆ ఇంద్ర బలిసంవాదం; ఉత్తరంబు= సమాధానం; చిత్తము= మనస్సు; అలరన్= సంతోషించగా; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: 'మున్ను దేవేంద్రుడికి బలిచక్రవర్తికీ సంవాద మొకటి జరిగింది. ఆ సంవాదప్రకారాన్ని నీవు ఆలకించుము. అది నీ ప్రశ్నకు సమాధానంగా సరిపోతుంది. నేను నీ మనస్సు సంతోషించే విధంగా ఆ వృత్తాంతాన్ని వినిపిస్తాను.

సీ. ఇంద్రుఁ డబ్జజు కడ కేతెంచి వినతుఁడై । 'బలి మహాసంపద వెలుఁగుచుండె;
నితని నిప్పుడు గాన; మాతఁ డెచ్చో నున్న । వాఁడొకో!' యనుడు నవ్వారిజాస
నుండు 'నీతలఁ పాప్పకుండుట యెఱిఁగితి; । నైనను జెప్పెద నసృతవాది
గాకుండుమీ యుష్ట్రఖర గోహయంబుల । యందులో నొక్కటి చంద మొంది

తే. యడఁగి యున్నాడు వధియించు టనుచితంబు । వాని నని పల్కె నటు సేయువాఁడఁ' గాను
మాటవెట్టుదుఁ గన్నచో మాననీయ । వాక్య'యని వీడుకొనియె నవ్వాసవుండు. 387

ప్రతిపదార్థం: ఇంద్రుఁడు= దేవతలరాజు; అబ్జజుకడకున్= బ్రహ్మదేవుడి దగ్గరకు; ఏతెంచి= వచ్చి; వినతుఁడు+ఐ= నమస్కరించినవాడై; బలి= బలిచక్రవర్తి; మహాసంపదన్= గొప్ప సంపత్తితో; వెలుఁగుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉన్నాడు; ఇతనినిన్= ఈ బలిని; ఇప్పుడు= ఈ దినాలలో; కానము= చూడము; ఆతఁడు= ఆ బలి; ఎచ్చోన్= ఏ చోట; ఉన్నవాఁడు+ఒకో!= ఉన్నాడో కదా!; అనుడున్= అన్న తరువాత; ఆ+వారిజాసనుండు= ఆ పద్మాసనుడు - బ్రహ్మ; నీ తలఁపు= నీ ఆలోచన; ఒప్పక+ఉండుట= తగక ఉండటం; ఎఱిఁగితిన్= గ్రహించాను; ఐనను= అయినా - గ్రహించినా; చెప్పెదన్= తెలుపుతాను; న+ఋతవాది= అసత్యం పలికేవాడు; కాక+ఉండుము+ఈ= కాకుండా నిలువుము; ఉష్ట్రఖర గోహయంబుల అందులోన్= ఒంటె, గాడిద, ఆవు, గుర్రముల లోపల; ఒక్కటి చందము= ఒక్కదాని విధం (ఆకారం); ఒంది= పొంది; అడఁగి+ఉన్నాడు= దాగి ఉన్నాడు; వానిన్= అతడిని; వధియించుట= చంపటం; న+ఉచితము= తగినది కాదు; అని పల్కెన్= అని చెప్పాడు; అటు= ఆ విధంగా; చేయువాఁడన్+కాను= చేసేవాడను కాను; మాననీయవాక్య!= గౌరవించవలసిన మాటగలవాడా!; కన్నచోన్= (బలిని)

చూస్తే; మాట+పెట్టుదున్= మాట ఇత్తును - భాషణం చేస్తాను; అని= అని పలికి; ఆ+వాసవుండు= ఆ ఇంద్రుడు; వీడుకొనియెన్= విడిచిపోయాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు బ్రహ్మదేవుడివద్దకు చేరి, నమస్కరించి, 'బలి మహాసంపదతో వెలుగుతూ ఉండేవాడు. ఇపుడు అతడు కనిపించడేమిటి? ఎక్కడ ఉన్నాడో కదా!' అని ప్రశ్నించాడు. దానికి బదులుగా బ్రహ్మ, 'నీ ఆలోచన అనుచితంగా ఉన్నదని నేను గ్రహించాను. అయినా నీకు చెప్పుతాను. అయితే నీవు మాత్రం అసత్యవాదివి కాకుమీ, ఒంటె, గాడిద, ఆవు, గుర్రములలో ఏదో ఒక దాని ఆకారం పొంది అతడు ఇపుడు దాగి ఉంటున్నాడు. అట్టి అతడిని చంపుట తగనిపని' అని పలికాడు. ఇంద్రుడు తాను ఆ విధంగా చేసేవాడను కానని పలుకుతూ, 'ఓ మన్నించదగ్గ మాటలు గల దేవా! నేను బలిని చూస్తే భాషణం మాత్రం చేస్తాను' అని పలికి వీడ్కొనినాడు.

వ. వీడ్కొని చని జగతిం జరియించి యొక్కచోట ఖరరూపంబున సంప్రీతుం డయి యున్న యబ్బలిం గని బలారాతి యిట్లనియె. 388

ప్రతిపదార్థం: వీడ్కొని= వీడ్కోలు పలికి; చని= వెళ్ళి; జగతిన్= లోకాన; చరియించి= తిరిగి; ఒక్కచోటన్= ఒక స్థలాన; ఖరరూపంబునన్= గాడిద ఆకారంతో; సంప్రీతుండు+అయి= బాగుగా సంతసించినవాడై; ఉన్న+ఆ+బలిన్= ఉండిన ఆ బలిచక్రవర్తిని; కని= చూచి; బల+ఆరాతి= ఇంద్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ ఇంద్రుడు వెదకగా ఒకచోట గాడిద రూపంలో సంతుష్టుడైన బలి కనిపించాడు. ఆ బలితో ఇంద్రుడు ఇట్లా అన్నాడు.

ఇంద్ర బలిచక్రవర్తి సంవాదప్రకారము (సం. 12-216-2)

క. 'ఏనుఁగులు సుట్టిరాఁ బే । రేనుఁగుపై మణిమయంపుటెల్లులు మెఱయం
గా నీ వే తెంతువు మముఁ । గానికిఁ గొన వప్పు డిపుడు గాడిదవైతే! 389

ప్రతిపదార్థం: ఏనుఁగులు= పట్టపుటేనుగులు; చుట్టిరాన్= చుట్టూ చేరిరాగా; పేరు+ఏనుఁగుపైన్= పెద్ద ఏనుగుమీద; మణిమయము+ఎల్లులు= మణులతో నిండిన గొడుగులు; మెఱయంగాన్= ప్రకాశించగా; అప్పుడు= నీవు రాజ్య మేలినప్పుడు; నీవు= చక్రవర్తివైన నీవు; ఏతెంతువు= వచ్చెదవు - వస్తూ ఉంటివి; మమున్= దేవతలమైన మమ్ము; కానికిన్= కానీకి కూడా- అత్యల్పమైన నాణెమునకు సమానంగా కూడా; కొనవు= గ్రహించవు; ఇపుడు= ఈ సమయాన; గాడిదవు+ఐతి(వి)+ఏ!= గాడిదవుగా అయ్యావా!

తాత్పర్యం: 'ఓ బలిచక్రవర్తీ! ఒకనాడు నీవు చుట్టూ పట్టపుటేనుగులు రాగా, ఒక మహాగజము నధిరోహించి, మణిమయ చ్ఛత్రచామరాలు వెలుగులు చిమ్ముతూ ఉండగా ఏతెంచేవాడవు. ఆనాడు దేవలోకనివాసులమైన మేము నీకు 'కానీ' కి కొరగాలేదు. అట్టి ఉజ్జ్వలమైన భూతకాలవైభవంగల నీవు ఈనాడు ఈవిధంగా గాడిదగా అయి ఉన్నావా!

క. కనకమయయూప మొప్పఁగ । ననూన విభవమున నీవు యాగం బొనరిం
చిన యొప్పును నిప్పటి నీ । యునికియునుం జూచి నాకు నుమ్మల మయ్యెన్. 390

ప్రతిపదార్థం: నీవు= బలిచక్రవర్తివైన నీవు; కనకమయ యూపము= బంగారపు కట్టుగొయ్య (యజ్ఞసమయాన పశువును కట్టివేసే కొయ్యపేరు యూపము); ఒప్పఁగన్= ప్రకాశించగా; న+ఊన విభవమునన్= అల్పంగాని గొప్పదైన సంపదతో; యాగంబు= యజ్ఞం; ఒనరించిన+ఒప్పును= చేసిన గొప్పదనమును; ఇప్పటి నీ+ఉనికియునున్= ఈ నాటి నీ స్థితినీ; చూచి= (కన్నులారా) కాంచి; నాకున్= దేవతల రాజైన నాకు; ఉమ్మలము+అయ్యెన్= సంతాపము కలిగింది.

తాత్పర్యం: ఆనాడు చక్రవర్తిగా నీవు బంగారు యూపస్తంభంతో గొప్పవైభవం వ్యక్తం కాగా యజ్ఞం నిర్వహించిన ఉజ్జ్వల సంఘటననూ, ఇప్పటి నీ శోచనీయమైన స్థితినీ చూచి నాకు శోకం కలుగుతున్నది.

విశేషం: నరు డెవడైనా, ఒకడి జీవనంలోనే ఊహకందని గొప్ప వ్యత్యాసాలను చూడటం తటస్థిస్తే, అతడిలో భావోద్వేగం సానుభూతి రూపాన తప్పక వ్యక్తమై తీరుతుంది. గౌతమ బుద్ధుడి జీవనంలోని పెద్ద వ్యత్యాసాలే అతడియెడ లోకానికి మొదట కలిగిన అనంత సానుభూతికీ, అనంతర కాలాన ఏర్పడిన ఆదరాభిమానాలకూ మూలమని అనటంలో ఔచిత్యమున్నది.

ఆ. ఉముక దినుచు నిట్టులుండి నీ తొల్లింటి । లీలఁ దలఁచి యుమ్మలింతొ? లేదొ?
యున్నరూపు సెప్ప వన్న! గార్దభరూప । దారుణైకనిపుణ! దానవేంద్ర! 391

ప్రతిపదార్థం: గార్దభరూప దారుణ+ఏక నిపుణ!= గాడిద ఆకారంతో భయంకరుడవైన ఒక్క నేర్పరీ! (ఇతరు లెవరూ ఇంతటి స్థితికి చేరినవారు లేరనుట); దానవ+ఇంద్ర!= రాక్షసుల రాజా! ఓ బలిచక్రవర్తీ!; ఉముక= ఊక - వడ్లమీది పొట్టు; తినుచున్= తింటూ; ఇట్టులు+ఉండి= ఈ విధంగా నీచంగా ఉండి; నీ తొల్లింటి లీలన్= నీ యొక్క పూర్వ వైభవాన్ని; తలఁచి= స్మరించి; ఉమ్మలింతు+ఒ?= శోకిస్తావా?; లేదు+ఒ?= లేదో? - శోకించవో?; ఉన్నరూపు= ఉన్న వాస్తవం - నిజం; చెప్పపు+అన్న= తెలియజేయవయ్యా!.

తాత్పర్యం: గాడిద రూపంతో దారుణంగా కనిపించే ఒకే ఒక్క నేర్పరీ! రాక్షసరాజా! నేడు ఊక తింటూ జీవిస్తున్న నీవు, నీ తొల్లిటి వైభవాన్ని తలచుకొని శోకిస్తూ ఉంటావా? ఉండవా? ఉన్న వాస్తవం యథార్థంగా చెప్పవయ్యా!'

విశేషం: బలిని సంబోధించిన తీరు గమనించవలసి ఉన్నది. 'గార్దభరూపదారుణ' - ఇంతవరకు సామాన్యమే. తరువాతి పదమే విలక్షణము - 'ఏకనిపుణ!' - బలికి ఆధ్యాత్మవిద్యావేత్తలలో పెద్ద పీట ఉన్న వైనాన్ని సూచిస్తున్న దీ పదం.

సీ. అన విని బలి దేవతాధీశుతో 'నీకు । నా విభవంబు గానంగ రాదు;
గుప్తమై యున్నది గుహయందు; నా కిచ్ఛ । వుట్టిన నిప్పుడ పాలిచి తోఁచు;
నది యటులుండె; నీ వధికుండ వల్పుల । యెదుర రజ్జులు వల్కుటేటి పెంపు?
పొమ్ము దుశ్శవన! నీ పోయెడు తెరు' వన్న । నాతండు నవ్వుచు నతనిఁ జూచి

ఆ. మున్ను పల్కినట్ల కన్నోటలేక ప । ల్కుటయు, నతఁడు 'భూతకోటి మంచు
వోలెఁ దోచు విరియు; బుద్ధిమంతులు దాని । కిచ్ఛ వగవ; రింత యెఱుఁగ వెట్లు?' 392

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విని; బలి= బలిచక్రవర్తి; దేవతా+అధి+ఈశుతోన్= దేవతల అధిపతితో - ఇంద్రుడితో; నీకున్= దేవేంద్రుడవైన నీకు; నా విభవంబు= నా సంపద; కానంగన్+రాదు= చూడరాదు - అగుపడదు; గుహయందున్= కొండబిలమునందు; గుప్తము+ఐ= దాచబడ్డదై; ఉన్నది= కలదు; నాకున్+ఇచ్ఛ+పుట్టినన్= నాకు కోర్కె కలిగినప్పుడు; ఇప్పుడు+అ= ఇప్పుడే; పొలిచి= సమీపించి; తోఁచున్= అగుపిస్తుంది; అది= ఆ విషయం-నా సంపద విషయం; అటుల+ఉండెన్= అట్లుండనీ - ఆ ప్రక్కన ఉండనిమ్ము; నీవు+అధికుండవు= నీవు పెద్దవాడవు; అల్పుల+ఎదురన్= పిన్నల - చిన్నవారి ఎదుట; రజ్జులు+పల్కుట= వ్యర్థభాషణములు ఆడుట; ఏటి పెంపు?= ఏ విధమైన పెద్దరికం?; దుశ్శవన= ఓ ఇంద్రుడా!; నీ పోయెడు తెరువు= నీవు వెళ్ళేదారిన; పొమ్ము= వెడలుము; అన్నన్= అనగా; ఆతండు= ఆ ఇంద్రుడు; నవ్వుచున్= నవ్వుతూ; అతనిన్+చూచి= ఆ బలిని చూచి; మున్ను= ముందు; పలికినట్లు+అ= అన్న విధంగానే; కన్నోట లేక= జంకులేకుండా; పల్కుటయున్= (అనుట జరిగిన) అన్న తరువాత; అతండు= ఆ బలి; భూతకోటి= ప్రాణి సమూహము; మంచు+పోలెన్= మంచువలె; తోఁచున్= కనిపించును; విరియున్= తొలగును - నశించును; బుద్ధిమంతులు= తెలివిగలవారు; దానికిన్= ఆ ప్రాణికోటి పుట్టి చచ్చుటకు; ఇచ్చన్+వగవరు= మదిలో శోకించరు; ఇంత= ఈ మాత్రము; ఎట్లు ఎఱుఁగవు= ఏల గ్రహించవు?

తాత్పర్యం: ఇంద్రుని ప్రశ్న విన్న బలి 'దేవేంద్రా! నీకు నా విభవం కనిపించదు. కొండగుహలో దాచబడి ఉన్నది. నాకు కోర్కెగల్గినప్పుడే కనిపిస్తుంది. సరి అది అట్లా ఉండనిమ్ము, నీవు గొప్పవాడవు. అల్పుల దగ్గర వ్యర్థభాషణాలు చేయటం ఏమి గొప్పతనం? నీవు వెళ్ళవలసిన దారిలో వెళ్ళిపొమ్ము' అన్నాడు. మొదట బలి ఇంద్రుడి ప్రశ్నను లక్ష్యపెట్టకుండా సమాధానం చెప్పాడు. అయితే ఇంద్రుడు బలిని వదలలేదు. అతడు నవ్వుతూ బలిని చూచి, పూర్వం ప్రశ్నించినట్లే మళ్ళీ ఏ జంకూ లేకుండా ప్రశ్నించాడు. అపుడు బలి 'ఈ కనిపించే ప్రాణికోటి అంతా మంచువలె కనిపిస్తుంది. మంచువలెనే తొలగిపోతుంది. బుద్ధిమంతులైన నరులు ప్రాణికోటి చావు పుట్టుకలకొరకు శోకించరు. ఈ మాత్రం ఎరుగ వేమిటి?' అన్నాడు.

విశేషం: ఇక్కడ బలి బుద్ధిమంతుడు. అతడు ఇంద్రుడి తొలిమాటలు వ్యర్థభాషితాలుగా తోచగా ఉబుసుపోక కోపం ఆడిన పల్కులుగా తలచి, పట్టించుకోలేదు. అందుకనే ఇంద్రుడిని తనదారిన తనను పొమ్మన్నాడు. అయితే ఇంద్రుడు నిశ్చలంగా నిలిచి నవ్వుతూ మళ్ళీ అదే ప్రశ్నవేసేసరికి, అతడి జిజ్ఞాస (తెలిసికొనాలనే కోరిక) మీద బలికి విశ్వాసమేర్పడి, సమాధానం చెప్పటం ప్రారంభించాడు. దుశ్చ్యవనుఁడు= ఇంద్రుఁడు; తన వజ్రాయుధమునకు సాధ్యుఁడు కాని చ్యవనముని వంటివాఁడు.

వ. అని వెండియు విరోచననందనుండు. **393**

ప్రతిపదార్థం: అని= అని పలికి; విరోచన నందనుండు= విరోచనుడి కొడుకైన బలి; వెండియున్= మరలా ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని బలి మరలా (ఈ విధంగా కొనసాగించాడు.) (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పొరి నర్థంబు ననర్థము । మరణము జీవితము సుఖ సమాగమమును దు
స్తర దుఃఖసంగమంబును । దొరకొన నే నెపుడు సమత తోడన నిలుతున్. **394**

ప్రతిపదార్థం: పొరిన్= క్రమంగా; అర్థంబున్= ధనం; అనర్థము= కీడు; మరణము= చావు; జీవితము= బ్రదుకు; సుఖసమ్+ఆగమమును= సుఖం బాగుగా రావటం; దుస్+తర దుఃఖ సంగమంబును= దాటరాని (దుఃఖంతో దాటవలసిన) దుఃఖం యొక్క కూడికా; దొరకొనన్= కలుగగా; నేను= బలిని అయిన నేను; ఎపుడున్= సదా ఎల్లవేళలా - సుఖంలో దుఃఖంలో, జీవితంలో, మరణంలో, అర్థంలో, అనర్థంలో; సమతతోడన్+అ= సమభావంతోనే; నిలుతున్= నిలుస్తాను.

తాత్పర్యం: దేవేంద్రా! లోకాన క్రమంగా ప్రాణికోటికి మేలు కీళ్ళు, బ్రదుకులు చావులు, సుఖానుభవాలు, దుఃఖపీడనలు వచ్చి పడుతూ ఉంటాయి. నేను మాత్రం ఎప్పుడూ మేలు జరిగినా, కీడు వాటిల్లినా, సుఖం కలిగినా, దుఃఖం పైకొన్నా, సమభావంతో నిలిచి ఉంటాను. నా మీద ఆ మేలుకీడుల ప్రభావ మేదీ ప్రసరించదు.

చ. బలమును నొప్పు బుద్ధియును బ్రౌఢతయుం గలవారు లేనివా
ర లనక యొక్కభంగిఁ దఱి రాకయ చూచి హరించుచుండు వి
చ్చలవిడిఁ గాలుఁ; డట్లగుట సారమతిం గని యున్నవాఁడ; ను
మ్మలికయు నుబ్బు నాదుమది మందున కైనను లేదు వాసవా! **395**

ప్రతిపదార్థం: వాసవా!= ఇంద్రా!; కాలుఁడు= యమధర్మరాజు; బలమును= శరీర బలమూ; ఒప్పు బుద్ధియును= తీరైన తెలివీ; ప్రౌఢతయున్= ప్రాగల్భ్యమూ, సమర్థతా; కలవారు= ఉన్నవారు - ఈ గుణాలన్నీ ఉన్నవారు; లేనివారలు= ఉండనివారు; అనక= అనకుండా; ఒక్కభంగిన్= ఒకే విధంగా; తఱిరాక+అ= సమయం, కాలం వచ్చుటయే - పోగాలం సమీపించుటే; చూచి= గమనించి;

విచ్చలవిడిన్= స్వేచ్ఛగా - అడ్డూ ఆపూ లేకుండా; హరించుచున్+ఉండున్= సంహరిస్తూ ఉంటాడు; అట్లు+అగుటన్= ఆ విధంగా జరుగుటను; సారమతిన్= గట్టి బుద్ధితో; కని+ఉన్నవాఁడన్= చూచి ఉన్నాను; నాదు మదిన్= నా మనస్సునందు; ఉమ్మలికయున్= దుఃఖమును; ఉబ్బును= సంతోషమును; మందునకున్+ఐనను= మందుకోసం కూడా - కొంచెం కూడా; లేదు= ఉండదు;

తాత్పర్యం: ఇంద్రా! లోకాన నరులలో శరీరబలం, బుద్ధి, వివేకం, పనులలో ఎంతో సామర్థ్యం కలవారున్నారు. అవి ఏవీ లేనివారూ పుష్కలంగానే ఉన్నారు. కాని కాలుడు మాత్రం కాలం సమీపించినప్పుడు ఆ ఇరుతెగలవారినీ స్వేచ్ఛగా తిరుగులేకుండా హరించివేస్తూనే ఉన్నాడు. కాలుడి దగ్గర బలవివేకసామర్థ్యాలేవీ కొరగావటంలేదు. అట్లా జరగడాన్ని నేను గట్టి తెలివితో గమనించి ఉన్నాను. కాబట్టి నా చిత్తాన ఉమ్మలిక ఉండదు. ఉబ్బూ ఉండదు- ఏ కొంచెంగానైనా.

ఉ. గాడిద రూపు దాల్చి యుముకల్ దినుచుండఁగఁ జూచి యుల్లసం
బాడెదు శక్ర! శాంతిసమయం బగుటన్ విను మింకఁ గొన్ని నీ
వాడిన నాదు చిత్తమున నల్క యొకింతయుఁ బుట్ట దిట్లు నీ
వాడితె మున్ను? ని న్నెఱుఁగనా? వలదా నను నీ వెఱుంగఁగన్? 396

ప్రతిపదార్థం: శక్ర!= దేవేంద్రా!; గాడిదరూపు+తాల్చి= గార్దభ ఆకారం ధరించి; ఉముకల్= ఊకలు; తినుచున్+ఉండఁగన్= తింటూ ఉండగా; చూచి= కనుగొని; ఉల్లసంబు+ఆడెదు= పరిహాసం పల్కుతావు; వినుము= ఆలకించుము; శాంతి సమయంబు+అగుటన్= సత్త్వరజస్తమోగుణాలు శాంతించిన కాలం కాబట్టి; నీవు= పరిహసించే నీవు; ఇంకన్+కొన్ని ఆడినన్= ఇంకా కొన్ని పరిహాసాలు - ఎకసక్కెములు పలికినా; నాదు చిత్తమునన్= నా మనస్సున; అల్క+ఒక+ఇంతయున్= కోపం కొంచెం కూడా; పుట్టదు= కలుగదు; మున్ను= పూర్వం, నేను ఏలే సమయాన; నీవు= ఇంద్రుడవైన నీవు; ఇట్లు= ఈ విధంగా పరిహాసంగా; ఆడితి(వి)+ఎ?= పలికితివా?; నిన్నున్+ఎఱుఁగనా?= దేవతల రాజువైన నిన్ను ఎరుగనా!; నన్నున్= బలిచక్రవర్తినైన నన్ను నీవు; ఎఱుఁగన్+వలదా?= ఎరుగవద్దా?

తాత్పర్యం: ఇంద్రా! ఇపుడు గార్దభాకారం ధరించి ఊక మేస్తున్న నన్ను చూచి, ఎకసక్కెములు ఆడుతున్నావు. త్రిగుణాలు శాంతించి ఉన్నవాడను కాబట్టి, నీవు ఇంకా మరికొన్ని పరిహాసాలు పలికినా నా చిత్తాన అలుక అంకురించదు. ముందు నేను చక్రవర్తిగా లోకమేలేటప్పుడు నీవు నాతో ఇట్లా పలికావా? నిన్ను నేను ఎరుగనా? మరి, నీవూ నన్ను ఎరిగి ప్రవర్తించవద్దా?

క. ఎలమియు వాడుటయును దన । వలచిన యట్టివె యెఱుంగవా? విధి చరితం
బులు బలవంతంబు లగుట । వలదె? వివేకంబు పెద్దవారికి నింద్రా! 397

ప్రతిపదార్థం: ఇంద్రా!దేవేంద్రా!; ఎలమియున్= వికాసమూ - వృద్ధీ; వాడుటయును= వినాశమూ; తన వలచిన+అట్టివె?= తాను (విధి) అనుకొన్న కోరిన అటువంటివే?; విధి చరితంబులు= విధియొక్క నడతలు; ఎఱుంగవా?= తెలియవా? గ్రహించలేవా?; బలవంతంబులు= బలము గలిగినవి (విధి చరితములు); అగుటన్= కాగా, అందువలన; పెద్దవారికిన్= పెద్దలైన వారికి (నీ వంటివారికి); వివేకంబు= మంచిచెడు గ్రహించే తెలివి; వలదె?= వద్దా? ఉండవద్దా?

తాత్పర్యం: ఓ దేవతల రాజా! విధి కోర్కెనుబట్టి ప్రాణుల జీవితాలలో వికాసంగాని, వినాశంగాని జరుగుతుంటుంది. విధి చేష్టలు బలీయాలు. ఆ విషయం నీ వెరుగవా! పెద్దవారికి వివేకం - మంచిచెడు వింగడించి చూచే తెలివి ఉండవద్దూ?

క. ఇటు గర్వించుట నీచత; । యెట వోయెదొ పాముఁ; మానుమీ వలవని త్రు
ళ్ళుట; వజ్రము నీవును బడి । కిటి తాఁకున నొఱగు దేను కినిసితినేనిన్. 398

ప్రతిపదార్థం: ఇటు= ఈ విధంగా; గర్వించుట= గర్వం వహించటం; నీచత= నైచ్యం - నీచుడి స్వభావం; ఎట= ఎక్కడకు; పోయెదో= పోతావో; పొమ్ము= వెడలుము; వలవని త్రుళ్ళుట= కూడని మిడిసిపాటు; మానుమీ= మానుకొనుము; ఏను= నేను; కినిసితిని+ఏనిన్= అలిగితినా; కోపగించితినా; వజ్రము= నీ వజ్రాయుధం; నీవును= నీవుకూడా; పిడికిటి తాఁకునన్= (నా) చేతి పిడికిలియొక్క దెబ్బకు; ఒఱగుదు= పడతావు.

తాత్పర్యం: ఇతరుల దైన్యాన్నిచూచి ఎకసక్కెములాడటం నీచస్వభావం. నీవు ఎటుపోతున్నావో పొమ్ము. ఈ తగని మిడిసిపాటు మానుకొమ్ము. నేను కోపగించానంటే, నీవూ నీ వజ్రాయుధమూ నా చేతి పిడికిటి వేటుకే నేలకు ఒరిగి పోవలసివస్తుంది.

క. ఇది మేలపు మాట సుమీ! । మది నుద్ధతి లేదు నాకు; మహితాశ్చర్యా
స్పదమగు విధాతృ చెయ్దిం । దుది నీవును దుస్సువోదు; త్రుళ్ళు టుడుగుమీ. 399

ప్రతిపదార్థం: ఇది= ఈ చివరిమాట; మేలము+మాటచుమీ!= పరిహాసపు పలుకు సుమా!; నాకున్= స్థిరప్రజ్ఞుడనైన నాకు; మదిన్= చిత్తమునందు; ఉద్ధతి లేదు= పొగరు ఉండదు; మహిత+ఆశ్చర్య+ఆస్పదము+అగు= గొప్పదీ ఆశ్చర్యానికి స్థానమైనదీ అయిన; విధాతృ చెయ్దిన్= విధియొక్క చేత (పని) వలన; తుదిన్= చివరకు; నీవును= దేవరాజువైన నీవు కూడా; తుస్సు+పోదు= భంగపడతావు; (కాబట్టి) త్రుళ్ళుట= మిడిసిపడటం; ఉడుగుమీ!= మానుము!

తాత్పర్యం: (బలి ప్రసంగంలో 'నేను కినిసితినేనిన్ నీవును వజ్రము పిడికిటి తాఁకున నొఱగుదు' అని ఒక మాట పల్కి ఉన్నాడు. అది నిజానికి ఔద్ధత్యాన్ని తెలియజేసే పలుకు. కాబట్టి ఆ మాటను తాను వాస్తవార్థంలో వాడలేదన్నాడు) ఇది పరిహాసవచనం మాత్రమే! నాకు చిత్తాన అహంకారం లేదు. గొప్ప అచ్చెరువుకు ఆస్పదమైన విధాత చేతలకు ఎవరూ అతీతులుగారు. చివరకు నీవు కూడా విధిచేతిలో భంగపడతావు. కాబట్టి త్రుళ్ళిపడటం మానుకొమ్ము.

వ. శాంతుఁడ వగు' మని పలికె; నట్టియెడ నవ్విరోచన నందను శరీరంబున నుండి సురూపయు సుగౌరయు నగు నొక్కమగువ నిర్గమించినం గని కౌశికుండు విస్మయ వికసితాక్షుం డగుచు నతనితో 'నివ్వనిత యెవ్వత?'యనిన నాతం 'డే నెఱుంగ నీవ యీ యమ నడుగు' మనుటయు నయ్యనిమిషపతి యమ్ముద్దియ మొగంబు గనుంగొని 'మాకు నిన్నెఱింగింపు' మనవుడు నద్దేవి యతనితోడ. 400

ప్రతిపదార్థం: శాంతుఁడవు+అగుము= శాంతించినవాడవు కమ్ము; అని పలికెన్= అని చెప్పాడు; అట్టి+ఎడన్= ఆ సమయాన; ఆ+విరోచన నందను శరీరంబున నుండి= ఆ విరోచనుడి కుమారుడైన బలియొక్క దేహంనుండి; సురూపయున్= మంచి ఆకారం కలిగినదీ; సుగౌరయున్= మంచి తెల్లనైనదియు; అగు+ఒక్క మగువ= అయిన ఒక వనిత; నిర్గమించినన్= బయటకు వెడలగా; కని= చూచి; కౌశికుండు= ఇంద్రుడు; విస్మయవికసిత+అక్షుండు+అగుచున్= అచ్చెరువుతో విప్పారిన కన్నులు గలవాడు అవుతూ; అతనితోన్= ఆ బలితో; ఈ+వనిత= ఈ స్త్రీ; ఎవ్వత?= ఎవరు?; అనినన్= అనగా; ఆతండు= ఆ బలి; ఏను+ఎఱుంగన్= నేను ఎరుగను; నీవు+అ= నీవే; ఈ+అమన్= ఈ అమ్మను, వనితను; అడుగుము= ప్రశ్నించుము; అనుటయున్= అన్న తరువాత; ఆ+అనిమిషపతి= ఆ దేవతలరాజు; ఆ+ముద్దియ మొగంబు= ఆ ముద్దరాలి ముఖం; కనుంగొని= చూచి; మాకున్= ఇంద్రదేవులమైన మాకు (రాచరికపు బహువచనం); నిన్నున్+ఎఱింగింపుము= నిన్ను తెలియపరచికొనుము; అనవుడున్= అన్న పిదప; ఆ+దేవి= ఆ దేవత; అతనితోడన్= ఆ ఇంద్రుడితో.

తాత్పర్యం: శాంతిని వహించుము ఇంద్రా!' అని బలి పలికాడు. ఆ సమయాన ఆ రాక్షసరాజు శరీరంనుండి ఒక వనిత మంచి ఆకారంతో, మంచి తెల్లదనంతో ప్రకాశిస్తూ బయటకు వెడలినది. ఆ దృశ్యం చూచిన ఇంద్రదేవుడు

అచ్చెరువుతో కన్నులు పెద్దవి కాగా, బలితో 'ఎవ్వరీమె?' అని ప్రశ్నించాడు. బలి తనకూ తెలియదంటూ 'నీవే ఈ వనితను అడిగి తెలిసికొ'మ్మన్నాడు. ఇంద్రుడు ఆ ముద్దరాలి మొగం చూచి 'మాకు నిన్ను ఎరిగించుకొ' మ్మని పలికాడు. దానికి బదులుగా ఆ దేవత ఆ ఇంద్రదేవుడితో.

విశేషం: లోక వ్యవహారాన 'అతడికి దశ తిరిగింది. ఇతడికి మహార్దశ వదలింది' వంటి మాటలు వింటూ ఉంటాం. ఆ మాటలలోని దశలు జ్యోతిష శాస్త్రాన్నిబట్టి లెక్కించి చెప్పేవి గావచ్చును. ఊరకే మనిషి స్థితిగతులను చూచి పలికేవీ కావచ్చును. ఇక్కడ బలి దశ మారింది. ఆ మార్పును భౌతికంగా సంభవిస్తున్నట్లుగా చిత్రిస్తూ వ్యాఖ్యానిస్తున్నాడు భారతకర్త. నరుడిలో సిరి ప్రవేశించటం నిర్గమించటం జరుగుతున్నట్లుగా నిరూపిస్తున్నాడు. ధర్మజుడి ప్రశ్న ఈ అంశానికి చెందినదే.

క. 'శ్రీయును భూతియు లక్ష్మియు । నా యభిధానములు మీరు న న్నెఱఁగమి పె
ద్దే? యింద్ర! యెజ్జగంబుల । నే యుగములయందు నెఱఁగ రెవ్వరు ననినన్.' 401

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓ ఇంద్రదేవా!; శ్రీయును= శ్రీ అనేదీ; భూతియును= భూతి అనేదీ; లక్ష్మియున్= లక్ష్మి అనేదీ; నా+అభిధానములు= నా పేరులు; మీరు= ఇంద్రబలులు - మీరు ఇరువురు; నన్నున్+ఎఱఁగమి= నన్ను గ్రహించలేకపోవటం; పెద్ద+ఏ?= ఆశ్చర్యమా? (కాదు); ఏ+జగంబులన్= ఏ లోకాలలోనైనా; ఏ యుగములయందున్= ఏ యుగాలలోనైనా; ఎవ్వరున్= ఎట్టివారూ; ఎఱఁగరు= తెలియరు; అనినన్= అనగా.

తాత్పర్యం: 'ఓ ఇంద్రదేవా! నా పేరులు మూడున్నాయి - శ్రీ, భూతి, లక్ష్మి అని. ఇక మీరు (ఇంద్రబలులు) ఇద్దరూ నన్ను ఎరుగకపోవటం విచిత్ర మేమీ కాదు. ఏ లోకాలలోనూ, ఏ యుగాలలోనూ, ఏ ఒక్కరూ నన్ను ఎరుగరు' అన్నది ఆ దేవి.

క. అనవుడు నతండు 'నీ వీ । దనుజేశ్వరుఁ బాయుటకుఁ గతం బేమి యొకో!'
యనిన విని లక్ష్మి 'సత్యం । బును ధర్మము దమము దానమును నా యిక్కల్. 402

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న వెంటనే; అతండు= ఆ ఇంద్రుడు; నీవు+ఈ దనుజ+ఈశ్వరున్= నీవు ఈ రాక్షసరాజును; పాయుటకున్= విడుచుటకు; కతంబు+ఏమి+ఒకో!= కారణం ఏమిటో కదా!; అనినన్= అనగా; విని= ఆలకించి; లక్ష్మి= లక్ష్మీదేవి; సత్యంబును= నిజమూ; ధర్మము= న్యాయం - పుణ్యం; దమము= నిగ్రహం; దానమును= ఇచ్చుటా - ఈ నాలుగు గుణాలూ; నా+ఇక్కల్= నా నెలవులు - స్థానాలు.

తాత్పర్యం: ఇంద్రుడు శ్రీదేవిని 'నీవీ రాక్షసరాజును విడిచి వెడలుటకు కారణమేమిటి?' అని అడిగాడు. ఆ ప్రశ్న విన్న లక్ష్మి 'సత్యం, ధర్మం, దమం, దానం - అనే గుణాలు నాకు నెలవులు. అవి ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాను.

విశేషం: ఇది మహాభారతంలో లక్ష్మీదేవి పలుకు. ఆమె సత్యధర్మాలు, దాంతి దానాలూ తన నెలవులంటున్నది. అనంతరకాలాన వెలసిన కావ్యాలలో లక్ష్మి దూషితగా దుష్టవర్తనగా వర్ణితమై కనిపిస్తూ ఉన్నది (కాదంబరి కావ్యాన). అది కాలవ్యత్యాసం కావచ్చు.

క. అవి గలిగి పరాక్రమయుతుఁ । డవు పురుషునిపాల నిలుతు నమరాధిప! యా
దివిజారి దొల్లి యట్టిఁడ । యవినీతత నిపుడు బ్రాహ్మణాసూయ మెయిన్. 403

ప్రతిపదార్థం: అవి= ఆ నాలుగు గుణాలు; కలిగి= ఉండి; పరాక్రమయుతుఁడు+అవు= ప్రతాపంతో కూడినవాడైన; పురుషుని పాలన్= నరుడి దగ్గర; నిలుతున్= ఉండెదను; అమర+అధిప!= దేవతలరాజా!; ఆ దివిజ+అరి= ఆ దేవతల శత్రువు; అట్టిఁడు+అ=

అట్టివాడే - ఆ గుణాలూ- పరాక్రమమూ గలవాడే; ఇపుడు= ప్రస్తుత కాలాన; అవినీతతన్= అవినయంతో - వినయం లేనివానితనంతో; బ్రాహ్మణ+అసూయ మెయిన్= బ్రాహ్మణులయెడ ఓర్వలేనితనంతో.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఆ నాలుగు గుణాలూ ఉండి, ప్రతాపవంతుడు కూడా అయిన పురుషుడిదగ్గర నేను నిలిచి ఉంటాను. ఆ బలిచక్రవర్తి పూర్వకాలాన అట్టివాడే. కాని, ప్రస్తుతకాలాన అతడు అవినయంతో, బ్రాహ్మణుల పట్ల, బ్రహ్మవిద్యాసంపన్నులయెడ అసూయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తొల్లిటి సచ్చారిత్రము । లెల్లను దిగవిడిచెఁ గాన యీతనికడ నే
నొల్ల నిలువ, వచ్చెద సుర । వల్లభ! నీ పాల నెలమి వసియింపంగన్. 404

ప్రతిపదార్థం: సురవల్లభ!= ఓ దేవతలరాజా!; తొల్లిటి= పూర్వపు; సత్+చారిత్రములు+ఎల్లను= మంచి నడతలను అన్నింటిని; దిగన్+విడిచెన్= దిగిపోయేటట్లు - వెడలిపోయే విధంగా వదలివేశాడు; కాన= కాబట్టి; ఈతని కడన్= ఈ బలి దగ్గర; నేన్+నిలువన్+ఒల్లన్= నేను నిలుచుటకు ఇష్టపడను; నీ పాలన్= నీ దగ్గర; ఎలమిన్= సంతోషంతో; వసియింపంగన్= నివసించటానికై; వచ్చెదన్= వస్తాను.

తాత్పర్యం: పూర్వపు ఆ మంచి నడతలు అన్నిటినీ ఈ బలి వదలివేశాడు. కాబట్టి ఇకపై ఈతడి దగ్గర ఉండనొల్లను. ఓ దేవరాజా! నీ దగ్గర సంతోషంతో నివసించటానికై వస్తాను.

ఆ. ఆ గుణములు మఱియు నాగమోదిత సమా । చారములును గలిమిఁ గోరి యింద్ర!
నిన్నుఁ బొంది యేను నిల్చెద; నేమిట । నేమఱంగ వలవ దెపుడు నీవు.' 405

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓ దేవరాజా!; ఆ గుణములు= ఆ నేను చెప్పిన గుణగణాలూ; మఱియున్= ఇంకను; ఆగమ+ఉదిత సమ్+ఆచారములును= శాస్త్ర విహితమైన మంచి ధర్మాలును; కలిమిన్= ఉండటంవలన; నిన్నున్= నిన్ను; కోరి= ఇష్టపడి; పొంది= చెంది; ఏను= నేను; నిల్చెదన్= నిలుస్తాను - పోకుండా - నిలకడగా ఉంటాను; నీవు= దేవరాజువైన నీవు; ఎపుడున్= ఏ సమయానైనా; ఏమిటన్= ఏ విషయాననైనా; ఏమఱంగన్+వలవదు= ఏమరి ఉండవద్దు- ప్రాల్మాలికతో పరాకుతో వ్యవహరించవద్దు.

తాత్పర్యం: ఇంద్రదేవా! నీలో నేను నుడివిన ఆ గుణాలతోపాటుగా, అదనంగా వేదశాస్త్ర విహితాలైన ధర్మాలను ఆచరించే సల్లక్షణం కూడా ఉన్నది. అందువలన నేను నిన్ను కోరి వరించి వచ్చి, నీ వద్ద నిలిచి ఉంటాను. అయితే నీవు కూడా ఎపుడూ ఏ విషయంలోనూ పరాకుపడకుండా నిత్యజాగరూకుడవై ఉండవలెను'.

విశేషం: లక్ష్మీనివాస మన్నది కొన్ని నియమ నిబంధనలకు లోబడి జరుగుతుంది. ఆ నియమనిబంధనలు పాటించినచోట శ్రీ తాండవిస్తుంది. వాటిని పారద్రోలిన చోటును సిరి దిగవిడిచి వెళ్ళుతుంది.

వ. అని పలికె నిట్లు లక్ష్మి చేతం బరిత్యక్తుండైన బలి యాఖండలు నాలోకించి. 406

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికెన్= చెప్పింది; ఇట్లు= ఈ ప్రకారంగా; లక్ష్మిచేతన్= శ్రీదేవి చేత; పరిత్యక్తుండు+ఐన బలి= విడువబడ్డ బలి; ఆఖండలున్= ఇంద్రుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: లక్ష్మి ఆ విధంగా పలికిన తరువాత, సిరి తొలగిన ఆ బలి ఇంద్రుడిని చూచి ఇట్లా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అయనవశంబునఁ దేజో । వియుక్తుఁ డై రవి ప్రతాపవిరహితుఁ డగు నా
క్రియఁ బొనుఁగుపడినఁ బొంగకు; । జయింతు నిను దేవదనుజ సంగర మగుడున్. 407

ప్రతిపదార్థం: రవి= సూర్యుడు; అయనవశంబునన్= ప్రయాణ (ఉత్తర - దక్షిణ దిక్కులకు ప్రయాణించటం) కారణాన; తేజస్+వియుక్తుడు+ఐ= కాంతిని వీడినవాడై; ప్రతాప విరహితుండు= వేడిమి లేనివాడు; అగున్= అవును; ఆ క్రియన్= ఆ విధంగా (నేను); పొనుఁగుపడినన్= నిస్తేజం కాగా - ప్రతాపం చెడగా; పొంగకు= సంతసించకు - ఉబ్బిపోకుము; దేవదనుజ సంగరము= దేవతల రాక్షసుల యుద్ధం; అగుడున్= అయినపుడు; నినున్= నిన్ను; జయింతున్= గెలుస్తాను.

తాత్పర్యం: 'సూర్యుడు తన ప్రయాణం కారణంగా తేజస్సు చెడి, వేడిమిని కోల్పోతాడు. ఆ విధంగా నేనూ ప్రస్తుతం నిస్తేజంగా ప్రతాపం తగ్గి ఉన్నానని ఉబ్బిపోకుము; దేవాసుర సంగ్రామం జరిగినప్పుడు నిన్ను నేను గెలుస్తాను'.

వ. అనుటయు మహేంద్రుండు. 408

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; మహా+ఇంద్రుండు= ఇంద్రదేవుడు.

తాత్పర్యం: అని బలి అనగా, దేవేంద్రుడు.

క. 'అది యట్టులుండె నీతోఁ । బదరం బని లేదు నాకుఁ బద్మభవుని మా
ట దలంపవలయు నీపై । భదురం బిడ దనుజనాథ! ప్రియ మందు మెదన్.' 409

ప్రతిపదార్థం: దనుజనాథ!= రాక్షసరాజా!; అది= నీవు నన్ను జయించబోయే విషయం; అట్టులు+ఉండెన్= ఆ విధంగా ఉండనిమ్ము - ఒక ప్రక్కన ఉండనిమ్ము; నీతోన్= బలివైన నీతో; పదరన్= వాగగా - వ్యర్థభాషణ చేయగా; పని లేదు= అవసరం లేదు; నాకున్= దేవరాజునైన నాకు; పద్మభవునిమాట= బ్రహ్మదేవుడి పలుకు - వధించటం ఉచితం కాదు అనేది; తలంపన్+వలయున్= స్మరించవలసి ఉన్నది; నీపైన్= నీ మీద; భిదురంబు= వజ్రాయుధం; ఇడన్= వేయను - ప్రయోగించను; ఎదన్= మనస్సున; ప్రియము+అందుము= ప్రీతిని పొందుము.

తాత్పర్యం: 'సరి, భవిష్యత్తులో నీవు నన్ను గెలిచే విషయం అట్లా ఉండనిమ్ము. ప్రస్తుతం నేను నీతో వ్యర్థప్రసంగం చేయ పనిలేదు. నేను బ్రహ్మదేవుడికిచ్చిన మాటను పాటించవలసి ఉన్నది. ఓ రాక్షసరాజా! నీ మీద నేను వజ్రాయుధాన్ని వేయను. నీవు మనస్సున ప్రీతిని వహించుము'.

క. అనిన విని యొండు పలుకక । దనుజాధీశ్వరుఁడు వోయె దక్షిణ దిశకుం;
జనియె నుదఙ్ముఖుఁడై దివి । కనిమిష నాథుండు గౌరవాన్వయముఖ్యా! 410

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; కౌరవ+అన్వయ ముఖ్యా!= ధర్మరాజా!; దనుజ+అధి+ఈశ్వరుండు= రాక్షసుల అధిపతి - బలి; ఒండు+పలుకక= ఒకటీ అనక - నిశ్శబ్దంగా; దక్షిణదిశకున్= దక్షిణదిక్కునకు; పోయెన్= పోయాడు; అనిమిష నాథుండు= రెప్పపాటులేనివారి రాజు - దేవేంద్రుడు; ఉదక్+ముఖుఁడు+ఐ= ఉత్తరమునకు ముఖంకలవాడై - ఉత్తర దిశగా; దివికిన్= స్వర్గానికి; చనియెన్= వెళ్ళెను.

తాత్పర్యం: ఇంద్రుడి ఆ మాటలు ఆలకించిన బలి, మరి మారుమాటాడకుండా, దక్షిణదిశకు వెడలిపోయాడు. ఇంద్రుడు కూడా ఉత్తరాభిముఖంగా కదలి, స్వర్గానికి వెళ్ళిపోయాడు ధర్మరాజా!' (అని భీష్ముడు ఈ వృత్తాంతాన్ని ముగించాడు.)

వ. అని చెప్పి యనిమిషనదీనందనుండు వెండియుఁ బాండవాగ్రజున కిట్లను 'నింద్ర నముచి సంవాదం బను నితిహాసంబు హృదయప్రసాదకరంబు; దాని నాకర్ణింపుము. 411

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; అనిమిష నదీ నందనుండు= దేవతల నది కొడుకు - భీష్ముడు; వెండియున్= ఇంకను; పాండవ+అగ్రజునకున్= పాండవులలో మొదటివాడితో - ధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ఇంద్ర నముచి సంవాదంబు+అను= ఇంద్ర నముచుల సంవాదం అనే పేరుగల; ఇతిహాసంబు= వృత్తాంతం - జరిగిన కథ; హృదయ ప్రసాదకరంబు= మనస్సున నిర్మలత్వమును కలిగించేది; దానిని= ఆ ఇతిహాసాన్ని; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంద్ర బలి సంవాదాన్ని వినిపించిన భీష్ముడు ధర్మరాజుతో 'ఇంద్ర - నముచి సంవాదం అనే మరొక ఇతిహాసమున్నది. అది మనస్సున కలతదీర్చి ఊరట కలిగిస్తుంది. దానిని విను'మంటూ ప్రారంభించాడు.

ఇంద్ర నముచి సంవాద ప్రకారము (సం. 12-219-1,2)

సీ. 'సిరిఁ బాసియును నొక్క చింతయు లేక వీ । చుల క్రం దడంగిన జలధివోలె
నముచి యేకాంతస్థలమున నుండఁగ నింద్రుఁ । డచటికి నేతెంచి యతనిఁ జూచి
'పేదవడ్డాఁడవు ప్రియజనంబును బరి । వారంబు లే దియ్యవస్థ కెంత
వగచెదవో దానవశ్రేష్ఠ!' నావుడు । నాతండు 'వగపు నిరర్థకంబు

తే. వలయు వస్తువు వగచిన వచ్చునయ్య? । రామి యొక్కటియే శరీరంబు నెదయుఁ
దాపమునఁ బొందు వగపున ధర్మ మేదు; । నింత యెఱుఁగుదు వగవ నే నేమిటికిని. 412

ప్రతిపదార్థం: నముచి= ఆ పేరుగల ఒక రాక్షసుడు; సిరిన్+పాసియును= లక్ష్మిని కోల్పోయికూడా; ఒక్క చింతయున్ లేక= ఒక విచారమూ లేకుండా; వీచుల క్రందు= అలల అలజడి; అడంగిన= అణగిన - మానిన; జలధి+పోలెన్= సముద్రంవలె; ఏక+అంతస్థలమునన్= ఒంటరి ప్రదేశాన - ఇతరు లెవరూ లేనిచోట; ఉండంగన్= వసించగా; ఇంద్రుఁడు= దేవతల రాజు; అచటికిన్+ఏతెంచి= ఆ చోటికి వచ్చి; అతనిన్+చూచి= ఆ నముచి దానవుడిని కనుగొని; పేద+పడ్డాఁడవు= పేదపడినవాడవు - లేనివాడ వైనావు; ప్రియజనంబును= ఇష్టమైన బంధుమిత్రులును; పరివారంబు= బలగం; లేదు; ఈ+అవస్థకున్= ఈ స్థితికి; ఎంత వగచెదవో?= ఎంతగా దుఃఖిస్తావో?; దానవశ్రేష్ఠ!= రాక్షసులలో ఉత్తముడా!; నావుడున్= అన్న వెంటనే; ఆతండు= ఆ నముచి; వగపు= దుఃఖం; నిర్+అర్థకంబు= నిష్ప్రయోజనం - వ్యర్థం; వలయువస్తువు= కావలసిన పదార్థం; వగచినన్= దుఃఖిస్తే; వచ్చును+అయ్య?= వస్తుందటయ్యా? (రాదు) పైగా; రామి= రాకపోవటం; ఒక్కటి+ఏ= ఒక్కటైనా; శరీరంబున్= దేహమూ; ఎదయున్= మనస్సూ; తాపమునన్= బాధవలన; పొందు= పొందే; వగపునన్= దుఃఖంవలన; ధర్మము+ఏదున్= ధర్మం నశిస్తుంది; ఇంత= ఇది అంతా; ఎఱుఁగుదున్= గ్రహించాను; నేను= జ్ఞానినైన నేను; ఏమిటికిని= దేనికి కూడా; వగవను= దుఃఖించను.

తాత్పర్యం: నముచి అనే రాక్షసుడు సంపదలు నశించిపోయినా, చీకూచింతా లేకుండా అలల సందడి మానిన సముద్రుడివలె నిశ్చలంగా ఒక ఏకాంతస్థలాన ఆసీనుడై ఉండగా అక్కడికి ఇంద్రుడు చేరి అతడి అవస్థను చూచి, 'ఓ రాక్షసరాజా! పేదవాడివై ఉన్నావు; బంధుమిత్రులుగాని ఇతర పరివారాలుగాని లేరు. ఈ హీనస్థితికి ఎంతగా దుఃఖిస్తున్నావో కదా!' అని ఓదార్చబోయాడు. అయితే నముచి మాత్రం 'వగపు నిష్ప్రయోజనం, వగచినంతమాత్రాన వలసిన పదార్థం వస్తుందటయ్యా? రాకపోవటమేకాక, శరీరానికీ మనస్సుకూ సంతాపం కూడా ఆ వగపువలన కలుగుతుంది. అంతేగాదు, వగపువలన ధర్మహానీ కలుగుతుంది. ఇదంతా గ్రహించినవాడను కాబట్టి నేను దేనికీ దుఃఖించను'.

విశేషం: అలం: ఉపమ.

తే. సకలభూతంబులకును శాసకుఁడు గలఁడు । గాదె! యొక్కరుఁ డాతని కల్పనమునఁ
బ్రాప్తమైనది నీళులు పల్లమునకు । వచ్చు క్రియఁ దాన వచ్చు గీర్వాణముఖ్య! 413

ప్రతిపదార్థం: గీర్వాణముఖ్య!= దేవతలరాజా!; సకలభూతంబులకును= ఎల్లప్రాణులకును; శాసకుఁడు= ఏలిక - అధిపతి; కలఁడు+కాదె!= ఉన్నాడు కదా!; ఒక్కరుఁడు= ఒకడు; ఆతని కల్పనమునన్= ఆ శాసకుడి ఏర్పాటువలన; ప్రాప్తము+ఐనది; లభించినట్టిది; నీళులు= నీరములు; పల్లమునకున్= పల్లమైన ప్రదేశానికి; వచ్చుక్రియన్= వచ్చే విధంగా; తాను+అ= తానే - స్వయంగా; వచ్చున్= చేరును.

తాత్పర్యం: ఓ దేవతలరాజా! సృష్టిలో ఎల్లప్రాణులకూ ఏలిక ఒక డున్నాడు కదా! అతడి ఏర్పాటు ప్రకారం ఏ ప్రాణికి ఏది ఎప్పుడు లభించాలో, ఆ ప్రాణికి అది అప్పుడు, నీళ్ళు పల్లానికి ప్రాకివచ్చినంత సులభంగా ప్రయత్న రహితంగా వచ్చి చేరుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. ఇది నా కయ్యెం; గాఁగల । యది యై యను గాధనిశ్చయం బెవ్వని నె
మ్మదిఁ గలుగు నుబ్బు వగ సం । పద యాపద గలుగ వట్టి భవ్యున కింద్రా! 414

ప్రతిపదార్థం: ఇంద్రా!= ఓ దేవరాజా!; ఎవ్వని నెఱ+మధిన్= ఏ నరుడి నిండు మనస్సులో; కాఁగల+అది+ఐ= కావలసి ఉన్నదై- ఏర్పడి ఉన్నదై; ఇది= ఈ పని- సంఘటన; నాకున్+అయ్యెన్= నాకు అయింది- జరిగింది; అను గాఢ నిశ్చయంబు= అనే గట్టి నిర్ణయం; కలుగున్= ఉండునో; అట్టి భవ్యునకున్= అట్టి శుభకరుడికి - యోగ్యుడికి; ఉబ్బు= సంతోషాతిరేకం; వగ= దుఃఖం; సంపద= కలిమి - సంపత్తి; ఆపద= విపత్తు - కష్టము; కలుగవు= ఉండవు - ఏర్పడవు.

తాత్పర్యం: ఇది ఈ విధంగా కావలసి ఉన్నదే, నాకు అయినది నాకు జరిగినది, ఇది జరగవలసి ఉండే జరిగింది. అనే గట్టి నిశ్చయంగల యోగ్యుడికి ఇక ఆనందం, దుఃఖం, సంపత్తి విపత్తివంటి ద్వంద్వాలు ఉండవు.

క. ధైర్యంబున వీర్యంబున । శౌర్యంబునఁ బ్రజ్ఞఁ బడయఁ జాలునె నరుఁ డె
క్కార్యము నప్రాప్యమయిన? । నార్యుం డది యెఱుఁగుఁ గాన యడలఁడు శక్రా! 415

ప్రతిపదార్థం: శక్రా!= ఓ ఇంద్రుడా!; నరుఁడు= మానవుడు; ఏ+కార్యమున్= ఏ పనినైనా; అప్రాప్యము+అయినన్= పొందరానిది అయితే; ధైర్యంబునన్= ధీరగుణంతో; వీర్యంబునన్= వీరభావంతో; శౌర్యంబునన్= శూరభావంతో - ధైర్యపరాక్రమాలతో; ప్రజ్ఞన్= బుద్ధిబలంతో; పడయున్+చాలునె?= పొందగలడా? (పొందలేడు); ఆర్యుండు= సజ్జనుడు; అది= ఆ విషయం; ఎఱుఁగున్+కానన్= తెలియును కాబట్టి; అడలఁడు= భయపడడు.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఒక కార్యం అలభ్యమని దైవం నిర్ణయించి ఉంటే, ఇక దానిని నరుడు తన ధైర్య శౌర్యాలతోగాని, పరాక్రమశక్తితోగాని, కాదంటే బుద్ధిబలంతోగాని పొందగలడా? పొందనే లేడు. ఆ విషయం సుజనుడు గ్రహించి ఉంటాడు కాబట్టి, అతడికి భయ ముండదు. అత డెవరికీ భయపడడు.

తే. మేలుఁ గీడును నరుఁ బొందుఁ గాలముల న । వశ్యమును వానిఁ గోరిన వచ్చుటయును
వినుము త్రోచినఁ బోవుటయును సురేంద్ర! । కలదె వానికిఁ? గావున వలదు చింత.' 416

ప్రతిపదార్థం: సుర+ఇంద్ర!= దేవతలరాజా!; మేలున్+కీడును= శుభమూ, అశుభమూ; కాలములన్= ఆయా సమయాలలో; అవశ్యమును= తప్పకుండ; నరున్= మానవుడిని; పొందున్= చెందుతాయి; వానిన్= ఆ మేలు కీళ్ళను; కోరినన్+వచ్చుటయును= కోరితే రావటమూ; త్రోచినన్+పోవుటయును= త్రోసివేస్తే పోవటమూ; వానికిన్= ఆ మేలు కీడులకు; కలదు+ఎ?= ఉన్నదా? (లేదు); కావున= కాబట్టి; చింత వలదు= విచారం - వగపు వద్దు; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఓ దేవరాజా! జీవితంలో మేలు, కీడు అనేవి కాలవశాన తప్పకుండా నరుడిని చేరేవే తప్ప, కోరితే వచ్చేవీ, త్రోసివేస్తే తొలగి పోయేవీ అవుతాయా? కావు. కాబట్టి ఆ మేలు, కీడుల విషయమై చింతించటం పనికిరాదు. వినుము'.

క. అని యిట్లు నముచి పలికిన । విని మెచ్చుచు దివికి నమరవిభుఁ డరిగెం; బా
వనచరిత! యింకనెయ్యది । వినవల తనవుడును భరితవినయుండగుచున్. **417**

ప్రతిపదార్థం: పావన చరిత!= పవిత్రమైన నడతగల ఓ ధర్మరాజా!;అని= పై విధంగా; ఇట్లు= ఈ ప్రకారం; నముచి= నముచిదనుజుడు; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; మెచ్చుచున్= మెచ్చుకొంటూ; అమరవిభుఁడు= దేవేంద్రుడు; దివికిన్ అరిగెన్= స్వర్గానికి వెళ్ళాడు; ఇంకన్= ఇంకనూ; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?= వినటానికి కోరుతున్నావు?; అనవుడున్= (అని భీష్ముడు) అన్న తరువాత; భరిత వినయుండు+అగుచున్= నిండిన వినయము కలవాడు అవుతూ.

తాత్పర్యం: ఈ ప్రకారంగా నముచి పలుకగా విన్న దేవేంద్రుడు నముచి పలుకులను మెచ్చికొంటూ తాను స్వర్గానికి వెడలిపోయాడు. ఓ పవిత్రచరిత్రగల ధర్మరాజా! నీవు ఇకపై ఏమి వినాలని నిరీక్షిస్తున్నావు - అని భీష్ముడు అనగా అణకువతో నిండినవాడై (ధర్మరాజు).

క. ఆ నరపతి శాంతనవుని । తో నిట్లను 'నెద్దియేని దుర్దశ యైనన్
మానవుఁ డెట్టిఁ డగుట మే । లానతియీవే? దయామయా! తేటపడన్.' **418**

ప్రతిపదార్థం: ఆ నరపతి= ఆ రాజు - ఆ ధర్మరాజు; శాంతనవునితోన్= శంతను తనయుడితో - భీష్ముడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఎద్ది+ఏని= ఏదైనా; దుర్+దశ+ఐనన్= చెడ్డ అవస్థ కలిగితే; మానవుఁడు= నరుడు; ఎట్టిఁడు+అగుట= ఎటువంటివాడు కావటం - ఏ విధంగా ప్రవర్తించటం; మేలు?= ఉత్తమం?; దయామయా!= దయతో నిండిన ఓ భీష్మాచార్యా!; తేటపడన్= స్పష్టంగా; ఆనతి+ఈవే?= సెలవీయవా? - ఉపదేశించవా?

తాత్పర్యం: ధర్మరాజు పితామహుడితో 'ఏదైనా చెడ్డ అవస్థ నరుడికి కలిగినపుడు అతడు ఎట్లాంటివాడు కావాలి? ఏ విధంగా ప్రవర్తించి ఆ దుర్దశను దాటగలగాలి? ఆజ్ఞాపించు'మని అర్థించాడు.

వ. అని యడిగిన నయ్యుధిష్ఠిరునకు బుధశ్రేష్ఠుం డిట్లనియె. **419**

ప్రతిపదార్థం: అని+అడిగినన్= ధర్మరాజు ఆ విధంగా అడగగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజునకు; బుధశ్రేష్ఠుండు= పండిత ఉత్తముడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అడుగగా భీష్ముడు ధర్మజుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఏ విధమున దుర్దశలకు । భూవర! ధైర్యంబ మందు; భూరిధృతిమెయిం
జేవ గలుగు దృఢనిశ్చయ । భావము నెవ్వగలఁ దొట్రువడ దెబ్బంగిన్. **420**

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; ఏ విధమునన్= ఏ ప్రకారంగానైనా; దుర్+దశలకున్= దురవస్థలకు - చెడు స్థితిగతులకు; ధైర్యంబు+అ= ధైర్యమే ధీర స్వభావమే; మందు= ఔషధం - ప్రతీకారం; భూరి ధృతిమెయిన్= గొప్ప ధైర్యంతో; చేవ+కలుగు= బలంగల; దృఢనిశ్చయ భావము= గట్టి నిర్ణయంగల మనస్సు; ఏ భంగిన్= ఏ విధంగానూ; నెఱ+వగలన్= నిండు దుఃఖాలతో; తొట్రు+పడదు= చలించదు - కదలిపోదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దురవస్థలు ఏ విధమైనవైనా ఆ అన్నిటికీ ఒక్క ధైర్యమే ఔషధం. గొప్ప ధైర్యంతో చేవగల గట్టి నిర్ణయం తీసికొన్న మనస్సు ఎటువంటి నిండు శోకాలలోనైనా, దుఃఖాలలోనైనా చలించకుండా నిలుస్తుంది. ఆ కష్టనష్టాలను అతిక్రమిస్తుంది.

క. ధృతి యారోగ్యము నొసఁగును; । ధృతి యుజ్జ్వలలక్ష్మిఁ దెచ్చు; ధృతి గీర్తి సము
న్నతిఁ జేయుఁ; గాలగత్యవ । గతి గలిగినఁ గలుగు ధృతి వికారవిదూరా! 421

ప్రతిపదార్థం: వికారవిదూరా!= వికృతులకు - మానసిక బలహీనతలకు మిక్కిలి దూరమైనవాడా! - ధర్మరాజా!; ధృతి= ధైర్యం; ఆరోగ్యమున్= రోగంలేని శరీరస్థితిని; ఒసఁగును= ఇస్తుంది; ధృతి= ధైర్యం; ఉత్+జ్వల లక్ష్మిన్= ప్రకాశించే సిరిని; తెచ్చున్= తీసికొనివస్తుంది; ధృతి= ధైర్యం; కీర్తి సమ్+ఉన్నతిన్= యశస్సుయొక్క మంచి ఔన్నత్యమును - పెరుగుదలను; చేయున్= కలిగిస్తుంది; కాలగతి+అవగతి= కాలముయొక్క నడకను గూర్చిన జ్ఞానం; కలిగినన్= ఏర్పడితే; ధృతి= ధీరగుణం; కలుగున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: మనోవికృతులకు దూరమైన ఓ ధర్మరాజా! ధైర్యం ఆరోగ్యాన్ని ఇస్తుంది. ధీరగుణం ప్రకాశించే సిరులు కురిపిస్తుంది. ధీరస్వభావం యశస్సును ఉన్నతంగా పెంచుతుంది. అయితే ఆ ధైర్యం కలగాలి - అంటే నరుడికి కాలపునడకను గూర్చిన జ్ఞానం ముందు కలగాలి.

విశేషం: ధైర్యం మానసిక లక్షణం. ఆరోగ్యం శరీర సంబంధి. అయినా ఆ మనోలక్షణం శరీరాన ఆరోగ్యాన్ని కలిగిస్తుంది అంటున్నాడు భారతకర్త. నిజమే మనఃప్రభావం శరీరంమీద పడటం సహజమైన వాస్తవమైన, విషయం. ఆధునిక వైద్యశాస్త్రమూ ఈ అంశాన్ని అంగీకరిస్తుందని తద్జ్ఞుల కథనం.

ఇంద్ర బలి సంవాద ప్రకారము (సం. 12-220-6)

వ. ఏ తద్విషయం బైన యది యొక్కటి యింద్ర బలి సంవాదం బను నితిహాసంబు గల; దాకర్ణింపుము. దేవాసురులకు సమరంబు సెల్లిన నందు విష్ణుని మహానుభావంబున దేవతలకు గెలుపై రుద్రాదిత్య మరుద్వసు గంధర్వ సిద్ధాదులు పరివేష్టింప నింద్రుం డైరావతారూఢుండై లీలం ద్రైలోక్యంబును జరించుచుండి యొకప్పుడు సముద్రోపాంతంబున నొక్క గిరిగహ్వరంబున యంగణంబున వైరోచనుం డగు బలిం గని చేరం జని యద్దనుజపతి దన్నుం జూచి నిస్సంభ్రముండును వైమనస్యరహితుండును నై యునికి నిరూపించి, యతనితో నిట్లనియె. 422

ప్రతిపదార్థం: ఏతద్+విషయంబు+ఐన+అది= ఈ విషయానికి చెందింది; ఒక్కటి= ఒక; ఇంద్రబలి సంవాదంబు+అను= ఇంద్రుడి యొక్క బలియొక్క సంభాషణం అనే; ఇతిహాసంబు= వృత్తాంతం; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; దేవ+అసురులకున్= దేవతలకు రాక్షసులకును; సమరంబు= యుద్ధం; చెల్లినన్= ముగియగా; అందున్= ఆ యుద్ధాన; విష్ణుని మహా+అనుభావంబునన్=

నారాయణుడి గొప్పతనం వలన; దేవతలకున్= సురలకు; గెలుపు+ఐ= జయం కలిగి; రుద్ర+ఆదిత్య మరుత్+వసు గంధర్వ సిద్ధ+ఆదులు= రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, గంధర్వులు, సిద్ధులు మొదలయినవారు (వీరందరూ దేవజాతి విశేషాలు); పరివేష్టింపన్= చుట్టిరాగా; ఇంద్రుండు= దేవరాజు; ఐరావత+ఆరూఢుండు+ఐ= ఐరావతమును (తెల్లని ఏనుగు - ఇంద్రుడి వాహనం) ఎక్కినవాడై; లీలన్= విలాసంగా; త్రైలోక్యంబును= ముల్లోకాలను; చరించుచున్+ఉండి= తిరుగుతూ ఉండి; ఒకప్పుడు= ఒక సమయాన; సముద్ర+ఉప+అంతంబునన్= సముద్రపు సమీపాన; ఒక్క గిరిగహ్వరంబునన్= ఒక కొండగుహలో; అంగణంబునన్= ముంగిలియందు; వైరోచనుండు+అగు= విరోచనుడి తనయుడగు; బలిన్= బలి (చక్రవర్తి)ని; కని= చూచి; చేరన్+చని= సమీపించి; ఆ+దనుజపతి= ఆ రాక్షసరాజు; తన్నున్+చూచి= తనను కనుగొని; నిస్+సంభ్రముండును= తొట్రుపాటు లేనివాడును; వైమనస్య రహితుండును= మనస్సు చెడినవానితనంలేనివాడును; ఐ+ఉనికి= అయి ఉండటం; నిరూపించి= గట్టిగా గ్రహించి; అతనితోన్= ఆ బలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి చెందిన వృత్తాంత మొకటి ఇంద్ర బలి సంవాదం అనే పేరుతో ఉన్నది. దానిని వినుము. దేవాసురులకు యుద్ధం ముగిసిపోగా, దానిలో నారాయణుడి ప్రాభవంతో దేవతలకు గెలుపు కలిగింది. అనంతరం ఇంద్రుడు దేవతాపరివారమైన రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, గంధర్వులు, సిద్ధులు మొదలయినవారు చుట్టిరాగా ఐరావతాన్ని అధిరోహించి విలాసంగా మూడులోకాలూ సంచరిస్తూ ఒకనాడు సముద్రపు సమీపంలో, ఒక కొండ గుహ ముంగిట విరోచనుడి తనయుడైన బలిని చూచాడు. చూచి, అతడి దగ్గరకువెళ్ళి, ఆ రాక్షసరాజు తనను చూచి ఏ పాటి తొట్రుపాటూ, మనస్సులో కలతా లేనివాడై ఉండటం గమనించి, అతడితో ఇట్లా అన్నాడు.

క. 'హీనస్థానమున విభవ । హీనత నిట్లుండి రిపుల యెలమిఁ గనియు నీ
మానసమున శోకింపమి । దానవకులనాథ! యెవ్విధంబునఁ గలిగెన్? 423

ప్రతిపదార్థం: దానవకులనాథ!= ఓ రాక్షసవంశరాజా! - బలీ!; హీనస్థానమునన్= హీనమగుచోట; విభవహీనతన్= ఐశ్వర్యపు లేమితో; ఇట్లు+ఉండి= ఈ విధంగా జీవిస్తూ; రిపుల+ఎలమిన్= శత్రువుల అభివృద్ధిని; కనియున్= చూచికూడా; నీ మానసమునన్= నీ మనస్సునందు; శోకింపమి= దుఃఖింపకుండటం; ఏ+విధంబునన్= ఏ ప్రకారంతో - ఏ పద్ధతితో; కలిగెన్?= ఏర్పడింది?

తాత్పర్యం: ఓ రాక్షసరాజా! తక్కువస్థితిలో ఉన్నావు, ఐశ్వర్యం కోల్పోయి ఉన్నావు, శత్రువుల వికాసాన్ని చూచావు. అయినా నీ మనస్సులో శోకం కలుగలేదు. ఎందువలన? ఇది - ఈ నిర్వికారస్థితి నీకు ఏ విధంగా సిద్ధించింది?

ఆ. శౌర్యముననొ వృద్ధసంసేవ వలననొ । తపమునను యుదాత్తతా నిరూఢి
గలిగి మమ్ము సరకుగాఁ గొన కున్నాఁడ । వేమి కతము? దీని నెఱుఁగఁ జెపుమ!' 424

ప్రతిపదార్థం: శౌర్యముననొ= శూరగుణంవలననో; వృద్ధసంసేవవలనన్+ఒ= పెద్దల పరిచర్య వలననో; తపమునన్+ఒ= తపస్సు వలననో; ఉదాత్తతా నిరూఢి+కలిగి= గొప్పదనపు గట్టితనం కలిగి; మమ్మున్= దేవతల రాజులమైన మమ్ము కూడా; సరకుగాన్+కొనక+ఉన్నాఁడవు= లక్ష్యపెట్టకుండా ఉన్నావు; కతము ఏమి?= కారణం ఏమిటి? దీనిన్= ఈ కారణాన్ని; ఎఱుఁగన్+చెపుము+అ!= తెలిసేటట్లుగా పలుకవే!

తాత్పర్యం: ఓ బలీ! నీవు శూరభావంవలననో, కాక పెద్దల పరిచర్యల ఫలితంగానో, అటుకాక తపశ్శక్తివలననో ఉదాత్తతను సంపాదించి, నీ ఎదుట నిలిచిన దేవేంద్రులమైన మమ్ము సరకుజేయక ఉన్నావు. కారణ మేమిటి? విశదంగా వివరించుము'.

విశేషం: ఉదాత్తత అనే గొప్ప లక్షణం మొత్తం వ్యక్తిత్వానికి సంబంధించింది. నరుడి చూపులో, మాటలో, ప్రవృత్తిలో, క్రియలో ప్రతి కదలికలోనూ అది వ్యక్తమౌతూ ఉంటుంది. ఆ ఉదాత్తతవలననే సామాన్యులు మాన్యులుగా, వక్తలు ప్రవక్తలుగా, పురుషులు పురుషోత్తములుగా మారి మానవ సమాజాలను నడిపించారు.

వ. అనిన విని బలి యతని కిట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; బలి= బలిదానవరాజు; అతనికిన్= ఆ దేవరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంద్రుడి ప్రశ్నకు బలి ఇట్లా సమాధానం ఇచ్చాడు.

ఆ. 'సరకు సేయ వను చసడ్డమాటలు గొన్ని। యాడినంత నేమియయ్యె నింద్ర!
నీదుశక్తి వింతయే దైవవశమున। నెట్టిపాటివారు నెట్లుఁ గారె? 426

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓయీ ఇంద్రుడా!; సరకు+చేయవు+అనుచున్= లక్ష్యపెట్టవు అంటూ; అసడ్డమాటలు+కొన్ని= అశ్రద్ధ - నిర్లక్ష్య భావంతోడి పలుకులు కొన్ని; ఆడిన+అంతన్= పలికినంత మాత్రాన; ఏమి+అయ్యెన్= ఏమి అయింది? (ఏమీ కాదు); నీదు శక్తి= నీ శక్తి; వింత+ఏ= ఆశ్చర్యకరమా? కాదు; దైవవశమునన్= విధివశాన - విధాత చేష్టలవలన; ఎట్టిపాటివారున్= ఏ విధమైన గొప్పదనం కలవారు కూడా; ఎట్లున్+కారె?= ఏ విధంగానో - ఏ పాటి గొప్పదనమూ లేనివారుగా కారా?

తాత్పర్యం: 'ఓయీ ఇంద్రదేవా! నీవు పలికిన 'సరకుచేయవు' వంటి మాటలు అశ్రద్ధతో నిర్లక్ష్యభావంతో కూడినవి. ఆ పలుకులవలన ప్రయోజన మేమిటి? నీశక్తిసామర్థ్యాలు ఆశ్చర్యకరాలు గావు. అది తెలిసిన విషయమే. విధిచేష్టలవలన ఏపాటివారికైనా అపుడపుడు హైన్యదైన్యాలు తప్పవు.

క. నీవు మును హీనుఁ డగుటయు। నా వలనం గాదు; నీకు ననుఁ హీనదశా
భావితునిఁ జేయరా దివి। దైవకృతము; లట్లుగాన ధైర్యము వలయున్. 427

ప్రతిపదార్థం: మును= పూర్వం; నీవు= దేవతల రాజువైన నీవు; హీనుఁడు+అగుటయున్= తక్కువవాడవు కావటం, నేను దండెత్తినపుడు రాజ్యం కోల్పోయి ఇక్కట్లపాలు కావటం; నావలనన్+కాదు= నా శక్తివలన కాదు; (అట్లే); నీకున్= నీకు కూడా; ననున్= రాక్షసరాజునైన నన్ను; హీనదశాభావితునిన్= తక్కువదనమును పొందిన వాడినిగా - రాజ్యభ్రంశాది కష్టాలపాల బడినవాడినిగా; చేయన్+రాదు= చేయ శక్తి చాలదు; ఇవి= ఈ కష్టనష్టాలు - పూర్వం నీకు, ఇపుడు నాకు జరిగినవి; దైవకృత్యములు= విధి చేష్టితములు; అట్లు+కాన= అ ట్లగుటను బట్టి - ఆ కారణాన; ధైర్యము= ధీరలక్షణం; వలయున్= కావలయును.

తాత్పర్యం: ఇంద్రా! పూర్వం నేను దండెత్తివచ్చినప్పుడు నీవు రాజ్యభ్రష్టుడవై హీనతను పొందావు. అయితే నిజానికి అది నావలన జరిగినది కాదు. ఆ విధంగానే నేడు నేను రాజ్యం కోల్పోయి దైన్యంతో ఉన్నట్లు అగుపిస్తున్నాను. ఈ నా స్థితికి నీవు కారణం కాబోవు. ఇవి నీవలనా, నావలనా జరిగే, జరిగిన పనులుకావు. వీటికి కర్త విధి. కాబట్టి, విధి చేష్టలకు తిరుగులేదు - అనే జ్ఞానంతో నరుడు ధైర్యం కలిగి ఉండాలి.

క. వినుఁ పర్యాయంబున సుఖ। మును దుఃఖముఁ జెందు జనులఁ బురుషుఁడు ధైర్యం
బున గర్వంబు విషాదం। బు నడంగింపఁ దగునంద్రు బుధు లది వినమే? 428

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము ఇంద్రా!; జనులన్= నరులను; పర్యాయంబునన్= క్రమంగా - వంతు ప్రకారంగా; సుఖమును= సౌఖ్యమూ; దుఃఖమున్= విషాదమూ; చెందున్= పొందుతాయి; (కాబట్టి) బుధులు= పండితులు; పురుషుఁడు= నరుడు; ధైర్యంబునన్= ధీరగుణంతో; గర్వంబు= పొగరు - పొంగిపోవటం (సుఖం కలిగినపుడు); విషాదంబున్= దుఃఖమును (కష్టం కలిగినపుడు); అడంగింపన్+తగును= అణచటం ఉచితం; అండ్రు= అంటారు; అది= ఆ మాట; వినము+ఏ= వినలేదా?

తాత్పర్యం: ఇంద్రా! ఆలకించుము, జీవితాన సుఖదుఃఖాలు క్రమంగా ఒకదాని తరువాత మరొకటిగా నరులను చెందుతూ ఉంటాయి. ఆ క్రమం తప్పించరానిది. కాబట్టి నరుడు ధైర్యంతో మెలుగుతూ, సుఖం కలిగినప్పుడు గర్వాన్నీ, దుఃఖం కలిగినపుడు విషాదాన్నీ ప్రకటించకుండా అణచుకొనవలసి ఉంటుంది - అని పండితులు పలుకుతారు. మనం ఆ మాట వినలేదా? విన్నాం కదా!

క. చెలులుం జుట్టలును సహా । యులు విభవము పెం పకాలయుక్తి నవస్థం
దొలఁగించుట గలదె? మదిం । దెలిసి మనుము మనికి యిట్టిదియ కా దెపుడున్. 429

ప్రతిపదార్థం: చెలులున్= స్నేహితులూ; చుట్టలును= చుట్టములు పక్కములూ; సహాయులు= తోడ్పడేవారూ; విభవము= సంపద; పెంపు= అభివృద్ధి - ఇవన్నీ; అకాలయుక్తిన్= సరిగాని కాలంతోడి కలయికను; అవస్థన్= దశను - దుర్దశను; తొలఁగించుట= ప్రక్కకు తప్పించటం - దూరీకరించటం; కలదె?= ఉన్నదా? (లేదు); మదిన్= మనస్సునందు; తెలిసి= గ్రహించి; మనుము= జీవించుము; మనికి= జీవితం; ఎపుడున్= ఎల్లప్పుడూ; ఇట్టిది+అ= ఇటువంటిదే - ఒకే విధమైనది; కాదు= కాబోదు.

తాత్పర్యం: నరుడి మహర్దశకుగాని దుర్దశకుగాని దైవమొకటే కారణం గాని ఇతరులెవరూ కాజాలరు. స్నేహితులూ, చుట్టపక్కాలు, సహాయకులూ, సంపదలూ, సమృద్ధులూ - ఇటువంటివి ఎన్ని ఉన్నా, నరుడికి చెడుకాలం దాపురించినపుడు, దుర్దశ ఆవహించబోతున్నపుడు తొలగించజాలవు. ఈ విషయం మనస్సున గ్రహించి నరుడు జీవించాలి. జీవిత మెప్పుడూ ఈ విధంగానే ఏకరీతిలో కొనసాగదని గ్రహించి జీవించుము దేవరాజా!

విశేషం: పురుషకారం దైవం ముందు దిగదుడుపు అనే విషయం గ్రహించాలి నరుడు.

క. నిను నే గెలుచుట కాలము । నన నీవును గాలయుక్తి నను గెలిచితి; గా
వున నశుభమునకు శుభమున । నకు గాలము సూవె కర్త కుశికతనూజా! 430

ప్రతిపదార్థం: కుశిక తనూజా!= ఓ కుశికుడి కుమారుడా! - ఇంద్రుడా!; నినున్= దేవతలరాజు వైన నిన్ను; నేన్= రాక్షసరాజునైన నేను; గెలుచుట= జయించటం; కాలమునన= కాలవశముననే; నీవును= నీవు కూడా; కాలయుక్తిన్= కాలముయొక్క కలయికతో-కాలం కలసిరాగా; ననున్+గెలిచితి(వి)= నన్ను జయించావు; కావునన్= కాబట్టి - మన జయాపజయాలు కాలాధీనాలు కాబట్టి; అశుభమునకున్= కీడునకు; శుభముననకున్= మేలునకును; కర్త - చేయునది; కాలము+చూవె= కాలం సుమా

తాత్పర్యం: పూర్వం దేవేంద్రుడ వైన నిన్ను రాక్షసరాజునైన నేను జయించాను. దానికి కర్త కాలమే తప్ప, నిజానికి నేను కాదు. ఆ విధంగానే నీవూ నన్ను గెలిచావు అనంతరకాలాన. దానికీ కర్త కాలమొక్కటే! నరుడికి వాటిల్లే శుభాశుభాలు రెండింటికీ కాల మొక్కటే కర్త తప్ప నరుడు కాబోడు.

ఆ. నాకు నీకు నేల నాకేశ! శత్రుత్వ । మేరి కైనఁ గలదె యెందుఁ? బాక
మునకుఁ దెచ్చుచుండు జనులఁ గాలము వృక్ష । ఫల విధముగ రజ్జు పలుకు లుడుగు.' 431

ప్రతిపదార్థం: నాక+ఈశ!= స్వర్గాధిపతీ! నాకున్+నీకున్= నాకూ, నీకూ; శత్రుత్వము+ఏల?= వైరం ఎందుకు?; ఎందున్= ఎక్కడనైననూ; ఏరికిన్+ఐనన్= ఎవరికైనా; కలదె?= ఉన్నదా? (శత్రుత్వం); కాలము= కాలం - కాలశక్తి; జనులన్= నరులను; వృక్షఫల విధముగన్= చెట్టుపండు రీతిగా - చెట్టున ఏర్పడిన కాయ పండైన విధాన; పాకమునకున్= పరిణతికి - పండే స్థితికి; తెచ్చుచున్+ఉండున్= తెస్తూ ఉంటుంది; రజ్జు పలుకులు= వ్యర్థ భాషణములు - కొరగాని పలుకులు; ఉడుగు(ము)= మానుము.

తాత్పర్యం: ఓ స్వర్గాధిపతీ! దేవేంద్రా! నీకూ నాకూ విరోధ మెందుకు? నీకూ నాకే కాదు, లోకాన ఎవరికైనా ఎక్కడైనా స్వతస్సిద్ధమైన వైరభావ మున్నదా! లేదు. అంతా కాలమహిమ! కాలమే నరులను పరిణతివైపు ప్రయాణింపజేస్తూ ఉంటుంది. చెట్టున పండిన కాయ పండుగా పరిణతిని కాలక్రమాన పొందినట్లుగానే నరుడూ పరిపాకంవైపు నడుస్తుంటాడు కాలప్రభావంవలన. అంతే తప్ప, నీవూ నేనూ కర్తలమనటం కొరగాని మాట. కాబట్టి వ్యర్థ భాషితాలు మానుము'.

వ. అని చెప్పి యంత నిలువక. 432

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పి= పలికి; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా (బలి తన హితవచనాలు ముగించి, అంతటితో ఆగకుండా.)

తాత్పర్యం: బలి ఇంకా తన భాషణాన్ని ఇట్లా సాగించాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'కా దిది విక్రమకాలము । లే దిప్పుడు నాకు నలుక లీలాత్మక రో
షాదరము గలిగినను నిను । నీ దగు పరిజనముఁ గూల్పనే పెడసేతన్?' 433

ప్రతిపదార్థం: ఇది= ఇపుడు నేనున్న ఈ సమయం; విక్రమకాలము= విక్రమించు పరాక్రమించే సమయం; కాదు= కాదు; ఇప్పుడు= ఈ సమయాన; నాకున్= నాకు - నీనుండి ఓటమిపొందిన నాకు; అలుక= కోపం; లేదు= కలుగదు; లీలా+ఆత్మక రోష+ఆదరము= వినోదాత్మకమైన - నిజం కాని క్రోధము నందు గౌరవం - ప్రీతి; కలిగినను= (నాలో) పుట్టినా; నినున్= నిన్నూ; నీది+అగు= నీకు చెందిన; పరిజనమున్= సేవక జనులను; పెడ+చేతన్= చేతి వెనుక భాగంతో; కూల్పనే?= నశింపజేయనా?

తాత్పర్యం: 'ఓ దేవేంద్రా! ఇపుడు నే నున్న ఈ కాలం పరాక్రమించటానికి అనువైనది కాదు. నాకు నీపై కోపమూ లేదు. అట్లాకాకుండా వినోదంకోసమైనా నాలో నీయెడ రోషావేశం జనించినా, నిన్నూ నీ తోడి జనాన్నీ నా పెడచేతితోనే కూల్చివేసేవాడను'.

వ. అని పలికి వెండియు. 434

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; వెండియున్= మరియూ.

తాత్పర్యం: ఈ విధంగా పలికిన బలి, ఇంకా చెప్పుతున్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'సరి పెంపునఁ గడునొప్పెదు । సురనాయక! యిపుడు మీఁదఁ జూచెదు నీకుం
బరిభవము దెచ్చుటకునై । కరము వెసన్ వచ్చు చేటుకాలము తెఱఁగున్. 435

ప్రతిపదార్థం: సురనాయక!= ఓ దేవతలరాజా!; సరిపెంపునన్= సమానమైన అభివృద్ధితో; కడున్+ఒప్పెదు= ఎక్కువగా ప్రకాశిస్తున్నావు; ఇపుడు= ఈ కాలాన - ఈ పెంపుగల సమయాన; మీఁదన్+చూచెదు= పైకి చూస్తున్నావు; నీకున్= నీకు కూడా (నాకువలెనే); పరిభవము= అవమానం; తెచ్చుటకున్+ఐ= తేవటంకొరకే; చేటుకాలము తెఱఁగున్= చెడుకాలం యొక్క పద్ధతి - చెడుకాలం; కరము= మిక్కిలి; వెసన్= వేగంగా; వచ్చున్= రాగలదు.

తాత్పర్యం: 'ఓ దేవతలరాజా! నేడు మంచి అభివృద్ధితో ఎంతగానో ఒప్పులకుప్పవై వెలుగుతున్నావు. పైకి చూస్తూ ఉన్నావు. గర్వించి, ఇతరులయెడ అనాదరంతో వెలుగుతున్నావు. కాని, చేటుకాలం నిన్ను అవమానించటంకొరకు మిక్కిలి వేగంతో సమీపించబోతూ ఉన్నది.

తే. ఇంద్రు లెందఱు వో? రింద్రు లేల? బ్రహ్మ । లుండుదురె? తఱితోఁ దెగుచున్న వారు
గాక దానవసంఘంబు గాలవశతఁ । బొందు టేటికి నెగ్గింపఁ? బొమ్ము నీవు. 436

ప్రతిపదార్థం: ఇంద్రులు= దేవతలరాజులు; ఎందరు+పోరు?= ఎంతమంది వెళ్ళిపోరు? - ఎందరో గతించారు; ఇంద్రులు+ఏల?= ఇంద్రులే ఎందుకు?; బ్రహ్మలు= ఇంద్రులకంటె పైవారయిన బ్రహ్మనామక దేవతలు మాత్రం - సృష్టికర్తగా చెల్లేవారు మాత్రం; ఉండుదురె?= ఉంటారా?; తఱితోన్= సమయంతో - కాలంతో; తెగుచున్+ఉన్నవారు+కాక= నశిస్తూ ఉన్నారు తప్ప; దానవసంఘంబు= రాక్షసుల సమాజం; కాలవశతన్= కాలానికి వశం అగుటను; పొందుట= చెందటం - కాలవశత్వాన్ని పొందుటను; ఎగ్గింపన్+ఏటికిన్?= నిందింప నేల?; నీవు= సురేంద్రుడ వైన నీవు; పొమ్ము= వెడలిపొమ్ము - వీడిపొమ్ము.

తాత్పర్యం: కాలప్రవాహంలో ఇంద్రులు ఎందరో గతించారు. ఇంద్రులే ఏమిటి? బ్రహ్మలు మాత్రం నిలుస్తారా? వారూ, తమ కాలం చెల్లిన వెంటనే నశించిపోతున్నారు. ఈ విధంగా కాలంముందు సృష్టికర్తలైన బ్రహ్మలకే స్వతంత్రమైన ఉనికి లేనప్పుడు, ఇక రాక్షససమాజ మేదో కాలానికి లొంగి ఉంటే, ఆ దశను చూచి వారిని నిందించటమెందుకు? ఓ దేవరాజా! నీవు వెళ్ళిపొమ్ము.

క. క్రతువులు సేఁతయు, దేవ । వ్రతములు సల్పుటయు, వృత్తవంతుఁ డగుటయుం
గతమే కాలము ద్రోచుట? । కతర్క్యవర్తనము గాల మది గొనదు సుమీ!' 437

ప్రతిపదార్థం: క్రతువులు= యజ్ఞాలు; చేఁతయున్= చేయటమూ; దేవవ్రతములు= దేవతలకై వ్రతాలు - పూజాపురస్కారాలు; చల్పుటయున్= చేయటమూ; వృత్తవంతుఁడు+అగుటయున్= చరిత్ర (మంచినడత) కలవాడు కావటం; కాలము+త్రోచుటకున్= కాలం పడవేయుటకు - నెట్టివేయుటకు - హీనదశకు చేర్చుటకు; కతమే?= కారణమా? (కాదు); కాలము= క్షణాలు - గంటలు- దినాలు - వత్సరాలుగా సాగిపోయే సమయం; అతర్క్యవర్తనము= ఊహించరాని ప్రవర్తనంగలది - ఊహ కందని నడతగలది; అది= ఆ కాలం; కొనదు+చుమీ!= గ్రహించదు సుమా! (ఇక్కడ కర్మ పదం లేదు. 'దేనినీ' గ్రహించదు అని అనుకొనాలి).

తాత్పర్యం: యజ్ఞాలూ, వ్రతాలూ నిర్వహించటం, శీలవంతుడై జీవించటం వంటి విషయాలు కాలగతిని మార్చలేవు. కాలగతికి అవి కారణాలు కాజాలవు. కాలప్రవర్తన ఊహ కందనిది. కాలం దేనినీ సరకుగొనదు; అన్నీ దానికి లొంగవలసినవే కాని, అది దేనికీ లొంగేది కాదు'.

క. అని యిట్లాడిన మాటలు । విని దనుజునిఁ జూచి యమరవిభుఁ డుల్లములో
నన సంరంభంబు నుడిపి । కొనుచు నతని కిట్టు లనియెఁ గురువంశవరా! 438

ప్రతిపదార్థం: కురువంశవరా!= కౌరవ వంశాన శ్రేష్ఠుడా! ధర్మరాజా!; అని= పై విధంగా; ఇట్లు+ఆడిన మాటలు= ఈ విధంగా పలికిన పలుకులు; విని= ఆలకించి; దనుజునిన్= రాక్షసుడిని - బలిని; చూచి= కనుగొని; అమరవిభుఁడు= దేవరాజు - ఇంద్రుడు; ఉల్లములోనన్+అ= మనస్సునందే; సంరంభంబును= తొట్రుపాటును; ఉడిపికొనుచున్= పాపుకొంటూ - తొలగించుకొంటూ; అతనికిన్= ఆ బలికి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పలికి బలిని చూచి, దేవేంద్రుడు మనసులోనే తన తొట్రుపాటును అణచుకొంటూ ఇట్లా పలికాడు.

విశేషం: బలి మాటలకు ఇంద్రుడు సంరంభం పాలైనట్లు భారతకర్త వాకొంటున్నాడు. ఆ తొట్రుపాటు బలికి గల జ్ఞానసంపత్తిని చూచి కావచ్చును. లేక 'లీలగా ఆగ్రహం కలిగినా నిన్నూ నీ వారిని పెడచేతితో కూలుస్తాను - అన్న అతడి స్థైర్యానికీ కావచ్చు.

క. 'అకట! భవచ్చిత్తము ని । ర్వికారమై భరితధృతి వివేకవినయశాం
తిక మగుచు వెలింగెడు దీ । నికిఁ గారణమైన నిష్ఠ నెఱి యెట్టిదియో!' 439

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; భవత్+చిత్తము= నీ మనస్సు; నిర్+వికారము+ఐ= వికృతులు లేనిదై; భరిత= నిండిన; ధృతి= ధైర్యం; వివేక= తెలివి; వినయ= అణకువ; శాంతికము= శాంతిగలది; అగుచున్= అవుతూ; వెలింగెడున్= ప్రకాశిస్తున్నది; దీనికిన్= ఈ స్థితికి; కారణము+ఐన= హేతువైన; నిష్ఠ= పట్టుదల; నెఱి= ధర్మం; ఎట్టిది+ఓ!= ఏ విధమైనదో!.

తాత్పర్యం: 'ఓ బలీ! నీ మనస్సు వికారాలకు దూరంగా, ధైర్యం, వివేకం, వినయం, శాంతి - అనే ఈ సద్గుణాలకు నిలయంగా వెలుగుతూ ఉన్నది. మరి ఈ నిర్వికారస్థితికీ, సౌశీల్యశాంతులకూ కారణమైన ఆ అభినివేశం ఎటువంటిదో! ఆ ధర్మం ఏ పాటిదో!'

విశేషం: ఇక్కడ ఇంద్ర వచనంలో 'అకట' అనే దుఃఖసూచక పదం కనిపిస్తున్నది. అది నిజంగా నిర్వేదానికి వాచకమే. ఇంద్రుడు ఈ గొప్ప లక్షణాలు తన విరోధిలో ఉండి, తనలో లేకపోవటానికి లోలోన దుఃఖిస్తూ అన్న మాటగా ఉన్నది అది.

క. అనిన నతఁ డతని కిట్లను । 'విను మనిషనాథ! యేను వేఱొకచోటం
గొని వచ్చితినే చిత్తం । బున కవికృతి ధృతి వివేక ముఖ్య గుణంబుల్? 440

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతఁడు= ఆ బలి; అతనికిన్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అనున్= ఈ విధాన చెప్పాడు; అనిమిషనాథ!= రెప్పపాటులేనివారికి - దేవతలకు రాజా! - ఇంద్రుడా!; వినుము= ఆలకించుము; ఏను= నేను; చిత్తంబునకున్= మనస్సునకు; అవికృతి ధృతి వివేక ముఖ్య గుణంబుల్= వికారం లేకపోవటం, ధైర్యం, జ్ఞానం - మొదలయిన గుణాలను లక్షణాలను; వేఱు+ఒకచోటన్= వేరే ఇతర స్థలంనుండి; కొని= తీసికొని; వచ్చితినే?= వచ్చానా? (కాదు).

తాత్పర్యం: ఇంద్రుడి ప్రశ్న విన్న బలి అతడితో ఇట్లా అన్నాడు. 'ఓ దేవతలరాజా! వినుము. నేను నా చిత్తానగల గుణాలు - నిర్వికారత, ధైర్యం, జ్ఞానం మొదలయిన వాటిని వేరొకచోటునుండి తీసికొని వచ్చానా? కాదు. అవి నాలో స్వతఃఏర్పడినవే.

వ. కాలప్రకారం బెఱుంగుదుం గావునఁ గలంగ కుండుదు. 441

ప్రతిపదార్థం: కాలప్రకారంబు= కాలముయొక్క రీతి - విధానం - ప్రవర్తించే తీరు; ఎఱుంగుదున్= తెలియుదును; కావునన్= కాబట్టి; కలంగక+ఉండుదున్= కలతచెందకుండా ఉంటాను.

తాత్పర్యం: నేను కాలతత్త్వాన్ని, అది ప్రవర్తించే తీరుతెన్నులను గ్రహించినవాడను కాబట్టి, నిర్వికారంగా ధైర్యంతో ఉంటాను.

తే. చెప్పుచున్నాఁడఁ గాలంబుచేత నెల్ల । విధముఁ జొప్పడు జనులకు వినుము కాల
మప్రమాదవర్తన మధిక ప్రమాద । సంగమత్తులు వా రెట్లు భంగపడరు? 442

ప్రతిపదార్థం: చెప్పుచున్+ఉన్నాఁడన్= పలుకుతున్నాను; కాలంబుచేతన్= కాలంవలన; జనులకున్= నరులకు; ఎల్లవిధమున్+చొప్పడున్= అన్ని తీరులూ కలుగుతాయి; వినుము= ఆలకించుము; కాలము= సమయం; అప్రమాద వర్తనము= పరాకులేని ప్రవర్తన - నడవడి కలది; అధిక ప్రమాద సంగమత్తులు= ఎక్కువ పరాకు కలయికతో మదించినవారు; వారు= జనులు; ఎట్లు భంగపడరు?= ఏ విధంగా (కాలంచేతిలో) భంగపాటు చెందకుండా ఉంటారు? ఉండలేరు - తప్పకుండా భంగపడితీరుతారు.

తాత్పర్యం: ఓ దేవేంద్రా! చెప్పుతున్నాను వినుము. కాలంవలననే నరులకు అన్ని తీరులూ, ఎల్ల అవస్థలూ, సకలదశలూ కలుగుతాయి. కాలం ప్రమాదమెరగకుండా జాగరూకతతో ప్రవర్తిస్తూ ఉంటుంది. దాని గమనంలో పరాకుకు స్థానం లేదు. అయినప్పుడు అధికప్రమాదాలలో పడి మత్తులయినవారు కాలంనుండి భంగపడకుండా ఎట్లా తప్పించుకుంటారు? తప్పించుకొనలేరు.

క. కళలుం గాష్ఠలు లోనుగఁ । గల చిదురులఁ గూర్చుకొనుచుఁ గాలంబు జనం
బుల వడ్డికిచ్చు నాతని । వల నలవడఁ బోదివి తనకు వశ్యులఁ జేయున్. 443

ప్రతిపదార్థం: కాలంబు= కాలం; కళలున్= ముప్పై కాష్ఠల భాగాలును - కాలపు చిన్నముక్కలును; కాష్ఠలున్= పద్దెనిమిది రెప్పపాట్ల కాలాలూ - కాలపు మరీ చిన్న ముక్కలును; లోనుగన్= లోపల కాగా; కల చిదురులన్= ఉన్న ముక్కలను; కూర్చుకొనుచున్= చేర్చుకొంటూ; జనంబులన్= జనులను; వడ్డికి+ఇచ్చు+ఆతని వలను= వడ్డీకి (డబ్బు) ఇచ్చేవాడి తీరు; అలవడన్= అలవాటుగా కాగా; పోదివి= వ్యయం చేయక ఉండి; తనకున్= తనకు (కాలానికి); వశ్యులన్+చేయున్= వశమయ్యే వారినిగా చేస్తుంది.

తాత్పర్యం: కాలస్వరూపాన పెద్దముక్క సంవత్సరమైతే, చిన్నముక్క కళ. కళ అంటె ముప్పై కాష్ఠల ప్రమాణంగల కాలం. కాష్ఠమనేది కళకంటె చిన్నదైన కాలపుముక్క. పద్దెనిమిది రెప్పపాట్లకాలం ఒక కాష్ఠ. కాలం ఈ చిన్న, మిక్కిలి చిన్న ముక్కల రూపాన తనను తాను సమకూర్చుకుంటూ, పెరిగి, ఇంకా పెరిగి పెరిగి చివరకు జగత్తునే కబళిస్తుంది. చిన్న చిన్న శకలాల రూపాన పెరిగి పెరిగి పెద్దదయ్యే కాలం ఒక వడ్డీ వ్యాపారివంటిది - వడ్డీవ్యాపారి కూడా చిన్న చిన్న మొత్తాలతో ప్రారంభించి, పెద్ద పెద్ద మిక్కిలి పెద్ద మొత్తానికి అధిపతి అవుతాడు. కాలమూ అంతే. ముందు కాష్ఠలతో అనంతరం కళలతో, నిమిషాలతో, గంటలతో, దినాలతో. . . . అట్లా పెరిగి పెరిగి చివరకు విశ్వంభరగా లోకమంతా తానే అయి సర్వస్వాన్నీ స్వాధీనంచేసికొంటుంది. నరులందరూ ఆ విధంగా చివరకు కాలాధీనులై పోతారు.

విశేషం: అలం: ఉపమ. కాలం తనను తాను పెంచుకొంటూ పోయే విధానాన్ని తేటతెల్లంగా చెప్పదలచి భారతకర్త ఇక్కడ వడ్డీవ్యాపారిని పోలికగా చూపాడు. ప్రారంభం అల్పంగా ఉండి, పరిసమాప్తి అనూహ్యపరిమాణంలో మిక్కిలి పెద్దదిగా ఉండే విషయాన్ని చెప్పటానికి ఈ పోలిక ఉచితమే. పైగా ఈ పెరుగుదల ఎట్ట ఎదుటే జరుగుతుంటుంది. అయినా నరుడు పట్టించుకొనడు. ఆధ్యాత్మవిషయావగాహనకు లౌకిక ఉపమాన స్వీకారం జరిగింది ఇక్కడ.

క. కాల మడఁగించుఁ జనుఁ గ । ల్లోలిని గిరిఁ ద్రెంచుకరణి లోభక్రోధా
శీలత్వ కామ భయములఁ । దేలు జనుఁడు కాలవృత్తి తెఱఁగు నెఱఁగునే? 444

ప్రతిపదార్థం: కాలము= సమయం; జనున్= నరుడిని; కల్లోలిని= నది; గిరిన్+త్రెంచు కరణిన్= కొండను కోసే విధంగా; అడఁగించున్= నశింపజేస్తుంది; లోభ క్రోధ+అశీలత్వ కామ భయములన్= పేరాస, రోషం, శీలహీనత, కోరిక, భీతి - ఇన్ని దుర్గుణాలలో; తేలు= పడి కొట్టుకొనే; జనుఁడు= నరుడు; కాలవృత్తి తెఱఁగున్= కాలముయొక్క ప్రవర్తన విధానమును - కాలం ప్రవర్తించే తీరును; ఎఱఁగునే?= గ్రహించునా? (గ్రహించడు).

తాత్పర్యం: కాలం ఒక నది. అది నిరంతర ప్రవాహశీలి. నది తన ప్రవాహవేగంతో కొండను కోసివేసి, తన దారిని తానూ సాగిపోతుంది. కాలమూ అంతే. తన గమనంతో నరుడిని లోగొని అణచివేస్తుంది. అయితే నరుడు మాత్రం ఈ వాస్తవాన్ని గ్రహించటంలేదు. అతడు తన దుర్గుణవలయంలో పడి కొట్టుకొంటూ ఉన్నాడు. లోభమూ, క్రోధమూ, శీలరాహిత్యమూ, కామమూ - అనే దుర్గుణాలలో చిక్కుకొని, భయవిహ్వలుడై బ్రతుకుతూ కాలప్రవృత్తిని గమనించలేకున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ఇంతకు మును సూచితి నతఁ । డెంతయు నొప్పుగొని యుండె; నిది గడుఁ జిత్రం;
బింత వెసఁ జచ్చె ననుఁ దనుఁ । జింతింపఁడు జనుఁడు మూఢచిత్తత్వమునన్. 445

ప్రతిపదార్థం: జనుఁడు= నరుడు; ఇంతకు మును= ఇంతకు పూర్వం; చూచితిన్= చూచాను; అతఁడు= ఆ నరుడు (ఒకానొకడు); ఎంతయున్= ఎంతగానో - ఎక్కువగా; ఒప్పు+కొని= గుణం కలిగి; ఉండెన్= (జీవించి) ఉన్నాడు; ఇది= ఈ విషయం; కడున్+చిత్రంబు= మిక్కిలి విచిత్రం; ఇంత వెసన్= ఇంత వేగంగా; చచ్చెన్= చనిపోయాడు; అనున్= అని పలుకుతారు; మూఢచిత్తత్వమునన్= జ్ఞానహీనమైన మనస్సువలన; తనున్= తనను గురించి; చింతింపఁడు= ఆలోచించడు.

తాత్పర్యం: నరుడు కాలమహిమను గమనించలేక, అపుడపుడు జరిగే హఠాత్ సంఘటనలను చూచి, 'ఇంతకుముందే చూచానే, చాలా బాగా ఉన్నాడు, మరీ విచిత్రంగా ఉన్నది, ఇంత త్వరగా పోయాడే!' అంటూ ఇతరులగూర్చి ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ ఉంటాడు. అతడి చిత్తం వివేకవిహీనం కాబట్టి, ఆ విధంగా తలపోస్తున్నాడు తప్ప నిజానికి ఆ సంఘటన తనకూ ఎంతో దూరాన లేదు. అయితే ఆ ఆలోచనే అతడికి రాదు.

క. వినుఁ భావాభావంబులు । గని యత్యుత్తమ తపంబు గైకొను విద్వ
జ్జనుఁడు గనుఁ గాలగతి యె । ల్లను గరతలశోభితామలకముం బోలెన్. 446

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము ఇంద్రా!; భావ+అభావంబులు= ఉనికి, లేములు - ఉండుట - ఉండకుండుటలు; కని= గ్రహించి; అతి+ఉత్తమ తపంబు= మిక్కిలి శ్రేష్ఠమైన తపస్సు; కైకొను= స్వీకరించే - చేసే; విద్వత్+జనుఁడు= విద్వాంసుడు

- జ్ఞాని; కాలగతి+ఎల్లను= కాలముయొక్క పోకడ మొత్తమును; కరతల శోభిత+ఆమలకమున్+పోలెన్= అరచేత శోభించే (కల) ఉసిరిక కాయనువలె; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: నరుడు తొలుత అంతర్ముఖుడై (తనలోనికి తాను చూచుకొనేవాడై) భావాన్ని, అభావాన్ని గ్రహించాలి. ఉనికిని, లేమిని తెలిసికొనాలి. అనంతరం మిక్కిలి ఉత్తమరీతిలో తపస్సును ఆచరించాలి - తీవ్రమయిన జిజ్ఞాసతో నిరంతర తపనతో కాలతత్త్వాన్ని అన్వేషించాలి. అపుడు నరుడు విద్వాంసు డౌతాడు. అతడికి కాల ప్రవృత్తి మొత్తమూ అరచేత నుంచుకొన్న ఉసిరికకాయవలె స్పష్టంగా నిస్సందేహంగా గోచరిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. కాలగతి గనుట శాంతికి । మూలంబై యంతరంగమున కాత్మమయ
త్వాలంబనంబు నిచ్చుఁ ద । దాలీనుండైన పురుషుఁ డక్షోభ్యుఁ డగున్.' 447

ప్రతిపదార్థం: కాలగతి= కాలపు నడకను; కనుట= చూడటం - గ్రహించటం; శాంతికిన్= మనస్సుయొక్క శాంతికి - వికారాలు లేకుండుటకు; మూలంబు+ఐ= కారణమై; అంతర్+అంగమునకున్= లోపలి అవయవమునకు - మనస్సునకు; ఆత్మమయత్వ+ఆలంబనంబున్= ఆత్మమయత్వం - తాను ఆత్మ తప్ప శరీరం కాదనే తత్త్వం అనే ఆధారమును - ప్రాపును; ఇచ్చున్= ఒసగును; తద్+ఆలీనుండు+ఐన= దానిని అంటి ఉన్నవాడు; పురుషుఁడు= నరుడు; అక్షోభ్యుడు+అగున్= క్షోభింప దగనివాడు - క్షోభకు గురికాజాలనివాడు ఔతాడు.

తాత్పర్యం: కాలపు నడకను గ్రహించటం మనశ్శాంతికి కారణమౌతుంది. మనస్సునకు 'తాను ఆత్మగాని, శరీరం కాదు' అనే ఆత్మమయత్వ భావనను బాసటగా అందిస్తుంది. ఆ భావనను అందుకొన్న నరుడు క్షోభకు అతీతుడుగా మారిపోతాడు'.

వ. అనిన విని పాకశాసనుం డతని వివేకపాకంబున కచ్చెరువొంది యభినందించి యతని కిట్లనియె.448

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పాకశాసనుండు= స్వర్గపాలకుడు - ఇంద్రుడు; అతని వివేకపాకంబునకున్= ఆ బలియొక్క జ్ఞానపరిణతికి - పండిన జ్ఞానానికి; అచ్చెరువు+ఒంది= ఆశ్చర్యం పొంది; అభినందించి= ప్రశంసించి; అతనికిన్= ఆ బలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంద్రుడు బలికిగల జ్ఞానపరిపాకానికి చకితుడై, అతడిని మెచ్చుకొని, ఇట్లా అన్నాడు.

ఆ. 'దనుజనాథ! యివ్విధంబునఁ గాల చా । రిత్రవేదివై పవిత్రశీల
యుతుఁడ వైతి; నీవు కృతకృత్యుఁడవు; నీదు । వృత్తి గోరవలయు నుత్తములకు. 449

ప్రతిపదార్థం: దనుజనాథ!= ఓ రాక్షసరాజా!; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; కాలచారిత్ర వేదివి+ఐ= కాలముయొక్క నడతను గ్రహించినవాడవై; పవిత్రశీల యుతుఁడవు+ఐతి(వి)= పావనమైన స్వభావంగలవాడవు అయినావు; నీవు= జ్ఞానివైన నీవు; కృతకృత్యుండవు= చేయబడిన పనిగలవాడవు - చేయవలసినదానిని చేసినవాడవు - ప్రయోజనం నెరవేరినవాడవు; ఉత్తములకున్= శ్రేష్ఠనరులకు; నీదు వృత్తి= నీ యొక్క ప్రవర్తనం - నడత - జీవనం; కోరవలయున్= కోరుకొనదగింది - అనుకరించదగింది.

తాత్పర్యం: 'ఓ దానవరాజా! బలీ! నీవు కాలపు నడకను - అతిగహనమైన దానిని గ్రహించావు. పావనమైన శీలం కలిగి, నిర్మలజీవనం గడపుతున్నావు. నీవు కృతకృత్యుడవు. నీవు చేయవలసినది ఇక ఏదీ మిగిలిలేదు. నీ నడత, నీ జీవనం ఉత్తమమానవులకు శిరోధార్యమై వెలుగుతున్నది.

తే. లోక మెల్లను నఱచేతిలోన నున్న । యట్లు గనుగొని సత్త్వాదులైన మూఁడు
గుణములను బాయఁ బెట్టి నిర్గుణత వెలుఁగు । నాత్మఁ గనుచున్నవాఁడ; వే మందు నిన్ను! 450

ప్రతిపదార్థం: లోకము+ఎల్లను= జగత్తునంతటినీ; అఱచేతిలోనన్= చేతి మధ్యభాగాన - హస్తంలోపల; ఉన్న+అట్లు= ఉన్న విధంగా; కనుఁగొని= చూచి; సత్త్వ+ఆదులు+ఐన= సత్త్వం (రజస్సు తమస్సు అనేవి) మొదలైన; మూఁడు గుణాలను= త్రిగుణాలను; పాయన్+పెట్టి= పోగొట్టి - తొలగించికొని; నిర్+గుణతన్= గుణాలు లేనితనంతో; వెలుఁగు= ప్రకాశించే; ఆత్మన్= అంతరాత్మను; కనుచున్+ఉన్నవాఁడవు= చూస్తూ ఉన్నావు; నిన్నున్= ఇట్టి ఆత్మ దర్శివైన నిన్ను; ఏమి+అందున్!= ఏమని అనేది! - ఏమని పొగడినా తక్కువే! - అంత ఎత్తునకు ఎదిగిపోయావు.

తాత్పర్యం: అరచేతిలో ఉన్న వస్తువును చూచినట్లుగా జగత్తు మొత్తాన్ని చూడగలుగుతున్నావు. నరుడికి జన్మసిద్ధాలయిన సత్త్వరజస్తమోగుణాలను, జన్మచక్రాన బంధించి త్రిప్పే గొప్ప సాధనాలను తొలగించుకొన్నావు. లోపల వెలిగే ఆత్మను - పరమాత్మకు ప్రతిబింబమైన దానిని దర్శిస్తున్నావు. ఇట్టి నిన్ను ఏమని పొగడేది!

క. కెలనికిఁ జూడఁగ దైన్యా । కలనం బగుచున్న యిపుడు గదిరిన దశయుం
దొలఁగుం గావుతఁ! గడుమే । లెలసి పరమసుఖముఁ బొందు మిచ్ఛావృత్తిన్.' 451

ప్రతిపదార్థం: కెలనికిన్= దాపునకు - దగ్గరకు; చూడఁగన్= చూడటానికి; దైన్య+ఆకలనంబు+అగుచున్న= దీనత్వమును కూర్చుతున్న; ఇపుడు+కదిరిన= ఈ సమయాన కలిగిన; దశయును= అవస్థకూడా; తొలఁగున్+కావుతన్= విడిపోవుగాక; కడు మేలు+ఎలసి= గొప్పమేలు కలిగి; ఇచ్ఛావృత్తిన్= కోరికతోడి వర్తనంతో; పరమసుఖమున్+పొందుము= గొప్ప ఆనందమును అందుకొనుము.

తాత్పర్యం: నీవు కృతకృత్యుడ వైనావు, లోకతత్త్వంతోపాటు ఆత్మతత్త్వమూ బోధపడి ఆత్మదర్శనం కూడా చేస్తున్నవాడవు నీవు. అయినా దగ్గరగా చూచినపుడు, భౌతికంగా ఒక దీనదశ నీ చుట్టూ కనిపిస్తున్నది. అది కూడా తొలగిపోయి నీకు గొప్ప మేలు, అంతకంటె గొప్ప ఆనందమూ, నీ కోర్కెకు లోబడి కలుగుగాక!'

క. అని పలికి యుచితముగ వీ । డ్కొని విభవం బెసఁగ నభ్రకుంజరము పయిన్
వినువీథిఁ జనియె సురలును । మునులును వేష్టింప భూతములు వినుతింపన్. 452

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఉచితముగన్= తగినట్లుగా; వీడ్కొని= వీడ్కోలు పొంది - విడిచి; విభవంబు+ఎసఁగన్= ఐశ్వర్యం అతిశయించగా; అభ్రకుంజరము పయిన్= ఆకాశపుటేనుగుమీద - ఐరావతంమీద; వినువీథిన్= ఆకాశమార్గాన; సురలును= దేవతలూ; మునులును= ఋషులూ; వేష్టింపన్= చుట్టుకొనగా; భూతములు= ప్రాణులు; వినుతింపన్= ప్రశంసించగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బలిని ఆ విధంగా అభినందించి, అతడికి ఇతోధికమైన శ్రేయస్సును, ఆనందాన్నీ ఆకాంక్షిస్తూ వీడ్కొని, దేవేంద్రుడు తన ఐశ్వర్యం అతిశయించగా ఆకాశపుటేనుగు నెక్కి, ఆకాశమార్గాన అమరులు, ఋషులు పరివేష్టించి రాగా, ప్రాణులు ప్రస్తుతించగా పయనమై పోయాడు.

తే. అమృతపానంబుఁ జేసిన యంతకంటె । నద్దనుజపతి మధురవాక్యామృతమున
సంభృతానందుఁడై సురేశ్వరుఁడు దనదు । పురమునకు నేఁగి సుఖముండెఁ గురువరేణ్య!' 453

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ఓ కురుశ్రేష్ఠుడా! ధర్మరాజా!; సుర+ఈశ్వరుండు= దేవతలరాజు; అమృతపానంబున్=అమృతమును తాగుటను; చేసిన+అంతకంటెన్= చేసినప్పటికంటే కూడా; ఆ+దనుజపతి మధురవాక్య+అమృతమునన్= ఆ రాక్షసరాజు బలి యొక్క తీయని మాటలు అనే అమృతంవలన; సంభృత+ఆనందుఁడు+ఐ= బాగుగా నిండిన ఆనందం కలిగినవాడై; తనదు పురమునకున్= తనయొక్క పట్టణానికి - అమరావతికి; ఏఁగి= వెళ్ళి; సుఖము+ఉండెన్= సుఖంగా ఉన్నాడు.

తాత్పర్యం: బలి సల్పిన సంభాషణం ఇంద్రుడికి అమృతపానంచేసినప్పటికంటె కూడా అధికమైన తృప్తిని, ఆనందాన్ని కలిగించింది. బలి మాటలు ఇంద్రుడి పాలిట అమృతాధికమైన పానీయంగా మారాయి. ఆ దేవేంద్రుడు బలి వాగమృతంతో కలిగిన అనుభూతిని మోసుకొంటూ అమరావతికి చేరి సుఖంగా ఉన్నాడు'.

వ. అని యిట్లు ధర్మతనయునకు భీష్ముండు పునర్భూతంబైన యింద్రబలి సంవాదంబు సెప్పెనని చెప్పిన విని మఱి యేమి సత్కథలు సెల్లెఁ? జెప్పుమని యడుగుటయు. 454

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ఇట్లు= ఈ ప్రకారంగా; ధర్మతనయునకున్= ధర్మరాజునకు; భీష్ముండు= భీష్ముడు; పునర్+భూతంబు+ఐన= మరల జరిగినదైన (పూర్వమొకటి జరిగి ఉన్నది); ఇంద్ర బలి సంవాదంబు= ఇంద్రుని బలి సంభాషణం; చెప్పెన్= తెలిపాడు; అని చెప్పినన్= అని పలుకగా (వైశంపాయనుడు కథకుడు); విని= ఆలకించి (జనమేజయుడు శ్రోత); మఱి+ఏమి= ఇంకను ఏ విధమైన; సత్ కథలు= మంచి వృత్తాంతాలు; చెల్లెన్?= జరిగాయి; చెప్పుము+అని+అడుగుటయున్= పలుకుము అని ప్రశ్నించటం జరిగిన తరువాత (అనంతర ఆశ్వాసాన కథాప్రారంభం).

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజునకు అతడి పితామహుడు భీష్ముడు మళ్ళీ రెండవసారి జరిగిన ఇంద్ర బలి సంవాదాన్ని వినిపించాడు - అని భారతామ్నాయానికి కథకుడైన వైశంపాయనుడు శ్రోత అయిన జనమేజయ మహారాజునకు తెలిపాడు. 'ఆ తరువాత ఇంకా ఏ సత్కథలు జరిగెనో చెప్పు'మని భారత ఇతిహాసశ్రోత అయిన జనమేజయుడు ఆ కథకుడిని అర్థించాడు. (ఆ తరువాత కథాక్రమం పంచమాశ్వాస ప్రారంభాన మొదలవుతుంది).

ఆశ్వాసాంతము

చ. పరమమునీంద్ర సంయమనపక్వ వివేకవిభూతి రమ్య! వి
స్తర మహనీయ తార్కిక వచఃకలనా నభిగమ్య! దేవతా
సుర పరిరక్షణోన్మథన శోభి కటాక్ష విహార! నిత్య సుం
దర! శుభకాంతిపూర! దురితప్రవిదారణ! వీతకారణా! 455

ప్రతిపదార్థం: పరమ= గొప్ప; ముని+ఇంద్ర= ఋషిశ్రేష్ఠులయొక్క; సంయమన= తపస్సువలన; పక్వ= పండిన; వివేక= జ్ఞానం యొక్క; విభూతి= ఐశ్వర్యంతో; రమ్య!= అందమైనవాడా!; విస్తర= విశాలమైన; మహనీయ= ఘనమైన; తార్కిక వచఃకలనా= తర్కశాస్త్ర సంబంధి వాక్కుల జ్ఞానంచేత; న+అభిగమ్య!= పొందరానివాడా!; దేవతా= సురలయొక్క; అసుర= రాక్షసులయొక్క; పరిరక్షణ= సంరక్షణయందు; ఉన్మథన= రాపిడి - తీవ్రమైన కదలికతో; శోభి= ప్రకాశించే; కటాక్ష= క్రీగంటి చూపుయొక్క; విహార!= ప్రసారం కలవాడా!; నిత్య సుందర!= ఎప్పుడూ అందంగా ఉండేవాడా!; శుభకాంతిపూర!= క్షేమ (కర) ప్రకాశంతో నిండినవాడా!; దురిత ప్రవిదారణ!= పాపమును నశింపజేసేవాడా! (ఖండించేవాడా!); వీతకారణా!= నశించిన- పోయిన కారణం కలవాడా!

తాత్పర్యం: గొప్ప మునీంద్రుల నిగ్రహం వలన పరిపక్వమైన ప్రజ్ఞాసంపత్తితో సుందరంగా భాసించేవాడా! విస్తృతమూ మహనీయమూ అయిన తర్కశాస్త్ర పరిజ్ఞానానికి అందకుండా వెలిగేవాడా! సురాసుర సంరక్షణ శ్రమతో అలసిన అందమైన క్రీగంటిచూపుతో విహరించేవాడా! నిత్యనూతన సౌందర్యంతో, శుభావహమైన తేజస్సుతో,నిండి వెలుగులు చిమ్మేవాడా! చెడును సంహరించేవాడా! అన్నిటికీ స్వయంగా కారణమై ప్రకాశిస్తూ స్వతఃకారణంలేనివాడా!

విశేషం: హరిహరనాథుడు జ్ఞానలభ్యుడే కాని, తర్కప్రాప్యుడు కాడు, ఆయన దయకు మంచి మాత్రమే పాత్రంకాని, సురాసుర విభేదం కాదు.

క. ఆదిత్యమరుద్వసు రు । ద్రాది సకలదేవతా మయాత్మక! శ్రీ సం
పాదనవిధావిచక్షణ । పాద సరోజా! మహర్ధిభక్తసమాజా! 456

ప్రతిపదార్థం: ఆదిత్య= సూర్యుడు; మరుత్= మరుత్తులు; వసు= వసువులు; రుద్ర+ఆది= రుద్రులు మొదలైన; సకలదేవతామయ+ ఆత్మక!= ఎల్లరు దేవతలతో నిండిన ఆత్మకలవాడా!, ఆదిత్యులు మొదలయినవారు దేవతలలో భిన్నజాతులు; ఆ అందరి ఆత్మ తానే అయినవాడా! - హరిహరనాథా!; శ్రీ= సంపదను; సంపాదన విధా= సంపాదించే పనియందు; విచక్షణ= నేర్పుగల - సమర్థమైన; పాదసరోజా!= పద్మాలవంటి అడుగులు కలవాడా!; మహా+బుద్ధి భక్త సమాజా!= గొప్ప అభివృద్ధితోడి భక్తుల సమూహం కలవాడా!

తాత్పర్యం: దేవతలలోని విభిన్న జాతులయిన ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, రుద్రులు మొదలయిన సకల దేవతలతో నిండిన ఆత్మకలవాడా! ఆ ఎల్లరు దేవతలను ఆత్మయందు ధరించేస్వామీ! సంపదలను సంపాదించిపెట్టే సమర్థతగల పాదపద్మాలు కలవాడా! గొప్ప అభివృద్ధి గల భక్త జనులకు ఆశ్రయ మైనవాడా! భక్తజన సందోహాలకు గొప్ప సమృద్ధులను అందించే దేవుడా!

మాలిని:

అమల హృదయవేద్యా! హవ్యకవ్య ప్రసాద్యా!
శమసుఖమయమూర్తీ! సర్వలోక ప్రవర్తీ!
కమలభవ నిషేవ్యా! కామదూరానుభావ్యా!
యమనియమవికాసీ! వ్యాసచేతో నివాసీ! 457

ప్రతిపదార్థం: అమల హృదయవేద్యా!= నిర్మల మనస్సుతో తెలిసికొనదగినవాడా!; హవ్యకవ్య ప్రసాద్యా!= దేవతల అన్నం (అమృతం)తో, పితృదేవతల అన్నంతో (పిండం) అనుగ్రహింపజేసుకోదగిన వాడా!; శమసుఖమయమూర్తీ!= శాంతి సౌఖ్యాలతో నిండిన ఆకారం కలవాడా!; సర్వలోక ప్రవర్తీ!= ఎల్లలోకాలను ప్రవర్తింపజేసేవాడా!; కమలభవ నిషేవ్యా!= బ్రహ్మచేత సేవింపదగినవాడా!; కామదూర+అనుభావ్యా!= మన్మథుడికి దూరమైన వారిచేత అనుభవించ దగినవాడా! - కామవాసనారహితులకు అగుపించేవాడా!; యమనియమ వికాసీ!= యమంతో, నియమంతో - నిగ్రహంతో, ఆచారంతో వికసించేవాడా!; వ్యాసచేతస్+నివాసీ!= వ్యాసుడి మనస్సున నివసించేవాడా!

తాత్పర్యం: నిర్మల మనస్కులకు (మాత్రం) తెలియదగినవాడా! దేవతల పితరుల అన్నములతో అనుగ్రహింపజేసుకో దగినవాడా! శాంతిసౌఖ్యాలే ఆకారంగా కలవాడా! ఎల్లలోకాలనూ నడిపించేవాడా! బ్రహ్మదేవుడి సేవలు అందుకొనేవాడా!

మన్మథదేవుడికి దూరమైనవారికి (మాత్రం) అనుభవానికి వచ్చేవాడా! నిగ్రహాన్ని పాటిస్తూ ఆచారాన్ని అనుసరిస్తూ ఉన్నవారికి ప్రకాశించేవాడా! వ్యాసమహర్షి మనస్సునందు నివసించేవాడా! హరిహరనాథా!

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున శాంతిపర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ పర్వంలోని ఈ భాగం; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన - సిరిగల, ఇరువురు కవులకు - సంస్కృతాంధ్ర కవులకు మిత్రుడైన; కొమ్మన+ఆమాత్య పుత్ర= కొమ్మన మంత్రి కుమారుడైన; బుధ+ఆరాధన విరాజి= పండితుల సేవనంవలన ప్రకాశించెడి; తిక్కన సోమయాజి ప్ర+నీతంబు+ఐన= తిక్కన సోమయాజిచేత (సోమయజ్ఞంచేసిన వానిచే) రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శుభకరమైన మహా భారతంలో - భారత గ్రంథమున; శాంతిపర్వంబునందున్= శాంతి అనే భాగాన (పర్వము= (చెరకు) గడ - భాగము - ఒక ముక్క); చతుర్థ+ఆశ్వాసము= నాలుగవ ఉపవిభాగం.

తాత్పర్యం: ఇది మంగళకరమైనది. ఉభయకవిమిత్రుడనే బిరుదం కలవాడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను సేవించటంవలన ప్రకాశించేవాడూ (పండితులు గౌరవించటంవలన రాజిల్లేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో శాంతిపర్వంలోని నాలుగవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని నాలుగవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - పంచమాశ్వాసము

శ్రీ కరణ నిపుణ చరణ । వ్యాకోచాంభోజ నిత్య వాసముదిత సు
శ్లోకముని చిత్త భృంగ! మ । హాకరుణామిళదపాంగ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= మోక్షమును; కరణ= కలిగించటంలో; నిపుణ= సమర్థములైన; చరణ+వ్యాకోచ+అంభోజ= వికసించిన పద్మాలవంటి పాదాలయందు; నిత్య= నిరంతరమును; వాస= నివసించటంచేత; ముదిత= సంతోషించిన; సుశ్లోక= కీర్తిమంతులైన; ముని= జ్ఞానులయొక్క; చిత్త= మనస్సులకు; భృంగ!= తుమ్మెద అయినవాడా!; మహాకరుణా= గొప్పదయతో; మిళత్= కూడిన; అపాంగ!= క్రీకన్నులుకలవాడా!; హరిహరనాథా!= విష్ణుశంకర స్వరూపుడవైన ఓ ప్రభూ!

తాత్పర్యం: విష్ణుశంకర స్వరూపుడవైన ఓ దేవా! వికసించిన పద్మాలవంటి నీ పాదాలు; సదా నివసించటంచేత సంతోషించిన శ్రీమంతులకు, జ్ఞానులకు మోక్షమును ప్రసాదించటంలో నేర్పుగలవి. అట్టి వారి మనస్సులకు తుమ్మెదవైన ఓ ప్రభూ! గొప్ప దయతో కూడిన క్రీగంటి చూపులు గలవాడా!

విశేషం: అలం: ఉపమ. మునిచిత్త భృంగ అనుచో రూపకం.

శ్రీ శక్ర సంవాద ప్రకారము (సం. 12-221-3)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె నట్లింద్రబలిసంవాద రూపంబునఁ గాలప్రకారంబు విని యుధిష్ఠిరుండు దేవవ్రతునితోడ. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడనే ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఇంద్రబలి సంవాదరూపంబునన్= ఇంద్రుడికి బలిచక్రవర్తికి జరిగిన సంభాషణ విధానాన్ని అనుసరించి; కాలప్రకారంబు= కాలముయొక్క స్వభావాన్ని; విని= ఆలకించి; దేవవ్రతునితోడన్= భీష్ముడితో.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనమునీంద్రుడు జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు: ఆ విధంగా ధర్మరాజు ఇంద్రుడికీ, బలిచక్రవర్తికీ జరిగిన సంవాదపద్ధతి ప్రకారం కాలస్వరూపాన్ని గురించి విని భీష్ముడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏమిట రూపగుఁ? బురుషుం । డేమెయిరూపు సెడు? నాకు నెఱిఁగింపుము తే
జోమహిత! యనిన నతఁ డా । భూమిపతికి నిట్టు లనియె భూపప్రవరా! 3

ప్రతిపదార్థం: తేజోమహిత!= తేజస్సుచేత పూజించబడినవాడా! పురుషుండు= జీవుడు; ఏమిటన్= దేనిచేత; రూపగున్?= వర్ధిల్లును?; ఏమెయిన్= ఏ విధంగా; రూపు చెడున్?= నశించును?; నాకున్; ఎఱిఁగింపుము= ఈ విషయం తెలియజేయుము; అనినన్= అని అడుగగా; ఓ జనమేజయ మహారాజా!; భూపప్రవరా!= రాజ శ్రేష్ముడవగు; అతఁడు= ఆ భీష్ముడు; ఆ భూమిపతికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: జీవుడు దేనివలన వృద్ధి పొందుతాడు? దేనివలన నశిస్తాడు? తేజోమాన్యుడ వైన ఓ భీష్మా! నా కీవిషయం బోధపడేటట్లు చెప్పుము' అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: ఓ జనమేజయమహారాజా!

వ. 'ఇవ్విషయంబునకు నొక్క యితిహాసంబు శ్రీశక్రసంవాదం బనంగలదు. దానిం జెప్పెద నాకర్ణింపుము. నారదమునీశ్వరుం డెందును నిజేచ్ఛంజరియించుచుండి యొక్కనాఁడు మందాకినికిం జని కృతస్నానుండై. 4

ప్రతిపదార్థం: ఈ+విషయంబునకున్= ఈ అంశాన్ని స్పష్టం చేయటానికి; శ్రీ శక్రసంవాదంబు= లక్ష్మికి ఇంద్రుడికి జరిగిన సంభాషణం; అనన్= అనగా; ఒక్క ఇతిహాసంబు= ఒక పూర్వకథ; కలదు= ఉన్నది; దానిన్= ఆ కథను; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; నారదమునీశ్వరుండు= నారదమహర్షి; ఎందునున్= ఎల్లయెడల; నిజేచ్ఛన్= తన ఇచ్ఛచొప్పున; చరియించుచుండి= తిరుగుచుండి; ఒక్కనాఁడు= ఒకదినం; మందాకినికిన్= ఆకాశగంగానదికి; చని= పోయి; కృతస్నానుండు+ఐ= స్నానం చేసినవాడై.

తాత్పర్యం: ఈ విషయం వివరించటానికి 'శ్రీశక్ర సంవాదం' అనే తొల్లిటికథ ఒకటి ఉన్నది. దానిని చెప్పుతాను వినుము. నారదమునీంద్రుడు ప్రతిచోటా తన యిష్టం వచ్చిన విధంగా తిరుగుతూ ఒకనాడు ఆకాశగంగానదికి వెళ్ళాడు. అక్కడ స్నానం చేసి.

క. ఆ నదియం దాచరిత । స్నానుండై నియతినున్న శక్రుం గని య
చ్చో నయ్యిరువురు సల్లా । పానందముఁ బొందుచుండ నాకాశమునన్. 5

ప్రతిపదార్థం: ఆ నదియందున్= ఆ గంగలో; ఆచరిత స్నానుండు+ఐ= స్నానం చేసినవాడై; నియతిన్= నియమంతో; ఉన్న= వర్తిల్లిన; శక్రున్= ఇంద్రుడిని; కని= చూచి; అచ్చోన్(ఆ+చోటన్)= ఆచోట; ఆ+ఇరువురున్= వారిద్దరును; సల్లాప+ఆనందమున్= సంభాషణం వలన కలిగే సంతోషమును; పొందుచుండన్= అనుభవిస్తుండగా; ఆకాశమునన్= ఆకాశంలో.

తాత్పర్యం: ఆ నదిలోనే స్నానం చేసి వ్రతనిష్ఠతో ఉన్న ఇంద్రుడిని నారదుడు చూచాడు. ఆ పైన, వారిద్దరూ అన్యోన్యం మాట్లాడుకొంటూ ఆనందిస్తున్నారు. ఇంతలోనే ఆకాశంలో.

తే బాలభాను బింబంబు గీడ్పఱుచునట్టి । దీప్తి మండలి దోఁచె; నద్దేవపతియు
మునిపతియుఁ జూచుచుండ గ్రక్కున విమాన । మవతరించి యాసన్నయై యతివ యొర్తు. 6

ప్రతిపదార్థం: బాలభానుబింబంబున్= లేత సూర్యుడి మండలమును; కీడ్పఱుచునట్టి= తక్కువజేసే; దీప్తిమండలి= కాంతిపుంజం; తోఁచెన్= భాసించింది; ఆ+దేవపతియున్= ఆ ఇంద్రుడును; మునిపతియున్= నారదుడును; చూచుచుండన్= చూస్తూ ఉండగానే; గ్రక్కునన్= వడిగా; విమానము= వ్యోమయానమునుండి; అవతరించి= దిగి; అతివ= స్త్రీ; ఓర్తు= ఒకతె; ఆసన్నఐ= దగ్గరకువచ్చినదై.

తాత్పర్యం: అప్పుడే ఉదయించిన సూర్యమండలకాంతిని అతిశయించిన ఒక కాంతిరాశి కనిపించింది. ఇంద్రుడు, నారదుడూ చూస్తూ ఉండగానే ఒక వనిత విమానంనుండి దిగి వారిదగ్గరకు వచ్చి.

క. పురుహూతున కభిముఖి యై । కరములు మోడ్చుటయు, నతఁడు గారవమున 'నె
వ్వర వబ్జానన! యెచటికి । నరిగెద, వెందుండి రాక?' యనియె నరేంద్రా! 7

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; పురుహూతునికిన్= ఇంద్రుడికి; అభిముఖిఐ= ఎదురుగా నిల్చినదై; కరములు= చేతులు; మోడ్చుటయున్= చేర్చి నమస్కరించగా; అతఁడు= ఆ ఇంద్రుడు; గారవమునన్= ఆదరముతో; అబ్జానన!= పద్మముఖీ!; ఎవ్వరవు= నీవు ఎవతెవు?; ఎచటికిన్= ఏ చోటికి; అరిగెదవు?= వెళ్ళుతావు?; ఎందుండి= ఎచటనుండి; రాక= వచ్చావు?; అనియెన్= అని అడిగాడు.

తాత్పర్యం: రాజా! ఇంద్రుడికి ఎదురుగా నిల్చి, ఆమె చేతులు మోడ్చి నమస్కరించింది. అతడు ప్రీతితో ఆమెను చూచి 'కమలముఖీ! నీ వెవరవు? ఎక్కడికి పోతున్నావు? ఎక్కడినుండి వచ్చావు?' అని ప్రశ్నించాడు.

సీ. అనవుడు నద్దేవి యాదరభరిత యై । 'బాలార్కబోధిత పద్మజాత
యైనట్టిదాన; శ్రీయన లక్ష్మినా భూతి । యనఁగ వెలుంగుదు ననఘ! యేను
స్వాహాస్వధామతి శ్రద్ధాధృతిస్మృతి । మేధల దనుజుల మెచ్చి వారి
కడనుండి మెచ్చ కిప్పుడు నీకడకు నేఁగు । దెంచితి' ననిన నద్దివిజనాథుఁ

తే. 'డేమికారణమున మెచ్చి? తేకతమున । మెచ్చవైతి దానవుల? నీ మెచ్చుచొప్పు
మాకు నెఱిఁగింపు' మనిన నమ్మాననీయ । వాక్య యిట్లని చెప్పె నవ్వాసవునకు. 8

ప్రతిపదార్థం: అనవుడున్= అత డట్లనగా; ఆ+దేవి= ఆ దివ్యస్త్రీ; ఆదరభరిత+ఐ= ప్రీతితో నిండినదై; అనఘ!= పాపరహితుడా!; ఏను= నేను; బాలార్క= లేతసూర్యుడిచేత; బోధిత=వికసింపచేయబడిన; పద్మ= పద్మమునుండి; జాత ఐనట్టిదానన్= పుట్టినదానను; శ్రీ యనన్= 'శ్రీ' అనియు; లక్ష్మినాన్= 'లక్ష్మి' అనియు; భూతి అనఁగన్= 'భూతి' అనియు; వెలుంగుదున్= ప్రకాశిస్తాను; స్వాహా, స్వధా, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ - అనే గుణాలచేత; దనుజులన్= రాక్షసులను; మెచ్చి= అభినందించి; వారికడన్= వారివద్ద; ఉండి= నివసించి; ఇప్పుడు= ఈ సమయమున; మెచ్చక= వారిని సమ్మతించక; నీ కడకున్= నీ సమీపానికి; ఏఁగుదెంచితిన్= వచ్చాను; అనినన్= అనగా; ఆ+దివిజనాథుఁడు= ఆ దేవేంద్రుడు; దానవులన్= రాక్షసులను; ఏమి కారణమునన్= ఏ హేతువుచేత; మెచ్చితి(వి)?= పూర్వం సమ్మతించావు?; ఏకతమునన్= ఏ కారణంచేత; మెచ్చవైతివి= (ఇప్పుడు) సమ్మతించవైతివి?; నీ మెచ్చు చొప్పున్= నీవు అభినందించే విధానాన్ని; మాకున్+ఎఱిఁగింపుము= మాకు తెలియజేయుము; అనినన్= అని అడుగగా; ఆ+మాననీయవాక్య= గౌరవించదగిన మాటలుగల ఆ దేవి; ఆ+వాసవునకున్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: ఇంద్రుడు అట్లా అడిగేసరికి ఆ దేవి మిక్కిలి ఆదరంతో 'పాపరహితుడ వైన ఓ ఇంద్రా! నేను బాలసూర్యుడి కిరణస్పర్శతో వికసించిన తామరపూవునుండి పుట్టినదాన్ని. 'శ్రీ', 'లక్ష్మి', 'భూతి' అనే పేర్లతో ప్రకాశిస్తూ ఉంటాను. పూర్వం నేను 'స్వాహా, స్వధా, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ' అనే గుణా లుండటంవలన రక్కసులను మెచ్చుకొని వారి వద్ద ఉండేదాన్ని. ఇప్పుడు వారిని మెచ్చక నీ చెంతకు వచ్చాను' అని చెప్పింది. అది విని ఇంద్రుడు 'పూర్వం ఎందువలన రాక్షసులను మెచ్చుకొన్నావు? ఇప్పుడు ఏ కారణాన మెచ్చకుండా ఉన్నావు? నీ మెప్పు పొందాలంటే ఎట్లా ఉండాలో మాకు చెప్పుము' అని అడిగాడు. అందుకు గౌరవించదగిన పద్ధతిలో మాటలాడే ఆ దేవి ఇంద్రుడితో ఇట్లా అన్నది:

విశేషం: 'స్వాహా, స్వధా' అనే శబ్దాలు దేవతలకు హవిస్సు అర్పించేటప్పుడు వాడబడతాయి. ఇవి ఇక్కడ యాగాలు చేసే స్వభావాన్ని సూచిస్తాయి. 'మతి' మొదలైన శబ్దాలు బుద్ధినీ, శ్రద్ధనూ, ధైర్యాన్నీ, స్మరణశక్తినీ, ప్రజ్ఞనూ క్రమంగా నిర్దేశిస్తున్నాయి. 'స్వాహా' మొదలైన గుణాలు లక్ష్మికి ప్రతిరూపాలైన దేవతలు, అవి ఉన్నచోట లక్ష్మి ఉంటుంది. (చూడు. సంస్కృతభారతం - శాన్తి - అధ్యా. 228- శ్లో॥22, 23, 82-84).

క. 'దానాధ్యయనాతిథిస । మ్మానాది విశిష్ట గుణసమగ్రత కలిమిన్
దానవుల నియ్యకొంటిని; । వాని విడిచి గర్వు లగుట వారి విడిచితిన్. 9

ప్రతిపదార్థం: దాన= ఈవి; అధ్యయన= స్వాధ్యాయం; అతిథిసమ్మాన= అతిథులను పూజించటం; ఆది= మొదలైన; విశిష్ట= శ్రేష్ఠమైన; గుణ= గుణాలయొక్క; సమగ్రత= పూర్ణత్వం; కలిమిన్= కలిగిఉండటంచేత; దానవులన్= రాక్షసులను; ఇయ్యకొంటిని= అంగీకరించాను; వానిన్= ఆ గుణాలను; విడిచి= వదలి; గర్వులు= గర్వంకలవారు; అగుటన్= అగుటచేత; వారిన్= ఆ రాక్షసులను; విడిచితిన్= వదలాను.

తాత్పర్యం: 'పూర్వం రాక్షసులు దానం, అధ్యయనం, అతిథిపూజనం మొదలైన సద్గుణాలు నిండుగా కలిగి ఉండేవారు. అందువలన వారిని అప్పుడు అంగీకరించాను. ఇప్పుడు వారు ఆ గుణాలు వదలిపెట్టి గర్వం వహించారు. అందుచేత వారిని వదలిపెట్టాను.

వ. సత్యధర్మపరుండ వగుటంజేసి నీపాల వసియింప రుచివుట్టి వచ్చితి' నని చెప్పి వెండియు. 10

ప్రతిపదార్థం: సత్యధర్మపరుండవు= (నీవు) సత్యమునందు; ధర్మమునందు ఆసక్తి కలవాడవు; అగుటన్+చేసి= అయిన కారణం చేత; నీపాలన్= నీ యొద్ద; వసియింపన్= నివసించటానికి; రుచి= ఆసక్తి; పుట్టి= కలిగి; వచ్చితిన్= అరుదెంచాను; అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: నీవు సత్యంలోనూ, ధర్మంలోనూ ఆసక్తి కలిగి ఉన్నావు. అందువలన నీవద్ద నివసించాలన్న కోరిక నాకు కలిగింది. అందుకై వచ్చా'నని లక్ష్మి చెప్పింది. మరల (ఇట్లా పలికింది).

సీ. గురుభక్తి నిరతులు, సురపితృపూజన । పరులును, సత్యసంభాషణులును,
దానశీలురుఁ, బరధన పరదార ప । రాఙ్ముఖచిత్తులు, బ్రాహ్మణ ప్రి
యులు, దివానిద్రా వియుక్తులు, వృద్ధదు । ర్బల దీన యోషిత్కృపారతులును,
శౌచులు, నతిథిభోజనశిష్టభోజులు । నేను మెచ్చు జనంబు; లిట్లుగాక

తే. ధర్మ మెడలి, కామంబు క్రోధంబుఁజాలఁ । గలిగి, గర్వులై బలియు భైక్షంబు నిడక
పరుష వాక్కులఁ గ్రూరంపుఁ జరితములను । మిగిలి వర్తించువారు నా మెచ్చు గారు. 11

ప్రతిపదార్థం: గురుభక్తి నిరతులు= ఆచార్యులయందు భక్తిగలవారు; సురపిత్ృ పూజన పరులును= దేవతలను, పితరులను పూజించటంలో ఆసక్తికలవారు; సత్యసంభాషణులును= సత్యమైన మాటలుకలవారును; దానశీలురు= దానం స్వభావంగా కలవారు; పరధన= ఇతరుల ధనమునందును; పరదార= ఇతరుల కళత్రములందును; పరాఙ్ముఖ= విముఖమైన; చిత్తులు= మనస్సుకలవారు; బ్రాహ్మణప్రియులున్= ద్విజులయందు ప్రీతికలవారును; దివానిద్రా వియుక్తులు= పగటివేళ నిద్రించనివారు; వృద్ధ= ముసలివారు; దుర్బల= బలహీనులు; దీన= దైన్యముగలవారు; యోషిత్= స్త్రీలు - వీరిపట్ల; కృపారతులును= దయ గలవారును; శౌచులు= బాహ్యమున; ఆభ్యంతరమున శుచిపాటించువారు; అతిథిభోజనశిష్టభోజులున్= అతిథులు భుజించగా

మిగిలిన అన్నంతినేవారును; ఏను= నేను; మెచ్చు= అభినందించే; జనంబులు= ప్రజలు; ఇట్లుగాక= ఈ రీతిగా ఉండక; ధర్మము+ఎడన్= ధర్మం తప్పి; కామంబు= కోరిక, క్రోధంబు= కోపం; చాలన్= మిక్కిలిగా; కలిగి= వహించి; గర్వులు+ఐ= గర్వం కలవారై; బలియున్= పూజార్హమైన కానుకయు; భైక్షంబు= భిక్షాన్నం; ఇడక= పెట్టక; పరుషవాక్కులన్= కఠినమైన మాటలచేత; క్రూరంపుఁ జరితములను= క్రూరమైన నడవడికలచేతను; మిగిలి= అతిశయించి; వర్తించువారు= మెలగేవారు; నా మెచ్చు గారు= నేను మెచ్చేవారు కారు.

తాత్పర్యం: గురువుల పట్ల భక్తిచూపేవారు, దేవతలను, పితృదేవతలను పూజించేవారు, సత్యం పలికేవారు, దానం చేసేవారు, ఇతరులకు చెందిన ధనం, స్త్రీల పట్ల కోరికలేక విముఖంగా ఉండేవారు, విప్రులపై ప్రీతి కలిగినవారు, పగటిపూట నిద్రించనివారు, వృద్ధులయందూ, బలహీనులయందూ, దీనులయందూ, స్త్రీలయందూ దయచూపేవారూ, బాహ్యంగానూ ఆంతరంగికంగానూ శౌచం పాటించేవారూ, అతిథులై వచ్చినవారు భుజించగా మిగిలినదానిని మాత్రమే భుజించేవారూ అయిన జనులను నేను మెచ్చుకొంటాను. అట్లా కాకుండా ధర్మహీనులై, కామక్రోధాలు ఎక్కువగా కలిగి, గర్వంతో కూడినవారై, పూజార్హమైన కానుకగాని, భిక్షగాని పెట్టకుండా కఠినమైన మాటలు మాట్లాడుతూ, మిక్కిలి క్రూరమైన ప్రవర్తన కలిగి చరించేవారిని నేను మెచ్చను.

విశేషం: సృష్టిలో ప్రాణివర్గం దైవసంపద కలదనీ, అసురసంపద కలదనీ రెండు రకాలుగా ఉంటుంది. ఇక్కడ లక్ష్మి ఇంద్రుడితో దైవసంపద గలవారు తనకు ఇష్టులనీ, అసురప్రవృత్తిగలవారిని తాను ఇష్టపడననీ చెప్పింది. దేవాసురసంపదల వివరణ భగవద్గీతలోని పదునారవ అధ్యాయంలో విపులంగా నిరూపించబడి ఉన్నది.

క. బుద్ధియు ధృతియును నీతియు । శ్రద్ధయు సన్నతియు క్షమయు శాంతియు ననఁగా
వృద్ధశ్రవ! యేడ్వురు మ । ద్వృద్ధి ప్రదదేవతలు శ్రుతిస్మృతికథితల్. 12

ప్రతిపదార్థం: వృద్ధశ్రవ= ఇంద్రా!; బుద్ధియున్= బుద్ధి, ధృతియున్= ధృతి; నీతియున్= నీతి; శ్రద్ధయున్= శ్రద్ధయు; సన్నతియున్= సన్నతియు; క్షమయున్= క్షమయు; శాంతియున్= శాంతియు; అనగాన్= అని ప్రసిద్ధికెక్కిన; ఏడ్వురు= ఏడుమంది; శ్రుతి స్మృతి కథితల్= శ్రుతులలోనూ స్మృతులలోనూ చెప్పబడినవారు; మద్వృద్ధి ప్రదదేవతలు= నాకు వృద్ధి నిచ్చే దేవతలున్నారు.

తాత్పర్యం: అమరేంద్రా! వేదాలలోనూ, స్మృతులలోనూ చెప్పబడిన ఏడుమంది దేవతలు నాకు వృద్ధి కల్గించేవారు. వారు బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, సన్నతి, క్షమ, శాంతి అని వ్యవహరించబడుతున్నారు. (బుద్ధి మొదలైన గుణాలున్న వారి వద్ద లక్ష్మి వృద్ధి బొందుతుందని తాత్పర్యం).

క. అష్టమి యగు దేవత నేఁ । గష్టాత్మత యసురులందుఁ గని విడిచితి మ
త్తుష్టికరచరితు లగుటఁ ద్రి । విష్టప సదుల కడ నిలిచి వెలసెద ననినన్. 13

ప్రతిపదార్థం: నేన్= నేను; అష్టమిఅగు= ఎనిమిదవ దైన; దేవతన్= దేవతను; అసురులందున్= రాక్షసులందు; కష్టాత్మత= దుష్టస్వభావమును; కని= చూచి; విడిచితిన్= వారిని వదలిపెట్టాను; మత్తుష్టికర= నాకు సంతసం కలిగించే; చరితులు= ప్రవర్తన కలవారు; అగుటన్= కావటంవలన; త్రివిష్టపసదుల కడన్= దేవతలచెంత; నిలిచి= నిలబడి; వెలసెదన్= ప్రకాశిస్తాను; అనినన్= అని చెప్పగా.

తాత్పర్యం: నేను ఎనిమిదవ దేవతను. రాక్షసులలో దుష్టస్వభావాన్ని చూచి వారిని వదలిపెట్టాను. నాకు సంతోషం కలిగించే విధంగా ప్రవర్తించేవారు కావటం వలన దేవతలచెంత నిలబడి ప్రకాశిస్తాను' అని చెప్పగా.

క. అభినందించిరి దేవ । ప్రభుఁడును నారదుఁడు నపుడు పవనంబును సౌ
రభసుఖ సంస్పర్శంబుల । నభిరామం బగుచు వీచె నల్లన యచటన్. 14

ప్రతిపదార్థం: దేవప్రభుఁడునున్= ఇంద్రుడున్నూ; నారదుఁడున్= నాదరమునీంద్రుడున్నూ; అభినందించిరి= (లక్ష్మిని) మెచ్చుకొన్నారు; అచటన్= ఆచోట; అప్పుడు= ఆ సమయంలో; పవనంబునున్= గాలికూడా; సౌరభ= పరిమళంచేత; సుఖ సంస్పర్శంబులన్= సుఖావహమైన స్పర్శచేత అభిరామంబు= మనోహరం; అగుచున్= అవుతూ; అల్లన= మెల్లగా; వీచెన్= ప్రసరించింది.

తాత్పర్యం: లక్ష్మి చెప్పిన మాటలు విని ఇంద్రుడూ, నారదుడూ, ఆమెను మెచ్చుకొన్నారు. ఆ సందర్భంలో అక్కడ గాలి కూడా సువాసనతోనూ, సుఖావహమైన స్పర్శతోనూ కూడి మనోహరమై మెల్లగా వీచింది.

ఆ. కురిసెఁ బుష్పవృష్టి, మొరసె గీర్వాణ దుం । దుభులు, సిరి వరింప నభినవోజ్జ్వ
లత్వమొంది దివిజులకు నేత్రపర్వమై । పొలిచి యింద్రుఁ డాత్మపురికి నరిగె. 15

ప్రతిపదార్థం: పుష్పవృష్టి= పూలవాన; కురిసెన్= కురిసింది; గీర్వాణదుందుభులు= దేవతల భేరులు; మొరసెన్= శబ్దించాయి; సిరి= లక్ష్మి; వరింపన్= వరించేసరికి; అభినవ+ఉజ్జ్వలత్వము= నూతనమైన ప్రకాశమానత్వాన్ని; ఒంది= పొంది; దివిజులకున్= దేవతలకు; నేత్రపర్వము+ఐ= కనులపండువై; పొలిచి= భాసించి; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; ఆత్మపురికిన్= తన నగరానికి; అరిగెన్= పోయాడు.

తాత్పర్యం: పిదప పూలవాన కురిసింది. దేవతల నగారామ్రోతలు వ్యాపించాయి. లక్ష్మి తనను వరించగానే నూతన ప్రకాశం పొంది దేవతలకు కన్నులపండువై ఇంద్రుడు తన పట్టణమైన అమరావతికి వెళ్ళాడు.

క. శతమఖకమలావాసా । ప్రతిమ సమాగమ విశేష బహుమత మగు నీ
యితిహాసము శ్రుతమైనఁ బ । ఠితమైనను నెఱయ సంఘటించును లక్ష్మిన్. 16

ప్రతిపదార్థం: శతమఖ= ఇంద్రుడియొక్క; కమల+ఆవాస= లక్ష్మీదేవియొక్కయు; అప్రతిమ= సాటిలేని; సమాగమ విశేష= విశిష్టమైన కలయికచేత; బహుమతము= మిక్కిలి సమ్మానితం; అగు= అవుతున్న; ఈ ఇతిహాసము= ఈ కథ; శ్రుతము+ఐనన్= వినబడినదైననూ; పఠితము+ఐననున్= చదువబడినదైననూ; నెఱయన్= విస్తృతముగా; లక్ష్మిన్= సిరిని; సంఘటించును=కలిగిస్తుంది.

తాత్పర్యం: సాటిలేనిదీ, విశిష్టమైనదీ అయిన ఇంద్రలక్ష్మి సమాగమంవలన ఈ కథ మిక్కిలిగా సంభావించ బడుతున్నది. దీనిని విన్నా, చదివినా సంపద సమృద్ధిగా లభిస్తుంది.

క. ఇందుల తాత్పర్యము నీ । డెందము నొందించి యతిదృఢీకృతశీలా
స్పందితుఁడ వగుము; తిరమై । యిందిర నీకడ వసించు నిభపురనాథా!' 17

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినాపట్టణానికి ప్రభుడవైన ఓ ధర్మరాజా!; ఇందుల= ఇందులోని; తాత్పర్యమున్= భావమును; నీ డెందమున్= నీ హృదయాన్ని; ఒందించి= పొందించి; అతిదృఢీకృత= మిక్కిలి గట్టిపరచబడిన; శీల= సత్ప్రభావంచేత; అస్పందితుఁడవు= చలనం లేనివాడవు; అగుము= కమ్ము; ఇందిర= లక్ష్మి; తిరమై= స్థిరమై; నీకడన్= నీ చెంత; వసించున్= నివసిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ ఇతిహాసంలోని రహస్యాన్ని నీ హృదయంలో పదిలపరచుకొమ్ము. తద్ద్వారా దృఢమైన శీలంతో చలనం లేని వాడవు కమ్ము. అట్లా చేస్తే లక్ష్మి స్థిరంగా నీవద్ద నిలిచిపోతుంది'.

క. అనిన విని ధర్మజుఁడు శాం । తనవునితో జనుల కెవ్విధము నాచారం
బున నెట్టిపాటి శీలం । బున నే విద్యను మహాత్మ! ముక్తి దొరకొనున్. 18

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుఁడు= ధర్మరాజు; శాంతనవునితోన్= భీష్ముడితో; మహాత్మ!= మహానుభావా!; జనులకున్= ప్రజలకు; ఏ+విధము+ఆచారంబునన్= ఏ విధమైన ఆచారంతో; ఎట్టిపాటిశీలంబునన్= ఏ రకమైన స్వభావంతో; ఏ విద్యనున్= ఏ రకమైన విద్యచేత; ముక్తి= మోక్షం; దొరకొనున్= లభిస్తుంది.

తాత్పర్యం: భీష్ముడు ఆ రీతిగా చెప్పగా విని ధర్మరాజు ఆయనతో ఇట్లా అన్నాడు: 'మహాత్మా! ప్రజలకు ఏ రకమైన ఆచారంవలన, ఏ విధమైన శీలం వలన, ఏ చదువు వలన ముక్తి దొరుకుతుంది?'

క. అనవుడు నతనికి నతఁ డి । ట్లను 'విను మితిహాస మొకటి యది నీ ప్రశ్నం
బున కుత్తర మగు; నేర్పడ । వినిపించెద గాఢతర వివేక నిరూఢా! 19

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతనికిన్= ధర్మరాజుకు; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; గాఢతర వివేకనిరూఢా!= దృఢమైన వివేకంచేత ప్రసిద్ధమైనవాడా!; ఇతిహాసము+ఒకటి= ఒక పూర్వకథ; వినుము= ఆలకించుము; అది= ఆ కథ; నీ ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరము+అగున్= సమాధానం అవుతుంది; ఏర్పడన్= స్పష్టమయ్యే విధంగా; వినిపించెదన్= ఆలకింపజేస్తాను.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనేసరికి, భీష్మ డతడితో ఇట్లా అన్నాడు: 'దృఢవివేకం వలన ప్రసిద్ధుడవైనవాడా! ఒక పూర్వకథ వినుము. అది నీ ప్రశ్నకు తగిన సమాధాన మవుతుంది. దాన్ని వినిపిస్తాను'.

దేవల జైగీషవ్య సంవాద ప్రకారము (సం. 12-222-34)

వ. అసితుం డగు దేవలుండు జైగీషవ్యుం డను సంయమితోడ 'నీవృత్తం బెఱిం గి కొనవలయు నెఱిం గింపవే!'
యనిన నమ్మహాత్ముం డమ్మునివరున కిట్లనియె. 20

ప్రతిపదార్థం: అసితుండగు దేవలుండు= అసితుడనే పేరుగల దేవలముని; జైగీషవ్యుండు అను సంయమితోడన్= జైగీషవ్యుడు అనే మునితో; నీ వృత్తంబు= నీ వర్తనాన్ని; ఎఱింగికొనవలయున్= తెలిసికొనాలి; ఎఱింగింపవే= తెలియజేయుమా; అనినన్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠునకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: పూర్వం అసితుండనే పేరుగలడైన దేవలముని జైగీషవ్యుడనే మునిని ఇప్పుడు నీ వృత్తాంతాన్ని తెలిసికొనాలని అడిగాడు. అప్పు డా జైగీషవ్య డతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'శాంతిమంతు లైన సౌమ్యుల కెయ్యది । నిష్ఠ దానియందు నిరతిశయ స
మాదరంబు గలదు నాదుచిత్తంబున । వినుము తద్విధంబు విస్తరింతు. 21

ప్రతిపదార్థం: శాంతిమంతులు+ఐన= శాంతిగలవారగు; సౌమ్యులకున్= ప్రియమైన దర్శనం కలవారికి; ఏ+అది= ఏది; నిష్ఠ= ఆచరింపదగిన ధర్మమో; దానిఅందున్= ఆ ధర్మమునందు; నాదు చిత్తంబునన్= నా హృదయంలో; నిరతిశయ సమాదరంబు= అత్యధికమైన ప్రీతి; కలదు= ఉన్నది; తద్విధంబున్= ఆ ధర్మప్రకారాన్ని; విస్తరింతున్= వివరించి చెప్పుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'శాంతిసంపన్నులై ప్రియదర్శనులైన వారికి ఏది పాటింపదగిన ధర్మంగా ఉన్నదో, ఆ ధర్మంపట్ల నా చిత్తం ఎనలేని ప్రీతి కలిగి ఉన్నది. ఆ ధర్మవిధాన మెట్లాంటిదో వివరిస్తాను వినుము.

క. వినుతించిన నిందించిన । ననఘా! మనమునఁ బ్రియంబు నప్రియమును లే
కునికియు వ్రేసిన నైనను । గనలు వొడమమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్. 22

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుతించినన్= పొగడినా; నిందించినన్= తెగడినా; మనంబునన్= చిత్తంలో; ప్రియంబున్= ప్రీతియు; అప్రియమునున్= అప్రీతియు; లేకునికియున్= లేకుండా ఉండటమున్నూ; వ్రేసినన్+ఐనను= (ఒకరు తనను) కొట్టినప్పటికినీ; కనలు= కోపం; పొడమమియున్= కలగకుండా ఉండటమున్నూ; ప్రబుద్ధ= జ్ఞానంకలవారియొక్క; గణ్య= గణించదగిన; గుణంబుల్= గుణాలుగా ఉన్నవి.

తాత్పర్యం: కిల్బిషంలేని ధర్మరాజా! ఇతరులు తనను పొగడవచ్చును, లేదా తెగడవచ్చును. అట్లా చేసినా చిత్తంలో ప్రీతిగానీ, అప్రీతిగానీ లేకుండా ఉండటం, అట్లాగే పరులు తనను కొట్టినా కోపం లేకుండా ఉండటం, జ్ఞానులైనవారి ఎన్నదగిన గుణాలుగా ఉన్నాయి.

విశేషం: మానావమానాలు, స్తుతినిందలు కల్గినప్పుడు సామాన్యులు పొంగిపోవటమో, లేక క్రుంగిపోవటమో జరుగుతూ ఉంటుంది. తన్నుకొట్టినవారిని తిరిగి కొట్టాలనిపిస్తుంది. కాని స్థితప్రజ్ఞులైనవారు స్తుతి నిందలను సమానంగా భావిస్తారు. వారు త్రిగుణాలకు అతీతంగా ఉంటారు. కాబట్టి తనకు అపకారం చేసినవారికి ప్రతీకారం చేయాలని అనుకోరు.

ఆ. ఒకటిగోరి దాని కుల్లంబు గందంగ । జాలిఁ బడమి, యేమి సంభవించె
నేని దానఁ దృప్తి నూనుట దప్పిన । పనికి వగవ కునికి భవ్యగుణము. 23

ప్రతిపదార్థం: ఒకటి= ఒక వస్తువును; కోరి= అభిలషించి; దానికిన్= ఆ వస్తువుకొరకై; ఉల్లంబు= హృదయము; కందంగన్= తపించగా; జాలిన్+పడమి= విచారం పొందకుండా ఉండటం; ఏమి సంభవించెనేనిన్= ఏమి జరిగినా; దానన్= ఆ జరిగినదానివలన; తృప్తిన్ ఊనుట= తృప్తినొందటం; తప్పినపనికిన్= తప్పిపోయిన కార్యానికి; వగవక+ఉనికి= చింతించకుండా వుండటం; భవ్యగుణము= శ్రేష్ఠమైన గుణం.

తాత్పర్యం: ఏదో ఒక వస్తువును కోరుకొని అది లభించకపోవటం వలన హృదయతాపానికి గురి అయి విచారించరాదు. తనకు మంచి జరిగినా, చెడు జరిగినా దానివలన తృప్తినొందాలి. తాను అనుకొన్నట్లు ఒక పని జరగలేదని చింతించకూడదు. ఇవే మేలైన గుణాలు.

క. హర్షంబును మానంబు న । మర్షము నపరాధమును సమదభావము ను
త్కర్షాపకర్ష చింతలు । నార్షసమాచారమున నిరస్తగుణంబుల్. 24

ప్రతిపదార్థం: హర్షంబును= సంతోషమూ; మానంబున్= అభిమానమూ; ఆమర్షమున్= అసహనమూ; అపరాధమును= తప్పిదమూ; సమదభావము= మదంతో గూడి ఉండటమూ; ఉత్కర్ష+అపకర్ష చింతలు= ఎక్కువ, తక్కువతనాలను గూర్చిన విచారాలూ; ఆర్షసమాచారమునన్= ఋషులకు చెందిన సమీచీనమైన ఆచారమునందు; నిరస్తగుణంబుల్= నిరసించబడిన గుణాలు అవుతున్నాయి.

తాత్పర్యం: సంతోషం, అభిమానం, అసహనం, అపరాధం, మదించటం, తన గొప్పతనాన్ని గూర్చిగాని, లేక తక్కువతనాన్ని గూర్చిగాని చింతిస్తూ ఉండటమనేవి ఋషులు విధించిన సదాచార పద్ధతిలో నిరసించబడిన గుణాలుగా ఉన్నాయి.

క. అవమానమునకుఁ దృప్తుం । డవు నమృతము ద్రావినట్ల యంచితసమ్మా
నవిధికి నుద్వేగముఁ బొం । దు విషంబునఁ బోలె శమరతుఁడు మునినాథా! 25

ప్రతిపదార్థం: మునినాథా!= మునిశ్రేష్ఠా!; శమరతుఁడు= అంతరింద్రియనిగ్రహమునందు తత్పరుడైనవాడు; అవమానమునకున్= (తనకు జరిగే) అవమానంతో కూడిన కార్యానికి; అమృతము+త్రావినట్లు+అ= సుధ నాస్వాదించినట్లే; తృప్తుండు+అవున్= తృప్తిపొందినవాడు ఔతాడు; అంచిత= పూజితమైన; సమ్మానవిధికిన్= సత్కారంతో గూడిన పనికి; విషంబునన్+పోలెన్= విషంచేతవలె; ఉద్వేగమున్+పొందున్= వ్యాకులత్వాన్ని పొందుతాడు.

తాత్పర్యం: మునిశ్రేష్ఠా! అంతరింద్రియ నిగ్రహంకలవాడు తనకు అవమానం జరిగితే అమృతం త్రాగినట్లుగా తృప్తి పొందుతాడు. సమ్మానం జరిగితే విషం త్రాగినప్పుడు పొందినట్లు కలతను పొందుతాడు. సమ్మానం కావాలని కోరడు. అవమానం జరిగితే కలత చెంద డని తాత్పర్యం.

క. చుట్టము పగ యను భేదం । బెట్టిజనులవలనఁ దగుల దెల్లప్పుడు నె
ప్పట్టున నద్దానను మదిఁ । బుట్టదు సంతోష హాని బుద్ధాత్మునకున్. 26

ప్రతిపదార్థం: బుద్ధాత్మునకున్= ఆత్మజ్ఞుడైనవాడికి; ఎట్టి జనులవలనన్= ఏ రకమైన ప్రజలవలనగానీ; ఎల్లప్పుడున్= ఏ వేళనైనా; చుట్టము= బంధువు; పగ= శత్రువు; అను భేదంబు= అనే భేదబుద్ధి; తగులదు= కలుగదు; ఏ+పట్టునన్= ఏ పరిస్థితిలో నైనా; ఆ+దానను= ఆ భేదబుద్ధివలన; మదిన్= హృదయంలో; సంతోషాని= సంతోషానికి చెరుపు; పుట్టదు= సంభవించదు.

తాత్పర్యం: ఆత్మతత్త్వం తెలిసినవాడికి ఏ విధమైన జనులను చూచినా ఎప్పుడైనా వీరు నావారు, వీరు శత్రువులు అనే భేదబుద్ధి పుట్టదు. ఆ భేదభావం లేకపోవటం వలన ఏ పరిస్థితిలోనూ ఆయన చిత్తంలో సంతోషం లోపించదు.

ఆ. ఇంద్రియముల గెల్చి హృదయంబు శాంతిసు । ఖంబుఁ బొంద నిర్వికార వృత్తి
యైనవాని పొందు మానితగతి దేవ । తలకుఁ బొంద నరిది ధర్మనిరత!' 27

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ధర్మమునందు+ఆసక్తుడైనవాడా!; ఇంద్రియములన్= శ్రోత్రంమొదలైన ఇంద్రియాలను; గెల్చి= జయించి; హృదయంబు= చిత్తం; శాంతిసుఖంబున్= శాంతివలనగలిగిన సుఖమును; పొందన్= చెందగా; నిర్వికారవృత్తి= వికారాలు లేని వర్తనముగలవాడు; ఐనవాని పొందు= అయినటువంటి వాడితో కలయిక; మానితగతిన్= పూజితమైన రీతిలో; దేవతలకున్= సురలకు; పొందన్+అరిది= పొందటానికి దుర్లభమై ఉన్నది.

తాత్పర్యం: ధర్మతత్పరుడవైన మునీంద్రా! శ్రోత్రాదులైన జ్ఞానేంద్రియాలను, పాదాదులైన కర్మేంద్రియాలను జయించిన వాడు హృదయంలో శాంతి పొందుతాడు. శాంతివలన వాడికి శాశ్వతసుఖం కలుగుతుంది. అప్పు డతడిలో ఏ విధమైన వికారాలూ కలగవు. అట్లాంటి వాడితో పూజితమైన పద్ధతిలో చెలిమి సాధించటం దేవతలకు సైతం దుర్లభంగా ఉంటుంది'.

క. అని చెప్పె ననుడుఁ గుంతీ । తనయాగ్రజుఁ డాత్మ సమ్మదముఁ బొంద నదీ
తనయునితో 'నెవ్వఁ డఖిల । జన ప్రియుఁడు సకలసత్త్వసమ్మతుఁ?' డనినన్. 28

ప్రతిపదార్థం: అని చెప్పెన్+అనుడున్= ఈ రీతిగా చెప్పాడని అనగా; కుంతీతనయ+అగ్రజుఁడు= ధర్మరాజు; ఆత్మ= చిత్తం; సమ్మదమున్+పొందన్= సంతసించగా; నదీతనయునితోన్= భీష్ముడితో; అఖిలజనప్రియుఁడు= సమస్తజనులకు ప్రియమైనవాడు; సకలసత్త్వసమ్మతుఁడు= సర్వప్రాణులకు ఇష్టమైనవాడు; ఎవ్వఁడు?= ఎవడు?; అనినన్= అని అడుగగా.

తాత్పర్యం: జైగీషవ్యుడు దేవలుడితో ఈ విధంగా చెప్పా'డని భీష్ము డన్నాడు. అది విని ధర్మరాజు సంతోషించాడు. ఆపై భీష్ముడిని 'సమస్త జనులకు, సకల ప్రాణులకు ప్రియమైనవాడు ఎవడు?' అని ప్రశ్నించగా.

ఉగ్రసేన శ్రీకృష్ణసంవాద ప్రకారము (సం. 12-223-23)

వ. అమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లను. 'నారదుని విషయంబుగా ఉగ్రసేనునకుఁ గేశవునకు సంవాదంబు గలిగె; నది నీ యడిగిన యర్థంబుఁ దేటపఱుచు; దాని నాకర్ణింపుము. 29

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఆ+మహీపతికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; నారదుని విషయంబుగాన్= నారదమునికి సంబంధించి; ఉగ్రసేనునకున్= ఉగ్రసేను డనబడే యాదవ విభునకు; కేశవునకున్= కృష్ణుడికి; సంవాదంబు= సంభాషణం; కలిగెన్= సంభవించింది; అది= ఆ సంవాదం; నీ అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబున్= విషయాన్ని; తేటపఱుచున్= స్పష్టం చేస్తుంది; దానిన్= ఆ సంవాదాన్ని; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మహాత్ముడైన భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'పూర్వం ఉగ్రసేనుడికీ, కృష్ణుడికీ నారదుడి విషయమై ఒక సంవాదం జరిగింది. ఆ సంవాదం నీవు అడిగిన విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. దానిని వివరిస్తాను. వినుము.

క. నరనాథ! యుగ్రసేనుఁడు । హరితో నిట్లనియె 'జనము లభివర్ణన త
త్పరు లగుదురు నారదునెడ; । నరయఁగ నతఁ డంతవాఁడె? యంబుజనాభా!' 30

ప్రతిపదార్థం: నరనాథ!= ధర్మరాజా!; ఉగ్రసేనుఁడు= ఉగ్రసేనవిభుడు; హరితోన్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు; నారదునెడన్= నారదుడిపట్ల; జనములు= ప్రజలు; అభివర్ణన తత్పరులు= కీర్తించటంలో ఆసక్తికలవారు; అగుదురు= అవుతున్నారు అంబుజనాభా!= పద్మం నాభియందు గల కృష్ణా!; అరయఁగన్= ఆలోచించగా; అతఁడు= ఆ నారదుడు; అంతవాఁడె?= అంత గొప్పవాడా?

తాత్పర్యం: ధర్మరాజా! ఉగ్రసేన మహారాజు శ్రీకృష్ణుడిని చూచి 'ప్రజలు నారదుడిని ఎంతో ఘనంగా ప్రశంసిస్తున్నారు. పద్మనాభా! నిజంగా నారదుడు ఆ ప్రశంసకు తగినంత గొప్పవాడేనా?' అని అడిగాడు.

వ. అనుటయు నా కృష్ణుం డగ్గురుమతి కిట్లనియె. 31

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; ఆ కృష్ణుండు= ఆ మాధవుడు; ఆ+గురుమతికిన్= ఆ దొడ్డబుద్ధిగలవాడితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: ఉగ్రసేను డట్లా అడిగేసరికి శ్రీకృష్ణుడు మహామతిఅయిన ఆ రాజుతో ఇట్లా అన్నాడు:

సీ. 'శ్రుతము నాచారంబు నతిశయవంతంబు । లెడ నహంకార మొక్కింతయేని
లేదు, శీలము గడు లెస్స, వేషము నిర్వి । కారం, బమత్సర గర్వమదుఁడు,
జననంబుఁ దపము దేజంబును బుద్ధియు । వినయంబు నయమును విశ్రుతములు,
ధైర్యంబు వచనమాధుర్యంబు శౌర్యదై । న్య క్రోధలోభ నిరాసకత్వ

ఆ. మోజ యతనియందు నైజంబు; లీర్ష్యయు । నుద్ధతియు నసూయయును నవజ్ఞ
యును నెఱుంగఁ డట్టి మునివరు నారదు । నఖిలజనులుఁ బొగడు టరుదె యధిప!' 32

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అతనిఅందున్= ఆ నారదుడియందు; శ్రుతమున్= విద్యయు; ఆచారంబున్= సత్ప్రవర్తనమూ; అతిశయవంతంబులు= ఆధిక్యం కలిగి ఉన్నాయి; ఎడన్= హృదయంలో; అహంకారము= గర్వం; ఒక్కింత ఏనిన్= లేశమైనా;

లేదు= ఉన్నది కాదు; శీలము= స్వభావం; కడున్= మిక్కిలి; లెస్స= మేలైనది; వేషము= వస్త్రాద్యలంకారం; నిర్వికారంబు= వికారం లేనిది; అమత్సరగర్వమదుఁడు= (అతడు) మాత్సర్యం, గర్వం, మదం లేనివాడు; జననంబు= పుట్టుకా; తపము= తపస్సూ; తేజంబును= ప్రకాశమూ; బుద్ధియున్= మతీ; వినయంబున్= అడకువా; నయమును= నీతీ; విశ్రుతములు= ప్రసిద్ధములు; ధైర్యంబు= ధీరత్వం; వచనమాధుర్యంబు= మాటలలోని మధురత్వము; శాఠ్యదైన్య క్రోధ లోభ నిరాసకత్వము= శఠత్వం, దీనత్వం, కోపం, పిసినితనం అను దోషములను నిరసించు స్వభావమును; ఓజ= ఉత్సాహము; అతనియందున్= ఆ నారదునిలో; నైజంబులు= స్వభావసిద్ధములు; ఈర్ష్యయున్= ఓర్వలేనితనము; ఉద్ధతియున్= గర్వం; అసూయయునున్= గుణాలపై దోషదృష్టి, అవజ్ఞయునున్= తెగడికయు; ఎఱుంగఁడు= తెలియనివాడు; అట్టిమునివరున్= అట్లాంటి మునిశ్రేష్ఠుడైన; నారదున్= నారదమునీంద్రుడిని; అఖిలజనులు= సమస్తప్రజలు; పొగడుట= స్తుతించుట; అరుదె?= అబ్బురమా?

తాత్పర్యం: 'రాజా! నారదునిలో శాస్త్రజ్ఞానం, సదాచారం అధికంగా ఉన్నాయి. అతడి హృదయంలో ఇసుమంతైనా అహంకారం లేదు. అతడి శీలం చక్కనిది. వేషంలో ఏ విధమైన వికారమూ లేదు. అతడిలో మాత్సర్యం, గర్వం, మదం అనే దుర్గుణాలు లేవు. అతని పుట్టుక, తపస్సు, తేజస్సు, బుద్ధి, వినయం, నీతి చాలా ప్రసిద్ధి పొందాయి. అతడు ధీరత్వం, మధురమైన మాటలు కలవాడు. శఠత్వం, దీనత్వం, కోపం, లోభం - అనే దుర్గుణాలను అతడు ఈసడించుకొంటాడు. అతడికి ఈర్ష్య, గర్వం, అసూయ, తిరస్కారభావం - అనేవి తెలియవు. అట్లాంటి మునిశ్రేష్ఠుడైన నారదుడిని జనులు కీర్తించటంలో ఆశ్చర్య మేమున్నది?'

వ. అని చెప్పె నగ్గుణంబు లఖిల ప్రియకరంబులు, సకల సత్త్వ సమ్మతంబు' లనిన విని ధర్మతనయుండు శంతను తనయుతోఁ 'గాలావయవ ప్రకారంబులును, యుగప్రమాణంబులును, భూతవిధంబులును నెఱింగింపవే!' యని యడుగుటయు, నతండు 'శుకుం డడుగ వేదవ్యాస మునీశ్వరుండు సెప్పిన యర్థంబులు నీయడిగిన యవియును మఱియు ననేకంబులుఁ; గలవు సెప్పెద విను' మని యజ్జనపతి కిట్లనియె. 33

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని వచించాడు; ఆ+గుణంబులు= ఆ గుణాలు; అఖిలప్రియకరంబులు= అందరికీ ప్రియమును కలిగించేవి; సకలసత్త్వసమ్మతంబులు= సమస్త ప్రాణులకు ఇష్టములైనవి; అనినన్+విని= అనగా ఆలకించి; ధర్మతనయుండు= ధర్మజుడు; శంతను తనయుతోన్= భీష్ముడితో; కాలావయవ ప్రకారంబులును= కాలముయొక్క అంగములకు చెందిన విధానాలు; యుగప్రమాణంబులును= కృతయుగాదులైన యుగాలయొక్క కొలతలు; భూతవిధంబులున్= పృథివి మొదలైన పంచభూతాల విధానాలను; ఎఱింగింపవే!= తెలుపవే!; అని అడుగుటయున్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భీష్ముడు; శుకుండు+అడుగన్= శుకయోగి ప్రశ్నించగా; వేదవ్యాస మునీశ్వరుండు= వేదవ్యాసుడనే ముని శ్రేష్ఠుడు; చెప్పిన= వచించిన; అర్థంబులు= విషయాలు; నీ అడిగినవియును= నీవు ప్రశ్నించినవియును; మఱియున్= అంతేకాక; అనేకంబులు= పెక్కువిషయాలు; కలవు= ఉన్నాయి; చెప్పెదన్= చెబుతాను; వినుము+అని= ఆలకించుమని; ఆ+జనపతికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణుడు ఉగ్రసేనుడితో చెప్పాడు; 'పై జెప్పిన గుణాలు అందరికీ ప్రియమైనవి. సమస్తప్రాణులకూ ఇష్టమైనవి' అని చెప్పేసరికి విని ధర్మరాజు భీష్ముడిని 'కాలము యొక్క అవయవాలకు చెందిన విభాగాలను, కృతాదియుగాల ప్రమాణాలను తెలియజెప్పు' మని అడిగాడు. అప్పుడు భీష్ముడు 'పూర్వం శుకుడు ఈ విషయాలనే వేదవ్యాస మునీశ్వరుడిని అడిగాడు. ఆ మునీంద్రుడు చెప్పిన విషయాలు నీ వడిగినవే కాక ఇంకా ఆయన అనేక విషయాలు తెలియజేశాడు. వాటిని వివరిస్తాను విను' మని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

క. అనఘుఁ బరాశరసూను స । వినయంబునఁ జేరి భక్తి వినతుం డై త
త్తనయుండు బుద్ధి సంప । ద్ఘనుఁడు శుకుం డిట్టు లనియెఁ గౌరవనాథా! 34

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ధర్మరాజా!; అనఘున్= పాపరహితుడైన; పరాశరసూనున్= వ్యాసుడిని; తత్తనయుండు= అతడి కుమారుడు; బుద్ధి సంపద్ధనుడు= ప్రజ్ఞావైభవంతో దొడ్డవాడూ అయిన; శుకుండు= శుకయోగి; సవినయంబునన్= వినయంతో; చేరి= సమీపించి; భక్తివినతుండు+ఐ= భక్తితో ప్రణమిల్లినవాడై; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కౌరవాధిపతివగు ఓ ధర్మరాజా! పాపరహితుడూ, పరాశరుడి పుత్రుడూ అయిన వ్యాసుడిని ఒకసారి అతడి కుమారుడూ, బుద్ధివైభవంలో పెద్దవాడూ అయిన శుకుడు వినయంతో సమీపించాడు. భక్తిభావంతో తండ్రికి నమస్కరించాడు. ఆ పైన ఇట్లా అన్నాడు:

తే. 'కాలవిధములు భూతసంఘప్రకార । ములును లోనుగ నెఱఁగంగ వలయు వాని
బహులకారుణ్యసంపద పల్లవింప । నాకు నెఱిఁగింపవే మునినాథవర్య!' 35

ప్రతిపదార్థం: మునినాథవర్య!= మునీంద్రులలో శ్రేష్ఠుడవైన వాడా!; కాలవిధములు= కాలముయొక్క ప్రకారాలు; భూతసంఘ ప్రకారములును= భూతసమూహాల స్వరూపాలూ; లోనుగన్= మొదలుగ; ఎఱుగంగవలయున్= తెలిసికొనాలి; బహులకారుణ్య సంపద= అత్యధికమైన దయావైభవము; పల్లవింపన్= విస్తరించగా; వానిన్= ఆ విషయాలను; నాకున్+ఎఱిఁగింపవే= నాకు తెలియజేయుమా!

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠా! కాలముయొక్క స్వరూపాలను, పంచభూతాల ప్రకారాలు లోనుగా గల విషయాలను తెలిసికొనాలని అనుకొంటున్నాను. మెండైన కృప తొణికిసలాడగా నాకు ఆ విషయాలు తెలియజేయుము!'

వ్యాసుడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము (సం. 12-224-6)

వ. అనిన విని భరితాదరుండై వేదవ్యాస మునీశ్వరుం డమ్మహనీయున కిట్లనియె. 36

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; వేదవ్యాస ముని+ఈశ్వరుండు= వేదవ్యాసమునివర్యుడు; భరిత+ఆదరుండు+ఐ= నిండినప్రేమకలవాడై; ఆ+మహనీయునకున్= పూజ్యుడైన ఆ శుకుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: శుకు డా విధంగా అడిగేసరికి వేదవ్యాసుడు మిక్కిలి ఆదరంతో పూజనీయుడైన ఆ శుకుడిని చూచి ఇట్లా అన్నాడు.

క. 'కాలములకు భూతములకు । నాలంబనభూత మగు మహామహిమఁ గ్రియా
లీల వెలింగెడు నప్పర । మాలోకం బెందు నిష్క్రియాత్మక మయ్యెన్. 37

ప్రతిపదార్థం: కాలమునకున్= రేయింబవళ్ళు మొదలైన కాలాలకు; భూతములకున్= పృథివి మొదలైన భూతాలకు; ఆలంబన భూతము+అగు= ఆధారమైన; మహామహిమన్= గొప్ప ప్రభావంతో; క్రియాలీలన్= కార్యరూపమైన విలాసంతో; వెలింగెడు= తేజరిల్లే; ఆ+పరమాలోకంబు= ఆ పరమతేజ స్స్వరూపం; ఎందున్= ఏ సందర్భంలో గానీ; నిష్క్రియాత్మకము= క్రియాసంబంధం లేనిదిగా; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: కాలాలకూ, భూతాలకూ ఆధారమైన గొప్ప ప్రభావంతో ఒక తేజశ్శక్తి పైకి అన్నిపనులూ చేస్తున్నట్లు భాసిస్తున్నది. కాని అది ఎప్పుడుగానీ ఏ విధమైన క్రియతోనూ సంబంధం లేనిదిగానే ఉన్నది.

వ. అది భావనీయంబు. 38

ప్రతిపదార్థం: అది= ఆ తేజస్సు; భావనీయంబు= భావించదగి ఉన్నది.

తాత్పర్యం: ఆ తేజోరూపమైన శక్తి మనస్సులో భావించటానికి యోగ్యమైనదిగా ఉన్నది.

క. వినుము! నిమేషంబులు పదు । నెనిమిది యగుఁగాష్ఠ; గాష్ఠ లిరువదియుం దో
డన పదియుం గళ; యఱువది । యును మున్నూఱుఁ గళలై ముహూర్తము నడచున్. 39

ప్రతిపదార్థం: వినుము; పదునెనిమిది= అష్టాదశ సంఖ్యాకాలైన; నిమేషంబులు= నిముసములు; కాష్ఠఅగున్= కాష్ఠఅనబడుతుంది; ఇరువదియున్= ఇరవై; తోడన పదియున్= చేరిన పదియు, మొత్తం ముప్పది; కాష్ఠలు= 'కాష్ఠలు' అనే కాలవిభాగాలు; కళ= కళ అనబడుతుంది; అఱువదియును మున్నూరు కళలు+ఐ= మూడువందలా అరవై కళలు గలదై; ముహూర్తము= ముహూర్తమనే కాలభాగం; నడచున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: ఆ సంగతి వివరిస్తాను వినుము. పదునెన్మిది నిమేషాలు ఒక 'కాష్ఠ' అన్న కాలవిభాగ మవుతుంది. అట్లాంటి ముప్పది కాష్ఠలు ఒక 'కళ' అవుతుంది. మూడువందల అరవై కళలను ఒక ముహూర్తం అంటారు.

తే. మూఁడు పదులు ముహూర్తముల్ మోహదూర! । యగు నహోరాత్ర; మట్టివి యన్ని గూడ
మాస; మవి రెండు ఋతు వను మహితసంజ్ఞఁ । బరఁగు; ఋతువు లాఱైన వత్సరము వత్స! 40

ప్రతిపదార్థం: మోహదూర!= మోహానికి దూరమైనవాడా!; వత్స!= కుమారా!; మూఁడుపదుల్= ముప్పదైన; ముహూర్తముల్= ముహూర్తాలనే కాలవిభాగాలు; అహోరాత్రము అగున్= పవలు రేయి అవుతున్నవి; అట్టివి= ఆ అహోరాత్రాలు; అన్ని= అంతే సంఖ్యగలవి, అనగా ముప్పది; కూడన్= కలియగా; మాసము= ఒక నెల ఔతుంది; అవిరెండు= ఆ మాసాలు రెండు చేరిన; ఋతువు+అను= ఋతువు అనబడే, మహితసంజ్ఞన్= శ్రేష్ఠమైన నామంతో; పరఁగున్= ఒప్పుతుంది; ఋతువులు= ఆ ఋతువులనబడే కాలవిభాగాలు; ఆఱు+ఐనన్= ఆరు కూడితే; వత్సరము= ఒక సంవత్సరం అవుతుంది.

తాత్పర్యం: మోహ మంటని ఓ కుమారా! ముప్పైముహూర్తాలు ఒక అహోరాత్ర మవుతుంది. ముప్పై అహోరాత్రాలు ఒక మాస మవుతుంది. రెండుమాసాలు కలిస్తే ఒక ఋతు వవుతుంది. ఆరు ఋతువులు ఒక సంవత్సరం అవుతుంది.

తే. అందు మూఁడేసి ఋతువుల కయననామ । కంబు లగు; నుత్తరాఖ్య మొకండు దక్షి
ణాభిధాన మొక్కటియు గుణాభిరామ! । యవి యహస్సును రాత్రియు ననఁగఁ బరఁగు. 41

ప్రతిపదార్థం: గుణ+అభిరామ!= గుణములచేత మనోహరమైనవాడా!; అందున్= ఆ ఋతువులలో; మూఁడేసి= మూడు మూడైన; ఋతువులకున్= ఋతువులనబడే కాలవిభాగాలకు; అయననామకంబులు= అయనాలనే పేర్లు; అగున్= ఉంటాయి; ఒకండు= ఒకటి; ఉత్తరాఖ్యము= ఉత్తరాయణ మనేది; ఒక్కటియున్= ఇంకొకటి; దక్షిణ+అభిధానము= దక్షిణాయనమనబడేది; అవి= ఆ ఉత్తరదక్షిణాయనాలు; అహస్సును= పవలును; రాత్రియున్= రేయియును; అనఁగన్+పరఁగున్= అని చెప్పగా ఒప్పుతున్నాయి.

తాత్పర్యం: సద్గుణాలచేత శోభిల్లే ఓ కుమారా! ఆ ఋతువులలో మూడేసి ఋతువులను అయన మంటారు. ఒక అయనానికి ఉత్తరాయణన మనీ, మరొక అయనానికి దక్షిణాయన మనీ పేర్లు. ఈ అయనాలు రెండింటినీ అహోరాత్రాలు (రేయింబవళ్ళు) అనికూడా వ్యవహరిస్తారు.

వ. అది యోగిజనుల నిర్దేశంబు. 42

ప్రతిపదార్థం: అది= ఆ వ్యవహారం; యోగిజనుల= యోగమార్గంలో ఉన్న జనులయొక్క; నిర్దేశంబు= కథనం.

తాత్పర్యం: యోగులు నిర్దేశించినట్లుగా పై వ్యవహారం కాలానికి ఏర్పడింది.

తే. అనఘ! యుత్తరదక్షిణాయనము లమ్మ । హోత్ము లగ్నియు ధూమంబు నండ్రు; మఱియు
వినుము! శుక్లంబుఁ గృష్ణంబు ననుట గలుగు । సుగతి కగతికి హేతువు లగుటఁ జేసి. 43

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఆ+మహాత్ములు= ఆ యోగులు; ఉత్తరదక్షిణ+అయనములు= ఉత్తరాయణ దక్షిణాయనాలను; అగ్నియున్= అగ్నిఅనీ; ధూమంబు= ధూమ మనీ; అండ్రు= అంటారు; మఱియున్= ఇంకను; వినుము; సుగతికిన్= మంచిగతికి; అగతికిన్= దుర్గతికిని; హేతువులు= (ఆ అయనాలు) కారణాలు; అగుటన్+చేసి= కావటంవలన; శుక్లంబు= శుక్లమనీ; కృష్ణంబు= కృష్ణమనీ; అనుట= వ్యవహరించటం; కలుగున్= సంభవిస్తున్నది.

తాత్పర్యం: పాపరహితుడా! యోగులు ఉత్తరాయణాన్ని 'అగ్ని' అనీ, దక్షిణాయనాన్ని 'ధూమ' మనీ కూడా అంటారు. అంతేకాక అందు మొదటిది సుగతి కలిగిస్తుంది కాబట్టి శుక్లమనీ, రెండవది దుర్గతి కలిగిస్తుంది కాబట్టి కృష్ణ మనీ వ్యవహరించటం కూడా కద్దు.

క. నరుల నెలలు నేఁడులు ఁ బితృ । సురులకు దినము లగు నండ్రు సూరులు వరుసం
బరఁగు కృత త్రేతా ద్వా । పర కలియుగ వత్సరముల భంగిఁ దెలిపెదన్. 44

ప్రతిపదార్థం: సూరులు= విద్వాంసులు; నరుల= మానవులయొక్క; నెలలు= మాసాలు; ఏఁడులు= సంవత్సరాలు; పితృసురులకున్= (క్రమంగా) పితరులకు, దేవతలకు; దినములు+అగున్+అండ్రు= దినము లవుతాయని చెప్పుతారు; వరుసన్= క్రమముగా; పరఁగు= ఒప్పారు; కృత= కృతయుగం యొక్కయు; త్రేతా= త్రేతాయుగం యొక్కయు; ద్వాపర= ద్వాపరయుగం యొక్కయు; కలియుగ= కలియుగం యొక్కయు; వత్సరముల= సంవత్సరాల యొక్క; భంగిన్= ప్రకారాన్ని; తెలిపెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: విద్వాంసు లైనవారు మానవులకు చెందిన నెలలు పితరులకు దినాలక్రింద లెక్కింపబడతాయనీ, సంవత్సరాలు దేవతలకు దినాలక్రింద పరిగణించబడతాయనీ అంటారు. అంటే మానవులకు ఒక్క నెల అయితే పితరులకు ఒక్క దినమవుతుంది. మానవులకు ఒక్క సంవత్సరమయితే దేవతలకు ఒక్క దినమవుతుందని భావం. ఇక కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని క్రమంగా ప్రవర్తించే ఆయా యుగాలకు చెందిన సంవత్సరాల వివరాలు తెలియజేస్తాను.

వ. ఆకర్ణింపుము. 45

తాత్పర్యం: వినుము.

చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము (సం. 12-224-18)

సీ. విబుధుల పండ్రెండు వేలేండ్లు సనునంత । నాలుగు యుగములు నోలి నడచుఁ
గృతయుగమ్మున కందుఁ జతురంశకములుఁ, ద్రే । తకు మూఁడు పాళ్ళును, ద్వాపరంబు
భాగద్వయంబునఁ బర్యవసిత మగుఁ; । గలియుగ మంశ మొక్కటన తీఱు;
నిబ్భంగిపాళ్ళగు నిన్నియుగముల కం । బరయుగ్మ వసువార్ధి పరిమితములు

తే. ఖద్వయర్తుగుణంబులు గగన యుగళ । వేద నేత్రంబులును నభోద్వితయకరసు
ధాంశులును వచ్చు మున్నూటయఱువదింటఁ । బెంప మానుషాబ్దంబులై పేర్చి యుండు. 46

ప్రతిపదార్థం: విబుధుల= దేవతలయొక్క; పండ్రెండు వేలేండ్లు= పండ్రెండువేల సంఖ్యగల సంవత్సరాలు; చనునంతన్= కడచినంతనే; ఓలిన్= క్రమంగా; నాలుగు యుగములు= కృతత్రేతాదులైన నాలుగు యుగాలు; నడచున్= ప్రవర్తిస్తాయి; అందున్= ఆ పండ్రెండువేల సంవత్సరాలలో; కృతయుగమ్మునకున్= కృతయుగానికి; చతురంశకములు= (పదింట) నాలుగుపాళ్ళు; త్రేతకున్= త్రేతాయుగానికి; మూఁడుపాళ్ళును= మూడంశాలును ఔతాయి; ద్వాపరంబు= ద్వాపరయుగం; భాగద్వయంబునన్= రెండుపాళ్ళతో; పర్యవసితము= సమాప్తం; అగున్= ఔతుంది; కలియుగము= నాల్గవయుగం; అంశము+ఒక్కటైనన్= ఒక్కభాగంలోనే; తీఱున్= సమాప్తమవుతుంది; ఈ+భంగిన్= ఈ రీతిగా; పాళ్ళు+అగు= భాగాలు అవుతున్న; ఇన్ని యుగములకున్= ఈ నాలుగు యుగాలకు; అంబరయుగ్మ వసువార్ధి పరిమితములు= నాలుగువేల ఎనిమిది వందల సంవత్సరాల; ఖద్వయర్తు గుణంబులు= మూడువేల ఆరువందలు; గగనయుగళవేద నేత్రంబులును= రెండువేల నాలుగు వందలు; నభోద్వితయకర సుధాంశులును= పండ్రెండువందలును; వచ్చున్= సమకూరుతాయి; మున్నూట యరువదింటన్= మూడువందల అరువది అనే సంఖ్యతో; పెంపన్= గుణించగా; మానుష+అబ్దంబులు+ఐ= మానవులకు చెందిన సంవత్సరాలై; పేర్చి ఉండున్= పెంపొందిఉంటాయి.

తాత్పర్యం: దేవతలకు చెందిన పండ్రెండువేల సంవత్సరాలు గడచేసరికి నాలుగు యుగాలు పూర్తి అవుతాయి. అందులో మొదటిదైన కృతయుగానికి పదింట నాల్గుభాగాలు, త్రేతాయుగానికి మూడుభాగాలు, ద్వాపరయుగానికి రెండుభాగాలు, కలియుగానికి ఒక్కభాగంగా కాలం విభక్తమయింది. 12000 లో పదింట నాల్గవభాగం, 4800, మూడవభాగం 3600, రెండవ భాగం 2400, ఒకభాగం 1200 గా గ్రహించవలసి ఉంటుంది. ఈ సంఖ్యలను క్రమంగా 360తో గుణిస్తే మానుష లోకానికి చెందిన కృతయుగాదుల సంవత్సరాలు సిద్ధిస్తాయి.

విశేషం: అంబరయుగ్మ వసు వార్ధులు అనే పదానికి సంఖ్యా గణన ప్రకారం 4800 అని అర్థం సిద్ధిస్తుంది. అంబరం అంటే ఆకాశం - శూన్యమన్నమాట; యుగ్మమంటే రెండు, అంబరయుగ్మమన్న పదానికి రెండు సున్నలని అర్థం; వసువులు అష్టసంఖ్యాకులు కాబట్టి వసుశబ్దానికి ఎనిమిది అని అర్థం; వార్ధి= సముద్రం - నాల్గు సముద్రాలు ప్రసిద్ధాలు కాన వార్ధి అంటే నాల్గు సంఖ్య అని అర్థం; 'అంకానాం వామతో గతిః' అన్నట్లు అంకెలను ఎడమవైపుకు లెక్కించాలి. ఇట్లా లెక్కిస్తే 4800 అనే సంఖ్య వస్తుంది. తక్కినవిగూడా ఇట్లానే అన్వయించుకోవాలి.

ఖద్వయర్తుగుణంబులు= ఖద్వయం= రెండు సున్నలు, ఋతువులు 6, గుణములు 3= మొత్తం 3600 -

గగనయుగళ వేదనేత్రంబులు= గగనయుగళ= రెండు సున్నలు, వేదాలు= 4, నేత్రాలు 2= మొత్తం 2400 -

నభోద్వితయకర సుధాంశులును= నభోద్వితయం= రెండుసున్నలు, కరములు2 , సుధాంశుడు= చంద్రుడు= ఒకటి - మొత్తం 1200 - వీటిని 360తో పెంచగా వచ్చేసంఖ్యలను గ్రంథకర్తే తరువాత వివరిస్తాడు.

వ. ఇట్లు కృతయుగంబునకుఁ బదియేడు లక్షలు ఇఱువది యెనిమిది వేలును, త్రేతాయుగంబునకుఁ బండ్రెండు లక్షలుఁ దొంబదియాఱువేలును, ద్వాపరంబునకు నెనిమిది లక్షలు నఱువది నాలుగువేలును, గలియుగంబునకు నాలుగు లక్షలు ముప్పది రెండు వేలును మనుష్య వత్సరంబు లయ్యె; నిందులోన సంధ్యలును, సంధ్యాంశంబులు ననుపేళ్లఁ గొంతేసి కాలంబు సెల్లు. 47

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కృతయుగంబునకున్= కృతయుగానికి; పదియేడులక్షలు ఇరువది ఎనిమిదివేలును= 4800 x 360= 17 28000 సంఖ్యగల సంవత్సరాలు, త్రేతా యుగానికి, పండ్రెండు లక్షలు తొంబదియాఱువేలును= 3600x 360= 12 96000 సంఖ్య గల సంవత్సరాలు, ద్వాపరంబునకున్= ద్వాపరయుగానికి, ఎనిమిదిలక్షలు అఱువదినాలుగు వేలును= 2400 x 360= 864000 సంఖ్యగల సంవత్సరాలును; కలియుగంబునకున్= కలియుగానికి; నాలుగు లక్షలు ముప్పదిరెండువేలును= 1200 x 360= 432000 సంఖ్యగల సంవత్సరాలును; మనుష్యవత్సరంబులు= మానవసంవత్సరాలు; అయ్యెన్= అయ్యాయి;

ఇందులోనన్= ఈ సంవత్సరాలలో; సంధ్యలును= సంధ్యలనియు; సంధ్యాంశంబులున్= సంధ్యాంశములనియు; అనుపేళ్ళన్= అనబడు నామములతో; కొంతేసికాలంబు= కొంతపరిమాణానికి చెందిన సమయం; చెల్లున్= గతిస్తుంది.

తాత్పర్యం: ఇట్లా లెక్కిస్తే మానవలోకానికి చెందిన కాల విభాగంలో కృతయుగానికి 17,28,000, త్రేతాయుగానికి 12,96,000, ద్వాపరయుగానికి 8,64,000, కలియుగానికి 4,32,000 సంవత్సరాలు వస్తాయి. ఇందులో కొంతకాలం సంధ్యలనీ, సంధ్యాంశాలనీ వ్యవహరించబడుతుంది.

క. క్రమమున సంధ్యలు సంధ్యాం । శములు ననం బరఁగు బుత్ర! సకలయుగాద్యం
తములును యుగయుగమునకుం । దమలో నవి సరియ కాలతత్త్వం బరయన్. 48

ప్రతిపదార్థం: పుత్ర!= వత్సా!;; సకలయుగ+ఆద్యంతములును= సమస్తయుగాల మొదటిభాగాలును, చివరిభాగాలును; క్రమమునన్= క్రమంగా; సంధ్యలు= సంధ్యలనీ; సంధ్యాంశములు= సంధ్యాంశాలు; అనన్= అనగా; పరఁగున్= ఒప్పారుతాయి; కాలతత్త్వంబు= కాలస్వభావం; అరయన్= పరిశీలించగా; యుగయుగమునకున్= యుగయుగానికీ; అవి= ఆ సంధ్యాసంధ్యాంశాలు; తమలోన్= తమయందు; సరియ= సమానంగానే ఉంటాయి.

తాత్పర్యం: కుమారా! అన్ని యుగాల ఆద్యంతభాగాలను సంధ్యలనీ, సంధ్యాంశాలనీ అంటారు. కాలతత్త్వాన్ని బట్టి పరిశీలిస్తే యుగయుగానికీ ఈ సంధ్యా సంధ్యాంశాలు సమంగానే ఉంటాయి.

వ. అది యెట్లంటేని దేవసంఖ్యం జెప్పెద. 49

ప్రతిపదార్థం: అది= ఆ వివరం; ఎట్లు+అంటివి+ఏనిన్= ఎట్లా అంటే; దేవసంఖ్యన్= దేవతలకాలమానాన్ని అనుసరించి; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఆ సంధ్యలు, సంధ్యాంశాల వివరం ఎట్లా అంటే దేవతల కాలమానానుసారం వివరిస్తాను.

క. నన్నూఱులు మున్నూఱులు । నిన్నూఱులు నూఱులును మహితవర్షము ల
య్యన్ని యుగములకును గ్రమా । సన్నత సంధ్యలను వాని సంధ్యాంశములన్. 50

ప్రతిపదార్థం: ఆ+అన్ని యుగములకునున్= ఆ సమస్త యుగాలకు; సంధ్యలను= సంధ్యాకాలాలలోనూ; వాని సంధ్యా+అంశములన్= ఆ యుగాల సంధ్యాంశముల కాలంలోనూ; క్రమ+ఆసన్నతన్= వరుసగా; నన్నూఱులు= నాల్గువందలు; మున్నూఱులు= మూడువందలు; ఇరు+నూరులు= రెండు వందలు; నూఱులును= ఒక వందసంవత్సరాలును; మహిత వర్షములు= పూజితమైన సంవత్సరాలుగా ఉన్నాయి.

తాత్పర్యం: కృతాది సర్వయుగాలకూ సంధ్యలలోనూ, సంధ్యాంశాలలోనూ క్రమంగా దేవతలకాలమానం ప్రకారం నాలుగువందల సంవత్సరాలూ, మూడువందల సంవత్సరాలూ, రెండువందల సంవత్సరాలూ, వంద సంవత్సరాలూ లెక్కకు వస్తాయి.

విశేషం: వీటిని మానుషకాలానికి అనుగుణంగా లెక్కించటానికి 360 సంఖ్యతో గుణించితే సరిపోతుంది.

వ. ఇట్లు కృతయుగంబునకు సంధ్య లక్షయునలువదినాలుగువేలు, దాని సంధ్యాంశంబు నంతియ; త్రేతకు సంధ్య లక్షయు నెనిమిది వేలు; దాని సంధ్యాంశంబు నంతియ; ద్వాపరంబునకు సంధ్య డెబ్బదిరెండువేలు; దాని సంధ్యాంశంబు నంతియ; కలియుగంబునకు సంధ్య ముప్పదియాఱువేలు; దాని సంధ్యాంశంబు నంతియ; యివి మానుష వత్సరంబులు. 51

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కృతయుగంబునకున్= కృతయుగానికి; సంధ్య= సంధ్యాకాలం; లక్షయు నలువది నాలుగు వేలు= 1,44,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ కృతయుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; త్రేతకున్= త్రేతాయుగానికి సంధ్య= సంధ్యాకాలం; లక్షయు నెనిమిదివేలు= 1,08,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశమున్= ఆ త్రేతాయుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; ద్వాపరంబునకున్= ద్వాపరయుగానికి; సంధ్య= సంధ్యాకాలం; డెబ్బదిరెండువేలు= 72,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ ద్వాపరయుగానికి చెందిన సంధ్యా+అంశకాలం కూడా; అంతియ= అంతే; కలియుగంబునకున్= కలియుగానికి; సంధ్య= సంధ్యాకాలం; ముప్పది+ఆఱువేలు= 36,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ కలియుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; ఇవి= ఈ చెప్పినవి; మానుష వత్సరంబులు= మానవలోకానికి చెందిన సంవత్సరాలు.

తాత్పర్యం: (దేవతావత్సరాలను 360తో గుణిస్తే మానుష వత్సరాలు వస్తాయి. ఆ విధంగా గుణించగా) కృతయుగానికి సంధ్య, సంధ్యాంశం - ఒక లక్ష నలభై నాలుగువేల మానుష సంవత్సరాల కాలమవుతుంది. త్రేతాయుగానికి ఒకలక్ష ఎనిమిదివేల సంవత్సరాల సమయ మవుతుంది. ద్వాపరయుగానికి డెబ్భైరెండువేల సంవత్సరాల సమయ మవుతుంది. కలియుగానికి ముప్పదియారువేల సంవత్సరాల కాలం పడుతుంది.

క. వరుసఁ గృత త్రేతా ద్వా । పర కలియుగములఁ దపంబు భవ్యజ్ఞాన
స్ఫురణము యజనము దోషా । దరమును మానవులకుం బ్రధానతఁ గలుగున్. 52

ప్రతిపదార్థం: మానవులకున్= మనుష్యులకు; ప్రధానతన్= ముఖ్యంగా; కృత= కృత యుగంలోనూ; త్రేతా= త్రేతాయుగంలోనూ; ద్వాపర= ద్వాపరయుగంలోనూ; కలియుగములన్= కలియుగంలోనూ; వరుసన్= క్రమంగా; తపంబు= తపస్సు; భవ్యజ్ఞానస్ఫురణము= శ్రేష్ఠమైన జ్ఞానంయొక్క ప్రకాశం; యజనము= యజ్ఞక్రియ; దోషాదరమును= దోషాచరణంపై ప్రీతియు; కలుగున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: మనుష్యులకు ముఖ్యంగా కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో శ్రేష్ఠమైన జ్ఞానస్ఫూర్తి, ద్వాపరయుగంలో యజ్ఞం చేయటం, కలియుగంలో దోషాచరణమూ - స్వభావంగా సంభవిస్తుంటాయి.

క. న్యాయంబులు, ధర్మంబులు, । నాయువులుఁ, దనూబలములు నంతంతకు వ
త్సా! యెంతయుఁ దఱుఁగుం ద్రే । తాయుగముఁ దొడంగి మనుజతతి కరయంగన్. 53

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; మనుజతతికిన్= మానవసమూహానికి; అరయంగన్= పరిశీలించగా; త్రేతాయుగమున్+తొడంగి= త్రేతాయుగం మొదలుకొని; న్యాయంబులున్= న్యాయవిధానాలు; ధర్మంబులు= ధర్మాచరణలు; ఆయువులున్= జీవన కాలాలు; తనూబలములున్= శరీరబలాలు; అంతంతకున్= అంతకంతకు; ఎంతయున్= మిక్కిలిగా; తఱుఁగున్= తగ్గిపోతాయి.

తాత్పర్యం: కుమారా! పరిశీలించి చూస్తే మానవాళికి త్రేతాయుగంనుండీ న్యాయం, ధర్మం, ఆయువు, శరీర పటుత్వం - ఇవి అంతకంతకూ ఎంతగానో తరిగిపోతాయి.

తే. ఆ యుగంబులు నాల్గు మహాయుగంబు । నాఁగఁ జనుఁ దత్సహస్రంబు నలువ పగలు
దాని కొలఁదియ రేయును దీని నెఱుఁగు । ప్రౌఢ జనములు సు మ్మహోరాత్ర విదులు. 54

ప్రతిపదార్థం: ఆ యుగంబులు నాల్గు= ఆ నాలుగు యుగాలూ; మహాయుగంబునాఁగన్= ఒక మహాయుగం అనగా; చనున్= ప్రవర్తిల్లుతుంది; తత్సహస్రంబు= ఆ మహాయుగాలు వెయ్యి; నలువ పగలు= బ్రహ్మకు ఒక పగటికాలం; రేయును= రాత్రియును; దానికొలఁదియ= అంతే పరిమాణం కలిగిఉంటుంది; దీనిన్= ఈ కాల విభాగాన్ని; ఎఱుఁగు= తెలిసికొను; ప్రౌఢజనములు= వివేకంగల మానవులు; అహోరాత్ర విదులు సుమ్ము!= అహోరాత్రాలను తెలిసికొన్న వారు సుమా!

తాత్పర్యం: కృతాదులైన నాలుగు యుగాలూ కలిస్తే ఒక మహాయుగం అవుతుంది. అట్లాంటి వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగటి కాల మవుతుంది. రాత్రి కాలం కూడా అంతే. ఈ విధమైన బ్రహ్మ పగలు - రేయి కాలక్రమాన్ని తెలిసికొన్న పండితులే అహోరాత్రవేత్త లనబడతారు.

తే. అతఁడు రాత్రి నిద్రించు; నిద్రావసరమ । ప్రళయ మగు లోకములకు; ప్రభాత మగుడు
మేలుకను; దివమున భూతజాలసృష్టి । పరతఁ బొందుఁబర్యాయ మిప్పాటఁ జెల్లు.' 55

ప్రతిపదార్థం: అతడు= ఆ బ్రహ్మ; రాత్రి= రాత్రివేళ; నిద్రించున్= నిద్రిస్తాడు; నిద్రా+అవసరము= ఆ నిద్రించే సమయమే; లోకములకున్= ప్రపంచాలకు; ప్రళయము+అగున్= విలయకాల మవుతుంది; ప్రభాతము+అగుడున్= తెల్లవారగానే; మేలుకనున్= ఆ బ్రహ్మ మేల్కొంటాడు; దివమునన్= ఆ పగటివేళ; భూతజాలసృష్టిపరతన్= ప్రాణి సమూహాన్ని సృష్టి చేయటంలో ఆసక్తతను; పొందున్= చెందుతాడు; ఈ+పాటన్= ఈ రీతిగా; పర్యాయము= క్రమం; చెల్లున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: ఆ బ్రహ్మ రాత్రివేళ నిద్రిస్తాడు. అతడు నిద్రించేసమయమే లోకాలకు ప్రళయకాలం. ప్రభాతం కాగానే అతడు మేలుకొంటాడు. పగటివేళలో ప్రాణికోట్ల సృష్టికి పూనుకొంటాడు. ఈ క్రమపద్ధతి ఇట్లాగే సాగిపోతూ ఉంటుంది'.

వ. అని వెండియు. 56

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: వ్యాసుడు ఇట్లా చెప్పి మళ్ళీ ఈ రీతిగా అన్నాడు.

తే. 'అనఘ! బ్రహ్మంబు దేజోమయంబు శుక్ల । మగ్రభాసిత మెద్దాని యతుల సార
రసము విశ్వంబు నది యహర్ముహితకాల । బుద్ధమై చేయు బహువిధ భూతసృష్టి. 57

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితా!; బ్రహ్మంబు= బ్రహ్మం; తేజోమయంబు= కాంతితో నిండినది; శుక్లము= ధవళమైనది; అగ్రభాసితము= ముందు ప్రకాశించేది; విశ్వంబున్= ప్రపంచం; ఏ+దాని= ఏ దానియొక్క; అతులసారరసము= సాటిలేని సారాంశమో; అది= ఆ బ్రహ్మం; అహర్ముహితకాల బుద్ధము+ఐ= అహస్సు అనే పూజ్యమైన కాలంలో మేల్కాంచినదై; బహువిధ భూతసృష్టి= నానావిధాలైన భూతాల సృష్టిని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: 'పాపరహితుడవైన ఓ శుకా! బ్రహ్మం తేజోమయం, అది శుక్లం. అన్నింటికంటె ముందు ప్రకాశించేది. ఈ విశ్వమంతా ఆ బ్రహ్మముయొక్క సారాంశమే. ఆ బ్రహ్మమే అహఃకాలంలో మేలుకొని నానావిధ భూతసంచయాన్ని సృష్టిస్తుంది.

వ. తత్ప్రకారం బెట్టి దనిన: నమ్మహనీయతత్త్వంబు వలన. 58

ప్రతిపదార్థం: తద్= ఆ బ్రహ్మముయొక్క; ప్రకారంబు= స్వరూపం; ఎట్టిది+అనినన్= ఏ విధమైనది అనగా; ఆ+మహనీయ= ఆ పూజనీయమైన; తత్త్వంబువలనన్= తత్త్వంనుండి.

తాత్పర్యం: ఆ బ్రహ్మస్వరూపం ఎట్లాంటి దంటే - పూజనీయమైన ఆ బ్రహ్మ తత్త్వంనుండి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. వినుఁ! మహన్మనోగగన పవనానల । సలిల భూము లనఁగ సంభవించు
మహిత విభవములు గ్రమంబున నేడు । రూపములు జన్యజనకభావ మొంది. 59

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; మహత్= మహత్తత్త్వం; మనః= మనస్సు; గగన= ఆకాశం; పవన= వాయువు; అనల= అగ్ని; సలిల= జలం; భూములు= పృథివి; అనఁగన్= అనగా; మహిత విభవములు= పూజితమైన విభవం గలవి అగు; ఏడురూపములు= సప్తరూపాలు; క్రమంబునన్= వరుసగా; జన్యజనకభావము= పుట్టేది, పుట్టించేది అనే భావాన్ని; ఒంది= పొంది; సంభవించున్= కలుగుతాయి.

తాత్పర్యం: మహత్తు, మనస్సు, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి - అనే ఈ ఏడు రూపాలు గొప్ప వైభవం కలిగి క్రమంగా జన్యజనక భావంతో ఉదయిస్తున్నాయి. అంటే, బ్రహ్మతత్త్వంనుండి మొదట మహత్తత్వం పుడుతుంది. దానినుండి మనస్సు, మనస్సునుండి ఆకాశం, ఆకాశంనుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్నినుండి జలం, జలమునుండి పృథ్వి - ఇట్లా క్రమంగా పుట్టుతున్నాయి. మహదాదిక మైన సప్తరూపాలకు మూలం బ్రహ్మమే.

విశేషం: 'ఆత్మన ఆకాశః సంభూతః, ఆకాశా ద్వాయుః వాయో రగ్నిః, అగ్నే రాపః, అద్భ్యః పృథివీ' ఇత్యాది శ్రుతివచనం కూడా పంచభూతాల ఉత్పత్తిక్రమాన్ని ఇట్లాగే వివరించింది.

క. క్రమయుక్తిని శబ్దస్ప । ర్శములును రూపరసగంధ సద్భావములుం
దమ గుణములుగా నాకా । శము మొదలగు భూతములు ప్రశస్తి వహించున్. 60

ప్రతిపదార్థం: ఆకాశము మొదలగు= ఆకాశాదులైన; భూతములు= ఐదు భూతాలు; క్రమయుక్తిని= క్రమయోగంతో; శబ్దస్పర్శములును= శబ్దం, స్పర్శము; రూపరసగంధ సద్భావములన్= రూపం, రసం, గంధం - అనే సత్పదార్థాలు; తమగుణములుకాన్= తమతమ గుణాలుగా; ప్రశస్తిన్= విఖ్యాతిని; వహించున్= కలిగి ఉన్నాయి.

తాత్పర్యం: పంచభూతాలలో క్రమంగా ఆకాశం శబ్దమనే గుణంతోనూ, వాయువు స్పర్శమనే గుణంతోనూ, తేజస్సు రూపమనే గుణంతోనూ, జలం రసమనే గుణంతోనూ, పృథివి గంధమనే గుణంతోనూ ప్రశస్తి వహిస్తున్నాయి.

క. నరనుత! వినుఁ మీ సప్త । స్వరూపములు పురుషులండ్రు సంయమివరు; లీ
పురుషులు గూడిన సృష్టికి । వెరవరు లది సంఘటిలదు వేర్పడిరేనిన్. 61

ప్రతిపదార్థం: నరనుత!= మనుజులచేత నుతించబడినవాడా!; వినుము= ఆలకించుము; సంయమివరులు= మునీంద్రులు; ఈ సప్తస్వరూపములు= పై జెప్పబడిన ఏడురూపాలు; పురుషులు+అండ్రు= పురుషులు అని చెప్పుతున్నారు; ఈ పురుషులు= మహదాది పురుషులు; కూడినన్= కలిసినచో; సృష్టికిన్= సృష్టికార్యం చేయటానికి; వెరవరులు= ఉపాయశాలు లగుతున్నారు; వేర్పడిరేనిన్= కలవకుండా విడివిడిగా ఉంటే; అది= ఆ సృష్టి; సంఘటిలదు= సంభవించదు.

తాత్పర్యం: జనస్తుతుడవైన ఓ శుకా! వినుము. మునీంద్రులు పై చెప్పిన సప్త స్వరూపాలను పురుషులు అని వ్యవహరిస్తున్నారు. వారు తమలో తాము కూడితే సృష్టికార్యం సిద్ధిస్తుంది. కూడకుండా ఉంటే సృష్టి జరగదు.

వ. ఇట్టి మహిమ గలిగి . 62

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమైన; మహిమకలిగి= ప్రభావం కలిగి.

తాత్పర్యం: ఈ విధమైన ప్రభావంతో కూడి.

క. తేజోరూపము బ్రహ్మము । ప్రాజాపత్యం బనఁగఁ బరగి పురుషుఁ డు
ద్భాజిష్ణు సత్యనిత్యా । వ్యాజమహిమ వెలుఁగుచుండు నకలంకమతిన్. 63

ప్రతిపదార్థం: పురుషుఁడు= పైన పేర్కొనబడిన పురుషుడు; తేజోరూపము= తేజస్స్వరూపం, బ్రహ్మం; ప్రాజాపత్యంబు అనఁగన్= బ్రహ్మమనీ, ప్రాజాపత్యమనీ అనగా; పరఁగి= ఒప్పి; ఉద్భాజిష్ణు సత్యనిత్యావ్యాజమహిమన్= ప్రకాశశీలమైన సత్యం, నిత్యం, వ్యాజరహితం అయిన ప్రభావంతో; అకలంకమతిన్= నిర్మలమైన బుద్ధితో; వెలుఁగుచుండున్= భాసిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: ఆ పురుషుడు తేజోరూపమనీ, బ్రహ్మమనీ, ప్రాజాపత్యమనీ వ్యవహరించబడుతున్నాడు. అంతేకాక నిర్మలమైన మతి గలిగి సదా ప్రకాశించే సత్యమూ, నిత్యమూ అయిన మహిమతో ప్రకాశిస్తూ ఉంటాడు.

క. వ్యాపకుఁడు స్రష్ట బ్రహ్మ ప్ర । జాపతినాఁ బరఁగి నిత్యసత్యాత్మ త్వో
ద్దీపితుఁడై పురుషుఁడు ని । ర్లేపుఁ డనిర్దేశముం గలిగి వెలుఁగొందున్. 64

ప్రతిపదార్థం: పురుషుఁడు= పురుషశబ్దవాచ్యుడైన అతడు; వ్యాపకుడు, స్రష్ట, బ్రహ్మ, ప్రజాపతినాన్= వ్యాపకుడనీ, స్రష్ట అనీ, బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అనగా; పరఁగి= ఒప్పారి; నిత్య సత్యాత్మత్వ+ఉద్దీపితుఁడు+ఐ= శాశ్వతం, సత్యం అయిన ఆత్మభావంచేత ప్రకాశించినవాడై; నిర్లేపుఁడు= సంగం లేనివాడై; అనిర్దేశమున్= ఇట్టిదని నిర్దేశించటానికి వీలుగాని భావమును; కలిగి= వహించి; వెలుఁగొందున్= ప్రకాశిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ పురుషుడినే వ్యాపకుడనీ, స్రష్ట అనీ, బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అంటారు. అతడు నిత్యమూ, సత్యమూ అయిన ఆత్మభావంతో ప్రకాశిస్తుంటాడు. మరియు సంగంలేనివాడై, ఏ విధమైన నిర్దేశం లేక వెలుగొందుతూ ఉంటాడు.

క. సురసంయమి గరుడోరగ । నరకిన్నర గిరి సరిద్వన పయోధులఁ ద
త్కరణీయములం జేయుం । బురుషుఁడు దివ్యాంతరంగమునఁ దలఁచి సుతా! 65

ప్రతిపదార్థం: సుతా!= కుమారా!; పురుషుఁడు= పూర్వోక్తుడైన ఆ పురుషుడు; దివ్య+అంతరంగమునన్= దివ్యమైన హృదయంలో; తలఁచి= సంకల్పించి; సుర= దేవతల యందును; సంయమి= మునులయందును; గరుడ= గరుడుల యందును; ఉరగ= పన్నగుల యందును; నర= మానవుల యందును; కిన్నర= కిన్నరుల యందును; గిరి= పర్వతాల యందును; సరిత్= నదులయందును; వన= అరణ్యాల యందును; పయోధులన్= సముద్రాలయందును; తత్కరణీయములన్= ఆయా కార్యాలను; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: కుమారా! ఆ పురుషుడు తన దివ్యమైన హృదయంలో తలచుకొని దేవతలు, ఋషులు, గరుడులు, ఉరగులు, నరులు, కిన్నరులు, పర్వతాలు, నదులు, అడవులు, సాగరాలు - వీటిలో సురాదులు చేయదగిన ఆయా కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు.

వ. ఇట్లు గలిగి వర్తిలుచున్న లోకంబులందు. 66

ప్రతిపదార్థం: ఇట్లు గలిగి= ఈ రీతిగా సంభవించి; వర్తిలుచున్న= ప్రవర్తిస్తున్న; లోకంబులందున్= ప్రపంచాలలో.

తాత్పర్యం: ఈ విధంగా సంభవించి నడుస్తున్న లోకాలలో.

ఆ. పౌరుషంబు సూవె ఫలదమందురు కొంద । అనఘ! దైవ మిచ్చు నండ్రు కార్య
ఫలము కొంద తెల్ల ఫలము భూతస్వభా । వంబ యండ్రు గొంద అమితతేజ! 67

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అమితతేజ!= అత్యధిక తేజం కలవాడా!; కొందఱు= కొంతమంది; పౌరుషంబు సూవె= పౌరుషమేకదా; ఫలదము= ఫలమిచ్చేది అని; అందురు= చెప్పుతారు; కొందఱు= మరికొంతమంది; కార్యఫలము= చేసేపనులయొక్క ఫలాన్ని; దైవము= విధి; ఇచ్చునండ్రు= ఇస్తుందంటారు; కొందఱు= ఇంక కొందరు; ఎల్లఫలము= అన్ని ఫలాలూ; భూతస్వభావంబ= ఆయా భూతాల స్వభావమే అని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పాపరహితుడవు, అధికతేజుడవూ అయిన ఓ శుకా! కొందరు పురుష ప్రయత్నమే ఫల మిస్తుందంటారు. మరికొందరు కార్యఫలం ఇచ్చేది దైవమని చెప్పుతారు. ఇంక కొందరు ఫలమంతా ఆయా భూతాల స్వభావమే కాని మరేమీ కాదు అని పేర్కొంటారు.

వ. ఇవి కర్మస్థుల తెఱంగులు; సత్త్వస్థులు సమదర్శను లయి యుండుదురు; విశేషంబు వినుము. 68

ప్రతిపదార్థం: ఇవి= ఈ చెప్పినవి; కర్మస్థుల= కర్మమార్గంలో ఉన్నవారి; తెఱంగులు= పద్ధతులు; సత్త్వస్థులు= సత్త్వంలో ఉన్నవారు; సమదర్శనులు+అయి= సమదృష్టి కలవారయి; ఉండుదురు= ఉంటారు; విశేషంబు= విశిష్టాంశం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కర్మమార్గంలో ఉండేవారి పద్ధతు లివి. సత్త్వస్థ లయిన వారు సదా సమదర్శనం కలిగి ఉంటారు. ఇక ఇందులో ఉన్న విశేషం వివరిస్తాను వినుము.

క. శివకరము దపము మేధా । ధవ! సకల జనంబులకును దానికి మూలం
బవిరళ శమదమ సంపద । లవుట నివి మనంబుతోడ నలవడ వలయున్. 69

ప్రతిపదార్థం: మేధాధవ!= బుద్ధిమంతుడా!; సకలజనంబులకును= సమస్త ప్రజలకూ; తపము= తపస్సు; శివకరము= మంగళకరం; దానికిన్= తపస్సుకు; అవిరళ= ఎడతెగని; శమదమ= అంతరింద్రియ నిగ్రహ బాహ్యేంద్రియ నిగ్రహములనెడి; సంపదలు= సిరులు; మూలంబు= కారణం; అవుటన్= కావటంవలన; ఇవి= ఈ శమదమాలు; మనంబు తోడన్= చిత్తంలో; అలవడన్ వలయున్= అలవాటు గావలెను.

తాత్పర్యం: ప్రజ్ఞావంతుడవైన ఓ శుకా! సర్వజనులకూ తపస్సు మంగళకరమైనది. తపస్సుకు మూలం ఎడతెగని శమదమాలే అవుతున్నాయి. అందువలన శమదమాలను మనస్సులో అలవరచుకొనాలి.

వ. స్వాధ్యాయంబు దపంబునకు బలం బిచ్చి తత్ఫలంబు గావించు. 70

ప్రతిపదార్థం: స్వాధ్యాయంబు= వేదాధ్యయనం; తపంబునకున్= తపస్సుకు; బలంబు+ఇచ్చి= బలం ఇచ్చి; తత్ఫలంబున్= ఆ తపస్సుకు అనువైన ఫలాన్ని; కావించున్= ఒడగూరుస్తుంది.

తాత్పర్యం: తపస్సుకు వేదాధ్యయనం బలం చేకూరుస్తుంది. తద్ద్వారా తపస్సుకు రాగల ఫలాన్ని ప్రసాదింపజేస్తుంది.

క. అరయంగా శబ్దంబును । పరంబునన రెండు సూవె బ్రహ్మములు గుణో
త్తర శబ్ద బ్రహ్మ భజన । పరుఁడు పరబ్రహ్మ మహితపదముం బొందున్. 71

ప్రతిపదార్థం: గుణ+ఉత్తర!= గుణశ్రేష్ఠుడా; అరయంగాన్= పరిశీలించగా; శబ్దంబును, పరంబున్= శబ్దబ్రహ్మము, పరబ్రహ్మము; అనన్= అనగా; బ్రహ్మములు= బ్రహ్మములు; రెండుచూవె!= రెండుగదా!; శబ్దబ్రహ్మ భజనపరుఁడు= శబ్దబ్రహ్మమును సేవించటంలో ఆసక్తి కలిగినవాడు; పరబ్రహ్మమహిత పదమున్= పరబ్రహ్మమనే శ్రేష్ఠమైన స్థానాన్ని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: గుణశ్రేష్ఠుడవైన ఓ శుకుడా! బ్రహ్మములు శబ్దబ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ రెండు రకాలుగా ఉన్నాయి. శబ్దబ్రహ్మను భజించడంలో ఆసక్తిగలవాడు పరబ్రహ్మను పొందుతాడు.

విశేషం: 'ద్వే విద్యే వేతవ్యే తు శబ్దబ్రహ్మ పరంచ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరంబ్రహ్మ ధిగచ్ఛతి॥' అన్న అమృతబిందూపనిషత్తులోని వచనం ఇక్కడ స్మరణీయం. శబ్దబ్రహ్మ పరబ్రహ్మలను రెండు విద్యలు తెలిసికొనాలి. శబ్దబ్రహ్మంలో నిపుణుడైనవాడు పరబ్రహ్మమును పొందుతాడని ఇందలి భావం.

క. పరమబ్రహ్మమ భూతో । త్కరముం గలిగించు మ్రింగు; దా నిష్క్రియతా
స్ఫురితం బయ్యును బ్రకృతి । స్ఫురణను శబలత్వ మొంది పురుషవరేణ్యా! 72

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= పురుషశ్రేష్ఠా!; పరమబ్రహ్మమ= పరబ్రహ్మమే; తాన్= తాను; నిష్క్రియతా స్ఫురితంబు= క్రియారాహిత్యంచేత ప్రకాశిస్తూ కూడా; ప్రకృతి స్ఫురణనున్= ప్రకృతి యొక్క స్ఫూర్తిచేత; శబలత్వము= విచిత్రత్వమును; ఒంది= పొంది; భూత+ఉత్కరమున్= భూతముల సమూహాన్ని; కలిగించున్= పుట్టిస్తుంది; మ్రింగున్= సంహరిస్తుంది.

తాత్పర్యం: పురుష వర్యుడవగు ఓ శుకా! పరబ్రహ్మమే తాను ఏ క్రియా లేనిదై కూడా ప్రకృతి ప్రభావంతో శబలత్వం పొంది భూతాలను పుట్టించటం, సంహరించటం చేస్తూ ఉంటుంది.

వ. సృష్టి తెఱంగు ము న్నెఱింగించితి; సంహారప్రకారంబు సెప్పెద నాకర్ణింపుము. 73

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; సృష్టి తెఱంగు= సృష్టిక్రమాన్ని; ఎఱింగించితిన్= తెలియజేశాను; సంహారప్రకారంబున్= జగత్తుయొక్క సంహారవిధానాన్ని; చెప్పెదన్= వచిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ముందు జగత్తుయొక్క సృష్టి విధానం చెప్పాను. ఇప్పుడు సంహారవిధానం ఎట్లాంటిదో వివరిస్తాను. వినుము.

తే. స్థావరములు జంగమములుఁ దన్నుఁ గలయ । విలయ మొందిన ఘటపృష్ఠ విధము దాల్చు;
భూమి నంబువుల్ మ్రింగు; వంబువుల నగ్ని । యగ్ని ననిలుం, డనిలుఁ ద్రావు నాకసంబు. 74

ప్రతిపదార్థం: స్థావరములు= కదలని కొండలు మొదలైనవి; జంగమములు= సంచరించే ప్రాణులు; తన్నున్= తనను; కలయన్= కూడుకొనగా; విలయము= ప్రళయం; ఒందిన= పొందిన; ఘటపృష్ఠ విధమున్= కుండయొక్క పూర్వ రూపమైన మట్టిరీతిని; తాల్చున్= ధరించును; భూమిన్= అట్టి పృథ్విని; అంబువుల్= జలం; మ్రింగున్= హరించును; అంబువులన్= జలాన్ని; అగ్ని= అనలుడు; అగ్నిన్= అనలుడిని; అనిలుండు= వాయువు; అనిలున్= వాయువును; ఆకసంబు= గగనం; త్రావున్= లయమొనర్చుకొంటాయి.

తాత్పర్యం: స్థావర జంగమా లనబడే సకలమూ భూమిలో కలిసిపోతాయి. అది ఘటస్వరూపం నశించిన పిమ్మట ఘటం తన పూర్వరూపమైన మృత్తికను పొందినట్లు అవుతుంది. ఆ భూమిని జలాలు మ్రింగుతాయి. జలాలను అగ్నీ, అగ్నిని వాయువూ, వాయువును ఆకాశమూ కబళిస్తాయి.

ఆ. ఆకసమును మనసు హరియించు, గంధాది । యగు గుణాళితోడ నఖిల భూత
ములును నిట్లు లయముఁ బొందిన గ్రసియించు । మనసు నాత్మగుణము నెనసి విధుఁడు. 75

ప్రతిపదార్థం: ఆకసమును= ఆకాశాన్ని; మనసు= చిత్తం; హరియించున్= లయింపజేస్తుంది; ఇట్లు= ఈ రీతిగా; అఖిలభూతములును= సమస్త భూతాలు; గంధ+ఆదిఅగు= గంధం మొదలైన; గుణ+ఆళితోడన్= గుణాల సమూహంతో కూడా; లయమున్= నాశమును; పొందినన్= పొందగా; విధుఁడు= చంద్రుడు; ఆత్మగుణమున్= తన స్వభావాన్ని; ఎనసి= పొంది; మనసున్= చిత్తమును; గ్రసియించున్= మ్రింగుతాడు.

తాత్పర్యం: మనస్సు ఆకాశాన్ని హరించివేస్తుంది. ఇట్లా సకలభూతాలూ తమ తమ గంధం మొదలైన గుణాలతో కూడ లయమై పోతాయి. తరువాత మనస్సుకు అధిదేవత అయిన చంద్రుడు తన స్వభావం పొంది ఆ మనస్సును కూడా తనలో లయం చేసుకొంటాడు.

క. అతనిఁ బొదువు సంకల్పం । బతుల జ్ఞానంబు దాని నడఁచును విజ్ఞా
నితఁ దద్బలముఁ బురుషదే । హితనుం గాలంబు వరుస నెడలం జేయున్. 76

ప్రతిపదార్థం: సంకల్పంబు= మనోవ్యాపారం; అతనిన్= ఆ చంద్రుడిని; పొదువున్= లయింపజేస్తుంది; అతులజ్ఞానంబు= సాటిలేని జ్ఞానం; దానిన్= ఆ సంకల్పాన్ని; అడఁచును= అణచివేస్తుంది; కాలంబు= కాలాత్మకమైన తత్త్వం; విజ్ఞానితన్= విజ్ఞానిత్వాన్ని; తద్బలమున్= దాని బలాన్ని; పురుషదేహితనున్= పురుషశరీరత్వాన్ని; వరుసన్= క్రమంగా; ఎడలన్+చేయున్= నశింపజేస్తుంది.

తాత్పర్యం: సంకల్పం చంద్రుడిని గ్రసిస్తుంది. నిరుపమానమైన జ్ఞానం సంకల్పాన్ని రూపుమాపుతుంది. కాలం క్రమంగా విజ్ఞానాన్ని, దాని బలాన్నీ, పురుషశరీరత్వాన్నీ హతమారుస్తుంది.

క. కాలం బెడలిన విద్యో । న్మీలిత మగు బోధ మన్యమిశ్రత్వంబుం
దూలించి వెలుఁగుచుండు వి । శాలమతీ! బ్రహ్మ మది ప్రశస్తము శ్రుతులన్. 77

ప్రతిపదార్థం: విశాలమతీ!= విపులమైన బుద్ధికలవాడా!; కాలంబు+ఎడలినన్= కాలం నశించిపోగా; విద్యోన్మీలితము+అగు= విద్యచేత వికసించినదైన; బోధము= జ్ఞానం; అన్యమిశ్రత్వంబున్= ఇతర పదార్థాలతో కలయికను; తూలించి= తొలగించి; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అది= అయ్యది; శ్రుతులన్= వేదాలలో; ప్రశస్తము= ప్రసిద్ధమైనది; బ్రహ్మము= బ్రహ్మశబ్దంతో వ్యవహరించబడేది.

తాత్పర్యం: విశాలబుద్ధిగల ఓ శుకుడా! ఆ కాలం కూడా నశిస్తుంది. పిదప విద్యచేత వికాసం పొందిన జ్ఞానం దేనితోనూ కలయిక చెందక శుద్ధబోధస్వరూపమై వెలుగొందుతుంది. అదే బ్రహ్మం. వేదాలతో ప్రశస్తమైన బ్రహ్మ మదే.

క. వినుమీ సంహరణంబును । దన వస మాతత్త్వ మవ్విధంబున దివసం
బును రాత్రియు భూతములకు । జననము విలయమును జేయు సంక్రీడమెయిన్. 78

ప్రతిపదార్థం: వినుము; ఈ సంహరణంబును= ఈ సంహారం కూడా; తన వసము= ఆ బ్రహ్మముయొక్క వశంలో ఉన్నదే; ఆ తత్త్వము= ఆ బ్రహ్మం; ఆ+విధంబునన్= ఆ రీతిగా; దివసంబును= పగలును; రాత్రియున్= రేయియు; భూతములకున్= భూతాలకు; జననమున్= పుట్టుకను; విలయమును= వినాశనాన్ని; సంక్రీడమెయిన్= ఆటవలె; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: శుకుడా! వినుము. ఈ సంహారకార్యం కూడా ఆ బ్రహ్మవశంలోనిదే. ఈ ప్రకారంగా ఆ బ్రహ్మం రేయుంబవళ్ళు భూతాలకు వినోదక్రీడవలె జనన మరణాలను చేస్తూ ఉంటుంది'.

వ. అని చెప్పి పారాశర్యుం డార్యవర్యుం డగు శుకునితో వెండియు నిట్లనియె. 79

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; పారాశర్యుండు= వ్యాసుడు; ఆర్యవర్యుండు+అగు= ఆర్యశ్రేష్ఠుడైన; శుకునితోన్= శుకయోగితో; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పి ఆర్యశ్రేష్ఠుడైన శుకుడిని చూచి మళ్ళీ ఇట్లా అన్నాడు:

సీ. 'జనియించి విప్రుండు జాతకర్మంబును । జౌలంబు నుపనీతి సంస్కృతియును
బడసి యాచార్యునిపాల నధ్యయనంబు । సేసి, తా నాతనిచే ననుజ్ఞ
గాంచి తక్కటివి మూఁ డంచితాశ్రమముల । యందు నొక్కటి పూననగు గృహస్థ
ధర్మ మాశ్రయ మంద్రు తక్కిన మూఁటికిఁ । గావున నది పూని దైవపైతృ

తే. కంబులైన ఋణంబులఁ గ్రాఁచు; వడుగు । నాఁటి నడవడి ఋషుల ఋణమ్ము దీర్చి
వచ్చి కాన కాషాయపక్వతఁ బ్రశుద్ధిఁ । బొంది మఱి యుత్తమాశ్రమ మొందు టొప్పు. 80

ప్రతిపదార్థం: విప్రుండు= ద్విజుడు; జనియించి= పుట్టి; జాతకర్మంబునున్= పుట్టినపుడు చేసే సంస్కారాన్ని; చౌలంబున్= చూడా కర్మయును; ఉపనీతి సంస్కృతియునున్= ఉపనయన సంస్కారమును; పడసి= పొంది; ఆచార్యునిపాలన్= గురువు చెంత; అధ్యయనంబు చేసి= వేదాధ్యయనం కావించి; తాను= శిష్యుడైన తాను; ఆతనిచేన్= ఆ గురువుచేత; అనుజ్ఞన్= అనుమతిని; కాంచి= పొంది; తక్కటివి= మిగిలినవైన; మూఁడు+అంచిత+ఆశ్రమములఅందున్= పూజితములైన (గార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసములనెడు) మూడు ఆశ్రమాలలో; ఒక్కటి= ఒక్క ఆశ్రమాన్ని; పూనన్+అగున్= స్వీకరించదగును; తక్కిన మూఁటికిన్= మిగిలిన బ్రహ్మచర్యం మొదలైన మూడాశ్రమాలకు; గృహస్థ ధర్మము= గృహస్థాశ్రమ రూపమైన ధర్మం; ఆశ్రయము= ఆధారం; అండ్రు= అని పెద్దలు చెప్పుతారు; కావునన్= ఆ కారణంవలన; నాఁటినడవడిన్= బ్రహ్మచర్య కాలం నాటి వేదాధ్యయనాది ప్రవర్తనతో; ఋషులఋణమ్మున్= ఋషులకు చెందిన అప్పును; తీర్చివచ్చి= తొలగించుకొని వచ్చి; వడుగు= బ్రహ్మచారి; అది= ఆ గృహస్థాశ్రమం; పూని= వహించి; దైవపైతృకంబులు+ఐన= దేవతలకు, పితరులకు చెందిన; ఋణంబులన్= అప్పులను; క్రాఁచున్= తొలగించుకొంటాడు; కాన= ఆ కారణంవలన; కాషాయపక్వతన్= చిత్తదోషాన్ని శమింపజేయడం ద్వారా; ప్రశుద్ధిన్= మిక్కిలి శుద్ధిని; పొంది= వహించి; మఱి= ఆ పైన; ఉత్తమ+ఆశ్రమము= శ్రేష్ఠమైన ఆశ్రమమును; ఒందుట= పొందుట; ఒప్పున్= సమంజసంగా ఉంటుంది.

తాత్పర్యం: బ్రాహ్మణుడు తాను పుట్టిన తర్వాత జాతకర్మ, చూడాకర్మ, ఉపనయనం మొదలైన సంస్కారాలు పొందాలి. ఆపై ఆచార్యుడి చెంతకు వెళ్ళి వేదాధ్యయనం చేయాలి. పిదప గురుని అనుమతి పొంది గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే మూడు ఆశ్రమాలలో ఏదైనా ఒక ఆశ్రమాన్ని స్వీకరించాలి. బ్రహ్మచర్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే మూడాశ్రమాలకూ ఆధారం గృహస్థాశ్రమం అంటారు. అందుచేత తాను బ్రహ్మచారిగా ఉంటూ వేదాధ్యయనం చేయటం ద్వారా ఋషి ఋణం తీర్చుకొన్నా, బ్రహ్మచారి ఇప్పుడు క్రమపద్ధతిలో గృహస్థాశ్రమం స్వీకరించి దేవఋణాన్ని, పితృఋణాన్ని తీర్చుకొనాలి. ఈ రీతిగా క్రమపద్ధతిలో చిత్తదోషం తొలగించుకొని పరిపాకం పొందిన తర్వాతనే ఉత్తమాశ్రమమైన సన్న్యాసం స్వీకరించటం మంచిది.

విశేషం: బ్రాహ్మణాది జాతులకు స్మృతులలో జాతకర్మం మొదలైన అనేక సంస్కారాలు విధించబడ్డాయి. ఇక్కడ విప్రులు పాటించవలసిన జీవనవిధానాన్ని బోధిస్తున్నాడు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనేవి నాలుగు ఆశ్రమాలు. ఇందులో బ్రహ్మచర్యం పాటించినవాడు తక్కిన మూడాశ్రమాలలో తనకు అనువైన ఏ ఆశ్రమాన్నైనా స్వీకరించవచ్చును. కాని క్రమపద్ధతిలో గార్హస్థ్యం స్వీకరించటం మంచిదని వ్యాసుడి అభిప్రాయం. అది తక్కిన ఆశ్రమాలను పోషించేది కదా!

ఋషిఋణం, దేవఋణం, పితృఋణం మొదలైన ఋణాలు ప్రతి ఒక్కరికీ సహజంగా ఉంటాయి. వేదాధ్యయనంతో ఋషి ఋణాన్నీ, యజ్ఞకర్మతో దేవఋణాన్నీ, శ్రాద్ధాదులతో పితరుల ఋణాన్నీ తీర్చుకొనవచ్చును. ఇందుకు గృహస్థాశ్రమం తగి ఉంటుంది. క్రమపద్ధతిలో పక్వస్థితికి వచ్చిన తర్వాత చివరిదీ, శ్రేష్ఠతమమైనదీ అయిన సన్న్యాసం స్వీకరించాలి. ఇట్లా చేయటం మంచిదని తాత్పర్యం.

తే. క్రతువుసేఁత సేయించుట, శ్రుతులు గాధ । నియతిఁ జదువుట, చదివించుటయును, ధనము
లీగికొనుట షట్కర్మంబు; లింతవట్టు । నర్హకృత్యంబు లండ్రు ధరామరులకు. 81

ప్రతిపదార్థం: క్రతువు= యజ్ఞం; చేఁత= చేయటం; చేయించుట= ఇతరులచేత అనుష్ఠింప చేయటం; గాఢనియతిన్= దృఢమైన నియమంతో; శ్రుతులు= వేదాలు; చదువుట= అధ్యయనం చేయటం; చదివించుటయును= ఇతరులచేత అధ్యయనం చేయించటం; ధనములు= అర్థసంపదలు; ఈగి= ఇవ్వటం; కొనుట= ఇతరులనుండి స్వీకరించటం; షట్కర్మంబులు= ఆరు కర్మములు; ఇంతవట్టు= ఇంతవరకు; ధరా+అమరులకున్= భూసురులకు; అర్హకృత్యంబులు= తగినపనులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: బ్రాహ్మణులకు యజ్ఞం చేయటం, ఇతరులచేత చేయించటం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అనబడే షట్కర్మలు తగిన పనులని పెద్దలు చెప్పుతారు.

దానగుణంబు సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట (సం.12-226-14,15)

వ. దానానుష్ఠానంబు సర్వజాతి సామాన్యం బయిన యుత్తమధర్మంబు; పుణ్యపరులకు దాతవ్యంబుగాని వస్తువు లేదు; కాశ్యుండను రాజు దన ప్రాణంబు లిచ్చి బ్రాహ్మణప్రాణంబులు గాచె, నౌశీనరుండగు శిబి యాత్మాంగంబుల నౌరస పుత్రునిని బ్రాహ్మణార్థంబుగా నొసంగెఁ; గాశీపతి యగు ప్రతర్దనుండు బ్రాహ్మణునికై నిజనయనంబులిచ్చె; విదేహుండును, జామదగ్న్యుండును, గయుండును నొక్కొక్కతఱి సకల వసుంధరయును బ్రాహ్మణుల కిచ్చిరి; పాంచాల్యుండగు బ్రహ్మదత్తుండు శంఖనిధి విప్రోత్తములకు దానంబుసేసె; మఱియును బ్రాహ్మణులకుఁ బ్రాణ శరీర మణి హిరణ్య కన్యాగవాది ప్రశస్త వస్తువు లనేకు లర్థుల కొసంగిరి; వారలకెల్లను సమకూరిన సద్గతుల విశేషంబులం జెప్పం బెద్దయని వెండియు. 82

ప్రతిపదార్థం: దాన+అనుష్ఠానంబు= దానం అనే ఆచరణ; సర్వజాతిసామాన్యంబు+అయిన= అన్ని జాతులకూ సాధారణమైన; ఉత్తమ ధర్మంబు= శ్రేష్ఠధర్మం; పుణ్య పరులకున్= పుణ్యంపై ఆసక్తిగలవారికి; దాతవ్యంబుకాని= ఈరాని; వస్తువు లేదు= పదార్థం లేదు; కాశ్యుండను రాజు= కాశ్య డనబడే నరపతి; తన ప్రాణంబులు= తన అసువులు; ఇచ్చి= ఒసగి; బ్రాహ్మణ ప్రాణంబులు= విప్రుడి యసువులను; కాచెన్= రక్షించాడు; ఔశీనరుండు+అగు= ఉశీనర దేశానికి చెందిన; శిబి= శిబి అనే రాజు; ఆత్మ+అంగంబులన్= తన అవయవాలను; ఔరస పుత్రునినిన్= తన సొంత కుమారుడిని; బ్రాహ్మణ+అర్థంబుగాన్= బ్రాహ్మణుల కొరకై; ఒసంగెన్= ఇచ్చాడు; కాశీపతిఅగు= కాశీనగరానికి రాజైన; ప్రతర్దనుండు= ప్రతర్దను డనేవాడు; బ్రాహ్మణునకై= విప్రుడికై; నిజనయనంబులు= తన కన్నులు; ఇచ్చెన్= ఇచ్చాడు; విదేహుండును, జామదగ్న్యుండును, గయుండును= జనకుడు, పరశురాముడు, గయుడనువారు; ఒక్కొక్క తఱిన్= ఒక్కొక్క సమయాన; సకలవసుంధరయును= సమస్త భూమియును;

బ్రాహ్మణులకున్= విప్రులకు; ఇచ్చిరి= ఇచ్చారు; పాంచాల్యుండగు= పాంచాలదేశానికి చెందినవాడైన; బ్రహ్మదత్తుండు= ఆ పేరుగల రాజు; విప్ర+ఉత్తములకున్= బ్రాహ్మణోత్తములకు; శంఖనిధి= 'శంఖ' మనే నిధిని; దానంబుచేసెన్= దానంగా ఇచ్చాడు; మఱియును= ఇంకను; అనేకులు= పెక్కుమంది; అర్హులకున్= తగినవారికి; బ్రాహ్మణులకున్= విప్రులకు; ప్రాణ= ప్రాణాలు; శరీర= దేహం; మణి= మణులు; హిరణ్య= స్వర్ణం; కన్యా= కన్యలు; గవాది(గో+ఆది)= గోవులు మొదలైన; ప్రశస్త వస్తువులు= శ్రేష్ఠ పదార్థాలు; ఒసంగిరి= ఇచ్చారు; వారలకున్+ఎల్లను= వారికందరికీ; సమకూరిన= కలిగిన; సద్గతుల విశేషంబులన్= ఉన్న తగతులలోని విశేషాలను; చెప్పన్+పెద్ద అని= వివరించటానికి అలవిగాకున్నదని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: దాన మనేది అన్ని జాతులకూ సాధారణమైన ఉత్తమధర్మం. పుణ్యాత్ములకు ఈరాని వస్తువు లేదు. పూర్వం కాశ్యుడనే రాజు తన ప్రాణా లిచ్చి బ్రాహ్మణుడి ప్రాణాలను రక్షించాడు. ఉశీనరాధిపతి అయిన శిబి బ్రాహ్మణులకై తన అవయవాలనూ, ఔరసపుత్రుడినీ దానం చేశాడు. కాశిని పాలించే ప్రతర్దనుడనేరాజు తన నేత్రాలు విప్రుడికై దానం చేశాడు. జనకుడు, పరశురాముడు, గయుడు బ్రాహ్మణులకై సమస్త భూమండలాన్ని దానమిచ్చారు. పాంచాలదేశీయుడైన బ్రహ్మదత్తుడు విప్రశ్రేష్ఠులకు శంఖనిధినే దానం చేశాడు. అంతే కాదు. చాలామంది తగిన విప్రులకు ప్రాణాలు, శరీరం, మణులు, బంగారు, కన్యలు, గోవులు మొదలైన శ్రేష్ఠపదార్థాలను దానం చేసి ఉన్నారు. వారి కందరికీ కలిగిన సద్గతులను వివరించటానికి సాధ్యం కాదు' అని చెప్పి వ్యాసుడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. 'దానాధ్యయన యజనముల । నానావిధపాపములు వినాశముఁ బొందుం
గాన యవి మేలు హింసా । హీనత ధర్మవిధిలేని యెడఁ గడు వలయున్. 83

ప్రతిపదార్థం: దాన= దానం చేతను; అధ్యయన= వేదాధ్యయనం చేతను; యజనములన్= యజ్ఞాలు చేయటంచేతను; నానావిధపాపములు= పెక్కు రకాలైన పాపాలు; వినాశమున్+పొందున్= నశించిపోతాయి; కాన= అందువలన; అవి= ఆ దానాదులు; మేలు= శ్రేష్ఠమైనవి; ధర్మవిధి లేనిఎడన్= ధర్మవిహిత విధానం లేని చోట; కడున్= మిక్కిలిగా; హింసాహీనత= హింసలేకుండా ఉండటం; వలయున్= ఆవశ్యకమై ఉన్నవి.

తాత్పర్యం: దానం, అధ్యయనం, యజ్ఞం చేయటం అనే కర్మలవలన అనేక విధాల పాపాలు నశిస్తాయి. కాబట్టి వాటి నాచరించటం మేలైన పని. వేదవిహిత ధర్మం కానప్పుడు ఏ ప్రాణులనూ హింసించకుండా ఉండాలి. (వేదం విధించినపుడు ప్రాణిహింస హింస కాదని భావం).

ఆ. ధూతపాపుఁ డైన పూతాత్ముకుండు ల । ఘ్వాశి యగుచు, నింద్రియముల గెల్చి
మనసులోనఁ గామమును గ్రోధమును జొర । నీక బ్రహ్మపదము నిచ్చఁ గోరు. 84

ప్రతిపదార్థం: ధూతపాపుఁడు+ఐన= తొలగిన పాపాలు కలవాడగు; పూత+ఆత్ముకుండు= పవిత్రాత్ముడు; లఘు+ఆశి అగుచున్= మితాహారి అవుతూ; ఇంద్రియములన్= ఇంద్రియాలను; గెల్చి= ఓడించి; మనసులోనన్= చిత్తంలో; కామమును క్రోధమును= కామాన్ని, కోపాన్నీ; చొరన్+ఈక= ప్రవేశించనీయకుండా; ఇచ్చన్= మనస్సులో; బ్రహ్మపదమున్= బ్రహ్మస్థానాన్ని; కోరున్= అభిలషిస్తాడు.

తాత్పర్యం: పాపాల నన్నిటినీ నశింపజేసికొన్న పవిత్రాత్ముడు మితంగా ఆహారం స్వీకరించి, ఇంద్రియాలపై విజయం సాధిస్తాడు. కామక్రోధాలను తన మనస్సులో ప్రవేశింపనీయడు. అట్లా చేసి బ్రహ్మపదవిని ఎదలో అభిలషిస్తాడు.

ఆ. ఇట్టివాఁడు వెడల నీఁడు నింద్రియజల । మన్యుపంక లోభమయ తటాది
ఘోరరూప యగు నసార సంసార వి । శాలనదిఁ బ్రశాంతశాలి హృదయ! 85

ప్రతిపదార్థం: ఇట్టివాఁడు= ఈ విధంగా ప్రవర్తించేవాడు; ఇంద్రియజల= ఇంద్రియా లనే నీటితోనూ; మన్యుపంక= కోపమనే బురదతోనూ; లోభమయతట+ఆది= లోభరూపమైన గట్టు మొదలైన వాటితోనూ; ఘోరరూప+అగు= భయంకర రూపంకలదైన; అసార= సారంలేని; సంసార= సంసారమనెడి; విశాల= విస్తృతమైన; నదిన్= నదిని; వెడలన్+ఈఁదున్= తరిస్తాడు.

తాత్పర్యం: ప్రశాంతమైన చిత్తం కల శుకుడా! పై నే చెప్పిన రీతిగా ప్రవర్తించేవాడు ఇంద్రియాలే నీరుగా, కోపమే బురదగా, లోభమే గట్టుగా - ఇట్లా భీకరంగా ఉన్న సంసార మనే విశాలమైన నదిని తరిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

తే. ఘనతరప్రజ్ఞ యను తెప్ప గలుగువాఁడు । సంసరణనది గడవంగఁ జాలుఁ గాక!
కామమును క్రోధమును మదిఁ గలిగి ప్రజ్ఞ । చించునేని నక్కడచుట చిక్కువడదె? 86

ప్రతిపదార్థం: ఘనతరప్రజ్ఞ+అను= గొప్పదైన ప్రజ్ఞ అనే; తెప్ప= నావ; కలుగువాఁడు= కలవాడు; సంసరణనదిన్= సంసారమనే నదిని; కడవంగన్+చాలున్= దాటగలుగుతాడు; కాక= అట్లాకాక; కామమును= కోరికను; క్రోధమును= కోపమును; మదిన్= చిత్తంలో; కలిగి= సంభవించి; ప్రజ్ఞన్= బుద్ధిని; చించున్+ఏనిన్= నశింపజేస్తే; ఆ+కడచుట= ఆ తరించటం అనే కార్యం; చిక్కు+పడదె?= ఇబ్బందికి గురికాదా?

తాత్పర్యం: గొప్ప ప్రజ్ఞ అనే పడవ నధిష్ఠించిన వాడు సంసార మనే నదిని దాటుతాడు. అట్లాకాక కామక్రోధాలవలన ప్రజ్ఞకు భంగం కలిగితే ఆ నదీతరణం చిక్కుపడి నెరవేరకపోతుంది కదా!

క. గతహర్షభయక్రోధుఁడు । ధృతిమంతుఁడు నప్రమత్తధీమహితుఁడు సం
శ్రితధర్ముఁడు దాంతుఁడు నగు । నతఁ డవసాదంబు నొందఁ డతులవివేకా! 87

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని తెలివికలవాడా!; గతహర్షభయక్రోధుఁడు= తొలగిన సంతోషం, భీతి, కోపంకలవాడు; ధృతిమంతుఁడు= ధైర్యంకలవాడు; అప్రమత్త= ఏమరుపాటు లేని; ధీ= బుద్ధిచేత; మహితుఁడు= పూజితుడైనవాడు; సంశ్రితధర్ముఁడు= ఆశ్రయించబడిన ధర్మంకలవాడు; దాంతుఁడు= నిగ్రహంకలవాడు; అగు= అయిన; అతఁడు= ఆ వ్యక్తి; అవసాదంబున్= నాశనాన్ని; ఒందఁడు= పొందడు.

తాత్పర్యం: అనుపమ వివేకంకల శుకుడా! ఎవరికి హర్షం, భయం, కోపం లేవో ఎవడు ధైర్యశాలియో, జాగరూకమైన బుద్ధిగలవాడో, ధర్మా న్నాశ్రయించి ఉంటాడో, ఇంద్రియనిగ్రహం కలిగి ప్రవర్తిస్తాడో, అట్లాంటివాడు నాశం పొందడు.

క. ధర్మ మధర్మము వోలె న । ధర్మము దా ధర్మవిధి విధంబున దోఁచుం
గర్మసమితి నొక్కొక యెడ । ధర్మగతి యెఱుంగవలయుఁ దచ్ఛాస్త్రములన్.' 88

ప్రతిపదార్థం: కర్మ సమితిన్= కార్యసమూహంలో; ఒక్కొక ఎడన్= ఒక్కొక్క సందర్భంలో; ధర్మము= ధర్మమైనది; అధర్మముపోలెన్= ధర్మం కాని దానివలెనూ; అధర్మము= ధర్మంకానిది; తాన్= తాను; ధర్మవిధివిధంబునన్= ధర్మకార్యం మాదిరిగానూ; తోఁచున్= భాసిస్తుంది; తద్+శాస్త్రములన్= ఆ ధర్మం నిరూపించే శాస్త్రాలతో; ధర్మగతి= ధర్మవిధానాన్ని; ఎఱుంగన్ వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: మనం అనుష్ఠించే కార్యాలలో ఒక్కొక్క పట్టున ధర్మకార్యం అధర్మంగా తోస్తుంది. అధర్మకార్యం ధర్మంగా తోస్తుంది. అందుచేత ధర్మశాస్త్రాలను పరీక్షించి ధర్మగమన మెట్లాంటిదో గుర్తించాలి'.

వ. అని యుపదేశించి మఱియును. 89

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; ఉపదేశించి= బోధించి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఇట్లా బోధించి వ్యాసుడు శుకుడితో ఇంకా ఇట్లా అన్నాడు:

క. 'జ్ఞానంబు వడయుటకు వా । ఙ్మానసములు సునియతములు గావింతురు, స
మ్మానిత శాంతికొఱకు వి । జ్ఞానంబున నాత్మనియతి సల్పుదురు బుధుల్. 90

ప్రతిపదార్థం: బుధుల్= పండితులు; జ్ఞానంబు పడయుటకున్= జ్ఞానం పొందటానికి; వాక్+మానసములు= వాక్కును, మనస్సును; సునియతములు= చక్కగా నియమించబడినవిగా; కావింతురు= చేస్తారు; సమ్మానిత= ఆదరింపబడిన; శాంతికొఱకున్= శాంతిని పొందటానికి; విజ్ఞానంబునన్= విశేష జ్ఞానంతో; ఆత్మనియతిన్= ఆత్మనియమమును; సల్పుదురు= చేస్తారు.

తాత్పర్యం: 'పండితు లైనవారు జ్ఞానసిద్ధిని కోరి వాక్కును, మనస్సునూ నిగ్రహిస్తారు. శాంతి పొందటానికై విశేషజ్ఞానంతో ఆత్మనియమం పాటిస్తారు.

క. ఈ తెరువున వేదవిదుఁడు । వీతామ్నాయుండు ధర్మవేదియుఁ బాప
స్పృతుఁడు సరియై కడతు ర । నాతురత జరామరణమహాంభోరాశిన్. 91

ప్రతిపదార్థం: ఈ తెరువునన్= ఈ మార్గంతో; వేదవిదుఁడు= వేదం తెలిసినవాడూ; వీత+ఆమ్నాయుండు= వేదజ్ఞానం లేనివాడూ; ధర్మవేదియున్= ధర్మం తెలిసిన వాడూ; పాపస్పృతుఁడు= పాపంచేత వృద్ధిపొందిన వాడూ; సరి+ఐ= సమానులై; అనాతురతన్= ఆతురత లేకుండా; జరామరణ మహా+అంభోరాశిన్= ముసలితనం, చావు అనే మహాసముద్రాన్ని; కడతురు= తరిస్తారు.

తాత్పర్యం: వేదజ్ఞుడైనా, వేదగంధం లేనివాడైనా, ధర్మజ్ఞుడైనా, పాపాత్ముడైనా సరే - పైన చెప్పిన పద్ధతి పాటిస్తే - అందరూ సమంగా జరామరణ ప్రవాహరూపమైన సంసారసముద్రాన్ని కష్టంలేకుండా దాటుతారు.

విశేషం: అలం: రూపకం.

వ. ఆచారనేమియుఁ, బ్రాణయుగంబును, నపానాక్షంబును, హ్రీవరూథంబును, నుపాయాపాయకూబరంబును,
ఘ్రాణశ్రవణ వాహనంబును, జ్ఞానసారథికంబును, సర్వతంత్రప్రతోదంబును, ద్యాగరశ్మియు నగు యోగరథంబు
నెక్కి వెరవుగలవాఁ డక్షరపదంబు సొరం జనఁజాలు; నా రథికుం డా తంత్రంబు ప్రభావంబునంజేసి.92

ప్రతిపదార్థం: ఆచారనేమియున్= ఆచార మనే చక్రపు టంచు గలదీ; ప్రాణయుగంబును= ప్రాణమనే కాడి గలదీ; అపాన+అక్షంబును= అపానమనే ఇరుసు కలదీ; హ్రీవరూథంబును= సిగ్గు అనే ఆచ్ఛాదనం కలదీ; ఉపాయ+అపాయకూబరంబును= ఉపాయం, అపాయం అనే నొగలు కలదీ; ఘ్రాణశ్రవణ వాహనంబును= ఘ్రాణేంద్రియ శ్రవణేంద్రియాలనే గుర్రాలు కలదీ; జ్ఞానసారథికంబును= జ్ఞాన మనే సారథి కలదియు; సర్వతంత్ర ప్రతోదంబును= సర్వతంత్రమనే జాటీ కలదీ; త్యాగరశ్మియున్= త్యాగమనే పగ్గాలు కలదీ; అగు= అయినట్టి; యోగరథంబున్= యోగమనే రథాన్ని; ఎక్కి= అధిష్ఠించి; వెరవుగలవాఁడు= ఉపాయశాలిఅయినవాడు; అక్షరపదంబున్= క్షరంకాని స్థానాన్ని అనగా మోక్షాన్ని; చొరన్+చనన్+చాలున్= ప్రవేశించగలుగును; ఆ రథికుండు= ఆ రథంలో పయనించినవాడు (ఆత్మ); ఆ తంత్రంబు= ఆ ఉపాయంయొక్క; ప్రభావంబునన్+చేసి= మహిమవలన.

తాత్పర్యం: సదాచారమే చక్రపుటంచుగా, ప్రాణమే కాడిగా, అపానమే ఇరుసుగా, సిగ్గే ఆచ్ఛాదనంగా, ఉపాయాపాయాలే నొగలుగా, ఘ్రాణేంద్రియ శ్రవణేంద్రియాలే గుర్రాలుగా, జ్ఞానమే సారథిగా, సర్వతంత్రమే కొరడాగా, త్యాగమే పగ్గాలుగా సాగే యోగమనే రథాన్ని ఎక్కిన ఉపాయశాలిఅయిన ఆత్మ అనే రథికుడు మోక్షపదం చేరుకొనగలడు. ఆ విధంగా పయనించిన రథికుడు ఆ ఉపాయబలంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం.

క. వరుసన ధరణీపవనాం । బరజలతేజముల గెలుచు, బల మెక్కి యహం
కరణంబు ద్రోచు; బుద్ధిం । బరువడి నడఁగించుఁ బ్రకృతి పనిఁ బెడఁబాపున్. 93

ప్రతిపదార్థం: వరుసన= క్రమంగా; బలము+ఎక్కి= బలవంతుడై; ధరణీ= భూమిని; పవన= గాలిని; అంబర= ఆకసాన్నీ; జల= నీటినీ; తేజములన్= తేజస్సును; గెలుచున్= లోబరచుకొంటాడు; అహంకరణంబున్= అహంకారాన్ని; త్రోచున్= కడకునెట్టివేస్తాడు; బుద్ధిన్= మతిని; పరువడిన్= శీఘ్రంగా; అడఁగించున్= నశింపజేస్తాడు; ప్రకృతిపనిన్= ప్రకృతియొక్క చేష్టను; పెడఁబాపున్= తొలగించి వేస్తాడు.

తాత్పర్యం: క్రమంగా బలపడి పృథ్వ్యాపస్తేజోవాయ్వాకాశాలనే పంచభూతాలపై విజయం సాధిస్తాడు. అంతేకాక అహంకారాన్ని కడకు నెట్టివేస్తాడు. బుద్ధిని నియమిస్తాడు. ప్రకృతి చేష్టలైన కామాదులను అరికట్టుతాడు.

ఆ. భూమిజయము దొడఁగి పురుషుఁ డంతంతకు । వృద్ధిఁ బొంది యోగసిద్ధిఁ బొందుఁ
బొగయు మిడుఁగుఱులును బొనుఁగు లేని శిఖియు । బహులశిఖలు నైన పగిది ననఘ! 94

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; పురుషుఁడు= జీవుడు; భూమిజయముతొడఁగి= పృథ్వీభూతమును జయించిన మొదలుగా; అంతంతకున్= అంతకంతకు; వృద్ధిన్+పొంది= పెరుగుదల నొంది; పొగయున్= ధూమమును; మిడుఁగుఱులును= నిప్పురవ్వలూ; పొనుఁగు లేని= తేజోహీనతలేనట్టి; శిఖియున్= అగ్నియు; బహులశిఖలున్= అనేకజ్వాలలు; ఐన పగిదిన్= అయిన రీతిగా; యోగసిద్ధిన్+పొందున్= యోగముయొక్క పరిపక్వదశను పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ శుకుడా! జీవాత్ముడు పృథ్వీభూతాన్ని జయించిన నాటినుండి క్రమక్రమంగా వృద్ధి పొందుతాడు. అతడు ధూమం, మిణుగురులు, తేజోహీనత లేని అగ్ని అనేక జ్వాలలతో కూడి జ్వలించినట్లే యోగసిద్ధుడై ప్రకాశిస్తాడు.

తే. వినుము మహంకారజయము పృథ్వీ ముఖంబు । లైనవానిని బుద్ధి ప్రధానమును జ
యించునట్టి సంస్కారంబు నిచ్చు; దాన । నగు మహానుభావంబు సంయమివరులకు. 95

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అహంకారజయము= అహంకారంపై సాధించిన గెలుపు; పృథ్వీముఖంబులు+ఐన వానిని= భూమి మొదలుగా గల పంచభూతాలను; బుద్ధి= బుద్ధిని; ప్రధానమును= ప్రకృతిని; జయించునట్టి= సాధించునటువంటి; సంస్కారంబున్= సంస్కరణమును; ఇచ్చున్= ఇస్తుంది; దానన్= అందువలన; సంయమివరులకున్= మునిశ్రేష్ఠులకు; మహానుభావంబు= గొప్ప ప్రభావం; అగున్= కల్గుతుంది.

తాత్పర్యం: అహంకారంపై విజయం సాధిస్తే క్రమంగా అది పృథ్వ్యాది పంచభూతాలనూ, బుద్ధినీ, ప్రకృతినీ జయించగల సంస్కారాన్ని ప్రసాదిస్తుంది. అందువలన మునివర్యులకు గొప్పప్రభావం సమకూరుతుంది.

వ. ఇది యోగప్రకారంబు. 96

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకు చెప్పింది; యోగప్రకారంబు= యోగముయొక్క విధానం.

తాత్పర్యం: ఇంతవరకు నిరూపించబడింది యోగపద్ధతి.

తే. అనఘ! యింద్రియముల విషయముల మీఁద । నిగుడనీక, మనంబుతో మగుడఁ బిగిచి
యాత్మఁగూర్చుట సాంఖ్యుల యనువు; సాంఖ్య । యోగములు రెండు నారయ నొక్క తెరువ. 97

ప్రతిపదార్థం: అనఘ!= కల్మషరహితుడా!; ఇంద్రియములన్= శ్రోత్రాదులైన ఇంద్రియాలను; విషయములమీఁదన్= శబ్దాదులైన విషయాలమీద; నిగుడనీక= ప్రసరింపనీక; మనంబుతోన్= మనస్సుతో; మగుడన్= మరలేటట్లు; తిగిచి= ఆకర్షించి; ఆత్మన్= ఆత్మయందు; కూర్చుట= లగ్నంకావించటం; సాంఖ్యుల అనువు= సాంఖ్యమార్గాన్ని అనుసరించేవారి పద్ధతి; ఆరయన్= పరిశీలించగా; సాంఖ్యయోగములు= సాంఖ్యమార్గం, యోగమార్గం; రెండున్= రెండూ; ఒక్క తెరువు+అ= ఒక్క పద్ధతియే.

తాత్పర్యం: పాపరహితుడా! ఇంద్రియాలను విషయాలపై పోనీయకుండా మనస్సు మరలింపజేసి ఆత్మయందు సంలగ్నం కావించాలి. సాంఖ్యులు ఈ పద్ధతినే పాటిస్తారు. పరిశీలించి చూడగా సాంఖ్యయోగమార్గాలు రెండూ ఒక పద్ధతికి చెందినవే.

విశేషం: భగవద్గీతలో కృష్ణుడు "ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి" అని సాంఖ్యయోగముల ఏకత్వాన్ని ప్రతిపాదించిఉన్నాడు. ఇక్కడ గూడ ఈ విషయమే మరల ప్రస్తావించబడింది.

క. ఈ రెండు ప్రకారంబుల । వారలకును మమత విడువవలయుట సరి; ని
స్సారపు సంసారమునకుఁ । గారణము మమత్వ మగుటఁ గవిజనముఖ్యా! 98

ప్రతిపదార్థం: కవిజనముఖ్యా!= యోగిజనశ్రేష్ఠా!; నిస్సారపు= సారరహితమైన; సంసారమునకున్= సంసారానికి; కారణము= హేతువు; మమత్వము= మమకారం; అగుటన్= కావటంవలన; ఈ రెండు ప్రకారంబుల వారలకును= ఈ ద్వివిధ పద్ధతులు పాటించే వారికి కూడా; మమత= మమకారమును; విడువన్+వలయుట= వదలవలసిన ఆవశ్యకత; సరి= సమమే.

తాత్పర్యం: యోగులలో శ్రేష్ఠుడవైన ఓ శుకుడా! నిస్సారమైన సంసారానికి ముఖ్యకారణం మమకారమే. అందువలన సాంఖ్యాన్ని అనుసరించేవారికైనా, యోగాన్ని పాటించేవారికైనా మమకార పరిత్యాగం సమానమైన ధర్మం.

వ. భూతతారతమ్యంబులు సెప్పెద నాకర్ణింపుము: జంగమస్థావరంబులయందు జంగమంబులు లెస్స; యవి జరాయువు, నండంబును, నుద్భిదంబును, స్వేదంబును నను జనక విశేషంబుల జనియించి బహుపాదంబులును, ద్విపాదంబులు నైయుండు; నందు మనుష్యులు మేలు; మనుష్యుల యందు జాతిధర్మోపధారకు లెక్కుడు; జాతి ధర్మోపధారకుల యందు విప్రు లుత్తములు; విప్రులయందు వేదజ్ఞులుదాత్తులు; వేదజ్ఞులయందుం బ్రవచనశీలు రుత్కృష్టులు; ప్రవచన శీలురయం దాత్మజ్ఞులధికులు; వారలు స్వధర్మవిదులు, సత్యసంకల్పులు, నధిభూతాధిదైవ వేదులు నగుదురు. వారలం జూవె దేవతలు బ్రాహ్మణులండ్రు; వా రెల్ల వారికి నమస్కారాద్యుపచారాదరణీయులు; వారికి సరిలేరు; వా రాధారంబుగా సమస్త జగంబులుఁ బ్రవర్తిల్లుచున్నవి' యని చెప్పి య మ్మహాత్ముండు వెండియు. 99

ప్రతిపదార్థం: భూతతారతమ్యంబులు= ప్రాణులలోని తరతమభేదాలు; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; జంగమస్థావరంబుల+అందున్= చరాచరములయందు; జంగమంబులు= చరప్రాణులు; లెస్స= మేలు; అవి= ఆప్రాణులు; జరాయువు= మావి; అండంబును= గ్రుడ్డును; ఉద్భిదంబును= భూమిని ఛేదించుకొని పుట్టేదీ; స్వేదంబును= చెమటయును; అను= అనే; జనకవిశేషంబులన్= ఉత్పాదకములైన వస్తు విశేషాలయందు; జనియించి= పుట్టి; బహుపాదంబులును= అనేక చరణాలు కలవి; ద్విపాదంబులున్+ఐ= రెండు చరణాలు కలవియునై; ఉండున్= ఉంటాయి; అందున్= ఆ ద్విపాదప్రాణులలో; మనుష్యులు=

మానవులు; మేలు= లెస్స; మనుష్యుల+అందున్= మానవులలో; జాతిధర్మ+ఉపధారకులు= జాతియొక్క ధర్మమును పోషించేవారు; ఎక్కుడు= మేలు; జాతిధర్మ+ఉపధారకులయందున్= జాతి ధర్మపోషకులలో; విప్రులు= బ్రాహ్మణులు; ఉత్తములు= శ్రేష్ములు; విప్రుల+అందున్= భూసురులలో; వేదజ్ఞులు= వేదం తెలిసినవారు; ఉదాత్తులు= శ్రేష్ములు; వేదజ్ఞుల+అందున్= వేదవిదులలో; ప్రవచనశీలురు= వేదపాఠప్రవచనం చూసేవారు; ఉత్కృష్టులు= శ్రేష్ములు; ప్రవచనశీలుర+అందున్= ప్రవచనం చేసేవారియందు; ఆత్మజ్ఞులు= ఆత్మతత్త్వమెరిగినవారు; అధికులు= శ్రేష్ములు; వారలు= వారు; సర్వధర్మవిదులు= సమస్త ధర్మాలు తెలిసినవారు; సత్యసంకల్పులు= సత్యమైన సంకల్పంకలవారు; అధి భూతాది దైవవేదులున్= అధిభూతమును; అధిదైవము నెరిగినవారును; అగుదురు= అవుతారు; దేవతలు= సురలు; వారలన్+చూవె= వారలనే కదా!; బ్రాహ్మణులు+అండ్రు= బ్రాహ్మణులు అని చెప్పుతారు; వారు= ఆ బ్రాహ్మణులు; ఎల్లవారికిన్= అందరికీ; నమస్కార+ఆది+ఉపచార+ఆదరణీయులు= నమస్కారం మొదలైన ఉపచారాలచేత ఆదరించదగినవారు; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; సరిలేరు= సాటివారు లేరు; వారు= ఆ బ్రాహ్మణులు; ఆధారంబుగాన్; ఆశ్రయంగా; సమస్తజగంబులున్= సర్వలోకాలూ; ప్రవర్తిల్లుచున్నవి= నడుస్తున్నవి; అని చెప్పి= అని వచించి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: ప్రాణులలోఉన్న తేడాలు వివరిస్తాను వినుము. చరాచరాలైన రెండు రకాల ప్రాణులలో చరప్రాణులు మేలైనవి. అవి మావి, గ్రుడ్డు, ఉద్భిదము, చెమట అనే ఉత్పాదక పదార్థాలనుండి పుట్టి అనేకపాదాలు గలవి, రెండు పాదాలు గలవిఅయి ఉంటాయి. వాటిలో మానవులు మేలు. మానవులలో జాతిధర్మాన్ని పోషించేవారు శ్రేష్ములు. వారిలో విప్రులు మేలైనవారు. విప్రులలో వేదము నెరిగినవారు ముఖ్యులు. వేదం తెలిసినవారిలో వేదార్థప్రవచనం కావించేవారు ఉత్కృష్టమైనవారు. అట్లా ప్రవచనం చేసేవారిలో ఆత్మజ్ఞులైనవారు గొప్పవారు. ఆత్మతత్త్వం తెలిసినవారు, సర్వధర్మవేత్తలు, యథార్థమైన సంకల్పం కలవారు, అధిభూతాధిదైవాలను ఎరిగినవారు అవుతున్నారు. దేవతలు అట్లాంటి వారినే బ్రాహ్మణు లంటారు. ఆ రకమైన బ్రాహ్మణులు అందరికీ ప్రణామాదులచేత ఆదరించదగి ఉన్నారు. వారికి సమానమైన వా రెవరూ లేరు. వారి నాధారం చేసికొనే సమస్త లోకాలూ నడుస్తున్నాయి' అని మళ్ళీ (వేదవ్యాసమునీంద్రుడు ఇట్లా అన్నాడు:)

తే. 'బ్రాహ్మణునకుఁ బ్రధానవర్తనము వినుము! । నిర్మలజ్ఞానయుక్తుఁడై కర్మసమితి
నలఘునిష్ఠమైఁ జలుపంగ వలయు; దాన । సంశయము లెల్లఁ బాయుఁ, బ్రసాద మొందు. 100

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= పై జెప్పిన లక్షణాలతో విలసిల్లే బ్రాహ్మణుడికి; ప్రధానవర్తనము= ముఖ్యమైన నడవడి; వినుము; నిర్మలజ్ఞానయుక్తుఁడు+ఐ= అతడు నిర్మలమైన జ్ఞానంతో కూడినవాడై; అలఘునిష్ఠమైన్= గొప్ప నిష్ఠతో; కర్మసమితిన్= కర్తవ్యకార్య సమూహాలను; చలుపంగన్ వలయున్= నిర్వహించాలి; దానన్= ఆ విధంగా చేయటంవలన; సంశయములు+ఎల్లన్= సమస్త సందేహాలూ; పాయున్= తొలగుతాయి; ప్రసాదమున్= నైర్మల్యమును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: 'పూర్వోక్తమైన లక్షణాలతో ఒప్పారే బ్రాహ్మణుడు ఎట్లా ప్రవర్తించాలో చెప్పుతాను వినుము. అతడు నిర్మలజ్ఞానం కలిగి గొప్ప దీక్షతో శ్రద్ధతో కర్తవ్యకర్మలు చేయాలి. అట్లా చేస్తే అతడి సంశయాలన్నీ తొలగిపోతాయి. అతడు మనోనైర్మల్యం పొందుతాడు.

క. ఇయ్యఖిలము సృజియింపఁగ । నెయ్యది ప్రభు వమ్మహామహిత భూతము పాం
దయ్యెడి శుభంబు దపమునఁ । జయ్యన సిద్ధించు; నది వినంశయ మనఘా! 101

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఈ+అఖిలమున్= ఈ సమస్త జగత్తును; సృజియింపఁగన్= సృష్టించటానికి; ఏ+అది= ఏది; ప్రభువు= సమర్థమో; ఆ+మహామహిత భూతము పొందు= ఆ మహాపూజ్యమైన భూతంతోడి కలయిక; అయ్యెడి= సంభవించెడి;

శుభంబు= మంగళం; తపమునన్= తపస్సుతో; చయ్యనన్= శీఘ్రంగా; సిద్ధించున్= సంభవిస్తుంది; అది= ఆ విషయం; విసంశయము= సంశయంలేనిది.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన శుకుడా! ఈ సమస్త ప్రపంచాన్నీ ఏది సృష్టిస్తున్నదో, ఆ మహాపావనమైన భూతంతో కలయిక అనే శుభం తపస్సుతో వెంటనే సిద్ధిస్తుంది. ఇందులో సందేహం లేదు.

క. మైత్రిం బోలెడు ధర్మము । ధాత్రీ దివిజులకు లేదు; దాని నడపినం
బుత్రా! యేకర్మంబు ప । విత్రతయును వలవ దది వివేకముఁ జేర్చున్.' 102

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; ధాత్రీ దివిజులకున్= భూసురులకు; మైత్రిన్+పోలెడిధర్మము= మిత్రత్వమును పోలిన; ధర్మము; లేదు= లేదు; దానిన్= ఆ మైత్రిని; నడపినన్= నిర్వహిస్తే; ఏకర్మంబు= ఏ కర్మయొక్క; పవిత్రతయును= పావనత్వమును; వలవదు= అక్కరలేదు; అది= ఆ మైత్రి; వివేకమున్= తెలివిని; చేర్చున్= ఘటిస్తుంది.

తాత్పర్యం: కుమారా! భూసురులకు మైత్రివంటి ధర్మం మరొకటి లేదు. మైత్రీధర్మాన్ని చక్కగా నడిపితే ఇతరకర్మల పవిత్రతలు పాటించవలసిన పనిలేదు. ఆ మైత్రి నిత్యానిత్య వివేకాన్ని కలిగిస్తుంది'.

విశేషం: సమస్తప్రాణుల పట్ల సద్భావన కలిగి మిత్రత్వమును పాటించటమే మైత్రి. ఇది శ్రేష్ఠతమ ధర్మం.

వ. అనిన విని శుకుం డా సంయమివరున కిట్లనియె. 103

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; శుకుండు= శుకయోగి; ఆ సంయమివరునకున్= ఆ వ్యాసుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడు ఈ రీతిగా చెప్పగా విని శుకుడు ఆ మునిశ్రేష్ఠుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు:

వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మ ప్రాప్తి సాధన ప్రకారము (సం. 12-231-3)

క. 'పరమబ్రహ్మపదము న । ధ్వరముననో, ప్రజ్ఞ పెంపు వలననొ, యోగా
చరణముననొ, సాంఖ్యసమా । దరణముననొ పొందవచ్చుఁ దత్త్వజ్ఞవరా!' 104

ప్రతిపదార్థం: తత్త్వజ్ఞవరా!= తత్త్వం తెలిసిన వారిలో శ్రేష్ఠుడవైనవాడా!; అధ్వరముననో= యజ్ఞంవలననో; ప్రజ్ఞపెంపువలననొ= మతియొక్క అతిశయంవలననో; యోగ+ఆచరణముననొ= యోగము నాచరించటంవలననో; సాంఖ్య సమాదరణముననొ= సాంఖ్యమును చక్కగా ఆచరించటంచేతనో; పరమబ్రహ్మపదమున్= శ్రేష్ఠమైన బ్రహ్మస్థానమును; పొందవచ్చున్?= పొందటానికి వీలవుతుంది?

తాత్పర్యం: 'తత్త్వమునెరిగినవారిలో శ్రేష్ఠుడవైన ఓ మునీశ్వరా! యజ్ఞక్రియవలననా? లేక ప్రజ్ఞాతిశయం వలననా? యోగాన్ని పాటించటం వలననా? సాంఖ్యాన్ని ఆదరించటం వలననా? ఏ విధంగా పరబ్రహ్మ పదమైన మోక్షమును పొందవచ్చును?'

చ. అనుటయు నమ్మునిప్రవరుఁ డాతని కిట్లను 'నీవు పేరు గ్రు
చ్చినయవి యెల్ల మేల; సవిశేషతపంబును, నింద్రియప్రవ
ర్తనముల నిగ్రహించుటయు, రాగము లోభముఁ ద్రోవఁ జాలు నే
ర్పును దృఢవిద్యయుం గలుగు పుణ్యుఁడు వొందఁగనోపు బ్రహ్మమున్. 105

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; ఆ+మునిప్రవరుఁడు= ఆ వ్యాసుడు; ఆతనికిన్= ఆ శుకుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; నీవు పేరుగ్రుచ్చిన+అవి ఎల్లన్= నీవు పేర్కొన్నవి అన్నియునూ; మేల= శ్రేయస్సును గలిగించేవే; సవిశేషతపంబును= విశేషంతో కూడిన తపస్సు; ఇంద్రియ ప్రవర్తనములన్= ఇంద్రియాల పోకడలను; నిగ్రహించుటయున్= నియమించటం; రాగమున్= విషయాలపై ప్రీతిని; లోభమున్= లోభమనే దుర్గుణమును; త్రోవన్+చాలు= తొలగింపగల; నేర్పును= చాతుర్యమును; దృఢవిద్యయున్= గట్టి విద్యయును; కలుగు= కలిగియున్నట్టి; పుణ్యుఁడు= పుణ్యాత్ముడు; బ్రహ్మమున్= బ్రహ్మస్థానాన్ని; పొందఁగన్+ఓపున్= పొందగలుగుతాడు.

తాత్పర్యం: అట్లా శుకు డడిగేసరికి వ్యాసమునీంద్రు డతడితో ఇట్లా అన్నాడు: 'నీ విపుడు చెప్పిన యజ్ఞాదులన్నీ బ్రహ్మపదప్రాప్తికి ఉపకరించే శ్రేష్ఠమైన సాధనాలే. అంతేకాక విశిష్టమైన తపస్సు, ఇంద్రియనిగ్రహం, రాగలోభనివారణ మొనర్చే చాతుర్యం, దృఢమైన విద్యకల పుణ్యాత్ముడు తప్పక బ్రహ్మపదాన్ని పొందుతాడు.

క. వినుఁ! మందు నొక విశేషం । బనఘా! బుద్ధీంద్రియంబు లైదును బరముం
గను వెలుఁగున కడ్డము వా । ని నడంగింపంగ మనసునిపుణత యొప్పున్. 106

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అందున్= ఇప్పుడు చెప్పినవాటిలో; ఒక విశేషంబు= ఒక విశేషాంశాన్ని; వినుము= ఆలకించుము; బుద్ధి+ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు; ఐదును= అయిదు కూడాను; పరమున్= బ్రహ్మమును; కను వెలుఁగునకున్= చూచే ప్రకాశానికి; అడ్డము= నిరోధకాలై ఉన్నవి; వానిన్= ఆ ఇంద్రియాలను; అడంగింపంగన్= అణచివేయగా; మనసు నిపుణత= చిత్తంయొక్క నేర్పు; ఒప్పున్= భాసిస్తుంది.

తాత్పర్యం: కల్మషరహితుడవైన ఓ శుకుడా! అందులోనూ ఒక విశేషం చెప్పుతాను. వినుము. శ్రోత్రం మొదలైన ఐదు జ్ఞానేంద్రియాలు పరతత్త్వ దర్శనానికి ఆటంకాలుగా ఉంటాయి. వాటిని నిరోధించి వేస్తే బ్రహ్మప్రాప్తి కవసరమైన మనోనైపుణ్యం చక్కగా విరాజిల్లుతుంది.

క. మనసు నియమింప భూతా । త్ముని యత్నం బోపు నియమమునకున్ లోనై
మన సింద్రియములఁ గుదియిం । చిన శబ్దాదులు దొఱంగి సిద్ధి దొరకొనున్. 107

ప్రతిపదార్థం: భూత+ఆత్ముని= జీవుడియొక్క; యత్నంబు= ప్రయత్నం; మనసున్= చిత్తమును; నియమింపన్= నిగ్రహించటానికి; ఓపున్= సమర్థమవుతుంది; మనసు= చిత్తం; నియమమునకున్= నిగ్రహానికి; లోనై= లోబడినదై; ఇంద్రియములన్= శ్రోత్రాదులగు ఇంద్రియాలను; కుదియించినన్= నిగ్రహిస్తే; శబ్దాదులు= శబ్దాదులైన విషయాలు; తొఱంగి= తొలగిపోయి; సిద్ధి= మోక్షం; దొరకొనున్= లభిస్తుంది.

తాత్పర్యం: జీవుడు ప్రయత్నిస్తే మనస్సును నిగ్రహించగలడు. నిగ్రహించబడిన మనస్సు ఇంద్రియాలను నియమించగలదు. అపుడు శబ్దాదులైన విషయాలు తొలగిపోతాయి. అంతట అభిలషించిన బ్రహ్మప్రాప్తి రూపమైన మోక్షం సిద్ధిస్తుంది.

ఆ. కనుట వినుట యాదిగాఁ గల యింద్రియం । బుల కగోచరంబు బుద్ధి; దీన
రూపుగాఁగఁ దోఁచు రూపశబ్దాది గు । ణత్వరహితమైన తత్త్వ మనఘ! 108

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుద్ధి= ప్రజ్ఞ; కనుట వినుట ఆదిగాన్+కల= చూడటం, వినటం మొదలైన; ఇంద్రియములకున్= ఇంద్రియాలకు; అగోచరంబు= గోచరించనిది; దీనన్= ఈ బుద్ధివలననే; రూపశబ్ద+ఆదిగుణత్వరహితము+ఐన= రూపం, శబ్దం మొదలైన గుణాలతో సంబంధం లేని; తత్త్వము= పరతత్త్వం; రూపుకాఁగన్= స్పష్టంగా; తోఁచున్= భాసిస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ శుకుడా! నేత్రం, శ్రోత్రం మొదలైన ఇంద్రియాలకు బుద్ధి గోచరించేదికాదు. బుద్ధివలననే రూపశబ్దాదులైన గుణాలతో ఏ మాత్రం సంబంధము లేని పరతత్త్వం స్పష్టంగా గోచరిస్తుంది.

చ. వినయము విద్యయుం గలుగు విప్రునియందును, గోవునందు, నొ
ప్పు నెఱయు హస్తియందు నొక పోఁకకుఁబోవని కుక్కయందు, దా
ని నడఁచి తెచ్చి వండి తిను నీచపుమాలనియందుఁ దుల్యద
ర్శనులు దదంతరాత్ముని నిరంజనునిం గనునట్టి పండితుల్. 109

ప్రతిపదార్థం: తదంతరాత్ముని= విప్రుడు మొదలైనవారి అంతరాత్మయైన; నిరంజనునిన్= పరిశుద్ధమైన పరమాత్మను; కనునట్టి= చూచునట్టి; పండితుల్= పండితులు; వినయము= అణకువ; విద్యయున్= చదువును; కలుగు= కలిగి ఉన్నట్టి; విప్రుని అందున్= బ్రాహ్మణుడియందు; గోవునందున్= ఆవునందు; ఒప్పునెఱయు= చక్కనైన; హస్తి +అందున్= ఏనుగునందు; ఒక పోఁకకున్+పోవని= ఒక నీచమైన పోకకు కూడ కొరగాని; కుక్కయందున్; దానిన్= ఆ కుక్కను; అడఁచి= చంపి; వండి= వంటజేసికొని; తిను నీచపు మాలని+అందున్= భుజించే నీచుడైన శ్వపాకుడి యందు; తుల్యదర్శనులు= సమమైన దర్శనంకలవారు.

తాత్పర్యం: విప్రాదులలో అంతరాత్మఅయిన పరిశుద్ధమైన పరమాత్ముడిని చూచే పండితులు. విద్యావినయ సంపన్నుడైన విప్రుడియందు, గోవునందు, ఏనుగునందు, పోకకు కూడ కొరగాని కుక్కయందు, కుక్కమాంసం వండుకొని తినే చండాలుడియందు సమదృష్టి గల్గువారవుతారు.

విశేషం: భగవద్గీతలో గూడ దీనికి మూలమైన శ్లోకము 'విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని। శుని చైవ శ్వపాకే చ పండితాः సమదర్శినः'॥ అన్నది కలదు.

క. స్థావరముల జంగమముల । నా విభుఁడు వసించు; నతనియందు నవి నిస
ర్గావాసత నుండును; ద । ద్భావన మెఱుఁగుట తదైక్యపదముం జేర్చున్. 110

ప్రతిపదార్థం: స్థావరములన్= స్థిరంగా ఒకచోట ఉండే ప్రాణులలోనూ; జంగమములన్= చరించే ప్రాణులలోనూ; ఆ విభుఁడు= ఆ పరమాత్ముడు; వసించున్= నివసిస్తాడు; అతని+అందున్= ఆ పరమాత్ముడియందు; అవి= ఆ చరాచరాలు; నిసర్గ+ఆవాసతన్= సహజ నివాసంకలవై; ఉండున్= ఉంటాయి; తద్భావనము= అవి అట్లా ఉండటాన్ని; ఎఱుఁగుట= తెలిసికొనుట; తత్+ఐక్యపదమున్= ఆ పరమాత్మతో ఏకమయ్యే స్థితిని; చేర్చున్= చేరుస్తుంది.

తాత్పర్యం: ఆ పరమాత్మ చరాచర ప్రాణులన్నిటిలో ఉన్నాడు. ఆ పరమాత్మలో ఆ ప్రాణులన్నీ ఉన్నవి. ఇట్లా ఒకదానిలో ఒకటి అవి పరస్పరం కలిసి ఉన్నాయని గ్రహించటమే బ్రహ్మపద ప్రాప్తిని సమకూరుస్తుంది.

తే. క్షరము నక్షరమును ననం గలవు రెండు । మూర్తు: లాత్మ కఖిలభూతములను బూర్వ
మొలయు మృత మన దివమున నుండు నమృత । మనఁగ నపరంబు రెంటిని గను బుధుండు. 111

ప్రతిపదార్థం: ఆత్మకున్= ఆత్మ పదార్థానికి; క్షరమున్= క్షరమనీ; అక్షరమునున్= అక్షరమనీ; అనన్= అనగా; రెండుమూర్తులు= రెండు ఆకృతులు; కలవు= ఉన్నాయి; అఖిలభూతములను= సమస్త ప్రాణులలోను; పూర్వము= మొదటిదైన క్షరం; మృతము= మరణశీలం; అనన్= అనగా; ఒలయున్= ఒప్పుతుంది; అపరంబు= మరొకటైన అక్షరం; అమృతము+అనఁగన్= మరణశీలం కానిదనగా; దివమునన్= స్వర్గంలో; ఉండున్= ఉంటుంది; బుధుండు= ఆత్మజ్ఞుడైన పండితుడు; రెంటినిన్= క్షరాక్షరాలను రెండింటినీ; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: ఆత్మకు క్షరమనీ, అక్షరమనీ రెండు మూర్తులున్నాయి. క్షరం సమస్త ప్రాణులలోను మృతమన్న పేరుతో ఉంటుంది. రెండవదైన అక్షరం 'అమృత' మనబడి స్వర్లోకంలో ఉంటుంది. పండితుడైనవాడు పై క్షరాక్షరాలను రెండింటినీ వేరు వేరుగా గ్రహిస్తాడు.

విశేషం: నశించిపోయే స్వభావం గలది క్షరము. నాశం లేనిది అక్షరం. స్థూలదేహాదులన్నీ కాలక్రమంలో నశించిపోతాయి కాబట్టి క్షర మనబడుతున్నాయి. అక్షరమైన జీవాత్మ నశించదు. అవిద్యను తొలగించుకొన్నపు డా జీవాత్ముడే పరమాత్ము డవుతాడు. పరమాత్ముడు కూడా అక్షరుడే.

'ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ' ఇత్యాదిగా గీతలో ఈ విషయమే చెప్పబడింది. సర్వభూతాలూ క్షరమనీ, కూటస్థుడు అక్షరుడనీ గీత పేర్కొన్నది. క్షరాక్షరములకు అతీతుడైన పురుషోత్తముడే పరమాత్ముడని వ్యవహరించబడుతున్నాడు.

క. ఈ లోకంబుల నెల్లం । గాలము పక్వంబు సేయఁగా నెవ్వాఁ డ
క్కాలము పక్వము సేయం । జాలు నతం డమృతు నజరు సత్యుఁ గనుటకున్. 112

ప్రతిపదార్థం: ఈ లోకంబులను+ఎల్లన్= ఈ లోకాలనన్నింటినీ; కాలము= కాలమనే తత్త్వం; పక్వంబుచేయఁగాన్= పచనం చేసివేయగా; ఎవ్వాఁడు= ఎవడు; ఆ+కాలమున్= ఆ కాలమును; పక్వము చేయన్= పచనమొనర్ప; అతండు= అట్టివాడు; అమృతున్= మరణశీలుడుకానివాడు; అజరున్= వార్ధకమంటనివాడు అగు; సత్యున్= శాశ్వతుడైన పరమాత్మను; కనుటకున్= చూచుటకు; చాలున్= సమర్థుడవుతాడు.

తాత్పర్యం: కాలం ఈ అన్ని లోకాలను పచనం చేసి వేస్తున్నది. ఆ కాలాన్ని పచనం చేయటంద్వారా ఎవడు జయించగలడో వాడు మాత్రమే జరామరణాలు లేని శాశ్వతుడైన అక్షరపురుషుడిని చూడగలడు.

విశేషం: సమస్త లోకాలూ కాలక్రమంలో నశించి పోతున్నాయి. మరణించేశరీరం తాను కాదని, తనకు మరణం లేదనీ ఎవడు గుర్తిస్తాడో వాడు మాత్రమే కాలానికి లోబడనివాడై కాలాన్ని జయించినవా డవుతాడు. వానికి అక్షరపురుష దర్శనం సిద్ధిస్తుంది.

తే. వినుఁ నవద్వారపురమున వెలుఁగుచుండు । హంసుఁ; డతనిన యక్షరుఁ డమృతుఁ డంద్రు
పరమయోగు లాతత్త్వంబు భంగిఁ గాంచు । యోగ్యసత్క్రియాభ్యాసవైరాగ్యపరుఁడు.' 113

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; హంసుఁడు= హంసశబ్దవాచ్యుడైన ఆత్మ; నవద్వారపురమునన్= తొమ్మిది ద్వారాలుగల పట్టణమనే శరీరంలో; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటాడు; పరమయోగులు= శ్రేష్ఠులైన యోగులు; అతనిన= ఆ హంసుడినే; అక్షరుఁడు+అమృతుఁడు+అంద్రు= అక్షరుడనీ అమృతుడనీ అంటారు; యోగ్య= తగిన; సత్క్రియా= సత్కార్యాలయొక్క; అభ్యాస= అభ్యాసమునందును; వైరాగ్య= వైరాగ్యమునందును; పరుఁడు= ఆసక్తిగలవాడు; ఆ తత్త్వంబుభంగిన్= ఆ అక్షరతత్త్వపద్ధతిని; కాంచున్= చూస్తాడు.

తాత్పర్యం: శుకా! వినుము. తొమ్మిదిద్వారాలు గల శరీర మనే నగరంలో హంసు డనే ఆత్మ భాసిస్తున్నాడు. శ్రేష్ఠులైన యోగులు ఆ ఆత్మనే అక్షరుడనీ, అమృతుడనీ అంటున్నారు. యోగ్యమైన సాధనాది సత్కార్యాలు ఆచరిస్తూ వైరాగ్య పరుడైనవాడు ఆ అక్షరతత్త్వాన్ని గ్రహించగలడు'.

విశేషం: శరీరానికి రెండు కన్నులు, రెండు చెవులు, రెండు నాసారంధ్రాలు, నోరు, గుదం, మూత్రద్వారం - అని తొమ్మిది ద్వారాలున్నాయి. అందువలన నవద్వారపురంగా శరీరం అభివర్ణించబడుతున్నది. 'నవద్వారేపురే' ఇత్యాదిగా గీతాదులలో ప్రయోగాలు గమనించేది.

వ. అని చెప్పి యప్పారాశర్యుండు వెండియు. 114

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లా పలికి; ఆ+పారాశర్యుండు= వ్యాసుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి పరాశరపుత్రుడైన వ్యాసమునీంద్రుడు మళ్ళీ శుకుడితో ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! వినుఁ గామమును గ్రోధమును భయంబు । నిద్రయును లోభమును జాల నిందితములు
యోగిజనులకుఁ గావున నుడుగవలయు । వీని నైదింటి నచలావధాన వృత్తి. 115

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుఁ= ఆలకించుము; యోగిజనులకున్= యోగమార్గంలో ఉన్నవారికి; కామమును= కామమూ; క్రోధమును= కోపమూ; భయంబున్= భీతియు; నిద్రయున్= నిద్రించటమూ; లోభమును= పిసినితనమున్నూ; చాలన్= మిక్కిలి; నిందితములు= నిందించబడినవి; కావునన్= అందువలన; అచలావధానవృత్తిన్= నిశ్చలమైన అవధానవ్యాపారంతో; వీనిన్+ఐదింటిన్= ఈ ఐదు దుర్గుణాలను; ఉడుగన్ వలయున్= వదలిపెట్టాలి.

తాత్పర్యం: పాపరహితుడా! ఇంకా చెప్పుతాను వినుము. యోగులైనవారికి కామం, క్రోధం, భయం, నిద్ర, లోభం అనేవి చాలా నిందించదగిన చెడు గుణాలు. కాబట్టి అచంచలమైన అవధానంతో ఈ ఐదు దుర్గుణాలనూ పరిత్యజించాలి.

శా. కామంబుం బెడఁబాచుఁ బండితుఁడు సంకల్పంబు వర్జించి, ని
ద్రామోహంబు నడంచు సత్త్వగుణ చింతన్, లోభముం బ్రాజ్ఞ సే
వాముద్రం దొలఁగించుఁ, గ్రోధము శమవ్యాప్తిన్ మగుడ్చున్ మతి
శ్రీమాన్యా! భయ మప్రమాదమున నిర్జించున్ దృఢస్వాంతుఁడై. 116

ప్రతిపదార్థం: మతిశ్రీమాన్యా!= బుద్ధివైభవంచేత పూజించదగిన వాడా!; పండితుఁడు= బుధుడు; దృఢస్వాంతుఁడు+ఐ= దృఢమైన చిత్తం కలవాడై; సంకల్పంబున్= మనోవ్యాపారాన్ని; వర్జించి= వదలి; కామంబున్= కామాన్ని; పెడఁబాచున్= ఎడబాయజేస్తాడు; సత్త్వగుణచింతన్= సత్త్వమనే గుణాన్ని చింతించటంచేత; నిద్రామోహంబున్= నిద్రఅనే మోహాన్ని; అడంచున్= నశింపజేస్తాడు; ప్రాజ్ఞసేవాముద్రన్= బుద్ధిమంతులైనవారి సేవఅనే ముద్రచేత; లోభమున్= పిసినితనాన్ని; తొలఁగించున్= తొలగింపజేస్తాడు; శమవ్యాప్తిన్= అంతరింద్రియనిగ్రహ వ్యాప్తిచేత; క్రోధమున్= కోపమును; మగుడ్చున్= మరలింపజేస్తాడు; అప్రమాదమునన్= జాగరూకతతో; భయమున్= భీతిని; నిర్జించున్= జయిస్తాడు.

తాత్పర్యం: ధీసంపదచేత పూజింపదగిన ఓ శుకుడా! పండితుడు దృఢచిత్తంతో సంకల్పాన్ని వదలి కామాన్ని వదలించుకొంటాడు, సత్త్వగుణాన్ని చింతించటం ద్వారా నిద్రామోహాన్ని నశింపజేస్తాడు. ప్రాజ్ఞులను సేవించటం వలన లోభాన్ని తొలగించుకొంటాడు. శమంతో కోపాన్ని విసర్జిస్తాడు. ఏమరుపాటు లేనివాడై భయాన్ని జయిస్తాడు.

తే. శిశ్నము నుదరమును ధృతిఁ, జేయుఁ గాలుఁ । జూడ్కిఁ జూడ్కిని వినికిని శుద్ధమాన
సమున మానసవాక్కుల విమలవిద్య । నవహితుండు రక్షించుఁ గులాగ్రగణ్య! 117

ప్రతిపదార్థం: కుల+అగ్రగణ్య!= వంశంలో మొదట గణించదగినవాడా!; అవహితుండు= అవధానంకలవాడు; శిశ్నమున్= పురుషాంగాన్నీ; ఉదరమును= పొట్టనూ; ధృతిన్= ధైర్యంతో; చేయున్+కాలున్= చేతిని, కాలిని; చూడ్కిన్= చూపుతో; చూడ్కిని= చూపును; వినికిని= శ్రవణమును; శుద్ధమానసమునన్= పరిశుద్ధమైన చిత్తంతోనూ; మానసవాక్కులన్= మనస్సును, వాక్కునూ; విమలవిద్యన్= నిర్మలమైన విద్యతోనూ; రక్షించున్= కాపాడుతాడు.

తాత్పర్యం: కులశ్రేష్ఠుడవైన ఓ శుకుడా! జాగరూకుడై ఏమరుపాటులేని వాడు శిశ్నోదరాలను ధీరతతోనూ, హస్తపాదాలను చూపుతోనూ, నేత్ర శ్రవణాలను శుద్ధచిత్తంతోనూ, మనోవాక్కులను నిర్మలమైన విద్యతోనూ కాపాడుకొంటాడు.

వ. మఱియు నొక్కతెఱంగు సెప్పెద. 118

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఒక్క తెఱంగున్= ఒక పద్ధతిని; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఇంకా ఒక మార్గం వివరిస్తాను.

తే. ఇంద్రియములలో నొక్కటియేనిఁ బట్టు । వడక వెడలిన నా గంటిఁ బ్రజ్ఞ గాఱు
నట్లు కావున మనసు మున్నాఁగి వినికి । యాదియగు నైదుఁ గ్రమమున నాఁగవలయు. 119

ప్రతిపదార్థం: ఇంద్రియములలోన్= ఐదు జ్ఞానేంద్రియాలలోనూ; ఒక్కటి+ఏనిన్= ఒక్కటైనా; పట్టువడక= నిగ్రహించబడక; వెడలినన్= తప్పించుకొనిపోతే; ఆగంటిన్= ఆ రంధ్రంద్వారా; ప్రజ్ఞ= తెలివి; కాఱున్= స్రవించిపోతుంది; అట్లు కావునన్= ఆ విధంగా జరుగుతుంది కాబట్టి; మనసున్= చిత్తమును; మున్ను= ముందు; ఆగి= నిరోధించి; వినికి+ఆది+అగు= శ్రవణం మొదలైన; ఐదున్= పంచేంద్రియాలను; క్రమమునన్= క్రమంగా; ఆఁగవలయున్= నిరోధించాలి.

తాత్పర్యం: ఇంద్రియాలలో ఒక్కటైన నిగ్రహానికి లొంగక తప్పించుకొంటే చాలు, ఆ రంధ్రంద్వారా ప్రజ్ఞ మొత్తం జారిపోతుంది. అందువలన మొదట చిత్తాన్ని నిరోధించాలి. ఆపై శ్రవణాదులైన పంచేంద్రియాలను నిరోధించాలి.

క. మనసును నింద్రియములనుం । దనయం దొదుఁగంగఁ జేయఁ దానుఁ దెలివి నొం
ది నిరంజనత్వ సిద్ధిం । గని యపధూమానలంబు కరణి వెలుంగున్. 120

ప్రతిపదార్థం: మనసును= చిత్తాన్ని; ఇంద్రియములనున్= ఇంద్రియాలనూ; తన+అందున్= ఆత్మలో; ఒదుఁగంగన్+చేయన్= అణగేటట్లు చేయగా; తాను= ఆత్మ; తెలివిన్+ఒంది= వివేకంపొంది; నిరంజనత్వసిద్ధిన్= మాయా దోషరాహిత్యాన్ని; కని= పొంది; అపధూమానలంబు కరణిన్= పొగలేని అగ్నివలె; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: మనస్సునూ, ఇంద్రియాలనూ తనలో నిగ్రహించుకొంటే తాను వివేకి అవుతాడు. ఆపై ఏ విధమైన దోషం లేనివాడై పొగలేని అనలంవలె వెలుగొందుతాడు.

మ. మన సేకాగ్రతఁ బొందఁ జేయ జనసమ్మర్దంబు వర్జించి శూ
న్యనికేతాద్రిగుహా వివిక్త వనదేవాగార ముఖ్యంబు లై
న నివాసంబుల నుండఁగావలయుఁ దన్మన్నించినం గీడు సే
సిన హర్షంబు నమర్షముం హృదయముం జెందింప కక్షోభ్యుఁడై. 121

ప్రతిపదార్థం: తన్= తనను; మన్నించినన్= పూజించినను; కీడు చేసినన్= (తనకు) అపకారం చేసినా; హర్షంబున్= సంతోషమును; అమర్షమున్= కోపమును; హృదయమున్= చిత్తమును; చెందింపక= పొందించకుండా; అక్షోభ్యుఁడు+ఐ= క్షోభింపజేయరానివాడై; మనసున్= చిత్తమును; ఏకాగ్రతన్= ఏకనిష్ఠత్వమును; పొందన్+చేయన్= ఒందించటానికి; జనసమ్మర్దంబున్= ప్రజల సందడిని; వర్జించి= త్యజించి; శూన్య= జనులు లేని; నికేత= గృహాలు; అద్రిగుహా= పర్వతగుహలు; వివిక్త= ఏకాంతములైన; వన= అడవులు; దేవాగార ముఖ్యంబులు+ఐన= దేవాలయాలు మొదలైన; నివాసంబులన్= స్థానాలలో; ఉండఁగాన్ వలయున్= నివసించాలి.

తాత్పర్యం: ఇతరులు తనను సమ్మానించినా, తనకు అపకారం చేసినా సంతోషాన్నీ, కోపాన్నీ పొందకుండా, ఏ విధమైన చిత్తక్షోభకు గురికానివాడై చిత్తమును ఏకాగ్రం చేయటానికి ఒక శూన్యమైన ప్రదేశంలో, కొండగుహలు, విజనములైన అడవులు, దేవాలయాలు మొదలైన ప్రదేశాలలో నివసించాలి.

క. సమదృష్టిని ఱాయియుఁ గన । కముఁ జూచుచు సత్స మాధికలితం బగు వృ
త్తము నడపిన శబ్దబ్ర । హ్మము షణ్మాసముల యోగి యతివర్తించున్. 122

ప్రతిపదార్థం: యోగి= యోగమార్గంలో ఉన్నవాడు; సమదృష్టిని= సమమైన చూపుతో; ఱాయియున్= శిలను; కనకమున్= బంగారాన్ని; చూచుచున్= విలోకిస్తూ; సత్సమాధికలితంబు+అగు= చక్కని సమాధితో కూడిన; వృత్తమున్= వర్తనమును; నడపినన్= నిర్వహించెనేని; షణ్మాసములన్= ఆరుమాసాలలో; శబ్దబ్రహ్మమున్= శబ్దమనే బ్రహ్మాన్ని; అతివర్తించున్= దాటిపోతాడు.

తాత్పర్యం: యోగి 'సమలోష్టాశ్మకాంచనః' అన్నట్లు రాయిని, బంగారాన్ని సమదృష్టితో చూస్తూ సమాధినిష్ఠుడై ఆరుమాసాలు గడపగలిగితే శబ్దబ్రహ్మాన్ని అతిక్రమిస్తాడు.

క. సుత! వినుఁ; శబ్దబ్రహ్మము । నతివర్తించి భువనత్రయమునను యోగా
న్వితుఁ డగు ముని గను నజు శా । శ్వతు నచలుఁ బురాణతము నజరుఁ బరమాత్మున్.' 123

ప్రతిపదార్థం: సుత!= కుమారా!; వినుఁ= ఆలకించుము; యోగ+అన్వితుఁడు= యోగంతో కూడినవాడు; అగు ముని= ఐన ముని; శబ్దబ్రహ్మమును= శబ్దమనే బ్రహ్మాన్ని; అతివర్తించి= దాటి; భువనత్రయమునను= ముల్లోకాలలోనూ; అజున్= పుట్టుకలేనివాడును; శాశ్వతున్= సత్యమైనవాడును; అచలున్= నిశ్చలమైనవాడును; పురాణతమున్= ప్రాచీనతముడును; అజరున్= వార్ధకం లేనివాడును అయిన; పరమాత్మున్= పరమాత్ముడిని; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: పుత్రా! యోగి శబ్దబ్రహ్మాన్ని దాటి మూడు లోకాలలోనూ జననం లేనివాడూ, శాశ్వతుడైనవాడూ, నిశ్చలమైనవాడూ, సనాతనుడూ, ముసలితనం లేనివాడూ అయిన పరమాత్ముడిని దర్శిస్తాడు.

వ. అనిన విని శుకుండు వేదవ్యాసమునీశ్వరునితో నిట్లను 'వేదంబు గర్మంబుల నాచరించుటయుం, బరిత్యజించుటయుం జెప్పు; నివ్విధంబులు పరస్పర విరుద్ధంబులై యున్నయవి; యిం దెద్దాన నెట్టిగతి సిద్ధించు; నేర్పడ? నెఱింగింపవే!' యనుటయు, నతం డతని కిట్లనియె. 124

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; శుకుండు= శుకయోగి; వేదవ్యాసమునీశ్వరునితోన్= వేదవ్యాస మునీంద్రుడితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; వేదంబు= శ్రుతి; కర్మంబులన్= కర్మలను; ఆచరించుటయున్= చేయటాన్ని; పరిత్యజించుటయున్= వదలటాన్ని; చెప్పున్= చెప్పుతున్నది; ఈ+విధంబులు= ఈ రెండు పద్ధతులు; పరస్పర విరుద్ధంబులు+ఐ= అన్యోన్య వ్యతిరేకాలుగా; ఉన్న+అవి= ఉన్నాయి; ఇందున్= ఈ రెండు మార్గాలలో; ఏ+దానన్= దేనివలన; ఎట్టిగతి= ఏ విధమైన ప్రాప్తి; సిద్ధించున్= లభిస్తుంది; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱింగింపవే= తెలియజెప్పుమా; అనుటయున్= అనగా; అతండు= ఆ వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డా రీతిగా చెప్పేసరికి అది విని శుకు డతడితో 'వేదం కర్మలు చేయాలనీ, వదలాలనీ రెండు రకాలుగా చెప్పుతున్నది. ఈ పద్ధతులు రెండూ అన్యోన్యం విరుద్ధంగా ఉన్నాయి. ఇందులో ఏది చేస్తే ఏ గతి లభిస్తుందో స్పష్టంగా తెలియజేయు'మని అడిగాడు. అందుకు వేదవ్యాసు డీ విధంగా చెప్పాడు.

ఆ. వినుఁ ప్రవృత్తి కర్మ మనఘ! నివృత్తి ని । ష్కర్మ మరయ బంధకంబు మోక్ష
ణంబు నగుట బోధనత్వసంపన్నులు । సారరు కర్మతంత్ర కరణమునకు. 125

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుఁ= ఆలకించుము; కర్మము= కర్మమార్గం; ప్రవృత్తి= ప్రవర్తనం; అరయన్= పరిశీలింపగా; నిష్కర్మము= కర్మరాహిత్యం; నివృత్తి= బంధించేది, (రెండవది) మోక్షణంబు= విడుదల కలిగించేది; అగుటన్= కావటంచేత; బోధనత్వ సంపన్నులు= జ్ఞానంకలవారు; కర్మ తంత్ర కరణమునకున్= కర్మవిధానం ఒనర్చటానికి; చొరరు= పూనుకొనరు.

తాత్పర్యం: పాపరహితుడా! వినుఁ. కర్మమార్గం ప్రవృత్తి అనీ, కర్మరహితమార్గం నివృత్తి అనీ చెప్పబడుతాయి. ఇందులో మొదటిది బంధం కలిగించేది, రెండవది విడుదల కలిగించేది. అందువలన జ్ఞానసంపన్నులైనవారు కర్మమార్గంలో ప్రవేశించరు.

క. కొందఱు కర్మకరణ మభి । నందింతురు; వారలకు జనన మరణములం
బొందక పోరాదు; మహా । నందముఁ బొందుదురు నిత్య నైష్కర్మ్య పరుల్. 126

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది; కర్మకరణమున్= కర్మచేయటాన్ని; అభినందింతురు= మెచ్చుకొంటారు; వారలకున్= వారికి; జనన మరణములన్= పుట్టుకను, చావును; పొందకపోరాదు= అనుభవించక పోవటానికి వీలుకాదు; నిత్యనై ష్కర్మ్యపరుల్= సదా నిష్కర్మలయందుండేవారు; మహానందమున్= గొప్ప ఆనందాన్ని; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: కొందరు కర్మలు చేయటమే మంచిదంటారు. కాని, వారు చావుపుట్టకలను పొందకుండా తప్పించుకొనలేరు. ఎల్లవేళలా నిష్కర్మతామార్గాన్ని అనుసరించేవారు గొప్ప ఆనందం పొందుతారు.

ఆ. చిత్తశుద్ధి మాత్రఁ జేసెనేనియు నవి ।ద్యాత్మకంబ చూవె యరయఁ గర్మ
మది దొఱంగు టంచితాత్మ విద్యాత్మక । ధర్మ మదియ మోక్షదంబు సుమ్ము! 127

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలింపగా; కర్మము= కర్మమార్గం; చిత్తశుద్ధిమాత్రన్= మనశ్శుద్ధిని మాత్రం; చేసెన్+ఏనియున్= చేసినప్పటికినీ; అవిద్యాత్మకంబ చూవె!= అవిద్యాస్వరూపమే గదా!; అది= ఆ కర్మను; తొఱంగుట= త్యజించటం; అంచిత+ఆత్మవిద్యా+ఆత్మక ధర్మము= పూజితమైన ఆత్మవిద్యా స్వరూపమైన ధర్మం; అదియ= అదే; మోక్షదంబు సుమ్ము= మోక్షమునిచ్చేది సుమా!

తాత్పర్యం: కర్మ చిత్తశుద్ధిని కలిగించినప్పటికీ, అవిద్యా స్వరూపమైనదే. దానిని వదలిపెట్టటమే ఆత్మవిద్య అయి ఉన్నది. మోక్షమిచ్చేది కూడా ఆ కర్మత్యాగమే.

ఉ. గుమ్మడిపువ్వుఁ దేనియయుఁ గూపము నైందవరేఖకాంతియున్
జు మ్మరయంగఁ గర్మఫల శోభనసంపద; జున్ను నేఱుఁ బూ
ర్ణమ్మగు చంద్రబింబము ననం దగు నిర్మలవిద్య గాధపా
కమ్ము ఫలోదయం బది యఖండసుఖాత్మ పదంబు పుత్రకా! 128

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా!; అరయంగన్= పరిశీలించగా; కర్మఫలశోభనసంపద= కర్మకు ప్రయోజనమైన సుందరమైన సంపత్తి; గుమ్మడి పువ్వుతేనియయున్= గుమ్మడిపువ్వులోని మకరందము; కూపమున్= బావియు; ఐందవరేఖ కాంతియున్+చుమ్ము= చంద్రరేఖాకాంతియు నగునుసుమా!; నిర్మలవిద్య= విమలమైన విద్య; జున్నున్= తేనెతెట్టెయు;ఏఱున్= నదియును; పూర్ణమ్ము+అగు=

నిండైన; చంద్రబింబము+అనన్+తగున్= చంద్రమండలమని చెప్పదగును; అది= ఆ విద్య; గాఢపాకమ్ము= అధికపాకం కలది; ఫలోదయంబు= ఫలమునకు ఉత్పత్తి స్థానమైనది; అఖండసుఖ+ఆత్మపదంబు= ఎడతెగని సుఖస్వరూపస్థానం.

తాత్పర్యం: కుమారా! కర్మమార్గానికి ఫలంగా లభించే శోభనమైన సంపద గుమ్మడిపువ్వు తేనెను, బావిని, చంద్రరేఖాకాంతిని పోలినది. నిర్మలమైన నైష్కర్మ్యమార్గ మనబడే విద్య తేనెతెట్టెను, నదిని, నిండుచంద్రబింబమును పోలినది. అది అధికపరిపాకం కలిగి ఫలానికి మూలమైనదై ఎడతెగని సుఖస్థానమై ఉన్నది.

విశేషం: గుమ్మడి పువ్వులో తేనె అతి స్వల్పంగా ఉంటుంది. తేనె తెట్టెలోని తేనెతో పోల్చినపుడు దాని ప్రయోజనం అతి స్వల్పం. అట్లాగే బావి సంకుచిత ప్రయోజనాలను మాత్రమే కల్గిస్తుంది. అందులోని నీరు స్వల్పం. నదితో పోల్చినపుడు బావివలన మనకు కలిగే లాభం చాలా కొద్దిపాటిది మాత్రమే. చంద్రుడి ఏకరేఖాకాంతి చాలా కొద్దిగా ఉంటుంది. పున్నమినాటి చంద్రుడి కాంతి ఎంతో పెద్దదై బహుళప్రయోజనాన్ని కల్గిస్తుంది. అట్లాగే స్వల్పఫలప్రదమైన కర్మమార్గంకంటే అత్యధిక ఫలప్రదమైన విద్యామార్గం శ్రేష్ఠమని భావం. అలం: రూపకం.

వ. కర్మంబునం గానిది యై విద్యనయ్యెడునట్టితెఱం గెఱింగించెద. 129

ప్రతిపదార్థం: కర్మంబునన్= కర్మమార్గంచేత; కానిది+ఐ= సాధించరానిదై; విద్యన్= విద్యామార్గంచేత; అయ్యెడునట్టి= సాధించదగినట్టి; తెఱంగు= పద్ధతి; ఎఱింగించెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: కర్మచేత సాధ్యంకాక విద్యచేత మాత్రమే సాధించదగిన పద్ధతి ఏదో తెలియపరుస్తాను.

క. వినుఁ! రేఖామాత్రపుఁ జం ।ద్రుని యట్టుల జీవుఁ డతని దుష్పక్షముఁ బో
లిన యజ్ఞానము నపగమ ।మున బోధానందసాంద్రపూర్ణతఁ బొలుచున్.' 130

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; జీవుఁడు= జీవాత్ముడు; రేఖామాత్రపు= ఒక్కరేఖామాత్రమే కల; చంద్రుని అట్టుల= చంద్రుడివంటివాడు; అతని= ఆ చంద్రుడియొక్క; దుష్పక్షమున్+పోలిన= కృష్ణపక్షంవంటిదైన; అజ్ఞానము నపగమమునన్= అజ్ఞానం తొలగిపోవటంచేత; బోధ+ఆనంద= జ్ఞానంచేత గలిగిన ఆనందంయొక్క; సాంద్ర= దట్టమైన; పూర్ణతన్= నిండుదనముచేత; పొలుచున్= భాసిస్తాడు.

తాత్పర్యం: ఏకరేఖామాత్రుడైన చంద్రుడితో సమానుడు జీవుడు. జీవుడి అజ్ఞానం చంద్రుడి కృష్ణపక్షంతో సమానమైనది. కృష్ణపక్షం గడచిపోతే చంద్రుడు పరిపూర్ణతను సంతరించుకొని భాసిస్తాడు. అట్లాగే అజ్ఞానమనే కర్మమార్గం గడిస్తే జీవుడు విద్యానంద పరిపూర్ణుడై వెలుగొందుతాడు'.

విశేషం: అలం: ఉపమ.

బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబని చెప్పుట (సం. 12-234-12)

వ. అని చెప్పిన విని 'విద్య యెట్టివారికి నలవడు? నెఱింగింపవే!' యనిన నందనునితో గంధవతీనందనుం
డిట్లనియె. 131

ప్రతిపదార్థం: అని చెప్పినన్ విని= ఈ రీతిగా చెప్పగా విని; విద్య= జ్ఞానహేతువైన విద్య; ఎట్టివారికిన్= ఏ రీతిగా ఉన్నవారికి; అలవడున్= అలవాటగును; ఎఱింగింపవే= తెలుపుమా; అనినన్= అని అడిగిన; నందనునితోన్= కుమారుడితో; గంధవతీనందనుండు= (యోజన) మత్స్యగంధి తనయుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పగా విని శుకుడు 'విద్య ఎట్లాంటి వారికి లభిస్తుందో చెప్పు'మని తండ్రిని అడిగాడు. అంతట వ్యాసమునీంద్రు డతనితో ఇట్లా అన్నాడు.

తే. బ్రహ్మచర్యసమేతతపంబు విపుల । కాననమున వానప్రస్థ గణము పొంత
నిలిచి చేయుచుఁ బర్ణశాలలకు నుచిత । కాలమునఁ జని యెత్తి భిక్షలు భుజించి. 132

ప్రతిపదార్థం: విపులకాననమునన్= విశాలమైన అడవిలో; వానప్రస్థగణము పొంతన్= వానప్రస్థాశ్రమంలో ఉన్నవారి చెంత; నిలిచి= ఉండి; బ్రహ్మచర్య సమేత తపంబున్= బ్రహ్మచర్యంతో కూడిన తపస్సును; చేయుచున్= చేస్తూ; ఉచితకాలమునన్= తగినసమయంలో; పర్ణశాలలకున్= పర్ణకుటీరాలకు; చని= పోయి; భిక్షలు ఎత్తి= భిక్షలు గ్రహించి; భుజించి= తిని.

తాత్పర్యం: విశాలమైన అరణ్యంలో వానప్రస్థులైనవారు నివసించే చోట ఉండి, బ్రహ్మచర్యంతో సహా తపోనిష్ఠ అనుష్ఠిస్తూ సరి అయిన సమయంలో అక్కడి పర్ణశాలలకు పోయి భిక్ష పరిగ్రహించి భుజిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నుతియు నమస్కృతియును లే । క తిరిగి, శుభ మశుభమను వగం బొందక, గో
ష్ఠి తెరువు సొరకుండుట సు । వ్రత, మది యధ్యాత్మవిద్యఁ బ్రచురముఁ జేయున్.' 133

ప్రతిపదార్థం: నుతియున్= పొగడ్తయు; నమస్కృతియున్= నమస్కారం; లేక= కలిగిఉండక; తిరిగి= సంచరించి; శుభము+అశుభము+అను వగన్= మంగళం, అమంగళం అనేచింతను; పొందక= చెందక; గోష్ఠితెరువు= పదిమంది కూడిన చోటికిపోయేమార్గం; చొరకుండుట= ప్రవేశించక ఉండటం; సువ్రతము= మంచివ్రతం; అది= ఆ వ్రతం; అధ్యాత్మవిద్యన్= బ్రహ్మవిద్యను; ప్రచురమున్+చేయున్= ఎక్కువ కావిస్తుంది.

తాత్పర్యం: మానావమానాలకు, శుభాశుభాలకు లొంగక ప్రజల కూటములలో చేరక ఉండటం మంచివ్రతం. ఆ వ్రతం వలన అధ్యాత్మవిద్య అభివృద్ధి పొందుతుంది'.

ఆ. అనుడు నతఁడు 'కర్మ మఖిలంబు నీడఁ బో । విడుచు టొప్పదండ్రు వేదవిదులు;
దాని నాదరింపఁ దగదొకో సంయమి । ప్రవర! సందియంబు వాపవలయు.' 134

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; అతఁడు= ఆ శుకుడు; సంయమిప్రవర!= మునిశ్రేష్ఠా!; వేదవిదులు= వేదం తెలిసినవారు; అఖిలంబు కర్మము= సమస్తమైన కర్మను; ఈఁడన్+పోన్ విడుచుట= వెనుదీయక విడనాడటం; ఒప్పదు+అండ్రు= తగదని చెప్పుతారు; దానిన్= ఆ కర్మమును; (లేక వారిమాటను); ఆదరింపన్+తగదొకో?= సంభావించటం అనుచితమా?; సందియంబు= ఈ సందేహాన్ని; పాపన్ వలయున్= తొలగించాలి.

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పగా శుకుడు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'మునీంద్రా! వేదజ్ఞులు కర్మను పూర్తిగా వదలరా' దని చెప్పుతున్నారు. ఆ కర్మను (లేదా వారిమాటను) ఆదరించకూడదా! ఈ సందేహం నివారించండి'.

వ. అనినం 'గర్మంబు విడువమియు, విడుచుటయుం గలిగియుండుఁ; దదీయయోగ్యతావిశేషంబు
లెఱింగించెద. 135

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కర్మంబు= కర్మమును; విడువమియున్= వదలకుండా ఉండటమూ; విడుచుటయున్= వదలటమూ; కలిగిఉండున్= ఉండటం కద్దు; తదీయ= ఆ కర్మత్యాగ - అపరిత్యాగాలయొక్క; యోగ్యతావిశేషంబులు= అర్హతను గూర్చిన విశేషాలు; ఎఱింగించెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: శుకు డట్లా అడిగేసరికి వ్యాసు డిట్లా అన్నాడు: 'కర్మను పరిత్యజించటమూ కద్దు. పరిత్యజించకపోవటమూ కద్దు. ఆ త్యాగాత్యాగాల విశేషాలను వివరిస్తాను.

సీ. వినుఁ' మని ముని యిట్టులను 'బ్రహ్మచారి గృ । హస్థ వానప్రస్థ యతులు విహిత
కర్మ నిష్ఠత సిద్ధిఁగాంతు; రాశ్రమ చతు । ష్కముఁ జతుష్పట్టికా ఘటితమైన
నిఃశ్రేణి తుదిముట్టు నెలవెక్కుటకు నిట్టి । క్రమవర్తనము సుకరంపుమార్గ;
మాయువు మొదలి నాలవపాలు గురుపాల । దాసునియట్లు సంతతముఁ బనులు

తే. ప్రీతిఁ జేయుచుఁ గుడిచిన పిదపఁ గుడిచి । శయ్యఁ జెందిన నాతని చరణయుగము
గరయుగంబున నొత్తుచు గలితనిద్రుఁ । డైన నిద్రించు బ్రహ్మచర్యాన్వితుండు. 136

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; అని= అనిచెప్పి; ముని= వ్యాసుడు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; బ్రహ్మచారి= బ్రహ్మచర్యాశ్రమంలో ఉండేవాడు; గృహస్థ= గృహస్థుడు; వానప్రస్థ= వానప్రస్థుడు; యతులు= సన్న్యాసి అనేవీరు; విహితకర్మనిష్ఠతన్= శాస్త్రంచేత విధించబడిన కర్మలో నిష్ఠకలిగిఉండటం వలన; సిద్ధిన్= సాధనచేత గమ్యమైన ప్రయోజనమును; కాంతురు= పొందుతారు; ఆశ్రమ చతుష్కమున్= నాలుగాశ్రమాలు; చతుష్పట్టికా ఘటితమైన= నాలుగు మెట్లతో సంఘటించబడిన; నిఃశ్రేణి= నిచ్చెన; తుదిముట్టు నెలవు= గమ్యస్థానమైన మోక్షమును; ఎక్కుటకున్= అధిరోహించటానికి; ఇట్లు= ఇటువంటి; క్రమవర్తనము= క్రమమైన పద్ధతి; సుకరంపుమార్గము= సులభమైన త్రోవ; బ్రహ్మచర్య+అన్వితుండు= బ్రహ్మచర్యంతో కూడిన వటువు; ఆయువు మొదలి నాలవపాలు= జీవితకాలమైన ఆయుస్సులో మొదటిదైన నాల్గవ భాగాన్ని; గురుపాలన్= గురుడి చెంత; దాసునిఅట్లు= సేవకుడివలె; సంతతమున్= ఎల్లప్పుడు; ప్రీతిన్= ప్రీతితో; పనులు= కర్మలు; చేయుచున్= ఆచరిస్తూ; కుడిచిన పిదపన్= (గురువు) భుజించిన పిమ్మట; కుడిచి= భుజించి; శయ్యన్+చెందినన్= (గురువు) శయనిస్తే; ఆతని చరణయుగమున్= ఆ గురువు పాదాలు రెండింటిని; కరయుగంబునన్= తన రెండు చేతులలో; ఒత్తుచున్= పిసుకుతూ; కలితనిద్రుఁడు+ఐనన్= అతడు నిద్రించగా; నిద్రించున్= తాను నిద్రపోతాడు.

తాత్పర్యం: నేను చెప్పేది వినుము' అని వ్యాసు డిట్లా అన్నాడు: 'బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి అనే నాలుగాశ్రమాలకు చెందినవారు శాస్త్రం విధించిన కర్మలు ఆచరించటం ద్వారా సిద్ధి పొందుతారు. నాలుగాశ్రమాల పద్ధతి నాలుగు మెట్లతో నిర్మించిన నిచ్చెన వంటిది. చివరి గమ్యమైన మోక్షపదవి నధిష్ఠించటానికి బ్రహ్మచర్యాది క్రమపద్ధతి సులభమైన త్రోవ. బ్రహ్మచారి తన ఆయువులో మొదటి నాల్గవభాగమైన యిరువదైదు సంవత్సరాల కాలం గురువువద్ద భృత్యుడివలె సదా ప్రియంగా కర్మలు చేస్తూ ఉండాలి. గురువు భుజించిన తర్వాత భుజించాలి. గురువు పడుకొన్న పిమ్మట ఆయన రెండు పాదాలనూ తన రెండు చేతులతో ఒత్తాలి. ఆయన నిద్రించిన తర్వాతనే తాను నిద్రించాలి.

విశేషం: 'శతాయుర్వైపురుషః' అన్న ప్రమాణాన్ని అనుసరించి మానవుల ఆయుఃకాలం నూరు సంవత్సరాలై ఉన్నది. దీనిని నాల్గు భాగాలుగా విభజిస్తే ఒక్కొక్క భాగానికి ఇరువైఅయిదు సంవత్సరాలవుతాయి. క్రమపద్ధతిలో ఆశ్రమాలను స్వీకరించేవాడు ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క ఆశ్రమం చొప్పున నాలుగాశ్రమాలను పాటించాలి.

క. రసగంధప్రముఖంబుల । దెస వేడుక లేక గురుమతికి వచ్చిన య
ట్టిసమయములఁ దగ వేదా ।భ్యసనంబులు సేయుచుండు నాతఁడు నియతిన్. 137

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ బ్రహ్మచారి; నియతిన్= నియమంతో; రసగంధప్రముఖంబుల దెసన్= రసం, గంధం మొదలైన విషయాలపై; వేడుక= ఔత్సుక్యం; లేక= కలిగి ఉండక; గురుమతికిన్= ఆచార్యుడి బుద్ధికి; వచ్చిన= తోచిన; అట్టిసమయములన్= ఆ కాలాలలో; తగన్= తగిన రీతిలో; వేద+అభ్యసనంబులు= శ్రుతిసారమును అభ్యసించటాన్ని; చేయుచుండున్= ఆచరిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: బ్రహ్మచారి నియమంపాటిస్తూ రసగంధాదులైన విషయాలపై మక్కువ లేనివాడై ఉంటాడు. గురువు బుద్ధికి తోచిన సమయాలలో ఆయన వద్ద వేదాభ్యాసం చేస్తూ ఉంటాడు.

వ. ఇది బ్రహ్మచారి ప్రకారం; బాతం డాశ్రమాంతరగతుం డయి వర్తించు విధంబు సెప్పెద. 138

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పింది; బ్రహ్మచారి ప్రకారంబు= బ్రహ్మచారి పద్ధతి; ఆతండు= ఆ బ్రహ్మచారి; ఆశ్రమ+అంతరగతుండు+అయి= మరొక ఆశ్రమమైన గృహస్థాశ్రమంలో ప్రవేశించినవాడై; వర్తించు= మెలగే; విధంబు= ప్రకారాన్ని; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఇంతవరకూ చెప్పింది బ్రహ్మచారి పద్ధతి. ఆ బ్రహ్మచారి గార్హస్థ్యం స్వీకరించినప్పుడు మెలగే పద్ధతిని వివరిస్తాను.

సీ. సవినయంబునఁ దన శక్తితో గురునకు । దక్షిణ యిచ్చి, యాతండు వనుపఁ
గా సమావర్తనకార్యంబు నడపి వి । వాహమై హవ్యకవ్యముల నతిథి
తోషణ బాంధవ పోషణంబుల సత్య । భాషల నిజదారపరతఁ బుత్ర
సంశిక్షఁ గ్రతువిశేషంబుల నొక యాయు । రంశంబు గడపి గృహస్థ, ధర్మ

తే. వృత్తిఁ గృతకృత్యుఁ డగు నగ్ని విడువ కడవిఁ । బూరిపంటల ఫలమూలములను భిక్షు
పూజ సలుపుచుఁ, బరిశిష్టములు భుజించి । తపము సేఁత వానప్రస్థ ధర్మసరణి. 139

ప్రతిపదార్థం: సవినయంబునన్= వినయంతో; తనశక్తితోన్= తనకున్న శక్తి కొలది; గురునకున్= ఆచార్యుడికి; దక్షిణ ఇచ్చి= దక్షిణగా ఈదగిన ధనం ఇచ్చి; ఆతండు= ఆ గురువు; పనుపఁగాన్= పంపగా; సమావర్తన కార్యంబున్= బ్రహ్మచర్య సమాప్తికి తగినకార్యం; నడపి= నిర్వహించి; వివాహము+ఐ= పెండ్లిచేసికొని; హవ్యకవ్యములన్= దేవతలకు, పితృదేవతలకు ఈదగిన యన్నములతోను; అతిథితోషణ= అతిథులను సంతోషపరచుటతోను; బాంధవపోషణంబులన్= బంధువులను పోషించటంతోను; సత్యభాషలన్= సత్యమైన మాటలతోనూ; నిజదారపరతన్= తన భార్యయందే ఆసక్తిగలవాడై ఉండటంచేతను; పుత్ర సంశిక్షన్= పుత్రులకు మంచి శిక్షణ చేతను; క్రతు విశేషంబులన్= యాగ విశేషాలతోనూ; ఒక ఆయుఃఅంశంబున్= తన ఆయుస్సులో నాలుగింట ఒకభాగాన్ని; కడపి= అతిక్రమించి; గృహస్థధర్మవృత్తిన్= గృహస్థుడి యొక్క ధర్మానికి చెందిన వర్తనంచేత; కృతకృత్యుఁడు= చేయదగిన పనులు చేసినవాడు; అగున్= అవుతాడు; అగ్నిన్ విడువక= అగ్నికార్యమును వదలక; అడవిన్= అరణ్యంలో; పూరిపంటలన్= ధాన్యములచేత; ఫలమూలములను= పండ్లు, దుంపలచేత; భిక్షుపూజన్= యతి పూజను;సలుపుచున్= నిర్వహిస్తూ; పరిశిష్టములు= మిగిలినవి; భుజించి= తిని; తపముచేఁత= తపస్సు చేయటం; వానప్రస్థధర్మసరణి= వానప్రస్థాశ్రమంలో ఉన్నవారి ధర్మముయొక్క మార్గమై ఉన్నది.

తాత్పర్యం: బ్రహ్మచారి వినయంతో తనశక్తి కొలది గురువుకు దక్షిణ ఇచ్చుకోవాలి. ఆయన అనుమతి పొంది అధ్యయనానంతరం గృహస్థధర్మాన్ని స్వీకరించటానికి అవసరమైన కార్యాలు నిర్వహించాలి. తరువాత పెండ్లి చేసికొని దేవతలను, పితృదేవతలనూ క్రమంగా హవ్యకవ్యాలలో సంతృప్తి పరచాలి. అతిథులను సంతోషపెట్టాలి.బంధువులను పోషించాలి. సత్యం పలకాలి. తన భార్యయందే అనురక్తుడై ఉండాలి. పుత్రులకు చక్కని శిక్షణ ఇవ్వాలి.

క్రతువులు చేయాలి. ఇట్లా జీవితకాలంలో ఒక పాతిక భాగం గడపి గృహస్థుడి ధర్మం పాటించి అతడు కృతార్థుడవుతాడు. ఆ పిమ్మట అగ్నికార్యం విడువకుండా నిర్వహిస్తూ ధాన్యాలతో, ఫలమూలాలతో సన్న్యాసులను ఆదరిస్తూ వారు తినగా మిగిలిన అన్నాన్ని భుజిస్తూ తపస్సు చేయటం వానప్రస్థులైనవారి ధర్మమార్గం.

క. వానప్రస్థ ప్రక్రియ । దా నొకపా లాయువునఁ బదంపడి తుది పా
లైనను సన్న్యసాను । స్థానమునకుఁ జొచ్చువాఁడు శాంతాత్మకుఁడై. 140

ప్రతిపదార్థం: పదంపడి= పిమ్మట; తాను= అతడు; ఒకపాలు+ఆయువునన్= ఒకభాగం ఆయుస్సుచేత; వానప్రస్థప్రక్రియన్= వానప్రస్థ వృత్తితో (గడపి); తుదిపాలైనను= శేషించిన నాల్గవపాలు జీవితకాలాన్నైనా; శాంతాత్మకుఁడు+ఐ= శాంతమైన చిత్తంకలవాడై; సన్న్యాస+అనుస్థానమునకున్= యతిధర్మాన్ని అనుష్ఠించటానికి; చొచ్చువాఁడు= ప్రవేశించేవాడు అగును.

తాత్పర్యం: ఈ విధంగా జీవితకాలంలో ఒకపాతిక వంతు వానప్రస్థ ధర్మాచరణతో గడపి, ఆ తరువాత మిగిలిన నాల్గవభాగం కాలంలో సన్న్యాసాశ్రమానుగుణమైన ధర్మానుష్ఠానంలో శాంతచిత్తంతో ప్రవేశించాలి.

వ. ఇ ట్లాయురంశంబులు నాలుగుం జెల్లుట యుత్తమ ధర్మస్వరూపం; బంశత్రయకాలాచరితంబైన
యాశ్రమత్రితయంబు ప్రవర్తనంబులఁ గషాయపక్వంబగుటయుఁ జతుర్థాశ్రమంబుఁ జెందుట కృత్యంబు;
దాని తెఱం గెఱింగించెద నవహితుండ వై యాకర్ణింపుము. 141

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఆయుఃఅంశంబులు= ఆయుర్భాగాలు; నాలుగున్+చెల్లుట= నాలుగును గడచుట; ఉత్తమధర్మస్వరూపంబు= శ్రేష్ఠమైనధర్మముయొక్క పద్ధతి; అంశత్రయ= మూడుభాగాలైన; కాల= సమయంలో; ఆచరితంబు+ఐన= చేయబడిన; ఆశ్రమత్రితయంబు= మూడాశ్రమాలయొక్క; ప్రవర్తనంబులన్= ఆయా ఆశ్రమానికి తగిన నడవడికలతో; కషాయపక్వంబు+అగుటయున్= చిత్తం శుద్ధం కావటంతోనే; చతుర్థ+ఆశ్రమంబున్= యత్యాశ్రమమును; చెందుట= స్వీకరించటం; కృత్యంబు= చేయదగింది; దాని తెఱంగు= నాల్గవ ఆశ్రమపద్ధతిని; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవహితుండవు+ఐ= అవధానం కలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా నాలుగు జీవితకాలభాగాలు గడవట మనేది ఉత్తమమైన ధర్మపద్ధతి. మొదటి మూడు కాలాంశాలలో చక్కని ప్రవర్తనలతో గడపిన బ్రహ్మచర్యం మొదలైన మూడాశ్రమాలు క్రమపక్వత పొందాలి. ఆ పిదప నాల్గవదైన సన్న్యాసాశ్రమం స్వీకరించటం ఉచితం. నాల్గవ ఆశ్రమానికి చెందిన పద్ధతి ఎట్లాంటిదో వివరిస్తాను. సావధానంగా వినుము.

సీ. ఆత్మయం దగ్ని సమారోపణము సేసి । యజన మాంతరముగ నకృతసంధి
విగ్రహుం డగుచుఁ బరిగ్రహ విముఖుఁడై । ముండుండు ననికేతనుండు వృక్ష
మూలవాసియును గపాలధారుండు నే । కాకియు నక్రోధకామశోకుఁ
డును గాఁగవలయు; భిక్షునకు నిందా స్తుతుల్ । దనయంద యడఁగంగఁ దాను బరుల

తే. దిక్కు వలుకక దివియెల్లఁ బిక్కటిలఁగఁ । దాన యున్నట్లు గనుచు నేమేనిఁ గుడిచి
యెద్దియేనియుఁ గట్టి యెందే శయించు । నతని దేవతల్ బ్రాహ్మణుఁ డంద్రు పుత్ర! 142

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; యజనము= యజ్ఞక్రియ; ఆంతరముగన్= ఆంతరంగికం కాగా; ఆత్మయందున్= ఆత్మలో; అగ్నిసమారోపణము చేసి= అగ్నిని చక్కగా ఆరోపింపజేసి; అకృత సంధి విగ్రహుండు+అగుచున్= ఇతరులతో కలయికగాని,

కలహంగాని చేయనివాడుగా ఉంటూ; పరిగ్రహవిముఖుఁడు+ఐ= ఇతరులనుండి ధనాదుల స్వీకారానికి విముఖుడై; ముండుండున్= బోడితలవాడును; అనికేతనుండున్= గృహం లేనివాడు; వృక్షమూలవాసియున్= చెట్టుమొదట నివసించేవాడును; కపాలధారుండున్= పెంకును చేబూనినవాడును; ఏకాకియున్= ఒంటరిగా ఉండేవాడును; అక్రోధకామశోకుఁడును= కోపం, కామం, దుఃఖం లేనివాడును; కాఁగన్+వలయున్= కావలెను; భిక్షునకున్= సన్న్యాసికి; నిందాస్తుతుల్= నిందించటం, పొగడటమూ; తనయంద= తనలోనే; అడఁగంగన్= అణగిపోగా; తాను= ఆ సన్న్యాసి; పరులదిక్కు= ఇతరులవైపు; పలుకక= మాట్లాడక; దివి ఎల్లన్= ఆకాశమంతా; పిక్కటిలఁగన్= క్రిక్కిరిసినట్లుగా; తాన= తానే; ఉన్నట్లు= ఉండినట్లు; కనుచున్= చూస్తూ; ఏమేని= ఏదైనా; కుడిచి= తిని; ఎద్దియేనియున్= ఏదైనా; కట్టి= ధరించి; ఎందేన్= ఎక్కడైనా; శయించునతని= శయనించే సన్న్యాసిని; దేవతల్= సురలు; బ్రాహ్మణుఁడు+అండ్రు= బ్రాహ్మణుడని చెప్పుతారు.

తాత్పర్యం: కుమారా! సన్న్యాసాశ్రమం స్వీకరించినవాడు ఆత్మలోనే అగ్ని సమారోపణం కావించి ఆంతరంగికంగా యజనక్రియ నిర్వహించాలి. ఎవరితోనూ పొత్తుగానీ, కలహంకానీ పెట్టుకొనకూడదు. అతడికి పరిగ్రహం తగదు. ముండిత శిరస్కుడై ఒక యింట నివాసం లేక ఏ చెట్టుమొదట్లోనో నివసించాలి. ఘటకపాలం చేతబట్టి ఏకాకిగా సంచరించాలి. కామానికీ, క్రోధానికీ, శోకానికీ గురి కాకూడదు. నిందాస్తుతులను తనలో అణచివేసి ఇతరులతో ఏ వ్యవహారమూ పెట్టుకొనక భూమ్యాకాశాలంతటా తానే వ్యాపించి ఉన్నానని భావిస్తూ, ప్రాప్తమైనది ఏదైనా తిని, ఏదైనా ధరించి, ఎక్కడైనా శయనించే స్వభావంకల ఆ యతిని దేవతలు 'బ్రాహ్మణుడు' అని వ్యవహరిస్తారు.

క. జన నికరములకుఁ దొలఁగును । ఘన భుజగంబులకుఁ బోలెఁ గనుఁ బీనుఁగుఁ గా
వనితం దనుఁ బాటించిన । ననఘా! నరకముగఁ దలఁచు నతఁడు మనమునన్. 143

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అతఁడు= ఆ సన్న్యాసి; జన నికరములకున్= ప్రజాసమూహాలకు; ఘనభుజంగం బులకున్+పోలెన్= పెద్దపాములకు వలె; తొలఁగును= తొలగిపోతాడు; వనితన్= స్త్రీని; పీనుఁగున్+కాన్= శవంగా; కనున్=భావిస్తాడు; తను= తనను; పాటించినన్= చేరితే; మనమున్= చిత్తంలో; నరకముగన్= నరకంగా; తలఁచున్= భావిస్తాడు.

తాత్పర్యం: పాపరహితుడా! ఆ యతి పాములు తొలగినట్లు ప్రజల గుంపులను చూస్తే దూరంగా తొలగిపోతాడు. స్త్రీని శవంగా భావిస్తాడు. ఆ స్త్రీ తనను పాటిస్తే అది నరకంగా చిత్తంలో భావిస్తాడు.

తే. అతనివలన భూతములకు నభయ మగుట । భూతముల దెస నభయంబ యాతనికిని
బుత్ర! యీగు లెల్లవియును భూతములకు । నభయ మిచ్చుటఁ బోలవం ద్రార్యజనులు. 144

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; అతనివలనన్= ఆ యతివలన; భూతములకున్= ప్రాణులకు; అభయము+అగుటన్= భయం లేదు కాబట్టి; ఆతనికిని= ఆ యతికి కూడ; భూతములదెసన్= ప్రాణులవలన; అభయంబు+అ= భయమన్నది లేదు; ఆర్యజనులు= పెద్దలు; ఈగు లెల్లవియును= సమస్తదానాలు; భూతములకున్= ప్రాణులకు; అభయము+ఇచ్చుటన్= నిర్భయత్వం ఒసంగుటను; పోలవు+అండ్రు= సరిపోల వని చెప్పుతారు.

తాత్పర్యం: కుమారా! సన్న్యాసివలన ప్రాణులకు భయం లేదు కాబట్టి ప్రాణులవలన అతడికి కూడా భయంలేదు. ఆర్యులైనవారు అన్నిదానాలు ప్రాణుల కిచ్చే అభయ ప్రదానానికి సరిపోల వని చెప్పుతారు.

ఆ. జంతుపదము లెల్ల దంతిపదంబులో । నడఁగు క్రియ నహింసయందు సకల
ధర్మములు నడంగుఁ గర్మ సంత్యాగికి । నైన భూతదయ సమర్థగుణము. 145

ప్రతిపదార్థం: జంతుపదములు+ఎల్లన్= జంతువుల అడుగులన్నీ; దంతిపదంబులోన్= ఏనుగు అడుగులో; అడఁగుక్రియన్= అణగునట్లు; అహింస+అందున్= 'అహింస' అనే ధర్మమందు; సకలధర్మములు= సమస్త ధర్మాలు; అడంగున్= అణగిపోతాయి; కర్మసంత్యాగికిన్+ఐనన్= కర్మములు పరిత్యజించినవాడికి సైతం; భూతదయ= ప్రాణులపట్ల చూపే కరుణ; సమర్హగుణము= ఉచితమైన గుణం.

తాత్పర్యం: లోకంలోని జంతువుల అడుగులన్నీ ఏనుగు అడుగులో లీనమైపోతాయి. అట్లే సమస్త ధర్మాలు 'అహింస' అనే ధర్మంలో లీనమైపోతాయి. కాబట్టి కర్మపరిత్యాగం చేసిన వానికి కూడా భూతదయ చాలా ఉచితమైన గుణంగా భాసిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

వ. కావున. **146**

తాత్పర్యం: అందువలన.

క. జగముల కెల్ల శరణ్యుం । డగుచు నమృతసిక్తమైన యట్టి మనసుతో
విగతాఖిలలేపస్థితి । గగనము నట్లుండు నతఁడు గణనాధికుఁడై.' **147**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ యతి; జగములకున్+ఎల్లన్= లోకాలకన్నిటికీ; శరణ్యుండు+అగుచున్= శరణొందదగినవాడు అవుతూ; అమృతసిక్తము+ఐన అట్టి= అమృతంతో తడుపబడినదైనట్టి; మనసుతోన్= చిత్తంతో; గణనాధికుఁడు+ఐ= ఇట్టివాడని ఊహించుటకు వీలుగానివాడై; విగత+అఖిల లేపస్థితిన్= తొలగిన సమస్త సంగముయొక్క స్థితిచేత; గగనముఅట్లు= ఆకాశంవలె; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: ఆ సన్న్యాసి లోకాల కన్నిటికీ శరణ్యమై ఉంటాడు. అతడి చిత్తం అమృతంతో తడిపినట్లు చల్లగా, శ్రేయోదాయకంగా ఉంటుంది. అతడు దేనినీ అంటక 'ఇట్టివాడు' అని ఊహించరానివాడై ఆకాశంవలె ఉంటాడు'.

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి యప్పరాశరనందనుండు వెండియు నిట్లనియె. **148**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; ఆ+పరాశర నందనుండు= ఆ వ్యాసుడు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి వ్యాసుడు మళ్ళీ ఈ విధంగా అన్నాడు:

వ్యాసుఁడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము (సం. 12-237-27, 28)

తే. హృదయవేదికయందు సమిద్ధమూర్తి । వెలుఁగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ
ములను యాజి య ట్లంతరమున నొనర్చు । యాగమున వీతకల్మషుఁడై వెలుంగు. **149**

ప్రతిపదార్థం: యాజి= యాగం చేసేవాడు; హృదయవేదిక+అందున్= హృదయ మనే యజ్ఞవేదిమీద; సమిద్ధమూర్తిన్= ఉజ్జ్వలమైన ఆకారంతో; వెలుఁగుచుండు= ప్రకాశించే; తేజమునందున్= తేజస్సులో; ప్రాణములను= అసువులను; వేల్చున్= హోమించును; అట్లు= ఆ రీతిగా; అంతరమునన్= ఆంతరంగికంగా; ఒనర్చు= చేసే; యాగమునన్= యాగంచేత; వీతకల్మషుఁడు+ఐ= తొలగిన పాపం కలవాడై; వెలుంగున్= భాసిస్తాడు.

తాత్పర్యం: అంతర్యాగం చేసే వాడు తన హృదయమనే యజ్ఞవేదికపై ధగధగ ప్రకాశించే తేజస్సులో ప్రాణాలను వేలుస్తాడు. అట్లా ఆంతరంగా చేసే యాగంవలన అతడు విగతపాపుడై భాసిస్తాడు.

క. వినుఁ! మాత్మతీర్థ సంసే । వనము తెఱఁగునట్టి వానికిఁ దిరుగం
జనవలయునె పెఱచోటుల । కని చెప్పుదు రాశ్రితులకు నధ్యాత్మవిదుల్. 150

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆత్మతీర్థ= 'ఆత్మ' అనే తీర్థముయొక్క; సంసేవనము తెఱంగు= సేవించే తీరును; ఎఱఁగునట్టివానికిన్= తెలిసినవాడికి; పెఱచోటులకున్= ఇతర ప్రదేశాలకు; తిరుగన్+చనన్ వలయునె అని= తిరుగటానికి పోవలెనా? అని; అధ్యాత్మవిదుల్= ఆధ్యాత్మికతత్త్వ మెరిగినవారు; ఆశ్రితులకున్= తమనాశ్రయించినవారికి; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: ఆధ్యాత్మిక తత్త్వవేత్తలైన పెద్దలు తమను ఆశ్రయించినవారితో - 'ఆత్మ' అనే తీర్థాన్ని ఎట్లా సేవించాలో తెలిసినవారికి ఇతర ప్రదేశాలలో తీర్థాటనం చేయవలసిన పనిలేదని చెప్పుతారు.

తే. అవనిఁ బొందదు దివమున నప్రమేయ । మండజంబు హిరణ్మయ మండమధ్య
మున వెలుంగు నుజ్జ్వలపక్ష ఘనత; దాని । నెఱఁగు సంతత యోగసమేతుఁ డనఘ! 151

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; హిరణ్మయము= స్వర్ణరూపమైన; అండజంబు= పక్షి; అవనిన్= భూమిని; పొందదు= చేరదు; దివమునన్= ఆకాశమందు; అప్రమేయము= గోచరింపచేసికొనటానికి వీలుకాదు; అండమధ్యమునన్= గ్రుడ్డుయొక్క మధ్యభాగంలో; ఉజ్జ్వలపక్ష ఘనతన్= మిక్కిలిగా ప్రకాశించే రెక్కల గొప్పతనంతో; వెలుంగున్= ప్రకాశిస్తుంది; దానిన్= ఆ పక్షిని; సంతతయోగ సమేతుఁడు= సదా యోగంతో కూడినవాడు; ఎఱఁగున్= తెలిసికొంటాడు.

తాత్పర్యం: కల్మషరహితుడ వైన ఓ శుక్రుడా! ఆత్మ అనే ఒక చిన్మయమైన పక్షి ఉన్నది. అది భూమిని స్పృశించదు. ఆకాశంలో ఏ ప్రమాణానికీ గోచరం కాదు. అది పిండమనే గ్రుడ్డు మధ్యలో ఉజ్జ్వలమైన కాలమనే రెక్కలతో ప్రకాశిస్తూ ఉంటుంది. యోగశక్తి కలవాడు మాత్రమే దానిని గ్రహించగలడు.

విశేషం: ప్రత్యగాత్మ ప్రమాణగోచరం కాదు. అది చిన్మయమైనది. అది మాయామయమైన హృదయాకాశంలో ఎగురుతూ ఉంటుంది. మోదప్రమోదాలనే వృత్తివిశేషాలను కూడా దాని రెక్కలుగా చెప్పవచ్చు. "అథ య దిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మదహరోZస్మిన్నంతరాకాశ స్తస్మిన్యదంతస్త దన్వేష్టవ్యమ్" అన్న శ్రుతిని ఇక్కడ అనుసంధించుకొనాలి.

క. వినుఁ మాఱంచులుఁ బండ్రెం । డనుపమధారలును నై నిజాస్యము విశ్వం
బును బొదువఁ దిరుగు కాలం । బను చక్రము దురవబోధ మది యడఁగు గుహన్. 152

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; కాలంబు+అను= కాలమనే; చక్రము= ఆయుధవిశేషం, (బండికల్లు); ఆఱు+అంచులు= ఋతువులనే ఆరు అంచులును; పండ్రెండు= పదియు రెండు సంఖ్యగల; అనుపమ ధారలునునై= సాటిలేని తీక్ష్ణమైన అంచులను గలిగినదై; నిజాస్యము= తన ముఖం; విశ్వంబును= ప్రపంచమును; పొదువన్= వ్యాపించగా; తిరుగున్= పరిభ్రమించును; దురవబోధము= గ్రహించుటకు శక్యంకానిదగు; అది= ఆ చక్రం; గుహన్= హృదయమనే గుహలో; అడఁగున్= అణగిపోతుంది.

తాత్పర్యం: కాలమనే చక్రానికి వసంతం మొదలైన ఆరు ఋతువులు అంచులుగా ఉన్నాయి. చైత్రం మొదలైన పన్నెండు మాసాలు తీక్ష్ణమైన ధారలుగా ఉన్నాయి. దాని ముఖం విశ్వమంతా వ్యాపించి ఉన్నది. గ్రహించశక్యం కాని ఆ కాలచక్రం బుద్ధిగుహలో అణగి ఉన్నది.

విశేషం: అలంకారం: రూపకం.

ఆ. మనసు నింద్రియములఁ బనిగొని పురుషుండు । ప్రచురశిక్షలేని రథ్యసమితి
నడపు రథికు మాడ్కి నడవడి నవి యీడ్చి । నట్టులైన నశుభ మావహిల్లు. 153

ప్రతిపదార్థం: పురుషుండు= జీవుడు; మనసున్= చిత్తమును; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; పనిగొని= నియోగించి; ప్రచురశిక్ష= దృఢమైన శిక్షణ; లేని= అలవడని; రథ్యసమితిన్= గుర్రాల సముదాయమును; నడపు= నడపించేసే; రథికు మాడ్కిన్= రథస్థుడివలె; నడవడిన్= ప్రవర్తనతో; అవి= ఆ ఇంద్రియాలు; ఈడ్చినట్టులు+ఐనన్= లాగినట్లు జరిగితే; అశుభము= అమంగళం; ఆవహిల్లున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: రథమును లాగే గుర్రాలకు చక్కని శిక్షణ ఉండాలి. అట్లా లేని పక్షంలో అవి స్వేచ్ఛగా రథాన్ని లాగితే ప్రమాదం కలుగుతుంది. అట్లే జీవుడు మనస్సును, ఇంద్రియాలను నియోగించేటప్పుడు నిగ్రహించకుండా వాటి మార్గంలో వాటిని పోనిస్తే అశుభానికి గురి అవుతాడు.

విశేషం: "యస్త్వవిజ్ఞానవాన్ భవత్యయుక్తేన మనసా సదా । తస్యేంద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వాఇవ సారథేః ॥" అను కఠశ్రుతిని ఇక్కడ అనుసంధించుకొనాలి. నిగ్రహంలేని చిత్తం కలవాడైన అవివేకి యొక్క ఇంద్రియాలు సారథియొక్క దుష్టాశ్వాలవలె వశం తప్పి ప్రవర్తిస్తాయి అని పై శ్రుతి తాత్పర్యం. అలంకారం: ఉపమ.

క. తనకు మహిత ప్రసాదం । బొనరక యున్నేనిఁ గీళ్లు లొలయు; నది దృఢ
త్వనిరూఢమైనఁ జేకుఱు । ననంత పదసిద్ధి; దాని కనువెఱిఁగింతున్. 154

ప్రతిపదార్థం: మహితప్రసాదంబు= శ్రేష్ఠమైన ఆత్మనిగ్రహం; తనకున్= సాధకుడికి; ఒనరక ఉన్నేనిన్= కలుగక ఉన్నచో; కీళ్లులు= కష్టాలు; ఒలయున్= సంభవిస్తాయి; అది= ఆత్మనిగ్రహం; దృఢత్వనిరూఢము+ఐనన్= దృఢపడితే; అనంతపదసిద్ధి= అంతంలేని ఉన్నత పదప్రాప్తి; చేకుఱున్= కలుగుతుంది; దానికిన్= ఆ పద ప్రాప్తికి; అనువు= ఉపాయం; ఎఱిఁగింతున్= తెలియజేస్తాను.

తాత్పర్యం: మోక్షప్రాప్తికై సాధన చేసే సాధకుడికి ఆత్మనిగ్రహం చాలా ముఖ్యం. అది సిద్ధించక పోతే కష్టాలు సంభవిస్తాయి. ఆత్మనిగ్రహం దృఢంగా సిద్ధిస్తే అంతంలేని మోక్షపదవి లభిస్తుంది. ఆ పదవిని సాధించే ఉపాయం చెప్పుతాను వినుము.

తే. సర్వసంకల్పరహితుఁడై సత్త్వమున వి । నిశ్చలంబుగఁ జిత్తంబు నిలుపవలయు
సత్త్వసక్త చిత్తంబు ప్రసాద మొసఁగు । దానఁ గాలంబు నడపు టుత్తమవిధంబు. 155

ప్రతిపదార్థం: సర్వసంకల్పరహితుఁడు+ఐ= సమస్తములైన సంకల్పాలు లేనివాడై; చిత్తంబున్= మనస్సును; సత్త్వమునన్= సత్త్వగుణంలో; వినిశ్చలంబుగన్= చలనం లేనట్లుగా; నిలుపన్ వలయున్= నిలపాలి; సత్త్వసక్త చిత్తంబు= సత్త్వగుణంలో ఆసక్తమైన మనస్సు ప్రసాదము= ఆత్మనిగ్రహమును; ఒసంగున్= ఇస్తుంది; దానన్= ఆ నిగ్రహంతో; కాలంబు నడపుట= కాలం గడపటం; ఉత్తమ విధంబు= మేలైన పద్ధతి.

తాత్పర్యం: ఆత్మప్రాప్తిని కోరేవాడు అన్ని సంకల్పాలూ వదలి మనస్సును సత్త్వగుణంతో సంసక్తం చేయాలి. సత్త్వగుణంలో నిలబడ్డ మనస్సు ఆత్మనిగ్రహాన్ని సమకూరుస్తుంది. అట్లాంటి నిగ్రహంతో కాలయాపన చేయటం మేలైన విధానం.

క. వినుము నివాతస్థానం । బునఁ గం పనరహిత దీపము వెలింగెడు చా
డ్పున నంతరాత్మ వెలుఁగుచు । నునికి ప్రసాదంబు భంగి యుత్తమధిషణా! ॥ 156

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా= ఉత్తమమైన బుద్ధిగలవాడా!; వినుము= ఆలకించుము; నివాతస్థానంబునన్= గాలిలేనిచోట; కంపనరహిత దీపము= కదలికలేని దివ్వె; వెలింగెడు చాడ్పునన్= ప్రకాశించే విధంగా; అంతరాత్మ= లోపలి ఆత్మ; వెలుంగుచున్+ఉనికి= ప్రకాశిస్తూ ఉండటం; ప్రసాదంబు భంగి= ప్రసాదం యొక్క పద్ధతి.

తాత్పర్యం: శ్రేష్ఠమైన బుద్ధి కలవాడా! వినుము. గాలి లేని చోట పెట్టిన దీపం కదలకుండా ప్రకాశిస్తుంది. ఆ రీతిగా ప్రసాదమంటే అంతరాత్మ చాంచల్యం లేకుండా నిగ్రహించబడి భాసించటమే.

విశేషం: అలం: ఉపమ.

క. విను తత్ప్రసాదవంతుఁడు । దనయందు నిరంజనముగఁ ద న్ననిశంబుం
గనుఁగొనుచు నియతి నియతా । శనుఁడై యుండుట యొనర్చు శాశ్వతపదమున్. 157

ప్రతిపదార్థం: విను= వినుము; తద్+ప్రసాదవంతుడు= ఆ ప్రసాదం కలవాడు; తన+అందున్= తనలో; నిరంజనముగన్= మాలిన్యరహితంగా; తన్నున్= తనను; అనిశంబున్= ఎల్లవేళలా; కనుఁగొనుచున్= చూస్తూ; నియతిన్= నియమంతో; నియత+అశనుఁడు+ఐ= నియమించబడిన మితాహారం గలవాడై; ఉండుట= ప్రవర్తించటం; శాశ్వత పదమున్= శాశ్వతమైన స్థానాన్ని; ఒనర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఆ రీతిగా అచంచలమైన అంతరాత్మ కలవాడు తనలో తనను సదా మాయామాలిన్యం లేనివాడినిగా చూస్తాడు. నియమంకలిగి ఉంటాడు. హితమితాహారంతో జీవిస్తాడు. అట్లా ఉంటే శాశ్వత పదమైన మోక్షం లభిస్తుంది.

తే. అతులవేదాంతశాస్త్ర మహాంబురాశిఁ । ద్రచ్చి పుచ్చిన నవనీత మిచ్చితిని స
మాదరంబునఁ గైకొను మనుసరించు । నిర్మలాత్మ తపస్వికి నీవు నొసఁగు. 158

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; వేదాంతశాస్త్ర= వేదాంతశాస్త్రమనే; మహా+అంబురాశిన్= గొప్ప సాగరాన్ని; త్రచ్చి= తరచి; పుచ్చిన= గ్రహించిన; నవనీతము= వెన్న; ఇచ్చితిని= ఇచ్చాను; సమాదరంబునన్= ప్రీతితో; కైకొనుము= స్వీకరించుము; అనుసరించు= (ఈ వేదాంతమార్గాన్ని) అనుసరించి ప్రవర్తించుము; నీవున్= నీవు కూడ; నిర్మల+ఆత్మ తపస్వికిన్= నిర్మలహృదయుడైన తపోనిష్ఠుడికి; ఒసఁగు= ఇమ్ము.

తాత్పర్యం: శుకా! సాటిలేని వేదాంతశాస్త్రమనే మహాసముద్రాన్ని మథించి పుచ్చుకొన్న సారమైన నవనీతాన్ని నీకిప్పుడు నేను ఇచ్చాను. నీవు దీనిని ప్రీతితో స్వీకరించుము. దీన్ని అనుసరించి నడచుకొమ్ము. నిర్మలచిత్తుడైన తపోనిధికి నీవు దీన్ని ప్రసాదించుము.

విశేషం: అలంకారం: రూపకం.

ఆ. సకల రత్నపూర్ణ సర్వవసుంధరా । చక్రదాన విధియు సరి యనంగ
రాదు విశ్వవేదరాశి సారాధ్యాత్మ । విద్య యిచ్చుటకు వివేకధుర్య!' 159

ప్రతిపదార్థం: వివేకధుర్య!= వివేకమనే భారం వహించే వాడా!; విశ్వ= సమస్తమైన; వేదరాశి= వేదసముచ్చయం యొక్క; సార= సారమైన; అధ్యాత్మవిద్య= బ్రహ్మవిద్యను; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; సకల= సమస్తమైన; రత్నపూర్ణ= రత్నాలతో నిండిన; సర్వ= సకలమైన; వసుంధరా చక్రదాన విధియున్= భూమిని దానం చేసే విధానం కూడా; సరి= సాటి; అనంగన్‌రాదు= అని చెప్పటానికి వీలుగాదు.

తాత్పర్యం: వివేకశాలీ! అన్ని వేదాల సారమైనది అధ్యాత్మవిద్య. దానిని దానం చేయటంతో సమస్తరత్న పూర్ణమైన భూమిని దానం చేసే విధికూడా సాటిరాజాలదు. బ్రహ్మవిద్య శ్రేష్ఠాతిశ్రేష్ఠమైన దని తాత్పర్యం'.

విశేషం: గీతలో భగవంతుడు 'అధ్యాత్మ విద్యా విద్యానాం' 'విద్యలలో నేను ఆధ్యాత్మవిద్యను' - అని చెప్పి అధ్యాత్మ విద్యా ప్రాశస్త్యాన్ని ప్రకటించాడు. ఇతర వస్తువుల వలన కలిగే సౌఖ్యం అల్పం. ఆత్మవిద్య అనల్పమైన ఆత్మసుఖాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి అధ్యాత్మవిద్యా ప్రదానం అన్ని దానాలకంటె మేలైనదని గ్రహించాలి.

వ. అని యుపదేశించి 'యింక నేమి వినవల?' తనిన శుకుండు 'దీనికంటె వినవలయునది గలదె? దీనిన సుదృఢంబుగా ననుగ్రహింపవే!' యనుటయు ననుకంపావిధేయుం డగు సాత్యవతేయుం డతని కిట్లనియె. 160

ప్రతిపదార్థం: అని ఉపదేశించి= ఈ విధంగా ఉపదేశం కావించి; ఇంకను= దీనికంటె అధికంగా; ఏమి వినన్ వలతు(వు)?= ఏమి వినవలెనని కోరుతున్నావు?; అనినన్= అని ప్రశ్నించే సరికి; శుకుండు= శుకయోగి; దీనికంటెన్= ఇంతకంటెను; వినవలయునది= వినదగింది; కలదె?= ఉన్నదా?; దీనిన్+అ= దీనినే; సుదృఢంబుగాన్= గట్టిగా నాకు బోధపడేటట్లు; అనుగ్రహింపవే= అనుగ్రహించుము; అనుటయున్= అనగా; అనుకంపా విధేయుండు+అగు= దయకు విధేయుడైన; సాత్యవతేయుండు= వ్యాసుడు; అతనికిన్= శుకుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: వ్యాసు డారీతిగా ఉపదేశించి 'ఇంకా ఏమి వినగోరుతున్నావు?' అని ప్రశ్నించాడు. శుకుడు 'దీనికంటె వినవలసిం దేముంది? ఈ విషయమే ఇంకా నా మనసులో దృఢంగా నాటుకొనేటట్లు బోధించుము' అని అడిగాడు. అప్పుడు దయావిధేయుడైన వ్యాసమహర్షి ఆ శుకుడిని చూచి ఇట్లా అన్నాడు.

క. భూతంబులఁ బచరించుచు । భూతాత్ముఁడు వానిఁ దన విభూతి నడంచున్.
భూతాహరణంబు నిజ । ద్యోతనము దదీయవృత్తి దుర్దశ పుత్రా! 161

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; భూత+ఆత్ముఁడు= భూతస్వరూపుడైన పరమాత్ముడు; భూతంబులన్= పంచభూతాలను; పచరించుచున్= ప్రవర్తింపజేస్తూ; వానిన్= ఆ భూతములను; తన విభూతిన్= తన విభూతిలో; అడంచున్= లీనంగావిస్తాడు; భూత+ఆహరణంబు= భూతాలను హరించటం; నిజద్యోతనము= తనను ప్రకాశింపజేయటం; తదీయవృత్తి= ఆ పరమాత్మయొక్క భూతాహరణమనే వర్తనం; దుర్దశ= (భూతాలకు) దుఃస్థితిగా ఉన్నది.

తాత్పర్యం: కుమారా! పరమాత్ముడు పంచభూతాలను, (ఆ భూతజన్యమైన చరాచరప్రాణికోట్లను) సృష్టికాలంలో ప్రవర్తింపజేస్తాడు. ప్రళయకాలంలో మళ్ళీ వాటిని తనలో విలీనం చేసికొంటాడు. ఈ రీతిగా సృష్టి స్థితి సంహారాత్మకమైన చర్య పరమాత్మవృత్తిగా జరిగిపోతున్నది. అతడి భూతాహరణ మనే చర్య భూతాలకు దుర్దశ.

క. అవయవము లెట్లు కూర్మము । నివిడించును లోని కడఁచు నెఱి నట్టుల భూ
తవితతి భూతాత్ముండును । ప్రవర్తన నివర్తనముల పాల్పడఁజేయున్. 162

ప్రతిపదార్థం: కూర్మము= తాబేలు; ఎట్లు= ఏ రీతిగా; అవయవములు= అంగాలు; నివిడించును= వెలుపలికి దోపజేయునో; నెటిన్= క్రమంగా; లోనికిన్= లోపలికి; అడఁచున్= ఉపసంహరించుకొనునో; అట్టులన్= అదే రీతిగా; భూత+ఆత్ముండును= భూతస్వరూపుడైన పరమాత్మకూడ; భూతవితతిన్= భూతసంతతిని; ప్రవర్తన నివర్తనముల= సృష్టి సంహారములయొక్క; పాల్పడన్= వశమమయ్యేటట్లుగా; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: తాబేలు తన అవయవాలనెట్లా వెలికి చూపి మరల లోనికి ముడుచుకొంటుందో అట్లాగే సకల భూతస్వరూపుడైన పరమాత్ముడు భూతాలను సృష్టించి మళ్ళీ తనలోనికి ఉపసంహరించుకొంటూ ఉంటాడు.

విశేషం: అలం: ఉపమ.

క. మాయాశబలుం డై యటు । సేయకపోరామి భూతసృష్టి యొనర్చున్
మాయఁ బెడఁబాప భూత ని । కాయాభావ మగు నదియ కవిజనముఖ్యా! 163

ప్రతిపదార్థం: కవిజనముఖ్యా!= యోగిజనులలో శ్రేష్ఠుడైనవాడా; మాయాశబలుండు+ఐ= (పరమాత్ముడు) మాయతో కూడినవాడై; అటు= ఆ రీతిగా; చేయకపోరామిన్= చేయకుండా ఉండటానికి వీలు లేకపోవటం వలన; భూతసృష్టి= భూతాలను ప్రవర్తింపజేయటాన్ని; ఒనర్చున్= చేస్తాడు; మాయన్= అవ్యక్తమైన ఆ మాయాశక్తిని; పెడఁబాపన్= వదలించగా; అదియ= అదే; భూతనికాయాభావము+అగున్= భూతసమూహాలయొక్క లేమి అవుతుంది.

తాత్పర్యం: యోగిజన శ్రేష్ఠుడవగు ఓ శుకుడా! పరమాత్ముడు మాయతో కూడినప్పుడే సృష్టి ప్రారంభమవుతుంది. అతడు మాయాయుక్తుడైన వేళలో భూతాలను సృష్టించకుండా ఉండలేడు కాబట్టి భూతసృష్టి జరుగుతున్నది. మళ్ళీ మాయను వదలగానే, ఆ స్థితి భూతాల అభావాన్ని సూచిస్తుంది. అంటే పరమాత్మ మాయావియోగం చెందినప్పుడు సృష్టి లేకుండా పోతుంది. భూతాల ఉనికి నశిస్తుంది.

తే. గగన పవనతేజో జలక్ష్మాగుణములు । సూవె శబ్దాదికంబును శ్రోత్రముఖ్య
కంబునై చెల్లు విషయచయంబు నింద్రి । యవ్రజంబును సర్వంబు నడఁచు శమము. 164

ప్రతిపదార్థం: గగనపవన తేజోజలక్ష్మాగుణములు= ఆకాశం, వాయువు, తేజస్సు, జలం, భూమి వీని గుణాలు; శబ్ద+ఆదికంబును= శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదు విషయాలును; శ్రోత్రముఖ్యకంబును= శ్రోత్రం, త్వక్కు, చక్షువు, జిహ్వా, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలును; ఐ చెల్లుచూవె!= అయిప్రవర్తిస్తుంది కదా!; శమము= మనోనిగ్రహం; విషయచయంబున్= శబ్దాదివిషయసంచయమును; ఇంద్రియవ్రజంబును= శ్రోత్రంమొదలైన ఇంద్రియ సమూహాన్ని; సర్వంబున్= సమస్తమును; అడఁచున్= శమింపజేస్తుంది.

తాత్పర్యం: శ్రోత్రం, శబ్దం ఆకాశముయొక్క గుణాలు. త్వక్కు, స్పర్శం, వాయువు యొక్క గుణాలు. జిహ్వా, రసం జలముయొక్క గుణాలు. ఘ్రాణం, గంధం పృథివీ భూతము యొక్క గుణాలు. ఈ రీతిగా పంచభూతాలనుండి పంచజ్ఞానేంద్రియాలు, పంచ విషయాలు జనించాయి. మనస్సును నిగ్రహించిన యోగి పూర్ణంగా ఇంద్రియాలను, విషయాలను నియమించగలుగుతాడు. కాబట్టి మనోనిగ్రహం ప్రధానమని భావం.

క. వినుమై దింద్రియములకును । మనంబు షష్ఠంబు; సప్తమత్వము బుద్ధిం
బనుగొను; భవ్యక్షేత్ర । జ్ఞునియం దష్టమత గల్గు సుగుణాభరణా! 165

ప్రతిపదార్థం: సుగుణ+ఆభరణా!= సద్గుణాలనే ఆభరణాలుగా కలవాడా!; వినుము= ఆలకించుము; ఐదు+ఇంద్రియములకును= శ్రోత్రము మొదలైన పంచజ్ఞానేంద్రియాలకు; మనంబు= మనస్సు; షష్ఠంబు= ఆరవది; సప్తమత్వము= ఏడవదన్నభావం; బుద్ధిన్= బుద్ధియందు; పనుగొనున్= కలుగుతుంది; భవ్యక్షేత్రజ్ఞుని అందున్= శ్రేష్ఠుడైన జీవుడియందు; అష్టమత= ఎనిమిదవదన్న భావం; కల్గున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: సుగుణాలంకారుడవగు ఓ శుకా! శ్రోత్రం మొదలైన ఐదుజ్ఞానేంద్రియాలు కలవు కదా! మనస్సు ఆరవది. బుద్ధి ఏడవదవుతుంది. క్షేత్రజ్ఞుడు అనే జీవుడు ఎనిమిదవవాడుగా పరిగణింపబడుతున్నాడు.

విశేషం: క్షేత్రమనగా శరీరము. క్షేత్రమును తెలిసినవాడు ఎవడో, వాడు క్షేత్రజ్ఞుడు. "ఇదం శరీరం కౌన్తేయ ! క్షేత్రమి త్యభిధీయతే, ఏత ద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః; అని క్షేత్రజ్ఞ లక్షణము భగవద్గీతలో వివరించబడింది.

తే. తలఁచు మనమందు నిశ్చయదశ యొనర్చు । బుద్ధి సర్వైక సాక్షిత్వమున వెలుంగు
నంతరాత్ముండు క్షేత్రజ్ఞుఁ డనఁగ వాని । మెఱపు సత్త్వాదిగుణములై మెఱయు వత్స! 166

ప్రతిపదార్థం: వత్స!= కుమారా!; తలఁచు= సంకల్ప వికల్పములు గావించునట్టి; మనమందున్= మనస్సునందు; బుద్ధి= అంతఃకరణ చతుష్టయంలో రెండవదైన బుద్ధి; నిశ్చయదశ యొనర్చున్= నిశ్చయావస్థను నిర్వహిస్తుంది; అంతరాత్ముండు= అంతరాత్మయగు; క్షేత్రజ్ఞుఁడు= జీవుడు; సర్వైకసాక్షిత్వమునన్= అంతటికీ ముఖ్యమైన సాక్షీభావంతో; వెలుంగున్= ప్రకాశించును; వాని మెఱపు= వాడి ప్రకాశం; సత్త్వాదిగుణములు+ఐ= సత్త్వం మొదలైన గుణాలుగానై; మెఱయున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: కుమారా! మనస్సు సంకల్ప వికల్పాలుచేస్తూ ఉంటుంది. ఆ దశలో నిశ్చయం చేసేది బుద్ధి. అంతరాత్ముడైన వాడు క్షేత్రజ్ఞుడనబడి అంతటికీ ఏకైక సాక్షిగా ప్రకాశిస్తూ ఉంటాడు. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు రూపంతో ప్రకాశించే ఆ క్షేత్రజ్ఞుడి ప్రకాశమే.

విశేషం: క్షేత్రజ్ఞుడనగా జీవుడని కొందరు, పరమాత్ముడని కొందరు వివరించి ఉన్నారు. అవిద్య తొలగి జీవత్వము నశించినపుడు జీవుడే పరమాత్ముడుగా భాసిస్తాడని అద్వైతవేదాంతము చెప్పుతున్నది. ద్వైతులు పరమాత్మకంటె జీవుడు వేరుగా ఉండునని నిర్ణయించారు.

తే. స్వస్థతయు దుఃస్థతయు జడత్వమును గ్రమవి । గణన సత్త్వరజస్తమోగుణము లవి స
మీరితములగు టడఁగుట యింద్రియంబు । లడరు టొడుఁగుట బుద్ధి కృత్యములు పుత్ర! 167

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; స్వస్థతయున్= హాయిగా ఉండి సుఖించే స్వభావం; దుఃస్థతయున్= దుఃఖానికి గురి యయి బాధపడే లక్షణం; జడత్వమును= బుద్ధి మాంద్యమున్ను; క్రమవిగణనన్= క్రమంగా; సత్త్వరజస్తమోగుణములు= సత్త్వగుణం, రజోగుణం, తమోగుణము లగును; అవి= ఆ గుణాలు; సమీరితములు+అగుట= ప్రేరితములు కావటం; అడఁగుట= శమించటం; ఇంద్రియంబులు= ఇంద్రియాలు; అడరుట= ప్రేరణ పొందటం; ఒడుఁగుట= శమించటం; బుద్ధికృత్యములు= బుద్ధిచేసే పనులు.

తాత్పర్యం: కుమారా! ప్రసన్నచిత్తుడై సుఖించటం సత్త్వగుణస్వభావం. దుఃఖంతో పరితపించటం రజోగుణ లక్షణం. అలసుడై బుద్ధిమాంద్యం కలిగి ఉండటం తమోగుణ లక్షణం. ఆయా గుణాలు, తదనుగుణంగా ఆయా ఇంద్రియాలు ప్రేరణ పొందటం, తర్వాత శమించటం అనేవి బుద్ధివలన కలిగే పనులు.

విశేషం: సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలు ప్రకృతి సంభవాలు. అవి జీవుడిని దేహంలో బంధిస్తాయి. వీటి లక్షణాలు భగవద్గీతలోని పదునాల్గవ అధ్యాయంలో విపులంగా నిరూపించబడ్డాయి.

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।

జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయ త్యుత! (గీత - 14-9) ఇత్యాదిగా సత్త్వం సుఖహేతువనీ, కర్మకారణమైన రజస్సు దుఃఖహేతువనీ, తమస్సు ప్రమాదహేతువనీ భగవద్గీత వివరించింది.

తే. అనఘ! యింద్రియములు విషయములు మనసు । బుద్ధియును నాత్మయును గ్రమంబునన యెక్కు;
డాత్మ బుద్ధి యనంగ నల్పాంతరంపు । వస్తువులు బుద్ధి యిన్నింట విస్తరిలుట. 168

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇంద్రియములు= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు; విషయములు= శబ్దం మొదలైన విషయాలు; మనసు= చిత్తం; బుద్ధియును= బుద్ధీ; ఆత్మయును= ఆత్మా - ఇవి; క్రమంబునన్+అ= క్రమంగానే; ఎక్కుడు= ఒకదానికంటె ఒకటి శ్రేష్ఠమైనవి.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ శుకుడా! ఇంద్రియాలకంటె విషయాలు, విషయాలకంటె చిత్తం, చిత్తంకంటె బుద్ధి, బుద్ధికంటె ఆత్మ - క్రమక్రమంగా శ్రేష్ఠములైనవి. ఆత్మకూ, బుద్ధికీ పెద్ద తేడా లేదు. బుద్ధి అన్నింటిలోనూ వ్యాపించి ఉంటుంది. కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇంద్రియేభ్యః పరా హ్యర్థా । అర్థేభ్యశ్చ పరం మనః ।
మనసశ్చ పరా బుద్ధిః । యో బుద్ధేః పరతస్తు సః ॥ (కఠశ్రుతి -1-3-10)

అనే శ్రుతి కూడ పైపద్యంలో చెప్పిన రీతిగా ఇంద్రియాదులు ఒకదానికంటె ఒకటి శ్రేష్ఠమైనవని నిరూపించింది.

క. కనుఁ గన్నె వినుఁ జెవియై । కొనుఁ జవి జిహ్వ యయి మూరుకొను నాసికయై,
తనువై స్పర్శము గైకొను । ననవద్యా! బుద్ధి యాత్మయంద నిలుచుచున్. 169

ప్రతిపదార్థం: అనవద్యా!= దోషరహితుడా!; బుద్ధి= అంతఃకరణచతుష్టయంలో రెండవదగు బుద్ధి; ఆత్మ+అంద= క్షేత్రజ్ఞుడైన అంతరాత్మయందే; నిలుచుచున్= నిలుస్తూ; కన్ను+ఐ= నేత్రమై; కనున్= చూస్తుంది; చెవి+ఐ= శ్రోత్రమై; వినున్= వింటుంది; జిహ్వ+అయి= నాలుకై; చవిన్= రసమును; కొనున్= గ్రహిస్తుంది; నాసిక+ఐ= ఘ్రాణమై; మూరుకొనున్= వాసన చూస్తుంది; తనువు+ఐ= శరీరమై; స్పర్శమున్= తాకిడిని; కైకొనున్= స్వీకరిస్తుంది.

తాత్పర్యం: దోషరహితుడవైన ఓ శుకా! సర్వవ్యాపిని అయిన బుద్ధి ఆత్మలో ఉంటూ నేత్రమై రూపాన్ని చూస్తుంది. చెవిగా మారి శబ్దాన్ని వింటుంది. నాలుకగా రూపొంది రసాన్ని గ్రహిస్తుంది. ముక్కై గంధాన్ని ఆఘ్రాణిస్తుంది. శరీరంలోని చర్మమై స్పర్శను స్వీకరిస్తుంది.

క. ప్రీతిం గడుఁ బొందలు విషా । దాతురతన్ స్రుక్కుఁ దద్వ్యయము లేక సమ
త్వాతిశయంబున నిలుచును । నేతృత్వంబునను బుద్ధి నెఱపు గుణములన్. 170

ప్రతిపదార్థం: బుద్ధి= అంతటా వ్యాపించిన ఈ బుద్ధి; ప్రీతిన్= సంతోషంతో; కడున్= మిక్కిలిగా; పొందలున్= ప్రవర్తిస్తుంది; విషాదాతురతన్= దుఃఖపీడితత్వంతో; స్రుక్కున్= వగజెందుతుంది; తద్వ్యయములేక= ఆ సంతోష విషాదాలు రెండూ లేక; సమత్వాతిశయంబునన్= సమభావముయొక్క అతిశయమునందు; నిలుచును= స్థిరపడుతుంది; నేతృత్వంబునను= నాయకత్వగుణముచేత; గుణములను= సత్త్వాదిగుణాలను; నెఱపున్= వ్యాపింపజేస్తుంది.

తాత్పర్యం: బుద్ధి ఒక సమయంలో సంతోషాతిశయంతో ఉప్పొంగిపోతుంది. ఇంకొక సమయంలో దుఃఖంతో క్రుంగిపోతుంది. సంతోషవిషాదాలు రెండూ లేక సమభావంతో ఉంటూ ఒక్కొక్క సారి స్థైర్యం వహించి ఉంటుంది. గుణాలకు తాను నాయకత్వం పూని వాటిని తన యిచ్చవచ్చినట్లు ప్రవర్తింప జేస్తుంది.

ఆ. తత్స్వభావ మెఱిఁగి తా నింద్రియాది స । ప్తకము వెంటఁ బోక తన్నుఁ గనుచు,
నున్న వానిఁ బొందనోపునె దుఃఖదై । న్యంబు సుఖమదంబు నప్రమత్త! 171

ప్రతిపదార్థం: అప్రమత్త!= ఏమరుపాటు లేనివాడా!; తత్స్వభావము= ఆ బుద్ధియొక్క స్వభావమును; ఎఱిఁగి= గ్రహించి; తాను= సాధకుడు; ఇంద్రియాది సప్తకము వెంటన్= ఇంద్రియాలు మొదలైన యేడింటి వెనుక; పోక= పోకుండా; తన్నున్= తనను; కనుచున్= చూస్తూ; ఉన్నవానిన్= ఉన్నట్టి వానిని; దుఃఖదైన్యంబు= దుఃఖమనే దీనత్వం గానీ; సుఖమదంబు= సుఖమనే గర్వంగానీ; పొందన్+ఓపునె?= చేరగలవా?

తాత్పర్యం: జాగరూకుడవైన ఓ శుకుడా! పైన చెప్పిన రీతిగా ఉండే బుద్ధియొక్క స్వభావాన్ని గ్రహించి సాధకుడైన మానవుడు పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి - వీటిని అనుసరించరాదు. తనలో తనను చూచుకొంటూ బాహ్యపదార్థాలపై భ్రాంతి వదలి ఉండాలి. అట్లా ఉన్నవాడిని సుఖదుఃఖాలు చెనకలేవు. అంటే అతడికి దుఃఖంవలన దీనత్వమూ, సుఖం వలన మదమూ కలుగవు. (సుఖదుఃఖాలకు అతీతమైన స్థితిలో అత డుంటా డని భావం).

ఆ. జలములందు నిలిచి జలపక్షి మునుఁగదు; । మేడిపండు మశకపీడఁ బొరయ;
దట్ల విషయసమితియందుఁ దానది దన । యందు నుండి వికృతి నొంద దాత్మ.' 172

ప్రతిపదార్థం: జలపక్షి= నీటిపక్షి; జలములందున్= నీళ్ళలో; నిలిచి= నిలబడి; మునుఁగదు= మునిగిపోదు; మేడిపండు= అత్తిపండు; మశకపీడన్= దోమబాధను; పొరయదు= పొందదు; అట్ల= అదే రీతిగా; ఆత్మ= క్షేత్రజ్ఞుడైన అంతరాత్మ; విషయసమితి+అందున్= శబ్దాదివిషయసముదాయ మందును; అది= ఆ విషయ సమూహం; తన+అందున్= ఆ యాత్మలోనూ; ఉండున్= ఉంటుంది; వికృతిన్= వికారమును; ఒందదు= పొందదు.

తాత్పర్యం: నీటిపక్షి నీటిలోఉన్నా మునిగిపోదు. అత్తిపండులో ఎన్ని పురుగులున్నా వాటివలన ఆ పండు బాధింపబడదు. అదే రీతిగా ఆత్మ విషయాలలో ఉన్నా, ఆత్మలో విషయాలున్నా - ఆత్మకు వికారం కలుగదు.

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి మఱియును. 173

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; చెప్పి= వచించి; మఱియును= మరల.

తాత్పర్యం: వ్యాసుడు శుకుడితో ఈ రీతిగా చెప్పాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుము మూర్ణనాభి తంతువు । జనియింపఁగఁ జేసినట్లు సత్త్వగుణము సం
జనకం బగు నది పురుషుఁడు । గనుట యుదాసీనతన వికారము గలదే? 174

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; ఊర్ణనాభి= సాలెపురుగు; తంతువున్= దారమును; జనియింపఁగన్+చేసినట్లు= సృష్టించినట్లే; సత్త్వగుణము= సత్త్వమనే గుణం; సంజనకంబు+అగున్= జ్ఞానాదులకు కారణమవుతుంది; అది= ఆ స్థితిని; పురుషుఁడు= ఆత్మ; కనుట= చూడటం; ఉదాసీనతన్+అ= ఔదాసీన్యంతోనే; వికారము= వికృతి; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: సాలెపురుగు తనలోనుండి దారమును సృష్టించినట్లే సత్త్వాదిగుణాలు జ్ఞానసుఖ దుఃఖాదులు కలిగిస్తున్నాయి. పురుషుడు ఉదాసీనుడై ఈ స్థితిని చూస్తూ ఉంటాడు. అందువలన అతడికి వికారం కలగదు.

విశేషం: 'సత్త్వము గుణసంజనకంబగు' అను పాఠాంతరము కలదు. ఆ పాఠమును స్వీకరిస్తే 'గుణ' శబ్దానికి విషయాలు అని అర్థం చెప్పాలి. సత్త్వాదిగుణాలు విషయాలను కలిగిస్తుంటాయి అని భావం. సాలెపురుగు దారాన్ని తనలోనుండే సృష్టిస్తుంది. అందుకై బాహ్య పదార్థాలను గ్రహించదు. అట్లే సత్త్వాదులు విషయాలకు అభిన్న నిమిత్తోపాదాన కారణాలవుతున్నాయని తెలిసికొనాలి.

ఆ. ఆదినిధనరహితుఁ డగు నిరంజనుఁ జెంది । గుణము లెడల విడిచి, క్రోధలోభ
ములకుఁ జొరవ యీని ముని హృదయగ్రంథి । విరియ నడఁచి మోక్ష విభవ మొందు. 175

ప్రతిపదార్థం: ఆది నిధన రహితుఁడు+అగు= మొదలు తుదిలేని (జననమరణాలు లేని); నిరంజనున్= పరమాత్మను; చెంది= పొంది; గుణములు= సత్త్వాదిగుణాలను; ఎడలన్ విడిచి= తొలగిపొయ్యేటట్లు వదలిపెట్టి; క్రోధలోభములకున్= కోపానికీ లోభానికీ; చొరవ ఈని= అవకాశం ఇవ్వని; ముని= మౌని; హృదయగ్రంథిన్= చిత్త గ్రంథిని; విరియన్+అడఁచి= నశింపజేసి; మోక్షవిభవము= ముక్తి సంపదను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పరమాత్మ ఆద్యంతాలు (జనన మరణాలు) లేనిది. అట్టి దాని నాశ్రయించి సత్త్వాది గుణాలను వదలి, కోపలోభాలను త్యజించిన ముని తన హృదయంలోని కామాదులకు జన్మస్థానమైన ముడిని నశింపజేసి మోక్షవైభవం పొందుతాడు.

క. శమసంపద బ్రాహ్మణ జ । న్మమునకు సామగ్ర్య మవ్వినయసారము చి
త్తమున కలవడ్డ మునికి భ । యము శోకము మదము హర్ష మనునివి గలవే? 176

ప్రతిపదార్థం: బ్రాహ్మణ జన్మమునకున్= విప్రుడియొక్క పుట్టుకకు; శమసంపద= ఆత్మనిగ్రహమనే ఐశ్వర్యం; సామగ్ర్యము= సర్వస్వమై ఉన్నది; ఆ+వినయసారము= ఆ వినయముయొక్క బలిమి; చిత్తమునకున్= మనస్సుకు; అలవడ్డ= అలవడిన; మునికిన్= మౌనికి; భయము= భీతి; శోకము= దుఃఖం; మదము= గర్వం; హర్షము= సంతోషం; అనునివి= అనబడేవి; కలవే?= ఉన్నవా?

తాత్పర్యం: బ్రాహ్మణుడై పుట్టినవాడికి ఆత్మనిగ్రహమనే సంపత్తే సర్వస్వం. అట్టి వినయబలం హృదయానికి అలవడిన మునీంద్రుడికి భయం, శోకం, మదం, సంతోషం అనేవి లేవు.

క. శమనిరతియు నాత్మ జ్ఞా । నముఁ జువ్వే బుధ లక్షణంబులు పర్యా
ప్తము లివి రెండు నరయ మో । క్షము సాధించుటకు వేఱ కల్పన లేలా?' 177

ప్రతిపదార్థం: శమనిరతియున్= చిత్త నిగ్రహంలో ఆసక్తియు; ఆత్మజ్ఞానమున్= ఆత్మను గూర్చిన తెలివియూ; బుధ లక్షణంబులు చువ్వే= ఆత్మజ్ఞుడైనవాని లక్షణములై ఉన్నవి; అరయన్= పరిశీలించగా; ఇవి రెండు= ఈ చెప్పిన రెండు లక్షణాలును; మోక్షమున్= ముక్తిని; సాధించుటకున్= వశం చేసికొనటానికి; పర్యాప్తములు= చాలిఉన్నవి; వేఱ= అన్యములైన; కల్పనలు+ఏలా?= సాధనములు ఎందుకు?

తాత్పర్యం: చిత్తనిగ్రహం, ఆత్మజ్ఞానం - అనేవి ప్రబుద్ధుడైన వాడి లక్షణములై ఉన్నవి. మోక్షం సాధించటానికి ఈ రెండు లక్షణాలే చాలి ఉన్నవి. వేరే సాధనలకై ప్రయాసపడ నవసరం లేదు.

వ. అనినవిని శుకుండు 'ధర్మంబులకెల్లఁ బరమంబయిన ధర్మంబెఱిఁగింపవే!' యనుటయు వాత్సల్యపరాయణుండగు నబ్బాదరాయణుండు 'సనాతనంబును, మునిసత్తమ సంస్తుత్యంబును నగునుత్తమ ధర్మంబు సెప్పెద; నేకాగ్రచిత్తుండ వయి యాకర్ణింపు'మని పలికి యిట్లనియె. 178

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; శుకుండు= శుకయోగి; ధర్మంబులకున్+ఎల్లన్= సమస్త ధర్మాలలోను; పరమంబు= శ్రేష్ఠం; అయిన ధర్మంబు= ఐన ధర్మాన్ని; ఎఱిఁగింపవే= తెలుపవే; అనుటయున్= అనేసరికి; వాత్సల్యపరాయణుండు+అగు= పుత్రస్నేహపరుడైన; ఆ+బాదరాయణుండు= ఆ వ్యాసుడు; సనాతనంబును= పురాతన మైనదీ; మునిసత్తమసంస్తుత్యంబును+అగు= మునిశ్రేష్ఠులచేత స్తుతించదగినదీ అయిన; ఉత్తమధర్మంబున్= శ్రేష్ఠధర్మమును; చెప్పెదన్= వివరిస్తాను; ఏక+అగ్రచిత్తుండవు+అయి= సమాహిత మనస్సు గలవాడవై; ఆకర్ణింపుము+అని= వినుమని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా వచించాడు.

తాత్పర్యం: ఈ విధంగా వ్యాసుడు చెప్పగా విని శుకయోగీంద్రుడు 'అన్ని ధర్మాలలోనూ శ్రేష్ఠమైన ధర్మ మేదో తెలియచెప్పు' మని అడిగాడు. అంతట పుత్రస్నేహపరుడైన ఆ పారాశర్యుడు 'పురాతనమూ, మునులచేత శ్లాఘ్యమూ అయిన శ్రేష్ఠధర్మాన్ని వివరిస్తాను, ఏకాగ్రమైన మనస్సుతో వినుము అని చెప్పి ఇట్లా అన్నాడు:

ఇంద్రియనిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట (సం. 12-242-1,2)

తే. 'ఎల్లకడలకు వెలువడు నింద్రియముల । బాలపుత్రులఁ దండ్రియుఁ బోలె నాఁగు
మవియు మనమును నిశ్చలైకాగ్రభావ । మొందు టుత్తమ తప మది యుజ్జ్వలాత్మ! 179

ప్రతిపదార్థం: ఉజ్జ్వల+ఆత్మ!= ప్రకాశమానమైన బుద్ధిగలవాడా!; ఎల్లకడలకున్= అన్ని దిశలకు; వెలువడు= ప్రసరిస్తున్న; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; బాలపుత్రులన్= బాలురైన కుమారులను; తండ్రియున్+పోలెన్= తండ్రివలె; ఆఁగుము= నిగ్రహించుము; అవియున్= ఆ ఇంద్రియములు; మనమును= చిత్తమును; నిశ్చల+ఏక+అగ్రభావము+ఒందుట= కదలికలేని ఏకాగ్రతను పొందటం; అది ఉత్తమతపము= అది శ్రేష్ఠమైన తపస్సు.

తాత్పర్యం: ఉజ్జ్వలమైన బుద్ధిగలవాడా! అన్ని దిక్కులకూ పరుగిడే చిన్న పిల్లలను తండ్రి ఏ విధంగా పట్టి నిలవేస్తాడో, అట్లాగే అన్ని దిశలకూ ప్రసరించే శ్రోత్రాదులైన ఇంద్రియాలను నిగ్రహించుము. ఆ ఇంద్రియాలూ, మనస్సూ కదలిక లేనివై ఏకాగ్రత్వం పొందటమనేదే మేలైన తపస్సు అవుతుంది.

క. అది ధర్మంబుల కెల్లం । దుది యగు ధర్మంబు; మనసుతో దానిఁ దగం
గుదియించి మేధతోడం । గదియింపుము నియతిఁ బుత్ర! కడుగాఢముగన్. 180

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; అది= ఆ ఇంద్రియనిగ్రహం; ధర్మంబులకున్+ఎల్లన్= సమస్త ధర్మాలలోను; తుదిఅగు= చివరిదగు (శ్రేష్ఠమగు); ధర్మంబు= ధర్మం; మనసుతోన్= చిత్తంతో; దానిన్= ఆ ధర్మమును; తగన్= చక్కగా; కుదియించి= సంలగ్నం చేసి; నియతిన్= నియమంతో; కడు గాఢముగన్= మిక్కిలి గట్టిగా; మేధతోడన్= బుద్ధితో; కదియింపుము= చేర్చుము.

తాత్పర్యం: కుమారా! ఆ ఇంద్రియసంయమనం ధర్మాలలో కెల్లా మేలైన ధర్మం. నీ మనస్సుతో ఆ ధర్మాన్ని సంసక్తం కావించుము. నియమంతో గట్టిగా దానిని బుద్ధితో చేర్చుము.

తే. ఇంద్రియంబుల నాఱింటి నిట్లు విషయ । ములకు నొలయక యుండంగ నిలువరించి'
తలఁపు లుడిగి, తేనియఁ బ్రమదమున నాను । భంగిఁ దృప్తుఁడవై యుండు పరముఁ గాంతు.' 181

ప్రతిపదార్థం: ఆటింటిన్= ఆరైన; ఇంద్రియములన్= మనస్సుతో కూడిన జ్ఞానేంద్రియాలను; విషయములకున్= శబ్దాదులైన విషయాలకు; ఒలయక ఉండంగన్= చేరకుండా ఉండేటట్లు; నిలువరించి= నిలిపి; తలఁపులు= సంకల్పాలు; ఉడిగి= వదలి; ప్రమదమునన్= సంతోషంతో; తేనియన్= మకరందాన్ని; ఆనుభంగిన్= త్రాగేటట్లు; తృప్తుడవై ఉందు= తృప్తి పొందిన వాడవై ఉంటావు; పరమున్= బ్రహ్మమును; కాంతు= చూస్తావు.

తాత్పర్యం: నీవు శ్రోత్రం మొదలగు ఐదు జ్ఞానేంద్రియాలను, మనస్సును శబ్దాది విషయాలవైపు పోనీయకుండా నిలుపుము. సంకల్పాలు వదలు. అట్లా చేస్తే సంతోషంతో తేనె నాస్వాదించేవిధంగా తృప్తి పొందుతావు. పరతత్త్వమును సాక్షాత్కరించుకొంటావు'.

వ. అని వెండియు. **182**

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి వ్యాసుడు మళ్ళీ (ఈ క్రింది విధంగా అన్నాడు.)

చ. 'తన కుసుమంబులన్ ఫలవితానము మూర్కొన నాన మ్రాను నే
రని క్రియఁ గాన నేరదు పరం బగు తత్త్వము నైజభంగి వి
న్ననువున నంతరాత్మ గను నైష్ఠికతం గను; మింతవట్టుఁ బా
మెనసిన తోలు వాయుక్రియ నీవు దొఱంగుదు పాపపుంజమున్. **183**

ప్రతిపదార్థం: మ్రాను= చెట్టు; తన కుసుమంబులన్= తన పూలను; ఫలవితానమున్= పండ్ల సమూహాన్ని; మూర్కొనన్= ఆఘ్రాణించటానికీ; ఆనన్= ఆస్వాదించటానికీ; నేరని క్రియన్= అభ్యసించనట్లే; పరంబు+అగు= శ్రేష్ఠమైన; తత్త్వము= బ్రహ్మతత్త్వం; నైజభంగిన్= తానుగా తన స్వరూపాన్ని; కానన్ నేరదు= గ్రహించజాలదు; విన్ననువునన్= నేర్పుతో; అంతరాత్మన్= పరమాత్మను; కను నైష్ఠికతన్= చూచేనిష్ఠా పరత్వమును; ఇంతవట్టు= ఇంతమాత్రం; కనుము= పొందుము; పాము= సర్పం; ఎనసిన= తనను పొందిన; తోలు= చర్మమును; పాయుక్రియన్= వదలిపెట్టే రీతిగా; నీవు పాపపుంజమున్= నీవు పాపసమూహాన్ని; తొఱంగుదు= వర్జిస్తావు.

తాత్పర్యం: వృక్షం తన పూలను తాను వాసన చూడలేదు. తన పండ్లను తాను ఆస్వాదించజాలదు. అట్లాగే తత్త్వం తనకు తానుగా తన స్వరూపమును గ్రహించలేదు. నీవు నేర్పుతో అంతరాత్మను సాక్షాత్కరించుకొనేందుకు చాలినంత నిష్ఠాపరత్వమును పొందుము. అట్లా చేస్తే పాము కుబుసాన్ని వర్జించినట్లు నీవు పాపసంచయాన్ని వర్జిస్తావు.

విశేషం: అలంకారం: ఉపమ.

వ. ఇవ్విధంబున శాంతి నొంది యవ్యక్త సంభవయు, సంకల్పకూలయుఁ, క్రోధపంకయు, నింద్రియగ్రాహయుఁ, గామభుజంగయు, మోహ తృణచ్ఛన్నయు, సంసారసాగర గామినియు నై ఘోరప్రకార యగుచు నకృతాత్ములకుం గడవరాని యట్టి లోభవాహిని సత్యతీర్థంబున నుత్తరించి. **184**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; శాంతిన్+ఒంది= శమమును పొంది; అవ్యక్త సంభవయున్= తెలియరాని పుట్టుక గలదియు; సంకల్పకూలయున్= తలపు లనే గట్టుకలదియు; క్రోధపంకయున్= కోపమనే బురద కలదియు; ఇంద్రియగ్రాహయున్= ఇంద్రియాలనే మొసళ్ళు గలదియు; కామభుజంగయున్= కోరికలనే పాములు గలదియు; మోహతృణచ్ఛన్నయున్= మోహమనే గడ్డితో కప్పబడినదియు; సంసారసాగరగామినియున్+ఐ= సంసార మనే సముద్రంలో ప్రవేశించేదియునై; ఘోరప్రకార= భయంకర

విధానంగలది; అగుచున్= అవుతూ; అకృత+ఆత్ములకున్= వివేకంలేని వారికి; కడవన్‌రాని అట్టి= దాటవీలుగానిదైన; లోభవాహిని= లోభ మనే నదిని; సత్యతీర్థంబునన్= సత్యమనే ఉపాయంతో; ఉత్తరించి= దాటి.

తాత్పర్యం: ఈ చెప్పిన పద్ధతిలో అంతరాత్మను సాక్షాత్కరించుకొని శాంతిని పొందాలి. లోభ మనేది ఎక్కడ ఎప్పుడు ఎట్లా పుట్టిందో తెలియదు. సంకల్పాలే దానికి గట్లు. క్రోధమే దానిలోని బురద. ఇంద్రియాలే అందలి మొసళ్ళు. కోరికలే అందులో పాములు. అది మోహమనే గడ్డితో కప్పబడి ఉంటుంది. సంసారసాగరంలో ప్రవేశిస్తుంది. అట్లా భయంకరంగా ఉన్న ఆ నదిని వివేకంలేని వారు దాటలేరు. సత్యమనే ఉపాయంతో దానిని దాటాలి. అట్లా దాటి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలంకారం: రూపకం.

క. సుత! నీవు సుప్రసన్నా । త్మతఁ బొంది నగాగ్రగతుఁడు మహివారలఁ జూ
చుతెఱంగున నీ భూత । ప్రతతిం గనుఁగొనుచునుండు పరితృప్తుఁడవై. 185

ప్రతిపదార్థం: సుత!= కుమారా!; నీవు సుప్రసన్న+ఆత్మతన్= నీవు నిర్మలాత్మత్వమును; పొంది= చెంది; నగ+అగ్రగతుఁడు= కొండకొననున్నవాడు; మహివారలన్= భూమిపైన ఉన్నవారిని; చూచుతెఱంగునన్= చూచేవిధంగా; ఈ భూతప్రతతిన్= ఈ ప్రాణిసమూహాన్ని; కనుఁగొనుచున్= చూస్తూ; పరితృప్తుఁడవు+ఐ ఉండు= తృప్తి పొందినవాడవై ఉండుము.

తాత్పర్యం: కుమారా! నీవు పై రీతిగా లోభమనేనదిని దాటి నిర్మలాత్మతను పొందుము. కొండపై నున్న వాడు భూమిమీద నున్నవారినెట్లా చూస్తాడో, అట్లాగే ఈ ప్రాణులను దర్శించుము. అట్లా చూచి సంతృప్తి వహించి ఉండిపొమ్ము.

విశేషం: అలం:

క. శాంతము ధర్మప్రచయం । బంతటికి విశిష్ట మిమ్మహావిద్య మదీ
యాంతఃకరణము సాక్షిగ । నెంతయు సంప్రీతి నీకు నిచ్చితిఁ బుత్రా!' 186

ప్రతిపదార్థం: ధర్మప్రచయంబు= ధర్మవర్గం; అంతటికిన్= మొత్తానికి; విశిష్టము= శ్రేష్ఠం; పుత్రా!= కుమారా!; మదీయ+అంతఃకరణము= నా అంతరింద్రియం; సాక్షిగన్= సాక్ష్యం వహించేది కాగా; ఎంతయున్= మిక్కిలి; సంప్రీతిన్= ప్రేమతో; ఈ+మహావిద్య= ఈ గొప్పదైన ఆధ్యాత్మిక విద్యను; నీకున్+ఇచ్చితిన్= నీకు ఇచ్చాను.

తాత్పర్యం: వత్సా! నే నిప్పుడు నీకు చెప్పిన ధర్మాలన్నిటిలోనూ ఇంద్రియనిగ్రహ రూపమైన శాంత మనే ధర్మం మిక్కిలి విశిష్టమైనది. నా అంతఃకరణం సాక్షిగా నీకు నేను ఎంతో ప్రేమతో ఈ శ్రేష్ఠమైన బ్రహ్మవిద్యను బోధించాను'.

వ. అని యి ట్లుపదేశించి పరమసంవిదేకాయనుండగు కృష్ణద్వైపాయనుండు కృతార్థీభూత చేతస్కుండగు నందను ప్రతిపత్తికి నభినందన విశేషంబుగా నధ్యాత్మవిద్యా విలాస విషయంబులగు వాక్యంబులు మఱియు ననుగ్రహించె; వానిం జెప్పెద. 187

ప్రతిపదార్థం: అని యిట్లు+ఉపదేశించి= అని ఈ రీతిగా బోధించి; పరమసంవిదేకాయనుండు+అగు= బ్రహ్మజ్ఞానానికి ముఖ్యస్థానమైన; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; కృతార్థీభూత చేతస్కుండు+అగు= కృతకృత్యమైన మనస్సు గలవాడైన;

నందను= కుమారుని యొక్క; ప్రతిపత్తికిన్= తెలివికి; అభినందన విశేషంబుగాన్= మెచ్చుకొనే పద్ధతిగా; మఱియున్= మరలకూడా; అధ్యాత్మవిద్యావిలాస విషయంబులు+అగు= బ్రహ్మవిద్యా విలాసానికి సంబంధించినవైన; వాక్యంబులు= మాటలు; అనుగ్రహించెన్= ప్రసాదించాడు; వానిన్= ఆ మాటలను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానైక నిలయుడైన వ్యాసమహర్షి ఈ విధంగా ఉపదేశించేసరికి శుకుడు కృతకృత్యతతో ధన్యుడయ్యాడు. అతడి తెలివిని అభినందిస్తూ వ్యాసుడు మళ్ళీ అతడికి ఆత్మవిద్యను వివరించే కొన్ని మాటలు చెప్పాడు. ఆ మాటలు చెప్పుతాను.

క. 'వేదములుఁ దదంగములు స । మాదరమునఁ జదివినను సుయజమానత్వా
పాదకుఁ డైనను బ్రాహ్మణ । తాదశ దక్కునె ప్రశాంతిఁ దక్కఁ గుమారా! 188

ప్రతిపదార్థం: కుమారా!= పుత్రా!; ప్రశాంతిన్+తక్కన్= ప్రశమంచేత తప్ప; వేదములు= శ్రుతులు; తదంగములు= వేదాంగములు; సమాదరమునన్= ప్రీతితో; చదివినను= పఠించినను; సుయజమానత్వ+ఆపాదకుఁడు+ఐనను= మంచి యజ్ఞకర్తృత్వం పొందినవాడైనా; బ్రాహ్మణతాదశ= బ్రాహ్మణత్వస్థితి; తక్కునె?= లభిస్తుందా?

తాత్పర్యం: వత్సా! బ్రాహ్మణత్వం అనేది ప్రశాంతిచేత మాత్రమే ప్రాప్తిస్తుంది. నాలుగువేదాలు, ఆరువేదాంగాలు (శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - అనేవి) చదివినా సిద్ధించదు. అట్లే యజ్ఞాలు చేసి మంచి యజమానుడుగా పేరు పొందినప్పటికీ బ్రాహ్మణత్వ స్థితి లభించదు.

క. ఒరులకుఁ దా వెఱవక తన । కొరులు వెఱవకుండునట్టి యొప్పిదు సమతం
బిరమైన నడవడిం గల । పరిణతచిత్తుండు సూవె బ్రాహ్మణుఁ డనఘా! 189

ప్రతిపదార్థం: అనఘా!= కల్మషరహితుడా!; ఒరులకున్= పరులకు; తాన్= తాను; వెఱవక= భయపడక; తనకున్+ఒరులు= తనకు పరులు; వెఱవక= భీతిల్లక; ఉండునట్టి= ఉన్నట్టి; ఒప్పిదు= విరాజిల్లెడు; సమతన్= సమభావంతో; తిరము+ఐన= స్థిరమైన; నడవడిన్= ప్రవర్తనను; కల= కలిగి ఉండు; పరిణతచిత్తుండు= పరిపక్వమైన మనస్సు కలవాడు; బ్రాహ్మణుఁడు సూవె!= విప్రుడగునుగదా!

తాత్పర్యం: పాపరహితుడా! ఎవడు ఇతరులకు తాను భయపడడో, ఎవరివలన ఇతరులు భీతిచెందరో, అట్టి సమదృష్టితో స్థిరమైన ప్రవర్తన కలిగిఉండే పరిపక్వమైన హృదయం కలవాడే బ్రాహ్మణు డనబడతాడు.

విశేషం: యస్మాన్నోద్విజతే లోకో । లోకా న్నోద్విజతే చ యః
హర్షామర్షభయోద్వేగైః । ముక్తో య స్స చ మే ప్రియః ॥ (గీత-12-15)

అని భగవంతుడి మాట. లోకం ఎవరినుండి ఉద్వేగం పొందదో, ఎవరు లోకంనుండి ఉద్వేగం పొందరో, హర్షమూ, అమర్షమూ, భయమూ, ఉద్వేగమూ ఎవరికి లేవో వాడే నాకు ప్రీతిపాత్రుడని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ స్థితికూడా బ్రాహ్మణత్వమును వ్యక్తం చేస్తున్నదని గుర్తించాలి.

తే. బంధనంబులలో నెల్లఁ బరమబంధ । నంబు గామంబు; దద్వర్జనమున నాత్మ
యభ్రపటలంబు వాసిన యమృతకిరణ । పూర్ణమండలమును బోలెఁ బొలుచు ననఘ! 190

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బంధనంబులలోన్+ఎల్లన్= సమస్త బంధనాలలోనూ; కామంబు= కోరిక; పరమబంధనంబు= దృఢమైన బంధనం; తద్వర్జనమునన్= ఆ కామమును విడవటంచేత; ఆత్మ= ప్రత్యగాత్మ; అభ్రపటలంబున్=

మేఘసమూహాన్ని; పాసిన= విడిచిన; అమృతకిరణపూర్ణ మండలమునున్+పోలెన్= చంద్రుడియొక్క సంపూర్ణబింబంవలె; పొలుచున్= భాసిస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడా! జీవుడిని సంసారంలో బంధించే బంధనాలన్నింటిలోనూ కామమనే బంధనం మిక్కిలి గట్టిది. ఆ కామాన్ని వదలితే మబ్బులను విడిచిన పూర్ణచంద్రుడివలె ఆత్మ ప్రకాశిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. పరతత్త్వోపాసన త । త్పరుఁడై సంక్షీణకామభావత నున్నం
బురుషు సుఖ మొందు వృద్ధిం । బొరయుచు వపు వమృతకిరణుఁ బొందినమాడ్కిన్. 191

ప్రతిపదార్థం: వపువు= శరీరం; వృద్ధిన్= పెంపుదలను; పొరయుచున్= పొందుచు; అమృతకిరణున్= చంద్రుడిని; పొందినమాడ్కిన్= పొందినరీతిగా; పరతత్త్వ+ఉపాసన తత్పరుఁడు+ఐ= బ్రహ్మతత్త్వమును ఉపాసించటంలో ఆసక్తిగలవాడై; సంక్షీణ కామభావతన్= క్షీణించిన కామభావం కలవానితనంతో; ఉన్నన్= ఉంటే; పురుషున్= జీవుడిని; సుఖము+ఒందున్= సుఖం పొందుతుంది.

తాత్పర్యం: శ్రేష్ఠమైన బ్రహ్మతత్త్వాన్ని ఉపాసిస్తూ కామభావాలను క్షయింపజేసికొనాలి. అట్లా ఉంటే పురుషుడిని శుక్లపక్షంలో నిత్యమూ శరీరాభివృద్ధి చంద్రుడిని పొందినట్లే శాశ్వతసుఖం పొందుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. పారిఁ బొరి భూతముల గుణో । త్కర మవిశేషాన్వితముగఁ గనుఁగొను సంవి
త్పర దుఃఖంబు సుఖముచే । విరియుఁ దరణిచేతఁ దమము విరిసిన భంగిన్. 192

ప్రతిపదార్థం: తరణిచేతన్= సూర్యుడిచేత; తమము= చీకటి; విరిసినభంగిన్= విడిపోయినట్లు; పారిన్+పోరిన్= మిక్కిలిగా; భూతముల= ప్రాణులయొక్క; గుణోత్కరము= గుణసమూహమును; అ+విశేషాన్వితముగన్= భేదంలేకుండా; కనుఁగొను= చూచునట్టి; సంవిత్పరు దుఃఖంబు= జ్ఞాననిష్ఠుని దుఃఖం; సుఖముచేన్= సుఖం కారణంగా; విరియున్= నశిస్తుంది.

తాత్పర్యం: ప్రాణులలోని గుణాల నన్నిటినీ అభేదదృష్టితో చూచే జ్ఞాననిష్ఠుడి దుఃఖం చీకటి, సూర్యుడిచేత నశించినట్లు సుఖాతిశయంచేత నశిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. తనది యనక యేమి ధనమునఁ బ్రియమందు, । నెద్ది గుడువకుండ నెసఁగుఁ దృప్తి,
యిచ్చఁ బొందులేక యెయ్యది బలమిచ్చు, । దానిఁ గనుట శ్రుతుల తలఁపు గనుట. 193

ప్రతిపదార్థం: తనది అనక= ఇది నాది అని అనుకొనకుండానే; ఏమి ధనమునన్= ఎట్టిధనంతో; ప్రియము+అందున్= ప్రీతినొందునో; ఎద్ది= ఏది; కుడువక+ఉండన్= తినకుండానే; తృప్తి= తనివి; ఎసఁగున్= అతిశయించునో; ఇచ్చన్= ఇచ్ఛతో; పొందులేక= కలయిక లేకయే; ఎయ్యది= ఏది; బలము+ఇచ్చున్= బలమినిస్తుందో; దానిన్= అట్టి ఆత్మతత్త్వమును; కనుట= చూడటం; శ్రుతుల తలఁపున్= వేదాభిప్రాయాన్ని; కనుట= చూడటం (అగును).

తాత్పర్యం: 'ఆత్మ' అనే ధనం 'తనది' అనుకొనకున్నా ప్రీతిని కల్గిస్తుంది. 'ఆత్మ' అనే భోజనం తినకున్నా తృప్తినిస్తుంది. 'ఆత్మ' అనే దానితో భౌతికస్పర్శ లేకున్నా బలం కలుగుతుంది. ఆ ఆత్మతత్త్వాన్ని చూడటమే వేదార్థాలను గ్రహించటం.

విశేషం: ధనం, భోజనం మొదలైన పదార్థాలు ప్రీతి, తృప్తి మొదలైనవాటిని కలిగిస్తాయి. కాని ఎక్కడో ఎవరివద్దనో ఉన్న ధనంవలన తనకు ప్రీతి కలుగదు. ఎవడో అన్నం భుజిస్తే తనకు తనివి కలగదు. 'ఆత్మ'భోజనం అట్లాంటిది కాదు. దానిని తనది అనుకొనకున్నా, భుజించకున్నా ప్రీతినీ, తృప్తినీ కలిగిస్తుంది. ఆత్మభావనతో కలిగే బలం చాలా గొప్పది. అందువలన ఆత్మతత్త్వప్రాప్తికై ప్రయత్నించాలి. ఆత్మలాభమే వేదతత్త్వాన్ని గ్రహించి ఆచరించినందుకు నిక్కమైన నిదర్శనం.

క. పరిపాటిఁ గర్మ మెడలఁగ । వరుస గుణము లడఁగ విషయవర్గము పొందుం
బొరయక యుండెడు బ్రాహ్మణు । జరయును మృత్యువును బొరయఁజాలవు వత్సా! 194

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; పరిపాటిన్= క్రమంగా; కర్మము+ఎడలఁగన్= కర్మము తొలగగా; వరుసన్= క్రమంగా; గుణములు= సత్త్వం మొదలైన గుణాలు; అడఁగన్= నశించగా; విషయవర్గము పొందున్= శబ్దాది విషయాలతోడి కలయికను; పొరయక ఉండెడు= పొందకుండా ఉండేటి; బ్రాహ్మణున్= విప్రుని; జరయును= ముసలితనమును; మృత్యువును= మరణమును; పొరయన్+చాలవు= పొందలేవు.

తాత్పర్యం: కుమారా! కర్మబంధమూ, సత్త్వాది గుణాలూ, శబ్దాది విషయాలూ క్రమక్రమంగా తొలగిపోయిన విప్రుడికి వార్ధకమూ, మరణమూ కలుగవు.

విశేషం: శరీరభావంతో ఉండేవాడికి ఆ శరీరానికి కలిగే ముసలితనం, మరణం మొదలైన దోషాలు కూడా ఆపాదిస్తాయి. కాని, 'తాను శరీరంకాదు, శుద్ధబుద్ధముక్తమైన ఆత్మను' అని గ్రహించిన బ్రాహ్మణుడికి వార్ధకాది దోషా లంటవని భావం.

తే. అనఘ! దేహంబుకంటె వేఱయిన దేహి । సూక్ష్మరూపము శాస్త్రోక్త సుకృతములఁ బ్ర
శాంతజనములు గాంతురు సాధనముల । నాదరింపరు దర్శనానంతరమున. 195

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; శాస్త్ర+ఉక్తసుకృతములన్= శాస్త్రాలలో చెప్పబడిన పుణ్యకర్మలచేత; ప్రశాంతజనములు= ప్రశాంతినొందిన జనులు; దేహంబుకంటెన్= శరీరంకంటె; వేఱు+అయిన= భిన్నమయిన; దేహి= ఆత్మయొక్క; సూక్ష్మరూపంబున్= సూక్ష్మమైన రూపును; కాంతురు= చూస్తారు; దర్శన+అనంతరమునన్= అట్లా చూచిన తర్వాత; సాధనములన్= వేరే ఉపాయాలను; ఆదరింపరు= గణించరు.

తాత్పర్యం: కల్మషరహితుడా! శాస్త్రాలలో చెప్పబడిన పుణ్యకర్మలచేత ప్రశాంతి నొందిన జనులు మాత్రమే శరీరం కంటె భిన్నమైన శరీరి, అనగా ఆత్మయొక్క సూక్ష్మస్వరూపాన్ని గ్రహించగలరు. అట్లా అవ్యక్తాత్మ స్వరూపాన్ని గ్రహించిన తర్వాత వారు వేరే సాధనాలను లెక్కచేయరు.

క. ఇనురూపము జలములఁ దోఁ । చిన క్రియ బుద్ధిఁ బ్రతిబింబసిద్ధత వెలుఁగొం
దిన యాత్మను బరమార్థతఁ । గను సత్త్వస్థులకు నిజము గానంగ నగున్. 196

ప్రతిపదార్థం: ఇనురూపము= సూర్యుడిరూపం; జలములన్= నీటిలో; తోఁచినక్రియన్= కనబడిన విధంగా; బుద్ధిన్= బుద్ధి యందు; ప్రతిబింబసిద్ధతన్= ప్రతిబింబంగా కావటంతో; వెలుఁగు+ఒందిన= ప్రకాశించిన; ఆత్మను= క్షేత్రజ్ఞుడిని; పరమార్థతన్= యథార్థంగా; కను= చూచే; సత్త్వస్థులకున్= సత్త్వగుణంలో ఉండేవారికి; నిజము= సత్యం; కానంగన్+అగున్= చూడటానికి వీలవుతుంది.

తాత్పర్యం: సూర్యుడి స్వరూపం నీళ్ళలో ప్రతిబింబంగా భాసిస్తుంది. అట్లాగే ఆత్మ బుద్ధిలో ప్రతిబింబరూపంతో వ్యక్తమవుతుంది. సత్త్వగుణ ప్రధానులైనవారు ఆత్మను యథాతథంగా చూడగలరు. అట్లాంటివారికి మాత్రమే సత్యం భాసిస్తుంది.

విశేషం: అలంకారం: ఉపమ.

క. అనఘ! దివసంబు రాత్రియు । ననునవి భానునకు లేని యట్టులు సతతం
బును బరమయోగయుతుఁ డగు । మునికి వివేకావివేకములు లేకుండున్. 197

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; భానునకున్= సూర్యుడికి; దివసంబు= పగలు; రాత్రియున్= రేయియు; అనునవి= అనేవి; లేని అట్టులు= లేనట్లే; సతతంబును= ఎల్లవేళలా; పరమ యోగయుతుఁడు+అగు= శ్రేష్ఠమైన యోగంతో కూడినవాడైన; మునికిన్= మౌనికి; వివేక+అవివేకములు= జ్ఞానాజ్ఞానాలు; లేక+ఉండున్= లేకుండా ఉంటాయి.

తాత్పర్యం: పాపరహితుడా! సూర్యుడికి రేయుంబవళ్ళు అనేవి లేవు. అట్లే సదా పరమయోగం పాటించే మునీంద్రుడికి వివేకం, అవివేకం అనేవి లేవు. సదా అతడు శుద్ధ జ్ఞానస్వరూపుడై ఉంటాడు కాబట్టి ఇది వివేకం కలిగిన స్థితి, ఇది వివేకం లేని స్థితి అనేవి అతడికి లేవని తాత్పర్యం.

విశేషం: అలంకారం: ఉపమ.

క. కరణంబులు దొడరిన ని । ష్కరణత నున్నను శమంబు గల యోగికి సు
స్థిర మగు సమాధి యని ముని । వర శాండిల్యుండు శిష్యవరులకుఁ జెప్పెన్. 198

ప్రతిపదార్థం: మునివర= మునిశ్రేష్ఠుడా!; శాండిల్యుండు= శాండిల్యుడు; కరణంబులు= ఇంద్రియాలు; తొడరినన్= కలిగిఉన్నా; నిష్కరణతన్= ఇంద్రియరహితస్థితితో; ఉన్నను= ఉన్నా; శమంబు= శాంతం; కల= కల్గిన; యోగికిన్= యోగశీలుడికి; సమాధి= చిత్తలయం; సుస్థిరము+అగున్+అని= ధృడమౌతుందని; శిష్యవరులకున్= శిష్యశ్రేష్ఠులకు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: శమప్రధానుడైన యోగికి ఇంద్రియాలున్నా, అవి లేకున్నా మనోలయ రూపమైన సమాధి దృఢంగానే ఉంటుందని శాండిల్యమహర్షి తన శిష్యులకు బోధించాడు.

సీ. వినుఁ మోహబీజ సంజనితంబు గామద్రు । మంబు ప్రమాదజలంబు దనకుఁ
బరిషేచనంబుగఁ బెరుఁగు నజ్ఞాన స్థి । రాధారకలితమై యందసూయ
పత్ర సంపద యది చిత్ర తరంబు మా । నస్కంధ దృఢత నున్నతి వహించు
శోక శాఖంబు ననేక చింతోప శా । ఖంబు బురాకృత కర్మ సార

తే. ఘనముఁ దృష్ణాలతా పరిగతము నగుచుఁ । బొలుచుఁ దత్ఫలములకు లుబ్ధులు గడంగి
ప్రాఁకి పడుదురు విడుపు శస్త్రముగ నది వి । ఖండితము సేసి బుధుఁడు దుఃఖములఁ దొఱఁగు. 199

ప్రతిపదార్థం: వినుఁ= ఆకర్ణించు; మోహబీజసంజనితంబు= మోహమనే విత్తనంనుండి మొలకెత్తినదైన; కామద్రుమంబు= కామమనే చెట్టు; అజ్ఞానస్థిర+ఆధారకలితము+ఐ= అజ్ఞానమనే గట్టి వేళ్ళతో కూడినదై; ప్రమాదజలంబు= ఏమరుపాటు అనేనీరు; తనకున్ పరిషేచనంబుగన్= తనకు నీరుకట్టుగా; పెరుఁగున్= వృద్ధిపొందుతుంది; అందున్= ఆ వృక్షమునందు; అసూయ= ఇతరుల ఉత్కర్షను సహింపమి అనే దుర్గుణం; పత్రసంపద= ఆకుల సంపత్తి(గాఉన్నది); అది= ఆ ఆకుల సంపద; చిత్రతరంబు= మిక్కిలి చిత్రమైనది; మానస్కంధదృఢతన్= అభిమానమనే బోదె యొక్క దార్ఢ్యంతో; ఉన్నతిన్= (ఆచెట్టు) ఔన్నత్యమును;వహించున్= పొందుతుంది; శోకశాఖంబు= శోకమనే కొమ్మలు కలది; అనేక చింతా+ఉపశాఖంబు= పెక్కు చింతలనే రెమ్మలుగలది; పురాకృత కర్మ సారఘనము= పూర్వం చేసిన కర్మల బలమే చేవగా కలది; తృష్ణాలతాపరిగతమున్= ఆశ అనే తీగలతో చుట్టబడింది;అగుచున్ = అవుతూ; పొలుచున్= భాసిస్తుంది; లుబ్ధులు= లోభగుణం కలవారు; తత్ఫలములకున్= ఆ చెట్టుకు సంబంధించిన పండ్లకు;

కడంగి= ప్రయత్నించి; ప్రాఁకి= ఎగబ్రాకి; పడుదురు= పతనం చెందుతారు; బుధుఁడు= పండితుడు (ఆత్మజ్ఞానం కలవాడు); విడుపు= త్యాగం; శస్త్రముగన్= ఖడ్గంగా; అది= ఆ చెట్టును; విఖండితము చేసి= తెగనరికి; దుఃఖములన్= శోకాలను; తొఱఁగున్= విడిచిపెడతాడు.

తాత్పర్యం: శుకుడా! వినుము. కామమనే వృక్షం మోహమనే బీజంనుండి మొలుస్తుంది. ఏమరుపాటు అనే నీటితో పెరుగుతుంది. అజ్ఞానమే దాని స్థిరమైన ఆధారపువేళ్ళు; అసూయే దానికి ఆకులు. అది చాలా చిత్రంగా ఉంటుంది. మానమనే కాండంతో దృఢపడి ఆ వృక్షం పైకెదుగుతుంది. శోకమే కొమ్మలుగా, అనేకచింతలే రెమ్మలుగా, పూర్వం చేసిన కర్మలబలమే చేవగా పెరిగిన ఆ చెట్టు ఆశలనే తీగెలతో చుట్టబడుతుంది. లోభులు ఆ చెట్టు పండ్ల కాశించి ఎక్కి తుదకు పతనమై పోతారు. ఆత్మజ్ఞుడైన పండితుడు త్యాగమనే కత్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమవుతాడు.

విశేషం: అలం: రూపకం

సీ. పురము శరీరంబు; బుద్ధి తత్స్వామిని; । సర్వార్థచింతన సచివపదవి
నడచుచు నుండు మనంబు శబ్దాద్యంబు । లై చెల్లు విషయంబులైదుఁ దగు పు
రోహితవర్గంబు శ్రోత్రాదులగు నింద్రి । యంబులు పౌరజనంబు; లిట్లు
పరఁగెడు రాజ్యంబు పరిభోగమునకు దూ । షకులైన దొరలు రజస్తమములు

తే. వారి కఱపులఁ బడు బుద్ధి నేరకుండి । మనసుతోడ వేర్పడినఁ దానును మనంబు
నేకముఖతఁ గార్యము సూచునేని దుష్టు । లడఁగుదురు భోగ మవ్యయ మగుఁ గుమార!' 200

ప్రతిపదార్థం: కుమార!= పుత్రా!; శరీరంబు= దేహం; పురము= పట్టణం; బుద్ధి= అంతఃకరణ చతుష్టయంలో రెండవదైన బుద్ధి; తత్స్వామిని= ఆ నగరానికి యజమానురాలు; మనంబు= మనస్సు; సర్వార్థచింతన= సమస్త పదార్థాలను గూర్చిన ఆలోచనతో; సచివ పదవిన్= మంత్రిస్థానంలో; నడచుచున్+ఉండున్= ప్రవర్తిస్తూ ఉంటుంది; శబ్ద+ఆద్యంబులు+ఐ= శబ్దం మొదలుగాగలవై; చెల్లు= ప్రవర్తిల్లే; విషయంబులు= విషయాలు; ఐదున్= ఐదును; తగు= తగిన; పురోహితవర్గంబు= పురోహితులయొక్క సమూహం; శ్రోత్ర+ఆదులు+అగు= చెవి మొదలైన; ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు; పౌరజనంబులు= పురప్రజలు; ఇట్లు= ఈ రీతిగా; పరఁగెడు= ప్రవర్తిల్లెడు; రాజ్యంబుపరిభోగమునకున్= రాజ్యముయొక్క అనుభవానికి; రజస్తమములు= రజోగుణ తమోగుణాలు; దూషకులు+ఐన= దూషించే స్వభావంగల; దొరలు= ప్రభువులు; నేరక+ఉండి= నేర్పు చాలక ఉన్నవై; బుద్ధి= మతి; మనసుతోడన్= చిత్తంతో; వేర్పడిన= విభిన్నమయినచో; వారికఱపులన్+పడున్= రజస్తమోగుణాల శిక్షణకు లోనవుతుంది; తానును= (అట్లు వారికి లోబడక) బుద్ధియును; మనంబును= చిత్తమును; ఏకముఖతన్= ఏకాభిప్రాయంతో; కార్యము= చేయదగినపనిని; చూచునేని= గమనించిన పక్షంలో; దుష్టులు= దుర్జనులు; అడఁగుదురు= నశించిపోతారు; భోగము= సుఖానుభవం; అవ్యయము+అగున్= అక్షయం అవుతుంది.

తాత్పర్యం: పుత్రా! ఈ శరీరమే ఒక నగరం. బుద్ధి దానికి ప్రభువు. సమస్త విషయాలనూ చింతించే చిత్తం అక్కడ మంత్రి పదవిలో కొనసాగుతూ ఉంటుంది. శబ్దాదులైన ఐదు విషయాలూ పురోహితవర్గమై ప్రవర్తిస్తాయి శ్రోత్రం మొదలైన ఇంద్రియాలే అక్కడి పురప్రజలు. ఇట్లా ఉండే ఈ రాజ్యాన్ని రజస్తమో గుణాలనే దుష్టులైన దొరలు అనుభవిస్తూ ఉంటారు. బుద్ధి తనకు వివేకం చాలనిదై చిత్తంతో విభేదించి రజస్తమోగుణాల శిక్షణలకు లోనై నశిస్తుంది. అట్లాకాక మనస్సుతో ఏకమై అది కర్తవ్యమేదో గ్రహించి ప్రవర్తిస్తే దుర్జనులైన రజస్తమోగుణాలు పొడవడగిపోతాయి. రాజ్యభోగం అక్షయ మవుతుంది'.

విశేషం: అలం: రూపకం.

వ. అని చెప్పెనని విని పాండవాగ్రజుండు భీష్మునితోఁ 'గార్యబలంబును, వీర్యబలంబును, మనోబలంబునుం గలుగు నుత్తమక్షితిపతు లనేకు లీకయ్యంబున మృతులైరి. నిజప్రాణంబునకు నొక్కరుండు నొడయండు లేక తక్కె ; మృత్యువనునది యెయ్యది? యేమిటం గలిగె? నెట్లు ప్రజల సంహరించు? నెఱింగింపవే!' యనుటయు నతం డిట్లనియె. 201

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని చెప్పాడు; అనినన్= అనగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= ధర్మజుడు; భీష్మునితోన్= శాంతనవుడితో; కార్యబలంబును= చేయదగిన పనులకు తగిన బలమూ; వీర్యబలంబును= పరాక్రమబలమూ; మనోబలంబును= చిత్తబలమూ; కలుగు= కలిగిఉన్న; ఉత్తమక్షితిపతులు= శ్రేష్ఠులైన రాజులు; అనేకులు= చాలమంది; ఈ కయ్యంబునన్= ఈ యుద్ధంలో; మృతులు+ఐరి= చనిపోయారు; ఒక్కరుండున్= ఒకడుకూడ; నిజప్రాణంబునకున్= తన ప్రాణానికి; ఒడయండు= ప్రభువు; లేక తక్కెన్= లేకపోయాడు; మృత్యువు+అనునది= చావు అనేది; ఏ+అది?= ఏది?; ఏమిటన్= దేనినుండి; కలిగెన్= సంభవించింది?; ఎట్లు= ఏ రీతిగా; ప్రజలన్= జనులను; సంహరించున్= చంపుతుంది?; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా వ్యాసుడు శుకుడితో చెప్పాడని భీష్మ డన్నాడు. అప్పుడు ధర్మరాజు భీష్ముడితో - 'కార్యబలమూ, వీర్యబలమూ, మనోబలమూ గల్గిన చాలామంది ఉత్తములైన భూపాలకులు ఈ యుద్ధంలో అసువులు కోల్పోయారు. వీరిలో ఒక్కడు కూడా తన ప్రాణాలకు ప్రభువు కాలేకపోయాడు. మృత్యువంటే ఏమిటి? అది దేనినుండి సంభవించింది? అది ఏ రీతిగా ప్రజలను చంపుతుంది? తెలియజెప్పుమని అడిగాడు. అపుడు భీష్మ డతడితో ఇట్లా అన్నాడు:

భీష్ముఁడు ధర్మరాజునకు మృత్యుదేవత తెఱం గెఱిఁగించుట (సం. 12-248-7)

సీ. వినుఁ మకంపనుఁ డను మనుజేంద్రుఁ డాత్మజుఁ । డాహవంబున మృతుఁ డైన, వగపు
గదురంగనుండి నారదు నలవోక వ । చ్చిన వానిఁ గని సవిశేషభక్తి
యుతముగా నాతిథ్య మొనరించి తన వగ । పెఱిఁగించుటయు, నమ్మునీశ్వరుండు
గరుణ శోకనిరాసకారణం బైన యా । ఖ్యాన మొక్కటి సెప్పె; దాని తెఱఁగు

తే. దేటపడునట్లుగాఁ బరిపాటి తోడ । నఖిలమును నెఱింగించెద నవహితుండ
వై వినంగ నీ వడిగిన యర్థమునకు । బోధకం బగు నది కురుభూపవర్య! 202

ప్రతిపదార్థం: కురుభూపవర్య!= కౌరవరాజోత్తమా!; వినుము; అకంపనుఁడు+అను= అకంపనుడనబడే; మనుజ+ఇంద్రుఁడు= రాజు; ఆహవంబునన్= యుద్ధంలో; ఆత్మజుఁడు= పుత్రుడు; మృతుఁడు+ఐనన్= చనిపోగా; వగపు= దుఃఖం; కదురంగన్+ఉండి= కలుగగా ఉండినవాడై; అలవోకన్= స్వేచ్ఛగా; వచ్చినవానిన్= వచ్చినవాడైన; నారదున్= నారదమునిని; కని= చూచి; సవిశేషభక్తి యుతముగాన్= అత్యధిక భక్తితో కూడిన పద్ధతిలో; ఆతిథ్యము= అతిథి సత్కారం; ఒనరించి= చేసి; తన వగపు= తన దుఃఖమును; ఎఱిఁగించుటయున్= తెలియజెప్పగా; ఆ+ముని+ఈశ్వరుండు= ఆ నారదుడు; కరుణన్= దయతో; శోకనిరాసకారణంబు+ఐన=దుఃఖ నివారణహేతువైన; ఆఖ్యానము= కథ; ఒక్కటిచెప్పెన్= ఒకటి వచించాడు;పరిపాటితోడన్= క్రమంగా; దానితెఱఁగు=ఆ కథా పద్ధతి; అఖిలమును= సర్వమును; తేటపడునట్లుగాన్= స్పష్టమయ్యేవిధంగా; ఎఱిఁగించెదన్= తెలియపరుస్తాను; అవహితుండవు+ఐ=

అవధానం కలవాడవై; వినంగన్= వింటే; అది= ఆ కథ; నీ అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థమునకున్= విషయానికి; బోధకంబు+అగున్= బోధించేది అవుతుంది.

తాత్పర్యం: కురురాజవర్యా! వినుము. పూర్వం అకంపనుడనే ఒక రాజుండేవాడు. అతడి కుమారుడు యుద్ధంలో మరణించాడు. ఆ రాజు దుఃఖాక్రాంతుడయ్యాడు. అట్లా ఉండగా నారదముని స్వేచ్ఛగా సంచరిస్తూ అప్పుడు అక్కడికి వచ్చాడు. అతడిని చూచి రాజు మిక్కిలి భక్తితో అతిథి సత్కారం కావించాడు. తర్వాత తన దుఃఖాన్ని గూర్చి ఆ మునికి తెలియపరచాడు. ఆ మునీంద్రుడు అది విని దయతో అతడికి దుఃఖాన్ని తొలగింపజేసే కథ ఒకటి చెప్పాడు. నేను ఆ కథనంతా స్పష్టంగానూ, క్రమంగానూ నీకు వివరిస్తాను. అవధానంతో వినుము. అది వింటే నీ వడిగిన ప్రశ్నకు సమాధానం తెలియవస్తుంది.

వ. అజుండు జగంబులు సృజియింప జంతుసంతానంబు వెరిఁగి సమ్మర్దం బధికంబై యూర్పు వోవని యట్లయిన నద్దేవుండు సంకటపడి సంహారప్రకారంబు విచారింపం దదీయ చిత్తంబు కార్యదాహంబున మహాదహనుండు జనియించి జగంబులు దహింపం జొచ్చిన. 203

ప్రతిపదార్థం: అజుండు= బ్రహ్మ; జగంబులు= లోకాలు; సృజియింపన్= సృష్టించగా; జంతుసంతానంబు= ప్రాణిసంతతి; పెరిఁగి= వృద్ధిపొంది; సమ్మర్దంబు= ఒత్తిడి; అధికంబు+ఐ= ఎక్కువై; ఊర్పు పోవని అట్లు+అయినన్= ఊపిరాడని ప్రకారంగా కాగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు; సంకటపడి= కష్టపడి; సంహారప్రకారంబున్= ప్రాణులను సంహరించే విధానాన్ని; విచారింపన్= ఆలోచించగా; తదీయచిత్తంబు= అతడి మనస్సుయొక్క; కార్యదాహంబునన్= కార్యార్థమయిన తాపమునందు; మహాదహనుండు= గొప్ప అగ్ని; జనియించి= పుట్టి; జగంబులు= లోకాలు; దహింపన్+చొచ్చినన్= కాల్చటానికి ప్రారంభించగా.

తాత్పర్యం: పూర్వం బ్రహ్మదేవుడు లోకాలు సృష్టించాడు. అంతట ప్రాణుల సంతానం ఎక్కువగా పెరిగిపోయింది. సమ్మర్దం ఎక్కువయింది. ఊపిరి పీల్చుకొనటానికి కూడా వీలులేని విధంగా పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఆ దేవుడు చింతించి ప్రాణిలోకాన్ని ఎట్లా సంహరించటమా అని యోచించసాగాడు. అతడి చిత్తంలో కార్యాన్ని గూర్చిన తీవ్రమైన ఆలోచన వలన వేడిమి జనించింది. అందుండి మహాగ్ని ప్రభవించింది. అది లోకాలను కాల్చివేయటానికి పూనుకొన్నది.

తే. త్రినయనుఁడు వచ్చి యాతనిఁ దేర్చె; నాతఁ । డాతెఱం గెఱిఁగించి యయ్యగ్ని నుడిపె;
నపుడు పుట్టెఁ దదీయేంద్రియవ్రజమున । నొక్క యంగన రక్తాక్షి యుజ్జ్వలాంగి. 204

ప్రతిపదార్థం: త్రినయనుఁడు= మూడుకన్నులుగల శివుడు; వచ్చి= ఏతెంచి; ఆతనిన్= బ్రహ్మదేవుడిని; తేర్చెన్= శాంతింపజేశాడు; ఆతఁడు= ఆ శివుడు; ఆ తెఱంగు= ప్రాణులను సంహరించే పద్ధతిని; ఎఱిఁగించి= తెలియజెప్పి; ఆ+అగ్నిన్= ఆ దహనుడిని; ఉడిపెన్= చల్లార్చాడు; అప్పుడు= ఆ సమయంలో; తదీయ+ఇంద్రియవ్రజమునన్= ఆ బ్రహ్మయొక్క ఇంద్రియ సమూహమునందు; రక్త+అక్షి= ఎఱ్ఱని కన్నులు గలది; ఉజ్జ్వల+అంగి= ప్రకాశించే అవయవాలు గలదైన; ఒక్క అంగన= ఒక స్త్రీ; పుట్టెన్= జనించింది.

తాత్పర్యం: ఆ సమయంలో శివుడక్కడికి వచ్చాడు. బ్రహ్మను శాంతింపజేశాడు. అతడికి పెరిగిపోయిన జంతు సంతతిని ఎట్లా సంహారం చేయాలో, ఆ పద్ధతి తెలియచెప్పి ఆ యగ్నిని శమింపజేశాడు. అప్పుడు ఎఱ్ఱని కన్నులతోనూ, భాసమానమైన అవయవాలతోనూ ఒప్పే ఒక స్త్రీ బ్రహ్మదేవుడి ఇంద్రియాలనుండి ఉద్భవించింది.

వ. పుట్టి దక్షిణాభిముఖియై పోవం గని కమలసంభవుండు పిలిచి 'మృత్యువ! ప్రజలఁ బ్రబల దుర్బలభేదంబు లేక సంహరింపు' మనుటయు నవ్వనిత వనటం గన్నీరొలుక 'నీ కుద్భవించి క్రూరకర్మంబు సేయుదునే? ధర్మకార్యంబునకుం బనుపు'మని పలికిన నయ్యశ్రుబిందువులు దోయిటంబట్టి యద్దేవుం డమ్ముద్దియతో 'నిదియపనిగా నుదయించినదానవు; నీవు ప్రజాసంహారంబు సేయవలయు' ననవుడు నాబాల గాలిం దూలు తీవయుంబోలెఁ గంపంబు నొందుచు. 205

ప్రతిపదార్థం: పుట్టి= ఉద్భవించి; దక్షిణా+అభిముఖి ఐ= దక్షిణదిశ కెదురైన ముఖంకలదై; పోవన్= పోతుండగా; కని= చూచి; కమలసంభవుండు= బ్రహ్మ; పిలిచి= ఆహ్వానించి; మృత్యువ!= ఓ మృత్యుదేవతా!; ప్రజలన్= జనులను; ప్రబలదుర్బల భేదంబు లేక= బలవంతుడు, దుర్బలుడు అనే తేడా లేకుండా; సంహరింపుము= చంపుము; అనుటయున్= అనగా; ఆ+వనిత= ఆ అంగన; వనటన్= దుఃఖంతో; కన్నీరు= బాష్పజలం; ఒలుకన్= ప్రసరించగా; నీకున్+ఉద్భవించి= నీకు పుట్టి; క్రూరకర్మంబు= క్రూరమైన కార్యం; చేయుదునే?= అనుష్ఠింతునా; ధర్మకార్యంబునకున్= పుణ్యకార్యానికి; పనుపుము+అని= నియోగింపుమని; పలికినన్= చెప్పగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మ; ఆ+అశ్రుబిందువులు= ఆ కన్నీటి బిందువులు; దోయిటన్= దోసిలితో; పట్టి= పట్టుకొని; ఆ+ముద్దియతోన్= ఆ వనితతో; ఇదియ= ఇదే; పనిగా= కార్యముగా; ఉదయించినదానవు= పుట్టినదానవు; నీవు ప్రజాసంహారంబు= నీవు జంతుసంహారము; చేయన్ వలయున్= చేయాలి; అనవుడున్= అనగా; ఆ బాల= ఆ బాలిక; గాలిన్+తూలు= వాయువుతో చలించే; తీవయున్+పోలెన్= లతవలె; కంపంబున్+ఒందుచున్= వణకిపోతూ.

తాత్పర్యం: ఆ రీతిగా పుట్టి దక్షిణదిక్కు కెదురుగా పోసాగింది. అది చూచి బ్రహ్మ 'ఓ మృత్యుదేవతా! నీవు ప్రాణులను ఇది బలమైనది, ఇది బలం లేనిది అన్న భేదం లేకుండా చంపుము' అని చెప్పాడు. అందుకు ఆ స్త్రీ దుఃఖిస్తూ కంటనీరు పెట్టి 'దేవా! నీకు పుట్టి నేను ఈ సంహారమనే క్రూరకార్యం ఎట్లా చేసేది? నన్ను ధర్మకార్యానికి నియోగించుము' అని అడిగింది. బ్రహ్మ ఆమె కన్నీటి బిందువులను అంజలితో పట్టుకొని ఆమెతో 'నీవు ఇందుకే జన్మించావు. కాబట్టి ప్రజాసంహారకార్యం తప్పక చేయాలి' అన్నాడు. అందు కా బాలిక గాలికి చలించే తీగవలె వణకిపోతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

క. 'మనుజుల హరించి బాంధవ । జనమున శోకంబుఁ జూడఁ జాలుదునె? తపం
బున కేఁగెద సదయంబుగ । ననుజ్ఞ సేయంగవలయు' నని ప్రణమిల్లెన్. 206

ప్రతిపదార్థం: మనుజులన్= మానవులను; హరించి= చంపి; బాంధవజనమునన్= వారి బంధుజనులలో; శోకంబున్= దుఃఖమును; చూడన్+చాలుదునె?= చూడగలనా?; తపంబునకున్= తపస్సు చేయటానికి; ఏఁగెదన్= పోతాను; సదయంబుగన్= కృపతో; అనుజ్ఞ చేయంగన్ వలయున్= అనుమతించాలి; అని ప్రణమిల్లెన్= అని నమస్కరించింది.

తాత్పర్యం: 'మానవుల ప్రాణాలు హరించి వారి బంధువులలో శోకం నేను చూడగలనా? తపస్సు చేయటానికి పోతాను. దయతో నాకు అనుమతి ఇమ్ము' అని నమస్కారం చేసింది.

వ. దానికి నరవిందసంభవుండు మందస్మితంబుతో 'ని ట్లే లగు? జంతుసంహారంబు నీ కవశ్యకర్తవ్యంబు; దానిం జేయమి సువ్వె యధర్మం' బని నిర్బంధించిన నూరకుండి యన్నాతి పదంపడి యల్లన సురిఁగి ధేనుకాశ్రమంబున కరిగి యత్యంత దీర్ఘకాలంబు ఘోరతపంబు సేసి, కౌశికి గంగ నందయను నదులకుం బోయి వాయు వాహారంబుగా నతిదుష్కరవ్రతంబు లనేక వర్షంబు లాచరించి హిమశిఖరి శిఖరంబునకుం జని చతురానన ప్రీతికరం బగు నిష్ఠాతిశయంబున సంయమంబు దాల్చియుండ నద్దేవుండు. 207

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; అరవిందసంభవుండు= బ్రహ్మ; మందస్మితంబుతోన్= చిరునవ్వుతో; ఇట్లు+ఏల+అగున్?= ఈ విధంగా ఎందుకు జరుగుతుంది?; జంతుసంహారంబు= ప్రాణుల సంహరించటం; నీకున్+అవశ్యకర్తవ్యంబు= నీకు తప్పక చేయదగినపని; దానిన్= ఆ కార్యాన్ని; చేయమి= చేయకపోవటం; అధర్మంబు సువ్వె= అధర్మంగదా!; అని నిర్భంధించినన్= అని పట్టువిడక చెప్పేసరికి; ఊరక+ఉండి= మారుమాటలాడకుండా ఉండి; ఆ+నాతి= ఆ స్త్రీ; పదంపడి= ఆపైన; అల్లన= మెల్లగా; సురిగి= అదృశమై చని; ధేనుక+ఆశ్రమంబునకున్= ధేనుకనామకమైన ఆశ్రమానికి; అరిగి= వెళ్ళి; అత్యంత దీర్ఘకాలంబు= చాలకాలం; ఘోరతపంబుచేసి= తీవ్రమైన తపస్సు చేసి; కౌశికి, గంగ, నంద అను నదులకున్= కౌశికి మొదలైన ఏరులకు; పోయి= వెళ్ళి; వాయువు+ఆహారముగాన్= గాలినే భోజనంగా; అనేకవర్షంబులు= పెక్కు సంవత్సరాలు; అతి దుష్కర వ్రతంబులు= మిక్కిలి కష్టమైన వ్రతాలను; ఆచరించి= చేసి; హిమశిఖరిశిఖరంబునకున్= హిమవత్పర్వతాగ్రానికి; చని= వెళ్ళి; చతుఃఆనన ప్రీతికరంబు+అగు= బ్రహ్మకు ప్రీతి కల్గించే; నిష్ఠా+అతిశయంబునన్= నిష్ఠాగరిష్ఠతతో; సంయమంబు= నియమాన్ని; తాల్చి ఉండన్= వహించి ఉండగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు;

తాత్పర్యం: అందుకు బ్రహ్మ చిరునవ్వు నవ్వి 'ఇట్లా ఎందుకు జరుగుతుంది? నీకు జంతువులను సంహరించటం చేయదగిన పని. ఆ పని చేయకపోతేనే అధర్మం' అని నిర్భంధించాడు. ఆమె అందు కేమీ బదులు చెప్పక ఊరుకొన్నది. పిదప మెల్లగా అక్కడినుండి మాయమైపోయి ధేనుకాశ్రమం చేరింది. అక్కడ చాలా కాలం తీవ్ర తపోనిష్ఠ కొనసాగించింది. అక్కడినుండి కౌశికి, గంగ, నంద అనే నదులకు వెళ్ళింది. ఆ నదీతీరాలలో గాలినే ఆహారంగా స్వీకరిస్తూ అనేక సంవత్సరాలు మిక్కిలి దుష్కరమైన వ్రతాలు చేసింది. ఆ పై హిమవత్పర్వత శిఖరం చేరి బ్రహ్మకు ప్రీతికరమైన నిష్ఠతో నిగ్రహం దాల్చి ఉండింది. అప్పుడు ఆ బ్రహ్మదేవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సన్నిధిసేసి తపముమెయి । నున్నఁ బ్రయోజనము గలదె? యుడుగుము పుత్రీ!'
యన్న 'శరణంబు వేఁడెద । నన్ను దయం గావు' మనియె నాతి యతనితోన్. **208**

ప్రతిపదార్థం: సన్నిధిచేసి= సమీపానికి వచ్చి; పుత్రీ!= కుమారీ!; తపముమెయిన్= తపస్సుతో; ఉన్నన్= ఉంటే; ప్రయోజనము= కార్యం; కలదె?= ఉన్నదా?; ఉడుగుము= మానుము; అన్నన్= అనగా; నాతి= వనిత; అతనితోన్= ఆ బ్రహ్మతో; శరణంబు వేఁడెదన్= శరణు కోరుతాను; నన్నున్ దయన్= నన్ను దయతో; కావుము+అనియెన్= రక్షించు మని అన్నది.

తాత్పర్యం: (బ్రహ్మ) ఆమె సమీపానికి వచ్చి 'బిడ్డా! ఈ విధంగా తపస్సు చేస్తూ ఉంటే నీకు కలిగే ప్రయోజన మేమి? ఈ తపోనిష్ఠ వదలిపెట్టుము' అని చెప్పాడు. అందు కామె బ్రహ్మతో "దేవా! నిన్ను శరణు వేడుతున్నాను. నన్ను దయతో రక్షించుము' అని చెప్పింది.

వ. అనిన విని యమ్మహాత్ముండు. **209**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; ఆ+మహాత్ముండు= ఆ బ్రహ్మ.

తాత్పర్యం: ఆమె అట్లా అనగా విని మహాత్ముడైన చతుర్ముఖుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'ప్రజల హరియించు టిది నీకు పరమధర్మ; । మేను బొంకెదనే? దీని నెల్ల భంగి
నాచరింపన వలయు; మత్ప్రార్థనంబు । భగ్న మొనరించు టొప్పదు పద్మనయన! **210**

ప్రతిపదార్థం: పద్మనయన!= కమలనేత్రా!; ప్రజలన్= జనులను; హరియించుట= సంహరించటం; ఇది= అనే ఈ పని; నీకున్ పరమధర్ముము= నీకు శ్రేష్ఠమైన ధర్మం; ఏను= నేను; బొంకెదనే?= అసత్యం పలుకుతానా!; దీనిన్= ఈ ప్రజాసంహారాన్ని;

ఎల్లభంగిన్= ఎన్ని విధాలనైనా; ఆచరింపన వలయున్= చేసేతీరాలి; మత్ప్రార్థనంబు= నా వేడికోలు; భగ్నము+ఒనరించుట= వమ్ముచేయటం; ఒప్పదు= తగదు.

తాత్పర్యం: పద్మాలవంటి నేత్రాలు కలదానా! ప్రజాసంహారం కావించటమే నీకు మేలైన ధర్మం. నేను నీతో అసత్య మాడుతానా? ఈ పనిని నీవు అన్నివిధాలా చేసే తీరాలి. నా కోరికను నెరవేర్చకుండా వమ్ముచేయటం నీకు ఉచితం కాదు.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద; నీయశ్రుజలంబు లే నంజలిపుటంబునం బట్టు టెఱుంగుదు గాదె? యవి నానావ్యాధిరూపంబుల మానవుల బాధించుఁ; గామ క్రోధంబులు వానికిం దోడుపడు; వారు దానన తెగుదురు; నీవు నిమిత్తమాత్రం; బింతియ; నీకు వరం బిచ్చెద. 211

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఒక్కవిశేషంబు= ఒక విశిష్టవిషయాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; ఏను= నేను; నీ అశ్రుజలంబులు= నీ కన్నీరు; అంజలిపుటంబునన్= దోయిట; పట్టుట= గ్రహించటం; ఎఱుంగుదుకాదె?= తెలియుదువుగదా!; అవి= ఆ కన్నీళ్ళు; నానావ్యాధిరూపంబులన్= అనేక రోగరూపాలతో; మానవులన్= మనుజులను; బాధించున్= పీడిస్తాయి; కామక్రోధంబులు= కోరిక, కోపం అనేవి; వానికిన్= ఆ కన్నీటికి; తోడుపడున్= సాయపడతాయి; వారు= ఆ మానవులు; దానన= దానివల్లనే; తెగుదురు= మరణిస్తారు; నీవు నిమిత్తమాత్రంబు= నీవు కారణంమాత్రమే; ఇంతియ= ఇంతే; నీకున్ వరంబు+ఇచ్చెదన్= నీకు విశేషించి ఒక వరంకూడా ఇస్తాను.

తాత్పర్యం: ఇంకా ఒక విశేషాంశం చెప్పుతాను. నీ కన్నీటిబిందువులను నేను నా దోసిట పట్టుకొనటం నీకు తెలుసుగదా! ఆ కన్నీరు అనేకరోగాల రూపాలతో మనుష్యులను బాధిస్తాయి. కామక్రోధాలనే దుర్గుణాలు ఆ పనిలో ఆ కన్నీటికి సాయం చేస్తాయి. ఆ మానవులు వాటితోనే మరణిస్తారు. నీవు ఈ పనిలో నిమిత్తమాత్రంగానే ఉంటావు. ఇంతే. నీకు విశేషించి ఒక వరం కూడా ఇస్తాను.

తే. పురుషుఁడును నంగనయును నపుంసకుండు । నగుము పుత్రిక! పురుషుని నంగనను న
పుంసకుని జంపువేళలఁ బొందకుండు । పాపమును నిది ధర్మమై పరఁగు నీకు.' 212

ప్రతిపదార్థం: పుత్రిక!= కుమారీ!; పురుషుఁడును= మగవాడుగానూ; అంగనయును= స్త్రీగానూ; నపుంసకుండును= పేడివిగానూ; అగుము= కమ్ము; పురుషునిన్= మగవాడిని; అంగనను= స్త్రీని; నపుంసకునిన్= పేడివాడిని; చంపువేళలన్= సంహరించే సమయంలో; పాపమును= కల్మషాన్ని; పొందకుండు= చెందకుండా ఉంటుంది; ఇది= ఈ సంహారం; నీకున్ ధర్మము+ఐ పరఁగున్= నీకు ధర్మకార్యమై విలసిల్లుతుంది.

తాత్పర్యం: కుమారీ! నీవు పురుషుడుగా, స్త్రీగా, నపుంసకుడిగా కమ్ము. అట్లయినప్పుడు నీవు మగవాడిని, ఆడుదానిని, పేడివానిని చంపేసమయంలో నీకు పాపమంటదు. అంతేకాక నీకది కర్తవ్యమైన ధర్మంగా కూడా పరిణమిస్తుంది.

వ. అని పలుకుటయు నప్పాలంతి శాపంబునకు వెఱచియు, నది యట్టిద కాక యను తలంపు దోఁచియుఁ, బ్రజాసంహారంబు సేయు నధికారంబు పూనె; మృత్యుదేవత ప్రాణాపహారిణి యగుఁ బ్రాణిజాలంబు దేహంబులం బాసి దేవాదిభావంబులం బొందుచు మగుడ మనుష్యత్వంబు నొందుచుండు. 213

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని చెప్పగానే; ఆ+పాలంతి= ఆ వనిత; శాపంబునకున్= బ్రహ్మ శాపానికి; వెఱచియున్= భయపడి కూడా; అది= ఆ కార్యం; అట్టిద కాక= అట్టిదేఅగుగాక; అను= అనునట్టి; తలంపు= భావన; తోఁచియున్= కలిగియు;

ప్రజాసంహారంబున్= జనులను చంపటాన్ని; చేయు అధికారంబు= నిర్వహించే ప్రక్రియను; పూనెన్= వహించింది; మృత్యుదేవత= మరణదేవత; ప్రాణ+అపహారిణి= ప్రాణాలను అపహరించేది; అగున్= అవుతుంది; ప్రాణిజాలంబు= జంతుసంతతి; దేహంబులన్= శరీరాలను; పాసి= వదలి; దేవ+ఆదిభావంబులన్= దేవతలు మొదలైన స్వరూపాలను; పొందుచున్= చెందుతూ; మగుడన్= మరల; మనుష్యత్వంబున్= మానవత్వాన్ని; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉంటుంది.

తాత్పర్యం: బ్రహ్మ ఆ విధంగా చెప్పగానే ఆ వనిత అతడి మాట వినకపోతే అతడు శపిస్తాడేమో అని భయపడింది. తన కర్తవ్యం అట్టిదే అగునుగాక అనే ఊహకూడా ఆమెకు సంభవించింది. అందువలన ఆమె జనసంహారమనే అధికారాన్ని వహించింది. ఆ మృత్యుదేవతే ప్రజలప్రాణాలను అపహరించేదిగా ఉన్నది. ప్రాణుల సమూహం మరణకాలంలో శరీరాలు వదలి పూర్వకర్మానుసారంగా దేవాదిస్వరూపాలు పొందుతుంది. మళ్ళీ మానవత్వం ఆ ప్రాణులకు కలుగుతూ ఉంటుంది.

తే. భీమనాదుండు భీముఁ డుద్దాముఁ డప్ర । తర్క్యతేజోమయుఁడు జగత్ప్రాణుఁ డొడలు
మనుపఁ జెఱుపంగ నొడయండు సనుట మగుడ । నరుగుదెంచుట వింతగా దతని కెందు.' 214

ప్రతిపదార్థం: జగత్ప్రాణుఁడు= వాయుదేవుడు; భీమనాదుండు= భయంకరమైన శబ్దం కలవాడు; భీముఁడు= భీకరుడు; ఉద్దాముఁడు= స్వతంత్రుడు; అప్రతర్క్యతేజోమయుఁడు= ఊహకందని తేజస్స్వరూపం కలవాడై; ఒడలు= శరీరమును; మనుపన్= కాపాడటానికి;చెఱుపంగన్= నశింపజేయటానికి; ఒడయండు= ప్రభువు; అతనికిన్= ఆ వాయువునకు; ఎందున్= ఎక్కడనైనా; చనుట= పోవటం; మగుడన్= మరల; అరుగుదెంచుట= రావటం; వింతకాదు= ఆశ్చర్యం కాదు.

తాత్పర్యం: జగత్తునకు ప్రాణస్వరూపుడైన వాయువు భీకరమైన ధ్వని కలిగి ఉంటాడు. అతడు భయంకరుడు; కట్టుబాటులేనివాడు, ఊహించరాని తేజస్సు కలవాడు. అతడే శరీరాన్ని రక్షించటానికీ, నశింపజేయటానికీ సమర్థుడైన ప్రభువు. ఎక్కడికైనా అతడు పోవటం, మళ్ళీ రావటం అనేది వింతకాదు'.

వ. అనినం 'దొల్లియు నిది వింటి; నాఁ డత్యంత శోకాక్రాంతుండ నగుట న ద్వినికి రిత్తవోయె; నేఁ డీ
యుపాఖ్యానంబున యర్థంబు పరిజ్ఞాతం బయ్యె.' 215

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; తొల్లియున్= పూర్వంకూడా; ఇది= ఈ విషయాన్ని; వింటిన్= విన్నాను; నాఁడు= ఆ దినం; అత్యంతశోక+ఆక్రాంతుండను= మిక్కిలి దుఃఖంచేత పీడితుడను; అగుటన్= కావటంవలన; ఆ+వినికి= ఆ వినటం; రిత్తపోయెన్= వ్యర్థమయింది; నేఁడు= ఈ దినం; ఈ ఉపాఖ్యానంబున= ఈ కథలోని; అర్థంబు= మృత్యువిషయం; పరిజ్ఞాతంబు= తెలిసింది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: భీష్మ డట్లా చెప్పేసరికి ధర్మజుడు 'ముందుకూడా ఇది విన్నాను. కాని, ఆ దినాన మిక్కిలిగా దుఃఖపీడితుడను కావటం వలన ఆ విన్నది వ్యర్థమయింది. నేడు నీవు చెప్పిన ఈ కథలో విషయం నాకు బోధ పడింది'.

క. అని పలికి యధిప! కుంతీ । తన యాగ్రజుఁ డిట్టు లనుఁ బితామహుతో 'స
జ్జనకోటి ధర్మమునకును । మనమున వెఱచు; నది యింత మాన్యం బగునే? 216

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అని పలికి= అని చెప్పి; కుంతీ తనయ+అగ్రజుఁడు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; పితామహుతోన్= భీష్ముడితో; ఇట్టులు+అనున్= ఈ రీతిగా అన్నాడు: సజ్జనకోటి= సుజనులయొక్క సమూహం; ధర్మమునకున్= ధర్మానికి; మనమునన్= చిత్తంలో; వెఱచున్= భయపడుతుంది; అది= ఆ ధర్మం; ఇంత మాన్యంబు= ఇంతగా పూజింపదగింది; అగునే?= అవునా?

తాత్పర్యం: జనమేజయమహారాజా! ధర్మరాజు ఈ రీతిగా చెప్పి భీష్ముడితో మళ్ళీ ఇట్లా అన్నాడు: 'సజ్జనులైన వారు తమ మనస్సులో ధర్మానికి భయపడుతున్నారు. ఆ ధర్మం ఇంతగా పూజింపదగినంత గొప్పదా?

వ. ధర్మంబు తెఱం గిట్టిదని నిరూపించి యనుగ్రహింపుము.' 217

ప్రతిపదార్థం: ధర్మంబు తెఱంగు= ధర్మంయొక్క తీరు; ఇట్టిది+అని= ఈ విధంగా ఉన్నదని; నిరూపించి= వివరించి; అనుగ్రహింపుము= అనుగ్రహం చూపుము.

తాత్పర్యం: ఆ ధర్మముయొక్క పద్ధతి ఇట్లాంటిదని ప్రతిపాదించి నన్ను అనుగ్రహించుము'.

సీ. అనుటయు నతఁ డిట్టు లనియె 'వేదంబుల । మీఁది భక్తియు దృఢస్మృతియు సమ్య
గాచారమును రుచిరాకారములు ధర్మ । మునకుఁ గొందఱు బుధజనము లర్థ
మగుఁ జతుర్థాకార మం; ద్రయినను బాడి । దప్పియు బొంకియు ధనము గూర్చు
టెల్ల పాపములకు నెక్కుడు; బొంకమి । పరుల సొమ్ముల కాసపడమి సర్వ

ఆ. ధర్మములకు నధికతరములు విధివిహి । తంబు గాని యట్టి ధర్మ మనఘ!
చవుట నిడిన విత్తు చాడ్పున రూపించి । చేయ నిహపరములఁ జెందు సుఖము. 218

ప్రతిపదార్థం: అనుటయున్= (ధర్మరాజు) అట్లు అనగా; అతఁడు= భీష్ముడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అనఘ!= పాపరహితుడా!; ధర్మమునకున్= ధర్మానికి; వేదంబులమీఁది భక్తియున్= వేదముల యందు భక్తినీ దృఢస్మృతియున్= గట్టిస్మృతియును; సమ్యగాచారమును= చక్కని ఆచరణమును; రుచిర+ఆకారములు= అందమైన(మూడు) స్వరూపాలు; కొందఱు బుధజనములు= పండితులు కొందరు; అర్థము= ధనం; చతుర్థ+ఆకారము= నాల్గవస్వరూపం; అగున్ అండ్రు= అగునని చెప్పుతారు; అయిననుఁ= ఐనప్పటికి; పాడితప్పియున్= న్యాయం దప్పియును; బొంకియున్= అసత్య మాడియు; ధనమున్+కూర్చుట= అర్థము నార్జించటం; ఎల్లపాపములకున్= సమస్త పాపాలకు; ఎక్కుడు= అధికమైనది; బొంకమి= అసత్యం పలుకకుండా ఉండటం; పరులసొమ్ములకున్= ఇతరుల ధనములకు; ఆస పడమి= ఆశపడకుండా ఉండటం; సర్వధర్మములకున్= అన్ని ధర్మాలకూ; అధికతరములు= ఎక్కువయినవి; విధివిహితంబుకాని= శాస్త్రోక్తం కానట్టి; అట్టి ధర్మము= అటువంటి ధర్మం; చవుటన్= చవిటినేలలో; ఇడిన= ఉంచిన; విత్తుచాడ్పునన్= విత్తనమువంటిదని; రూపించి= నిరూపించి; చేయన్= అనుష్ఠించగా; ఇహపరములన్= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; సుఖము చెందున్= సుఖం పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగానే భీష్ము డతడితో ఈ రీతిగా చెప్పాడు: 'అనఘా! వేదాలపై భక్తీ, స్మృతులపై గట్టి విశ్వాసం, మంచి ఆచారం అనేవి మూడూ ధర్మానికి సుందరమైన ఆకారాలు. కొందరు పండితులు ధనం ధర్మానికి నాల్గవ ఆకారమంటారు. ఐనా న్యాయం తప్పి, అసత్యం పలికి ధనం సంపాదించటం పాపాలన్నింటిలోకీ ఎక్కువపాపం. అసత్యం పలకకుండా ఉండటం, ఇతరుల ధనాన్ని ఆశించకుండటం అన్ని ధర్మాలలోనూ మేలైన ధర్మాలు. శాస్త్రవిరుద్ధమైన ధర్మం చేయటం చవిటి నేలలో విత్తిన విత్తనం వలె నిష్ప్రయోజనమవుతుంది. ఇది గ్రహించి ప్రవర్తిస్తే ఇహలోక పరలోకాలలో సుఖం లభిస్తుంది.

వ. ధర్మంబు తెఱంగు సూక్ష్మంబు; ధర్మంబులు బహువిధంబు; లట్లు గావున ధర్మసర్వస్వనైజస్వరూప నిరూపణంబు
సేసి కరతలామలకంబుగాఁ బలికెద నాకర్ణింపుము. 219

ప్రతిపదార్థం: ధర్మంబు తెఱంగు= ధర్మంయొక్క పద్ధతి; సూక్ష్మంబు= అధ్యాత్మమైన (అగోచరమైనది); ధర్మంబులు= ధర్మాలు; బహువిధంబులు= అనేక విధాలు; అట్లు కావునన్= ఆ కారణంవలన; ధర్మసర్వస్వ నైజస్వరూపనిరూపణంబు= సర్వధర్మసారమైన నిజస్వరూపంయొక్క ప్రతిపాదనమును; చేసి= ఒనర్చి; కరతల+ఆమలకంబుగాన్= చేతిలోని ఉసిరిక కాయవలె స్పష్టమయ్యేటట్లు; పలికెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మస్వరూపం చాలా సూక్ష్మమై అగోచరంగా ఉంటుంది. ధర్మాలు నానావిధాలుగా ఉంటాయి. అందువలన అన్ని ధర్మాలకూ సారభూతమైనది ధర్మనిజ స్వరూపజ్ఞానం. ఆ స్వరూపాన్ని నిరూపించి అరచేతిలోని ఉసిరికకాయవలె స్పష్టమయ్యేటట్లు వివరిస్తాను వినుము.

క. ఒరు లేమేమి యొనర్చిన । నరవర! యప్రియము తన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి । పరాయణము పరమధర్మపథముల కెల్లన్.' 220

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఒరులు= పరులు; ఏమి+ఏమి+ఒనర్చినన్= ఏ యే పనిచేస్తే; తన మనంబునకున్= తన చిత్తానికి; అప్రియము అగున్= అనిష్టం అగునో; అవి= ఆ పనులు; తాను ఒరులకున్= తాను పరులకు; చేయక+ఉనికి= చేయకుండా ఉండటం; పరమధర్మపథములకున్+ఎల్లన్= శ్రేష్ఠమైన ధర్మమార్గా లన్నింటికీ; పరాయణము= ఉత్తమమైన ఆశ్రయం.

తాత్పర్యం: రాజా! ఇతరులు ఏమేమి చేస్తే తన మనస్సునకు అప్రియంగా ఉంటుందో, ఆ పనులను తాను ఇతరులకు చేయకుండా ఉండటమే అన్ని ధర్మమార్గాలకూ ఉత్తమమైన ఆలంబనంగా ఉన్నది'. ('ధర్మపదములకు' అన్న పాఠమునకు 'ధర్మస్థానాలకు' అని అర్థం చెప్పుకొనాలి).

వ. అని చెప్పినం బ్రీతుండై తాతకుం బ్రణమిల్లి పాండవాగ్రజుండు 'ధర్మస్వరూప నిరూపణం బింత యొప్పునే!' యని యభివర్ణించి 'యాగ్రహంబున నేమేనియు నడుగుచున్నవానింగా నన్నుం దలంప వలదు; వలవని యట్టిది యడుగం దెలిసికొనుటకై వలయునది యడుగుదు; నట్లుంగాక యడిగిన దానిన యడుగుటయుం గలుగుఁ; గృప నాదరింపుము. సమ్యగాచారంబు ధర్మప్రకారంబని నిర్దేశించితి; వుత్తమాచార ప్రకారం బెఱిఁగింపవే' యనుటయు నమ్మనుజపతికి నమ్మహితాత్ముం డిట్లనియె. 221

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని వచించగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; తాతకున్= పితామహుడైన భీష్ముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ధర్మస్వరూపనిరూపణంబు= ధర్మానికి చెందిన నిజరూపంయొక్క ప్రతిపాదనం; ఇంత ఒప్పునే= ఇంతగా ఒప్పిదమగునే; అని అభివర్ణించి= అభినందన పూర్వకంగా పల్కి; నన్నున్= నన్ను; ఆగ్రహంబునన్= కోపంతో; ఏమి+ఏనియున్= ఏదేదో; అడుగుచున్నవానింగాన్= ప్రశ్నించేవాడనుగా; తలంపన్ వలదు= అనుకొనవద్దు; వలవనిఅట్టిది= అనావశ్యకమైనదానిని; అడుగన్= ప్రశ్నించను; వలయునది= ఆవశ్యకమైనది; తెలిసికొనుటకై= బోధపరచుకొనటానికై; అడుగుదున్= ప్రశ్నిస్తాను; అట్లున్+కాక= అట్లేకాకుండా; అడిగినదానినిన్= ప్రశ్నించిన విషయాన్ని; అడుగుటయున్= మరల ప్రశ్నించటం; కలుగున్= సంభవిస్తుంది; కృపన్= దయతో; ఆదరింపుము= మన్నించుము; సమ్యగాచారంబు= మంచి ఆచారం; ధర్మ+ఆకారంబు+అని= ధర్మంయొక్క స్వరూపమని; నిర్దేశించితి(వి)= చెప్పావు; ఉత్తమ+ఆచార ప్రకారంబు= మేలైన ఆచారముయొక్క విధానాన్ని; ఎఱిఁగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అనేసరికి; ఆ+మనుజపతికిన్= ఆ రాజునకు; ఆ+మహిత+ఆత్ముండు= ఆ మహాత్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: భీష్మ డావిధంగా చెప్పేసరికి ధర్మరాజు సంతుష్ట డయ్యాడు. తాతకు నమస్కరించాడు. 'ధర్మస్వరూప నిరూపణం ఇంత చక్కగా ఉన్నదే!' అని ఆ నిరూపణాన్ని మెచ్చుకొన్నాడు. తరువాత భీష్ముడిని చూచి ' నేనేదో

పట్టుదలతో అడుగుతున్నానని భావించవద్దు. అవసరం లేనిదాని నడగను. తెలిసికొనాలన్న అంశాన్ని అడుగుతాను. అంతేకాదు. ఒక్కొక్క సారి జిజ్ఞాసతో అడిగిన విషయాన్నే మళ్ళీ అడుగుతుంటాను. దయతో నన్ను మన్నించి అనుగ్రహించుము. నీవు ధర్మస్వరూపాన్ని నిరూపిస్తూ సదాచారం ధర్మముయొక్క స్వరూపమని చెప్పావు. ఉత్తమమైన ఆచారం ఎట్లాంటిదో నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పుడు ఆ ధర్మరాజుతో మహాత్ముడైన భీష్ముడు ఇట్లా అన్నాడు:

తే. 'వేద మాచారములఁ జెప్పు వివిధగతుల; । సకలహిత మగునట్టి యాచార మరయ
ననఘ! వేఱొండు గలదె? మహాత్ము లెద్ది । యాచరించిరి దానిఁ జేయంగవలయు.' 222

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వేదము= శ్రుతి; వివిధగతులన్= అనేకవిధాల; ఆచారములన్= ఆచరణాలను; చెప్పున్= వచిస్తుంది; సకలహితము+అగునట్టి= అందరికీ హితమైనట్టి; ఆచారము= ఆచరణం; వేఱొకటి= మరొకటి; అరయన్= పరిశీలించగా; కలదె?= ఉన్నదా?; మహాత్ములు= పెద్దలు; ఎద్ది= దేనిని; ఆచరించిరి= చేస్తారో; దానిన్= ఆ కార్యమును; చేయంగన్ వలయున్= అనుష్ఠించాలి.

తాత్పర్యం: 'పాపరహితా! వేదం వివిధాచారాలను నిరూపిస్తున్నది. పరిశీలించి చూస్తే అందరికీ హితకరమైన సదాచారం వేరే ఏమున్నది? మహాత్ములైన వారు ఏ ఆచారాన్ని పాటిస్తారో, దానినే తక్కినవారు పాటించాలి.

వ. అని పలికి 'తొల్లి జాజలి యను మునికిఁ దులాధారుండను వణిగ్వరునితో సంవాదంబు గలిగె; నది యితిహాసరూపంబునఁ జెల్లు; నేతద్విషయంబయి యుండు దానిం జెప్పెద; నాకర్ణింపుము. 223

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తొల్లి= పూర్వం; జాజలిఅను మునికిన్= 'జాజలి' అనే మౌనికీ; తులాధారుఁడు+అను వణిగ్వరునితోన్= తులాధారుడనే వైశ్య ప్రముఖుడితో; సంవాదంబు= సంభాషణ; కలిగెన్= ప్రవర్తిల్లింది; అది= ఆ సంవాదం; ఇతిహాసరూపంబునన్= ఇతిహాసంగా; చెల్లున్= ప్రవర్తిల్లుతున్నది; ఏతద్విషయంబయి= ఈ సదాచారరూపమైన ధర్మాన్ని విషయంగా కలిగినదై; ఉండున్= ఉంటున్నది; దానిన్= ఆ సంవాదాన్ని; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని వచించి భీష్ముడు ఇట్లా అన్నాడు: 'పూర్వం 'జాజలి' అనే మునికీ, తులాధారుడనే వైశ్య శ్రేష్ఠుడితో ఒక సంవాదం జరిగింది. అది ఇతిహాసరూపంలో ఉన్నది. అది నీ వడిగిన సదాచారరూపమైన ధర్మాన్ని వివరిస్తుంది. ఆ సంవాదాన్ని వివరిస్తాను వినుము.

జాజలి తులాధారుల సంవాదప్రకారము (సం. 12-252-1)

సీ. చలనంబు లేక జాజలి తపోనిష్ఠ నా । సీనుఁడై యుండఁ బిచ్చికలు గూఁడు
గావించెఁ దన్మస్తకంబున; నమ్మిథు । నము గారణముగ నండములు గలిగి
పిల్లలై వర్తించి యెల్లెడ కెరగొన । నరుగుచు మరలుచు నవియు నవియు
నగ్గూఁట వసియింప, నతఁడు దయాళుఁ డై । వానిఁ జోపక యుండి వత్స! తనదు

తే. నియతి కెద మెచ్చి యీధర్మనిష్ఠ యెందుఁ । గలదె? యనుటయు మ్రోసె నాకాశవాణి;
ధర్మపరుఁ డైన యత్తులాధారుఁ డింత । యాడఁ డిట్లాడ నే లని యద్భుతముగ. 224

ప్రతిపదార్థం: వత్స!= కుమారా!; జాజలి= జాజలి అనేముని; చలనంబు లేక= కదలిక లేకుండా; తపోనిష్ఠన్= తపస్సుకు చెందిన పూనికతో; ఆసీనుఁడు+ఐ+ఉండన్= కూర్చొనిఉండగా; పిచ్చికలు= ఊరపిచ్చుకలు; తన్మస్తకంబునన్= అతడితలమీద; గూఁడు= పక్షిగృహం; కావించెన్= నిర్మించాయి; ఆ+మిథునము= ఆ పక్షులజంట; కారణముగన్= హేతువుగా; అండములు= గ్రుడ్లు; కలిగి= సంభవించి; పిల్లలు+ఐ= శిశువులై; వర్తించి= ఉండి; ఎల్లెడకున్= అన్నిచోట్లకు; ఎరగొనన్= ఆహారం స్వీకరించటానికి; అరుగుచున్= పోతూ; మరలుచున్= తిరిగివస్తూ; అవియున్= ఆ పిచ్చుకలజంటయు; అవియు= వాని పిల్లలును; ఆగూఁటన్= ఆ గూడునందు; వసియింపన్= నివసిస్తూ ఉండగా; అతఁడు= ఆ జాజలి; దయాళుఁడు+ఐ= దయగలవాడై; వానిన్= ఆ పక్షులను; చోపకఉండి= తరుమక ఉండి; తనదు= తనయొక్క; నియతికిన్= నియమానికి; ఎదన్= హృదయంలో; మెచ్చి= అభినందించి; ఈ ధర్మనిష్ఠ= ఈ ధర్మస్థితి; ఎందున్= ఎక్కడైనా; కలదె?= ఉన్నదా?; అనుటయున్= అనగానే; ఆకాశవాణి= గగనవాణి; ధర్మపరుఁడు+ఐన= ధర్మమునందు ఆసక్తుడైన; ఆ+తులాధారుఁడు= ఆ తులాధారుడనేవాడు; ఇంత ఆడఁడు= ఇంతగా మాట్లాడడు; ఇట్లు+ఆడన్+ఏల?= ఈ రీతిగా చెప్పటం ఎందుకు?; అని అద్భుతముగన్= అని ఆశ్చర్యకరంగా; మ్రోసెన్= ధ్వనించింది.

తాత్పర్యం: కుమారా! జాజలి అనే ముని కదలిక లేకుండా తపఃస్థితిలో ఆసీనుడై ఉన్నాడు. పిచ్చుకలు అతడి తలపై గూడు నిర్మించాయి. అందులో గ్రుడ్లు కూడా పెట్టాయి. ఆ గ్రుడ్లు పొదిగి పిల్లలయ్యాయి. పెద్ద పిచ్చుకలు, వాటి పిల్లలూ కలిసి ఆహారం కొరకై అన్నిచోట్లకూ పోతూ వస్తూ ఆ గూటిలో నివసించసాగాయి. ఆ జాజలి దయతో ఆ పక్షులను తరిమివేయకుండా ఉండి తన నియమానికి తానే మెచ్చుకొని 'ఇంతటి ధర్మనిష్ఠ ఎక్కడైనా ఉంటుందా?' అని అనుకొన్నాడు. అప్పుడు ఆకాశవాణి 'మహాధర్మాత్ముడైన తులాధారుడు ఈ విధంగా ఎప్పుడూ మాట్లాడి ఎరుగడు. ఈ విధంగా నిన్ను నీవు గొప్పగా మెచ్చుకొంటూ మాట్లాడటం ఎందుకు?' అని అతడిని ఆక్షేపిస్తూ ఆశ్చర్యకరంగా ధ్వనించింది.

వ. అట్లు మ్రోసిన విని వెఱఁగుపడి యత్తులాధారుం గాన వలయు నని తలంచినం 'దులాధారుండు వారాణసీపురంబున నున్నవాఁ' డను వాక్యంబును నంబరంబున వీతెంచె; నమ్మునియును మత్సరభరితుఁ డగుచు నప్పురంబునకుం బోయి జనసంపూజ్య వాణిజ్యంబునం బ్రవర్తిల్లు నతనిం గాంచిన నతండు సముచితసత్కారం బాచరించి యిట్లనియె. 225

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; మ్రోసినన్= ధ్వనించగా; విని= ఆలకించి; వెఱఁగుపడి= ఆశ్చర్యమొంది; ఆ+తులాధారున్= ఆ తులాధారుడనే వాడిని; కానన్ వలయును+అని= చూడాలని; తలంచినన్= సంకల్పించగా; తులాధారుండు= తులాధారుడనేపేరుగల వైశ్యుడు; వారాణసీపురంబునన్= కాశీనగరంలో; ఉన్నవాఁడు= ఉన్నాడు; అను వాక్యంబునున్= అనేమాటకూడ; అంబరంబునన్= ఆకాశంలో; వీతెంచెన్= ఉదయించింది; ఆ+మునియును= ఆ జాజలి కూడా; మత్సరభరితుండు+అగుచున్= మచ్చరం గలవాడై; ఆ+పురంబునకున్= ఆ నగరానికి; పోయి= వెళ్ళి; జనసంపూజ్య వాణిజ్యంబునన్= ప్రజలచేత పూజించదగిన వ్యాపారకృత్యమునందు; ప్రవర్తిల్లు= వ్యవహరిస్తున్న; అతనిన్= ఆ తులాధారుడిని; కాంచినన్= చూడగా; అతండు= ఆ తులాధారుడు; సముచిత సత్కారంబు= తగిన మర్యాద; ఆచరించి= చేసి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: ఆ ధ్వని విని జాజలి ఆశ్చర్యం పొందాడు. 'ఆ తులాధారుడిని చూడా లనుకొన్నాడు. ఇంతలో 'అతడు కాశిలో ఉంటాడు' అనే వాక్యం ఆకాశంనుండి వినిపించింది. ఆ ముని మాత్సర్యంతో కూడినవాడై కాశికి పోయాడు. అక్కడ ప్రజామాన్యమైన వ్యాపారంలో ఉన్న తులాధారుడిని చూచాడు. అంతట ఆ తులాధారు డతడికి తగిన సత్కారం చేసి ఇట్లా అన్నాడు.

తే. 'పిచ్చికలు గూఁడు శిరమునఁ బెట్టి తారుఁ । బిల్లలును సుఖలీల వర్తిల్లుచుండఁ
జిత్తవికృతి లే కెట్టులు సేయుదయ్య । తపము? సంభావనీయవర్తనుఁడ వీవు.' 226

ప్రతిపదార్థం: పిచ్చికలు= ఊరబిచ్చికలు; శిరమునన్= తలపై; గూఁడుపెట్టి= గృహం కట్టి; తారున్= తామును; పిల్లలును= శిశువులును; సుఖలీలన్= హాయిగా; వర్తిల్లుచుండన్= బ్రదుకుతుండగా; చిత్తవికృతి= మనోవికారము; లేక= కలుగకుండా; ఎట్టులు= ఎట్లా; తపముచేయుదు+అయ్య!= తపస్సు చేస్తున్నావయ్యా!; ఈవు= నీవు; సంభావనీయవర్తనుఁడవు= గౌరవింపదగిన ప్రవర్తన కలవాడవు.

తాత్పర్యం: 'అయ్యా! పిచ్చికలు నీ తలమీద గూడు కట్టుకొని అక్కడ తామూ, తమ పిల్లలూ కలిసి హాయిగా జీవిస్తూఉండగా నీవు ఏ మాత్రం మనోవికారం లేకుండా ఎట్లా తపస్సు చేస్తున్నావు? నీ ప్రవర్తన చాలా గౌరవించదగింది.'

వ. అనినఁ దదీయబోధంబునకు విస్మయంబందుచు విప్రోత్తముండు 'నీవు వణిగ్వర్తనంబున నుండ నెవ్విధం
బగు ధర్మంబున నివ్విశేషంబు గలిగె?' ననవుడు నతం డతని కిట్లనియె. 227

ప్రతిపదార్థం: అనినన్ = అని చెప్పగా; విప్రోత్తముండు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; తదీయ బోధంబునకున్= అతడి జ్ఞానానికి; విస్మయంబు+అందుచున్= ఆశ్చర్యపడుతూ; నీవు వణిగ్వర్తనంబునన్= నీవు వ్యాపారవృత్తిలో; ఉండన్= ఉండగా; ఏ+విధంబు+అగు= ఏ విధమైన; ధర్మంబునన్= ధర్మంచేత; ఈ+విశేషము= ఈ త్రైకాలికజ్ఞాన విశేషం; కలిగెన్?= సంభవించింది?; అనవుడున్= అని అడుగగా; అతండు= ఆ తులాధారుడు; అతనికిన్= ఆ జాజలికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: తులాధారు డట్లా అనేసరికి బ్రాహ్మణశ్రేష్ఠుడైన జాజలి అతడి జ్ఞానానికి ఆశ్చర్యపడ్డాడు. 'నీవు వ్యాపారవృత్తిలో ఉన్నావుగదా! నీ కేవిధంగా ఇట్లాంటి జ్ఞానాతిశయం కలిగింది?' అని ప్రశ్నించాడు. అప్పుడు తులాధారు డతడితో ఇట్లా అన్నాడు:

సీ. 'విలుచుట నమ్ముట నొలయదు వంచన । యర్హాలాభంబున యనుభవింతు;
సరి సిద్ధసిద్ధులు; సమలోష్టకాంచన । మై యుండు మనసు; నిందాభినుతులు
హింసయు నాత్మ ప్రశంసయు లేవు; భూ । తంబులయం దెల్ల దయ ఘటిల్లు;
నభయదక్షిణ మగు నంచిత సత్య యా । గము సెల్లుఁ; గోర భోగమును యశము;

తే. నెవ్వరికి మేలు సేసిన నింత సేసి । నాఁడ ననుబుద్ధి మమత యెన్నండు నాకుఁ
గలుగ దేమిట నేనియు వలపునొల్ల । మియును బుట్టదు; నిక్క మింతయు మహాత్మ! 228

ప్రతిపదార్థం: మహాత్మ!= గొప్ప మనసు కలవాడా!; విలుచుటన్= కొనటంలోనూ; అమ్ముటన్= విక్రయంలోనూ; వంచన= మోసం; ఒలయదు= కలుగదు; అర్హాలాభంబున= తగిన లాభాన్నే; అనుభవింతున్= అనుభవిస్తాను; సిద్ధి+అసిద్ధులు= లాభనష్టాలు; సరి= సమానం; మనసు= చిత్తం; సమలోష్టకాంచనము+ఐ= మట్టి పెళ్ళయందును, బంగారునందును సమభావంకలదై; ఉండున్= ఉంటుంది; నిందా+అభినుతులు= తెగడ్త, పొగడ్తలు; హింసయున్= బాధించుటయు; ఆత్మప్రశంసయున్= నన్ను నేను పొగడుకొనటం; లేవు= ఉన్నవి కావు; భూతంబులయందున్+ఎల్లన్= సమస్త ప్రాణులలోనూ; దయ= కరుణ; ఘటిల్లున్= కల్గును; అభయదక్షిణము+అగు= నిర్భయత్వమే దక్షిణగా గలిగినదైన; అంచితసత్యయాగము= మానితమైన సత్యమనే యాగం; చెల్లున్= ప్రవర్తిల్లుతుంది; భోగమును= సుఖమును; యశమున్= కీర్తిని; కోరన్= వాంఛించను; ఎవ్వరికిన్= ఎట్లాంటివారికి; మేలుచేసినన్=

ఉపకారం చేసినను; ఇంత సేసినాఁడన్= నేను ఇంత ఉపకారం చేశాను; అను బుద్ధి= అనే తలపు; మమత= మమకారం; ఎన్నండున్= ఎప్పుడును; నాకున్ కలుగదు= నాకు సంభవించదు; ఏమిటన్+ఏనియున్= దేనియందైనను; వలపున్= రాగమును; ఒల్లమియును= ద్వేషమును; పుట్టదు= కలుగదు; ఇంతయున్= ఇదంతా; నిక్కము= నిజము.

తాత్పర్యం: 'మహాత్మా! నేను వ్యాపారవృత్తిలో క్రయవిక్రయాలు చేసేటప్పుడు మోసముండదు. తగిన లాభాన్నే అనుభవిస్తాను కాని ఎక్కువ లాభాన్ని కోరను. లాభాలాభాల పట్ల సమభావం కలిగి ఉంటాను. నా చిత్తం మట్టిపెళ్ళను, బంగారాన్నీ సమంగానే చూస్తుంది. స్తుతినిందలు, హింసించటం, నన్ను నేను పొగడుకొనటం అనేవి నాకు లేవు. అన్ని ప్రాణులపట్ల దయగలిగి ఉంటాను. నేను పాటించే సత్యమనే యాగానికి అభయమే దక్షిణగా ఉంటుంది. (నేను సత్యప్రవర్తనతో ఉంటాను గాన నాకు భయంలేదు). మితిమీరిన సుఖాలనూ, కీర్తినీ కోరను. ఎవరికి ఎట్లాంటి ఉపకారం చేసినా సరే, ఇంత చేసినానన్న తలపు నాలో పుట్టదు. నాకు ఎప్పుడూ మమకారం లేదు. దేనిమీదగానీ నేను రాగద్వేషాలు కలిగిఉండను. నేను చెప్పినదంతా సత్యం.

విశేషం: తులాధారుడు "నేను ఎవరికి ఉపకారం చేసినా, ఇంత చేశాను అని భావించను' అని జాజలికి చెప్పాడు. జాజలి పిచ్చుకలకు తాను చేసిన మేలును భావించుకొని తనను తాను ప్రశంసించుకొన్నాడు. తులాధారుడిలో ఆత్మప్రశంస లేదు. కాన వీరిరువురి ప్రవర్తనలో కల భేదం స్పష్టం.

క. లోకం బెల్లను నేఁ జి । త్రాకారము గాఁగఁ జూతు; నట్లగుట మనం
బేకార్యములం దగులదు । కోకనద దళాంబుబిందుగుణ మొనరంగన్. 229

ప్రతిపదార్థం: నేన్= నేను; లోకంబు+ఎల్లను= సమస్తలోకాన్నీ; చిత్రాకారము+కాఁగన్= చిత్రంలోని బొమ్మనువలె; చూతున్= చూస్తాను; అట్లు+అగుటన్= ఆ విధంగా చూడటంవలన; కోకనదదళ+అంబుబిందుగుణము= చెంగల్వ రేకుమీది నీటిబొట్టుయొక్క స్వభావం; ఒనరంగన్= కలుగగా; మనంబు= నా చిత్తం; ఏకార్యములన్= ఏ పనులలోనూ; తగులదు= సంలగ్నం కాదు.

తాత్పర్యం: నేను ఈ లోకాన్నంతటినీ చిత్రంలోని బొమ్మను చూచినట్లే చూస్తాను. అందువలన నా మనస్సు కలువరేకును నీరంటనట్లే దేనినీ అంటుకొనకుండా నిస్సంగస్థితిలో ఉంటుంది'.

వ. అనిన విని జాజలి తులాధారున కిట్లనియె. 230

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; జాజలి= జాజలిముని; తులాధారునకున్+ఇట్లు+అనియెన్= తులాధారుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని తులాధారుడితో మళ్ళీ జాజలిమునీంద్రుడు ఈ రీతిగా చెప్పాడు.

తే. 'తపములును యజ్ఞములు నీవు ధర్మములుగఁ । బలుకవైతివి యార్యసంభావనీయ
పదములగు కర్మములలోనఁ బరిగణింపఁ । బడవొకో వేదశాస్త్రతత్పరులచేత.' 231

ప్రతిపదార్థం: నీవు= తులాధారుడవైన నీవు; తపములును= తపస్సులును; యజ్ఞములు= యాగకర్మలు; ధర్మములుగన్= ధర్మకార్యాలుగా; పలుకవైతివి= చెప్పవైతివి; వేదశాస్త్ర తత్పరులచేతన్= వేదములయందును, శాస్త్రముల యందును ఆసక్తులైన వారిచేత; ఆర్యసంభావనీయ పదములు+అగు= మహనీయులచే గౌరవింప దగిన స్థానములుగల; కర్మములలోనన్= కార్యాలలో; పరిగణింపన్+పడవు+ఒకో= (తపోయజ్ఞాలు) లెక్కించబడటం లేదా!

తాత్పర్యం: 'నీవు ఇప్పుడు పేర్కొన్న కర్మలలో తపస్సులు, యజ్ఞాలు ధర్మకార్యాలని చెప్పవైతివి. వేదాలలో, శాస్త్రాలలో నిష్ణాతులైన పెద్దలు తపస్సు మొదలైన కార్యాలను ఆర్యులు గౌరవించే సత్కర్మలలో లెక్కిస్తున్నారు గదా! అట్లాంటప్పుడు నీ వెందుకు ఆ కార్యాలను పేర్కొనలేదు?'

చ. అనవుడు నాతఁ డిట్లను 'నహంకృతి యుక్తముఁ గామసంశ్రితం
బును నగునేని నట్టి తపమున్, ఫలకాంక్ష యొనర్చు యజ్ఞమున్,
ఘనతరలోభవృత్తి యను కాన్పున మెచ్చదు దేవకోటి; వా
న నగు గతాగతంపు భ్రమణంబులు గీళ్ళులు గాక మేలులే? 232

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= తులాధారుడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు; అహంకృతియుక్తమున్= అహంకారంతో కూడింది; కామసంశ్రితంబును= కోరికలకు నెలవైనదీ; అగున్+ఏనిన్= అయితే; అట్టి తపమున్= అట్లాంటి తపస్సున్ను; ఫలకాంక్ష= ఫలాపేక్షతో; ఒనర్చు= చేసేటి; యజ్ఞమున్= యజ్ఞకర్మయును; దేవకోటి= దేవతాసమూహం; ఘనతరలోభవృత్తి= పెద్దదైన లోభవర్తనము; అను కాన్పున= అనేది కన్పించటంచేత; మెచ్చదు= అభినందించదు; వానన్= అట్టి తపోయజ్ఞాలవలన; అగు= సంభవించే; గత+ఆగతంపు భ్రమణంబులు= రాకపోకలతోకూడిన త్రిప్పటలు, కీళ్ళులుగాక= ఉపద్రవాలుగాక; మేలులే?= శుభాలా?

తాత్పర్యం: జాజలి అట్లా అనగా తులాధారుడు ఇట్లా అన్నాడు: 'అహంకారం, కోరిక- వీటితో కూడిన తపస్సు, ఫలంమీది కోరికతో చేసే యజ్ఞమూ ప్రయోజనకారులు కావు. ఆ రెండింటిలోనూ పెద్ద లోభితనం కన్పిస్తుంది. అందువలన దేవతలు ఆ తపోయజ్ఞాలను మెచ్చరు. అంతేకాక వాటివలన ఇహలోక పరలోకాల మధ్య సాగే రాకపోకలకు చెందిన త్రిప్పటలు అపకారం కలిగిస్తాయే కాని మేలు కల్గించవు.

ఆ. నిత్యతృప్తుఁ డైన సత్యయజ్ఞుని యెడ । దేవతలును నధిక తృప్తు లగుదు;
రమరతృప్తివలన నవ్యయానందంబు । సంఘటిల్లుఁ జూవె సంయమీంద్ర! 233

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్ర!= మునీంద్రా!; నిత్యతృప్తుఁడు+ఐన= సదా తృప్తికలిగి ఉండునట్టి; సత్యయజ్ఞుని ఎడన్= సత్యమునే యజ్ఞంగా కలవాడిపట్ల; దేవతలును= సురలుకూడ; అధికతృప్తులు= మిక్కిలి తృప్తి పొందినవారు; అగుదురు= అవుతారు; అమరతృప్తివలనన్= దేవతలయొక్క తృప్తి కారణంగా; అవ్యయ+ఆనందంబు= తరుగు లేని ఆనందం; సంఘటిల్లున్+చూవె= కలుగుతుంది కదా!

తాత్పర్యం: మునీంద్రా! ఎవడు సత్యమే యజ్ఞమని భావించి సత్యాన్ని పాటిస్తూ సదా తృప్తి పొంది ఉంటాడో, అతడిపట్ల దేవతలుకూడా సంతృప్తి వహిస్తారు. దేవతాతృప్తివలన తిరుగులేని ఆనందం కలుగుతుంది'.

తే. అనిన జాజలి 'యట్లేని ననఘ! నీవు । కర్మ ముడుగమి కెయ్యది కారణంబు?
మాకు నెఱిఁగింపు' మనుటయు మహితబోధుఁ । డగు తులాధారుఁ డిట్లను నతనితోడ. 234

ప్రతిపదార్థం: అనినన్= అనగా; జాజలి= జాజలిముని; అనఘ!= పాపరహితుడా!; అట్లు+ఏనిన్= అట్లా ఐతే; నీవు కర్మము+ఉడుగమికిన్= నీవు కర్మను వదలకుండా ఉండటానికి; కారణంబు= హేతువు; ఏ+అది?= ఏది?; మాకున్+ఎఱిఁగింపుము= మాకు తెలుపుము; అనుటయున్= అనేసరికి; మహితబోధుఁడు+అగు= శ్రేష్ఠమైన జ్ఞానంకలవాడైన; తులాధారుఁడు= తులాధారుడనే వైశ్యుడు; అతనితోడన్= ఆ జాజలితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: తులాధారు డట్లా అనగానే జాజలి అతడితో 'అనఘా! అట్లైతే నీవు కర్మ వదలకుండా ఉండటానికి కారణమేమి? మాకు తెలియజెప్పుము' అని అన్నాడు. అప్పుడు శ్రేష్ఠజ్ఞాన సంపన్నుడైన తులాధారుడు అతడితో ఈ విధంగా చెప్పాడు.

క. 'ధర్మారాముఁడు సంతత । ధర్మసఖుఁడునై యసంగతా నిష్ఠ మతిన్
నిర్మలుఁడగు వానికి ని । ష్కర్మత్వానందసిద్ధి గలుగు మునీంద్రా! 235

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మౌనివర్యా!; ధర్మారాముఁడు= ధర్మంలో రమించేవాడు; సంతతధర్మ సఖుఁడున్+ఐ= సదా ధర్మంతో మైత్రిచేసేవాడై; మతిన్= బుద్ధిలో; అసంగతానిష్ఠన్= నిస్సంగత్వనిష్ఠచేత; నిర్మలుఁడు+అగువానికిన్= మాలిన్య రహితుడైనవాడికి; నిష్కర్మత్వ+ఆనందసిద్ధి= అకర్మణతవలన కలిగే ఆనందప్రాప్తి; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠా! ఎవడు ధర్మంలో రమిస్తాడో, సదా ధర్మానికి మిత్రుడై ఉంటాడో, బుద్ధిలో అసంగత్వాన్ని పాటిస్తాడో, అట్లా పాటించి నిర్మల హృదయు డవుతాడో, అట్లాంటివాడికి కర్మరహితత్వం వలన కలిగే ఆనందం తప్పక సిద్ధిస్తుంది.

ఆ. నగములెల్లఁ బుణ్యనగములు, నదులెల్లఁ । బుణ్యనదులు వినుము భూసురాగ్ర
గణ్య! యకలుషం బకర్దమం బనఁజాలు । నాత్మ తీర్థమెఱుఁగు నకలుషునకు. 236

ప్రతిపదార్థం: భూసుర+అగ్రగణ్య!= విప్రులలో మొదట లెక్కించదగినవాడా!; వినుము= ఆలకించుము; అకలుషంబు= కాలుష్యం లేని; అకర్దమంబు= బురద లేనిది; అనన్+చాలు= అనగలిగినట్టి; ఆత్మతీర్థము= ఆత్మఅనే తీర్థాన్ని; ఎఱుఁగు= తెలిసికొన్న; అకలుషునకున్= పాపరహితుడికి; నగములు+ఎల్లన్= కొండలన్నీ; పుణ్యనగములు= పవిత్రమైన కొండలు; నదులు+ఎల్లన్= అన్ని ఏరులూ; పుణ్యనదులు= పవిత్రమైన ఏరులు.

తాత్పర్యం: విప్రోత్తమా! వినుము. ఏ విధమైన కాలుష్యం, పంకం లేని 'ఆత్మ' అనే తీర్థాన్ని తెలిసికొన్న పవిత్రాత్ముడికి లోకంలో ఉన్న కొండలన్నీ పావనమైన కొండలే. నదులన్నీ పావనమైన నదులే. అతడు పవిత్రాత్ముడు కాబట్టిఅతడికి సర్వమూ పవిత్రమే అవుతుంది. (అందుచేత పవిత్రప్రదేశాలకై అతడు విశేషించి వెదకవలసిన పని లేదని భావం).

క. కారణములవలనఁ గృత । ప్రారంభంబైన కర్మ మంచితగతికిం
గారణమే కర్తవ్య । త్వారబ్ధ క్రియలయట్టు లనఘచరిత్రా!' 237

ప్రతిపదార్థం: అనఘచరిత్రా!= దోషరహితమైన వర్తనం కలవాడా!; కర్తవ్యత్వ+ఆరబ్ధ క్రియల అట్టులు= ఇది చేయదగినది అన్న ఉద్దేశంతో ప్రారంభించిన కర్మలవలె; కారణములవలనన్= ఏవో కారణాలచేత; కృతప్రారంభంబు+ఐన= ప్రారంభించబడిన; కర్మము= పని; అంచితగతికిన్= పూజితమైన స్థితికి; కారణమే?= నిమిత్తమా? (కాదనుట)

తాత్పర్యం: పవిత్రచరిత్రా! 'ఇది నావంతు కర్తవ్యం కాన నేనీపని చేసి తీరతాను' అన్న ఉద్దేశంతో చేసే కర్మ పూజ్యమైన గొప్పసిద్ధికి హేతువు అవుతుంది. అంతేకాని ఏదో ప్రయోజనాన్ని కాంక్షించి, ఇతరకారణాలవలన చేసే పని ఆ విధమైన మహోన్నత గతికి కారణం ఎట్లా అవుతుంది?' (కాజాలదని భావం).

వ. అని చెప్పి యంత నిలువక. 238

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; అంతన్= అంతటితో; నిలువక= ఆగక.

తాత్పర్యం: తులాధారుడు ఆ రీతిగా చెప్పి, దానితో నిలువక మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. 'వినుమంచివారిచే నై । ననునితరుల చేతనేని నా యెఱిఁగిన యీ
యనువొప్పదొ మేలో యను । ననుమానము వాపుదమె మహాధర్మనిధీ! 239

ప్రతిపదార్థం: మహాధర్మనిధీ!= గొప్ప ధర్మానికి తావలమైనవాడా!; వినుమ= ఆలకించు; నా ఎఱిఁగిన= నేను తెలిసికొన్న; ఈ+అనువు= ఈ ధర్మపద్ధతి; ఒప్పదొ?= తగదో?; మేలో= తగినదో; అను అనుమానము= అనే సందేహం; మంచివారిచేన్+ఐనను= సజ్జనులచేతగానీ; ఇతరులచేతన్+ఏనిన్= పరులచేతగాని; పాపుదమె= తీర్చుకొందమా!

తాత్పర్యం: 'ధర్మాత్మా! వినుము. నాకు తెలిసిన ఈ ధర్మప్రకారం సరిఅయినదో కాదో అనే సందేహాన్ని సజ్జనుల ద్వారానైనా, లేక తదితరులచేత గానీ తీర్చుకొందామా!

వ. అప్పని మనచేత నయ్యెడి; నీవు దండ్రివోలెం బెనిచిన మరగి నీతో నరుగుదెంచి నీశిరంబు చక్కటిచదలం
జేరువం బొలయు నిప్పులుఁ గులం బిలిచి కరంబుల ధరియించి యుపలాలింపుమా!' యనుటయు జాజలి
వానిం బిలిచిన నవి దివిన నిలిచి యతనితో నిట్లనియె. 240

ప్రతిపదార్థం: ఆ+పని= ఆ కార్యం; మనచేతన్= మనవలన; అయ్యెడిన్= కాగలదు; నీవు తండ్రి+పోలెన్= నీవు జనకుడివలె; పెనిచిన= పెంచిన; మరగి= అలవాటుపడి; నీతోన్+అరుగుదెంచి= నీతోకూడా వచ్చి; నీ శిరంబు చక్కటి చదలన్= నీ తలకు సూటిగా ఆకాశమునందు; చేరువన్= సమీపంబున; పొలయు= తిరుగుతున్న; ఈ+పులుఁగులన్= ఈ పిచ్చికలను; పిలిచి= ఆహ్వానించి; కరంబులన్= చేతులలో; ధరియించి= ఉంచుకొని; ఉపలాలింపుమా!= బుజ్జగించుమా!; అనుటయున్= అనగా; జాజలి= జాజలిముని; వానిన్= ఆ పక్షులను; పిలిచినన్= ఆహ్వానించగా; అవి= ఆ పక్షులు; దివిన్+అం= ఆకాశంలోనే; నిలిచి= నిలబడి; అతనితోన్= ఆ జాజలితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాయి.

తాత్పర్యం: అట్లా సంశయం తొలగించుకొనే పని మనమే చేసికొనవచ్చును. నీవీ పిచ్చుకలను తండ్రివలె పెంచావు. నీతో అవి మచ్చిక పడి ఉన్నాయి. నీ తలమీద నేరుగా ఆకాశంలో సమీపం లోనే ఎగురుతూ ఉన్నాయి. వాటిని పిలిచి నీ చేతిపై ఉంచుకొని బుజ్జగించుము' అని చెప్పాడు. తులాధారు డట్లా అనగానే జాజలి ఆ పక్షులను పిలిచాడు. అవి అతడి చేతిమీదికి రాకుండానే ఆకాశంలోనే నిలబడి జాజలిని చూచి ఇట్లా అన్నాయి.

చ. 'మునివర! ధర్మదేవత మమున్ బనుపన్ నిను నారయంగ వ
చ్చిన భటసంఘ మేము; వినుచెప్పెద మీసు గలంక పోరితం
బను నివి మత్సరంబు గల యట్టిమనంబునఁ బుట్టు; హింస వీ
నన జనియించు; సంయమిజనంబు విమత్సరమైన మేలగున్. 241

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; ఏము= మేము; ధర్మదేవత= ధర్మానికి అధిష్ఠానమైన దేవత; మమున్= మమ్ములను; పనుపన్= పంపగా; నినున్+ఆరయంగన్= నిన్ను పరీక్షించటానికి; వచ్చిన= ఏతెంచిన; భటసంఘము= సేవకవర్గం; చెప్పెదము= వచింతుము; వినుమ= వినుము; మత్సరంబు+కలయట్టి= మాత్సర్యం గలిగినట్టి; మనంబునన్= చిత్తంలో; ఈసు= ఈర్ష్య; కలంక= మనఃక్షోభం; పోరితంబు+అనునివి= కలహం అనే ఇవి; పుట్టున్= కలుగుతాయి; వీనన= వీటినుండే; హింస= హింసించటం; జనియించున్= కలుగుతుంది; సంయమిజనంబు= మునిజనం; విమత్సరము+ఐనన్= మాత్సర్యం లేనిదైతే; మేలు+అగున్= శుభం కలుగుతుంది.

తాత్పర్యం: 'మునివర్యా! నిన్ను పరీక్షించటానికి ధర్మదేవత పంపిస్తే మేము వచ్చాము. మేము ఆ ధర్మదేవతకు చెందిన సేవకులం. ఇప్పుడు నీకు కలిగిన సంశయం తొలగేటట్లు విషయం చెప్పుతాము, వినుము. ఎవడి హృదయంలో మాత్సర్యదోషం ఉంటుందో, వాడిలో ఈర్ష్య, కలంక, కలహం అనే దుర్గుణాలు కలుగుతాయి. వీటివలననే హింస కూడా కలుగుతుంది. అందువలన మునివృత్తిలో ఉన్నవారు పూర్తిగా మాత్సర్యదోషాన్ని హృదయంనుండి తొలగించుకొంటేనే మేలు కలుగుతుంది.

తే. స్పర్ధ సద్ధర్మమునకు నాశని సుధర్మ । నాశమునఁ జేసి నరుఁడు వినష్టభావ
మొందుఁ గావున సంస్పర్ధ యుడుగవలయు । నిర్మలశ్రద్ధ గైకొని నిపుణుఁ డనఘ! 242

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; స్పర్ధ= పోటీ; సద్ధర్మమునకున్= మంచి ధర్మానికి; నాశని= వినాశకారి; సుధర్మనాశమునన్+చేసి= మంచి ధర్మం వినాశం పొందటంవలన; నరుఁడు= మానవుడు; వినష్టభావము= విశేషంగా నశించే భావాన్ని; ఒందున్= పొందుతాడు; కావునన్= అందువలన; నిపుణుఁడు= నేర్పు కలవాడు; నిర్మలశ్రద్ధన్= విమలమైన శ్రద్ధతో; కైకొని= స్వీకరించి; సంస్పర్ధన్= పోటీని; ఉడుగన్ వలయున్= వర్జించాలి.

తాత్పర్యం: పాపరహితా! స్పర్ధ అనే దుర్గుణం మంచిధర్మాన్ని నశింపజేస్తుంది. మంచిధర్మం నశిస్తే మనుజుడు పూర్తిగా వినాశానికి గురి అవుతాడు. అందువలన తెలివైన నేర్పరి నిర్మలమైన శ్రద్ధగలవాడై స్పర్ధ అనే దుర్గుణాన్ని వదలాలి.

క. శ్రద్ధ ఋషితనయ! సాత్వికి । బోద్ధ వ్యావాప్తి శుభముఁ బొనరించు మన
శ్శుద్ధిస్వరూప దానిఁ బ్ర । బుద్ధుఁడు వాటించుఁజూవె పురుషాత్మికఁగన్. 243

ప్రతిపదార్థం: ఋషితనయ!= మునికుమారా!; సాత్వికి= సత్త్వగుణం వలన కలిగిన; శ్రద్ధ= ఆసక్తి; బోద్ధవ్య+అవాప్తిన్= తెలిసికొనదగిన దానిని పొందటంచేత; శుభమున్= మంగళమును; పొనరించు= కలిగించునట్టి; మనశ్శుద్ధి స్వరూప= చిత్తనైర్మల్యస్వరూపమైనది; దానిన్= ఆ శ్రద్ధను; ప్రబుద్ధుఁడు= తెలివైనవాడు (ఆత్మజ్ఞుడు); పురుషాత్మికఁగన్= పురుషస్వరూపిణిగా; పాటించున్+చూవె!= అనుసరించునుగదా!

తాత్పర్యం: మునికుమారా! సత్త్వగుణంవలన జనించిన శ్రద్ధ మనం తెలిసికొనదగిన దానిని తెలియజేస్తుంది. తద్ద్వారా శుభం కలగజేస్తుంది. చిత్తశుద్ధే శ్రద్ధకు స్వరూపం. అందువలన తత్త్వజ్ఞుడు శ్రద్ధను పురుష స్వరూపిణిగా భావించి అనుసరిస్తాడు.

విశేషం: 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అని గీత - శ్రద్ధావంతుడు జ్ఞానం పొందుతాడని చెప్పింది. శాస్త్రమునందు గురువాక్యమునందు ఇది సత్యమనే బుద్ధితో నిశ్చయానికి రావటమే శ్రద్ధ. దానివలన ఆత్మతత్త్వం లభిస్తుందని శంకరులు వివేకచూడామణిలో వివరించారు.

"శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యాऽవధారణా।
సా శ్రద్ధా కథితా సద్భిర్యయా వస్తూపలభ్యతే॥ " (వివేకచూడామణి).

క. అమరులు విమలశ్రద్ధా । సమేతములు గాని తాపసత్వముఁ గ్రతుమ
త్వము గైకొన రా సువిశే । షముగలిగిన మెత్తు రది ప్రశస్తం బనఘా! 244

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అమరులు= దేవతలు; విమలశ్రద్ధాసమేతములు కాని= నిర్మలమైన శ్రద్ధతో కూడని; తాపసత్వమున్= మునిత్వమును; క్రతుమత్త్వమున్= యాజకత్వమును; కైకొనరు= అంగీకరించరు; ఆ సువిశేషము= ఆ విశిష్టమైన శ్రద్ధ; కలిగినన్= ఉంటే; మెత్తురు= అభినందిస్తారు; అది= ఆ శ్రద్ధ; ప్రశస్తంబు= ఉత్తమం.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ జాజలీ! దేవతలు నిర్మలమైన శ్రద్ధ లేని తపసితనమునూ, యాజకత్వాన్నీ అంగీకరించరు. శ్రద్ధతో కూడి ఉంటే వాటిని వారు మెచ్చుకొని అంగీకరిస్తారు. కాబట్టి శ్రద్ధ అనేది చాలా ప్రశస్తమైన గుణం.

క. వినుము మునివర! వాగ్వృత్తియు । మనఃప్రవర్తనముఁ గాచు మహితశ్రద్ధా
ధనసంపద; శ్రద్ధ యనం । జనునది జీవాత్మ సుప్రసన్నత సుమ్మీ!' 245

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; వినుము= వినుము; మహిత శ్రద్ధాధనసంపద= పూజ్యమైన 'శ్రద్ధ' అనే అర్థసంపత్తి; వాక్+వృత్తియున్= వాక్కుల యొక్క వ్యాపారమునూ; మనఃప్రవర్తనమున్= చిత్తముయొక్క నడవడికనూ; కాచున్= కాపాడుతుంది; శ్రద్ధ= శ్రద్ధ; అనన్+చనునది= అనబడేది; జీవాత్మ సుప్రసన్నత సుమ్మీ!= ప్రత్యగాత్మ యొక్క ప్రసన్నత్వమే సుమా!

తాత్పర్యం: మునివర్యా! వినుము. మానితమైన 'శ్రద్ధ' అనే ధనసంపద మన మాటలను, మనస్సును చెడుదారిలో పోనీకుండా కాపాడుతుంది. 'శ్రద్ధ' అనేది జీవాత్మయొక్క మంచి ప్రసన్నతాగుణమే సుమా!'

తులాధారుఁడు జాజలికిం చెప్పిన బ్రహ్మగీతలు (సం. 12-256-7)

వ. అని మఱియు నిట్లను 'బ్రహ్మగీత లను వాక్యంబు లాకర్ణింపుము. 246

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; మఱియు= ఇంకను; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; బ్రహ్మగీతలు+అను= బ్రహ్మగీతలు అనబడే వాక్యంబులు= మాటలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ పక్షులు ఆ విధంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాయి. 'బ్రహ్మగీతలు అనే మాటలు వినుము.'

క. యాగంబునందు శ్రద్ధా । యోగముగల యశుచి శ్రద్ధ యొనరని శుచి పు
ణ్యాగమసంపదఁ దుల్యులు । గా గణుతించిరి నిరూపకత నమరవరుల్. 247

ప్రతిపదార్థం: అమరవరుల్= దేవతాశ్రేష్ఠులు; యాగంబునందున్= యజనకర్మ చేసేటప్పుడు; శ్రద్ధాయోగముకల= శ్రద్ధాసమేతుడైన; అశుచి= శుచిలేనివాడు; శ్రద్ధఒనరని= శ్రద్ధలేని; శుచి= శుచిగలవాడు; పుణ్య+ఆగమసంపదన్= పుణ్యంయొక్క రాక అనే సంపద విషయంలో; నిరూపకతన్= నిరూపించటంలో; తుల్యులుగాన్= సమానులుగా; గణుతించిరి= లెక్కించారు.

తాత్పర్యం: దేవతలు శుచిలేకున్నా యాగం చేసేటప్పుడు శ్రద్ధ గలవాడినీ, శుచి ఉండినా శ్రద్ధలేని వాడినీ పరిశీలించి నిరూపిస్తూ వీరిరువురికీ పుణ్యం సంపాదించటంలో సమానత్వమే ఉంటుందని నిర్ణయించారు. (శౌచంలేని దోషాన్ని శ్రద్ధ తొలగిస్తుందని భావం).

క. వినుఁ! మజుఁడు శ్రద్ధ యతిపా । వని, యది గలవాఁడు గౌరవశ్రేష్ఠుం; డా
తని యన్నము భోజ్యతరం । బని నిర్దేశించె నెల్ల యమరులు వినఁగన్. 248

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అజుఁడు= బ్రహ్మ; శ్రద్ధ అతిపావని= శ్రద్ధ చాలా పవిత్రమైనది; అది కలవాఁడు= శ్రద్ధావంతుడు; గౌరవశ్రేష్ఠుఁడు= గౌరవంచేత ఉత్కృష్టుడు; ఆతని అన్నము= అతడు పెట్టే భోజనం; భోజ్యతరంబు+అని= తినదగిన వాటిలో మేలైనదని; ఎల్లఅమరులు= దేవతలందరూ; వినఁగన్= వింటూ ఉండగా; నిర్దేశించెన్= చెప్పాడు.

తాత్పర్యం: వినుము. పూర్వం బ్రహ్మదేవుడు దేవతలందరూ వింటూ ఉండగా 'శ్రద్ధ చాలా పవిత్రమైనది. శ్రద్ధగల మనుజుడు గౌరవంవలన ఉత్కృష్ట డవుతున్నాడు. అతడి అన్నం భుజించటానికి యుక్తతరమైనది' అని చెప్పాడు.

ఉ. వారక వడ్డి కిచ్చి కుడువన్ వెరవారిన దానశీలు నె
వ్వారికిఁ జేయుఁ జూపక ధ్రువంబుగ లోభగుణంబ పట్టి ని
స్సారత నుండు వేదవిదు సామ్యముఁ జేర్చి రమర్త్యులందు న
వ్వారిజసూతి దాని యగువాఁ డధికుం డనియెన్ హవిర్విధిన్. 249

ప్రతిపదార్థం: అమర్త్యులు= సురలు; వారక= ఉడుగక; వడ్డికిన్= వృద్ధికి; ఇచ్చి= ఒసంగి; కుడువన్= అనుభవించటానికి; వెరవారిన= యుక్తిపరుడైన; దానశీలున్= దానంచేసే స్వభావంగలవాడిని; ఏ+వారికిన్= ఎవరికిన్ని; చేయున్+చూపక= హస్తం కూడా చూపకుండా; ధ్రువంబుగన్= స్థిరంగా; లోభగుణంబు= పిసినితనం అనే గుణాన్నే; పట్టి= అవలంబించి; నిస్సారతన్= సారహీనతతో; ఉండు= మెలగునట్టి; వేదవిదు= వేదజ్ఞుడితో; సామ్యమున్+చేర్చిరి= పోలిక చెప్పారు; అందున్= వారిలో; ఆ+వారిజసూతి= ఆ బ్రహ్మ; హవిర్విధిన్= యాగకర్మలో; దాని అగువాఁడు= దానం చేసేవాడు; అధికుండు= గొప్పవాడు; అనియెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: వడ్డీవ్యాపారం చేసి తాను అనుభవిస్తూ తగిన సమయంలో దానంకూడా చేసేవాడినీ, ఎవరికీ ఏమీ ఇవ్వకుండా లోభి అయిన వేదాభ్యాసపరుడినీ - సమానమని దేవతలు చేర్చి పలికారు. వారిద్దరిలోనూ యజ్ఞకర్మలో దానం చేసేవాడు శ్రేష్ఠుడని బ్రహ్మదేవుడు చెప్పాడు.

ఆ. దానగుణము శ్రద్ధ లేనివానికి లేదు । గాన యివ్విధమునఁ గమలభవుఁడు
నిశ్చయించె; నీవు నిర్మలశ్రద్ధాభి । పూతమతివి గమ్ము పుణ్యచరిత! 250

ప్రతిపదార్థం: పుణ్యచరిత!= పవిత్రమైన నడవడి కలవాడా!; శ్రద్ధలేనివానికిన్= శ్రద్ధావిరహితుడికి; దానగుణము= దానంచేయాలనే స్వభావం; లేదు= ఉన్నదికాదు; కాన= కాబట్టి; కమలభవుఁడు= బ్రహ్మ; ఈ+విధమునన్= ఈరీతిగా; నిశ్చయించెన్= నిర్ణయించాడు; నీవు నిర్మలశ్రద్ధా+అభిపూతమతివి= నీవు విమలమైన శ్రద్ధచేత పవిత్రమైన బుద్ధికలవాడవుగా; కమ్ము= అగుము.

తాత్పర్యం: పావనమైన చరిత్రం కల ఓ జాజలీ! 'శ్రద్ధ' అనే గుణం లేనివాడికి దానం చేయాలనే స్వభావం ఉండదు. అందువలననే బ్రహ్మదేవుడు 'దానం చేసేవాడే శ్రేష్ఠుడు' అని నిర్ణయించి చెప్పాడు. నీవు శ్రద్ధయొక్క గొప్పతనాన్ని గుర్తించి నీబుద్ధిని నిర్మలమైన శ్రద్ధతో పవిత్రంగా చేసికొమ్ము.

ఆ. వినుము శ్రద్ధ గలుగు మనుజుండు పాపంబుఁ । దొలఁగఁ ద్రోవనేర్చుఁ; దోలు డిగ్గ
నూడ్వ వెరవు గలుగు నురగంబు చాడ్పునఁ । గాన మేలు శ్రద్ధధానుఁ డగుట.' 251

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; శ్రద్ధకలుగు= శ్రద్ధకలిగినటువంటి; మనుజుండు= మానవుడు; తోలు= కుబుసం; డిగ్గన్+ఊడ్వన్= తొలగించుకొనటానికి; వెరవుకలుగు= ఉపాయం గలిగినట్టి; ఉరగంబు చాడ్పునన్= పామువలె; పాపంబున్= పాపాన్ని; తొలఁగన్+త్రోవ నేర్చున్= తొలగేటట్లు త్రోసి వేయటానికి శక్తికలవాడవుతాడు; కాన= కాబట్టి; శ్రద్ధధానుఁడు+అగుట= శ్రద్ధగలవాడు కావటం; మేలు= శుభకరం.

తాత్పర్యం: ఇంకను వినుము. అనాయాసంగా కుబుసాన్ని తొలగించుకొనే పాములవలె శ్రద్ధావంతుడైన మానవుడు పాపమును తొలగించుకొంటాడు. అందువలన మానవుడు శ్రద్ధావంతుడు కావటం శుభప్రదం.

వ. అని వెండియు. 252

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఇట్లా చెప్పి మళ్ళీ (ఆ పక్షులు ఈ రీతిగా అన్నాయి.)

ఆ. 'మత్సరాది చిత్తమాలిన్యములు శ్రద్ధ । గల మనంబునందు నిలువనేర'
వనినఁ దేఱి యిట్టులనియె జాజలి తులా । ధారుతోడ నిభృతిఁ గౌరవేంద్ర! 253

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధర్మరాజా! శ్రద్ధగల= శ్రద్ధకలిగినట్టి; మనంబునందున్= చిత్తంలో; మత్సర+ఆది చిత్త మాలిన్యములు= మాత్సర్యం మొదలైన మనోదోషాలు; నిలువన్ నేరవు= నిలబడజాలవు; అనినన్= అని చెప్పగా; తేఱి= తేరుకొని; జాజలి= జాజలిముని; నిభృతిన్= నిబ్బరంగా; తులాధారుతోడన్= తులాధారుడనే వ్యాపారితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! శ్రద్ధగలవాడి మనస్సులో మత్సరం మొదలైన దోషాలు నిలబడలేవు, అని ఆ పిచ్చుకలు జాజలితో చెప్పాయి. అది విని జాజలి తేరుకొన్నాడు. తరువాత తులాధారుడిని చూచి సవినయంగా ఇట్లా అన్నాడు:

క. మునులవలనఁ దత్త్వం బే । వినకుండుటఁ జేసి యిట్టివిధము గలిగె నా
కనఘా! నీ వాక్యంబుల । మనంబు దెలివొందె శాంతి మరగెద నింకన్.' 254

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; మునులవలనన్= తాపసులనుండి; ఏన్= నేను; తత్త్వంబు= తత్త్వార్థమును; వినకుండుటన్+చేసి= ఆలకించకపోవటంవలన; నాకున్= జాజలినైన నాకు; ఇట్టివిధము= ఈ రీతి; కలిగెన్= సంభవించింది; నీ వాక్యంబులన్= నీవు చెప్పిన మాటలచేత; మనంబు= చిత్తం; తెలివి+ఒందెన్= తెలివిపొందింది; ఇంకన్= ఇటుపైన; శాంతిన్= శమమును; మరగెదన్= అభ్యసిస్తాను.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ తులాధారా! పూర్వం నేను మునులవద్ద తత్త్వం వినలేదు. అందువలన నా కిట్టి 'ఆత్మశ్లాఘాపరత్వం' అనే అవినయదోషం సంభవించింది. నీ ఉపదేశవచనాల వలన నా మనస్సు కిప్పుడు తెలివిగలిగింది. ఇక మీద నేను శాంతిమార్గంలో నడుస్తాను'.

వ. అనిన నభినందించి తులాధారుండు. 255

ప్రతిపదార్థం: అనినన్= జాజలి అట్లా అనగా; తులాధారుండు= తులాధారుడనే వైశ్యుడు; అభినందించి= మెచ్చి.

తాత్పర్యం: జాజలి అట్లా అనేసరికి తులాధారుడు (పశ్చాత్తాపంతో కూడిన అతడి మాటలు విని) అతడిని అభినందించి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. తన తన తెరువునఁ గర్మం । బనుష్ఠితం బైన మేల యనఘ! నివృత్తిం
గని శ్రద్ధ గూర్పఁగా నే । ర్పెనయంగా వలయు దాని యెడయం దతఁడున్. 256

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తన తన తెరువునన్= తనకు తనకు చెందిన మార్గంలో; కర్మంబు= పని; అనుష్ఠితంబు+ఐనన్= చేయబడితే; మేలు+అ= శుభమే; దాని ఎడ అందున్= ఆ కర్మ వ్యవహారంలో; అతఁడున్= ఆ కర్మానుష్ఠానపరుడు; నివృత్తిన్+కని= నివర్తనమును పొంది; శ్రద్ధన్+కూర్పఁగాన్= శ్రద్ధను సంఘటించటానికి; నేర్పు= చాతుర్యం; ఎనయంగావలయున్= పొందాలి.

తాత్పర్యం: పాపరహితుడా! మానవుడు తనకు విధ్యుక్తమైన ఏ కర్మకలదో, ఆ కర్మను చక్కగా అనుష్ఠించటం మేలు. మరియు అతడు ఆ కర్మపట్ల నివృత్తిని పొంది శ్రద్ధతో కర్మసన్న్యాస పద్ధతిని పాటించటానికి తగిన నేర్పుకూడా కలిగి ఉండాలి.

ఆ. అట్లకాక యని ప్రియంబుమై వీడ్కొని । జాజలియును జనియె రాజవర్య!
యిహపరముల నెసకమెసఁగ సౌఖ్యము తులా । ధారుఁడును సమున్నతత్వ మొందె. 257

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజశ్రేష్ఠా!; జాజలియును= జాజలిమునీంద్రుడును; అట్లకాక!= అట్లేఅగునుగాక!; అని ప్రియంబుమైన్= అని ప్రీతితో; వీడ్కొని= పోయివస్తానని చెప్పి వదలి; చనియెన్= వెళ్ళాడు; తులాధారుఁడును= తులాధారుడుకూడా; ఇహపరములన్= ఈ లోకంలోను, పరలోకంలోను; సౌఖ్యము= సుఖం; ఎసకమెసఁగన్= అతిశయించగా; సమున్నతత్వము= గొప్పతనమును; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: నృపశ్రేష్ఠుడవగు ఓ ధర్మరాజా! తులాధారు డట్లా చెప్పేసరికి జాజలి 'అట్లే అగుగాక!' అని చెప్పి ప్రీతితో వీడ్కోలు వడసి వెళ్ళిపోయాడు. తులాధారుడు సైతం ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖం పెంపొందగా మహోన్నతస్థితిని పొందాడు.

క. ఆ వణిజుఁడు ధర్మస్థితి । దేవతలును మెచ్చునట్లు దెలియఁగఁ బలికెన్
నీ వీ వాక్యము లన్నిట । భావం బలవఱిచి కసటు వాపుము వత్సా!' 258

ప్రతిపదార్థం: వత్సా!= పుత్రా!; ఆ వణిజుఁడు= ఆ వర్తకుడు; దేవతలును= అమరులుకూడా; మెచ్చునట్లు= అభినందించేటట్లు; ధర్మస్థితి= ధర్మంయొక్క పద్ధతిని; తెలియఁగన్+పలికెన్= తెలిసేటట్లు చెప్పాడు; ఈ వాక్యములు+అన్నిటన్= తులాధారుడు వచించిన మాటలన్నిటిలోను; భావంబు= అభిప్రాయం; అలవఱిచి= అలవడజేసి; నీవు కసటు= నీవు మాలిన్యమును; పాపుము= తొలగించు కొనుము.

తాత్పర్యం: కుమారా! తులాధారుడు దేవతలు సైతం మెచ్చుకొనే విధంగా, ధర్మపద్ధతిని గూర్చి స్పష్టంగా వివరించాడు. నీవు అతడు జెప్పిన మాటలన్నిటిలోనూ నీ భావాన్ని సమన్వయింపజేసి నీ హృదయంలోని మాలిన్యాన్ని తొలగించుకొమ్ము'.

వ. అని చెప్పినం బ్రమదంబు నొంది. 259

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని వచించగా; ప్రమదంబు= సంతోషం; ఒంది= పొంది.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పేసరికి సంతోషం పొంది (తరువాతి పద్యంతో అన్వయం).

క. సురసరిదాత్మజుతోఁ గురు । నరపాలోత్తముఁడు వినయనమ్రుం డగుచున్
'జిరమో కార్యసమీక్ష య । చిరమో వలయునది కరుణఁ జెప్పు' మనవుడున్. 260

ప్రతిపదార్థం: కురునరపాల+ఉత్తముఁడు= ధర్మరాజు; వినయనమ్రుండు+అగుచున్= వినయంతో వంగి నమస్కరించేవాడై; సురసరిదాత్మజుతోన్= గంగానదీ పుత్రుడైన భీష్ముడితో; కార్యసమీక్ష= కార్యముయొక్క పరిశీలన; వలయునది= ఆవశ్యకమైనది; చిరమో= బహుకాలమో; అచిరమో= అల్పకాలమో; కరుణన్= కృపతో; చెప్పుము= వివరించుము; అనవుడున్= అనగా.

తాత్పర్యం: కౌరవాధిపతి అగు ధర్మజుడు వినయంతో ప్రణమిల్లి భీష్ముడితో 'కార్యాలను సమీక్షించటంలో అవసరమైనది బహుదీర్ఘ సమయమా? లేక అత్యల్పసమయమా?' (చాలకాలం ఆలోచించి కార్యం నెరవేర్చవలెనా? లేక త్వరపడి నిర్ణయం చేయవలెనా?) దయచేసి ఈ సంగతి వివరించు'మని అడిగాడు. అట్లా అడిగేసరికి - (తరువాతి వచనంతో అన్వయం).

వ. అతం డతని కిట్లనియె: 261

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు:

క. 'త్వరితము సేయక కార్యము । చిరంతన విమర్శనముగఁ జేసి యెనర్పన్
ధరణీశ్వర! యోటువడఁడు । పురుషుఁడు; సిద్ధియును వానిఁ బొందు దృఢముగన్. 262

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= రాజా!; పురుషుఁడు= మనుజుడు; కార్యము= పని; త్వరితము చేయక= వేగిరం చేయక; చిరంతన విమర్శనముగన్ చేసి= చాలకాలం పరామర్శతో కూడినదిగా; ఒనర్పన్= చేస్తే; ఓటు పడఁడు= ఓడిపోడు; వానిన్= ఆ రీతిగా చేసేవాడిని; సిద్ధియును= ఫలప్రాప్తికూడా; దృఢముగన్= నిశ్చయంగా; పొందున్= చేరుతుంది.

తాత్పర్యం: 'రాజా! పనిచేసేటప్పుడు త్వరపడరాదు. తొందరపడకుండా చక్కగా చాలాకాలం ఆలోచించి చేస్తే ఓటమి కలుగదు. అంతేకాక అట్లా చేసేవాడికి తప్పకుండా ఆ కార్యంలో విజయం కూడా సిద్ధిస్తుంది.

క. తాలిమి లేని జనంబులు । మేలెఱుఁగక యట్టివాని మీఁదను జాడ్యం
బాలస్యం బిది యని దో । షాలోచన మాచరింతు; రది మతి యగునే? 263

ప్రతిపదార్థం: తాలిమి లేని= ఓర్పు లేని; జనంబులు= ప్రజలు; మేలు+ఎఱుఁగక= శ్రేష్ఠమైనది తెలియక; అట్టివానిమీఁదను= ఆ విధంగా ఆలోచించి నిదానంగా పనులు చేసేవాడిపై; ఇది జాడ్యంబు= ఇది జడత్వం; ఆలస్యంబు+అని= అలసత్వం అని; దోష+ఆలోచనము= దొసగులను గూర్చిన చింతన; ఆచరింతురు= చేస్తారు; అది= అట్లా చేయటం; మతి అగునే?= తెలివి ఔతుందా?

తాత్పర్యం: ఏ మాత్రం సహనంలేనివారు మంచి ఏదో తెలియజాలరు. వారు చక్కగా ఆలోచించి కార్యాలు నిర్వర్తించేవాడిని చూచి 'వీడు జడుడు, అలసుడు' అని నిందిస్తారు. అది బుద్ధిమంతుల లక్షణం కాదు'.

వ. అని చెప్పి వెండియు నిట్లను 'నీవడిగిన యర్థంబు మేధాతిథి యను మునిసుతుండు చిరకారి యనువాని
వృత్తాంతంబు వినినం దెలియు; దానిం జెప్పెద. 264

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల; ఇట్లనున్= ఈ విధంగా అన్నాడు; నీవు+అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబు= విషయం; మేధాతిథిఅను మునిసుతుండు= మేధాతిథి అనబడే మునియొక్క పుత్రుడు; చిరకారి అనువాని= చిరకారి అనబడే వాడియొక్క; వృత్తాంతంబున్= చరిత్రను; వినినన్= ఆలకిస్తే; తెలియున్= తేటపడుతుంది; దానిన్= ఆ చరిత్రను; చెప్పెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: భీష్ముడు డారీతిగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ఇప్పుడు నీ వడిగిన విషయం మేధాతిథి అనే తాపసుడి కుమారుడు 'చిరకారి' అనే వాడి చరిత్ర వింటే స్పష్టమవుతుంది. ఆ కథ వివరిస్తాను వినుము.

చిరకారియను మునికుమారుని చరిత్ర (సం. 12-258-2)

క. అతఁడు చిరకాల సువిచా । రితంబుగాఁ జేసి యాచరించుం గురుభూ
పతివర్య! యెద్దియును నది । గతముగఁ జిరకారి నామకంబునఁ బరఁగున్. 265

ప్రతిపదార్థం: కురుభూపతివర్య!= కౌరవరాజశ్రేష్ఠా!; అతఁడు= ఆ మేధాతిథి కుమారుడు; ఎద్దియును= ఏ పని ఐనను; చిరకాల సువిచారితంబుగాన్+చేసి= చాలాకాలం చక్కగా ఆలోచనతో కూడినదిగా కావించి; ఆచరించున్= అనుష్ఠించును; అది కతముగన్= అదికారణంగా; చిరకారినామకంబునన్= చిరకారి అనే పేరుతో; పరఁగున్= ప్రవర్తిల్లుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ మేధాతిథిపుత్రుడు ఏ పనినీ తొందరపడి చేయడు. చక్కగా ఆలోచించి చాలాకాలం తర్వాత ఆ పని నెరవేరుస్తాడు. అందువలననే ప్రజ లతడిని 'చిరకారి' అని వ్యవహరించారు.

సీ. వినుఁ మొక్క కారణంబున ముని పత్నిపైఁ । గోపించి చంప నక్కొడుకుఁ బనిచి
యెటయేని వెడలి పోవుటయును, బనులెల్లఁ । జిరవిచారముతోడఁ జేయుఁ గాన
యచ్చిరకారి యిట్లని విచారించె 'జ । నకు పంపుసేఁత మానంగరాదు,
తల్లిఁ జంపుటయును తగదు; తండ్రి తలంపుఁ । దప్పింతుఁ గాకని తలఁతునేనిఁ

తే. గల్మషంబంద్రు దాని సత్కర్మవిదులు; । మాతృరక్ష గర్తవ్య మెమ్మాడ్కినైనఁ;
బుత్ర భావ మస్వాతంత్ర్యమునకు నెలవు; । పాప మడఁగింప నెవ్వల నోపు నొక్కొ! 266

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ముని= మేధాతిథిఅనే మౌని; ఒక్కకారణంబునన్= ఏదో ఒక కారణం చేత; పత్నిపైన్= భార్యమీద; కోపించి= కోపపడి; చంపన్= (ఆమెను) చంపటానికై; ఆ+కొడుకున్= ఆ కుమారుడిని; పనిచి= నియోగించి; ఎటఏనిన్= ఎచ్చటికో; వెడలిపోవుటయున్= బయలుదేరి పోగా; ఆ+చిరకారి= ఆ చిరకారి అనేవాడు; పనులు+ఎల్లన్= కార్యాలన్నీ; చిరవిచారముతోడన్= దీర్ఘకాలపుటాలోచనతోగూడ; చేయున్+కాన= చేస్తాడు కాబట్టి; ఇట్లు+అని= ఈ రీతిగా; విచారించెన్= చింతించాడు; జనకుపంపుసేఁత= తండ్రి ఆదేశాన్ని నిర్వర్తించటం; మానంగన్ రాదు= నిలుపతగదు; తల్లిన్= అమ్మను; చంపుటయును= హతమార్చుటకూడా; తగదు= ఉచితంకాదు; తండ్రి తలంపు= జనకుడి సంకల్పాన్ని; తప్పింతున్+కాక+అని= తొలగింతునుగాక అని; తలఁతునేనిన్= భావించెదనేని; దానిన్= అట్లు చేయటాన్ని; సత్కర్మవిదులు= మంచికార్యాలను గురించి తెలిసిన పెద్దలు; కల్మషంబు+అండ్రు= పాప మంటారు; ఏ+మాడ్కిన్+ఐనన్= ఏ రీతిగా నైనా; మాతృరక్ష= తల్లిని కాపాడటం; కర్తవ్యం= చేయదగినది; పుత్రభావము= పుత్రత్వం; అస్వాతంత్ర్యమునకున్= స్వతంత్రత లేమికి; నెలవు= ఆశ్రయం; పాపము= ఈ కల్మషమును; అడఁగింపన్= నశింపజేయుటకు; ఏ+వలను= ఏ ఉపాయం; ఓపును+ఒక్కొ!= సమర్థమైన దొకో!

తాత్పర్యం: ధర్మజా! వినుము. మేధాతిథి ఏదో ఒక కారణాన భార్యపై కోపించాడు. కొడుకును పిలిచి ఆమెను చంపుమని ఆదేశించి వెంటనే అత డెక్కడికో వెళ్ళిపోయాడు. మునికుమారుడైన చిరకారి తాను చేసే పనులన్నీ చాలాసేపు ఆలోచించి చేసే లక్షణం కలవాడు. అందువలన అత డిట్లా ఆలోచించాడు; 'మాతండ్రి ఆజ్ఞను పాటించకుండా ఉండటానికి వీలుగాదు. అట్లని తల్లిని చంపటం కూడా యుక్తం కాదు. తండ్రియొక్క ఆలోచన తప్పించటానికి ప్రయత్నిద్దా మనుకొంటే సత్కర్మవేత్తలైన పెద్దలు అట్లా చేయటం పాపమంటారు. తల్లినెట్లాగైనా కాపాడాలి. ఏ విధంగా చూచినా తల్లిదండ్రులమధ్య ఈ 'పుత్రత్వం' అనేది స్వేచ్ఛలేనిదిగా ఉన్నది. ఈ పాపాన్ని తొలగించజాలినది ఏదైనా ఉపాయమున్నదా?

క. జననీ వధంబు సేసిన । ననుమానమె నరక మగుట యని యుడిగితిఁ బో,
జనకావమాన మొనరిం । చిన వానికి నరకమున వసింపఁగ వలదే. 267

ప్రతిపదార్థం: జననీవధంబున్= మాతృహత్యను; చేసినన్= చేస్తే; నరకము+అగుట= నరకలోకప్రాప్తి; అనుమానమె? అని= సందేహమా? అని; ఉడిగితిన్‌పో= వర్జించితినిపో; జనక+అవమానము= తండ్రియొక్క తిరస్కారమును; ఒనరించినవానికిన్= చేసినవాడికి; నరకమునన్= నరకలోకమునందు; వసింపఁగ వలదే?= నివసించవలసిరాదా?

తాత్పర్యం: తల్లిని చంపితే నరకం వస్తుందని భావించి మాతృహత్యను వర్జిస్తాననుకో, అప్పుడు పిత్రాజ్ఞ ధిక్కరించిన దోషం రాదా? ఆ దోషం వలన నరకప్రాప్తి తప్పుతుందా?

తే. తల్లి ధాత్రిక బీజంబు తండ్రి వెట్టు । వంశధరణార్థముగ; నిది వారి భంగి;
యేను బొత్తులవాఁడ; నయ్యిరువురకును । వీరలం దిప్పు డెవ్వరి విడుచువాఁడ?' 268

ప్రతిపదార్థం: వంశధరణ+అర్థముగన్= వంశాన్ని నిలపటానికి; తల్లి; ధాత్రిక= నేల; తండ్రి= జనకుడు; బీజంబుపెట్టున్= విత్తనం నాటుతాడు; ఇది= ఈ రీతిగా చేయటం; వారి భంగి= జననీజనకుల పద్ధతి; ఏను= నేను; ఆ+ఇరువురకును= ఆ ఇద్దరికీ; పొత్తులవాఁడన్= ఉమ్మడిగా సంబంధించినవాడను; వీరలందున్= వీరిరువురిలో; ఇప్పుడు= ఈ సమయంలో; ఎవ్వరిన్= ఎవరిని; విడుచువాఁడన్?= వదలగలను?

తాత్పర్యం: వంశము నిల్పటానికి గాను తల్లి నేలకాగా, తండ్రి అందులో బీజావాపం చేస్తాడు. ఇది వారి పద్ధతి. నేను తల్లి దండ్రులిద్దరికీ సంబంధించినవాడను. ఈ క్లిష్టపరిస్థితిలో ఈ ఇరువురిలో నే నిప్పు డెవరిని వదలిపెట్టగలను?'

విశేషం: ధాత్రిక అనే పాఠానికి 'భస్త్రిక' అనే పాఠాంతరం ఉన్నది. 'ధాత్రిక' పాఠమే సమంజసం.

వ. అని విచారించి తలంచుకొని. 269

ప్రతిపదార్థం: అని విచారించి= అని చింతించి; తలంచుకొని= భావించుకొని.

తాత్పర్యం: చిరకారి ఈ రీతిగా చింతించి తలచుకొన్నవాడై - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'జనకుఁడ యేనై జన్మిం । చినవాఁడను; జనకు పంపు సేసినఁ బాయుం
దనయుని పాపము లనియును । వినియుండుదుఁ; దలఁపు లింక వేయును నేలా? 270

ప్రతిపదార్థం: జనకుఁడు+అ = తండ్రియే; ఏనై= నేనై; జన్మించిన వాఁడను= పుట్టినవాడను; తనయుని పాపములు= కుమారుడి పాపాలు; జనకుని పంపు= తండ్రి ఆజ్ఞను; చేసినన్= నెరవేరిస్తే; పాయున్= తొలగుతాయి; అనియును= అనికూడా; వినియుండుదున్= ఆలకించిఉన్నాను; ఇంకన్= ఇకపై; తలపులు= సంకల్పాలు; వేయునున్+ఏలా?= వేయి ఎందుకు?

తాత్పర్యం: తండ్రియే నేనై పుట్టాను. జనకుడి ఆజ్ఞ నెరవేరిస్తే కుమారుడి పాపాలన్నీ నశిస్తాయని కూడా విని ఉన్నాను. ఇంక లేనిపోని వేయి ఊహలు ఎందుకు?

విశేషం: "ఆత్మా వై పుత్రనామాసి" అనేశ్రుతి ననుసరించి తండ్రియే కుమారుడై జన్మిస్తాడని గ్రహించాలి.

క. జనకుఁడు దపమును ధర్మం । బును విద్యయుఁ బరమదైవమును గావున నా
తనికిఁ బ్రియంబగు పని సే । సిన దేవత లెల్లఁ బ్రీతిఁ జెందుట గల్గున్. 271

ప్రతిపదార్థం: జనకుఁడు= తండ్రి; తపమును= తపస్సున్నూ; ధర్మంబును= శాస్త్రోక్త ధర్మమున్నూ; విద్యయున్= చదువున్నూ; పరమదైవమును= శ్రేష్ఠమైన దైవమున్నూ; కావునన్= కాబట్టి; ఆతనికిన్= తండ్రికి; ప్రియంబు+అగు= ప్రీతిపాత్రమైన; పని= కార్యం; చేసినన్= చేస్తే; దేవతలు+ఎల్లన్= దేవతలందరూ; ప్రీతిన్+చెందుట= సంతోషపడటం; కల్గున్= ఔతుంది.

తాత్పర్యం: తపస్సు, ధర్మం, విద్య, శ్రేష్ఠమైన దైవం - ఇవన్నీ తండ్రియే. అందువలన తండ్రికి ప్రీతి గలిగించే పని నెరవేరిస్తే దేవతలందరూ ప్రీతి పొందుతారు'.

వ. అని వితర్కించియుఁ దల్లి తెఱంగుఁ దలంచి. 272

ప్రతిపదార్థం: అని వితర్కించియున్= అని విశేషంగా ఆలోచించికూడా; తల్లి తెఱంగున్= మాతృస్థితిని; తలంచి= చింతించి.

తాత్పర్యం: ఈ విధంగా తండ్రిని గూర్చి విశేషంగా చిరకారి విచారించాడు. తదుపరి తల్లియొక్క స్థితిని గూర్చి ఆలోచించి (మళ్ళీ ఇట్లా అనుకొన్నాడు) - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కరచరణాది సంఘటితకాయము సంజననంబు వహ్నిపు
ట్టరణికిఁ బోలెఁ దల్లి దెసనైనది గాదొకొ! యట్లుఁగాక దు
ర్భరమగు గర్భఖేదమును బట్టికినై నిజదేహచింతపై
భర మొకయింతలేక పడుపాటులు నక్కట! యెక్కు డింతకున్. 273

ప్రతిపదార్థం: వహ్నిపుట్టు= అగ్నియొక్క పుట్టుక; అరణికిన్+పోలెన్= త్రచ్చుటచేత నిప్పును గలిగించే కొయ్యకువలె; కరచరణాది సంఘటితకాయము సంజననంబు= చేతులు, కాళ్ళు మొదలైన అవయవాలతో కూడిన శరీరం యొక్క పుట్టుక; తల్లిదెసన్= జననియందు; ఐనది కాదొకొ!= జరిగినది కాదా!; అట్లున్‌కాక= అట్లు కావటమే కాక; దుర్భరము+అగు= భరించరాని; గర్భ ఖేదమును= పురిటి నొప్పుల వలన కలిగే బాధ; నిజదేహచింతపైన్= తన శరీరానికి చెందిన విచారంమీద; ఒక ఇంత= ఇసుమంత కూడా; భరములేక= బరువులేక; పట్టికినై= బిడ్డకొరకై; పడుపాటులున్= పడే కష్టాలు కూడ; ఇంతకున్= స్వశరీరచింత కంటె; ఎక్కుడు= ఎక్కువ; అక్కట!= అయ్యో!

తాత్పర్యం: అగ్ని అరణిని మథించటం వలన అందులో పుట్టుతుంది. అట్లాగే చేతులు, కాళ్ళు మొదలైన అంగాలతో కూడిన ఈ శరీరం తల్లినుండే జనిస్తుంది. అంతేకాదు సహించశక్యంకాని గర్భధారణ క్లేశం, తన శరీరంయొక్క బాగోగులు చూచుకొనకుండ బిడ్డకై పడే పలు కష్టాలు అయ్యో! తల్లికే ఎంతో ఎక్కువగా ఉంటాయి.

ఆ. వచ్చిపోయి చూచువాఁడు గా కిడుమలఁ। బడునె తల్లిపోలెఁ బట్టితోడఁ
దండ్రి చెప్పు నిట్లు ధర్మశాస్త్రంబులు। నంబ గౌరవమున నధిక యగుట. 274

ప్రతిపదార్థం: తండ్రి= జనకుడు; వచ్చిపోయి చూచువాఁడుకాక= వస్తూ పోతూ చూస్తూఉండే వాడేకాక; పట్టితోడన్= బిడ్డతో; తల్లిపోలెన్= జననివలె; ఇడుమలన్+పడునె?= కష్టాలు పడుతాడా?; ధర్మశాస్త్రంబులున్= ధర్మశాస్త్రాలు కూడా; అంబ= తల్లి; గౌరవమునన్= గురుత్వమునందు; అధిక అగుటన్= (తండ్రికంటె) గొప్పది కావటాన్ని; ఇట్లు= ఇదే రీతిగా; చెప్పున్= చెప్పుతున్నవి.

తాత్పర్యం: తండ్రి బిడ్డవద్దకు రాకపోకలు సాగిస్తూ చూస్తూ ఉంటాడు. అంతేకాని తల్లివలె బిడ్డవిషయాన్ని గాఢంగా పట్టించుకొని బాధపడడు. ధర్మశాస్త్రాలు కూడా తండ్రికంటె తల్లి గౌరవంలో గొప్పది అని ఇట్లాగే చెప్పుతున్నాయి.

విశేషం: **"ఉపాధ్యాయాన్ దశాచార్యః । ఆచార్యాణాం శతం పితా ।**
సహస్రం తు పితౄన్ మాతా । గౌరవే ణాతిరిచ్యతే ॥

అని మన్వాది ధర్మశాస్త్రాలు చెప్పుతున్నాయి. అంటే పదిమంది ఉపాధ్యాయులకంటె ఒక ఆచార్యుడు, నూరుమంది ఆచార్యులకంటె ఒక తండ్రి, వెయ్యిమంది తండ్రులకంటె ఒక తల్లి గౌరవంలో గొప్పవారుగా ఉన్నారని భావం. అందుకే వేదంకూడా 'మాతృదేవో భవ' అని తల్లినే మొదటి దైవంగా భావించుమని బోధించింది.

ఆ. బాలుఁ డైనఁ గొడుకు ప్రౌఢుఁ డైనను వృద్ధుఁ । డైన నొక్క విధమ యర్మిలియును
నరయు భరముఁ దల్లి కా పదార్థంబు జ । గంబు కలిమికెల్లఁ గారణంబు. 275

ప్రతిపదార్థం: కొడుకు= పుత్రుడు; బాలుఁడైనన్= పిల్లవాడైనా; ప్రౌఢుఁడు+ఐనను= యుక్తవయస్సు కలవాడైనా; వృద్ధుఁడు+ఐనన్= ముసలివాడైనా; అర్మిలియును= ప్రేమయు; అరయు భరము= కాపాడే బాధ్యత; తల్లికిన్= జననికి; ఒక్క విధము+అ= ఒకేరీతిగా ఉంటుంది; ఆ పదార్థంబు= 'తల్లి' అనే ఆ వస్తువు; జగంబు కలిమికిన్+ఎల్లన్= సర్వ ప్రపంచపుటునికికీ; కారణంబు= నిమిత్తం.

తాత్పర్యం: కన్నకొడుకు చిన్న వయస్సులోఉన్నా, యుక్తవయస్సు కలవాడైనా; వృద్ధుడైనా తల్లికి వాడిమీద ప్రేమ, అతడిని రక్షించే బాధ్యత ఒకేరీతిగా ఉంటాయి. 'తల్లి' అనే వస్తువే ఈ లోకానికంతటికీ మూలకారణం.

ఆ. క్షుద్ర జంతువులకు గురులకు నెమ్మెయిఁ । దలఁప నొక్కరూప తల్లి వలయు
నూఱడిల్లఁ గలదె యొండుసోటుల సువ । స్తువు నివాసమైన చోటఁ గాక! 276

ప్రతిపదార్థం: క్షుద్రజంతువులకున్= నీచ జంతువులకూ; గురులకున్= పెద్దవారికీ; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; తలఁపన్= ఆలోచించగా; తల్లి= మాత; ఒక్కరూప వలయున్= ఒకే విధంగా అవసరమై ఉన్నది; సువస్తువు= మంచి వస్తువు; నివాసము+ఐన= నివసించెడి; చోటన్+కాక= ప్రదేశంలో కాక; ఒండుచోటులన్= వేరే చోట్ల; ఊఱడిల్లన్+కలదె?= ఉపశమించటానికున్నదా?

తాత్పర్యం: నీచ ప్రాణులకైనా, ఉత్తమప్రాణులకైనా ఏ రీతిగా ఆలోచించి చూచినా తల్లి ఒకే రీతిగా అవసరమై ఉన్నది. తల్లివంటి సత్పదార్థం ఉన్నచోట సుఖంగా ఉండగలంగాని, అది లేనిచోట ఉపశాంతితో జీవించటం సాధ్యమా?

క. అప్పుడ యసమర్థుం డగు । నప్పుడ దుఃఖీయగు శూన్యమై తోఁచు జగం
బప్పుడ మాతృవియోగం । బెప్పుడు వాటిల్లె నపుడ యెంతయుఁ దూలున్. 277

ప్రతిపదార్థం: మాతృవియోగంబు= తల్లితో ఎడబాటు; ఎప్పుడు= ఏ కాలంలో; పాటిల్లెన్= కల్గెనో; అప్పుడు+అ= అప్పుడే; అసమర్థుండు+అగున్= శక్తిలేనివాడౌతాడు; అప్పుడు+అ= ఆ కాలంలో; దుఃఖి+అగున్= దుఃఖం పొందినవాడౌతాడు; అప్పుడు+అ= అప్పుడే; జగంబు= లోకం; శూన్యము+ఐ= లేనిదై; తోఁచున్= భావనకు వస్తుంది; అపుడు+అ= అప్పుడే; ఎంతయున్= మిక్కిలిగా; తూలున్= చలించిపోతుంది.

తాత్పర్యం: ఎవడికి తల్లితో ఎప్పుడు వియోగం కలుగుతుందో, వాడు అప్పుడే అన్ని విధాలా అశక్తు డవుతాడు. అప్పుడే దుఃఖితు డవుతాడు. అతడికి లోకమంతా శూన్యమై తోస్తుంది. అప్పుడు వాడు చలించిపోతాడు.

క. కలవాఁడు లేనివాఁడు స । బలుఁ డబలుఁడు మూఢబుద్ధి ప్రౌఢుం డనఁగా
వల; దెవ్వరికైన జనని । కలిమియ యత్యంతసౌఖ్యకరమై యుండున్. 278

ప్రతిపదార్థం: కలవాఁడు= సంపన్నుడు; లేనివాఁడు= పేదవాడు; సబలుఁడు= బలవంతుడు; అబలుఁడు= బలహీనుడు; మూఢబుద్ధి= తెలివిలేనివాడు; ప్రౌఢుండు= బుద్ధిమంతుడు; అనఁగాన్ వలదు= అని చెప్పవద్దు; ఎవ్వరికైనన్= ఎట్టివారికైనాసరే; జనని కలిమియ= తల్లి ఉండటమే; సౌఖ్యకరము+ఐ= సుఖము కలిగించేదై; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: వాడు ధనికుడు కావచ్చును, లేక పేదవాడు కావచ్చును. బలవంతుడు కావచ్చును, లేదా బలహీనుడు కావచ్చును. మూర్ఖుడు కావచ్చును, లేదా బుద్ధిమంతుడు కావచ్చును. వాడూ వీడూ అనవలసిన పని లేదు. ఎవడికైనా తల్లి జీవించి ఉండటమే సుఖహేతువై ఉంటుంది.

తే. ఇట్టి జనని వధించుట యెల్లభంగి । నధికపాప పయోరాశియందు ముంచు;
దీని నెఱుఁగండె పసులవాఁ డైన? వధకు । నేల తెంపు వాటిలుఁ? జేతు లెట్టులాడు?' 279

ప్రతిపదార్థం: ఇట్టి జననిన్= ఇట్లాంటి తల్లిని; వధించుట= చంపటం; ఎల్లభంగిన్= అన్నివిధాలా; అధికపాప పయోరాశి అందున్= గొప్ప 'పాప' మనే సాగరంలో; ముంచున్= ముంచివేస్తుంది; పసులవాఁడు+ఐన= పశువులు మేపుకొనేవాడైనా; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగండు+ఎ?= తెలియడా?; వధకున్= తల్లిని చంపటానికి; తెంపు= సాహసం; ఏల పాటిలున్= ఎట్లా సంభవిస్తుంది?; చేతులు= కరములు; ఎట్టులు+ఆడున్?= ఎట్లా పనిచేస్తాయి?

తాత్పర్యం: ఇట్లాంటి పూజ్యురాలైన తల్లిని వధించటం అన్ని రీతులా మహాపాపమనే సముద్రంలో ముంచివేస్తుంది. ఈ సంగతి పసులకాపరికి కూడా తెలిసిందే. తల్లిని చంపటానికి సాహస మెట్లా కల్గుతుంది? చేతు లెట్లా ఆడుతాయి?'

వ. అని యిట్లు పెక్కు భంగుల నూహించుచుఁ జిరకారి యగుట నతండు శీఘ్రకారి గాక యుండం దడవెంతయేనియుం గలిగె నంతకుం దదీయ జనకుండు. 280

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ రీతిగా; అతండు= ఆ మునికుమారుడు; పెక్కుభంగులన్= అనేక విధాల; ఊహించుచున్= తర్కిస్తూ; చిరకారి అగుటన్= 'చిరకారి' (ఆలసించి చేసేవాడు) కావటంచేత; శీఘ్రకారి కాకఉండన్= తొందరపడి పనిచేసేవాడు కాకుండా ఉండగా; ఎంతవినియున్= ఎంతో; తడవు= ఆలస్యం; కలిగెన్= అయింది; అంతకున్= ఆ సమయానికి; తదీయ జనకుండు= అతడి తండ్రి.

తాత్పర్యం: చిరకారి ఈ రీతిగా అనేక విధాల ఆలోచిస్తూ ఉండిపోయాడు. సహజంగా అతడు బహుకాలం చింతించి పనిచేసేవాడు కావటం వలన తొందరపడలేదు. ఇట్లా చాలా సమయం జరిగిపోయింది. అప్పటికి అతడి తండ్రి మేధాతిథి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడపనికి నాలిఁ జంపం । గొడుకుఁ బనిచి వచ్చినాఁడ గ్రూరత్వమునం
గడవంబడునొకొ పని?' యని । కడువెసఁ జనుదెంచె నశ్రుకణములు దొరఁగన్. 281

ప్రతిపదార్థం: క్రూరత్వమునన్= కఠినమైన స్వభావంతో; వెడపనికిన్= చిన్న పనికి; ఆలిన్= భార్యను; చంపన్= చంపటానికై; కొడుకున్= కుమారుడిని; పనిచి= ఆదేశించి; వచ్చినాఁడన్= వచ్చాను; పని= ఆ క్రూరమైన కర్మ; కడవన్+పడున్+ఒకొ అని=జరిగి పోయి ఉంటుందా అని; అశ్రుకణములు= కన్నీటి బొట్లు; తొరఁగన్= జారగా; కడున్ వెసన్= మిక్కిలి త్వరగా; చనుదెంచెన్=వచ్చాడు;

తాత్పర్యం: ఇంచుక పనికి కోపించి క్రూరుడనై భార్యను చంపుమని పుత్రుడి నాజ్ఞాపించి వచ్చాను. కుమారుడు ఆ పనిచేసి ఉంటాడేమో! అని కన్నీరు కారుస్తూ వడివడిగా తిరిగి వచ్చాడు.

వ. అట్లు సనుదెంచునప్పుడు. 282

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; చనుదెంచు+అప్పుడు= వచ్చేటప్పుడు.

తాత్పర్యం: అట్లా అతడు వచ్చేటప్పుడు.

క. 'చిరకారి యెట్లునుం దన । చిరకారితఁ జూపుఁ గాక శీఘ్రపుఁ జేతన్
దురటిల్లఁ జేయునే నను? । వెరవరి వాఁ డిట్టి పనికి వేగిరపడునే?' 283

ప్రతిపదార్థం: చిరకారి= నా కుమారుడగు చిరకారి; ఎట్లునున్= ఏ విధంగానైనా; తన చిరకారితన్= తనయొక్క చిరకారిత్వమును; అనగా ఆలస్యంగా పనిచేసే లక్షణం; చూపున్+కాక= ప్రదర్శిస్తాడుగాక; శీఘ్రము+చేఁతన్= త్వరతో కూడిన పనిచేత; ననున్= నన్ను; దురటిల్లన్+చేయునే?= వగచేటట్లు చేస్తాడా?; వాఁడు= అతడు; వెరవరి= ఉపాయశాలి; ఇట్టిపనికిన్= ఈ విధమైన పనికి; వేగిరపడునే?= తొందరపడతాడా?

తాత్పర్యం: 'నా పుత్రుడు చిరకారి ఏ రీతిగానైనా చాలాకాలం ఆలోచించి పనిచేసే తన సహజ స్వభావాన్నే ప్రదర్శిస్తాడు. కాని త్వరపడి పనిచేసి నన్ను దుఃఖింపజేస్తాడా? వాడు చాలా ఉపాయం కలవాడు. అందువలన ఇట్లాంటి క్రూరమైన పనికి తొందరపడతాడా? (పడ డని భావం).

వ. అని పుత్రునుద్దేశించి. **284**

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా భావించి; పుత్రున్+ఉద్దేశించి= కుమారుడితో.

తాత్పర్యం: ఇట్లా భావించి కుమారుడితో (మళ్ళీ ఇట్లా అనుకొన్నాడు).

చ. 'చిరముగ గర్భవాసమునఁ జెందితి పుత్ర చిరంబుగాఁగ ని
న్నరసె గదయ్య తల్లి; యనయంబును నేఁబనుపంగఁ బూనియుం
జిరమగునట్టి యిత్తెఱఁగుసేఁత దలంచితయేని సత్కృపా
పర! చిరకారి నాబరఁగు భాసితనామము సార్థకం బగున్. **285**

ప్రతిపదార్థం: సత్కృపాపర!= మంచిదయగలవాడా!; పుత్ర!= కుమారా!; చిరముగన్= చాలాకాలంగా; గర్భవాసమునన్+చెందితి(వి)= తల్లియొక్క ఉదరవాసం చేశావు; తల్లి= మాత; చిరంబు+కాఁగన్= చాలాకాలంగా; నిన్నున్+అరసెన్+కదయ్య= నిన్ను కాపాడింది గదా నాయనా!; నేను= నేను; అనయంబును= నీతివిరహితమైన పనిని; పనుపంగన్= చేయుమని నిన్ను నియోగించగా; పూనియున్= పూనుకొని కూడా; చిరము+అగునట్టి= చాలాకాలం కొనసాగినట్టి; ఇత్తెఱఁగు చేఁత= ఈ పద్ధతిగా చేయటం; తలంచిత+అ+ఏనిన్= సంకల్పించితివా; చిరకారి+అనన్= చిరకారి అనగా; పరఁగు= ప్రవర్తిల్లే; భాసితనామము= ప్రకాశితమైన నీ పేరు; సార్థకంబు+అగున్= ప్రయోజనంతో కూడిన దవుతుంది.

తాత్పర్యం: కరుణాపరుడవైన ఓ కుమారా! నీవు చాలాకాలం నీతల్లి గర్భంలో ఉన్నావు. నిన్ను ఎంతోకాలం నీ తల్లి పోషించింది. నేను నిన్ను అవినీతి పరమైన కార్యం చేయటానికి పురికొల్పాను. ఐనా చాలాకాలం నీతల్లి నీకై చేసిన సేవలను తలంచుకొన్నావంటే 'చిరకారి' అనే నీ పేరు సార్థకమవుతుంది. (నీవు తొందర పడి నీ తల్లి వధకు పూనుకొనవు అని భావం).

ఆ. నాకు నా తపంబునకు నింద రాకుండ, । దురితభయము నిన్నుఁ బొరయకుండ
నెమ్మిఁ జేసి తన్న నీ చిరకారిత । సకల భూతములును సంస్తుతింప. **286**

ప్రతిపదార్థం: నాకున్= మేధాతిథినైన నాకూ; నా తపంబునకున్= నా తపస్సుకూ; నింద= అపవాదు; రాకుండన్= కలగకుండ; నిన్నున్= నా కుమారుడవైన నిన్ను; దురితభయము= పాపభీతి; పొరయకుండన్= అంటకుండా; నీ చిరకారితన్= నీయొక్క చిరకారిత్వాన్ని; సకలభూతములును= సమస్త ప్రాణులును; సంస్తుతింపన్= పొగడగా; నెమ్మిన్= ప్రీతితో; చేసితి(వి)+అన్న!= చేసితివా బాబూ!

తాత్పర్యం: బాబూ! నాకూ, నే నింతకాలం చేసిన తపస్సుకూ నింద కలుగకుండానూ, నా కుమారుడ వైన నీకు 'తల్లిని చంపినందుకు కలిగే పాపభీతి అంటకుండానూ, సమస్త ప్రాణులూ నీ 'చిరకారిత్వ' మనే లక్షణాన్ని

స్తుతింపగానూ, నీతల్లిపట్ల ప్రీతి నెఱపితివా? (నీ చిరకారిత నెమ్మి జేసితన్న?= నీ చిరకారిత్వ మనే ధర్మాన్ని ప్రీతితో నెరవేర్చావా నాయనా!' అని కూడా అన్వయించుకొనవచ్చును).

వ. అనుచుం జనుదెంచి నివాసంబు ప్రవేశించినం గని చిరకారి నిజకరంబున నున్న వధసాధనంబు డిగ్గ విడిచి యగ్గౌతమవంశవర్యు చరణంబులు శిరంబు సోఁకఁబ్రణామంబు సేసెం; బత్నియుం జాఁగిమ్రొక్కెఁ; నయ్యిరువుర నెత్తి శోకబాష్పంబు లానందాశ్రువులుగా నమ్మునివరుండు దనయుని గాఢాలింగనంబును, మూర్ధఘ్రాణంబునుం జేసి దీవనలం బొగడ్తల నభినందించి దానును వారును సుఖాసీను లై యుండి యిట్లనియె. 287

ప్రతిపదార్థం: అనుచున్= అని అనుకొంటూ; చనుదెంచి= వచ్చి; నివాసంబున్= గృహంలో; ప్రవేశించినన్= ప్రవేశించేసరికి; కని= చూచి; చిరకారి= అతడికుమారుడైన చిరకారి; నిజకరంబునన్+ఉన్న= తన చేతిలో ఉన్నట్టి; వధసాధనంబు= చంపటానికి సాధనమైన దానిని(కత్తిని); డిగ్గన్ విడిచి= వదలిపెట్టి; ఆ+గౌతమవంశవర్యు చరణంబులు= ఆ గౌతమవంశ శ్రేష్ఠుడైన మేధాతిథి పాదాలు; శిరంబుసోఁకన్= తలతాకేటట్లుగా; ప్రణామంబుచేసెన్= నమస్కరించాడు; పత్నియున్= భార్యకూడ; చాఁగిమ్రొక్కెన్= సాగిలబడి నమస్కరించింది; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఆ+ఇరువురన్= వారిద్దరినీ; ఎత్తి= పైకి లేవనెత్తి; శోకబాష్పంబులు= దుఃఖాశ్రువులు; ఆనంద+అశ్రువులుగాన్= సంతోషబాష్పాలు కాగా; తనయునిన్= కుమారుడిని; గాఢ+ఆలింగనంబును= గట్టి కౌగిలింతను; మూర్ధఘ్రాణంబునున్= శిరస్సు మూర్కొనుటను; చేసి= కావించి; దీనివలనన్= ఆశీర్వాదాలచేతనూ; పొగడ్తలన్= స్తుతులచేతనూ; అభినందించి= మెచ్చి; తానును= మేధాతిథి అయిన తానును; వారును= ఆ భార్యాపుత్రులును; సుఖాసీనులు+ఐ ఉండి= హాయిగా కూర్చున్నవారై ఉండి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా అనుకొంటూ వచ్చి మేధాతిథి తన ఇల్లు ప్రవేశించాడు. అతడిని చూచి చిరకారి తన చేతనున్న ఖడ్గాన్ని వదలిపెట్టాడు. ఆపై తండ్రి పాదాలు శిరస్సుసోకేటట్లు నమస్కరించాడు. మునిపత్ని కూడా ఆయనకు ప్రణమిల్లింది. ఆ మునీంద్రుడు ఆ యిద్దరినీ ఎత్తి తన దుఃఖబాష్పాలు ఆనందబాష్పాలు కాగా కుమారుడిని గట్టిగా కౌగిలించుకొన్నాడు. అతడి శిరసు మూర్కొన్నాడు. ఆశీర్వచనాలతోనూ, పొగడితలతోనూ అతడిని మెచ్చుకొన్నాడు. తరువాత మునీశ్వరుడూ, అతడి భార్యా, కుమారుడూ సుఖాసీనులై ఉన్నారు. అప్పుడు మేధాతిథి ఇట్లా అన్నాడు:

క. 'కార్యవిచారము చిరముగ । ధైర్యముతో నడపవలయుఁ; దత్త్రియలం
దార్యుఁ డనార్యుఁడు వీఁ డని । యార్యులు సేయుదురు నిశ్చయమును; దిరముగన్. 288

ప్రతిపదార్థం: కార్యవిచారమున్= కార్యంయొక్క సమీక్షను; చిరముగన్= చిరకాలంగా; ధైర్యముతోన్= ధీరత్వంతో; నడపన్ వలయున్= నిర్వహించాలి; ఆర్యులు= పెద్దలు; తత్త్రియల+అందున్= ఆయా కర్మలయందు; వీఁడు ఆర్యుఁడు= ఇతడు ఆర్యవృత్తి గలవాడు; అనార్యుఁడు అని= ఇతడు అనార్యవృత్తికలవాడు అని; తిరముగన్= స్థిరంగా; నిశ్చయమును= నిర్ణయాన్ని; చేయుదురు= చేస్తారు.

తాత్పర్యం: ఒక కార్యం చేయవలసి వచ్చినపుడు చాలాకాలం ఆలోచించి ధీరత్వంతో మంచి చెడ్డలు నిర్ణయించుకొని ఆ పని నెరవేర్చాలి. ఆయాపనులను నిర్వహించేటపుడు ఆలోచించి చేసేవాడిని ఆర్యుడనీ, తొందరపడేవాడిని అనార్యుడనీ పెద్దలైనవారు స్థిరంగా నిర్ణయిస్తారు.

క. మిత్రత్వము శత్రుత్వముఁ । బాత్రతయు నపాత్రతయును బరికించు సుచా
రిత్రుఁడు చిరతరగణనా । సూత్రితముగ దాన నెల్ల శుభములు నొందున్.' 289

ప్రతిపదార్థం: చిరతరగణనా సూత్రితముగన్= చాలాకాలం సమీక్షతో కూడినట్లుగా; మిత్రత్వమున్= మైత్రిని; శత్రుత్వమున్= శత్రుభావాన్ని; పాత్రతయున్= యోగ్యతయును; అపాత్రతయును= అయోగ్యతయును; పరికించు= పరిశీలించే; సుచారిత్రుఁడు= మంచి నడవడి కలవాడు; దానన్= అట్లా చేయటంవలన; ఎల్లశుభములన్= సమస్త కల్యాణాలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: తొందరపడక చాలాసేపు విచారించి 'ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు యోగ్యుడు, ఇతడు అయోగ్యుడు' అని పరిశీలించి ఆచరించే సచ్చరిత్రుడు - సమస్తమైన శుభాలనూ పొందుతాడు'.

వ. అని నిర్దేశించె; న ట్లా చిరకారి చిరకారిత్వంబు సఫలత్వంబు నొంది వినుతింబొందె. 290

ప్రతిపదార్థం: అని నిర్దేశించెన్= అని చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; ఆ చిరకారి చిరకారిత్వంబు= ఆ మునికుమారుడి చిరకారితాలక్షణం; సఫలత్వంబున్= సాఫల్యాన్ని; ఒంది= పొంది; వినుతిన్+పొందెన్= పొగడ్తకెక్కాడు.

తాత్పర్యం: అని మేధాతిథి వచించాడు. ఈ రీతిగా 'చిరకారి' నామకుడయిన ఆ ముని కుమారుడి చిరకారిత్వం సఫలమయింది. అతడు తన చిరకారిత్వం వలన శ్లాఘాపాత్రుడయ్యాడు.

క. కావునఁ గురువంశోత్తమ! । నీవును సదసత్ప్రకార నిశ్చయము చిరం
బై వఱలఁ జేయుమీ! యది । గావించుం జిరము లైన కార్యఫలములన్. 291

ప్రతిపదార్థం: కురువంశ+ఉత్తమ!= కౌరవకులశ్రేష్ఠా!; కావునన్= అందువలన; నీవునున్= నీవుకూడ; సదసత్ప్రకారనిశ్చయము= మంచి చెడుల పద్ధతియొక్క నిర్ణయమును; చిరంబై= దీర్ఘకాలమున చేయబడునదై; వఱలన్= ఒప్పేటట్లు; చేయుమీ!= ఒనరింపుమా!; అని= ఆ విధంగా చేసిన నిశ్చయము; చిరములు+ఐన= శాశ్వతాలైన; కార్యఫలములన్= కార్యప్రయోజనాలను; కావించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కురువంశోత్తముడవైన ఓ ధర్మరాజా! అందువలన నీవు కూడా కార్యం చేయవలసి వచ్చినపుడు మంచి చెడులను చక్కగా ఆలోచించి తొందరపాటు లేక నిర్వర్తించుము. అట్లా చేసిన కార్యం యొక్క నిర్ణయం శాశ్వత ఫలాలను ప్రసాదిస్తుంది.

క. వినుమచిరవృత్తిఁ జేసిన । పని కర్తకు నావహించుఁ బశ్చాత్తాపం
బనఘా! చిరభావితశు । ద్ధి నిరూపణకృతము శుభముఁ దేజముఁ దెచ్చున్.' 292

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; అచిరవృత్తిన్= తొందరపాటుతో; చేసిన= నిర్వర్తించిన; పని= కర్మం; కర్తకున్= చేసినవాడికి; పశ్చాత్తాపంబు= అనుతాపం; ఆవహించున్= కలిగిస్తుంది; చిరభావిత శుద్ధి నిరూపణకృతము= చాలాకాలం భావింపబడి శుద్ధిని నిరూపించటం చేత చేయబడిన పని; శుభమున్= భద్రమును; తేజమున్= కాంతిని; తెచ్చున్= లభింపజేస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ యుధిష్ఠిరా! వినుము. తొందరపడి ఒకడు పనిచేస్తే - ఆ పని చేసినవాడికి తరువాత పశ్చాత్తాపం కలిగిస్తుంది. అట్లాకాక చక్కగా చాలాకాలం ఆలోచించి దోషం లేదని నిర్ణయించుకొని చేసిన పని కర్తకు కల్యాణాన్నీ, ప్రకాశాన్నీ తెచ్చిపెట్టుతుంది.

వ. అనిన విని ధర్మపుత్రుండు 'ప్రజల శిక్షించు వెరవెట్టి' దని యడిగిన నాపగానందనుండు 'దొల్లి ద్యుమత్సేనుం డను రాజునకు నిజతనూజుం డగు సత్యవంతుతోడ సంవాదంబు గలిగె నది నీయడిగిన యర్థంబునకుం బ్రకాశకం బగుఁ; జెప్పెద నాకర్ణింపుము'; వా రిద్దఱుం బ్రజాశిక్ష తెఱంగు మాటలాడు సమయంబున.293

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మపుత్రుండు= ధర్మజుడు; ప్రజలన్= జనులను; శిక్షించు వెరపు= శిక్షించే పద్ధతి; ఎట్టిది+అని అడిగినన్= ఏ విధమైనదని ప్రశ్నింపగా; ఆపగానందనుండు= గంగాసుతుడైన భీష్ముడు; తొల్లి= పూర్వం; ద్యుమత్సేనుండు+అను రాజునకున్= ద్యుమత్సేనుడనే నృపుడికి; నిజ తనూజుండు+అగు= తన కుమారుడైన; సత్యవంతుతోడన్= సత్యవంతుడనేవాడితో; సంవాదంబు= సంభాషణ; కలిగెన్= జరిగింది; అది= ఆ సంవాదం; నీ అడిగిన అర్థంబునకున్= నీవు ప్రశ్నించిన విషయానికి; ప్రకాశకంబు+అగున్= నిరూపించేదవుతుంది; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; వారిద్దఱున్= ద్యుమత్సేన సత్యవంతు లనువా రిరువురు; ప్రజాశిక్ష తెఱంగు= ప్రజల శిక్షించే పద్ధతిని గూర్చి; మాటలాడు సమయంబునన్= సంభాషించుకొనే కాలమందు;

తాత్పర్యం: భీష్ముడావిధంగా చెప్పగా విని ధర్మరాజు 'ప్రజలను శిక్షించే పద్ధతి ఎట్లాంటిది?' అని మళ్ళీ ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడిట్లా అన్నాడు: 'పూర్వం ద్యుమత్సేనుడనే రా జుండేవాడు. అతడి కుమారుడు సత్యవంతుడు. వా రిరువురి మధ్య ఒక సంవాదం జరిగింది. ఆ సంవాదం నీ విపుడు నన్ను అడిగిన ప్రశ్నను వివరిస్తుంది. దానిని చెప్పుతాను వినుము. వారిరువురూ ప్రజలను శిక్షించే విధానాన్ని గురించి మాట్లాడుకొనే సమయంలో.

సీ. వధము ధర్మంబుగా బుధులు సెప్పుదు రని । యనుశాసనము సేయు జనకుతోడ
సత్యవంతుఁడు 'హింస కృత్యకర్మంబగు । నేని యకృత్య మిం కేది?' యనుడు
'మ్రుచ్చులు ప్రల్లదుల్ సచ్చువారల యట్లు । గాకున్న బాధలు లోకమునకుఁ
బుట్టవె?' యనిన నబ్భూపతి యమ్మాట । కతఁడు 'సంపుటదక్క నన్యదండ

తే. విధిన శిక్ష సెల్లించుట వెరవుగాదె?' । నావుడును బతి 'య ట్లేల నడచు? దృష్టి
దండ వాగ్దండ ధనదండ తనువికార । దండములు సేయునది తప్పు దర మెఱింగి. 294

ప్రతిపదార్థం: బుధులు= పండితులు; వధమున్= చంపటాన్ని; ధర్మంబుగాన్= ధర్మకార్యంగా; చెప్పుదురు+అని= వచిస్తారని; అనుశాసనమున్ చేయు= ఆజ్ఞ చేయునట్టి; జనకుతోడన్= తండ్రితో; సత్యవంతుఁడు= అతడి కుమారుడగు సత్యవంతుడు; హింస= చంపటం; కృత్యకర్మంబు+అగున్+ఏనిన్= చేయదగిన పని ఐతే; ఇంకన్ అకృత్యము ఏది?= ఇంక చేయరాని పని ఏమున్నది?; అనుడున్= అనగా; ఆ+భూపతి= ఆ రాజు; మ్రుచ్చులు= దొంగలు; ప్రల్లదుల్= దుష్టులు; చచ్చువారల= చచ్చేవారే; అట్లు కాకున్నన్= అట్లా కానిచో; లోకమునకున్= ప్రపంచానికి; బాధలు= కష్టాలు; పుట్టవె?= కలుగవా?; అనినన్= అని చెప్పగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; అతఁడు= ఆ సత్యవంతుడు; చంపుటతక్కన్= వధించటం వినా; అన్యదండవిధిన్+అ= మరొక శిక్షాప్రకారంతోనే; శిక్ష చెల్లించుట= దండించటం; వెరపు గాదె!= యుక్తం కాదా!; నావుడును= అనగా; పతి= రాజు; అట్లు= ఆ రీతిగా; ఏల= ఎందుకు; నడచున్?= జరుగుతుంది?; తప్పు దరమున్= అపరాధంయొక్క ప్రమాణమును; ఎఱింగి= తెలిసికొని; దృష్టి దండ= చూపుతో శిక్షయు; వాగ్దండ= మాటలతో శిక్షించటం; ధనదండ= ధనాన్ని గ్రహించటం అనే శిక్షయు; తనువికారదండములు= శరీరానికి వికృతికలిగించటం అనే శిక్షలు; చేయునది= చేయాలి.

తాత్పర్యం: ద్యుమత్సేనుడు నేరం చేసినవారిని వధించటం ధర్మమని పండితులు చెప్పుతారని ఆనతి ఇచ్చాడు. అది విని అతడి కుమారుడు సత్యవంతుడు 'చంపటమే ధర్మమైతే ఇంక చేయరాని అధర్మ కార్య మేముంటుంది?' అని ప్రశ్నించాడు. అందుకు రాజు "దొంగలు, దుర్జనులు వధార్హులే, లేకపోతే లోకానికి వారివలన బాధలు తప్పవు' అని చెప్పాడు. అందుకు సత్యవంతుడు 'చంపటమనే శిక్షను వదలి మరొక దండనవిధానంతో శిక్షించటం ఉచితం కదా?' - అని అడిగాడు. అందుకు రాజు 'అట్లా ఎందుకు జరుగుతుంది? తప్పు చేసినవాడిని దండించేటప్పుడు

చేసిన తప్పు ఏ పాటిదో గమనించి అందుకు తగినట్లు చురచుర చూడటమనే శిక్షగాని, తీవ్రమైన మాటలతో మందలించటం అనే శిక్షగాని, డబ్బు వసూలు చేయటమనే శిక్షగానీ, లేక శరీరంలోని అవయవాలను వికృతం చేయటమనే శిక్షగానీ విధించాలి' అని చెప్పాడు.

క. వినుఁ చంపఁ దగిన తప్పున । కనఘా! చంపుటయు వలయు; నాప్తుఁడు బంధుం
డనుజుఁడు దనుజుఁడు ననుమ । న్ననయును దుష్టనెడ రాజునకుఁ బాప మగున్. 295

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుఁ= ఆలకించుము; చంపన్+తగిన తప్పునకున్= వధార్హమయిన నేరానికి; చంపుటయున్= వధించటమూ; వలయున్= అవసరమౌతుంది; రాజునకున్= ప్రభువుకు; దుష్టనెడన్= దుర్జనుడి పట్ల; ఆప్తుఁడు= కావలసినవాడు; బంధుండు= చుట్టం; అనుజుఁడు= సోదరుఁడు; తనుజుఁడు= కుమారుడు; అను మన్ననయున్= అనే ఆదరం కూడా; పాపము+అగున్= కిల్బిష మవుతుంది.

తాత్పర్యం: పాపరహితుడవగు ఓ కుమారా! చెప్పుతాను వినుము. చంపదగిన తప్పుచేసినవాడిని చంపటమే కర్తవ్యం. రాజైనవాడికి దుర్మార్గుడి పట్ల 'వీడు నాకు కావలసినవాడు, చుట్టం, తమ్ముడు, కుమారుడు' అనే పక్షపాతంకూడా పాపమే అవుతుంది సుమా!

తే. తాను మున్ను వినీతుఁడై తనదు మంత్రి । వరులఁ బుత్రుల భృత్యుల వరుసతోడ
వినయవంతులఁ జేసి భూవిభుఁడు ప్రజకు । రక్షణము సేయ నిహముఁ బరంబుఁ గల్గు. 296

ప్రతిపదార్థం: భూవిభుఁడు= రాజు; మున్ను= ముందు; తాను వినీతుఁడు+ఐ= తాను వినయం కలవాడై; తనదు= తనయొక్క; మంత్రివరులన్= అమాత్యముఖ్యులను; పుత్రులన్= కుమారులను; భృత్యులన్= సేవకులను; వరుసతోడన్= క్రమంగా; వినయవంతులన్+చేసి= వినీతులుగా ఒనర్చి; ప్రజకున్= జనులకు; రక్షణము చేయన్= కాపుదల చేయగా; ఇహమున్+పరంబున్= ఇహలోకపరలోక సుఖాలు రెండూ; కల్గున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: రాజైనవాడు తాను ముందు వినయంగల వాడుగా ఉండాలి. తదుపరి తన మంత్రులను, కుమారులను, సేవకులనూ క్రమంగా వినయపరులను చేయాలి. అట్లా చేసి ప్రజలను రక్షించే భూపతి ఇహలోక సుఖాన్నీ, పరలోక సౌఖ్యాన్నీ చూరగొంటాడు.

క. దోష మరసి కామంబును । రోషంబును లేక తగిన రూపునఁ జేయం
బోషక మగు ధర్మమునకు । వైషమ్యవిహీనమైన వధము గుమారా! 297

ప్రతిపదార్థం: కుమారా!= పుత్రా!; దోషము+అరసి= తప్పును పరీక్షించి; కామంబును= కోరికనూ; రోషంబును= క్రోధాన్ని; లేక= కలిగిఉండక; తగిన రూపునన్= ఉచితమైన పద్ధతిలో; చేయన్= ఆచరించగా; వైషమ్యవిహీనము+ఐన= పక్షపాతరహితమైన; వధము= చంపటం; ధర్మమునకున్= ధర్మాచరణానికి; పోషకము+అగున్= పోషించేదిగా అవుతుంది.

తాత్పర్యం: పుత్రా! తప్పుచేసినవాడి తప్పును చక్కగా పరీక్షించాలి. కామక్రోధాలు వదలి ఉచితమైన పద్ధతిలో ఏ విధమైన పక్షపాతమూ లేకుండా వధార్హమైన నేరానికే మరణదండన విధించాలి. అట్లా చేస్తే అది ధర్మాన్ని పోషించే శిక్షగా అవుతుంది.

క. చంపఁగఁ జూచియు లోభము । పెంపునఁ గ్రోధమునఁ గామపీడను మది శం
కింపక దుష్టులు గీడొన । రింపఁగఁ జూడమె కలంక రేఁగు నహింసన్. 298

ప్రతిపదార్థం: దుష్టులు= దుర్జనులు; చంపఁగన్= వధించగా; చూచియున్= చూచికూడా; లోభము పెంపునన్= ఎక్కువ ఆశతోనూ; క్రోధమునన్= కోపంతోనూ; కామపీడను= కోరికవలన కలిగే ఒత్తిడివలన; మదిన్= మనసులో; శంకింపక= సందేహించక; కీడు+ఒనరింపఁగన్= అపకారం చేస్తుండగా; చూడమె= మనం చూస్తున్నాముకదా!; అహింసన్= హింస లేకపోవటం చేత; కలంక రేఁగున్= అస్తవ్యస్తమైన స్థితి విజృంభిస్తుంది.

తాత్పర్యం: దుర్మార్గులు నేరం చేసినవారు వధించబడటం చూస్తూనే ఉంటారు. కాని, కామం, క్రోధం, లోభం అనే దుర్గుణాలు మితిమీరటం వలన మదిలో ఏ విధమైన సందేహం లేకుండా ఇతరులకు తీవ్రమైన అపకారం చేస్తూనే ఉంటారు. ఇది మనం చూస్తూనే ఉన్నాంకదా! కాబట్టి మరణదండన విధించకుండా రాజు పూర్తిగా అహింసాపద్ధతిని పాటిస్తే లోకంలో ఎంతో అరాజకం ప్రబలిపోతుంది.

విశేషం: మానవులు కామక్రోధలోభాలకు గురిఅయి అకృత్యాలు చేసి నరకం పాలవుతారు. భగవద్గీతలో - ఈ విషయమే - "త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః, కామః క్రోధశ్చ లోభశ్చ తస్మా దేతత్త్రయం త్యజేత్" అని చెప్పబడింది. అరిషడ్వర్గాలనబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలలో మొదటివి మూడూ ఎంతగా మానవుడిని అకృత్యాలకు ప్రేరేపిస్తాయో ఇక్కడ ద్యుమత్సేనుడు నిరూపించాడు.

ఆ. విను మహింస విప్రజనులకు నెల్ల భం । గులను వలయుఁ బ్రజలవలనఁ గరుణ
గలిగి వారిఁ గీడు గదురక యుండంగఁ । గాపు పతి కహింసకత్వ మనఘ!' 299

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; విప్రజనులకున్= బ్రాహ్మణులకు; ఎల్లభంగులనున్= అన్నివిధాలా; అహింస= హింసలేమి; వలయున్= ఆవశ్యకమై ఉన్నది; పతికిన్= రాజునకు; ప్రజలవలనన్= జనులపట్ల; కరుణకలిగి= దయగలిగి; వారిన్= ఆ ప్రజలను; కీడు= అపకారం; కదురక ఉండంగన్= తాకకఉండేటట్లుగా; కాపు= రక్షించటం; అహింసకత్వము= హింసకుడు కాకుండా ఉండట మవుతుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన సత్యవంతుడా! వినుము. బ్రాహ్మణులైనవారు అన్నివిధాలా అహింసనే పాటించాలి. ప్రజాపాలకుడైన భూపతికి ఆ విధమైన అహింస తగదు. అతడు ప్రజలపట్ల దయగలిగి ఉండాలి. వారికి ఏ విధమైన అపకారం కలుగకుండా చూడాలి.అట్లా ప్రజలను కాపాడటమే రాజైన వానికి అహింస అవుతుంది'.

కపిల గో సంవాద ప్రకారము (సం. 12-260-5)

వ. అనియె నని చెప్పిన విని యజాతశత్రుండు తాతతో 'నవశ్యకర్తవ్యంబు గృహస్థధర్మంబో పరిత్యాగంబో నిరూపించి చెప్పవే' యనిన నతండు 'రెండును మాననీయ ధర్మంబుల; కపిలగోసంవాదంబను నితిహాసంబు వినుము; దాన నీవితర్కంబు వినిశ్చయ దశంబొందు, నని పలికి యిట్లనుఁ 'గపిలుం డను సంయమిసత్తముం డుత్తమాకృతియు భీతిరహితయు నహుషసంభావితయు నగు నొక్కగోవుం గాంచి 'నీవు వేదస్వరూపవు గావే' యని పలికె నమ్మాట వేదంబుల వలని యాదరంబు లేమింజేసి వెడలినదిగా నూహించి యప్పుడు గెలన నున్న స్యామరశ్మి యనుముని సూక్ష్మరూపంబున నగ్గోవు నందుఁ బ్రవేశించి. 300

ప్రతిపదార్థం: అనియెన్+అని= అని చెప్పానని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= ధర్మరాజు; తాతతోన్= భీష్ముడితో; అవశ్యకర్తవ్యంబు= తప్పక చేయదగింది; గృహస్థధర్మంబో= గృహస్థుడికి సంబంధించిన ధర్మమో; పరిత్యాగంబో= సన్న్యాసమో; నిరూపించి= నిరూపణంచేసి; చెప్పవే= చెప్పుము; అనినన్= అనగా; అతండు= ఆ భీష్ముడు; రెండును=

గృహస్థసన్న్యాసములు రెండును; మాననీయ ధర్మంబులు+అ= పూజించదగిన ధర్మాలే; కపిలగోసంవాదంబు+అను= కపిలగోసంవాదంఅనే; ఇతిహాసంబు= పూర్వకథను; వినుము= ఆలకించుము; దానన్= అది వినటంవలన; నీ వితర్కంబు= నీసందేహం; వినిశ్చయదశన్= నిర్ణయస్థితిని; పొందున్+అని= పొందగలదని; పలికి= చెప్పి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; కపిలుండు+అను= కపిలనామకుడైన; సంయమిసత్తముండు= మునిశ్రేష్ఠుడు; ఉత్తమ+ఆకృతియున్= మేలైన ఆకారం కలదీ; భీతిరహితయున్= భయంలేనిదీ; నహుష సంభావితయున్= నహుషుడిచేత సమ్మానించబడినదీ అయిన; ఒక్కగోవున్= ఒక ఆవును; కాంచి= చూచి; నీవు వేదస్వరూపవు కావే= నీవు శ్రుతి స్వరూపిణివి అగుదువుగదా!; అని పలికెన్= అని చెప్పాడు; ఆ+మాట= ఆ పలుకు; వేదంబుల వలని= వేదములవలన; ఆదరంబు= గౌరవం; లేమిన్+చేసి= లేకపోవటంవలన; వెడలినదిగాన్= పుట్టిందిగా; ఊహించి= తర్కించి; అప్పుడు= ఆ సమయంలో; కెలనన్+ఉన్న= సమీపంలో ఉన్న; స్యూమరశ్మి అనుమునిని= స్యూమరశ్మి అనే మౌని; సూక్ష్మరూపంబునన్= సూక్ష్మమైన రూపంతో; ఆ+గోవునందున్= ఆ ఆవులో; ప్రవేశించి= చొచ్చి.

తాత్పర్యం: అని ద్యుమత్సేనుడనే రాజు చెప్పాడు' అని భీష్ముడు అన్నాడు. అది విని ధర్మరాజు భీష్ముడితో 'గృహస్థధర్మ సన్న్యాస ధర్మాలలో తప్పక ఆచరించదగిన ధర్మమేదో నిర్ధారణ చేసి చెప్పు'మన్నాడు. అప్పుడు భీష్ముడు, 'పై రెండు ధర్మాలూ గౌరవించదగినవే. దీనిని నిరూపించే కపిలగోసంవాద మనే ఒక ఇతిహాసం ఉన్నది. దానిని వినిపిస్తాను, వినుము. అది వింటే నీ సందేహం తొలగిపోతుంది' అని చెప్పి ఇట్లా అన్నాడు: 'కపిలు డనే మునివర్యుడు శ్రేష్ఠమైన ఆకారం కలదీ, నిర్భయమైనదీ, నహుషుడిచేత పోషించబడినదీ, అయిన ఒక ధేనువును చూచి, నీవు వేదస్వరూపిణివిగదా అన్నాడు. ఆ ప్రక్కనే ఉన్న స్యూమరశ్మి అనే ముని కపిలుడి మాట వేదాలపై గౌరవం లేకపోవటం వలన వెలువడిందని ఊహించాడు. వెంటనే అతడు సూక్ష్మాకృతితో ఆ గోవులో ప్రవేశించాడు. అట్లా ప్రవేశించి -(తరువాతి పద్యంతో అన్వయం).

క. వేదములు డాంబికత్వా। పాదనములు గాఁగ యతులు వలుకుదు; రవి స
ర్వాదరణీయంబులు నీ। కాదరపాత్రములు గావొ?' యని పలుకుటయున్. **301**

ప్రతిపదార్థం: యతులు= సన్న్యాసులు; వేదములు= శ్రుతులు; డాంబికత్వ+ఆపాదనములు కాఁగన్= డాంబికతను కలుగజేసేవిగా; పలుకుదురు= చెప్పుతారు; అవి= ఆ వేదాలు; సర్వ+ఆదరణీయంబులు= అందరికీ ఆదరించదగినవి; నీకున్+ఆదరపాత్రములు= నీకు గౌరవయోగ్యాలు; కావొ?= కావా?; అని పలుకుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: 'పరివ్రాజకులు వేదాలు డంబం కలిగిస్తాయని అంటారు. అవి అందరికీ ఆదరింపదగి ఉన్నాయి. నీకు ఆదరించదగినవి కావా?' అని కపిలుడితో గోవులో ప్రవేశించిన స్యూమరశ్మి అన్నాడు. అట్లా అనేసరికి -(తరువాతి పద్యంతో అన్వయం).

వ. అగ్గోవున కతం డిట్లనియె. **302**

ప్రతిపదార్థం: ఆ+గోవునకున్= ఆ ఆవుతో; అతండు= కపిలుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ఆ గోవుతో కపిలు డిట్లా అన్నాడు:

క. 'వేదములవలన నాకు న। నాదరమును నాదరమ్ము నను రెండును లే;
వేది గతంబుగ నడిగితొ। నీదు తలం పెఱుఁగునట్టి నేరిమి గలదే. **303**

ప్రతిపదార్థం: వేదములవలనన్= వేదాలపట్ల; నాకున్= నాకు; అనాదరమును= గౌరవం లేకుండటం కాని; ఆదరమ్మును= మన్ననకాని; అను రెండును లేవు= అనే రెండు భావాలూ లేవు; ఏది కతంబుగన్= ఏది కారణంగా; అడిగితొ= నీవు అడిగినావో; నీదు తలంపు= నీ అభిప్రాయాన్ని; ఎఱుఁగునట్టి= తెలిసికొనేటటువంటి; నేరిమి= నేర్పు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: 'అయ్యా! వేదాల విషయంలో నాకు ఆదరమూ లేదు. అనాదరమూ లేదు. నీవు ఎందు కిట్లా అడిగావో నాకు తెలియదు. నీ అభిప్రాయాన్ని గ్రహించే నేర్పరిని కాను.

వ. అయినను నా యెఱింగినంత సెప్పెద నాకర్ణింపుము; బ్రహ్మచర్య గృహస్థ ధర్మ వానప్రస్థ వృత్తి పరివ్రజనంబు లను నాలుగాశ్రమంబులు దేవయానంబుల; యత్తెరువుల నడచుట సంసారులకుఁ గర్తవ్యంబు గావున. 304

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికీ; నా ఎఱింగినంత= నేను గ్రహించినంత వరకు; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; బ్రహ్మచర్య గృహస్థధర్మ వానప్రస్థవృత్తి పరివ్రజనంబులు+అను= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థ వర్తనం, సన్న్యసనం అనే; నాలుగు ఆశ్రమంబులు= చతురాశ్రమాలు; దేవయానంబులు+అ= ఆత్మప్రాప్తిహేతువులైన దేవయాన మార్గాలే; ఆ+ తెరువులన్= ఆ మార్గాలలో; నడచుట= చరించటం; సంసారులకున్= సంసారంలో ఉండేవారికి; కర్తవ్యంబు= అనుష్ఠించదగింది; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: అయినప్పటికీ నాకు తెలిసినంత వరకూ నీ వడిగిన విషయం చెప్పుతాను. వినుము. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలూ ఆత్మప్రాప్తికి సాధనాలే కాబట్టి, దేవయానా లనబడు తున్నాయి. ఆ మార్గాలలో నడవటం సంసారులైన వారికి ఆచరణీయంగా ఉన్నది. అందువలన - (తరువాతి పద్యంతో అన్వయం).

క. వారలకు వేదవిహితా । చారంబులు వలయు నది ప్రశస్తము హింసా
ప్రారంభ మాచరించుట । యారయఁగా మేలొ కీడొ యంచితమూర్తీ!' 305

ప్రతిపదార్థం: అంచితమూర్తీ!= పావనమూర్తీ!; వారలకున్= ఆ సంసారులకు; వేదవిహిత+ఆచారంబులు= వేదంచేత విధించబడిన ఆచారాలు; వలయున్= అవసరమై ఉన్నవి; అది= ఆ పద్ధతి; ప్రశస్తము= శ్రేష్ఠం; హింసాప్రారంభము= హింసాప్రయత్నం; ఆచరించటం= చేయటం; ఆరయఁగాన్= పరిశీలించగా; మేలొ= శుభమో; కీడొ= అశుభమో!

తాత్పర్యం: ఓ పవిత్రమూర్తీ! వేదం విధించిన ఆచారాలు సంసారులైన వారికి ఆవశ్యకమయి ఉన్నాయి. వేదవిహిత పద్ధతిలో నడవటం శ్రేష్ఠమైనది. అయితే యజ్ఞాలలో హింసకు పూనుకొనటం శుభప్రదమో, అశుభప్రదమో నీవే చెప్పుము'.

వ. అనుటయు స్యూమరశ్మి యతని కిట్లనియె. 306

ప్రతిపదార్థం: అనుటయున్= అని కపిలుడు చెప్పగా; స్యూమరశ్మి= గోవులోఉన్న స్యూమరశ్మి; అతనికిన్= కపిలుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కపిలు డట్లా అడిగేసరికి గోవులో ప్రవేశించి ఉన్న స్యూమరశ్మి అతడితో ఇట్లా అన్నాడు:

క. 'అలఘుమతిని యజ్ఞార్థం । బులుగాఁ బశువులను ధాన్యములఁ గల్పించెన్
జలజభవుం; డదిగాకయుఁ । దలకొని యజ్ఞంబు లతఁడు దాఁ జేయఁడొకో!' 307

ప్రతిపదార్థం: జలజభవుండు= బ్రహ్మ; అలఘుమతినిన్= గొప్పబుద్ధితో; పశువులనున్= జంతువులనూ; ధాన్యములన్= కొలుచులూ; కల్పించెన్= సృష్టించాడు; అది కాకయున్= అంతేకాక; అతఁడు= ఆ బ్రహ్మ; తాన్= తాను; తలకొని= పూనుకొని; యజ్ఞంబులు= యాగాలు; చేయఁడు+ఒకో!= చేయటం లేదా!

తాత్పర్యం: బ్రహ్మ గొప్ప ఆలోచనతో యజ్ఞంకొరకే పశువులను, ధాన్యాలను సృష్టించాడు. అంతే కాదు. అతడు తాను పూనుకొని యజ్ఞాలు చేశాడు కదా!

క. వినుమజ్ఞునకును బ్రాజ్ఞున । కును గలయది దివ్యసుఖము గోరుట దివ్య
త్వనిరూఢి యాగకరణం । బునఁ దక్కఁగ నొంటఁ గలుగఁ బోలునె చెపుమా! 308

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; దివ్యసుఖము= దేవలోకానికి చెందిన సుఖాన్ని; కోరుట= అభిలషించటం; అజ్ఞునకునున్= జ్ఞానహీనుడికి; ప్రాజ్ఞునకును= జ్ఞానవంతునికిని; కలయది= ఉన్నదే; యాగకరణంబునన్+తక్కఁగన్= యజ్ఞంచేస్తే తప్ప; ఒంటన్= మరొకవిధంగా; దివ్యత్వనిరూఢి= దేవత్వసిద్ధి; కలుగన్+పోలునె?= సిద్ధిస్తుందా?; చెపుమా!= వివరించుమా!

తాత్పర్యం: ఇంకా వినుము. జ్ఞానవంతుడు, జ్ఞానహీనుడూ ఇద్దరూ దివ్యసుఖం అభిలషిస్తారు. యజ్ఞంచేస్తే తప్ప దేవలోకసుఖహేతువైన దివ్యత్వప్రాప్తి కలుగదు. మరొకరీతిగా కలుగుతుందేమో నీవే చెప్పుము.

క. అమలిన గృహస్థ ధర్మో త్తమముం గల్మషహరంబు దైవతసంభా
వ్యము నైన యజ్ఞ కర్తృ । త్వము మునివర! హింస గాఁగ దలఁపం దగునే? 309

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; అమలినగృహస్థ ధర్మోత్తమమున్= నిష్కల్మషమైన శ్రేష్ఠమైన గృహస్థధర్మమూ; కల్మషహరంబున్= పాపహరమూ; దైవతసంభావ్యమున్= దేవతలచేత సమ్మానించదగిందీ; ఐన= అయినట్టి; యజ్ఞకర్తృత్వము= యాజకత్వం; హింసకాఁగన్= హింసాకృత్యంగా; తలఁపన్+తగునే= భావించటం యుక్తమా?

తాత్పర్యం: ఓ మునీంద్రా! యజ్ఞం చేయటమనేది కల్మషరహితమూ, శ్రేష్ఠతమమూ అయిన గృహస్థధర్మం. అది పాపాన్ని హరిస్తుంది. దేవతలుకూడా ఆ పనిని గౌరవిస్తారు. అట్టిదానిని హింస అని భావించటం యుక్తమా?'

చ. అనుటయు నిట్లనుం గపిలుఁ 'డాత్మ సుఖైక పరాయణుండు మె
చ్చునె పెఱసౌఖ్యకోటి గతశోకుఁ డకాముఁడ సంగశీలుఁ డా
తని కవియెల్ల నేటికి మదప్రదలోకము లొల్లమిన్ సనా
తన మగు మోక్షముం గొఱలి తా విడుచున్ గృహధర్మవర్గమున్.' 310

ప్రతిపదార్థం: అనుటయున్= స్యూమరశ్మి అట్లా అనగా; కపిలుఁడు= కపిలమునీంద్రుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ఆత్మసుఖ+ఏక పరాయణుండు= ఒక్క ఆత్మసుఖం మీదనే ఆసక్తి కలవాడు; పెఱసౌఖ్యకోటిన్= ఇతరాలైన అనేక సుఖాలను; మెచ్చునె?= అభినందిస్తాడా?; గతశోకుఁడు= శోకం తొలగిన వాడు; అకాముఁడు= కోరికలేనివాడు; అసంగశీలుఁడు= సంగం లేనివాడు అయిన; ఆతనికిన్= అతడికి; అవిఎల్లన్= ఆ ఇతర సుఖాలన్నీ; ఏటికిన్?= ఎందుకు?; తాన్= తాను; మదప్రద లోకములు= ఇంద్రియసుఖమిచ్చే లోకాలను; ఒల్లమిన్= అభిలషించకపోవటంవలన; సనాతనము+అగు= శాశ్వతమైన; మోక్షమున్= ముక్తిని; కొఱలి= పొంది; గృహధర్మవర్గమున్= గృహస్థులకు చెందిన ధర్మాల సముదాయాన్ని; విడుచున్= వదలుతాడు.

తాత్పర్యం: స్యూమరశ్మి అట్లా చెప్పేసరికి అతడితో కపిలముని ఇట్లా అన్నాడు: 'ఆత్మసుఖాన్ని మాత్రమే కోరేవాడు ఇతర సుఖాలను కోరడు. అతడు శోకరహితుడు, కామరహితుడు, సంగరహితుడు. అట్లాంటివాడికి ఆ పరలోకసుఖాలతో పనేమి? అతడు సుఖప్రదమైన స్వర్గాదిలోకాలను అభిలషించడు కాబట్టి శాశ్వతమైన మోక్షం పొంది గృహస్థధర్మాలను వర్జిస్తాడు'.

వ. అనిన విని స్యూమరశ్మి యా సిద్ధప్రవరున కిట్లనియె. 311

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; స్యూమరశ్మి= స్యూమరశ్మి అనే ముని; ఆ సిద్ధ ప్రవరునకున్= ఆ కపిలుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలు డట్లా చెప్పగా విని స్యూమరశ్మి సిద్ధశ్రేష్ఠుడైన ఆ కపిలుడితో ఇట్లా అన్నాడు:

ఆ. ప్రజలు దల్లిఁ జెందు పగిది గృహస్థ ధ । ర్మంబు నెల్ల యాశ్రమములుఁ జేరి
కాదె జీవనంబు గావించుకొను గృహ । యుక్తుఁ డోషధులకు నొడయుఁ డగుట. 312

ప్రతిపదార్థం: గృహయుక్తుఁడు= గృహస్థుడు; ఓషధులకున్= సస్యములకు; ఒడయుఁడు+అగుటన్= ప్రభువు కావటంవలన; ప్రజలు= బిడ్డలు; తల్లిన్+చెందుపగిదిన్= తల్లిని చేరేటట్లు; ఎల్ల ఆశ్రమములు= అన్ని ఆశ్రమాలూ; గృహస్థధర్మంబున్= గృహస్థాశ్రమాన్ని; చేరి= ఆశ్రయించి; జీవనంబు= బ్రతుకు; కావించుకొనున్ కాదె= నిర్వహించుకొంటాయి గదా!

తాత్పర్యం: గృహస్థుడు ఫలమునిచ్చి వెంటనే నశించిపోయే సస్యాదులైన ఓషధులకు ప్రభువు. అందువలన బిడ్డలు తల్లిని చేరినట్లే ఇతర ఆశ్రమాలకు చెందిన వారు తమకు పోషకుడైన గృహస్థుడిని ఆశ్రయించి జీవిస్తున్నారు.

క. వినుఁ మోక్షము గార్హస్థ్యం । బునఁ గాదని యెన్నఁ డెచటఁ బురుషుం డెవ్వం
డు నిరూపించి పలికె? స । ర్వనిధానము గృహము వేదవాక్యఫలజ్ఞా! 313

ప్రతిపదార్థం: వేదవాక్యఫలజ్ఞా!= శ్రుతివచనాల ఫలం ఎఱిగిన కపిలమహర్షీ!; వినుఁ= ఆలకించుము; గార్హస్థ్యంబునన్= గృహస్థాశ్రమంతో; మోక్షము= ముక్తి; కాదని= సిద్ధించదని; ఎన్నఁడున్= ఎప్పుడు; ఎచటన్= ఎక్కడ; పురుషుండు+ఎవ్వండు= ఏ పురుషుడు; నిరూపించి= నిర్ధారణ చేసి; పలికెన్?= చెప్పెను?; గృహము= ఇల్లు; సర్వనిధానము= అన్నిటికీ నిధి అయినది.

తాత్పర్యం: ఓ శ్రుతివచన ఫలాన్ని ఎరిగిన మునీంద్రా! గృహస్థాశ్రమం వలన ముక్తి సిద్ధించ దని ఎవడు, ఎప్పుడు, ఎక్కడ నిరూపణ చేసి చెప్పాడు? గృహం సమస్త కార్యాలకూ, వాటి ఫలాలకూ నిధిఅయినది కదా!

క. అలసులు ధనహీనులు నై । సొలసి క్రియలు విడుతు; రది విసూత్రత; దానం
గలదే సద్గతి? వేదం । బులు విడిచి యఘంబుపరతఁ బోవరె తండ్రీ! 314

ప్రతిపదార్థం:తండ్రీ!= నాయనా!; అలసులు= సోమరులు; ధనహీనులును+ఐ= దరిద్రులుఅయి; సొలసి= వెనుదీసి; క్రియలు= కర్మలు; విడుతురు= వర్జిస్తారు; అది= అట్లా వర్జించటం; విసూత్రత= విగతసూత్రత్వమవుతుంది; దానన్= దానివలన; సద్గతి=మంచిగతి; కలదే?= ఉన్నదా?; వేదంబులు= శ్రుతులు; విడిచి= వర్జించి; అఘంబుపరతన్=పాపపరత్వంతో;పోవరె?=పోరా?

తాత్పర్యం: తండ్రీ! సోమరులై దరిద్రులైనవారు వెనుక అడుగువేసి వేదవిహితకర్మలు విడిచివేస్తారు అది తెగిన దారంవలె ఆలంబనం లేని స్థితిగా పరిణమిస్తుంది. దానివలన సద్గతి నశిస్తుంది. ఇట్లా వేదాలు వర్జించినవారు పాపానికి అగ్గమై నశించి పోకుండా ఉంటారా?

క. విదితము గర్భాధానము । మొదలుగ శ్రుతికలితమంత్రములు నిర్మల సం
పద లెల్లను బ్రాహ్మణునకు । నొదవించుట దగునె శ్రుతుల నొల్లక యుండన్.' 315

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= విప్రునకు; గర్భాధానము మొదలుగన్= గర్భంలో బీజావాపం మొదలుకొని; శ్రుతికలితమంత్రములు= వేదంలో విధించబడిన మంత్రాలు; నిర్మలసంపదలు+ఎల్లను= విమలమైన సమస్త సంపదలను; ఒదవించుట= కలిగించటం; విదితము= తేటతెల్లం; శ్రుతులన్= వేదాలను; ఒల్లకఉండన్= అంగీకరించకుండటం; తగునె?= ఉచితమా?

తాత్పర్యం: గర్భాధానం మొదలైన సంస్కారం గల్గించే వేదవిహితమంత్రాలు బ్రాహ్మణుడికి సమస్త సంపదలను కలిగించటం లోక ప్రసిద్ధమే. వేదాలను అంగీకరించకుండటం ఉచితమౌతుందా?'

ఆ. అనినఁ గపిలుఁ డిట్టు లని వివరించు 'నా । చారములను దేవ సమితి నెల్ల
భూమిసురులు దృప్తిఁ బొందింతు; రమృత మా । నంగఁ బ్రీతి నిచ్చు భంగి యొలయ. 316

ప్రతిపదార్థం: అనినన్= స్యూమరశ్మి అట్లా అనగా; కపిలుఁడు= కపిలమహాముని; ఇట్టులు+అని= ఈ రీతిగా; వివరించున్= చెప్పాడు; భూమిసురులు= బ్రాహ్మణులు; ఆనంగన్= త్రాగటానికి; ప్రీతిన్= ప్రియంగా; అమృతము+ఇచ్చు భంగి= అమృతమొసంగే పద్ధతి; ఒలయన్= కలుగగా; ఆచారములను= ఆచారాలతో; దేవసమితిన్+ఎల్లన్= దేవతల సమూహమంతటిని; తృప్తిన్+పొందింతురు= తనివి నొందిస్తారు.

తాత్పర్యం: స్యూమరశ్మి అట్లా చేప్పేసరికి కపిలు డీ రీతిగా తన అభిప్రాయం వివరించాడు. 'విప్రులు దేవతలనందరినీ అమృతం ద్రావించినరీతిగా వేదవిహితాలైన ఆచారాలతో తృప్తి పొందింపజేస్తారు.

వ. అది యట్లుండె వినుము చెప్పెద. 317

ప్రతిపదార్థం: అది= అట్లా చేయటం; అట్లు+ఉండెన్= ఆ రీతిగా ఉండనిమ్ము; చెప్పెదన్= ఇంకను విశేషాలు చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: విప్రులు పాటించే ఆచారాలు అట్లా ఉన్నాయి. ఇంకా వినదగిన విశేషాలు వివరిస్తాను వినుము.

క. పాణి యుపస్థం బుదరము । వాణి యనఁగ మూయరాని వాకి ళ్ళివి; గీ
ర్వాణులకు వీని బుధుఁడు పు । రాణపురుషరక్షకై తిరంబుగ మూయున్. 318

ప్రతిపదార్థం: పాణి= చేయి; ఉపస్థంబు= గుహ్యేంద్రియం; ఉదరము= పొట్ట; వాణి= వాక్కు; అనఁగన్= అనగా; గీర్వాణులకున్= దేవతలకు (కూడ); మూయన్ రాని= మూయటానికి వీలుకాని; వాకిళ్ళు+ఇవి= ద్వారాలివి; బుధుఁడు= పండితుడు; పురాణపురుష రక్షకై= పరమాత్మ పరిరక్షణకుగాను; వీనిన్= ఈ ద్వారాలను; తిరంబుగన్= గట్టిగా; మూయున్= బంధిస్తాడు.

తాత్పర్యం: దేవతలకు సైతం చేయి, గుహ్యేంద్రియం, పొట్ట, వాక్కు అనే వాకిళ్ళు నాలుగూ మూయరానివై ఉన్నాయి. ఆత్మజ్ఞుడైన పండితుడు తనలోని పరమాత్మను పరిరక్షించటానికై ఈ నాలుగు ద్వారాలనూ గట్టిగా మూసివేస్తాడు.

తే. పుచ్చికొనఁడు ముందటఁ బైఁడిప్రోక యున్న ; । నలుక నొడమియుఁ బొడువను నడువఁ దొడఁగ;
డట్టి యా నైష్ఠికుని చేత నడఁగకున్నె । పాణి యనియెడు వాకిలి బంధురముగ. 319

ప్రతిపదార్థం: ముందటన్= ఎదురుగా; పైఁడిప్రోక= బంగారుప్రోగు; ఉన్నన్= ఉండినప్పటికీ; పుచ్చికొనఁడు= స్వీకరించడు; అలుక= కోపం; పొడమియున్= కలిగినా; పొడువనున్= పొడవటానికి; అడువన్= కొట్టటానికి; తొడఁగడు= ప్రయత్నించడు; అట్టి= అటువంటి; ఆ నైష్ఠికునిచేతన్= ఆ నిష్ఠగలవాడిచేత; పాణి అనియెడు= చేయి అనే; వాకిలి= ద్వారం; బంధురముగన్= ఒప్పిదంగా; అడఁగక+ఉన్నె?= మూయబడక ఉంటుందా?

తాత్పర్యం: ఆత్మజ్ఞుడు ఎదురుగా స్వర్ణరాశి పడిఉన్నా పరిగ్రహించడు. కోపం వచ్చినా ఎదుటివారిని పొడవటం, కొట్టటం చేయడు. అట్లాంటి నిష్ఠాగరిష్టుడు 'చేయి' అనే వాకిలిని చక్కగా మూసినవాడవుతాడు.

క. ఏ విధము కాంతనైనన్ । దా విహరణమునకు నెపుడుఁ దార్పఁడు తనయం
దావిష్టము భార్యావ్రత । మావెర వడ్డం బుపస్థ మనువాకిటికిన్. 320

ప్రతిపదార్థం: తాన్= తాను; ఏ విధము కాంతన్+ఐనన్= ఎట్లాంటి స్త్రీనైనా; విహరణమునకున్= విహారానికి; తార్పఁడు= కదియించడు; భార్యావ్రతము= పరస్త్రీవర్జనాత్మకమైన పత్నీవ్రతం; తన+అందున్= తనలో; ఆవిష్టము= ప్రవేశించిఉంటుంది; ఆ వెరవు= ఆ పద్ధతి; ఉపస్థము+అను= గుహ్యేంద్రియ మనే; వాకిటికిన్= ద్వారానికి; అడ్డంబు= నిరోధమై ఉన్నది.

తాత్పర్యం: ఆత్మజ్ఞుడైన పండితుడు ఎట్లాంటి స్త్రీనైనా తనతో విహరించటానికి పురికొల్పడు తాను తన భార్యతో తప్ప ఇతర స్త్రీలతో రమించడు. ఈ పద్ధతి 'ఉపస్థ' మనే ద్వారాన్ని బంధిస్తుంది.

క. తనుయాత్రకుఁగా నశనము । గొనుఁ; బూర్ణముగాఁ గొనండు; గోరఁడు లౌల్యం
బున రాని దాని; నమ్మెయి । ముని యుదరద్వార మోపి మూసెన కాదే? 321

ప్రతిపదార్థం: అశనము= ఆహారం; తనుయాత్రకుగాన్= శరీరనిర్వహణానికై; కొనున్= స్వీకరిస్తాడు; పూర్ణముగాన్= పొట్టనిండుగా; కొనండు= తినడు స్వీకరించడు; లౌల్యంబునన్= చాపల్యంతో; రానిదానిన్= తనకు ప్రాప్తించనిదానిని; కోరఁడు= అభిలషించడు; ఆ+మెయిన్= ఆ రీతిగా; ముని= సంయమి; ఉదరద్వారము= 'పొట్ట' అనెడి వాకిలిని; మూసెన్+అ కాదే= బంధించెనే కదా!

తాత్పర్యం: ఆత్మతత్త్వజ్ఞుడైన మునీంద్రుడు శరీరధారణకు ఎంత అవసరమో అంతే ఆహారం పరిగ్రహిస్తాడు. అంతేకాని పొట్టనిండా తినడు. తన కేది ప్రాప్తమో దానితో తృప్తి వహిస్తాడే కాని రానిదానిపై చాపల్యంతో అభిలాష చూపడు. ఆ రీతిగా ఉన్న ముని ఉదరమనే ద్వారాన్ని బంధించినట్లే కదా!

క. పలుకఁ డసత్యము, దూఱం । బలుకఁడు, బెట్టిదముగాఁగఁ బలుకఁడు, వాదం
బులకుఁ జొరఁడు వాణి యనం । గలవాకిలి యట్టి బుధుఁడు గప్పం జాలున్. 322

ప్రతిపదార్థం: అసత్యము= కల్లమాట; పలుకఁడు= చెప్పడు; దూఱన్= ఇతరులను నిందించటానికై; పలుకఁడు= మాటలాడడు; బెట్టిదముకాఁగన్= ఉద్ధతంగా; పలుకఁడు= మాట్లాడడు; వాదంబులకున్= వాగ్వివాదాలకు; చొరఁడు= ప్రవేశించడు; అట్టిబుధుఁడు= అట్లా ఉండే పండితుడు; వాణిఅనన్+కల= 'వాక్కు' అనగా కల; వాకిలి= ద్వారం; కప్పన్+చాలున్= బంధించగలుగును.

తాత్పర్యం: పండితుడు అబద్ధం చెప్పడు, పరనింద చేయడు, క్రూరంగా పరుషవచనాలు పలుకడు, ఇతరులతో తగవులకు పోడు. అట్లా ఉండేవాడు 'వాక్కు' అనే వాకిలిని బంధించగలడు.

తే. ద్వారములు నాల్గు మూయంగ దక్షుఁడైన । వాఁడ చూవె బ్రాహ్మణుఁ; డట్టివాని కేల
తపములును యజనంబులు దానములును । వ్రతములును వేదకింకరత్వంబు దొడఁకు. 323

ప్రతిపదార్థం: నాల్గు ద్వారములు= నాలుగు వాకిళ్ళు; మూయంగన్= బంధించటానికి; దక్షుఁడు+ఐనవాఁడు+అ= సమర్థుడైనవాడే; బ్రాహ్మణుఁడు= విప్రుడు; చూవె= సుమా!; అట్టివానికిన్= అట్లాంటివాడికి; తపములును= తపస్సులున్నూ; యజనంబులు= యజ్ఞకరణములున్నూ; దానములును= వితరణములున్నూ; వ్రతములును= వ్రతాలున్నూ; వేదకింకరత్వంబు తొడఁకు= వేదదాస్యంతోడి సంబంధము; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: పై చెప్పిన పాణి, ఉపస్థం, ఉదరం, వాణి అనే నాలుగు ద్వారాలూ మూయగలిగే నైపుణ్యం కలవాడే బ్రాహ్మణు డనబడతాడు. అట్లాంటివాడికి తపస్సులు, యాగక్రియలు, దానాలు, వ్రతాలు అక్కరలేదు. వాడు వేదాలకు దాస్యం చేయవలసిన అవసరం కూడా లేదు.

విశేషం: ఇక్కడ జిహ్వ, ఉపస్థం మొదలైన వాటిని నిగ్రహించగల ఉత్తమగుణ సంపన్నుడే బ్రాహ్మణుడని చెప్పుట జరిగింది. అంతే కాని జాతిచేత బ్రాహ్మణుడైన వాడు పేర్కొన బడలేదని గ్రహించాలి.

తే. ద్వంద్వములు లేక పేర్మికి వ్రస్సి పడక । ప్రకృతి వికృతులఁ గనుచుండు బ్రాహ్మణత్వ
శాలి యా సదాచారంబు సలుపలేని । వాఁడు ఫలకాంక్షియై కర్మవశతఁ బొందు. 324

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వశాలి= (పై పద్యంలో చెప్పిన) బ్రాహ్మణత్వమనే ధర్మంకలవాడు; ద్వంద్వములు లేక= శీతోష్ణాలు, సుఖదుఃఖాలు ఇత్యాదిగాగల ద్వంద్వాలు లేనివాడై; పేర్మికిన్= గౌరవానికి; వ్రస్సిపడక= ఆరాటపడక; ప్రకృతివికృతులన్= ప్రకృతి వికారాలను; కనుచుండున్= చూస్తూ ఉంటాడు; ఆ సదాచారంబు= ఆ సత్ప్రవర్తన; సలుపలేనివాఁడు= అనుష్ఠింపజాలనివాడు; ఫలకాంక్షి+ఐ= ఫలితాలమీది అపేక్ష గలవాడై; కర్మవశతన్= కర్మకు అధీనుడు కావటం; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: పై జెప్పిన నాలుగు ద్వారాలూ మూయటమనే బ్రాహ్మణధర్మంతో ఒప్పారేవాడే శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాలకు లొంగడు. ప్రతిష్ఠకై ప్రాకులాడడు. ప్రకృతిరూపమైన బ్రహ్మాన్నీ, వికృతిరూపమైన దైవతాన్నీ తటస్థుడై చూస్తూ ఉంటాడు. అట్లాంటి బ్రాహ్మణ్యాన్ని అనుష్ఠింపజాలనివాడే ఫలాన్ని అపేక్షించి కర్మల కధీనుడౌతాడు.

వ. అని నిర్దేశించిన గోవునం దడంగియునికి దక్కి సన్నిహితుండై స్యూమరశ్మి తన పేరు సెప్పి 'యేను ధర్మనిర్ణయం బెఱింగికొనవలసి గోవిలీనుండనై పలుకుచుండితిఁ గాని యొండుగాదు. మహాత్మా! ని న్నాశ్రయించితి. వేదంబులు ప్రమాణంబు లగుట యూఁది వర్ణాశ్రమ విహితాచారంబులు నడపుటయుం, బరిత్యాగంబునుం గల దెయ్యది యత్యంత విధేయంబు సువ్యక్తంబుగా నెఱింగింపవే. నీవు ధర్మసూక్ష్మత్వదర్శి; వేను శుశ్రూషకుండ; న న్ననుశాసింపు'మనవుడుఁ గపిలుండు ప్రీతుండై యతని కిట్లనియె. 325

ప్రతిపదార్థం: అని నిర్దేశించినన్= అని కపిలుడు చెప్పగా; స్యూమరశ్మి= స్యూమరశ్మి అనే ముని; గోవునందున్= ఆవునందు; అడంగిఉనికి= అడగిఉండటాన్ని; తక్కి= వర్జించి; సన్నిహితుండు+ఐ= సమీపానికి వచ్చినవాడై; తన పేరుచెప్పి= తన నామం పేర్కొని; ఏను= నేను; ధర్మనిర్ణయంబు= ధర్మనిశ్చయం; ఎఱింగికొనవలసి= తెలిసికొనవలసి; గోవిలీనుండను+ఐ= ఆవునందు దాగినవాడనై; పలుకుచుండితిన్= మాటాడుతూ ఉన్నాను; కాని= అంతేకాని; ఒండుకాదు= మరేమీ కాదు; మహాత్మా!= మహా బుద్ధిగలవాడా!; నిన్నున్+ఆశ్రయించితిన్= నిన్ను అండగొన్నాను; వేదంబులు= శ్రుతులు; ప్రమాణంబులు+అగుట= జ్ఞానకారణాలు కావటం; ఊఁది= గ్రహించి; వర్ణాశ్రమ విహిత+ఆచారంబులు= వర్ణాలకు, ఆశ్రమాలకు విధింపబడిన ఆచారాలు; నడపుటయున్=

నిర్వహించటమూ; పరిత్యాగంబునున్= వదలిపెట్టటమున్నూ; కలది= ఉన్నది; ఏ+అది= ఏది?; అత్యంత విధేయంబు= మిక్కిలిగా చేయదగినదో; సువ్యక్తంబుగాన్= స్పష్టంగా; ఎఱింగింపవే!= తెలుపుమా!; నీవు= కపిలమునివైన నీవు; ధర్మసూక్ష్మత్వదర్శివి= ధర్మాలలోని సూక్ష్మభావాన్ని చూచేవాడవు; ఏను= నేను; శుశ్రూషకుండన్= సేవకుడను (వినగోరేవాడను); నన్నున్+అనుశాసింపుము= నన్ను ఆజ్ఞాపించుము; అనవుడున్= అనగా; కపిలుండు= కపిలముని; ప్రీతుండు+ఐ= ప్రీతి పొందినవాడై; అతనికిన్= ఆ స్యూమరశ్మికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలముని అట్లా చెప్పేసరికి స్యూమరశ్మి ధేనువులో దాగి ఉండటాన్ని వర్జించి అతడికి సమీపంగా వచ్చాడు. తన పేరు చెప్పి ఇట్లా అన్నాడు: ' నేను ధర్మనిశ్చయం గ్రహించదలచి ఈ గోవులో దాగి మాటలాడానే కాని మరేమీ కాదు. ఓ మహాత్మా! నేను నిన్ను ఆశ్రయించాను. వేదాలు ప్రమాణాలు అన్న సంగతి గ్రహించిన తర్వాత ఆ వేదాలలో విధించిన బ్రాహ్మణాది వర్ణాలకూ, బ్రహ్మచర్యాద్యాశ్రమాలకూ తగిన ఆచారాలను నిర్వహించటమూ కద్దు. పరిత్యజించటమూ కద్దు. ఈ రెండు పద్ధతులలో ఏది మిక్కిలిగా అనుష్ఠించదగిందో స్పష్టంగా తెలియజెప్పుము. నీవు ధర్మాలలోని సూక్ష్మాంశాలను తెలిసినవాడవు. నేను వినాలన్న కోరికతో వచ్చిన సేవకుడను. నాకు ఈ రహస్యం బోధించి నన్ను శాసించుము'. అత డట్లా అనగానే కపిలుడు అతడిపట్ల ప్రీతిపొంది ఇట్లా చెప్పాడు:

క. జ్ఞానంబు నాశ్రయించిన । వానికి నే పనులఁ గీడు వాటిల్లదు; ప్ర
జ్ఞానరహితుండు గామా । ధీనత మెయిఁ గర్మసమితి త్రిప్పునఁ జిక్కున్. 326

ప్రతిపదార్థం: జ్ఞానంబున్= జ్ఞానయోగాన్ని; ఆశ్రయించినవానికిన్= అండగాకొన్నవాడికి; ఏ పనులన్= ఏ కార్యాలలోనూ; కీడు= అశుభం; పాటిల్లదు= కలుగదు; ప్రజ్ఞానరహితుండు= ప్రకృష్టమైన జ్ఞానం లేనివాడు; కామ+అధీనతమెయిన్= కోరికలకు వశపడుటవలన; కర్మసమితి త్రిప్పునన్= కర్మసమూహాల పరిభ్రమణంలో; చిక్కున్= తగులుకొంటాడు.

తాత్పర్యం: 'జ్ఞానాన్ని ఆశ్రయించినవాడు ఏ పనిచేసినా వాడికి కీడు కలుగదు. జ్ఞానం లేనివాడు కోరికలకు దాసుడై కర్మలలో తగులుకొంటాడు. ఆ కర్మల చక్రభ్రమణంలోబడి తిరుగుతూ ఉంటాడు.

క. అనహంకారుఁడు నక్రో । ధనుఁడు నతృష్ణుండు నై నతఁడు శుభ మశుభం
బను భేదముఁ బొరయఁడు; విడు । పున సమతాసుఖమయత్వముం గనుచుండున్. 327

ప్రతిపదార్థం: అనహంకారుఁడున్= అహంకారంలేనివాడు; అక్రోధనుఁడున్= కోపంలేనివాడు; అతృష్ణుండున్= ఆశ లేనివాడూ; ఐన+అతఁడు= అయినవాడు; శుభము+అశుభంబు+అను= మేలు కీడు అనే; భేదమున్= తేడాను; పొరయఁడు= పొందడు; విడుపునన్= త్యాగంచేత; సమతాసుఖమయత్వమున్= సమభావంచేత కలిగే సుఖస్థితిని; కనుచుండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: అహంకారం, కోపం, ఆశ లేనివాడు శుభాశుభాలనే భేదదృష్టి పొందడు. అతడు త్యాగం కలిగి సర్వత్రా సమభావంతో సుఖస్వరూపాన్నే దర్శిస్తూ ఉంటాడు.

క. వినుమెఱుక గలర మీరె । ల్లను నేకాత్మత్వసిద్ధి లాభం బెందే
ని నొకని కలవడు నాతం । డనుమానింపఁ డఖిల క్రియలుఁ బోఁ ద్రోచున్.' 328

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; మీరు+ఎల్లనున్= మీరు అందరున్నూ; ఎఱుకగలర= తెలివిగలవారే; ఎందున్+ఏనిన్= ఎక్కడో ఒక్కచోట; ఒకనికిన్= ఒక్కడికి; ఏక+ఆత్మత్వసిద్ధిలాభంబు= ఒకే ఒక ఆత్మ ఉన్నదనే భావప్రాప్తి; అలవడున్= సిద్ధిస్తుంది;

ఆతండు= ఆ సిద్ధి కలిగినవాడు; అనుమానింపఁడు= సందేహించడు; అఖిలక్రియలున్= సమస్తమైన పనులూ; పోన్‌త్రోచున్= తొలగద్రోస్తాడు.

తాత్పర్యం: వినుము. మీరందరూ జ్ఞానం కలవారే, ఐనా ఎక్కడో ఒకానొకడికి మాత్రమే సర్వత్రా ఏకాత్మభావనాప్రాప్తి కలుగుతుంది. అది కలిగినవాడి కీ సందేహా లుండవు. అతడు సర్వకర్మలూ అనాయాసంగా కడకు నెట్టివేస్తాడు.

వ. అనిన విని స్యూమరశ్మి య మ్మునివరున కిట్లనియె. 329

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; స్యూమరశ్మి= స్యూమరశ్మి యనేవాడు; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలు డట్లా చెప్పగా విని స్యూమరశ్మి ఆ మునీంద్రుడితో ఈ రీతిగా చెప్పాడు.

ఆ. వేదశాస్త్రసరణి విడుచు టున్మార్గవ । ర్తనము; మోక్షపదము రాదు దాన
ననఁగ విందు; నంచితాత్మ వేదంబులఁ । గైకొనమియ కీడు నాకుఁ జూడ. 330

ప్రతిపదార్థం: అంచిత+ఆత్మ!= పూజితాత్మా!; వేదశాస్త్రసరణి= వేదాలు, శాస్త్రాలు విధించిన త్రోవ; విడుచుట= వీడటం; ఉన్మార్గవర్తనము= తప్పుత్రోవలో నడవటమే; దానన్= అందువలన; మోక్షపదము= ముక్తిస్థానం; రాదు= సిద్ధించదు; అనఁగన్= అని చెప్పగా; విందున్= విని ఉన్నాను; నాకున్+చూడన్= నా పరిశీలనలో; వేదంబులన్= శ్రుతులను; కైకొనమి+అ= స్వీకరింపకుండటమే; కీడు= అశుభం.

తాత్పర్యం: పవిత్రాత్మా! వేదాలు, శాస్త్రాలు విధించిన త్రోవ వదలటం తప్పుదారిలో చరించటమే. అట్లా చేయటంవలన ముక్తి సిద్ధించదని నేను విన్నాను. పరిశీలించి చూడగా వేదాలను అంగీకరించకుండా ఉండటమే కీడుగా నాకు తోస్తున్నది.

వ. నా మనంబు సందియంబుఁ బాపవే' యనినం గపిలుం డమ్మహాద్విజునితో 'వేదంబుల నేల కై కొనకుండ వచ్చు? నవియ చూవె లోకంబులకుం బ్రమాణంబు'లని పలికి యిట్లనియె. 331

ప్రతిపదార్థం: నా మనంబు సందియంబు= నా మనస్సులోని సందేహాన్ని; పాపవే= తొలగించుమా; అనినన్= అనగా; కపిలుండు= కపిలముని; ఆ+మహాద్విజునితోన్= ఆ గొప్పవిప్రుడితో; వేదంబులన్= శ్రుతులను; ఏల= ఎందుకు; కైకొనక+ఉండవచ్చున్?= స్వీకరించక ఉండవచ్చును?; అవి+అ= ఆ వేదములే; చూవె!= సుమా!; లోకంబులకున్= జగత్తులకు; ప్రమాణంబులు= కొలమానాలు, ఆదర్శాలు; అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: నా మనస్సులోని సందేహం తొలగించు'మని స్యూమరశ్మి అనేసరికి కపిలుడు ఆ మహాబ్రాహ్మణుడితో 'వేదాలను ఎందుకు అంగీకరించకుండా ఉండాలి? అవే కదా లోకాలకు ప్రమాణాలుగా ఉన్నాయి' అని చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు:

కపిలుఁడు స్యూమరశ్మికి వేదంబులు ముఖ్యప్రమాణంబులుగాఁ జెప్పుట (సం. 12-262-14,1)

క. 'అరయంగా శబ్దంబును । బరంబు నన రెండు సూవె బ్రహ్మములు; గుణో
త్తర! శబ్దబ్రహ్మ భజన । పరుఁడు పరబ్రహ్మ మహిత పదమున్ బొందున్. 332

ప్రతిపదార్థం: గుణ+ఉత్తర!= గుణశ్రేష్ఠుడా!; అరయంగాన్= పరిశీలించగా; శబ్దంబును= శబ్దమనీ; పరంబును= పరమనీ; అనన్= అనగా; రెండు= ఇవి రెండూ; బ్రహ్మములు= బ్రహ్మ శబ్దంచేత చెప్పబడతాయి; చూవె= సుమా!; శబ్దబ్రహ్మ భజనపరుఁడు=

శబ్దబ్రహ్మమును సేవించటంలో ఆసక్తుడైనవాడు; పరబ్రహ్మమహిత పదమున్= పరబ్రహ్మ మనే శ్రేష్ఠమైన మోక్షస్థానాన్ని; పొందున్= చేరుకొంటాడు.

తాత్పర్యం: గుణశ్రేష్ఠుడవైన ఓ స్యూమరశ్మీ! బ్రహ్మములు రెండు. అవి శబ్దబ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ పేర్కొనబడుతున్నాయి. అందులో శబ్దబ్రహ్మాన్ని భజించి నిష్ణాతుడైనవాడు పరబ్రహ్మపదవి అనే మోక్షస్థానం చేరుకొంటాడు.

విశేషం: పై పద్యంలో 'గుణోత్తర' అనే పదాన్ని శబ్దబ్రహ్మశబ్దానికి విశేషణంగా అన్వయించి గుణాలచేత శ్రేష్ఠమైన శబ్దబ్రహ్మాన్ని భజించేవాడు అని కూడ అర్థం చెప్పవచ్చును. ఈ పద్యానికి మూలమైన సంస్కృత శ్లోకం

"ద్వే బ్రహ్మణీ వేదితవ్యే శబ్దబ్రహ్మ పరం చ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥"

అని అమృతబిందూపనిషత్తులో

"ద్వే విద్యే వేదితవ్యే తు శబ్దబ్రహ్మ పరం చ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి॥"

అని కొద్దిపాటి మార్పుతో కనిపిస్తున్నది.

శబ్దబ్రహ్మ విద్యను అపరావిద్య అనీ, పరబ్రహ్మ బోధకవిద్యను పరావిద్య అనీ ఉపనిషత్తులు పేర్కొన్నాయి. మొదట అపరావిద్యలో కృషి చేసి నిష్ణాతుడైన వాడు అనగా ఆరితేరినవాడు పరావిద్యలో ప్రావీణ్యం పొందగలడని ఉపనిషత్తుల అభిప్రాయం.

క. మనమున నెద్దియుఁ గోరం । డనసూయయు శమము దమము నతులజ్ఞానం
బును గల గృహపతి ధర్మం । బని నడపును వేదచోదితాచారములన్. 333

ప్రతిపదార్థం: అనసూయయున్= అసూయ లేకపోవటమూ; శమమున్= అంతరింద్రియనిగ్రహమూ; దమమున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; అతులజ్ఞానంబును కల= సాటిలేని జ్ఞానమూ కలిగినట్టి; గృహపతి= గృహస్థుడు; మనమునన్= చిత్తంలో; ఎద్దియున్= ఏది కూడా; కోరండు= అభిలషించడు; వేదచోదిత+ఆచారములన్= వేదంచేత విధించబడిన ఆచారాలను; ధర్మంబు+అని= ఇవి చేయదగిన ధర్మాలని; నడపును= నిర్వహిస్తాడు.

తాత్పర్యం: అసూయ వదలి అంతరింద్రియాలపైనా, బాహ్యేంద్రియాలపైనా నిగ్రహం సాధించిన జ్ఞానసంపన్నుడైన గృహస్థుడు మనస్సులో ఏదీ అభిలషించడు. అతడు వేదం విధించిన సదాచారాలను కర్తవ్యధర్మాలన్న బుద్ధితో శ్రద్ధగా నిర్వహిస్తాడు.

క. భూతదయయు ననహంకా । రాతిశయముఁ గలుగు విమలుఁ డప్రాయశ్చి
త్తాతురుఁడు సూవె! విధులు సు । నీతములైనను దృఢాత్మనిష్ఠ కతమునన్. 334

ప్రతిపదార్థం: భూతదయయున్= ప్రాణికోట్లపై కరుణ; అనహంకార+అతిశయమున్= అహంకారం లేమి; కలుగు= కలిగినట్టి; విమలుఁడు= నిర్మలస్వభావుడు; విధులు= వేదవిహితాచారాలు; సునీతములు+ఐనను= చక్కగా అనుష్ఠించబడినప్పటికి; దృఢ+ఆత్మనిష్ఠ= గట్టి ఆత్మస్థితి; కతమునన్= కారణాన; అప్రాయశ్చిత్తాతురుఁడు= ప్రాయశ్చిత్తంచేత ఆతురుడు కానివాడు; చూవె!= సుమా!

తాత్పర్యం: ప్రాణులపై దయ, అహంకారం బొత్తిగా లేకపోవటం కల నిర్మలచిత్తుడైన గృహస్థుడు దృఢమైన ఆత్మనిష్ఠ కలిగి ఉంటాడు. అందువలన అతడు వేదం విధించిన ఆచారాలు, కర్మలు చేస్తున్నా ప్రాయశ్చిత్తం చేయవలసిన పనిలేదు.(ఆత్మనిష్ఠవలన అతడిలోని దోషాలు తొలగిపోతాయి కాబట్టి ప్రాయశ్చిత్తం అక్కరలేదనిభావం.).

క. వినుఁ శాంతులైన విప్రులు । మనుజేంద్రులు గృహమునంద మహితవ్రత సం
జనిత పరిజ్ఞాన నిరం । జనులై పడయుదురు సూవె శాశ్వతపదమున్. 335

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; శాంతులు+ఐన= నిగ్రహపరులైన; విప్రులు= బ్రాహ్మణులు; మనుజ+ఇంద్రులు= రాజులు; గృహమునందు+అ= ఇంటియందే; మహితవ్రతసంజనిత పరిజ్ఞాన నిరంజనులు+ఐ= శ్రేష్ఠమైన వ్రతంచేత కలిగిన పరిజ్ఞానంచేత దోషం లేనివారై; శాశ్వతపదమున్= ముక్తిని; పడయుదురు= పొందుతారు; చూవె!= సుమా!

తాత్పర్యం: ఇంకా వినుము. ఇంద్రియనిగ్రహపరులైన విప్రులు, నృపులు గృహస్థాశ్రమంలోనే చక్కని వ్రతాలు ఆచరించి అందువలన కలిగిన జ్ఞానం వలన దోషం శమించినవారై శాశ్వతమైన మోక్షస్థానం పొందుతారు.

తే. బ్రహ్మచర్యాదు లగు నాల్గుఁ బాదమహిమ । గాఁగఁ బరఁగెడు ధర్మ మొక్కటియ చూవె!
యెవ్వఁ డెందు వర్తించిన నేమి? సకల । కర్మఫలరూపకత్వ మొక్కటియ కాదె! 336

ప్రతిపదార్థం: బ్రహ్మచర్య+ఆదులు+అగు= బ్రహ్మచర్యం మొదలైనవి; నాల్గున్= నాలుగు ఆశ్రమాలు కూడా; పాదమహిమకాఁగన్= పాదప్రభావం పొందగా; పరఁగెడు= విలసిల్లే; ధర్మము= ధర్మం; ఒక్కటియచూవె!= ఒక్కటే సుమా!; ఎవ్వఁడు= ఏ వ్యక్తి; ఎందు= ఏ ఆశ్రమంలో; వర్తించినన్+ఏమి= ప్రవర్తించినా ఏమి; సకలకర్మఫలరూపకత్వము= సమస్త కర్మల ఫలాన్ని రూపించే ధర్మం; ఒక్కటియ కాదె!= ఒక్కటే కదా!

తాత్పర్యం: ధర్మానికి బ్రహ్మచర్యం మొదలైన నాలుగాశ్రమాలు నాలుగుపాదాలుగా ఉన్నాయి. ఆ నాలుగుపాదాలపై నిలిచి ఉన్న ధర్మం ఒక్కటే. అందుచేత ఎవడు ఏ ఆశ్రమంలో ఉంటే నేమి? సమస్త కర్మల ఫలాలను రూపింపజేసే ధర్మస్వరూపం ఒక్కటే కదా! (సర్వకర్మల ఫలస్వరూపం ఒకటే కదా!)

క. సంతోషామృత సుఖిత । స్వాంతుం డగు నేని నట్టివాఁడు గృహంబుం
గాంతారదేశమును నొ । క్కంతగ నిశ్చింతవృత్తి నక్షోభ్యుఁ డగున్. 337

ప్రతిపదార్థం: సంతోష+అమృత సుఖితస్వాంతుండు= సంతసమనే అమృతంచేత సుఖించిన చిత్తం కలవాడు; అగున్+ఏనిన్= అయితే; అట్టివాఁడు= అట్లాంటి మనుజుడు; గృహంబున్= ఇంటిని; కాంతారదేశమునున్= అడవిప్రదేశాన్నీ; ఒక్కంతగన్= ఒకే విధంగా (భావించి); నిశ్చింతవృత్తి= చింతలేని వర్తనముతో; అక్షోభ్యుఁడు+అగున్= క్షోభింపజేయటానికి వీలుకాని వాడౌతాడు.

తాత్పర్యం: ఎవడు సంతోషమనే అమృతంతో సుఖించే చిత్తం కలిగి ఉంటాడో అట్లాంటివాడు ఇంటినీ, అడవినీ ఒకే రకంగా భావించగలవా డవుతాడు. వాడికి చింతలు ఉండవు. అందువలన దేనికీ కలత చెందడు.

క. వినుఁ తృష్ణారాహిత్యం । బున నాలవు నాశ్రమంబుఁ బొందుదురు మహా
జను; లది యుపనిషదుక్తం । బనక యవైదిక మనంగ నగునే నీకున్? 338

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; మహాజనులు= గొప్పవారు; తృష్ణారాహిత్యంబునన్= ఆశలేమిచేత; నాలవు= నాల్గవదైన; ఆశ్రమంబున్= సన్న్యాసాశ్రమాన్ని; పొందుదురు= చెందుతారు; అది= ఆ పద్ధతి; ఉపనిషద్+ఉక్తంబు+అనక= ఉపనిషత్తులచేత ప్రతిపాదించబడినదని చెప్పక; అవైదికము+అనంగన్= వేదవిరుద్ధ మైనదని చెప్పగా; నీకున్+అగునే?= నీకు తగునా?

తాత్పర్యం: మహాత్ములు ఆశను పూర్తిగా వర్జించి నాలుగవదైన సన్న్యాసాశ్రమం స్వీకరిస్తారు. అది ఉపనిషత్తులు ప్రతిపాదించిన పద్ధతి. అట్లా భావించక అది వేదవిహితమైనది కాదు అని నీవు చెప్పవచ్చునా?

క. జ్ఞానము ధర్మమున కధి । ష్ఠానము మూలంబు పరమసంతోషము భ
వ్యానూనత్యాగము రూ । పానందము ప్రాఁకు దాని కను వేదంబుల్. 339

ప్రతిపదార్థం: వేదంబుల్= శ్రుతులు; ధర్మమునకున్= యతిధర్మానికి; అధిష్ఠానము= ఆశ్రయం; జ్ఞానము= జ్ఞాననిష్ఠ; దానికిన్= ఆ ధర్మానికి; పరమసంతోషము= ఆనందం; మూలంబు= మొదలు; భవ్య+అనూనత్యాగము= శ్రేష్ఠమైన మహాత్యాగం; రూపు= స్వరూపం; ఆనందము= ఆత్మానందం; ప్రాఁకు= ఆలంబనం; అనున్= అని చెప్పుతున్నవి.

తాత్పర్యం: వేదాలు యతిధర్మాని కధిష్ఠానం జ్ఞానమనీ, దానికి అత్యంతసంతోషిష్ఠితే మొదలనీ, మహాత్యాగమే స్వరూపమనీ, ఆనందమే పట్టుగొమ్మ అనీ చెప్పుతున్నాయి.

క. ఏదియుఁ దలఁప నసేవ్యము । గా దాశ్రమసమితిలోనఁ గావున శుచులై
యేదాన నున్న సంసా । రోదధి యాదరికిఁ బోవ నోపుదురు బుధుల్. 340

ప్రతిపదార్థం: ఆశ్రమసమితిలోనన్= బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలలోనూ; ఏదియున్= ఏ ఆశ్రమం కూడా; తలఁపన్= భావించగా; అసేవ్యము కాదు= సేవించదగినది కాదు; కావునన్= అందుచేత; శుచులు+ఐ= శుద్ధాంతఃకరణం కలవారై; ఏ దానన్+ఉన్నన్= ఏ ఆశ్రమంలో ఉన్నా; బుధుల్= పండితులు; సంసారోదధి= సంసారసాగరం యొక్క; ఆ దరికిన్= ఆవలి గట్టుకు; పోవన్= పోవటానికి; ఓపుదురు= సమర్థ లవుతారు.

తాత్పర్యం: బాగా ఆలోచించి చూస్తే నాలుగు ఆశ్రమాలలోనూ ఏ ఆశ్రమమూ సేవించదగినది కాదు. అందువలన అంతఃకరణశుద్ధి కలిగి ఏ ఆశ్రమంలో ఉన్నా ఆత్మజ్ఞులైన పండితులు సంసారసాగరతీరం చేరగలరు.

క. సంతోషంబున నేగతి । శాంతాత్మున కొదవు దాని సద్గతిగా వే
దాంతవిదులు గొనియాడుదు; । రింత నిజము; దీని నీవు నెఱుఁగు మనింద్యా! 341

ప్రతిపదార్థం: అనింద్యా!= నిందించదగనివాడా!; శాంత+ఆత్మునకున్= శమించిన చిత్తంకలవాడికి; సంతోషంబునన్= సంతసం చేత; ఏ గతి= ఏ ప్రాప్తి; ఒదవున్= కలుగునో; దానిన్= ఆ గతిని; వేదాంత విదులు= వేదాంతం తెలిసిన వారు; సద్గతిగాన్= మంచిగతిగా; కొనియాడుదురు= పొగడుదురు; ఇంత నిజము= ఇంతా సత్యం; నీవున్= నీవుకూడ; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: పవిత్రుడవైన ఓ స్యూమరశ్మీ! శాంతచిత్తుడైన వాడికి సంతోషం కారణంగా ఏ గతి లభిస్తుందో, ఆ గతినే సద్గతి అని వేదాంతవేత్తలైన పెద్దలు శ్లాఘిస్తారు. ఇది సత్యం. నీవు కూడా ఈ సత్యాన్ని గ్రహించుము.

తే. వేద తాత్పర్య మారసి వేదితవ్య । మెఱుఁగు వారలు వేదజ్ఞు; లిట్లు గాని
వారు వేదపాఠకులు; సర్వంబు నరయ । వేద పరినిష్ఠితము సూవె విప్రవర్య! 342

ప్రతిపదార్థం: విప్రవర్య!= బ్రాహ్మణశ్రేష్ఠా!; వేద తాత్పర్యము= శ్రుతియొక్క భావాన్ని; ఆరసి= పరిశీలించి; వేదితవ్యము= తెలిసికొన దగిన తత్త్వాన్ని; ఎఱుఁగువారలు= తెలిసికొనేవారు; వేదజ్ఞులు= వేదం తెలిసినవారు; ఇట్లు కానివారు= ఈ రీతిగా తెలిసికొనని వారు; వేదపాఠకులు= వేదం చదివేవారు; అరయన్= పరిశీలించగా; సర్వంబున్= సమస్తమూ; వేదపరినిష్ఠితము= వేదంలో నిహితం; చూవె!= సుమా!

తాత్పర్యం: విప్రశ్రేష్ఠా! ఎవరు వేదభావాన్ని గ్రహించి తెలియదగిన తత్త్వం తెలిసికొంటారో వారే వేదం తెలిసినవా రవుతారు. అట్లా కానివారు వట్టి వేదపాఠకులు మాత్రమే. వారికి వేదరహస్యం తెలియదు. పరిశీలించి చూచేవారికి వేదంలోనే అంతా నిక్షిప్తమైనట్లు గోచరిస్తుంది.

క. త్యాగ మొక నెలవు; శమసం । యోగం బుత్తరము దాని; కూర్ధ్వము సంతో
షాగమము; మోక్షలాభో । ద్యోగికి నివి గమ్యభూము లుత్తమధిషణా!' 343

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా!= శ్రేష్ఠమైన బుద్ధి కలవాడా!; త్యాగము= కర్మఫలాన్ని త్యజించటం; ఒక నెలవు= ఒక స్థానం; దానికిన్= ఆ త్యాగానికంటె; శమసంయోగము= అంతరింద్రియ నిగ్రహం; ఉత్తరము= శ్రేష్ఠం; సంతోషాగమము= సంతుష్టి పొందటం; ఊర్ధ్వము= దానికంటె ఉన్నతమైనది; మోక్షలాభ+ఉద్యోగికిన్= ముక్తిప్రాప్తికై ప్రయత్నించే వాడికి; ఇవి= ఈ మూడూ; గమ్యభూములు= చేరదగిన స్థానాలు.

తాత్పర్యం: శ్రేష్ఠమతీ! మోక్షం కావాలని ప్రయత్నించే సాధకుడు ముందు కర్మఫలత్యాగం చేయాలి. ఆ తరువాత మనస్సును నిగ్రహించాలి. ఆ పైన సదా సంతోషంతో ఉండాలి. ఇవి ఒక దానికంటె ఒకటి ఉన్నతమైన గతులు. సాధకుడు తప్పక ఈ మూడింటినీ పొందాలి'.

వ. అని యి ట్లుపదేశించి. 344

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ రీతిగా; ఉపదేశించి= ప్రబోధించి.

తాత్పర్యం: కపిలుడు స్యూమరశ్మికి పైన చెప్పిన విధంగా ఉపదేశించాడు. తరువాత.

సీ. 'వేదితవ్యంబన విదితంబు నా ఋతం । బనఁగ సత్యంబన నతిశయిల్లి,
సంభృతస్థావర జంగమం బనఁగ స । ర్వాత్మకంబన శుభం బనఁగ వెలసి,
యవ్యక్త మనఁగ బ్రహ్మంబునా నుత్తర । మనఁగ శివంబన వినుతి కెక్కి,
ప్రభవం బనంగ నవ్యయ మన శాంతి నాఁ । దేజంబు నా నెందుఁ దేజరిల్లి,

తే. క్షమ యనంగ నంబర మనఁగా ధ్రువంబు । నా ననామయ మన నొప్పి లీనరూప
బుద్ధి సంప్రాప్య మగు తత్త్వమునకు వేద । మానిత బ్రాహ్మణులకు నమస్కరింతు.' 345

ప్రతిపదార్థం: వేదితవ్యంబు+అనన్= వేదితవ్యమనీ (తెలిసికొనదగిన దనీ); విదితంబునాన్= విదితమనీ (తెలియబడినదనీ); ఋతంబు+అనఁగన్= ఋతమనీ; సత్యంబు+అనన్= సత్యం అనీ; అతిశయిల్లి= శోభిల్లి; సంభృత స్థావర జంగమంబు+అనఁగన్= చరాచరములను భరించినదనీ; సర్వాత్మకంబు+అనన్= సర్వ స్వరూపమనీ, అన్నిటికీ ఆత్మస్థానీయమనీ; శుభంబు+అనఁగన్= శుభమనీ; వెలసి= అలరారి; అవ్యక్తము+అనఁగన్= అవ్యక్తమనీ; బ్రహ్మంబునాన్= బ్రహ్మమనీ; ఉత్తరము+అనఁగన్= ఉత్తరమనీ; శివంబు+అనన్= శివమనీ; వినుతికిన్+ఎక్కి= ప్రసిద్ధి పొంది; ప్రభవంబు+అనఁగన్= ప్రభవమనీ (ఉత్పత్తి స్థానమనీ); అవ్యయము+అనన్= అవ్యయ మని (వ్యయం కానిదనీ); శాంతినాన్= శాంతి అనీ; తేజంబునాన్= తేజమనీ; ఎందున్= అంతటా; తేజరిల్లి= ప్రకాశించి; క్షమఅనఁగన్= క్షమ అనీ, (భూమి అనీ); అంబరంబు+అనఁగాన్= అంబరమనీ (ఆకాశమనీ); ధ్రువంబునాన్= ధ్రువమనీ (స్థిరమైనదనీ); అనామయమనన్= అనామయమనగా (జాడ్యం లేనిదనగా); ఒప్పి= భాసించి; లీనరూప బుద్ధిసంప్రాప్యము+అగు= లయమైన రూపం కల బుద్ధిచేత ప్రాపింపదగిన; తత్త్వమునకున్= పరతత్త్వానికి; వేదమానిత బ్రాహ్మణులకున్= వేదజ్ఞానంచేత పూజించబడిన విప్రులకూ; నమస్కరింతున్= ప్రణమిల్లుతాను.

తాత్పర్యం: వేదితవ్యమూ, విదితమూ, ఋతమూ, సత్యమూ, సంభృతస్థావరజంగమమూ (చరాచర జగత్తును భరించేది), సర్వాత్మకమూ, శుభమూ, అవ్యక్తమూ, బ్రహ్మమూ, ఉత్తరమూ, శివమూ, ప్రభవమూ, అవ్యయమూ,

శాంతీ, తేజమూ, క్షమా, అంబరమూ, ధ్రువమూ, అనామయమూ - అని వ్యవహరించబడుతూ లయించిన రూపం కల బుద్ధికి మాత్రమే గోచరమవుతున్న పరతత్త్వానికీ, వేద విజ్ఞానంతో పూజితులైన విప్రులకూ నేను నమస్కరిస్తాను.

వ. అని పలుకుటయు స్యూమరశ్మి ప్రీతుఁడగుచుఁ గపిలునిం బ్రశంసించె; నియ్యితిహాసంబు తాత్పర్యంబు నీవుం గనికొను'మని చెప్పినం దద్దయుఁ బ్రియంబంది ధర్మనందనుండు 'ధర్మార్థకామంబులు మూఁడును వేదశంసితంబులు; వీనిలో నెద్దాని లాభంబున విశేషంబు గలిగియుండు నెఱింగింపవే !' యనిన గాంగేయుండు గుండధారుం డనువాఁడు నిజభక్తున కుపకారంబు సేసిన ప్రకారం బితిహాస రూపంబునం బ్రవర్తిల్లునది భవత్ప్రశ్నంబునకు నుత్తరంబై యుండు; వినుము చెప్పెద'నని యప్పుడమిఱేని కిట్లనియె.346

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని చెప్పేసరికి; స్యూమరశ్మి ప్రీతుండు+అగుచున్= స్యూమరశ్మిఅనే ముని సంతుష్టుడై; కపిలునిన్= కపిలుడిని; ప్రశంసించెన్= అభినందించాడు; ఈ+ఇతిహాసంబు+తాత్పర్యంబున్= ఈ ఇతిహాసంయొక్క భావాన్ని; నీవున్= నీవు కూడా; కనికొనుము= గ్రహించుము; అని చెప్పినన్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; తద్దయున్= మిక్కిలిగా; ప్రియంబు+అంది= సంతోషించి; ధర్మ+అర్థకామంబులు మూఁడునున్= ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలూ; వేదశంసితంబులు= వేదాలచేత ప్రశంసింపబడి ఉన్నాయి; వీనిలోన్= ఈ మూడింటిలోనూ; ఏ+దాని లాభంబునన్= దేని ప్రాప్తివలన; విశేషంబు= అతిశయం; కలిగి+ఉండున్= లభిస్తుంది; ఎఱింగింపవే= చెప్పుమా; అనినన్= అని అడుగగా; గాంగేయుండు= భీష్ముడు; కుండధారుండు+అనువాఁడు= కుండధారుడనేవాడు; నిజభక్తునకున్= తన భక్తుడికి; ఉపకారంబు చేసిన ప్రకారంబు= ఉపకరించిన పద్ధతి; ఇతిహాసరూపంబునన్= పూర్వకథారూపంతో; ప్రవర్తిల్లున్= ఉంటున్నది; అది= ఆ కథ; భవత్ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు+ఐ ఉండున్= సమాధానమై ఉన్నది; వినుము= ఆలకించుము; చెప్పెదన్+అని= చెప్పుతాను అని; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని కపిలమునీంద్రుడు చెప్పేసరికి స్యూమరశ్మి సంతసించి కపిలమునిని ప్రశంసించాడు. ఈ కథలోని భావం నీవు కూడా గ్రహించుము అని భీష్ముడు చెప్పాడు. అందుకు ధర్మరాజు ఎంతో సంతోషించాడు. ఆయన మళ్ళీ 'వేదాలలో ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలు ప్రశస్తమై ఉన్నాయి. ఆ మూడిటిలోనూ ఏది లభిస్తే గొప్పగా ఉంటుంది? ఈ సంగతి తెలియజెప్పుము' అని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడు ' పూర్వం కుండధారుడు అనేవాడు తన భక్తుడికి ఉపకరించిన విధానం ఒక ఇతిహాసరూపంలో ఉన్నది. అది నీ ప్రశ్నకు సమాధానంగా ఉంటుంది; దానిని చెప్పుతాను విను'మని ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

కుండధారుం డను దేవానుచరుని వృత్తాంతము (సం. 12-263-2)

సీ. 'యజ్ఞార్థ మొక్క బ్రాహ్మణుఁడు ధనార్థియై । తపము సేయఁగఁ గుండధారుఁ డనఁగఁ
బరఁగెడు దేవానుచరుఁ డచ్చటికి వచ్చి । 'యభిలాష మేరూప' మనుడు 'నర్థ
సిద్ధిఁ గోరెద'నని చెప్పినఁ బ్రీతి నా । తఁడు మాణిభద్రుని ధనదభృత్య
నియతిఁ దలంప సన్నిధి సేసె నయ్యక్షుఁ; । డతఁడు 'మదాశ్రితుం డైన యితని

తే. ధనసమగ్రునిఁ జేయవే' యనిన 'నెంత । ధనము వలసిన నిచ్చెద' ననియె మాణి
భద్రుఁ డమ్మహాత్ముఁడు మర్త్యభావ మస్థి । రత్వదూషిత మను విచారంబు వుట్టి! 347

ప్రతిపదార్థం: ఒక్క బ్రాహ్మణుఁడు= ఒక విప్రుడు; యజ్ఞ+అర్థము= యజ్ఞంకొరకై; ధనార్థి+ఐ= ధనంకోరినవాడై; తపము చేయఁగన్= తపస్సు చేయగా; కుండధారుఁడు+అనఁగన్= కుండధారుడు అనే పేరుతో; పరఁగెడు= ప్రవర్తిల్లెడు; దేవ+అనుచరుఁడు=

దేవసేవకుడు; అచ్చటికిన్= ఆ చోటికి; వచ్చి= ఏతెంచి; అభిలాషము= కోరిక; ఏ రూపము?= ఎట్టిది?; అనుడున్= అనగా; అర్థసిద్ధిన్= ధనప్రాప్తిని; కోరెదను+అని= అభిలషిస్తున్నానని; చెప్పినన్= చెప్పగా; ఆతఁడు= ఆ కుండధారుడు; ప్రీతిన్= ప్రీతితో; నియతిన్= నియమపూర్వకంగా; ధనదభృత్యున్= కుబేరుడి బంటు అయిన; మాణిభద్రునిన్= మాణిభద్రుడనేవాడిని; తలంపన్= స్మరించగా; ఆ+యక్షుఁడు= ఆ యక్షుడు; సన్నిధిచేసెన్= సమీపించాడు; అతఁడు= ఆ కుండధారుడు; మదాశ్రితుండు+ఐన= నన్నాశ్రయించిన వాడైన; ఇతనిన్= ఈ బ్రాహ్మణుడిని; ధనసమగ్రునిన్= ధనంచేత సంపూర్ణుడిగా; చేయవే= చేయుమా; అనినన్= అనగా; మాణిభద్రుఁడు= మాణిభద్రుడనే ఆ యక్షుడు; ఎంతధనము= ఎంత విత్తం; వలసినన్= కావలసినను; ఇచ్చెదన్= ఇస్తాను; అనియెన్= అన్నాడు; ఆ+మహాత్ముఁడు= మహనీయుడైన ఆ కుండధారుడు; మర్త్యభావము= మరణించే స్వభావంకల మానవత్వం; అస్థిరత్వ దూషితము= శాశ్వతం కాకపోవటంచేత దూషించబడింది; అను విచారంబు= అనే ఆలోచన; పుట్టి= కలిగి.

తాత్పర్యం: ఒక విప్రుడు యజ్ఞం చేయాలన్న తలంపుతో ధన మభిలషించి తపస్సు చేశాడు. కుండధారుడనే దేవసేవకు డొకడు అతడు తపస్సు చేస్తున్న చోటికి వచ్చాడు. వచ్చి 'నీ కోరిక ఏమి?' అని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మణుడు ధనం కొరకై తపస్సు చేస్తున్నా నన్నాడు. అప్పుడు ఆ కుండధారుడు నియమపూర్వకంగా కుబేరుడి బంటైన మాణిభద్రుడనే యక్షుడిని తలచాడు. ఆ యక్షుడు వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అప్పు డా కుండధారుడు 'ఈ విప్రుడు నన్ను ఆశ్రయించి ఉన్నాడు. ఇతడిని మిక్కిలి ధనవంతుడిని చేయుము' అని అర్థించాడు. అంతట మాణిభద్రుడు 'ఇతడు ఎంత ధనం కావలె నని కోరినా ఇస్తాను' అని చెప్పాడు. ఇంతలో కుండధారుడు 'మానవుడు మరణశీలుడు. మానవత్వం స్థిరమైనది కాదు' అన్న ఆలోచన కలిగినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ధన మేటికి? నీ విప్రుని । మన మొలయఁగ వలయు ధర్మమార్గంబున; దా
నన సర్వసంపదలు నగు' । నని నిశ్చయ మొంది వినయ మతిశయ మందన్. 348

ప్రతిపదార్థం: ధనము= అర్థం; ఏటికిన్?= ఎందుకు?; ఈ విప్రుని= ఈ బ్రాహ్మణుడియొక్క; మనము= చిత్తం; ధర్మమార్గంబునన్= ధర్మపు త్రోవలో; ఒలయఁగన్ వలయున్= ప్రవేశించాలి; దానన్+అ= అట్లా చేయటం వలననే; సర్వసంపదలున్= సమస్తమైన సిరులూ; అగునని= కలుగుతాయి అని; నిశ్చయము+ఒంది= నిర్ణయించుకొని; వినయము= అడకువ; అతిశయము+అందన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: 'డబ్బు ఎందుకు? ఈ భూసురుడి చిత్తం ధర్మమార్గంలో ప్రవర్తించాలి. అట్లా ప్రవర్తిస్తే ఇతడికి సమస్తమైన సంపదలూ సిద్ధిస్తాయి' అని నిశ్చయించుకొని మిక్కిలి వినయంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. యక్షవరునితోడ నవ్విచారము మృదు । వచన రచనఁ జెప్ప వాఁడు దాని
కాత్మఁ బ్రీతిఁ బొంది యనుమతి సేయంగ । నధికభక్తి నిరతుఁడై యతండు. 349

ప్రతిపదార్థం: యక్షవరునితోడన్= యక్షశ్రేష్ఠుడితో; ఆ+విచారము= ఆ ఆలోచన; మృదువచన రచనన్= మెత్తని మాటలతో; చెప్పన్= చెప్పేసరికి; వాఁడు= ఆ యక్షుడు; దానికిన్= అందుకు; ఆత్మన్= మనస్సులో; ప్రీతిన్= సంతోషం; పొంది= చెంది; అనుమతి చేయంగన్= అనుమతించగా; అతండు= ఆ కుండధారుడు; అధికభక్తి నిరతుఁడు+ఐ= మిక్కిలి భక్తితత్పరుడై.

తాత్పర్యం: కుండధారుడు యక్షునితో తన అభిప్రాయాన్ని మెత్తని పలుకులతో వివరించాడు. అందు కా యక్షుడు మనస్సులో ఎంతో సంతోషించి అనుమతించాడు. అప్పు డా కుండధారుడు అత్యంతభక్తి గలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దేవతలను బ్రార్థించిన । నావసుధామరుని చిత్త మా ప్రొద్ద తప

స్సేవనతత్పర మగుడున్ । దేవానుచరునకు నిట్లనియె నతఁ డధిపా! 350

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దేవతలనున్= సురలను; ప్రార్థించినన్= వేడగా; ఆ ప్రొద్దు+అ= ఆ దినమే; ఆ వసుధా+అమరుని చిత్తము= ఆ విప్రుడిమనస్సు; తపస్సేవనతత్పరము= తపం చేయటంలో ఆసక్తమైనది; అగుడున్= కాగా; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; దేవ+అనుచరునకున్= దేవసేవకుడైన కుండధారుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! దేవతల నుద్దేశించి ధర్మమార్గంలో ఆ విప్రుడు ప్రవర్తించేటట్లు అనుగ్రహించుమని కుండధారుడు ప్రార్థించాడు. అట్లా ప్రార్థించగానే ఆ దినమే ఆ బ్రాహ్మణుడి మనస్సు తపస్సులో సంలగ్నమయింది. అప్పు డా బ్రాహ్మణుడు కుండధారుడితో ఇట్లా అన్నాడు:

క. 'అనఘా! భవదీయదయన్ । మనంబు దెలివొందె నిపుడు నా; కే నొల్లన్

ధనము తపంబ యొనర్పఁగ । ననుజ్ఞ సేయంగవలయు నాదరణమునన్.' 351

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఇప్పుడు= ఇప్పుడు; భవదీయదయన్= నీ కృపచేత; నాకున్= ధనం కోరిన నాకు; మనంబు= చిత్తం; తెలివి+ఒందెన్= వివేకం కలదయింది; ఏన్= నేను; ధనము= విత్తం; ఒల్లన్= అభిలషించను; ఆదరణమునన్= ప్రీతితో; తపంబు+అ= తపస్సే; ఒనర్పఁగన్= చేయటానికి; అనుజ్ఞచేయంగన్ వలయున్= అనుమతించాలి.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ కుండధారుడా! ఇంత వరకూ ధనాన్ని అభిలషిస్తూ ఉండిన నాకు ఇప్పుడు నీ దయవలన చిత్తం వివేకవంత మయింది. ఇంక నాకు ధనమక్కరలేదు. ప్రీతితో తపస్సునే చేయటానికి నన్ను అనుమతించుము'.

ఆ. అనిన 'నట్లకాక యాచరింపుము ధర్మ' । మనుచు నరిగె నిర్జరానుచరుఁడు

భూసురుండు మూలములును బత్రములు నా । హారములుగఁ జేసె నధికతపము. 352

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; నిర్జర+అనుచరుఁడు= దేవానుచరుడైన కుండధారుడు; అట్లకాక= అట్లే అగుగాక!; ధర్మమున్= ధర్మమును; ఆచరింపుము= చేయుము; అనుచున్= అంటూ; అరిగెన్= పోయాడు; భూసురుండు= బ్రాహ్మణుడు; మూలములును= కందమూలాలు; పత్రములున్= ఆకులునూ; ఆహారములుగన్= భోజనాలుకాగా; అధికతపమున్= తీవ్రమైన తపస్సు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణు డా విధంగా చెప్పేసరికి కుండధారుడు 'అట్లే కానిమ్ము; ధర్మం ఆచరించుము' అంటూ స్వస్థానానికి వెళ్ళిపోయాడు. బ్రాహ్మణుడు దుంపలూ, ఆకులూ ఆహారంగా స్వీకరిస్తూ కఠిన తపస్సుచేశాడు.

క. క్రమమున జల పవనము లశ । నములుగఁ గొని తపము సేసినం గాయముఁ జి

త్తము మానుషంబు లగు చం । దములు విడిచి దివ్యమహిమధామము లయ్యెన్. 353

ప్రతిపదార్థం: క్రమమునన్= క్రమంగా; జలపవనములు= నీరు గాలి; అశనములుగన్= ఆహారాలుగా; కొని= గ్రహించి; తపముచేసినన్= తపస్సు చేయగా; కాయము= శరీరం; చిత్తము= మనస్సు; మానుషంబులు+అగు= మనుష్య సంబంధం కలవి అగు; చందములు= విధానాలు; విడిచి= వదలి; దివ్యమహిమధామములు= దివ్యమైన ప్రభావానికి నెలవులుగా; అయ్యెన్= ఐనవి;

తాత్పర్యం: ఆ విప్రుడు క్రమంగా కందపత్రాలు కూడా వదలి నీటిని గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ తపస్సు చేశాడు. అందువలన అతడి శరీరమూ, మనస్సూ మనుష్యత్వాన్ని వదలి దివ్యప్రభావానికి నెలవులై విలసిల్లాయి.

వ. అట్లు సిద్ధుం డగుటయు. 354

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; సిద్ధుండు= తపస్సుచేత సిద్ధిపొందినవాడు; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఆ విప్రు డారీతిగా తపస్సుచేత సిద్ధి పొందగా.

క. నను నెవ్వ రాశ్రయించిన । ధన మొసఁగుదు, రాజ్యమిత్తుఁ; దద్దురితములం
దునుముదు; నను నగ్గలికలు । మనమున జనియింపఁజొచ్చె మనుజాధీశా! 355

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; ననున్= నన్ను; ఎవ్వరు= ఎట్టివారు; ఆశ్రయించినన్= ఆశ్రయించిననూ; ధనమున్= విత్తమును; ఒసఁగుదున్= ఇస్తాను; రాజ్యమున్= రాజ్యాన్ని; (పరిపాలించదగిన దేశాన్ని) ఇత్తున్= ఇస్తాను; తద్దురితములన్= ఆశ్రయించినవారి పాపాలను; తునుముదున్= సంహరిస్తాను; అను అగ్గలికలు= అనే ఉత్సాహాతిశయాలు; మనమునన్= చిత్తంలో; జనియింపన్+చొచ్చెన్= కలుగసాగాయి.

తాత్పర్యం: రాజా! ఆ బ్రాహ్మణుడికి తపఃప్రభావం వలన 'న న్నెవ్వ రాశ్రయించినా వలసినంత ధనమిస్తాను. రాజ్యం ఇస్తాను. వారి పాపాలను పోగొట్టుతాను' అనే ఉత్సాహాతిశయం అతడి మనస్సులో కలుగసాగింది.

వ. అవ్విధంబున మహానుభావుండై. 356

ప్రతిపదార్థం: ఆ+విధంబునన్= ఆ రీతిగా; మహానుభావుండు+ఐ= గొప్పప్రభావం కలవాడై.

తాత్పర్యం: ఆ రీతిగా అతడు గొప్ప ప్రభావం కలిగినవాడై.

తే. ఆతఁ డతిభక్తిఁ దలఁచె దేవానుచరుని; । నపుడ యక్కుండధారుండు నరుగుదెంచె;
నరుగుదెంచిన నతఁడు నిజానుభావ । జనితగంధ పుష్పములఁ బూజన మొనర్చి. 357

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ బ్రాహ్మణుడు; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; దేవ+అనుచరునిన్= దేవసేవకుడైనకుండధారుడిని; తలఁచెన్= స్మరించాడు; అపుడు+అ= తలపగానే; ఆ+కుండధారుండును= ఆ కుండధారుడుకూడ; అరుగుదెంచెన్= వచ్చాడు; అరుగుదెంచినన్= అతడు రాగా; అతఁడు= ఆ విప్రుడు; నిజ+అనుభావజనిత గంధపుష్పములన్= తన తపఃప్రభావంచేత సృష్టించబడిన గంధంచేతను, పూలచేతను; పూజనము= అర్చన; ఒనర్చి= చేసి.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు అత్యంతభక్తియుక్తుడై దేవసేవకుడిని తలచాడు. అతడు అట్లా తలచగానే కుండధారుడు అతడి యెదుట ప్రత్యక్షమయ్యాడు. అతడు రాగానే ఈ విప్రుడు అతడిని తన తపోమహిమచేత సృష్టించబడిన గంధంతోనూ, పూలతోనూ పూజించాడు. పూజించిన పిదప. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. చక్కఁగఁ జాగి మ్రొక్కుటయుఁ జయ్యన నెత్తి మనం బెలర్పఁగా
నక్కునఁజేర్చి యిట్లనియె నద్దివిజానుచరుండు 'శంక దాఁ
దక్కి ధనంబుఁ గామమును ధర్మముతోఁ గలయంగ నెన్ననే
యక్కట! యిట్లు వేదమని యప్పురుషార్థమునూఁద మే లగున్.' 358

ప్రతిపదార్థం: చక్కఁగన్= సాష్టాంగంగా; చాగిమ్రొక్కుటయున్= సాగిలబడి నమస్కరించగానే; ఆ+దివిజ+అనుచరుండు= ఆ కుండధారుడు; చయ్యనన్= వెంటనే; ఎత్తి= బ్రాహ్మణుడిని పైకి లేవదీసి; మనంబు+ఎలర్పఁగాన్= చిత్తం సంతోషించగా;

అక్కునన్+చేర్చి= వక్షమున (కౌగిట) చేర్చుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అక్కట!= ఔరా!; వేదము= శ్రుతి; తాన్= తాను; శంక దక్కి= సంశయం వీడి; ధనంబున్= అర్థమును; కామమును= కామ పురుషార్థాన్నీ; ధర్మముతోన్= ధర్మమనే మొదటి పురుషార్థంతో; కలయంగన్= కలియగా; ఎన్ననే?= ప్రశంసించునా?; అవి= ఆ అర్థకామాలు; ఆ+పురుషార్థమున్= ఆ ధర్మమనే ముఖ్యపురుషార్థాన్ని, ఊఁదన్= ఆధారంగా చేసికొన్నపుడు; మేలు+అగున్= శ్రేయస్సు కలుగుతుంది.

తాత్పర్యం: విప్రుడు కుండధారుడికి పూజానంతరం సాష్టాంగనమస్కారం చేశాడు. కుండధారు డందుకు సంతసించి వెనువెంటనే అతడిని లేవనెత్తి కౌగిలించుకొని ఇట్లా అన్నాడు: 'వేదం శంకలేక ధర్మంతో సమానంగా అర్థ కామాలను పరిగణించగలదా? ఔరా! అర్థకామాలు ధర్మాన్ని మించకుండా ఉన్నంతవరకే శ్రేయోదాయకా లవుతాయి'.

విశేషం: ధర్మం ముఖ్య పురుషార్థం. అర్థకామాలు సైతం పురుషార్థాలే. కాని ధర్మాన్ని అనుసరించి అర్థ కామాలను అనుభవించాలి. ధర్మవిరుద్ధమైన అర్థకామాలు శ్రేయస్సు కల్గించవు. శ్రీకృష్ణభగవానుడు గీతలో 'ధర్మావిరుద్ధः కామోఽస్మి భూతేషు' - నేను ప్రాణులలో ధర్మానికి విరుద్ధం కాని కామమునై ఉన్నాను అని చెప్పాడు. అందువలన అర్థకామాలకంటె ధర్మమే ప్రధానమని కుండధారు డిక్కడ విశదం చేశాడని గ్రహించాలి.

వ. అని ధర్మం బగ్గించి. **359**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ధర్మంబు= ధర్మాన్ని; అగ్గించి= ప్రశంసించి.

తాత్పర్యం: కుండధారు డట్లా చెప్పి ధర్మాన్ని అర్థకామాలకంటె శ్రేష్ఠమైనదని వినుతించాడు. తరువాత.

క. 'ఆ సుకృతముఁ గడయెయ్ది మ । హాసత్త్వా యోగసేవ నారామత ను
ద్భాసితుఁడ వగుచు నిష్మా । వ్యాసంగ విహారి వగు మనామయలీలన్.' **360**

ప్రతిపదార్థం: మహాసత్త్వా!= గొప్ప సత్త్వముగల ఓ విప్రుడా!; ఆ సుకృతమున్= ఆ ధర్మాన్ని; కడయెయ్ది= పారం ముట్టి; యోగసేవ నారామతన్= యోగమును సేవించటంచేత రమిస్తూ; ఉద్భాసితుఁడవు+అగుచున్= ప్రకాశమానుడవవుతూ; అనామయ లీలన్= ఉపద్రవం లేని పద్ధతితో; నిష్మావ్యాసంగ విహారివి= ఆత్మనిష్ఠ సంబంధంతో విహరించేవాడవుగా; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'మహాసత్త్వుడ వగు ఓ భూసురుడా! నీవు పురుషార్థాలలో శ్రేష్ఠమైన ఆ ధర్మాన్ని ఆచరించుము. యోగాన్ని సేవిస్తూ క్రీడించుము. దానిద్వారా భాసించే ఏ ఉపద్రవమూ లేని పద్ధతిలో ఇట్లా ఆత్మనిష్ఠుడవై స్వేచ్ఛగా విహరించుము.

క. అని యతఁడు నిజనివాసం । బున కరిగెను విప్రవరుఁడు మునిజనములు పూ
జనము లొనరింప ఖేచరు । లనుమోదింప విహరించె నప్రతిహతుఁడై.' **361**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; అతఁడు= ఆ కుండధారుడు; నిజనివాసంబునకున్= తన స్థానానికి; అరిగెను= వెళ్ళాడు; విప్రవరుఁడు = బ్రాహ్మణశ్రేష్ఠుడు; మునిజనములు= మునుల సమూహాలు; పూజనములు+ఒనరింపన్= తనను అర్చించగా; ఖేచరులు= ఆకాశచారులు; అనుమోదింపన్= అభినందించగా; అప్రతిహతుఁడు+ఐ= ఎదురులేని వాడై; విహరించెన్=సంచరించాడు.

తాత్పర్యం: కుండధారు డట్లా చెప్పి తన స్థానానికి వెళ్ళాడు. ఈ బ్రాహ్మణుడు మునులు తనను పూజిస్తుండగా, తన ప్రవృత్తిని ఖేచరులైన దేవతావిశేషాలు అనుమోదించగా, ఎదురులేకుండా యోగమార్గంలో విహరించాడు.

నారద ప్రవర్తితం బగు నితిహాసము (సం. 12-264-2)

వ. అని చెప్పి యప్పురుషవరుం డప్పాండవాగ్రజుతో వెండియు నిట్లను 'నొక్క ధర్మసూక్ష్మ త సెప్పెద నాకర్ణింపు; ముంఛవృత్తి యగు విప్రుం డొక్కరుండు భార్యాసహితుండై వనంబున నుండి యజ్ఞాచరణంబునకుం దొడంగి యహింసాపరుఁ డగుటం బశువిధి యుడిగి ఫలమూలంబుల హవిస్తంత్రంబు నడపం జూచె; నది విహితాచారంబు గామి యెఱింగియు శాపభయంబునం దత్పత్ని యమ్మహీసురవరు నెదుర నిలిచియుం బలుకకుండెఁ; బాకశాసనాదులు హవిర్భాగంబులు గొనం గడంగమి నగ్నియుం బచనశక్తిం దొఱంగె; నట్టియెడ నా సమీపంబునం బిరుగు హరిణంబు మనుష్య వచనంబులం దత్పత్ని దూఱి యమ్మహీసురవరు నెదుర నిలిచి తన్ను హింసించి యాగంబు సెల్లింపు మనిన, నతండట్లు సేయంబో మ్మనవుడుఁ గొన్ని యడుగులు వోయి మగిడి యాకృష్ణమృగంబు 'నా యిచ్చు దివ్యదృష్టిం గనుంగొను; మేను చెప్పినట్లు సేసిన ని న్నభినందించువారై యప్సరఃకాంతలును గంధర్వులును వీరె విమానంబుల నేతెంచిన వా'రనుటయు నవ్విప్రుండు విలోకించి దివ్యత్వసిద్ధికై దాని హింసించువాఁ డగుటయు; దానం దదీయతపంబునకు నుత్పాతంబులు పుట్టె; నేనరూపంబున వర్తించు నా ధర్మదేవత యా భూదేవునకు సన్నిధి సేసి నీయజ్ఞశ్రద్ధకు సంతోషించి ధర్మసూక్ష్మత్వంబు దెలుప వచ్చితి; నర్హంబగు హింసావిశేషం బహింసావ్రతహానింజేయదు; క్రతువు గదాయని యనర్హహింస కర్తవ్యంబుగా దని నిర్దేశించి తత్పత్నీసమాధానంబునం దపశ్శక్తి ప్రత్యాసత్తియుం జేసి యాగవిశేషవిధానంబు వరప్రదానంబున నిర్వహించె; నయ్యితిహాసంబు నారదప్రవర్తితంబని చెప్పిన నప్పుడమిఱేఁడు ప్రీతుండై. 362

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; ఆ+పురుషవరుండు= ఆ పురుషశ్రేష్ఠుడైన భీష్ముడు; ఆ+పాండవ+అగ్రజుతోన్= పాండవులలో పెద్దవాడైన ఆ ధర్మజుడితో; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; ఒక్కధర్మసూక్ష్మతన్= ఒక ధర్మరహస్యాన్ని; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; ఉంఛవృత్తిఅగు= రాలిన గింజల నేరుకొని తినే వర్తనం కలిగిన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఒక్కరుండు= ఒకడు; భార్యాసహితుండు+ఐ= భార్యతో కూడినవాడై; వనంబునన్= అడవిలో; ఉండి= వసించి; యజ్ఞ+ఆచరణంబునకున్= యజ్ఞం చేయటానికి; తొడంగి= పూనుకొని; అహింసాపరుండు+అగుటన్= అహింసావ్రతం పాటించే వాడు కావటంవలన; పశువిధిన్= పశుహింసా రూపమైన విధానాన్ని; ఉడిగి= వర్జించి; ఫలమూలంబులన్= పండ్లచేతను; దుంపల చేతను; హవిస్తంత్రంబు= హవిర్విధానాన్ని; నడపన్= నిర్వర్తించటానికి; చూచెన్= ఆలోచించాడు; అది= ఆ పద్ధతి; విహిత+ఆచారంబు= శాస్త్రం విధించిన ఆచారం; కామి= కాకుండటం; ఎఱింగియున్= తెలిసికూడా; తత్పత్ని= అతడి భార్య; శాపభయంబునన్= శాపంవలని భీతిచే; ఆ+మహీసురవరు+ఎదురన్= ఆ బ్రాహ్మణుడి ఎదుట; నిలిచియున్= నిలబడికూడా; పలుకక+ఉండెన్= ఏమీ మారు చెప్పజాలక పోయింది; పాకశాసన+ఆదులు= ఇంద్రాదులైన దేవతలు; హవిర్భాగంబులు= యజ్ఞాగ్నిలో వేల్చబడిన హవిస్సుయొక్క పాళ్ళను; కొనన్= గ్రహించటానికి; కడంగమిన్= ప్రయత్నించక పోవటం వలన; అగ్నియున్= అగ్నికూడ; పచన శక్తిన్= పాకంచేసే సామర్థ్యాన్ని; తొఱంగెన్= కోల్పోయాడు; అట్టిఎడన్= ఆ సందర్భంలో; ఆ సమీపంబునన్= ఆ చెంతనే; తిరుగు= సంచరించే; హరిణంబు= లేడి; మనుష్యవచనంబులన్= మానవుల భాషతో; తత్పత్నిన్= ఆయన భార్యను; దూఱి= నిందించి; ఆ+మహీసురవరుఎదురన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడి ఎదుట; నిలిచి= నిలబడి; తన్నున్ హింసించి= తనను వధించి; యాగంబు చెల్లింపుము= యజ్ఞం పూర్తిచేయుము; అనినన్= అని చెప్పగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; అట్లు= ఆ రీతిగా; చేయన్+పొమ్ము= చేయనుపో; అనవుడున్= అనగా; ఆ కృష్ణమృగంబు= ఆ నల్లలేడి; కొన్నియడుగులు= కొంతదూరం; పోయి= వెళ్ళి; మగిడి= తిరిగివచ్చి; నా ఇచ్చు= నేను ఇచ్చెడి; దివ్యదృష్టిన్= దివ్యదృష్టితో; కనుంగొనుము= చూడుము; ఏను= నేను; చెప్పినట్లు= వచించిన రీతిగా; చేసినన్= ఆచరిస్తే; నిన్నున్+అభినందించువారై= నిన్ను మెచ్చుకొనేవారై; అప్సరఃకాంతలును= అప్సరఃస్త్రీలును;

గంధర్వులును= గానంచేసే గంధర్వులు కూడ; వీరె= ఈ కనిపించేవారే; విమానంబులన్= విమానాలమీద; ఏతెంచినవారు= వచ్చారు; అనుటయున్= అనగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; విలోకించి= చూచి; దివ్యత్వసిద్ధికై= దివ్యత్వంయొక్క ప్రాప్తికై; దానిన్= ఆ కృష్ణమృగాన్ని; హింసించువాఁడు= చంపేవాడు; అగుటయున్= కాగా; దానన్= దానివలన; తదీయతపంబునకున్= వాని తపస్సుకు; ఉత్పాతంబులు= ఉపద్రవాలు; పుట్టెన్= కలిగాయి; ఏణరూపంబునన్= జింకరూపంతో; వర్తించు= మెలగుతున్న; ఆ ధర్మదేవత= ధర్మమునకు అధిష్ఠానమైన ఆ దేవత; ఆ భూదేవునకున్= ఆ విప్రుడికి; సన్నిధిచేసి= ప్రత్యక్షమై; నీయజ్ఞశ్రద్ధకున్= యజ్ఞమునందు నీకు గల ఆస్తిక్యబుద్ధికి; సంతోషించి= సంతసించి; ధర్మసూక్ష్మత్వంబు= ధర్మంలోని సూక్ష్మతను; తెలుపన్= తెలియజేయటానికై; వచ్చితిన్= ఏతెంచాను; అర్హంబు+అగు= తగిన; హింసావిశేషంబు= హింసావిధానం; అహింసావ్రతహానిన్= అహింసావ్రతానికి చేటును; చేయదు= కల్గించదు; క్రతువు కదా అని= యజ్ఞం కదా అన్న బుద్ధితో; అనర్హహింస= తగని హింసాప్రక్రియ; కర్తవ్యంబు కాదు= చేయదగింది కాదు; అని నిర్దేశించి= అని చెప్పి; తత్పత్నీసమాధానంబునన్= అతడి భార్యను సమాధానపరచటమూ; తపశ్శక్తి ప్రత్యాసత్తియున్= తపోమహిమ సాంగత్యమూ; చేసి= ఆచరించి; వరప్రదానంబునన్= వరాన్ని ప్రసాదించటంతో; యాగవిశేషవిధానంబున్= యజ్ఞవిశేష విధిని; నిర్వహించెన్= నిర్వర్తింపజేసింది; ఆ+ఇతిహాసంబు= ఆ పూర్వగాథ; నారదప్రవర్తితంబు+అని= నారదమునిచే ప్రవర్తింపజేయబడిందని; చెప్పినన్= వచించగా; ఆ+పుడమిఱేడు= ఆ రాజు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో పై విధంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ఒక ధర్మరహస్యం చెప్పుతాను వినుము. రాలిన గింజలను ఏరుకొని తినటమనే ఉంఛవర్తనంతో జీవించే బ్రాహ్మణు డొకడు భార్యతో సహా అడవిలో ఉండేవాడు. అతడు యజ్ఞం చేయటానికి ప్రయత్నించాడు. కాని, అహింసావ్రతాన్ని పాటించేవాడు కావటంవలన పశువులను హింసించటం తగదని ఫలమూలాలతో హవిర్విధానం నిర్వర్తింపజూచాడు. అది శాస్త్రవిహిత పద్ధతి కాదని తెలిసికూడా అతడి భార్య అతడి ఎదుట నిలబడి శపిస్తాడన్న భయంతో ఏమీ చెప్పకుండా ఉండిపోయింది. ఇంద్రాది దేవతలు ఆ యజ్ఞంలో హవిస్సులను స్వీకరించడానికి రాలేదు. అగ్ని కూడా హవిస్సులను పచనం చేసే శక్తి కోల్పోయాడు. ఆ పరిస్థితిలో ఆ సమీపప్రాంతంలో సంచరించే జింక ఒకటి మానవవచనాలతో అతడి భార్యను నిందించి, ఆ బ్రాహ్మణుడి ఎదుట నిలబడి 'నన్ను చంపి యాగం పూర్తిచేయి' అని చెప్పింది. అయినా అతడు 'నేనట్లా చేయనుపో' అని నిరాకరించాడు. ఆ కృష్ణహరిణం కొన్ని అడుగులు పోయి మరల తిరిగివచ్చి 'నేనిచ్చే దివ్యదృష్టితో చూడు. నేను చెప్పినట్లు చేస్తే నిన్ను మెచ్చుకొనటానికై ఇదిగో అచ్చరలు, గంధర్వులు విమానాలెక్కి వచ్చి ఉన్నారు చూడుము' అని చెప్పింది. ఆ విప్రుడు వారిని చూచి దివ్యత్వప్రాప్తి నభిలషించి ఆ లేడిని హింసించటానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆ హింసవలన అతడి తపస్సుకు ఉత్పాతాలు కలిగాయి. అపుడు జింకరూపంలో ఉన్న ఆ ధర్మదేవత అతడికి నిజరూపంలో ప్రత్యక్షమై 'నేను నీ యజ్ఞశ్రద్ధకు సంతసించాను. నీకు ధర్మసూక్ష్మం చెప్పటానికై వచ్చాను. ఉచితమైన హింస అహింసకు భంగకరం కాదు. యజ్ఞం పేరుతో తగని హింస ఎన్నడూ చేయరాదు' అని చెప్పింది. తరువాత అతడి భార్యను సమాధానపరచింది. అతడి తపశ్శక్తికి లోటులేకుండా చేసింది. వరమిచ్చి అతడి యాగం నిర్వహించబడేటట్లు అనుగ్రహించింది. ఈ కథను నారదమహర్షి లోకంలో ప్రవర్తింపజేశాడు అని భీష్ముడు చెప్పాడు. అందుకు ధర్మజుడు ప్రీతి పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట (సం. 12-265-2)

క. 'పురుషుం డేమిటఁ బాపా । చరణమునకుఁ జొచ్చు? ధర్మచర్యకు మూలం
బరయఁగ నెయ్యది? రెంటిం । బొరయం డెద్దాన? నెట్లు వొందును ముక్తిన్?' 363

ప్రతిపదార్థం: పురుషుండు= మానవుడు; ఏమిటన్= దేనివలన; పాపాచరణమునకున్= పాపంచేయటానికి; చొచ్చున్= ప్రారంభిస్తాడు; అరయఁగన్= పరిశీలించగా; ధర్మచర్యకున్= ధర్మాచరణకు; మూలంబు= కారణం; ఎయ్యది?= ఏది?; ఏ+దానన్= దేనివలన; రెంటిన్= పుణ్యపాపాలను రెండింటినీ; పొరయఁడు= పొందడు; ముక్తిన్= మోక్షాన్ని; ఎట్లు= ఎట్లా; పొందున్= పొందుతాడు?

తాత్పర్యం: పురుషుడు దేనివలన పాపకార్యాలు చేయటానికి పూనుకొంటాడు? పుణ్యకార్యాలకు కారణ మేది? దేనివలన పుణ్యపాపాలు రెండూ అంటకుండా ఉండగలడు? మోక్షం ఎట్లా పొందుతాడు?

వ. అని యడిగిన నతనికి భీష్ముం డిట్లనియె. **364**

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు= పితామహుడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా ధర్మరాజు ప్రశ్నించాడు. అది విని భీష్ముడు ధర్మజుడితో ఇట్లా అన్నాడు:

సీ. 'గంధరసాదుల కాంక్ష లోభము మోహ । మును దెచ్చు; నద్దోషమునకు మనసు
లోనైన ధర్మవిలోపంబు వాటిల్లు; । దానఁ బాపము సేయు తలఁపు లొదవు;
బ్రజ్ఞ నక్కీడులు భావించి సద్గోష్ఠిఁ । బరఁగంగ విషయతత్పరత మాను;
నది ధర్మబుద్ధికి నాలవాలం బగు; । ధర్మాచరణములఁ దనివి సనక
తే. హృద్గత ద్వంద్వముల నెల్ల నెడల విడుచు । ననఘ! యనపాయ మగు నుపాయమున ముక్తి
వడయుఁ బదపడి; యేను నీయడిగినంత । వట్టఁ దెలిపితి ధర్మనిర్వాహి వగుము.' **365**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; గంధరసాదులకాంక్ష= గంధం, రసం మొదలైన విషయాలమీది కోరిక; లోభమున్= లోభాన్ని; మోహమున్= మోహాన్ని; తెచ్చున్= తీసికొని వస్తుంది; మనసు= చిత్తం; ఆ+దోషమునకున్= ఆ దోషానికి; లోనైనన్= లోబడితే; ధర్మవిలోపంబు= ధర్మానికి హాని; పాటిల్లున్= కలుగుతుంది; దానన్= దానివలన; పాపము చేయు= పాపకార్యాలు చేసే; తలఁపులు= సంకల్పాలు; ఒదవున్= సంభవిస్తాయి; ప్రజ్ఞన్= ప్రతిభతో; ఆ+కీడులు= ఆ దోషాలు; భావించి= ఊహించి; సద్గోష్ఠిన్= సజ్జనుల గోష్ఠిలో; పరఁగంగన్= ప్రవర్తిల్లితే; విషయతత్పరత= విషయాలపై ఆసక్తి; మానున్= తొలగిపోతుంది; అది= ఆ పద్ధతి; ధర్మబుద్ధికిన్= ధర్మంచేయాలనే బుద్ధికి; ఆలవాలంబు= పాదు; అగున్= అవుతుంది; ధర్మ+ఆచరణములన్= ధర్మకార్యాలు చేయటం వలన; తనివి చనక= తృప్తి పొందక; హృద్గతద్వంద్వములన్+ఎల్లన్= హృదయంలో ఉన్న సుఖదుఃఖాది ద్వంద్వాల నన్నింటినీ; ఎడలన్ విడుచున్= వర్జిస్తాడు; పదపడి= పిదప; అనపాయము+అగు= అపాయంలేని; ఉపాయమునన్= ఉపాయంతో; ముక్తిన్= మోక్షమును; పడయున్= పొందుతాడు; ఏను= నేను; నీఅడిగినంతవట్టు= నీవు ప్రశ్నించినంతవరకు; తెలిపితిన్= తెలియజేశాను; ధర్మనిర్వాహివి= ధర్మకార్యాలు నెరవేర్చేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే విషయాలమీది కోరిక లోభ మోహాలు కలిగిస్తుంది. చిత్తం లోభమోహాలకు లోనైతే ధర్మానికి లోపం కలుగుతుంది. ధర్మం లోపించగానే పాపకార్యాలు చేయాలనే తలపులు కలుగుతాయి. అందువలన తెలివితో ఈ కీడులన్నిటినీ ఊహించి వాటిజోలికి పోక సజ్జనుల గోష్ఠిలో కాలం గడిపితే విషయాలపై ఆసక్తి నశిస్తుంది. దానివలన ధర్మబుద్ధి ఉదయిస్తుంది. ధర్మకార్యాలు క్రమంగా ఆచరిస్తూ పోతే హృదయంలోని రాగద్వేషాలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలు తొలగిపోతాయి. ఆపైన అపాయం లేని ఉపాయంతో ముక్తి పొందుతాడు. నీవు అడిగినంతవరకూ విషయాలు నీకు తెలియజేశాను. నీవు ధర్మాన్ని ఆచరించుము'.

తే. అనుడు ననపాయ మగు నుపాయం బనంగఁ । జెప్పి తొక్కటి; మోక్షంబుఁ జెందుతెఱఁగు
దానిఁ దెలియంగ నెఱిఁగింపవే నరేంద్ర । ముఖ్య!' యనియె నక్కురువంశముఖ్యుఁ డధిప! 366

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనుడున్= భీష్ముడట్లా అనగానే; ఆ+కురువంశముఖ్యుఁడు= ఆ కౌరవవంశానికి ప్రధానుడైన ధర్మరాజు; నరేంద్రముఖ్యా!= రాజశ్రేష్ఠా!; అనపాయము+అగు= అపాయం లేనిదైన; ఉపాయంబు+అనంగన్= ఉపాయం అనగా; మోక్షంబున్= ముక్తిని; చెందు= పొందు; తెఱఁగు= మార్గం; ఒక్కటి= ఒకదానిని; చెప్పితి(వి)= చెప్పితివి; దానిన్= ఆ ఉపాయాన్ని; తెలియంగన్= తెలిసేవిధంగా; ఎఱిఁగింపవే= తెలియజేయుమా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! భీష్ముడట్లా అనేసరికి ధర్మరాజు భీష్ముడితో 'రాజవర్యా! అపాయంలేని ఉపాయం అంటూ మోక్షం పొందే మార్గమొక్కటి చెప్పావు. దానిని విపులంగా తెలియజెప్పుము' అని ప్రార్థించాడు.

వ. అనుటయు నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె. 367

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజునకు; శాంతనవుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజుడు ఆ విధంగా ప్రార్థించగానే భీష్ము డతడితో ఈ రీతిగా అన్నాడు:

క. 'వినుము ఘటము సేయుట సా । ధనములు లేకున్న నగునె ధరణిప! పూర్వాం
బునిధికిఁ జను మార్గ మపర । వనరాశికిఁ జనునె? వెరవు వలయుం దెలియన్. 368

ప్రతిపదార్థం: ధరణిప!= రాజా!; వినుము= ఆలకించుము; ఘటమున్= కుండను; చేయుట= నిర్మించటం; సాధనములు లేకున్నన్= పరికరాలు లేకపోతే; అగునె?= జరుగునా?; పూర్వాంబునిధికిన్= తూర్పు సముద్రానికి; చనుమార్గము= పోయేదారి; అపరవనరాశికిన్= పశ్చిమసాగరానికి; చనునె?= పోతుందా?; వెరవు= ఉపాయం; తెలియన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. తగు సాధనాలు లేకుంటే కుమ్మరి కుండ చేయగలడా? తూర్పు సాగరానికి పోయేదారి ఎప్పుడైనా పడమటి సముద్రానికి పోతుందా? అందువలన ఏ పనికైనా తగిన ఉపాయాన్ని తప్పక తెలిసికొనాలి.

విశేషం: అలం: దృష్టాంతం.

వ. అడిగి మేలు సేసి తాకర్ణింపుము. 369

ప్రతిపదార్థం: అడిగి= ప్రశ్నించి; మేలు= మంచి; చేసితి(వి)= చేశావు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మోక్షానికి 'అపాయం లేని ఉపాయమేది?' అని అడిగి మంచి పని చేశావు. చెప్పుతాను వినుము.

సీ. క్షమఁ గ్రోధ, మకృత సంకల్పతఁ గామంబు, । చిరనిద్ర సత్త్వసంసేవనమున
గాఢధైర్యమున రాగద్వేషములు, భయ । మప్రమాదమున, మోహంబు భ్రమము
వినివర్తనాభ్యాసమున రోగములు నుప । ద్రవములు హితము మితంబు గాల
యోజితంబును నగు భోజనంబున జీవ । సందర్శనమున నిశ్శ్వాస మఖిల

తే. విషయములు నంతవిరసతా వేక్షణమున । నిత్యసంతోషమున లోభనిరతి కృప న
ధర్మ ముచిత కృతావేక్ష ధర్మ మవులఁ । ద్రోవనేర్చుట ముక్తికిఁ ద్రోవ యధిప! 370

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; క్షమన్= ఓర్పుతో; క్రోధము= కోపాన్ని; అకృతసంకల్పతన్= సంకల్పం చేయకుండా ఉండటంవలన; కామంబు= కోరికను; సత్త్వసంసేవనమునన్= సాత్త్వికగుణాభాస్యంతో; చిరనిద్ర= నిడుపైన నిద్దురను ; గాఢధైర్యమునన్= దృఢమైన ధీరత్వంతో; రాగద్వేషములు= ఆసక్తి ద్వేషాలను; అప్రమాదమునన్= ఏమరుపాటు లేకుండా ఉండటంతో; భయము= భీతిని; వినివర్తన+అభ్యాసమునన్= తొలగద్రోయటమనే అభ్యాసంతో; మోహంబు భ్రమము= వ్యామోహభ్రాంతులను; హితము= మేలు చేసేది; మితంబున్= పరిమితమైనది; కాలయోజితంబునున్= తగిన కాలంలో స్వీకరించబడేది; అగు= అయిన; భోజనంబునన్= ఆహారంచేత; రోగములు= వ్యాధులను; ఉపద్రవములు= బాధలను; జీవసందర్శనమునన్= క్షేత్రజ్ఞుడనబడే జీవుడిని చూడటంచేత; నిశ్శ్వాసము= ప్రాణచేష్టను; అంత విరసతావేక్షణమునన్= కడపట రసహీనత్వమును చూచుటచే; విషయములు= శబ్దము మొదలైన విషయాలను; నిత్యసంతోషమునన్= సదా సంతోషముగా నుండుటచే; లోభనిరతి= లోభతత్పరతను; కృపన్= కరుణతో; అధర్మము= ధర్మంయొక్క లేమిని; ఉచితకృతావేక్ష= తగిన రీతిలో చేయబడిన సమీక్షణంచేత; కర్మము= కర్మను; అపులన్+త్రోవనేర్చుట= కడకునెట్టటం అభ్యసించటమే; ముక్తికిన్= మోక్షానికి; త్రోవ= మార్గం.

తాత్పర్యం: రాజా! ఓరిమితో కోపాన్నీ, సంకల్పించకుండా ఉండటంతో కామాన్నీ, సత్త్వగుణాభ్యాసంతో నిద్రనూ, దృఢమైన ధైర్యంతో రాగద్వేషాలనూ, జాగరూకతతో భయాన్నీ, జ్ఞానవైరాగ్యాదులతో క్రమంగా తొలగించటం నేర్చుకొనటం ద్వారా మోహభ్రాంతులనూ, హితమూ, మితమూ, తగినకాలంలో గ్రహింపబడేదీ అయిన భోజనంతో రోగాలనూ, ఉపద్రవాలనూ, క్షేత్రజ్ఞస్వరూపుడైన జీవుడిని చూడటంద్వారా ప్రాణచేష్టనూ, కడపట నిస్సారములని గ్రహించటంతో శబ్దాది విషయాలనూ, నిత్యసంతుష్టితో లోభాన్నీ, దయతో అధర్మాన్నీ, తగిన సమీక్షణ విధానంతో కర్మనూ కడకు నెట్టటం నేర్చుకొనటమే ముక్తికి బాట అవుతున్నది.

తే. తాను గ్రోధాదు లెడలించుఁగాని ముక్తిఁ । దెచ్చి యీఁ; దొకభంగి ముక్తికిఁ బథంబు
నగుట ననపాయ మగు నుపాయం బనంగ । వలసె నీ నేర్పు పే రిందువంశవర్య! 371

ప్రతిపదార్థం: ఇందువంశవర్య!= చంద్రవంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; తాను= ఈ ఉపాయం; క్రోధాదులు= కోపం మొదలైన దుర్గుణాలను; ఎడలించున్+కాని= తొలగిస్తుందికాని; ముక్తిన్= మోక్షాన్ని; తెచ్చి+ఈదు= తీసికొనివచ్చి ఈయదు; ఒక భంగిన్= ఒక విధంగా; ముక్తికిన్= మోక్షానికి; పథంబున్= దారియు; అగుటన్= కావటంవలన; ఈ నేర్పుపేరు= ఈ చాతుర్యం యొక్క నామం; అనపాయము+అగు= అపాయంలేని; ఉపాయము+అనంగన్+వలసెన్= ఉపాయమని చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠా! పై జెప్పిన ఉపాయం ముక్తికి ఆటంకం కల్గించే కామక్రోధాదులను తొలగిస్తుంది కాని తాను ముక్తిని తెచ్చి సమర్పించదు. ఒక విధంగా అది మోక్షానికి తెరువు కావటం వలననే ఆ నేర్పును అపాయంలేని ఉపాయమని చెప్పటమయింది.

చ. అనుడు నజాతశత్రుఁ 'డిటు లన్నలు దమ్ములు లోనుగాఁగఁ దృ
ష్ణ నఖిలబంధుకోటులనుఁ జంపెడు తెం పాలసెన్ మహాత్మ! యే
యనువునఁ దృష్ణ త్రోపువడునట్టి సమంచితచిత్త ధర్మముం
బనుపఱుపంగ జాలు కలభాషణ పంక్తి ననుగ్రహింపవే!' 372

ప్రతిపదార్థం: అనుడున్= అని భీష్ము డనగా; అజాతశత్రుఁడు= ధర్మజుడు; మహాత్మ!= మహానుభావా!; ఇటులు= ఇట్లా; అన్నలు తమ్ములు లోనుగాఁగన్= అగ్రజులు అనుజులు మొదలైనవారిని; తృష్ణన్= ఆశతో; అఖిలబంధుకోటులనున్= సమస్త బంధుసమూహాలను; చంపెడు= వధించే; తెంపు= సాహసం; ఒలసెన్= సంభవించింది; తృష్ణ= ఆశ; ఏ యనువునన్= ఏ

ఉపాయంతో; త్రోపువడున్= తొలగిపోవునో; అట్టి= అటువంటి; సమంచిత చిత్త ధర్మమున్= పూజితమైన మనోధర్మాన్ని; పనుపఱుపంగన్+చాలు= అభ్యసింపజేయగా నేర్చునట్టి; కలభాషణపంక్తిన్= మధురమైన మాటలపరంపరను; అనుగ్రహింపవే!= ప్రసాదించుమా!

తాత్పర్యం: భీష్ముడట్లా అనగానే ధర్మరాజు 'ఓ మహాత్మా! ఆశ వలన సోదరులు మొదలైన సమస్త బంధుసమూహాలనూ వధించే సాహసం సంభవించింది. ఈ ఆశ ఎట్లా తొలగిపోతుందో, ఆ మానితమైన మనోధర్మాన్ని అలవడజేసే మధురవచనాలు వినిపించుము'.

క. అనుటయు దేవవ్రతుఁ డ । మ్మనుజపతికి నిట్టు లనియె 'మాండవ్యునితో
జనకుఁడు సెప్పిన మాటలు । విను; మవి తృష్ణ నడఁగించు వెరవు నొనర్చున్. 373

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; దేవవ్రతుఁడు= భీష్ముడు; ఆ+మనుజపతికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; జనకుఁడు= జనక భూపాలుడు; మాండవ్యునితోన్= మాండవ్యుడనే మునితో; చెప్పిన= వచించిన; మాటలు= పలుకులు; వినుము= ఆలకించు; అవి= ఆ మాటలు; తృష్ణన్= ఆశను; అడఁగించు= నశింపజేయు; వెరవున్= ఉపాయమును; ఒనర్చున్= చేయును.

తాత్పర్యం: ధర్మజు డట్లా అనేసరికి భీష్ము డతడితో ఇట్లా అన్నాడు: 'పూర్వం జనకుడు మాండవ్యుడనే మునితో చెప్పిన మాటలు చెప్పుతాను, వినుము. ఆ మాటలు తృష్ణను నశింపజేసే ఉపాయం తెలుపుతాయి.

జనకరాజ మాండవ్య మహాముసులసంవాద ప్రకారము (సం. 12-268-3)

వ. జనకుని కడకు మాండవ్యుండు వచ్చి వితృష్ణత్వశిక్షఁ గోరిన న మ్మేదినీశ్వరుం డాదరభరితుండై. 374

ప్రతిపదార్థం: మాండవ్యుండు= మాండవ్యమహాముని; జనకుని కడకున్= జనకనరేంద్రుడి సమీపానికి; వచ్చి= ఏతెంచి; వితృష్ణత్వశిక్షన్= ఆశ లేమిలో శిక్షణను; కోరినన్= అడుగగా; ఆ+మేదినీ+ఈశ్వరుండు= ఆ రాజు; ఆదరభరితుండు+ఐ= ప్రీతితో కూడినవాడై.

తాత్పర్యం: మాండవ్యముని ఒకసారి జనకభూపాలుడి కడకు వచ్చాడు. వచ్చి ఆశ లేకుండా ఉండటానికై తగిన శిక్షణ నిమ్మని అర్థించాడు. అప్పు డా భూపాలకుడు అతడిపట్ల ఆదరం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'అర్థముల్ దుఃఖదోషాకరంబులు విను । మేమిటిపై నాశ లేమిఁ జేసి
పొరయవు నను దుఃఖములు మునినాయక! । మిథిల గాలంగ నేమియును నాకుఁ
గాలని య ట్లుండెఁ; గామసుఖంబును । దివ్య సుఖంబునుఁ దృష్ణ విడుచు
సుఖముఁ బోలునె? యర్థసులభత తోడన । గోవుతోఁ బెరిఁగెడు కొమ్ములట్లు
తే. తృష్ణ దానును పెరుఁగుఁ; దదీయ శక్తి । మమత గలుగు మా బంధులు మా ధనములు
మా నివాసంబు లనమి మమత్వ మెదఁ ది । రంబు గాకున్న నింకుఁ దృష్ణాంబురాశి. 375

ప్రతిపదార్థం: మునినాయక!= మునిశ్రేష్ఠా!; వినుము= ఆలకించుము; అర్థముల్= సంపదలు; దుఃఖదోష+ఆకరంబులు= దుఃఖమనే దోషానికి నిలయాలు; ఏమిటిపైన్= దేనిమీదా; ఆశ= తృష్ణ; లేమిన్+చేసి= లేకపోవటంవలన; ననున్= నన్ను; దుఃఖములు=బాధలు; పొరయవు= అంటవు; మిథిల= మిథిలానగరం; కాలంగన్= దహింపబడగా; ఏమియునున్= ఏదీకూడా; నాకున్= నా చిత్తానికి; కాలనిఅట్లు+ఉండెన్= కాలకుండా ఉన్నట్లే ఉన్నది; కామసుఖంబునున్= కామానుభవం వలన కలిగే సుఖమూ; దివ్య సుఖంబునున్=

దేవలోకసుఖమూ; తృష్ణ విడుచుసుఖమున్= ఆశ విడనాడటం వలన కలిగే సుఖాన్ని; పోలునె?= పోలగలవా?; గోవుతోన్= ఆవుతోగూడ; పెరిఁగెడు= వృద్ధిపొందే; కొమ్ములట్లు= కొమ్ములలాగా; అర్థసులభతతోడనన్+అ= అనాయాసంగా ధనప్రాప్తి కాగానే; తృష్ణ= ఆశ; తానునున్= తానుగూడ; పెరుఁగున్= వృద్ధి పొందుతుంది; తదీయశక్తిన్= ఆశకు సంబంధించిన సామర్థ్యం వలన; మమత= మమకారం; కలుగున్= కలుగుతుంది; కలుగు= సంభవించే; మాబంధులు= మా చుట్టాలు; మా ధనములు= మా సంపదలు; మా నివాసంబులు= మా ఇళ్ళు; అనమిన్= అనకపోవటం వలన; మమత్వము= మమకారం; ఎదన్= హృదయంలో; తిరంబుగాక+ఉన్నన్= స్థిరపడకపోతే; తృష్ణా+అంబురాశి= ఆశ అనే సముద్రం; ఇంకున్= ఎండిపోతుంది.

తాత్పర్యం: మునీశ్వరా! చెప్పుతాను వినుము. సంపదలు దుఃఖనిలయాలు. నాకు దేనిపైనా ఆశలేదు. అందువలననే మిథిలానగరం తగలబడుతున్నా నాకు ఏమీ తగులబడినట్లు లేదు. కామసుఖమూ, దివ్యసుఖమూ ఆశలేమిచేత కలిగే సుఖానికి ఈడు కావు. అర్థం అనాయాసంగా లభించగానే గోవుతో కూడా కొమ్ములు పెరిగినట్లే ఆశ కూడా పెరిగిపోతుంది. ఆశాప్రభావం వలన కలిగే మమకారం పెరిగి పోతుంది. వీరు మా చుట్టాలు, అవి మా సంపదలు, ఇవి మా నెలవులు - అనే మమకారం తొలగితే తృష్ణ అనే సాగరం ఎండిపోతుంది.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

క. దొరకొన్న ననుభవించుచు । దొరకొనమికిఁ జింతనొంది దురపిల్లక ని
ర్భరుఁడై యున్ననుఁ దృష్ణకుఁ । జొరవచ్చునె యతని మనసు సువ్రతశీలా! 376

ప్రతిపదార్థం: సువ్రతశీలా!= మంచివ్రతం స్వభావంగా కలవాడా!; దొరకొన్నన్= లభిస్తే; అనుభవించుచున్= అనుభవిస్తూ; దొరకొనమికిన్= లభించనిదానికి; చింతన్+ఒంది= విచారంపొంది; దురపిల్లక= దుఃఖించక; నిర్భరుఁడు+ఐ= పూర్ణచిత్తుడై; ఉన్ననున్= ఉంటే; అతని మనసు= అతడి చిత్తం; తృష్ణకున్= ఆశకు; చొరన్ వచ్చునె?= ప్రవేశించవీలగునా?

తాత్పర్యం: సద్వ్రతమే స్వభావంగా గల ఓ మాండవ్యమునీంద్రా! దొరకినదానిని అనుభవిస్తూ, దొరకనిదానికి చింతపడి దుఃఖించకుండా పరిపూర్ణుడై ఎవడు ఉంటాడో, అతడి మనస్సులోనికి తృష్ణ ప్రవేశించనేరదు.

తే. విడువరాదు దుర్మతులకు నొడలు ముదియఁ । దాను ముదియదు ప్రాణాంతమైన రోగ
మనఘ! తృష్ణ వర్జితకాముఁడై నతండు । దానిఁ బోఁద్రోచి సౌఖ్యసాంద్రత్వ మొందు. 377

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తృష్ణ= ఆశ; దుర్మతులకున్= దుర్బుద్ధులైనవారికి; విడువన్‌రాదు= వదలటానికి వీలుకాదు; ఒడలు= శరీరం; ముదియన్= ముదిసిపోగా; తాను= ఆశ; ముదియదు= వృద్ధత్వం పొందదు; (అది) ప్రాణాంతమైన= ప్రాణవినాశకమైనట్టి; రోగము= వ్యాధి; వర్జితకాముఁడు+ఐన+అతండు= కోరికలు వదలినవాడు; దానిన్= ఆ తృష్ణను; పోఁద్రోచి= కడకు నెట్టివైచి; సౌఖ్యసాంద్రత్వము= సుఖాధిక్యమును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ మునిశ్రేష్ఠా! దుర్మతులైనవారు తృష్ణను విడువలేరు. శరీరం ముసలితనం పొందినా ఆశమాత్రం ముదిమి పొందదు. అది ప్రాణాలు తీసే రోగం. ఎవడు తాను విముఖుడై తృష్ణను పరిహరిస్తాడో, అతడు అత్యధిక సుఖం పొందుతాడు.

క. శోక ప్రమదాది ద్వం । ద్వాకులుఁ డవుఁ గాక శాంతి నంతఃకరణ
శ్రీకిఁ బరిరక్ష సేయుము; । నీకు వితృష్ణత్వసౌఖ్యనిత్యత గలుగున్.' 378

ప్రతిపదార్థం: శోకప్రమద+ఆది ద్వంద్వ+ఆకులుఁడవు= దుఃఖం, సుఖం మొదలైన ద్వంద్వాలచేత వ్యాకులపడినవాడవు; కాక= కాకుండా; శాంతిన్= శమంతో; అంతఃకరణశ్రీకిన్= మనోబుద్ధ్యాదులతో కూడిన అంతఃకరణలక్ష్మికి; పరిరక్ష= కాపుదల; చేయుము= ఒనర్చుము; నీకున్= మాండవ్యుడవగు నీకు; విత్పృష్ణసౌఖ్యనిత్యత= ఆశ లేమివలన కలిగే సౌఖ్యస్థిరత్వం; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: మునీంద్రా! నీవు సుఖదుఃఖాది ద్వంద్వాలకు వ్యాకులత చెందవద్దు. నిగ్రహంతో మనోబుద్ధ్యాదులతో కూడిన అంతఃకరణసంపదను కాపాడుకొమ్ము. అట్లా చేస్తే నీకు ఆశలేమివలన నిత్యసుఖం లభిస్తుంది'.

క. అని చెప్పిన నమ్ముని య । మ్మనుజపతిం బ్రస్తుతించి మనము ప్రశాంతిం
బనుపడఁగఁ బ్రీతి వీడ్కొని । చని వర్తిల్లెను విత్పృష్ణసరణిఁ గుమారా! 379

ప్రతిపదార్థం: కుమారా!= ధర్మరాజా!; అని చెప్పినన్= జనకుడు ఆ రీతిగా చెప్పేసరికి; ఆ+ముని= ఆ మాండవ్యుడు; ఆ+మనుజపతిన్= ఆ రాజును; ప్రస్తుతించి= ప్రశంసించి; మనము= చిత్తం; ప్రశాంతిన్+పనుపడఁగన్= ప్రశాంతిని పొందగా; ప్రీతిన్= సంతోషంతో; వీడ్కొని చని= పోయివస్తానని చెప్పి వదలిపోయి; విత్పృష్ణ సరణిన్= ఆశారహిత మార్గంలో; వర్తిల్లెను= చరించాడు.

తాత్పర్యం: ధర్మపుత్రా! జనకుడట్లా బోధించే సరికి ఆ మాండవ్యుడు ఆ రాజును ప్రస్తుతించాడు. అతడి చిత్తం శాంతి పొందింది. ఆపై రాజును వీడ్కొని ఆ మాండవ్యమునీంద్రుడు ఆశారహితమైన పథంలో సంచరించాడు.

పితాపుత్రసంవాదము

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సర్వభూతభయావహంబగుచుం గాలం బతిక్రమించుచుండఁ బురుషుం డెద్ది యాచరించుట మేలు? దీని మున్ను నడిగి విన్నవాఁడ; నిది పెద్దయు వినవలయునది గావున నడిగెదం జెప్పవే!' యనుటయు, నమ్మహాత్ముం డీ యర్థంబు దెలియుటకు ముంద రేను జెప్పిన పితాపుత్ర సంవాదం బను నితిహాసంబు లెస్స; యందుఁగొన్ని వాక్యంబు లప్పుడు సెప్పనియవి యునుం గలవు; చెప్పెద వినుఁ; మధ్యయనపరుం డగు నొక్క బ్రాహ్మణపుత్రుం డన్వర్థనామధేయుండు మేధావి యనువాఁడు దండ్రి కభిముఖుండై. 380

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్మజుడు; శంతనునందనుతోన్= భీష్ముడితో; సర్వభూతభయావహంబు+అగుచున్= సమస్త ప్రాణులకు భీతికలిగిస్తూ; కాలంబు= సమయం; అతిక్రమించుచుండన్= గడుస్తూ ఉండగా; పురుషుఁడు= జీవుడు; ఎద్ది= ఏది; ఆచరించుట= చేయటం; మేలు= శుభం; దీనిన్= ఈ విషయాన్ని; మున్నున్= ముందుకూడా; అడిగి= ప్రశ్నించి; విన్నవాఁడన్= ఆలకించినవాడను; ఇది= ఈ సంగతి; పెద్దయున్= మిక్కిలిగా; వినన్వలయునది= వినదగింది; కావునన్= కాబట్టి; అడిగెదన్= ప్రశ్నిస్తున్నాను; చెప్పవే= వివరింపుమా; అనుటయున్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఈ అర్థంబు= ఈ విషయం; తెలియుటకున్= గ్రహించటానికి; ముందర= ముందు; ఏను= నేను; చెప్పిన= వచించిన; పితాపుత్రసంవాదంబు+అను= తండ్రికొడుకుల సంవాదమనే; ఇతిహాసంబు= పూర్వగాథ; లెస్స= బాగైనది; అందున్= దానిలో; కొన్ని వాక్యంబులు= కొన్నిమాటలు; అప్పుడు= ఆ కాలమున; చెప్పనియవియునున్= చెప్పనివి కూడ; కలవు= ఉన్నవి; చెప్పెదన్+వినుము= వివరిస్తాను వినుము; అధ్యయనపరుండు= విద్యాభ్యాసంలో ఆసక్తుడైనవాడు; ఒక్క బ్రాహ్మణపుత్రుండు= ఒక విప్రసుతుడు; అన్వర్థనామధేయుండు= సార్థకమైన పేరు గలవాడు; మేధావిఅనువాఁడు= 'మేధావి' అనబడేవాడు; తండ్రికిన్= జనకుడికి; అభిముఖుండు+ఐ= ఎదురుమొగంతో ఉన్నవాడై.

తాత్పర్యం: భీష్ముడట్లా చెప్పగా విని ధర్మరాజు అతడితో 'సమస్త ప్రాణులకూ భయంకలిగిస్తూ కాలం గడుస్తుండగా పురుషుడు ఏమి చేస్తే శ్రేయస్సు కలుగుతుంది? ఈ విషయం ఇంతకుముందు కూడా విన్నాను. అయినా ఇది మిక్కిలిగా వినదగిన విషయం. అందువలన మళ్ళీ అడుగుతున్నాను చెప్పు'మన్నాడు. అప్పుడు మహనీయుడైన ఆ పితామహుడు ఈ విషయం గ్రహించేముందు నేను పూర్వం చెప్పిన పితాపుత్రసంవాదం అనే ఇతిహాసం చాలా మేలైనది. అందులో కొన్ని మాటలు నేను నీకు అప్పుడు చెప్పనివి కూడా ఉన్నాయి. ఇప్పు డవి చెప్పుతాను వినుము. విద్యాభ్యాసపరుడైన ఒక విప్రకుమారు డుండేవాడు. వాడు 'మేధావి' అనే సార్థకనామధేయం కలిగి మిక్కిలి తెలివితో ప్రవర్తించేవాడు. వాడు తండ్రి ఎదుట నిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'ఆయువు దఱుఁగు నంతంతకు ధీరుఁ డె । య్యది సేయువాఁ?' డన్న నతఁడు 'బ్రహ్మ
చర్యంబు వేదాభ్యసనమును సంతాన । సంపాదనంబు యజ్ఞప్రవర్త
నంబును జేసి వానప్రస్థధర్మంబు । నడపి యాచరితసన్న్యాసుఁ డగుట
కృత్యం' బనుడు 'జరామృత్యువుల్ జననమా । దిగ వెను తగులంగ దిగులు లేమి

తే. మీను వలదన్నుఁ బొదువుట గాన కిష్ట । వృత్తి విహరించుచుండెడు విధమ కాదె!
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు । మనఘ! వార్చునె మృత్యువు జనుల పనుల.' 381

ప్రతిపదార్థం: ధీరుఁడు= ధైర్యం కలవాడు; ఆయువు= జీవితకాలం; తఱుఁగున్+అంతంతకున్= ఆరోజు కారోజు తరిగిపోతూ ఉండగా; ఏ+అది= ఏమి; చేయువాఁడు+అన్నన్= చేయాలి అని అడుగగా; అతఁడు= అతడి తండ్రి; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచారియొక్క ధర్మమును; వేద+అభ్యసనమునున్= వేదాలను చదవటం; సంతానసంపాదనంబున్= సంతతిని పొందటం; యజ్ఞప్రవర్తనంబునున్= యజ్ఞాచరణం; చేసి= అనుష్ఠించి; వానప్రస్థధర్మంబున్= వానప్రస్థుడియొక్క ధర్మాన్ని; నడపి= నిర్వహించి; ఆచరితసన్న్యాసుఁడు+అగుట= అనుష్ఠింపబడిన సన్న్యాసం కలవాడు కావటం; కృత్యంబు= చేయదగినపని; అనుడున్= అనగా; జననము+ఆదిగన్= పుట్టింది మొదలుగా; జరామృత్యువుల్= ముసలితనం; మరణం; వెనుతగులంగన్= వెంబడించగా; దిగులు లేమి= విచారం లేకుండా ఉండటం; మీను= చేప; వల= జాలము; తన్నున్= తనను; పొదువుటన్= ఆక్రమించటం; కానక= చూడక; ఇష్టవృత్తిన్= ఇచ్చవచ్చిన చొప్పున; విహరించుచుండెడు= తిరుగుతుండే; విధమకాదె!= పద్ధతేకదా!; మేలు= మంచిపని; ఎల్లి= రేపు; చేసెదను+అనక= చేస్తాను అనకుండా; ఇపుడు+అ= ఇప్పుడే; చేయుము= అనుష్ఠించుము; అనఘ!= పాపరహితుడా!; మృత్యువు= చావు; జనుల= ప్రజలయొక్క; పనులన్= కార్యాలను; వార్చునె?= ప్రతీక్షించునా?

తాత్పర్యం: 'ధీరుడైన మనుజుడు నిత్యమూ ఆయుస్సు తరిగిపోతూ పోతూ ఉండగా ఏమి చేయాలి?' అని ప్రశ్నించాడు. తండ్రి అతడితో 'బ్రహ్మచర్యం, వేదాధ్యయనం, సంతానం పొందటం, యజ్ఞనిర్వహణం చేసి ఆపై వానప్రస్థధర్మం నిర్వర్తించి సన్న్యాసవృత్తిని అవలంబించటం చేయదగినపని' అని చెప్పాడు. అప్పుడు కుమారుడు 'పాపరహితుడవైన ఓ తండ్రీ! పుట్టినది మొదలు ముదిమి, మరణం వెంటబడతాయి. అప్పుడు విచారం లేకుండా ఉండటం; వల తన్ను ఆక్రమించినపుడు దానిని చూడకుండా చేప ఇచ్చవచ్చినట్లు విహరించినట్లే కదా! అందువలన చేయాలనుకొన్న సత్కార్యం రేపటికి వాయిదా వేయకుండా ఇప్పుడే పూర్తిచేయుము. ప్రజల పనులు పూర్తి అయ్యేంతవరకు మృత్యువు తన పని చేయకుండా ఎదురుచూస్తూ ఉంటుందా?'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలికి పుత్రుండు వెండియు. 382

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పుత్రుండు= కుమారుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: అట్లా చెప్పి ఆ విప్రకుమారుడు మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'కృత మిది యకృతం బిది యిది । కృతాకృతంబనుచు నరుఁడు కింకర్తవ్య
త్వతిరోహితాత్మహిత సం । స్మృతియైనఁ గృతాంతుఁ డతనిఁ జేర్చుఁ దనపురిన్. 383

ప్రతిపదార్థం: ఇది= ఇది; కృతము= చేయబడింది; ఇది= ఇది; అకృతంబు= చేయబడనిది; ఇది; కృత+అకృతంబు= చేసీ చేయనిది (అసంపూర్ణంగా చేయబడింది); అనుచున్= అని భావిస్తూ; నరుఁడు= మనుజుడు; కింకర్తవ్యతిరోహితాత్మహితసంస్మృతి= ఏమి చేయాలి అనే సందేహంతో కప్పబడిన ఆత్మహితముయొక్క స్మరణకలవాడు; ఐనన్= ఐతే; కృత+అంతుఁడు= యముడు; అతనిన్= అట్టివాడిని; తన పురిన్= తన నగరాన్ని; చేర్చున్= పొందిస్తాడు.

తాత్పర్యం: ఏ మనుజుడు ఇది చేశాను, ఇది చేయలేదు, ఇది చేసీ చేయకుండా ఉన్నాను అని తలంచుకొంటూ ఏమి చేయాలో తోచనిస్థితిలో పడి ఆత్మహితం మరచి ఉంటాడో అట్టివాడిని యముడు తన నగరానికి తీసికొనిపోతాడు.

క. అనఘా! మృత్యువు నమృతం । బును దేహమునంద కలవు; మోహము మృత్యు
త్వనిరూఢ మున్నరూపుం । గనుటమృతత్వోపహితము గాఁగ నెఱుఁగుమీ. 384

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; మృత్యువు= మరణం; అమృతంబునున్= మరణరాహిత్యస్థితీ; దేహమునందు+అ= శరీరమునందే; కలవు= ఉన్నాయి; మోహము= సంసారం మీది వ్యామోహం; మృత్యుత్వ నిరూఢము= మరణ ధర్మంచేత ప్రసిద్ధమైనది; ఉన్న రూపున్= యథార్థమైన తత్త్వమును; కనుట= చూడటం; అమృతత్వోపహితముకాఁగన్= అమృతత్వంతో కూడిందిగా; ఎఱుఁగుమీ!= తెలిసికొనుమా!

తాత్పర్యం: పాపరహితుడ వగు ఓ జనకా! ఈ శరీరంలోనే మృత్యువు, అమృతత్వం అనేవి రెండూ ఉన్నాయి. సంసార వ్యామోహమే మృత్యువు. తత్త్వజ్ఞానమే అమృతత్వం. ఈ విషయం చక్కగా గ్రహించుము.

క. ననుబోఁటికిఁ బశుయజ్ఞం । బున హింసకుఁ డగుట దగునె భూసురవర! హిం
సనరహితమైన శాంతి య । జనమున బ్రహ్మోధ్వరంబు సలిపెద నియతిన్. 385

ప్రతిపదార్థం: భూసురవర!= విప్రశ్రేష్ఠా!; ననుబోఁటికిన్= నావంటి వాడికి; పశుయజ్ఞంబునన్= పశువులను వధించి చేసే యజ్ఞంతో; హింసకుఁడు+అగుట= హింసించేవాడు కావటం; తగునె?= ఉచితమా?; హింసన రహితము+ఐన= హింసలేని; శాంతియజనమునన్= శాంతియజ్ఞంతో; నియతిన్= నియమపూర్వకంగా; బ్రహ్మోధ్వరంబు= బ్రహ్మయజ్ఞమును; సలిపెదన్= చేస్తాను.

తాత్పర్యం: విప్రవర్యా! నా వంటివాడికి పశువులను చంపి చేసే ద్రవ్యయజ్ఞం తగదు. హింసా సంబంధంలేని శాంతియజ్ఞంతో నేను నియమంగా బ్రహ్మయజ్ఞం చేస్తాను.

విశేషం: యజ్ఞాలు అనేక విధాలుగా ఉన్నాయి. వేదంలోని కర్మకాండలో పశువధతో కూడిన అనేకయజ్ఞాలు నిరూపించబడి ఉన్నాయి. అయితే అవి అంత ప్రశస్తమైనవి కావు. గీతలో శ్రీకృష్ణుడు "శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః" అని చెప్పాడు. అంటే ద్రవ్యమయమైన యజ్ఞం కంటె జ్ఞానయజ్ఞం శ్రేయస్కరమని అర్థం. అందువలన మోక్షార్థులు జ్ఞానయజ్ఞం అనుష్ఠిస్తారే కాని ద్రవ్యయజ్ఞాలు చేయరు. ఇక్కడ మేధావి జ్ఞానయజ్ఞ మనబడే బ్రహ్మయజ్ఞమే ప్రశస్తమని వివరించాడు. సర్వేంద్రియ నిగ్రహంతో

కూడిందే తపోమయమూ, యోగమయమూ అయిన శాంతియజ్ఞం. అందువలన జ్ఞానప్రాప్తి కల్గుతుంది. ఆ విధానాన్నే బ్రహ్మయజ్ఞమని వ్యవహరిస్తారు. గీతలో ఈ యజ్ఞాల స్వరూపం విపులంగా నిరూపించబడి ఉన్నది. ఆధునిక కాలంలో కర్మకాండలో చెప్పినట్లు ద్రవ్యయజ్ఞాలు చేసేవారు అరుదైపోయారు. ఇప్పుడు కూడా జ్ఞానయజ్ఞం ప్రశస్తమై ఉన్నది.

క. యోగంబుఁ దపంబుఁ బరి । త్యాగంబును గాక యొండు లగునె హితంబుల్?
రాగము సరి దుఃఖంబును । ద్యాగముఁ బోలెడి సుఖంబు నరయం గలవే? 386

ప్రతిపదార్థం: యోగంబున్= యోగానుష్ఠానము; తపంబున్= తపస్సు; పరిత్యాగంబునున్= సంగం త్యజించటమూ; కాక= ఇవికాక; ఒండులు= ఇతర మార్గాలు; హితంబుల్= శ్రేయస్కరాలు; అగునె?= అవుతాయా?; రాగముసరి= విషయాసక్తితో సమానమైన; దుఃఖంబునున్= బాధయు; త్యాగమున్+పోలెడి= విషయాసక్తిని వదలటంతో సమానమైన; సుఖంబున్= ప్రమోదమును; అరయన్= పరిశీలించగా; కలవే?= ఉన్నవా?

తాత్పర్యం: యోగాన్ని అనుష్ఠించటం, తపస్సు చేయటం, విషయాసక్తిని త్యజించటం - అనేవి హితకరమైన మార్గాలు. వీటితో సమానమైన శ్రేయోమార్గాలు మరి లేవు. అట్లాగే విషయాసక్తితో సదృశమైన దుఃఖం మరొకటి లేదు. త్యాగాన్ని పోలిన సుఖం కూడా లేదు.

క. ప్రజ యేన కాన నన్నుం । బ్రజ సుగతికిఁ బుచ్చునని భరంపడి కోరం
బ్రజ విడిచెద నా యందది । యజేయమును నవ్యయంబు నగు పద మిచ్చున్. 387

ప్రతిపదార్థం: ఏను+అ= నేనే; ప్రజ= జనించిన సంతానమై ఉన్నాను; కానన్= అందుచేత; నన్నున్= నన్ను; ప్రజ= సంతతి; సుగతికిన్= సద్గతికి; పుచ్చున్+అని= పంపుతుందని; భరంపడి= అతిశయించి; కోరన్= అభిలషించను; ప్రజన్= సంతతిని; విడిచెదన్= వదలివేస్తాను; అది= ఆ త్యాగం; నాయందున్= నాలో; అజేయమునున్= జయించరానిదీ; అవ్యయంబున్= వ్యయం కానిదీ; అగుపదమున్= అయినస్థానాన్ని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: తండ్రీ! నేను నీకు సంతతినై ఉన్నాను. నాకు కలిగిన మరొక సంతతి నా సుగతికి హేతువవుతుందని నేను భావించటం లేదు. అందువలన నేను సంతతికొరకై అభిలషించను. సంతతిని వదలివేస్తాను. (గృహస్థధర్మం స్వీకరించను అని భావం). ఆ త్యాగం నాకు జయించరాని, తరుగులేని మహోన్నతస్థితికి హేతువవుతుంది.

ఉ. కావున లోకసంక్షయము గన్గొని యెల్లెడ నిర్మముండ వై
నీవును శాంతియున్ సమత నిష్ఠయుఁ బూని గుహాప్రవేశ సం
భావన నాత్మదర్శన విభాసివి గమ్మనినం దదీయ వి
ద్యావచనంబులం జనకుఁ డట్టిఁడ యై వెలిఁగెం గృతార్థతన్. 388

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; నీవును= నీవుకూడ; లోకసంక్షయమున్= లోకంయొక్క వినాశాన్ని; కన్గొని= చూచి; ఎల్ల+ఎడన్= అన్ని విషయాలలోనూ; నిర్మముండవు+ఐ= మమకారం లేనివాడవై; శాంతియున్= శమము; సమత= సమభావం; నిష్ఠయున్= ఆత్మనిష్ఠ కూడా; పూని= వహించి; గుహాప్రవేశసంభావనన్= బుద్ధిగుహలో చొరబారుట అనే సంభావనచే (ఏకాంతమైన కొండగుహలో ప్రవేశించటం అనియు చెప్పవచ్చును.); ఆత్మదర్శన విభాసివి= ఆత్మను చూడటంచేత ప్రకాశించేవాడివి; కమ్ము= అగుము; అనినన్= అని చెప్పగా; తదీయ విద్యావచనంబులన్= అతడి బ్రహ్మవిద్యామయాలైన మాటలచేత; జనకుఁడు= తండ్రి; అట్టిఁడ+ఐ= అట్లాంటివాడుగానే రూపొంది; కృతార్థతన్= కృతకృత్యతతో; వెలిఁగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అందువలన లోకం శాశ్వతం కాదని గ్రహించి నీవు దేనిమీదా మమకారం పెట్టుకొనవద్దు. శాంతి, సమభావం, ఆత్మనిష్ఠ కలిగి ఉండుము. నీ బుద్ధిగుహలోనికి ప్రవేశించి అందు నిగూఢంగా ఉన్న ఆత్మను చూడుము. (ఏకాంతమైన కొండగుహలో జేరి ఆత్మ దర్శనపరుడివి కమ్ము)' అని కుమారుడు తండ్రికి బోధించాడు. అతడు చెప్పిన బ్రహ్మవిద్యా ప్రబోధకాలైన మాటలు విని తండ్రి ఆ రీతిగా అనుష్ఠించి కృతార్థుడై వెలుగొందాడు.

క. నరనాథ! యమృతమగు ను । న్నరూపు గను దీవు మరగు నా చెప్పిన యి
ప్పరమేతిహాస వాక్యో । త్కరంబు నర్థంబు చిత్తగత మగుచుండన్. 389

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా!; నా చెప్పిన= నేను వచించిన; ఈ+పరమ+ఇతిహాస వాక్య+ఉత్కరంబు= ఈ శ్రేష్ఠమైన పూర్వగాథకు చెందిన వచనసమూహంయొక్క; అర్థంబు= శబ్దార్థం; చిత్తగతము= మనసుకెక్కింది; అగుచుండన్= అవుతూ ఉండగా; ఈవు= నీవు; అమృతము+అగు= మరణరహితమైన; ఉన్నరూపు= యథార్థతత్త్వమును; కనుదు= చూస్తావు; మరగు= దానిని ఆశించుము.

తాత్పర్యం: రాజా! నే నిప్పుడు చెప్పిన గాథకు చెందిన వాక్యాల అర్థం నీ మనస్సున కెక్కగా నీవు కూడా అమృతమైన ఆ పరతత్త్వస్వరూపాన్ని చూడగలవు. అభ్యాసంతో దాని నాశించుము'.

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డెవ్విధంబు శీలంబు గలవాఁడు బ్రహ్మపదంబు నొందు?' నని యడిగిన భీష్ముం
డత్యాదరంబున. 390

ప్రతిపదార్థం: అనినన్= భీష్ము డట్లా చెప్పగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; ఏ+విధంబు= ఎట్టిదైన; శీలంబు గలవాఁడు= స్వభావం కలవాడు; బ్రహ్మపదంబున్= మోక్షస్థానమును; ఒందున్?= పొందుతాడు?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; భీష్ముండు= భీష్ముడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో.

తాత్పర్యం: భీష్ము డారీతిగా చెప్పగా విని ధర్మరాజు 'ఏ విధమైన స్వభావం కలవాడు మోక్షం పొందగలడో వివరించు' మని మళ్ళీ ప్రశ్నించాడు. భీష్ముడు అతడిపట్ల మిక్కిలి ప్రీతిగలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'అధిప! లఘ్వాశియై యింద్రియప్రపంచ । జయము గలిగి మోక్షార్థోక్త సారధర్మ
నిరతి నుండెడి వానికిఁ బరమ మగు ప । దంబు తంగేటిజున్ను చందంబు నొందు.' 391

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; లఘు+ఆశి+ఐ= మితంగా భుజించేవాడై; ఇంద్రియప్రపంచజయము= శ్రోత్రం మొదలైన ఇంద్రియ సమూహంపై విజయాన్ని; కలిగి= కలిగి ఉండి; మోక్ష+అర్థ+ఉక్త సారధర్మనిరతిన్= మోక్షం కొరకై చెప్పబడిన శ్రేష్ఠధర్మాలపై ఆసక్తితో; ఉండెడివానికిన్= ఉండేవాడికి; పరమము+అగు= శ్రేష్ఠమైన; పదంబు= బ్రహ్మపదం; తంగేటిజున్ను చందంబున్= తంగేడుచెట్టు లోని తేనెతెట్టెవలె అందుబాటులో ఉండే విధాన్ని; ఒందున్= పొందును.

తాత్పర్యం: 'రాజా! మితాహారం స్వీకరిస్తూ ఇంద్రియానీకాన్ని జయించి మోక్షం కొరకై శాస్త్రాలలో చెప్పబడిన ఉత్తమ ధర్మాలను అనుష్ఠించేవాడికి బ్రహ్మపదం తంగేటిజున్నువలె సులభసాధ్యమై ఉంటుంది'.

విశేషం: తంగేడుచెట్టు మిక్కిలి ఎత్తుగా పెరగదు. దానిలోని తేనెతెట్టెను సులభంగా ఎవ్వరైనా గ్రహించి అనుభవించవచ్చును. అలంకారం ఉపమ.

వ. అని పలికి మఱియు నిట్లను 'హారీతగీతి యను వాక్యసంచయం బాకర్ణింపుము. దాన మోక్ష ధర్మంబులు దేటపడుం జెప్పెద హారీతుం డను మునివరుండు విద్వజ్జనంబులు దనవలనం బ్రవ్రజనంబు సమీచీన ప్రకారంబుగా నెఱుంగ నపేక్షించిన. 392

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; మఱియున్= మరలకూడ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు!; 'హారీతగీతి' యను= 'హారీతగీత యనబడే; వాక్యసంచయంబున్= వచనసమూహమును; ఆకర్ణింపుము= వినుము; దానన్= దానివలన; మోక్షధర్మంబులు= ముక్తిపొందుటకనువైన ధర్మాలు; తేటపడున్= స్పష్టమవుతాయి; చెప్పెదన్= చెపుతాను; హారీతుండను మునివరుండు= 'హారీతు' డనే మునిశ్రేష్ఠుడు; విద్వజ్జనంబులు= పండితజనులు; తనవలనన్= తననుండి; ప్రవ్రజనంబు= సన్న్యాస పద్ధతిని; సమీచీన ప్రకారంబుగాన్= చక్కని రీతిలో; ఎఱుంగన్= తెలుసుకొనటానికి; అపేక్షించినన్= కోరగా.

తాత్పర్యం: భీష్ముడు ధర్మజుడితో అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. ' హారీతగీత' అనబడే కొన్ని మాటలున్నాయి. అవి వినుము. వాటిద్వారా మోక్షధర్మాలు స్పష్టమయ్యేటట్లు చెప్పుతాను. పూర్వం హారీతుడనే ఒక మునిశ్రేష్ఠుడి నుండి పండితులు సన్న్యాసవిధానం చక్కగా తెలిసికొనాలని అపేక్షించారు. అట్లా వారు అపేక్షించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-269-2)

సీ. వారి కి ట్లనియె 'నిష్కారంభమతి నిలు । వెడలి కోర్కుల కెల్ల విముఖుఁ డగుచు
జనములకీడు వాక్చక్షుర్మనోవర్త । నములఁ గూర్పక మైత్రి సమతఁ గరుణ
గలిగి, నిందాప్రశంసల ఖేదమును నుబ్బు । లేక పాడింటను నేకతంపు
గుడి మ్రాని పొంతను గుహలోన నుండుచు । డంపకములకు వంటకములకును

తే. భోజనములకుఁ దటియైన ప్రొద్దు గడపి । భిక్ష గొనుఁ బ్రీతి మన్నన పెద్దవెట్టు
నట్టియెడఁ దక్కి క్రొత్తగా నరుగు యతి ని । రంతరంబు నాత్మారాముఁ డై చరించు. 393

ప్రతిపదార్థం: వారికిన్= ఆ పండిత జనులకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; యతి= సన్న్యాసి; నిష్కా+ఆరంభమతిన్= ఆత్మనిష్కాప్రయత్నం గల బుద్ధితో; ఇలు వెడలి= గృహంనుండి వెలికివచ్చి; కోర్కులకున్+ఎల్లన్= సమస్తములైన కోరికలకూ; విముఖుఁడు+అగుచున్= పరాఙ్ముఖుడవుతూ; జనముల= ప్రజలయొక్క; కీడున్= అపకారమును; వాక్చక్షుర్మనోవర్తనములన్= మాటలు, చూపులు, మనస్సు వీటినడతలలో; కూర్పక= సంధించక; మైత్రి= మిత్రభావం; సమత= సమభావం; కరుణ= దయ; కలిగి= కలిగి ఉండి; నిందాప్రశంసలన్= తెగడిక - పొగడికలలో; ఖేదమును= దుఃఖాన్ని; ఉబ్బున్= పొంగటమూ; లేక= లేనివాడై; పాడింటనున్= పాడుపడిన ఇంటిలో; ఏకతంపుగుడిన్= ఏకాంతమైన ఆలయంలో; మ్రానిపొంతను= చెట్టుచెంతను; గుహలోనన్= కొండబిలంలో; ఉండుచున్= ఉంటూ; డంపకములకున్= దంచటానికీ; వంటకములకున్= వండటానికీ; భోజనములకున్= భుజించటానికీ; తటిఐన ప్రొద్దు= అనువైన కాలం; కడపి= దాటనిచ్చి; భిక్షన్+కొనున్= భిక్షగ్రహిస్తాడు; ప్రీతిన్= ప్రియంతో; మన్ననన్= గారవంతో; పెద్దపెట్టునట్టి ఎడన్= అధికంగా భిక్షపెట్టే చోటును; తక్కి= వర్జించి; క్రొత్తగాన్= నూతనంగా; అరుగున్= పోతాడు; నిరంతరంబున్= ఎల్లవేళల; ఆత్మారాముఁడు+ఐ= తనలో తాను క్రీడించేవాడై; చరించున్= తిరుగుతాడు.

తాత్పర్యం: హారీతుడు పండితులతో ఇట్లా అన్నాడు: 'ఆత్మనిష్ఠలో ఉద్యుక్తమైన బుద్ధిగలవాడై సన్న్యాసి ఇల్లు వదలాలి. కోర్కెలు కలిగి ఉండకూడదు. తన మాటలలో, చూపులలో, చిత్తంలో ప్రజలకు ఏ విధమైన కీడూ

తలపెట్టరాదు. మిత్రత్వం, సమత్వం, దయ కలిగి ఉండాలి. స్తుతినిందలకు పొంగటం, క్రుంగటం లేకుండా ఉండాలి. పాడుపడిన ఇంటిలోనో, ఏకాంతమైన చోట గుడిలోనో, చెట్టునీడనో, లేక కొండగుహాలోనో ఉండాలి. దంచటం, వండటం, భోజనం పనులు పూర్తి అయేసమయంవరకూ వేచిఉండి భిక్షకు పోవాలి. తనపై ఎక్కువ ప్రీతి, గౌరవం చూపుతూ మితిమించి భిక్షపెట్టే వారున్నచోటు వదలి క్రొత్తచోటికి వెళ్ళాలి. సదా ఆత్మయందే రతి గలిగి చరించాలి.

తే. అనిన వారు కృతార్థులై యతనిఁ బ్రస్తు । తించి రని చెప్పె విని నరదేవవరుఁడు

దేవతటినీ తనూజుతో 'భావశుద్ధి । కలిమి యొప్పుఁగదే!' యని పలికి మఱియు. 394

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వారు= ఆ పండితులు; కృతార్థులు+ఐ= ధన్యులై; అతనిన్= ఆ హారీతుడిని; ప్రస్తుతించిరి+అని= పొగిడారని; చెప్పెన్= చెప్పాడు; విని= ఆలకించి; నరదేవవరుఁడు= రాజశ్రేష్ముడైన ధర్మపుత్రుడు; దేవతటినీ తనూజుతోన్= గంగాపుత్రుడితో; భావశుద్ధి కలిమి= చిత్తశుద్ధి కలిగి ఉండటం; ఒప్పున్+కదే అని= శోభిస్తుంది కదా అని; పలికి= చెప్పి; మఱియున్= ఇంకనూ.

తాత్పర్యం: ఇట్లా హారీతముని చెప్పేసరికి ఆ విద్వజ్జనులు కృతకృత్యులై అతడిని పొగిడారు' అని భీష్ముడు చెప్పాడు. అది విని ధర్మరాజు భీష్ముడితో 'ఔరా! భావశుద్ధి కలిగి ఉండటం ఎంత శోభావహమైనది?' అని పలికి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. రాజభావంబు తొడుసునఁ గ్రచ్చుకొన్న । మనసుతో నుండ కెన్నఁడో మరలి యింద్రి

యముల నిర్జించి సత్త్వాదు లవులఁ ద్రోచి । యేను శాంతిసుఖంబున కెలయు టనఘ!' 395

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఏను= నేను; రాజభావంబు తొడుసునన్= రాజత్వంయొక్క సంబంధంచేత; క్రచ్చుకొన్న= చుట్టుకొని ఉన్న; మనసుతోన్= చిత్తంతో; ఉండక= వర్తించక; మరలి= ఈ స్థితినుండి తొలగి; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; నిర్జించి= జయించి; సత్త్వాదులు= సత్త్వంమొదలైన త్రిగుణాలను; అవులన్+త్రోచి= కడకునెట్టి; శాంతిసుఖంబునకున్= శాంతిచేత కలిగే ఆత్మసుఖానికి; ఎలయుట= చేరటం; ఎన్నఁడో!= ఎప్పుడో కదా!

తాత్పర్యం: కిల్బిషరహితుడవైన ఓ పితామహా! నేను రాజత్వం అనే సంబంధంతో చుట్టుకొన్న చిత్తాన్ని వదలి ఇంద్రియాలను జయించి సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలను దాటి శాంతివలన కలిగే ఆత్మసుఖాన్ని చూరగొనేది ఏనాటికో కదా!'

చ. అనుటయు నాతఁ డిట్టు లను నక్కురుభర్తకు 'వేగ మేటికిన్

ఘనభుజ? యెల్లచందములుఁ గాలముతోడివ చుమ్ము; వర్ణధ

ర్మనిరతి చిత్తపాకము గ్రమంబునఁ దెచ్చుఁ గషాయపక్వతన్

బనుపడ కర్వు డేలగు నృపాలకుమారుఁడు సన్న్యసింపఁగన్? 396

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+కురుభర్తకున్= కౌరవనాథుడైన ఆ ధర్మరాజుకు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ఘనభుజ!= మహాబాహూ!; వేగము= త్వర; ఏటికిన్?= ఎందుకు?; ఎల్లచందములు=అన్ని ప్రకారాలు; కాలముతోడివి+అ+చుమ్ము!= కాలానుసారాలే సుమా!; వర్ణధర్మనిరతి= బ్రాహ్మణాదివర్ణాలయొక్కధర్మాలలోదృఢమైనఆసక్తి;క్రమంబునన్=క్రమంగా;చిత్తపాకమున్=మనఃపరిపాకాన్ని;తెచ్చున్=తీసికొనివస్తుంది;నృపాలకుమారుఁడు=రాకుమారుడు;

కషాయపక్వతన్= చిత్తదోషాన్ని శమింపజేయటాన్ని; పనుపడక= వాడుక పడకుండా; సన్న్యసింపఁగన్= సన్న్యాసధర్మాన్ని స్వీకరించటానికి; అర్హుఁడు= తగినవాడు; ఏల+అగున్?= ఎట్లా ఔతాడు?

తాత్పర్యం: ధర్మసుతుడు అట్లా అనేసరికి భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు: 'మహాబాహుడవైన ఓ ధర్మరాజా! అన్ని విధానాలూ కాలానుగుణంగానే ఉంటాయి సుమా! వర్ణాలకు చెందిన ధర్మాలపై ఆసక్తి క్రమంగా మనస్సుకు పరిపక్వత తెస్తుంది. రాజపుత్రుడైనవాడు చిత్తదోషాన్ని శమింపజేయకుండా సన్న్యసించటానికి ఎట్లా అర్హుడు ఔతాడు?'

విశేషం: 'కషాయం చిత్తదోషం పాచయిత్వా విశ్లథం కృత్వా' అని నీలకంఠ వ్యాఖ్య - కషాయ శబ్దానికి చిత్తదోషమని భావం.

వ. ఇవ్విషయంబున వృత్రగీత యను నితిహాసంబు గలదు వినుము. వృత్రుండు భండనంబునం బడిన నెత్తికొనిపోయి పెట్టుకొని యున్న యెడ నయ్యవస్థ నొందియు విషాదంబు లేకయున్న యద్దనుజవిభునితో శుక్రుండు 'వైరిహృతవిభవుండవైన నీకు మనోవ్యథ లేమికిఁ గతంబేమి?' యని యడిగిన నతం డతని కిట్లనియె. 397

ప్రతిపదార్థం: ఈ+విషయంబునన్= ఈ విషయంలో; వృత్రగీత అను= 'వృత్రగీత' అనే; ఇతిహాసంబు= పూర్వగాథ; కలదు= ఉన్నది; వినుము= ఆలకించుము; వృత్రుండు= వృత్రాసురుడు; భండనంబునన్= యుద్ధంలో; పడినన్= పడగా; ఎత్తికొనిపోయి= లేవనెత్తికొని వెళ్ళి; పెట్టుకొని ఉన్న ఎడన్= ఉంచుకొని ఉండగా; ఆ+అవస్థన్= ఆ స్థితిని; ఒందియున్= పొందికూడా; విషాదము లేక ఉన్న= దుఃఖము లేకున్న; ఆ+దనుజవిభునితోన్= ఆ రాక్షస ప్రభువుతో; శుక్రుండు= శుక్రాచార్యుడు; వైరిహృతవిభవుండవు+ఐన= శత్రువులచేత అపహరించబడిన సంపదకలవాడవగు; నీకున్= వృత్రుడవైన నీకు; మనోవ్యథ= చిత్తబాధ; లేమికిన్= లేకుండుటకు; కతంబు+ఏమి?= కారణమేమి?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ వృత్రుడు; అతనికిన్= ఆ శుక్రుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి సంబంధించినది 'వృత్రగీత' అనే ఇతిహాసం ఒకటి ఉన్నది. వినుము. వృత్రాసురుడు యుద్ధంలో పడిపోగా అనుచరులు అతడిని లేవనెత్తుకొనిపోయి పెట్టుకొని ఉన్నారు. అట్టి దురవస్థ పొంది కూడా వృత్రుడు ఏ విధమైన విషాదం లేకుండా ఉన్నాడు. అప్పుడు గురువైన శుక్రుడు ఆ రాక్షసరాజుతో 'శత్రువులు నీ సంపదను హరించినా నీకు చిత్తబాధ లేకుండా ఉండటానికి కారణమేమి?' అని ప్రశ్నించాడు. అప్పుడు అతడితో వృత్రాసురుడు ఈ రీతిగా చెప్పాడు.

వృత్రగీత (సం. 12-270-13)

తే. కలిమియును లేమియును విను కాలవశగ । తములు; బోధవిహీనుల దర్ప దైన్య
కలితసుఖదుఃఖములఁ బెట్టుఁగాక యర్థ । ముల యనిత్యత యెఱిఁగినఁ గలదె వికృతి? 398

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; కలిమియును= సంపదయు; లేమియును= పేదరికమును; కాలవశగతములు= కాలానికి అధీనాలు; (అవి), బోధవిహీనులన్= జ్ఞానం లేనివారిని; దర్పదైన్యకలిత సుఖదుఃఖములన్= గర్వం, దీనత్వంతో కూడిన సుఖంలోనూ, దుఃఖంలోనూ; పెట్టుఁగాక= ఉంచును గాక; అర్థముల= సంపదలయొక్క; అనిత్యత= అశాశ్వతత్వం; ఎఱిఁగినన్= తెలుసుకొంటే; వికృతి= వికారం; కలదు+ఏ?= ఉన్నదా?

తాత్పర్యం: సంపద, పేదరికం అనేవి కాలానికి అధీనమై ఉంటాయి. అవి జ్ఞానంలేని మూఢులకు మదాన్నీ, దీనత్వాన్నీ కల్గిస్తాయి. తద్ద్వారా వారి సుఖానికీ, దుఃఖానికీ హేతువు లవుతాయి. అంతేకాని సంపదలు శాశ్వతం కావు అని తెలిసికొన్న జ్ఞానికి అవి ఉన్నా, లేకున్నా ఎట్లాంటి వికారమూ కలుగదు.

వ. అర్థంబుల యస్థిరత్వంబ కా దాకర్ణింపుము. 399

ప్రతిపదార్థం: అర్థంబుల= సంపదలయొక్క; అస్థిరత్వంబ కాదు= అశాశ్వతమే కాదు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: సంపదలయొక్క అశాశ్వత్వమే కాదు. ఇంకా వినుము.

క. దైవతమానుష తిర్య । గ్భావంబులఁ బొందుచును వికారిణియై భూ
తావలి దిరిగిన వెంటన । వే విధములఁ దిరుగుఁ గర్మవివశత్వమునన్. 400

ప్రతిపదార్థం: భూత+ఆవలి= ప్రాణులయొక్క సమూహం; దైవతమానుషతిర్యగ్భావంబులన్= దేవత్వం, మనుష్యత్వం, పశుత్వం అనే భావాలను; పొందుచును= పొందుతూ; కర్మవివశత్వమునన్= కర్మకు అధీనం కావటం వలన; వికారిణి+ఐ= వికారం కలదై; తిరిగిన వెంటన్+అ= పోయిన మార్గంలోనే; వేవిధములన్= వెయ్యి విధాలుగా; తిరుగున్= సంచరిస్తుంది.

తాత్పర్యం: ప్రాణుల బృందం దేవతలుగా, మనుష్యులుగా, పశుపక్ష్యాదులుగా జన్మిస్తూ కర్మకు లొంగి వికారం పొంది సంచరించిన మార్గంలోనే మరల మరల వేయివిధాల సంచరిస్తూ ఉంటుంది.

క. ఏ నిది యంతయు నెఱుఁగుదుఁ । గాన వగపు నుబ్బు నాకుఁ గలుగ' వనుడు ని
మ్మాన విహీనపు మాటలు । దానవకులనాథ! నీకుఁ దగునే యాడన్.' 401

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇదిఅంతయున్= దీనినంతటినీ; ఎఱుఁగుదున్= తెలిసికొని ఉన్నాను; కాన= కావున; వగపు= విచారం; ఉబ్బు= సంతసం; నాకున్+కలుగవు= నాకు సంభవించవు; అనుడున్= అనగా; దానవకులనాథ!= రాక్షసకుల రాజా!; ఈ+మానవిహీనపు మాటలు= అభిమానంలేని ఈ పలుకులు; నీకున్ ఆడన్+తగునే?= నీకు చెప్పదగినవా?

తాత్పర్యం: ఈ విషయమంతా నాకు తెలుసు. అందువలన ఏది ఏమైనా నాకు సుఖదుఃఖాలు కలుగవు' అని వృత్రు డన్నాడు. అది విని 'రాక్షసవంశాధిపా! మానం లేని ఈ మాటలు చెప్పటం నీకు ఉచితమా?'

వ. అని యతని మనశ్శుద్ధి యెఱుంగుటకునై భార్గవుండు. 402

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; భార్గవుండు= శుక్రుడు; అతని మనశ్శుద్ధిన్= ఆ వృత్రాసురుడి చిత్తశుద్ధిని; ఎఱుంగుటకున్+ఐ= తెలిసికొనటానికై.

తాత్పర్యం: అని చెప్పి శుక్రాచార్యుడు ఆ వృత్రుడి చిత్తశుద్ధి ఎట్లాంటిదో తెలిసికొనటానికై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనయము నీసువొనర్చిన । విని యతనికి నిట్టు లనియె వృత్రుఁడు 'విజయం
బునకు నయి తపము సేయనె । మును? తత్సుకృతమునఁ గొననె మూఁడు జగములున్? 403

ప్రతిపదార్థం: అనయమున్= మిక్కిలి; ఈసు+పొనర్చినన్= ఈర్ష్య ప్రదర్శించగా; విని= ఆలకించి; వృత్రుఁడు= వృత్రాసురుడు; అతనికిన్= ఆ శుక్రుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; మును= పూర్వం; విజయంబునకున్+అయి= యుద్ధంలో విజయం

పొందటానికై; తపము చేయనె?= తపస్సు చేసినవాడనుగానా?; తత్సుకృతమునన్= ఆ తపస్సు అనే పుణ్యంచేత; మూఁడు జగములున్= త్రిలోకాలనూ; కొననె?= చేకొన్నానుకదా!

తాత్పర్యం: అత్యంతం ఆ మాటలతో శుక్రుడు ఈర్ష్య ప్రదర్శించగా అతడి మాటలు విని వృత్రుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'నేను పూర్వం యుద్ధంలో విజయం పొందటానికై తపస్సు చేయలేదా? ఆ తపఃప్రభావంవలన కలిగిన పుణ్యంతో ముల్లోకాలకూ ప్రభువును కాలేదా?

క. ఆ యైశ్వర్యము గ్రమ్మఱి । మాయుటకుం గారణంబు మాన్యచరిత! లే
దే యొక దుష్కృత; మది యిటు । సేయుం గాకేమి? యేల చింతింపంగన్? **404**

ప్రతిపదార్థం: మాన్యచరిత!= పూజ్యచరిత్రుడా!; క్రమ్మఱిన్= మరల; ఆ+ఐశ్వర్యము= ఆ సంపద; మాయుటకున్= తొలగిపోవటానికి; కారణంబు= హేతువు; ఒక దుష్కృతంబు= ఒక పాపం; లేదే?= లేదా?; అది= ఆ పాపం; ఇటు= ఇట్లు; చేయున్+కాక+ఏమి= ఒనర్చునుగాక ఏమి?; చింతింపంగన్+ఏల?= విచారించట మెందుకు?

తాత్పర్యం: పూజ్యచరిత్రుడవైన ఓ ఆచార్యా! పూర్వం అనుభవించిన ఆ సంపద ఇప్పుడు తొలగింది. దీనికి కారణమన్న పాపం లేకుండునా? ఆ పాపం ఇట్లా చేస్తుంది. చేస్తే చేయనీ! ఇందుకై విచారించటం ఎందుకు?

క. వినుము మనఘ! యింక సుకృతం । బునకుం జొర దుష్కృతంబు పాంతకుఁ బోనే
ననుపము నచ్యుతు నవ్యయు । ననంతుఁ జెందెద ననామయత నవ్విష్ణున్. **405**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆకర్ణించుము; ఏను= నేను; ఇంకన్= ఇకమీదట; సుకృతంబునకున్= పుణ్యానికి; చొరన్= ప్రవేశింపను; దుష్కృతంబు పొంతకున్= పాపం చెంతకును; పోను= చనను; అనుపమున్= సాటిలేనివాడిని; అచ్యుతున్= భక్తరక్షణంలో జారుపాటు లేనివాడిని; అవ్యయున్= వ్యయం లేనివాడిని; అనంతున్= అంతం లేనివాడిని; ఆ+విష్ణున్= ఆ విష్ణుదేవుడిని; అనామయతన్= బెడదలేకుండా; చెందెదన్= పొందుతాను.

తాత్పర్యం: పాపరహితుడవయిన ఓ ఆచార్యా! వినుము. ఇంకమీద నేను పాపపుణ్యాల వంకకు పోను. తనకు సాటి లేనివాడూ, చ్యుతి లేనివాడూ, వ్యయం లేనివాడూ, శాశ్వతుడూ, తుది లేనివాడూ, సర్వవ్యాపకుడూ అయిన విష్ణుదేవుడిని ఏ చిక్కులు లేని పద్ధతిలో ఆశ్రయిస్తాను.

చ. అనిమిషనాథుతోడి యనియప్పుడు గంటి ననంతు నాద్యు వి
ష్ణుని నలవోకఁ దన్మహిమ సువ్రత! నా కెఱిఁగింపు; కర్మసం
జనితవిశేషతం గలుగు చాయలలోపల నెద్ది యవ్విభుం
గనుటకు నర్హ మయ్యెఱుక గల్గఁగఁ జేయుము నాదు బుద్ధికిన్.' **406**

ప్రతిపదార్థం: సువ్రత!= మంచి వ్రతంకలవాడా!; అనిమిషనాథుతోడి= ఇంద్రుడితోడి; అని అప్పుడు= యుద్ధసమయంలో; అనంతున్= అంతంలేనివాడిని; ఆద్యున్= అంతటికీ మొదటివాడైన వాడిని; విష్ణునిన్= సర్వవ్యాపకుడైన వాడిని; అలవోకన్= లీలగా; కంటిన్= చూచాను; తన్మహిమన్= ఆ విష్ణుదేవుడి ప్రభావం; నాకున్+ఎఱిఁగింపు= నాకు తెలియజెప్పుము; కర్మసంజనిత విశేషతన్= కర్మం వలన కలిగే విశేషప్రక్రియలచేత; కలుగు= సంభవించే; చాయలలోపలన్= జాడలలో, (వర్ణాలలో); ఎద్ది= ఏది; ఆ+విభున్= ఆ విష్ణుదేవుడిని; కనుటకున్= చూడటానికి; అర్హము= తగినదో; ఆ+ఎఱుకన్= ఆ తెలివిని; నాదు బుద్ధికిన్= నా మతికి; కల్గఁగన్+చేయుము= కలిగించుము.

తాత్పర్యం: సద్వ్రతశీలుడవైన ఓ శుక్రాచార్యా! నేను ఇంద్రుడితో సంగరం చేసినప్పుడు లీలగా అనంతుడూ, ఆద్యుడూ అయిన విష్ణువును చూచాను. ఆయన మహిమ నాకు తెలియచెప్పుము. కర్మలవలన పెక్కు వర్ణాలు (జీవావస్థలు) ఏర్పడతాయి. అందులో ఏ వర్ణం ఆ దేవుడిని చూడటానికి మిక్కిలిగా తగి ఉన్నదో నా బుద్ధికి గోచరించేటట్లు వివరించుము.

ఆ. అనిన 'నట్లకాక వినుము చెప్పెద'నని । యసురగురుఁడు పలుకు నవసరమున
నచటి కరుగుదెంచె నఖిల మునీంద్ర స । మ్మాన్యుఁ డగు సనత్కుమారుఁ డధిప! 407

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనినన్= అని వృత్రుడు అడుగగా; అసురగురుఁడు= రాక్షసుల గురువైన శుక్రుడు; అట్లకాక= అట్లే అగుగాక!; చెప్పెదన్= చెప్పుతాను; వినుము అని= ఆలకించుము అని; పలుకు+అవసరమునన్= చెప్పే సమయంలో; అఖిలమువి+ఇంద్ర సమ్మాన్యుఁడు+అగు= సమస్త మునివర్యులచేత పూజించదగినవాడైన; సనత్కుమారుఁడు= సనత్కుమారుడనే బ్రహ్మమానసపుత్రుడు; అచటికిన్= ఆ చోటికి; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా వృత్రుడు ప్రశ్నించగానే రక్కసులకు ఆచార్యుడైన శుక్రుడు 'అట్లాగే విష్ణుడి మహిమను విశదీకరిస్తాను, వినుము' అని అన్నాడు. అత డట్లా అంటూ ఉండగానే అక్కడికి మునిశ్రేష్ఠులందరి చేతను పూజించదగిన బ్రహ్మమానసపుత్రుడు సనత్కుమారుడు వచ్చాడు.

వ. వచ్చి యభిపూజితుండై సమున్నతాసనంబున నున్న యమ్మహాత్మునితో శుక్రుండు 'విష్ణుని మాహాత్మ్యంబును
వర్ణవిశేషంబులు నిద్దానవేంద్రునకు నెఱింగింపవే!' యనిన నతండు ప్రసన్నవదనుం డగుచు నిట్లనియె.408

ప్రతిపదార్థం: వచ్చి= ఏతెంచి; అభిపూజితుండు+ఐ= అన్నివిధాలా పూజించబడినవాడై; సమున్నత+ఆసనంబునన్= ఎత్తైన పీఠిక పై; ఉన్న= కూర్చున్న; ఆ+మహాత్మునితోడన్= ఆ మహనీయుడితో; శుక్రుండు= శుక్రాచార్యుడు; విష్ణుని మాహాత్మ్యంబును= వెన్నుడి మహిమనూ; వర్ణవిశేషంబులన్= రంగులలోని తేడాలనూ; ఈ+దానవేంద్రునకున్= ఈ రాక్షసరాజుకు; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనినన్= అని అడుగగా; అతండు= ఆ సనత్కుమారుడు; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహపూర్ణమైన ముఖం కలవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ రీతిగా వచ్చిన సనత్కుమారుడికి రక్కసులరేడు పూజాదులు కావించాడు. ఆపై ఉన్నతాసనంపై ఆ మునీంద్రుడు కూర్చున్నాడు. శుక్రుడు ఆయనతో 'ఈ వృత్రాసురుడికి విష్ణుదేవుడి మాహాత్మ్యాన్నీ, వర్ణవిశేషాలనూ తెలియజెప్పు'మని అర్థించాడు. అప్పుడు ప్రసన్నమైన ముఖంతో సనత్కుమారుడు ఇట్లా చెప్పాడు.

ఆ. 'వినుము దనుజనాథ! విష్ణునియం దఖి । లంబుఁ గలుగు నిలుచు లయముఁ బొందు;
నతనిభక్తి నింద్రియ జయంబునను బోలె । దానధర్మవిధులఁ గానరాదు. 409

ప్రతిపదార్థం: దనుజనాథ!= రక్కసులరేడా!; వినుము= ఆలకించుము; విష్ణుని+అందున్= వెన్ననిలో; అఖిలంబున్= సమస్తమున్నూ; కలుగున్= ఉదయిస్తుంది; నిలుచున్= నిలిచి ఉంటుంది; లయమున్+పొందున్= లయిస్తుంది; అతనిన్= ఆ దేవుడిని; భక్తిన్= భక్తిచేతా; ఇంద్రియజయంబుననున్+పోలెన్= ఇంద్రియాలను నిగ్రహించటంచేత వలె; దానధర్మవిధులన్= త్యాగం, ధర్మం మొదలైన విధానాలచేత; కానన్ రాదు= చూడటానికి సాధ్యంకాదు.

తాత్పర్యం: రాక్షసరాజా! వినుము. విష్ణుడిలోనే ఈ సమస్త చరాచరాత్మక జగత్తూ ఉదయిస్తుంది. అతడిలోనే నిలిచి ఉంటుంది. చివరికి ఆ దేవుడిలోనే లీనమవుతుంది. భక్తితోనూ, ఇంద్రియవిజయంతోనూ ఆ దేవుడిని సందర్శించవచ్చును గాని, దానం, ధర్మకార్యాలు మొదలైన వాటిద్వారా చూడటానికి సాధ్యంకాదు.

వ. అవి ప్రయోజన పడుటయుం గలిగి యుండు; నదియునుం జెప్పెద; మున్ను విష్ణుని మహిమ యాకర్ణింపుము. 410

ప్రతిపదార్థం: అవి= ఆ దాన ధర్మాదులు; ప్రయోజనపడుటయున్= అక్కరకు రావటం; కలిగిఉండున్= సంభవిస్తుంది;అదియున్= ఆ విషయం కూడ; చెప్పెదన్= వివరిస్తాను; మున్ను= ముందు; విష్ణునిమహిమ= వెన్నుని ప్రభావం; ఆకర్ణింపుము= విను.

తాత్పర్యం: ఆ దానాది ధర్మకార్యాలు కూడా ప్రయోజనం కలిగియే ఉన్నాయి. దానిని కూడా చెప్పుతాను. ముందుగా విష్ణుడి ప్రభావ మెటువంటిదో చెప్పుతాను వినుము.

తే. ధరణి పాదంబు లతనికి శిరము దివము । దిశలు బాహు లతఁడు సర్వదేవమయుఁడు
భూతవిక్షేప సంహారములు దదీయ । మానసస్ఫైరలీలలు దానవేంద్ర! 411

ప్రతిపదార్థం: దానవేంద్ర!= రాక్షసరాజా!; అతనికిన్= ఆ విష్ణువునకు; ధరణి= భూమి; పాదంబులు= కాళ్ళు; దివము= ఆకాశం (స్వర్గం); శిరము= తల; దిశలు= దిక్కులు; బాహులు= చేతులు; అతఁడు= ఆ విష్ణువు; సర్వదేవమయుఁడు= సకల దేవతాస్వరూపుడు; భూతవిక్షేపసంహారములు= ప్రాణుల సృష్టి మరియు సంహారాలు; తదీయ మానసస్ఫైరలీలలు= ఆ దేవుడి చిత్తముయొక్క స్వేచ్ఛావిలాసాలు.

తాత్పర్యం: రాక్షసనాథా! విష్ణువుకు భూమి - పాదాలు, ఆకాశం (స్వర్గం) - తల, దిక్కులు - భుజాలు. ఆ దేవుడు సర్వదేవతాస్వరూపుడై ఉన్నాడు. ప్రాణులను సృష్టించటం, సంహరించట మనేవి ఆయన చిత్తంలో సంభవించే స్వేచ్ఛాలీలావిలాసాలు.

వ. వినుము జీవావస్థలు ఛాయలై యుండుఁ గృష్ణంబును, ధూమ్రంబును, హరితంబును, హారిద్రంబును, రక్తంబును, శుక్లంబును నైనవి యాఱుగల వద్దశా విశేషంబులు. 412

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; జీవ+అవస్థలు= కర్మవిశేషంవలన కలిగే జీవుల దశలు; ఛాయలు= వర్ణాలు; ఐ+ఉండున్= అయి ఉంటాయి; ఆ+దశావిశేషంబులు= ఆ అవస్థాభేదాలు; కృష్ణంబునున్= నలుపును; ధూమ్రంబునున్= నలుపుమించిన ఎరుపును; హరితంబునున్= ఆకుపచ్చరంగును; హారిద్రంబునున్= పసుపువర్ణమును; రక్తంబునున్= ఎరుపును; శుక్లంబునున్= తెలుపును; ఐనవి= అయి ఉన్నవి, ఆఱు= ఆరుసంఖ్య గలవి; కలవు= ఉన్నాయి.

తాత్పర్యం: వివరిస్తాను వినుము. కర్మవిశేషం వలన జీవులకు అవస్థాభేదాలు కలుగుతాయి. అవి వర్ణాలుగా రూపొంది ఉంటాయి. అట్టి భేదాలు ఆరున్నాయి. అవి క్రమంగా నలుపు, నలుపుమించి కలసిన ఎరుపు, ఆకుపచ్చరంగు, పసుపురంగు, ఎరుపు, తెలుపు అనబడతాయి.

తే. అనఘ! విష్ణువిహారంబు లైన విషమ । వివిధ విక్షేప సంహారవృత్తులందు
భ్రమణ మొందెడి జీవుని బహుళకర్మ । ముల వశంబున నాతనిఁ బొందుచుండు. 413

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విష్ణువిహారంబులు+ఐన= విష్ణుదేవుడి విహరణా లైనటువంటి; వివిధ విక్షేపసంహార వృత్తులందున్= నానావిధాలైన సృష్టిసంహారవ్యాపారాలలో; భ్రమణము= తిరుగుటను; ఒందెడి= పొందెడి; జీవుని= జీవాత్మయొక్క; బహుళకర్మముల వశంబునన్= అనేక కర్మలవలన; ఆతనిన్= ఆ జీవుడిని; పొందుచుండున్= (పై చెప్పిన దశావిశేషాలు) ప్రాప్తిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: పాపరహితుడవైన వృత్రాసురుడా! నానావిధాలైన సృష్టిసంహారాలు విష్ణువు విహారవిలాసాలై ఉన్నాయి. జీవుడు వాటిలో పరిభ్రమిస్తూ ఉంటాడు. అతడి కర్మల ఫలితంగా పైన పేర్కొన్న ఆరు అవస్థాభేదాలు అతడిని పొందుతూ ఉంటాయి.

తే. తన్ను నుత్తమ మధ్యమాధమము లైన । ఛాయ లొందంగఁ బ్రచుర పర్యాయవృత్తి
జీవుఁ డమరత్వ ముఖ్యనానావిధముల । నొంది యెక్కుచు డిగ్గుచు నుండుఁ జూవె. 414

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్ముడు; తన్నున్= తనను; ఉత్తమ మధ్యమ+అధమములు+ఐన= శ్రేష్ఠం, మధ్యమం, నీచం అయిన; ఛాయలు= వర్ణాలు; ప్రచురపర్యాయవృత్తిన్= ఆధిక్యక్రమవర్తన ననుసరించి; ఒందఁగన్= పొందగా; అమరత్వ ముఖ్యనానావిధములన్= దేవత్వం మొదలైన అనేక స్థితులను; ఒంది= పొంది; ఎక్కుచున్= పైకిపోతూ; డిగ్గుచున్= క్రిందికివస్తూ; ఉండున్+చూవె!= ఉంటాడు సుమా!

తాత్పర్యం: జీవుడిని ఉత్తమం, మధ్యమం, నీచం అనే దశాభేదాలు క్రమానుగుణంగా పొందుతూ ఉంటాయి. దానిని బట్టి అతడు దేవత్వం, మనుష్యత్వం, మొదలైన అవస్థలు పొంది పైకీ, క్రిందికీ పరిభ్రమిస్తూ ఉంటాడు సుమా!

క. మే లొనరింపఁగ దొరకొను । మేలిమి గలచాయ కీడు మెయికొని చేయన్
లోలత్వరహిత! చాయకుఁ । జాలం గీడ్పాటు వొలయు చందము వచ్చున్. 415

ప్రతిపదార్థం: లోలత్వరహిత!= చాంచల్యం లేనివాడా!; మేలు+ఒనరింపఁగన్= మంచిపని చేయగా; మేలిమికల= శ్రేష్ఠమైన; చాయ= వర్ణం; దొరకొనున్= సంభవిస్తుంది; మెయికొని= పూనుకొని; కీడు= అపకారం; చేయన్= చేయగా; చాయకున్= వర్ణానికి; చాలన్= మిక్కిలి; కీడ్పాటు+పొలయు= చేటు ఘటిల్లే; చందము వచ్చున్= పద్ధతి సంభవిస్తుంది.

తాత్పర్యం: చాపల్యం లేని వృత్రుడా! ఎవడు ఇతరులకు మేలు చేస్తాడో వాడికి మంచి వర్ణం సిద్ధిస్తుంది. అట్లా కాక ఇతరులకు అపకారం చేసేవాడికి వచ్చే వర్ణం కూడా అధమమై ఉంటుంది.

వ. కావునన్. 416

తాత్పర్యం: కాబట్టి.

క. రసకర్మజ్ఞుఁడు దారము । పసిండి సేఁతకుఁ బ్రయత్నపరుఁడై శుద్ధ
త్వసమగ్రము సేయుక్రియ । న్విసువక పరిశుద్ధి జీవునికిఁ జేయు టురున్. 417

ప్రతిపదార్థం: రసకర్మజ్ఞుఁడు= రసవాదక్రియ తెలిసినవాడు; దారమున్= సూత్రమును; పసిండిసేఁతకున్= బంగారుగా చేయటానికి; ప్రయత్నపరుఁడు+ఐ= ఉద్యమం చేసేవాడై; శుద్ధత్వసమగ్రము= నైర్మల్య సంపన్నం; చేయు క్రియన్= చేసేటట్లు; విసువక= విసుగు చెందక; జీవునికిన్= జీవాత్ముడికి; పరిశుద్ధిన్+చేయుట= నిర్మలత్వం ఆపాదించటం; ఉరున్= తగి ఉంటుంది.

తాత్పర్యం: రసవాదక్రియా కలాపం తెలిసినవాడు దారాన్ని బంగారుగా మార్చటానికి ప్రయత్నిస్తూ దానికి శుద్ధిగల్గించి నట్లే జీవుడికి శ్రేయస్సు కలిగించటానికై మలవిక్షేపాది దోషాలు లేకుండా చేయటం ఉచిత మవుతుంది.

క. వినుఁ కుసుమంబుల వాసిం । చిన నొప్పని కంపు విడిచి చెందును సౌర
భ్య నిరూఢిం దిలలట్టుల । యనఘా! సుకృతముల జీవుఁ డకలంకుఁ డగున్. 418

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుఁ= ఆలకించుము; తిలలు= నువ్వులు; కుసుమంబులన్= పువ్వులలో; వాసించినన్= ఉంచితే, వాసెన కట్టుకట్టితే; ఒప్పని కంపున్= దుర్గంధమును; విడిచి= వదలి; సౌరభ్యనిరూఢిన్= సువాసనా ప్రశస్తిని; చెందును= పొందుతాయి; అట్టుల= అట్లే; జీవుఁడు= జీవాత్ముడు; సుకృతములన్= పుణ్యకార్యాలచేత; అకలంకుఁడు+అగున్= మాలిన్యం లేనివాడవుతాడు.

తాత్పర్యం: పాపంలేనివాడా! నువ్వులను మంచిగంధంగల పూలలో వాసెన కట్టు కట్టితే దుర్గంధం వదలి సుగంధం కలవిగా అవుతాయి. అట్లే పుణ్యకార్యాలచేత జీవుడు మాలిన్యం వీడి పవిత్రుడవుతాడు.

విశేషం: అలం: ఉపమ.

క. అంతంతకు సత్కర్మము । లెంతయుఁ బెనుపొంద జీవుఁ డెక్కుడు చాయన్
జింతా కలుషము వాయఁగ । సంతోషామృతము నాని సంశుద్ధుఁ డగున్. 419

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్ముడు; అంతకున్+అంతకున్= అంతకంతకు; సత్కర్మములు= సుకృతాలు; ఎంతయున్= మిక్కిలిగా; పెనుపొందన్= వృద్ధిపొందగా; ఎక్కుడు చాయన్= మేలైన వర్ణంతో; చింతాకలుషము= వగపు అనే కాలుష్యం; పాయఁగన్= తొలగిపోగా; సంతోష+అమృతమున్= హర్షమనే సుధను; ఆని= త్రాగి; సంశుద్ధుడు+అగున్= పరిశుద్ధ డవుతాడు.

తాత్పర్యం: ఎంతకెంతకు జీవుడు పుణ్యకార్యాలు చేస్తాడో, అంతకంతకు మేలైన వర్ణాన్ని అతడు పొందుతాడు. దానివలన అతడి దుఃఖం తొలగుతుంది. సంతోషసుధను ఆస్వాదించి అతడు నిర్మలు డవుతాడు.

వ. ఎక్కుడు చాయ శుక్లత్వంబు. 420

ప్రతిపదార్థం: ఎక్కుడు చాయ= శ్రేష్ఠవర్ణం; శుక్లత్వంబు= తెలుపు.

తాత్పర్యం: పైన నిర్దేశించిన ఆరు రంగులలో తెలుపు మేలైన వర్ణం.

క. జీవుఁడు శుక్లచ్ఛాయా । భావితుఁడైనపుడు విష్ణు భావించుటకున్
దా వెరవరి యగుఁ దద్గత । భావ మొసఁగు గుఱుము లేని పండగునెలవున్.' 421

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ; శుక్లచ్ఛాయాభావితుఁడు+ఐనపుడు= ధవళవర్ణవాసితుడైన సమయంలో; విష్ణున్= వెన్నుని; భావించుటకున్= ధ్యానించటానికి; తాన్= తాను; వెరవరి+అగున్= ఉపాయశాలి అవుతాడు; తద్గతభావము= విష్ణుడి యందు సక్తమైన ధ్యానం; గుఱుము లేని= గింజలేని; పండు+అగు= ఫలమైన; నెలవున్= స్థానమును; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: జీవుడు ఎప్పుడు శుక్లవర్ణ వాసితమైన చిత్తవృత్తి గలవాడవుతాడో, అప్పు డతడు విష్ణువు నందు ధ్యానం కలిగినవాడవుతాడు. విష్ణుధ్యానం గింజలేని పండువంటి ఉత్తమస్థితిని కలిగిస్తుంది. (పండులో గింజగల భాగం వదలి తక్కిన భాగమునే అనుభవిస్తారు. గింజలేని పండు మొత్తం ఆనందజనకమై ఉంటుందని భావం)'.

విశేషం: 'గురుము' అనే పదానికి 'గుఱుతు' అనే పాఠాంతరం ఉన్నది. 'గురుతు లేని పండు' అన్న పాఠానికి మచ్చలేని ఫలమని అర్థం.

వ. అనిన విని వృత్రుం 'డదీనంబులు, నమృతస్వరూపంబులు నగు భవదీయ వచనంబులు వినికింజేసి విశుద్ధుండనైతి' నని పలికి ప్రాణంబులు విడిచి విష్ణునిం బొందె' నని చెప్పుటయు, నప్పాండవేయాగ్రజుండు 'వృత్రుని విజ్ఞానంబును, విష్ణుభక్తియు నింత యొప్పునే?' యని యగ్గించి, 'యతండును, నాఖండలుండును భండనంబు సేసిన తెఱం గెఱింగింపవే' యనుటయు ననిమిషనదీనందనుం డతని కిట్లనియె. 422

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; వృత్రుండు= వృత్రాసురుడు; అదీనంబులు= దైన్యంలేనివి; అమృత స్వరూపంబులున్= సుధాసదృశములు; అగు= అయిన; భవదీయవచనంబులు= నీమాటలు; వినికిన్+చేసి= వినటంవలన; విశుద్ధుండన్+ఐతిన్+అని= పరిశుద్ధుడనయ్యాను అని; పలికి= వచించి; ప్రాణంబులు= అసువులు; విడిచి= వదలి; విష్ణునిన్= వెన్నుని; పొందెన్= చేరాడు; అని చెప్పుటయున్= అని చెప్పగా; ఆ+పాండవేయ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ఆ ధర్మజుడు; వృత్రుని= వృత్రాసురుడియొక్క; విజ్ఞానంబును= విశేషజ్ఞానమూ; విష్ణుభక్తియున్= మాధవుడిపై గల భక్తియు; ఇంత ఒప్పునే?= ఇంతగా భాసించిందా?; అని+అగ్గించి= అని ప్రశంసించి; అతండునున్= ఆ వృత్రుడూ; ఆఖండలుండును= ఇంద్రుడూ; భండనంబు చేసిన= యుద్ధంచేసిన; తెఱంగు= పద్ధతి; ఎఱింగింపవే అనుటయున్= తెలుపుమనగానే; అనిమిషనదీనందనుండు= దేవనదీపుత్రుడు- భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: సనత్కుమారుడు అట్లా చెప్పగా విని వృత్రాసురుడు 'ధైర్యం కలిగించేవీ, అమృతతుల్యములూ అయిన నీ మాటలు విని 'నేను పరిశుద్ధుడ నయ్యాను' అని చెప్పి ప్రాణాలు వదలి విష్ణు సన్నిధి చేరుకొన్నాడు' అని భీష్ముడు చెప్పగా విని ధర్మజుడు 'వృత్రాసురుడి విజ్ఞానమూ, విష్ణుభక్తీ ఇంతగా రాణించాయే' అని ప్రశంసించాడు. తరువాత 'వృత్రుడు, ఇంద్రుడు ఎట్లా యుద్ధం చేశారో తెలుపు' మని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ము డతడితో ఇట్లా అన్నాడు:

ఇంద్రవృత్రాసురుల యుద్ధప్రకారము (సం. 12-272-7)

సీ. 'ఇంద్రుఁ డుజ్జ్వలరథం బెక్కి దేవానీక । సహితుఁడై వృత్రుపైఁ జన నతండు
దనుజసైన్యముఁగొని తాఁకెఁ; దత్సంగర । మవ్వాసవునకు భయం బొనర్చెఁ;
బర్వత ప్రతిమరూపమున నయ్యసుర యు । గ్రతఁ జూచి వడఁకు దైవతకులేంద్రు
నద్దానవుండు మాయాబలంబున మోహి । తునిఁ జేయ సాగయుడు ముని సమాజ

తే. సంస్తుతముగ రథంతరసామశక్తిఁ । జేసి యమ్మూర్ఛదేర్చి వసిష్ఠుఁ డతని
తోడ నజుఁడును హరియు రుద్రుండుఁ బోరు । గనుఁగొనంగ వచ్చినవారు గడఁగు మనుడు. 423

ప్రతిపదార్థం: ఇంద్రుఁడు= వాసవుడు; ఉజ్జ్వలరథంబున్= ప్రకాశించే అరదాన్ని; ఎక్కి= అధిష్ఠించి; దేవానీకసహితుఁడు+ఐ= దేవసైన్యంతో కూడినవాడై; వృత్రుపైన్= వృత్రాసురుడిమీదికి; చనన్= దండెత్తిపోగా; అతండు= ఆ వృత్రుడు; దనుజసైన్యమున్+కొని= రాక్షససైన్యాన్ని వెంటకొని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; తత్సంగరము= ఆ యుద్ధం; ఆ+వాసవునకున్= ఆ ఇంద్రుడికి; భయంబు+ఒనర్చెన్= భీతి కలిగించింది; ఆ+అసుర+ఉగ్రతన్= ఆ రక్కసుడి ఉగ్రత్వమును; పర్వతప్రతిమరూపమునన్= కొండవంటి రూపుతో; చూచి= విలోకించి; వడఁకు= చలిస్తున్న; దైవతకుల+ఇంద్రున్= దేవతల సమూహానికి ప్రభువైన ఇంద్రుడిని; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; మాయాబలంబునన్= మాయయొక్క బలంతో; మోహితునిన్+చేయన్= మోహగ్రస్తుడిని చేయగా; సాగయుడున్= (ఇంద్రుడు) మూర్ఛిల్లగా; వసిష్ఠుఁడు= వసిష్ఠమహర్షి; ముని సమాజసంస్తుతముగన్=

మునుల సమూహం స్తుతించేటట్లు; రథంతరసామశక్తిన్+చేసి= రథంతరమనే సామ మంత్రంయొక్క ప్రభావంచేత; ఆ+మూర్ఛన్+తేర్చి= సామ్మనుండి తేరుకొనేటట్లు చేసి; అతనితోడన్= ఆ ఇంద్రుడితో; అజుఁడును= బ్రహ్మయు; హరియున్= విష్ణువును; రుద్రుండున్= శివుడును; పోరు= యుద్ధమును; కనుఁగొనంగన్ వచ్చినవారు= చూడటానికి వచ్చారు; కడఁగుము= ఉద్యమించుము; అనుడున్= అని చెప్పగా.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రకాశించే రథం అధిష్ఠించి దేవతాసైన్యంతో సహా వృత్రుడిపైకి సమరానికి వెళ్ళాడు. వృత్రుడు రాక్షససైన్యంతో సహా ఇంద్రుడిని మార్కొని యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఆ యుద్ధం ఇంద్రుడికి భీతి కల్గించింది. పర్వతాకారుడై భయంకరంగా ఉన్న వృత్రాసురుడి ఉగ్రరూపం చూచి ఇంద్రుడు గడగడ వణకసాగాడు. అప్పుడా రాక్షసరాజు అతడిని మాయాశక్తితో మూర్ఛితుడిని చేశాడు. అంతట వసిష్ఠుడు మునులు తనను పొగడుతుండగా రథంతరసామ మంత్రాల ప్రభావంతో ఇంద్రుడిని మూర్ఛనుండి తేరుకొనేటట్లు చేశాడు. తరువాత అతడితో 'బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు ఈ యుద్ధం చూడాలని వచ్చారు. సన్నద్ధుడవు కమ్ము!' అని చెప్పి యుద్ధానికి పురికొల్పాడు.

చ. అతఁడు గడంగ దేవగురుఁ డప్డు మునీంద్రులుఁ దాను నమ్మరు
త్పతి విజయంబు గోరి హరుఁ బ్రార్థన సేయఁ దదీయతేజ ము
ద్ధత చటులజ్వరం బగుచు దైత్యపతిం బొదివెన్ సురేశ్వరో
ద్యతకులిశంబుఁ బొందె హరి దత్సమయంబునఁ గౌరవేశ్వరా! 424

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కౌరవులకు నాథుడవైన ధర్మరాజా!; అతఁడు= ఆ ఇంద్రుడు; కడంగన్= యుద్ధానికి ఉద్యమించగా; అప్డు= ఆ సమయాన; దేవగురుఁడు= బృహస్పతి; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; తానున్= తానుకూడ; ఆ+మరుత్పతి విజయంబున్= ఆ దేవేంద్రుడి జయాన్ని; కోరి= అభిలషించి; హరున్= రుద్రుడిని; ప్రార్థన చేయన్= ప్రార్థించగా; తదీయతేజము= ఈ రుద్రుడి యొక్క తేజస్సు; ఉద్ధతచటుల జ్వరంబు+అగుచున్= గర్వితమై చలించే జ్వరమవుతూ; దైత్యపతిన్= రాక్షసరాజును; పొదివెన్= ఆక్రమించింది; తత్సమయంబునన్= అప్పుడు; హరి= విష్ణువు; సుర+ఈశ్వరోద్యత కులిశంబున్=ఇంద్రుడు పైకెత్తిన వజ్రాయుధాన్ని; పొందెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వసిష్ఠుడి ప్రేరణతో ఇంద్రుడు యుద్ధానికి తలపడ్డాడు. అప్పుడు బృహస్పతి మునులతో కూడి తాను ఇంద్రుడి విజయార్థమై ఈశ్వరుడిని ప్రార్థించాడు. ఆ శంకరుడి తేజస్సు మహోద్ధతమై చలించే జ్వరంగా రూపొంది వృత్రుడిని ఆక్రమించింది. ఆ కాలంలోనే విష్ణువు ఇంద్రుడు పైకెత్తిన వజ్రాయుధాన్ని ప్రవేశించాడు.

తే. ఇంద్రునకు రుద్రుఁ డత్తఱి నిట్టు లనియె । ననఘ! యఱువది వేలు దివ్యాబ్దములు మ
హాతపం బొనరించె నీయసుర; వీని । కొసఁగెఁ బద్మజుఁ డధికమహోగ్రబలము. 425

ప్రతిపదార్థం: అత్తఱిన్= ఆ సమయంలో; రుద్రుఁడు= శివుడు; ఇంద్రునకున్= వాసవుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; అనఘ!= పాపరహితుడా!; ఈ యసుర= ఈ రాక్షసుడు; అఱువదివేలు దివ్య+అబ్దములు= అరవైవేల దివ్యసంవత్సరాలు; మహాతపంబు+ఒనరించెన్= గొప్ప తపస్సు చేశాడు; పద్మజుఁడు= బ్రహ్మ; వీనికిన్= ఈ రక్కసుడికి; అధికమహా+ఉగ్రబలమున్= ఎక్కుడైన భయంకరబలాన్ని; ఒసంగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అప్పుడు రుద్రుడు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు: 'పాపరహితుడా! ఈ రాక్షసుడు అరవైవేల దివ్యసంవత్సరాలు తీవ్రతపస్సు చేశాడు. బ్రహ్మ వీడికి భయంకరమైన మహాబలం ప్రసాదించాడు'.

క. అని చెప్పి 'యబ్బలము నా । ఘనతేజముచేత నడఁగు గడఁగు' మనుడు న
య్యనిమిషనాథుఁడు వజ్రం । బున వైవ నతండు వడియె మునిగణ మలరన్. 426

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఆ+బలము= ఆ సత్తువ; నా ఘనతేజముచేతన్= నాయొక్క గొప్ప తేజస్సుచేత; అడఁగున్= నశిస్తుంది; కడఁగుము= ప్రయత్నించుము; అనుడున్= అనగా; ఆ+అనిమిషనాథుఁడు= ఆ దేవప్రభువు; వజ్రంబునన్= వజ్రాయుధంతో; వైవన్= వేయగా; ముని గణము= మునిబృందం; అలరన్= సంతసించగా; అతండు= ఆ రాక్షసుడు; పడియెన్= నేలకూలాడు.

తాత్పర్యం: రుద్రుడు ఆ రీతిగా పలికి 'వాడి బలము గొప్పదైన నా తేజస్సుచేత నశిస్తుంది, కాబట్టి ప్రయత్నించుము' అని ఇంద్రుడిని పురికొల్పాడు. అంతట ఇంద్రుడు వజ్రాయుధంతో వాడిని కొట్టాడు. ముని సమూహం సంతోషించగా ఆ దెబ్బకు ఆ రాక్షసుడు నేలకూలాడు.

క. సుర లార్చిరి, తూర్యంబులు । మొరసె ననేకంబు; లపుడు మోదమున మునుల్
హరిహరులం గీర్తించిరి, । సురేంద్రు నగ్గించి రధికశుభవాక్యములన్. 427

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఆర్చిరి= అరచారు; అనేకంబులు తూర్యంబులు= పెక్కు వాద్యాలు; మొరసెన్= మ్రోగాయి; అపుడు= ఆ సమయంలో; మునుల్= మౌనులు; మోదమునన్= సంతోషంతో; హరిహరులన్= విష్ణువునూ, రుద్రుడినీ; కీర్తించిరి= స్తుతించారు; అధిక శుభవాక్యములన్= అనేక మంగళవచనాలతో; సురేంద్రున్= దేవేంద్రుడిని; అగ్గించిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: వృత్రాసురుడు పడిపోగానే దేవతలు ఆనందంతో అరచారు. పెక్కువాద్య విశేషాలు మ్రోగాయి. మునులు సంతసంతో హరినీ, హరుడినీ వినుతించారు. అనేక మంగళవాక్యాలతో దేవేంద్రుడిని పొగడారు.

క. విను విష్ణుని సంస్పర్శం । బున నప్పుడ చూవె కసటు వోయిన నతనిం
గనుటయు శాంతిం బొందుట । యును గురువర! కలిగె వృత్రు నుల్లంబునకున్.' 428

ప్రతిపదార్థం: కురువర!= కౌరవశ్రేష్ఠా!; వినుము= ఆలకించుము; విష్ణుని సంస్పర్శంబునన్= విష్ణుదేవుడు తాకటంతో; అప్పుడ చూవె!= అప్పుడే సుమా!; కసటు= మాలిన్యం; పోయినన్= తొలగిపోగా; అతనిన్= ఆ విష్ణుడిని; కనుటయున్= చూడటమూ; వృత్రుఉల్లంబునకున్= వృత్రాసురుడి హృదయానికి; శాంతిన్+పొందుటయునున్= శమించటమున్నూ; కలిగెన్= సంభవించాయి.

తాత్పర్యం: కురుశ్రేష్ఠా! వెన్నుని స్పర్శతో అప్పుడే వృత్రుడి హృదయగతమైన మాలిన్యం తొలగిపోయింది. అప్పుడతడు విష్ణుదేవుడిని చూచాడు. అతడి చిత్తానికి శాంతి కూడా అప్పుడు కల్గింది'.

వ. అని పలికి భీష్ముండు వెండియు నవ్విభున కిట్లను నట్లు వృత్రుని జయించి. 429

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= మరల; ఆ+విభునకున్= ఆ రాజుకు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; వృత్రునిన్= వృత్రాసురుడిని; జయించి= ఓడించి.

తాత్పర్యం: భీష్ముడి రీతిగా చెప్పి మరల ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: అట్లా వృత్రుడిని యుద్ధంలో పరాజితుడిని చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. హరునకు మ్రొక్కి 'మీ కరుణ నార్తి దొఱంగి యనూన సౌఖ్యముం
బొరసితి' నంచు వీడుకొని పోయె మహేంద్రుఁడు బ్రహ్మహత్య యా
సురపతి నప్డు వెన్కొనియెఁ జొచ్చె బిసాంతర మాతఁ డందునుం
బరిగొని యుగ్రవృత్తి నది పట్టెఁ జలంబున నమ్మహాత్మునిన్. 430

ప్రతిపదార్థం: మహేంద్రుఁడు= దేవేంద్రుడు; హరునకున్= రుద్రుడికి; మ్రొక్కి= నమస్కరించి; మీ కరుణన్= మీ దయచేత; ఆర్తిన్= బాధను; తొఱంగి= త్యజించి; అనూన సౌఖ్యమున్= అధికసుఖాన్ని; పొరసితిన్+అంచున్= పొందాను అంటూ; వీడుకొని పోయెన్= పోయివస్తానని వెళ్ళిపోయాడు; అప్డు= అప్పుడు; బ్రహ్మహత్య= బ్రహ్మహత్యాదోషం; ఆ సురపతిన్= ఆ ఇంద్రుడిని; వెన్కొనియెన్= వెంబడించింది; ఆతఁడు= ఆ ఇంద్రుడు; బిస+అంతరమున్= తామరతూడులోపల; చొచ్చెన్= ప్రవేశించాడు; అది= ఆ దోషము; అందునున్= ఆ తామర తూడులోగూడ; పరిగొని= చుట్టుముట్టి; ఉగ్రవృత్తిన్= భీకరవర్తనంతో; చలంబునన్= మాత్సర్యంతో; ఆ+మహాత్మునిన్= ఆ ఇంద్రుడిని; పట్టెన్= గ్రహించింది.

తాత్పర్యం: అంతట ఇంద్రుడు శివుడికి ప్రణమిల్లాడు. 'మీ దయవలన పీడ తొలగి మహాసౌఖ్యం పొందాను' అని చెప్పుతూ పోయివస్తానని వెళ్ళాడు. అప్పుడు బ్రహ్మహత్యాదోషం ఆ ఇంద్రుడిని వెంబడించింది. దానికి భయపడి అతడు తామరతూడులో ప్రవేశించాడు. అది మాత్సర్యంతో వెంబడించి అక్కడ కూడా భయంకరంగా అతడిని చుట్టుముట్టి ఆక్రమించింది.

ఆ. బ్రహ్మహత్య దన్నుఁ బట్టిన నమరేంద్రుఁ । డజుని కడకు నేఁగి ప్రార్థనంబు
చేసి 'దీనిఁ బాయఁజేయవే' యన నతం । డది దొలంగఁ జేయుననువు దలఁచి. 431

ప్రతిపదార్థం: బ్రహ్మహత్య= బ్రహ్మహత్య అనే దోషం; తన్నున్= తనను; పట్టినన్= ఆక్రమించగా; అమరేంద్రుఁడు= దేవేంద్రుడు; అజుని కడకున్= బ్రహ్మవద్దకు; ఏఁగి= పోయి; ప్రార్థనంబుచేసి= ప్రార్థించి; దీనిన్= ఈ బ్రహ్మహత్యను; పాయన్+చేయవే+అనన్= తొలగించవే అనగా; అతండు= ఆ బ్రహ్మ; అది= ఆ దోషమును; తొలంగన్+చేయు= తొలగించే; అనువున్= ఉపాయాన్ని; తలఁచి= భావించి.

తాత్పర్యం: ఇంద్రుడు బ్రహ్మహత్యాదోషం తనను పట్టుకొనటంతో బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. ఆయనను ప్రార్థించి ఈ దోషం తొలగేటట్లు చేయుమన్నాడు. బ్రహ్మ ఆ దోషం తొలగించే ఉపాయం ఆలోచించాడు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అగ్నినోషధివృక్షతృణంబులను వనితా జనంబులను జలంబులను దలంపున రావించి వృత్రునివలన వాసవునకుం బాటిల్లిన బ్రహ్మహత్య చతుర్భాగంబులు సేసితి. మీర లొక్కొక్క పాలు గై కొనుండని పనిచెఁ; బనిచిన వారు 'దేవా! నీ పంపు సేసెదము; మాకు నిష్కృతి యెట్టిది? దాని నీదివ్య చిత్తంబున నవధరింపవలయు' నని పలికిన నగ్ని కిని నోషధివృక్షతృణంబులకును, వనితాజనంబులకును, జలంబులకును వరంబులుగాఁ గ్రమంబున నీవు ప్రజ్వలింపక హవిఃప్రదానంబు సేయు వానియందును, మీకుఁ బర్వంబుల భేదనచ్ఛేదనంబు లాచరించువానియందును, మీరు రజస్వలలై యుండ మీతో సురతంబు సలుపువాని యందును, మీలో మల మూత్ర శ్లేష్మంబులు విడుచువాని యందును మీ మీ కడనున్న బ్రహ్మహత్య ప్రవేశింపఁ గలయది' యని నిర్దేశించిన దానికిం బ్రియం బంది, యగ్ని ప్రముఖంబులు శతమఖు బ్రహ్మహత్య పాళ్ళు ధరియించి; రిట్లు విరించి ప్రసాదంబునం గల్మషంబు దొఱంగి యాఖండలుండు దదనుమతి నశ్వమేధంబు సేసి నాక సామ్రాజ్యంబున సర్వలోక పూజ్యత్వంబు నొంది వెలింగె' నని చెప్పి వెండియు నిట్లనియె. 432

ప్రతిపదార్థం: అగ్నిన్= అగ్నిదేవుడిని; ఓషధివృక్షతృణంబులనున్= అరటిమొదలైన ఓషధులను, చెట్లను, గడ్డిమొక్కలను; వనితాజనంబులను= స్త్రీలను; జలంబులను= నీటిని; తలంపునన్= సంకల్పంతో; రావించి= వచ్చేటట్లు చేసి; వృత్రునివలనన్= వృత్రాసురుడివలన; వాసవునకున్= ఇంద్రుడికి; పాటిల్లిన= కల్గిన; బ్రహ్మహత్యన్= బ్రహ్మహత్యాదోషాన్ని; చతుర్భాగంబులు= నాలుగుపాళ్ళు; చేసితిన్= చేశాను; మీరలు= మీరు; ఒక్కొక్క పాలు= ఒక్కొక్క భాగం; కైకొనుండు+అని= స్వీకరించండి అని; పనిచెన్= నియోగించాడు; పనిచినన్= నియోగించేసరికి; వారు= అగ్ని మున్నగువారు; దేవా!= ప్రభూ!; నీపంపు= నీయాజ్ఞ; చేసెదము= నిర్వర్తిస్తాం; మాకున్= అట్లా నిర్వర్తించిన అగ్న్యాదులమైన మాకు; నిష్కృతి= ప్రాయశ్చిత్తం; ఎట్టిది= ఎట్లాంటిది?; దానిన్= ఆ ప్రాయశ్చిత్తాన్ని; నీ దివ్యచిత్తంబునన్= నీ దివ్యమానసంలో; అవధరింపన్ వలయున్+అని= భావించవలెను అని; పలికినన్= చెప్పగా; అగ్నికినిన్= అనలమునకు; ఓషధివృక్షతృణంబులకున్= ఓషధులకు, చెట్లకు, గడ్డికిని; వనితాజనంబులకునున్= స్త్రీలకు; జలంబులకును= నీటికిని; క్రమంబునన్= వరుసగా; వరంబులుగాన్= దేవతలిచ్చే కోరికలుగా; నీవు= అగ్నివైన నీవు; ప్రజ్వలింపక= మండక; హవిఃప్రదానంబు చేయువాని+అందునున్= హవిస్సును వేల్చువాడి యందు; మీకున్= ఓషధివృక్షాదులగు మీకు; పర్వకాలంబులన్= పండుగదినాలలో; భేదన చ్ఛేదనంబులు= పెళ్ళగించటం, నరకటం చేసేవాడియందు; మీరు= స్త్రీజనమైన మీరు; రజస్వలలై ఉండన్= ముట్టుగలవారై ఉండగా; మీతోన్ సురతంబు= మీతో రతి; సలుపువానియందును= చేసేవాడియందు; మీలోన్= జలమైన మీలో; మలమూత్రశ్లేష్మంబులు= మలం, మూత్రం, తెమడ వీటిని; విడుచువానియందును= వదలిపెట్టేవాడియందు; మీమీ కడన్= మీమీ వద్ద; ఉన్నబ్రహ్మహత్య= ఉన్నట్టి బ్రహ్మహత్యాదోషం; ప్రవేశింపన్ కలయది= దూరగలదు; అని నిర్దేశించినన్= అని చెప్పగా; దానికిన్= ఆ మాటకు; ప్రియంబు+అంది= సంతోషపడి; అగ్నిప్రముఖంబులు= అగ్ని మొదలగు వారు; శతమఖు= ఇంద్రుడియొక్క; బ్రహ్మహత్యపాళ్ళు= బ్రహ్మహత్యాదోషపు విభాగాలను; ధరియించిరి= పూనారు; ఇట్లు= ఈ రీతిగా; విరించి ప్రసాదంబునన్= బ్రహ్మఅనుగ్రహంతో; కల్మషంబు= పాపం; తొఱంగి= వీడి; ఆఖండలుండు= ఇంద్రుడు; తదనుమతిన్= బ్రహ్మయొక్క సమ్మతితో; అశ్వమేధంబు= అశ్వమేధమనే యజ్ఞం; చేసి= నిర్వహించి; నాక సామ్రాజ్యంబునన్= స్వర్గ సామ్రాజ్యంలో; సర్వలోకపూజ్యత్వంబును= సమస్తలోకాలచేత పూజించబడుటను; ఒంది= పొంది; వెలింగెన్= ప్రకాశించాడు; అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మ అగ్నిదేవుడిని, ఓషధులను, చెట్లను, గడ్డిమొక్కలను, స్త్రీలను, నీటిని తన సంకల్పశక్తితో వచ్చేటట్లు చేశాడు. 'ఇంద్రుడికి కలిగిన బ్రహ్మహత్యాదోషాన్ని నేను నాలుగు భాగాలు చేశాను. మీరు ఒక్కొక్క భాగం స్వీకరించాలి' అని ఆదేశించాడు. అందుకు అగ్న్యాదులు 'ప్రభూ! నీ ఆన పాటిస్తాము. అయితే దానివలన కలిగే పాపానికి మాకు ప్రాయశ్చిత్తమేది? దానిని నీ మనస్సులో నిశ్చయించి చెప్పు' మని అన్నారు. అప్పుడు విధాత అగ్నికి, ఓషధి వృక్షతృణాలకూ, స్త్రీలకూ, నీటికీ క్రమంగా ఈ క్రింది రీతిగా వరాలు ఇచ్చాడు. 'నీవు మండకున్నప్పుడు హవిస్సు నీలో వేల్చేవాడిలో నీలోని దోషం ప్రవేశిస్తుంది' అని అగ్నికి వరమిచ్చాడు. 'పండుగకాలంలో మిమ్ములను భగ్నంచేసి, నరికి, పెకలించేవారిలో మీలోని దోషం చేరుతుంది' అని ఓషధి వృక్షతృణాలకు వరమిచ్చాడు. 'మీరు రజస్వలలై ఉన్నపుడు మీతో రతిచేసే వాడిలోనికి మీ దోషం ప్రవేశిస్తుం' దని స్త్రీలకు వరం ఇచ్చాడు. 'మీలో మలమూత్రాలు, కళ్ళెలు వదలిపెట్టే వాడిని మీలోని దోషం వెన్నంటుతుంది' అని నీటికి వరమిచ్చాడు. అందుకు అగ్ని మున్నగువారు సంతోషించారు. ఇంద్రుడి బ్రహ్మహత్యాదోషాన్ని వారు ధరించారు. ఇట్లా బ్రహ్మ అనుగ్రహంతో ఇంద్రుడు పాపం వీడి ఆయన సమ్మతితో అశ్వమేధయాగం చేశాడు. స్వర్గరాజ్యంలో సమస్తలోకపూజ్యుడై వెలుగొందాడు' అని చెప్పి మరల భీష్ముడు ధర్మరాజుతో ఈ రీతిగా అన్నాడు:

తే. ఒదవు వృత్రురక్తమున బుద్బుదము లెసఁగి । పుట్టకొక్కులై యవి జనభోజ్యభావ
మొంది విప్రాదికద్విజ యోగ్యతాభి । పన్నములు గావు ధర్మసంపన్నచరిత! 433

ప్రతిపదార్థం: ధర్మసంపన్నచరిత!= ధర్మంతో కూడిన శీలంకల ఓ ధర్మరాజా!; ఒదవు= ఉదయించిన; వృత్రురక్తమునన్= వృత్రాసురుడి నెత్తుటిలో; బుద్బుదములు= బుడగలు; ఎసఁగి= వృద్ధిపొంది; పుట్టకొక్కులు+ఐ= పుట్టగొడుగులుగా రూపొంది; అవి= ఆ పుట్టగొడుగులు; జనభోజ్యభావము+ఒంది= ప్రజలకు తినదగినవై; విప్రాదికద్విజ= బ్రాహ్మణులు మున్నగు ద్విజులకు; యోగ్యతాభిపన్నములు= భోజనయోగ్యతతో గూడినవి; కావు= కావు.

తాత్పర్యం: 'ధర్మాత్మా! వృత్రుని శరీరంనుండి కారిన నెత్తురునుండి బుడగలు పుట్టాయి. అవి పుట్టకొక్కులయ్యాయి. ప్రజలకు ఆహారపదార్థంగా కూడ రూపొందాయి. అయితే రాక్షస రక్తజములు కావటం వలన బ్రాహ్మణులు మొదలైన ద్విజులు భుజించటానికి అవి తగని వయ్యాయి.

క. ఆ వాసవు చందంబున । నీవును శత్రుజయకీర్తనీయుఁడ వగుచున్
భూవిబుధుల కెపుడుఁ బ్రమో । దావహుఁడవు గమ్ము, భారతాన్వయముఖ్యా! 434

ప్రతిపదార్థం: భారత+అన్వయముఖ్యా!= భరతవంశశ్రేష్ఠా!; ఆ వాసవుచందంబునన్= ఆ ఇంద్రుడివలె; నీవును= నీవుకూడ; శత్రుజయకీర్తనీయుఁడవు+అగుచున్= రిపులను జయించటంచేత కీర్తించదగినవాడ వవుతూ; భూవిబుధులకున్= భూసురులకు; ఎప్పుడున్= ఎల్లవేళల; ప్రమోద+ఆవహుఁడవు కమ్ము= సంతోషం కలిగించేవాడవు కమ్ము.

తాత్పర్యం: భరతవంశముఖ్యుడవైన ఓ ధర్మపుత్రా! ఆ ఇంద్రుడివలె నీవు కూడా శత్రువులను జయించి కీర్తి పొందుము. బ్రాహ్మణులకు సదా సంతోషం కలిగించుము.

తే. పర్వములయందు విప్రసభను సభక్తి । కంబుగా నెవ్వఁ డీశక్రకథఁ బఠించు
వానిఁ బాపము లొందవు, మాననీయ । ధర్మములయందు రతుఁడగు ధర్మతనయ!' 435

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ధర్మపుత్రా!; ఎవ్వఁడు= ఎవడు; పర్వముల+అందున్= పండుగదినాలలో; విప్రసభను= బ్రాహ్మణుల సభలో; ఈ శక్రకథన్= ఈ ఇంద్రుడి చరిత్రమును; సభక్తికంబుగాన్= భక్తితో కూడి; పఠించున్= చదువునో; వానిన్= అతడిని; పాపములు= కిల్బిషాలు; ఒందవు= పొందవు; మాననీయ ధర్మముల+అందున్= పూజ్యములైన ధర్మాలయందు; రతుఁడు+అగున్= (అతడు) ఆసక్తిగల వాడవుతాడు.

తాత్పర్యం: ధర్మజా! ఎవడు పర్వదినాలలో ఈ ఇంద్రుడి కథను భక్తితో బ్రాహ్మణుల సభలో చదువుతాడో, వాడికి పాపా లంటవు. వాడు మాన్యమైన ధర్మాలలో ఆసక్తి కలవా డవుతాడు'.

వ. అనిన నతండు ప్రీతుండై 'వృత్రుండు జ్వరంబుచేతం బొదువంబడియె నని వింటి; దాని జననంబును దత్ప్రకారంబును నెఱిఁగింపవే' యనుటయు భీష్ముం డా భూపతి కిట్లనియె. 436

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతండు= ఆ ధర్మసుతుడు; ప్రీతుండు+ఐ= ప్రీతినొందినవాడై; వృత్రుండు= వృత్రాసురుడు; జ్వరంబుచేతన్= జ్వరంచేత; పొదువంబడియెన్+అని= ఆక్రమించబడ్డాడని; వింటిన్= విన్నాను; దాని జననంబును= ఆ జ్వరముయొక్క పుట్టుకయును; తత్ప్రకారంబునున్= దాని స్వభావమును; ఎఱిఁగింపవే= తెలుపుమా; అనుటయున్= అనగా; భీష్ముండు= గాంగేయుడు; ఆ భూపతికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు అట్లా చెప్పగా విని ధర్మరాజు ప్రీతి పొందాడు. 'వృత్రుడిని జ్వరం ఆక్రమించింది అని విన్నాను. ఆ జ్వరం ఎట్లా పుట్టింది? దాని విధానం ఏమిటి? తెలియజేయు' మని మళ్ళీ అడిగాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా చెప్పాడు.

దక్షమఖధ్వంసంబు నప్పుడు శివునివలన జ్వరం బుద్భవించిన ప్రకారము (సం. 12-274-4)

సీ. రజతాచలంబున రత్నతటంబున । నంబికాసహితుఁడై హరుఁడు పేర్మి
నమరమునీంద్ర యక్షాదులు గొలువంగ । నుండు; నట్లుండంగ నొక్కనాఁడు
దేవర్షికోటు లతిప్రమదంబునం । జనఁ జూచి 'వీ రేమిపనికి నెచటి
కరిగెద?' రని పతి నడిగె భవాని; యా । తఁడు 'దక్షుచేయు నధ్వరమునందుఁ

తే. దమహవిర్భాగములు గొనుదాని' కనినఁ । 'బొలఁతి నీ వేల పో?' వను పలుకు పలికె;
'నాకు మును భాగపరికల్పనంబు లేమి । నతఁడు బిలువఁ; డేనును బోవ' ననియె భవుఁడు. 437

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; అంబికాసహితుఁడు+ఐ= సతీదేవితో కూడినవాడై; రజత+అచలంబునన్= కైలాసగిరిపై; రత్నతటంబునన్= రత్నసానువునందు; పేర్మిన్= అతిశయంగా; అమరముని+ఇంద్ర యక్ష+ఆదులు= దేవతలు, మునివర్యులు, యక్షులు మొదలైనవారు; కొలువంగన్+ఉండున్= సేవించగా ఉంటాడు; అట్లు+ఉండంగన్= అట్లా ఉండగా; ఒక్కనాఁడు= ఒక్కదినం; భవాని= సతీదేవి; దేవర్షికోటులు= దేవతలు, ఋషిసమూహాలు; అతిప్రమదంబునన్= మిక్కిలి సంతోషంతో; చనన్= పోగా; చూచి= విలోకించి; వీరు= ఈ దేవర్షులు; ఏమిపనికిన్= ఏ కార్యానికి; ఎచటికిన్= ఎక్కడికి; అరిగెదరు?= పోతున్నారు?; అని పతిన్+అడిగెన్= అని భర్తను ప్రశ్నించింది; ఆతఁడు= ఆ శివుడు; దక్షు చేయు= దక్షప్రజాపతి చేసే; అధ్వరము+అందున్= యజ్ఞంలో; తమ హవిర్భాగములు= తమకు చెందిన వేల్చిన ద్రవ్యపు పాళ్ళను; కొనుదానికిన్+అనినన్= స్వీకరించటానికని చెప్పగా; పొలఁతి= పార్వతి; నీవు+ఏల పోవు?= నీవెందుకు పోవటం లేదు?; అను పలుకు= అనుమాట; పలికెన్= అన్నది; భవుఁడు= శివుడు; నాకున్= శివుడనైన నాకు; మును= ముందు; భాగపరికల్పనంబు= పాలు కల్పించటం; లేమిన్= లేకుండటంవలన; అతఁడు= ఆ దక్షుడు; పిలువఁడు= నన్ను ఆహ్వానించడు; ఏనును= నేనుకూడ; పోవన్+అనియెన్= పోనన్నాడు.

తాత్పర్యం: శివుడు వెండికొండపై సతీదేవితో కూడి ఉన్నాడు. దేవతలు, మునివర్యులు, యక్షులు మొదలైనవారు ఆ దేవుడిని సేవిస్తూ ఉన్నారు. ఒక్క దినాన దేవర్షి సమూహం చాలా సంతోషంతో బయలుదేరి వెళ్ళుతూ ఉండటం చూచి అంబిక 'వీరు ఎక్కడికి ఏమి పనిమీద పోతున్నారు?' అని భర్తను అడిగింది. అందుకు భవుడు 'దక్షుడు చేసే యాగంలో తమ తమ హవిర్భాగాలు గ్రహించటానికి వీరు పయనమయ్యారు' అని చెప్పాడు. అప్పుడు భవాని 'అయితే నీ వెందుకు పోవటం లేదు?' అని ప్రశ్నించింది. దానికి శివుడు నాకు ముందుభాగం పెట్టలేదు. అందువలన అతడు నన్ను పిలువలేదు. నేనుకూడా పోవటం లేదు' అని చెప్పాడు.

క. తన పతికి భాగకల్పన । మొనరింపఁడు దక్షుఁ డని మహోగ్రపుఁ గోపం
బున బొమలు ముడివడఁగ న । వ్వనిత పలుకు మాని యుండె వసుధాధీశా! 438

ప్రతిపదార్థం: వసుధాధీశా!= రాజా!; దక్షుఁడు= దక్షప్రజాపతి; తన పతికిన్= తన భర్తకు; భాగకల్పనము= పాలు కల్పించటం; ఒనరింపఁడు= చేయడు; అని= అని తలచి; మహా+ఉగ్రపు= మిక్కిలి భయంకరమైన; కోపంబునన్= క్రోధంతో; బొమలు; ముడిపడఁగన్= వక్రత్వం పొందగా; ఆ+వనిత= ఆ భవాని; పలుకు మాని= మాట్లాడటం మాని; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: ధర్మరాజా! దక్షుడు తన భర్తకు యజ్ఞంలో భాగం కల్పించలేదని సతీదేవి మిక్కిలి కోపంతో కనుబొమలు ముడివడగా మాట్లాడటం మాని మౌనంగా ఉండిపోయింది.

సీ. దేవిచిత్త మెఱింగి దేవుండు ప్రమథసం । ఘంబులు దాను నా క్రతువు సెఱుప
నరిగె; యజ్ఞాంగంబు లన్నింటిఁ బ్రమథులు । గాసి సేయుచును రక్తములు సల్లి
యార్పంగ మృగరూపమై గగనంబున । కెగసె; నధ్వరము మున్నీశునుదుట
నలుకఁ బుట్టిన ఘర్మజల కణ మిలఁ బడ్డఁ । బెనుమంట లెగసిన జనితుఁ డయ్యె

ఆ. నందుఁ బురుషుఁ డొకరుఁ డరుణ నేత్రకము నీ । లంబు నూర్ధ్వరోమకంబు ఘోర
భంగికంబు నైన యంగంబుతో సప్త । తంతుదాహి యగుచు ధరణినాథ! 439

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; దేవుండు= భవుడు; దేవిచిత్తము+ఎఱింగి= భవాని మనస్సు తెలిసికొని; ప్రమథసంఘంబులు= ప్రమథసమూహాలు; తానును= తానుకూడ; ఆ క్రతువు= ఆ యజ్ఞాన్ని; చెఱుపన్= చెడగొట్టటానికి; అరిగెన్= పోయాడు; ప్రమథులు= శివభటులు; యజ్ఞ+అంగంబులు+అన్నింటన్= యజ్ఞానికి చెందిన అవయవాలన్నింటిలోనూ; గాసి చేయుచును= చీకాకు పరుస్తూ; రక్తములు+చల్లి= నెత్తురులు చల్లి; ఆర్పంగన్= ఆర్పివేయగా; అధ్వరము= యజ్ఞం; మృగరూపమై= జింక రూపుగలదై; గగనంబునకున్= ఆకసానికి; ఎగసెన్= ఎగిరిపోయింది; మున్ను= ముందు; ఈశునుదుటన్= శివుడి ఫాల భాగంలో; అలుకన్= కోపంతో; పుట్టిన= ఉదయించిన; ఘర్మజలకణము= చెమటబొట్టు; ఇలన్= భూమిపై; పడ్డన్= పడగా; పెనుమంటలు= పెద్దజ్వాలలు; ఎగిసినన్= పైకి లేవగా; అందున్= ఆ జ్వాలలలో; అరుణనేత్రకము= ఎఱ్ఱని కనులుకలది; నీలంబు= నల్లనిది; ఊర్ధ్వరోమకంబు= పైకి మొనచూపిన వెంట్రుకలు కలది; ఘోరభంగికంబు= భయంకరమైన ఆకృతికలదియు; ఐన+అంగంబుతోన్= అయినట్టి శరీరంతో; సప్తతంతుదాహి= యజ్ఞాన్ని కాల్చివేసేవాడు; అగుచున్= అవుతూ; పురుషుఁడు+ఒకరుఁడు= ఒక పురుషుడు; జనితుఁడు+అయ్యెన్= పుట్టాడు.

తాత్పర్యం: రాజా! అప్పుడు భవానీదేవి చిత్తం గ్రహించి భవుడు ప్రమథగణాలతో కూడా తాను దక్షయజ్ఞాన్ని నాశనం చేయటానికై వెళ్ళాడు. అక్కడ శివభటులు యజ్ఞాంగాలను చీకాకు జేసి రక్తం చల్లి అగ్నిహోత్రాన్ని ఆర్పివేశారు. అంతట యజ్ఞం మృగరూపంతో ఆకాశాని కెగిరిపోయింది. ఈశ్వరుడి పాలభాగంలో కోపంవలన పుట్టిన చెమట బిందువొకటి భూమిపై పడింది. వెంటనే అక్కడ పెద్దమంటలు ఏర్పడ్డాయి. ఆ మంటలలో ఒక పురుషుడు ఎఱ్ఱని నేత్రాలు, నల్లనిరూపు, ఊర్ధ్వముఖమైన రోమాలు గల భయంకరమైన ఆకృతితో జన్మించాడు.

క. సురలు మునులు భయమునఁ బఱ । చిరి నలుగడ; బ్రహ్మ వచ్చి శివుఁ గని వినయో
త్తరముగ మ్రొక్కుచు 'నమరులు । పరికల్పించెదరు నీకు భాగము భక్తిన్. 440

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; మునులు= మౌనులు; భయమునన్= భీతితో; నలుగడ= నాలుగు దెసలకు; పఱచిరి= పరుగెత్తారు; బ్రహ్మ= అజుడు; వచ్చి= ఏతెంచి; శివున్= భవుడిని; కని= చూచి; వినయ+ఉత్తరముగన్= వినయప్రధానంగా; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; అమరులు= సురలు; నీకున్= శివుడ వగు నీకు; భక్తిన్= భక్తితో; భాగము= పాలు; పరికల్పించెదరు= ఏర్పాటు చేస్తారు.

తాత్పర్యం: అట్లా జరుగగానే దేవతలు, ఋషులు భయంతో నలుదిక్కులకు పారిపోయారు. అపుడు బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి శివుడిని చూచి వినయభరితుడై నమస్కరిస్తూ 'దేవతలు నీకు యజ్ఞంలో భక్తితో భాగం కల్పిస్తారు.

వ. స్వామీ! కోపం బుపసంహరింపుము.' 441

ప్రతిపదార్థం: స్వామీ!= ప్రభూ!; కోపంబు= క్రోధాన్ని; ఉపసంహరింపుము= మరలించుము.

తాత్పర్యం: స్వామీ! కోపం మళ్ళించుకొమ్ము'.

క. నావుడు నల్ల నగుచు న । ద్దేవుఁడు గరుణించి మునుల దేవతలను సం
భావింప భాగకల్పన । గావించిరి వార లా జగత్ప్రభువునకున్. 442

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; ఆ+దేవుఁడు= ఆ శివుడు; అల్లనగుచున్= మందహాసం చేస్తూ; కరుణించి= దయచూపి; మునులన్= మౌనులను; దేవతలను= సురలను; సంభావింపన్= గౌరవించగా; వారలు= ఆ మునులు, దేవతలు; ఆ జగత్ప్రభువునకున్= ఆ జగదీశ్వరుడికి; భాగకల్పన= పాలు కల్పించటం; కావించిరి= చేశారు.

తాత్పర్యం: బ్రహ్మ అట్లా అనగానే ఆ శివుడు దయతో మందహాసం చేస్తూ మునులనూ దేవతలనూ సంభావించాడు. వారు జగన్నాథుడైన ఆ దేవుడికి యజ్ఞంలో భాగం కల్పించారు.

వ. అప్పరమేశ్వరుండు సుప్రసన్నుండై యనిమిషులకు మునిగణంబులకు నానందం బొసంగె; శతానందుం డయ్యిందుశేఖరునితో 'దేవా! నీనుదుటి చెమటం బుట్టిన యప్పురుషుండు జ్వరంబను నామంబున బ్రశస్తుండయి యెందునుం జరియించు; నీ జ్వరం బేకముఖత్వంబునం బృథివికి దుర్భరంబగు బహువిధంబుగా సృజియింపవే' యనుడు నగ్గిరీశుండు కరులకు శిరస్తాపనంబును, భుజంగంబులకు నిర్మోకంబును, గోవులకు ఖురాంతర్బాధనంబును, మృగంబులకు నైజస్వరూపదర్శన ప్రత్యవరోధనంబును, దురగంబులకుఁ బార్శ్వశోషణంబును, మయూరంబులకుఁ బత్రోద్భేదనంబును, గోకిలంబులకు నేత్రరోగంబును, శుకంబులకు హిక్కయు, నజంబులకుఁ జిత్తభ్రమణంబును, శార్దూలంబులకు శ్రమంబును, మనుష్యులకు జననమరణాదుల యెడ వేదనావేశంబునుంగా విభాగించె; నిది జ్వరప్రకారంబు. జ్వరంబు మాహేశ్వరతేజంబు గావున సర్వజనంబులకు నమస్కార్యంబును, మాననీయంబునై యుండు. 443

ప్రతిపదార్థం: ఆ+పరమేశ్వరుండు= ఆ శివుడు; సుప్రసన్నుండు+ఐ= అత్యంతానుగ్రహంకలవాడై; అనిమిషులకున్= దేవతలకు; మునిగణంబులకున్= ముని బృందానికి; ఆనందంబు+ఒసంగెన్= సంతోషం కలిగించాడు; శతానందుండు= బ్రహ్మ; ఆ+ఇందుశేఖరునితోన్= ఆ చంద్రశేఖరుడితో; దేవా!= ప్రభూ!; నీ నుదుటి చెమటన్= నీ నొసలి స్వేదమునందు; పుట్టిన= జనించిన; ఆ+పురుషుండు= ఆ పురుషుడు; జ్వరంబు+అను= జ్వరం అనే; నామంబునన్= పేరుతో; ప్రశస్తుండు+అయి= ప్రసిద్ధుడై; ఎందునున్= ప్రతిచోటా; చరియించున్= తిరుగుతాడు; ఈ జ్వరంబు= ఇట్టి జ్వరం; ఏకముఖత్వంబునన్= ఒకే రూపుతో; పృథివికిన్= భూమికి; దుర్భరంబు+అగున్= భరించరాని దవుతుంది; బహువిధంబుగాన్= నానాముఖాలుగా; సృజియింపవే= సృష్టించుమా; అనుడున్= అని చెప్పగా; ఆ+గిరీశుండు= ఆ శివుడు; కరులకున్= ఏనుగులకు; శిరస్తాపనంబును= తల నొప్పియును; భుజంగంబులకున్= పాములకు; నిర్మోకంబునున్= కుబుసమును; గోవులకున్= ధేనువులకు; ఖురాంతర్బాధనంబునున్= గిట్టలలో నొప్పియును; మృగంబులకున్= జింకలకు; నైజస్వరూపదర్శనప్రత్యవరోధనంబునున్= తమస్వరూపాన్ని చూడటంలో ఆటంకమును; తురగంబులకున్= గుర్రాలకు; పార్శ్వశోషణంబునున్= ప్రక్కలు శుష్కించుటయును; మయూరంబులకున్= నెమళ్ళకు; పత్రోద్భేదనంబును= ఈకలు ఊడుటయును; కోకిలంబులకున్= కోయిలలకు; నేత్రరోగంబును= కంటివ్యాధియును; శుకంబులకున్= చిలుకలకు; హిక్కయున్= ఎక్కిళ్ళును; అజంబులకున్= మేకలకు; చిత్తభ్రమణంబును= మనస్సు భ్రమించుటయును; శార్దూలంబులకున్= పులులకు; శ్రమంబును= శ్రాంతియును; మనుష్యులకున్= మానవులకు; జనన మరణ+ఆదులయెడన్= పుట్టుక, చావు మొదలైన సందర్భాలలో; వేదనా+ఆవేశంబునున్+కాన్= దుఃఖావేశమును కాగా; విభాగించెన్= విభజించాడు; ఇవి= ఈ చెప్పినవి; జ్వరప్రకారంబు= జ్వరముయొక్క స్వరూపం; జ్వరంబు= జ్వరం; మహేశ్వరతేజంబు+అగున్= శివసంబంధమైన

తేజస్సు; కావునన్= అందువలన; సర్వజనంబులకున్= సమస్తప్రజలకు; నమస్కార్యంబునున్= నమస్కరించదగినదియును; మాననీయంబును= పూజించదగినదియును; ఐ+ఉండున్= అయి ఉన్నది.

తాత్పర్యం: ఆ శివుడు వారిపట్ల అనుగ్రహపరుడై దేవతలకు, మునులకూ ఆనందం కలిగించాడు. బ్రహ్మదేవుడు ఆ చంద్రశేఖరుడితో 'దేవా! నీ నొసటి చెమట నుండి పుట్టిన పురుషుడు 'జ్వరం' అనే పేరుతో ప్రసిద్ధుడవుతాడు. అతడు సర్వత్రా సంచరిస్తాడు. ఆ జ్వరం ఏకరూపమై ఉంటే భూమి భరించలేదు. అందువలన దానిని నానా రూపాలుగా సృష్టించుము' అని చెప్పాడు. అప్పుడు శంకరుడు ఆ జ్వరాన్ని ఏనుగులకు తలనొప్పిగా, పాములకు కుబుసంగా, గోవులకు గిట్టలలో నొప్పిగా, లేళ్ళకు తమరూపు చూచేదానికి ఆటంకంగా, గుర్రాలకు పార్శ్వభాగంలో శోషణంగా, నెమళ్ళకు ఈకలు ఊడిపోవటంగా, కోకిలలకు నేత్రవ్యాధిగా, చిలుకలకు వెక్కిళ్ళుగా, మేకలకు మనోభ్రాంతిగా, పులులకు శ్రమగా, మానవులకు చావుపుట్టుకలు మొదలైన సందర్భాలలో దుఃఖంగా విభజించాడు. ఇది జ్వరస్వరూపం. జ్వరం శివుడి తేజస్సు. అందుచేత అది అందరికీ నమస్కరించదగింది, సమ్మానించదగిందిగాఉన్నది.

క. జ్వరకథ వినినఁ బఠించినఁ, బురుషుం డారోగ్యసిద్ధిఁ బొందలుం; దేజఃస్ఫురణముఁ జిత్తసమాధియు, దొరకొనుఁ; గోర్కులు ఫలించు; దురితము లడఁగున్.' 444

ప్రతిపదార్థం: జ్వరకథ= జ్వరచరిత్ర; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; పురుషుఁడు= మనుజుడు; ఆరోగ్యసిద్ధిన్= ఆరోగ్య ప్రాప్తితో; పొందలున్= శోభిల్లుతాడు; తేజస్స్ఫురణమున్= తేజస్సుయొక్క దీప్తియును; చిత్తసమాధియున్= మనోనిగ్రహమును; దొరకొనున్= లభిస్తుంది; కోర్కులు= అభిలాషలు; ఫలించున్= ఫలిస్తాయి; దురితములు= పాపాలు; అడఁగున్= నశిస్తాయి.

తాత్పర్యం: జ్వరముయొక్క ఈ చరిత్రను విన్నా, చదివినా పురుషుడు ఆరోగ్యం పొందుతాడు. అతడికి తేజస్సూ, చిత్తనిగ్రహమూ సిద్ధిస్తాయి. కోర్కెలు తీరుతాయి. పాపాలు తొలగిపోతాయి'.

క. అని చెప్పి యమరతటినీ, తనూభవుం డాదరమున ధర్మసుతునితో 'ననఘా! నీ విం కెయ్యది, వినవల?' తనవుడు నతండు వినయానతుఁడై. 445

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; అమరతటినీ తనూభవుండు= గంగాసుతుడు; ఆదరమునన్= ప్రీతితో; ధర్మసుతునితోన్= ధర్మపుత్రుడితో; అనఘా!= పాపరహితుడా!; నీవు+ఇంకన్= నీవు ఇంకమీదట; ఏ+అది= ఏది; వినవలతు(వు)?= వినగోరుతున్నావు?; అనవుడున్= అనగా; అతండు= ధర్మజుడు; వినయ+ఆనతుఁడు+ఐ= వినయంతో ప్రణమిల్లినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి భీష్ముడు ప్రీతితో ధర్మజుడిని చూచి 'అనఘా! నీ వింకా ఏమి వినాలనుకొంటున్నావు?' అని ప్రశ్నించాడు. అంతట ధర్మరాజు వినయంతో భీష్ముడికి నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

శాస్త్రతత్త్వం బెఱుంగని వాఁడు సేయవలసిన విధము (సం. 12-276-3)

తే. 'శాస్త్రతత్త్వ మెఱుంగక సంశయాత్ముఁ, డగుచుఁ బరమార్థ మిట్టిది యనఁగలేని యట్టివాఁ డేమి కర్మంబు నాచరించు, వాఁడు సెప్పవె ధర్మప్రవర్తనజ్ఞ!' 446

ప్రతిపదార్థం: ధర్మప్రవర్తనజ్ఞ!= ధర్మంయొక్క ప్రవృత్తిని తెలిసిన ఓ పితామహా!; శాస్త్రతత్త్వమున్= శాస్త్రముయొక్క నిజ స్వరూపాన్ని; ఎఱుంగక= తెలియక; సంశయ+ఆత్ముఁడు+అగుచున్= సందేహంతో కూడిన మనస్సు కలవాడవుతూ; పరమార్థము=

ముఖ్యార్థం; ఇట్టిది= ఇటువంటిది; అనఁగన్ లేని అట్టివాఁడు= అనజాలని మనుజుడు; ఏమి కర్మంబున్= ఏ పనిని; ఆచరించువాఁడు= చేయువాడు; చెప్పవే!= వివరించుమా!

తాత్పర్యం: 'ధర్మప్రవృత్తిని గ్రహించిన పితామహా! శాస్త్రతత్త్వం ఏమిటో తెలియక సందేహించేవాడు ఇదమిత్థమని పరమార్థం గ్రహించజాలడు. అట్లాంటివాడు ఏ పని చేస్తాడో వివరించుము.

వ. అని యడిగిన నమ్మహామతి యతని కిట్లను 'గురుపూజయు వృద్ధోపసేవనంబును విద్యాశ్రవణంబు నవశ్యకర్తవ్యంబులు; మఱియునుం జేయవలయునవి నారద గాలవ సంవాదంబు వినినం దెలియు; వినుము చెప్పెద; నారదు నాశ్రయించి గాలవుండు. 447

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ+మహామతి= ఆ మహాబుద్ధి అయిన భీష్ముడు; అతనికిన్= ధర్మజుడికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; గురుపూజయున్= ఆచార్యులను అర్చించటమూ; వృద్ధ+ఉపసేవనంబును= పెద్దలను సేవించటమూ; విద్యాశ్రవణంబున్= విద్యను వినటమూ; అవశ్యకర్తవ్యంబులు= తప్పక చేయదగినవి; మఱియునున్= ఇంకను; చేయవలయునవి= అనుష్ఠించవలసినవి; నారద గాలవ సంవాదంబున్= నారదగాలవమునుల సంభాషణమును; వినినన్= వింటే; తెలియున్= తెలుస్తుంది; చెప్పెదన్= వివరిస్తాను; వినుము= ఆకర్ణించుము; గాలవుండు= గాలవుడను ముని; నారదున్+ఆశ్రయించి= నారదుడిని చేరి.

తాత్పర్యం: ధర్మజుడు అట్లా అడిగేసరికి మహాబుద్ధిమంతు డయిన భీష్ము డతడితో ఇట్లా అన్నాడు: 'గురువులను పూజించటం, వృద్ధులను సేవించటం, విద్యను వినటం తప్పక చేయదగిన పనులు. ఇంకా చేయదగినవి నారదగాలవుల మధ్య జరిగిన సంవాదం వింటే తెలియవస్తాయి. ఆ సంవాదం చెప్పుతాను, వినుము. గాలవుడు నారదమునిని ఆశ్రయించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నానా శాస్త్రంబుల న । ర్థానేకత్వంబు గనుచు నప్రాప్త సువి
జ్ఞానపరినిష్ఠ మగు మ । న్మానసముం దేర్పవే సమగ్రవివేకా!' 448

ప్రతిపదార్థం: సమగ్రవివేకా!= పూర్ణవివేకం కలవాడా!; నానా శాస్త్రంబులన్= వివిధ శాస్త్రాలలో; అర్థ+అనేకత్వంబున్= విషయాల బాహుళ్యాన్ని; కనుచున్= చూస్తూ; అప్రాప్తసువిజ్ఞాన పరినిష్ఠము+అగు= పొందబడని మంచి విజ్ఞానమునందు నిష్ఠను పొందనిదైన; మన్మానసమున్= నా చిత్తాన్ని; తేర్పవే!= ప్రసన్నత పొందించుమా!

తాత్పర్యం: పూర్ణవివేకం కల ఓ నారదమునీంద్రా! నేను అనేక శాస్త్రాలు చూచాను. అందులోని నానా విషయాలు నా దృష్టికి వచ్చాయి. కాని, మంచి విజ్ఞానంలో నా మనస్సు నిలుకడ పొందలేదు. ఇట్లాంటి నా చిత్తం ప్రసన్నమయ్యేటట్లు నాకు బోధచేయుము'.

వ. అని యభ్యర్థించిన నద్దేవముని యమ్మహాద్విజున కిట్లనియె. 449

ప్రతిపదార్థం: అని+అభ్యర్థించినన్= అని కోరగా; ఆ+దేవముని= ఆ నారదముని; ఆ+మహాద్విజునకున్= ఆ మహాబ్రాహ్మణుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: గాలవుడు ఆ రీతిగా అడిగేసరికి నారదమునీంద్రుడు ఆ మహావిప్రుడిని చూచి ఇట్లా చెప్పాడు.

క. చతురాశ్రమముల వృత్త । స్థితులు పరీక్షించి యందుఁ జెందఁదలఁచి త
ద్ధతి సూక్ష్మదృష్టిఁ గనుఁగొని । సతతంబుఁ ద్రివర్గచరిత సౌమ్యుం డగుచున్. 450

ప్రతిపదార్థం: చతురాశ్రమముల వృత్తస్థితులు= బ్రహ్మచర్యం మొదలైన నాల్గు ఆశ్రమాల వర్తనాలు, పరిస్థితులు; పరీక్షించి= పరికించి; అందున్= ఆ ఆశ్రమాలలో; చెందన్+తలఁచి= ప్రవేశించటానికి సంకల్పించి; తద్గతిన్= వాటి పోకడను; సూక్ష్మదృష్టిన్= సూక్ష్మమైన చూపుతో; కనుఁగొని= చూచి; సతతంబున్= ఎల్లవేళలా; త్రివర్గచరితన్= ధర్మాదులైన త్రివర్గాల నడతతో; సౌమ్యుండు+అగుచున్= శోభిల్లిన వాడు అవుతూ.

తాత్పర్యం: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగాశ్రమాల పరిస్థితులనూ పరికించాలి. అందులో ప్రవేశించదలచినవాడు వాటి పోకడను సూక్ష్మదృష్టితో చూడాలి. సదా ధర్మార్థకామాల నడవడికలో సౌమ్యభావం కలిగి ఉంటూ (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పాపకర్మంబు లెల్లనుఁ బాయఁ బెట్టి । పుణ్యకృత్యంబు లగువానిఁ బురుషుఁ డోపి
నట్లు శుద్ధమనస్కుఁడై యాచరించు । వాఁడు సజ్జనసంగతి వలయు నెపుడు. 451

ప్రతిపదార్థం: పురుషుఁడు= మానవుడు; పాపకర్మంబులు+ఎల్లనున్= పాపపు పనులన్నింటినీ; పాయన్+పెట్టి= త్యజించి; పుణ్యకృత్యంబులు+అగువానిన్= పుణ్యకార్యములైన వాటిని; ఓపినట్లు= శక్తి ననుసరించి; శుద్ధమనస్కుఁడు+ఐ= నిర్మలమైన చిత్తం కలవాడై; ఆచరించువాఁడు= చేసేవాడు కావాలి; ఎపుడున్= ఎల్లవేళలా; సజ్జనసంగతి= సాధుజనులతోడి పొత్తు; వలయున్= ఆవశ్యకమై ఉన్నది.

తాత్పర్యం: మనుజుడు పాపానికి హేతువులైన పను లన్నిటినీ వదలాలి. యథాశక్తి పవిత్రమైన చిత్తంతో పుణ్యకార్యాలు మాత్రమే చేయాలి. సదా సజ్జనులతో సాంగత్యం కలిగి ఉండాలి.

విశేషం: దుర్జనులతో సాంగత్యం వలన దుష్టసంస్కారాలు కలుగుతాయి. అందుచేత పాపకర్మల పట్ల ప్రవృత్తి కలుగుతుంది. పుణ్యకార్యాలు మాత్రమే చేయాలంటే అందుకు తగిన సంస్కారం సజ్జన సాంగత్యంతో సిద్ధిస్తుంది. అందుకే సజ్జనసంగతి అవసరమని చెప్పటమయింది.

క. వినుఁ సర్వభూతముల యం । దును మార్దవయుక్తుఁడై మధుర వాగ్వృత్తిం
బనుపడఁగవలయు; నార్జవ । మనూనముగ దేవపితృసమర్చకుఁ డగుచున్. 452

ప్రతిపదార్థం: వినుఁ= వినుము; ఆర్జవము= ఋజుత్వం; అనూనముగన్= వెలితిలేనిది కాగా; దేవపితృసమర్చకుఁడు+అగుచున్= దేవతలకు, పితృదేవతలకు పూజలు చేసేవాడవుతూ; సర్వభూతముల+అందునున్= సమస్తప్రాణులందును; మార్దవయుక్తుఁడు+ఐ= మెత్తదనంతో కూడినవాడై; మధురవాగ్వృత్తిన్= తియ్యని వాగ్వ్యాపారమునందు; పనుపడఁగన్ వలయున్= వాడుక పడాలి.

తాత్పర్యం: ఇంకా వినుము. పురుషుడు కపటవృత్తిని వదలి ఋజుత్వాన్ని పూర్ణంగా కలిగి ఉండాలి. దేవతలనూ, పితృదేవతలనూ శాస్త్రోక్తవిధి ప్రకారం పూజించాలి. ఎల్లప్రాణుల పట్ల కాఠిన్యం వదలి మెత్తదనంతో వ్యవహరించాలి. మధురమైన మాటలకు అలవాటు పడాలి.

క. అనహంకారము, నప్రా । ర్థనమును విషయములఁ బెద్ద దగులమియును మే;
లనఘా! పరునిందించుట । దను వర్ణించుకొను టనుచితము లెయ్యెడలన్. 453

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అనహంకారమున్= అహంకారం లేకుండా ఉండటం; అప్రార్థనమును= యాచనలేకుండా ఉండటం; విషయములన్= శబ్దం, స్పర్శం మొదలైన విషయ సుఖాలలో; పెద్ద= మిక్కిలిగా; తగులమియును= ఆసక్తుడు కాకుండా ఉండటమూ; మేలు= శ్రేయస్కరం; ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనైనా; పరున్= ఇతరుడిని; నిందించుట= తూలనాడటమూ; తనున్= తనను; వర్ణించుకొనుట= శ్లాఘించుకొనటమూ; అనుచితములు= తగని పనులు.

తాత్పర్యం: కల్మషరహితుడవైన ఓ గాలవమునీంద్రా! పురుషుడికి అహంకారం పనికిరాదు. యాచన కూడదు. అట్లాగే శబ్దస్పర్శ రూపరసగంధా లనే విషయాలలో అపరిమితమైన ఆసక్తి తగదు. అహంకారాది దోషాలు లేకుండా ఉంటే మేలు కలుగుతుంది. ఎప్పుడైనా సరే ఇతరులను నిందించటం, తనను తాను పొగడుకొనటమనేవి తగవు.

క. వినుమలసుండును గర్వియు । ననర్థభాషియును మత్సరాలీఢుఁడుఁ గ్రో
ధనుఁడును గా వలవదు శ । క్త్యనురూపతఁ జేయవలయు నాతిథ్యంబున్. 454

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అలసుండును= సోమరియు; గర్వియున్= గర్వం కలవాడూ; అనర్థభాషియును= అర్థరహితంగా మాట్లాడేవాడును; మత్సర+ఆలీఢుఁడున్= మచ్చరంచేత స్పృశించబడినవాడునూ; క్రోధనుఁడునున్= కోపం కలవాడును; కావలవదు= కాదగదు; ఆతిథ్యంబున్= అతిథిసత్కారాన్ని; శక్త్యనురూపతన్= శక్తికి తగినట్లుగా; చేయన్ వలయున్= ఆచరించాలి.

తాత్పర్యం: గాలవా! ఇంకా వినుము. మనుజుడు సోమరిపోతు, గర్వగ్రస్తుడు, నిష్ప్రయోజనంగా ఏదేదో మాటలాడేవాడు, మాత్సర్యదోషం కలవాడు, కోపశాలి కారాదు. అతిథులకు తన శక్తిననుసరించి సత్కారం చేయాలి. (శక్తికి మించిగాని, శక్తికి తక్కువగాకాని ఆతిథ్యం చేయదగదని భావం).

క. వేదాధ్యయనంబుఁ దదం । గాదరణము యజ్ఞవిధిసమారంభము ధా
త్రీదైవత సమ్మానము । నే దేశమునందుఁ గలుగు నిర వది నిలువన్. 455

ప్రతిపదార్థం: ఏ దేశమునందున్= ఏ భూ భాగములో; వేద+అధ్యయనంబున్= వేదాలు చదవటమును; తదంగ+ఆదరణమున్= వేదాల అంగాలను ఆదరించటమూ; యజ్ఞవిధి సమారంభమున్= యజ్ఞకార్యప్రయత్నమున్ను; ధాత్రీదైవత సమ్మానమున్= భూసురసత్కారమున్ను; కలుగున్= ఉండునో; అది= ఆ దేశం; నిలువన్= నివసించటానికి; ఇరవు= (తగిన) స్థానం.

తాత్పర్యం: వేదాధ్యయనం, వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - అనే ఆరు శాస్త్రాలపట్ల ప్రీతి, యజ్ఞాచరణం, బ్రాహ్మణసమ్మానమూ - ఏ దేశంలో ఉంటాయో, ఆ దేశమే నివసించటానికి తగిన ప్రదేశమవుతుంది.

క. ఇత్తెఱఁగునఁ బురుషుం డ । త్యుత్తమ చరితముల నడచుచుండఁగఁ బాయుం
జిత్తంబుకలఁక బోధో । త్పత్తికి నది మూల మగు నధర్మవిదూరా!' 456

ప్రతిపదార్థం: అధర్మవిదూరా!= అధర్మానికి మిక్కిలి దూరంగా ఉన్నవాడా!; ఈ+తెఱఁగునన్= ఈ రీతిగా; పురుషుండు= మనుజుడు; అత్యుత్తమచరితములన్= మిక్కిలి శ్రేష్ఠమైన ప్రవర్తనలతో; నడచుచుండఁగన్= చరిస్తూ ఉంటే; చిత్తంబుకలఁక= మనస్సులోని మాలిన్యం; పాయున్= తొలగుతుంది; అది= అట్లా చిత్తమాలిన్యం తొలగటం; బోధ+ఉత్పత్తికిన్= జ్ఞానం కలగటానికి; మూలము+అగున్= కారణమవుతుంది.

తాత్పర్యం: అధర్మప్రవృత్తిలేని ఓ గాలవమునీ! ఈ రీతిగా మనుష్యుడు పవిత్రమైన నడవడిక కలిగి ప్రవర్తిస్తే అతడి చిత్తదోషం పరిహరించబడుతుంది. ఆ దోషం తొలగగానే అతడికి జ్ఞానోదయ మవుతుంది'.

క. అని చెప్పె ననుడుఁ గుంతీ । తనయాగ్రజుఁ డమరతటిని తనయునితో ని
ట్లనుఁ 'గాలపాశసంఛే । దనమును ననుబోఁటి యెవ్విధంబునఁ జేయున్?' 457

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని వచించాడు; అనుడున్= అనగా; కుంతీతనయ+అగ్రజుఁడు= కుంతిపుత్రులలో పెద్దవాడైన ధర్మజుడు; అమరతటిని తనయునితోన్= గంగాసుతుడైన భీష్ముడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ననుబోఁటి= నావంటివాడు; ఏ+విధంబునన్= ఏ రీతిగా; కాలపాశసంఛేదనమునున్= కాలమనే త్రాడును తెగకోయటాన్ని; చేయున్?= చేస్తాడు?

తాత్పర్యం: అని నారదుడు గాలవుడితో చెప్పాడని భీష్ముడు ధర్మజుడితో చెప్పాడు. అప్పుడు ధర్మసుతుడు భీష్ముడితో మళ్ళీ ఇట్లా అన్నాడు: 'నావంటి వాడు కాలపాశాన్ని ఎట్లా ఛేదించగలడు?'

వ. అని యడిగిన నతం డతని కిట్లనియె. 458

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజు డట్లా ప్రశ్నించగా భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు:

అరిష్టనేమి యను ముని సగరున కుపదేశించిన ధర్మప్రకారము (సం. 12-277-2)

ఆ. 'వినుమరిష్టనేమి యను ముని నడిగె నీ । యడిగినట్ల సగరుఁ; డమ్మహాత్ముఁ
డన్నరేంద్రునకుఁ బ్రియంబునఁ జెప్పిన । సౌమ్యవాక్యములు ప్రశాంతిఁ జేయు. 459

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; సగరుఁడు= సగరచక్రవర్తి; అరిష్టనేమి అను మునిన్= 'అరిష్టనేమి' అనే ఋషిని; నీ+అడిగినట్లు+అ= నీవు ప్రశ్నించినట్లే; అడిగెన్= ప్రశ్నించాడు; ఆ+మహాత్ముఁడు= ఆ అరిష్టనేమి; ఆ+నరేంద్రునకున్= ఆ రాజుకు; ప్రియంబునన్= ప్రీతితో; చెప్పిన= వచించిన; సౌమ్యవాక్యములు= తిన్నని మాటలు; ప్రశాంతిన్+చేయున్= ప్రకృష్టమైన శాంతిని కలిగిస్తాయి.

తాత్పర్యం: 'ధర్మజా! వినుము. నీవు నన్ను ఇప్పు డడిగిన రీతిగానే పూర్వం సగరుడనే నృపాలుడు అరిష్టనేమి అనే మునీంద్రుడిని ప్రశ్నించాడు. ఆ ముని ఆ రాజుకు ప్రీతితో అపుడు చెప్పిన శాంతవచనాలు వింటే మనస్సుకు శాంతి కలుగుతుంది.

వ. వానిం జెప్పెద నవహితుండవై వినుము. సగరుం బ్రబోధించుటకు నరిష్టనేమి యిట్లను. ధనధాన్య పశుకళత్ర పుత్రాదుల సందడింబడి డెందం బాకులంబగునేని ముక్తిమార్గంబు దుర్గమంబై యుండు. 460

ప్రతిపదార్థం: వానిన్= ఆ వచనాలను; చెప్పెదన్= చెప్పుతాను; అవహితుండవు+ఐ= అవధానం కలవాడవై; వినుము= ఆలకించుము; అరిష్టనేమి= అరిష్టనేమి అనే మునీంద్రుడు; సగరున్= సగరచక్రవర్తిని; ప్రబోధించుటకున్= చక్కగా బోధించటానికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ధనధాన్య పశుకళత్ర పుత్రాదులు= ధనం, ధాన్యం, పశువులు, భార్య, బిడ్డలు మొదలైనవారి; సందడిన్= సమూహపు ఒత్తిడిలో; పడి= లగ్నమై; డెందంబు= హృదయం; ఆకులంబు+అగునేనిన్= వ్యాకులత చెందినట్లైతే; ముక్తిమార్గంబు= మోక్షపుదారి; దుర్గమంబు+ఐ+ఉండున్= పోగూడనిదై ఉంటుంది.

తాత్పర్యం: ధర్మజా! ఆ మాటలు చెప్పుతాను, సావధానంగా వినుము. సగరనృపుడిని ప్రబుద్ధుడిని చేయటానికై అరిష్టనేమి ఇలా అన్నాడు: 'ధనం, ధాన్యం, పశువులు, భార్య, పుత్రులు మొదలైన జనసమూహపు టొత్తిడిలో తగులుకొని చిత్తం వ్యాకులత్వం పొందితే మోక్షమార్గం త్రొక్కరానిదై పోతుంది.

సీ. వృద్ధ కళత్రంబు బుద్ధిమత్పుత్రుల । విడిచి నిర్భరత వివిక్త దేశ
మునకుఁ బోవలయు; సపుత్రుం డపుత్రకుం । డను విశేషంబు లే; దతులశాంతి
వైరాగ్యములు గలవానికి విను నృప । వర్య! బంధులఁబ్రోవవలదె యను త
లంపున సంసారలంపటుం డగువాఁడు । బేల; దా మృత్యువుపాలు వడిన
ఆ. యపుడవారి నరయ నబ్బునే యద్దశఁ । దలఁచి ముక్తి గోరఁదగదె యట్లుఁ
గాక తనకు వారు గలుగుదురే యప్పు । డదియుఁ దలఁపవలయు నదియ కాదె! 461

ప్రతిపదార్థం: నృపవర్య!= రాజశ్రేష్ఠా!; వినుఁ= ఆలకించుము; వృద్ధకళత్రంబున్= ముసలిదైన భార్యను; బుద్ధిమత్పుత్రులన్= బుద్ధిమంతులైన కుమారులను; విడిచి= వదలి; నిర్భరతన్= నిబ్బరంతో; వివిక్త దేశమునకున్= జనశూన్యమైన చోటికి; పోవలయున్= వెళ్ళవలెను; అతులశాంతి వైరాగ్యములు= సాటిలేని శమము, విరక్తి; కలవానికిన్= కల్గినవాడికి; సపుత్రకుండు= పుత్రులు కలవాడు; అపుత్రకుండు= పుత్రులు లేనివాడు; అనువిశేషంబు= అనే భేదం; లేదు= ఉన్నదికాదు; బంధులన్= చుట్టాలను; ప్రోవన్ వలదె?= రక్షింపవద్దా?; అను తలంపునన్= అనే సంకల్పంతో; సంసారలంపటుండు+అగువాఁడు= సంసారంలో మిక్కిలిగా ఆసక్తుడైనవాడు; బేల= మూఢుడు; తాన్= తాను; మృత్యువుపాలుపడినన్= మరణిస్తే; అప్పుడు= ఆ సమయంలో; వారిన్= ఆ బంధువులను; అరయన్ వచ్చునే?= కాపాడనగునా?; ఆ+దశన్= ఆ స్థితిని; తలఁచి= భావించి; ముక్తి= మోక్షం; కోరన్+తగదె?= అభిలషింపదగదా?; అట్లున్+కాక= అట్లా కాకున్న; అప్పుడు= తాను మరణించే సమయాన; తనకున్ వారు కలుగుదురే?= తన విషయంలో బంధువులు సాయపడతారా?; అదియున్= ఆ విషయంకూడ; తలఁపన్ వలయునదియ కాదె!= ఆలోచించదగిందే కదా!

తాత్పర్యం: రాజేంద్రా! వినుము. మనుజుడు వార్ధకదశలో ఉన్న భార్యను, బుద్ధిమంతులైన పుత్రులనూ వదలి నిబ్బరంగా ఏకాంతప్రదేశానికి పోవాలి. శాంతి, వైరాగ్యం కలవాడు తప్పక అట్లా పోతాడు, కాని అతడు బిడ్డలు కలవాడా? లేక లేనివాడా అనే తేడా లేదు. బిడ్డలున్నా విడిచి విరక్తుడు విజనస్థలానికి వెళ్ళుతాడు. సంసారంలో పూర్తిగా మునిగిపోయిన వాడు ఈ బంధువులను నేను రక్షించవద్దా? - అనే తలంపు కలిగి ఉంటాడు. అట్లాంటి వాడు మూర్ఖుడు. ఒకవేళ తాను మరణించాడనుకో, అపుడు వారి నతడు కాపాడగలడా? ఆ స్థితిని ఊహించి ముందే ముక్తి కోరుకొనాలి. బంధువులను వదలకుండా ఉన్నా, తనకు మరణం ఆసన్నమైనపుడు వారు తనను కాపాడగలరా? లేక ముక్తిని ఈయగలరా? ఈ సంగతి కూడా ఆలోచించదగిన అంశమే కదా!

తే. భూతముల పుట్టుఁ జేష్టయుఁ బొలియుటయును । జూచునేర్పు గలుగువాఁడు సూడనేర్చు
మోక్షమార్గంబు చిత్తంబు మూఢమైన । సక్తుఁడగు లోకగతి నెట్లు ముక్తి గలుగు? 462

ప్రతిపదార్థం: భూతముల పుట్టున్= ప్రాణుల పుట్టుకనూ; చేష్టయున్= అవి చేసే కర్మలూ; పొలియుటయునున్= తుదకు అవి మరణించటాన్నీ; చూచునేర్పు కలుగువాఁడు= పరిశీలించే చాతుర్యం కల బుద్ధిమంతుడు; మోక్షమార్గంబున్= ముక్తిపథాన్ని; చూడనేర్చున్= కనుగొనగలడు; చిత్తంబు= మనసు; మూఢమైనన్= మోహాగ్రస్తమైతే; లోకగతిన్= లోకప్రవృత్తిలో; సక్తుఁడు+అగున్= ఆసక్తి కలవా డవుతాడు; ముక్తి= మోక్షం; ఎట్లు కలుగున్?= ఎట్లా సంభవిస్తుంది?

తాత్పర్యం: నిత్యం ప్రాణులు పుట్టి, కర్మలు చేసి, గిట్టుతూ ఉన్నాయి. దీనిని చక్కగా గమనించినవాడు మోక్షకాంక్షతో శ్రేయోమార్గంలో పయనిస్తాడు. ఎవడి చిత్తం సంసారవ్యామోహానికి లొంగిపోయిందో వాడు లోకప్రవృత్తిలో తగులుకొని ప్రేయోమార్గంలో పడిపోతాడు. ఇక వాడికి మోక్షం ఎట్లా కలుగుతుంది?

క. అనఘ! దురన్నము శాల్యో । దనమును భూమియును మృదుల తల్పము నజిన
మ్మును సురుచిరచీనాంబర । మును సరి యెవ్వనికి నతఁడు ముక్తిం బడయున్. 463

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఎవ్వనికిన్= ఏ మనుజుడికి; దురన్నమున్= దుష్టాన్నమును; శాల్యోదనమునున్= మేలైన వరి అన్నమున్నూ; భూమియును= కటికనేలయు; మృదులతల్పమున్= మెత్తని శయ్యయు; అజినమ్మునున్= జింకచర్మమును; సురుచిర చీనాంబరమునున్= అందమైన పట్టువస్త్రమును; సరి= సమానమో; అతఁడు= అట్లాంటివాడు; ముక్తిన్= మోక్షమును; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ రాజా! ఎవడు దుష్టాన్నమునూ, మేలైన మృష్టాన్నాన్నీ, కటికనేలనూ, మెత్తని హంసతూలికాతల్పాన్నీ, జింకచర్మాన్నీ, అందమైన పట్టు పీతాంబరాన్నీ సమదృష్టితో చూస్తాడో వాడు ముక్తి పొందుతాడు.

తే . నేలయెల్లను నేలిన నృపుల పుట్టు । నీగిపోకయుఁ జూపాదిగాఁగఁ గలుగు
శక్తు లెడలినఁ జెడు మేని చందమును ద । లంప నేర్చునతఁడు మోక్షలక్ష్మిఁ జెందు. 464

ప్రతిపదార్థం: నేల+ఎల్లనున్= సమస్త భూమండలాన్నీ; ఏలిన= పాలించిన; నృపుల పుట్టున్= రాజుల జన్మయు; ఈగిపోకయున్= వెనుకకొరగి పోవటమున్నూ; చూపు+ఆది కాఁగన్+కలుగు= చూపు మొదలుగాగల; శక్తులు= సామర్థ్యాలు; ఎడలినన్= తొలగిపోగా; చెడు= చెడిపోతున్న; మేనిచందమునున్= శరీరస్థితిని; తలంపన్ నేర్చునతఁడు= భావించగల వాడు; మోక్షలక్ష్మిన్= మోక్షశ్రీని; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: సమస్త భూమండలాన్నీ పరిపాలించిన మహారాజులు సైతం కాలం చెల్లగానే నేలకొరగి పోతున్నారు. చూపు మొదలైన ఇంద్రియశక్తులు ఉడిగిపోగానే శరీరం చెడిపోతున్నది. దీనిని చక్కగా భావించి సంసారముయొక్క నిస్సారతను గమనించగలవాడు మోక్షలక్ష్మిని చేపట్టగలడు.

క. ధనయోగము దుర్లభమని । యును గ్లేశము సులభ మనియు నూహించుచు నె
మ్మనమున మర్త్యత్వము గీ । డని యెఱుఁగు నతండు గను మహానందంబున్. 465

ప్రతిపదార్థం: ధనయోగము= అర్థప్రాప్తి; దుర్లభము+అనియునున్= పొంద శక్యం కానిదనీ; క్లేశము= దుఃఖం; సులభము+అనియున్= అనాయాసంగా పొందబడునదనీ; ఊహించుచున్= భావిస్తూ; నెమ్మనమునన్= చిత్తంలో; మర్త్యత్వము= మనుష్యత్వం; కీడు+అని= అశుభమనీ; ఎఱుఁగు అతండు= తెలిసికొనే వాడు; మహానందంబున్= మోక్షానందాన్ని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ లోకంలో సుఖజీవనాని కవసరమైన ధనాన్ని సంపాదించటం సులభమైన విషయం కాదు. ఏ ప్రయత్నం చేయకుండానే వచ్చేవి క్లేశాలు అని భావించాలి. ఈ భావనవలన మానవత్వం శుభప్రదం కాదన్న సత్యం తెలియవస్తుంది. అట్లా గ్రహించినవాడు మోక్షం పొంది నిరతిశయానందాన్ని అందుకొంటాడు.

క. కావున గృహస్థవృత్తి । న్నీవతిలోలుఁడవు గాక నెఱిఁ జేయుము ర
క్షావిధి ధరణీప్రజకుం । గైవల్యము దాన నీకుఁ గలుగుం జులుకన్.' 466

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; నీవు గృహస్థవృత్తిన్= నీవు గృహస్థుడికి చెందిన వర్తనంలో; అతిలోలుఁడవు కాక= మిక్కిలి ఆసక్తికలవాడవు కాకుండా; నెఱిన్= క్రమంగా; ధరణీప్రజకున్= భూమిలోని జనులకు; రక్షావిధిన్= రక్షణకార్యాన్ని; చేయుము= ఆచరించుము; దానన్= దానివలన; కైవల్యము= ముక్తి; చులుకన్= అనాయాసంగా; నీకున్+కలుగున్= నీకు సిద్ధిస్తుంది.

తాత్పర్యం: అందుచేత నీవు గృహస్థులకు చెందిన నడతలో లంపటుడవు కావద్దు. క్రమంగా జనానీకాన్ని నీ విధ్యుక్తధర్మం పాటించి పరిపాలించుము. అందువలన నీకు కష్టం లేకుండా మోక్షం సిద్ధిస్తుంది'.

క. అని బోధించిన సగరుం । డనయముఁ దెలివొంది నియతుఁడై ప్రజ రక్షిం
చె నరేంద్ర! నీవుఁ దద్వ । ర్తనమున నెగడుము జనాభిరంజన మొప్పన్.' 467

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; అని బోధించినన్= అరిష్టనేమి ఈ రీతిగా బోధించగా; సగరుండు= సగరు డనే భూపాలకుడు; అనయమున్= మిక్కిలి; తెలివి+ఒంది= వివేకం పొంది; నియతుఁడు+ఐ= నియమం కలవాడై; ప్రజన్= జనులను; రక్షించెన్= కాపాడాడు; నీవున్= నీవు కూడ; తద్వర్తనమునన్= అట్టి ప్రవర్తనతో; జన+అభిరంజనము= ప్రజారంజనం; ఒప్పన్= విలసిల్లగా; నెగడుము= వర్ధిల్లుము.

తాత్పర్యం: అరిష్టనేమి అట్లా ప్రబోధించేసరికి సగరచక్రవర్తి ప్రబోధితుడయ్యాడు. నియమవంతుడై ప్రజాపాలన కొనసాగించాడు. ధర్మరాజా! నీవు కూడా అతడివలె వర్తించి ప్రజలు రంజిల్లేటట్లుగా రాజ్యపాలన చేసి వర్ధిల్లుము.

తే. అనినఁ బ్రియమంది పాండవేయాగ్రజుండు । 'ధర్మ విద్వేషపరులగు దానవులకు
మంత్రియై యుండు శుక్రత్వ మహిమ యెట్లు । గలిగె భార్గవునకుఁ బుణ్యగణ్యచరిత!' 468

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండవేయ+అగ్రజుండు= ధర్మజుడు; ప్రియము+అంది= ప్రీతినొంది; పుణ్యగణ్యచరిత్ర!= పుణ్యంచే గణనీయమైన శీలంకలవాడా!; భార్గవునకున్= శుక్రుడికి; ధర్మవిద్వేషపరులు+అగు= ధర్మాన్ని ద్వేషించేవారయిన; దానవులకున్= రక్కసులకు; మంత్రి+ఐ+ఉండు= అమాత్యుడై ఉండునట్టి; శుక్రత్వ మహిమ= శుక్రత్వప్రభావం; ఎట్లు= ఎట్లా; కలిగెన్?= సంభవించింది?

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా చెప్పగా విని ధర్మరాజు ప్రీతి పొందాడు. మళ్ళీ భీష్ముడితో ఇలా అన్నాడు: 'పుణ్యంతో ప్రసిద్ధి పొందిన సచ్చరిత్రగల ఓ పితామహా! రాక్షసులు ధర్మాన్ని ద్వేషించేవారుకదా! వారికి మంత్రిగా మనగలిగే 'శుక్రత్వం' అనే మహిమ భార్గవుడికి ఎట్లా కలిగింది?'

శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము (సం. 12-278-4)

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె 'నాతఁడు యోగబలంబు పెంపునన్
ధనదుని మోసపుచ్చి తదుదాత్త ధనం బవలీలఁ గొన్న నె
మ్మనమున నొచ్చి చెప్పెఁ బురమర్దనుతోడ; నతండు దానికిం
గనలున నమ్మహేశ్వరుఁడు గన్నుల నిప్పులు రాలుచుండఁగన్. 469

ప్రతిపదార్థం: అనవుడున్= అని ప్రశ్నించగా; భీష్ముఁడు= పితామహుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ఆతఁడు= ఆ భార్గవుడు; యోగబలంబు పెంపునన్= యోగానికి చెందిన బలాతిశయంతో; ధనదునిన్= కుబేరుడిని; మోసపుచ్చి= వంచించి; తదుదాత్త ధనంబున్= ఆ కుబేరుడి శ్రేష్ఠమైన సంపదను; అవలీలన్= అనాయాసంగా; కొన్నన్= గ్రహించగా; అతండు= ఆ కుబేరుడు; నెమ్మనమునన్= హృదయంలో; నొచ్చి= బాధపడి; పురమర్దనుతోడన్= శివుడితో; చెప్పెన్= చెప్పాడు; దానికిన్= అందుకు; కనలునన్= కోపంతో; మహేశ్వరుఁడు= శివుడు; కన్నులన్= నేత్రాలలో; నిప్పులు= అగ్నికణాలు; రాలుచుండఁగన్= జారిపడుతూ ఉండగా.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా ప్రశ్నించేసరికి భీష్ముడతడితో ఇట్లా అన్నాడు: 'భార్గవుడు గొప్ప యోగబలం ప్రదర్శించి కుబేరుడిని వంచించాడు. అతడి ధనం అనాయాసంగా అపహరించాడు. అందుకు కుబేరుడు చిత్తంలో చాలా నొచ్చుకొని తన మిత్రుడూ, త్రిపురాసుర సంహారకర్తా అయిన శివుడితో జరిగిన సంగతి చెప్పాడు. అది వినగానే శివుడికి కోపం వచ్చింది. ఆగ్రహాతిశయం వలన అతడి కన్నులనుండి నిప్పులు రాలాయి. అట్లా రాలుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. శూల ముగ్రత నెత్తి 'యెచ్చోట నున్న । వాఁడు భార్గవుఁ?' డనుచు దుర్వారకోప
వివశుఁ డగుటయు? నాతఁడు వెఱచి చాల । దూరముగఁ బోయి తుప్పలఁ దూలియుండె. 470

ప్రతిపదార్థం: ఉగ్రతన్= భయంకరత్వంతో; శూలమున్= శూలాయుధాన్ని; ఎత్తి= చేపట్టి; భార్గవుఁడు= శుక్రుడు; ఏ+చోటన్= ఎక్కడ; ఉన్నవాఁడు+అనుచున్= ఉన్నాడంటూ; దుర్వారకోప వివశుఁడు+అగుటయు= వారించరాని కోపంచేత వశంతప్పినవాడు కాగానే; ఆతఁడు= ఆ భార్గవుడు; చాలన్= మిక్కిలి; వెఱచి= భయపడి; దూరముగన్+పోయి= దూరంగా వెళ్ళి; తుప్పలన్= చిన్న పొదలలో; తూలిఉండెన్= నక్కి ఉన్నాడు.

తాత్పర్యం: శివుడు భీకరంగా శూలాయుధం పైకెత్తి 'భార్గవుడు ఎక్కడ ఉన్నాడు?' అంటూ అత్యధిక కోపంతో వివశుడైనాడు. అది చూచి చాలా భయపడి భార్గవుడు పరుగెత్తి దూరంగాపోయి చిన్న పొదలలో ఒదిగి ఉన్నాడు.

క. అమ్మెయి నిలుచుటకునుఁ జి । త్త మ్మోర్వమిఁ దల్లడంబు దనికినఁ గడు వే
గమ్మునఁ ద్రిపురహరుని హ । స్తమ్మునఁ జొప్పడియెఁ గని యతఁడు వెస మ్రింగెన్. 471

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ రీతిగా; నిలుచుటకునున్= నిలిచి ఉండటానికి; చిత్తము= మనస్సు; ఓర్వమిన్= ఓర్చుకొనకపోవటం వలన; తల్లడంబు= వణకు; తనికినన్= పుట్టగా; కడువేగమ్మునన్= మిక్కిలి వేగంతో; త్రిపురహరుని= శివుడియొక్క; హస్తమునన్= చేతిలో; చొప్పడియెన్= దొరికిపోయాడు; అతఁడు= ఆ శివుడు; కని= చూచి; వెసన్= శీఘ్రంగా; మ్రింగెన్= కబళించాడు.

తాత్పర్యం: అట్లా పొదలలో దాగి ఉండటానికి అతడి చిత్తం ఓర్చుకొనలేకపోయింది. శరీరంలో కంపం కలిగింది. వెంటనే అతడు శివుడి చేతికి దొరికిపోయాడు. అది చూచి శివు డతడిని అప్పుడే మ్రింగివేశాడు.

ఆ. కడుపులోన నుండి కలగొనఁ బాఱెడు । విబుధవైరిగురుఁడు వెడలకుండు
నట్లుగాఁగఁ దెరువులన్నియు మూసి శి । శ్నంబు మూయ కంగజన్మరిపుఁడు. 472

ప్రతిపదార్థం: కడుపులోనన్+ఉండి= ఉదరములోనుండి; కలగొనన్+పాఱెడు= కలతజెంది పరుగిడుతున్న (నలువైపులకు పరుగిడుతున్న); విబుధవైరిగురుఁడు= దేవతలకు శత్రువులగు రాక్షసులకు ఆచార్యుడైన శుక్రుడు; వెడలక+ఉండునట్లు కాఁగన్= వెలుపలికి చనక ఉండేటట్లుగా; అంగజన్మరిపుఁడు= మన్మథుడి శత్రుడగు శివుడు; తెరువులు+అన్నియున్= దారులన్నీ; మూసి= బంధించి; శిశ్నంబున్= పురుషాంగమును; మూయక= బంధించక.

తాత్పర్యం: అట్లా మ్రింగి తన కడుపులో ఉంటూ కలత చెందేటట్లు ఇటూ అటూ పరుగిడుతున్న భార్గవుడు పారిపోకుండా ఉండేటట్లు శివుడు దారులన్నీ మూసివేశాడు. కాని పురుషాంగద్వారం మాత్రం మూయకుండా తెరచి ఉంచాడు.

క. వెడలు మని తెరువు సూపిన । వెడలెను భృగునందనుండు; వెండియుఁ గోపం
బడరఁగ నాతనిఁ గనుఁగొని । యెడు రుద్రునిఁ జూచి దేవి యిట్లనియె నృపా! 473

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; వెడలుము= వెడలిపొమ్ము; అని తెరువు+చూపినన్= అని దారి చూపగా; భృగునందనుండు= భార్గవుడు; వెడలెను= శిశ్నద్వారం నుండి వెలుపలికి వచ్చాడు; వెండియున్= మరలకూడ; కోపంబు+అడరఁగన్= క్రోధం ప్రసరించగా; ఆతనిన్= ఆ భార్గవుడిని; కనుఁగొనియెడు= చూస్తూ ఉన్న; రుద్రునిన్= శివుడిని; చూచి= విలోకించి; దేవి= పార్వతి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! అట్లా శివుడు శిశ్నద్వారం మాత్రం మూయక ఆ దారినుండి బయటికి పొమ్మని భార్గవుడికి దారి చూపాడు. అత డా దారినుండి వెలికి వచ్చాడు. ఇంకా శివుడి కోపం చల్లారలేదు. అతడివైపు కినుకతో చూస్తూనే ఉన్నాడు. అప్పుడు పార్వతీదేవి శివుడితో ఇట్లా అన్నది.

క. 'నీ కడుపున జన్మించుట । నాకుం గొడుకయ్యె నితఁడు; నా సుతునకు సు
శ్లోకా! యలుగం దగునే । నీకు? సుఖిం జేయు మీతనిం గృపతోడన్.' 474

ప్రతిపదార్థం: సుశ్లోకా!= మంచి కీర్తి కలవాడా!; ఇతఁడు= ఈ భార్గవుడు; నీ కడుపునన్= నీ ఉదరంలో; జన్మించుటన్= పుట్టటంతో; నాకున్+కొడుకు+అయ్యెన్= నాకూ పుత్రుడయ్యాడు; నా సుతునకున్= నా కుమారుడికై; నీకున్ అలుగన్+తగునే?= నీకు కోపింపతగునా?; ఈతనిన్= ఇతడిని; కృపతోడన్= దయతో; సుఖిన్+చేయుము= ఆనందింపజేయుము.

తాత్పర్యం: 'సుకీర్తీ! ఈ భృగుపుత్రుడు నీ కడుపునుండి పుట్టటం వలన నాకూ కొడుకయ్యాడు. నా కొడుకుపట్ల నీవు కోపించటం యుక్తమా? అందుచేత దయతో ఇతడిని సుఖవంతుడిని చేయుము'.

తే. అనినఁ దేజస్వి జేసి చంద్రార్ధ మౌళి । శిశ్నమున నిర్గమించుటఁ జేసి యితఁడు
శుక్రుఁ డనుపేర వర్తించు; సుదతి! నీకుఁ । బ్రియ మొనర్చితి ననియె సంప్రీతితోడ. 475

ప్రతిపదార్థం: అనినన్= అనగా; చంద్రార్ధమౌళి= చంద్రశేఖరుడు శివుడు; సంప్రీతితోడన్= మిక్కిలి ప్రీతితో; తేజస్వినన్= తేజోవంతుడిగా; చేసి= ఒనర్చి; సుదతి!= పార్వతీ!; శిశ్నమునన్= మగగురిద్వారా; నిర్గమించుటన్+చేసి= బయలువెడలటం వలన; ఇతఁడు= ఈ భృగునందనుడు; శుక్రుఁడు+అనుపేరన్= శుక్రుడనే నామంతో; వర్తించున్= ప్రవర్తిస్తాడు; నీకున్= పార్వతివగు నీకు; ప్రియము+ఒనర్చితిన్= ప్రియం చేశాను; అనియెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: పార్వతీదేవి అట్లా ప్రార్థించగానే శివుడు ప్రీతి పొందాడు. భార్గవుడిని తేజోవంతుడిగా చేశాడు. తరువాత పార్వతిని చూచి 'సుదతీ! వీడు నా శిశ్నమునుండి బయలువెడలినాడు. కాన 'శుక్రుడు' అనే పేరుతో వర్తిస్తాడు. నీకు ప్రియమైన కార్యం చేశా' నని చెప్పాడు.

తే. 'అనఘ! యిది భార్గవుఁడు శుక్రుఁడైన తెఱఁగు' । నావుడును ధర్మజుఁడు శాంతనవునితోడ
'నీదు వాక్యామృతమున నా నెమ్మనంబు । తృప్తి సనదు; సద్ధర్మంబుఁ దెలుపు' మనియె. 476

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇది= ఇప్పుడు చెప్పింది; భార్గవుఁడు= భృగుపుత్రుడు; శుక్రుఁడైన తెఱఁగు= శుక్రుడుగా రూపొందిన విధానం; నావుడున్= అని చెప్పగా; ధర్మజుఁడు= ధర్మపుత్రుడు; శాంతనవునితోడన్= భీష్ముడితో; నీదు వాక్య+అమృతమునన్= నీ వచనమనే సుధతో; నా నెమ్మనంబు= నా చిత్తము; తృప్తి చనదు= తృప్తి చెందదు; సద్ధర్మంబున్= మంచిధర్మాన్ని; తెలుపుము+అనియెన్= తెలియజెప్పుమన్నాడు.

తాత్పర్యం: పాపరహితు డవగు ఓ ధర్మపుత్రా! ఇప్పుడు నేను చెప్పింది భార్గవుడు శుక్రుడుగా రూపొందిన కథాక్రమం అని భీష్ముడన్నాడు. అప్పుడు ధర్మసుతుడు శంతనుసుతుడైన భీష్ముడిని చూచి 'నీ వాక్యామృతం

ఎంత గ్రోలినా నామనస్సు తృప్తి పొందటం లేదు. ఇంకా నాకు మంచి మంచి ధర్మాలు బోధించు' మని అర్థించాడు.

వ. అనవుడు నమ్మహానుభావుం డమ్మహీనాథుతోఁ 'బరాశర గీతా శ్రవణ ప్రవణుండ వగు'మది ధర్మప్రబోధకం బగునని పలికి యిట్లనియె. 477

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడైన భీష్ముడు; ఆ+మహీనాథుతోన్= ఆ రాజుతో; పరాశరగీతా శ్రవణ ప్రవణుండవు= పరాశరముని చెప్పిన గీతను వినటంలో ఆసక్తుడవు; అగుము= కమ్ము; అది= ఆ శ్రవణం; (లేక ఆ గీత); ధర్మప్రబోధకంబు+అగున్+అని= ధర్మమును చక్కగా బోధించేది అవుతుందని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడట్లా అర్థించగా మహానుభావుడైన భీష్ముడు ఆ రాజును చూచి 'నీవు పరాశరమహర్షి గీతను వినుము. అది ధర్మాన్ని చక్కగా బోధిస్తుంది' అని చెప్పి ఇట్లా పలికాడు.

జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మప్రకారము (సం. 12-279-3)

సీ. జనకభూపతి యడిగినఁ బరాశరముని। ధర్మసంబోధనతా నిరూఢి
నిట్లని యెఱిఁగించె 'నిహపరసౌఖ్యముల్। ధర్మకార్యములని తలఁచి నరుఁడు
ఫలము బీజంబునం బడయునట్టుల ధర్మ। మున సౌఖ్యసంసిద్ధిఁ బొందవలయు;
సుకృత దుష్కృతములు సుఖమును దుఃఖంబుఁ। గుడువఁ జేయక నరు విడువ వధిప!

తే. వాఙ్మనోదృష్టి కలితప్రవర్తనములఁ। గాయ చేష్టితములను నన్యాయపథముఁ
బొరయనీకున్న సత్పథనిరతి గలుగు। సత్యశమదమాహింసలు సత్పథములు. 478

ప్రతిపదార్థం: జనకభూపతి= జనకభూపాలుడు; అడిగినన్= ప్రశ్నించగా; పరాశరముని= పరాశరుడనే సంయమి; ధర్మసంబోధనతానిరూఢిన్= ధర్మమును చక్కగా బోధించుటంలోని నైపుణ్యంతో; ఇట్లు+అని= ఈ రీతిగా; ఎఱిఁగించెన్= తెలియపరచాడు; అధిప!= రాజా!; ఇహపరసౌఖ్యముల్= ఈ లోకంలోనూ; పరలోకంలోనూ కలిగే సుఖములు; ధర్మకార్యములు= ధర్మం కారణంగా కలిగే కార్యాలు; అని తలఁచి= అని భావించి; నరుఁడు= మనుజుడు; బీజంబునన్= విత్తనముతో; ఫలమున్= పండును; పడయునట్టుల= పొందునట్లు; ధర్మమునన్= ధర్మముతో; సౌఖ్యసంసిద్ధిన్= సుఖప్రాప్తిని; పొందవలయున్= చెందవలెను; సుకృత దుష్కృతములు= పుణ్యపాపములు; సుఖమునున్= సౌఖ్యమును; దుఃఖమున్= క్లేశమును; కుడువన్+చేయక= అనుభవించేటట్లు చేయకుండ; నరున్= మనుజుడిని; విడువవు= వదలవు; వాఙ్మనోదృష్టి కలిత ప్రవర్తనములన్= మాటలు, మనస్సు, చూపు - వీటితో కూడిన ప్రవృత్తులయందును; కాయచేష్టితములను= శరీరముతో చేయు పనులలోనూ; అన్యాయపథమున్= అధర్మమార్గం; పొరయనీక+ఉన్నన్= పొందనీయకుండా ఉన్నచో; సత్పథనిరతి= సన్మార్గంపై ఆసక్తి; కలుగున్= సంభవిస్తుంది; సత్యశమదమా హింసలు= సత్యము, అంతరింద్రియ నిగ్రహం; బాహ్యేంద్రియనిగ్రహం, అహింస- అనేవి; సత్పథములు= మంచిమార్గాలు.

తాత్పర్యం: జనకుడు పరాశరమునిని సద్ధర్మతత్త్వమును గురించి ప్రశ్నించాడు. ఆ ముని ధర్మప్రబోధమందలి నైపుణ్యంతో ఇట్లా చెప్పాడు. 'రాజా! మానవుడు ఇహలోక సుఖాలూ, పరలోక సుఖాలూ ధర్మమూలకాలే అని భావించాలి. విత్తనంవేసి తద్ద్వారా ఫలం పొందే విధంగానే ధర్మ మాచరించి సుఖం పొందాలి. పుణ్యం సుఖాన్నీ, పాపం దుఃఖాన్నీ మానవుడిచేత అనుభవింపజేయకుండా వదలవు. వాక్కులోగాని, మనస్సులోగాని, చూపులోగానీ,

శరీరంతో చేసే పనులలో గాని అన్యాయం అంటనీయకుండా ఉండగలిగితే సన్మార్గంపై ఆసక్తి కలుగుతుంది. సత్యం, అంతరింద్రియాలను నిగ్రహించటం, బాహ్యేంద్రియాలను నిగ్రహించటం, హింసలేకుండా ఉండట మనేవే సన్మార్గా లనబడుతాయి.

క. అనఘుం డింద్రియహయభృత । మనోరథ రథంబు నాఁగు మహితజ్ఞాన
త్వనిరూఢ రశ్మిశక్తిని । జనపాలక! దుష్పథమునఁ జనకుండంగన్. 479

ప్రతిపదార్థం: జనపాలక!= రాజా!; అనఘుండు= పాపరహితుడు; మహితజ్ఞానత్వ నిరూఢరశ్మి శక్తినిన్= శ్రేష్ఠజ్ఞానత్వమనే ప్రసిద్ధమైన పగ్గాలబలంతో; ఇంద్రియహయభృత మనోరథరథంబున్= ఇంద్రియాలనే గుర్రాలచేత భరించబడిన కోరికలనే రథాన్ని; దుష్పథమునన్= దుర్మార్గంలో; చనకుండంగన్= పోకుండా ఉండేటట్లు; ఆఁగున్= అరికట్టుతాడు.

తాత్పర్యం: రాజా! పాపరహితుడైన మనుజుడు శ్రేష్ఠమైన తెలివి అనే పగ్గాలతో ఇంద్రియాలనే గుర్రాలతో లాగబడే కోరిక లనే రథాన్ని అపమార్గంలో పోనీయకుండా నిగ్రహిస్తాడు.

విశేషం: అలం: రూపకం. శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు అనే గుర్రాలు కోరికలనే రథాన్ని లాగుతున్నాయి. జ్ఞాని అయినవాడు తన జ్ఞానమనే పగ్గంతో ఇంద్రియాలను అరికట్టాలి. లేకపోతే ఇంద్రియాలు విషయాసక్తితో రథాన్ని అపమార్గంలోకి ఈడ్చుకుపోతాయి. అట్లా జరిగితే రథం గమ్యం చేరక ప్రమాదానికి లోనవుతుంది. ఇంద్రియ నిగ్రహంతో మానవుడు అధర్మమార్గంలో ప్రవేశించకుండా ఉండాలని భావం. కోరిక అనే రథం పరమాత్మవైపు పయనించాలి గాని, విషయాలవైపు పోకూడదు. కఠోపనిషత్తులో శరీరం రథంతోనూ, ఆత్మ రథికుడితోనూ, బుద్ధి సారథితోనూ, మనస్సు పగ్గంతోనూ, ఇంద్రియాలు గుర్రాలతోనూ, విషయాలు అపమార్గాలతోనూ రూపించబడ్డాయి. అక్కడి రూపకాలంకార ప్రక్రియే కొంత మార్పుతో ఇక్కడ అనుసరించబడింది.

ఆ. పడయరాని యాయు వొడలికిఁ గలిగినఁ । బాపకృతుల దానిఁ బదటఁ గలుప
నగునె పుణ్యవిధిసమాచరణములఁ గై । సేయవలయుఁ గాక చెలువు మిగుల. 480

ప్రతిపదార్థం: ఒడలికిన్= శరీరానికి; పడయన్ రాని= పొందరాని; ఆయువు= జీవితకాలము; కలిగినన్= లభిస్తే; దానిన్= దానిని; చెలువు= శోభ; మిగులన్= అతిశయించగా; పుణ్యవిధి సమాచరణములన్= పుణ్యకార్యముల నాచరించుటలతో; కైసేయవలయున్+కాక!= అలంకరింపవలెనుగాక!; పాపకృతులన్= పాపకార్యాలతో; పదటన్+కలుపన్+అగునె?= బూడిదలో కలపటం యుక్తమా?

తాత్పర్యం: శరీరానికి దుర్లభమైన ఆయువు దొరికినప్పుడు దానిని పాపపు పనులతో బూడిదపాలు చేయటం తగునా? అట్లా కాక శోభ అతిశయించేటట్లు ఆ శరీరాన్ని పుణ్యకార్యాలు చేయటంతో అలంకరించటం తగును. పవిత్రకార్యాలతో శరీరం శోభావహమవుతుంది. పాపకార్యాలతో చివరకు దానిని బూడిదపాలు చేయటం తగదని తాత్పర్యం.

క. దురితంబులు దొడరు నహిత । కరణంబున మేలు వడయఁగాఁ గోరుట భూ
వర! దుస్సలిలస్నానా । దరము తెఱఁగు సూవె యెవ్విధంబునఁదలఁపన్. 481

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దురితంబులు= పాపాలు; తొడరు= విజృంభించునట్టి; అహితకరణంబునన్= హితములుగాని కార్యములు చేయటంవలన; మేలు= శ్రేయస్సును; పడయన్+కాన్+కోరుట= పొందాలని అభిలషించటం; ఏ+విధంబునన్= ఏ రీతిగా; తలఁపన్= ఆలోచించినా; దుస్సలిలస్నాన+ఆదరము తెఱఁగు= చెడునీటిలో స్నానము చేయుటయందలి ప్రీతివంటిది; చూవె= చూడుమా!

తాత్పర్యం: రాజా! పాపకారణమైన దుష్టకార్యాలు చేసి శ్రేయస్సు పొందాలని కోరటం ఏ విధంగా ఆలోచించినా మురికినీటిలో స్నానం చేయటం వంటిదే. శుభ్రమైన నీటిలోనే స్నానం చేయాలి. అట్లాకాక మురికినీటిలో స్నానం చేస్తే శుభ్రత కలగదు. (అట్లాగే శ్రేయస్సు కోరేవాడు పుణ్యం కల్గించే పనులు చేయాలి కాని పాపం కలిగించే పనులు చేస్తే మేలు కలగదని తాత్పర్యం).

విశేషం: అలంకారం: ఉపమ.

క. సమదర్శియై యఖిల భూ । తములను దనయట్ల కాఁగఁదలఁచుచు నెవ్వం
డమలన్యాయపరుండగు । నమరు లతని వందనీయుఁ డండ్రు నరేంద్రా! 482

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; ఎవ్వండు= ఎవడు; సమదర్శి+ఐ= సమానమైన దృష్టికలవాడై; అఖిలభూతములనున్= సర్వప్రాణులను; తన యట్ల కాఁగన్= తనవంటివే అయినట్లుగా; తలఁచుచున్= భావిస్తూ; అమలన్యాయపరుండు+అగున్= నిర్మలమైన న్యాయమునందు నిరతుడవుతాడో; అతనిన్= అట్టివాడిని; అమరులు= దేవతలు; వందనీయుఁడు= నమస్కరించదగినవాడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! ఎవడు సమదృష్టి కలిగి సమస్త ప్రాణికోటినీ తనవంటిదే అని భావిస్తూ నిర్మలమైన న్యాయాన్ని పాటిస్తాడో, అతడిని దేవతలు నమస్కరణీయుడు అని చెబుతారు.

క. ధన మించుకేని ధర్మం । బునఁ బడసినయట్టి దైన భూవర! పాత్రం
బున నిడిన నది మహాఫల । జనకంబగు నండ్రు వేదసంవేదిజనుల్. 483

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; వేదసంవేదిజనుల్= వేదాలు చక్కగా ఎరిగినవారు; ధనము= అర్థం; ఇంచుక+ఏనిన్= కొద్దిపాటిదైనా; ధర్మంబునన్= ధర్మమార్గంతో; పడసిన అట్టిది+ఐనన్= ఆర్జించినట్టిదైతే; పాత్రంబునన్= తగినవాడియందు; ఇడినన్= ఉంచితే; అది= ఆ ధనం; మహాఫలజనకంబు= గొప్ప ఫలాన్ని కలిగించేది; అగున్+అండ్రు= అవుతుందని అంటారు.

తాత్పర్యం: రాజా! వేదాలను చక్కగా గ్రహించినవారు ధనం కొద్దిగానైనా ధర్మంగా ఆర్జించబడి ఉండి, దానిని తగినవారికి దానం చేస్తే, అది గొప్ప ఫలం కలిగిస్తుందంటారు.

తే. మునుల ఋణ మధ్యయనమున, ననిమిషుల ఋ । ణంబు క్రతువున; నతిథిఋణంబు పూజఁ
దీర్చునది శ్రాద్ధమునఁ బితృదేవతల ఋ । ణంబు, నరుల ఋణము రంజన వ్రతమున. 484

ప్రతిపదార్థం: అధ్యయనమునన్= వేదాధ్యయనంతో; మునుల ఋణమున్= ఋషిఋణాన్ని; క్రతువునన్= యజ్ఞంతో; అనిమిషుల ఋణంబున్= దేవతల ఋణాన్ని; పూజన్= సమ్మానసత్కారాదులతో; అతిథిఋణంబున్= అతిథులై వచ్చినవారి ఋణాన్ని; శ్రాద్ధమునన్= పితృకర్మతో; పితృదేవతల ఋణంబున్= పితరుల ఋణాన్ని; రంజనవ్రతమునన్= రంజింపజేయటం అనే వ్రతంతో; నరుల ఋణమున్= ప్రజల ఋణాన్ని; తీర్చునది= తీర్చుకోవాలి.

తాత్పర్యం: వేదాలు చదవటంతో ఋషిఋణాన్ని, యజ్ఞాలు చేయటంతో దేవతల ఋణాన్ని, పూజాది సత్కారాలతో అతిథి ఋణాన్ని, పితృకర్మతో పితరుల ఋణాన్ని, చక్కని పాలనతో రంజింపజేయటం ద్వారా ప్రజల ఋణాన్ని తీర్చుకోవాలి.

క. నారద పర్వత దేవల । భారద్వాజాదు లైన పరమమునులు ధ
ర్మారంభంబునఁ బడసిరి । గారవ మట్లగుట ధర్మకరణము వలయున్. 485

ప్రతిపదార్థం: నారద పర్వత దేవల భారద్వాజాదులు+ఐన= నారదుడు, పర్వతుడు, దేవలుడు, భారద్వాజుడు మొదలైన; పరమమనులు= శ్రేష్ఠమునులు; ధర్మ+ఆరంభంబునన్= ధర్మకార్యారంభంతో; గారవమున్= గౌరవమును; పడసిరి= పొందారు; అట్లు+అగుటన్= అట్లా కావటం వలన; ధర్మకరణము= ధర్మంయొక్క ఆచరణ; వలయున్= కావాలి.

తాత్పర్యం: నారదుడు, పర్వతుడు, దేవలుడు, భారద్వాజుడు మొదలైన మహామునీంద్రులు పూర్వం ధర్మకార్యాలు చేసి గౌరవానికి పాత్రులయ్యారు. అందువలన ధర్మకార్యాలు తప్పక చేయాలి.

క. వినుము మర్షుఁడగు ననర్షుం । డనఘా! విష్ణుస్తుతిక్రియం దపమున ద
ర్మనిరూఢి నివి మనంబున । ఘన పరిబోధంబుఁ గూర్చుఁ గావున నధిపా! 486

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అధిపా!= రాజా!; వినుము= ఆలకించుము; అనర్షుండు= అయోగ్యుడైన జనుడు; విష్ణుస్తుతిక్రియన్= విష్ణుదేవుడి స్తోత్రం చేయటమనే కర్మచేతను; తపమునన్= తపస్సుచేతను; ధర్మనిరూఢిన్= ధర్మప్రసిద్ధి చేతను; ఇవి= విష్ణుస్తుతి మొదలైనవి; మనంబునన్= చిత్తమునందు; ఘన పరిబోధంబున్= గొప్ప జ్ఞానమును; కూర్చున్+కావునన్= కలిగిస్తాయి కాబట్టి; అర్షుఁడు+అగున్= యోగ్యుడవుతాడు.

తాత్పర్యం: రాజా! విష్ణుస్తోత్రం, తపస్సు, ధర్మాచరణం అనేవి మనస్సులో గొప్ప జ్ఞానం కలిగిస్తాయి. అందువలన అయోగ్యుడైనవాడు స్తోత్రం, తపస్సు, ధర్మం ఆచరిస్తే యోగ్యుడుగా రూపొందుతాడు.

ఆ. ఆహితాగ్నిఁ బుణ్యుఁ డను శ్రుతి జననియు । జనకుఁడును గురుండు సద్గతియును,
దేజమును బలంబు ధృతియును బుద్ధియు । నగ్ని యగుటఁ జేసి యమలచరిత. 487

ప్రతిపదార్థం: అమలచరిత!= నిర్మలచరిత్రం కల ఓ జనకమహారాజా!; జననియున్= తల్లియును; జనకుఁడునున్= తండ్రియును; గురుండున్= ఆచార్యుడును; సద్గతియునున్= మంచి గతియును; తేజమునున్= తేజస్సున్ను; బలంబున్= బలమున్ను; ధృతియునున్= ధైర్యమున్ను; బుద్ధియున్= మతియున్ను; అగ్ని అగుటన్+చేసి= అగ్నియే కావటం వలన; శ్రుతి= వేదం; ఆహితాగ్నిన్= అగ్నిహోత్రమునుంచుకొని ఉన్నవాడిని; పుణ్యుఁడు+అనున్= పుణ్యాత్ముడని అంటున్నది.

తాత్పర్యం: నిర్మలచరిత్రుడవైన ఓ జనకమహారాజా! తల్లి, తండ్రి, గురువు, మంచిగతి, తేజస్సు, బలం, ధృతి, బుద్ధి - ఇవన్నీ అగ్నియే. అందువల్లనే వేదం అగ్నిహోత్రము నుంచుకొన్నవాడు పుణ్యాత్ముడు అని చెప్పింది.

తే. సుజనసంగతి కర్తవ్య కుజనుఁడైన । దాన నిర్మలుఁ డయ్యెడుఁ గాన వినుము
శూద్రజాతి భూదేవ శుశ్రూషఁగాదె । యిహముఁ బరమునుఁ బడయుట మహితవృత్తి. 488

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; కుజనుఁడు+ఐనన్= దుర్జనుడైనప్పటికీ; దానన్= ఆ సజ్జన సాంగత్యంచేత; నిర్మలుఁడు= పవిత్రుడు; అయ్యెడున్+కానన్= ఔతాడుకాబట్టి; సుజనసంగతి= సజ్జనులతోడి పొత్తు; కర్తవ్య= చేయదగినది; శూద్రజాతి= శూద్రవర్ణము; భూదేవ శుశ్రూషన్+కాదె= భూసురుల సేవచేతకదా; మహితవృత్తిన్= పూజితమైన వర్తనంతో; ఇహమున్= ఈ లోకమును; పరమునున్= పరలోకమును; పడయుట= పొందటం.

తాత్పర్యం: రాజా! వినుము. ఎంతటి దుర్జనుడైనా సజ్జనసాంగత్యంతో పవిత్రుడవుతాడు. అందువలన సజ్జనసాంగత్యం అవశ్యం చేయదగింది. శూద్రకులం భూసురకులాన్ని సేవించి వారి సాంగత్యంతో గదా ఇహపరలోక సుఖాలను పొందుతున్నది!

క. అనఘా! మర్త్యుల జీవన । మనిత్యమని యెఱిఁగి సుఖమునప్పుడు దుఃఖం
బున యపుడు ధర్మ మేమఱ । కునికియ యెజ్జాతికైన నుర వూహింపన్. 489

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితా!; ఊహింపన్= ఆలోచించగా; మర్త్యుల జీవనము= మానవుల బ్రదుకు; అనిత్యము+అని= అశాశ్వతమని; ఎఱిఁగి= తెలిసికొని; సుఖమునప్పుడున్= సుఖసమయంలోగానీ; దుఃఖంబున+అపుడున్= దుఃఖసమయంలో గానీ; ధర్మము+అ= ధర్మమును; ఏమఱక+ఉనికి= ఏమరిల్లక ఉండటమే; ఏ+జాతికిన్+ఐనన్= ఏ జాతిలో పుట్టినవాడికైనా; ఉరవు= ఉచితం.

తాత్పర్యం: పాపరహితుడా! మానవజీవితం శాశ్వతం కాదని తెలిసికొని సుఖకాలంలో గానీ, దుఃఖకాలంలో కానీ ధర్మంపట్ల ఏమరుపాటు లేకుండా ఉండటమే ఏ జాతివారైనా పాటించవలసిన ఉచిత పద్ధతి.

తే. పాప మించుక దొడరిన పనియు నెట్టి । ఫలము గలిగిన వల దల్ప ఫల విధాయి
యైన పుణ్యమిశ్రితకార్య మాచరించు । నది; శివంబగు దాన నిహమ్ముఁ బరము. 490

ప్రతిపదార్థం: ఇంచుక= కొంచెం; పాపము= కిల్బిషం; తొడరిన= కలిగిన; పనియున్= కార్యమును; ఎట్టిఫలముగల్గినన్= ఎట్లాంటి ప్రయోజనం సిద్ధించినా; వలదు= చేయవద్దు; అల్పఫలవిధాయి= కొంచెం ప్రయోజనం కలిగించేది; ఐన= అయినట్టి; పుణ్యమిశ్రితకార్యమున్= పుణ్యంతో కూడిన పనిని; ఆచరించునది= చేయునది; దానన్= దానిచేత; ఇహమ్మున్= ఈ లోకమును; పరమున్= పరలోకమును; శివంబు+అగున్= శుభప్రద మవుతుంది.

తాత్పర్యం: ఎంత ఫలం దానివలన కలుగుతున్నా ఆ పని కొంచెం పాపంతో కూడి ఉంటే, చేయవద్దు. ఫలం కొంచెమే అయినా పుణ్యంతో కూడిన పని తప్పక చేయాలి. దానివలన ఇహపరలోకాలలో శుభం కలుగుతుంది.

తే. యజ్ఞపరుఁడు రక్షకుఁడు నుపార్జకుండు । విప్రశుశ్రూషకుఁడు గాని విప్రరాజ
వైశ్యశూద్రులు దక్కటివాని నెట్టి । ధర్ములఁ జేసిరేని నధర్మపరుల. 491

ప్రతిపదార్థం: యజ్ఞపరుఁడు= యజ్ఞంచేయడంలో ఆసక్తి కలవాడు; రక్షకుఁడు= రాజ్యరక్షణ ఒనరించేవాడు; ఉపార్జకుండు= ధనం సంపాదించేవాడు; విప్రశుశ్రూషకుఁడు= బ్రాహ్మణసేవకుడు; కాని= కానట్టి; విప్రరాజ వైశ్యశూద్రులు= బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రులు; తక్కటివానిన్= పై జెప్పినవాడికంటె అన్యములైన; ఎట్టిధర్ములన్= ఎట్టి ధర్మకార్యాలను; చేసిరేనిన్= చేసినప్పటికీ; అధర్మపరులు+అ= ధర్మపరులు కానివారే.

తాత్పర్యం: యజ్ఞంచేయని విప్రుడు, రక్షణ చేయని క్షత్రియుడు, తన వృత్తిలో ధనమార్జించని వైశ్యుడు, బ్రాహ్మణ సేవ చేయని శూద్రుడు - వీరు తదితరమైన ఎట్టి ధర్మకార్యాలు చేసినా, అధర్మపరులే కాని ధర్మపరులు కారు.

ఆ. ధర్మలబ్ధమైన ధనము పాతికయేని । బహుళఫలము నిచ్చుఁ; బాపవృత్తి
పార్జితంబు కోటియైన నిష్ఫలమంద్రు । దానశాస్త్ర విదులు మానవేంద్ర! 492

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= రాజా!; దానశాస్త్రవిదులు= దానశాస్త్రం తెలిసినవారు; ధర్మలబ్ధము+ఐన= ధర్మకార్యాలు చేయటంతో దొరకిన; ధనము= అర్థం; పాతికఏనిన్= నాలుగవవంతైనా(కొంచెమైనా); బహుళఫలమున్+ఇచ్చున్= ఎక్కువ ఫలాన్ని

ప్రసాదిస్తుంది; పాపవృత్తి+ఉపార్జితంబు= పాపపు పనిచేత సంపాదించబడినదైన ధనం; కోటి ఐనన్= కోటిసంఖ్యగలదైనా (అత్యధికమైనను); నిష్ఫలము+అండ్రు= ప్రయోజనం లేనిదని చెప్పుతారు.

తాత్పర్యం: రాజా! దానశాస్త్రం పరిశోధించిన విద్వాంసులు ధర్మపద్ధతిలో ఆర్జించిన ధనం కొద్దిపాటిదైనా బహుప్రయోజనకారి అనీ, అధర్మపద్ధతిలో ఆర్జించిన విత్తం కోటి అయినా (అత్యధికమైనా) నిష్ప్రయోజనమనీ చెప్పుతారు.

క. నృపధర్మ వైశ్యధర్మము । లపాపకర్మములు జీవనాభావము పా
లుపడిన బ్రాహ్మణునకు నర । కపాతమగు శూద్రకర్మ కర్తృత్వమునన్. 493

ప్రతిపదార్థం: జీవనాభావము= జీవించటానికి లేమి అనగా పేదరికంయొక్క; పాలుపడిన= వశమైన; బ్రాహ్మణునకున్= విప్రుడికి; నృపధర్మవైశ్య ధర్మములు= రాజవృత్తి, వైశ్యవృత్తి అనే రెండు వృత్తులును; అపాపకర్మములు= పాపంలేని పనులు; శూద్రకర్మ కర్తృత్వమునన్= శూద్రుడి పనికి పూనుకొనటంచేత; నరకపాతము+అగున్= నరకంలో పడటం సంభవిస్తుంది.

తాత్పర్యం: ఒకవేళ బ్రాహ్మణుడు జీవించటానికి లేక పేదరికం పాలు పడితే రాజులకు, వైశ్యులకు విధించబడిన వృత్తి నాశ్రయించి జీవించవచ్చును. దానివలన పాపమంటదు. కాని, అట్టి విప్రుడు శూద్రవృత్తి అయిన సేవాభావాన్ని అంగీకరిస్తే నరకంలో పడిపోతాడు.

క. రాజునకును ధర్మము శ । స్త్రాజీవిక యొకఁడు; వైశ్యుఁ డాపద యైనన్
రాజవర! మధువు మాంసముఁ । దాఁ జట్టి యిడంగఁ బొందు దౌర్గత్యంబున్. 494

ప్రతిపదార్థం: రాజవర!= నృపవర్యా!; రాజునకునున్= నృపుడికి; శస్త్రాజీవిక+ఒకఁడు+అ= శస్త్రమును చేపట్టి జీవించుటొక్కటే; ధర్మము= కర్తవ్యధర్మమై ఉన్నది; వైశ్యుఁడు= తృతీయవర్ణంవాడు; ఆపద ఐనన్= కష్టం సంభవించినపుడు; తాన్= తాను; మధువున్= కల్లును; మాంసమున్= మాంసాన్ని; చట్టిన్= పాత్రలో; ఇడంగన్= పెట్టినచో; దౌర్గత్యంబున్= దుర్గతిని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! శస్త్రము నాశ్రయించిన జీవిక ఒకటే క్షత్రియుడికి ధర్మం. వైశ్యుడు తనకు కష్టం వచ్చినప్పుడు తన ధర్మం వదలి మధుమాంససేవనం చేస్తే దుర్గతి పాలవుతాడు.

క. జనవర! కృషిఁ బశుపాలన । మున నేనియు బ్రదుకు ధర్మముగ నార్యులు శూ
ద్రునకు విధింతురు జీవన । వినాశమున వాన వృత్తి వినిహత గామిన్. 495

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; శూద్రునకున్= నాలుగవవర్ణం వానికి; ఆర్యులు= పెద్దలు; జీవనవినాశమునన్= బ్రదుకుతెరువు నశించునపుడు; వానన్= కృషిమొదలగు వాటిచేత; వృత్తి= తన వర్తనం; వినిహత+కామిన్= చెడిపోదు కాబట్టి; కృషిన్= వ్యవసాయం చేతను; పశుపాలనమునన్+ఏనియున్= పశురక్షచేతనైనను; బ్రదుకు= జీవనం; ధర్మముగన్= చేయదగిన ధర్మంగా; విధింతురు= నియమిస్తారు.

తాత్పర్యం: రాజా! శూద్రుడు బ్రదుకుతెరువు నశించినప్పుడు వ్యవసాయం చేసి, పశువులను పాలించి జీవించవచ్చును. అది ధర్మమని పెద్దలు చెప్పుతారు. దానివలన ఆ స్థితిలో శూద్రవృత్తికి చేటు లేదు కాబట్టి వా రట్లా నియమం చేశారు.

సీ. వినుఁ తొల్లి ధర్మవర్తనము లసహ్యంబు । లైన దానవులు మహోగ్రహమున
నరులయం దెలసిన నరవర! వారలు । దర్పరోషముల నధర్మవృత్తిఁ
దగిలినఁ గలఁగె వేదములును గ్రతువులు । సురలు విషణ్ణులై పురహరునకు
నంతయు నెఱిఁగింప, నతఁడు త్రిశూలంబుఁ । బనుప దైత్యావిష్టభావ మడఁచె;

తే. నది మహామునుల్ మృడునిఁ బ్రజాభిరక్ష । ణమునకై నిల్ప శ్రుతులు జన్నములుఁ దొంటి
చందమునఁ జెల్లె నమరులు సంతసింప । ననఘ! నీవునుఁ బాలింపు మట్ల ప్రజల.' 496

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; వినుఁ= ఆలకించుము; తొల్లి= పూర్వం; ధర్మవర్తనములు= ధర్మాచరణములు; అసహ్యములు+ఐనన్= సహించరానివి కాగా; దానవులు= రక్కసులు; మహా+ఆగ్రహమునన్= పెద్దకోపావేశంతో; నరులఅందున్= మానవులందు; ఎలసినన్= ప్రవేశించగా; వారలు= ఆ మనుష్యులు; దర్పరోషములన్= గర్వంతోనూ, రోషంతోనూ; అధర్మవృత్తిన్= ధర్మ విరుద్ధమైన వర్తనాన్ని; తగిలినన్= ఆశ్రయించగా; వేదములును= శ్రుతులును; క్రతువులు= యజ్ఞాలు; కలఁగెన్= కలతపొందాయి; సురలు= దేవతలు; విషణ్ణులు+ఐ= దుఃఖం పొందినవారై; అంతయున్= జరిగిన వృత్తాంతం అంతటినీ; పురహరునకున్= శివుడికి; ఎఱిఁగింపన్= తెలుపగా; అతఁడు= ఆ శివుడు; త్రిశూలంబున్= త్రిశూలమనే ఆయుధాన్ని; పనుపన్= పంపగా; అది= ఆ త్రిశూలం; దైత్యావిష్టభావమున్= రాక్షసులచేత ఆవేశింపబడిన భావాన్ని; అడఁచెన్= సంహరించింది; మహాములన్= గొప్పమునులు; మృడునిన్= శివుడిని; ప్రజాభిరక్షణమునకై= జనులను కాపాడటంకొరకై; నిల్పన్= నిలుపగా; అమరులు= దేవతలు; సంతసింపన్= ముదమొందగా; శ్రుతులు= వేదాలు; జన్నములు= యజ్ఞాలు; తొంటిచందమునన్= మునుపటివలె; చెల్లెన్= కొనసాగాయి; అనఘ!= పాపరహితుడవైన ఓ జనకమహారాజా!; నీవునున్= నీవుకూడ; అట్ల= అదే విధంగా; ప్రజలన్= జనులను; పాలింపుము= రక్షింపుము.

తాత్పర్యం: రాజా! వినుము. పూర్వం రాక్షసులు ధర్మకార్యాలు తమకు సహింపరానివయ్యేసరికి పెద్ద ఆగ్రహం పూని మానవులలో ప్రవేశించారు. ఆ మానవులు అందువలన గర్వరోషాలు పూని అధర్మకార్యాలలో నిమగ్నులయ్యారు. అప్పుడు వేదాలు, యజ్ఞాలు కలతజెందాయి. దేవతలు విషాదగ్రస్తులై ఈ వృత్తాంతమంతా శివుడికి తెలియజేశారు. శివుడు త్రిశూలాన్ని ప్రయోగించాడు. ఆ త్రిశూలం మానవులలోని రాక్షసావేశాన్ని నశింపజేసింది. అప్పుడు మహర్షులు శివుడిని ప్రజారక్షకుడిగా నిలిపారు. అంతట వేదాలు, యజ్ఞాలు పూర్వంవలెనే కొనసాగాయి. దేవతలు అందుకు సంతోషించారు. పాపరహితుడా! నీవు కూడా అట్లాగే ప్రజలను పాలించుము'.

క. అని చెప్పి తపము పెంపును । వినిపించుట కిట్టు లనియె విద్యాధరస
న్ముని దేవతాగణంబులు । వినుత తపంబునన మహిత విభవముఁ బొందెన్. 497

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; తపము పెంపునున్= తపస్సుయొక్క మహిమను; వినిపించుటకున్= వినిపింపజేయటానికై; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; విద్యాధర= విద్యాధరులు; సన్మునిదేవతా గణంబులు= శ్రేష్ఠులైన మునులు, దేవతలయొక్క సమూహాలు; వినుతతపంబునన్= ప్రశస్తమైన తపస్సుతోనే; మహితవిభవమున్= పూజ్యమైన వైభవాన్ని; పొందెన్= చెందాయి.

తాత్పర్యం: పరాశరముని ఇట్లా చెప్పి తపోమహిమను జనకుడికి వినిపించాలనుకొని మళ్ళీ ఇట్లా అన్నాడు: 'విద్యాధరులు, ఉత్తమమునులు, దేవతలయొక్క బృందాలు పూర్వం గణుతించదగిన తపస్సు చేయటంవలననే శ్రేష్ఠమైన వైభవమును పొందారు.

చ. కమలభవుండు దాఁ దపము కల్మిన కాదె సృజించె నెల్ల లో
కములను; నాదిరాజు లధికంబగు పెంపు వహించుటెల్ల ను
త్తమ తప మాచరించుటన; తద్దయు సౌఖ్యకరంబులైన భో
జ్యములును గంధమాల్యములు శయ్యలు భవ్యతపఃప్రభూతముల్. 498

ప్రతిపదార్థం: కమలభవుండు= బ్రహ్మ; తాన్= తాను; ఎల్లలోకములనున్= సమస్తమైన లోకాలనూ; తపము కల్మినకాదె= తపస్సు కలిగిఉండటం వలననేకదా!; సృజించెన్= సృష్టించాడు; ఆదిరాజులు= మొదటిభూపాలకులు; అధికంబు+అగు= దొడ్డదైన; పెంపున్= గొప్పతనాన్ని; వహించుట+ఎల్లన్= కల్గి ఉండటమంతా; ఉత్తమతపమున్= శ్రేష్ఠమైన తపస్సును; ఆచరించుటన్= చేయటంవలననే; తద్దయున్= అత్యధికంగా; సౌఖ్యకరంబులు+ఐన= సుఖం కలిగించేవి అగు; భోజ్యములునున్= భుజించదగిన పదార్థాలును; గంధమాల్యములు= సుగంధద్రవ్యాలు, మాలికలు; శయ్యలు= పాన్పులు; భవ్యతపఃప్రభూతముల్= శ్రేష్ఠమైన తపస్సునుండి కలిగినవే.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు తాను తపస్సు చేయటం వలననే సమస్త లోకాలనూ సృష్టించాడు. ఆదికాలానికి చెందిన రాజులు గొప్ప ప్రభావం కలిగి ఉండటంకూడా శ్రేష్ఠమైన తపస్సు చేయటం వలననే. పెద్దగా మనకు సుఖం కలిగించే ఆహారపదార్థాలు, గంధం, పూలమాలలు, పడుకలు - ఇవన్నీ గొప్ప తపస్సుకు ఫలంగా మనకు కలిగినవే.

తే. దారధనమిత్ర పుత్రకాద్యంబు లగు ప । దార్థముల సంగమునఁ జిత్త మలఁతఁ బొంది
విసివినప్పుడు నిర్మల విపుల తపము । గారణంబగు నుపశాంతి కలిమి కనఘ! 499

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; చిత్తము= మనస్సు; దారధనమిత్ర పుత్రక+ఆద్యంబులు+అగు= భార్య, ధనం, మిత్రులు, పుత్రులు మొదలైనట్టి; పదార్థముల సంగమునన్= వస్తువుల కలయికతో; అలఁతన్= అలసటను; పొంది= చెంది; విసివినప్పుడు= విసుగు పొందిన సమయంలో; ఉపశాంతి కలిమికిన్= ప్రశాంతి కలిగిఉండటానికి; నిర్మలవిపులతపము= విమలమూ, దీర్ఘమూ అయిన తపస్సు; కారణంబు+అగున్= హేతు వవుతుంది.

తాత్పర్యం: కల్మషంలేని ఓ రాజా! భార్య, విత్తం, మిత్రులు, పుత్రులు మొదలైన వారి పొత్తుతో మనస్సు విసిగి వేసారినప్పుడు దానికి ఉపశమనం కావాలంటే అది నిర్మలమూ, తీవ్రమూ అయిన తపస్సు నుండి మాత్రమేసిద్ధిస్తుంది.

క. వినుఁ! లోభము సంతోషం । బును దుఃఖసుఖ ప్రదములు పురుషున కవి సం
జనితములగుట తపము లే । కునికిని గలుగుటను జూవె యుర్వీనాథా! 500

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= భూనాథా!; వినుఁ= ఆలకించుము; పురుషునకున్= మనుజుడికి; లోభమున్= పిసినితనమును; సంతోషంబును= హర్షమున్నూ; దుఃఖసుఖప్రదములు= దుఃఖాన్నీ, సుఖాన్నీ కలిగించేవి; అవి= ఆ లోభసంతోషాలు; సంజనితములు+అగుట= కలగటం; తపములేక+ఉనికినిన్= తపస్సు లేకుండుటను; కలుగుటను జూవె= వలననే సుమా!

తాత్పర్యం: రాజా! ఇంకా చెప్పుతాను వినుము. మానవుడికి లోభం దుఃఖాన్ని కలిగిస్తుంది. సంతోషం సుఖాన్ని కలిగిస్తుంది. లోభమూ, సంతోషమూ తపస్సు లేకపోవటంవలననే సంభవిస్తాయి. పరిశీలించి చూడుము.

తే. అనఘ! సుఖదుఃఖములు వచ్చినపుడు మద వి । షాదములు లేక సంప్రాప్తసముపభోగ
రతుఁడు నప్రాప్యవాంఛా నిరాసకుండు । నగుట సారతపోరూప మండ్రు బుధులు. 501

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుధులు= పండితులు; సుఖదుఃఖములు= హర్షవిషాదాలు; వచ్చినపుడు= సంభవించిన సమయంలో; మదవిషాదములు లేక= పొంగటం, క్రుంగటం లేకుండా; సంప్రాప్త సముపభోగరతుఁడున్= లభించిన భోగాలలో ఆసక్తి కలవాడును; అప్రాప్యవాంఛా నిరాసకుండున్= లభ్యంకాని కోరికలను త్యజించేవాడును; అగుట= కావటం; సారతపో రూపము+అండ్రు= శ్రేష్ఠతపస్సుయొక్క రూపు అని పలుకుతారు.

తాత్పర్యం: కిల్బిషరహితుడవైన ఓ రాజా! సుఖం వచ్చినపుడు పొంగిపోక, దుఃఖం వచ్చినపుడు క్రుంగిపోక, తాముగా వచ్చి చేరిన భోగా లనుభవిస్తూ, లభించనివాటికి సంబంధించిన కోరికలను దూరం చేసికొనటమే శ్రేష్ఠమైన తపస్సుయొక్క లక్షణమని పండితులు చెప్పుతారు.

క. వరధర్మము నర్థంబును । సరసంబగు విషయ సుఖము సద్గతియుఁ దపఃపరిపాకమునన కలుగున్ । నరునకుఁ దత్త్ర్యిధాత్త నైపుణుఁ డైనన్.' 502

ప్రతిపదార్థం: నరునకున్= మనుజుడికి; తత్త్ర్యిధా+ఆత్తనైపుణుఁడు+ఐనన్= ఆయా విధాలలో పొందబడిన నేర్పు గలవాడైతే; వరధర్మమున్= శ్రేష్ఠమైన ధర్మమూ; అర్థంబునున్= విత్తమూ; సరసంబు+అగు= రసవంతమైన; విషయసుఖమున్= శబ్దాది విషయాలవలన కలిగే కామ సౌఖ్యమూ; సద్గతియున్= ఉత్తమగతియూ; తపఃపరిపాకమునన్+అ= తపస్సు పండటం చేతనే; కలుగున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: మానవుడు ఆయా విధానాలలో నేర్పు సంపాదిస్తే తపస్సు పక్వదశకు వచ్చినప్పుడే ధర్మం, అర్థం, విషయసుఖంతో కూడిన కామం, ఉత్తమగతి అయిన మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి'.

వ. అనిన విని జనకుండు వర్ణంబుల యుత్కర్షాపకర్షత్వంబులకు మూలం బెయ్యది దానిని, దాన పుత్రుండై జన్మించునం; ద్రదియు విసంశయం బగుట నెఱిఁగింపవే' యనుటయుం బరాశరుం డతని కిట్లనియె.503

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనకుండు= జనకభూపాలుడు; వర్ణంబుల= బ్రాహ్మణాదిజాతులయొక్క; ఉత్కర్ష+అపకర్షత్వంబులకున్= ఎక్కువ - తక్కువతనాలకు; మూలంబు= కారణం; ఏ+అది?= ఏది?; దానిని= ఆ విషయాన్ని; తాన్+అ= తానే; పుత్రుండు+ఐ= కుమారుడై; జన్మించున్= పుట్టుతాడు; అండ్రు= అని అంటారు; అదియున్= ఆ విషయమును; విసంశయంబు+అగుట= సందేహం తొలగునట్లుగా; ఎఱిఁగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడిగేసరికి; పరాశరుండు= పరాశరముని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరాశరుడట్లా చెప్పగా విని జనకమహారాజు 'బ్రాహ్మణక్షత్రియాదులైన వర్ణాలకు గొప్పతనం, తక్కువతనం కలగటానికి కారణ మేమి? ఆ విషయాన్నీ, తానే కుమారుడై జన్మిస్తాడని అంటారు. ఆ సంగతినీ సందేహం తీరేటట్లు నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పుడు పరాశరముని జనకమహారాజుతో ఇట్లా చెప్పాడు:

తే. 'పద్మభవముఖ బాహూరుపాదసంభ । వములు గాన భూసురరాజవైశ్యశూద్ర భావములు తారతమ్య సంప్రాప్తి నొందె । జనన దేశగుణంబుల మనుజనాథ! 504

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; భూసురరాజ వైశ్యశూద్రభావములు= బ్రాహ్మణత్వం, క్షత్రియత్వం, వైశ్యత్వం, శూద్రత్వం అనేవి; పద్మభవముఖ బాహు+ఊరు పాదసంభవములు కానన్= బ్రహ్మయొక్క వదనం, బాహువులు, తొడలు, కాళ్ళు - ఉత్పత్తి స్థానాలుగా కలవి కావున; జనన దేశగుణంబులన్= పుట్టినచోట్ల యొక్క గుణాలనుబట్టి; తారతమ్య సంప్రాప్తిన్= తరతమ భావంయొక్క ప్రాప్తిని; ఒందెన్= పొందాయి.

తాత్పర్యం: రాజా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు క్రమంగా బ్రహ్మదేవుడియొక్క ముఖం, బాహువులు, తొడలు, పాదాలు అనే చోట్లనుండి పుట్టారు. పుట్టినచోటుయొక్క భేదాలను బట్టి బ్రాహ్మణాది వర్ణాలు ఉత్కర్షభావాన్నీ, అపకర్షభావాన్నీ పొందాయి.

విశేషం: బ్రాహ్మణాది వర్ణాలపుట్టుక పురుషసూక్తం ఆధారంగా ఇక్కడ వర్ణించబడింది. పురుషసూక్తానికి వివరణ ఇచ్చేవారు పలురకాల అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. సమాజస్వరూపాన్ని విరాట్పురుషుడి స్వరూపంతో పోల్చటం జరిగిందే కాని మానవుల పుట్టుకలో స్థానభేదాలున్నాయని చెప్పటం సమంజసం కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ పుట్టినచోటే భేదాలకు కారణమని స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. పుట్టుకతోనే మానవులలో ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా భావించటమనేది భారతకాలం నుండీ వస్తున్న సంప్రదాయ మని గుర్తించవలసి ఉంటుంది.

క. తాన సుతుఁ డగుట దెలియం । గానగు; మును లాత్మ వీర్య కలనం బెచ్చో
నైనం జేయఁగ ముని భా । వానూనత ఋశ్యశృంగుఁ డాదిగఁ గనుటన్.' 505

ప్రతిపదార్థం: మునులు= మహర్షులు; ఆత్మవీర్యకలనంబు= తమ శుక్రమును ఉంచుటను; ఏ+చోనైనన్= ఏ చోటనైనా; చేయఁగన్= చేయగా; మునిభావానూనతన్= మునిత్వంయొక్క సమగ్రత్వాన్ని; ఋశ్యశృంగుఁడు+ఆదిగన్= ఋశ్యశృంగుడు మొదలుగా; కనుటన్= పొందుటచేత; తాన్+అ= తానే; సుతుఁడు+అగుట= పుత్రుడు కావటం; తెలియంగాన్+అగున్= తెలిసికొనవచ్చును.

తాత్పర్యం: మునులు తమ వీర్యాన్ని ఎక్కడ నిక్షిప్తం చేసినా అక్కడ సమగ్రమైన మునిత్వం కల్గినవారు జన్మిస్తున్నారు. ఈ సంగతిని ఋశ్యశృంగుడు మొదలైనవారిలో చూడవచ్చును. అందువలన 'ఆత్మా వై పుత్ర నామాసి' అన్నట్లు తానే పుత్రుడై జన్మిస్తున్నాడని తెలిసికొనవచ్చును'.

విశేషం: ఋశ్యశృంగుడు విభాండకుడనే మునియొక్క పుత్రుడు. విభాండకుడు నదిలో స్నానం చేస్తూ ఊర్వశిని చూచాడు. అతడి వీర్యం అప్పుడు నదిలో పడింది. ఒక ఆడమృగం ఆ నీటిని త్రాగింది. నీటితోపాటు విభాండకుని శుక్లం కూడా మృగముయొక్క గర్భంలో ప్రవేశించింది. ఆ మృగానికి పుట్టిన కుమారుడే ఋశ్యశృంగుడు. దీనినిబట్టి ఋషుల తేజస్సు ఎక్కడ పడినా అక్కడ ఋషికుమారులే పుట్టుతున్నారని తెలియరావటం వలన తండ్రి తానే తనయుడై జన్మిస్తున్నాడని గ్రహించవచ్చును.

ఆ. అనిన జనకుఁ డిట్టులను 'వినినవి యైన । వలయుఁ దెలియ వినఁగ వర్ణధర్మ
సమితిఁ గల విశేషసాధారణత్వంబు । లేర్పరించి చెప్పవే మునీంద్ర!' 506

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; జనకుఁడు= జనకచక్రవర్తి; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ముని+ఇంద్ర!= మునివర్యా!; వినినవి ఐనన్= ముందు విన్నవే ఐనప్పటికీ; తెలియన్= స్పష్టంగా తెలిసికొనటానికి; వినఁగన్ వలయున్= మళ్ళీ వినాలి; వర్ణధర్మసమితిన్= బ్రాహ్మణాదివర్ణాలయొక్క ధర్మసముచ్చయంలో; కల= ఉన్నట్టి; విశేషసాధారణత్వంబులు= విశేషభావమూ, సామాన్యభావమూ; ఏర్పరించి= విభజించి; చెప్పవే= విశదీకరించుమా!

తాత్పర్యం: పరాశరు డట్లా చెప్పగా జనకుడు మళ్ళీ ఈ రీతిగా అన్నాడు: 'మునివర్యా! పూర్వం విన్న విషయాలే స్పష్టంగా గ్రహించాలంటే మళ్ళీ మళ్ళీ వినవలసి ఉంటుంది. బ్రాహ్మణక్షత్రియాది వర్ణాలలో ఉన్న సాధారణ ధర్మాలు, విశేషధర్మాలు చక్కగా విభజించి నాకు వివరించుము.'

వ. అనుటయుఁ బరాశరుం డిట్టు లనియె. 507

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; పరాశరుండు= పరాశరముని; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: జనకు డట్లా ప్రశ్నించగా పరాశరుడిట్లా చెప్పాడు.

సీ. 'వినుము ప్రతిగ్రహంబును యాజనంబును । నధ్యాపనమును ధరామరులకుఁ,
బ్రజరక్ష నృపునకుఁ, బశుపాలనము గృషి । వాణిజ్య మనునివి వణిజులకును,
శూద్రజనులకు శుశ్రూషయు శ్రుతులు వి । శేషధర్ములుగఁ జెప్పు సత్య
శౌచంబులును నహింసయు ననసూయయు । శ్రాద్ధంబు నతిథిపూజనము నాత్మ

తే. దారపరతయు సర్వసాధారణంబు । లనఘ! వీనను నిజవృత్తులను సమస్త
జాతులును నిహపరసౌఖ్యసంపదలకు । నాస్పదములగు; నింద్యంబు లన్యవిధులు. 508

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; శ్రుతులు= వేదాలు; ధరామరులకున్= విప్రులకు; ప్రతిగ్రహంబునున్= పుచ్చుకొనటమును; యాజనంబునున్= యజింపజేయటమును; అధ్యాపనమునున్= చదివించటమును; నృపునకున్= రాజుకు; ప్రజరక్ష= జనరక్షణమును; వణిజులకునున్= వైశ్యులకు; పశుపాలనమున్= పశురక్షణమును; కృషి= వ్యవసాయమును; వాణిజ్యమునున్= వ్యాపారమును; అను+ఇవి= ఈ చెప్పినవృత్తులు; శూద్రజనులకున్= శూద్రప్రజలకు; శుశ్రూషయున్= సేవయును; విశేషధర్ములుగన్= విశిష్టమైన ధర్మాలుగా; చెప్పున్= వచించును; సత్యశౌచంబులునున్= సత్యాన్నీ, శుచినీ పాటించటం; అహింసయున్= హింసలేమి; అనసూయయున్= అసూయ లేకుండా ఉండటం; శ్రాద్ధంబున్= పితృకర్మయు; అతిథిపూజనమున్= అతిథులను సమ్మానించటమూ; ఆత్మదారపరతయున్= తన భార్యయందే తత్పరుడై ఉండటమూ; సర్వసాధారణంబులు= అన్ని వర్ణాలకూ సమానమైన ధర్మాలు; వీననున్= ఈ సామాన్యధర్మాల చేతను; నిజవృత్తులనున్= తమ తమ విశిష్టధర్మాలకు చెందిన వర్తనాల చేతను; సమస్తజాతులును= సర్వవర్ణాలూ; ఇహపరసౌఖ్యసంపదలకున్= ఈ లోకానికీ, పరలోకానికీ చెందిన సుఖవిభవాలకు; ఆస్పదములు+అగున్= స్థానాలు అవుతాయి; అన్యవిధులు= తదితరవృత్తులు; నింద్యంబులు= నిందించదగినవి.

తాత్పర్యం: 'పాపరహితుడా! నీవడిగిన విషయాలు వివరిస్తాను వినుము. బ్రాహ్మణులకు దానం పుచ్చుకొనటం, యజ్ఞం చేయించటం, వేదం చదివించటం విశేషధర్మాలు. రాజుకు ప్రజారక్షణమూ, వైశ్యులకు పశురక్షణ, వ్యవసాయం, వ్యాపారం, శూద్రులకు సేవావృత్తి - ఇవి విశేషాధర్మాలని వేదాలు చెప్పుతున్నాయి. సత్యం, శౌచం, అహింస, అసూయలేమి, పితృకర్మ, అతిథిపూజ, తన భార్యతో మాత్రమే సంగమం కలిగి ఉండటం అనేవి సర్వవర్ణాలకూ సాధారణధర్మాలు. ఈ సామాన్యధర్మాలనూ, పై జెప్పిన విశేషధర్మాలనూ పాటిస్తే అన్ని జాతులూ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సుఖం పొందుతాయి. ఇక్కడ జెప్పినట్లు కాక ఇతర ధర్మాలు పాటించటం తగదు. అవి నిందించదగినవి.

విశేషం: ఇక్కడ విప్రులకు దానం పుచ్చుకొనటం, యాగం చేయించటం, వేదం చదివించటం అనే మూడు విశేషధర్మాలు చెప్పటమయింది. వీటితోపాటు దానం చేయటం, యాగం చేయటం, వేదం చదవటం అనేవి కూడా ఉన్నాయి. ఇవి అన్నీ కలిస్తే షట్కర్మ లనబడుతాయి. అవే దానం, ప్రతిగ్రహం, యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం అని పేర్కొనబడ్డాయి.

క. భూవర! నాకుం జూడం । గా విష్ణుఁడు దైవ; మట్లు గావున నతనిన్
భావించు టెల్ల వారికిఁ । గావించును మోక్షమయసుఖము లన్నింటన్.' 509

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నాకున్+చూడంగాన్= నేను పరిశీలించగా; విష్ణుఁడు= వెన్నుడు; దైవము= దేవుడు; అట్లు కావునన్= అట్లాకావటంవలన; అన్నింటన్= అన్ని విషయాలలోనూ; అతనిన్= ఆ విష్ణువును; భావించుట= తలచటం; ఎల్లవారికిన్= అందరికీ; మోక్షమయ సుఖములు= ముక్తిమయమైన సౌఖ్యాలు; కావించును= కలిగిస్తాడు'.

తాత్పర్యం: రాజా! నా దృష్టిలో విష్ణువే పరదైవతము. అందువలన అందరూ అన్నివిషయాలలోనూ ఆ దేవుడిని తలంచటం మంచిది. అట్లా చేస్తే మోక్షాత్మక సుఖం సిద్ధిస్తుంది'.

క. అనిన విని జనక భూవిభుఁ । డనఘ! యహింసనములైన యవి యెయ్యవి? య
ప్పను లెఱుఁగ జెప్పవే నా' । కనుడు నతని కిట్టులనియె నమ్మునియధిపా! 510

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; జనకభూవిభుఁడు= జనకమహారాజు; అనఘ!= పాపరహితుడా!; అహింసనములు+ఐన అవి= హింసారహితములైనవి; ఎయ్యవి?= ఏవి?; ఆ+పనులు= ఆ కార్యాలు; నాకున్= జనకుడనైన నాకు; ఎఱుఁగన్+చెప్పవే= తెలియజెప్పుమా; అనుడున్= అనగా; ఆ+ముని= ఆ పరాశరుడు; అతనికిన్= జనకుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాశరమునీంద్రుడు ఆ రీతిగా చెప్పేసరికి విని జనకుడు 'అనఘా! హింసారహితాలైన పనులేవి? ఆ పనులు ఏవో నాకు విశదపరచుము' అని మళ్ళీ ప్రశ్నించాడు. అప్పుడు ఆ పరాశరు డా రాజుతో ఈ విధంగా చెప్పాడు.

జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము (సం. 12-280-12)

ఆ. 'శమము దమము లేమి జనులకు హింస నొ । నర్చుఁ గాన ధరణినాథ! వినుము
హింస శమదమములు హృదయంబునకు నెప్పు । నలవడంగఁ జేఁత యండ్రు బుధులు.' 511

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; వినుము= ఆలకింపుము; శమము= అంతరింద్రియ నిగ్రహం; దమము= బాహ్యేంద్రియ నిగ్రహం; లేమి= లేకపోవటం; జనులకున్= ప్రజలకు; హింసన్= పీడను; ఒనర్చున్+కానన్= కలిగిస్తుంది కాబట్టి; బుధులు= పండితులు; హృదయంబునకున్= చిత్తానికి; ఎప్డున్= ఎల్లవేళలా; శమదమములు= అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహాలు; అలవడంగన్+చేఁత= అలవాటు చేయటం; అహింస అండ్రు= 'అహింస' అని చెప్పుతారు.

తాత్పర్యం: 'రాజా! నీ వడిగిన విషయం వివరిస్తాను. వినుము. మనోనిగ్రహమనే శమమూ, బాహ్యేంద్రియ నిగ్రహమనే దమమూ లేకపోతే జనులకు హింస కలుగుతుంది. అందువలననే పెద్దలు చిత్తానికి శమదమాలు అలవాటు చేయటమే అహింస అంటారు'.

వ. అని చెప్పి వెండియుం బరాశరమునీశ్వరుం డిట్లనియె. 512

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; పరాశరమునీశ్వరుండు= పరాశరమునివర్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి మళ్ళీ పరాశరముని జనకుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'దురమున జయము గొనుటకై । నరపతులకు వలయు హింసనం బెట్లును; ద
త్పరిహరణ స్థానములును । ధరణీశ్వర! కలవు సెప్పెదను వినుమ వానిన్. 513

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= రాజా!; నరపతులకున్= రాజులకు; దురమునన్= యుద్ధంలో; జయమున్= గెలుపును; కొనుటకై= స్వీకరించటానికై; ఎట్లునున్= ఎట్లైనా; హింసనంబు= హింసించటం; వలయున్= ఆవశ్యకమై ఉన్నది; తత్పరిహరణ స్థానములునున్= ఆ హింసను పరిహరించే చోట్లు కూడ; కలవు= ఉన్నాయి; వానిన్= ఆ చోట్లను; చెప్పెదను= వివరిస్తాను; వినుమ= వినుము.

తాత్పర్యం: 'రాజా! యుద్ధభూమిలో గెలుపు పొందటానికై రాజులు ఎట్లాగూ హింస చేయక తప్పదు. అయితే ఆ హింస కలగకుండా నివారించే స్థానాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటిని వివరిస్తాను. వినుము.

క. పడినం బాఱినఁ గైదువు । వడినను వాహనము వడినఁ బార్థివముఖ్యా!
పొడువఁదగదు శత్రుని నె । య్యెడల నహింసనముఁ బోల వే సుకృతములున్. **514**

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజశ్రేష్ఠా!; పడినన్= శత్రువు క్రింద పడిపోయినా; పాఱినన్= పరుగిడినా; కైదువు= ఆయుధం; పడినను= క్రిందపడిపోయినా; వాహనము= గుర్రం వంటి వాహనం; పడినన్= పడిపోయినా; శత్రునిన్= పగవాడిని; పొడువన్+తగదు= కొట్టకూడదు; ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనైనా; ఏ సుకృతములున్= ఏ పుణ్యాలునూ; అహింసనమున్+పోలవు= హింసలేమికి సరిరావు.

తాత్పర్యం: రాజవర్యా! యుద్ధరంగములో శత్రువు క్రిందపడిపోయినపుడు, పారిపోయినపుడు, అతడిచేతిలోని ఆయుధం జారిపోయినప్పుడు, అతడి వాహనం పడిపోయినపుడు అతడిని ప్రహరించకూడదు. ఎప్పుడైనాసరే, ఏ పుణ్యకార్యాలైనా అహింసకు సాటిరావు.

క. న్యాయమున సంగరంబుం । జేయఁగ శస్త్రాగ్ని దన్నుఁ జెందిన దానం
గాయంబు విడుచు పురుషుఁడు । వేయేటికి మోక్షలక్ష్మి విభుఁ డగు నధిపా! **515**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; న్యాయమునన్= క్రమం తప్పక; సంగరంబున్= యుద్ధమును; చేయఁగన్= నిర్వహించగా; శస్త్రాగ్ని= ఆయుధాగ్ని; తన్నున్= తనను; చెందినన్= తాకితే; దానన్= దానివలన; కాయంబున్= శరీరమును; విడుచు పురుషుఁడు= త్యజించే మనుజుడు; వేయి+ఏటికిన్?= వేయిమాట లేల?; మోక్షలక్ష్మివిభుఁడు+అగున్= ముక్తిరమకు భర్త అవుతాడు.

తాత్పర్యం: రాజా! వేయిమాట లెందుకు? న్యాయంగా యుద్ధంచేసే సమయంలో శత్రువు ప్రయోగించిన శస్త్రానలం సోకి మరణించే పురుషుడు మోక్షలక్ష్మికి మగడవుతాడు.

క. తనతోఁ దుల్యుం డైనను । మనుజాధిప! యధికబల సమగ్రత్వము గ
ల్గిన నని శత్రుని వధియిం । చిన నరపతి పుణ్యలోక సిద్ధిం బొందున్.' **516**

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= రాజా!; అనిన్= యుద్ధంలో; తనతోన్+తుల్యుండు+ఐనను= తనతో సమానుడైనా; అధికబల సమగ్రత్వమున్= ఎక్కువ బలసంపూర్ణతను; కల్గినన్= కలిగిఉన్నా; శత్రుని= అట్టిపగవాడిని; వధియించిన= చంపిన; నరపతి= రాజు; పుణ్యలోకసిద్ధిన్= పుణ్యలోకప్రాప్తిని; పొందున్= చెందుతాడు.

తాత్పర్యం: యుద్ధభూమిలో ఏ భూపాలుడు తనతో బలంలో సమానుడూ, లేక తనకంటె ఎక్కువబలం కలవాడూ అయిన పగవాడిని చంపుతాడో, అతడు పుణ్యలోకాలకు పోతాడు'.

విశేషం: యుద్ధంలో చనిపోయినవాడు మోక్షం పొందుతాడని పూర్వపద్యంలో చెప్పబడింది. ఇక్కడ చంపినవాడు కూడా పుణ్యలోకాలకు పోతాడని చెప్పటమయింది. అయితే తనకంటె బలహీనుడైనవాడిని చంపితే సుగతి కలగదని ఈ పద్యాన్నిబట్టి గ్రహించాలి.

వ. అని మఱియును. **517**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ పరాశరముని ఇట్లా అన్నాడు:

క. ' భూతంబులు నింద్రియ సం । ఘాతము సత్త్వాదిగుణనికాయముఁ గాయం
బైతోఁచు టెఱిఁగినను ధ । ర్మేతరకృత్యములు సేయునే నరుఁ డనఘా! 518

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; భూతంబులున్= పంచభూతాలును; ఇంద్రియసంఘాతమున్= ఇంద్రియాల సమూహమును; సత్త్వాదిగుణనికాయమున్= సత్త్వం మొదలైన గుణాల సంచయమును; కాయంబు+ఐ= శరీరమై; తోఁచుట= ప్రకాశించటం; ఎఱిఁగినను= తెలిసికొన్నచో; నరుఁడు= మానవుడు; ధర్మేతర కృత్యములు= అధర్మకార్యాలు; చేయునే?= చేస్తాడా?

తాత్పర్యం: పాపరహితుడా! పృథివ్యాదులైన ఐదుభూతాలు, శ్రోత్రం మొదలైన ఇంద్రియాల సమూహం, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలూ శరీరంగా రూపొందుతాయి అన్న విషయం తెలిస్తే మానవుడు అధర్మకార్యాలు చేయగలడా?

క. జాతుఁడు మృతుఁ డగుట ధ్రువము; । భూతోల్లాసము లనిత్యములు; వినుఁ సద్యఃపాతి యగు శరీరంబున । కై తొఱఁగునె ధర్మపథము నార్యుం డనఘా! 519

ప్రతిపదార్థం: అనఘా!= కిల్బిషంలేనివాడా!; వినుఁ= ఆలకించుము; జాతుఁడు= పుట్టినవాడు; మృతుఁడు+అగుట= చచ్చుట; ధ్రువము= నిక్కం; భూత+ఉల్లాసములు= ప్రాణుల విలాసాలు; అనిత్యములు= అశాశ్వతాలు; ఆర్యుండు= పూజ్యుడు; సద్యఃపాతి అగు= వెంటనే పడిపోయే; శరీరంబునకై= దేహంకొరకై; ధర్మపథమున్= ధర్మమార్గాన్ని; తొఱఁగునె?= విడుచునా?

తాత్పర్యం: జనకా! ఇంకా చెప్పుతాను వినుము. పుట్టినవాడు మరణించటం తథ్యం. ప్రాణులకు సంబంధించిన ఉల్లాసాలన్నీ అశాశ్వతాలు. పూజ్యుడైన మానవుడు త్రుటిలో నశించిపోయే ఈ శరీరంకొరకై ధర్మమార్గం వీడి చరిస్తాడా?

తే. ఉత్తరాయణమును సంగరోత్సవాది । కారణంబులుఁ గలుగు సత్కర్మపరుని
మరణమునకు దుష్కాలంబు గరళరజ్జు । జలముఖములుఁ బాటిలు దుష్టచరితుమృతికి. 520

ప్రతిపదార్థం: సత్కర్మపరుని మరణమునకున్= సత్కార్యాలు చేసేవాడి చావుకు; ఉత్తర+అయనమును= ఉత్తరాయణ కాలమున్నూ; సంగర+ఉత్సవాదికారణంబులున్= యుద్ధోత్సవం మొదలైన హేతువులున్నూ; కలుగున్= సంభవిస్తాయి; దుష్టచరితు మృతికిన్= దుర్జనుడి మరణానికి; దుష్కాలంబున్= చెడుకాలం; గరళరజ్జుజలముఖములున్= విషం, త్రాడు, నీరు మొదలైనవి; పాటిలున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: సత్కార్యాలు చేసే సజ్జనుడికి మరణం ఉత్తరాయణ పుణ్యకాలంలోనూ, యుద్ధం మొదలైన సంఘటనల వలననూ కలుగుతుంది. దుష్కార్యపరుడైన దుష్టుడు దుష్టకాలంలో (దక్షిణాయనంలోనే) మరణిస్తాడు. వాడి చావుకు విషం, ఉరిత్రాడు, జలం మొదలైనవి హేతువు లవుతాయి.

క. మానవులకుఁ దలఁపఁగ న । జ్ఞానమునట్టి పగ లే; దసంగతకృత్యా
ధీనుండై రూపు సెడును । దానం గావున నుదాత్త ధర్మవిధిజ్ఞా! 521

ప్రతిపదార్థం: ఉదాత్తధర్మవిధిజ్ఞా!= శ్రేష్ఠమైన ధర్మవిధిని తెలిసినవాడా!; దానన్= అజ్ఞానంవలన; అసంగతకృత్యాధీనుండు+ఐ= అనుచితాలైన కార్యములకు వశమైనవాడై; రూపుచెడును కావునన్= నశిస్తాడు కాబట్టి; తలఁపఁగన్= ఊహించగా; మానవులకున్= మనుజులకు; అజ్ఞానమునట్టి= అజ్ఞానమువంటి; పగ= శత్రువు; లేదు= లేదు.

తాత్పర్యం: మేలైన ధర్మప్రకారమును తెలిసిన ఓ జనకమహారాజా! అజ్ఞానంవలన మానవుడు అనుచితకార్యాలకు పాల్పడి నశించిపోతాడు. అందువలన మనుష్యులకు అజ్ఞానంవంటి విరోధి మరొకడు లేడు.

క. మానుషజన్మము మే; లతి । హీనపు జాతిని జనించె నేనియు నన్యం
బైన జననంబు కంటెను । దాన సుగతివడయ నగుట దత్త్వప్రవణా! 522

ప్రతిపదార్థం: తత్త్వప్రవణా!= తత్త్వమునందు ఆసక్తుడైన వాడా!; దానన్= మానవజన్మచేత; సుగతిన్= సద్గతిని; పడయన్+అగుటన్= పొందవచ్చును కాబట్టి; అన్యంబు+ఐన= ఇతరమైన; జననంబుకంటెను= జన్మకంటె; అతిహీనపుజాతినిన్= మిగుల తక్కువ కులంలో; జనించెన్+ఏనియున్= పుట్టినను; మానుషజన్మము= మనుష్యుడియొక్క పుట్టుక; మేలు= శ్రేష్ఠం.

తాత్పర్యం: యథార్థతత్త్వమునందు ఆసక్తి గల ఓ రాజా! ఎంత తక్కువ కులంలో పుట్టినా, ఇతర జన్మలకంటె మానవుడై జన్మించటమే మేలు. ఎందుకంటే మానవజన్మవలన సద్గతిని పొందవచ్చును గదా!'

క. దానములఁ బుణ్యతీర్థ । స్నానంబుల నతిథిపూజనంబులను ఫలా
దాన నిరతుండు గా కీ । మానుష్యము గారవించు మతి నిత్యుఁడగున్.' 523

ప్రతిపదార్థం: దానములన్= దానాలివ్వటంలోనూ; పుణ్యతీర్థస్నానంబులన్= పవిత్రతీర్థాలలో స్నానం చేయటంలోనూ; అతిథిపూజనంబులనున్= అతిథులను పూజించుటలోనూ; ఫలాదాననిరతుండు కాక= ఫలాన్ని పొందటంలో ఆసక్తిగలవాడుకాక; ఈ మానుష్యమున్= ఈ మనుష్యత్వమును; గారవించుమతిన్= గౌరవించే బుద్ధిచేత; నిత్యుఁడు+అగున్= శాశ్వతుడవుతున్నాడు.

తాత్పర్యం: దానాలు, పుణ్యతీర్థాలలో స్నానాలు, అతిథి సమ్మానాలు చేసినప్పుడు వాటివలన కలిగే ఫలాన్ని ఆశించకుండా ఉండాలి. అట్లా ఉంటూ ఈ మనుష్యజన్మమును ఎవడు గౌరవిస్తాడో, వాడు శాశ్వతస్థానం పొందుతాడు. (ఫలాకాంక్ష లేకుండా సత్కర్మలు చేస్తే శాశ్వతస్థితి లభిస్తుం' దని తాత్పర్యం).

వ. అనిన విని జనక జనేశ్వరుండు పరాశరమునీశ్వరునితో 'మే లెయ్యది? పరమగతి యెయ్యది? కృతంబైన
నెద్దానికి నాశంబు లేకుండు? నెఱింగింపవే' యనవుడు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె. 524

ప్రతిపదార్థం: అనినన్= పరాశరు డట్లా చెప్పగా; విని= ఆకర్ణించి; జనకజనేశ్వరుండు= జనకరాజు; పరాశరముని+ఈశ్వరునితోన్= పరాశరమునీంద్రుడితో; ఏ+అది= ఏది; మేలు= భద్రమైనది; ఏ+అది= ఏది; పరమగతి= శ్రేష్ఠమైన గతి; కృతంబు+ఐనన్= చేయబడితే; ఏ+దానికిన్= దేనికి; నాశంబులేకుండున్= వినాశం లేకుండా ఉంటుందో; ఎఱింగింపవే!= తెలుపుమా!; అనవుడున్= అనగా; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా చెప్పగా విని జనకుడు పరాశరుడితో 'ఏది మేలు? ఏది సుగతి? ఏ పని చేస్తే దానికి వినాశం లేకుండా శాశ్వతంగా ఉంటుంది? ఈ విషయాలు నాకు తెలియపరచు' మని అడిగాడు. అప్పుడు ఆ రాజును చూచి ఆ ముని ఇట్లా పలికాడు.

ఆ. ' అరయ మే లసంగ; మంచితజ్ఞానంబు । పరమగతి, మహాతపంబు చేటు
లేని కృత్య; మిట్లుగా నెఱుంగుట సర్వ । వేదవాక్య తత్త్వవిత్వ మనఘ! 525

ప్రతిపదార్థం: అనఘ!= కిల్బిషరహితుడా!; అరయన్= పరిశీలించిచూడగా; అసంగము= సంగం లేకుండా ఉండటం; మేలు= భద్రం; అంచితజ్ఞానంబు= పూజితమైన జ్ఞానం; పరమగతి= శ్రేష్ఠమైన గతి; మహాతపంబు= గొప్ప తపస్సు; చేటులేని= చెడిపోని; కృత్యము= కార్యం; ఇట్లుగాన్= ఈ రీతిగా; ఎఱుంగుట= గ్రహించటం; సర్వవేదవాక్య తత్త్వవిత్వము= సమస్త వేదవచనాల తత్త్వాన్ని తెలియటం.

తాత్పర్యం: 'అనఘా! దేనితోనూ సంగం లేకుండా ఉండటం మేలు. మంచి జ్ఞానం కలిగిఉండటం పరమమైన గతి. గొప్ప తపస్సు అనుష్ఠిస్తే దానికెప్పుడూ నాశముండదు. ఇట్లా తెలిసికొనటమే సర్వవేదవచనాల యథార్థభావాన్ని గ్రహించటం అవుతుంది.'

వ. అని చెప్పి వెండియు. **526**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఇట్లా పలికి పరాశరుడు మళ్ళీ ఈ రీతిగా చెప్పాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుసుమతి విషయములయం । దునికి గలిగె నేనిఁ బొందఁ డుదకంబులఁ బొం
దని బిసరుహపత్త్రము చా । డ్పున నది విజ్ఞానఫలము భూపవరేణ్యా! **527**

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజవర్యా!; వినుసుమతి= బుద్ధిమంతుడు; విషయముల+అందున్= శబ్దంమొదలైన విషయాలలో; ఉనికి కలిగెన్+ఏనిన్= ఉన్నను; ఉదకంబులన్= నీళ్ళను; పొందని= అంటని; బిసురహపత్రము చాడ్పునన్= తామరాకువలె; పొందఁడు= అంటడు; అది= అట్లా అంటనితనం; విజ్ఞానఫలము= విజ్ఞానముయొక్క ప్రయోజనం.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠా! వినుము. నీళ్ళలో ఉన్నా తామరాకునకు నీరంటదు. అట్లాగే బుద్ధిగలవాడు శబ్దస్పర్శాది విషయాలలో ఉన్నా అవి అంటకుండా ఉంటాడు. అట్లా అసంగంగా ఉండటమే విజ్ఞానం గలిగిఉన్నందుకు ఫలమవుతుంది.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. అనఘ! మూఢాత్ము చిత్తంబునందు విషయ । జాల మత్యంత గాఢసంసక్తి నొందు
లక్కరసము దండాదుల జిక్కఁబట్టు । చందమున దీనిఁ గనుట ప్రశాంతికరము. **528**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; మూఢాత్ముచిత్తంబునందున్= మూర్ఖుడి మనస్సులో; విషయజాలము= శబ్దం మొదలుగా గల విషయ సమూహం; లక్కరసము= లక్కద్రవము; దండాదులన్= కట్టె మొదలైనవాటిని; చిక్కఁబట్టు చందమునన్= అంటబట్టుకొనే రీతిగా; అత్యంతగాఢసంసక్తిన్= మిక్కిలి దృఢమైన సంయోగాన్ని; పొందున్= పొందుతుంది; దీనిన్= ఈ పరిస్థితిని; కనుట= గ్రహించటం; ప్రశాంతి కరము= ప్రశాంతిని కలిగిస్తుంది.

తాత్పర్యం: జనకమహారాజా! లక్కరసం ఏ విధంగా దండం మొదలైన పదార్థాలను గట్టిగా పట్టుకొంటుందో అట్లాగే మూఢుని హృదయంలో శబ్దస్పర్శాదులైన విషయజాలం మిక్కిలి దృఢంగా అంటుకొనిపోతుంది. ఈ సంగతిని గమనించి జాగ్రత్తపడటం వలన శాంతి కలుగుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. ఇనరుచిఁ బాషాణము ర ।శ్మి నిరూఢం బైనయట్ల చిత్తము సద్భా
వనమున సదాత్మకం బగు । ననామయ స్థితికి మూల మది మనుజేంద్రా! **529**

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= రాజా; పాషాణము= రాయి (సూర్యకాంతమణి); ఇనరుచిన్= సూర్యకాంతిచేత; రశ్మినిరూఢంబు= కిరణాలతో సంబద్ధం; ఐన+అట్ల= అయిన విధంగా; చిత్తము= మనస్సు; సద్భావనమునన్= మంచిని లేక సత్స్వరూపాన్ని భావించటంచేత; సదాత్మకంబు= మంచితనమే స్వరూపముగా కలది, సత్స్వరూపం; అగున్= అవుతుంది; అది= అట్లాకావటం;

అనామయ స్థితికిన్= శుభస్థితికి; మూలము= కారణం.

తాత్పర్యం: రాజా! సూర్యకాంత శిల సూర్యుడి కాంతిలో సూర్యకిరణాలతో సంబద్ధమవుతుంది. అదే రీతిగా మనస్సు మంచిని భావిస్తే మంచిదిగానే రూపొందుతుంది. లేదా సత్యస్వరూపుడైన పరమాత్మను భావిస్తే సత్స్వరూపం గానే పరిణమిస్తుంది. అట్లా పరిణమించి నప్పుడే ఏ ఉపద్రవమూ లేని శుభస్థితి సిద్ధిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. ఆరయఁ గదళీగర్భా । సారము సంసార; మిట్టిచంద మెఱిఁగినం
జేరవు జనన మరణములు; । గారించును దీని భంగిఁ గానక యున్నన్. 530

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించగా; సంసారము= గృహస్థజీవనం; కదళీగర్భసారము= అరటిపొట్టవలె నిస్సారం; ఇట్టిచందమున్= ఈ రీతిని; ఎఱిఁగినన్= తెలిసికొంటే; జనన మరణములు= చావు పుట్టుకలు; చేరవు= దరికిరావు; దీనిభంగిన్= ఈ సంసారస్థితిని; కానక ఉన్నన్= గ్రహించకుంటే; కారించును= బాధిస్తాయి.

తాత్పర్యం: పరిశీలించి చూస్తే అరటి కంబంపొట్టవలె సంసారం సారహీనమై కనిపిస్తుంది. ఈ సంగతి గ్రహించిన వాడు చావుపుట్టుకలనుండి విముక్తు డౌతాడు. అది గ్రహించకపోతే జననమరణాలు అతడిని బాధిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

క. ఒరుల పనికిఁగా నిజహిత । విరహితుఁ డగునట్లు గాదె వివిధేంద్రియకా
ర్యరతుండై యాత్మసము । ద్ధరణంబును జేయకునికి ధరణీనాథా! 531

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; వివిధ+ఇంద్రియకార్యరతుండు+ఐ= నానావిధాలయిన ఇంద్రియాల పనులలో ఆసక్తుడై; ఆత్మసముద్ధరణంబునున్= తనను ఉద్ధరించు కొనుటను; చేయక+ఉనికి= చేయకుండా ఉండటం; ఒరులపనికిగాన్= ఇతరుల కార్యం కొరకై; నిజహితవిరహితుఁడు= తన+శ్రేయస్సుచేత విడువబడినవాడు; అగునట్లు కాదె= అయినట్లే కదా!

తాత్పర్యం: భూపతీ! మానవుడు పలురకాల ఇంద్రియకార్యాలలో నిమగ్నుడై తనను తాను ఉద్ధరించుకొనకపోవటం ఇతరుల పనికై తన శ్రేయస్సును పోగొట్టుకొన్నట్లే కదా!

క. తన గృహమున నభ్యాసం । బున మెలఁగెడు నంధు చందమున సంసారం
బునఁ దిరుగు మూఢుఁ డెఱుఁగఁడు । వినుతం బగుమోక్షపదము విమలవివేకా! 532

ప్రతిపదార్థం: విమలవివేకా!= నిర్మలమైన వివేకం కలవాడా!; తన గృహమునన్= తన ఇంటిలో; అభ్యాసంబునన్= అలవాటువలన; మెలఁగెడు= ప్రవర్తించెడు; అంధుచందమునన్= గ్రుడ్డివాడివలె; సంసారంబునన్= కుటుంబజీవనమునందు; తిరుగుమూఢుఁడు= చరించే మూర్ఖుడు; వినుతంబు+అగు= ప్రశస్తమైన; మోక్షపదమున్= ముక్తిస్థానమును; ఎఱుఁగఁడు= గ్రహించడు.

తాత్పర్యం: శుద్ధ వివేకంకల ఓ జనకమహారాజా! గ్రుడ్డివాడు అలవాటు చొప్పున తన ఇంటిలో ఇటు అటు సంచరించినట్లే జనన మరణాత్మకమైన సంసారంలో పరిభ్రమించే మూర్ఖుడు ప్రశస్తమైన మోక్షస్థితిని గ్రహించలేడు.

విశేషం: అలం: ఉపమ.

క. వినుము! మృణాళంబున నం । టిన రొంపి జలంబులం గడిగినను బెడఁబా

సిన క్రియ విమల జ్ఞానం । బున సంసారంబు వాయుఁ బురుషు నరేంద్రా! 533

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; వినుము= ఆలకించుము; మృణాళంబునన్= తామరతూడునందు; అంటిన= తగులువడిన; రొంపి= బురద; జలంబులన్= నీటిచేత; కడిగినను= శుభ్రం చేస్తే; పెడన్+పాసినక్రియన్= తొలగిపోయిన రీతిగా; విమలజ్ఞానంబునన్= నిర్మలమైన జ్ఞానంచేత; పురుషున్= మనుజుడిని; సంసారంబు= భవం; పాయున్= విడిచిపోతుంది.

తాత్పర్యం: రాజా! వినుము. తామరతూడుకు తగులుకొన్న బురద నీటితో కడిగితే తొలగిపోతుంది. అదే మాదిరిగా మానవుడికి అంటిన సంసారం నిర్మలజ్ఞానం కలిగితే వీడిపోతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. నరనాయక! శిశ్నోదర । పరాయణుం డగుచు నొండు పరికింపని దు
ర్మరుఁ డెలుకఁ బిల్లి వొదివిన । పరుసున జర వొదువ ముక్తిఁ బడయక పాలియున్. 534

ప్రతిపదార్థం: నరనాయక!= నరనాథా!; శిశ్నోదరపరాయణుండు+అగుచున్= గుహ్యేంద్రియమునందును, కుక్షియందును ఆసక్తుడవుతూ; ఒండు= మరొకటి; పరికింపని= పరిశీలించని; దుర్మరుఁడు= దుష్టమానవుడు; ఎలుకన్= మూషికమును; పిల్లిపొదివిన పరుసునన్= పిల్లి పట్టుకొన్న రీతిగా; జర= ముసలితనం; పొదువన్= ఆక్రమించగా; ముక్తిన్= మోక్షమును; పడయక= పొందక; పాలియున్= నశిస్తాడు.

తాత్పర్యం: రాజా! గుహ్యేంద్రియాన్నీ, కుక్షినీ తృప్తి పరచటంలోనే నిమగ్నుడై మరొక విషయం పరిశీలింపని దుష్టమనుజుడు పిల్లి ఎలుకను పట్టినట్లు తనను వార్ధక్యం పైకొనగా మోక్షం పొందలేక నశిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. భ్రేఁగు పెద్దైన నోడ వారిధిఁ దరింప । లేని భంగి మనోభవాలీఢవృత్తి
యగుచునుండు జీవుండు భవాబ్ధియుత్త । రింపలేఁ డిది నిజము గరిష్ఠచరిత! 535

ప్రతిపదార్థం: గరిష్ఠచరిత= శ్రేష్ఠమైన చరిత్రం కలవాడా!; ఓడ= పడవ; భ్రేఁగు= భారం; పెద్ద+ఐనన్= అధికమైతే; వారిధిన్= సముద్రాన్ని; తరింప లేని భంగిన్= దాటలేని రీతిగా; మనోభవాలీఢవృత్తి= మన్మథుడిచేత ఆక్రమించబడిన వ్యాపారం కలవాడు; అగుచున్+ఉండు= అవుతున్న; జీవుండు= జీవుడు; భవ+అబ్ధి= సంసారసాగరం; ఉత్తరింపలేఁడు= దాటలేడు; ఇది నిజము= ఇది సత్యం.

తాత్పర్యం: పవిత్రచరిత్రుడవైన ఓ రాజా! బరువు ఎక్కువైతే పడవ సముద్రం దాటలేదు. అదే రీతిగా కామావేశం అధికమైన జీవుడు సంసారసముద్రాన్ని దాటజాలడు. ఇది నిజం.

విశేషం: అలం: ఉపమ

క. పడియెడు దుఃఖము లరయం । గడుఁబెక్కల్పములు గను సుఖంబులు వీనం
బడయఁగ నగుమే లెయ్యది? । విడుప యురవు శుభము పొందు విద్యాప్రవణా! 536

ప్రతిపదార్థం: విద్యాప్రవణా!= విద్యయందు ఆసక్తుడైనవాడా!; అరయన్= పరిశీలించగా; పడియెడు= అనుభవించెడు; దుఃఖములు= క్లేశములు; పెక్కు= అధికములు; కను సుఖంబులు= అనుభవించే సుఖాలు; అల్పములు= స్వల్పములు; వీనన్=

కామతృష్ణమొదలైన ఈ దుర్గుణాలచేత; పడయఁగన్+అగు= అనుభవించే; మేలు= భద్రం; ఏ+అది= ఏది?; విడుపు+అ= త్యాగమే; ఉరవు= ఉచితమైనది; శుభముపొందు= మంచి మిత్రము.

తాత్పర్యం: గుహ్యేంద్రియతృప్తి, కుక్షింభరిత్వము అనే ఈ దుర్గుణాలవలన అనుభవానికి వచ్చే కష్టాలు ఎక్కువగా ఉంటాయి. సుఖాలు చాలా స్వల్పం. అందువలన వీటివలన కలిగే మే లేమున్నది? ఈ దుర్గుణాలను పరిత్యజించటమే ఉచితమైన కర్తవ్యం. ఆ పరిత్యాగమే మనకు కలగనున్న శుభానికి మిత్రము. (శుభం కల్గిస్తుందని భావం.)

క. మిత్రులు భార్యలు భ్రాతలుఁ । బుత్రులు నిజకార్యపరులు బోధము సు మ్మా
త్మత్రాణమునకు మూలము । ధాత్రీపతివర్య! యెవ్విధంబునఁ జూడన్. 537

ప్రతిపదార్థం: ధాత్రీపతివర్య!= రాజశ్రేష్ఠా!; ఏ+విధంబునన్+చూడన్= ఏ రీతిగా పరిశీలించినా; మిత్రులున్= స్నేహితులును; భార్యలున్= పెండ్లాములు; భ్రాతలున్= సోదరులును; పుత్రులున్= కుమారులును; నిజకార్యపరులు= తమ కార్యమునందు ఆసక్తులు; ఆత్మత్రాణమునకున్= తన రక్షణకు; మూలము= హేతువు; బోధముసుమ్ము= జ్ఞానంసుమా!

తాత్పర్యం: రాజేంద్రా! ఎట్లా ఆలోచించి చూచినా లోకంలో మిత్రులు, భార్యలు, సోదరులు, కుమారులు తమతమ పనులు సాధించుకొవటంలోనే నిమగ్నులై ఉంటారు. తనను తాను రక్షించుకొనటానికి జ్ఞానమొక్కటే సాధనం సుమా! తక్కినవారు తన రక్షణకు ఉపయోగపడరు.

ఆ. ధీరుఁడై యభేదదృష్టియ పాటించు । చుండునట్టి పురుషు నొక్కమాటు
విడువ దర్కునంశు విభవంబు చాడ్పున । బోధలక్ష్మి పెంపు భూపవర్య! 538

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠా!; అర్కున్= సూర్యుడిని; అంశువిభవంబు చాడ్పునన్= కాంతివైభవం వలె; ధీరుఁడు+ఐ= ధైర్యంకలవాడై; అభేదదృష్టి+అ= భేదంలేని చూపునే; పాటించుచుండునట్టి పురుషున్= శీలించునట్టి మానవుడిని; బోధలక్ష్మిపెంపు= జ్ఞానలక్ష్మియొక్క అతిశయం; ఒక్కమాటున్= ఒక్కసారికూడ; విడువదు= వదలదు.

తాత్పర్యం: రాజవర్యా! కాంతివైభవం సూర్యుడిని ఎప్పుడూ వదలిపెట్టి ఉండదు. అదే రీతిగా భేదభావం లేని ధీర పురుషుడిని జ్ఞానలక్ష్మి ఎప్పుడూ త్యజించదు.

విశేషం: అలం: ఉపమ.

క. అని యిట్లు పెక్కుభంగుల । మునివరుఁడు పరాశరుం డమోఘ ప్రజ్ఞా
ఘనత యొలయంగఁ జెప్పిన । జనకుఁడు ముదమందె భరత సంతతివర్యా! 539

ప్రతిపదార్థం: భరతసంతతివర్యా!= భరత సంతతిలో శ్రేష్ఠా!; ఇట్లు+అని= ఈ రీతిగా; మునివరుఁడు= మునిశ్రేష్ఠుడు; పరాశరుండు= పరాశరుడు; అమోఘప్రజ్ఞాఘనత= వ్యర్థంకాని బుద్ధియొక్క అతిశయం; ఒలయంగన్= ప్రసరించగా; పెక్కుభంగులన్= అనేకరీతులుగా; చెప్పినన్= చెప్పగా; జనకుఁడు= జనకమహారాజు; ముదము+అందెన్= సంతోషించాడు.

తాత్పర్యం: భారతవర్యా! మునిశ్రేష్ఠుడైన పరాశరుడు ఈ రీతిగా అనేకవిధాల అమోఘమైన ప్రజ్ఞతో చెప్పేసరికి జనకచక్రవర్తి సంతోషించాడు.

హంసగీత (సం. 12-288-1,2)

సీ. అనిన ధర్మసుతుండు హర్షమ్ము దనదు చి । త్తమున నిండార శాంతనవుతోడ

' దమమును సత్యంబు క్షమయును నెల్లెడ । వినుతింపఁబడు నార్యజనులచేత;
నవి యంత లెస్సలే?' యనవుడు నతనికి । నతఁడిట్టులను 'పిను హంసగీత;
యది యుత్తరంబగు నధిప! నీ ప్రశ్నంబు । నకు; దానిఁ జెప్పెద నలినభవుఁడు
తే. పసిఁడి రాయంచయై కేలిపరత నొంది । తిరుగ నొక్కెడ సాధ్యు లద్దేవుఁ గాంచి
పక్షివర! నీవు విద్యలఁ బ్రౌఢుఁడగుట । నెప్పఁగా విందు మాశ్రయించెదము నిన్ను. 540

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ధర్మసుతుండు= ధర్మరాజు; తనదు చిత్తమునన్= తన మనస్సులో; హర్షమ్ము= సంతోషం; నిండారన్= నిండగా; శాంతనవుతోడన్= భీష్ముడితో; దమమును= బాహ్యేంద్రియనిగ్రహమును; సత్యంబు= సత్యపరిపాలనము; క్షమయును= ఓర్పును; ఆర్యజనుల చేతన్= పెద్దలచేత; ఎల్లెడన్= అన్నిచోట్ల; వినుతింపఁబడున్= ప్రస్తుతింపబడుతుంది; అవి= దమము మొదలైన ఆ గుణాలు; అంత లెస్సలే?= అంతశ్రేష్ఠములైనవా?; అనవుడున్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; అతఁడు= భీష్ముడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; అధిప!= రాజా!; హంసగీత వినుం= 'హంసగీత' అన్న ఉపదేశభాగాన్ని ఆలకించుము; అది= ఆ గీత; నీ ప్రశ్నంబునకున్= నీవడిగిన ప్రశ్నకు; ఉత్తరంబు+అగున్= సమాధాన మవుతుంది; దానిన్= ఆ హంసగీతను; చెప్పెదన్= పలుకుతాను; నలినభవుఁడు= పద్మజుడైన బ్రహ్మ; పసిఁడిరాయంచ ఐ= బంగారు రాజహంసఅయి; కేళిపరతన్= క్రీడాపరత్వమును; ఒంది= పొంది; తిరుగన్= సంచరించగా; సాధ్యులు= సాధ్యులనబడే దేవతావిశేషాలు; ఒక్క+ఎడన్= ఒకచోట; ఆ+దేవున్= ఆ బ్రహ్మను; కాంచి= చూచి; పక్షివర!= పక్షిశ్రేష్ఠా!; విద్యలన్= విద్యలలో; నీవు ప్రౌఢుఁడు+అగుట= నిపుణుడవగుట; చెప్పఁగాన్+వింటము= చెప్పుతుండగా వింటున్నాము; నిన్నున్= విద్యానిపుణుడవగు నిన్ను; ఆశ్రయించెదము= ఆశ్రయంగా పొందుతాము.

తాత్పర్యం: అని భీష్ముడు పై విధంగా చెప్పేసరికి ధర్మరాజు చిత్తం సంతోషంతో నిండిపోయింది. అప్పుడు అతడు మరల భీష్ముడితో 'దమము, సత్యము, ఓర్పు - అనే సద్గుణాలు ప్రతిచోటా పెద్దలచేత కీర్తించబడుతున్నాయి. అవి అంత మంచి గుణాలా?' అని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ము డతడితో 'రాజా! 'హంసగీత' అనే గీత వినుము. అది నీ ప్రశ్నకు తగిన సమాధానంగా ఉన్నది. దానిని చెప్పుతాను. బ్రహ్మదేవుడు బంగారు రాజహంస రూపం పొంది స్వేచ్ఛగా క్రీడిస్తూ సంచరిస్తూ ఉండగా, ఒకచోట సాధ్యులు ఆ దేవుడిని చూచారు. చూచి 'పక్షివర్యా! నీవు విద్యలలో నిపుణుడ వని అనేకులు చెప్పగా విన్నాము. నిన్ను మేము ఆశ్రయిస్తున్నాము.'

వ. ' ఏము సాధ్యుల' మని పలికి సవినయంబుగా నిట్లనిరి. 541

ప్రతిపదార్థం: ఏము సాధ్యులము= మేము 'సాధ్యులు' అనబడే దేవతావర్గానికి చెందినవారము; అని పలికి= అని చెప్పి; సవినయంబుగాన్= వినయంతో; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: 'మేము సాధ్యులు అనబడే దేవతావర్గపు వారము' అని చెప్పి మళ్ళీ వారు వినయంతో బ్రహ్మ నుద్దేశించి ఇట్లా అన్నారు.

తే. ' ఉత్తమం బెద్ది? నీ చిత్త మెలయు నెందుఁ? । బురుషుఁ డెయ్యది గల్గినఁ బొందు నఖిల
కర్మబంధ మోక్షము? నట్టి ధర్మ మెఱుఁగఁ । జెప్పవే కరుణాలత చిగురులొత్త.' 542

ప్రతిపదార్థం: కరుణాలత= 'దయ' అనే తీగ; చిగురులు+ఒత్తన్= అంకురించగా; ఎద్ది= ఏది; ఉత్తమంబు= శ్రేష్ఠతమమైనది; నీ చిత్తము= నీ హృదయం; ఎందున్= దేనిలో; ఒలయున్= ప్రసరిస్తుంది?; పురుషుఁడు= మనుజుడు; ఏ+అది= ఏది; కల్గినన్= కలిగిఉంటే; అఖిలకర్మబంధమోక్షమున్= సమస్తకర్మబంధాలనుండి విడుదలను; పొందున్= చెందుతాడు; అట్టి ధర్మమున్=

అటువంటి ధర్మాన్ని; ఎఱుఁగన్+చెప్పవే= తెలియచెప్పుమా.

తాత్పర్యం: 'ఈ లోకంలో ఉత్తమమైన దేది? నీ మనస్సు దేనిలో లీనమవుతుంది? ఏది కలిగి ఉంటే పురుషుడు అన్నివిధాలైన కర్మబంధాలనుండి విడివడతాడు? అట్లాంటి ప్రశస్తధర్మాన్ని మాకు దయామయమైన చిత్తంతో వివరించుము.'

వ. అని యడిగిన నాదరించి యయ్యంచ వారల కిట్లనియె. 543

ప్రతిపదార్థం: అని+అడిగినన్= సాధ్యులట్లా ప్రశ్నించగా; ఆ+అంచ= ఆ రాజహంస; ఆదరించి= సంభావించి; వారలకున్= వారికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఆ సాధ్యులట్లా తనను ప్రశ్నించగా హంస వారిపై ఆదరం చూపి వారితో ఇట్లా అన్నది.

క. ' క్షమయును దమమును సత్యము । నమేయ మహిమాస్పదంబు లన వింటము ధ
ర్ములం దెల్లను నభివ । ర్ణ్యము; లవి హృద్గంథిభేదన ప్రౌఢంబుల్.' 544

ప్రతిపదార్థం: క్షమయును= ఓర్పును; దమమును= బాహ్యేంద్రియ నిగ్రహమును; సత్యమున్= సత్యవచనమున్ను; అమేయమహిమ+ఆస్పదంబులు+అనన్= అపరిమితమైన ప్రభావానికిస్థానాలనగా; వింటము= వింటున్నాము; అవి; ధర్ములందున్+ఎల్లనున్= సమస్త ధర్మాలలోనూ; అభివర్ణ్యములు= కీర్తించదగినవి; హృద్గ్రంథిభేదనప్రౌఢంబుల్= హృదయంలోని ముడులను భేదించటంలో సమర్థములు.

తాత్పర్యం: 'ఓర్పు, దమము, సత్యము అనే ఈ మూడు సద్గుణాలు అపరిమితమహిమ కలిగి ఉన్నాయని వింటున్నాము. అవి సమస్త ధర్మాలలోనూ కీర్తించదగినవై ఉన్నాయి. అవి హృదయంలోని వాసనామయములై అవిద్యవలన ఏర్పడిన గ్రంథులను భేదించటంలో చాలా సమర్థములై ఉన్నాయి.'

విశేషం: పూర్వజన్మలో చేసిన కర్మల వలన కలిగిన మాలిన్యం హృదయంలో వాసనారూపంలో ముడివడి ఉంటుంది. ఈ ముడులే హృదయగ్రంథులు అనబడతాయి. ఈ శరీరమే నేను, ఇది నా ధనం, నేను సుఖవంతుడిని, దుఃఖవంతుడిని' ఇత్యాది భావనలే. అవిద్యామూలంగా ఏర్పడే గ్రంథులు. క్షమ మొదలైన సద్గుణాల వలన ఈ ముడులు విడిపోతాయి.

వ. అని చెప్పి వెండియు. 545

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఆ హంస అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నది.

క. ' పరమర్మ భేదులును నయ । విరహితములు ధర్మకార్య విముఖంబులు ని
ష్ఠురములు నగు మాటలు స । త్పురుషుం డాడఁ డవి సత్యములు గా కునికిన్. 546

ప్రతిపదార్థం: అవి= ఈ చెప్పబోయేవి; సత్యములు= నిజాలు; కాక+ఉనికిన్= కాకుండా ఉండటంవలన; సత్పురుషుండు= సజ్జనుడు; పరమర్మ భేదులునున్= ఇతరుల జీవస్థానాలను భేదించేవీ; నయవిరహితములున్= నీతిలేనివీ; ధర్మకార్య విముఖంబులున్= ధర్మంతో కూడిన పనులకు విరుద్ధాలును; నిష్ఠురములున్+అగు= కఠినములునైన; మాటలు= వాక్యాలు; ఆడఁడు= పలుకడు.

తాత్పర్యం: ఇతరుల మర్మాలను భేదించేవీ, నీతికి దూరమైనవీ, ధర్మకార్యాలకు అనుకూలం కానివీ, కఠినములైనవీ అయిన వాక్యాలు సత్యాలు కాజాలవు. అందువలన సజ్జనుడు అట్టిమాటలు చెప్పడు.

క. జనములు దను నవమానిం । చిన నిందించినను మాఱుసేయక సైరిం
చిన శాంతాత్ముఁడు వారల । మును చేసిన యట్టి సుకృతముల నాఁచికొనున్. 547

ప్రతిపదార్థం: జనములు= ప్రజలు; తనున్= తనను; అవమానించినన్= పరాభవించినా; నిందించినన్= తిట్టినా; మాఱుచేయక= ప్రతీకారం చేయక; సైరించిన= సహించిన; శాంత+ఆత్ముఁడు= శాంతచిత్తుడు; వారల= వారియొక్క; మునుచేసినఅట్టి= పూర్వం కావించినట్టి; సుకృతములన్= పుణ్యాలను; ఆఁచికొనున్= అపహరించుకొంటాడు.

తాత్పర్యం: ఎవడు జనులు తనను అవమానించినా, తిట్టినా బదులు చేయకుండా సహించుకొంటాడో, అట్టి శాంతమనస్కుడు తనను అవమానించినవారు పూర్వం చేసిన పుణ్యాలను అపహరించుకొంటాడు.

క. కీడాడిన మేలాడుచుఁ । దాడన మొనరించి రేని దరహాసముతో
నీడం బోదును గ్రోధో । త్పీడ వొరయ దెప్పుడును మదీయహృదయమున్. 548

ప్రతిపదార్థం: కీడు+ఆడినన్= నిందించినా; మేలు+ఆడుచున్= శుభం పలుకుతూ; తాడనము= కొట్టటం; ఒనరించిరేనిన్= చేసినను; దరహాసమునన్= చిరునగవుతో; ఈఁడన్+పోదును= వెనుదీస్తాను; ఎప్పుడునున్= ఏ వేళనూ; మదీయహృదయమున్= నా చిత్తాన్ని; క్రోధ+ఉత్పీడ= కోపముయొక్క+ఒత్తిడి; పొరయదు= పొందదు.

తాత్పర్యం: న న్నెవరైనా నిందిస్తే నేను వారిపట్ల శుభమే పలుకుతాను కాని అశుభం పలకను. ఎవరైనా కొట్టినా చిరునవ్వుతో వెనుదీస్తాను గాని మారు కొట్టటానికి ప్రయత్నించను. ఎప్పుడూ నా హృదయంలో కోపం పొడసూపదు.

తే. వేదసారంబు సత్యంబు; వినుఁడు! సత్య । సారమూర్తి దమము; దమసార మనఘు
లార! మోక్ష; మీ పరిపాటి గారవమున । నాదరించు జనంబుల కందు ముక్తి. 549

ప్రతిపదార్థం: అనఘులార!= పాపరహితులారా!; వినుఁడు= ఆలకించండి!; వేదసారంబు= శ్రుతియొక్క సారం; సత్యంబు= సత్యవచనం; సత్యసారమూర్తి= సత్యంయొక్క సారమైన రూపం; దమము= బాహ్యేంద్రియ నిగ్రహం; దమసారము= ఇంద్రియనిగ్రహము యొక్క సారాంశం; మోక్షము= విడుదల; ఈ పరిపాటిన్= ఈ పద్ధతిని; గారవంబునన్= ప్రేమతో; ఆదరించు జనంబులకున్= గౌరవించే ప్రజలకు; ముక్తి= మోక్షం; అందున్= లభిస్తుంది.

తాత్పర్యం: పాపరహితులైన సాధ్యులారా! వినండి. వేదము యొక్క సారాంశం సత్యం. సత్యంయొక్క సారరూపం దమము, దమము యొక్క సారాంశం ముక్తి. ఈ ప్రకారం సత్యాదులను పాటించేవారికి మోక్షం కరతలామలక మవుతుంది.

క. దమమునఁ గర్మేంద్రియముల । శమియింపఁగఁ జేత యది నిసర్గగుణంబై
రమియించు నెప్పురుషు చి । త్తము దాన నతండు సర్వధర్మకరుఁ డగున్. 550

ప్రతిపదార్థం: దమమునన్= ఇంద్రియ నిగ్రహంతో; కర్మేంద్రియములన్= వాక్కు మొదలైన కర్మేంద్రియాలను; శమియింపఁగన్+చేత= శాంతింప జేయటం; అది= అది; నిసర్గగుణంబై= సహజస్వభావమై; ఏ+పురుషు చిత్తమున్= ఏ మనుజుడి మనస్సును; రమియించున్= రమింపజేస్తుందో; అతండు= ఆ మనుజుడు; దానన్= ఆ చిత్తంచేత; సర్వధర్మకరుఁడు+అగున్= సమస్త ధర్మాలు చేసినవా డవుతాడు.

తాత్పర్యం: బాహ్యేంద్రియ నిగ్రహాత్మకమైన దమంతో వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే ఐదు కర్మేంద్రియాలను శాంతింప జేయటమనేది సహజగుణమై ఎవడి మనస్సును రమింపజేస్తుందో, దానివలన అతడు సమస్తమైన ధర్మాలు చేసినవాడవుతాడు.

క. ఆ తెఱఁ గఘములఁ బాచును । బాతకములు వాయ మొగులు వాసిన సంప్ర
ద్యోతితుఁ డగు నమృతాంశుని । భాతి వెలుఁగు నాత్మమోక్షపద మది సుండీ! 551

ప్రతిపదార్థం: ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; అఘములన్= పాపాలను; పాచును= తొలగిస్తుంది; పాతకములు= పాపాలు; పాయన్= తొలగగా; మొగులు పాసినన్= మబ్బు తొలగిన; సంప్రద్యోతితుఁడు+అగు= చక్కగా ప్రకాశించేవాడైన; అమృతాంశుని భాతిన్= చంద్రుడివలె; ఆత్మ వెలుఁగున్= ఆత్మ ప్రకాశిస్తుంది; అది= ఆ ఆత్మప్రకాశమే; మోక్షపదము సుండీ!= మోక్షస్థానం సుమా!

తాత్పర్యం: ఆ రీతిగా ఇంద్రియాలను నిగ్రహించటమనే పద్ధతి పాపాలు నశింపచేస్తుంది. పాపాలు పోతే మబ్బు తొలగితే చంద్రుడు ప్రకాశించునట్లు ఆత్మ ప్రకాశిస్తుంది. అదే మోక్షం.

విశేషం: అలంకారం: ఉపమ.

క. మనసును వాక్కును రక్షం । బనుపడు నెవ్వనికి శ్రుతి తపస్త్యాగము లా
తని చేతిలోని వగునని । మునిజనములచేత విందుము నిరంతరమున్. 552

ప్రతిపదార్థం: ఎవ్వనికిన్= ఏ మనుజుడికి; మనసునున్= చిత్తమును; వాక్కునున్= మాటయు; రక్షన్+పనుపడున్= రక్షణకు అలవాటుపడునో; శ్రుతితపస్త్యాగములు= వేదము, తపస్సు, దానము అనేవి; ఆతనిచేతిలోనివి+అగున్+అని= అతడి చేతికి లభ్యము లవుతా యని; నిరంతరమున్= ఎల్లవేళలా; మునిజనములచేతన్= ఋషులచేత; విందుము= వింటాము.

తాత్పర్యం: ఎవడు మనస్సును, మాటను అపమార్గంలో పోనీయకుండా రక్షిస్తాడో, అతడి చేతిలోనే వేదం, తపస్సు, త్యాగం ఉంటాయని సదా మునులు చెప్పగా వింటున్నాము.

క. పలుకు వడినతనిఁ బాపం । బులు విడుచుం బలికినతనిఁ బొందును బాపం
బులు నొరుపాపము దనపై । నొలయింపఁగనేల నింద యుడిగినఁ గాదే. 553

ప్రతిపదార్థం: పలుకువడినతనిన్= నిందపడినవాడిని; పాపంబులు= పాతకాలు; విడుచున్= వదలుతాయి; పలికినతనిన్= నిందించినవాడిని; పాపంబులు= పాతకాలు; పొందును= చేరుతాయి; ఒరుపాపమున్= ఇతరుని పాతకమును; తనపైన్= తనమీద; ఒలయింపఁగన్+ఏల= వ్యాపింపచేయట మెందుకు?; నింద యుడిగినన్= నిందించటం వదలితే; కాదే?= జరుగదా? (ఉచితం గాదా)

తాత్పర్యం: ఎవడు ఊరక ఇతరులచేత నిందించబడతాడో, వాడిని పాపాలు విడిచిపెడతాయి. ఎవడు ఊరక ఇతరుడిని నిందిస్తాడో, వాడిని పాపాలు చుట్టుకొంటాయి. అందువలన ఇతరులను నిందించి వారి పాపం తనపై వేసికొనటం ఎందుకు? నిందించటం పూర్తిగా వదలి పెట్టితే మంచిదికదా!

క. కుపితుఁ డగువాని వ్రతమును । జపమును దేవార్చనంబు శ్రాద్ధక్రియయుం
దపమును దానము యజనము । నపగతములు గాఁగఁజేయు నంతకుఁ డలుకన్. 554

ప్రతిపదార్థం: అంతకుఁడు= యముడు; అలుకన్= కోపంతో; కుపితుఁడు+అగువాని వ్రతమును= కోపించినవాడియొక్క వ్రతమూ; జపమును= జపమూ; దేవార్చనంబు= దేవపూజ; శ్రాద్ధక్రియయున్= పితృకర్మ; తపమును= తపస్సు; దానము= ఈవి; యజనము= యాగక్రియ; అపగతములు+కాఁగన్+చేయున్= తొలగేటట్లు చేస్తాడు.

తాత్పర్యం: ఎవడు కోపం కలిగిఉంటాడో, వాడి వ్రతం, జపం, దేవపూజ, పితృకర్మ, తపస్సు, దానం, యాగక్రియ - వీటన్నిటినీ కోపంతో యముడు నశింపజేస్తాడు.

చ. పలుకక యుండుకంటెఁ దగఁ బల్కుట మేలు; వినుండు! సత్యముం
బలుకుట ధర్మమార్గమునఁ బల్కుట సర్వజన ప్రియంబుగాఁ
బలుకుట యోలి నెక్కుడగు భంగులు; వీని నెఱింగి యొండుమైఁ
బలుకక నాల్గుచందములఁ బల్కఁగ మెత్తురు వాని దేవతల్. 555

ప్రతిపదార్థం: వినుండు= ఆలకించండి!; పలుకకఉండు కంటెన్= మాటలాడక ఉండటంకన్నా; తగన్= తగురీతిగా; పల్కుట= మాటలాడటం; మేలు= శ్రేయస్కరం; సత్యమున్= నిజమును; పలుకుట= వచించటం; ధర్మమార్గమునన్= ధర్మపద్ధతిలో; పల్కుట= వచించటం; సర్వజనప్రియంబుగాన్= సమస్త ప్రజలకు ప్రీతికలిగేటట్లుగా; పలుకుట= వచించటం; ఓలిన్= వరుసగా; ఎక్కుడు+అగుభంగులు= ఎక్కువఅయిన పద్ధతులు; వీనిన్= ఈ పద్ధతులను; ఎఱింగి= తెలిసికొని; ఒండుమైన్= మరొకరీతిగా; పలుకక= వచించక; నాల్గుచందములన్= నాల్గువిధాల; పల్కఁగన్= వచించగా; వానిన్= అట్లు వచించేవాడిని; దేవతల్= సురలు; మెత్తురు= అభినందిస్తారు.

తాత్పర్యం: వినండి! మాటలాడకుండా మౌనం వహించటంకంటె తగినట్లు మాటలాడటం మేలు. సత్యంగా మాటలాడటం, ధర్మపద్ధతిలో మాటలాడటం, సకలజనులకు ప్రీతిగా మాటలాడటం క్రమంగా శ్రేష్ఠమైన పద్ధతులు. ఇట్లా మాట్లాడేపద్ధతులు గ్రహించి మరొక విధంగా మాటలాడక పై జెప్పినట్లు నాలుగువిధాల మాటలాడేవాడిని దేవతలు అభినందిస్తారు.

క. సత్యక్షమాదమంబులు । నిత్యపదంబునకు నెక్కు నిచ్చెన; యవి సం
గత్యనుగతములు సత్సాం । గత్యం బటు గాన ముఖ్యకార్యము సుండీ!' 556

ప్రతిపదార్థం: సత్య క్షమా దమంబులు= సత్యం, ఓర్పు, ఇంద్రియనిగ్రహం అనేవి; నిత్యపదంబునకున్= శాశ్వతమైన స్థానానికి; ఎక్కునిచ్చెన= ఎక్కటానికి తగిన సాధనము; అవి= సత్యం మొదలైనవి; సంగత్యనుగతములు= సాంగత్యమును అనుసరించి వచ్చేవి; అటుకానన్= అందువలన; సత్సాంగత్యంబు= సజ్జనులతోడి పొత్తు; ముఖ్యకార్యము= ప్రధానంగా చేయదగింది; చుండీ!= సుమా!

తాత్పర్యం: సత్యం, ఓర్పు, బాహ్యేంద్రియ నిగ్రహం అనేవి మూడూ శాశ్వతమైన మోక్షస్థానం అధిష్ఠించటానికి ఉపకరించే నిచ్చెనవంటివి. అవి సాంగత్యమునుబట్టి వస్తాయి. ఆ కారణాన సజ్జనసాంగత్యం ముఖ్యమైన కర్తవ్యమని గమనించండి!'

విశేషం: అలంకారం: రూపకం.

వ. అని సత్య క్షమా దమ ప్రకారవిషయంబు లైన వాక్యంబులు సెప్పిన విని కృతార్థులై సాధ్యులు సంతోషించి
వెండియు హంసంబున కిట్లనిరి. 557

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; సత్య క్షమా దమ ప్రకారవిషయంబులు+ఐన= సత్యం, ఓర్పు, ఇంద్రియనిగ్రహం వీటి స్వభావం విషయంగా గల్గిన; వాక్యంబులు= మాటలు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; కృతార్థులు+ఐ= కృతకృత్యులై; సాధ్యులు సంతోషించి= సాధ్యులు హర్షించి; వెండియున్= మరల; హంసంబునకున్= అంచతో; ఇట్లు+అనిరి= ఈ రీతిగా అన్నారు.

తాత్పర్యం: హంస ఈ ప్రకారంగా సత్యం, క్షమ, దమం అనే గుణాలస్వభావాన్ని వివరించే మాటలు చెప్పింది. అది విని ధన్యులై సాధ్యులు సంతోషించారు. మళ్ళీ హంసతో వారు ఇట్లా అన్నారు.

క. ' ఏమిట లోకం బావృత? । మేమిటఁ దా వెలుఁగకుండు? నేమిట మిత్ర
స్తోమంబు విడుచుఁ దనుఁ గా । దేమిట మోక్షంబు? మాకు నెఱిఁగింపు దయన్.' 558

ప్రతిపదార్థం: లోకంబు= ప్రపంచం; ఏమిటన్= దేనిచేత; ఆవృతము= ఆవరింపబడింది; ఏమిటన్= దేనివలన; తాన్= తాను; వెలుఁగకుండున్= ప్రకాశించకుండా ఉంటుంది; ఏమిటన్= దేనిచేత; తనున్= తనను; మిత్రస్తోమంబు= మిత్రులసమూహం; విడుచున్= వదలును; ఏమిటన్= దేనివలన; మోక్షంబు= ముక్తి; కాదు= సిద్ధించదు; దయన్= కృపతో; మాకున్ ఎఱిఁగింపు= మాకు తెలియజెప్పుము.

తాత్పర్యం: 'ఈ లోకం దేనిచేత కప్పబడి ఉన్నది? ఒకడు తాను దేనివలన ప్రకాశించకుండా ఉంటాడు? దేనిచేత మిత్రులు తనను వదలిపోతారు? దేనిచేత మోక్షం కలుగదు? ఈ విషయాలు కృపతో మాకు తెలియపరచుము.'

వ. అనుటయు. 559

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా.

తాత్పర్యం: అని సాధ్యులు ప్రశ్నింపగా.

ఉ. ఆనతవైరి! యిట్టులను హంసము వారలతోడ 'లోక మ
జ్ఞానముచేత నావృతము సంభృతమత్సరుఁడైన వే ఱగుం
దాను బ్రకాశసంపదకుఁ దన్ విడుచుం దెగి మిత్రకోటిలో
భానుగతిన్ విమోక్షపద మందదు సంగముకల్మి నెమ్మెయిన్.' 560

ప్రతిపదార్థం: ఆనతవైరి!= అవనతులైన శత్రువులు కలవాడా!; హంసము= మరాళం; వారలతోడన్= వారితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; లోకము= ప్రపంచం; అజ్ఞానము చేతన్= జ్ఞానంలేమిచేత; ఆవృతము= కప్పబడింది; తాను= తాను; సంభృతమత్సరుఁడు+ఐనన్= మచ్చరముచేత నిండినవాడైతే; ప్రకాశసంపదకున్ వేఱు+అగున్= కాంతి సంపదకు భిన్నమవుతాడు; లోభానుగతిన్= లోభమును అనుసరించటం చేత; తెగి= సాహసించి; మిత్రకోటి= మిత్రులబృందం; తన్+విడుచున్= తనను వదలును; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; సంగముకల్మిన్= సంసర్గం కలిగి ఉండటంచేత; విమోక్షపదము= విముక్తి స్థానం; అందదు= లభించదు.

తాత్పర్యం: శత్రుంజయుడవైన ఓ ధర్మరాజా! అప్పుడు హంస వారితో ఇట్లా అన్నది: 'ఈ లోకం అవివేకంచేత ఆవరించబడిఉన్నది. మానవుడు మాత్సర్యం కలవాడైతే లోకంలో ప్రకాశించకుండా పోతాడు. లోభి అయినవాడిని మిత్రబృందం వదలిపోతుంది. ఏ రీతిగానైనా లోకసంసర్గం కలిగిఉన్న వాడికి మోక్షం లభించదు.'

వ. అనిన వారు మరాళంబున కిట్లనిరి. 561

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వారు= ఆ సాధ్యులు; మరాళంబునకున్= హంసకు; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: హంస అట్లా చెప్పేసరికి సాధ్యులు మళ్ళీ దానితో ఇట్లా అన్నారు.

క. ' ఎవ్వఁడు రమించు నొక్కఁడ, । యెవ్వఁడు పెక్కండ్రఁ బ్రీతి నెసఁగఁగఁజేయున్,
నివ్వటిలు నెవ్వనికి బల । మెవ్వఁడు కలహంబు వెంట కెంతయుఁ దొలఁగున్.' 562

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడు; ఒక్కఁడ రమించున్= ఒకడే క్రీడిస్తాడు; ఎవ్వఁడు= ఎవడు; పెక్కండ్రన్= పెక్కుమందిని; ప్రీతిన్= ప్రీతితో; ఎసఁగఁగన్+చేయున్= అతిశయించునట్లు చేస్తాడు; ఎవ్వనికిన్= ఎవనికి; బలము= సత్తువ; నివ్వటిలున్= కలుగుతుంది; ఎవ్వఁడు= ఎవడు; ఎంతయున్= మిక్కిలిగా; కలహంబు వెంటకున్= జగడపు త్రోవకు; తొలఁగున్= దూరంగా పోతాడు.

తాత్పర్యం: ఒక్కడే తనలో తాను రమించేవా డెవడు? చాలామందికి ప్రీతి కల్గించేవా డెవడు? ఎవనికి బలం కలుగుతుంది? ఎవడు కలహపు త్రోవకు దూరంగా తొలగిపోతాడు?'

వ. అని యడిగిన హంస యిట్లనియె. 563

ప్రతిపదార్థం: అని యడిగినన్= అని ప్రశ్నించగా; హంస= మరాళం; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని సాధ్యులు అడిగేసరికి హంసవారితో ఇట్లా చెప్పింది.

క. ' ప్రాజ్ఞుఁడు రమించు నొక్కఁడ; । ప్రాజ్ఞుఁడు పెక్కండ్రఁ బ్రీతిఁ బరఁగఁగఁ జేయున్;
బ్రాజ్ఞుఁడు బలవంతుం డగుఁ; । బ్రాజ్ఞుఁడు కలహమునఁ దొట్టుపడక తొలంగున్. 564

ప్రతిపదార్థం: ప్రాజ్ఞుఁడు= పండితుడు; ఒక్కఁడ= ఒకడే; రమించున్= క్రీడిస్తాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; పెక్కండ్రన్= చాలామందిని; ప్రీతిన్= ప్రీతితో; పరఁగఁగన్+చేయున్= ప్రవర్తిల్లునట్లు చేస్తాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; బలవంతుండు+అగున్= బలంకలవాడవుతాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; కలహమునన్= జగడంలో; తొట్టుపడక= తగులువడక; తొలంగున్= దూరంగా పోతాడు.

తాత్పర్యం: ఆత్మజ్ఞానసంపన్నుడైన పండితుడు ఒక్కడే తనలోతాను ఆనందిస్తాడు, ఎక్కువమంది జనులలో ప్రీతి కలిగిస్తాడు. బలం కలవా డవుతాడు. అట్టి పండితుడు ఎవరితోనూ జగడానికి పోక తొలగిపోతాడు.

వ. అని చెప్పిన రాయంచతో సాధ్యు లిట్లనిరి. 565

ప్రతిపదార్థం: అని చెప్పిన= అని వచించిన; రాయంచతోన్= రాజహంసతో; సాధ్యులు+ఇట్లు+అనిరి= సాధ్యు లీరీతిగా అన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పిన హంసను చూచి సాధ్యులు మరల ఇట్లా చెప్పారు.

తే. ' విప్రుఁడేమిట దేవత్వవిభవ మొందు? । నేమి కతమున సాధుత్వ మెసకమెసఁగు?
నతని కెద్ది యసాధుత్వ మావహించు? । మానుషుం డగు నెద్దాన? మహితమూర్తి! 566

ప్రతిపదార్థం: మహితమూర్తి!= పూజ్యమైన ఆకృతిగల ఓ హంసా!; విప్రుఁడు= బ్రాహ్మణుడు; ఏమిటన్= దేనిచేత; దేవత్వవిభవమున్= అమరత్వ వైభవాన్ని; ఒందున్= పొందుతాడు; అతనికిన్= ఆ విప్రుడికి; ఏమి కతమునన్= ఏ కారణాన; సాధుత్వము= సజ్జనత్వం; ఎసకమెసఁగున్?= మిక్కిలి అతిశయిస్తుంది?; ఎద్ది= ఏది; అసాధుత్వమున్= దుర్జనత్వమును; ఆవహించున్= కలిగిస్తుంది?; ఏ+దానన్= దేనివలన; మానుషుండు+అగున్?= కేవలమనుష్య డవుతాడు?

తాత్పర్యం: 'దివ్యాకృతి గల ఓ హంసమా! బ్రాహ్మణుడు దేనిచేత దేవతావైభవం పొంది రాణిస్తాడు? ఏ కారణంతో అతడు సాధుపురుషుడుగా ప్రశస్తి పొందుతాడు? అతడిని సాధుత్వం లేనివాడినిగా చేసేది ఏది? దేనివలన అతడు

కేవలం మనుష్య డవుతాడు?'

చ. అనుటయు హంస మిట్టులను 'నధ్యయనంబున దేవభావముం
గను; వ్రతవృత్తి సాధువనఁగాఁ జరియించు; జనం బసాధు నాఁ
జనుఁ బరివాదశీలమున; శౌచవిహీనత మృత్యుభీతి వొం
దిన మదిలోన నెక్కొనిన దీనత విప్రుఁడు మానుషుం డగున్.' 567

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; హంసము= మరాళం; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; విప్రుఁడు= ద్విజుడు; అధ్యయనంబునన్= వేదం చదువటంచేత; దేవభావమున్+కనున్= దేవత్వం పొందుతాడు; వ్రతవృత్తిన్= పుణ్యకర్మపు వర్తనంచేత; సాధువు అనఁగాన్= సజ్జనుడనగా; చరియించున్= ప్రవర్తిల్లుతాడు; పరివాదశీలమునన్= నిందాశీలంచేత; జనంబు= ప్రజ; అసాధునాన్+చనున్= దుర్జనుడనగా అట్లే అయిపోతాడు; శౌచవిహీనతన్= శుచిత్వం లేకపోవటం వలన; మృత్యుభీతిన్= మరణభయమును; పొందిన మదిలోనన్= చెందిన హృదయములో; నెక్కొనిన= పాదుకొన్న; దీనతన్= దీనత్వముచేత; మానుషుండు+అగున్= మనుష్యుడు అవుతాడు.

తాత్పర్యం: సాధ్య లట్లా ప్రశ్నించగా హంస ఇట్లా అన్నది - 'బ్రాహ్మణుడు వేదాధ్యయనం చేయటంతో దేవత్వం పొందుతాడు. ఉపవాసాది పుణ్యకర్మలు చేయటంతో సాధువుగా ప్రశస్తి పొందుతాడు. నింద్యమైన శీలం కలవాడైతే ప్రజ లతడిని దుర్జనుడు అని వ్యవహరిస్తారు. శౌచం పాటించకపోవటం వలన, మరణభీతితో దీనత్వం పొందటం వలన అతడు కేవలం మనుష్యుడుగా రూపొందుతాడు.'

క. అని పలికి సాధ్యులకుఁ దన । తను విభవము సూపి సమ్మదంబున వారల్
దనుఁగొలువ నిజనివాసం । బున కేఁగె నజుండు నగవు మొగమున నెఱయన్. 568

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అజుండు= బ్రహ్మ; సాధ్యులకున్= సాధ్యులనబడే ఆ దేవతావర్గాలకు; తన తనువిభవమున్= తన శరీరవైభవాన్ని; చూపి= ప్రదర్శించి; వారల్= వారు; సమ్మదంబునన్= సంతసంతో; తనున్+కొలువన్= తనను ఆరాధించగా; నగవు= నవ్వు; మొగంబునన్= వదనమందు; నెఱయన్= వ్యాపించగా; నిజనివాసంబునకున్= తన నెలవుకు; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: హంస రూపంతో ఉన్న బ్రహ్మదేవుడు అట్లా చెప్పి సాధ్యులకు తన నిజమైన శరీరవైభవం చూపాడు. వా రందుకు చాలా సంతోషించి ఆయనను సేవించారు. పిమ్మట ముఖంలో నవ్వు దీపిస్తూ ఉండగా బ్రహ్మ తన నెలవైన సత్యలోకానికి వెళ్ళాడు.

వ. అని చెప్పి భీష్ముండు. 569

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; భీష్ముండు= భీష్ముడు

తాత్పర్యం: అట్లా ధర్మజుడితో వచించి భీష్ముడు మళ్ళీ ఈ క్రింది రీతిగా అన్నాడు.

ఉ. ' సాదరవృత్తి సాధ్యులఁ బ్రహర్ష సమేతులఁ జేయఁ బూని సం
వాదము సేసె దేవముని వంద్యుఁ డజుం; డిది సేయు నాయురు
త్పాదన మిచ్చు సంతతశుభంబులు గీర్తి యొనర్చుఁ బుత్రపౌ
త్రోదయ మావహించు భరతోత్తమ! తన్ వినినన్ బఠించినన్.' 570

ప్రతిపదార్థం: దేవమునివంద్యుఁడు= దేవతలచేతను; మునులచేతను నమస్కరించదగినవాడైన; అజుడు= బ్రహ్మ; సాదరవృత్తిన్= ఆదరంతో కూడిన వర్తనతో; సాధ్యులన్= సాధ్యులను; ప్రహర్షసమేతులన్= సంతోషంతో గూడినవారినిగా; చేయన్+పూని= చేయ నారంభించి; సంవాదమున్+చేసెన్= సంభాషించాడు; భరత+ఉత్తమ!= భరతవంశములో శ్రేష్ఠుడా!; ఇది= ఈ సంవాదం; తన్= తనను; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; ఆయురుత్పాదనమున్= ఆయువు యొక్క పుట్టుకను; చేయున్= కలిగిస్తుంది; సంతత శుభంబులు= ఎడతెగని మంగళాలను; ఇచ్చున్= ప్రసాదిస్తుంది; కీర్తి+ఒనర్చున్= యశస్సు కలిగిస్తుంది; పుత్రపౌత్ర+ఉదయమున్= కొడుకుల, మనుమల ఉద్భవమును; ఆవహించున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: భరతకులశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా! దేవతలకు, మునులకూ నమస్కరణీయుడైన బ్రహ్మ ఆదరంతో సాధ్యులకు సంతోషం కలిగించటానికై వారితో 'హంసగీత' అనే ఈ సంవాదం చేశాడు. ఈ గీతను విన్నా, చదివినా, దీర్ఘాయువు కలుగుతుంది. ఎడతెగని శుభాలు సంభవిస్తాయి. కీర్తి చేకూరుతుంది. పుత్రులు, మనుమలు తామరతంపరగా ఉదయించి వంశం వర్ధిల్లుతుంది.'

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సాంఖ్యయోగంబుల తారతమ్యంబులుం దత్స్వరూపం బులు నెఱింగింపవే' యనుటయు, నమ్మహీపతికి నమ్మహాత్ముం డిట్లనియె. 571

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా ఆకర్ణించి; ధర్మనందనుండు= ధర్మజుడు; శంతనునందనుతోన్= శంతనుడి కుమారుడైన భీష్ముడితో; సాంఖ్యయోగంబుల తారతమ్యంబులున్= సాంఖ్యశాస్త్ర, యోగశాస్త్రములయొక్క తరతమ భేదాలను; తత్స్వరూపంబులున్= ఆ శాస్త్రాల నిజరూపాలను; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడట్లా చెప్పేసరికి విని ధర్మరాజు అతడితో 'సాంఖ్యశాస్త్రం, యోగశాస్త్రం -ఈ రెండింటియొక్క భేదాలు, వాటి స్వరూపాలు తెలియజెప్పుము' అని అడిగాడు. అంతట ఆ నరపాలుడితో భీష్ముడు ఈ రీతిగా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్రప్రకారము చెప్పుట (సం. 12-289-2)

క. తెలుపుదురు సాంఖ్యులును యో । గులుఁ దమతమ తెఱఁగు మేలగుట కారణసం
కలితముగ నాకుఁ జూడఁగ । నలఘుగుణా! యొక్క రూప యయ్యురు దెఱఁగున్. 572

ప్రతిపదార్థం: అలఘుగుణా!= గొప్ప గుణాలు గలవాడా!; సాంఖ్యులునున్= సాంఖ్య మార్గం అనుసరించేవారూ; యోగులున్= యోగమార్గం అవలంబించేవారూ; కారణసంకలితముగన్= హేతువులతో కూడ; తమ తమ తెఱఁగులు= తమ తమ పద్ధతులు; మేలు+అగుట= శ్రేష్ఠంకావటం; తెలుపుదురు= చెప్పుతారు; నాకున్+చూడఁగన్= నేను పరిశీలింపగా; ఆ+ఇరుదెఱఁగున్= ఆ రెండు విధాలతోవయును; ఒక్కరూప= ఒకే విధమైనది.

తాత్పర్యం: 'శ్రేష్ఠగుణుడవైన ఓ ధర్మజా! సాంఖ్యులు, యోగులు తమ తమ మార్గాలే మేలైనవని కారణాలు నిరూపిస్తూ ప్రకటిస్తారు. కాని నా దృష్టికి ఆ రెండు మార్గాలూ ఒక్కటే.

క. ప్రత్యక్షహేతువాదులు । సత్యపరా! యోగపరులు సాంఖ్యులు శాస్త్రా
ర్థత్యంతనైపుణులు స । ద్ధత్యాకలనంబు సరియ తదుభయమునకున్. 573

ప్రతిపదార్థం: సత్యపరా!= సత్యపరాయణా!; యోగపరులు= యోగులు; ప్రత్యక్షహేతువాదులు= ప్రత్యక్షాన్నే ప్రామాణ్యహేతువని వాదించేవారు; సాంఖ్యులు= సాంఖ్యమార్గం అనుసరించేవారు; శాస్త్రార్థత్యంతనైపుణులు= శాస్త్ర ప్రతిపాదితమైన విషయములందు

మిక్కిలి సామర్థ్యం కలవారు; తదుభయమునకున్= ఆ రెంటికీ; సద్గత్యాకలనంబు= ఉన్నతమైన గతి చేకూరటం; సరి+అ= సమానమే.

తాత్పర్యం: సత్యనిష్ఠుడవైన ఓ ధర్మపుత్రా! యోగులు ప్రత్యక్ష మొక్కటే ప్రమాణహేతువని వాదిస్తారు. సాంఖ్యులు శాస్త్ర ప్రతిపాదితమైన అర్థాలలో విశ్వాసం కలిగి అవే ప్రమాణమని నిరూపిస్తారు. అయినా ఈ రెండుమార్గాలవారూ చివరికి పొందే లక్ష్యం ఒక్కటే.

క. ఆ తెరువులు రెంటికి వే । ఱై తోఁచుట దర్శనంబునంద నరేంద్రా!
భూతహితము సద్వ్రతచ । ర్యాతిశయము శౌచమును నియతకృత్యంబుల్.' 574

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; ఆ తెరువులు= ఆ మార్గాలు; రెంటికిన్= రెండింటికి; వేఱైతోచుట= విభిన్నములై భాసించటం; దర్శనంబునంద= శాస్త్రమునందే; భూతహితము= ప్రాణులకు మేలు చేయటం; సద్వ్రతచర్యాతిశయము= మంచి నియమాలను ఎక్కువగా పాటించటం; శౌచమును= శుచిత్వం; నియతకృత్యంబుల్= రెండు మార్గాలకూ తప్పనిసరిగా సంబద్ధమైన కార్యాలు.

తాత్పర్యం: రాజా! సాంఖ్యయోగాల మార్గాలు రెండూ విభిన్నమై కనిపించటమనేది కేవలం శాస్త్రమునందు మాత్రమే. ప్రాణులపట్ల హితం, మంచి నియమాలు పాటించటం, శౌచం ఈ రెండుమార్గాలకూ నియతమైన కార్యాలే.'

విశేషం: సాంఖ్యయోగౌ పృథగ్బాలాः । ప్రవదన్తి న పండితాः
ఏకమప్యాస్థిత స్సమ్యక్ । ఉభయో ర్విందతే ఫలమ్ ॥ (గీత - 5-4)
యత్సాంఖ్యైः ప్రాప్యతే స్థానం । తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ । యः పశ్యతి స పశ్యతి ॥ (గీత - 5-5)

అని శ్రీకృష్ణుడు గీతలో ప్రతిపాదించి ఉన్నాడు. 'అవివేకులు మాత్రమే సాంఖ్యమూ, యోగమూ వేరువేరని చెప్పుతారు. ఈ రెండింటిలో దేని ననుష్ఠించినా ఫలప్రాప్తి కలుగుతుంది. సాంఖ్యులు పొందే స్థానాన్నే యోగులు కూడా పొందుతారు. అందువలన సాంఖ్యయోగాలను రెంటినీ ఒక్కటిగా చూచేవాడు యథార్థదర్శి' అన్న గీతాచార్యుడి అభిప్రాయం ఇక్కడ భీష్ముడు చెప్పిన మాటలతో సరిపడుతున్నది.

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'భూతదయయును, సద్వ్రతధారణంబును, శౌచంబును దుల్యంబులై సాంఖ్యయోగంబులకు దర్శనంబు వేఱగుట యెట్లు? వివరింపవే' యనుటయు, నన్నరదేవునకు దేవవ్రతుండిట్లనియె. 575

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; సాంఖ్యయోగంబులకున్= సాంఖ్యానికీ, యోగానికీ; భూతదయయునున్= ప్రాణులపట్ల కృపయు; సద్వ్రతధారణంబునున్= మంచినియమాలు పాటించటమూ; శౌచంబునున్= శుచిత్వమూ; తుల్యంబులు+ఐ= సమానములై; దర్శనంబు= శాస్త్రం; వేఱు+అగుట= భిన్నమవటం; ఎట్లు= ఎట్లా; వివరింపవే= విశదీకరింపుమా; అనుటయున్= అని అడుగగా; ఆ+నరదేవునకున్= ఆ రాజుకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పింది విని ధర్మరాజు 'సాంఖ్యయోగమార్గాలు రెండింటికీ భూతదయ, వ్రతనిర్వహణ, శుచిత్వం అనేవి సమానాలై ఉండగా శాస్త్రం మాత్రం ఎట్లా వేరుగా ఉంటుంది? ఈ సంగతి వివరించుము' అని అర్థించాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. ' యోగులకు యోగబలమున । రాగము మోహంబునుం జిరస్నేహముఁగా
మాగమముఁ గ్రోధము గుణా । యోగము వరుసఁ బెడఁబాప నున్నతి యొలయున్. 576

ప్రతిపదార్థం: యోగబలమునన్= యోగము యొక్క సామర్థ్యంతో; రాగమున్= విషయముల మీది అనురాగాన్నీ; మోహంబునున్= అజ్ఞానాన్నీ; చిరస్నేహమున్= దీర్ఘకాలికమైన ప్రీతిని; కామ+ఆగమమున్= అభిలాష యొక్క ఉత్పత్తినీ; క్రోధమున్= కోపాన్నీ; వరుసన్= క్రమంగా; గుణ+ఆ యోగము= పై దోషాలకు విరుద్ధాలైన సద్గుణాలతోడి కలయిక; పెడన్+పాపన్= తొలగించగా; యోగులకున్= యోగమార్గంలో ఉన్నవారికి; ఉన్నతి= ఔన్నత్యం; ఒలయున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: రాగం, మోహం, దీర్ఘకాలికమైన స్నేహం, కామం, క్రోధం అనే దుర్గుణాలు ఆత్మోన్నతిని నిరోధించేవి. యోగబలంతో పై దోషాలను తద్విరుద్ధమైన సద్గుణాలతో తొలగిస్తే యోగులకు ఆత్మోన్నతి లభిస్తుంది.

విశేషం: పద్యంలో 'గుణాయోగము' అన్న పదాన్ని ద్వితీయాంతంగా గ్రహిస్తే, రాగాదులతోపాటు త్రిగుణాలతోడి ఆ యోగాన్ని (కలయికను) కూడా యోగబలంతో తొలగిస్తే - అని అర్థం చెప్పాలి.

చ. ఘనరుషమున్ సముద్ధతమృగంబును జాలము వ్రచ్చి వాగురా
వినిహతిఁ జేసి యిష్టపదవిం జను చాడ్పున యోగతంత్రరో
ధనమగు లోభ జాత దురితవ్రజముం బెడఁబాచి సత్పథం
బునఁ జరియించు యోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్. 577

ప్రతిపదార్థం: ఘనరుషమున్= పెద్ద చేపయున్నూ; సముద్ధతమృగంబును= బలిష్ఠమై గర్వించిన జంతువున్నూ; జాలమున్= వలను; వ్రచ్చి= చించి; వాగురావినిహతిన్+చేసి= ఉరిని ఛేదించి; ఇష్టపదవిన్= ఇచ్చవచ్చిన త్రోవలో; చనుచాడ్పునన్= పోయేటట్లు; యోగి= యోగం శీలించేవాడు; సుఖమూర్తితన్= సుఖస్వరూపాన్ని; సుస్థితగాన్= దృఢంగా ఉండేటట్లు; వహించుచున్= కలిగిఉంటూ; యోగతంత్ర రోధనము+అగు= యోగంయొక్క ఉపాయాలను అడ్డగించినదైన; లోభజాతదురితవ్రజమున్= లోభంనుండి కలిగిన పాపసంచయాన్ని; పెడన్+పాచి= తొలగద్రోసి; సత్పథంబునన్= సన్మార్గంలో; చరియించున్= సంచరిస్తాడు.

తాత్పర్యం: పెద్దచేప వలను చించుకొని, బలిష్ఠమైన మృగము ఉరిని ఛేదించుకొని ఇచ్చవచ్చిన దారిలో వెళ్ళిపోతాయి. అట్లే యోగి దృఢమైన సుఖస్వరూపంలో ఉంటూ యోగోపాయాలను నిరోధించే పాపాలను తొలగించుకొని సన్మార్గంలో సంచరిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. యోగబలము లేని యొకభంగి యోగి బల్ । ద్రోపు లేని మీను నేపు లేని
మృగము వలయు నురియుఁ దెగిపోవ నుఱుకంగ । లేనియట్ల భవములోన నడఁగు. 578

ప్రతిపదార్థం: యోగబలము లేని= యోగశక్తి చాలని; ఒక భంగియోగి= ఒక మాదిరి యోగి; బల్‌త్రోపులేని మీనున్= పెద్దగా దూసుకొని పోయేశక్తి లేని చేప; ఏపు లేని మృగమున్= విజృంభించే శక్తిలేని జంతువు; వలయున్= జాలమును; ఉరియున్= పాశమును; తెగిపోవన్= తెగిపోయేటట్లుగా; ఉఱుకంగలేని+అట్ల= పరుగెత్తలేని మాదిరిగా; భవములోనన్= సంసారంలో; అడఁగున్= అణగిపోతాడు.

తాత్పర్యం: బలాధిక్యంతో విజృంభించి ముందుకు దూసుకొని పోలేని చేప వలను ఛేదించలేదు. అట్లే శక్తి చాలని మృగం ఉరిని తెగజేసి ముందుకు పోలేదు. అవి రెండూ పాశం క్రింద తగులువడతాయి. అదే రీతిగా యోగబలం చాలని యోగి పాపపాశాలను ఛేదించలేక సంసారంలోనే నిబద్ధుడైపోతాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. అల్పమైన యగ్ని యడఁగు నింధనములు । మీఁద వైవ బలము మిగులలేని
యోగమట్ల తనకు నురునట్టి దానన । సాదమొందు సకలజనమనోజ్ఞ! 579

ప్రతిపదార్థం: సకలజనమనోజ్ఞ!= సమస్త ప్రజలకు మనోహరమైనవాడా!; అల్పమైన= కొద్దిపాటిదైన; అగ్ని= నిప్పు; ఇంధనములు= కట్టెలు; మీఁదవైవన్= పైనవేయగా; అడఁగున్= ఆరిపోతుంది; అట్ల= అదే మాదిరిగా; బలము మిగులలేని= శక్తి చాలని; యోగము= యోగానుష్ఠానం; తనకున్+ఉరునట్టి దానన్+అ= తనకు తగిన దానితోనే; సాదము+ఒందున్= అణగారిపోతుంది

తాత్పర్యం: సకల జనులకు హృదయంగముడవైన ధర్మసుతా! కొద్దిపాటి నిప్పు కట్టెలు పైన పడవేస్తే ఆరిపోతుంది. అదే రీతిగా బలహీనమైన యోగం కూడా తన కనుకూలమైన దానితోనే అణగారిపోతుంది. కట్టెలు అగ్నికి అనుకూలమైనప్పటికీ నిప్పు తక్కువై కట్టెలెక్కువైతే నిప్పు శమించిపోతుంది. (అదే రీతిగా అనుకూలమైన యోగసాధనలే యోగానికి బలం లేనప్పుడు దానిని శమింపజేస్తాయని తాత్పర్యం).

విశేషం: అలం: ఉపమ.

ఆ. ఇద్ధమైన యగ్ని ఇంధన సంపద । నతిశయిల్లు నట్టు లధికబలస
మగ్రసారయోగ మహిమయు నంతంత । కగ్గలించు వ్రతము లగ్గలింప. 580

ప్రతిపదార్థం: ఇద్ధము+ఐన= దీపించిన; అగ్ని= అనలం; ఇంధనసంపదన్= కట్టెల సమృద్ధిచేత; అతిశయిల్లునట్టులు= ఎక్కువగా మండే విధంగా; అధికబలసమగ్రసారయోగ మహిమయున్= ఎక్కువ బలంతో సమగ్రమైన శ్రేష్ఠయోగ ప్రభావం కూడ; వ్రతములు= నియమాలు; అగ్గలింపన్= ఎక్కువ కాగా; అంతంతకున్= అంతకంతకు; అగ్గలించున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: బాగా జ్వలించిన అగ్ని ఎక్కువగా వంటచెరకు అందిస్తే ఇంకా ఎక్కువగా మండుతుంది. అదే రీతిగా శక్తిమంతమైన యోగంయొక్క ప్రభావం ఎంతకెంతకు నియమసాధనలు ఎక్కువవుతాయో, అంతకంతకు అతిశయమై రాణిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. స్రోతోవేగము పటుగతి । వీతబలుం దిగుచునట్లు విషయము లీడ్చుం
జేతోబలసంభృత యో । గాతిశయుఁడు గాని వాని నంచితచరితా! 581

ప్రతిపదార్థం: అంచితచరితా= పూజ్యమైన చరిత్రం కలవాడా!; స్రోతోవేగము= ప్రవాహంయొక్క వేగం; పటుగతిన్= పటిష్ఠమైన నడకతో; వీతబలున్= తొలగినబలం కలవాడిని; తిగుచునట్లు= లాగివేసేటట్లు; చేతోబలసంభృతయోగాతిశయుఁడు= మనోబలంతో నిండిన యోగదృఢత్వం కలవాడు; కానివానిన్= కానట్టి యోగిని; విషయములు= శబ్దం మొదలైన విషయాలు; ఈడ్చున్= లాగివేస్తాయి.

తాత్పర్యం: మాన్యచరిత్రుడవగు ఓ ధర్మరాజా! బలంగా ముందుకు సాగిపోయే ప్రవాహవేగం బలహీనుడిని లాగివేస్తుంది. అట్లాగే మనోబలంతో కూడిన యోగశక్తి లేనివాడిని శబ్దస్పర్శాది విషయాలు తమవైపునకు లాగివేస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

క. నది రయము వారణేంద్రుఁడు । గుదియించిన యట్ల పోలెఁ గురువర! దైన్యా
స్పదమగు విషయోల్లాసముఁ । గుదియించును యోగసిద్ధి గురుహృద్బలుఁడున్. 582

ప్రతిపదార్థం: కురువర!= కురుశ్రేష్ఠా!; వారణ+ఇంద్రుఁడు= గజేంద్రుడు; నదిరయమున్= నదీవేగాన్ని; కుదియించిన అట్ల పోలెన్= అడ్డగించేటట్లే; యోగసిద్ధి గురుహృద్బలుఁడున్= యోగంయొక్క సిద్ధిచేత గొప్పదైన మనోబలం కలవాడుకూడా; దైన్యాస్పదము+అగు= దీనత్వానికి నెలవైన; విషయ+ఉల్లాసమున్= శబ్దాదివిషయాల విలాసాన్ని; కుదియించును= అడ్డగిస్తాడు.

తాత్పర్యం: కురువర్యా! మదించిన ఏనుగు నదీప్రవాహ వేగాన్ని తగ్గించినట్లే యోగసిద్ధితో మనోబలం సంపాదించుకొన్న యోగివర్యుడు దీనత్వం కలిగించే విషయాల ఉరవడిని తగ్గించివేస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. కుపితుఁడగు నంతకుండును గ్రోధఘోర । మృత్యువును నైన నియమసమృద్ధయోగ
బలునిదెస వోవఁ జాల రప్రతిహతముగ । నెందుఁ జరియించు నతఁడు నరేంద్రముఖ్య! 583

ప్రతిపదార్థం: నరేంద్రముఖ్య!= రాజశ్రేష్ఠా!; కుపితుఁడు+అగు= కోపించినవాడైన; అంతకుండును= యముడు అయినా; క్రోధఘోరమృత్యువునున్+ఐనన్= కోపంచేత భయంకరమైన మృత్యుదేవత ఐనా; నియమసమృద్ధ యోగబలుని దెసన్= నియమాలతో సమగ్రమైన యోగబలం కలవాడివైపు; పోవన్+చాలరు= పోలేరు; అతఁడు= ఆ యోగి; అప్రతిహతముగన్= ఎదురులేకుండ; ఎందున్+చరియించున్= ఎక్కడనైనా తిరుగగలడు.

తాత్పర్యం: నృపశ్రేష్ఠా! కోపించిన యముడుగానీ, కోపభీకరమైన మృత్యువుగానీ దృఢనియమాలను పాలించి యోగశక్తి పరిపూర్ణుడైన యోగిచెంతకు పోలేరు. అట్లాంటి యోగీంద్రుడు ఎదురులేనివాడై ఎక్కడనైనా తిరుగుతాడు.

క. భోగంబుఁ దపముఁ బొరిఁబొరి । రాగవిరాగతల హృదయరంగమునకుఁ గే
ళీగతులఁ దెచ్చి యార్చుచు । యోగి యనుభవించుఁ దగిలియుండం డెందున్. 584

ప్రతిపదార్థం: యోగి= యోగశీలుడు; పొరిన్+పొరిన్= మాటిమాటికి; భోగంబున్= విషయానుభవాన్ని; తపమున్= తపస్సును; రాగవిరాగతలన్= రక్తినీ, విరక్తినీ; హృదయరంగమునకున్= చిత్తం అనే రంగస్థలానికి; కేళీగతులన్= క్రీడాగమనాలతో; తెచ్చి= తీసికొనివచ్చి; ఆర్చుచున్= ఆడిస్తూ; అనుభవించున్= అనుభవిస్తాడు; ఎందున్= దేనిలోనూ; తగిలిఉండడు= ఆసక్తుడై ఉండడు.

తాత్పర్యం: యోగాభ్యాసపరుడైనవాడు మాటిమాటికీ తన హృదయమనే రంగస్థలం మీదికి విషయసుఖానుభవాన్నీ, తపస్సునూ, రాగాన్నీ, విరాగాన్నీ సవిలాసంగా తీసికొనివచ్చి ఆడిస్తూ ఉంటాడు. ఎందులోనూ తగులువడకుండా తాను ఆ క్రీడారసాన్ని అనుభవిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

క. జగతీవర! యోగస్థా । లగతులు సెప్పితి వినం గలదు సూక్ష్మవిధం
బగుమార్గ ప్రచయము ద । న్నిగదన మవధానమున వినిన మతి దేఱున్. 585

ప్రతిపదార్థం: జగతీవర!= భూవరా!; యోగస్థాల గతులు= యోగంయొక్క స్థూలమైన విధానాలు; చెప్పితిన్= వివరించాను; సూక్ష్మవిధంబు+అగు= సూక్ష్మపద్ధతిగల; మార్గప్రచయము= విధానాల సముదాయం; వినంగలదు= వినటానికి మిగిలిఉన్నది;

తన్నిగదనమున్= ఆ చెప్పటాన్ని; అవధానమునన్= హెచ్చరికతో; వినినన్= వింటే; మతి= బుద్ధి; తేఱున్= ప్రసన్నతపొందుతుంది.

తాత్పర్యం: రాజా! యోగానికి చెందిన స్థూలమైన విషయాలు ఇంతవరకూ చెప్పాను. ఇంకా సూక్ష్మ విషయాలైన కొన్ని యోగవిధానాలు వినవలసి ఉన్నాయి. వాటి వివరణ సావధానంగా వింటే బుద్ధి నిర్మలమవుతుంది.

క. ఏమిగతి లక్ష్యభేదముఁ ; దా మేలుగఁ జేయు ధన్వి తత్పరుఁడై యో
గామల చిత్తుఁడు మోక్షం ; బామెయి సాధించువాఁ డహంకృతిదూరా! 586

ప్రతిపదార్థం: అహంకృతిదూరా!= అహంకారం లేనివాడా!; ధన్వి= విలుకాడు; ఏమిగతిన్= ఎట్లు; తత్పరుఁడు+ఐ= దానియందాసక్తుడై; తాన్= తాను; లక్ష్యభేదమున్= గురిని ఛేదించటాన్ని; మేలుగన్= బాగా; చేయున్= చేస్తాడో; ఆ+మెయిన్= అదేరీతిగా; యోగ+అమలచిత్తుఁడు= యోగముచే నిర్మలమైన హృదయం కలవాడు; మోక్షంబు= ముక్తిని; సాధించువాఁడు= సంపాదిస్తాడు.

తాత్పర్యం: అహంకారంలేని ఓ ధర్మరాజా! విలుకాడు తదేకచిత్తుడై ఎట్లా లక్ష్యాన్ని చక్కగా ఛేదిస్తాడో, అట్లాగే యోగనిపుణుడు మోక్షలక్ష్యాన్ని సాధిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. నేతికుండ మోచి యే తెఱఁగున సోబ ; నాలు వ్రాఁకు నైపుణంబు గలుగు
పురుషుఁడట్ల యోగపరిణతుండును నాత్మ ; నేమఱక విముక్తి కెక్క వలయు. 587

ప్రతిపదార్థం: నైపుణంబు గలుగు= నేర్పుగల; పురుషుఁడు= మనుజుడు; నేతికుండ= నేతితో నింపిన కుండను; మోచి= వహించి; ఏ+తెఱఁగునన్= ఏ రీతిగా; సోబనాలు= మెట్లు; వ్రాఁకున్= ఎక్కుతాడో; అట్ల= ఆ రీతిగానే; యోగపరిణతుండునున్= యోగనిపుణుడుకూడ; ఆత్మన్+ఏమఱక= ఆత్మవిషయంలో మరుపులేకుండా; విముక్తికిన్= మోక్షానికి; ఎక్కన్‌వలయున్= ఎగబ్రాకాలి.

తాత్పర్యం: నేర్పుగల పురుషుడు నెత్తిపై నేతికుండ మోసికొని ఎట్లా మెట్లు ఎక్కిపోతాడో, అట్లాగే యోగనిపుణత గలవాడు కూడ ఆత్మను మరువకుండా మోక్షసౌధాన్ని అధిష్ఠించాలి.

విశేషం: అలం: ఉపమ.

తే. రథికునకుఁ గలమరికి సారథియుఁ గర్ణ ; ధారుఁడును బోలె నాత్మకుఁ దాను సుపథ
వర్తనైకవిధాయి గావలయు యోగ ; ధారణా నిశ్చలుం డగు ధీరు డధిప! 588

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రథికునకున్= రథమునధిష్ఠించిన వాడికిని; కలమరికిన్= ఓడనెక్కిపోయేవాడికిని; సారథియున్= రథంనడిపేవాడును; కర్ణధారుఁడును పోలెన్= చుక్కానిపట్టేవాడివలె; యోగధారణానిశ్చలుండు+అగు= యోగమును ధరించుటలో చలనములేనివాడైన; ధీరుఁడు= ధైర్యముగలవాడు; తాను= తాను; ఆత్మకున్= తన ఆత్మకు; (తనకు); సుపథవర్తనైక విధాయి= మంచి మార్గమున ప్రవర్తించుటను మాత్రమే కల్పించువాడు; కావలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! రథమెక్కి పోయేవాడిని సారథివలె, పడవ ఎక్కి పయనించే వాడిని చుక్కాని పట్టేవాడివలె యోగధారణలో నిశ్చలస్థితిని పొందిన ధీరచిత్తుడు తన ఆత్మను మంచి మార్గంలోనే నడిపించాలి.

విశేషం: అలం: ఉపమ.

క. శిరమును నాభియు హృదయము । నురమును గర్ణములుఁ బార్శ్వయుగళము నాత్మా
దరణీయస్థానము ల । య్యిరవులఁ గనుయోగి యాత్మ నిభపురనాథా!' 589

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినానగరరాజా!; శిరమును= తలను; నాభియున్= బొడ్డును; హృదయమున్= హృదయాన్ని; ఉరమును= వక్షమును; కర్ణములున్= చెవులు; పార్శ్వయుగళమున్= రెండు ప్రక్కలును; ఆత్మాదరణీయస్థానములు= ఆత్మకు ఆదరించదగిన ప్రదేశాలు; యోగి= యోగశీలుడు; ఆ+ఇరవులన్= ఆ స్థానాలలో; ఆత్మన్ కనున్= ఆత్మను చూస్తాడు.

తాత్పర్యం: హస్తినాపుర ప్రభుడవైన ఓ ధర్మపుత్రా! శరీరంలో తల, బొడ్డు, హృదయం, వక్షం, చెవులు, ఇరుప్రక్కలు - ఆత్మకు ఆదరించదగిన నెలవులై ఉన్నాయి. యోగి అయినవాడు ఆ స్థానాలలో తన ఆత్మను సందర్శిస్తాడు.'

వ. అనిన నజాతశత్రుం డాపగాపుత్రునితో నిట్లనియె. 590

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆపగా పుత్రునితోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పగా ధర్మజుడు అతడితో ఇట్లా అన్నాడు:

తే. ' యోగి యెట్టి యాహారంబు లుడుగవలయు? । నాతఁ డెబ్భంగి భోజ్యంబు లనుభవించి
బలము వడయువాఁ?డిది నాకుఁ దెలియఁజెప్ప । వే జనస్తవనీయసమిద్ధబుద్ధి! 591

ప్రతిపదార్థం: జన స్తవనీయ సమిద్ధ బుద్ధి!= జనులచేత స్తుతించదగిన తేజోవంతమైన బుద్ధికలవాడా!; యోగి= యోగశీలుడు; ఎట్టి= ఎటువంటి; ఆహారంబులు= భోజనాలు; ఉడుగన్ వలయున్?= వర్జించాలి?; ఆతఁడు= ఆ యోగి; ఏ+భంగిభోజ్యంబులు= ఎట్లాంటి ఆహారపదార్థాలను; అనుభవించి= భుజించి; బలము+పడయువాఁడు?= బలం పొందుతాడు; ఇది= ఈ విషయం; నాకున్+తెలియన్=చెప్పవే!= నాకు ఎఱుగజేయుమా!

తాత్పర్యం: 'ప్రజాస్తుతికి పాత్రమై దీపించే బుద్ధిగల ఓ పితామహా! యోగి ఎట్లాంటి ఆహారాలు వర్జించాలి? అతడు ఎటువంటి ఆహారాలు తింటే బలం పుంజుకొంటాడు? ఈ విషయం నాకు వివరించుము.'

సీ. అనవుడు నతనితో నతఁడు 'సున్నిగ్ధంబు । లైన యాహారముల్ మానువాఁడు
యోగి; నీరసముల నుదకంబులను జాల । నాఁకలి పుచ్చుచు నవియు నుదర
మధికపూర్ణంబగు నట్లుగాఁ గొనక వ । ర్తించుట బలము వర్ధింపఁజేయు'
నని చెప్పి వెండియు ననుఁ 'గామమును గ్రోధ । మును నిద్రయును దృష్ణయును భయంబు

తే. రతియు నరతియుఁ బవనంబుగతియు నుడిపి । ధారణా నిశ్చలుం డయి తన్నుఁ దాన
కనుచునుండెడు యోగి దుర్గంపుఁజోటు । వెడల నరిగి సుఖస్థానవిభవ మొందు. 592

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతనితోన్= ఆ ధర్మజుడితో; అతఁడు= భీష్ముడు; యోగి= యోగాభ్యాసపరుడు; సున్నిగ్ధంబులు+ఐన= నూనెగల్గి చిక్కనైన; ఆహారముల్= భోజనాలు; మానువాఁడు= వదలేవాడు; నీరసములన్= సరసములు కానట్టి పదార్థాలతోనూ; ఉదకంబులనున్= నీటితోను; చాలన్= మిక్కిలిగా; ఆఁకలి పుచ్చుచున్= ఆకలి తీర్చుకొంటూ; అవియున్= అవికూడా; ఉదరము= పొట్ట; అధికపూర్ణంబు+అగునట్లుగాన్= మిక్కిలి నిండేటట్లుగా; కొనక= గ్రహించక; వర్తించుట= ఉండటం; బలమున్= సత్తువను; వర్ధిల్లన్+చేయున్= వృద్ధిపొందిస్తుంది; అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; అనున్= ఇట్లా అన్నాడు; కామమునున్=

కోరికనూ; క్రోధమునున్= కోపాన్నీ; నిద్రయునున్= నిద్రనూ; తృష్ణయునున్= ఆశనూ; భయంబున్= భీతినీ; రతియున్= రాగాన్నీ; అరతియున్= రాగంలేమినీ; పవనంబుగతియున్= శ్వాసగమనాన్నీ; ఉడిపి= ఉడిగించి; ధారణా నిశ్చలుండు+అయి= యోగమును ధరించటంలో కదలికలేనివాడై; తన్నున్= తనను; తాన= తానే; కనుచున్+ఉండెడు యోగి= చూస్తూ ఉండే యోగి; దుర్గంపుఁజోటున్= చొరరాని ప్రదేశాన్ని; వెడలన్+అరిగి= అతిక్రమించిపోయి; సుఖస్థానవిభవమున్= ఆనందపదముయొక్క వైభవాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అడుగగా అతడితో భీష్ముడు ఇట్లా అన్నాడు: 'యోగి నూనెగల చిక్కనైన ఆహారపదార్థాలు వర్జించాలి. రసవత్తరములు కాని పదార్థాలతో, నీటితో ఆకలి తీర్చుకొనాలి. అవికూడా పొట్టనిండేటట్లు ఎక్కువగా తీసికొనరాదు. అట్లా ఉంటే బలం పెంపొందుతుంది' - ఈ రీతిగా చెప్పి భీష్ముడు మళ్ళీ ఇట్లా అన్నాడు: - 'కామాన్నీ, క్రోధాన్నీ, నిద్రనూ, ఆశనూ, భయాన్నీ, అభిరుచినీ, అభిరుచిలేనితనాన్నీ, శ్వాసగమనాన్నీ ఉడిగించాలి. యోగధారణలో నిశ్చలత కలిగి తనలో తనను చూచుకొంటూ రమించే యోగి దుర్గమప్రదేశాలను నిర్గమించి నిత్యసుఖానికి నెలవైన ధామం చేరుకొంటాడు.

క. జనవర! యసిధారావ్రత । మనఁదగియెడు ధారణానియతి పనుపడు నె
వ్వని చిత్తంబున నా యో । గనిరూఢున కరిది యైన కార్యముఁ గలదే. 593

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; ఎవ్వనిచిత్తంబునన్= ఎవడి హృదయంలో; అసిధారావ్రతము= కత్తివాదరపై నడక; అనన్+తగియెడు= అని చెప్పదగిన; ధారణానియతి= ధారణయొక్క నియమం; పనుపడున్= అలవడుతుందో; ఆ యోగనిరూఢునకున్= అట్టి యోగసిద్ధుడికి; అరిది+ఐన కార్యమున్= అశక్యమైన పని; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: రాజా! కత్తి వాదరపై నడక అనదగిన యోగధారణా నియమం ఎవడి చిత్తంలో స్థిరమై ఉంటుందో అట్లాంటి యోగనిపుణుడు సాధించరాని కార్యమేమున్నది?

క. యోగనిరూఢుఁడు సంగ । త్యాగానందైకరతుఁ; డతనికి జనన సం
యోగము మృతిదైన్యంబును । భోగాభోగ సుఖదుఃఖములు లే వధిపా! 594

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; యోగనిరూఢుఁడు= యోగమునందు సిద్ధిపొందినవాడు; సంగత్యాగ+ఆనందైకరతుఁడు= పొత్తును విడుచుటచేత కలిగే ఆనందమునందే ఆసక్తుడు; అతనికిన్= అట్టి యోగికి; జననసంయోగమున్= పుట్టుకతోపొత్తు; మృతిదైన్యంబునున్= మరణభీతిచేతకలిగే దీనత్వమూ; భోగ+అభోగసుఖదుఃఖములు= భోగంచేత కలిగే సుఖమూ; భోగం లేకపోవటంచేత కలిగే దుఃఖమూ; లేవు= ఉండవు.

తాత్పర్యం: రాజా! యోగసిద్ధి పొందినవాడు సంగాన్ని వదలిపెట్టటం వలన కలిగే సంతోషంలోనే ఆసక్తి కలిగి ఉంటాడు. అతడికి పుట్టుకతో సంయోగం, మరణంతో దీనత్వం లేవు. భోగంవలన సుఖించటం, భోగం లేకపోతే దుఃఖించటం అనేవి అతడి కుండవు.

క. అతనికి సరిత్సముద్ర । క్షితిభృ ద్ద్వీపములు గేలికిం బట్టులు దా
మతిఁ దలఁచెనేనిఁ బరిశాం । తత నున్నను గుడియు గుహయుఁ దగుమందిరముల్. 595

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ యోగికి; సరిత్సముద్రక్షితిభృద్ద్వీపములు= నదులు, సముద్రాలు, కొండలు, దీవులు; కేళికిన్= క్రీడకు;

పట్టులు= నెలవులు; తాన్= తాను; మతిన్= చిత్తమునందు; తలఁచెన్+ఏనిన్= తలంచినచో; పరిశాంతతన్+ఉన్ననున్= శాంతంగా ఉన్నా; గుడియున్= దేవాలయమూ; గుహయున్= కొండబిలమూ; తగుమందిరముల్= తగిన గృహాలు.

తాత్పర్యం: యోగనిపుణుడికి నదులూ, సాగరాలూ, కొండలూ, దీవులూ క్రీడాస్థానా లవుతాయి. అతడు తలచుకొంటే, ప్రశాంతంగా ఉంటే గుడి, పర్వతగుహ తగిన నివాసగృహాలుగా రూపొందుతాయి.

క. విముఖుం డగుటయుఁ గీళులు । దమయంతన చెందు జనులఁ దా వారలకున్
సుముఖుం డగుటయు శుభములు । సమకూరును శివునియట్ల చరితము లెల్లన్.' 596

ప్రతిపదార్థం: తాన్= తాను; విముఖుండు= ప్రతికూలుడు; అగుటయున్= కాగానే; తమ+అంతన= తమకుతామే; కీళులు= అశుభములు; జనులన్= ప్రజలను; చెందున్= పొందుతాయి; వారలకున్= ఆ జనులకు; సుముఖుండు+అగుటయున్= అనుకూలుడు కాగానే; శుభములు= మంగళాలు; సమకూరును= కలుగును; చరితములు+ఎల్లన్= నడవడికలన్నీ; శివుని+అట్ల= శంకరుడి వంటివే అవుతాయి.

తాత్పర్యం: యోగి ప్రజలకు విముఖుడుగా ఉంటే వాళ్ళకు అశుభాలు తమకు తామే కలుగుతాయి. అతడు వారికి సుముఖుడైతే శుభాలు ప్రాప్తిస్తాయి. యోగియొక్క పోకడలన్నీ శంకరుడి పోకడలను పోలి ఉంటాయి.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి వెండియు. 597

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: భీష్ముడు మరీతిగా పలికి మళ్ళీ ఈ విధంగా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' యోగతంత్రంబు సకలశాస్త్రోదితంబు । విను విశేషించి లోకైక విభుఁడు సెప్పె
దీని నారాయణుఁడు; మునిమాననీయ । మిది మనంబునఁ దెలిసికొ మ్మిద్ధచరిత!' 598

ప్రతిపదార్థం: ఇద్ధచరిత= ఉజ్జ్వలమైన శీలం కలవాడా!; విను= ఆలకించుము; యోగతంత్రంబు= యోగంయొక్క సిద్ధాంతం; సకలశాస్త్ర+ఉదితంబు= సమస్తశాస్త్రాలలో చెప్పబడింది; విశేషించి= అతిశయించి; దీనిన్= ఈ యోగశాస్త్రాన్ని; లోకైకవిభుఁడు= ప్రపంచానికి ముఖ్యప్రభువైన; నారాయణుఁడు= మాధవుడు; చెప్పెన్= వచించాడు; ఇది= ఈ సిద్ధాంతం; మునిమాననీయము= మునులచేత పూజించదగినది; మనంబునన్= నీ చిత్తంలో; తెలిసికొమ్ము= గ్రహించుకొనుము.

తాత్పర్యం: 'ఉజ్జ్వలచరిత్రుడవైన ఓ ధర్మరాజా! వినుము. ఇప్పుడు నేను వివరించిన యోగసిద్ధాంతం సకలశాస్త్రాలలో చెప్పబడి ఉన్నది. విశేషించి దీనిని జగదేకప్రభువైన నారాయణుడు చెప్పాడు. దీనిని మునులు గౌరవిస్తున్నారు. కాబట్టి నీవు నీ మనస్సులో దీనిని చక్కగా గ్రహించుము.'

వ. అనిన విని ధర్మతనయుండు 'యోగతంత్రప్రకారంబు భవత్ప్రసాదంబునం బ్రబుద్ధంబయ్యెఁ; సాంఖ్యస్వరూపం బెట్టిది యెఱిఁగింపవే' యని యడిగిన, నతనికి దేవవ్రతుం డిట్లనుఁ 'గపిలాది మహాముని దర్శితంబైన మార్గంబున వివరించెద. 599

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; యోగతంత్రప్రకారంబు= యోగసిద్ధాంత

విధానం; భవత్ప్రసాదంబునన్= నీ అనుగ్రహంచేత; ప్రబుద్ధంబు+అయ్యెన్= తెలియబడింది; సాంఖ్యస్వరూపంబు= సాంఖ్యశాస్త్రవిధానం; ఎటింగింపవే= తెలుపుమా; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మసుతుడికి; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కపిల+ఆదిమహాముని దర్శితంబు+ఐన= కపిలుడు మొదలైన పెద్ద మునులు చూపిన; మార్గంబునన్= పద్ధతిలో; వివరించెదన్= విశదీకరిస్తాను.

తాత్పర్యం: భీష్ముడట్లా చెప్పగా విని ధర్మరాజు 'నీ అనుగ్రహం వలన నేను యోగశాస్త్ర మెట్లాంటిదో చక్కగా తెలిసికొనగలిగాను. ఇక సాంఖ్యశాస్త్ర స్వరూపం ఎట్లాంటిదో నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పు డతడితో భీష్ముడు ఇట్లా చెప్పాడు. 'నేను నీకు కపిలుడు మొదలైన మహా మునులు చెప్పిన పద్ధతి ననుసరించి సాంఖ్యశాస్త్రాన్ని విశదీకరిస్తాను.'

భీష్ముఁడు ధర్మరాజునకు సాంఖ్యస్వరూప నిరూపణంబు సేయుట (సం. 12-290-3)

సీ. ' వినుము దృఢజ్ఞానమున విషయంబుల । భంగి లెస్సగ నారయంగ వలయు;
నవియుఁ దిర్యఙ్మనుష్యామర పితృసిద్ధ । గరుడ గంధర్వ కిన్నరుల యందు
వేఱుచందంబులై విలసిల్లు; శ్రుతివాక్య । దృష్టంబులగు దానఁ దెలియ నరయు
పరిచయంబున భేదపరబోధమేమిటి । కనరాదు; తోఁచిన యప్పు డవియు

తే. దురితకరముల యని వానిఁ దొడరకుండ । వలదె లెస్సగ నెఱిఁగిన వచ్చుఁ దొలఁగ
నేమఱమి దక్క నొండొకం డేల చోర । జనులఁ జిట్లంగ నడఁచుట కనఘచరిత! 600

ప్రతిపదార్థం: అనఘచరిత!= దురితంలేని చరిత్రం కలవాడా!; వినుము= ఆలకించుము; దృఢజ్ఞానమునన్= గట్టి తెలివితో; విషయంబులభంగిన్= ((గ్రహించదగిన) ఆయా అంశాల పద్ధతిని; లెస్సగన్= బాగుగా; ఆరయంగన్+వలయున్= పరిశీలించాలి; అవియున్= ఆ విషయాలుకూడా; తిర్యఙ్మనుష్యామర పితృసిద్ధ గరుడ గంధర్వకిన్నరుల+అందున్= పశుపక్ష్యాదులు, మానవులు, దేవతలు, పితరులు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులనబడే వీరిలో; వేఱుచందంబులు+ఐ= వేరువేరు విధములై; విలసిల్లున్= ప్రకాశిస్తాయి; శ్రుతివాక్య దృష్టంబులు+అగున్= (అవి) వేదవచనములచేత తెలియబడునవి అవుతున్నాయి; దానన్= దానివలన; తెలియన్+అరయు= తెలిసికొనటానికై అన్వేషించుము; పరిచయంబునన్= ఎఱుకలో; భేదపరబోధము= భేదంతో సంబంధపడిన జ్ఞానం; ఏమిటికిన్= ఎందుకు; అనన్ రాదు= అని చెప్పతగదు; తోఁచిన అప్పుడు= ఉదయించినప్పుడు; అవియున్= ఆ విషయాలుకూడా; దురితకరముల+అని= పాపహేతువులే అని; వానిన్= ఆ విషయాలను; తొడరక+ఉండన్ వలదె?= అంటకుండా ఉండవద్దా?; లెస్సగన్= బాగుగా; ఎఱిఁగినన్= గ్రహిస్తే; తొలఁగన్ వచ్చున్= తొలగిపోవచ్చు; చోరజనులన్= దొంగలను; చిట్లంగన్+అడఁచుటకున్= కొట్టి అణచేటందుకు; ఏమఱమిదక్కన్= జాగరూకత తప్ప; ఒండు+ఒకండు+ఏల?= మరొకటి ఎందుకు?

తాత్పర్యం: 'పవిత్రవర్తనుడవైన ధర్మపుత్రా! వినుము. గ్రహించదగిన విషయాల నన్నింటినీ దృఢమైన వివేకంతో గ్రహించాలి. పశుపక్ష్యాదులు, మానవులు, దేవతలు, పితరులు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు - వీరికి చెందిన విషయాలు పరస్పర భిన్నంగా ఉంటాయి. వేదవాక్యాలలో వాటిని చూడవచ్చును. నీవు కూడా వాటిని ఆ విధంగా తెలిసికొనటానికై ప్రయత్నించుము. పశుపక్ష్యాదులు, మానవులు మొదలైన వారికి చెందిన భిన్నభిన్న విషయాలను గ్రహించవలసిన అవసర మేమున్నది? అని చెప్పకూడదు. ఆయా పరిస్థితులు మనకు కలిగినపుడు అవికూడ పాపహేతువులే అని తెలిసికొని వాటిని అంటకుండా ఉండాలి కదా! అవి చక్కగా తెలిసి ఉంటే వాటినుండి బయటపడవచ్చును. దొంగలను ఒడలు పగలగొట్టి తరిమివేయాలంటే ఏమరుపాటు లేకుండా ఉండటం తప్ప

మరొక ఉపాయంతో ప్రయోజనమేముంది? అందువలన దోషభూయిష్ఠమైన ఆయా విషయాలకు దూరంగా ఉండాలంటే వాటిని గూర్చిన పరిజ్ఞానం అవసరమే. (ఇందులో ఏమరుపాటు పనికిరాదని భావం).

విశేషం: తిర్యక్కులు, మానవులు మొదలైన వారికి చెందిన విషయాలన్నీ దోషాలతో కూడినవే. అవి శాశ్వతాలు కాక రాకపోకలు గలిగి ఉండటం వలననే దోషభూయిష్ఠాలవుతున్నాయి. ఆ దోషస్వరూపం చక్కగా తెలిస్తే వాటిని వర్జించి చివరికి జీవుడు మోక్షం పొందుతాడు. అందువలన వేదవాక్యాల సాయంతో వాటిని గ్రహించాలని తాత్పర్యం. ఆ విషయాలలో కొన్ని గుణాలు కలిగించవచ్చును. అయినా వాటికి కూడా రాకపోకలుంటాయి. అందువలన వాటికి శాశ్వతత్వం లేదు కాబట్టి అవికూడా దోషాలే అని భావించాలని ఈ ఘట్టంలో సంస్కృతభారతానికి వ్యాఖ్యవ్రాసిన నీలకంఠుడు వివరించాడు. (చూడు - ఓరియంటల్ బుక్స్ రీప్రింట్ కార్పొరేషన్ వారి - శాంతిపర్వం - ద్వితీయముద్రణ, 602 పుట).

చ. తలఁపఁగ నాయు వింతియకదా యని సౌఖ్యము దుఃఖముం బొరిం
గలుగవె కాలవృత్తి నని, కర్మము లిట్లని వేదచోదనం
బుల బహుభంగు లిట్టివని బుద్ధికి సత్త్వరజస్తమోగుణం
బులకుఁ బ్రవర్తనంబు లివి పొమ్మని కాంచుట చాల మే లగున్. 601

ప్రతిపదార్థం: తలఁపఁగన్= ఊహించగా; ఆయువు= జీవితకాలం; ఇంతియకదా అని= ఇంతేకదా అనీ; సౌఖ్యమున్= సుఖమూ; దుఃఖమున్= దుఃఖమూ; కాలవృత్తిన్= కాలవర్తనచేత; పొరిన్= క్రమంగా; కలుగవె అని= సంభవించవా అనీ; కర్మములు+ఇట్లు+అని= పనులు ఇట్లాంటివి అనీ; వేదచోదనంబుల బహుభంగులు= శ్రుతిచేసేప్రేరణలయొక్క వివిధ పద్ధతులు; ఇట్టివి+అని= ఈ విధమైనవనీ; బుద్ధికిన్= బుద్ధి అనే అంతఃకరణవృత్తికి; సత్త్వరజస్తమోగుణంబులకున్= సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలకు; ప్రవర్తనంబులు= పోకడలు; ఇవిపొమ్ము+అని= ఇవియే సుమా! అనీ; కాంచుట= గ్రహించటం; చాలమేలు+అగున్= మిక్కిలి శ్రేయస్సు అవుతుంది.

తాత్పర్యం: ఆయువు ఇంతేకదా! అనీ, సుఖమూ, దుఃఖమూ క్రమంగా వస్తూఉంటాయి అనీ, మనం చేయదగిన కర్మ లట్లాంటివి అనీ, వేదం విధించే నానా విధులు ఈ రీతిగా ఉన్నాయనీ, బుద్ధియొక్క ప్రవృత్తి, సత్త్వరజస్తమోగుణాల ప్రవృత్తులూ ఇవే సుమా! అనీ గ్రహించటం ఎంతో శ్రేయోదాయక మవుతుంది. ఇవి తెలిసికొనటంవలన మానవుడు ప్రవృత్తిమార్గం వదలి క్రమంగా నివృత్తిమార్గంలో ప్రవేశించి శ్రేయస్సు పొందుతాడని భావం.

సీ. ఇంద్రియార్థంబుల నేనింట నై దింద్రి । యములును గోష్ఠంబునందు వహ్ని
పవనుండు బయలను, బావకునందుఁ దో । యములును భూమి దోయముల బలము
గౌశికునందును గ్రాంతి యుపేంద్రుని । యందును నర్థంబునందు లోభ
మును దమస్సున బుద్ధియును రజస్సునఁ దమ । స్సును సత్త్వమున రజస్సును గరంబు

ఆ. దగులు సత్త్వ మాత్మఁదగులు; నాత్ముండు నా । రాయణుఁడు మహేశుఁ డనఁగ బరఁగు
పరముఁ దగులు నతఁడు పరము మోక్షంబునఁ । దగులు, మోక్ష మెందుఁ దగుల దధిప! 602

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇంద్రియ+అర్థంబుల+ఏనింటన్= శబ్దం మొదలైన ఐదువిషయాలలో; ఐదు+ఇంద్రియములునున్= శ్రోత్రంమొదలైన ఇంద్రియాలు ఐదును; కోష్ఠంబునందున్= గర్భమునందు; వహ్ని= అగ్ని; బయలనున్= ఆకాశమున;

పవనుండున్= వాయువును; పావకునందున్= అగ్నియందు; తోయములును= జలములును; తోయములన్= జలాలలో; భూమి= పృథివియు; కౌశికునందునున్= ఇంద్రుడియందు; బలమున్= హస్తేంద్రియమును; ఉపేంద్రునియందునున్= విష్ణువునందు; క్రాంతి= పాదవిక్షేపమును (కాలుముందుకు చాచుట); అర్థంబునందున్= ధనమునందు; లోభమునున్= పిసినితనమును; తమస్సునన్= తమోగుణమునందు; బుద్ధియునున్= బుద్ధియు; రజస్సునన్= రజోగుణమునందు; తమస్సును= తమోగుణమును; సత్త్వమునన్= సత్త్వగుణమునందు; రజస్సును= రజోగుణమును; కరంబున్= మిక్కిలిగా; తగులున్= తగులువడిఉంటాయి; సత్త్వము= సత్త్వగుణము; ఆత్మన్= జీవునియందు; తగులున్= తగులుకొనిఉంటుంది; ఆత్ముండు= జీవుడు, నారాయణుడు మహేశుఁడు+అనఁగన్+పరఁగు= నారాయణుడు, మహేశ్వరుడు అనగా ప్రసిద్ధుడైన; పరమున్= శ్రేష్ఠుడైనదేవుని; తగులున్= తగులుకొని ఉంటాడు; అతఁడు= ఆ దేవుడు; పరము= శ్రేష్ఠమైన; మోక్షంబునన్= మోక్షమునందు; తగులున్= ఆసక్తుడై ఉంటాడు; మోక్షము= ముక్తి; ఎందున్= దేనిలోనూ; తగులదు= తగులుకొనదు.

తాత్పర్యం: రాజా! శ్రోత్రం, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలు క్రమంగా శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదు విషయాలలోనూ, అగ్ని ఉదరంలోనూ, వాయువు ఆకాశంలోనూ, జలం అగ్నిలోనూ, భూమి జలమందునూ, హస్తేంద్రియం ఇంద్రుడియందునూ, పాదవిక్షేపం (కాలు చాచటం) వామనుడైన విష్ణుని యందునూ, లోభం ధనంలోనూ, బుద్ధి తమోగుణంలోనూ, తమోగుణం రజోగుణంలోనూ, రజోగుణం సత్త్వగుణంలోనూ మిక్కిలిగా తగులువడివున్నాయి. సత్త్వగుణం జీవాత్ముడితో సంబద్ధమై ఉన్నది. త్వంపదార్థమైన జీవుడు నారాయణుడూ, మహేశ్వరుడూ అనబడే దేవుడిలో తగులువడిఉన్నాడు. ఆ దేవుడు శ్రేష్ఠమైన మోక్షంలో సక్తుడై ఉన్నాడు. తత్పదార్థమైన మోక్షం ఎందులోనూ తగులువడక స్వతంత్రమై ఉన్నది.

క. ప్రకృతి పదాఱు వికారము । లకు నాశ్రయ మాత్మ కది నెలవు; వినుమాత్మం
డకుటిల తేజోరూపతఁ । బ్రకృతియు వికృతియును గాక ప్రస్ఫురితుఁ డగున్. 603

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ప్రకృతి= త్రిగుణాలసామ్యావస్థ అయిన ప్రకృతి; పదాఱు వికారములకున్= పదునారు వికారాలకు; ఆశ్రయము= ఆధారం; ఆత్మకున్= ఆత్మకు; అది= ఆ ప్రకృతి; నెలవు= స్థానం; ఆత్ముండు= ఆత్మ; అకుటిలతేజోరూపతన్= స్వచ్ఛమైన తేజస్సు యొక్క రూపంకలవా డవటంచేత; ప్రకృతియున్= గుణసామ్యావస్థయు; వికృతియునున్+కాక= వికారమున్ను కాక; ప్రస్ఫురితుఁడు+అగున్= భాసించినవాడవుతాడు.

తాత్పర్యం: సత్త్వం మొదలైన మూడు గుణాల సామ్యావస్థ అయిన ప్రకృతి పదునారు వికారాలకు ఆలంబనమై ఉన్నది. ఆత్మకు ఆ ప్రకృతే ఆశ్రయస్థానం. ఆత్మ స్వచ్ఛమైన తేజోరూపం కలిగి ఉన్నది. అది ప్రకృతి వికృతులలో ఏదీ కాక భాసిస్తూ ఉన్నది.

విశేషం: సత్త్వరజస్తమోగుణాల కలయికతో కూడిన సామ్యావస్థకు ప్రకృతి అని పేరు. ఈ ప్రకృతే ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు, పంచభూతాలు (పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం) - అనే పదారు వికారాలకు ఆశ్రయమై ఉన్నది. సంస్కృత భారతానికి వ్యాఖ్య రచించిన నీలకంఠుడు, స్వప్నశరీరం పదునారు కార్యాలతో ఆవృతమై ఉన్నదనీ, ప్రాణం మొదలు నామం వరకూ గల 'ప్రాణాఁచ్ఛద్ధాం' ఇత్యాది వేదమంత్రంలో చెప్పబడిన ప్రాణాదుల పదునారు కార్యాలనూ వివరించాడు. అందలి విశేషాలు ఆ వ్యాఖ్యలో చూడవచ్చును.

తే. ఆత్మునకు రెండు రూపంబు లనఘ! కలవు । విషయసంగతి నొక్కటి విస్తరిల్లుఁ,
దదుపభోగంబు లేక మధ్యస్థభావ । మొంది యొక్కఁడు వెలుఁగుచు నుండుఁ జూవె! 604

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఆత్మునకున్= ఆత్మకు; రెండు రూపంబులు= రెండు ఆకారాలు; కలవు= ఉన్నాయి; ఒక్కటి= అందులో ఒకటి; విషయసంగతిన్= శబ్దాదులైన విషయాల కలయికతో; విస్తరిల్లున్= వ్యాపించి ఉన్నది; ఒక్కఁడు= మరొక ఆత్మ; తదుపభోగంబు లేక= ఆ విషయాల యొక్క అనుభవం లేకుండా; మధ్యస్థభావమున్+ఒంది= తటస్థస్వరూపం పొంది; వెలుఁగుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; చూవె!= సుమా!.

తాత్పర్యం: అనఘా! ఆత్మకు రెండు రూపాలు ఉన్నాయి. అందులో ఒకటి శబ్దస్పర్శాది విషయాలను శ్రోత్రం, త్వక్కు మొదలైన ఇంద్రియాలద్వారా అనుభవిస్తూ ఉంటుంది. మరొక ఆత్మ విషయాలతోడి పొత్తు లేకుండా తటస్థంగా ఉండి భాసిస్తూ ఉంటుంది.

విశేషం: ఆత్మ ఒక్కటే అయినా అవిద్యా (అజ్ఞానం) ప్రభావం వలన ఆత్మ నిజస్వరూపాన్ని మరచిపోయి కామకర్మాదులకు లోనై జన్మలెత్తి విషయసుఖాలను అనుభవిస్తూ ఉంటుంది. ఇది అవిద్య ఉన్నంతవరకూ ఇట్లాగే ప్రవర్తిస్తుంది. అవిద్య తొలగినవాడు ఆత్మ పరమాత్మగా భాసిస్తుంది. పరమాత్మకు సుఖదుఃఖాలు, విషయాలతోడి పొత్తు లేవు. అవిద్యకు లోనైనవాడు జీవాత్మ. అవిద్యను నశింపజేసికొన్న నాడు అతడే పరమాత్మగా ప్రకాశిస్తాడు. ఈ జీవాత్మ - పరమాత్మలనే ఇక్కడ ఆత్మయొక్క రెండురూపాలుగా పేర్కొనటమయిందని గ్రహించాలి.

క. పవనం బేకము, ప్రాణా । ది విభేదము లైదు, వినుఁ! తదీయంబులు వా
ని విధంబు లరయ నిశ్చల । మవు నది; యాసుకృత మంతరాత్మునిఁ జూపున్. 605

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; పవనంబు= వాయువు; ఏకము= ఒక్కటి; తదీయంబులు= దానికి చెందినవి; ప్రాణాదివిభేదములు+ఐదు= ప్రాణం మొదలైన భేదాలు ఐదు; వాని విధంబులు= ప్రాణాదివాయువుల యొక్క స్వరూపాలను; అరయన్= పరిశీలించగా; అది= ఆ వాయువు; నిశ్చలము+అవున్= కదలిక లేనిదవుతుంది; ఆ సుకృతము= ఆ పుణ్యము; అంతఃఆత్మునిన్= పరమాత్ముడిని; చూపున్= దర్శింపజేస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. వాయువు ఒక్కటే. కాని దానికి చెందిన భేదాలు ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అని ఐదు విధాలుగా ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే క్రమంగా పవనగమనం నిరోధించబడుతుంది. ఈ నిరోధమనే సుకృతం జీవుడిలోని అంతరాత్మను దర్శింపజేస్తుంది.

విశేషం: వాయువు ఒక్కటైనా స్థానభేదాన్ని బట్టి అది ఐదు విధాలుగా రూపొందింది. హృదయంలో ఉన్నవాయువు ప్రాణమనబడుతుంది. గుదస్థానంలో ఉన్నది అపానం. నాభిప్రదేశంలో ఉండేది సమానవాయువు. కంఠస్థలంలో ఉన్న దానిని ఉదానమంటారు. వ్యానమనేది సర్వశరీరంలోనూ వ్యాపించిఉంటుంది. వాయుగమనాన్ని పరిశీలిస్తూ ప్రాణాయామాది క్రియలు ఆచరిస్తే వాయు నిరోధం జరుగుతుంది. తద్ద్వారా అంతరాత్మను చూడవచ్చును. వాయుచలనాన్ని అరికట్టటం ద్వారా మనస్సును నిరోధించవచ్చు. మనస్సు నిశ్చలమైతే పరమాత్మ దర్శనం కలుగుతుంది.

క. వినుఁ! గర్భవాస దుఃఖం । బును జన్మవ్యథయు బాల్యము విమూఢత్వం
బును రాగక్లేశ జరా । జనితకృపణతలును జూపు, సంగముఁ బాపున్. 606

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము, (ఆ సుకృతం); గర్భవాసదుఃఖంబును= మాతృగర్భంలో నివసించటానికి చెందిన దుఃఖాన్ని; జన్మవ్యథయున్= పుట్టుకకు సంబంధించిన బాధను; బాల్యము విమూఢత్వంబునున్= పసితనంలోని మూర్ఖత్వాన్నీ; రాగక్లేశ జరాజనిత కృపణతలును= విషయాసక్తి లోని కష్టాన్నీ; ముసలితనంలో జనించే దీనత్వాన్నీ; చూపున్= దర్శింపజేస్తుంది; సంగమున్= వాటి సాంగత్యాన్ని; పాపున్= తొలగిస్తుంది.

తాత్పర్యం: ధర్మజా! వినుము. పైన చెప్పిన సుకృతం మానవులకు మాతృగర్భవాసంలోని క్లేశాన్నీ, పుట్టుకలోని బాధనూ, బాలుడుగా ఉండేటప్పుడుండే మూఢత్వాన్నీ, విషయాసక్తిలోని క్లేశాన్నీ, వార్ధకంలోని దీనావస్థనూ స్పష్టంగా తెలియజేస్తుంది. అవి తెలియటం వలన వాటిని వదలించుకొనాలని మానవుడు ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నం అతడికి సంసారం తోడి పొత్తును తొలగిస్తుంది.

ఉ. చెందుచునుండుఁ బుణ్యములు సేసి సురత్వము, మధ్యకర్ముఁడై
యొందు నరత్వమున్, దురితయోగమునం బశుకీటభావమున్
బొందు, సుఖంబు దుఃఖమును బొందఁగ జీవుఁడు దీనిభేదశ
క్తిం దెలియంగ నేర్చినమతిం గల యాతఁడు గోరు మోక్షమున్. 607

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ; సుఖంబున్= సౌఖ్యాన్నీ; దుఃఖమునున్= దుఃఖాన్నీ; పొందఁగన్= అనుభవించటానికై; పుణ్యములు= సుకృతములు; చేసి= ఆచరించి; సురత్వమున్= దేవత్వాన్ని; చెందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు; మధ్యకర్ముఁడు+ఐ= సుకృతమూ - దుష్కృతమూ కాని మధ్యమరూపాలైన సామాన్యకర్మలు గలవాడై; నరత్వమున్= మానవత్వాన్ని; ఒందున్= పొందుతాడు; దురితయోగమునన్= పాపంతోడి పొత్తున; పశుకీటభావమున్= జంతుత్వాన్ని, పురుగురూపాన్నీ; పొందున్= చెందుతాడు; దీని భేదశక్తిన్= కర్మయొక్క భేదసామర్థ్యాన్ని; తెలియంగన్= గ్రహించగా; నేర్చినమతిన్= నేర్పుగలబుద్ధిని; కల+ఆతఁడు= కలిగినట్టివాడు; మోక్షమున్= ముక్తిని; కోరున్= అభిలషిస్తాడు.

తాత్పర్యం: జీవుడు సుఖదుఃఖాలు పొందటానికై పుణ్యకార్యాలు చేసి అమరత్వం పొందుతాడు. పుణ్యాతిశయమూ, పాపాతిశయమూ లేని నడిమిరకపు పనులు చేసి మానవుడై జన్మిస్తాడు. పాపం ఎక్కువైనపుడు పశువుగానో, పురుగుగానో ఉద్భవిస్తాడు. జీవుడు చేసే కర్మలలో ఇన్ని తేడా లున్నాయి. ఈ కర్మయొక్క భేదసామర్థ్యాన్ని గ్రహించనేర్చిన బుద్ధిమంతుడు మాత్రం కర్మజాలంలో తగులువడకుండా ముక్తి కోరి అందుకై ప్రయత్నిస్తాడు.

క. క్షయవృద్ధులఁ జంద్రుఁడు న । బ్ధియు లోనుగఁ బొందుచుండఁ దెలియఁడు బంధు
క్షయమునకు వగచు నజ్ఞుం । డయమహితా! దీని నెఱుఁగు టమలతఁ దెచ్చున్. 608

ప్రతిపదార్థం: అయమహితా!= శుభకర్మలచేత పూజించబడినవాడా!; చంద్రుఁడున్= చందమామయు; అబ్ధియున్= సముద్రుడును; లోనుగన్= లోనుగా గలవారు; క్షయవృద్ధులన్= నాశాన్నీ, వృద్ధినీ; పొందుచున్+ఉండన్= పొందుతూ ఉండగా; అజ్ఞుండు= జ్ఞానహీనుడు; తెలియఁడు= ఈ సంగతి గ్రహించడు; బంధుక్షయమునకున్= చుట్టాల వినాశానికి; వగచున్= దుఃఖిస్తాడు; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగుట= గ్రహించటం; అమలతన్+తెచ్చున్= నిర్మలత్వాన్ని సమకూరుస్తుంది.

తాత్పర్యం: పవిత్రకర్మలచేత పూజితుడవైన ఓ ధర్మరాజా! చంద్రుడు, సముద్రం మొదలైన గొప్ప గొప్ప పదార్థాలు హాని, వృద్ధులు పొందుతున్నాయి. అయినా వివేకం లేనివాడు క్షయవృద్ధులు తప్పవన్న విషయం గుర్తించడు. తన బంధువులు మరణిస్తే దుఃఖిస్తాడు. హాని, వృద్ధి అనే ద్వంద్వాలు సృష్టిలో సహజాలు అని గ్రహించగలిగితే చిత్తం నిర్మల మవుతుంది.

క. తన దేహము దోషములం । గని వేవురలో నొకండు గలుగు విముక్తిం
గను పని కుద్యోగించుట । కనఘా! పెక్కండ్రు లే రహంకృతికతనన్.' 609

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వేవురలోన్= వెయ్యిమందిలో; ఒకండు= ఒక్కడు; తన దేహము దోషములన్= తన శరీరంలోని దోషాలను; కని= చూచి; విముక్తిన్= మోక్షమును; కను పనికిన్= చూచే కార్యానికి; ఉద్యోగించుటకున్=

ప్రయత్నించటానికి; కలుగున్= ఉంటాడు; అహ్నంకృతికతనన్= అహంకారకారణంచేత; పెక్కండ్రు లేరు= ఎక్కువమంది లేరు.

తాత్పర్యం: అనఘా! వెయ్యిమందిలో ఒక్కడు మాత్రమే తన శరీరానికి చెందిన దోషాలు గ్రహించి మోక్షం కొరకై ప్రయత్నించేవా డుంటాడు. అహంకారం కారణంగా చాలామంది మోక్షప్రయత్నం చేసేవారు లేరు.'

విశేషం: "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యదతతి సిద్ధయే" అన్న భగవద్గీతావాక్యం అభిప్రాయం ఇదే.

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'దేహదోషంబు లెవ్వి? యెటింగింపవే' యనుటయు, ననిమిషనదీనందనుం డతని కిట్లనియె. 610

ప్రతిపదార్థం: అనిన విని= అని చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; దేహదోషంబులు= శరీరదోషాలు; ఎవ్వి= ఏవి; ఎటింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అనిమిషనదీనందనుండు= దేవనదీపుత్రుడైన భీష్ముడు; అతనికిన్= ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పగా విని ధర్మరాజు 'శరీరంలోని దోషాలు ఏవి? నాకు తెలియపరచుము' అని అడిగాడు. అప్పుడు భీష్ము డతడితో ఈ రీతిగా చెప్పాడు.

క. వినుఁ! కామముఁ గ్రోధము భయ । మును నిద్రయు నిశ్శ్వసనము భూవర! దేహం
బునఁ గల దోషము; లీ యై । దును బాపెడి తెఱఁగు సెప్పుదుం దెలియంగన్. 611

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; వినుఁ= ఆలకించుము; కామమున్= కోరిక; క్రోధమున్= కోపం; భయమును= భీతి; నిద్రయున్= నిద్దుర; నిశ్శ్వసనమున్= నిట్టూర్పు; దేహంబునన్= శరీరమునందు; కల దోషములు= ఉన్న దోషాలు; ఈ ఐదునున్= ఈ ఐదురకాలైన దోషగుణాలను; పాపెడి తెఱఁగు= తొలగించే విధానాన్ని; తెలియంగన్= తెలిసేటట్లుగా; చెప్పుదున్= చెప్పుతాను.

తాత్పర్యం: 'రాజా! వినుము. కామం, క్రోధం, భయం, నిద్ర, నిశ్శ్వాసం అనేవి దేహగతమైన దోషాలు. ఈ ఐదు దోషాలను తొలగించుకొనే విధానం కూడా వివరిస్తాను.

సీ. క్షమ క్రోధమునకు, సంకల్ప వర్జనము గా । మమునకు, నప్రమాదము భయంబు
నకు, సత్త్వసంసేవనము నిద్రకును, లఘు । భోజిత నిశ్వాసమునకు వైరు
లని చెప్పి, వెండియు నను ననేకములగు । దోషముల్ దొలఁగంగఁ ద్రోచువెరవు
లును బెక్కు లవి గనికొను వివేకము గల । పురుషుండు దన్మార్గ పరిచయమున

తే. విష్ణుమాయను దోఁచు నీ విష్టపములు । భిత్తి చిత్రంబు విధమున ఫేనభంగి
బుద్బుదాకృతిగాఁ గను బుధుఁడు; దీని । సరకు సేయక మోక్షంబు తెరువు వెదకు. 612

ప్రతిపదార్థం: క్రోధమునకున్= కోపానికి; క్షమ= ఓర్పు; కామమునకున్= కోరికకు; సంకల్పవర్జనము= సంకల్పించటాన్ని విడవటం; భయంబునకున్= భయానికి; అప్రమాదము= ఏమరుపాటు లేకుండటం; నిద్రకునున్= నిద్దురకు; సత్త్వసంసేవనము= సత్త్వగుణమును సేవించటం; నిశ్శ్వాసమునకున్= నిట్టూర్పునకు; లఘుభోజిత= అల్పభోజనం చేయటం; వైరులు+అని= శత్రువులని; చెప్పి= వచించి; వెండియున్= మరల; అనున్= చెప్పాడు; అనేకములు+అగు= పెక్కులయిన; దోషముల్= దోషాలు; తొలఁగంగన్+త్రోచు= తొలగజేసేటటువంటి; వెరవులును= ఉపాయాలుకూడ; పెక్కులు= అనేకాలు; వివేకముకల= తెలివిగల; పురుషుండు= మానవుడు; తన్మార్గ పరిచయమునన్= ఆ ఉపాయాల యొక్క త్రోవలతోడి పరిచయంతో; అవి కనికొనున్= వాటిని ఎరింగి గ్రహిస్తాడు;

విష్ణుమాయను= విష్ణుమాయచేత; తోఁచు= ఉదయించే; ఈ విష్టపములు= ఈ లోకాలు; భిత్తిచిత్రవిధంబునన్= గోడమీది బొమ్మలవలె; ఫేనభంగిన్= నురుగురీతిగానూ; బుద్బుద+ఆకృతిగాన్= నీటి బుడగవంటి రూపుగలవిగానూ; కను= చూచు; బుధుఁడు= పండితుడు; దీనిన్= ఈ లోకాన్ని; సరకుచేయక= లక్ష్యపెట్టక; మోక్షంబు తెరువు= ముక్తియొక్క మార్గమును; వెదకున్= అన్వేషిస్తాడు.

తాత్పర్యం: కోపానికి ఓర్పూ, కామానికి సంకల్పించకుండా ఉండటమూ, భయానికి ఏమరుపాటు లేకుండటమూ, నిద్రకు సత్త్వగుణాన్ని సేవించటమూ, శ్వాసకు అల్పాహారస్వీకరణమూ శత్రువులు' - అని భీష్ముడు చెప్పాడు. మళ్ళీ ఇట్లా అన్నాడు. ఇంకా పెక్కు దోషాలను తొలగించుకొనే ఉపాయాలు కూడా అనేకం ఉన్నాయి. వివేకవంతుడు వాటిమార్గాలను తెలిసికొని చేపట్టి దోషాలను నిర్మూలిస్తాడు. ఈ లోకాలు విష్ణుమాయా ప్రభావం వలన కలుగుతున్నాయి. పండితుడు వీటిని గోడమీది బొమ్మలుగా, నురుగులవలె, నీటి బుడగలతీరుగా చూస్తాడు. అతడు వీటిని లక్ష్యపెట్టడు. మోక్షమార్గాన్ని మాత్రమే అన్వేషిస్తాడు.

ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము (సం. 12-290-80, 81)

వ. ఇది సాంఖ్యప్రకారంబు బహిస్స్పర్శంబులు తపోదండంబునం దొలంగం జడిసి యానపాత్రరూపంబుగా దీని నవలంబించిన యార్యుండు ప్రజ్ఞాకర్ణధార సామర్థ్యంబున దుఃఖోదకంబును వ్యాధిమృత్యు మహాగ్రాహంబును భయోరగంబును హింసావేగంబును రాగపంకంబును తృష్ణావర్తంబును నానాప్రీతిరత్నంబును సత్యతీరంబును నగు సంసారసాగరంబు నుత్తరించు నా సుకృతి నట సూర్యుండు తన రశ్ముల వహించి నడపు పద్మతంతు సన్నిభంబైన మార్గంబు ప్రవేశించి చనంజన సూక్ష్ముండును శీతలుండును సుగంధియు సుఖస్పర్శుండును సప్తమారుత శ్రేష్ఠుండును నగు పవనుం డెదుర్కొని నభఃపరమగతిం జేర్చు; నభంబు రజః పరమగతిని రజస్సు సత్త్వపరమగతిని, సత్త్వంబు నారాయణుని, నారాయణుండు పరమంబునం జేర్పనందుం గలిసి తన్మయుండై యమృతత్వనిత్యుండగు'నని చెప్పిన విని పాండవాగ్రజుం'డట్లమృత స్వరూపశాశ్వతుండగు నమ్మహాత్ముండు దన పూర్వవృత్తంబు దలంచునో తలంపకుండునో దాని నిశ్చయం బతిగహనంబు; మోక్షంబు దలంచి పరమజ్ఞానమగ్నుం డగుటం బురుషున కెద్ది దశయో యను వితర్కంబున నది ప్రవృత్తి ధర్మంబున కంటె మే లనరాకున్నది; యీ రెండు దెఱంగులుం దెలుప నీవకాక యీలోకంబున నొరులు గలరే?' యనుటయు నజ్జనపతికి జాహ్నవీనందనుం డిట్లనియె. 613

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; సాంఖ్యప్రకారంబు= సాంఖ్యముయొక్క విధానం; తపోదండంబునన్= తపస్సు అనే కర్రతో; బహిస్స్పర్శంబులు= వెలుపలి తాకిడులు; తొలంగన్ జడిసి= తొలగద్రోచి; దీనిన్= ఈ సాంఖ్యవిధిని; యానపాత్రరూపంబుగాన్= ఓడయొక్క రూపంగా; అవలంబించిన= గ్రహించిన; ఆర్యుండు= పూజ్యుడు; ప్రజ్ఞాకర్ణధార సామర్థ్యంబునన్= తెలివిఅనే ఓడ నడిపేవాడి నైపుణ్యంతో; దుఃఖోదకంబునున్= దుఃఖమనే నీరు కలదీ; వ్యాధిమృత్యుమహాగ్రాహంబునున్= రోగాలు, మరణం అనే గొప్ప మొసళ్ళు గలదీ; భయ+ఉరగంబునున్= భయం అనే సర్పాలు కలదీ; హింసావేగంబునున్= హింస అనే ప్రవాహం కలదీ; రాగపంకంబునున్= విషయాసక్తి అనే బురదకలదీ; తృష్ణా+ఆవర్తంబునున్= ఆశ అనే సుడిగుండం కలదీ; నానాప్రీతి రత్నంబునున్= పలురకాల సంతోషాలు అనే రత్నాలు గలదీ; సత్యతీరంబునున్+అగు= సత్యమనే గట్టు గలదీ అయిన; సంసారసాగరంబున్= సంసారమనే సముద్రాన్ని; ఉత్తరించున్= దాటుతాడు; అటన్= అచ్చట; సూర్యుండు= సూర్యుడు; ఆ సుకృతిన్= ఆ పుణ్యాత్ముడిని; తన రశ్ములన్= తన కిరణాలచేత; వహించి= మోసి; నడపున్= కొనిపోతాడు; పద్మతంతు సన్నిభంబు+ఐన= తామరతూడు దారంతో సమానమైన; మార్గంబు ప్రవేశించి= త్రోవలో చొచ్చి; చనన్+చనన్= పోగా పోగా; సూక్ష్ముండునున్= అణుస్వరూపుడూ; శీతలుండునున్= చల్లనివాడూ; సుగంధియున్= మంచివాసనకలవాడూ; సుఖస్పర్శుండునున్= హాయిగొలిపే స్పర్శకలవాడూ; సప్తమారుతశ్రేష్ఠుండునున్= ఏడు వాయువులలో మేలైనవాడూ; అగు= అయినట్టి; పవనుండు= ప్రవాహమనెడు వాయువు; ఎదుర్కొని= అభిముఖమైపోయి;

నభఃపరమగతిన్= ఆకాశముయొక్క శ్రేష్ఠగతిని; చేర్చున్= చేరుస్తాడు; నభంబు= ఆకాశం; రజఃపరమగతినిన్= రజస్సుయొక్క శ్రేష్ఠగతిని; రజస్సు= రజోగుణం; సత్త్వపరమగతినిన్= సత్త్వంయొక్క శ్రేష్ఠమైన గతిని; సత్త్వంబు= సత్త్వగుణం; నారాయణునిన్= విష్ణుదేవుడిని; నారాయణుండు= విష్ణువు; పరమంబునన్= పరమాత్మయందు; చేర్పన్= చేర్చగా; అందున్+కలిసి= ఆ పరమాత్మతో కూడి; తన్మయుండు+ఐ= పరమాత్మ స్వరూపుడై; అమృతత్వ నిత్యుండు= అమరణ ధర్మప్రాప్తిచేత శాశ్వతుడు; అగునని చెప్పినన్= అవుతాడని చెప్పగా; విని= ఆకర్ణించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; అట్లు= ఆ రీతిగా; అమృతస్వరూపశాశ్వతుండు+అగు= అమరణ ధర్మస్వరూపంచేత నిత్యుడైన; ఆ+మహాత్ముండు= ఆ సుకృతాత్ముడు; తన పూర్వవృత్తంబున్= తన మునుపటి వృత్తాంతాన్ని; తలంచునో= భావిస్తాడో; తలంపక+ఉండునో= భావించకే ఉంటాడో; దాని నిశ్చయంబు= దానికి సంబంధించిన నిర్ణయం; అతిగహనంబు= మిక్కిలి సూక్ష్మమవటంవలన ఎరుగరానిది; మోక్షంబున్= ముక్తిని; తలంచి= భావించి; పరమజ్ఞానమగ్నుండు+అగుటన్= శ్రేష్ఠజ్ఞానంలో లీనుడు కావటం వలన; పురుషునకున్= జీవుడికి; ఎద్ది= ఏది; దశయో= అవస్థయో; అను వితర్కంబునన్= అన్న సందేహముచేత; అది= ఆ స్థితి; ప్రవృత్తి ధర్మంబున కంటెన్= లోకప్రవర్తనకు సంబంధించిన ధర్మానికంటె; మేలు+అనరాక+ఉన్నది= శ్రేష్ఠమైనదని చెప్పరాక ఉన్నది; ఈ రెండు తెఱంగులున్= ఈ రెండు మార్గాలూ; తెలుపన్= వ్యక్తం చేయటానికి; నీవకాక= నీవే తప్ప; ఈ లోకంబునన్= ఈ జగత్తులో; ఒరులు= ఇతరులు; కలరే?= ఉన్నారా?; అనుటయున్= అని చెప్పగా; ఆ+జనపతికిన్= ఆ రాజుకు; జాహ్నవీనందనుండు= గంగాసుతుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంతవరకూ చెప్పింది సాంఖ్యులు అనుసరించే విధానం. వెలుపలి స్పర్శలు అనబడే విషయసుఖాలను తపస్సు అనే క్రతో తొలగనెట్టి ఈ సాంఖ్యవిధానాన్ని ఓడగా గ్రహించిన ఆర్యుడు ప్రజ్ఞ అనే పడవ నడిపే చుక్కాని వాడి నైపుణ్యంతో సంసారమనే సముద్రాన్ని దాటుకొంటాడు. ఆ సముద్రం దుఃఖమనే నీటితోనూ, వ్యాధులు, మరణమనే మొసళ్ళతోనూ, భయమనే పాములతోనూ, హింస అనే ప్రవాహంతోనూ, విషయాసక్తి అనే బురదతోనూ, ఆశలు అనే సుడులతోనూ, పెక్కు సంతోషాలు అనే రత్నాలతోనూ, సత్యమనే గట్టుతోనూ కూడి ఉంటుంది. ఆ సముద్రాన్ని దాటిన పుణ్యాత్ముడిని సూర్యుడు తన కిరణాలతో మోసికొనిపోతాడు. పిదప తామరతూడులోని దారమంతటి సూక్ష్మమైన దారిలో ప్రవేశించి అతడు పయనిస్తూ ఉండగా మిక్కిలి సూక్ష్మమైనవాడూ, చల్లనివాడూ, మంచివాసనకలవాడూ, సుఖమైన స్పర్శకలవాడూ, ఏడు విధాలైన వాయువులలో శ్రేష్ఠుడూ అయిన ప్రవహుడనే పవనుడు అతడి కెదురుగా పోయి అతడిని ఆకాశంయొక్క పరమగతిని చేరేటట్లు చేస్తాడు. ఆకాశం రజస్సుయొక్క పరమగతినీ, రజస్సు సత్త్వంయొక్క పరమగతినీ, సత్త్వం నారాయణుడినీ క్రమంగా చేరేటట్లు చేస్తాయి. నారాయణుడు ఆ పుణ్యాత్ముడిని కడకు పరమాత్మతో చేరుస్తాడు. ఆ పరతత్త్వంతో కలిసి అతడు తన్మయుడై అమృతత్వదశను పొంది శాశ్వతస్థితి కలవాడవుతాడు' ఇట్లా భీష్ముడు చెప్పగా విని ధర్మజుడు 'ఆ రీతిగా అమృతస్వరూపుడై నిత్యుడైన మహాత్ముడు తన పూర్వస్థితిని తలుస్తాడా? తలంచకుండానే ఉంటాడా? ఈ విషయానికి సంబంధించిన నిర్ణయం అగోచరమై ఉన్నది. మోక్షాన్ని భావించి అందుకై పరమజ్ఞానంలో లీనమైనవాడు కావటంతో ఆ పురుషుడి అప్పటి స్థితి ఎట్లాంటిదో అంతుబట్టటం లేదు. ఈ సంశయం ఉండటం వలన ఆ స్థితి ఈ లోక ప్రవృత్తిధర్మం కంటె మేలైనది అని నిర్ణయించి చెప్పటానికి వీలుకాకుండా ఉన్నది. అతడు ఆ స్థితిలో తన పూర్వస్థితిని తలుస్తాడా? తలంచడా? అనే ఈ రెండు మార్గాలనూ ఇదమిత్థమని తెలపటానికి ఈ లోకంలో నీవు తప్ప మరెవరూ లేరు' అని అన్నాడు. అప్పుడు ధర్మరాజుతో భీష్మ డీరీతిగా చెప్పాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. ఆకాశం యొక్క పరమగతి అంటే హార్దాకాశమని గ్రహించాలి. అట్లాగే రజస్సుయొక్క పరమగతి

అహంకారమనీ, సత్త్వముయొక్క పరమగతి మహత్తత్త్వమనీ, దాని పరమగతి నారాయణుడనీ, నారాయణుడి పరమగతి ఉపాధిరహితమైన చిన్మాత్రస్వరూపమనీ గ్రహించాలి. ఆ స్వరూపం పొందితేనే అమృతత్త్వం సిద్ధిస్తుంది. (చూడు - నీలకంఠ పండితుని 'భారతభావదీప' మనే సంస్కృతభారతవ్యాఖ్య - ఓరియంటల్ బుక్స్ రీప్రింటింగ్ కార్పొరేషన్‌వారి ప్రచురణ - శాంతిపర్వం - ద్వితీయముద్రణ - 606వ పుట).

క. అడిగితి లెస్సగఁ బ్రశ్నము । గడుసంకట; మెట్టి యెఱుక గలవారలు నె
ప్పుడు సంశయించు చో టిది; । దడయక యుత్తరము సెప్పెదం దేటపడన్. 614

ప్రతిపదార్థం: లెస్సగన్= బాగుగా; కడుసంకటమున్= మిక్కిలి సూక్ష్మమైన; ప్రశ్నమున్= ప్రశ్నను; అడిగితి(వి)= అడిగావు; ఇది= ఇయ్యది; ఎప్పుడున్= ఎల్లవేళలా; ఎట్టిఎఱుక గలవారలున్= ఎట్లాంటి విజ్ఞానం గలిగినవారైనా; సంశయించుచోటు= సందేహించే స్థానం; తడయక= ఆలసించక; తేటపడన్= స్పష్టమయ్యేటట్లుగా; ఉత్తరమున్= సమాధానాన్ని; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: 'నీవు చాలా గహనమైన ప్రశ్నను చక్కగా అడిగావు. ఎంత తెలివైన వారైనా సందేహించే విషయ మిది. వెంటనే ఇది స్పష్టంగా బోధపడేటట్లు వివరిస్తాను.

వ. కపిల దర్శన విదులగు మునీంద్రుల పరమమతం బిది; యవహితుండవై యాకర్ణింపుము. 615

ప్రతిపదార్థం: ఇది= నేనిప్పుడు చెప్పేది; కపిల దర్శనవిదులు+అగు= కపిలమహర్షి చెప్పిన సాంఖ్యశాస్త్రము నెరింగినవారైన; ముని+ఇంద్రుల= మునిశ్రేష్ఠులయొక్క; పరమమతంబు= శ్రేష్ఠమైన అభిప్రాయం; అవహితుండవు+ఐ= అవధానంకలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కపిలమహర్షి చెప్పిన సాంఖ్యశాస్త్రమును తెలిసికొన్న మునివర్యుల శ్రేష్ఠమైన మత మిది. దీనిని సావధానంగా వినుము.

సీ. పురుషుని నింద్రియంబు లెఱుఁగ; వవి మనస్ । స్థములు గావున మనస్సంగమమునఁ
గనువాని నతఁడు ముక్తత్వంబు లేని య । ప్పుడుఁ గల్గినను నది పురుషునందు
సమమ నిర్విషభుజంగములట్ల నిశ్చేష్ట । నున్న యింద్రియములఁ గన్నఁ గాన
కున్నను నేమి యయ్యుదిత విజ్ఞానామృ । తస్వరూపునకు నాతండు దొఱఁగఁ

తే. గాష్ఠకుడ్యకుసూలాదికముల చంద । మొందునట్టు గాకయు నింద్రియోత్కరంబు
శరధిఫేననిభం బయి విరియు నవ్వి । భూతి యీశ్వరుతెఱఁ గాత్మఁ బొందకున్నె? 616

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు; పురుషునిన్= ఆత్మను; ఎఱుఁగవు= తెలియనేరవు; అవి= ఆ ఇంద్రియాలు; మనస్థములు గావునన్= మనస్సులో ఉండేవి కాబట్టి; వానిన్= ఆ ఇంద్రియాలను; అతఁడు= ఆ పురుషుడు; కనున్= చూస్తాడు; అది= ఆ చూడటం; ముక్తత్వంబు లేని అప్పుడున్= ముక్తి కలగని దశలోనూ; కల్గిననున్= ముక్తి కలిగిన అవస్థలోనూ; పురుషునందున్= ఆత్మయందు; సమము+అ= సమానమే; ఆ+ఉదితవిజ్ఞాన+అమృత స్వరూపునకున్= ఉదయించిన విజ్ఞానంచేత అమరణధర్మమునొందిన స్వరూపంగల ఆ పురుషుడికి; నిర్విషభుజంగములట్ల= విషంలేని పాములవలె; నిశ్చేష్టన్= చేష్టారహితత్వంతో; ఉన్న= ఉన్నట్టి; ఇంద్రియములన్= ఇంద్రియాలను; కన్నన్= చూచినా; కానకున్ననున్= చూడక ఉండినా; ఏమి?= ఏమవుతుంది?; ఆతండు= ఆ పురుషుడు; తొఱఁగన్= విడువగా; ఇంద్రియోత్కరంబు= ఇంద్రియాల సమూహం; కాష్ఠకుడ్యకుసూల+ఆదికముల చందమున్= కొయ్య, గోడ, గాదె మొదలైన పదార్థాల రీతిని; ఒందున్= పొందుతుంది; అట్లు కాకయున్= అట్లాకాక; శరధిఫేన నిభంబు+అయి= సముద్రంలోని నురుగుతో సదృశమై; విరియున్= విచ్ఛిన్నమై పోతుంది;

ఆ+విభూతి= ఆ వైభవం; ఈశ్వరుతెఱఁగు= ఈశ్వరుడి విధానం; ఆత్మన్= ఆత్మను; పొందకున్నె?= పొందక ఉంటుందా?

తాత్పర్యం: శ్రోత్రం, త్వక్కు మొదలైన ఇంద్రియాలు పురుషుడిని తెలియజాలవు. అవి మనస్సులో ఉంటాయి. కాబట్టి పురుషుడు మనస్సుతోడి సంబంధం వలన ఇంద్రియాలను తెలిసికొంటాడు. పురుషుడు ముక్తిపొందినా, పొందకుండినా ఇంద్రియాలను తెలిసికొనటమనేది సమానమే. ఆత్మజ్ఞానసంపన్నుడై అమృతస్వరూపుడైన పురుషుడు విషం లేని పాములవలె చేష్టలు లేక పడిఉన్న ఇంద్రియాలను తెలిసికొన్నా, తెలిసికొనకున్నా జరిగే దేమీలేదు. అందువలన అతడి కేవిధమైన బాధలూ లేవు. ముక్తి నొందిన పురుషుడు ఇంద్రియాలను వర్జించినప్పుడు ఆ ఇంద్రియాలు కొయ్య, గోడ, గాదెలవలె జడంగా పడి ఉంటాయి. లేదా సాగరంలోని నురుగువలె విచ్ఛిన్నమై పోతాయి. ఇంద్రియాలు ఈ స్థితిని పొందటమనేది ఈశ్వరుడి విభూతిఅయి ఉన్నది. అది ముక్తి పొందిన ఆత్మకు కూడా అన్వయిస్తుంది.

విశేషం: అలం: ఉపమ. ముక్తుడు కానివాడు ఇంద్రియాలను గ్రహించజాలినట్లే ముక్తుడైనవాడు కూడ ఇంద్రియాలను గ్రహించగలడు. అయితే ముక్తిపొందిన వాడిని జడప్రాయాలైన ఇంద్రియాలు ఏమీ చలింపజేయలేవు. లేదా అవి నీటిపై నురుగువలె రూపులేనివై పోతాయి. ఈశ్వరు డే విధంగా ఇంద్రియాల ప్రభావానికి లోనుగాడో, అట్లాగే ముక్త పురుషుడు కూడా ఇంద్రియాల ప్రభావానికి ఏ విధంగానూ లోనుగాడని భావం.

క. వినుఁ! మింద్రియసహితముగా । మనుజాధిప! బోధపూరమగ్నత్వము గ
ల్గిననుం దత్సూక్ష్మగతులఁ । గనుఁ బురుషుఁడు గనియు నిర్వికారత నుండున్. 617

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= రాజా!; వినుము= ఆలకించుము; ఇంద్రియసహితముగాన్= ఇంద్రియాలతో కూడిఉండేటట్లు; బోధపూరమగ్నత్వము= జ్ఞానప్రవాహంలో మునుగటం; కల్గిననున్= సంభవించినా; పురుషుఁడు= ముక్తాత్ముడు; తత్సూక్ష్మగతులన్= వాటి సూక్ష్మగమనాలను; కనున్= చూస్తాడు; కనియున్= చూచికూడా; నిర్వికారతన్= వికార రహితస్థితితో; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: రాజా! వినుము. ఒకవేళ పురుషుడు ఇంద్రియాలతో కూడియే పరమజ్ఞానమగ్నుడైతే అతడు వాటి సూక్ష్మమైన పోకడలను చూస్తూ ఉంటాడు. చూచినా తాను వాటివలన కలిగే వికారాలకు లోనుకాడు.

తే. భూతములను గుణంబుల బుద్ధి మనసు । నడఁచికొని జీవుఁ డొందు నారాయణునిఁ ద
దీయమాహాత్మ్యమున మాననీయపరమ । పదము గనుఁగాన నిష్పుణ్యపాపుఁ డతఁడు. 618

ప్రతిపదార్థం: జీవుఁడు= పురుషుడు; భూతములనున్= పంచభూతాలనూ; గుణంబులన్= మూడు గుణాలనూ; బుద్ధిన్= బుద్ధినీ; మనసున్= చిత్తాన్నీ; అడఁచికొని= లయింపజేసికొని; నారాయణునిన్= నారాయణు డనబడే పరమాత్ముడిని; ఒందున్= పొందుతాడు; తదీయ మాహాత్మ్యమునన్= ఆ నారాయణుడి ప్రభావం వలన; మాననీయపరమపదమున్= పూజ్యమైన మోక్షాన్ని; కనున్= చూస్తాడు; కానన్= కావున; అతఁడు= ఆ ముక్తజీవుడు; నిష్పుణ్యపాపుఁడు= పుణ్యపాపాలు లేనివాడవుతాడు.

తాత్పర్యం: జీవుడు పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం అనే ఐదు భూతాలనూ, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలనూ, బుద్ధినీ, మనస్సునూ అణచుకొన్నవాడై నారాయణుడి సన్నిధి చేరుకొంటాడు. ఆ పరమాత్ముడి కృపాప్రభావం వలన మహితమైన పరమపదం పొందుతాడు. అందువలన ఆ స్థితిలో అతడికి పుణ్యం, పాపం అనేవి లేవు. (ఇంద్రియాల పోకడలను చూస్తున్నా అతడికి పుణ్యపాపాల స్పర్శ లేదని తాత్పర్యం.)

క. పునరావర్తనరహితుం । డనఘా! పరమాత్ముఁ జెందినట్టి పురుషుఁ డ

వినుతావస్థను మోక్షం । బని చెప్పుదు; రంతకంటె నధికము గలదే?' 619

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; పరమాత్ముఁన్= నారాయణుడివి; చెందినట్టి= పొందినట్టి; పురుషుఁడు= జీవుడు; పునరావర్తనరహితుండు= తిరిగి రాకలేనివాడు; ఆ+వినుత+అవస్థను= పునర్జన్మలేని ఆ ప్రశస్తమైన దశను; మోక్షంబు+అని= ముక్తి అని; చెప్పుదురు= అంటారు; అంతకంటెన్= ఆ మోక్షంకంటె; అధికము= గొప్పది; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ ధర్మరాజా! పరమాత్ముడైన నారాయణుడిని పొందినట్టి జీవుడికి పునర్జన్మ లేదు. శ్రేష్ఠమైన పునరావృత్తిలేని ఆ దశనే మోక్షమంటారు. మోక్షావస్థకంటె ఎక్కువ దశ మరేమీ లేదు.

విశేషం: "ఆ బ్రహ్మ భువనాల్లోకాः । పునరావర్తినోZర్జున!
మా ముపేత్య తు కౌంతేయ । పునర్జన్మ న విద్యతే॥' (గీత - 8-16)

అన్న గీతావాక్యం ఇక్కడ స్మరణీయం. కృష్ణుడు అర్జునుడితో 'అర్జునా! బ్రహ్మలోకం వరకూ పోయిన వారు మళ్ళీ తిరిగి జన్మిస్తారు. కాని నన్ను పొందినవారికి పునర్జన్మ లేదు' అని చెప్పాడు. అందువలన నారాయణుడి సన్నిధి చేరి ఆ పరమాత్ముడి అనుగ్రహానికి పాత్రులైనవారు ముక్తు లవుతా రని గ్రహించాలి.

వ. అని చెప్పి వెండియు. 620

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: భీష్ముడు ధర్మజుడితో అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. ' గురుని వచనంబు తెఱఁగునఁ । బరమార్థ నిరూపణంబు భంగి నియతిఁ ద
త్పరుఁడై నడపం జాలిన । పురుషునిఁ దడయక ప్రశాంతి పొందు నరేంద్రా! 621

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; గురుని వచనంబు తెఱఁగునన్= ఆచార్యుడి ఉపదేశాన్ని అనుసరించి; పరమ+అర్థనిరూపణంబు భంగిన్= పరతత్త్వమును నిరూపించే పద్ధతిని; నియతిన్= నియమంతో; తత్పరుఁడు+ఐ= దానియందే ఆసక్తిగలవాడై; నడపన్+చాలిన= నిర్వహించగలిగినట్టి; పురుషునిన్= మానవుడిని; తడయక= ఆలసించక; ప్రశాంతి= ప్రకృష్టమైన శాంతి పొందున్= పొందుతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! గురూపదేశాన్ని అనుసరించి ఎవడు పరతత్త్వ నిరూపణ పద్ధతిని నియమంతో పాటిస్తాడో, అట్లాంటి పురుషుడికి త్వరలో ప్రశాంతి కలుగుతుంది.

చ. జనవర! సాంఖ్య మిట్టిది ప్రజాపతి పూజ్యము బ్రహ్మభావభా
జనత ఘటింప దీనిసరి సమ్యగుపాయము లెందులేవు; నె
మ్మనమున సంశయింపక సమాహితచిత్తత దీనినూఁడు ని
స్తనుఁడగు నమ్మహేశునకుఁ దాఁ దనువిం కిట వేయు నేటికిన్. 622

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; సాంఖ్యము= సాంఖ్యశాస్త్రం; ఇట్టిది= ఇటువంటిది; ప్రజాపతిపూజ్యము= ఇది బ్రహ్మచేత పూజించతగినది; బ్రహ్మభావభాజనతన్= బ్రహ్మత్వయోగ్యతను; ఘటింపన్= కలిగించటానికి; దీని సరి= దీనికి సాటియగు; సమ్యగు పాయములు= మంచి ఉపాయాలు; ఎందున్= ఎక్కడను; లేవు= ఉన్నవికావు; నెమ్మనమునన్= చిత్తమునందు;

సంశయింపక= సందేహించక; సమాహితచిత్తతన్= సమాధానం పొందిన మనస్సుతో; దీనిన్= ఈ సాంఖ్యవిధానాన్ని; ఱఁదు= అవలంబించుము; తాన్= తాను; నిస్తనుఁడు+అగు= శరీరంలేనివాడైన; ఆ+మహేశునకున్= ఆ పరమేశ్వరుడికి; తనువు= శరీరం; ఇంకన్= ఇకపై; ఇటన్= ఈ విషయంలో; వేయున్ ఏటికిన్?= వెయ్యి మాటలు ఎందుకు?

తాత్పర్యం: రాజా! ఇప్పుడు నేను చెప్పింది సాంఖ్యపద్ధతి. ఇది ప్రజాపతి అయిన బ్రహ్మచేత పూజించదగినదై ఉన్నది. జీవుడు బ్రహ్మత్వం పొందటానికి దీనికి దీటు రాగల మంచి ఉపాయాలు వేరే ఎక్కడా లేవు. నీవు దీని విషయమై మనస్సులో సంశయించవద్దు. మనస్సును సమాధానపరచుకొని ఈ సాంఖ్య పద్ధతిని పాటించుము. ఈ సాంఖ్యం శరీరంలేని పరమేశ్వరుడికి శరీరమై ఉన్నది. ఇంక ఈ విషయమై వెయ్యి మాటలతో ప్రయోజన మేమి?

తే. వేదశాస్త్ర పురాణ సంవేదితంబు । లైన బహువిధసంపరిజ్ఞానములకు
నెల్ల నిది సేరుగడ సూవె యేఱులకు స । ముద్రమును బోలె నుపశాంతి భద్రచిత్త! 623

ప్రతిపదార్థం: ఉపశాంతి భద్రచిత్త!= ఉపశాంతిచే మంగళకరమైన మనస్సు గల ఓ ధర్మరాజా! ఏఱులకున్= నదులకు; సముద్రమును పోలెన్= సాగరంలాగా; వేదశాస్త్రపురాణసంవేదితంబులు+ఐన= శ్రుతులచేత, శాస్త్రాలచేత, పురాణాలచేత తెలియజేయబడినవైన; బహువిధసంపరిజ్ఞానములకున్+ఎల్లన్= అనేకవిధాలైన జ్ఞానాలకన్నింటికిని; ఇది= ఈ సాంఖ్యపద్ధతి; చేరుగడ చూవె= గమ్యం సుమా!

తాత్పర్యం: ప్రశాంతిచేత భద్రమైన హృదయంగల ఓ ధర్మరాజా! నదులకన్నిటికీ సముద్రమే గమ్యమైనట్లు వేదాలు, శాస్త్రాలు, పురాణాలు ప్రతిపాదించే నానావిధ జ్ఞానాలకు ఈ సాంఖ్యపద్ధతి చేరువలోనున్న గమ్యమై ఉన్నది చూడుము.

వ. యోగులును సాంఖ్యులును జూచువెరవు లాకర్ణించితి కాదె; యిది యిట్లగుటం జేసి దర్శనభేదంబు గల దంటి
నదియును నల్పాంతరం; బదియునుంగాక. 624

ప్రతిపదార్థం: యోగులునున్= యోగమార్గం అనుసరించే వారూ; సాంఖ్యులునున్= సాంఖ్యపద్ధతిని అనుసరించే వారూ; చూచువెరవులు= చూచేపద్ధతులు; ఆకర్ణించితి(వి) కాదె!= వింటివికదా!; ఇది ఇట్లు+అగుటన్+చేసి= ఇది ఇట్లా ఉంటున్నది కాబట్టి; దర్శనభేదంబు= చూపులో తేడా; కలదు+అంటిన్= ఉన్నదన్నాను; అదియునున్= ఆ భేదం కూడ; అల్ప+అంతరంబు= స్వల్పమైన తేడా గలది; అదియునున్+కాక= అదీకాక.

తాత్పర్యం: ధర్మరాజా! యోగులు, సాంఖ్యులు చూచే పద్ధతిని వింటివికదా! అట్లు ఉండటంవలననే నేను వారిలో దర్శనభేదం ఉన్నదని చెప్పాను. ఆ భేదం చాలా స్వల్పమైనది. అదీకాక.

ఆ. యోగి చూచుభంగి నుర్వీశ! సాంఖ్యుండుఁ । జూచు; సాంఖ్యుఁ డరయు చొప్పు యోగి
వరుఁడు నరయుఁ; గాన వారిద్దఱును నొక్క । తెరువువార యండ్రు పరమమునులు. 625

ప్రతిపదార్థం: ఉర్వీశ!= రాజా!; యోగిచూచుభంగిన్= యోగి చూచునట్లే; సాంఖ్యుండున్+చూచున్= సాంఖ్యపద్ధతిననుసరించువాడు కూడ చూస్తాడు; సాంఖ్యుఁడు+అరయు చొప్పున్= సాంఖ్యుఁడు చూచే విధానమును; యోగివరుడున్= యోగిశ్రేష్ఠుడుకూడ; అరయున్= చూస్తాడు; కానన్= కావున; పరమమునులు= శ్రేష్ఠులైన మౌనులు; వారు+ఇద్దఱును= ఆ ఇద్దరున్నూ; ఒక్కతెరువువార+అండ్రు= ఒక మార్గములోని వారే అని చెప్పుతారు.

తాత్పర్యం: భూపాలా! యోగి చూచే రీతిగానే సాంఖ్యుడు చూస్తాడు. సాంఖ్యుడు చూచునట్లే యోగి చూస్తాడు.

అందువలననే మునివర్యులు వా రిద్దరూ ఒక్కమార్గానికి చెందినవారే అని అంటారు.

విశేషం: 'ఏకం సాంఖ్యం చ యోగం చ । యుः పశ్యతి స పశ్యతి!' (గీత 5-5) అని గీతావచనం. 'సాంఖ్యాన్ని, యోగాన్నీ ఒకటిగానే ఎవడు చూస్తాడో, వాడే నిజంగా చూచేవాడు' అని ఈ వచనానికి అర్థం. దీనివలన సాంఖ్యయోగాలకు పెద్ద భేదం లేదని గ్రహించాలి.

క. వినుఁ! సాంఖ్యమ్మును యోగము । ననుఁ పేఱుల కాని దీనియం దదియును దా
న నదియుఁ దోఁచుచునుండుం । గనుఁ దత్త్వవిచారి యొకఁడ కా నీ రెంటిన్. 626

ప్రతిపదార్థం: వినుఁ= ఆలకించుము; సాంఖ్యమ్మును= సాంఖ్యమనీ; యోగమున్+అను= యోగమనీ అనే; పేఱులు+అ+కాని= పేరులే కాని; దీనిఅందున్= దీనిలో; అదియునున్= అదీ; దానన్= దానిలో; ఇదియున్= ఇదీ; తోఁచుచున్+ఉండున్= కనిపిస్తూ ఉంటాయి; తత్త్వవిచారి= తత్త్వమును విచారించేవాడు; ఈ రెంటిన్= ఈ రెండింటినీ; ఒకఁడకాన్= ఒక్కటిగానే; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: రాజా! వినుము. సాంఖ్యమనీ, యోగమనీ పేరులో భేదమే కాని నిజంగా పరిశీలించి చూస్తే సాంఖ్యంలో యోగమూ, యోగంలో సాంఖ్యమూ కనిపిస్తూనే ఉంటాయి. అందువలననే తత్త్వజ్ఞులు సాంఖ్యయోగాలను రెంటినీ ఒక్కటిగానే భావిస్తారు.

క. ఈ తెరువునఁ జరియించుచు । నే తెఱఁగున నైనఁ దప్పెనేనియుఁ బురుషుం
డాతత నాక సుఖము గనుఁ; । దోఁతెంచును మగుడ సద్బుధుల వంశమునన్. 627

ప్రతిపదార్థం: పురుషుండు= జీవుడు; ఈ తెరువునన్= ఈ మార్గంలో; చరియించుచున్= చరిస్తూ; ఏతెఱఁగునన్+ఐనన్= ఏ విధంగానైనా; తప్పెన్+ఏనియున్= మార్గం తప్పితే; ఆతతనాక సుఖమున్= విస్తృతమైన స్వర్గసుఖాన్ని; కనున్= చూస్తాడు; మగుడన్= మరల; సద్బుధుల వంశమునన్= మంచి పండితుల వంశమునందు; తోఁతెంచును= జన్మిస్తాడు.

తాత్పర్యం: జీవుడు ఈ మార్గంలో సంచరిస్తూ ఉంటాడు. ఏ విధంగానైనా అతడు మార్గం తప్పి గమ్యమైన మోక్షం చేరలేకపోతే స్వర్గానికి పోతాడు. అక్కడ సుఖం అనుభవిస్తాడు. మరల మంచి విబుధుల వంశంలో జన్మిస్తాడు.

విశేషం: పైన చెప్పిన యోగాది మార్గాలు మోక్షం చేరటానికి ఉపాయాలు. ఆ మార్గాలలో భద్రంగా పయనించేవాడు గమ్యమైన పరమపదం చేరుకొంటాడు. వాడికి పునర్జన్మ లేదు. అట్లాకాక ఏ కారణంవలననైనా యోగమార్గం నుండి భ్రష్టుడైనవాడు స్వర్గానికి వెళ్ళుతాడు. అక్కడ పుణ్యఫలమైన స్వర్గసుఖాలు అనుభవిస్తాడు. పుణ్యం క్షీణమైన పిమ్మట 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' (గీత 9-21) అన్నట్లు మళ్ళీ మానవలోకంలో జన్మిస్తాడు. అయితే పూర్వం వీడు యోగభ్రష్టుడు కనుక ఆ ప్రభావంవలన 'శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోZ భిజాయతే' (గీత 6-41) అన్నట్లు శుచిమంతులు, శ్రీమంతులు అయిన మాన్యుల వంశంలో జన్మించి సాంఖ్యయోగం పాటిస్తాడు. యోగసిద్ధి పొందిన పిమ్మట మోక్షం వాడికి సిద్ధిస్తుంది అని భావం.

ఆ. మఱియు నిత్తెఱంగు మనసున నెలసిన । వినుతమోక్షలక్ష్మి విభుత గాంచు
నిట్టి తెరువు సూప నెవ్వరి కలవి నా । రాయణునక కాక యమలచరిత! 628

ప్రతిపదార్థం: అమలచరిత!= విమలచరిత్రుడా!; మఱియున్= ఇంకను; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; మనసునన్= చిత్తమునందు; ఎలసినన్= పొందితే; వినుతమోక్షలక్ష్మి విభుతన్= ప్రశస్తమైన మోక్షమనే లక్ష్మియొక్క ప్రభుత్వమును; కాంచున్= పొందుతాడు; నారాయణునకు+అ+కాక= ఒక్క శ్రీమన్నారాయణపరమాత్మకు తప్ప; ఇట్టి తెరువు= ఇట్లాంటి మార్గమును; చూపన్=

దర్శింపజేయటానికి; ఎవ్వరికిన్+అలవి= ఇతరుల కెవ్వరికి శక్యం?

తాత్పర్యం: పవిత్రచరిత్రుడవైన ఓ ధర్మరాజా! బుధుల వంశంలో పుట్టినవాడు మరల ఆ యోగమార్గాన్ని చిత్తంలో అనుసంధించి నిర్వహించగలిగితే మోక్షలక్ష్మికి ప్రభువు కాగలడు. ఈ మోక్షమార్గాన్ని ఆ యోగులకు ఒక్క శ్రీమన్నారాయణుడు చూపగలడే కాని ఇతరులకు అది సాధ్యమా? (భగవదనుగ్రహం వలననే మోక్షప్రాప్తి కలుగుతుందని భావం).

వ. నారాయణ ప్రణీతంబై యక్షర ప్రదర్శకం బైన యిత్తెఱంగుఁ జిత్తంబున నలవరింపు' మని దేవవ్రతుండు ధర్మనందనునకుం జెప్పెనని యిట్లు వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పిన, 'నటమీఁద వర్తించిన విశిష్ట సల్లాపంబులు సెప్పవే' యని యడుగుటయు. 629

ప్రతిపదార్థం: నారాయణప్రణీతంబై= నారాయణుడిచేత ప్రవర్తింపచేయబడినదై; అక్షర ప్రదర్శకంబు+ఐన= క్షరంలేని మోక్షమును చూపించేదగు; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; చిత్తంబునన్= మనస్సులో; అలవరింపుము+అని= అభ్యసించుమని; దేవవ్రతుండు= భీష్ముడు; ధర్మనందనునకున్= ధర్మజుడికి; చెప్పెన్+అని= వచించెనని; ఇట్లు= ఈ విధంగా; వైశంపాయనుండు= వ్యాసుడి శిష్యుడైన వైశంపాయనుడు; జనమేజయునకున్= పరీక్షిత్తు పుత్రుడైన జనమేజయ మహారాజునకు; చెప్పినన్= చెప్పగా; అటమీఁదన్= ఆ పైన; వర్తించిన= జరిగిన; విశిష్టసల్లాపంబులు= విమూత్నమైన సంభాషణములు; చెప్పవే= వచించుమా; అని అడుగుటయున్= అని అడుగగా.

తాత్పర్యం: శ్రీమన్నారాయణుడిచేత ప్రవర్తితమై అవ్యయమైన మోక్షాన్ని ప్రదర్శించే ఈ పద్ధతిని నీ చిత్తములో అభ్యసించుము' అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు అని ఈ రీతిగా వ్యాసశిష్యుడయిన వైశంపాయనముని పరీక్షిత్తనయుడైన జనమేజయుడితో చెప్పాడు. ఆ పైన జనమేజయుడు వైశంపాయనుడితో ధర్మజుడికీ, భీష్ముడికీ తరువాత జరిగిన విశిష్టమైన సంభాషణలు వివరించుమని అడిగాడు. అట్లా అడిగేసరికి (తరువాతి ఆశ్వాసంలోని రెండవ పద్యంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. లీలాస్వీకృతచక్రశూల! వినతాళీరక్షణాలోల! దు
శ్శీల స్వాంతవిదూర! వేదజలదశ్రేణీమయూరా! సమి
త్కేళీఖండిత దైత్య! నిర్జరగణక్షేమక్రియానిత్య! ని
స్త్రైలోక్యత్వ నిరంజనాగ్రవిహృతీ! సంస్థాపకవ్యాహృతీ! 630

ప్రతిపదార్థం: లీలా స్వీకృత చక్రశూల!= విలాసార్థం స్వీకరించబడిన చక్రశూలాలు కలవాడా!; వినతాళీరక్షణాలోల!= ప్రణతులైన భక్తశ్రేణిని రక్షించటంలో ఆసక్తికలవాడా!; దుశ్శీలస్వాంత విదూర!= దుశ్చరిత్రులైనవారి చిత్తములకు దూరమైనవాడా!; వేదజలదశ్రేణీ మయూరా!= వేదాలనెడు మేఘపంక్తికి నెమలివైనవాడా!; సమిత్కేళీఖండితదైత్య= యుద్ధక్రీడలో ఖండించబడిన రాక్షసులు కలవాడా!; నిర్జరగణ క్షేమక్రియానిత్య!= దేవతల బృందానికి క్షేమం కలిగించే కార్యమునందు సదా ప్రవర్తించే వాడా!; నిస్త్రైలోక్యత్వ నిరంజనాగ్ర విహృతీ!= ముల్లోకాల నతిక్రమించి మాయాసంగదోషంలేని వాడవై ఆ లోకాల తుదిని

మాలిని.

జపయజన నిషేవ్యా! సంగనిర్ముక్తభావ్యా!
విపుల దురితభేదీ! విశ్వలోకప్రమోదీ !
యపరిమిత విభూతీ! యప్రమాణస్వరీతీ!
యుపనిష దవగమ్యా! యోగభావ్యైకరమ్యా!

ప్రతిపదార్థం: జపయజననిషేవ్యా!= జపయజ్ఞంచేత సేవించదగినవాడా!; సంగనిర్ముక్తభావ్యా!= సంగంలేని వారిచేత ధ్యానించదగినవాడా!; విపుల దురితభేదీ!= విస్తృతమైన పాపాలను నశింపచేసేవాడా!; విశ్వలోకప్రమోదీ!= సమస్తలోకములను సంతసింపజేసేవాడా!; అపరిమితవిభూతీ!= అనంతమైన ఐశ్వర్యం కలవాడా!; అప్రమాణస్వరీతీ= ప్రమాణంలేని స్వీయపద్ధతికలవాడా!; ఉపనిషదవగమ్యా!= ఉపనిషత్తులచేత తెలియదగిన వాడా!; యోగభావ్యైకరమ్యా!= యోగవిద్యచేత బావించదగిన ముఖ్యమైన రమణీయత్వం కలవాడా!

తాత్పర్యం: జపయజ్ఞంచేత సేవించదగిన ఓ దేవా! సంగంలేని విరాగులచేత ధ్యానించదగినవాడా! అనంతమైన పాపసంచయాన్ని హరించేవాడా! సమస్తలోకాన్నీ ఆనందింపజేసేవాడా! అంతంలేని ఐశ్వర్యం కలవాడా! ప్రమాణాల కందని నిజపద్ధతి కలవాడా! వేదాంత రూపాలైన ఉపనిషత్తులచేత తెలిసికొనదగినవాడా! చిత్తవృత్తి నిరోధరూపమైన యోగవిద్యచేత భావించదగిన ముఖ్యమైన మనోహరత్వం కలవాడా!

విశేషం: 'యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి' (గీత.10-25)అని గీతావచనం. యజ్ఞాలలో భగవంతుడు జపయజ్ఞ స్వరూపుడై ఉన్నాడనటం వలన ద్రవ్యయజ్ఞాలకంటె జపయజ్ఞం శ్రేష్ఠమని భావించాలి. 'నాన్తోస్తి మను దివ్యానాం విభూతీనాం పరంతప!' (గీత.10-40)-'అర్జునా! నా దివ్య విభూతులకు అంతం లేదు' అని శ్రీకృష్ణుడి వచనం. 'అపరిమిత విభూతీ' అన్న ప్రయోగం ఈ సంగతినే తెలియపరుస్తున్నది. ఇది మాలినీ వృత్తం. 'ననమయయ' గణాలు గల మాలిని. 'ననమయయయుతేయం మాలినీ భోగిలోకైఃr'- అని లక్షణం. 8వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

విశేషం: అలం: అంత్యప్రాసం.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన
శ్రీ మహాభారతంబున శాంతిపర్వంబునందుఁ బంచమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; శ్రీమదుభయకవిమిత్ర= శ్రీమంతులైన సంస్కృతాంధ్రకవులనే ఇరుతెగలవారికి మిత్రుడును; కొమ్మనామాత్యపుత్ర= కొమ్మనమంత్రి కుమారుడును; బుధారాధన విరాజి= పండితులను ఆరాధించటంచేత శోభిల్లేవాడును అగు; తిక్కన సోమయాజి= తిక్కన సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబునన్= శ్రీ మహాభారతంలో; శాంతిపర్వంబునందున్= శాంతిపర్వంలో; పంచమ+ఆశ్వాసము= ఐదవ ఆశ్వాసం.

తాత్పర్యం: శ్రీ మంతులైన సంస్కృతాంధ్ర కవు లనే ఇరుతెగలవారికి మిత్రుడు, పండితులను ఆరాధించటంచేత విశేషంగా భాసించినవాడు అయిన శ్రీ తిక్కన సోమయాజి రచించిన ఆంధ్రమహాభారతంలోని శాంతిపర్వంలో ఐదవ అశ్వాసం.

శాంతిపర్వంలో పంచమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - షష్ఠాశ్వాసము

క. శ్రీ సంధానప్రౌఢ ద । యాసంభృత భక్తమోద! యఖిలజగద్ర
క్షాసక్తి వినోద! శమా । భ్యాసనిరత నిర్విభేద! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదలను; సంధాన= సమకూర్చటంలో; ప్రౌఢ= సమర్థమైన; దయా= కరుణచేత; సంభృత= కలిగించబడిన; భక్తమోద= భక్తుల ఆనందం కలవాడా!; (సంపత్కరమైన దయాగుణంతో భక్తులకు ఆనందం కలిగించేవాడా!); అఖిల= సమస్తమైన; జగత్= లోకాలనూ; రక్షా= రక్షించటమనే; ఆసక్తి= ఆసక్తితో-రక్షణభారాన్ని కోరి వహించి నిర్వహించటంతో; వినోద!= ఆనందించే వాడా! (జగద్రక్షణకార్యభారాన్ని ఒక వినోదంగా వహించేవాడా!); శమ+అభ్యాస= అంతరింద్రియ నిగ్రహాన్ని అభ్యసించటంవలన; నిరతనిర్విభేద!= నిరంతరం నిర్విభేద స్థితిని పొందేవాడా! (శమాభ్యాస నిరతమైన నిర్విభేదస్థితి కలవాడా అనికానీ); హరిహరనాథా!= ఓ హరిహరనాథుడా!

తాత్పర్యం: ప్రతి ఆశ్వాసానికీ ఆద్యంతాలలో కృతిపతిని స్తుతించటం తెలుగుకవుల సంప్రదాయం. ఈ కందపద్యంలో తిక్కన హరిహరనాథుడికి మూడు విశిష్టసంబోధనలు కూర్చాడు. ఇహపరాలలో సకల సంపదలనూ భక్తులకు సంధానించటంలో సమర్థుడు హరిహరనాథుడు. అతడి దయాగుణం అంతటి ప్రౌఢం. దానితో భక్తులు ఆనందిస్తున్నారు. జగద్రక్షణ భారాన్ని కోరివహించాడు హరిహరనాథుడు. ఆ రక్షాసక్తితో వినోదిస్తున్నాడు. అతడిది శమాభ్యాస నిరతమైన నిర్విభేదస్థితి. (శమాభ్యాసంతో విభేదాలు నిర్గతమైపోయి సర్వాంతర్యామిత్వం పొందినవాడని). [(శమాభ్యాస నిరతశ్చాసౌ నిర్విభేదశ్చ - తత్సంబుద్ధౌ).]

విశేషం: 'అఖిలజగద్రక్షాసక్త - రక్షాసక్తి - వినోద' అనే పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. రక్షణయందు ఆసక్తమైన (సంలగ్నమైన) వినోదం కలవాడా - అనీ, రక్షణయందున్న ఆసక్తితో (అభిలాషతో) వినోదించేవాడా - అనీ ఈ పాఠాంతరాలకు అర్థం. మూడు పాఠాలకూ భావంలో పెద్దగా తేడా లేదు. సంబోధన లన్నింటా అంత్యానుప్రాస పాటించాడు తిక్కన. 'ద' అనేది అంత్యానుప్రాసాక్షరం. ఇది హ్రస్వం కాబట్టి దీని పూర్వాక్షరాన్ని మూడుచోట్లా దీర్ఘమే వేసి నియమం పాటించాడు.

భీష్ముని ధర్మజుండు ప్రశంసించి యక్షర క్షరంబుల నడుగుట. (సం. 12-291-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు యోగసాంఖ్యవిదు లక్షరంబునొంది యానందస్వరూపు లగుదురని చెప్పిన విని ధర్మతనయుండు దేవవ్రతునితో 'నీవు పరమజ్ఞాన నిధివని వేదసంవేదు లగు విప్రులు సెప్పనప్పలుకులు నిన్ను సాంఖ్యయోగ ప్రవీణులయిన యతులును మునిపతులును వర్ణింప నవ్వచనంబులును నాకర్ణించుచుం బ్రమోదంబునం బొందుచుండుదుము. దక్షిణాయనశేషదినంబు లింక నల్పంబు, లర్కుండు మరలంబడినఁ బరమగతిం బ్రాపించెదవు, మఱి మేమెవ్వరిచేత వినువారము? కురువంశంబునకుం బ్రజ్ఞాఘృత ప్రదీపితంబగు దీపంబుగావె? భవత్తేజంబు నాశ్రయించెద' మని తనవారలం

గలసికొని పలికి, 'నీవు నిర్దేశించిన యక్షరం బనునది యెట్టిది? క్షరం బెయ్యది? యెఱింగింపవే?' యనుటయు నతండు 'వసిష్ఠజనక సంవాదంబనంబరఁగు విశిష్టేతిహాసంబు గలదు. దాన నీయడిగిన యవియును మఱియునెఱుంగ వలయునట్టివి యనేకార్థంబులును దెలివిపడు; వినుమని సుప్రసాదభరితుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా! వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= వివరించాడు; అట్లు= ఇంతకుముందు (పంచమాశ్వాసం చివర) చెప్పినట్లుగా; యోగసాంఖ్యవిదులు= ఒక తెరువువారే అయిన యోగవిద్యావేత్తలూ, సాంఖ్యవిద్యావేత్తలూ; అక్షరంబును ఒంది= క్షరం (నాశము) లేని స్థితిని పొంది; ఆనందస్వరూపులు= ఆనందస్వరూపులు; అగుదురు అని= అవుతారని; చెప్పినన్= భీష్ముడు చెప్పేసరికి; విని; ధర్మతనయుండు; దేవవ్రతునితో= భీష్ముడితో (ఇట్లా అంటున్నాడు); నీవు; పరమజ్ఞాననిధివి= పరమజ్ఞానానికి నిధివి; అని; వేదసంవేదులు అగు విప్రులు= వేద వేత్తలయిన విప్రులు (విజ్ఞులు); చెప్పన్= చెబుతూంటే; ఆ+పలుకులున్= ఆ మాటలనూ; సాంఖ్యయోగ ప్రవీణులయిన= సాంఖ్యవిద్యాప్రవీణులూ, యోగవిద్యా ప్రవీణులూ అయిన; యతులును= యతీశ్వరులూ; మునిపతులును= మునీశ్వరులూ; నిన్ను; వర్ణింపన్= వర్ణిస్తూంటే; ఆ+వచనంబులున్= ఆ పలుకులనూ; ఆకర్ణించుచున్= శ్రద్ధగా వింటూ; ప్రమోదంబునన్ పొందుచుందుము= మేమంతా ఆనందం పొందుతూ వుంటాం; దక్షిణ+అయన శేషదినంబులు= ఈ దక్షిణాయనంలో మిగిలిన రోజులు; ఇంకన్= ఇక; అల్పంబులు; చాలా తక్కువ; అర్కుండు= సూర్యుడు; మరలంబడినన్= ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తే; పరమగతిన్ ప్రాపించెదవు= నీవు పరమపదిస్తావు - అక్షయపులోకాలకు చేరుకుంటావు; మఱి మేము= మరింక మేము; ఎవ్వరిచేతన్= ఎవరినుంచి; వినువారము?= వినగలం?; కురువంశంబునకున్= ఈ కురువంశానికి; ప్రజ్ఞా= తెలివి అనే; ఘృత= నేతితో; ప్రదీపితంబు అగు= వెలిగించబడిన; దీపంబు+కావె?= దీపానికి నీవే కదా?; భవత్= నీ; తేజంబున్= తేజస్సును; ఆశ్రయించెదము= ఆశ్రయిస్తాం; అని= అంటూ; తనవారలన్= తన సోదరాదులను; కలిపికొని= కలుపుకొని; పలికి= మాట్లాడి; నీవు; నిర్దేశించిన= ఇంతకుముందు పేర్కొన్న; అక్షరంబు అనునది= 'అక్షరము' అనేది; ఎట్టిది= ఎటువంటిది?; క్షరంబు= క్షరము (పుట్టి-నాశనమయ్యేది); ఏ+అది= ఏది?; ఎఱింగింపవే?= దయచేసి తెలియచెప్పవా?; అనుటయున్= అని ధర్మరాజు అడిగేసరికి; అతండు= ఆ భీష్ముడు; వసిష్ఠజనకసంవాదంబు అనన్= 'వసిష్ఠజనకసంవాదము' అని; పరఁగు= ప్రసిద్ధిపొందిన; విశిష్ట+ఇతిహాసంబు= ఒక విశిష్టమైన కథ; కలదు= ఉన్నది; దానన్= దానితో; నీ+అడిగిన అవియును= నువ్వు అడిగినవీ; మఱియున్= ఇంకా; ఎఱుంగన్ వలయునట్టివి= తెలుసుకోవలసినవి; అనేకార్థంబులును= అనేక విశేషాలూ; తెలివిపడున్= స్పష్టపడతాయి; వినుము అని; సుప్రసాదభరితుండై= ప్రసాదగుణభరితుడై - సుప్రసన్నుడై - భీష్ముడు ఇట్లా అన్నాడని (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు; 'ఆ విధంగా యోగసాంఖ్య పండితులు అక్షరమైన ఆనందస్వరూపులౌతారని చెప్పగా విని, ధర్మరాజు దేవవ్రతుడితో ఇట్లా అన్నాడు. 'నీవు పరమజ్ఞానివని వేదవిదులు, సాంఖ్యయోగ ప్రవీణులయిన యతీంద్రులు చెప్పగా విని సంతోషిస్తూ ఉంటాము. దక్షిణాయనంలో ఇంకా మిగిలిన రోజులు తక్కువ. సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించగానే నీవు పరమపదిస్తావు. ఆ తరువాత మేము ఎవరివలన వినగలుగుతాము? కురువంశంలో ప్రజ్ఞ అనే నేయితో వెలుగుతున్న దీపంవలె ఉన్నావు. నీ తేజస్సును ఆశ్రయిస్తున్నాము' అని తనవారితో కలిసి పలికి 'నీవు చెప్పిన 'అక్షర'మనేది ఎటువంటిది?' 'క్షర' మేది? తెలుపుము' అన్నాడు. భీష్ముడు 'వసిష్ఠ జనకుల సంవాద' మనే ఉత్తమ ఇతిహాసం ఉన్నది. దానివలన నీ వడిగిన విశేషాలన్నీ తెలుస్తాయి వినుము' అని సుముఖుడై.

విశేషం: 'ప్రజ్ఞాఘృత ప్రదీపితంబగు దీపంబుగావె' అనేచోట 'ప్రజ్ఞాకృత/ ప్రజ్ఞామృత ప్రేరితంబగు దీపంబవుగావె' అని పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. ప్రాజ్ఞకృతము అని ఉన్నప్పుడు ప్రదీపితము - ప్రేరితము అనే (క్త) నిష్ఠాంతాలు వ్యర్థమవుతాయి. ప్రజ్ఞను అమృతంగా పోల్చినందువలన అది ఇంధనంగా ప్రదీపితత్వానికి సాధకం కానేరదు. అంచేత 'ప్రజ్ఞాఘృత ప్రదీపితంబగు'

అనేదే సాధుపాఠం. 'కురువంశప్రదీపస్యం జ్ఞానద్రవ్యేణ దీప్యసే' (శాంతి 291-5) అని వ్యాసుడు దీపన సాధకంగా జ్ఞానద్రవ్యమన్నాడు. ఆ ద్రవ్యాన్ని తిక్కన ఘృతమని స్పష్టపరిచాడు. తరువాతి శ్లోకంలో 'న తృప్యామీహ రాజేంద్ర శృణ్వన్నమృత మీదృశమ్' (291-6) అన్నాడు. ఉపదేశాన్ని అమృతంగా పోల్చి దాని ఆస్వాదనతో ఎంతకీ తనివితీరటం లేదని ధర్మరాజు అభిప్రాయం. అమృతంతో పోల్చినప్పుడు ఇలా ఆస్వాదానుభూతి అన్వయిస్తుందే కానీ ప్రదీపితత్వం కాదు.

'దీపంబవు గావె - దీపంబుగావె' అనే రెండు పాఠాలూ తెలుగువ్యాకరణానికి అనుకూలమే. దీపంబు అనేది ఈ వాక్యంలో యుష్మద్విశేషణం. కాబట్టి వుగాగమం ప్రాయికంగా వస్తుంది. వస్తే 'దీపంబవుగావె' అనీ, రాకపోతే 'దీపంబుగావె' అనీ అవుతుంది. వుగాగమ రహితరూపం 'ప్రాయోగ్రహణంబుచే రక్షితంబయ్యె'.

సీ. అనఘ! సుఖాసీనుఁడైన వసిష్ఠసం । యమిఁగాంచి భక్తిఁ బాదముల కెఱఁగి
జనకభూనాథుండు వినయంబుతోడ ను । పాసించి 'మునివర! యక్షరం బ
నాది శివంబన నపునరావృత్తి సి । ద్ధిదమగుచుండు నెయ్యది యెఱుంగఁ
జెప్పవే!' యనుడు నాశ్రిత వత్సలుండగు । నమ్మహాత్ముఁడు దెలియంగఁ జెప్పె

తే. నద్దయాళుని చెప్పిన యత్తెఱంగు । ప్రస్ఫుటంబుగఁ జెప్పెదఁ బాండవాగ్ర
జన్మ! నీ కని పలికి యజ్జాహ్నవీత । నూజుఁ డిట్లను నాననాంభోజ మలర. 3

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఓ ధర్మరాజా!; సుఖాసీనుఁడైన= సుఖంగా కూర్చున్న; వసిష్ఠసంయమిన్= వసిష్ఠమహర్షిని; కాంచి= చూచి; భక్తిన్= భక్తితో; పాదములకున్= పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; జనకభూనాథుండు= జనకమహారాజు; వినయంబుతోడన్= వినయంతో; ఉపాసించి= అర్చించి; మునివర!= ఓ మునీశ్వరా!; అక్షరంబు= నాశనం లేనిదీ; (క్షరము= పుట్టి నశించేది; అక్షరము= పుట్టుకలేనిది - నశించనిది; అనాది= ఆది లేనిదీ; శివంబు అనన్= శుభప్రదం అనబడేదీ; అపునరావృత్తి సిద్ధిదము= జన్మరాహిత్య సిద్ధిని కలిగించేదీ; అగుచుండున్ ఎయ్యది?= అవుతూ ఉంటుందో - అది ఏది?; ఎఱుంగన్ చెప్పవే?= దయచేసి తెలియజెప్పవా?; అనుడున్= జనకభూనాథుడు ఇట్లా అనేసరికి; ఆశ్రితవత్సలుండగు= ఆశ్రితులమీద వాత్సల్యం కలవాడైన; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు వసిష్ఠుడు; తెలియంగన్ చెప్పెన్= తెలిసేటట్లు చెప్పాడు; పాండవ+అగ్రజన్మ!= ఓ పాండవులలో పెద్దవాడా!; ఆ+దయాళుని= ఆ దయామయుడు వసిష్ఠుడు; చెప్పిన ఆ+తెఱంగున్= వివరించిన ఆ విధానమంతా; ప్రస్ఫుటంబుగన్= స్పష్టపడేటట్లు; నీకున్ చెప్పెదన్= నీకు నేను చెబుతాను; అని పలికి= అని చెప్పి; ఆ+జాహ్నవీతనూజుఁడు= ఆ గంగాపుత్రుడు భీష్ముడు; ఆనన+అంభోజము+అలరన్= తన ముఖపద్మం వికసించగా; ఇట్లు= ఈ చెప్పబోయే విధంగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: ఒకప్పుడు జనకమహారాజు వసిష్ఠుడిని అడిగాడు - అక్షరతత్త్వం తెలియజెప్పుమని. అప్పుడు ఆశ్రిత వత్సలుడూ దయాగుణ విశిష్టుడూ అయిన ఆ మహాత్ముడు పూర్వం వసిష్ఠుడు జనకుడికి వివరించి చెప్పాడు. అది అంతా నీకు నేను స్పష్టంగా చెప్పుతాను' - అని సంతోషంగా భీష్ముడు ధర్మరాజుకు వివరించటం మొదలు పెట్టాడు.

విశేషం: ఇక్కడ జనకభూనాథుడు అంటే సీతాదేవి కన్నతండ్రి కాదు. ఆ వంశంలోవారికి అందరికీ జనకుడు అనేది సాధారణ నామధేయం. అదికాక అసలు పేరు వేరే వుంటుంది. 'వసిష్ఠస్య చ సంవాదం కరాళజనకస్య చ (291-7), సప్రచ్ఛర్షివరం రాజా కరాళజనకః పురా (291-10) అనీ వ్యాసుడు రెండుసార్లు కరాళజనకుడు అన్నాడు. అంటే ఈ జనకమహారాజు అసలు పేరు కరాళుడు అన్నమాట. 'అద్దయాళుని చెప్పిన అత్తెఱంగు' - అనేది తెలుగు వాక్యనిర్మాణంలో ఒక విశిష్టకారకం. దయాళునియొక్క చెప్పిన ఆ విధానం - అంటే దయాళుడు చెప్పిన ఆ విధానం అని ఫలితార్థం. 'నీయడిగినయవి, నా యొనర్పంబూనిన మహా ప్రబంధంబునకు- ఇత్యాదులన్నీ ఇటువంటివే.

వసిష్ఠ జనకరాజ సంవాద ప్రకారము (సం. 12-291-7)

వ. జనకజనేశ్వరు బోధించుటకై వసిష్ఠ మునీశ్వరుం డి ట్లనియె. 4

ప్రతిపదార్థం: జనకజనేశ్వరున్= కరాళజనకమహారాజును; బోధించుటకై= జ్ఞానవంతుడిని చెయ్యటానికి; వసిష్ఠమునీశ్వరుండు= ఆ వసిష్ఠమహర్షి; ఇట్లు అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కరాళజనక మహారాజుకు జ్ఞానం బోధించేందుకు వసిష్ఠమహర్షి ఇట్లా చెప్పాడు.

క. 'నయనముఖ పాణిపాదము । లయమహితా! యెందుఁ గలిగి యాద్యంతపరి
క్షయవృద్ధి రహితమై ని । ర్ద్వయ మగు తత్త్వంబు నక్షరంబండ్రు బుధుల్. 5

ప్రతిపదార్థం: అయమహితా!= ఓ శుభాన్వితా! ధర్మరాజా!; నయన= నేత్రాలు; ముఖ= ముఖం; పాణిపాదములు= చేతులూ, కాళ్ళూ; ఎందున్ కలిగి= సర్వాత్మనా కలిగి ఉండీ; ఆది+అంత+పరిక్షయ+వృద్ధి+రహితమై= ఆది, అంతం, వినాశం, వృద్ధి - అనేవి లేనివై; నిన్+ద్వయము+అగు+తత్త్వమున్= అద్వితీయమైన తత్త్వాన్ని; బుధుల్= పండితులు; అక్షరంబు+అండ్రు= అక్షరము అంటారు.

తాత్పర్యం: 'ఓ మంగళగుణాన్వితా! ధర్మరాజా! కరచరణాది అవయవాలు కలిగి ఉండీ, ఆది, అంతం, క్షయం, వృద్ధి - ఇవి లేనివైన ఏకైక తత్త్వాన్ని 'అక్షరము' అంటారు పండితులు.

విశేషం: నిర్విభేదం, నిర్ద్వయం, అద్వితీయం - ఇవన్నీ సమానార్థకాలు. ఏకైకం అని తాత్పర్యం. ద్వయములేనిది నిర్ద్వయం. ద్వితీయం లేనిది అద్వితీయం. విభేదం లేనిది నిర్విభేదం. సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్, సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి (291-16) అనేది మూలశ్లోకం. ఇందులో సర్వతః అనే పదానికి పర్యాయంగా 'ఎందున్ కలిగి' అన్నాడు తిక్కన. సర్వత్రగామి, సర్వదర్శి, సర్వగతి, సర్వశిరస్సు, సర్వానందం, సర్వశ్రోత అయిన ఆ పరబ్రహ్మమే అంతటా ఆవరించి ఉంటుంది - అదే అక్షరమని తాత్పర్యం వివరించారు పెద్దలు.

క. క్షరమండ్రు దానివలనను । క్షరియించిన తత్త్వములను జనవత్సల! య
య్యిరువది నాల్గింటిని దర । తరమ విభాగించి చెప్పెదం దెలియంగన్. 6

ప్రతిపదార్థం: జనవత్సల!= జనులపట్ల వాత్సల్యం కలవాడా! (జనుల వాత్సల్యం చూరగొన్నవాడా అని కానీ); ఓ ధర్మరాజా! దానివలనను= 'అక్షరము' అనబడే ఆ తత్త్వంనుంచి; క్షరియించిన= ఆవిర్భవించిన; తత్త్వములను= తత్త్వాలను; క్షరము అండ్రు= 'క్షరము' అంటారు; ఆ+ఇరువది నాల్గింటిని= క్షరతత్త్వాలు ఇరవై నాల్గింటినీ; తరతరమ= క్రమంగా; విభాగించి= విభజించి; తెలియంగన్= నీకు తెలిసేటట్లు; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: జనవత్సలా! ఓ ధర్మరాజా! అక్షరతత్త్వంనుంచి ఇరవై నాలుగు క్షరతత్త్వాలు ఆవిర్భవించాయి. నీకు స్పష్టంగా తెలియటంకొరకు వాటిని విడమరచి చెప్పుతాను ఆలకించుము.

తే. అక్షరము విక్రియాశబలాత్మకత్వ । మొందు నవ్వికృతికును బేళ్కొలసెఁ బ్రకృతి
యనఁ బ్రధానంబునాఁగ నవ్యక్త మనఁగ । దానఁబుట్టు మహన్నామతత్త్వ మనఘ! 7

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; అక్షరంబు= అక్షరము అని చెప్పబడిన తత్త్వం; విక్రియా= వికృతితో; శబలాత్మకత్వము+ఒందున్= వైవిధ్యాన్ని పొందుతుంది; ఆ+వికృతికికూడా; ప్రకృతి+అనన్= ప్రకృతి అనీ;

ప్రధానంబునఁగన్= ప్రధానము అనీ; అవ్యక్తము+అనఁగన్= అవ్యక్తము అనీ; పేళ్లు+ఒలసెన్= పేరులు ఏర్పడ్డాయి; దానన్= ఆ విక్రియనుండి; మహత్+నామతత్త్వము= మహత్(మహాన్) అని పిలవబడే తత్త్వం; పుట్టున్= పుడుతుంది. (12-291-17).

తాత్పర్యం: అక్షరతత్త్వం విక్రియను పొందుతుంది. దానికి ప్రకృతి, ప్రధానం, అవ్యక్తం అని పేరులు. ఆ విక్రియనుండి 'మహత్' అనబడే తత్త్వం ఆవిర్భవిస్తుంది.

తే. వినుము మహంకార మా తత్త్వమున జనించు। దాన భూతపంచకమును దద్గుణంబు
లైన శబ్దాది విషయంబులైదు నింద్రి। యములుఁ బదియును మనసును నావహిల్లు. 8

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; ఆ తత్త్వమునన్= ఆ మహన్నామతత్త్వంనుంచి; అహంకారము= అహంకారమనేది; జనించున్= ఉద్భవిస్తుంది; దానన్= దానినుంచి; భూతపంచకమును= పంచభూతాలూ; తద్గుణంబులైన శబ్దాదివిషయంబులు ఐదున్= పంచభూతాలకూ గుణాలైన శబ్దస్పర్శ రూపరసగంధాదులు అయిదూ; ఇంద్రియముల్ పదియును= జ్ఞానేంద్రియాలు అయిదూ - కర్మేంద్రియాలు అయిదూ వెరసి పది ఇంద్రియాలూ; మనసును= మనస్సునందు; ఆవహిల్లున్= ఏర్పడతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము; ప్రకృతి లేదా ప్రధానం లేదా అవ్యక్తం అనబడే తత్త్వం ఒకటి. దానినుంచి ఆవిర్భవించే మహత్తు - రెండు. అహంకారం - మూడు. పంచభూతాలు, పంచగుణాలు- అయిదు. జ్ఞానేంద్రియాలు-ఐదు కర్మేంద్రియాలు. మనస్సు - ఒకటి. కలిపి మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు ఉన్నాయి. పృథివ్యప్తేజోవాయ్వాకాశాలు ('నేల, నీరు, వెలుగు, గాలి, ఆకాశం) పంచభూతాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు - అయిదు గుణాలు. శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణాలు (చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు) అయిదూజ్ఞానేంద్రియాలు. వాక్పాణి పాదపాయు మేఢ్రాలు అయిదూ కర్మేంద్రియాలు మనస్సునందు ఏర్పడతాయి.

(12-291-28).

క. క్షరమయ్యిరువది నాలుగు। నరనాథా! యక్షరంబునకు నెయ్యెడలన్
క్షరభావము లే దయ్య। క్ష రము విలాసములు సూవె క్షరతత్త్వమ్ములో. 9

ప్రతిపదార్థం: నరనాథా!= ఓ రాజా!; క్షరము= క్షరమే; ఆ+ఇరువది నాలుగున్= ఆ ఇరవైనాలుగు తత్త్వాలును; అక్షరంబునకున్= అక్షరము అనబడే తత్త్వానికి; ఏ+ఎడలన్= ఎప్పుడూ; క్షరభావము= క్షరత్వం; లేదు= లేనేలేదు; క్షరతత్త్వమ్ములో= క్షరతత్త్వాలు అన్నీ; ఆ+అక్షరము విలాసములు చూవె= ఆ అక్షరతత్త్వం తాలూకు విలాసాలే సుమా!

తాత్పర్యం: క్షరమే ఇరవైనాలుగు తత్త్వాలుగా అవుతుంది. అక్షరతత్త్వానికి ఎక్కడా ఎప్పుడూ క్షరభావం ఉండదు. అయితే క్షరతత్త్వాలు అన్నీ అక్షరతత్వం తాలూకు విలాసాలే.

వ. ఈ చతుర్వింశతి తత్త్వంబులును విజ్ఞానగోచరంబులు, పంచవింశతితమంబై యక్షరంబనం బరఁగు
నిప్పరమతత్త్వంబు వినుము మవిజ్ఞేయం బవ్యయం బకలంకం బనామయం బమృతంబు. 10

ప్రతిపదార్థం: ఈ చతుర్వింశతి తత్త్వంబులును= ఈ చెప్పిన ఇరవై నాలుగు తత్త్వాలూ; విజ్ఞానగోచరంబులు= విజ్ఞానానికిఅందుతాయి; పంచవింశతితమంబై= ఇరవై అయిదవదై; అక్షరంబు+అనన్= అక్షరము అని; పరఁగు= ఒప్పుతున్న; ఈ+పరమతత్త్వంబు= ఈ పరమతత్త్వం; వినుము; అవిజ్ఞేయంబు= అది విజ్ఞానగోచరం కానిది; అవ్యయంబు= అది వ్యయం కానిది; అకలంకంబు= కళంకంలేనిది; అనామయంబు= ఆమయంలేనిది (నాశమూ, రోగమూ లేనిది); అమృతంబు= మృతిలేనిది; మృతంకానిది.

తాత్పర్యం: శ్రద్ధగా ఆలకించుము. ఈ ఇరవై నాలుగు తత్త్వాలూ విజ్ఞానానికి అందుతాయి. ఇరవై అయిదవ అక్షరమైన పరమతత్త్వం విజ్ఞానానికి గోచరం కానిది. నాశం లేనిది. మృతి లేనిది.

విశేషం: 'అమృతంబు' అనటానికి బదులు 'అనాద్యంతంబు' అనే పాఠాంతరం కనిపిస్తున్నది కొన్ని ప్రతులలో. ఆదీ అంతమూ లేనిది అని దాని భావం.

క. జననాథ! యక్షరం బెం । దును గ్రీడఁ జరించుఁ ద్రిగుణ దోహలపరమై
తనకుఁ బ్రబోధము లేకు । న్నను నానాయోనిగత జననముల వెంటన్. 11

ప్రతిపదార్థం: జననాథ= ధర్మరాజా!; అక్షరంబు= అక్షరతత్త్వమనేది; తనకున్= తనకు; ప్రబోధము= జ్ఞానము - మెలకువ అనేది; లేకున్నను= లేకపోయినట్టయితే; త్రిగుణదోహలపరమై= సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలతో బలపడినదై; (బలపరచునదై) నానాయోనిగత జననములవెంటన్= పలురకాల జీవజాతులలో జననాలను వరుసగా పొందుతూ; ఎందును= సర్వత్ర; క్రీడన్= కేళీవిలాసంగా; చరించున్= సంచరిస్తుంది.

తాత్పర్యం: అక్షరతత్త్వానికి ప్రబోధం లేకపోతే సత్త్వరజస్తమోగుణాల సంయోజనకారణంగా నానాజాతులలో జన్మపరంపరలను పొందుతూ ఉంటుంది. ఇది అక్షరతత్త్వానికి ఒక క్రీడావిలాసం (12-291-42).

క. వినుఁ సత్త్వరజస్తమముల । యనుసరణమువలన వివిధమగు యోనిగణం
బున వెలసిన యా తత్త్వము । దనుఁ జూడఁగలేక యవియ తానని యుండున్. 12

ప్రతిపదార్థం: వినుఁ= ధర్మరాజా! శ్రద్ధగా ఆలకించుము; సత్త్వరజస్తమముల= ఆ త్రిగుణాల; అనుసరణమువలనన్= వెంట తగులుకోవటం వలన; వివిధము+అగు= పలు రకాలైన; యోనిగణంబునన్= జాతులలోనికి; వెలసిన= అవతరించిన; ఆ తత్త్వము= ఆ అక్షరతత్త్వం; తనున్ చూడఁగ లేక= తనను తాను అవలోకించుకోలేక (గ్రహించుకోలేక); అవియ= ఆ జాతులే; తాను= నేను; అని= అనుకొని; ఉండున్= నివసిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటం వలన జన్మపరంపరలలోనికి జారిపోయిన ఆ అక్షరతత్త్వం తనను తాను తెలిసికొనలేక, అవే తాను అనుకొని వాటిలో నివాసం సాగిస్తూ ఉంటుంది.

ఉ. సత్త్వరజస్తమోగుణవశస్థితి నక్షర మర్హధర్మ సం
గిత్వము మధ్యకర్మతయుఁ గిల్బిషకృత్యమునొంది యొంది ది
వ్యత్వనరత్వగోమృగఖగాదిక తిర్యగనేక హీనజం
తుత్వములన్ సుఖంబులును దుఃఖములున్ నరకంబులుం గనున్. 13

ప్రతిపదార్థం: అక్షరము= అక్షర తత్త్వమనేది; సత్త్వరజస్తమో గుణవశస్థితిన్= సత్త్వగుణము - రజోగుణము - తమోగుణము అనే ఈ మూడింటికీ వశవర్తి అగుట వలన; వరుసగా - అర్హధర్మసంగిత్వమున్= అర్హమైన ధర్మాలతో కూడి ఉండటం అనే స్థితినీ (ఇది సత్త్వగుణ లక్షణం); మధ్యకర్మతయున్= పుణ్యపాపాలు రెండింటినీ ఆచరించటమనే స్థితినీ (ఇది రజోగుణ లక్షణం); కిల్బిషకృత్యమున్= కేవలం పాపకార్యాలే చెయ్యటం అనే స్థితినీ (ఇది తమోగుణ లక్షణం); ఒంది+ఒంది= పూర్తిగా పొంది; దివ్యత్వ= దేవతాత్వంలో; నరత్వ= మానవత్వంలో; గోమృగఖగాదిక తిర్యక్+అనేక హీన జంతుత్వములన్= గోవు, మృగము, పక్షి మొదలైన తిర్యగ్జాతికి చెందిన అనేక నీచ జంతుత్వాలలో; సుఖంబులును= సుఖాలనూ; దుఃఖములున్= దుఃఖాలనూ; నరకంబులున్= నరకాలనూ; కనున్= అనుభవిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: సత్త్వగుణానికి వశవర్తి అయిన అక్షరతత్త్వం అర్హధర్మాలను పొందీ ఆచరించీ దివ్యత్వంతో సుఖాలను అనుభవిస్తుంది. రజోగుణానికి వశవర్తి అయి పుణ్యపాపాలను చెరిసగంగా ఆచరించి నరత్వం పొంది సుఖదుఃఖాలను

చెరిసగంగా అనుభవిస్తుంది. తమోగుణానికి వశవర్తి అయి కేవలం పాపకృత్యాలనే ఆచరించి పశుపక్ష్యాది జంతుత్వాన్ని పొంది నరకం అనుభవిస్తుంది.

విశేషం: ఈ పద్యమంతటా క్రమాలంకారమూ ఉంది. అలంకారం: క్రియాలంకారం,

క. జనవర! శుక్లము లోహిత । మును గృష్ణమునైన వర్ణముల నక్షర మొం
దును సత్త్వరజస్తమముల । యనుసారంబున నవర్ణమయ్యు వికృతమై. 14

ప్రతిపదార్థం: జనవర!= ఓ యుధిష్ఠిరా!; అక్షరము= అక్షరతత్త్వం; అవర్ణమయ్యున్= ఏ రంగూలేనిదే అయినప్పటికీ; సత్త్వరజస్తమముల+అనుసారంబునన్= సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటం వలన; వికృతమై= మార్పునకు లోనై; శుక్లము= తెలుపూ; లోహితము= ఎరుపూ; కృష్ణమును+ఐన= నలుపూ అయిన; వర్ణములన్= రంగులను; ఒందును= పొందుతుంది.

తాత్పర్యం: అక్షరానికి స్వతస్సిద్ధంగా ఏ రంగూ లేదు. కానీ, అది ఈ త్రిగుణాలను అనుసరించటం వలన మార్పులకు లోనవుతుంది. సత్త్వగుణానుసారంగా తెలుపురంగునూ, రజోగుణానుసారంగా ఎరుపురంగునూ, తమోగుణానుసారంగా నలుపురంగునూ పొందుతుంది.

క. అగుణంబయ్యును నిమ్మెయిఁ । బ్రగుణతఁ బ్రాపించు నక్షర మహంకార
స్థగుణంబూఁదిన, విడిచినఁ । దెగు నన్నియు నిర్వికారదీప్తంబునగున్.' 15

ప్రతిపదార్థం: అక్షరము= అక్షరతత్త్వం; అగుణంబు+అయ్యున్= తనంతతాను నిర్గుణమే అయినా; అహంకారస్థగుణంబు= అహంకారగతమైన గుణాన్ని (అహంకారలక్షణాన్ని); ఊఁదినన్= పొందినట్లయితే; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; ప్రగుణతన్= ప్రకృష్టగుణవత్తను; ప్రాపించున్= పొందుతుంది; విడిచినన్= అహంకారస్థగుణాన్ని విడిచినట్టయితే; అన్నియున్= ఈ గుణాలన్నీ; తెగున్= తొలగిపోతాయి; నిర్వికార= నిర్వికారస్థితితో; దీప్తంబున్= ప్రకాశించేదికూడా; అగున్= అవుతుంది.

తాత్పర్యం: నిర్గుణమైన అక్షరతత్త్వం అహంకారగుణ సంయోగంవలన ఈ రకంగా ఇన్ని వికారాలను పొందుతున్నది. అహంకారగుణ సంయోగాన్ని విడిచిపెట్టేస్తే ఈ వికారాలు అన్నీ తొలగిపోతాయి. నిర్వికారస్థితితో మళ్ళీ ప్రదీప్తంకూడా అవుతుంది.'

వ. అని చెప్పి వెండియు. 16

ప్రతిపదార్థం: అని చెప్పి= వసిష్ఠుడు ఇట్లా వివరించి; వెండియున్= మరల.

తాత్పర్యం: అని చెప్పి, వసిష్ఠుడు మళ్ళీ (ఇట్లా వివరిస్తున్నాడు.)

చ. 'క్రతువులఁ దీర్థయాత్రలను రాత్ర్యశనంబుల భూమిశయ్యలన్
వ్రతపరినిష్ఠలన్ జడలు వల్కలముల్ వివిధంపు దండముల్
సతతముఁ దాల్చుటన్ వపువు సంకటపాటునఁ బెట్టు నాద్యమ
చ్యుత మమలంబు దాను దనుఁ జూడక యక్షరమప్రబుద్ధమై. 17

ప్రతిపదార్థం: ఆద్యము= తొట్టతొలిదీ; అచ్యుతము= చ్యుతి లేనిదీ; అమలంబు= మలినరహితమూ అయిన; అక్షరము= అక్షరతత్త్వం; తాను తనున్ చూడక= తనను తాను తెలుసుకోలేక; అప్రబుద్ధమై= జ్ఞానప్రబోధం లేనిదై; వపువున్= శరీరాన్ని

(ఉపాధిని); సంకటపాటునన్ పెట్టున్= కష్టపెడుతూ వుంటుంది; ఏ రకంగా అంటే - క్రతువులన్= యజ్ఞయాగాది క్రియలతోనూ; తీర్థయాత్రలను= పుణ్యక్షేత్రాలకు ప్రయాణం సాగించటాలతోనూ; రాత్రి+అశనంబులన్= రాత్రిపూట మాత్రమే భోజనం చెయ్యటాలతోనూ (ఏకభుక్తాలతోనూ); భూమిశయ్యలన్= కటికనేలమీద పవ్వళించటాలతోనూ; వ్రతపరినిష్ఠలన్= రకరకాల వ్రతాల నియమనిష్ఠలతోనూ; జడలు= జడలూ; వల్కలముల్= నారచీరలూ; వివిధంపు దండముల్= రకరకాల దండాలూ (సన్న్యాసాశ్రమానికి సూచకంగా ఉండే దండములు - కర్రలు, ఏకదండి, ద్విదండి, త్రిదండి ఇత్యాదిగా ఆశ్రమభేదాలు ఉన్నాయి); సత్వరమున్= ఎల్లవేళలా; తాల్చుటన్= ధరించటంతోనూ; వపువును సంకటపాటున పెడుతుంది.

తాత్పర్యం: తనను తాను తెలిసికొనలేక ఈ అక్షరతత్త్వం. 'క్రతువులు చేయటం, తీర్థయాత్రలకు తిరగటం, ఏకభుక్తాలు ఉండటం, నేలమీద పడుకొనటం - ఇంకా రకరకాల కఠోరవ్రత నియమాలు పాటించటం, జటావల్కల దండాలు ధరించటం - ఇత్యాది కార్యక్రమాలతో శరీరాన్ని సంకటపెట్టుతూ ఉంటుంది - ఇది అచ్యుతమే. అమలమే. కానీ, ఇప్పుడు అప్రబుద్ధం.

క. అమృతము నభవము నజరము । నమలమునగు తన్ను మృతము నాహితభవమున్
సమధికజరమును మలసహి । తముగా నక్షరము మమతఁ దలఁచు నరేంద్రా! 18

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధర్మరాజా!; అమృతము= చావులేనిది; అభవము= పుట్టకలేనిది; అజరము= ముసలితనము లేనిది; అమలమున్= మలినము లేనిది; అగు= అయినటువంటి; అక్షరము= అక్షరతత్త్వం; తన్నున్= తననుతాను; మృతము= చావు కలదిగానూ; ఆహితభవమున్= పుట్టక కలదిగానూ; సమధికజరమును= బాగా ముసలితనము (జరా) పొందేదిగానూ; మలసహితముగాన్= మలినసహితముగానూ; మమతన్= మమకారంతో; తలఁచున్= భావిస్తుంది.

తాత్పర్యం: అక్షరతత్త్వానికి చావూ పుట్టుకా ముసలితనం - ఇట్లాంటివి ఏమీలేవు. అది అమలం. కాని, ఉపాధిగతమైన మమకారంతో ఇవన్నీ తనకు ఉన్నాయని భావిస్తూ ఉంటుంది.

ఆ. తనకుఁదాన బంధమొనరించుకొనియెడు । పొత్తినూలికాయ పురువు భంగి
నగుణమయ్యు సగుణతావాప్తిఁ బొందు న । క్షరము ప్రకృతి గుణము సంక్రమించి. 19

ప్రతిపదార్థం: తనకున్ తాన= తనకుతానే; బంధము= బంధాన్ని; ఒనరించుకొనియెడు= కల్పించుకునేటువంటి; పొత్తినూలికాయ పురువుభంగిన్= సాలెపురుగువలె (సాలీడువలె); అక్షరము= అక్షరతత్త్వమనేది; అగుణమయ్యున్= స్వతస్సిద్ధంగా నిర్గుణమే అయినా; ప్రకృతి గుణము= ప్రధానము - ప్రకృతి - అవ్యక్తము అనబడే విక్రియ తాలూకు గుణం; సంక్రమించి= సంక్రమించటంచేత (అది కారణంగా); సగుణత+అవాప్తిన్= సగుణత్వప్రాప్తిని; పొందున్= పొందుతుంది.

తాత్పర్యం: స్వతస్సిద్ధంగా నిర్గుణమైన అక్షరతత్త్వం తన విక్రియ అయిన ప్రకృతిగుణాలు తనకే సంక్రమించటం చేత తానుకూడా సగుణత్వాన్ని పొందుతున్నది. ఇది ఎట్లా ఉన్నదంటే సాలెపురుగువలె ఉన్నది. సాలెపురుగు తన పొత్తికడుపులోనుండి వచ్చిన నూలుదారాలతో తనకు తానే గూడు అల్లుకొని అందులో తానే బందీ అయిపోతుంది. (గుణము అంటే త్రాడు అనికూడా అర్థం ఉన్నది).

విశేషం: ఈ దృష్టాంతం వ్యాసుడు ఇచ్చినదే. "కోశకారో యథాత్మానం కీటః సమనురుంధతి! సూత్రతంతుగుణైర్నిత్యం తథాయ మగుణో గుణైఃII" (12-292-4). భావప్రకటన సమర్థంగా సాలీడుని 'పొత్తినూలికాయ పురువు' అన్నాడు తిక్కన.

ఆ. అమలవాయుసేవనము నిర్మలత్వంబు । గలుగఁగాఁ బదాఱు కళలఁ బూర్ణఁ
డగు సుధాంశు మాడ్కి నక్షర మమలినా । ఖండశాంతిబోధఘనత వెలుఁగు.' 20

ప్రతిపదార్థం: అక్షరము= ఈ అక్షరతత్త్వం; అమల= స్వచ్ఛమైన; వాయు= వాయువుయొక్క; సేవనము= అనుభవం; నిర్మలత్వంబు= నిర్మలస్థితి; కలుగఁగాన్= (రెండూ) లభించినప్పుడు; పదాఱుకళలన్= పదహారు కళలతోనూ; పూర్ణుఁడు+అగు= పరిపూర్ణత్వాన్ని పొందిన; సుధాంశు మాడ్కిన్= అమృతకిరణుడైన చంద్రుడివలె; అమలిన= మలినరహితమూ; అఖండ= పరిపూర్ణమూ అయిన; శాంతి= శాంతియొక్క; బోధ= ఎరుకతో; కలిగిన ఘనతన్= గొప్పదనంతో; వెలుఁగున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: వాయుసేవనం వలన (మబ్బులు తొలగిపోయి) నిర్మలస్థితి పొంది పదారుకళలతో పరిపూర్ణుడైన చంద్రుడు ప్రకాశిస్తాడు. అట్లాగే అక్షరతత్త్వం కూడా అఖండశాంతి బోధతో మునుపటి గొప్పదనాన్ని మళ్ళీ పొంది విరాజిల్లుతుంది'.

వ. అనిన విని జనకుం డమ్మునీశ్వరున కిట్లనియె. 21

ప్రతిపదార్థం: అనినన్= అని చెబుతూంటే; విని; జనకుండు; ఆ+మునీశ్వరునకున్= ఆ వసిష్ఠుడితో; ఇట్లు; అనియెన్= సంభాషించాడు.

తాత్పర్యం: అని చెప్పుతూంటే విని, జనకమహారాజు ఆ వసిష్ఠుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'వనితకుఁ బురుషునకుం దన । తనయంతన రూపాకం డొదవఁ జేయఁగ వి
న్ననువు గలుగ దొండొరువుల । నెనయుటఁగాని శ్రుతిమతము నిట్ల మహాత్మా! 22

ప్రతిపదార్థం: మహాత్మా!; గొప్ప ఆత్మకలవాడా! వనితకున్= స్త్రీకీ; పురుషునకున్= పురుషుడికీ; ఒండొరులన్= ఒకరిని ఒకరు; ఎనయుటన్‌కాని= కలుసుకోవటం వల్లనే తప్ప; తనయంతన= విడివిడిగా; రూపు ఒకండు= ఒక రూపాన్ని; ఒదవన్ చేయఁగన్= ప్రసవించటమనేది; విన్ననువు= నేర్పు; కలుగదు= కనిపించలేదు; శ్రుతిమతమున్= వేదం అభిప్రాయంకూడా; ఇట్లు+అ= ఇలాగే ఉన్నది.

తాత్పర్యం: 'మహాత్మా! స్త్రీపురుషులు పరస్పరం కలిసికొంటే మరొక రూపాన్ని ఉత్పత్తి చేయగలుగుతున్నారే తప్ప, విడివిడిగా ఆ ఇద్దరిలో ఎవ్వరికీ ఆ నేర్పు లేదు అనేది లోకం చూస్తే తెలుస్తున్నది. వేదమూ ఇదే చెప్పుతున్నది.

క. వనితగుణంబులు చర్మం । బును మాంసము శోణితంబుఁ బురుషగుణతతిన్
వినుఁ మజ్జాస్థిస్నాయువు । లనఘతపోవిభవ! యిట్లయని శ్రుతి సెప్పున్. 23

ప్రతిపదార్థం: అనఘ= పవిత్రమైన; తపోవిభవ!= తపోవైభవం కలవాడా!; చర్మంబును= చర్మం; మాంసమున్= మాంసం; శోణితంబున్= రక్తం - ఇవి; వనితగుణంబులు= స్త్రీవల్ల శిశువుకు లభించే గుణాలు; పురుష= పురుషునియొక్క; గుణతతిన్= గుణసమూహం వలన; వినుఁ; మజ్జా= మూలగ; అస్థి= ఎముకలు; స్నాయువులు= ఆయువు పట్టులు (నెరకులు) అనేవి ఇవి పురుషుడివలన బిడ్డకు లభిస్తాయని; ఇట్ల+అని= ఇలాగనే; శ్రుతి= వేదం; చెప్పున్= చెప్పుతోంది.

తాత్పర్యం: ఓ తపస్వీ! చర్మం, మాంసం, రక్తం - అనేవి స్త్రీనుండీ, మజ్జ, ఎముకలు, స్నాయువులు - అనేవి పురుషుడినుండి బిడ్డకు లభిస్తాయి. వేదం ఇట్లాగే చెప్పుతున్నది.

వ. అది తిర్యఙ్మనుష్యాదులైన సకల యోనులయందును జన్యంబులు ఆవహిల్లెడి తెఱంగు. 24

ప్రతిపదార్థం: అది= ఈ పైని చెప్పినది; తిర్యక్+మనుష్య+ఆదులైన= పశుపక్షిమానవాదులైన; సకలయోనులయందును= సకలజాతులలోనూ; జన్యంబులు(జన్మంబులు)= పుట్టుకలు; ఆవహిల్లెడి తెఱంగు= జరిగే పద్ధతి.

తాత్పర్యం: పైన చెప్పినది పశుపక్షిమానవాదులైన సకలజాతులలోనూ పుట్టుకలు జరిగే పద్ధతి.

క. నరనారీసంబంధము । వరుసగదా పురుషునకును బ్రకృతికి నన్యో
న్యరమణ మది సర్వజనన । కర మిట్టులు శ్రుతులు సెప్పుఁ గారుణ్యనిధీ! 25

ప్రతిపదార్థం: కారుణ్యనిధీ!= ఓ కృపానిధీ!; పురుషునకును= పురుషుడికీ; ప్రకృతికిని= ప్రకృతికీ ఉండే; అన్యోన్యరమణము= పరస్పర ఆనందం, ఆకర్షణ అనేది; నరనారీసంబంధము వరుస కదా!= నరనారీ సంబంధం వంటిదే గదా!; అది= ఆ సంబంధం, ఆ ఆకర్షణ; సర్వజననకరము= సకలజీవరాశికీ జన్మకారణం; ఇట్టులు= ఇట్లాగని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెబుతున్నాయి.

తాత్పర్యం: పురుషుడికీ ప్రకృతికీ ఉన్న ఆకర్షణ నరనారీసంబంధం వరసే. స్త్రీ పురుష సంబంధంవంటిదే ప్రకృతి పురుషుల పరస్పరాకర్షణ. అదే సమస్త ప్రాణికోటికీ జన్మహేతువు. వేదాలు ఇదే చెప్పుతున్నాయి.

క. వినుము ప్రకృతి పురుషుల భం । గి నిరూపింపంగ ముక్తికిని మార్గంబుం
గను వెరవు లేకయున్నది । మునినాయక! యెఱుఁగఁ జెప్పు మోక్షపదంబున్. 26

ప్రతిపదార్థం: మునినాయక!= ఓ మునీశ్వరా!; వినుము; ప్రకృతిపురుషుల భంగిన్= ప్రకృతి పురుషుల పద్ధతిని; నిరూపింపంగన్= నిరూపించినా (లేదా నిరూపించటానికీ); ముక్తికిని= మోక్షానికి; మార్గంబున్= మార్గాన్ని; కను= తెలిసికొనే; వెరవు= ఉపాయం; లేకఉన్నది= కనిపించటంలేదు (అందుచేత); మోక్షపదంబున్= ముక్తిమార్గాన్ని; ఎఱుఁగన్ చెప్పు= నాకు తెలిసేట్టు చెప్పుము.

తాత్పర్యం: ప్రకృతిపురుషుల పద్ధతిని స్పష్టంగా నిరూపించవచ్చును. అయినా ముక్తిమార్గం మాత్రం తెలియరావటం లేదు. కాబట్టి ఓ మునీశ్వరా! మోక్షమార్గం ఏమిటో స్పష్టంగా తెలియజేయుము.

క. అనుపమ మజర మతీంద్రియ । మనామయ మనంత మమల మన వెలుఁగు నొకం
డని వేదశాస్త్రములచే । వినియుండుదు దానిఁ దెలుపవే కృప నాకున్.' 27

ప్రతిపదార్థం: (ఓ మునినాయకా!) అనుపమము= సాటిలేనిదీ; అజరము= ముసలితనంలేనిదీ; అతీంద్రియము= ఇంద్రియాలకు అతీతమైనదీ; అనామయము= ఆమయాలు (నాశమూ రోగమూ) లేనిదీ; అనంతము= అంతులేనిదీ; అమలము= మాలిన్యం లేనిదీ; అనన్= ప్రసిద్ధిపొందిన; ఒకండు= ఒకానొకతత్త్వం; వెలుఁగున్= ప్రకాశిస్తోంది; అని; వేదశాస్త్రములచేన్= వేదాలవల్లా, శాస్త్రాలవల్లా; వినియుండుదున్= విని ఉన్నాను; దానిన్= ఆ తత్త్వాన్ని; నాకున్= నాకు (కూడా); కృపన్= దయతో; తెలుపవే!= (దయచేసి) తెలియజెప్పవా!

తాత్పర్యం: అనుపమాది లక్షణాలు కలిగి, ఒక తేజస్సు ఏదో ప్రకాశిస్తున్నదని వేదాలూ శాస్త్రాలూ చెప్పుతున్నాయి. అది విన్నాను. దయచేసి ఆ తత్త్వాన్ని నాకు తెలియజేయుము'.

వ. అని వేఁడిన నమ్మునివరుండు సాదరంబుగా నతని కిట్లనియె. 28

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; వేఁడినన్= జనకుడు ప్రార్థించేసరికి; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడు - వసిష్ఠుడు; సాదరంబుగాన్= ఆదరంతో; అతనికిన్= ఆ జనకుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ప్రార్థించగా వసిష్ఠుడు ఆదరంతో ఆ జనకుడికి ఈ విధంగా చెప్పాడు.

వసిష్ఠుఁడు జనకున కక్షరక్షర తత్త్వంబుల తెఱం గెఱిఁగించుట (సం. 12-291-13)

సీ. 'గ్రంథంబు ధరియింతు గాని నీ కర్థబో । ధంబు లే దర్థబోధవ్యపేత
మగు గ్రంథధారణ మప్రయోజన మర్థ । నిశ్చయ మెఱిఁగింతు నిపుణబుద్ధి
నవధరింపుము సాంఖ్య మనుసరించును యోగ । తంత్రంబు నదియును దాని తెరువు
నొందుఁ గావున సాంఖ్యయోగంబు లేకంబ । యని కండ్రు ప్రాజ్ఞులు మనుజనాథ!

తే. సాంఖ్యమునకు యోగమునకు జనని శ్రుతియ । పురుషవనితానపుంసకంబు లనఁ బ్రకృతి
లింగములు గల నాత్ముం డలింగుఁ డతనిఁ । జెంద దది యెద్దియును నని చెప్పు శ్రుతులు. 29

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ జనకమహారాజా!; గ్రంథంబున్= తత్త్వశాస్త్ర గ్రంథాన్ని; ధరియింతు(వు)కాని= కంఠస్థం చేస్తావే కానీ; నీకున్= నీకు; అర్థబోధంబులేదు= అర్థావగాహన లేదు; అర్థబోధ= అర్థజ్ఞానంతో; వ్యపేత= విరహితమైన; గ్రంథధారణ= పుస్తకపఠనం; అప్రయోజనము= నిష్ఫలం; అర్థనిశ్చయము= అర్థనిర్ణయాన్ని; ఎఱిఁగింతున్= తెలియజేస్తాను; నిపుణబుద్ధిన్= నేర్పుగల ధీశక్తితో; అవధరింపుము= శ్రద్ధగా ఆలకించుము; సాంఖ్యమున్= సాంఖ్యశాస్త్రాన్ని; యోగతంత్రంబు= యోగశాస్త్రం; అనుసరించును= అనుసరిస్తుంది; అదియును= ఆ సాంఖ్యంకూడా; దాని తెరువున్= యోగశాస్త్రపద్ధతిని; ఒందున్= అనుసరిస్తుంది; కావునన్= కాబట్టి; సాంఖ్యయోగంబులు= సాంఖ్యమూ, యోగమూ అనేవి; ఏకంబు+అ+అని= ఒకటే అని; ప్రాజ్ఞులు= పండితులు; కండ్రు= దర్శిస్తున్నారు - భావిస్తున్నారు; సాంఖ్యమునకున్= ఈ సాంఖ్యానికీ; యోగమునకున్= ఆ యోగశాస్త్రానికీ; జనని= తల్లి (ఆవిర్భావ ప్రదేశం); శ్రుతి+అ= వేదమే; పురుషవనితా నపుంసకంబులు+అనన్= పురుషుడు, స్త్రీ, నపుంసకం అని; ప్రకృతి లింగములు= ప్రకృతి సిద్ధమైన లింగాలు; కలవు= ఉన్నాయి; ఆత్ముండు= ఆత్ముడుమాత్రం; అలింగుఁడు= లింగరహితుడు; అతనిన్= ఆత్ముడిని; అది ఎద్దియును= స్త్రీ పుం నపుంసకలింగాలలో ఏ ఒక్కటీకూడా; చెందదు= పొందదు; అని= అని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెబుతున్నాయి.

తాత్పర్యం: 'మహారాజా! నీవు తత్త్వశాస్త్ర గ్రంథాలు ధారణచేస్తున్నావే తప్ప వాటి అర్థం నీకు అవగాహనకు రాలేదు. అర్థం తెలియని చదువు వ్యర్థం. అర్థనిశ్చయాన్ని నేను చెప్పుతున్నాను. శ్రద్ధగా ఆలకించుము. సాంఖ్యయోగశాస్త్రాలు ఒకదానిని ఒకటి అనుసరిస్తూ ఉంటాయి. అందుకే అవి అభిన్నాలు, ఒక్కటే అని ప్రాజ్ఞులు గుర్తించారు. ఈ రెండింటికీ వేదమే జన్మస్థానం, అదే ఆధారం. ప్రకృతిలో మూడు లింగాలు ఉన్నాయి. అవి ప్రసిద్ధాలు. ఆత్మకు మాత్రం ఆ లింగాలు ఏవీ ఉండవు. ఇదికూడా వేదం చెప్పిన విషయమే.

క. వినుఁ బీజంబున బీజం । బును దేహమునందు దేహమును నింద్రియముల్
దనతనవలనం దానును । మనంబునకు మనసు పుట్టు మహితవిచారా! 30

ప్రతిపదార్థం: మహితవిచారా!= ఓ శ్రేష్ఠమైన ఆలోచన కలవాడా!; వినుఁ; బీజంబునన్= విత్తనం నుండి; బీజంబును= విత్తనమూ; దేహమునందున్= శరీరంనుంచి; దేహమును= శరీరమూ; ఇంద్రియముల్= ఇంద్రియాలు; తనతనవలనన్= ఒక్కొక్కదానినుంచి; తానును= తాను ఒక్కొక్కటీ; మనంబునకున్= మనస్సుకు; మనసు= మనస్సూ; పుట్టున్= జన్మిస్తాయి.

తాత్పర్యం: ఓ ఆలోచనాపరుడా! విత్తనంనుండి విత్తనమూ, దేహంనుండి దేహమూ, ఇంద్రియాలనుండి ఇంద్రియాలూ, మనస్సునుండి మనస్సూ - ఇట్లా జన్మిస్తూ ఉంటాయి. తెలిసికొమ్ము.

తే. ఇతఁ డబీజుం డదేహుం డనింద్రియుండు । వీతమానసుఁడని యాత్మవిధము సెప్పు
వేదములు, భవదుఃఖ కర్మాదికములు । నాతనికి లేవు నిర్గుణుం డగుటఁ జేసి. 31

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ ఆత్ముడు; అబీజుండు= బీజ విరహితుడు; అదేహుండు= దేహశూన్యుడు; అనింద్రియుండు= ఇంద్రియ రహితుడు; వీతమానసుఁడు= మనస్సులేనివాడు; అని= అని; ఆత్మవిధము= ఆత్మ తాలూకు స్వభావాన్నీ, విధానాన్నీ; వేదములు= వేదాలు; చెప్పున్= చెబుతున్నాయి; నిర్గుణుండు= గుణరహితుడు; అగుటన్+చేసి= అవ్వటంవలన; ఆతనికిన్= ఆత్ముడికి; భవదుఃఖకర్మాదికములు= పుట్టుక, దుఃఖం, కర్మాచరణ మొదలైనవి; లేవు= ఉండవు.

తాత్పర్యం: ఆత్మకు బీజం లేదనీ, దేహం ఉండదనీ, ఇంద్రియాలు లేవనీ, మనస్సు కూడా ఉండదనీ వేదాలు వివరిస్తున్నాయి. ఆత్మ అనేది నిర్గుణం. అందుచేత దానికి భవబంధాలూ భవదుఃఖాలూ కర్మాచరణలూ - ఇట్లాంటివి ఏమీ ఉండవు.

చ. ప్రకృతి యలింగ, తజ్జనితభంగులు లింగము, లట్టులయ్యు రం
జకగుణశీల లింగచయసంగతిఁ దాను సలింగమయ్యె, మూ
ర్తికలన లేక యుండియుఁ బరిస్ఫుట పుష్పఫలాదిసూచక
ప్రకరముచేత మూర్తమయి రంజిలదే ఋతువేళ సూడఁగన్. 32

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి అనేది నిజానికి; అలింగ= లింగరహిత; తద్= ఆ ప్రకృతినుంచి; జనిత= పుట్టిన; భంగులు= వికారాలే; లింగములు= లింగాలు; అట్టులయ్యున్= అయినప్పటికీ; రంజక= రంజింపజేసే; గుణ= గుణమూ; శీల= స్వభావమూ ఉన్న; లింగచయ= ఆ లింగ సమూహంయొక్క; సంగతిన్= కలయికతో - సాంగత్యంతో; తానున్= ఆ ప్రకృతి తాను కూడా; సలింగ+అయ్యెన్= లింగసహిత అవుతోంది; మూర్తికలన లేకయుండియున్= ఒక రూపం అనేది లేకపోయినా; ఋతువేళ= వసంతాది ఋతుసమయం; పరిస్ఫుట= స్పష్టంగా కనిపించే; పుష్పఫల+ఆది= పువ్వులూ, పండ్లూ మొదలైన; సూచకప్రకరముచేతన్= సూచకసమూహంతో; మూర్తము+అయి= ఒక రూపం ధరించినదై; చూడఁగన్= మనం గమనించాలే కానీ; రంజిలదే= ప్రకాశించదా!

తాత్పర్యం: వసంతాది ఋతువులకు ఒక రూపమంటూ ఏదీ లేదు. అయినా ఫలపుష్పాలవలన ఆ ఋతువులకు ఒక రూపం ఏర్పడుతున్నది. ఆ చిహ్నాలతో ఆయా ఋతువులను మనం గుర్తిస్తున్నాం. అట్లాగే ప్రకృతికి కూడా ఒక లింగమంటూ ఏదీ లేదు. లింగాలన్నీ ప్రకృతినుండి పుట్టిన వికృతులే. అయితే ఆ లింగాల సాంగత్యంవలన ప్రకృతి కూడా సలింగ అవుతున్నది. నిజానికి అది అలింగ.

క. కావున గుణములు ప్రకృతివ । యేవిధమునఁ జూచినను మహేశ్వరుని గుణి
త్వావేశము పొరయ దస । ద్భావము సద్భావమగునె? భరితవివేకా! 33

ప్రతిపదార్థం: భరితవివేకా!= వివేకవంతుడా!; కావునన్= కాబట్టి; గుణములు= గుణములనేవి; ప్రకృతివి+అ= ప్రకృతివే; ఏ విధమునన్ చూచినను= ఏ విధంగా చూసినప్పటికీ; మహేశ్వరునిన్= మహేశ్వరుడిని (పరమాత్మను); గుణిత్వ+ఆవేశము= గుణాలు ఆవేశించటమనేది; పొరయదు= జరగదు; అసద్భావము= లేనిది; సద్భావము= ఉన్నది; అగునె?= అవుతుందా?

తాత్పర్యం: కాబట్టి గుణాలు ప్రకృతివే కానీ పరమాత్మవి కావు. అవి ఏ రకంగానూ మహేశ్వరుడికి అంటవు. లేనిది ఉన్నట్లు అవుతుందా! కాదు కదా! అట్లాగే ఇదీనూ.

వ. ఇది యక్షర క్షర వివేకం, బేకం బనేకంబు దర్శనం బదర్శనంబు నిస్తత్వంబు దత్వం బపవర్గంబు వర్గంబని యక్షరక్షరంబుల పర్యాయ నిర్దేశంబు, లక్షరంబు నప్రబుద్ధులు గానరు, ప్రబుద్ధులగు సాంఖ్యులును యోగులును బుద్ధికిం బరంబై పంచవింశతితమంబైన యా తత్త్వంబు నాలోకింతు'రని చెప్పిన వసిష్ఠుతో నవ్వసుమతీవల్లభుండు. 34

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకూ చెప్పింది; అక్షర - క్షర వివేకంబు= అక్షరమూ క్షరమూ అనేవాటి వివేకం (జ్ఞానం); ఏకంబు= ఏకమూ; అనేకంబు= అనేకమూ; దర్శనంబు= దర్శనమూ (కనబడేది); అదర్శనంబు= అదర్శనమూ; నిస్తత్వంబు= తత్త్వరహితమూ; తత్త్వంబు= తత్త్వమూ; అపవర్గంబు= అపవర్గమూ; వర్గంబు= వర్గమూ; అని= అని వరుసగా; అక్షర క్షరంబుల= అక్షర క్షరాల పర్యాయనిర్దేశంబులు= పర్యాయసంజ్ఞలు; అక్షరంబున్= అక్షర తత్త్వాన్ని; అప్రబుద్ధులు= ప్రబుద్ధులు కానివారు (జ్ఞానరహితులు); కానరు= తెలుసుకోలేరు; ప్రబుద్ధులు అగు= జ్ఞానులైన; సాంఖ్యులును= సాంఖ్యులూ; యోగులును= యోగులూ; బుద్ధికిన్ పరంబై= బుద్ధికి అందనిదై; పంచవింశతి తమంబైన= ఇరవై అయిదవదైన; ఆ తత్త్వంబున్= ఆ అక్షరతత్త్వాన్ని; ఆలోకింతురు= దర్శిస్తారు; అని; చెప్పినన్= చెప్పేసరికి; వసిష్ఠతోన్= ఆ వసిష్ఠుడితో; ఆ+వసుమతీ వల్లభుండు= ఆ జనకమహారాజు.

తాత్పర్యం: ఇంతరకూ చెప్పినది అక్షరమూ - క్షరమూ అనే వాటి జ్ఞానం. ఏకమూ, అనేకమూ; కనబడేది, అదర్శనమూ; తత్త్వరహితమూ - తత్త్వమూ; అపవర్గమూ వర్గమూ అని వరుసగా అక్షర క్షరాల పర్యాయసంజ్ఞలు. అజ్ఞానులు అక్షరతత్త్వాన్ని గ్రహించలేరు. తెలిసికొనలేరు. జ్ఞానులైన సాంఖ్యులూ, యోగులూ, బుద్ధికి అందనిదై, ఇరవై అయిదవదైన ఆ అక్షరతత్త్వాన్ని దర్శిస్తారు' అని వసిష్ఠుడు చెప్పగా విని, ఆ జనకమహారాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'కలదు నానాత్వ మేకత్వ మాత్మునకు న । విద్యయు విద్య నా విందు నదియు
నదియును నెఱిఁగింపు మక్షరక్షరభేద । మీవు సెప్పితి బుద్ధి యెంతయేని
నస్థిరగాన యయ్యవబోధమును మాసె । సాంఖ్యయోగంబుల చందములును
దెలియంగఁ జెప్పఁగా వలయు నా' కనుడు న । ముని యిట్టు లనియె నమ్మనుజ పతికి

తే. 'యోగమనఁగను ధ్యానంబు రాగరహిత! । యదియు వినుము ప్రాణాయామ మనఁగ నొకటి
మనసు నేకాగ్రతావృత్తి యనఁగనొకఁడు । పరఁగు సగుణత్వ నిర్గుణ భావగతుల. 35

ప్రతిపదార్థం: ఆత్మునకున్= ఆత్మకు; నానాత్వము= అనేకత్వమూ; ఏకత్వము= ఏకత్వమూ; కలదు= ఉంది; అవిద్యయున్= అవిద్య; విద్య= విద్య; నాన్= అని పెద్దలు చెప్పగా; విందున్= విన్నాను; అదియున్ అదియున్= ఆ రెండింటినీ; ఎఱిఁగింపుము= నాకు తెలియజేయుము; అక్షర క్షర భేదము= అక్షర క్షరాల విభేదాన్ని; ఈవు= నీవు; చెప్పితి(వి)= చెప్పావు; బుద్ధి= ఈ బుద్ధి అనేది; ఎంతయేనిన్= ఎంతయినా; అస్థిర= అస్థిరం దీనికి స్థిరతలేదు; కానన్= కాబట్టి; ఆ+అవబోధమునునన్= ఆ వివేకంకూడా; మాసెన్= అంతరించిపోయింది; సాంఖ్యయోగంబుల= సాంఖ్యయోగాల; చందములునున్= తీరుతెన్నులను కూడా; నాకున్= నాకు; తెలియంగన్+చెప్పఁగాన్ వలయున్= తెలిసేట్లు నీవే చెప్పాలి; అనుడున్= అని అడిగేసరికి; ఆ+ముని= ఆ వసిష్ఠుడు; ఆ+మనుజపతికిన్= ఆ జనకమహారాజుకు; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు; రాగరహిత!= రాగమూ మోహమూ అనేవి లేనివాడా!; యోగము+అనఁగను= యోగం అంటే; ధ్యానంబు= ధ్యానమే; వినుము= విను; అదియున్= అదికూడా; ప్రాణాయామము+అనఁగన్+ఒకటి= ప్రాణాయామమని ఒకటీ; మనసు+ఏకాగ్రతావృత్తి+అనఁగన్+ఒకఁడు= మనస్సు యొక్క ఏకాగ్రతాప్రవృత్తి అని మరొకటీ; సగుణత్వ - నిర్గుణభావగతులన్= సగుణనిర్గుణ పద్ధతులుగా; పరఁగున్= ఉన్నాయి.

తాత్పర్యం: 'మహర్షీ! ఆత్మకు ఏకత్వం అనేకత్వం ఉన్నది అంటున్నారు. అట్లాగే విద్య, అవిద్య - అనేవి ఉన్నాయి అంటున్నారు. ఇవి రెండూకూడా నాకు తెలిసేటట్లు చెప్పుము. అక్షర-క్షర విభేదం ఏమిటో చెప్పావు. కానీ, బుద్ధి ఎంతయినా అస్థిరం. అందుచేత ఆ వివేకం అప్పుడే రూపుమాసిపోయింది. సాంఖ్యయోగ పద్ధతులను కూడా మరింత స్పష్టంగా వివరించుము' అని జనక మహారాజు అడిగాడు. అప్పుడు వసిష్ఠుడు ఇట్లా అన్నాడు. 'ఓ రాగరహితుడా!

చెప్పుతున్నాను శ్రద్ధగా వినుము. యోగం అంటే ధ్యానం. అది ప్రాణాయామం అని ఒకటీ, మానసిక ఏకాగ్రత అని ఒకటీ - రెండు పద్ధతులలో ఉంటుంది. వీటిలో మొదటిది సగుణత్వ విధానం. రెండవది నిర్గుణత్వ పద్ధతి. ("ఏకాగ్రతా చ మనసః ప్రాణాయామస్తథైవ చ, ప్రాణాయామస్తు సగుణో నిర్గుణో మనసస్థథా" (12-294-8).)

వ. తదనుష్ఠాన ప్రకారంబు సెప్పెద. 36

ప్రతిపదార్థం: తద్= ఆ రెండింటికీ; అనుష్ఠాన ప్రకారంబు= అనుష్ఠాన పద్ధతి; చెప్పెదన్= చెప్పుతాను. తెలిసికొమ్ము.

తాత్పర్యం: ఆ రెండింటికీ అనుష్ఠానపద్ధతి చెప్పుతాను వినుము.

క. 'మలమూత్రంబుల కాలం । బుల భుక్తి కనంతరమున భూవర! యోగం
బలవఱుచు రెండు మార్గం । బులును నిషిద్ధంబు లండ్రు పూర్వాచార్యుల్. 37

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనకమహారాజా!; మలమూత్రంబుల= మలమూత్రాలు విసర్జించే; కాలంబులన్= సమయాల్లోనూ; భుక్తికిన్= భోజనానికి; అనంతరమునన్= తరువాత సమయంలోనూ; యోగంబు= ఈ యోగాన్ని; అలవఱుచు= అలవాటుగా చేసేటువంటి; రెండు మార్గంబులును= రెండు పద్ధతులూ; నిషిద్ధంబులు= నిషిద్ధాలు అని; పూర్వాచార్యుల్= పురాతన గురువులు; అండ్రు= అంటున్నారు.

తాత్పర్యం: 'ఓ రాజా! మలమూత్రాలు విసర్జించే సమయంలోనూ, భోజనానికి తరువాతా ప్రాణాయామాదికమైన యోగాన్ని అనుష్ఠించటం సమంజసం కాదనీ, అది నిషిద్ధమనీ పూర్వాచార్యులు చెప్పుతున్నారు. ('మూత్రోత్సర్గే పురీషే చ భోజనే చ నరాధిప! త్రికాలం నాభియుంజీత శేషం యుంజీత తత్పరః' (12-294-9).)

సీ. కొంచెపుటశనంబుఁ గొనుచు సంగంబులఁ । బాసి యింద్రియముల పజ్జఁ జనమి
శబ్దాదియైన విషయజాత మంతరం । గంబున సందడిగాక యుండ
సద్బుద్ధి దృఢమగు సాధనంబుగఁ గొని । మరలిచి యాత్మన మనసు నిలిపి
యపగతసంకల్పుఁడై యుపలస్థాణు । భంగికస్థితిఁ బనుపడి దివంబు

తే. రాత్రియును యోగసేవానురతి నివాత । దీపమును బోలె వెలుఁగు నాత్మీయమూర్తిఁ
గనుచు నెడనెడ నుపరమకాలములు స । నంగ వర్తించి యోగి యానంద మొందు. 38

ప్రతిపదార్థం: కొంచెము+అశనంబు= అల్పపరిమాణంలో ఆహారాన్ని; కొనుచున్= స్వీకరిస్తూ; సంగంబులన్= తగులుకోళ్ళను; పాసి= వదిలించుకొని; ఇంద్రియముల పజ్జన్= ఇంద్రియాలవైపు; చనమి= వెళ్ళకపోవటం; శబ్దాదియైన= శబ్దము మొదలైన; విషయజాతము= విషయసమూహం; అంతరంగంబునన్= హృదయంలో; సందడికాక+ఉండన్= సందడి చెయ్యకుండా ఉండటం; సద్బుద్ధిన్= మంచి ధీశక్తిని; దృఢము+అగు= గట్టిదైన; సాధనంబుగన్+కొని= సాధనంగా స్వీకరించి; మనసున్= మనస్సును; మరలిచి= మళ్ళించి; ఆత్మన్+అ= ఆత్మలోనే; నిలిపి= నిలబెట్టి; అపగత సంకల్పుఁడై= ఏ రకమైన సంకల్పాలూ లేనివాడై; ఉపలస్థాణుభంగికస్థితిన్= రాయివలె నిశ్చలమైన (స్థాణు)భంగితో ఉంటూ; పనుపడి= పూనికతో వరుసగా; దివంబున్ రాత్రియును= పగలూ రాత్రికూడా; యోగసేవా+అనురతిన్= యోగానుష్ఠానం పట్ల గాఢవాంఛతో; నివాతదీపమును పోలెన్= గాలి లేనప్పుడు నిశ్చలంగా వెలిగే దీపం వలె; వెలుఁగు= ప్రకాశించే; ఆత్మీయమూర్తిన్= ఆత్మ(తాలూకు) రూపాన్ని; కనుచున్= దర్శిస్తూ; ఎడనెడన్= మధ్యమధ్యలో; ఉపరమకాలములు= విరామసమయాలు; చనంగన్= కడచిపోతూండగా; వర్తించి= యోగానుష్ఠానంతో వర్తించి; యోగి= యోగి అయినవాడు; ఆనందము+ఒందున్= ఆనందం పొందుతాడు.

తాత్పర్యం: కొలదిగా మాత్రమే ఆహారాన్ని భుజిస్తూ, కలయికలను వదలిపెట్టి, ఇంద్రియాలపై దృష్టి పెట్టకుండా, విషయసంబంధమైన ప్రలోభాలు లోలోపల గొడవచేయకుండా ఉండేటందుకు మంచి బుద్ధిబలాన్ని ఆయుధంగా గ్రహించి, మనస్సును ఆత్మలోనికి మరల్చి, రాయివలె ఏ సంకల్పాలూ లేకుండా, గాలిలేనప్పుడు నిశ్చలంగా ఉండే దీపంవలె ఆత్మస్వరూపాన్ని నిరంతరం దర్శించుకొంటూ యోగి ఆనందిస్తాడు.

వ. ఇది యోగప్రకారంబు, సాంఖ్యంబు తెఱం గెఱింగించెద. 39

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; యోగప్రకారంబు= యోగ పద్ధతి; సాంఖ్యంబు తెఱంగు= ఇంక సాంఖ్య పద్ధతి; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: పైన చెప్పినది యోగ పద్ధతి. ఇక సాంఖ్యం గురించి వివరిస్తాను.

తే. ప్రకృతివాదు లవ్యక్తంబు ప్రకృతియండ్రు । ప్రసవధర్మిణియైన యా ప్రకృతి దన్ను
బుద్ధ్యహంకారములుఁ బంచభూతములును । విషయములు నింద్రియములుఁగా విస్తరించు. 40

ప్రతిపదార్థం: ప్రకృతివాదులు= సాంఖ్యులు; ప్రకృతి= ప్రకృతి అనేది; అవ్యక్తంబు= అవ్యక్తము; అండ్రు= అంటారు; ప్రసవధర్మిణి+ఐన= ప్రసవించే ధర్మం కలదైన; ఆ ప్రకృతి; తన్నున్= తనను తాను; బుద్ధి+అహంకారములు= బుద్ధి, అహంకారం; పంచభూతములును= పంచభూతాలూ; విషయములు= శబ్దాదివిషయాలూ; ఇంద్రియములున్= శ్రోత్రాది ఇంద్రియాలూ; కాన్= అయ్యేటట్లు; విస్తరించున్= విస్తరించుకొంటుంది.

తాత్పర్యం: మహారాజా! ప్రకృతివాదులైన సాంఖ్యులు ఈ ప్రకృతిని 'అవ్యక్తము' అంటారు. దీనికి ప్రసవించే ధర్మం ఉన్నది కాబట్టి తనను తాను బుద్ధిగా, అహంకారంగా, పంచభూతాలుగా, శబ్దాది విషయాలుగా, శ్రోత్రాది ఇంద్రియాలుగా (జ్ఞానేంద్రియాలూ, కర్మేంద్రియాలూ) విస్తరించుకొంటుంది.

వ. పురుషునివలన నివి యెల్లను గలుగుఁ బురుషుఁడింతకు నధిష్ఠాతయై యుండు. 41

ప్రతిపదార్థం: పురుషునివలనన్= పురుషుడివలన; ఇవి+ఎల్లనున్= పైని చెప్పిన విస్తరణ అంతా; కలుగున్= జరుగుతుంది; పురుషుఁడు= పురుషుడే; ఇంతకున్= దీనికంతటికీ, ఇంతకూ; అధిష్ఠాతయై ఉండున్= అధిష్ఠాతగా ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడివలన ఈ విస్తరణ అంతా జరుగుతుంది. పురుషుడే దీని కంతటికీ అధిష్ఠాత.

క. అనులోమంబున సృష్టియు । జనవర! ప్రతిలోమవృత్తి సంహారముఁ గ
ల్గును జనన ప్రళయంబులఁ । దనకు బహుత్వంబు నేకతయు శోభిల్లున్. 42

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా!; అనులోమంబునన్= అనులోమ పద్ధతిలో; సృష్టియున్= సృష్టి; ప్రతిలోమవృత్తిన్= ప్రతిలోమపద్ధతిలో; సంహారమున్= ఉపసంహారమూ (ప్రళయం లేదా వినాశం); కల్గును= ఏర్పడతాయి; జనన ప్రళయంబులన్= ఈ సృష్టి సంహారాలలో; తనకున్= ప్రకృతికి; బహుత్వంబున్= అనేకత్వమూ; ఏకతయున్= ఏకత్వమూ; శోభిల్లున్= వరుసగా ప్రకాశిస్తాయి.

తాత్పర్యం: ఓ జనకా! అనులోమంలో (పైనుండి క్రిందకు) సృష్టి జరుగుతుంది. ప్రతిలోమంలో (క్రిందినుండి పైకి) సంహారం జరుగుతుంది. సృష్టి జరుగుతున్న (జనన) సమయంలో ప్రకృతికి అనేకత్వం శోభిస్తుంది.

ప్రళయసమయంలో ఏకత్వం విరాజిల్లుతుంది. 'అనులోమేన జాయంతే, లీయంతే ప్రతిలోమతః (12-294--32). ఏకత్వం ప్రళయే చాస్య, బహుత్వం చ యదాసృజత్ (12-294-33)'.

వ. క్షేత్రంబన నవ్యక్తంబనం బకృతియనం బ్రధానం బనం బరఁగు తత్త్వం బొక్కటియ. దానిన సత్త్వంబు నండ్రు, జీవుం డా క్షేత్రంబు నెఱింగినవాఁడు, కావున క్షేత్రజ్ఞుఁడును, నవ్యక్తపురంబున వసియించుటఁజేసి పురుషుండు, ననవెలుంగు, క్షేత్రక్షేత్రజ్ఞులు వేఱగుట ప్రస్ఫుటంబు, అవ్యక్తంబు జ్ఞానంబు, పురుషుండు జ్ఞేయుండు, ప్రకృతి సగుణాత్మక, పురుషుండు నిర్గుణుం డిది సాంఖ్యప్రకారం, బిట్లు పరిసంఖ్యానరూపంబునఁ జతుర్వింశతితత్త్వంబుల నేర్పరించి పురుషుండు దన్నుఁదాన చూడం గైవల్యంబు సిద్ధించు; నిట్టిది యపునరావృత్తిపదంబు, తత్త్వసమూహం బప్రబుద్ధం బది క్షరంబు, పంచవింశతితత్త్వ విశిష్టుండగు పురుషుండు ప్రబుద్ధుం డక్షరంబునం బరఁగు, నిత్తెఱం గెఱింగిన వా రెల్లవలనను నిర్భయులు. భూవర! యోగంబును సాంఖ్యంబును నక్షరంబును జెప్పితి. విద్యావిద్యలు సెప్పెద నాకర్ణింపుము. 43

ప్రతిపదార్థం: క్షేత్రంబు+అనన్= క్షేత్రముఅనీ; అవ్యక్తంబు అనన్= అవ్యక్తము అనీ; ప్రకృతి అనన్= ప్రకృతి అనీ; ప్రధానంబు అనన్= ప్రధానము అనీ; పరఁగు= చెప్పబడుతున్న; తత్త్వంబు+ఒక్కటి+అ= తత్త్వం ఒక్కటే; దానిన= దానినే; సత్త్వంబున్+అండ్రు= సత్త్వము అని కూడా అంటారు; జీవుండు= జీవుడు; ఆ క్షేత్రంబున్= అవ్యక్తమైన ఆ ప్రకృతిని; ఎఱింగెడివాఁడు= తెలిసికొనే వ్యక్తి; కావునన్= కాబట్టి; క్షేత్రజ్ఞుఁడును= క్షేత్రజ్ఞుడు అనీ; అవ్యక్తపురంబునన్= ప్రకృతిలో; వసియించుటన్ చేసి= నివసించటం వలన; పురుషుండును+అనన్= పురుషుడు అనీ; వెలుంగున్= ప్రకాశిస్తున్నాడు; క్షేత్ర-క్షేత్రజ్ఞులు= ప్రకృతి పురుషులు; వేఱు అగుట= విభిన్నులు అనేది; ప్రస్ఫుటంబు= స్పష్టం; అవ్యక్తంబు= ప్రకృతి అనేది; జ్ఞానంబు= జ్ఞానం; పురుషుండు= పురుషుడు; జ్ఞేయుండు= తెలిసికొనదగినవాడు; ప్రకృతి= ప్రకృతి అనేది; సగుణాత్మక= సగుణస్వరూపం కలది; పురుషుండు= పురుషుడు; నిర్గుణుండు= నిర్గుణుడు; ఇది= ఇది అంతా; సాంఖ్యప్రకారంబు= సాంఖ్యపద్ధతి; ఇట్లు= ఇలా; పరిసంఖ్యానరూపంబునన్= పరిగణనరూపంలో; చతుర్వింశతి తత్త్వంబులన్= ఇరవై నాలుగు తత్త్వాలనూ; ఏర్పరించి= నిర్ధారించుకొని; పురుషుండు= పురుషుడు; తన్నున్ తాన= తనను తానే; చూడన్= దర్శిస్తే; కైవల్యంబు సిద్ధించున్= కైవల్యం (మోక్షం) సిద్ధిస్తుంది; ఇట్టిది= ఇటువంటిది; అపునరావృత్తిపదంబు= పునర్జన్మ లేని స్థానం; తత్త్వసమూహంబు= తత్త్వసమూహమనేది; అప్రబుద్ధంబు= ప్రబుద్ధంకానిది; అది= అది; క్షరంబు= క్షరతత్త్వం; పంచవింశతితత్త్వవిశిష్టుండు అగు పురుషుండు= ప్రబుద్ధుడు (జ్ఞాని); అక్షరంబు అనన్= అతడే అక్షరతత్త్వం అని; పరఁగున్= ఒప్పును; ఈ+తెఱంగు= ఈ పద్ధతిని; ఎఱింగినవారు= తెలుసుకొన్నవారు; ఎల్లవలనను= సమస్తంనుండి; నిర్భయులు= భయరహితులు; (వారికి దేనినుంచీ ఏ భయమూ ఉండదని); భూవర!= ఓ జనకరాజా!; యోగంబును= యోగమునూ; సాంఖ్యంబును= సాంఖ్యమునూ; అక్షరంబును= అక్షర (తత్త్వ)మునూ; చెప్పితిన్= నీకు వివరించాను; విద్యావిద్యలు= విద్య, అవిద్య అనేవి; చెప్పెదన్= తెలియజేస్తాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా విను.

తాత్పర్యం: క్షేత్రం, అవ్యక్తం, ప్రకృతి, ప్రధానం అని చెప్పబడుతున్నది ఒక్కటే తత్త్వం. 'సత్త్వము' దానికి మరొక పేరు. అట్టి ప్రకృతిని ఎరిగినవాడు గనుక క్షేత్రజ్ఞుడుగా, ప్రకృతిలో ఉండటంవలన పురుషుడుగా జీవుడు ప్రకాశిస్తున్నాడు. ప్రకృతి వేరు, పురుషుడు వేరు అనేది స్పష్టం. ప్రకృతి జ్ఞానం. పురుషుడు తెలిసికొనవలసినవాడు. ప్రకృతికి గుణాలు ఉన్నాయి. పురుషుడు నిర్గుణుడు. ఇది సాంఖ్య పద్ధతి ఇట్లా పరిగణన రూపంగా ఇరవై నాలుగు తత్త్వాలనూ గ్రహించి దర్శించుకొంటే మోక్షం లభిస్తుంది. ఇది పునర్జన్మ లేని స్థితి. తత్త్వసమూహం వ్యక్తం కానిది. నాశవంతమైనది. పంచవింశతితత్త్వాలతో కూడిన పురుషుడు ప్రకటస్వరూపుడు, క్షరము లేనివాడు. ఈ విషయం తెలిసినవాళ్ళు నిర్భయంగా ఉండగలరు. రాజా! యోగమునూ, సాంఖ్యమునూ అక్షరతత్త్వాన్ని, నీకు బోధించాను. ఇక 'విద్య - అవిద్య' అనగా ఏమిటో వివరిస్తాను వినుము.

విద్యావిద్యల ప్రకార నిరూపణము (సం.12-295-1)

ఆ. విద్యయనఁగఁ బంచవింశతితమ తత్త్వ । మైన యక్షరంబు మానవేంద్ర!
వినుఁ మవిద్య నాఁగఁ జనుఁ బ్రధానము, దేట । పఱిచెదను విశేషభంగు లెల్ల. 44

ప్రతిపదార్థం: మానవేంద్ర= మానవనాయకా!; విద్య+అనఁగన్= విద్య అంటే; పంచవింశతితమ తత్త్వము+ఐన= ఇరవై అయిదో తత్త్వమైన; అక్షరంబు= అక్షరమే; వినుము; ప్రధానము= ప్రకృతియే; అవిద్య నాఁగన్+చనున్= అవిద్య అనబడుతున్నది; విశేషభంగులు+ఎల్లన్= విశేష పద్ధతులన్నీ; తేటపఱిచెదను= స్పష్టపరుస్తాను.

తాత్పర్యం: ఓ మానవనాయకా! ఇరవై అయిదో తత్త్వమైన అక్షరమే విద్య. ప్రధానమూ అవ్యక్తమూ క్షేత్రమూ అనే పేర్లతో వ్యవహరింపబడే ప్రకృతియే అవిద్య. వీటిలో ఉన్న తక్కిన విశేషవిభాగాలు కూడా స్పష్టంగా చెప్పుతాను వినుము.

వ. కర్మేంద్రియంబులకు బుద్ధీంద్రియంబు విద్య, బుద్ధీంద్రియంబులకు మనస్సును, మనస్సునకు భూతపంచకంబును, భూతపంచకంబునకు నహంకారమును, నహంకారమునకు బుద్ధియు, బుద్ధికి నవ్యక్తంబును, నవ్యక్తంబునకుం బంచవింశతితమ తత్త్వంబును విద్య'లని చెప్పి వెండియు నమ్మునివరుం డిట్లనియె. 45

ప్రతిపదార్థం: కర్మేంద్రియంబులకున్= కర్మాచరణ చేసే ఇంద్రియాలకు; బుద్ధి+ఇంద్రియంబు= జ్ఞానేంద్రియం; విద్య; బుద్ధీంద్రియంబులకున్= జ్ఞానేంద్రియాలకు; మనస్సును= మనస్సు అనేది విద్య; మనస్సునకున్= ఈ మనస్సుకు; భూతపంచకంబును= పంచభూతాలు విద్య; భూత పంచకంబునకున్= పంచభూతాలకు; అహంకారమును= అహంకారమూ; అహంకారమునకున్= ఆ అహంకారానికి; బుద్ధియున్= బుద్ధి అనేదీ; బుద్ధికిన్= ఆ బుద్ధికి; అవ్యక్తంబును= అవ్యక్తము అనబడే ప్రకృతీ; అవ్యక్తంబునకున్= ఆ ప్రకృతికి; పంచవింశతితమతత్త్వంబును= ఇరవై అయిదవ తత్త్వమూ; విద్యలు= విద్యలు అవుతాయి; అని చెప్పి= ఇట్లా వివరించి; వెండియున్= తిరిగి; ఆ+మునివరుండు= ఆ వసిష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కర్మాచరణ చేసే ఇంద్రియాలకు జ్ఞానేంద్రియాలు, జ్ఞానేంద్రియాలకు మనస్సూ, మనస్సుకు పంచ భూతాలూ, పంచ భూతాలకు అహంకారమూ, అహంకారానికి బుద్ధీ, బుద్ధికి ప్రకృతీ, ఆ ప్రకృతికి ఇరవై అయిదవ తత్త్వమూ విద్యలు' అని చెప్పి, వసిష్ఠుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. 'క్షరము నక్షరమును ననఁ గలుగు రెంటి । నేర్పఱిచి మున్ను సెప్పితి నింక నొకటి
సెప్పఁ గలదు సమగ్రవిశేషకలిత । మవహితుండవై విను విదేహాధినాథ! 46

ప్రతిపదార్థం: విదేహాధినాథ!= విదేహరాజ్యధిపా - జనకమహారాజా!; క్షరము= క్షరతత్త్వమూ; అక్షరమును= అక్షరతత్త్వమూ; అనన్= అనే పేర్లతో; కలుగు= ఉన్నటువంటి; రెంటిన్= రెండింటినీ; ఏర్పఱిచి= విడమరిచి; మున్ను= ఇంతవరకూ; చెప్పితిన్= చెప్పాను; ఇంకన్+ఒకటి= మరొకటి; చెప్పన్= చెప్పటానికి; కలదు= ఉంది; సమగ్రవిశేషకలితము= అది పరిపూర్ణమైన విశేషంతో కూడినది; అవహితుండవై= సావధానుడవై; విను.

తాత్పర్యం: 'ఓ విదేహరాజా! క్షరమూ అక్షరమూ అనే తత్త్వాలను రెండింటినీ ఇంతవరకూ వివరించి చెప్పాను. ఇంకా చెప్పవలసింది మరొకటి ఉన్నది. అది సమగ్రవిశేషకలితం. సావధానుడవై వినుము.

సీ. జీవుండుఁ బ్రకృతియు భూవర! యక్షర । క్షరము లీ రెంటిని క్షరము లనియు
నార్యులు సెప్పుదు రక్షరంబులు నందు । రాద్యంతరహితంబు లగుట యీశ్వ
రత్వంబుగల్గుట తత్త్వాదికము లనఁ । జనుట రెంటికి సదృశంబు సూవె
ప్రకృతిగుణంబులై పరఁగెడు మహదహం । కారాదికంబులఁ గలసినపుడు

ఆ. క్షర మనంగ వచ్చుఁ బురుషునిఁ ప్రకృతిఁ దా । నని తలంచుఁగాన, నదియుఁ బురుషుఁ
బొంద గుణవికారములు లేమి నిర్గుణ । మక్షరం బనంగ నగును దాని. 47

ప్రతిపదార్థం: భూవర!= మహారాజా!; జీవుండున్= జీవుడూ; ప్రకృతియున్= ప్రకృతి అనేదీ; అక్షర క్షరములు= వరుసగా అక్షరమూ క్షరమూను; ఈ రెంటినిన్= ఈ రెండింటినీ; క్షరములు+అనియున్= కేవలం క్షరములు అని కూడా; ఆర్యులు= పెద్దలు; చెప్పుదురు= చెప్పుతుంటారు; అక్షరంబులున్ అందురు= అక్షరములు అని కూడా అంటారు; ఆద్యంత రహితంబులు అగుట= ఆదీ అంతమూ లేనివి కావటం; ఈశ్వరత్వంబు కల్గుట= ఈశ్వరత్వం ఉండటం; తత్త్వాదికములు+అనన్+చనుట= తత్త్వాదికాలు అని చెప్పటానికి తగినవి కావటం అనే ఈ లక్షణాలు; రెంటికిన్= జీవుడికీ, ప్రకృతికీ; సదృశంబు+చూవె= సమానం సుమా!; ప్రకృతిగుణంబులై= ప్రకృతిగుణాలుగా; పరఁగెడు= ఒప్పేటువంటి; మహత్+అహంకారాదికంబులన్= మహత్తు అహంకారం మొదలైనవాటితో; కలసినపుడు= కూడినప్పుడు(జీవుడు); ప్రకృతిన్= ప్రకృతిని; తాను+అని= తానే అని; తలంచున్‌గానన్= భావిస్తాడు కాబట్టి; పురుషునిన్= జీవుడిని; క్షరము అనంగన్ వచ్చున్= క్షరము అని కూడా అనవచ్చును; అదియున్= ఆ ప్రకృతికూడా; పురుషున్+పొందన్= జీవుడిని పొందినప్పుడు; గుణవికారములు= గుణసంబంధమైన వికారాలు; లేమిన్= లేకపోవటం వలన; నిర్గుణము= నిర్గుణమనీ; అక్షరంబు= అక్షరము అనీ; దానిన్= ఆ ప్రకృతిని; అనంగన్ అగును= చెప్పవచ్చును.

తాత్పర్యం: భూవరా! జీవుడిని అక్షరమనీ, ప్రకృతిని క్షరమనీ అంటారు. కొందరు పెద్దలు ఈ రెంటినీ 'క్షరములు' అన్నారు. మరికొందరు 'అక్షరములు' అన్నారు. ఆద్యంతాలు లేకపోవటం, ఈశ్వరతత్త్వాన్ని కలిగిఉండటం- ఇత్యాదులు జీవుడికీ ప్రకృతికీ ఉన్న సాదృశ్యాలు. మహదహంకారాది ప్రకృతిగుణాలను పొందినపుడు పురుషుడు (జీవుడు) తనను తాను ప్రకృతిగా భావిస్తాడు కనుక అతడిని 'క్షరము' అని కూడా అనవచ్చును. ఈ ప్రకృతి పురుషుడిని పొందినప్పుడు గుణవికారరహితంగా ఉంటుంది కాబట్టి అప్పుడు దానిని నిర్గుణమనీ అక్షరమనీ కూడా వ్యవహరించవచ్చును.

వ. ఎప్పుడు పురుషుండు ప్రబుద్ధుం డయ్యె నప్పు డతండు. 48

ప్రతిపదార్థం: ఎప్పుడు= ఎప్పుడయితే; పురుషుండు= జీవుడు; ప్రబుద్ధుండు+అయ్యెన్= ప్రబుద్ధుడు (జ్ఞాని) అవుతాడో; అప్పుడు; అతండు= ఆ జీవుడు.

తాత్పర్యం: జీవుడు ఎప్పుడయితే జ్ఞాని అవుతాడో అప్పుడు ఆ జీవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ఇంతకాలమేని యెఱుఁగక సంగాభి । భూతయగుచు నప్రబోధకలిత
యైనయట్టి ప్రకృతి యేనంటి నిస్సంగ । బోధమహిమఁగానఁ బోలదయ్యె. 49

ప్రతిపదార్థం: ఇంతకాలమేని= ఇంతకాలమయినా; ఎఱుఁగక= తెలియక; సంగాభిభూతయగుచున్= సాంగత్యసహిత అవుతూ; అప్రబోధకలిత+ఐనయట్టి= అజ్ఞానసహిత అయినటువంటి; ప్రకృతి= ప్రకృతియే; ఏను+అంటిన్= నేను అనుకున్నాను; నిస్సంగ బోధమహిమన్= నిస్సంగమహిమ, బోధమహిమ (సాంగత్య రహితతత్త్వమూ, జ్ఞానసహితతత్త్వమూ) - అనేవాటిని; కానన్+ పోలదు+ అయ్యెన్= తెలుసుకోలేకపోయాను.

తాత్పర్యం: సాంగత్యసహితమూ జ్ఞానరహితమూ అయిన ప్రకృతియే నేను అని ఇంతకాలమూ తెలియక అనుకొన్నాను. నిస్సంగమహిమనూ జ్ఞానమహిమనూ గుర్తించలేకపోయాను. (అని జీవుడు అనుకొంటాడట).

క. ప్రకృతికి నాకును నుదకము । నకు మత్స్యంబునకుఁ బోలె నైసర్గికమై
ప్రకటంబైనది వేర్పా । టకట! యహంకారవశత నది యే నంటిన్. 50

ప్రతిపదార్థం: ప్రకృతికిన్= ప్రకృతినీ; నాకునున్= నాకూ; ఉదకమునకున్ మత్స్యంబునకున్+పోలెన్= నీటికీ చేపకూ వలె; నైసర్గికమై= సహజసిద్ధమై; వేర్పాటు= విభిన్నత; ప్రకటంబైనది= స్పష్టంగా ఉంది; అకట!= అయ్యో!; అహంకారవశతన్= అహంకారానికి వశుడిని అవటంవలన; అది= ఆ ప్రకృతి; ఏను+అంటిన్= నేనే అనుకొన్నాను.

తాత్పర్యం: (ప్రబుద్ధుడైన పురుషుడు ఇంకా ఇట్లా అనుకొంటాడట). నీటికీ చేపకూ వలె ప్రకృతికీ నాకూ విభిన్నత అనేది సహజసిద్ధమై స్పష్టంగా భాసిస్తూనే ఉన్నది. అయినా అయ్యో! అహంకారంవలన నేనే ఆ ప్రకృతి అనుకొన్నాను సుమా!

విశేషం: నీరూ చేపా వేరు వేరు అన్న దృష్టాంతాన్ని వ్యాసుడే ఇచ్చాడు. **మత్స్యోऽన్యత్వం యథా జ్ఞానాదుదకాన్నాభిమన్యతే । ఆత్మానం తద్వదజ్ఞానాదన్యత్వం చైవ వేద్మ్యహమ్ ॥** (12-295-25). అజ్ఞానంతో చేప వలను అనుసరించినట్టుగా పురుషుడు ప్రకృతివెంట పడతాడనికూడా వ్యాసుడు చెప్పాడు. 'మత్స్యో జాలం హ్యవిజ్ఞానా దనువర్తితవాం స్తథా' (12-295-23).

క. ప్రకృతి గుణంబులఁ గొని బహు । వికృతపురూపముల నట్లు వెట్టిగొలిపె నే
నకలంకుండ నరూపుఁడఁ । బ్రకృతి దొఱఁగి నిలిచెదను నిరంజనమహిమన్. 51

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి; గుణంబులన్ కొని= సత్త్వాది గుణాలను స్వీకరించి; బహు= పలురకాలయిన; వికృతపురూపములన్= రూపవికారాలతో; అట్లు= ఆ విధంగా; వెట్టిగొలిపెన్= వ్యామోహపరచింది; (నిజానికి) నేను; అకలంకుండన్= కళంకరహితుడను; అరూపుఁడన్= రూపరహితుడను; ప్రకృతిన్ తొఱఁగి= ప్రకృతి విడిపించుకుని (విడిచిపెట్టి); నిరంజనమహిమన్= నిరంజనమహిమతో (అహంకారమమకార రహితస్థితిలో); నిలిచెదను= నిలుస్తాను.

తాత్పర్యం: ప్రకృతి తన గుణవికారాలతో లోభపెట్టి ఇంతకాలమూ నన్ను వెర్రివాడిని చేసింది. నిజానికి నేను కళంకరహితుడను, రూపరహితుడను, ఈ ప్రకృతిని విడిచి నిర్మముడనూ, నిరహంకారుడనూ అయి శాశ్వతంగా నిలుస్తాను. అక్షరత్వం పొందుతాను.

తే. ప్రకృతి సేసెనె యీ యపరాధ మరయ? । నాయదియకాక వే ఱొకండే? యసంగ
కలితుఁడగు నేను దానితోఁ గలియనేల? । కలిగె బహురూపములు దానఁగాదె నాకు. 52

ప్రతిపదార్థం: ఈ అపరాధము= ఈ అపరాధాన్ని; ప్రకృతి చేసెనె?= నిజంగా ప్రకృతియే చేసిందా?; అరయన్= ఆలోచించి చూస్తే; నా+అదియకాక= ఇది నా అపరాధమే కాక; వేఱొకండే?= వేరొకటా?; అసంగకలితుఁడు+అగు= సాంగత్యరహితుడను అయిన; నేను= నేను(జీవుడు లేక పురుషుడు); దానితోన్= ఆ ప్రకృతితో; కలియన్+ఏల?= కలవటం ఎందుకు?; నాకున్= నాకు; బహురూపములు= అనేకరూపాలు; కలిగెన్= కలగటం; దానన్ కాదె!= దానివల్లనే కదా!

తాత్పర్యం: నిజంగా ఈ అపరాధం ప్రకృతివలననే జరిగిందా? కాదు. దోషమంతా నాదే. అసంగుడను అయిన నేను అసలు ప్రకృతితో ఎందుకు కలిశాను?అట్లా నేనై కలిసినందువలననే కదా ఈ అనేకరూపత కలిగింది నాకు!

క. మమతంగాదే బహు జ । న్మములయ్యెడు! దీని విడిచి నానాయోని
భ్రమణంబుం బాసెద న । త్యములుఁడ నగు నాకుఁ బ్రకృతి యాశ్రయ మేలా? 53

ప్రతిపదార్థం: మమతన్ కాదె= మమకారం వల్లనే కదా; బహుజన్మములు+అయ్యెడున్!= బహుజన్మలు కలుగుతున్నాయి!; దీనిన్= ఈ మమకారాన్ని; విడిచి= పరిత్యజించి; నానాయోని భ్రమణంబున్= పలు జాతులలో జన్మించటమనే ఈ తిరుగుడును; పాసెదన్= తొలగించుకుంటాను, అతి+అమలుఁడన్+అగు= పూర్తిగా నిర్మలుడను అయిన; నాకున్= నాకు; ప్రకృతి ఆశ్రయము= ప్రకృతిని ఆశ్రయించటమనే ఈ లక్షణం; ఎలా?= ఎందుకూ?

తాత్పర్యం: మమకారంవలన బహుజన్మలు కలుగుతున్నాయి. దానిని వదలించుకొన్నాను - అంటే ఈ నానా జన్మభ్రమణం తొలగిపోతుంది. సహజంగా నేను (పురుషుడు - జీవుడు) నిర్మలుడను. ప్రకృతిని ఆశ్రయించటం అనే ఈ లక్షణం నాకెందుకు? అనవసరం.

తే. ఎన్ని రూపులు గొనివచ్చి యెట్లు పాడవు । సూపెనేనియుఁ బ్రకృతినేఁ జూడ మమత
నా నహంకారమనఁ గల్గు వానిఁ జేర । నీక త్రోచినఁ బ్రకృతి దానెట్లు దోఁచు? 54

ప్రతిపదార్థం: ఎన్నిరూపులు= ఎన్ని రూపాలను; కొని= ధరించి; వచ్చి= ప్రత్యక్షమై; పాడవున్+చూపెన్+ఏనియున్= విజృంభణను చూపించినా; ప్రకృతిన్= ఈప్రకృతిలో; ఏన్+చూడన్= నేను పరిశీలిస్తే; మమత+నాన్= మమకారం అనీ; అహంకారము+అనన్= అహంకారం అనీ; కల్గున్= రెండు ఉన్నాయి; వానిన్= ఆ రెండింటినీ; చేరనీక= దగ్గరకు రానివ్వకుండా; త్రోచినన్= పరిహరించినట్లయితే; ప్రకృతి= ఈ ప్రకృతి; తాను= అది; ఎట్లుతోఁచున్?= ఇంక ఎలా నన్ను వశపరచుకుంటుంది? (వశపరచుకోదు).

తాత్పర్యం: ఎన్ని రూపాలలో ఈ ప్రకృతి విజృంభించినా మమకారం, అహంకారం అనేవి రెండే దీని మూలతత్వాలు. ఇవి రెండూ పరిహరించగలిగితే ఇంక ఈ ప్రకృతి పురుషుడిని ఏమీ చేయలేదు.

క. నిశ్చేతనయును నెంతయు । దుశ్చేష్టయునైన ప్రకృతి దొఱఁగి సముద్య
న్నిశ్చయవృత్తి నిరామయ । నిశ్చలనిర్మల పదైక నిరతుఁడ నగుదున్.' 55

ప్రతిపదార్థం: నిశ్చేతనయున్= చైతన్యరహితమూ; ఎంతయున్= మిక్కిలి; దుశ్చేష్టయున్+అయిన= దుశ్చేష్టాసహితమూ అయిన; ప్రకృతిన్= ఈ ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; సముద్యత్= విజృంభిస్తున్న; నిశ్చయవృత్తిన్= నిశ్చయ ప్రవృత్తితో (నేను= నేను); నిరామయ= ఆమయ రహితమూ (రోగాదికాలు లేనిది); నిశ్చల= నిశ్చలమూ; నిర్మల= మలిన రహితమూ అయిన; పద+ఏక+నిరతుఁడన్= స్థానం పట్ల మాత్రమే ఆసక్తి కలవాడను; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: నిశ్చేతనతా దుశ్చేష్టతలు ప్రకృతి లక్షణాలు. అటువంటి ప్రకృతిని విడిచిపెట్టివేయాలి. అప్పుడు నిశ్చయవృత్తితో నిరామయ నిశ్చల నిర్మలపదాన్ని పొందగలుగుతాను'.

వ. అని యిట్లు పరబోధనంబునం జేసి క్షరంబగు నవ్యక్తంబు దొఱంగిన పంచవింశకుం డక్షరం బనం బరఁగు, నక్షరంబునకుం బరంబైన దానిం బెక్కండ్రఱుంగరు, సాంఖ్యసూక్ష్మత్వదర్శకులు గాంతురు, క్షరాక్షర పరంబు లప్రబుద్ధబుధ్యమాన బుద్ధంబులను నిర్దేశంబులు గలిగియుండుఁ, బరతత్త్వనిర్దేశంబునం బొల్చు షడ్వింశకంబు బుద్ధంబును విమలంబును నప్రమేయంబును సనాతనంబునునై పంచవింశంబును జతుర్వింశంబునుం గనుచు వెలుంగు నని చెప్పి వెండియు. 56

ప్రతిపదార్థం: అని+ఇట్లు= ఈ ప్రకారంగా; పరబోధనంబునన్+చేసి= ఉత్తమ జ్ఞానంవలన; క్షరంబు+అగు= నశించేదైన; అవ్యక్తంబున్= ప్రకృతిని; తొఱంగిన= విడిచిపెట్టిన; పంచవింశకుండు= ఇరవై అయిదవ తత్త్వమైన పురుషుడు (జీవుడు); అక్షరంబు+అనన్= 'అక్షరము' అని; పరఁగున్= అలరారుతాడు; అక్షరంబునకున్= ఈ అక్షరతత్త్వానికన్నా; పరంబు+అయిన+దానిన్= ఉత్తమమైన దానిని (పైది) (నాశనము లేనివాడు); పెక్కండ్రు= చాలామంది; ఎఱుంగరు= ఎరుగరు; సాంఖ్యసూక్ష్మత్వ దర్శకులు= సాంఖ్యశాస్త్రంలో ఉన్న సూక్ష్మతత్త్వాన్ని గ్రహించగలిగినవారు మాత్రమే; కాంతురు= గ్రహిస్తారు; క్షర+అక్షర+పరంబులు= క్షరమూ, అక్షరమూ పరమూ అనే ఈ మూడూ; అప్రబుద్ధ+బుధ్యమాన+బుద్ధంబులు= అప్రబుద్ధమూ,(తెలుసుకోబడనిది) బుధ్యమానమూ (తెలుసుకొంటున్నది); బుద్ధమూ; (తెలుసుకోబడినది) అను= అనేటటువంటి; నిర్దేశంబులు= పేర్లు; కలిగియుండున్= కలిగిఉంటాయి; పరతత్త్వనిర్దేశంబునన్= పరతత్త్వం అనే పేరుతో; పొల్చు= ఉండేటటువంటి; షడ్వింశకంబు= ఈ ఇరవై ఆరవతత్త్వం; బుద్ధంబును= బుద్ధమూ (జ్ఞానసంపన్నం); విమలంబును= (మలినరహితం) విమలమూ; అప్రమేయంబును= కొలతకు అందనిదీ; అప్రమేయమూ; సనాతనంబును+ఐ= సనాతనమూ అయి; పంచవింశంబును= ఇరవై అయిదవ తత్త్వాన్నీ; చతుర్వింశంబును= ఇరవై నాల్గవతత్త్వాన్నీ; కనుచున్= దర్శిస్తూ; వెలుంగున్= ప్రకాశిస్తుంది; అని చెప్పి= అని వసిష్ఠుడు వివరించి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని ఈ విధంగా ఉత్తమ జ్ఞానం వల్ల నశించే ప్రకృతిని విడిచిపెట్టిన పురుషుడు (ఇరవై అయిదవతత్త్వం) అక్షరు డనబడతాడు. దీనికంటె పైన ఉన్న ఉత్తమతత్త్వాన్ని చాలామంది ఎరుగరు. సాంఖ్యులు తప్ప. క్షరుడు, అక్షరుడు, ఉత్తముడు; వీరు అప్రబద్దులు (తెలుసుకోబడనివారు)ఇరవై ఆరవతత్త్వం పురుషతత్త్వం. వరుసగా ఇవి - తెలిసికొనబడనిది, తెలిసికొంటున్నది, తెలియబడినదీను, చివరిది (పరతత్త్వం) జ్ఞానసంపన్నం, శుద్ధం, కొలతకు అందనిదీ, శాశ్వతమైనదీను. ఇది ఇరవై అయిదవతత్త్వాన్ని, ఇరవై నాలగవతత్వాన్ని దర్శిస్తూ వెలుగొందుతుంది.

క. 'వినుఁ దృశ్యంబు నదృశ్యం । బును నగు జీవ పరతత్త్వములు బ్రహ్మసమా
ఖ్యను నెగడుఁ బ్రకృతి కది లే । దనఘా! యక్షరము తెఱఁగు నభివర్ణింతున్. 57

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడవైన జనకమహారాజా!; వినుఁ; దృశ్యంబున్= దృశ్యమూ; అదృశ్యంబును= అదృశ్యమూ; అగు= అయిన; జీవ-పరతత్త్వములు= జీవతత్త్వం, పరతత్త్వం అనేవి (ఈ జీవుడూ పరుడూ); బ్రహ్మసమాఖ్యను= బ్రహ్మ(తత్త్వం) అనే పేరుతో; నెగడున్= ఒప్పారుతుంటాయి; ప్రకృతికిన్= ప్రకృతికి; అది లేదు= ఆ పేరు లేదు; అక్షరము తెఱఁగున్= అక్షరతత్త్వంయొక్క పద్ధతిని; అభివర్ణింతున్= వివరిస్తాను.

తాత్పర్యం: దృశ్యమూ అదృశ్యమూ అయిన ఈ జీవతత్త్వపరతత్త్వాలకు 'బ్రహ్మము' అనే పేరుకూడా ఉన్నది. ప్రకృతికి అది లేదు. ఇంక అక్షరతత్త్వాన్ని వివరిస్తాను తెలిసికొనుము.

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బరికించు జీవుండు । పరముఁ గాంచునపుడు ప్రకృతి సగుణ
తానిరూఢి యడఁగి తన్మయత్వము నొంది । జీవకేవలత్వసిద్ధి యొలయు. 58

ప్రతిపదార్థం: ప్రకృతిన్= ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; తన్నున్= తనను తాను; పరికించు= దర్శించేటువంటి; జీవుండు= జీవుడు (పురుషుడు); పరమున్= పరతత్త్వాన్ని (ఇరవై ఆరవది); కాంచునపుడు= తెలుసుకొనేటప్పుడు; ప్రకృతి= ప్రకృతి తాలూకు; సగుణతానిరూఢి= సగుణత్వస్థూర్తి; అడఁగి= నశించి; తద్+మయత్వమున్ ఒంది= తన్మయత్వాన్ని పొంది; జీవకేవలత్వసిద్ధి= జీవుడియొక్క కేవలతా సిద్ధి (నేను ప్రకృతికాదు. కేవలమూ జీవుడిని అనే స్థితిని); ఒలయున్= పొందుతాడు.

తాత్పర్యం: ప్రకృతిని విడిచిపెట్టేసి, జీవుడు తనను తాను తెలిసికొని, పరతత్త్వాన్ని దర్శించేటప్పుడు ప్రకృతి తాలూకు సగుణత్వస్థితి నశించిపోతుంది. తన్మయత్వాన్ని పొంది ఈ పురుషుడు తన కేవల జీవతత్త్వసిద్ధిని గ్రహిస్తాడు.

క. వినుఁ కేవలుఁడగు జీవుఁడు । దనుఁ బరముంగాఁగఁ జూచి తల్లీనత్వం
బున వెలుఁగు నది నిరామయ । మనంతమగు పదముసూవె యతులవివేకా! 59

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని వివేకంకలవాడా!; వినుఁ; కేవలుఁడు+అగు+జీవుఁడు= కేవలత్వసిద్ధిని పొందిన జీవుడు; తనున్= తనను తాను; పరమున్+కాఁగన్= పరతత్త్వంగా; చూచి= దర్శించి; తద్+లీనత్వంబునన్= తన్మయత్వంతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు (పరతత్త్వమయుడు అవుతాడు); అది= ఆ స్థితి; నిరామయము= ఆ మయరహితమూ; అనంతము+అగు= అనంతమూ అయిన పదము+చూవె= స్థానం సుమా!

తాత్పర్యం: తన కేవలత్వాన్ని గుర్తించిన జీవుడు తనను తాను పరతత్త్వంగా దర్శించి తల్లీనుడవుతాడు. అదే నిరామయమూ అనంతమూ అయిన పదం సుమా!

క. ఈ నెఱి పురుషునకుం గల । నానాత్వైకత్వములును నరనాయక! శా
స్త్రానూన దృష్టిఁ గనుఁగొనఁ । గా నగుఁ దాత్పర్యశుద్ధి కలితాత్మునకున్. 60

ప్రతిపదార్థం: నరనాయక= ఓ జనకమహారాజా!; ఈ నెఱిన్= ఈ విధంగా (ఈ ఉపాయంతో); పురుషునకున్ కల= పురుషుడికి (జీవుడు) ఉన్న; నానాత్వ+ఏకత్వములును= అనేకత్వమూ ఏకత్వమూ అనేవి; శాస్త్ర+అనూనదృష్టిన్= శాస్త్రం తాలూకు మహోన్నత దృష్టితో; తాత్పర్యశుద్ధికలిత+ఆత్మునకున్= శ్రద్ధకలిగినవాడికి; కనుఁగొనఁగాన్+అగున్= తెలుసుకోవటం సాధ్యమవుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! పురుషుడికి సంబంధించిన ఏకత్వం, అనేకత్వం అనేవాటిని శాస్త్రమర్యాదతో ఈ విధంగా తెలిసికొనవచ్చును. శ్రద్ధ ఉన్నవాడు ఇవి గ్రహించగలుగుతాడు.

క. అనఘా! మోక్షము తెఱఁ గిది । వినుఁ మోక్షణమిట్లు పంచవింశునకుఁ గాఁ
గనినది యతండు ప్రకృతిం । దనుగాఁ గొని తద్గుణములఁ దగులుట వలనన్. 61

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పావనుడా! వినుఁ; మోక్షము తెఱఁగు= మోక్షంతాలూకు పద్ధతి; ఇది= ఇదీ; ఇట్లు; మోక్షణము= (విడుదల) మోక్షం అనేది; పంచవింశునకుఁగాన్= ఇరవై అయిదవ తత్త్వమయిన జీవుడికోసమని; కనినది= ఏర్పడింది, దర్శింపబడింది; అతండు= ఆ జీవుడు (పురుషుడు); ప్రకృతిన్= ఈ ప్రకృతిని; తనున్+కాన్= తానుగా; కొని= సంభవించి, స్వీకరించి; తద్+గుణములన్= ఆ ప్రకృతిగుణాలలో (మమకారాహంకారాదుల్లో); తగులుటవలనన్= తగుల్కోవటంవలన (అతడికి వాటినుంచి మోక్షణం అవసరమయ్యింది అని అన్వయం.)

తాత్పర్యం: పరమపావనుడా! ఇది మోక్ష పద్ధతికి. పంచవింశుడైన పురుషుడికే మోక్షం అనేది. ఈ జీవుడు తనను ప్రకృతిగా భావించి దాని గుణాలలో తగుల్కొని ఉంటాడు కాబట్టి అతడికి వాటినుంచి మోక్షణం (విడుదల) అవసరమవుతుంది.

తే. తగులువాసి షడ్వింశకత్వమునఁ గలియఁ । దనకు మును లేని కేవలత్వమును నిర్మ
లత్వ శుచితా స్వతంత్రత్వ సత్వపరత । లొందుఁ దద్ధర్మ సమవాయ మొలసి యధిప!' 62

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తగులున్+పాసి= అహంకార మమకారాలనే ప్రకృతి గుణాల్లో తగుల్కొన్న స్థితిని విడిచిపెట్టి (ఈ జీవుడు); షడ్వింశకత్వమునన్= ఇరవై ఆరవ తత్త్వంలో (పరంలో); కలియన్= ఐక్యం పొందినట్టయితే; తనకున్= తనకు; మునులేని= అంతవరకూ లేని; కేవలత్వమును= కేవలత్వం; నిర్మలత్వ= నిర్మలత్వం; శుచితా= శుచిత్వం; స్వతంత్రత్వ సత్వపరతలు= స్వతంత్రత్వం, సత్వ పరత్వం అనేవి; తద్+ధర్మ+సమవాయము+ఒలసి= ఆ ధర్మసముదాయంతో ఐక్యం జెంది (అవిభాజ్యంగా); ఒందున్= కేవలత్వాదులను పొందుతాడు.

తాత్పర్యం: ప్రకృతితో తనకున్న తగులును విడిచిపెట్టి పురుషుడు ఇరవై ఆరవతత్త్వంతో కలిసినట్టయితే అతడు తనకు అంతకు ముందు లేని కేవలత్వనిర్మలత్వాది పరతత్త్వలక్షణాలను పొందుతాడు. వాటితో సమైక్యంచెందుతాడు'

వ. అని యిట్లు ప్రబోధించి. **63**

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ ప్రకారంగా; ప్రబోధించి= బోధపరచి - వసిష్ఠుడు ఇంకా కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా బోధించి, వసిష్ఠుడు ఇంకా ఇట్లా చెప్పాడు.

క. 'శివమును బరమ బ్రహ్మము। నవికృతియు సనాతనంబు నగు పదమును భూ
ధవ! యెఱిఁగించితి నిర్భయుఁ। డవు గ మ్ములవఱపు మిది దృఢంబుగ నాత్మన్. **64**

ప్రతిపదార్థం: భూధవ!= ఓ రాజా!; శివమును= శుభప్రదమూ; పరమబ్రహ్మమున్= పరబ్రహ్మమూ; అవికృతియున్= వికారాలు లేనిదీ; సనాతనంబున్= సదాతనమూ (ఎల్లకాలమూ ఉండేది); అగు= అయిన; పదమును= స్థానాన్ని - పరమపదాన్ని; ఎఱిఁగించితిన్= నీకు తెలియజేశాను; ఇది= ఈ తత్త్వాన్ని; ఆత్మన్= నీ ఆత్మలో; దృఢంబుగన్= గట్టిగా; అలవఱుపుము= అలవరుచుకో; నిర్భయుఁడవు కమ్ము= భయరహితుడవు కమ్ము.

తాత్పర్యం: 'జనకమహారాజా! శివమూ, పరబ్రహ్మమూ, వికారరహితమూ, సనాతనమూ అయిన పదాన్ని తెలియజేశాను. దీనిని నీవు స్థిరచిత్తంతో అలవరచుకొమ్ము. అందువలన నిర్భయుడవు అవుతావు.

తే. దీని నెఱిఁగించునపుడు భక్తియును శమము। దమము సంశ్రయమును వేదతత్పరతయుఁ
గలుగఁజూచి యెఱింగింపు కానివాని। కీకుమా విద్య పాత్రదానైక నిరతి **65**

ప్రతిపదార్థం: దీనిన్= ఈ విద్యను; ఎఱిఁగించునపుడు= నీవు ఎవరికైనా తెలియజెప్పాలనుకుంటే; భక్తియున్= భక్తి; శమము= అంతరింద్రియ నిగ్రహం; దమము= బాహ్యేంద్రియనిగ్రహం; సంశ్రయమును= అనన్యచిత్తంతో శరణాగతిగా ఆశ్రయించటం; వేదతత్పరతయున్= వేదాలపట్ల భక్తితాత్పర్యాలు; కలుగన్+చూచి= ఉండటాన్ని గమనించి కలవాడవై; పాత్రదాన+ఏక+నిరత= పాత్రుడికే దానం చెయ్యాలి అనే నియమం కలవాడా!; ఎఱింగింపు= అటువంటివాడికే తెలియజెప్పుము; కానివానికిన్= ఈ లక్షణాలు లేని అనర్హుడికి; విద్యన్= ఈ సాంఖ్యవిద్యను; ఈకుమా!= ఇవ్వకు సుమా!

తాత్పర్యం: మహారాజా! నీకు ఇంతవరకూ తెలియజెప్పిన ఈ విద్యను నీవు మరెవరికయినా తెలియజెప్పాలని-అనుకొంటే అవతలి వ్యక్తి అర్హతానర్హతలు గమనించి వ్యవహరించుము. భక్తి, నిగ్రహం, సంశ్రయణం, వేదాలపట్ల గౌరవం - ఈ లక్షణాలు ఉన్నవాడికే ఉపదేశించుము. పాత్రత ఎరిగికదా దానం చేయుమన్నారు! ఈ లక్షణాలు లేని అపాత్రుడికి ఈ విద్యను ఉపదేశం చేయకుము సుమా!

ఆ. అఖిల రత్నపూర్ణయగు వసుంధర యెల్ల। నొసఁగితేని నొసఁగు యోగ్యతాభి
యుక్తిలేనివాని కొసఁగకు మీ విద్య। తగిన పాత్రమైనఁ దడయ కిమ్ము.' **66**

ప్రతిపదార్థం: రాజా! అఖిల= సమస్తమైన; రత్న= రత్నాలతో; పూర్ణయగు= నిండినదైన; వసుంధర ఎల్లన్= భూమినంతటినీ; ఒసఁగితేనిన్ ఒసఁగు= ఇస్తే ఇమ్ము; యోగ్యతా+అభియుక్తి లేనివానికిన్= నిగ్రహాదియోగ్యతల కూడిక లేనివాడికి మాత్రం; ఈ విద్యన్= ఈ సాంఖ్య విద్యను; ఒసఁగకుము= ఇవ్వకు; తగిన పాత్రము ఐనన్= తగిన యోగ్యుడు (అర్హుడు) అయినట్టయితే; తడయక= ఆలస్యం చేయకుండా వెంటనే; ఇమ్ము= ఉపదేశించుము.

తాత్పర్యం: మహారాజా! యోగ్యతాయోగ్యతలు చూడకుండా ఎవడికి ఇవ్వాలనుకొంటే వాడికి సామ్రాజ్యమంతా ఇచ్చివేయుము. నేను కాదనను. కానీ, ఈ విద్యనుమాత్రం పైని పేర్కొన్న యోగ్యతలు లేనివాడికి దయచేసి ఎప్పుడూ ఇవ్వవద్దు. అర్హుడు అయినట్లయితే మరి ఆలస్యం చేయకుండా వాడికి ఉపదేశించుము'.

క. 'అని చెప్పె, నియతుఁడై విని । జనకనృపాలుఁడు కృతార్థజన్ముం డయ్యెన్
మనుజేంద్రవర్య నీకే । వినిపించితిఁ దదితిహాస విధ మేర్పడఁగన్.' 67

ప్రతిపదార్థం: అని చెప్పెన్= ఈ ప్రకారంగా వసిష్ఠుడు చెప్పాడు; జనక నృపాలుఁడు= జనకమహారాజు; నియతుఁడై= నియమనిష్ఠలు కలవాడై; విని= అంతా శ్రద్ధగా విని; కృతార్థజన్ముండు= చరితార్థమైన జన్మకలవాడు; అయ్యెన్= అయ్యాడు; మనుజేంద్రవర్య!= ఓ రాజశ్రేష్ఠుడా ధర్మరాజా!; తద్= ఆ; ఇతిహాస= జనకవసిష్ఠులమధ్య జరిగిన వృత్తాంతంయొక్క; విధము= వరుస అంతా; ఏర్పడఁగన్= స్పష్టపడేట్టు; నీకున్= నీకు; ఏన్= నేను; వినిపించితిన్= వివరించాను.

తాత్పర్యం: జనకమహారాజు నియమనిష్ఠలతో వసిష్ఠుడు చెప్పినది అంతా విని జన్మ చరితార్థతను పొందాడు. ఓ ధర్మరాజా! ఆ జరిగిన కథ అంతా నీకు నేను స్పష్టంగా వివరించి చెప్పాను.'

వ. అని పలికి భీష్ముఁడు పాండవాగ్రజున కిట్లనియె. 68

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముఁడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. 'ఇది బ్రహ్మ వసిష్ఠునకున్ । సదయుండై చెప్పె నతఁడు నారదునకు సం
విదితంబు నేసె నమ్మని । మదాత్మకుం దేటపఱిచె మహనీయకృపన్. 69

ప్రతిపదార్థం: (ధర్మరాజా!) ఇది= ఈ సాంఖ్యరహస్యాన్ని; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; వసిష్ఠునకున్= వసిష్ఠుడికి; సదయుండై= దయ కలవాడై; చెప్పెన్= తెలియజెప్పాడు; అతఁడు= ఆ వసిష్ఠుడు; నారదునకున్= నారదమహర్షికి; సంవిదితంబున్ చేసెన్= ఎరుక పరిచాడు; ఆ+ముని= ఆ నారదముని; మద్+ఆత్మకున్= నా ఆత్మకు (అంతరంగానికి); మహనీయకృపన్= గొప్ప దయతో; తేటపఱిచెన్= స్పష్టపరిచాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! మొట్టమొదటిగా ఈ తత్త్వరహస్యాన్ని బ్రహ్మదేవుడు వసిష్ఠుడికి తెలియజేశాడు. వసిష్ఠుడు నారదుడికి వివరించాడు. ఆ నారదుడేమో దయతో నాకు ఉపదేశించాడు.

క. ఏను వసిష్ఠవచనముల । కానెఱిఁగించితి మనంబు కలఁక విడిచి యీ
జ్ఞానం బలవఱుపుము పర । మానందప్రదము కౌరవాన్వయముఖ్యా! 70

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ+ముఖ్యా!= కౌరవవంశంలో ప్రధానుడా!; ధర్మరాజా! ఏను= నేను; వసిష్ఠ వచనములు+అ కాన్= వసిష్ఠుని మాటలుగానే (అ కాన్= వలె); ఎఱిఁగించితిన్= నీకు తెలియజెప్పాను; మనంబు(యొక్క) కలఁకన్= దిగులును; విడిచి= విడిచిపెట్టి; ఈ జ్ఞానంబు= నేను ఇంతవరకూ ఉపదేశించిన ఈ విద్యను; అలవఱుపుము= అభ్యాసంలోకి తెచ్చుకొమ్ము; పరమ+ఆనంద ప్రదము= (ఇది) బ్రహ్మానందాన్ని (ఇస్తుంది) ఇచ్చేది.

తాత్పర్యం: పాండవాగ్రజా! నాకు నారదుడు ఉపదేశించిన ఈ విద్యను నీకు (జనక వసిష్ఠుల సంభాషణగా) వసిష్ఠుడి మాటలుగా తెలియజెప్పాను. మానసికమైన కలతను విడిచిపెట్టి, ఈ జ్ఞానాన్ని అలవరచుకొమ్ము. ఇది పరమానందాన్ని సమకూరుస్తుంది.

క. క్షరమును నక్షరమును ద । త్పరమును నెఱిఁగితి విశోకభయమోహుఁడవై
కురువర! యా నిశ్రేయస । కరప్రబోధంబు నూఁదు గాఢాదరతన్.' 71

ప్రతిపదార్థం: కురువర!= ఓ కురువంశోత్తమా! ధర్మారాజా!; క్షరమును= క్షరతత్త్వం; అక్షరమును= అక్షరతత్త్వం; తద్ పరమును= వాటికంటే పై దయిన పరతత్త్వం - వీటిని; ఎఱిఁగితి(వి)= తెలుసుకున్నావు; విశోకభయమోహుఁడవై= శోకం, భయం, మోహం అనేవి విగళితమైపోయినవాడవై; ఆ= నేను వివరించిన; నిశ్రేయసకర= మోక్షప్రదమయిన; ప్రబోధంబున్= జ్ఞానాన్ని; గాఢ+ఆదరతన్= మిక్కిలి ఆదరంతో; ఊఁదు(ము)= అవలంబించుము.

తాత్పర్యం: ఓ కురువరా! క్షర, అక్షర పరతత్త్వాల గురించి తెలిసికొన్నావు. శోకం, భయం, మోహం అనేవి నీకు పోయి ఉంటాయి. మోక్షప్రదమైన ఆ విద్యను గాఢమైన ఆదరంతో అవలంబించుము'.

వ. అని చెప్పి వెండియు. 72

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇలా వివరించి; వెండియున్= తిరిగి - భీష్ముడే ఇంకా ఇట్లా కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఇట్లా వివరించి, తిరిగి ఇట్లా కొనసాగిస్తున్నాడు.

సీ. 'వేఁట వేడుక నడవికిఁ జని వసుమంతుఁ । డనువాఁడు జనకుని తనయుఁడొక్క
చో భృగువంశతేజో వర్ధనుండగు । నొక మునీశ్వరుఁ జూచి యుచితవృత్తిఁ
జేరి వినమ్రుఁడై 'చిత్తానువృత్తిమై । నిహపరంబుల కెద్ది హితము సెప్ప
వే' యన్నఁ గృప నతండిట్లను - భూతహి । తాహితాచరణంబు లధిప! సౌఖ్య

ఆ. దుఃఖముల నొనర్చు దుర్వార తృష్ణ త । న్నిరసనంబు మేలు నరులు జుంటి
చవియకాని నెగులుఁ జఱి రయంబున నెక్కి। తారు విఱుగఁబడుటఁ దలఁప లేరు. 73

ప్రతిపదార్థం: జనకుని తనయుఁడు= జనకుని కుమారుడైన; వసుమంతుఁడు+అనువాఁడు= వసుమంతుడు అనే వ్యక్తి; వేఁటవేడుకన్= వేటపట్ల ఉన్న వేడుకతో; అడవికిన్ చని= అరణ్యానికి వెళ్ళి; ఒక్కచోన్= ఆ అడవిలో ఒకచోట; భృగువంశతేజోవర్ధనుండు+అగు= భృగువంశ తేజస్సును వృద్ధి పరిచేవాడైన; ఒక మునీశ్వరున్= ఒక మునీశ్వరుడిని; చూచి= దర్శించి; ఉచితవృత్తిన్= తగిన పద్ధతితో (ప్రవర్తనతో); చేరి= సమీపించి; వినమ్రుఁడై= వినయంతో వంగినవాడై; చిత్త+అనువృత్తిమైన్= చిత్తాన్ని అనుసరించి; ఇహపరంబులకున్= ఇహపరాలకు; ఎద్ది= ఏది; హితము= హితమో; చెప్పవే= వివరింపవా'; అన్నన్= అని అడిగేసరికి; కృపన్= దయతో; అతండు= ఆ భృగువంశమునీశ్వరుడు; ఇట్లు+అనున్= ఇలా చెప్పాడు; అధిప!= రాజా! (జనకరాజపుత్రా!) వసుమంతుడా!; భూత= ప్రాణులకు-లేదా పంచభూతాలకూ; హిత= మేలు; అహిత= కీడు; ఆచరణంబులు= చెయ్యటాలు; సౌఖ్య - దుఃఖములన్= సౌఖ్యాన్నీ, దుఃఖాన్నీ; ఒనర్చున్= కలిగిస్తాయి; దుర్వార= వారింపరానిదైన; తృష్ణ= ఇచ్ఛకలిగి ఉండటం; తద్= అది (దానిని); నిరసనంబు= నిరసించటం; మేలు= హితం; నరులు= జీవులు; జుంటి= తేనెయొక్క; చవియకాని= రుచినేకానీ; నెగులున్= శ్రమనూ (దుఃఖాన్నీ); చఱి= కొండచరియను; రయంబునన్= వేగంగా; ఎక్కి= అధిరోహించి; తారు= తాము; విఱుగన్+పడుటన్= విరిగిపడిపోవటాన్నీ; తలఁపన్ లేరు= ఊహించలేరు.

తాత్పర్యం: 'ధర్మరాజా! జనకుడి కుమారుడైన వసుమంతుడు ఒకరోజున వేటకొరకు అడవికి వెళ్ళి అక్కడ ఒకచోట భృగువంశమునీశ్వరుడిని చూచి వినయంగా 'స్వామీ! ఇహపరాలకు హితం ఏదో తెలియచెప్పవా?' అని అడిగాడు. అప్పుడు ఆ మునీశ్వరుడు ఇట్లా అన్నాడు. 'వసుమంతుడా! మనం చేసే హితాహితకార్యాలు సౌఖ్యాన్నీ దుఃఖాన్నీ

ఇస్తాయి. (హితకార్యాలు సౌఖ్యాన్నీ, అహితకార్యాలు దుఃఖాన్నీ ఇస్తాయి). అందుచేత అవి చేయాలి - అనే తృష్ణను విడిచిపెట్టుకొనటం మంచిది. మానవులు ఎట్లాంటివాళ్ళంటే - తేనె రుచిమీద కోరికేకానీ దాన్ని సంపాదించటంలో ఉన్న శ్రమమీద ధ్యాస ఉండదు. దానికొరకు కొండచరియలు ఎక్కుతున్నాం అనుకొంటారే తప్ప ఆనక అక్కడనుండి జారిపడతాం - అనే విషయం తలచుకోరు.

విశేషం: 'దుర్వారతృష్ణతన్నిరసనంబు' అనేది వావిళ్ళవారి ప్రతిలో ఉన్నపాఠం. 'దుర్వారతృష్ణితన్నిరసనంబు' అనేది సంశోధితభారతప్రతిలో ఉన్న పాఠం. 'స్వాదుకాముక! కామానాం వైతృష్ణ్యం కిం న గచ్ఛసి (12-297-7)' కోరికలపట్ల వైముఖ్యం ఎందుకుపొందవు? - అనేది వ్యాసభారతం. తృష్ణతన్ లేదా తృష్ణితన్+నిరసనంబు అని విభజించినా అర్థం కిట్టించవచ్చును. దుర్వారతృష్ణ లేదా తృష్ణి+తన్నిరసనంబు అని సమాసాలుగా విభజిస్తే అన్వయం ఇంకా సులువుగా కుదురుతుంది. కానీ, అప్పుడు 'దన్నిరసనంబు' కావాలి. ఈ పాఠం ఎక్కడా లేదు. అందుచేత ఇక్కడ 'తత్' శబ్దాన్ని సమాసమధ్యంలో పూర్వావయవపరామర్శకంగా ప్రయోగించాడనటమే సమంజసం. దుర్వారతృష్ణ(ష్ణి)యది నిరసించుట - అన్న పద్ధతిలో సమాసం. తత్ - తావదాదులను వాక్యాలంకారాలుగా వాడటమూ సంస్కృతంలో ఉన్నది. అప్పుడు 'తృష్ణాతన్నిరసనంబు' అని ఉండవలసి వస్తుంది. అది ఆటవెలదిలో కుదరదు. కాబట్టి 'దుర్వారతృష్ణితన్నిరసనంబు' అన్న సంశోధితముద్రణ పాఠమే మేలుబంతి.

క. ధర్మంబుఁ బరిజ్ఞానము । నిర్మలమతి నభ్యసించి నృప! యనిశంబున్
ధార్మికసంగతి గలిగినఁ । బేర్మి యుభయలోకముల నభిష్టత్యమగున్.' 74

ప్రతిపదార్థం: నృప!= ఓ వసుమంతుడా!; ధర్మంబున్= ధర్మాన్నీ; పరిజ్ఞానమున్= విద్యనూ; నిర్మలమతిన్= నిర్మలమైన మనస్సుతో(నూ); అభ్యసించి= అలవరచుకొని; అనిశంబున్= ఎల్లవేళలా (రేయింబవళ్ళు); ధార్మికసంగతి= ధార్మికుల సాంగత్యం (ధార్మికక్రియల సాంగత్యం); కలిగినన్= పొందినట్టయితే; పేర్మి= ఆ గొప్పదనం; ఉభయలోకములన్= ఇహ పరలోకాలలో; అభిష్టత్యము+అగున్= కొనియాడదగినది అవుతుంది.

తాత్పర్యం: ఓ వసుమంతుడా! ధర్మాన్నీ, జ్ఞానాన్నీ నిర్మలమైన మనస్సుతో అభ్యసించాలి. ఎల్లవేళలా ధార్మికసాంగత్యం పెంపొందించుకొనాలి. అప్పుడు ఆ గొప్పదనం ఆ ప్రవర్తన ఇహపరలోకాలలో అభినందించబడుతుంది'

.

వ. అని మఱియును. 75

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: అని చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బ్రాహ్మణ ప్రార్థితములైన పనులు సేయు । మిమ్ము ధనము పాత్రములకు నిచ్చి వగవ
కుండు, మక్రోధకామత్వ మొలయఁ జేయు । మతికి ధృతి సాలఁ గల్గుము మనుజనాథ! 76

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ వసుమన్మహారాజా!; బ్రాహ్మణ= బ్రాహ్మణులచేత; ప్రార్థితములైన= కోరబడిన; పనులు= కార్యాలు; చేయుము= చెయ్యి; పాత్రములకున్= అర్హులకు; ధనము= ధనం; ఇమ్ము; ఇచ్చి= అట్లా దానంచేసి; వగవకుండుము= మరి బాధపడవద్దు; అక్రోధకామత్వము= క్రోధరహితత్వం - కామరహితత్వాలను; ఒలయన్ చేయు(ము)= పొందుము; మతికిన్= మదికి(అంతరంగానికి); ధృతి= ధైర్యాన్ని; చాలన్= అధికంగా; కల్గుము= కలిగించుకొమ్ము.

తాత్పర్యం: 'ఓ రాజా! బ్రాహ్మణులు కోరిన పనులు చేయుము. పాత్రత గుర్తించి ధనాదికం దానం చేయుము. చేసిన తరువాత 'అయ్యో! ఇచ్చేశానే' అని బాధపడకుము. క్రోధాన్నీ, కామాన్నీ విడిచిపెట్టుము. మనస్సుకు ధైర్యం పెంపొందించుకొమ్ము. ఇది చాలా ముఖ్యం.

వ. ధృతిలేమింగాదె మహాభిషాఖ్యుండగు నృపముఖ్యుండు త్రివిష్టపంబుననుండి విభ్రష్టుండయ్యె! ధృత్యాలంబనంబునంగదా యయాతి యాపద నిస్తరించె!' 77

ప్రతిపదార్థం: మహాభిష+ఆఖ్యుండు+అగు= మహాభిషుడు అనే పేరుగల; నృపముఖ్యుండు= రాజోత్తముడు; ధృతిలేమిన్+కాదె= ధృతి అనేది లేకపోవటంవలననే కదా; త్రివిష్టపంబుననుండి= స్వర్గంనుండి; విభ్రష్టుండు+అయ్యెన్!= పరిభ్రష్టుడయ్యాడు! (జారిపడ్డాడని); యయాతి= యయాతి మహారాజు; ధృతి+ఆలంబనంబునన్+కదా= ధృతిని అవలంబించటం వల్లనేకదా!; ఆపదన్= ప్రమాదాన్ని; నిస్తరించెన్!= కడచి గట్టెక్కగలిగాడు! (సం. 12-297-23).

తాత్పర్యం: మహాభిషుడనే రాజు ధైర్యం కోల్పోయే కదా స్వర్గభ్రష్టుడైనాడు! అదీ ధైర్యాన్ని పొందటంవలననే కదా! యయాతి ఆపదనుండి బయటపడ్డాడు!'

క. అనిన విని యా నృపతి య । మ్ముని వచనము లూఁది కామమునకుం గ్రోధం
బునకుం దొలఁగించి తనదు । మనము ధృతికి ధర్మమునకు మరుగంజేసెన్.' 78

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పేసరికి; ఆ నృపతి= ఆ వసుమంతుడు; ఆ+మునివచనములు= ఆ భృగువంశమహర్షి మాటలను; ఊఁది= ఆధారం చేసికొని; తనదు మనమున్= తన మనస్సును; కామమునకున్= కామానికీ; క్రోధంబునకున్= క్రోధానికీ; తొలఁగించి= దూరంచేసి; ధృతికిన్= ధైర్యానికీ; ధర్మమునకున్= ధర్మానికీ; మరుగన్+చేసెన్= అలవాటు పడేటట్టు చేశాడు.

తాత్పర్యం: భృగువంశమహర్షి చేసిన ఉపదేశాన్ని ఆధారం చేసికొని ఆ వసుమంతుడు కామక్రోధాలను వదలిపెట్టి ధృతిధర్మాలను అలవాటు చేసికొన్నాడు.'

వ. అని చెప్పినం బ్రియంబంది మందాకినీనందనుతో ధర్మనందనుండు 'ధర్మాధర్మవియుక్తంబును సర్వసంశయ విముక్తంబును జన్మమృత్యు రహితంబును నిత్యంబును శుచియును శివంబును నవ్యయంబును పరంబును ననాయాసంబును నగునట్టిదాని నెఱింగింపవే?' యని ప్రార్థించిన నతండు యాజ్ఞవల్క్య జనక సంవాదం బితిహాసరూపంబునం బ్రవర్తిల్లు నది వినిన భవదభ్యర్థితంబైన యర్థంబు ప్రతిభాసించు మఱియు వలయునవి యెఱుంగనగుం జెప్పెదనని పలికి యతని కిట్లనియె. 79

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని చెప్పేసరికి; ప్రియంబు+అంది= సంతోషించి; మందాకినీనందనుతోన్= గంగాపుత్రుడైన భీష్ముడితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ధర్మ+అధర్మ+వియుక్తంబును= ధర్మాధర్మాలు లేనిదీ; సర్వసంశయ= సమస్త సంశయాలనుంచీ; విముక్తంబును= విడుదల పొందినదీ; జన్మమృత్యు రహితంబును= పుట్టుక చావులు లేనిదీ; నిత్యంబును= సదాతనమైనదీ; శుచియును= పరిశుభ్రమైనదీ; శివంబును= శుభప్రదమైనదీ; అవ్యయంబును= నశించనిదీ లేక మార్పులేనిదీ; పరంబును= పరము అని పిలువబడేదీ; అనాయాసంబును= దుఃఖరహితమైనదీ (క్లేశరహితమనిగానీ); అగునట్టి దానిన్= ఇటువంటి లక్షణాలు గల తత్త్వాన్ని; ఎఱింగింపవే?= తెలియజెప్పవా?; అని; ప్రార్థించినన్= ప్రార్థించేసరికి; అతండు= ఆ భీష్ముడు; యాజ్ఞవల్క్యజనక సంవాదంబు= యాజ్ఞవల్క్యుడూ, జనకుడూ - వీరిద్దరికీ మధ్య సాగిన సంభాషణ; ఇతిహాసరూపంబునన్= కథారూపంగా; ప్రవర్తిల్లును= ప్రసిద్ధికెక్కింది; అది= ఆ వృత్తాంతాన్ని; వినినన్= విన్నట్టయితే; భవత్= నీచేత; అభ్యర్థితంబైన= ప్రార్థించబడిన; అర్థంబు= విషయం; ప్రతిభాసించున్= నీకు అవగతమవుతుంది; మఱియున్= అంతేకాదు; వలయునవి= కావలసినవి అన్నీ; ఎఱుంగన్+అగున్= తెలుస్తాయి; చెప్పెదన్= ఆ ఇతిహాసం చెప్పుతాను; అని పలికి= అని చెప్పి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు అనియెన్= ఇలా తెలియజేశాడు.

తాత్పర్యం: భీష్ము డింతవరకు చెప్పినదానికి సంతోషపడి ధర్మరా జతడితో 'ధర్మాధర్మాల విచారం లేనిదీ, అన్ని సంశయాలనూ పోగొట్టేదీ చావుపుట్టకలు లేనిదీ, శుచి, శుభ్రత కలిగినదీ, శాశ్వతమైనదీ, మార్పులేనిదీ, 'పరము' అని పిలువబడేది, దుఃఖాన్ని పోగొట్టేదీ - అయినట్టి తత్త్వాన్ని బోధించు' మన్నాడు. దానికి బదులుగా 'నీ ప్రశ్నలన్నింటికి సమాధానం ఇదీ - యాజ్ఞవల్క్యజనక సంవాదాన్ని గూర్చి చెప్పుతాను' అంటూ ఆ వృత్తాంతాన్ని చెప్పసాగాడు.

యాజ్ఞవల్క్య జనకరాజ సంవాదప్రకారము (సం.12-298-3)

ఆ. వినుము సకలలోక విశ్రుత విజ్ఞాన । ఘనుని యాజ్ఞవల్క్యఁడను మునీంద్రు
వినయ మొప్పఁ గాంచి వినతుఁడై మిథిలేశుఁ । డైన జనకనృపతి యతనితోడ. 80

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; సకలలోక= సమస్తలోకాల్లో; విశ్రుత= ప్రసిద్ధికెక్కిన; విజ్ఞానఘనునిన్= మహా విజ్ఞాని అయిన; యాజ్ఞవల్క్యఁడు+అను+మునీంద్రున్= యాజ్ఞవల్క్యుడనే మునీశ్వరుడిని; వినయము+ఒప్పన్= వినయం అలరారేటట్టు; కాంచి= దర్శించి; వినతుఁడై= నమస్కరించినవాడై; మిథిలేశుఁడైన జనకనృపతి= మిథిలాపరిపాలకుడైన జనకమహారాజు; అతనితోడన్= ఆ యాజ్ఞవల్క్య మహర్షితో.

తాత్పర్యం: ధర్మరాజా! యాజ్ఞవల్క్యుడు సకలలోకాలలోనూ ప్రసిద్ధికెక్కిన మహాజ్ఞాని. ఒకరోజున జనకమహారాజు ఆ మహర్షిని దర్శించాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. ఇట్లా అడిగాడు.

వ. ఇంద్రియంబులు నవ్యక్తంబును బ్రహ్మంబును బరంబును భూతసర్గ ప్రళయంబులును దత్కాల సంఖ్యలును దేటపఱిచి భవదీయ దయాళుత్వంబు నెఱపవే' యనిన నమ్మునివరుం డమ్మహీవరున కిట్లనియె. 81

ప్రతిపదార్థం: ఇంద్రియంబులును= జ్ఞానకర్మేంద్రియాలూ; అవ్యక్తంబును= ప్రకృతి; బ్రహ్మంబును= బ్రహ్మము అనబడేది; భూత సర్గ ప్రళయంబులును= పంచభూతాలూ, వాటి సృష్టి, వాటి ప్రళయం; తత్కాల సంఖ్యలును= వాటికి చెందిన కాలసంఖ్యలు; తేటపఱిచి= (వీటిని) నాకు స్పష్టంగా తెలియజేసి; భవదీయ= నీయొక్క; దయాళుత్వంబు= కృపాసహితత్వాన్ని (దయగలవాడవు అనటాన్ని); నెఱపవే= నిర్వహించవా; అనినన్= అని అభ్యర్థించేసరికి; ఆ+మహీవరునకున్= ఆ జనకమహారాజుకు; ఆ మునివరుండు= యాజ్ఞవల్క్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఇంద్రియాలు, ప్రకృతి, బ్రహ్మము, పంచభూతాలూ, వాటి సృష్టి, ప్రళయం, వాటి సంఖ్యను - వీటి నన్నిటినీ దయతో నాకు చెప్పవలెను' అని జనక మహారాజు అడుగగా, దానికి మునిశ్రేష్ఠుడైన యాజ్ఞవల్క్యుడు ఇట్లా సమాధాన మిచ్చాడు.

సీ. 'అధిప! సర్గముఁ బ్రళయంబు నవ్యక్తంబు । దానొనరించుఁ దత్కాల సంఖ్య
వినుఁ-కల్పములు పది దినమున, కంతియ । రజనికాలంబు, సర్గంబు పగలు
సేయు, రే ప్రళయంబు సెల్లించుఁ దొలుత న । శేషభూతములకు జీవనముగ
నోషధికల్పన మొనరించు, దానికై । హైరణ్యమైన మహాండమున వి

తే. ధాతఁ బుట్టించు, నతఁడు భూతములనెల్ల । జనన మొందించు, భూమ్యాది సారభూత
గంధముఖ్య గుణోత్కరగ్రాహకములు । శ్రోత్రముఖములు, దత్స్వామి సూవె మనసు. 82

ప్రతిపదార్థం: అధిప!= జనకమహారాజా!; సర్గమున్= సృష్టినీ; ప్రళయంబున్= ప్రళయాన్నీ (వినాశం); అవ్యక్తంబు= అవ్యక్తం అనబడే ప్రకృతి; తాన్= తాను; ఒనరించున్= కల్పిస్తుంది; తత్కాలసంఖ్య= వాటి కాలపరిమాణం (పరిగణన); వినుము= చెప్పుతున్నాను ఆలకించుము; దినమునకున్= పగటిపూటకు; కల్పములు= కల్పాలు; పది= పది; రజనికాలంబు= రాత్రి సమయంకూడా; అంతియ= అంతే - పదికల్పాలు; సర్గము= సృష్టి అనే దాన్ని; పగలు చేయున్= పగటిపూట నిర్వహిస్తుంది; రే= రాత్రిపూట; ప్రళయంబు= ప్రళయాన్ని; చెల్లించున్= నిర్వహిస్తుంది; తొలుతన్+అ= వీటి అన్నింటికంటే ముందే; అశేష భూతములకున్= అన్ని ప్రాణులకూ; జీవనముగన్= ఆధారంగా; ఓషధి కల్పనమున్= ఓషధుల సృష్టిని; ఒనరించున్= చేస్తుంది; దానికై= దానికోసమని; హైరణ్యమైన= హిరణ్యసంబంధమైన; మహాండమునన్= ఈ పెద్ద అండంలో - బ్రహ్మాండంలో; విధాతన్= విధాత అనబడే బ్రహ్మదేవుడిని; పుట్టించున్= సృష్టిస్తుంది; అతఁడు= ఆ విధాత; భూతములన్ ఎల్లన్= భూతాలను అన్నింటినీ (పంచభూతాలూ - సకలప్రాణులూ); జననము+ఒందించున్= పుట్టిస్తాడు; భూమి+ఆది= భూమ్యాకాశాది పంచభూతాలకూ; సారభూత= సారమైన; గంధముఖ్య= గంధశబ్దాదులైన; గుణ+ఉత్కర= గుణసమూహానికి; గ్రాహకములు= స్వీకారకాలు (గ్రహించేవి); శ్రోత్రముఖములు= ముక్కూ చెవీ మొదలైన ఇంద్రియాలు; మనసు= మనస్సు అనేది; తద్= ఆ ఇంద్రియాలకు; స్వామి చూవె= ప్రభువు సుమా!

తాత్పర్యం: 'జనకమహారాజా! సర్గమూ ప్రళయమూ అనేవాటిని అవ్యక్తమే ('ప్రకృతి - అహంకారం) సృష్టిస్తుంది. పదికల్పాలు ఒక పగలు. పది కల్పాలు ఒక రాత్రి. పగటిపూట సృజన, రాత్రిపూట ప్రళయం. అశేషప్రాణికోటికీ జీవనాధారంగా అన్నిటి కంటే ముందు ఓషధీసృష్టి జరుగుతుంది. దీనికొరకని ఈ బ్రహ్మాండంలో విధాతను సృష్టిస్తుంది. అత డేమో పంచభూతాలనూ సృష్టిస్తాడు. పృథివీ - అప్ - తేజో - వాయు - ఆకాశాలు పంచభూతాలు. గంధ - రస - రూప - స్పర్శ - శబ్దాలు వీటికి సారభూతమైన గుణాలు. ఈ గుణాలను ముక్కు- నాలుక - కన్ను - చర్మం- చెవి - అనే ఐదు ఇంద్రియాలు గ్రహిస్తాయి. గుణోత్కర గ్రాహకాలు ఇవి. ఈ ఇంద్రియాలకు మనస్సు ప్రభువు.

విశేషం: ఇంద్రియాలకు మనస్సు ప్రభువు అనటాన్ని వ్యాసుడు ఇంకా ఇట్లా వివరించాడు. ఇంద్రియాలు ఏమీ గ్రహించలేవు. గ్రహించేది మనస్సే. కన్ను చూస్తోంది అనుకుంటాం. కాదు. మనస్సే కన్నుతో చూస్తోంది. మనస్సు కనక వ్యాకులంగా ఉంటే చూస్తున్నా కన్ను చూడనట్టే. ఏమీ కనపడదు. మనస్సు ద్వారానే ఇంద్రియాలు అన్నీ ఆయాగుణాలను గ్రహిస్తున్నాయి. మనస్సు నిద్రపోతే ఇంద్రియాలు అన్నీ నిద్రపోతాయి. ఇంద్రియాలు నిద్రపోయినా మనస్సు మాత్రం నిద్రపోదు. అందుచేత మనఃప్రధానాలు ఇంద్రియాలు. **చక్షుఃపశ్యతి రూపాణి మనసా తు న చక్షుషా। మనసి వ్యాకులే చక్షుః పశ్యన్నపి న పశ్యతి । తథేంద్రియాణి సర్వాణి పశ్యన్తీత్యభిచక్షతే**

(12-299-16). మనస్యుపరతే రాజన్ ఇంద్రియోపరమో భవేత్। న చేంద్రియోపరమే మనస్యుపరమో భవేత్ ॥ ఏవం మనఃప్రధానాని ఇంద్రియాణి విభావయేత్ । ఇంద్రియాణాం హి సర్వేషామీశ్వరం (12-299-17,18). ఈ శ్లోకాల భావాన్ని తిక్కన ఈ తరువాతి పద్యంలో అందిస్తున్నాడు.

వ. అది యెట్లంటేని. **83**

ప్రతిపదార్థం: అది= మనస్సే ఇంద్రియాలకు ప్రభువు అనటం; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎలాగ అన్నట్టయితే - వినుము.వివరిస్తున్నాను.

తాత్పర్యం: ఇంద్రియాలకు మనస్సే ప్రభువు అవటం వలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుటకును గనుటకును సా । ధనములయిన చెవియుఁ గన్నుఁ దనతనయంతన్
విననుం గానను నేర్చునె । మనఃప్రభావమునఁ గాక? మనుజాధీశా! **84**

ప్రతిపదార్థం: మనుజాధీశా!= ఓ జనకమహారాజా!; వినుటకును= వినటానికీ; కనుటకునున్= చూడటానికీ; సాధనములు+ఐన= సాధనాలైన (ఉపకరణాలైన ఇంద్రియాలు); చెవియున్= చెవీ; కన్నున్= కన్నూ; మనఃప్రభావమునన్ కాక= ఇదంతా మనస్సు

ప్రభావంతో కాకుండా తనతనయంతన్= తమంతతాము; విననున్= వినటం; కాననున్= చూడటం; నేర్చునె?= చెయ్యగలవా?;(అవి తమంతతాము వినలేవు, చూడలేవు అని.)

తాత్పర్యం: ఓ మహారాజా! మనస్సు ప్రభావంతోనే తప్ప చెవి తనంత తాను వినలేదు, కన్ను తనంత తాను చూడలేదు. ఇట్లాగే తక్కిన ఇంద్రియాలు అన్నీను.

తే. ఇంద్రియములెల్ల నట్టివ యెలసి యొండు । వలన మనసున్నఁ దమతమ వర్తనముల
నిగుడ నేరమి తెల్లంబు నృపవరేణ్య! । యిట్టు లగు టజ్ఞులకునైన నెఱుఁగవచ్చు. 85

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ఓ రాజోత్తమా!; ఇంద్రియములు+ఎల్లన్= ఇంద్రియాలు అన్నీ; అట్టివి+అ= అట్లాంటివే - మనస్సు అధీనంలోనే ఉంటాయి; ఎలసి= ఆసక్తమై; ఒండువలనన్= మరొకవిషయం వైపు; మనసు+ఉన్నన్= మనస్సు ఉన్నట్టయితే; తమ తమ వర్తనములన్= ఇంద్రియాలు తమ తమ వ్యాపారాల్లో; నిగుడన్ నేరమి= ప్రవర్తించలేకపోవటం (చొరలేకపోవటం, ప్రవేశించలేకపోవటం); తెల్లంబు= స్పష్టం; ఇట్టులు+అగుట= ఇట్లా ఉండటం (ఈ పరిస్థితి); అజ్ఞులకునైనన్= అజ్ఞులకుకూడా; ఎఱుఁగన్+వచ్చున్= తెలియవచ్చే విషయమే.

తాత్పర్యం: ఓ రాజా! ఇంద్రియాలన్నీ ఇట్లా మనఃప్రభావంతోనే ఉంటాయి. ఈ మనస్సు కనుక మరింకేదయినా విషయంలో ఆసక్తమై ఉన్నట్లయితే ఇంద్రియాలు ఏవీ కూడా తమతమ పనులను చేయలేవు. అజ్ఞానులు కూడా ఈ విషయాన్ని తేలికగా గ్రహించగలరు.

తే. మనసు చేతివ యింద్రియ మహిమలెల్ల । నుపరతంబైన మనసుతో నుడిగి మడఁగు
నింద్రియము లుపరమ మొందెనేని దాన । మనసు మగుడదు విషయతృష్ణన చరించు. 86

ప్రతిపదార్థం: ఇంద్రియ మహిమలు+ఎల్లన్= ఇంద్రియాల శక్తులన్నీ; మనసుచేతివి+అ= మనస్సుచేతిలోవే (మనస్సుకి అధీనాలే); ఉపరతంబైన= వెనక్కుమళ్ళిన; మనసుతోన్= మనస్సుతోపాటు (ఇంద్రియమహిమలు కూడా); ఉడిగి= విరమించి; మడఁగున్= ఉపశమిస్తాయి; ఇంద్రియములు; ఉపరమము+ఒందెన్+ఏని= ఉపశమించినా; దానన్= దానివలన; మనసు= మనస్సు; మగుడదు= వెనక్కు మళ్ళదు; విషయతృష్ణన్+అ= ఆసక్తిగొన్న ఆ విషయం పట్ల తృష్ణతోనే; చరించున్= సంచరిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: రాజా! ఇంద్రియమహిమలన్నీ మనస్సు చేతిలోవే. మనస్సు కనుక విషయాసక్తినుండి వెనక్కు మళ్ళితే ఇంద్రియాలు అన్నీ దానితోపాటే వెనక్కు మళ్ళుతాయి. కానీ, ఇంద్రియాలు వెనక్కు మళ్ళినా వాటితోపాటు మనస్సుకూడా వెనక్కు మళ్ళుతుందని చెప్పలేము. మళ్ళదు. విషయతృష్ణలోనే అట్లాగే సంచరిస్తూ ఉంటుంది.

క. కావున నింద్రియ చేష్టల । నేవలనికిఁ బోవ నీమి యింతకు ముఖ్యం
బై వడిగొను మనసు దిగువఁ । గావలయును మగుడ దీనిఁ గనుఁగొను మనఘా! 87

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా!; కావునన్= కాబట్టి; ఇంద్రియచేష్టలన్= ఇంద్రియాల చేష్టలను; ఏ వలనికిన్= ఏ వైపునకూ; పోవన్+ఈమి= పోనివ్వకపోవటం; ఇంతకున్= ఇంతకూ; ముఖ్యంబై= ప్రధానమైనదై; వడిగొను= విషయాసక్తితో పరుగులుతీసే; మనసున్= మనస్సును; మగుడన్= వెనకకు మళ్ళేట్టు; తిగువఁగాన్ వలయున్= దిగలాగాలి; దీనిన్= ఈ విధాన్ని; కనుఁగొనుము= దర్శించుము, అభ్యసించుము.

తాత్పర్యం: అనఘా! ఇంద్రియాలనూ వాటి చేష్టలనూ నిగ్రహించటం అతిప్రధానం. విషయాసక్తమై పరుగులుతీసే మనస్సును వెనుకకు మళ్ళించాలి. ఇది గ్రహించి అభ్యసించుము.

వ. ప్రళయప్రకారంబు వినుము. రాత్రియగుటయు నవ్యక్తం బహంకృతి పురుషు బోధించిన నతండు పండ్రెండు మూర్తులు గైకొని రశ్మిజాలంబుల జరాయుజ ప్రభృతి సర్వభూతంబులను రూపుమాపినం గూర్మపృష్ఠంబునుంబోని పృథివి జలమయం బగు జలంబు లోకంబు లెల్లం దమమయంబకాఁ బేర్చి తన్నుం గాలాగ్ని మడియింపం గుదియుఁ బ్రజ్వల జ్జ్వాలాభీలం బగు నయ్యనలం బనిలంబుచేతం జెడు నెందునుం దానయై పరఁగు నమ్మహాబలు నాకసంబు మ్రింగు నతివితతంబగు నవ్వియత్తత్త్వంబు మనంబు గ్రసియించు మనంబు నయ్యహంకారాధిష్ఠిత పురుషుండు గబళించు నయ్యహంకృతి నవ్యక్తంబు లోఁగొను నిట్లు రేయివోయిన నెప్పటివిధంబు ప్రవర్తిల్లు. 88

ప్రతిపదార్థం: ప్రళయప్రకారంబున్= ప్రళయపద్ధతిని; వినుము; రాత్రి+అగుటయున్= రాత్రి కావటంతోనే; అవ్యక్తంబు= ప్రకృతి; అహంకృతిపురుషున్= అహంకారయుక్తుడైన పురుషుడిని; బోధించినన్= నిద్రలేపగా; అతండు= ఆ అహంకృతి పురుషుడు; పండ్రెండుమూర్తులు కైకొని= పన్నెండు సూర్యరూపాలు ధరించి; రశ్మిజాలంబులన్= కిరణసమూహాలతో; జరాయుజ+ప్రభృతి= గర్భజాతాలూ, అండజాతాలూ, స్వేదజాతాలూ; ఉద్భిజ్జాలూ అయిన; సర్వభూతంబులను= చతుర్విధ జీవరాశినీ; రూపుమాపినన్= నశింపజేస్తే; కూర్మపృష్ఠంబునున్+పోని= తాబేటి వీపువలె ఉండే; పృథివి= భూమి; జలమయంబు+అగున్= జలమయం అయిపోతుంది; జలంబు= ఈ నీరు; లోకంబులెల్లన్= లోకాలన్నీ; తమమయంబు+అ కాన్= జలమయాలే అయిపోయేట్టు; పేర్చి= విజృంభించి; తన్నున్= ఆ జలాన్ని; కాలాగ్ని= ప్రళయకాలాగ్ని; మడియింపన్= నశింపజేస్తే; కుదియున్= అంతరించిపోతుంది; ప్రజ్వలత్= అతిశయించి మండుతున్న; జ్వాలా= మంటలతో; ఆభీలంబు+అగు= భయంకరమైన; ఆ+అనలంబు= ఆ కాలాగ్ని; అనిలంబుచేతన్= అష్టాత్మకుడైన మహావాయువుచేత; చెడున్= నశిస్తుంది; ఎందునున్= ఎక్కడచూసినా; తానయై= తానే అయి; పరఁగు= సంచరిస్తున్న; ఆ+మహాబలున్= ఆ వాయువును; ఆకసంబు= ఆకాశము; మ్రింగున్= మింగేస్తుంది; అతి వితతంబు+అగు= అతి విస్తృతమైన; ఆ+వియత్తత్త్వంబున్= ఆ ఆకాశతత్త్వాన్ని; మనంబు= మనస్సు; గ్రసియించున్= కబళిస్తుంది; మనంబున్= మనస్సును; ఆ+అహంకార+అధిష్ఠిత పురుషుండు= ఆ అహంకృతిపురుషుడు; కబళించున్= మింగేస్తాడు; ఆ+అహంకృతిన్= ఆ అహంకారాన్ని; అవ్యక్తంబు= అవ్యక్తము అనబడే ప్రకృతి; లోఁగొనున్= కబళిస్తుంది; ఇట్లు= ఈ ప్రకారంగా; రేయి+పోయినన్= రాత్రిగడిస్తే; ఎప్పటివిధంబు= మళ్ళీ పూర్వపద్ధతి; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: (పగటిని సృష్టిగానూ, రాత్రిని ప్రళయంగానూ లోగడ (శాంతి - 6-82) చెప్పాడు.) రాత్రి అయ్యేసరికి అవ్యక్తం అహంకృతిపురుషుడిని ప్రబోధిస్తుందిట. అప్పుడు అతను పన్నెండు సూర్యరూపాలు గ్రహించి తన కిరణాలతో జీవరాశిని అంతటినీ నశింపజేస్తాడు. జీవరాశి నాలుగువిధాలు. గర్భాశయంనుండి పుట్టేవీ (జరాయుజములు), గుడ్డులనుండి పుట్టేవీ (అండజాలు), స్వేదంనుండి పుట్టేవి (స్వేదజములు), గింజలనుండి మొలకెత్తేవి (ఉద్భిజ్జాలు), ఈ మొత్తం జీవరాశిని ద్వాదశాదిత్యకిరణాలు నాశనం చేస్తాయి. అప్పుడు ఈ భూమి తాబేటి చిప్పవలె (కూర్మపృష్ఠం) అయిపోతుంది. అప్పుడు మహాప్రవాహంవలె నీరు వచ్చి ఈ భూగోళాన్ని ముంచివేస్తుంది. జలమయం చేసివేస్తుంది. కాలాగ్ని చెలరేగి ఆ నీటిని ఆవిరి చేసివేస్తుంది. మహావాయువును ఆకాశం మ్రింగివేస్తుంది. ఆకాశాన్ని మనస్సు కబళిస్తుంది. మనస్సును అహంకృతిపురుషుడు గ్రసిస్తాడు. అహంకారాన్ని అవ్యక్తం లోగొంటుంది. ఇదీ ప్రళయం. రాత్రి గడిస్తే మళ్ళీ అంతా మామూలే. పగటిపూట సృజన.

క. ప్రీతిగ నధ్యాత్మము నధి । భూతము నధిదైవతంబు భూవర! సంప్ర
ద్యోతితములుగాఁ జెప్పెద । నా తెఱఁగు ప్రబోధకారియగు నూహింపన్. 89

ప్రతిపదార్థం: భూవర!= జనకమహారాజా!; అధ్యాత్మము= ఆధ్యాత్మికమూ; అధిభూతము= ఆధిభౌతికమూ; అధిదైవతంబు= ఆధిదైవికమూ అనే వీటినిగురించి; ప్రీతిగన్= ప్రేమగా; సంప్రద్యోతితములు+కాన్= స్పష్టపడేటట్లు; చెప్పెదన్= చెబుతాను; ఆ తెఱఁగు= ఆ పద్ధతి; ఊహింపన్= ఆలోచిస్తే; ప్రబోధకారి+అగున్= నీకు జ్ఞానప్రదం అవుతుంది.

తాత్పర్యం: మహారాజా! అధ్యాత్మ, అధిభూత, అధిదైవతాలు ఏమిటో నీకు స్పష్టపరుస్తాను. అది నీకు కనువిప్పు కలిగిస్తుందని భావిస్తాను.

అధ్యాత్మాధిభూతాధిదైవత ప్రకారము (సం.12-301-1)

సీ. పాదపాయూపస్థపాణివాక్కులు విను । మధ్యాత్ములు దత్క్రమానుయుక్తి
గంతవ్యమును విసర్గంబు నానందంబుఁ । గర్తవ్యవక్తవ్యకములు నయ్యె
నధిభూతములు వాని కధిదైవములు వరు । సన విష్ణుమిత్రప్రజాపతులును
శక్రపావకులును జక్షువు జిహ్వాయు । ఘ్రాణంబుఁ ద్వక్కు శ్రోత్రంబుఁ జూవె

తే. యనఘ! యధ్యాత్ములు రూపమును రసంబుఁ । జాలుపడ గంధసంస్పర్శ శబ్దములును
దదధిభూతంబు లధిదైవతములు సూర్య । జలమహీ వాయు దిశలండ్రు శాస్త్రవిదులు **90**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విను(ము); పాద, పాయు, ఉపస్థ పాణి, వాక్కులు= కాళ్ళు, గుదము, రహస్యావయవము, చేతులు, నాలుక ఇవి అయిదూ; అధ్యాత్ములు= అధ్యాత్మాలు; తద్+క్రమ+అనుయుక్తిన్= వాటివరుసలోనే; గంతవ్యమును= గమ్యం; విసర్గంబున్= విసర్జించదగిన మలమూత్రాదికం; ఆనందంబున్= ఆనందమును; కర్తవ్య= చేయదగినది; వక్తవ్యకములు= పలుకదగినది - ఇవి అయిదూ; అధిభూతములు= అధిభూతాలు; వానికిన్= ఆ అయిదింటికీ; వరుసన= అదే వరుసలో; విష్ణుమిత్ర ప్రజాపతులును= విష్ణువు, సూర్యుడు, ప్రజాపతి(బ్రహ్మ) అనేవారూ; శక్రపావకులును= ఇంద్రుడు, అగ్ని అనేవారూ మొత్తం అయిదుగురు; అధిదైవములు= అధిదైవతాలు; చక్షువు= కన్ను; జిహ్వాయున్= నాలుక; ఘ్రాణంబున్= ముక్కు; త్వక్కు= చర్మం; శ్రోత్రంబున్= చెవి అనే ఈ అయిదూ; అధ్యాత్ములు+చూవె= అధ్యాత్మాలు సుమా!; రూపమును= రూపమూ; రసంబున్= రుచి; గంధ= వాసన; సంస్పర్శ= స్పర్శ; శబ్దములును= శబ్దమూ అనే ఈ అయిదూ; చాలుపడన్= వరుసగా; తద్= కన్ను మొదలైన వాటి కయిదింటికీ; అధిభూతంబులు= అధిభూతాలు; సూర్య= సూర్యుడూ; జల= నీరూ; మహీ= నేలా; వాయు= గాలీ; దిశలు= ఆకాశం అనే అయిదూ; అధిదైవతములు= వీవాటికి అధిదైవతాలు; శాస్త్రవిదులు= శాస్త్రవేత్తలు; అండ్రు= ఇట్లా చెబుతారు (దైవానికి అధీనంలో ఉండేవి).

తాత్పర్యం: కాళ్ళూ, గుదమూ, ఉపస్థ, చేతులూ, నాలుక - అనేవి అయిదూ అధ్యాత్మాలు. వీటికి గంతవ్యం, విసర్జనం, ఆనందం, కర్తవ్యం, వక్తవ్యం - అనేవి అయిదూ అధిభూతాలు. వీటికే వరుసగా విష్ణు, సూర్య, ప్రజాపతి, ఇంద్ర, అగ్ని - వీరు అయిదుగురూ అధిదైవతాలు. కన్ను, నాలుక, ముక్కు, చర్మం, చెవి - ఇవి అయిదూ అధ్యాత్మాలు. రూప, రస, గంధ, స్పర్శ, శబ్దాలు వాటికి వరుసగా అధిభూతాలు. తేజస్సు, జలం, భూమి, వాయువు, ఆకాశం అనేవి అయిదూ అదే క్రమంలో అధిదైవతాలు.

క. మన మధ్యాత్ము దానికి । ననఘా! మంతవ్యమందు రధిభూతము చం
ద్రుని నధిదైవతముగ బుధ । జనములు చెప్పుదురు శ్రుతివచఃప్రతిపత్తిన్. **91**

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా!; మనము= మనస్సు అనేది; అధ్యాత్ము= అధ్యాత్మం; దానికిన్= దానికి; మంతవ్యము= మంతవ్యమనేది (మననము చేసికొనదగినది); అధిభూతము= అధిభూతం; అందురు= అంటారు; శ్రుతివచః= వేదవాక్కుల;

ప్రతిపత్తిన్= ప్రామాణికతతో; బుధజనములు= పండితులు; చంద్రునిన్= చంద్రుడిని; అధిదైవతముగన్= మనస్సుకు అధిదైవతంగా; చెప్పుదురు.

తాత్పర్యం: రాజా! మనస్సు అనేది అధ్యాత్మం. దీనికి మంతవ్య మనేది అధిభూతం. చంద్రుడేమో అధిదైవతం. వేదప్రామాణ్యాన్ని బట్టి పండితులు ఇట్లా చెప్పుతున్నారు.

తే. బుద్ధి యధ్యాత్మమనఁ జను భూతవర్య! । దాని కధిభూత మంద్రు బోద్ధవ్యమైన
దానిఁ బొల్చు తదీయాధిదైవతంబు । వినుము క్షేత్రజ్ఞుఁడని చెప్పు వేదచయము. 92

ప్రతిపదార్థం: భూతవర్య!= జీవోత్తమా! జనకమహారాజా!; బుద్ధి= బుద్ధి అనేది; అధ్యాత్మము= అధ్యాత్మం; అనన్+చెల్లును= అనటం తగును; బోద్ధవ్యమైన దానిన్= (దానికి) తెలిసికొనదగినదానిని; అధిభూతము+అంద్రు= బుద్ధికి అధిభూతము అంటారు; పొల్చు= అతిశయించే; తదీయ= ఆ బుద్ధియొక్క; అధిదైవతంబు= అధిదైవతం; క్షేత్రజ్ఞుఁడు+అని= క్షేత్రజ్ఞుడే అని; వేదచయము= వేదసమూహం; చెప్పున్= చెప్పుతుంది; వినుము.

తాత్పర్యం: బుద్ధి అధ్యాత్మమనీ, బోద్ధవ్యం అధిభూతమనీ, క్షేత్రజ్ఞుడైన జీవుడే అధిదైవతమనీ వేదాలు చెప్పుతున్నాయి.

క. ఆరయ నధ్యాత్మ మహం । కారం బధిభూతనామకం బభిమానం
బారూఢ యశఃపరమో । దారా! రుద్రుఁ డధిదైవతం బన నెగడున్. 93

ప్రతిపదార్థం: ఆరూఢ= ప్రసిద్ధికెక్కిన; యశః= కీర్తితో; పరమ+ఉదారా!= గొప్ప ఔదార్యం కలవాడా! ఓ జనకమహారాజా!; ఆరయన్= పరిశీలించగా; అహంకారంబు= అహంకారమనేది; అధ్యాత్మము= అధ్యాత్మం; అభిమానంబు= అభిమానమనేది; అధిభూతనామకంబు= అహంకారానికి అధిభూతం అవుతుంది; రుద్రుఁడు= భవుడు; అధిదైవతంబు= అధిదైవతం; అనన్= అనగా; నెగడున్= ఒప్పును.

తాత్పర్యం: అహంకార మనేది ఆధ్యాత్మం. దానికి అభిమాన మనేది అధిభూతం. అధిదైవతమేమో రుద్రుడు.

విశేషం: దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది - **"అభిమానో z ధిభూతం తు భవస్తత్రాధిదైవతమ్" (12-301-12)**. అనే పాఠం కూడా కొన్ని ప్రతులలో ఉన్నది. తెలుగు ప్రతులన్నింటా అభిమానమనేదే కనపడుతున్నది. భవుడు అన్నదానిని తిక్కన రుద్రుడు అన్నాడు. స్థూలార్థం సమానమే అయినా వ్యుత్పత్తి స్వభావంలో తేడా ఉన్నది. దీనికి 'బుద్ధి యధిదైవతంబన' అనే పాఠాంతరం తెలుగులో ఉన్నది. **విరించో z త్రాధిదైవతమ్** అనే పాఠాన్ని సంశోధిత ముద్రణ అధస్సూచికలో (పి.వి.యన్. శాస్త్రి ప్రతి 12-298-12) చూపింది.

తే. ధరణివల్లభ! చిత్తమధ్యాత్మ మనఁగ । బరఁగుఁ జేతయితవ్యంబు భావితాత్ము
లైన మహనీయు లధిభూతమంద్రు బ్రహ్మ । మంచితాధిదైవతమను నాగమములు.' 94

ప్రతిపదార్థం: ధరణివల్లభ!= ఓ మహారాజా! (భూపతీ!); చిత్తము= చిత్తము అనేది; అధ్యాత్ముము+అనఁగన్+పరఁగున్= అధ్యాత్మం అనబడుతుంది; భావిత+ఆత్ములైన= ఆలోచనాపరులైన; మహనీయులు= గొప్పవారు; చేతయితవ్యంబున్= చేతయితవ్యము అనబడేదాన్ని; అధిభూతము+అంద్రు= చిత్తానికి అధిభూతం అంటారు; ఆగమములు= వేదాలూ, శాస్త్రాలూ; బ్రహ్మమున్= బ్రహ్మము అనబడేదాన్ని; అంచిత= ఒప్పయిన; అధిదైవతము+అనున్= చిత్తానికి అధిదైవతం అంటాయి.

తాత్పర్యం: రాజా! చిత్తం అధ్యాత్మం, చేతయితవ్యం దానికి అధిభూతం, పరబ్రహ్మం దానికి అధిదైవతం అని ఆగమాలు చెప్పుతున్నాయి'.

విశేషం: దీనికి మూలశ్లోకం భండార్కరు వారి ప్రామాణిక ప్రతిలో ప్రధానపాఠంగా లేదు. అధస్సూచిలో మాత్రమే ఉన్నది. **చిత్తమధ్యాత్మమిత్యాహుర్యోగినః సూక్ష్మదృష్టయః । అధిభూతం చైత్యమాహూ రుద్రస్తత్రాధిదైవతమ్** ॥ ఇది గ్రంథలిపిలో లాహోరు ప్రతిగా వారు సూచించారు. దీనివలన చేతయితవ్యమే చైత్యమని తెలుస్తోంది. రుద్రుడు తెలుగులో బ్రహ్మం అయాడు.

వ. అని చెప్పి 'ప్రకృతి పురుష ప్రకారంబులు వినుట మనో నిర్వికారత్వకారణం బగు' నను పలుకు పలికి యిట్లనియె. 95

ప్రతిపదార్థం: అని చెప్పి= యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పి; ప్రకృతి పురుషప్రకారంబులు= ప్రకృతిపురుషుల పద్ధతులు; వినుట= వినటం; మనోనిర్వికారత్వ కారణంబు+అగున్= మనస్సు తాలూకు నిర్వికారత్వానికి హేతువు అవుతుంది; అను పలుకు= ఈ మాట; పలికి= అని; ఇట్లు అనియెన్= మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పి 'ప్రకృతి పురుషుల పద్ధతులు వినుటవలన మనస్సు నిర్వికారత్వాన్ని పొందుతుం'దంటూ, ఇంకా ఇట్లా చెప్పాడు.

క. 'ప్రకృతి దనయిచ్చఁ గ్రీడా । ర్థకముగ సత్త్వాదిగుణ వితానము నానా
వికృతులఁ బొందింప నసం । ఖ్యకవిధమై పరఁగుచుండునది మనుజేంద్రా! 96

ప్రతిపదార్థం: మనుజేంద్రా!= ఓ రాజేంద్రా!; ప్రకృతి= ప్రకృతి అనేది; తనయిచ్చన్= స్వేచ్ఛతో; క్రీడార్థకముగన్= క్రీడావిలాసంకోసం అన్నట్టు; సత్త్వాదిగుణవితానమున్= సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే గుణసమూహాన్నీ; నానావికృతులన్= వాటివలన పలురకాల వికారాలనూ (రూపభేదాలనూ); పొందింపన్= కలుగజేస్తే; అసంఖ్యకవిధమై= లెక్కపెట్టలేనన్ని భేదాలు కలదై; పరఁగుచుండున్+అది= ఒప్పుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఈ ప్రకృతి అనేది స్వేచ్ఛగా క్రీడావిలాసంగా సత్త్వాదిగుణాలనూ, నానా వికృతులనూ పురుషుడికి కల్పిస్తూ ఉంటుంది.

క. దీపమున ననేకములగు । దీపములు పరంపరానుదీప్తాకృతులై
వ్యాపించు చందమున గుణ । రూపంబులఁ బరపుఁ బ్రకృతి రోషవిదూరా! 97

ప్రతిపదార్థం: రోషవిదూరా!= రోషరహితుడా!; దీపమునన్= ఒక దీపంనుండి; అనేకములగు= అనేకమైన; దీపములు= దీపాలు; పరంపరా+అనుదీప్త+ఆకృతులై= ఒకదాని నుంచి ఒకటి వరసగా వెలిగిన ఆకారాలు కలవై; వ్యాపించు చందమునన్= వ్యాప్తి చెందినట్టుగా; ప్రకృతి= ఈ ప్రకృతి అనేది; గుణరూపంబులన్= సత్త్వాదిగుణాలనూ రూపాలనూ; పరపున్= వ్యాప్తి చెందిస్తుంది.

తాత్పర్యం: రోషరహితుడా! ఒక దీపం నుంచి అనేకదీపాలు వ్యాప్తి చెందినట్టు ఈ ప్రకృతి అనేది గుణరూపాలను వ్యాప్తి పొందిస్తుంది.

సీ. సత్త్వగుణంబులు సంతోష మానంద । మారోగ్య మక్రోధ మార్జవంబు
శుద్ధి ప్రకాశత సుస్థిరత్వ మహింస । నిర్మల శ్రద్ధ వినీతి లజ్జ
సత్యంబు శౌచంబు సమత యాచారం బ । కార్పణ్యపైశున్య కామవృత్తి
విను రజోగుణములు విగ్రహ దర్పాభి । మాన కామక్రోధ మత్సరములు

ఆ. కరుణలేమి భోగకాంక్ష యహంకార । ముమ్మలిక తమోగుణమ్ము లప్ర
కాశమోహ బహుతరాశన వాదప్ర । మాద మౌర్ఖ్యమరణ భేదనములు. 98

ప్రతిపదార్థం: సంతోషంబు= సంతోషంగా ఉండటం; ఆనందము= ఆనందంగా ఉండటం; ఆరోగ్యము= రోగరహితంగా ఉండటం; అక్రోధము= క్రోధంలేకపోవటం; ఆర్జవంబు= ఋజుత్వం (తిన్నని నడవడి); శుద్ధి= పరిశుభ్రత; ప్రకాశత= తేజస్వితత్వం; సుస్థిరత్వము= నిశ్చలత్వం; అహింస= హింస విడనాడటం; నిర్మలశ్రద్ధ= నిర్మలమైన శ్రద్ధ (దీక్ష); వినీతి= వినయం; లజ్జ= సిగ్గు; సత్యంబు= నిజం చెప్పటం; శౌచంబు= శుచిగా ఉండటం; సమత= సర్వప్రాణి సమానత్వం; ఆచారంబు= ఆచారపరత్వం; అకార్పణ్య పైశున్యకామవృత్తి= లోభించటం (దుష్టత), చాడీలు చెప్పటం, కాముకత్వం అనేవి లేకుండా ప్రవర్తించటం ఇవి; సత్త్వగుణంబులు= సత్త్వగుణాలు; వినుము; విగ్రహ= కలహించటం; దర్ప= అహంకారం; అభిమాన= గర్వం; కామ= అతివాంఛ; క్రోధ= కోపం; మత్సరములు= ఈర్ష్య అనేవీ; కరుణ లేమి= దయ లేకపోవటం; భోగకాంక్ష= భోగాలు అనుభవించాలి అనే కోరిక; అహంకారము= అహంభావం; ఉమ్మలిక= దుఃఖం - ఇవన్నీ; రజోగుణములు= రజోగుణాలు; అప్రకాశ= తేజోరహితత్వం; మోహ= వ్యామోహం; బహుతర+అశన= తిండిపోతుగా ఉండటం; వాద= వాదోపవాదాల్లో ప్రీతి; ప్రమాద= పొరపాటు పడటం; మౌర్ఖ్య= మూర్ఖత్వం; మరణ= మరణం; భేదనములు= ఒకరిమీద ఒకరికి చాడీలు చెప్పటం - ఇవన్నీ; తమోగుణమ్ములు= తమోగుణాలు.

తాత్పర్యం: సంతోషాదులు సత్త్వగుణాలనీ, అహంకార కామ క్రోధాదులు రజోగుణా లనీ, తిండిపోతుదనం చాడీకోరుతనం మొరకుదనం ఇత్యాదులు తమోగుణాలనీ తెలిసికొమ్ము.

క. ప్రకృతికిని గుణములుం గొని । యకలంకుండైన యంతరాత్ముని వేవే
ల్వికృతులఁ బొందించుట పా । యక కలుగుం దత్స్వభావ మది యరయంగన్. 99

ప్రతిపదార్థం: గుణములన్+కొని= సత్త్వరజస్తమోగుణాలను స్వీకరించి; అకలంకుండు+ఐన= స్వతస్సిద్ధంగా కళంకరహితుడైన; అంతరాత్మునిన్= అంతరాత్ముడిని; వేవేల్= వేలకువేలుగా; వికృతులన్+పొందించుట= రూప వికారాలను పొందేట్టు చెయ్యటం; ప్రకృతికిన్= ఈ ప్రకృతి అనేదానికి; పాయక= వదలక; కలుగున్= ఉంటుంది; అరయంగన్= ఆలోచించి చూస్తే; అది= అట్లా పొందించటమనేది; తద్= ఆ ప్రకృతియొక్క; స్వభావము= స్వభావం.

తాత్పర్యం: సత్త్వాది గుణాలతో - కళంకరహితుడైన పురుషుడికి అనేకరూపాలు కల్పించటం ప్రకృతికి స్వభావం. అది దానిని వదలదు.

క. పురుషుఁడు చైతన్యాత్ముఁడు । నరనాయక! ప్రకృతి చేతనారహిత జగ
ద్ధరఁ బురుషుని వెలుఁగునఁ దా । ధరియించుం బురుషుఁ దిగుచుఁ దనమెయిఁ దిరుగన్. 100

ప్రతిపదార్థం: నరనాయక!= జనకమహారాజా!; పురుషుఁడు= జీవాత్ముడు; చైతన్యాత్ముఁడు= చైతన్యస్వరూపుడు; ప్రకృతి= ఈ ప్రకృతిమాత్రం; చేతనారహిత= చైతన్యరహితం; పురుషుని= అంతరాత్మునికి చెందిన; వెలుఁగునన్= ప్రకాశంలో; తాను= ఈ ప్రకృతి; జగత్+ధరన్= జగద్భారాన్ని; ధరియించున్= వహిస్తుంది; పురుషున్= పురుషుడిని; తనమెయిన్= తనతో; తిరుగన్= తిరిగేట్టు; తిగుచున్= లాగుతుంది.

తాత్పర్యం: రాజా! పురుషుడు చైతన్య సహితుడు. ప్రకృతికి చైతన్యం లేదు. అయినా పురుషుడి ప్రకాశంలోనే తాను జగద్భారాన్ని వహిస్తుంది. పురుషుడిని కూడా తనవెంట తిప్పుకొంటుంది.

ఉ. సత్త్వరజస్తమోగుణ వశస్థితిఁ గేవలపుణ్యమిశ్రకా
రిత్వ విరుద్ధకర్మములఁ బ్రేరితమై కను నూర్ధ్వలోకసే
వి త్వము మానుషత్వ పదవీకలనంబును రౌరవంబు నా
తత్వము తన్నెఱుంగమి ప్రధానము చేఁతల నావహిల్లినన్. 101

ప్రతిపదార్థం: ఆ తత్త్వము= పురుషుడు అనబడే ఆ తత్త్వం; తన్నున్+ఎఱుంగమి= తనను తాను తెలుసుకోకపోవటంచేత; ప్రధానము చేఁతలన్= ప్రధానము అనబడే ప్రకృతియొక్క చేష్టలలోకి; ఆవహిల్లినన్= లొంగిపోయినట్టయితే; సత్త్వ రజ స్తమోగుణ వశస్థితిన్= సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే మూడు గుణాలకూ వివశమైపోయిన పరిస్థితిలో; కేవలపుణ్య= పూర్తిగా పుణ్యకర్మలను చెయ్యటం; మిశ్రకారిత్వ= పుణ్యకార్యాలను కొన్నింటినీ, పాపకార్యాలను కొన్నింటినీ చెయ్యటం; విరుద్ధకర్మములన్= పుణ్యవిరుద్ధమైన పాపకర్మలు చెయ్యటం - వాటితో; ప్రేరితమై= ప్రేరేపింపబడినదై; క్రమంగా - ఊర్ధ్వలోకసేవిత్వము= పుణ్యలోకాలను సేవించటం; మానుషత్వ పదవీ+కలనంబును= మనుష్యజన్మను అధిష్ఠించటం; రౌరవంబున్= రౌరవము అనబడే నరకాన్నీ; కనున్= పొందుతుంది.

తాత్పర్యం: జీవాత్మ అనబడే ఈ తత్త్వం తనను తాను తెలిసికొనలేక, ప్రధానము అనబడే ప్రకృతితత్త్వపు చేతలలో ఇరుక్కుపోయి సత్త్వగుణంతో కేవల పుణ్యకర్మలను ఆచరించి ఊర్ధ్వలోకాలను పొందుతుంది. రజోగుణంతో మిశ్రకర్మలను ఆచరించి మానుషత్వం పొందుతుంది. తమోగుణంతో కేవల పాపకర్మలు ఆచరించి రౌరవాది నరకాల పాలవుతుంది.

క. తను నెఱిఁగిన నవ్యక్తము । చనవునఁ బోఁ డాత్ముఁ డజర శాశ్వత విగతాం
జన విమలాచ్యుత పదముం । గని యక్షరుఁడగు నిజప్రకాశస్థిరతన్.' 102

ప్రతిపదార్థం: ఆత్ముఁడు= ఈ జీవాత్ముఁడు; తనున్= తనను తాను; ఎఱిఁగినన్= తెలుసుకొన్నట్టయితే; అవ్యక్తము చనవునన్= అవ్యక్తము అనబడే ప్రకృతియొక్క చనవుతో; పోఁడు= దానివెంట పడి వెళ్ళడు; అజర= ముసలితనం లేనిదీ; శాశ్వత= శాశ్వతమైనదీ; విగత+అంజన= నిరంజనమైనదీ (పాపరహితం, శివప్రదం); విమల= నిర్మలమైనదీ; అచ్యుత= చ్యుతిలేనిదీ అయిన; పదమున్= స్థానాన్ని; కని= పొంది; నిజ= తనయొక్క; ప్రకాశ= తేజస్సు తాలూకు; స్థిరతన్= నిశ్చలత్వంతో; అక్షరుఁడు+అగున్= (జీవాత్ముడు) అక్షరాత్ముడే అయిపోతాడు.

తాత్పర్యం: జీవాత్ముడు ప్రబుద్ధ డైనట్లయితే అవ్యక్త మనబడే ప్రకృతివెంట తగిలిపోడు. శాశ్వతం, నిరంజనం, నిర్మలం, జరావిరహితం అయిన అచ్యుతపదాన్ని పొంది అక్షరుడై పోతాడు. పంచవింశతితత్త్వవిశిష్టుడైన పురుషుడు తనను తాను తెలిసికొని ప్రబుద్ధుడైతే అక్షరుడైపోతాడు.'

వ. అనిన విని జనకపతి యమ్మునిపతితో 'ననాదినిధనంబులు నమూర్తంబులు నచలంబులు నగ్రాహ్యంబులు నగు పురుషప్రకృతితత్త్వంబులయం దొక్కటి సచేతనంబైయుండఁ దక్కినయది చేతనారహితం బగుటకుం గతం బేమి యెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె. 103

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలించి; జనకపతి= జనకమహారాజు; ఆ+మునిపతితోన్= ఆ యాజ్ఞవల్క్య మునీశ్వరుడితో; అనాదినిధనంబులును= ఆదీ అంతమూ లేనివీ; అమూర్తంబులును= ఆకారరహితాలూ; అచలంబులున్= నిశ్చలాలూ; అగ్రాహ్యంబులును= గ్రహింపరానివీ; అగు= అయినటువంటి; పురుష-ప్రకృతి తత్త్వంబులయందున్= ఈ పురుషతత్త్వ - ప్రకృతితత్త్వాలలో; ఒక్కటి= ఒకటి (పురుషతత్త్వం); సచేతనంబై+ఉండన్= సచేతనంగా ఉంటే; తక్కినయది= రెండవది (ప్రకృతితత్త్వం); చేతనారహితంబు+అగుటకున్= చైతన్యరహితమై పోవటానికి; కతంబు= కారణం; ఏమి= ఏమిటో; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనుటయున్= అని వేడుకోగా; అతండు= ఆ యాజ్ఞవల్క్యుడు; అతనికిన్= ఆ జనకమహారాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని జనకమహారాజు ఆ యాజ్ఞవల్క్య మునీశ్వరుడితో 'ఆదీ, అంతమూ లేనివీ, ఆకారరహితాలూ, నిశ్చలాలూ, గ్రహింపరానివీ అయిన పురుష, ప్రకృతి తత్త్వాలలో ఒకటి సచేతనంగా ఉండగా రెండవది - ప్రకృతితత్త్వం చైతన్యరహితమై పోవటానికి కారణం ఏమిటో తెలియజెప్పు' మని అడుగగా ఆ జనకమహారాజుతో యాజ్ఞవల్క్యుడు ఇట్లా అన్నాడు.

క. సగుణం బగుణం బగునే? । యగుణము సగుణమగు నెట్టు? లవ్యక్తము ని
త్యగుణసమవేతమై జడ । త గలిగియుండంగఁ బురుషధర్మము గలదే? 104

ప్రతిపదార్థం: సగుణంబు= సత్త్వాదిగుణసహితమైనది; అగుణంబు+అగునే?= గుణరహితం అవుతుందా?; అగుణము= గుణరహితమైనది; సగుణము= గుణసహితం; అగునెట్టులు?= ఎలా అవుతుంది?; అవ్యక్తము= అవ్యక్తము అనబడే ప్రకృతి; నిత్య= ఎల్లవేళలా; గుణసమవేతమై= సత్త్వాదిగుణాలతో కూడినదై; జడతన్= చైతన్యరహితత్వాన్ని; కలిగి+ఉండన్= ధరించి ఉండగా; పురుషధర్మము= పురుషతత్త్వానికి స్వభావమైన చైతన్యం; కలదే?= దానికి ఉంటుందా?

తాత్పర్యం: సగుణం, అగుణం కాదు. అట్లాగే అగుణమూ సగుణం కాదు. సత్త్వాదిగుణాలు కలిగి జడస్థితిలో ఉండే అవ్యక్తానికి (ప్రకృతికి) పురుషధర్మమైన (జీవాత్మ) చైతన్యం ఉండదు.

క. పురుషుని కల రూపెఱిఁగెడు । పరిబోధము లేకయుండుఁ బ్రకృతికిఁ బ్రకృతిం
బురుషుఁ డెఱుంగును దనకుం । బరంబు లేదనియుఁ గను శుభస్థిర దృష్టిన్. 105

ప్రతిపదార్థం: ప్రకృతికిన్= ప్రకృతికి (అవ్యక్తానికి); పురుషుని= పురుషుడియొక్క; కలరూపు= యథార్థరూపాన్ని; ఎఱిఁగెడు= తెలిసికొనగలిగిన; పరిబోధము= జ్ఞానం; లేకయుండున్= ఉండదు; పురుషుఁడు= జీవాత్ముడు; ప్రకృతిన్= అవ్యక్తాన్ని; ఎఱుంగును= తెలుసుకోగలడు; తనకున్= తనకంటే; పరంబు= పరమైనది; లేదు+అనియున్= లేదు అనికూడా; శుభస్థిరదృష్టిన్= శుభప్రదమైన నిశ్చలదృష్టితో; కనున్= దర్శింపగలడు.

తాత్పర్యం: రాజా! పురుషుడి యథార్థరూపాన్ని గ్రహించగలిగిన జ్ఞానం ప్రకృతికి లేదు. కానీ, ప్రకృతిని తెలిసికొనగలిగిన జ్ఞానం - చైతన్యం పురుషుడికి ఉన్నాయి. అంతేకాదు - ఈ పురుషుడు నిశ్చలదృష్టితో చూచి తనకన్నా పరతత్త్వం లేదని కూడా గ్రహించగలడు.

క. కావునఁ బ్రకృతి యచేతన । భూవల్లభ! చేతనుండు పురుషుఁడు సమ్య
గ్భావన యలవడిన మునీం । ద్రావళి యిమ్మెయి సునిశ్చయంబుగఁ బలుకున్. 106

ప్రతిపదార్థం: భూవల్లభ!= జనకభూపతీ!; కావునన్= అందుచేత; ప్రకృతి= ప్రకృతితత్త్వమనేది; అచేతన= చైతన్యరహితం; పురుషుఁడు= జీవాత్ముడు; చేతనుండు= చైత్యసహితుడు; సమ్యక్+భావన= సరిగ్గా భావించటమనేది; అలవడిన= అభ్యాసపరచుకొన్న; మునీంద్రావళి= మునీశ్వరుల సమూహం; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; సునిశ్చయంబుగన్= కచ్చితమైన నిశ్చయంగా; పలుకున్= చెప్పుతోంది.

తాత్పర్యం: పైని చెప్పిన కారణంవలన ప్రకృతి అచేతన అనీ, పురుషుడు సచేతనుడనీ తెలుస్తున్నది. ఆలోచనాపరులైన మునీశ్వరులందరూ ఇదే నిశ్చయంగా తెలియజెప్పారు.

వ. అని వెండియు. 107

తాత్పర్యం: అనిచెప్పి మరల ఇట్లా కొనసాగిస్తున్నాడు.

ఆ. తాను బ్రకృతిఁ బ్రకృతి తనయందు నిల్చు ని । ల్చినను దాన వికృతిఁ జెందకుండుఁ
బురుషుఁ డుదకమత్స్యముల యుదుంబరమశ । కముల సంగమంబు కరణి గలుగ. 108

ప్రతిపదార్థం: తాను= పురుషుడు తాను; ప్రకృతిన్= ప్రకృతియందూ; ప్రకృతి= అవ్యక్తం; తనయందున్= తనయందూ; నిల్చున్= నిలుస్తారు; నిల్చినను= అట్లా నిల్చినప్పటికీ; ఉదకమత్స్యముల= నీరూ, చేపలయొక్క; ఉదుంబర మశకముల= మేడి దోమల యొక్క; సంగమంబు-కరణి= కలయికతో పోలిక; కలుగన్= లభించేట్టు; పురుషుఁడు= జీవాత్ముడు; వికృతిన్+చెందక+ఉండున్= ఏ వికారాన్నీ పొందకుండా ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడు ప్రకృతిలో ఉంటాడు. ప్రకృతిని తనలో నిలుపుకొంటాడు. కానీ, ఈ కలయికవలన తానుమాత్రం ఏ వికృతినీ పొందడు. చేప నీళ్ళల్లో ఉన్నట్లూ, ఒకరకం దోమలు మేడిపండులోకి దూరి ఉన్నట్లూ ఈ కలయిక ఉంటుంది. ఇదీ ప్రకృతితో పురుషుడి సాంగత్యం. లీనత్వంలో అలీనత్వం.

విశేషం: 'మేడిపండు చూడ మేలిమై యుండును, పొట్ట విచ్చిచూడ పురుగులుండు' అన్నాడు వేమన్న. ఈ పురుగులు దోమల్లాగానే ఉంటాయి. ఎగిరే పురుగులు. వ్యాసుడూ మశకా లనే అన్నాడు. **"అన్యం చ మశకం విద్యాత్, అన్యచ్చోదుంబరం తథా । న చోదుంబర సంయోగైర్మశకస్తత్ర లిప్యతే॥" (12-303-14)**

ఆ. జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రంబు । గాక యుండునట్టి కమలదళము
భంగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద । ద్వికృతిఁ బొందకుండు వీతదోష! 109

ప్రతిపదార్థం: వీతదోష!= దోషరహితుడా! ఓ జనకమహారాజా!; జలమున్= నీటిని; కదిసి+ఉండి= కలిసి ఉండీ కూడా; జలముచేన్= ఆ నీటితో; ఆర్ద్రంబుకాక+ఉండునట్టి= తడి కాకుండా ఉండేటటువంటి; కమలదళము -భంగిన్= తామరపువ్వు రేకువలె; అంతరాత్మ= జీవాత్ముడు; ప్రకృతిన్= ప్రకృతిని; పొందియును= కలిసీకూడా; తద్+వికృతిన్= దానివలన కలిగే వికారాన్ని; పొందక+ఉండున్= పొందకుండా ఉండగలుగుతాడు.

తాత్పర్యం: తామరపువ్వు గానీ తామర ఆకు గానీ నీళ్ళను తాకుతూ నీళ్ళల్లోనే ఉంటుంది. కానీ, దాని ఆకులకు గానీ రేకులకు గానీ తడి అంటదు. అట్లాగే జీవాత్ముడు ప్రకృతిలో ఉన్నా దాని వికారాలు మాత్రం ఇతడికి అంటవు.

వ. ఇది సాంఖ్యానుభావంబు, యోగంబు తెఱం గెఱింగించెద. 110

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకూ చెప్పినది; సాంఖ్య+అనుభావంబు= సాంఖ్యస్వరూపం; యోగంబు తెఱంగున్= ఇంక యోగం పద్ధతిని; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: ఇంతవరకూ సాంఖ్యయోగం గురించి చెప్పాను. ఇక యోగపద్ధతిని తెలియజేస్తాను.

క. వినుసాంఖ్యసమజ్ఞానం । బును యోగసమానబలము భూవర! లే వెం
దును, నవి రెండును వేఱుగఁ । గను బాలిశుఁ డొక్క తెరువకా నేఁ గందున్. 111

ప్రతిపదార్థం: భూవర!= జనకమహారాజా!; వినుసాంఖ్య= సాంఖ్యంతో; సమ= సమానమైన; జ్ఞానంబును= జ్ఞానమూ; యోగ= యోగంతో; సమాన= సాటివచ్చే; బలమును= బలమూ; ఎందునున్ లేవు= ఇంక ఎక్కడా లేవు; అవి రెండును= ఆ సాంఖ్యయోగాలు రెండింటినీ; బాలిశుఁడు= మూర్ఖుడు; వేఱుగన్+కను= వేరు వేరుగా చూస్తాడు; నేన్= నేను; ఒక్కతెరువు+అకాన్= ఒకే మార్గంగా; కందున్= దర్శిస్తాను, భావిస్తాను.

తాత్పర్యం: జనకమహారాజా! సాంఖ్యంతో సాటివచ్చే జ్ఞానంకానీ, యోగంతో సాటివచ్చే బలంకానీ ఇంక ఎక్కడా- ఏ వేదశాస్త్రాలలోనూ కనిపించవు. మూర్ఖుడు ఈ రెండింటినీ వేరువేరు శాస్త్రాలుగా భావిస్తాడేమో కానీ నేను మాత్రం ఒక్కటిగానే చూస్తాను.

క. జననాథ! మనోధారణ । యును బ్రాణాయామ విధియు నుపయోగ్యములై
చను నిర్గుణమును సగుణం । బును ననఁగా రెండు తంత్రములు యోగమునన్. 112

ప్రతిపదార్థం: జననాథ!= ఓ జనకమహారాజా!; యోగమునన్= ఈ యోగంలో; మనోధారణయును= మనస్సును ఏకాగ్రం చేయటం; ప్రాణ+ఆయామ+విధియున్= ప్రాణాయామం చెయ్యటం - అనేవి; ఉపయోగ్యములై= ఉపయోగింపదగినవిగా; చనున్= ఉంటాయి; నిర్గుణమును= ఒకటి నిర్గుణం; సగుణంబునున్= మరొకటి (ప్రాణాయామం) సగుణం; అనఁగాన్= అని; రెండు తంత్రములు= ఇవి రెండు తంత్రాలు - రెండు ఉపాయాలు.

తాత్పర్యం: మనస్సును ఏకాగ్రం చేయటం, ప్రాణాయామం అనేవి యోగంలో రెండు ప్రధాన తంత్రాలు. వీటిలో మొదటిదానిని నిర్గుణం అంటారు. రెండోదానిని సగుణం అంటారు. మనస్సును ఏకాగ్రం చేయటమే ధ్యానం. అదే మనోధారణ.

క. ప్రాణాయామము గ్రమమునఁ । బ్రాణోత్పీడనము గాని భంగి నడుపుచున్
ఘోణాగ్రస్థితి విషయ । శ్రేణి దొఱఁగి యుండి యోగసిద్ధతఁ బడయున్. 113

ప్రతిపదార్థం: ఘోణ+అగ్రస్థితిన్= నాసిక అగ్రభాగం నుంచి; ప్రాణాయామమున్= ప్రాణాయామాన్ని; క్రమమునన్= ఒక క్రమంతో; ప్రాణ+ఉత్పీడనము= ప్రాణాపాయం; కాని భంగిన్= జరగని పద్ధతిలో; నడుపుచున్= సాగిస్తూ; విషయశ్రేణిన్= ఇంద్రియసుఖాలను; తొఱఁగియుండి= విడిచిపెట్టేసి; యోగసిద్ధతన్= యోగసిద్ధిని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! శ్వాసకు ఇబ్బంది కలగకుండా నాసికాగ్రభాగంనుండి క్రమం తప్పకుండా ప్రాణాయామం నడిపిస్తూ, ఇంద్రియసుఖాలపట్ల ఆసక్తిని వదలించుకొని అభ్యాసకుడు యోగసిద్ధుడు అవుతాడు.

వ. ఎట్లంటేని. 114

తాత్పర్యం: అది ఎట్లా అంటే (ఇదిగో వినుము).

తే. కరము నియతుఁడై కొంతేసి కాలముల శ । రీర ధర్మవిరోధిగా రేయుఁ బగలుఁ
బ్రాణ సంయమనము నడపంగవలయు । దాన చిత్తంబుఁ దనువు శుద్ధత వహించు. 115

ప్రతిపదార్థం: కరమున్= మిక్కిలి; నియతుఁడై= నియమవంతుడై; కొంత+ఏసి+కాలములన్= కొంచెం కొంచెం సేపుగా; శరీరధర్మ+అవిరోధిగాన్= శరీరస్వభావానికి విరోధం కలగకుండా; రేయున్= రాత్రి; పగలున్= పగలూ; ప్రాణసంయమనము= ప్రాణాయామం; నడపంగన్+వలయున్= నడపించాలి; దానన్= దానితో; చిత్తంబున్= అంతరంగమూ; తనువు= బహిరంగమూ (శరీరం); శుద్ధతన్ వహించున్= శుద్ధి పొందుతాయి.

తాత్పర్యం: ప్రాణాయామం అభ్యసించే వ్యక్తి చాలా నియమనిష్ఠలతో ఉండాలి. క్రమక్రమంగా కొంచెం కొంచెం సేపు దాన్ని అభ్యసించాలి. శరీరధర్మానికి ఇబ్బంది కలగని పద్ధతిలో దాన్ని ఆచరించాలి. రేయి కొంతసేపూ, పగలు కొంతసేపూ నడిపించాలి. అట్లా చేస్తే అంతశ్శుద్ధీ బహిశ్శుద్ధీ లభిస్తాయి.

వ. అది సిద్ధత్వసంపదకు మూలం బిది సగుణతంత్రంబు తెఱఁగు, నిర్గుణ తంత్రప్రకారం బెఱిఁగించెద.116

ప్రతిపదార్థం: అది= ప్రాణాయామమూ, దానివల్ల లభించే అంతర్బహిశ్శుద్ధులూ; సిద్ధత్వసంపదకున్= యోగసిద్ధిని పొందటమనే మహాభాగ్యానికి; మూలంబు= మూలం; ఇది= ఇంతవరకూ చెప్పింది; సగుణతంత్రంబు తెఱంగు= సగుణోపాయం తాలూకు పద్ధతి; నిర్గుణతంత్ర ప్రకారంబు= మనోధారణ లేదా ధ్యానం అనే నిర్గుణోపాయం తాలూకు తెరగు; ఎఱిఁగించెదన్= ఇక తెలియజేస్తాను.

తాత్పర్యం: ప్రాణాయామమూ దానివలన లభించే అంతర్బహిశ్శుద్ధులూ, యోగసిద్ధికి మూలం. ఇంతవరకూ చెప్పింది సగుణోపాయ పద్ధతి. ధ్యానం అనే నిర్గుణోపాయాన్ని ఇక తెలియబరుస్తాను.

తే. ఇంద్రియంబులు మనమునం దివురఁజేసి । మనసుఁ దిగిచి యహంకారమున నడంచి
బుద్ధిలోన నహంకృతిఁ బుచ్చి బుద్ధి । ప్రకృతిఁ గలఁపఁ దద్ధ్యానతత్పరత గలుగు. 117

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= ఇంద్రియాలను; మనమునందున్= మనస్సులో; ఇవురన్+చేసి= ఇంకిపోయేట్టు చేసి; మనసున్= మనస్సును; తిగిచి= వెనక్కులాగి; అహంకారమునన్= అహంకారంలో; అడంచి= అణిచివేసి; అహంకృతిన్= ఈ అహంకారాన్ని; బుద్ధిలోనన్= బుద్ధిలో; పుచ్చి= అంతరింప జేసి; బుద్ధి= ఆ బుద్ధి(ని); ప్రకృతిన్= ప్రకృతిలో; కలఁపన్= కలిపినట్లయితే; తద్= ఆ; ధ్యానతత్పరత= ధ్యానతత్పరత్వం; కలుగున్= లభిస్తుంది.

తాత్పర్యం: ఇంద్రియాలను మనస్సులో, మనస్సును అహంకృతిలో, అహంకృతిని బుద్ధిలో, బుద్ధిని ప్రకృతిలో సంలీనం చేసినట్లయితే అదే ధ్యానం. అదే మనోధారణ.

క. ధ్యానైక తత్పరాత్ముఁడు । గానఁబడయు నజరు నిర్వికల్పు విమలు ని
ధ్యానందసత్యశుద్ధ । జ్ఞానమయుం బరము నచలు శాశ్వతుని శివున్. 118

ప్రతిపదార్థం: ధ్యాన+ఏక+తత్పర+ఆత్ముఁడు= ధ్యానంపట్ల అద్వితీయమైన తత్పరత కలిగిన వ్యక్తి; అజరున్= జరలేనివాడూ; నిర్వికల్పున్= వికల్పాలు లేనివాడూ; విమలున్= మలినరహితుడూ; నిత్య+ఆనంద+సత్య+శుద్ధ+జ్ఞానమయున్= నిత్యానందమయుడూ, సత్యమయుడూ, శుద్ధమయుడూ; జ్ఞానమయున్= జ్ఞానమయుడూ; పరమున్= పరతత్త్వం అనబడేవాడూ; అచలున్= నిశ్చలుడూ; శాశ్వతునిన్= శాశ్వతమైనవాడూ అయిన; శివున్= శివుడిని; కానన్+పడయున్= చూడగలడు.

తాత్పర్యం: ధ్యాననిష్ఠ కలిగిన వ్యక్తి - జరావికల్పరహితుడూ, నిర్మలుడూ, నిత్యానందమయుడూ, సత్య-శుద్ధ జ్ఞానమయుడూ, పరముడూ, అచలుడూ, శాశ్వతుడూ అయిన శివుడిని దర్శించగలుగుతాడు.

చ. ఉదిత సమగ్రబోధుఁడగు యోగికి నిశ్చలదీపరూపసం
పద సుఖసుప్తు భంగి ఘనపంక్తులు లేని వియత్తలంబు నొ
ప్పిద మొదవుం దరంగముల పెల్లునఁ దాఁ జలితంబుగాని వా
ర్ధి దశ నతం డకంపుఁ డగు ధీపరివృత్తులు గల్గెనేనియున్. 119

ప్రతిపదార్థం: ఉదిత= ఆవిర్భవించిన; సమగ్ర= పరిపూర్ణమైన; బోధుఁడు+అగు= జ్ఞానం కలవాడైన; యోగికిన్= ధ్యానతత్పరుడికి; నిశ్చల= చలనంలేని; దీప= దీపంయొక్క; రూపసంపద= రూపసంపత్తి; సుఖసుప్తు= ఆదమరిచి నిద్రపోయినవాడియొక్క; భంగి= పోలిక; ఘనపంక్తులు= మేఘాల గుంపులు; లేని= లేనటువంటి; వియత్+తలంబు(యొక్క) ఒప్పిదము= ఆకాశపు చందమూ;

ఒదవున్= లభిస్తాయి; తరంగముల= కెరటాల; పెల్లునన్= అతిశయంతో; తాన్= తాను; చలితంబు= చలించినది; కాని= కానటువంటి; వార్ధి+దశన్= సముద్రంవలె; అతండు= ఆ యోగి; ధీ+పరివృత్తులు= బుద్ధి చాంచల్యాలు; కల్గెనేనియున్= ఎన్ని కల్గినప్పటికీ; అకంపుఁడు+అగున్= కంపించడు - చలించడు.

తాత్పర్యం: పరిపూర్ణ జ్ఞాని అయిన యోగి నిశ్చలదీపంవలె ఉంటాడు. ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నట్లు ఉంటాడు. నిర్మేఘమూ నిర్మలమూ అయిన ఆకాశంవలె ఉంటాడు. బుద్ధిలో మార్పులూ చాంచల్యాలూ ఎన్ని వచ్చినా- తరంగాల తాకిడికి చలించని సముద్రంవలె అతడూ నిశ్చలంగా ఉంటాడు.

విశేషం: అలం: మాలోపమ.

క. భేరీ శంఖాదిక నా - నారవములు వొడమెనేని నాతఁడు దానం
గారింపఁబడఁడు వీతవి । కారస్థితిఁ బొలిచియుండు గగనముభంగిన్. 120

ప్రతిపదార్థం: భేరీ= యుద్ధభేరులూ; శంఖ+ఆదిక= శంఖాలూ మొదలైన; నానా+రవములు= రకరకాల ధ్వనులు; పొడమెనేనిన్= తనచుట్టూ చెలరేగినా; ఆతఁడు= ఆ యోగి; దానన్= ఆ రణగుణధ్వనితో; కారింపఁబడఁడు= హింసింపబడడు; గగనముభంగిన్= ఆకాశంలాగా; వీతవికార స్థితిన్= వికారాలు ఏమీ లేని స్థితితో; పొలిచి+ఉండున్= విరాజిల్లుతూంటాడు.

తాత్పర్యం: భేరీభాంకారాలూ శంఖధ్వంకారాలూ తన చుట్టూ ఎన్ని చెలరేగినా యోగి చలించడు. ధ్యానం భంగపడదు. నిర్వికారంగా నిశ్చలంగా ఆకాశంవలె ఉంటాడు.

క. తేనియకుండఁ గొనుచు సో । పానము లేమఱుట లేక ప్రాఁకిన క్రియ నా
త్మానందరసంబొక కణ । మైనఁ జిలుకనీక తుదికి నాతం డెక్కున్. 121

ప్రతిపదార్థం: తేనియకుండన్= తేనెతో నిండిన కుండను; కొనుచున్= మోస్తూ; సోపానములు= మెట్లు; ఏమఱుటలేక= ఏమరుపాటు లేకుండా; ప్రాఁకిన క్రియన్= అధిరోహించిన విధంగా('క్రియన్' అనేది 'పోలెన్', 'వలెన్' మొదలైన వాటివలె ఉపమావాచకం); ఆత్మానందరసంబు= ఆత్మానందమనే మధురద్రవం; ఒక కణమైనన్= ఒక్క బిందువు కూడా; చిలుకనీక= తొణికి పడనీయకుండా; ఆతండు= ఆ యోగి; తుదికిన్= కొసదాకా; ఎక్కున్= అధిరోహిస్తాడు.

తాత్పర్యం: తేనెకుండ నెత్తిమీద పెట్టుకొని ఏమరుపాటు అనేది లేకుండా మెట్టులు ఎక్కినట్లుగా యోగి తన ఆత్మానందరసం ఒక్క బొట్టు కూడా చిందిపోకుండా అధిరోహించి గమ్యం చేరుకొంటాడు.

విశేషం: అలం: ఉపమ. దీనికి వ్యాసుడి శ్లోకం ఇట్లా ఉన్నది **"తైలపాత్రం యథా పూర్ణం కరాభ్యాం గృహ్య పూరుషః । సంయతాత్మా భయాత్తేషాం న పాత్రాద్బిందు ముత్సృజేత్ । తథైవోత్తరమాణస్య చైకాగ్ర మనసస్తథా ॥"** నూనె నిండిన పాత్రను చేతులతో పట్టుకొని ఒక వీరుడు మెట్టు ఎక్కుతూ ఉంటాడు. అటూ ఇటూ కత్తులవారు ఝళిపిస్తూ ఉంటారు. ఏకాగ్రతను కోల్పోకుండా నూనె బొట్టు తొణికి పడకుండా ఆ వీరుడు అన్ని మెట్లు ఎక్కి పైకి చేరుకొనాలి. చేరుకొంటాడు. అట్లాగే ఆకర్షణలూ ఆటంకాలూ ఎన్ని వచ్చినా యోగి చలించకుండా సాధన కొనసాగించి గమ్యం (ముక్తి) చేరుకొంటాడు. పోలికగా చెప్పిన ఈ అంశం ఒకరకం యుద్ధవిద్య. వీరుడి భౌతికశక్తినీ, బౌద్ధిక శక్తినీ పరీక్షించే విధాన మిది. కరాటే - కుంగ్‌ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో ఇది ఇప్పటికీ ఉన్నది. ఇక్కడ తైలపాత్రను తిక్కన తేనియకుండగా మార్చాడు. ఆత్మానందరసంతో పోల్చటం వలన ఈ మార్పు మరింతగా అందగించింది.

క. అనఘ! యిది యోగపథ మిం । దనలసుఁడై చనఁగఁ జాలు నతఁడు కృతార్థుం
డనితరసులభ పద ప్రా । ప్తినిరూఢుఁ డనామయుం డభిష్టతుఁ డెందున్. 122

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; ఇది= ఈ చెప్పినది; యోగపథము= యోగమార్గం; ఇందున్= ఈ మార్గంలో; అనలసుఁడై= ఏమరుపాటు (అలసత) లేనివాడై; చనఁగఁ జాలునతఁడు= ప్రయాణించగల్గినవాడు; కృతార్థుండు= కృతకృత్యుడు; ఎందున్= సర్వత్ర; అతఁడు; అనితరసులభ= ఇతరులకు అందని; పద= మోక్షపదం యొక్క; ప్రాప్తి= లబ్ధితో; నిరూఢుఁడు= ప్రసిద్ధికెక్కినవాడూ; అనామయుండు= రోగరహితుడూ; అభిష్టుతుఁడు= కొనియాడబడేవాడూను.

తాత్పర్యం: జనకమహారాజా! ఇంతవరకూ చెప్పినది యోగమార్గం. ఈ మార్గంలో ప్రయాణించాలంటే చాలా ఏకాగ్రత ఉండాలి. జాగరూకుడై ప్రయాణించినవాడు కృతార్థుడవుతాడు. ఇతర మార్గాలలో ప్రయాణించేవారికి అంత తేలికగా అందని మోక్షపదం ఇతడికి లభిస్తుంది. అనామయు డవుతాడు. సర్వేసర్వతస్స్తుతిపాత్రుడు అవుతాడు.

వ. అని యుపదేశించి వెండియు. **123**

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; ఉపదేశించి= ఉపదేశం చేసి; వెండియున్= మరల - కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా చెప్పి, మరల (కొనసాగిస్తున్నాడు).

సీ. నరనాథ! యుత్క్రమణప్రదేశంబులు । పాదజంఘూజానుపాయు గుహ్య
ములు నూరుపార్శ్వనాభులు బాహువక్షోగ । ళాననశ్రోత్ర నాసాంబకములు
భ్రూఫాలమస్తకంబులు నోలి విష్ణుండు । వసుసాధ్యమిత్రులు వసుధయును బ్ర
జాపతి మరుదిందు సంక్రందనస్థాణు । లును నరుం డను మహామునియు విశ్వ

తే. దేవదిగ్గంధవహులును బావకుండు । నశ్విపితృ శతానందులు నందు వెలుఁగు
చుండ్రు హృన్మయ పవనక్రమోత్క్రమముల । నొందు నద్దైవతంబుల యోగివరుఁడు.' **124**

ప్రతిపదార్థం: నరనాథ!= మిథిలేశ్వరా!; పాద= కాళ్ళు; జంఘూ= పిక్కలు; జాను= మోకాళ్ళు; పాయు= గుదం; గుహ్యములును= రహస్యాంగాలు అనేవీ; ఊరు= తొడలు; పార్శ్వ= డొక్కలు; నాభులు= బొడ్డు అనేవీ; బాహు= చేతులు; వక్షః= ఉరస్సు; గళ= గొంతు (కంఠం); ఆనన= ముఖం; శ్రోత్ర= చెవులు; నాసా= ముక్కు; అంబకములు= కన్నులు అనేవీ; భ్రూ= కనుబొమలు; ఫాల= నుదురు; మస్తకంబులున్= శిరస్సు - అనేవీ; ఉత్క్రమణ ప్రదేశములు= యోగి హృదయగతమైన ప్రాణవాయువు శరీరంనుంచి ఉత్క్రమించే ప్రదేశాలు; ఓలిన్= క్రమంగా; విష్ణుండు= విష్ణుమూర్తి (పాద); వసు= వసువులు (జంఘూ); సాధ్య= సాధ్యులు; మిత్రులు= సూర్యుడు అనేవారూ; వసుధయును= భూమి (గుహ్య); ప్రజాపతి= ప్రజాపతి అనబడే బ్రహ్మ; మరుత్= మరుత్తులు అనే దేవతలు; ఇందు= చంద్రుడు (నాభి); సంక్రందన= ఇంద్రుడు (బాహు); స్థాణులును= శివుడు (వక్షః); అనేవారూ; నరుండు+అను+మహాముని యున్= నరుడు అనే పేరుగల మహాముని (గళం); విశ్వదేవ= విశ్వేదేవతలు; దిక్= దిక్కులు (శ్రోత్ర); గంధవహులును= వాయువు (నాసా) అనేవారూ; పావకుండు= అగ్ని (అంబకములు); అశ్వి= అశ్వినీ దేవతలు; పితృ= పితృదేవతలు; శతానందులు= శతానందుడు అనబడే మరొక బ్రహ్మ; అందున్= ఆయా అవయవాలలో; వెలుఁగుచుండ్రు= విరాజిల్లుతూ ఉంటారు; యోగివరుఁడు= యోగీశ్వరుడు; హృద్+మయ= హృదయగతమైన; పవన= ప్రాణవాయువుయొక్క; క్రమ+ఉత్క్రమములన్= వరుసగా జరిగిన ఉత్క్రమణాలతో; ఆ+దైవతంబులన్= ఆయా దేవతలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: (యోగీశ్వరుడి శరీరంలో ఏయే ప్రదేశాలనుండి ప్రాణవాయువు ఉత్క్రమిస్తే అతడు ఏయే దేవతల స్థానాన్ని పొందుతాడో ఈ పద్యంలో వివరించి చెప్పాడు). కాళ్ళనుండి ఉత్క్రమిస్తే వైష్ణవస్థానాన్నీ, పిక్కలనుండి

అయితే వసుస్థానాన్ని, మోకాళ్ళనుండి సాధ్యులస్థానాన్ని, గుదప్రదేశంనుండి సూర్యస్థానాన్ని, రహస్యాంగంనుండి వసుధాస్థానాన్ని, తొడలనుండి ప్రజాపతిస్థానాన్ని, పార్శ్వాలనుండి మరుత్తుల స్థానాన్ని, నాభినుండి చంద్రస్థానాన్ని, బాహువులనుండి ఇంద్రస్థానాన్ని, రొమ్మునుండి స్థాణుత్వాన్ని, గళంనుండి నరుడనే మునీశ్వరుడి స్థానాన్ని, ముఖంనుండి విశ్వేదేవత్వాన్ని, చెవులనుండి దిక్కుల స్థానాన్ని (దిక్పాలకత్వమేమో **దిశః శ్రోత్రేణ చాప్నుయాత్** అని మూలం), నాసికనుండి వాయుత్వాన్ని, నేత్రాలనుండి పావకత్వాన్ని, కనుబొమలనుండి అశ్వినీదేవత్వాన్ని, ఫాలంనుండి పితృదేవతల స్థానాన్ని, మస్తకంనుండియితే శతానందత్వాన్ని పొందుతాడు'.

విశేషం: పాఠాంతరాలతో సరిజూచుకొంటే ఆంధ్రీకరణం యథామూలంగా సరిపోతోంది. (12-305-1 నుండి 7 శ్లోక్లాలు)

యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణసూచకంబులఁ జెప్పుట (సం. 12-305-7)

వ. అని చెప్పి మఱియు నిట్లను 'నరిష్టంబుల తెఱం గెఱుంగవలయుం గావున నెఱింగించెద నాకర్ణింపుము.' **125**

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పి= వివరించి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు; అరిష్టంబుల తెఱంగు= అరిష్టాలు ఎట్లా ఉంటాయో; ఎఱుంగన్ వలయున్= తెలుసుకోవాలి; కావునన్= కాబట్టి; ఎఱింగించెదన్= తెలియజేస్తాను; ఆకర్ణింపుము= ఆలించు.

తాత్పర్యం: 'ప్రాణోత్క్రమణవేళ అరిష్టసూచకాలను వివరిస్తాను తెలిసికొమ్ము' అని యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుకు చెప్పుతున్నాడు.

సీ. 'ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి । గంటికిఁ గలుగంగఁ గానకున్న
ముక్కున వలపటఁ జెక్కవాసినయట్లు । దోఁచినఁ బూర్ణచంద్రుండు మలినుఁ
డై కానవచ్చిన నాయువు సంవత్స । రంబునఁ గడచను రాజముఖ్య!
కాంతి దొల్లిటియట్లుగాక యంతకు నెక్కు । డైనను గడుఁజెడ్డ నట్లు ప్రజ్ఞ

తే. క్రొత్తగాఁ బెద్దయైనను గొంచెమైన । నాఱునెలల మరణదశ యగుట గలుగు
నిందుమండలమున రవి యందు నడుమఁ । దెఱపి గాంచినఁ దెగు నేడు దివసములకు. **126**

ప్రతిపదార్థం: రాజముఖ్య!= ఓ రాజోత్తమా!; ధ్రువమండలమునన్= సప్తర్షిమండలంలో; అరుంధతిన్= అరుంధతీ నక్షత్రాన్ని; కనుశక్తి= చూడగలిగిన శక్తి; కంటికిన్= నేత్రాలకు; కలుగంగన్= ఉన్నప్పటికీ; కానకున్నన్= చూడలేక పోతే; ముక్కునన్+వలపటన్= ముక్కు కుడివైపున; చెక్క+పాసినయట్లు= ముక్కు తెగిపోయినట్లు; తోఁచినన్= కనిపించినట్టయితే; పూర్ణచంద్రుండు= నిండు జాబిల్లి; మలినుఁడై= మసకబారి; కానవచ్చినన్= కనిపించినట్టయితే; ఆయువు= అటువంటివాడి ఆయుర్దాయం; సంవత్సరంబునన్= ఒక సంవత్సరకాలంలో; కడచను= అంతం అవుతుంది; కాంతి= తేజస్సు; తొల్లిటి+అట్లు గాక= మునుపటివలె కాకుండా; అంతకున్+ఎక్కుడు+ఐననున్= అంతకంటే ఎక్కువ అయినా; కడున్+చెడ్డన్= లేదా పూర్తిగా చెడిపోయినా; అట్లు= అట్లాగే; ప్రజ్ఞ= తెలివి అనేది; క్రొత్తగాన్= ఉన్నట్టుండి; పెద్దయైననున్= గొప్పగా అతిశయించినా; కొంచెము+ఐనన్= బాగా తరిగిపోయినా; ఆఱునెలలన్= ఆరుమాసాల్లో; మరణదశ+అగుట= మరణ దశ ప్రాప్తించటం; కలుగున్= జరుగుతుంది; ఇందుమండలమునన్= చంద్రబింబంలోనూ; రవియందున్= సూర్యబింబంలోనూ; నడుమన్= మధ్యభాగంలో; తెఱపి= వెలితి; కాంచినన్= కనిపించినట్లయితే; ఏడు దివసములకున్= కేవలం వారం రోజుల్లో; తెగున్= వాడు మరణిస్తాడు.

తాత్పర్యం: 'జనకమహారాజా! సప్తర్షిమండలంలో అరుంధతిని చూడగలిగిన శక్తి కంటికి ఉన్నా అరుంధతి కనపడకపోతే వాడి ఆయుర్దాయం ఇక సంవత్సరమే అని గ్రహించుము. నాసికకు కుడివైపున ఒక ముక్కు ఊడిపోయినట్లు తన చూపులకే అనిపిస్తే వాడు కూడా సంవత్సరంకంటె జీవించడు. అట్లాగే నిండు చందమామ మకిలిపట్టినట్టు బూజురు బూజురుగా కనిపిస్తే అతడూ అంతే - సంవత్సరం తరువాత మరి ఉండడని తెలిసికొమ్ము. ముఖవర్చస్సు ఇదివరకువలె కాకుండా బాగా పెరిగినట్లు కనపడినా తరిగినట్లుగా కనపడినా, తెలివికూడా అట్లాగే బాగా పెరిగినట్లో తరిగినట్లో అనిపించినా వాడు ఆరునెలల్లో సెలవు తీసికొంటాడని గుర్తించుము. సూర్యచంద్రబింబాలలో తొరైలు కనపడితే వాడు వారం రోజులకంటె బ్రతుకడు సుమా!

క. విను గుడిలోనున్న సమయ । మున సురభిద్రవ్యములను బొల వల్చుట గ
ల్గిన నాఱు దివసములఁ గ । ల్గును మృత్యుసమాగమంబు గుణరత్ననిధీ! 127

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ!= గుణసముద్రుడా - జనకమహారాజా! వినుము; గుడిలోన్+ఉన్న+సమయమునన్= కోవెలలో కూర్చున్న తరుణంలో; సురభిద్రవ్యములను= పువ్వులూ, గంధం మొదలైన పరిమళవస్తువుల్లో; పొల వల్చుట= దుర్గంధ విజృంభణ; కల్గినన్= తనకు అనిపిస్తే; ఆఱు దివసములన్= ఆరు రోజులలో; మృత్యు సమాగమంబు= మృత్యుప్రాప్తి; కలుగున్= అవుతుంది.

తాత్పర్యం: సద్గుణసముద్రుడా! మరొక విషయం చెప్పుతున్నాను గ్రహించుము. కోవెలలోకి వెళ్ళినప్పుడు అక్కడున్న గంధపుష్పాది సుగంధద్రవ్యాలు ఎవడి ముక్కుకి దుర్గంధంవలె సోకుతాయో వాడు ఆరునెలల్లో 'హరీ' అంటాడని తెలిసికొమ్ము.

విశేషం: 'పొల వల్చుట' అని మాత్రమే అన్నాడు తిక్కన. కానీ వ్యాసుడు శవం కంపు కొట్టటం అన్నాడు. **"శవగంధముపాఘ్రాతి సురభిం ప్రాప్య యో నరః । దేవతాయతనస్థస్తు షడ్రాత్రేణ స మృత్యుభాక్ ॥" (12-305-14).**

తే. ముక్కువ్రాలుట కర్ణముల్ మ్రొగ్గఁబడుట । రదనవైవర్ణ్యమక్షి విరాగభావ
మంగ మతికృష్ణ మగు టుల్ల మడరఁ జెడుట । సూచకములు సద్యోమృత్యు గోచరతకు. 128

ప్రతిపదార్థం: ముక్కు= నాసిక; వ్రాలుట= ఒరిగిపోవటం; కర్ణముల్= చెవులు; మ్రొగ్గఁబడుట= వాలిపోవటం; రదన= దంతాల; వైవర్ణ్యము= రంగు మారిపోవటం; అక్షి= నేత్రాల; విరాగభావము= విరక్తి; అంగము= శరీరం; అతికృష్ణము+అగుట= బాగా నల్లబడటం; ఉల్లము= హృదయం; అడరన్+చెడుట= స్పందన కోల్పోవటం; సద్యోమృత్యు గోచరతకున్= వెంటనే మృత్యువు ప్రత్యక్షమవుతుంది అనటానికి; సూచకములు= చిహ్నాలు.

తాత్పర్యం: చెవులూ, ముక్కూ వాలిపోవటం, దంతాలు రంగు మారిపోవటం, కన్నులు నిర్జీవంగా అయిపోవటం, శరీరమంతా మాడిపోయినట్టు నల్లబడటం, హృదయస్పందన కోల్పోవటం - ఇవన్నీ సద్యోమృత్యువుకు సూచకాలు.

తే. కారణము లేక దాపలి కను ద్రవించు । నెత్తి చక్కటి ధూమంబు నెగయు నపుడ
మరణదశ యావహిల్లెడు మానవునకు । జనకనృప! యివి బ్రహ్మ సెప్పిన విధములు. 129

ప్రతిపదార్థం: జనకనృప!= జనకమహారాజా!; కారణములేక= కారణం ఏదీ లేకుండానే; దాపలి కను= ఎడమకన్ను; ద్రవించున్= నీరు కారుతుంది; నెత్తిచక్కటిన్= నెత్తిమీద; ధూమంబు= పొగ; నెగయున్= ఎగసిపడుతుంది; మానవునకున్= ఇవి జరిగిన మానవుడికి; మరణదశ= చివరిదశ; అపుడు+అ= ఆ క్షణంలోనే; ఆవహిల్లెడున్= ప్రాప్తిస్తుంది; ఇవి= ఇవన్నీ; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; చెప్పిన= వివరించిన; విధములు= తీరులు.

తాత్పర్యం: అకారణంగా ఎడమకన్ను నీరోడినా, నెత్తిమీదనుంచి పొగలు రేగినా ఆ మానవుడు తత్ క్షణమే మరణిస్తాడని సూచన. ఇవన్నీ బ్రహ్మదేవుడు స్వయంగా చెప్పిన విషయాలు సుమా!

క. విను యోగివరుఁ డరిష్టము । కనుఁగొని యనిశమును యోగగతియుతసాంఖ్యం
బనపాయత నడుపుచు నా । త్మునిఁ బరముం జేర్చి కాలముం గబళించున్. 130

ప్రతిపదార్థం: విను= రాజా! ఆలకించుము; యోగివరుఁడు= యోగీశ్వరుడు; అరిష్టము= అశుభాన్ని; కనుఁగొని= పైని చెప్పిన మరణ సూచకాలతో గ్రహించి; అనిశమును= ఎల్లప్పుడూ; యోగగతియుత= యోగమార్గంతో కూడిన; సాంఖ్యంబున్= సాంఖ్యవిద్యను; అనపాయతన్= విడిచిపెట్టకుండా; నడుపుచున్= సాగిస్తూ; ఆత్మునిన్= జీవాత్ముడిని; పరమున్ చేర్చి= పరమాత్మను చేర్చి; కాలమున్= కాలాన్ని; కబళించున్= స్వాయత్తం చేసుకుంటాడు - స్వాధీనపరచుకుంటాడు.

తాత్పర్యం: ఆయా మరణసూచకాలతో యోగీశ్వరుడు అరిష్టాన్ని గుర్తించి, యోగమార్గం విడువకుండా సాగిస్తూ, జీవాత్మను పరమాత్మతో అనుసంధానించి, కాలాన్ని స్వాధీనపరుచుకొంటాడు.

వ. ఇవ్విధమున నతండు. 131

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ పద్ధతిగా; అతండు= ఆ యోగీశ్వరుడు.

తాత్పర్యం: ఈ విధంగా ఆ యోగీశ్వరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కాల కబళనైక శీలుఁడై మృత్యువు । గెలిచి శాశ్వతము నచలము శివము
నచ్యుతము ననామయము నమృతము నవ్య । యంబు నగు పదంబునందు నిలుచు.' 132

ప్రతిపదార్థం: కాల= కాలాన్ని; కబళన= స్వాధీనపరచుకోవటమనే; ఏక= (ఒకే ఒక్క) అద్వితీయమైన; శీలుఁడై= స్వభావం కలవాడై; మృత్యువున్= మృత్యువును; గెలిచి= జయించి; శాశ్వతమున్= నిత్యమైనదీ; అచలమున్= చలించనిదీ; శివమున్= శుభప్రదమైనదీ; అచ్యుతమున్= చ్యుతిలేనిదీ; అనామయమున్= రోగరహితమైనదీ; అమృతమున్= మరణంలేనిదీ; అవ్యయంబున్= మార్పులేనిదీ; అగు= అయినటువంటి; పదంబునందున్= స్థానంలో; నిలుచున్= నిలుస్తాడు.

తాత్పర్యం: యోగీశ్వరుడు కాలాన్ని కబళించే శీలంతో మృత్యువును జయించి, శాశ్వతాదిలక్షణాలు కలిగిన అవ్యయ పదాన్ని పొందుతాడు'.

వ. అని పలికి యాజ్ఞవల్క్య మునీశ్వరుండు జనకజనేశ్వరుతోఁ 'బరంబు దేటపఱుపు మని నీ వడిగి; తా ప్రశ్నంబు
సూక్ష్మం; బుత్తరం బవహితుండ వయి వినుమ'ని యిట్లనియె. 133

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లా చెప్పి; యాజ్ఞవల్క్యమునీశ్వరుండు= యాజ్ఞవల్క్యుడు; జనక+జన+ఈశ్వరుతోన్=జనకమహారాజుతో; పరంబు= పరతత్త్వాన్ని; తేటపఱుపుము+అని= విశదీకరించుమని; నీవు; అడిగితి(వి)= అడిగావు; ఆ ప్రశ్నంబు= ఆ ప్రశ్న; సూక్ష్మంబు= చాలా సూక్ష్మమైనది; ఉత్తరంబు= సమాధానం; అవహితుండవు+అయి= సావధానుడవై; వినుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా వివరించాడు.

తాత్పర్యం: అని చెప్పి యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుతో 'పరతత్త్వాన్ని విశదీకరించు మని అడిగావు. ఆ ప్రశ్న చాలా సూక్ష్మమైనది' అంటూ ఇట్లా కొనసాగించాడు.

సీ. 'మహనీయతపమున మార్తాండు నాకుఁ బ్ర । సన్నుఁగాఁ జేసితి సదయదృష్టి
ననుఁజూచి యద్దేవుఁ డనఘ! వరంబు నీ । కిచ్చెద నీ కోర్కి యెద్ది? సెప్పు
మనవుడుఁ బ్రణతుండనై యజుస్సంప్రాప్తి । గోరెద ననిన నవ్వారిజాప్తుఁ
డట్లేని వాగ్దేవి నావహించెద విప్ర । తంబుగాఁ జేయు మాస్యంబు విప్ర!

తే. యనియె నవ్వచనము విని యాననమ్ము । సంతసమున విచ్చితి సరస్వతియు నాదు
తనువుఁ జొచ్చెఁ బదంపడి దాహమొంది । తన్ను నెఱుఁగక వెగడొందు నన్ను నినుఁడు. 134

ప్రతిపదార్థం: మహనీయ తపమునన్= గొప్ప తపస్సుతో; మార్తాండున్= సూర్యుడిని; నాకున్= నాకు; ప్రసన్నుఁగాన్= ప్రసన్నుడిగా; చేసితిన్= చేసికొన్నాను; ఆ+దేవుఁడు= ఆ సూర్యభగవానుడు; సదయదృష్టిన్= కరుణగల చూపులతో; ననున్+చూచి= నన్ను వీక్షించి; అనఘ!= ఓ పవిత్రుడా! యాజ్ఞవల్క్యుడా!; వరంబున్= ఒక వరాన్ని; నీకున్+ఇచ్చెదన్= నీకు ఇస్తాను; నీ కోర్కి= నీ కోరిక; ఎద్ది?= ఏమిటి?; చెప్పుము= చెప్పు; అనవుడున్= అని సూర్యుడు అనగానే; ప్రణతుండను+ఐ= నమస్కరించినవాడిని అయి; యజుఃసంప్రాప్తిన్= యజుర్వేద లబ్ధిని; కోరెదన్= కోరుకుంటున్నాను; అనినన్= అని నేను అడగగానే; ఆ+వారిజ+ఆప్తుఁడు= పద్మాలకు ఆప్తుడైన ఆ సూర్యుడు; అట్లు+ఏనిన్= అట్లాగయితే; వాగ్దేవిన్= సరస్వతిని; ఆవహించెదన్= ఆవహింపజేస్తాను; విప్ర!= ఓ బ్రాహ్మణుడా!; ఆస్యంబున్= నీ నోటిని; వివృతంబుగాన్+చేయుము= బాగా తెరుచుకునేట్టు చెయ్యి; అనియెన్= అన్నాడు; ఆ+వచనము= ఆ మాట; విని= ఆలించి (పాటించి); సంతసమునన్= సంతోషంతో; ఆననమ్మున్= నా నోటిని; విచ్చితిన్= తెరిచాను; సరస్వతియున్= వాగ్దేవి; నాదు తనువున్= నా శరీరాన్ని; చొచ్చెన్= ప్రవేశించింది; పదంపడి= వెనువెంటనే; దాహము+ఒంది= మంటలకు లోనై; తన్నున్+ ఆ సూర్యభగవానుడిని; ఎఱుఁగక= గుర్తించలేక; వెగడు+ఒందు= తల్లడిల్లుతున్న; నన్నున్= నన్ను; ఇనుఁడు= ఆ సూర్యదేవుడు.

తాత్పర్యం: 'జనకమహారాజా! ఒకప్పుడు నేను గొప్ప తపస్సుచేసి సూర్యభగవానుడిని మెప్పించాను. ఆ దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొనుమన్నాడు. అయితే 'నాకు యజుస్సులను సంప్రాప్తింపజేయుము' అని అడిగాను. 'సరే అట్లాగే. సరస్వతీదేవిని ఆవహింపజేస్తాను. నోరు పెద్దదిగా తెరువుము' - అన్నాడు సూర్యుడు. నేను ఆనందంతో నోరు తెరిచాను. సరస్వతి శరీరంలోనికి ప్రవేశించింది. వెంటనే శరీరం భగభగ లాడిపోయింది. తట్టుకొనలేక ఎదురుగా ఉన్న సూర్యుడిని గుర్తుపట్టలేక తల్లడిల్లిపోయాను. అట్లాంటి నన్ను చూచి ఆ సూర్యుడు (ఇట్లా అన్నాడు).

క. కనుఁగొని యించుకసేపునఁ । దనువడు నని పలికెఁ బిదపఁ దనువడుటయునుం
బనుపడియె నప్పు డద్దే । వుని వదనాబ్జమున నా చెవుల కింపారన్. 135

ప్రతిపదార్థం: కనుఁగొని= నన్నుచూసి; ఇంచుకసేపునన్= కొంచెం సేపట్లో; తనువడున్= చల్లబడుతుంది; అని పలికెన్= అని అన్నాడు; పిదపన్= అటు తరువాత; తనువడుటయునున్= చల్లపడటమనేది కూడా; పనుపడియెన్= జరిగిపోయింది; అప్పుడు= ఆ సమయాన; ఆ+దేవుని= ఆ సూర్యదేవుడి; వదన+అబ్జమునన్= ముఖ పద్మంనుంచి; నా చెవులకున్= నా కర్ణేంద్రియాలకు; ఇంపారన్= ఇంపు అతిశయించేట్టు.

తాత్పర్యం: సూర్యుడు నన్ను చూచి 'ఓ విప్రుడా! కొంచెంసేపు తట్టుకొమ్ము. మంటలు చల్లబడతాయి' అన్నాడు. అనట మేమిటి చల్లబడటం కూడా జరిగిపోయింది. అప్పుడు సూర్యుడి ముఖపద్మంనుండి నా చెవులకు ఇంపుగా కొన్ని పలుకులు వినిపించాయి.

విశేషం: 'వదనాబ్జమునుండి నా చెవులకింపారన్ అని ఉండవలసిన పంచమీవిభక్తికి బదులుగా 'వదనాబ్జమునన్' అని సప్తమీవిభక్తి నిలిచింది. దీనిని బాలవ్యాకర్త సూత్రించాడు. 'ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగా నగు'

(కారక - 11) 'వదనాబ్జముననుండి' అన్న చోట ఉన్న 'ఉండి' శబ్దానికి లోపం బహుళంబుగా వస్తుందని ప్రౌఢవ్యాకర్త సూత్రించాడు. 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తములమీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు (కారక -11)' 'వదనాబ్జమున నా చెవుల కింపారన్.'

క. భూసురవర! వేదము ప్రతి । భాసిల్లుచు సంతతప్రపత్తి గలుగు ను
ల్లాసంబు బుద్ధినొందు స । మాసన్నంబు లగు సాంఖ్యమతయోగంబుల్. 136

ప్రతిపదార్థం: భూసురవర!= ఓ బ్రాహ్మణోత్తమా! యాజ్ఞవల్క్యుడా!; వేదము= నీవడిగిన యజుర్వేదం; ప్రతిభాసిల్లుచున్= విరాజిల్లుతూ; సంతతప్రపత్తి= శాశ్వత శరణాగతి; కలుగున్= నీకు లభిస్తుంది; ఉల్లాసంబు= వికాసం; బుద్ధిన్= నీ బుద్ధిని; ఒందున్= పొందుతుంది; సాంఖ్యమతయోగంబుల్= సాంఖ్యమతమూ, యోగమూ; సమాసన్నంబులు+అగున్= నిన్ను చేరుకుంటాయి.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యమహర్షీ! వేదం నీకు లభిస్తుంది. నీ బుద్ధి వికసిస్తుంది. సాంఖ్యయోగాలు నీకు ప్రాప్తిస్తాయి. (వేదం భాసించే ప్రపత్తితో ఉన్న ఉల్లాసం బుద్ధికి కలుగుతుందని గానీ).

ఆ. యోగసాంఖ్య సిద్ధినొందు నిష్టావాప్తి । సనుము సమ్మదమున' నను మృదూక్తు
లుద్భవించె మోద ముత్కట మయ్యె నా । కమృతవృష్టిఁ దోఁగినట్టు లైతి. 137

ప్రతిపదార్థం: యోగసాంఖ్య సిద్ధిన్= యోగసాంఖ్యాల సిద్ధితో; ఒందు+ఇష్ట+అవాప్తిన్= లభించేటువంటి ఇష్టావాప్తితో; సమ్మదమునన్= సంతోషంగా; చనుము= వెళ్ళము; అను= అనేటువంటి; మృదు+ఉక్తులు= మృదువైన మాటలు; ఉద్భవించెన్= వెలువడ్డాయి; నాకున్= నాకు; మోదము= ఆనందం; ఉత్కటము+అయ్యెన్= అతిశయించింది; అమృతవృష్టిన్= అమృతవర్షంలో; తోఁగినట్టులు+ఐతిన్= ఓలలాడినట్టు అయ్యాను.

తాత్పర్యం: యోగసాంఖ్యాల సిద్ధివలన కలిగే ఇష్టావాప్తి నీకు లభిస్తుంది. ఆనందంగా వెళ్ళము' అనే మెత్తని పలుకులు సూర్యుడి నోటినుండి నా చెవులకు సోకాయి. నా ఆనందానికి అవధులు లేవు. అమృతవర్షంలో దొప్పదోగినట్టు అయ్యాను.

విశేషం: అలం: ఉపమ.

వ. తదనంతరంబ యద్దేవుం డస్తాచలంబువలని కరిగె; నేనుం బరమానందకందళిత మనస్కుండ నగుచు
మందిరంబున కేతెంచి సరస్వతిం దలంచుచున్నంత - 138

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; ఆ+దేవుండు= ఆ సూర్యభగవానుడు; అస్తాచలంబువలనికిన్= పశ్చిమాద్రి వైపునకు; అరిగెన్= వెళ్ళిపోయాడు; నేనున్= నేనుకూడా; పరమానంద= గొప్ప ఆనందంతో; కందళిత= పులకించిన; మనస్కుండను+అగుచున్= మనస్సుకలవాడను అవుతూ; మందిరంబునకున్= ఇంటికి; ఏతెంచి= తిరిగివచ్చి; సరస్వతిన్= వాగ్దేవిని; తలంచుచున్+ఉన్నంతన్= ధ్యానిస్తూండగా.

తాత్పర్యం: తరువాత ఆ సూర్యభగవానుడు పశ్చిమదిక్కుగా వెళ్ళిపోయాడు. నేను మిక్కిలి సంతోషిస్తూ ఇంటికి వచ్చి సరస్వతీదేవిని ధ్యానిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుము వినుతస్వరవ్యం । జనభూషిత యగ్రభాగ సంస్ఫురదోంకా
రనితాంత హృద్యమధుగ । ర్భనిజాకృతి విశదముగ సరస్వతి దోఁచెన్. 139

ప్రతిపదార్థం: వినుము= జనకమహారాజా! ఆలకించుము; వినుత= పొగడొందిన; స్వర= అచ్చులూ; వ్యంజన= హల్లులతో; భూషిత= అలంకరింపబడినదీ; అగ్రభాగ= ఉపరిభాగంలో; సంస్ఫురత్= విరాజిల్లుతున్న; ఓంకార= ప్రణవం కలదీ; నితాంత= మిక్కిలి; హృద్య= మనోహరమైన; మధు= తీయందనం- మకరందం; గర్భ= మధ్యభాగంలోగల; నిజ+ఆకృతి= తన ఆకారం కలదీ; ఐన సరస్వతి= భారతి; విశదముగన్= స్పష్టంగా; తోఁచెన్= భాసించింది.

తాత్పర్యం: మిథిలాధిపతీ! ఓంకారం అగ్రభాగంలో ఉండగా అచ్చులూ హల్లులతో అలంకరింపబడిన సరస్వతి నాకు ప్రత్యక్షం అయింది. హృద్యమైన మధువు ఆ రూపానికి మధ్యభాగంలో భాసిస్తోంది. ఈ రూపం నాకు స్పష్టంగా కనిపించింది.

విశ్వావసునకు యాజ్ఞవల్క్యఁ డుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-306-30)

వ. తోఁచిన నత్యంతభక్తిం బ్రపత్తిసేసి సూర్యప్రసాదలబ్ధయుఁ బంచ దశశాఖా సమన్వితయు నిఖిలోత్తర సంహితయు నగు నయ్యజుర్వచోమూర్తి ధరియించి శిష్యులం బరిగ్రహించి వారల నధ్యయనంబు సేయించుచు నివ్వాఙ్మయ బ్రహ్మంబునందు వేదితవ్యం బెయ్యదియో యని విచారింప విరోచనుమహానుభావంబునం జేసి యోగసాంఖ్య రూపోపాయ ప్రకారంబు దోఁచెఁ బదంపడి తదుపేయంబగు వేదవేద్యంబును నద్దేవుని కరుణావిశేషంబునం బ్రతిభాసించెఁ గొండొక కాలంబునకు విశ్వావసుం డను గంధర్వేశ్వరుండు నాకడకుం జనుదెంచి తన్నెఱింగించి యేనుజేయు నతిథిపూజనం బత్యాదరంబునఁ గైకొని 'విశ్వావిశ్వంబులు మిత్రావరుణులు జ్ఞానజ్ఞేయంబులుఁ దపోzతపంబులు సూర్యాతిసూర్యులు విద్యావిద్యలు వేద్యావేద్యంబులుం జలాచలంబులు ననునవి వేదోదితంబులు వానిం దేటపఱుపవే' యని యడిగిన నవహితుండవై వినుమని పలికి - విశ్వంబు భూతభవ్యభవత్కరం బగు నవ్యక్తం బవ్యక్తనామ ప్రకృతి య; విశ్వంబు నిర్గుణుండగు పురుషుండు; మిత్రావరుణులు పురుష ప్రకృతులు, జ్ఞానజ్ఞేయంబులుఁ దపోzతపంబులు సూర్యాతిసూర్యులును ప్రకృతిపురుషుల కానఱుంగుము. విద్యావిద్యా వేద్యావేద్యా చలచలంబులను శబ్దంబులు వరుసం బురుషునకుం బ్రకృతికిని వాచకంబు లని చెప్పి వెండియు నిట్లనియె. 140

ప్రతిపదార్థం: తోఁచినన్= సరస్వతీదేవి ప్రత్యక్షమయ్యేసరికి; అత్యంత భక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రపత్తి+చేసి= శరణాగతి చేసి; సూర్య= సూర్యదేవుడి; ప్రసాద= అనుగ్రహంతో; లబ్ధయున్= చేకూరినదీ; పంచదశ= పదిహేను; శాఖా= శాఖలతో; సమన్వితయున్= కూడుకొన్నదీ; అగు= అయిన; ఆ+యజుఃవచఃమూర్తిన్= యజుర్వేదం అనే ఆ సరస్వతిని; ధరియించి= ఆవాహన చేసికొని; శిష్యులన్= కొందరు శిష్యులను; పరిగ్రహించి= స్వీకరించి; వారలన్= వారితో; అధ్యయనంబు+చేయించుచున్= యజుశ్శాఖల అధ్యయనం చేయిస్తూ; ఈ+వాఙ్మయ బ్రహ్మంబునందున్= ఈ వాగ్రూపమైన యజుర్వేదంలో; వేదితవ్యంబు= తెలిసికొనవలసినది; ఏ+అదియో= ఏదో; అని; విచారింపన్= ఆలోచిస్తుండగా; విరోచను= సూర్యుడియొక్క; మహా+అనుభావంబునన్+చేసి= గొప్ప మాహాత్మ్యంతో; యోగ - సాంఖ్యరూప= యోగం సాంఖ్యం అనే రూపంగల; ఉపాయప్రకారంబు= ఉపాయవిధానం; తోఁచెన్= కనిపించింది; పదంపడి= తరువాత; తద్= ఆ ఉపాయంతో; ఉపేయంబు+అగు= పొందదగినదై; వేదవేద్యంబును= వేదంతో మాత్రమే తెలుసుకోవలసిన తత్త్వం కూడా; ఆ+దేవుని= ఆ సూర్యభగవానుడి; కరుణా విశేషంబునన్= దయావిశేషంతో; ప్రతిభాసించెన్= స్ఫురించింది; కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; విశ్వావసుండు+అను= విశ్వావసుడు అనే; గంధర్వ+ఈశ్వరుండు= గంధర్వప్రభువు; నా కడకున్= నా వద్దకు; చనుదెంచి= వచ్చి; తన్నున్+ఎఱింగించి= తన పరిచయం చెప్పుకుని; ఏను= నేను; చేయు= చేసిన; అతిథిపూజనంబు= అతిథిమర్యాదలను; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; కైకొని= స్వీకరించి; విశ్వ+అవిశ్వంబులున్= విశ్వమైనదీ, విశ్వంకానిదీ; మిత్రావరుణులు= మిత్రుడూ, వరుణుడూ అనేవారూ;

జ్ఞాన జ్ఞేయంబులున్= జ్ఞానమూ, జ్ఞేయమూ అనేవీ; తపః+అతపంబులున్= తపస్సయినదీ తపస్సు కానిదీ; సూర్య+అతిసూర్యులున్= సూర్యుడూ, అతిసూర్యుడూ అనేవీ; విద్యా+అవిద్యలు= విద్య అయినదీ, విద్యకానిదీ; వేద్య+అవేద్యంబులున్= తెలిసికొనదగినదీ తెలిసికొనదగనిదీ; చల+అచలంబులున్= చలించేదీ, చలించనిదీ; అనునవి= అనే ఇవన్నీ; వేద+ఉదితంబులు= వేదోక్తాలు; వానిన్= వాటిని; తేటపఱుపవే= నాకు తెలియజెప్పవా; అని; అడిగినన్= అభ్యర్థిస్తే; అవహితుండవు+ఐ= సావధానుడవై; వినుము; అని; పలికి= చెప్పి; భూతభవ్య భవత్కరంబు+అగు= భూతకాలమూ, భవిష్యత్కాలమూ, వర్తమానకాలమూ అనేవాటిని రూపొందించే; అవ్యక్తనామప్రకృతి= అవ్యక్తం అనబడే ప్రకృతియే; విశ్వంబు= విశ్వము అనబడుతుంది; నిర్గుణుండు+అగు= సత్త్వాది గుణరహితుడైన; పురుషుండు= పురుషుడే; అవిశ్వంబు= అవిశ్వం అనబడేది; మిత్రావరుణులు= మిత్రుడూ, వరుణుడూ అనేవారు; పురుష ప్రకృతులు= వరుసగా పురుషుడూ, ప్రకృతీ; జ్ఞానజ్ఞేయంబులున్= జ్ఞానమూ, జ్ఞేయమూ అనేవీ; తపః+అతపంబులున్= తపస్సూ అతపస్సూ అనేవీ; సూర్య+అతిసూర్యులును= సూర్యుడూ, అతిసూర్యుడూ అనేవీ; ప్రకృతిపురుషులు+అ కాన్= వరుసగా ప్రకృతి పురుషులు అని; ఎఱుంగుము= తెలుసుకో; విద్యా+అవిద్యా= విద్య, అవిద్యలూ; వేద్య+అవేద్య= వేద్య, అవేద్యాలూ; అచల+చలంబులు= అచలమూ, చలమూ; అను= అనేటువంటి; శబ్దంబులు= పదాలు; వరుసన్= క్రమంగా; పురుషునకున్= పురుషుడికీ; ప్రకృతికిని= ప్రకృతికీ; వాచకంబులు= బోధకాలు; అని చెప్పి= అని వివరించి; వెండియున్= తిరిగి ఇంకా; ఇట్లు+అనియెన్= యాజ్ఞవల్క్యుడు గంధర్వుడితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: ధ్యానంలో సాక్షాత్కరించిన సరస్వతీదేవిని నేను (యాజ్ఞవల్క్యుడు) శరణు వేడగా సూర్యానుగ్రహంతో పదిహేను శాఖల యజుర్వేదం స్ఫురించింది. దానిని శిష్యులకు నేర్పి, వేదవేద్యమైన తత్త్వాన్ని సాంఖ్యయోగాల సహాయంతో తెలిసికొనగలిగాను. ఇట్లా కాలం గడుస్తున్నది. ఒకనాడు విశ్వావసువు అనే గంధర్వుడు నా దగ్గరకు వచ్చాడు. పదిహేను ప్రశ్నలు వేసాడు. అన్నింటికీ సమాధానాలు చెప్పాను. విశ్వావిశ్వాలూ మిత్రావరుణులూ జ్ఞానజ్ఞేయాలూ తపోతపస్సులూ, సూర్యాతిసూర్యులూ, విద్యావిద్యలూ, వేద్యావేద్యాలూ, చలాచలాలూ - వీటిని తెలియజెప్పుమని పదిహేనవ ప్రశ్నగా కట్టకడపట అడిగాడు. విశ్వమూ, వరుణుడూ, జ్ఞానమూ, తపస్సూ, సూర్యుడూ - ఇవన్నీ అవ్యక్తము అనబడే ప్రకృతి. అవిశ్వమూ, మిత్రుడూ, జ్ఞేయమూ, అతపస్సూ, అతిసూర్యుడూ - ఇవన్నీ పురుషుడు. అట్లాగే విద్య, వేద్యం, అచలం అనే శబ్దాలు పురుషుడికి పర్యాయపదాలు - అని చెప్పి యాజ్ఞవల్క్యుడు ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: **"విశ్వంబు భూతభవ్యభవత్కరంబగు నవ్యక్తం బవ్యక్త నామప్రకృతి"** తెలుగు (సం. 12-306-36) భారతప్రతులలో కనిపిస్తున్న పాఠం. దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **విశ్వావ్యక్తం పరం విద్యాత్ భూతభవ్య భయంకరమ్**. దీనికి 'భూతభవ్యరూపం యద్భయం, సంసారస్తత్కరోతీతి భూతభవ్యభయంకరమ్' అని నీలకంఠ వ్యాఖ్య. 'భూతభవ్యభవత్తథా' అనే పాఠాంతరంకూడా (జి2, ఎమ్ 1. 5-7) ఉన్నట్లు భండార్కరు ప్రతిలో అధస్సూచిక ఉన్నది. తిక్కన్నకు దొరికిన పాఠం ఇదే అయ్యుండాలి. 'భయంకరమగు' అనేది పాఠాంతరంగా తెలుగు ప్రతులలోనూ ఉన్నది. అయితే ఇందులో 'అవ్యక్తంబు' అనే మాట ఒకటి అదనంగా కనపడుతున్నది. దాని అవసరం కనిపించటంలేదు. భూత భవ్యభవత్కరంబగు నవ్యక్తనామ ప్రకృతి= విశ్వంబు అని అన్వయం కుదిరిపోతున్నది. కాబట్టి అదనంగా ఉన్న 'అవ్యక్తంబు' అనే మాట లేఖకదోషమో ముద్రాపకుల దోషమో అయి ఉంటుంది. 'విద్యావిద్యా - వేద్యావేద్య-చలాచలంబులు' అని సంశోధితముద్రణ పాఠం. దీని ప్రకారం చల= పురుషుడు, అచల= ప్రకృతి అని అన్వయం. **"చలాం తు ప్రకృతిం ప్రాహుః కారణం క్షేపసర్గయోః। అక్షేపసర్గయోః కర్తా నిశ్చలః పురుషః స్మృతః" (12-306-42)** అనేది మూలశ్లోకం. సర్గప్రతిసర్గలకు కారణం అవుతున్నది కాబట్టి చల అంటే ప్రకృతి. వాటికి కర్త కాడు కనుక అచలుడు (నిశ్చలః) అంటే పురుషుడు. సంశోధిత ముద్రణలో పాఠం పూర్తిగా దీనికి వ్యతిరేకంగా ఉన్నది. కాబట్టి 'విద్యావిద్యా-వేద్యావేద్యాచల చలంబులు' అని ఉన్న వావిళ్ళ ప్రతిలో పాఠమే సరియైనది. విద్యా+అవిద్యా, వేద్య+అవేద్య+అచల+చలంబులు అని పదవిభాగం. అప్పుడు వరుసగా 'అచలంబు పురుషునకున్, చలంబు ప్రకృతికిని వాచకంబులు' అవుతాయి.

అ. అజము లవ్రణంబు లక్షయంబు లతీంద్రి । యములు ప్రకృతి పురుషు లనఁగఁ బరఁగు
రెండు తత్త్వములు నఖండరూపతఁ బొంది । నపుడు ప్రకృతి పురుషునట్ల కాన. 141

ప్రతిపదార్థం: రెండు తత్త్వములున్= వ్యక్తమూ అవ్యక్తమూ అనే ఈ రెండు తత్త్వాలూ; అఖండరూపతన్+పొందిన+అపుడు= ఏకాకారాన్ని పొందినప్పుడు; ప్రకృతి= అవ్యక్తమనబడే ప్రకృతి; పురుషునట్లు+అ+కాన= వ్యక్తమనబడే పురుషునివంటిదే అవుతుంది కాబట్టి; అజములు= అజాలూ; అవ్రణంబులు= అవ్రణాలూ (అక్షరాలు); అక్షయంబులు= అక్షయాలూ; అతీంద్రియములు= అతీంద్రియాలూ; అనఁగన్= అనే పేర్లతో; ప్రకృతి పురుషులు= ప్రకృతి తత్త్వమూ, పురుషతత్త్వం రెండూ కూడా; పరఁగున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: విశ్వావసుగంధర్వా! వ్యక్తావ్యక్త తత్త్వాలు రెండూ సమైక్యం పొంది అఖండరూపత్వం పొందినప్పుడు అజములూ అవ్రణములూ అక్షయములూ అతీంద్రియములూ అనే పేర్లతో రెండూ వ్యవహరించబడుతూ ఉంటాయి.

విశేషం: దీనికి మూలశ్లోకాలు ఇట్లా ఉన్నాయి: **"అజా పుభా వప్రజౌ చ అక్షయౌ చాప్యుభావపి । అజౌ నిత్యావుభౌ ప్రాహురధ్యాత్మగతి నిశ్చయాः ॥ అక్షయత్వాత్ప్రజననే అజమత్రాహురవ్యయమ్ । అక్షయం పురుషం ప్రాహుः క్షయో హ్యస్య న విద్యతే ॥' ' (12-306-43,44)** అజములూ, అప్రజములూ, అక్షయములూ, నిత్యములూ అనే పేర్లు రెండింటికీ వర్తిస్తాయని ద్వివచనంతో చెప్పాడు వ్యాసుడు. అప్రజములూ, నిత్యములూ అనే పదాలు తిక్కన ఆంధ్రీకరణంలోనికి రాలేదు. అప్రజంబులు అనేది అవ్రణంబులు అయిందో! అతీంద్రియములు అనేది అదనంగా వచ్చి చేరింది. 'అతీంద్రియావుభౌ' అనే పాఠాంతరం దీనికి మూలం. అజౌ అన్నపదాన్ని వ్యాఖ్యానిస్తూ నీలకంఠీయం। **"అజౌ, అజననహేతూ, పురుషసన్నిధానస్య, అనయా భూతసర్గం కరోమీతీచ్ఛాయాశ్చ అభావాత్. ప్రకృతేరపి సర్గాసామర్థ్యాత్"** - అంది. సాన్నిధ్యం లేకపోవటం వలన, ఇచ్ఛలేకపోవటం వలన ప్రకృతి పురుష తత్త్వాలు జననహేతువులు కాలేకపోతున్నాయి. భూతసృష్టి చెయ్యలేక పోతున్నాయి. కాబట్టి రెండూ 'అజములు' అవుతాయి అని తాత్పర్యం. 'అప్రజములు' అనేది దీనికి పర్యాయపదం అవుతుంది.

అజ్ఞౌ అని పాఠాంతరం ఉన్నది. దాన్ని వ్యాఖ్యానిస్తూ 'యథా ప్రకృతిర్జడత్వాత్ స్వాత్మానం న జానాత్యేవం నిష్కలాత్మాపి స్వాత్మని వృత్తివిరోధాత్ స్వాత్మనం న జానాతీత్యత ఉభావప్యజ్ఞౌ' అన్నాడు. జడత్వం కారణంగా ప్రకృతికి స్వాత్మజ్ఞానం ఉండదు. నిర్గుణుడైన పురుషుడికి కూడా ఆత్మవృత్తి విరోధం వలన ఈ జ్ఞానం ఉండదు. అందుచేత రెండూ అజ్ఞములు అవుతాయని భావం. 'అజౌ నిత్యావుభౌ' అనే ఉత్తరార్ధాన్ని వ్యాఖ్యానిస్తూ 'ద్విత్వ మవివక్షితమ్. తేన యదకర్మఫలం తదజం తదేవ చ నిత్యమిత్యర్థః' అన్నాడు. రెండింటికీ కలిపి ఇవి వాచకాలు అవుతున్నాయి కాబట్టి ద్వివచనం అవసరం లేదు. అది వివక్షితం కాదు. అకర్మఫలాన్నే 'అజము' అంటారు. ఇది ప్రకృతి పురుషతత్త్వాలకు రెండింటికీ సమానం.

వ. అని తెలిపి మఱియును. 142

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; తెలిపి= తెలియజెప్పి; మఱియును= ఇంకా .

తాత్పర్యం: ఇట్లా తెలిపి, ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుఁ వేదవేద్యము నెఱుం । గని యాతని వేదపాఠకలనంబు సుధీ
ధన! వేదభారవహనం । బనఁజను నింతియ నిరర్థకాయాసంబై. 143

ప్రతిపదార్థం: సుధీధన!= జ్ఞానసంపన్నుడా! విశ్వావసూ!; వినుఁ; వేదవేద్యమున్= వేదంతో తెలుసుకోదగిన ఆ తత్త్వాన్ని; ఎఱుంగని ఆతని= తెలుసుకోని వ్యక్తి(యొక్క) చేసే; వేదపాఠకలనంబు= వేదపఠనమనే పని (వ్యాపారం); నిరర్థక= నిష్ప్రయోజనమైన; ఆయాసంబై= శ్రమ అయి; వేదభార వహనంబు= వేదాల బరువు మొయ్యటం మాత్రమే; అనన్+చనున్= అనదగింది;ఇంతియ=ఇంతే.

తాత్పర్యం: వేదాధ్యయనానికి ఫలం వేదవేద్యాన్ని తెలిసికొనటం. అది జరగనినాడు అయిదు వేదాలనూ బట్టీయం పట్టినా అది కేవలం శ్రమ. వేదాల బరువుని మోయటం మాత్రమే. నిష్ప్రయోజనం. ఇంతే!

ఆ. క్షరము నక్షరంబుఁ గానంగఁ బోలు వే । దార్థచింతనమున నమ్మిథునము
నందుఁ బూర్వ మురివి యపరంబు సేపట్టి । నిలువవలయు నధికనిష్ఠ గలిగి. 144

ప్రతిపదార్థం: వేదార్థచింతనమునన్= వేదార్థాన్ని మననం చెయ్యటంవలన; క్షరమున్= ఏది క్షరతత్త్వమో; అక్షరంబున్= ఏది అక్షరతత్త్వమో; కానంగన్+పోలున్= తెలుసుకోగలగాలి; ఆ+మిథునమునందున్= ఆ జంటలో; పూర్వము= మొదటిది; ఉరివి= విడిచిపెట్టి; అపరంబు= రెండవదైన అక్షరతత్త్వాన్ని; చేపట్టి= స్వీకరించి; అధికనిష్ఠ కలిగి= దృఢమైన నిష్ఠను వహించి; నిలువన్+వలయున్= నిలవాలి.

తాత్పర్యం: వేదార్థచింతనవలన క్షర - అక్షరతత్త్వాల వివేకం కలుగుతుంది. వీటిలో క్షరాన్ని విడిచిపెట్టి అక్షరతత్త్వాన్ని స్థిరమైన నిష్ఠతో స్వీకరించాలి.

తే. అక్షరం బగు పంచవింశాఖ్య తత్త్వ । తత్పరత నున్నఁ గేవలత్వము ఘటిల్లు
వినుము కేవలత్వమున షడ్వింశదర్శ । నంబు పురుషున కొదవి తన్మయత గలుగు. 145

ప్రతిపదార్థం: అక్షరంబు+అగు= అక్షరము అనబడే; పంచవింశాఖ్య= ఇరవై అయిదవదైన; తత్త్వ= తత్త్వంపట్ల; తత్పరతన్= తాత్పర్యంతో; ఉన్నన్= ఉన్నట్లయితే; కేవలత్వము= కేవలత్వస్థితి; ఘటిల్లున్= సంభవిస్తుంది; వినుము= ఓ విశ్వావసూ! ఆలకించుము; కేవలత్వమునన్= ఆ కేవలతా సిద్ధివలన; పురుషునకున్= పురుషుడికి; షట్+వింశదర్శనంబు= ఇరవై ఆరవదైన పరతత్త్వ సాక్షాత్కారం; ఒదవి= లభించి; తద్+మయత= దానితో తాదాత్మ్యం; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఇరవై అయిదవదైన అక్షరతత్త్వాన్ని ఉపాసిస్తే క్షరాతీతమైన కేవలత్వం సిద్ధిస్తుంది. దానివలన ఇరవై ఆరవదైన పరతత్త్వం సాక్షాత్కరిస్తుంది. తాదాత్మ్యం కలుగుతుంది.

క. పురుషుని నవ్యక్తము రెం । డు రూపులుగఁ జూచు టొప్పెడు తెఱం గతఁడుం
బురుషోత్తముండు నరయఁగ । నిరువురుగా రతఁడ యాతఁ డిది నిజము సుమీ. 146

ప్రతిపదార్థం: పురుషునిన్= పురుషతత్త్వాన్నీ; అవ్యక్తమున్= ప్రకృతినీ; రెండు రూపులుగన్= వేరువేరైన రెండు తత్త్వాలుగా; చూచుట= చూడటమనేది; ఒప్పెడు తెఱంగు= ఒప్పయిన పద్ధతియే; అతఁడున్= పరముడు అనబడే ప్రబుద్ధపురుషుడూ; పురుషోత్తముడున్= పురుషోత్తముడు అనబడే ఇరవై ఆరవతత్త్వమూ; అరయఁగన్= పరిశీలించి చూస్తే; ఇరువురు కారు= విడివిడిగా ఇద్దరు కారు; అతఁడు+అ= అతడే; ఆతఁడు= ఆతడు; ఇది; నిజము సుమీ= సత్యం సుమా!

తాత్పర్యం: పురుషుడినీ, ప్రకృతినీ వేరువేరు రూపాలుగా చూడట మనేది సమంజసమే. కాని, పరముడూ పురుషోత్తముడూ వేరువేరు కాదు. ఇద్దరూ ఒకటే. (ఇరవై అయిదూ ఇరవై ఆరూ తత్త్వాలకు భేదం లేదని).

క. పురుషోత్తమ షడ్వింశక । పరమేశ్వర నామకములు వరఁగును వినుమా
పరమునకు నదియ నిష్కళ । నిరంజనానంద బోధనిత్యం బనఘా!' 147

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా! విశ్వావసూ!; వినుము; ఆ పరమునకున్= ప్రసిద్ధుడైన ఆ పరమాత్మకు; పురుషోత్తమ= పురుషోత్తముడనీ; షడ్వింశక= ఇరవై ఆరవ తత్త్వమనీ; పరమేశ్వర= పరమేశ్వరుడనీ; నామకములు= ప్రసిద్ధమైన నామధేయాలు;

పరఁగును= ఉన్నాయి; అదియ= అదే; నిష్కళ= నిర్గుణం; నిరంజన= నిరంజనం; ఆనంద= ఆనందం; బోధ= జ్ఞానం; నిత్యంబు= నిత్యం.

తాత్పర్యం: పురుషోత్తముడూ షడ్వింశకతత్త్వమూ పరమేశ్వరుడూ అనేవి ఆ పరమాత్మకే పేర్లు. (ప్రబుద్ధుడైన జీవాత్ముడే పరమాత్ముడని లోగడ వివరించాడు). అదే నిష్కలం. అదే నిరంజనం. అదే ఆనందం. అదే జ్ఞానం. అదే నిత్యం'.

వ. అని చెప్పిన విని విశ్వావసుండు 'పంచవింశకతత్త్వంబునకుం బరంబు గలుగుటయు నది రూపింప నేకంబగుటయు నారద జైగీషవ్య దేవల కపిలశుక సుమంత పైలాదులైన పరమమునుల గోష్ఠీ విశేషంబుల విందు. వినినను నిస్సంశయంబగు బోధం బుదితంబు గామి నిన్నాశ్రయించితి, నీవు సంయమిలోక సురలోక బ్రహ్మలోక ప్రఖ్యాత ప్రజ్ఞాన సంభావనీయుండవు. మదీయ సందేహాపనయంబు సేయవే' యనుటయు నారదాయత్త చిత్తుండనై. 148

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని యాజ్ఞవల్క్యుడు చెప్పగా; విని= గ్రహించి; విశ్వావసుండు= ఆ విశ్వావసువు; పంచవింశక తత్త్వంబునకున్= ఇరవై అయిదవ తత్త్వంకంటే; పరంబు= పరమైనది; కలుగుటయున్= ఉండటమూ; అది= ఆ తత్త్వం; రూపింపన్=నిర్ధారిస్తే; ఏకంబు+అగుటయున్= ఒక్కటే కావటం అనేది; నారద= నారదుడూ; జైగీషవ్య= జైగీషవ్యుడూ; దేవల= దేవలుడూ; కపిల= కపిలుడూ; శుక= శుకుడూ; సుమంత= సుమంతుడూ; పైల+ఆదులైన= పైలుడూ మొదలైన; పరమమునుల= మహామునుల; గోష్ఠివిశేషంబులన్= చర్చాసందర్భాలలో; విందున్= విని ఉన్నాను; వినిననున్= విన్నప్పటికీ; నిస్సంశయంబు+అగు= సంశయరహితమైన; బోధంబు= జ్ఞానం; ఉదితంబు+కామిన్= కలగకపోవటంతో; నిన్నున్= నిన్ను; ఆశ్రయించితిన్= ఆశ్రయించాను; నీవు= ఓ యాజ్ఞవల్క్యమహర్షీ! నీవు; సంయమిలోక= నిగ్రహసంపన్నులైన మహర్షుల సమూహంలోనూ; సురలోక= దేవలోకంలోనూ; బ్రహ్మలోక= బ్రహ్మలోకంలోనూ; ప్రఖ్యాత= ప్రసిద్ధికెక్కిన; ప్రజ్ఞాన= తత్త్వజ్ఞానంతో; సంభావనీయుండవు= గౌరవింపబడుతున్నవాడవు; మదీయ= నా; సందేహ+అపనయంబు= సందేహాన్ని తొలగించటం; చేయవే?= చేయవా?; అనుటయున్= అని అభ్యర్థించటంతో; నారద+ఆయత్త-చిత్తుండను+ఐ= నారదుడిని ధ్యానించిన హృదయం కలవాడనై - హృదయంలో నారదుడ్ని ధ్యానించి యాజ్ఞవల్క్యుడు పలుకుతున్నాడు.

తాత్పర్యం: అని యాజ్ఞవల్క్యుడు చెప్పగా విశ్వావసుడు 'ఇరవై అయిదవ తత్త్వానికి పైన మరొకటి ఉండటం, అది మరలా ఒకటే కావటం అన్న విషయాన్ని నారద, జైగీషవ్య, దేవల, కపిల, శుక, సుమంత పైలాదుల గోష్ఠీ సందర్భాలలో విని ఉన్నాను. అయినా ఇంకా అనుమాన నివృత్తి కాలేదు. సర్వలోక పూజ్యుడవైన నీవే నా సందేహాన్ని తొలగించాలి' అని న న్నడుగగా, నారదుడిని ధ్యానించి.

క. మునిగోష్ఠివలని కొఱతయె । విను భవదీయాంతరంగవృత్తి కలుషయై
నిను సంశయాత్మునింగా । నొనరించుచు నున్నయది సముజ్జ్వలతేజా! 149

ప్రతిపదార్థం: సముత్+జ్వలతేజా= ప్రకాశించే తేజస్సు కలవాడా!; మునిగోష్ఠివలని కొఱతయె= నీ సంశయం తీరకపోవటం మహర్షుల గోష్ఠిలోని లోపమా?; విను; భవదీయ= నీ; అంతరంగవృత్తి= మనః ప్రవృత్తి - ఏకాగ్రత; కలుషయైనను= కలుషితయై చెడిపోతే; నిను, సంశయాత్మునిన్+కాన్= నిన్ను సంశయాత్ముడిగా; ఒనరించుచునున్న+అది= చేస్తోంది.

తాత్పర్యం: ఓ తేజస్వీ! నీ సందేహం తీరకపోవట మనేది ఎవరి తప్పు అంటావు? మహర్షుల గోష్ఠిదా ఆ లోటు? కాదు కదా! ఏకాగ్రత కోల్పోయి నీ బుద్ధి కలుషం అయితే అది నిన్ను సంశయాత్ముడిగానే ఉంచేస్తుంది మరి.

వ. ప్రసన్నైకాగ్రచిత్తుండవై యాకర్ణింపు మని యిట్లంటి. 150

ప్రతిపదార్థం: (అందుచేత ఓ విశ్వావసూ!); ప్రసన్న= కలతదేరి ప్రసన్నమైన; ఏకాగ్రచిత్తుండవు+ఐ= ఏకాగ్రతతో ఉన్న చిత్తం కలవాడవై; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అంటిన్= ఈ ప్రకారంగా పలికాను.

తాత్పర్యం: అందుచేత ఓ విశ్వావసూ! ప్రశాంతమైన మనస్సుతో వినుము' అంటూ ఇట్లా కొనసాగించాను.

క. 'పురుషున కవ్యక్త పరి । స్ఫురణ శబలవృత్తి గలుగఁ బోయిన నతనిం
బురుషోత్తముఁ డనరు జనన । మరణాది వికారయుక్తి మాటయి యజ్ఞుల్. 151

ప్రతిపదార్థం: పురుషునకున్= జీవాత్మునికి; అవ్యక్త= ప్రకృతియొక్క; పరిస్ఫురణన్= స్ఫూర్తితో; శబలవృత్తి= అనేక రూపత్వం; కలుగన్+పోయినన్= కలిగినట్లయితే; అతనిన్= ఆ జీవాత్ముడిని; జననమరణ+ఆది= పుట్టుక చావు మొదలైన; వికారయుక్తి= వికారాలతో కూడి ఉండటమనేది; మాటు+అయి= మిషగా; అజ్ఞుల్= తత్త్వజ్ఞాన రహితులు; పురుషోత్తముఁడు+అనరు= పురుషోత్తముడు అని అనరు.

తాత్పర్యం: ప్రకృతితో సాంగత్యంవలన పురుషుడికి అనేకరూపత్వం కలుగుతుంది. జనన మరణాది వికారాలు తప్పవు. ఇది కారణంగా అతడిని పురుషోత్తముడు అనకపోవటం అజ్ఞత. ప్రకృతి సాంగత్యంలో ఉంటూనే పురుషుడు తన విభిన్నత్వాన్ని తెలిసికొనగలిగితే ప్రబుద్ధుడు అయినట్లే. జననమరణాది వికారాలు ఎన్ని ఉన్నా అతడిని (ప్రబుద్ధ జీవాత్మను) పురుషోత్తముడుగా గుర్తించటం విజ్ఞులు మాత్రమే చెయ్యగలరు.

వ. అని వెండియు. 152

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: అని చెప్పి మరల యాజ్ఞవల్క్యుడు ఇట్లా అంటున్నాడు.

తే. ప్రకృతి పురుషునిఁ గానదు, ప్రకృతిఁ గనుచు । నునికిఁ బురుషుండు పరమునిఁ గనుట లేక
యుండుఁ, గనుఁ దద్ద్వయముఁ బరముండు, పరమ । వీక్షణము పురుషున కగు వెరవు వినుము. 153

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతితత్త్వం; పురుషునిన్= జీవాత్ముడిని; కానదు= దర్శించదు; పురుషుండు= జీవాత్ముడు; ప్రకృతిన్= ప్రకృతిని; కనుచున్+ఉనికిన్= దర్శిస్తూ ఉండటంచేత; పరమునిన్= పరమాత్ముడిని; కనుట= దర్శించటం; లేక+ఉండున్= లేకుండా ఉండిపోతాడు; పరముండు= పరమాత్మ; తద్+ద్వయమున్= ప్రకృతి పురుషతత్త్వాలు రెండింటినీ; కనున్= చూస్తాడు; పురుషునకున్= జీవాత్మకు; పరమవీక్షణము= పరమాత్మ దర్శనం; అగు= అయ్యే; వెరవు= ఉపాయం; వినుము.

తాత్పర్యం: ప్రకృతి పురుషుడిని చూడదు. ప్రకృతినే చూస్తూ పురుషుడు పరమాత్మను దర్శించలేడు. పరమాత్మ మాత్రం ఈ రెండింటినీ చూస్తూ ఉంటాడు. పురుషుడు పరమాత్మను దర్శించే ఉపాయం ఏమిటో చెప్పుతాను వినుము.

క. స్నేహసహవాసములు స । మ్మోహముఁ దలకొలుపఁ గాలమున మునుఁగుచు గా
ఢాహంకారమమత్వము । లీహఁ బెనుపఁ బ్రకృతిఁ బురుషుఁ డే ననుచుండున్. 154

ప్రతిపదార్థం: స్నేహసహవాసములు= స్నేహమూ, సహవాసమూ అనేవి; సమ్మోహమున్= వ్యామోహాన్ని; తలకొలుపన్= కలిగిస్తే; కాలమునన్= ఋతువులూ, సంవత్సరాలూ ఇత్యాదిగా ఉన్న కాలంలో; మునుఁగుచున్= మునిగిపోతూ; గాఢ= గాఢమైన;అహంకార=

అహంభావమూ; మమత్వములు= మమకారం అనేవి; ఈహన్= కోరికను; పెనుపన్= పెంపొందించగా; పురుషుఁడు= జీవాత్ముడు; ఏను= నేను; ప్రకృతిన్= ప్రకృతిని; అనుచుండున్= అనుకుంటూ ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడికి ప్రకృతితో స్నేహమూ, సహవాసమూ తప్పవు. అవి అతడిలో ప్రకృతిపట్ల వ్యామోహం కలిగిస్తాయి. దానితో కాలంలో మునిగిపోతాడు. అహంకార మమకారాలు కోరికను పెంచుతాయి. ఇంక ఈ జీవాత్ముడు 'నేనే ప్రకృతిని' అనుకొంటూ ఉంటాడు. ఈ వ్యామోహం ఉన్నంతవరకూ పురుషుడికి 'పరమవీక్షణము' లభించదు.

క. అది లెస్సగ విడిచి ప్రకృతి । కుదకనిభాకలనమును ఋషోపమ తనకుం
బదిలుఁడయి చూడనేర్చిన । విదితం బగు దానితోడి వేర్పా టనఘా! 155

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! - విశ్వావసూ!; అది= ప్రకృతిని నేనే అనే భావం; లెస్సగన్= బాగా; విడిచి= విడిచిపెట్టేసి; ప్రకృతికిన్= ప్రకృతికి; ఉదకనిభ+ఆకలనమును= నీటితో పోలిక; తనకున్= తనకు; ఋష+ఉపమ= చేపతో పోలిక; పదిలుఁడు+అయి= జాగరూకుడై; చూడనేర్చినన్= చూడగలిగితే; దానితోడి వేర్పాటు= ప్రకృతితో తన విభిన్నత; విదితంబు+అగున్= స్పష్టపడుతుంది.

తాత్పర్యం: ఓ విశ్వావసూ! నేనే ప్రకృతిని అనే భావం విడిచిపెట్టి పురుషుడు చూడగలగాలి. ప్రకృతిని నీరుగా, తనను చేపగా దర్శించగలిగితే తనకూ ప్రకృతికీ ఉన్న వేర్పాటు ఏమిటో తెలుస్తుంది.

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బన్నుగాఁ జూచు వి । వేక దృఢతఁ బంచవింశకుండు
సంగరహితమైన షడ్వింశపదము ని । స్సంశయముగఁ గాంచు వంశవర్య! 156

ప్రతిపదార్థం: వంశవర్య!= గంధర్వవంశశ్రేష్ఠుడా!; ప్రకృతి= ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; తన్నున్= తననుతాను; పన్నుగాన్= వేరుపడినవానిగా; చూచు= దర్శించే; వివేకదృఢతన్= జ్ఞానదృఢత్వంతో; పంచవింశకుండు= ఇరవై అయిదవ తత్త్వమైన పురుషుడు (జీవాత్ముడు); సంగరహితము+ఐన= బంధరహితమైన; షడ్వింశపదమున్= ఇరవై ఆరవ తత్త్వమైన పరమస్థితిని; నిస్సంశయముగన్= నిస్సందేహంగా; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: ఓ విశ్వావసూ! ప్రకృతిని విడిచిపెట్టి తనను తాను భిన్నుడుగా గుర్తించగలిగిన దృఢవివేకం పురుషుడికి లభిస్తే అప్పుడు నిస్సంగమైన పరతత్త్వాన్ని నిస్సందేహంగా చూడగలుగుతాడు.

క. జననజరామృత్యు భయం । బున యోగసమేతసాంఖ్యముం దిరముగ నూఁ
దిన యతులు నిర్మమత్వం । బునఁ బడయుదు రప్పరంబు పాం దచలముగన్. 157

ప్రతిపదార్థం: జనన= పుట్టుట; జరా= ముసలితనం; మృత్యు= చావు అనే వీటివలన కలిగే; భయంబునన్= భయంతో; యోగసమేత= యోగసహితమైన; సాంఖ్యమున్= సాంఖ్యాన్ని; తిరముగన్= స్థిరంగా; ఊఁదిన= ఆశ్రయించిన; యతులు= యోగులు; నిర్మమత్వంబునన్= మమకార రహితస్థితితో; ఆ+పరంబు+పొందు= ఆ పరతత్త్వసాన్నిధ్యాన్ని; అచలముగన్= నిశ్చలంగా; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: జననమృత్యుభయాలతో యోగసాంఖ్యాలను ఆశ్రయించిన యతీశ్వరులు నిర్మమత్వస్థితితో పరతత్త్వ సాన్నిధ్యాన్ని సుస్థిరంగా అనుభవిస్తారు.

వ. అపునరావృత్తిపదం బగు నప్పదంబు సూవె పరం' బని చెప్పి వెండియు. 158

ప్రతిపదార్థం: అపునరావృత్తి పదంబు+అగు= పునర్జన్మ అనేది లేని స్థానమైన; ఆ+పదంబు+చూవె= ఆ స్థితియే సుమా!; పరంబు= పరతత్త్వమంటే; అని; చెప్పి= పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: పునర్జన్మ లేని స్థానమైన, ఆ స్థితియే పరతత్త్వ మంటే' అని పలికి మరల.

క. నెట్టన చూడమి నయ్యెడు । నట్టిది యొకచూపునం బరానందంబున్
గట్టిగఁ జేయఁగ వికృతులు । పుట్టక పురుషుండు తత్ప్రబోధాత్ముఁడగున్. 159

ప్రతిపదార్థం: నెట్టన= పూనికతో; చూడమిన్= చూడకపోవటంవలన; అయ్యెడు+అట్టిది= ఏర్పడేటువంటిది; ఒకచూపునన్= ఒక ప్రత్యేక అవగాహనతో; పరానందంబున్= పరము అనబడే ఆనందాన్ని; గట్టిగన్+చేయఁగన్= స్థిరపరుచుకుంటే; వికృతులు= సత్త్వరజస్తమోగుణ సంబంధమైన వికారాలు; పుట్టక= కలగకుండా; పురుషుండు= జీవాత్ముడు; తద్= ఆ పరమాత్మకు సంబంధించిన; ప్రబోధ+ఆత్ముఁడు+అగున్= జ్ఞానంతో కూడినవాడు అవుతాడు.

తాత్పర్యం: 'నేను ప్రకృతికంటే భిన్నుడను' అనే పూనికతో చూడకపోవటం వలన కలిగేది, ఒక ప్రత్యేకమైన అవగాహనతో కూడిన చూపుతో చూస్తే, అందువలన కలిగే పరమానందాన్ని స్థిరపరుచుకొనగలిగితే పురుషుడికి ఏ వికారాలూ ఉండవు. ప్రబుద్ధుడు అవుతాడు.

క. పురుషోత్తముండుఁ బురుషుఁడు । నిరువు రగుట గలదు గలిగెనేనియుఁ బురుషుం
బురుషోత్తమునందుఁ గలపు । వెరవున నేకత్వమహిమ విజ్ఞాతమగున్. 160

ప్రతిపదార్థం: పురుషోత్తముండున్= పరమాత్ముడూ; పురుషుఁడున్= జీవాత్ముడూ; ఇరువురు+అగుట= ఇద్దరుగా విభిన్నులు+కావటం; కలదు= ఉంది; కలిగెనేనియున్= ఉన్నప్పటికీ; పురుషున్= జీవాత్ముడిని; పురుషోత్తమునందున్= పరమాత్మలో; కలపు= ఐక్యంచేసే; వెరవునన్= ఉపాయంలో; ఏకత్వమహిమ= ఏకత్వం తాలూకు గొప్పతనం; విజ్ఞాతము+అగున్= తెలివిడికి వస్తుంది.

తాత్పర్యం: పురుషోత్తముడూ, పురుషుడూ విభిన్న లనటమూ ఉన్నది. అయినా ఇద్దరినీ కలిపే ఉపాయంలోనే ఏకత్వమహిమ సాధకుడికి అనుభవంలోనికి వస్తుంది. (సాంఖ్యయోగాలద్వారా ఇది సిద్ధిస్తుందని).

క. ఇది విజ్ఞానము కృత్యము । తుది విజ్ఞానాత్ముఁడు నగు, దుర్లభము ప్రశాం
తి దశాహీనాత్ముల క । ప్పదమది, మోక్షంబు మమత వాసినఁ గల్గున్.' 161

ప్రతిపదార్థం: ఇది= ఏకత్వమహిమ విజ్ఞాతం కావటమనేది; విజ్ఞానము కృత్యము= విద్యవలన జరిగేపని; తుదిన్= కట్టకడపటికి; విజ్ఞానాత్ముఁడున్= పురుషుడు విద్యావంతుడు కూడా; అగున్= అవుతాడు; ప్రశాంతిదశా+హీన+ఆత్ములకున్= చిత్తశాంతి అనే దశ లేనివారికి; ఆ+పదము+అది= ఆ పరమాత్మ స్థాయి; దుర్లభము= ఒకపట్టాన దొరకదు; మమత= మమకారం అనేది; పాసినన్= వదిలిపోయినట్టయితే; మోక్షంబు= ముక్తి; కల్గున్= లభిస్తుంది.

తాత్పర్యం: జీవాత్మ పరమాత్మల ఏకత్వమహిమను ఎరుక పరచటమే విజ్ఞానం (విద్య) చేసేపని. చిత్తశాంతి అనేది లేనివాళ్ళకు పరానందం లభించదు. ఏకత్వమహిమ సిద్ధించదు. మమకారాన్ని విడిచిపెట్టుకొంటే మోక్షం లభిస్తుంది.

వ. అని యుపదేశించిన విని విశ్వావసుండు ప్రమోదంబు నొంది 'పథ్యంబును హితంబును దథ్యంబును నగుతెఱం గనుగ్రహించితి భవదీయ ప్రసాదంబునం గలంకదేఱి నిర్మలుండ నయితి' నని పలికి సభక్తికంబుగా బ్రదక్షిణంబును ప్రణామంబునుం జేసి నిజస్థానంబున కరిగె' నని చెప్పి యాజ్ఞవల్క్యమునినాథుండు జనకజననాథుతో వెండియు నిట్లనియె. 162

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఉపదేశించినన్= ఉపదేశించగా; విని; విశ్వావసుండు= విశ్వావసుడు అనే గంధర్వుడు; ప్రమోదంబున్+ఒంది= సంతోషించి; పథ్యంబును= ఆచరించదగినదీ; హితంబును= మేలుకూర్చేదీ; తథ్యంబును= నిజమైనదీ; అగు= అయిన; తెఱంగు= విధానాన్ని; అనుగ్రహించితి(వి)= నాకు దయచేశావు; భవదీయ= నీ; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; కలంక+తేఱి= కలతనుంచి తేరుకుని తేటపడి; నిర్మలుండన్+అయితిన్= మలినరహితుడిని అయ్యాను; అని పలికి= ఇట్లా చెప్పి; సభక్తికంబుగాన్= భక్తితో; ప్రదక్షిణంబును= ప్రదక్షిణం; ప్రణామంబును= సాష్టాంగనమస్కారం; చేసి= ఆచరించి; నిజ స్థానంబునకున్= తన నెలవుకు; అరిగెన్= వెళ్ళిపోయాడు; అని చెప్పి= ఇట్లా వివరించి; యాజ్ఞవల్క్య మునినాథుండు= మునీశ్వరుడైన యాజ్ఞవల్క్యుడు; జనక - జననాథుతోన్= జనేశ్వరుడైన జనకుడితో; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా నేను ఉపదేశించగా వినిన విశ్వావసుడు 'నాకు మేలుకూర్చేదీ ఆచరణయోగ్యమైనదీ, నిజమైనదీ అయిన మార్గాన్ని చెప్పావు. నీ అనుగ్రహంవలన తేటపడ్డాను' అని నాకు నమస్కరించి, విశ్వావసుడు సెలవు తీసికొన్నాడు' అని యాజ్ఞవల్క్యుడు ఇంకా ఇట్లా చెప్పసాగాడు.

క. 'మానవపతిసత్తమ! యీ । జ్ఞానము బ్రహ్మాది దివిజ సంయమిమత మె
వ్వానికి మోక్షంబునకుం । దాన తెరువు - తెరువు లొండ్లు దలఁపం గలవే? 163

ప్రతిపదార్థం: మానవ+పతిసత్తమ!= రాజోత్తమా!; ఈ జ్ఞానము= నేను ఇంతవరకూ ఉపదేశించిన ఈ విద్య; బ్రహ్మ+ఆది= బ్రహ్మమొదలైన; దివిజ= దేవతల; సంయమి= నిగ్రహసంపన్నులైన మునీశ్వరుల; మతము= అభిమతం; ఏ+వానికిన్= ఎవడికైనా; మోక్షంబునకున్= ముక్తికి; తాను+అ= అదియే; తెరువు= మార్గం; ఒండ్లు+తెరువులు= వేరే మార్గాలు; తలఁపన్= ఎంత ఆలోచించినా; కలవే?= ఉన్నాయా? (లేవని భావం).

తాత్పర్యం: జనకరాజోత్తమా! ఇంతవరకూ నేను చెప్పింది బ్రహ్మాది దేవతలకూ, మునులకూ సమ్మతమైన మతం. ఇదే ముక్తికి మార్గం. మరి వేరే మార్గాలు లేనే లేవు.

ఆ. జ్ఞానమునన కాని జన్మజరామృత్యు । వుల జయించునట్టి యలఘు మోక్ష
పదము గల్గ నేర దది కారణముగ సు । జ్ఞాన మెల్లభంగి సాధ్యతమము. 164

ప్రతిపదార్థం: జ్ఞానమునన్+అ+కాని= జ్ఞానంచేతనే తప్ప; జన్మ= పుట్టుక; జరా= ముసలితనం; మృత్యువులన్= మరణం అనే వీటిని; జయించునట్టి= జయించేటువంటి; అలఘుమోక్షపదము= ఆ గొప్ప ముక్తిపదవి; కల్గన్ నేరదు= లభించదు; అది కారణముగన్= అందుచేత; ఎల్లభంగిన్= సర్వవిధాలా; సుజ్ఞానము= ఈ మంచిజ్ఞానం (విద్య); సాధ్యతమము= తప్పకుండా సాధించవలసిన వాటి అన్నింటిలో ఉత్తమోత్తమం.

తాత్పర్యం: జననమరణాలను జయించటమే మోక్షపదవి. అది కేవలం ఈ జ్ఞానంచేతనే లభిస్తుంది కాబట్టి జ్ఞానసాధన అనేది అన్నివిధాలా ఉత్తమోత్తమ కర్తవ్యం.

క. గురుఁ డెవ్వఁడైనగు ని । వ్వెర వుపదేశించువాఁడ వేల్పుగ శ్రద్ధా
పరమతి గావలయు జనన । మరణంబులు శ్రద్ధ లేని మనుజునిఁ బొదువున్. 165

ప్రతిపదార్థం: గురుఁడు= ఆచార్యుడు; ఎవ్వఁడు+ఐనన్+అగున్= చతుర్వర్ణాలలో ఎవడయినా కానిమ్ము; ఈ+వెరవు= ఈ ఉపాయాన్ని; ఉపదేశించువాఁడు+అ= ఉపదేశించినవాడే; వేల్పుగన్= దేవుడుగా; శ్రద్ధాపర+మతిన్= శ్రద్ధతోకూడిన బుద్ధికలవాడు; కావలయున్= కావాలి; జననమరణంబులు= ఈ జననజరామృత్యువులు; శ్రద్ధలేని= శ్రద్ధలేనటువంటి; మనుజునిన్= మానవుడిని; పొదువున్= పొదువుకుంటాయి లేక ఆవరిస్తాయి.

తాత్పర్యం: చతుర్వర్ణాలలో గురువు ఎవడైనా కానిమ్ము, ఈ ఉపాయం చెప్పినవాడే దేవత. శిష్యుడికి అంతటి శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ లేకపోతే జననమరణరూపమైన అజ్ఞానం వదలదు. పొదువుకొనే ఉంటుంది.

క. వినుఁ మజ్ఞానంబునఁ గ । ర్మనిరూఢత గలుగు దాన మలఁగవు జననం
బును మరణము సమ్యక్ జ్ఞా । న నిత్యుఁ డగువాఁడు మోక్షణముఁ జుల్కఁ గనున్. 166

ప్రతిపదార్థం: వినుము= రాజా! ఆలకించు; అజ్ఞానంబునన్= అవిద్యవలన; కర్మనిరూఢత= కర్మాచరణమనే బంధంలో కూరుకుపోవటమనేది; కలుగున్= జరుగుతుంది; దానన్= అందుచేత; జననంబును-మరణమున్= జననమరణాలు; మలఁగవు= అంతరించవు; సమ్యక్+జ్ఞాన+నిత్యుఁడు+అగువాఁడు= సరియైన విద్యపట్ల నిష్ఠ కలిగినవాడు; మోక్షణమున్= ముక్తిని; చుల్కన్= తేలికగా; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! వింటున్నావా! అజ్ఞానంవలన జీవాత్ముడు కర్మాచరణబంధనంలో కూరుకొనిపోతాడు. అతడికి జననమరణాదులు అంతరించవు. మోక్షపదం లభించదు. సరియైన జ్ఞానం కలవాడికి ముక్తి కరతలామలకం.

క. ఈ వెర వూఁదుము నృప! నను । నీ వడిగిన యంతయును వినిశ్చయకృతి సం
భావితముగాఁగఁ జెప్పితిఁ । బోవిడువుము శోకమోహమును, నిలుపు ధృతిన్.' 167

ప్రతిపదార్థం: నృప!= రాజా!; ఈ వెరవు= ఈ మార్గాన్ని; ఊఁదుము= ఆశ్రయించుము; ననున్= నన్ను; నీవు; అడిగినయంతయునున్= అడిగినంతా; వినిశ్చయకృతిన్= ఏ సందేహమూ, సంశయమూ లేని నిశ్చయరీతిలో; సంభావితముగాఁగన్= అందరూ ఒప్పి మెచ్చేట్టు; చెప్పితిన్= వివరించాను; శోకమోహమును= దుఃఖహేతువైన మోహాన్ని; పోన్+విడుపుము= వదలించుకొమ్ము; ధృతిన్= ధైర్యాన్ని; నిలుపు= అలవరచుకొమ్ము.

తాత్పర్యం: రాజా! ఇప్పటివరకూ నేను ఉపదేశించిన ఈ మార్గాన్ని ఆశ్రయించుము. నీవు నన్ను అడిగినదంతా నలుగురికీ సమ్మతమైన పద్ధతిలో ఏ సందేహాలకూ తావులేకుండా వివరించి చెప్పాను. శోకహేతువైన మోహాన్ని లేదా శోకాన్నీ, మోహాన్నీ, విడిచిపెట్టుము. జ్ఞానంవలన కలిగే ధైర్యం నిలుపుకొమ్ము'.

క. అని చెప్పిన ముదితుండై । జనకుఁడు శోకాదిభావ సంగవిరహితం
బును బ్రహ్మధ్యానపరం । బును నగు చిత్తంబుతోడ ముదితుం డగుచున్. 168

ప్రతిపదార్థం: అని చెప్పినన్= యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పేసరికి; జనకుఁడు= జనకమహారాజు; ముదితుండై= సంతోషించినవాడై; శోక+ఆది= దుఃఖమూ మొదలైన; భావ= భావాలతో; సంగవిరహితంబును= సాంగత్యం లేనిదీ; బ్రహ్మధ్యాన పరంబును= పరమాత్మను ధ్యానించటంలో సక్తమైనదీ; అగు= అయిన; చిత్తంబుతోడన్= అంతరంగంతో; ముదితుండు+అగుచున్= సంతోషించినవాడు అవుతూ.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యుడు ఇట్లా వివరించి చెప్పేసరికి జనకమహారాజు సంతోషపడ్డాడు. దుఃఖాది భావాలను విడిచిపెట్టేసి బ్రహ్మధ్యానంలో జనకుడి చిత్తం సంలగ్నమయ్యింది. అందువలన మరీ సంతోషం కలిగింది. ఆ ఆనందంలో అట్లా ఉండిపోయాడు.

విశేషం: సంశోధిత ముద్రణ ప్రతిలో ముదితుండై - ముదితుండగుచున్ అనే పాఠమే కనపడుతున్నది. వావిళ్ళవారి ప్రతిలోనూ ఇట్లాగే ఉన్నది. ఇది పునరుక్తి. 'ముని నతుఁడగుచున్' అనే పాఠాంతరాన్ని సంశోధితముద్రణ అధస్సూచికగా ఇచ్చింది. దాన్ని స్వీకరిస్తే పునరుక్తి తొలగిపోతుంది. ముని= యాజ్ఞవల్క్య మహర్షికి; నతుఁడు+అగుచున్= నమస్కరిస్తూ - ఉండెను అని అన్వయం మరింత సమంజసంగా ఉంటుంది.

వ. ఉండెం బాండవాగ్రజా! యీ యాజ్ఞవల్క్యమునివరు వాక్యరూపంబునన యే నిమ్మహనీయజ్ఞానంబు నీ కుపదేశించితి' నని చెప్పి భీష్ముఁ డతనితో 'నీ విందుల తాత్పర్యంబు గలిగి యార్యగర్హితంబులగు శోకమోహాదిప్రాకృతభావంబులం దొఱంగి సుఖి వగు' మనిన విని య క్కొంతేయాగ్రజుండు సంతుష్టాంతరంగుండై య గ్గాంగేయునకుం బ్రణమిల్లి 'గృహస్థ ధర్మంబు పరిత్యజింపక మోక్షంబు వడయుట గలుగనోపునే?' మదీయ చిత్తంబు సంశయాయత్తం బగుచుండు; నిక్కాలుష్యంబు వాపవే' యని యభ్యర్థించిన నతండు 'జనకసులభాసంవాదం బను నితిహాసంబు గలుగు దాన నేతత్సంశయంబు వాయు దానిం జెప్పెద వినుఁ' మని పలికి యతని కిట్లనియె. 169

ప్రతిపదార్థం: ఉండెన్= ఉన్నాడు; పాండవ+అగ్రజా!= ధర్మరాజా!; ఈ యాజ్ఞవల్క్యమునివరు= ఈ యాజ్ఞవల్క్యుడనే మునీశ్వరుడి; వాక్యరూపంబునన్+అ= పలుకుల ప్రకారమే; ఏను= నేను; ఈ+మహనీయ జ్ఞానంబున్= ఈ గొప్ప విద్యను; నీకున్= నీకు; ఉపదేశించితిన్= ఉపదేశించాను; అని చెప్పి= అని తెలిపి; భీష్ముఁడు= భీష్మాచార్యుడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; నీవు; ఇందులన్= ఈ విషయంపట్ల; తాత్పర్యంబు= శ్రద్ధ; కలిగి= వహించి; ఆర్య= సజ్జనులచేత; గర్హితంబులు+అగు= నింద్యాలయిన; శోక మోహ+ఆది= దుఃఖమూ, వ్యామోహమూ మొదలైన; ప్రాకృత భావంబులన్= ప్రకృతి సంబంధమైన భావాలను; తొఱంగి= విడిచి; సుఖివి= సుఖవంతుడవు; అగుము= కమ్ము; అనినన్= అని పలుకగా; విని; ఆ+కొంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; సంతుష్ట+అంతరంగుండై= సంతోషించిన హృదయం కలవాడై; ఆ+గాంగేయునకున్= గంగాపుత్రుడైన ఆ భీష్ముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; గృహస్థధర్మంబు= గృహస్థాశ్రమాన్ని; పరిత్యజింపక= విడిచిపెట్టకుండా; మోక్షంబు+పడయుట= ముక్తి పొందటం; కలుగన్+ఓపునే?= సంభవిస్తుందా?; మదీయచిత్తంబు= నా అంతరంగం; సంశయ+ఆయత్తంబు+అగుచుండున్= ఈ సందేహానికి లోనవుతూ ఉంటుంది; ఈ+కాలుష్యంబు= ఈ మాలిన్యాన్ని; పాపవే?= దయచేసి తొలగింపవా?; అని; అభ్యర్థించినన్= ప్రార్థించేసరికి; అతండు= ఆ భీష్ముడు; జనకసులభాసంవాదంబు+అను= ధర్మధ్వజుడనే జనకమహారాజూ, సులభాదేవి - వీరిద్దరిమధ్యా నడిచిన వివాదం అనే; ఇతిహాసంబు= ఒక పూర్వవృత్తాంతం; కలుగున్= ఉంది; దానన్= ఆ కథతో; ఏతత్+సంశయంబు= నీ ఈ సందేహం; పాయున్= తొలగిపోతుంది; దానిన్= ఆ సంవాదాన్ని; చెప్పెదన్= చెబుతాను; వినుము; అని పలికి= అని చెప్పి; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా వివరించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! యాజ్ఞవల్క్యముని పలుకుల ప్రకారమే నేను ఈ గొప్పవిద్యను నీకు ఉపదేశించాను; అని చెప్పి భీష్ముడు 'నీవు దీనియందు శ్రద్ధకలిగి సజ్జనులు గర్హించే శోకమోహాలను త్యజించి సుఖివి కమ్ము' అని ధర్మరాజుతో పలుకగా అతడు సంతోషించి భీష్ముడికి నమస్కరించి 'గృహస్థ ధర్మాన్ని వదలకుండా మోక్షం పొందవచ్చునా? అనే అనుమానం నా మనస్సులో ఉన్నది. దానిని తొలగించు' మని వేడుకొన్నాడు. భీష్ముడు

'జనకసులభాదేవుల నడుమ జరిగిన సంవాద మనే ఇతిహాసాన్ని విను' మనీ, 'దానివలన సందేహాలన్నీ తొలగిపోతాయి. దానిని విను' మని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు చెప్పుట (సం. 12-308-3)

క. సులభాభిధాన యగునొక । లలన విమలయోగధర్మ లంపటు జనకుం
గెలన విని యతని బోధము । కొలఁది పరీక్షింపఁ దనకుఁ గోర్కి వొడమినన్. 170

ప్రతిపదార్థం: సులభా+అభిధాన+అగు= సులభ అనే పేరుగలదైన; ఒక లలన= ఒక వనిత; విమల= పవిత్రమైన; యోగధర్మ= యోగాచరణంలో; లంపటున్= పూర్తిగా మునిగిపోయిన; జనకున్= ధర్మధ్వజుడనే జనకమహారాజును; కెలనన్= సమీపంలోనే (ఉన్నాడని); విని= తెలిసికొని; అతని= ఆ జనకుడి; బోధముకొలఁది= జ్ఞానం లోతు; పరీక్షింపన్= పరీక్షించాలని; తనకున్= తనకు; కోర్కి= కోరిక; పొడమినన్= కలుగగా.

తాత్పర్యం: అనగా అనగా ఒక వనిత. ఆవిడపేరు సులభ. యోగ ధర్మాలను ఒక వ్యసనంవలె ఆచరిస్తున్న జనకమహారాజును పరీక్షించాలనీ, అతడి జ్ఞానం తాలూకు లోతు ఎంతో తెలిసికొనాలనీ ఆవిడకు ఒక కోరిక కలిగింది. జనకమహారాజు ఆ దగ్గరలోనే ఉన్నా డని తెలిసికొన్నది.

వ. నియమాచరణకృశం బగు శరీరంబు యోగప్రభావంబున డాఁచి సుందరసుకుమారం బగు నాకారంబు వహించి జనకుం గాంచి భిక్షావృత్తిత్వసూచకంబు లగు వచనంబు లుపన్యసించిన నతండాసనపాద్యార్చనంబు లాచరించి మహనీయంబగు భోజనం బొనర్చిన సంతృప్తిం బొంది యవ్విదేహపతికి నాసన్నంబగు నుచితాసనంబున నాసీనయైయుండి యాతండు ముక్తుండగుఁ గామిఁ గనుఁగొను తలంపున నిజానుభావంబున నతని చిత్తంబు ప్రవేశించి మారవికారంబు భావించి. 171

ప్రతిపదార్థం: నియమ+ఆచరణ= యోగ నియమాలను ఆచరించటం వలన; కృశంబు+అగు= చిక్కిపోయిన; శరీరంబున్= తన శరీరాన్ని; యోగప్రభావంబునన్= యోగశక్తితో; డాఁచి= మరుగుపరచి; సుందర సుకుమారంబు+అగు= సుందరమూ, సుకుమారమూ అయిన; ఆకారంబు= రూపం; వహించి= ధరించి; జనకున్= జనకమహారాజును; కాంచి= సమీపించి; భిక్షావృత్తిత్వ= తాను భిక్షావృత్తితో ఉన్నాను అనే విషయానికి; సూచకంబులగు= సూచకాలైన; వచనంబులు= మాటలు; ఉపన్యసించినన్= పలికే సరికి; అతండు= ఆ జనకుడు; ఆసన పాద్య+అర్చనంబులు= కూర్చోవటానికి ఆసనం; కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళూ అందివ్వటమనే గౌరవాలు; ఆచరించి= చేసి; మహనీయంబు+అగు= గొప్పదైన; భోజనంబు+ఒనర్చినన్= విందుభోజనం ఏర్పాటు చేయగా; సంతృప్తిన్+పొంది= ఆవిడ సంతుష్టురాలై; ఆ+విదేహపతికిన్= ఆ జనకమహారాజుకు; ఆసన్నంబు+అగు= సమీపంలో ఉన్న; ఉచిత+ఆసనంబునన్= సముచిత పీఠంమీద; ఆసీనయై యుండి= సుఖంగా కూర్చుని; ఆతండు= ఆ జనకుడు; ముక్తుండు= సంగవిరహితుడు; అగున్ కామిన్= అవునోకాదో; కనుఁగొను తలంపునన్= తెలిసికొనే ఉద్దేశంతో; నిజ= తన; అనుభావంబునన్= కటాక్షాది చేష్టలతో; అతని చిత్తంబు= ఆ జనకుడి హృదయం (లోనికి); ప్రవేశించి= చొరబడి; మారవికారంబున్= మన్మథవికారాన్ని; భావించి= ఊహించి.

తాత్పర్యం: ఆమె యోగప్రభావంతో చిక్కిపోయిన తన శరీరాన్ని మరుగుపరిచి, అందమైన శరీరాన్ని తెచ్చిపెట్టుకొని, జనకుడివద్దకు వెళ్ళి, తాను భిక్షుకి నన్నట్లుగా తోచే మాటలు అతడితో అనగా, ఆయన ఆమెను సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి, సుఖాసీనురాలినిగా చేశాడు. అతడు నిజంగా విరక్తుడగునో కాదో పరీక్షించటానికి తన చేష్టలతో ఆమె మన్మథవికారాన్ని కలిగించబోయింది.

క. తన లోచనదీప్తుల న । మ్మనుజపతి మొగంబునందు మల్లడిగొనఁ జే
సిన నమ్మహాత్ముఁ డప్ప । ద్మనయన తలఁ పెఱిఁగి జనిత మందస్మితుఁడై. 172

ప్రతిపదార్థం: తన= ఆ సులభాదేవి తన యొక్క; లోచనదీప్తులన్= నేత్రకాంతులను; ఆ+మనుజపతి= ఆ జనకమహారాజుగారి; మొగంబునందున్= ముఖంమీద; మల్లడిగొనన్= గుంపుగా పెనవేసుకునేట్టు; చేసినన్= చేసేసరికి; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు; ఆ+పద్మనయన= ఆ పద్మాక్షియొక్క; తలఁపు= ఆలోచనను; ఎఱిఁగి= గుర్తించి; జనితమందస్మితుఁడై= మొలకెత్తిన చిరునవ్వు కలవాడై.

తాత్పర్యం: సులభాదేవి మన్మథభావసూచకాలైన తన మెరుపు చూపులను జనకమహారాజు ముఖంమీదికి వ్యాపింపజేసింది. అతడు ఆమె మనస్సును గ్రహించాడు. చిన్నగా నవ్వుకొన్నాడు. మెల్లగా ప్రశ్నించాడు.

ఆ. 'ఎచటినుండి యెచటికేఁగెద? వెవ్వరి । దాన? వేమి వెంటఁ దగిలి నడతు
సుదతి! నాకుఁ జెప్పు మది యట్టులుండె నా । మాట వీవు విను సమాదరమున. 173

ప్రతిపదార్థం: సుదతి!= అందమైన పలువరుస కలదానా!; ఎచటనుండి+ఎచటికిన్+ఏఁగెదవు?= ఎక్కడనుండి ఎక్కడికి వెళుతున్నావు?; ఎవ్వరిదానవు?= నీవెవరవు?; ఏమిటి వెంట+తగిలి+నడతు(వు)= నీవు ఏమి చేస్తుంటావు?; నాకున్= నాకు; చెప్పుము= తెలియజేయుము; అది+అట్టులు+ఉండెన్= అది అట్లా ఉంచి; నా మాటలు= నీకు చెప్పబోయే మాటలు; ఈవు= నీవు; సమాదరమునన్= శ్రద్ధతో; విను.

తాత్పర్యం: 'ఓ సుదతీ! నీవు ఎవరవు? ఏ ఊరు? ఎక్కడికి వెళ్ళుతున్నావు? ఏమి చేస్తుంటావు? వివరంగా చెప్పుము. దానికేంగానీ ముందు నేను చెప్పే మాటలు శ్రద్ధగా వినుము.

విశేషం: ఈ ఇతిహాసంలో జనకమహారాజు పేరు ధర్మధ్వజుడు. **"సన్న్యాస ఫలికः కశ్చిద్బభూవ నృపతిः పురా! మైథిలో జనకో నామ ధర్మధ్వజ ఇతి శ్రుతः॥"** (12-308-4). మిథిలాధిపతులందరికీ 'జనకుడు' అనేది సాధారణ నామధేయం. ఎవరికి వారికి ప్రత్యేకంగా విశిష్టనామధేయాలూ ఉంటాయి. అది ఆ వంశసంప్రదాయం. ఈ సులభ - జనకమహారాజును మిథిలానగరం వెళ్ళి మంత్రి పండిత సభా మధ్యంలో కలుసుకున్నట్టుగా వ్యాసుడు ముందే చెప్పాడు. **"సా ప్రాప్య మిథిలాం రమ్యాం సమృద్ధజనసంకులామ్। భైక్షచర్యాపదేశేన దదర్శ మిథిలేశ్వరమ్॥"** (12-308-12). **"అథ భుక్తవతీ ప్రీతా రాజానం మంత్రిభిర్వృతం । సర్వభాష్యవిదాం మధ్యే చోదయామాస భిక్షుకీ॥" (15).** దీనిని తిక్కన 206వ వచనంలో ప్రస్తావించాడు. తన నేత్రకాంతులతో జనకుడి నేత్రకాంతులను సంయోజన చేసి (చూపుల పగ్గాలు పెనవేసి - రశ్మి అంటే పగ్గమనికూడా) యోగబంధనంలో అతడిని బంధించింది అన్నాడు వ్యాసుడు. " **నేత్రాభ్యాం నేత్రయోరస్య రశ్మిస్సంయోజ్య రశ్మిభిः । సా స్మ సంచోదయిష్యంతం యోగబంధైర్బబంధ హ॥''** (12-308-17).

సీ. పంచశిఖుండను పరమమునీశ్వరు । శిష్యుండ నతనిచే శిక్షితంబు
గమలాక్షి సాంఖ్యయోగక్షితి పాలనం । బులఁ ద్రివిధంబగు మోక్షధర్మ
మట్లుగావున సంశయము లేక ముక్తకా । మస్థితి నమ్ముఁడు మార్గములను
నడచి పరంబున కెడపడకుండుదు । ముక్తి వైరాగ్యైకమూల సూవె

తే. వినుము విరక్తి దృఢ జ్ఞానజనిత గాన । దీపిత జ్ఞానమును విరక్తియు ధరింపఁ
బడిన బుద్ధి నిర్ద్వంద్వత బరఁగు నింటి । యంద నిల్చి నిస్సంగుఁడనై చరింతు. 174

ప్రతిపదార్థం: కమలాక్షి!= పద్మాలవంటి కన్నులుగలదానా!; పంచశిఖుండు+అను= పంచశిఖుడు అనే పేరుగల; పరమమునీశ్వరు= మహామునివరుని; శిష్యుండన్= శిష్యుడను నేను; సాంఖ్య - యోగ - క్షితిపాలనంబులన్= సాంఖ్యమూ, యోగమూ, రాజ్యపరిపాలనమూ అనే వీటితో; త్రివిధంబు+అగు= మూడు విధాలైన; మోక్షధర్మము= ముక్తి పద్ధతి (స్వభావం); అతనిచేన్= ఆ పంచశిఖగురునిచేత; శిక్షితంబు= (నాకు) నేర్పబడింది; అట్లు+కావునన్= అందుచేత; సంశయము లేక= ఏ సందేహమూ లేకుండా; ముక్తకామస్థితిన్= కోరికలు తొలగిన స్థితితో; ఆ+మూఁడు+మార్గములను= ఆ మూడు మోక్షపద్ధతుల్లోనూ; నడచి= ప్రవర్తించి; పరంబునకున్= పరతత్త్వానికి లేదా పరలోకానికి; ఎడపడక+ఉండుదున్= దూరం కాకుండా ఉండగలుగుతున్నాను; ముక్తి= మోక్షమనేది; వైరాగ్యైకమూల+చూవె= వైరాగ్యమే మూలంగా కలది సుమా!; విను; విరక్తి= వైరాగ్యమనేది; దృఢ-జ్ఞాన-జనిత= నిశ్చలమైన జ్ఞానం వల్లనే పుడుతుంది; కానన్= కాబట్టి; దీపిత జ్ఞానమునున్= ప్రకాశించే జ్ఞానమూ; విరక్తియున్= అందువలన కలిగే వైరాగ్యమూ; ధరింపఁబడిన= రెండూ ధరించినటువంటి; బుద్ధి= అంతరంగం; నిర్ద్వంద్వతన్= సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా; పరఁగున్= వ్యవహరిస్తుంది; ఇంటియంద= ఇంటిలోనే; నిల్చి= ఉండీ; నిస్సంగుఁడనై= విరక్తుడనై; చరింతున్= సంచరిస్తూ ఉంటాను.

తాత్పర్యం: ఓ పద్మాక్షీ! పంచశిఖుడు అనే మునీశ్వరుడికి నేను శిష్యుడను. ఆయన నాకు సాంఖ్యంలోనూ యోగంలోనూ రాజ్యపరిపాలనలోనూ - ఈ మూడింటా ముక్తిపొందే మార్గాలు ఉపదేశించారు. అందుచేత నిస్సంశయంగా నిష్కామంగా ఆ మూడు మార్గాల్లోనూ నడుస్తూ పరమాత్మకు సన్నిహితంగా ఉంటున్నాను. ముక్తికి వైరాగ్యమే మూలం. వైరాగ్యానికి జ్ఞానమే ఆధారం. కాబట్టి జ్ఞానంతో కలిగిన విరక్తి నా అంతరంగంలో ఉండటం వలన సుఖదుఃఖాలూ, రాగద్వేషాలూ వంటి ద్వంద్వాలకు అతీతంగా జీవించగలుగుతున్నాను. ఇంటిలోనే (సంసారంతోనే) ఉండి కూడా నిస్సంగుడిగా మనుతున్నాను.

క. వనితా! చందనమునఁ బూ । సినఁ గత్తిని వ్రేసినను సుచిత్తత నా క
జ్ఞను లిరువురయందును సరి, । కనకము లోష్టమును సమమ కాఁ గనుగొందున్. 175

ప్రతిపదార్థం: వనితా!= ఓ మగువా!; చందనమునన్= మంచి గంధంతో; పూసినన్= పులిమినా; కత్తిని= ఖడ్గంతో; వ్రేసినన్= ఖండించినా; నాకున్= నాకు; ఆ+జనులు= ఆ పనిచేసిన వ్యక్తులు; ఇరువురయందునున్= ఇద్దరిపట్లా; సుచిత్తత= ద్వేషం లేని మంచి మనస్సు కలిగి ఉండటమనేది; సరి= సమానం; కనకమున్= బంగారాన్నీ; లోష్టమునున్= మట్టినీ; సమము+అ= సమానమే; కాన్= అయ్యేట్టు; కనుఁగొందున్= చూస్తాను.

తాత్పర్యం: ఓ వనితా! నా శరీరానికి (కుడిభుజానికి) చందనం పులిమినా (ఎడమభుజాన్ని) కత్తితో నరికినా ఆ ఇద్దరి వ్యక్తుల పట్లా నేను రాగ-ద్వేష రహితంగా సమానంగా ఉండగలను. నా దృష్టిలో బంగారానికీ, మట్టికీ తేడా లేదు. నాకు రెండూ సమానమే.

తే. జ్ఞానమును గర్మమును రెంటి సంగమంబు । నిష్ఠలుగ మోక్షవిదులు వర్ణింతు రాత్మ
శాస్త్రములు గని మద్గురుశాసనంబు । సుగమపదము తృతీయంబు సూవె యబల! 176

ప్రతిపదార్థం: అబల!= ఓ సుకుమారీ!; జ్ఞానమును= జ్ఞానమూ; కర్మమును= కర్మత్యాగమూ లేదా కర్మాచరణమూ; రెంటి= ఈ రెండింటి; సంగమంబున్= సాంగత్యాన్ని; నిష్ఠలుగన్= జ్ఞాననిష్ఠగానూ, కర్మనిష్ఠగానూ; మోక్షవిదులు= ముక్తిస్వరూపం తెలిసినవారు; ఆత్మశాస్త్రములు+కని= ఆత్మతత్త్వాన్ని గురించీ మోక్షం గురించీ చర్చించే శాస్త్రాలు చదివి; వర్ణింతురు= వివరించి చెబుతూ ఉంటారు; మత్+గురు+శాసనంబు= మా గురువుగారి ఆజ్ఞ(ఉపదేశం); సుగమపదము= తేలికగా పొందదగినది; తృతీయంబు+చూవె= అది మూడవ నిష్ఠ సుమా!

తాత్పర్యం: ఓ సుకుమారీ! వేదాంతగ్రంథాలు చదివిన మోక్షవేత్తలు జ్ఞాననిష్ఠ - కర్మనిష్ఠ అనే రెండు మార్గాలు చెప్పుతూ ఉంటారు. కానీ, మా గురువుగారు చెప్పేది సులభమైన మూడవ మార్గం సుమా!

ఆ. కీడుగని యొకండు గృహధర్మ ముడిగి స । మాశ్రయించు నాశ్రమాంతరంబు
దాన సంగ ముడుగఁగా నేర దదియొల్ల । మియును వలపుగాన మీననయన! 177

ప్రతిపదార్థం: మీననయన!= ఓ మచ్చెకంటీ!; కీడు+కని= ఏదో ప్రమాదాన్ని పొంది; ఒకండు= ఒక గృహస్థు; గృహధర్మము+ఉడిగి= గృహస్థాశ్రమాన్ని విడిచిపెట్టి; ఆశ్రమాంతరంబున్= సన్న్యాసాశ్రమాన్ని (ఎందుకంటే); సమాశ్రయించున్= స్వీకరిస్తాడు; దానన్= అట్లా స్వీకరించినందువలన; సంగము= తగుల్కోలు; ఉడుగఁగాన్+నేరదు= అంతరించిపోదు (మరొక ఆశ్రమం - సన్న్యాసం); అది+ఒల్లమియున్= గృహస్థాశ్రమం వద్దనటం కూడా; వలపు+కానన్= ఒక కోరికయే కాబట్టి.

తాత్పర్యం: ఓ చేపకన్నుల చిన్నదానా! కుటుంబంలో ఏదో కీడు జరిగింది కదా అని ఒకడు గృహస్థాశ్రమం వదిలేసి సన్న్యాసాశ్రమం స్వీకరిస్తాడు. అంతమాత్రాన అతడికి సాంగత్యం వదలదు. గృహస్థాశ్రమం వద్దు అని ద్వేషించటం కూడా ఒక సంగమే. రాగమే కాదు ద్వేషమూ పనికి రాదు సుమా!

క. దండముఁ గాషాయంబును । ముండితయుఁ గమండలువును మోక్ష మొసఁగ వె
ట్లుండేని లింగములకు న । ఖండజ్ఞాన ప్రదత్వకలనము గలదే? 178

ప్రతిపదార్థం: దండమున్= సన్న్యాసులు ధరించే పొడవాటి కర్ర (త్రిదండి); కాషాయంబును= కాషాయవస్త్రధారణ; ముండితయున్= గుండు కలిగియుండుట; కమండలువును= నీటి కమండలమూ - ఇవి; మోక్షమున్+ఒసఁగవు= మోక్షాన్ని ఇయ్యవు; ఎట్లు+అండు(వు)+ఏనిన్= ఎలాగంటే; లింగములకున్= చిహ్నాలకు; అఖండ= అఖండమైన; జ్ఞాన= జ్ఞానాన్ని; ప్రదత్వకలనము= ఇవ్వగలిగిన శక్తి; కలదే?= ఉన్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: సన్న్యాసాశ్రమం స్వీకరించాడు - అనటానికి చిహ్నాలైన కాషాయధారణ, ముండనం, దండకమండల వహనం, ఇత్యాదులు మోక్షాన్ని ఇవ్వవు. బాహ్యచిహ్నాలకు జ్ఞానప్రదానశక్తి ఉండదుగదా! జ్ఞానమనేది ఆత్మగుణం. ఈ చిహ్నాలు ఏమీ లేకుండానూ జ్ఞాని ఉండవచ్చును.

విశేషం: ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎట్లంటేనిన్ అని ఉంటే అన్వయం హాయిగా కుదురుతుంది. కానీ అప్పుడు ప్రాసనియమం భంగపడుతుంది. అందు(వు)+ఏనిన్= అందేనిన్ అని విభజించి ద-డలకు అభేదం కనక 'అండేనిన్' అని సమన్వయించాలి. 'అందురు- అండ్రు' అనే రూపాల్లో దకారం డకారంగా మారటం ఉన్నది.

క. మగువా! దుఃఖము శిథిలం । బగునని లింగములు దాల్తు రమ్మెయి లే దె
ట్లు? గొడుగునందుం గావున । వగవఁగ మోక్షదముగాఁగ వలయున్ గొడుగున్. 179

ప్రతిపదార్థం: మగువా!= ఓ వనితా!; దుఃఖము= శోకమనేది; శిథిలంబు+అగున్+అని= తొలగిపోతుంది అనుకొని; లింగములు= కాషాయమూ మొదలైన వైరాగ్య చిహ్నాలను; తాల్తురు= ధరిస్తూ ఉంటారు; ఆ+మెయి= ఆపాటి; గొడుగునందున్= రాజలాంఛనమైన వెల్లగొడుగులోమాత్రం; లేదు+ఎట్లు?= లేదా ఏమిటి?; కావునన్= కాబట్టి; వగవఁగన్= దుఃఖాలు కొనితెచ్చుకొనటానికీ; మోక్షదము+కాఁగన్= ముక్తిప్రదం అవ్వటానికీ; గొడుగున్= కాషాయాదులతోపాటు గొడుగుకూడా; వలయున్= కావలసిందే మరి!

తాత్పర్యం: దుఃఖం తొలగిపోతుందని కాషాయాది సన్న్యాసచిహ్నాలను స్వీకరిస్తారు. ఆ పాటి శక్తి రాజలాంఛనంగా నేను ధరించే సితచ్ఛత్రానికి మాత్రం లేదా! అది దుఃఖహేతువైనా ముక్తిప్రదమైనా గొడుగు అనేది నాకు తప్పదు.

(జ్ఞానం కాక కాషాయాదులే మోక్షాన్ని ఇచ్చేటట్లయితే నాకు నా గొడుగూ మోక్షదం అవుతుందని; జ్ఞానమే మోక్ష హేతువయినప్పుడు అది నాకు ఉన్నది కనుక ఇంక ఈ రాజలాంఛనాలు నాకు దుఃఖకారణాలూ బంధనాలూ కావని భావం.)

విశేషం: దీనికి మూలశ్లోకంలో భావం మరింత స్పష్టంగా కనపడుతున్నది. **"అథవా దుఃఖశైథిల్యం వీక్ష్య లింగే కృతా మతిః । కిం తదేవార్థ సామాన్యం ఛత్రాదిషు న లక్ష్యతే॥" (12-308-49).** ఏ చిహ్నాలూ లేనంతమాత్రం చేత మోక్షం లభించదు. ఏవో కొన్ని లాంఛనాలు ఉన్నంతమాత్రంచేత అవి బంధనాలూ కావు. చిహ్నాలు ఉన్నా లేకపోయినా జీవుడు జ్ఞానంచేతనే ముక్తుడు అవుతున్నాడు. **"ఆకించన్యే న మోక్షోzస్తి, కైంచిన్యే నాస్తి బంధనమ్ । కైంచిన్యే చేతరే చైవ జంతుః జ్ఞానేన ముచ్యతే॥" (12-308-50).**

ఆ. జ్ఞానమునన కాని మానిని! లింగమా । త్రమున ముక్తి యగునె? రాజ్యబంధ
రాగబంధ నిఖిల భోగబంధములఁ బ్ర । జ్ఞాసిఁ దునిమినాఁడ నది గతముగ. 180

ప్రతిపదార్థం: మానిని!= ఓ మగువా!; జ్ఞానమునన్+అ+కాని= జ్ఞానం చేతనే తప్ప; లింగమాత్రమునన్= కాషాయాది చిహ్నాలను ధరించినంత మాత్రంచేత; ముక్తి+అగునె?= మోక్షం లభిస్తుందా?; రాజ్యబంధ= రాజ్యపరిపాలనం అనే బంధాన్నీ; రాగబంధ= వ్యామోహం అనే బంధాన్నీ; నిఖిల= సమస్తమైన; భోగబంధములన్= భోగబంధాలనూ; ప్రజ్ఞా+అసిన్= ప్రజ్ఞ అనే ఖడ్గంతో; తునిమినాఁడన్= ఖండించినవాడను; అది+కతముగన్= ఆ కారణంగా.

తాత్పర్యం: మానినీ! జ్ఞానంవలన మాత్రమే ముక్తి లభిస్తుంది. దండ కమండల కాషాయాది చిహ్నాలవలన కాదు. నేను రాజ్య, రాగ, భోగబంధాలను అన్నింటినీ జ్ఞానం అనే కత్తితో తెగకోసుకొన్నాను. అది కారణంగా ముక్తుడను అయ్యాను. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం.

వ. ఇట్లు ముక్తుండ నైయున్న నాయెడ ముక్తత్వాముక్తత్వంబు లారయవేఁడి వచ్చి మచ్చిత్తంబు మెత్తన చొచ్చి తిదియ ప్రయోజనం బట్లుంగాక. 181

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; ముక్తుండను+ఐ+ఉన్న= ముక్తుడిని అయి ఉన్న; నా+ఎడన్= నాయందు; ముక్తత్వ+అముక్తత్వంబులు= ముక్తుడా? అముక్తుడా? అనే లక్షణాలు; ఆరయన్= తెలుసుకోవటం కోసం; వేఁడి వచ్చి= కోరి వచ్చి; మత్+చిత్తంబున్= నా హృదయాన్ని; మెత్తన= మెల్లగా; చొచ్చితి(వి)= ప్రవేశించావు; ప్రయోజనంబు= దీనికి ప్రయోజనం; ఇదియ= ఇదే, ఇంతే; అట్లున్+కాక= అట్లా కాక.

తాత్పర్యం: ఇట్లా ముక్తుడనై ఉన్న నన్ను పరీక్షించటానికి నా హృదయంలోనికి మెల్లగా ప్రవేశించావు. దీనికి ప్రయోజనం ఇంతే! అట్లా కాక.

తే. బ్రాహ్మణివి యోగినివి పరభార్య వబల! । భర్త ప్రోషితుఁ డేను నృపాలసుతుఁడ
వినుము గృహమేధి నాచారఘనుఁడ నిట్టి । నేను నీవు రమించుట నిందఁ దెదె? 182

ప్రతిపదార్థం: అబల!= ఓ సుకుమారీ!; బ్రాహ్మణివి= నీవు బ్రాహ్మణస్త్రీవి; యోగినివి= భిక్షుకివి; పరభార్యవు= పరకాంతవు; భర్త= నీ మగడు; ప్రోషితుఁడు= ఏదో పనిమీద దూరప్రాంతాలకు వెళ్ళినవాడు; వినుము= ఆలకించు; ఏను= నేను; నృపాల సుతుఁడన్= క్షత్రియకుల సంజాతుడిని; గృహమేధిన్= గృహస్థాశ్రమంలో ఉన్నవాడిని; ఆచారఘనుఁడన్= ఆచారాలను

పాటించటంలో నిష్ఠకలవాడిని; ఇట్టి= ఇటువంటి; నేనున్= నేనూ; నీవున్= నీవూ; రమించుట= సుఖించటమనేది; నిందన్+ తేదె?= అపకీర్తి తీసుకురాదా?

తాత్పర్యం: మానినీ! నేను ముక్తుడనో కాదో పరీక్షించటంకొరకే నీవు నా హృదయంలోనికి ప్రవేశించావు అనుకొంటున్నాను. అట్లా కాక మరింకేదయినా శృంగారపరమైన శారీరకవాంఛతో ప్రవేశించినట్లయితే - వినుము. మరి నీవు బ్రాహ్మణకులంలో పుట్టినదానవు. నేను క్షత్రియుడను. నీవు యోగినివి. నేను గృహమేధిని. నీవు పరభార్యవు. నేను ఆచారపరుడను. ఇట్లాంటి నీవూ నేనూ రమించటం ఎంతటి నింద్యం! ఎంతటి అపకీర్తి!

వ. స్వతంత్రవై నీవు చేసిన యీ యవినయంబున నెయ్యది వాటిల్లిన నది నీయంద నిలుచుం గాక!' యని పలికి వెండియు. 183

ప్రతిపదార్థం: స్వతంత్రవు+ఐ= స్వతంత్రురాలవై; నీవు; చేసిన; ఈ; అవినయంబునన్= అవినీతివలన; ఎయ్యది= ఏది; పాటిల్లినన్= జరిగినా; అది; నీయందున్+అ= నీయందే; నిలుచున్+కాక!= నిలుచుగాక!; అని పలికి= అని పెచ్చరించి; వెండియున్= మళ్ళీ ఇలా అన్నాడు.

తాత్పర్యం: స్వతంత్రించి నీవు చేసిన ఈ అవినీతి పనివలన ఏమి జరిగినా అది నీకే చెందుతుంది గాక!' అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నావలని రాగముననే । నీవిట్లైతి ననుఁ గెల్చు నిపుణతకుం గా
కీ వెడమాయల నిప్పుడుఁ । బో విడువవు యోగశక్తి పాలుపు కలిమినే. 184

ప్రతిపదార్థం: ననున్= నన్ను; గెల్చు= జయించటం అనే; నిపుణతకున్+కాక= నైపుణ్యంకోసం కాకుండా; ఈ+వెడమాయలన్= ఈ రకమైన వృథా మాయలు; ఇప్పుడున్= ఇంత చెప్పినా ఇప్పటికీ; పోన్+విడువవు= నీవు విడవటం లేదు; అది యోగశక్తి= యోగశక్తియొక్క; పాలుపు= మహిమ; కలిమినే= నీకు ఉండటంచేతనే.

తాత్పర్యం: 'ఓ మానినీ! నన్ను పరీక్షించి గెలవటంకొరకు కాక నాపట్ల అనురాగంతోనే నీవు ఇట్లా అందాలరాశిగా రూపం ధరించి వచ్చావు. అందుకే ఈ వృథామాయలను ఇప్పటికీ నీవు వదిలిపెట్టటం లేదు. ఇదంతా నీకున్న యోగశక్తి మహిమవలన సాధ్యపడుతున్నది.

క. నిను డాఁచి కుటిలభావం । బున దుష్టచరిత్రవైతి ముక్తుల తెఱఁగే
వనిత! యిది యే బయలుపఱి । చిననైనను మానవలదె చెన్నఁటిచూపుల్?' 185

ప్రతిపదార్థం: వనిత!= ఓ మగువా!; నినున్= నిన్ను నీవు; డాఁచి= కప్పిపుచ్చుకొని; కుటిలభావంబునన్= వక్రబుద్ధితో; దుష్టచరిత్రవు+ఐతి(వి)= దుష్టస్వభావవు అయ్యావు; ఇది= ఇటువంటిది; ముక్తుల తెఱఁగే?= ముక్తుల పద్ధతియేనా?; ఏన్= నేను; బయలుపఱిచిన నైననున్= ఇట్లా నా స్వభావాన్నీ, నీ వ్యవహారాన్నీ బట్టబయలు చేసినప్పుడైనా; చెన్నఁటి చూపుల్= వంకర చూపులు (దుష్టమైన చూపులు); మానవలదె?= మానవద్దా?

తాత్పర్యం: అమ్మాయీ! వక్రబుద్ధితో నిన్ను నీవు కప్పిపుచ్చుకొని నీ దుష్టస్వభావం వెల్లడించుకొన్నావు. ఇది ముక్తుల పద్ధతేనా? పోనీ నేను బయలుపరచాను కనుక ఇప్పటికైనా నీ కుటిల వీక్షణాలు మానుకొనవద్దా?'

క. అని తన వైరాగ్యంబును । ఘనబోధము మహిమయుం బ్రకాశింప మనం
బున సరకుగొనక యి ట్ల । వ్వనితఁ బలికి యన్నరేంద్రవర్యుఁడు మఱియున్. 186

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఆ+నరేంద్రవర్యుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు జనకమహారాజు; తన= తనయొక్క; వైరాగ్యంబును= విరక్తి; ఘన= గొప్పదైన; బోధము+మహిమయున్= జ్ఞానం యొక్క మహిమా; ప్రకాశింపన్= విరాజిల్లేటట్లు; మనంబునన్= మనస్సులో; సరకుగొనక= సులభను లెక్కచెయ్యకుండా; ఇట్లు= ఈ ప్రకారంగా; ఆ+వనితన్= ఆ స్త్రీని ఉద్దేశించి; పలికి= ఉపన్యసించి; మఱియున్= ఇంకా (ఇట్లా అంటున్నాడు.)

తాత్పర్యం: జనకమహారాజు అమెను లెక్కచెయ్యకుండా తన వైరాగ్యమూ, తన జ్ఞానమహిమమూ ప్రకాశించేట్లు ఇట్లా మాట్లాడి, మళ్ళీ తనే ఇంకా ఉపన్యాసం కొనసాగిస్తున్నాడు.

క. తను వొప్పెడునది యౌవన । మును నూతన మిట్టి నీకుఁ బొలఁతీ! యోగం
బున నింతచొరవ యెమ్మెయిఁ । బనుపడియెం జెపుమ! దాఁపఁ బనిలే దింకన్.' 187

ప్రతిపదార్థం: పొలఁతీ!= ఓ వనితా!; తనువు= నీ శరీరం; ఒప్పెడునది= చాలా అందంగా ఉంది; యౌవనమును= నీ జవ్వనంకూడా; నూతనము= తొలిదశలో ఉంది; ఇట్టి నీకున్= ఇలా తొలిప్రాయంలో ఉన్న నీకు; యోగంబునన్= యోగమార్గంలో; ఇంత చొరవ= ఇంతటి ప్రవేశం (చనవు); ఏ+మెయిన్= ఎట్లా; పనువడియెన్= అలవడింది; చెపుమ!= దయచేసి చెప్పుము!; ఇంకన్= ఇక; దాఁపన్+పనిలేదు= దాచవలసిన అవసరంలేదు.

తాత్పర్యం: ఓ వనితా! నీ శరీరం చూస్తే ఒప్పులకుప్పవలె ఉన్నది. నీ యౌవనమా తొలిదశలో ఉన్నది. మరి నీకు ఇంతటి యోగమహిమ ఎట్లా అలవడింది? ఇంకా దాపరికం ఎందుకు? చెప్పుము'.

వ. అనుచు. 188

తాత్పర్యం: అంటూ.

క. తను సరకుసేయ కి ట్ల । జ్జననాథుఁడు వలుక నవ్వచనములు దెలియన్
విని సులభ చతురముగ ని । ట్లను నించుక గొంకులేక యవ్విభుతోడన్. 189

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తనున్= తనను; సరకుసేయక= లక్ష్యపెట్టకుండా; ఇట్లు= ఈ విధంగా; ఆ+జననాథుఁడు= ఆ జనకమహారాజు; పలుకన్= మాట్లాడేసరికి; ఆ+వచనములు= ఆ మాటలు; తెలియన్ విని= అర్థమయ్యేట్టు ఆలకించి; సులభ= ఆ సులభ; చతురముగన్= నిపుణంగా; ఆ+విభుతోన్= ఆ రాజుతో; ఇంచుక= కొంచెమైనా; కొంకులేక= జంకు అనేది లేకుండా; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నది.

తాత్పర్యం: జనకమహారాజు ఇట్లా తనను ఏ మాత్రమూ లెక్కచెయ్యకుండా మాట్లాడినా; అంతా శ్రద్ధగా ఆలకించి, సులభాదేవి చాలా నిపుణంగా బదులు పలికింది.

క. 'శ్రోతకుఁ దనకుం బ్రియమగు । నే తెరువున నట్టిమెయి సమీరిత మైనం
జూ తగు వాక్యం బది నృప । సూతీ! పెఱపలుకు బాలిశుల చొ ప్పరయన్. 190

ప్రతిపదార్థం: నృపసూతీ!= ఓ రాకుమారా!; శ్రోతకున్= వినే వ్యక్తికీ; తనకున్= చెప్పే తనకూ; ఏ తెరువునన్= ఏ పద్ధతిలో; ప్రియము+అగున్= హితవు అవుతుందో; అట్టి మెయిన్= ఆ పద్ధతిలో; సమీరితము+ఐనన్+చూ!= చెప్పబడినది అయితేనే సుమా!; అది; తగువాక్యంబు= తగినమాట అవుతుంది; పెఱపలుకు= తక్కినవాక్యం (మాట); అరయన్= పరిశీలనగా చూస్తే; బాలిశుల చొప్పు= మూర్ఖుల పద్ధతి.

తాత్పర్యం: 'ఓ క్షత్రియకుమారా! వినే వ్యక్తికీ, చెప్పే వ్యక్తికీ హితమైన పద్ధతిలో వెలువడినదే సరి అయిన మాట. తక్కినవన్నీ మూఢుల మాటలక్రిందే లెక్క.

వ. భవదీయ వాక్యవైదగ్ధ్యం బట్లుండె నీవు నన్నెవ్వరిదాన? వెచ్చటినుండి వచ్చి? తెటుపోయె?దని తొలుత నడిగి తవహితుండవై వినుము చెప్పెద. 191

ప్రతిపదార్థం: భవదీయ= నీ; వాక్య= మాటల; వైదగ్ధ్యంబు= నేర్పు; అట్లు+ఉండెన్= అట్లా ఉంది; నీవు; నన్నున్= నన్ను; ఎవ్వరిదానవు?= ఎవరి వనితవు?; ఎచ్చటినుండి వచ్చితి(వి)?= ఎక్కడనుంచి వచ్చావు?; ఎటుపోయెదు?= ఎక్కడికి వెడతావు?; అని; తొలుతన్= ఆదిలో; అడిగితి(వి)= అడిగావు, అవహితుండవై= సావధానుడవై; వినుము= ఆలకించు; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: నీ మాటల చాతుర్యం అట్లా ఉండనిమ్ము. నా వివరాలను మొదట్లో అడిగావు కనుక చెప్పుతున్నాను. సావధానంగా వినుము.

జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట (సం. 12-308-95,96)

క. వినుఁ పాంసూదకముల చా । డ్పున జతుకాష్ఠముల భంగి భూతంబులకున్
మనుజేంద్ర! కలుగుఁ బొం దా । పని నన్యోన్యసమధీనభావము గలదే? 192

ప్రతిపదార్థం: మనుజేంద్ర= ఓ మహారాజా!; వినుఁ; పాంసు+ఉదకముల+చాడ్పునన్= దుమ్ము, నీరులాగా; జతు+కాష్ఠముల+భంగిన్= లక్క, చెక్కల్లాగా; భూతంబులకున్= పంచభూతాలకు; పొందు= కలయిక (సాంగత్యం); కలుగున్= ఏర్పడుతుంది; ఆ పనిన్= ఆ కలయికలో; అన్యోన్య సమ్+అధీన+భావము= పరస్పరం ఒకదాని అధీనంలో మరొకటి ఉండటమనే స్థితి; కలదే?= ఉంటుందా?

తాత్పర్యం: ధూళికణాలూ, నీటి బిందువులూ కలిసినట్లుగా, లక్కతో కర్ర అతికినట్లుగా పంచభూతాలకు యాదృచ్ఛికంగా పరస్పరం కలయిక ఏర్పడుతూ ఉంటుంది. ఎంతగా కలిసి ఉన్నా ఇవి పరస్పరాధీనాలు కావు. దేని అస్తిత్వం దానికుంటుంది. ఒకదానితో కలిసి ఉన్నట్టు మరొక దానికి తెలియదు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. ఒక్క మేనియంద యుర్వీశ! పంచభూ । తములు దశమితేంద్రియములు మనసు
బుద్ధియును బ్రధానమును గల వివి యొక్కఁ । డొకటియవియె, యేల యొండు సెప్ప? 193

ప్రతిపదార్థం: ఉర్వీశ!= రాజా!; ఒక్క మేనియందున్+అ= ఒక్క శరీరంలోనే; పంచభూతములున్= పంచభూతాలూ; దశమిత+ఇంద్రియములున్= పది పరిమితమైన ఇంద్రియాలూ; మనసున్= మనస్సూ; బుద్ధియును= బుద్ధి అనేదీ; ప్రధానమును= ప్రకృతి లేదా అవ్యక్తం అనబడే తత్త్వమూ; కలవు= ఉన్నాయి; ఇవి= ఇవన్నీ; ఒక్కఁడు+ఒకటి+అవియె= వేటికవి స్వతంత్రాలే; ఒండు= మరొకటి ఉదాహరణంగా; చెప్పన్ ఏల?= చెప్పటం ఎందుకూ?

తాత్పర్యం: ఒకే శరీరంలో పంచభూతాలూ, దశేంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ, ప్రకృతీ ఇవి అన్నీ కలిసిఉంటున్నాయి. కానీ, ఒకదాని ఉనికి మరొక దానికి తెలియదు. దేని కది ప్రత్యేకమే. ఇంక మరొకటి చెప్పవలసిన పని ఏముంది? (పంచభూతాల కలయిక అన్యోన్య సమధీనం కాదు అనటానికి ఇది చాలు - అని.)

వ. నిక్కంబునకు నెవ్వరు నెవ్వరివారుం గామి తెలియవే? యని పలికి వెండియు. 194

ప్రతిపదార్థం: నిక్కంబునకున్= నిజానికి; ఎవ్వరున్= ఎవ్వరూకూడా; ఎవ్వరివారున్+కామి= ఎవ్వరివారూ కాకపోవటం; తెలియవే?= ఎరుగవా?; అని పలికి= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: నిజానికి ఎవరూ ఒకరికి చెందినవారు కారని తెలియదా?' అని చెప్పి మరల ఇట్లా కొనసాగించింది.

తే. 'సకలలోకములను సదశ్వంబు కరణి । ధావనము సేయుచుండుఁ బ్రధాన మింత
యెఱిఁగి జననాథ! యెవ్వరి నెచటనుండు । వార లనువార మమ్మాటవలను సెపుమ! 195

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా!; ప్రధానము= ప్రకృతి అనేది (ప్రాణం); సత్+అశ్వంబు+కరణిన్= మేలుజాతి గుర్రంలాగా; సకలలోకములను= సమస్తలోకాలలోనూ; ధావనము+చేయుచుండున్= పరుగుతీస్తూ ఉంటుంది; ఇంత= ఇదంతా; ఎఱిఁగి= తెలిసీ; ఎవ్వరిన్= ఎవరిని; ఎచటనుండువారలు= ఎక్కడ ఉండేవారు; అనువారము?= అనగలం?; ఆ+మాట+వలనున్= ఆ మాట తీరూ అర్థం; (వలను= తీరు, దిక్కు); చెపుమ!= చెప్పుము చూద్దాం!

తాత్పర్యం: 'జనకమహారాజా! ప్రకృతి అనేది జవనాశ్వంవలె సకలలోకాలకూ పరుగులు తీస్తూ ఉంటుంది. అది నీకూ తెలుసు, నాకూ తెలుసు. ఇంత తెలిసీ ఎవరిని ఎక్కడివాళ్ళు అని అడగగలం? అసలు ఆ ప్రశ్నకు అర్థంఏమిటి?

తే. నీవు నీయందు నినుఁగను నెఱియ యొరుల । యందుఁ గానంగవలవదే యధిప! తన్ను
నొరులనొక్కటిగాఁ జూచు పురుషుఁ డెచట । మీరలుండుదు రెవ్వరివార లనునె? 196

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీవు; నీయందున్= నీలో; నినున్= నిన్ను; కను= చూసుకొనే; నెఱియ= అందమే, పద్ధతియే; ఒరులయందున్= ఇతరులలో కూడా; కానంగన్+వలవదే?= చూడవద్దా?; తన్నున్= తననూ; ఒరులన్= ఇతరులనూ; ఒక్కటిగాన్= అభిన్నంగా; చూచు= దర్శించగలిగిన; పురుషుఁడు= జ్ఞాని; ఎచటన్= ఎక్కడ; మీరలు= మీరు; ఉండుదురు?= నివసిస్తారు?; ఎవ్వరివారలు?= ఎవరికి చెందినవారు మీరు?; అనునె?= అని ప్రశ్నిస్తాడా?

తాత్పర్యం: రాజా! నీలో నిన్ను నీవు చూచికొనగలిగినట్లే ఇతరులలోనూ చూడగలగాలి కదా! జీవాత్ముడి సాక్షాత్కారం సర్వప్రాణికోటిలోనూ పొందగలిగినవాడు తాను అనీ, ఇతరులు అనీ భేదభావంతో ఉండగలడా? అతడికి అందరూ అంతా ఒక్కటే. 'నీవు ఎవరవు? ఎవరి దానవు?' - ఇట్లాంటి ప్రశ్నలు వెయ్యడు. అవునా?

తే. అరులు మిత్రు లుదాసీను లనుచు సంధి । విగ్రహాది షడ్గుణముల వెరవు లొకరుఁ
డలవరించుచు విజయంబు నాసపడుచు । నుండునటె? ముక్తితెఱఁ గిటులున్నె యరయ?! 197

ప్రతిపదార్థం: ఒకరుఁడు= అటువంటి జ్ఞానం కలిగిన వ్యక్తి ఒకడు; అరులు= శత్రువులూ; మిత్రులు= స్నేహితులూ; ఉదాసీనులు= మధ్యస్థులూ; అనుచున్= అని ఇతరులను విభజిస్తూ; సంధి= పొత్తూ; విగ్రహ= యుద్ధమూ; ఆది= మొదలైన; షడ్గుణముల= ఆరు విధానాల; వెరవులు= ఉపాయాలు; అలవరించుచున్= ఆచరణలో పెట్టుతూ; విజయంబున్= శత్రువులమీద విజయాన్ని; ఆశపడుచున్= ఆశిస్తూ; ఉండునటె?= ఉంటాడా?; అరయన్= ఆలోచిస్తే; ముక్తి తెఱఁగు= మోక్షవిధానం - ముక్తిమార్గం; ఇటులు+ఉన్నె?= ఇట్లా ఉంటుందా?

తాత్పర్యం: రాజా! వీరు శత్రువులనీ, వారు మిత్రులనీ, వీరు మధ్యస్థులనీ జనులను విభజించి చూస్తూ, వాళ్ళమీద విజయం సాధించటానికి ఆరురకాల రాజనీతి ఉపాయాలను పన్నుతూ - ఇట్లా ఉంటాడా నిజమైన జ్ఞాని? ముక్తిమార్గం ఇట్లాగే ఉంటుందా?

ఉ. కావున నీవు ముక్తుఁడవు గా విటు గాకయు నిన్ను ముక్తుఁగా
భూవర! చూచె దిక్కలఁక బుద్ధులు సెప్పి తగం దొలంగఁగాఁ
ద్రోవఁగఁ బాడి బంధులకు దుర్మతి వుట్టినయట్టి మర్ము వా
రే విధినైన మందు లిడి యెప్పటి బుద్ధి ఘటించుచాడ్పునన్. 198

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కాబట్టి; నీవు; ముక్తుడవు= బంధవిముక్తుడవు (జ్ఞానివి); కావు= కాదు; ఇటు+కాకయున్= ఇట్లా కాకపోయినా; నిన్నున్= నిన్ను నీవు; ఇటు= ఇట్లా; ముక్తున్+కాన్= ముక్తుడుగా; చూచెదు= భావిస్తున్నావు; ఈ+కలఁకన్= ఈ రుగ్మతను; బుద్ధులు+చెప్పి= జ్ఞానం ఉపదేశించి; తగన్= తగిన పద్ధతిలో; తొలంగఁగాన్+త్రోవఁగన్= తొలగ జేయటం; బంధులకున్= హితులకు; దుర్మతి+పుట్టిన+అట్టి+మర్మున్= దురాలోచనలూ, దుర్బుద్ధులూ పుట్టే మానవుడిని; వారు= ఆ బంధువులు; ఏ విధినైనన్= ఎట్లాగైనా; మందులు+ఇడి= ఔషధాలు ఇచ్చి; ఎప్పటి బుద్ధి= మునుపటి సద్బుద్ధి; ఘటించు+చాడ్పునన్= కలగజేసినట్టుగా; పాడి= ధర్మం.

తాత్పర్యం: ఓ రాజా! షాడ్గుణ్యం పన్నుతూ జయాభిలాషివై ఉన్నావు కాబట్టి నీవు ముక్తుడవు కావు. కాకపోయినా ఇట్లా నిన్ను నీవు ముక్తుడుగా భావిస్తున్నావు. అంటే ఇదేదో మానసికరుగ్మత. తగిన బుద్ధి చెప్పి దీనిని తొలగించటం బంధువుల కర్తవ్యం. ఎవడయినా ఒకడు ఉన్నట్టుండి దుర్మతి అయిపోతే వాడికి ఎట్లాగైనా ఏ మందులో మాకులో ఇప్పించి మళ్ళీ మనిషిని చేసినట్లుగా బంధువులంతా పూనుకొని నీ కలక వదలించాలి. ఇది పాడి. ఇది ధర్మం.

వ. ఏనెట్లు ముక్తుండఁగా? నంటేని విను మింకనుం జెప్పెద. 199

ప్రతిపదార్థం: రాజా! ఏను= నేను; ఎట్లు= ఏ విధంగా; ముక్తుండన్+కాను?= ముక్తుడిని కాను?; అంటి(వి)+ఏనిన్= అని నీవు అడిగినట్లయితే; వినుము= ఆలకించు; ఇంకనున్= ఇంకా వివరంగా; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: ఓ రాజా! 'నేను ఏ విధంగా ముక్తుడను కాను?' అని నీవు అడిగితే గనుక ఇంకా చెప్పుతాను. వినుము.

సీ. వర్గత్రయంబున వలనను సప్తాంగ । ములయందుఁ జిత్తంబు మెలఁగుచుండ,
రాజులు-మజ్జనభోజన నిద్రావ । సరములు లోనుగా జనులుసేయు
విజ్ఞాపనము విని యాజ్ఞాపనం బొన । రించుచు, మంత్రులుఁ బ్రేమపాత్ర
తరుణులు నస్వతంత్రతఁ జేయ, నర్థుల । కొసరి తిండియు ధనగుప్తిమీఁది

తే. భరముఁ దమలో విరోధులై పట్టి మనసుఁ । జిక్కువఱుపంగఁ, బెక్కండ్రు సిరికి నడువఁ
బరిహరించుచు - బహుదుఃఖపరులు నల్ప । సౌఖ్యులును నగుచునికి రాజ్యంబు తెఱఁగు. 200

ప్రతిపదార్థం: వర్గత్రయంబున+వలనను= ధర్మ, అర్థ, కామాలు అనే మూడు పురుషార్థాల పట్లా; సప్త+అంగములయందున్= సైన్యమూ, కోశమూ మొదలైన రాజ్యాంగాలు ఏడింటిపట్లా; చిత్తంబు= మనస్సు; మెలఁగుచున్+ఉండన్= నిత్యమూ మెలగుతూ ఉంటే; మజ్జన+అవసరము= స్నాన సమయమూ; భోజన+అవసరము= భోజనసమయమూ; నిద్రా+అవసరము(లు)= నిద్రాసమయమూ అని; లోనుగాన్= ఈ మొదలైనవాటిని; జనులు= సేవకజనులు; చేయు= చేసేటటువంటి; విజ్ఞాపనము= విన్నపం; విని= ఆలకించి; ఆజ్ఞాపనంబు+ఒనరించుచున్= వాటివాటికి ఏర్పాట్లు చెయ్యమని ఆజ్ఞలు జారీ చేస్తూ; మంత్రులున్= అమాత్యులూ; ప్రేమపాత్ర= ప్రేమకు పాత్రలైన; తరుణులున్= వనితలూ; అస్వతంత్రతన్= అస్వతంత్రస్థితిని; చేయన్= తనకు కల్పించగా; అర్థుల= యాచకుల విషయంలో; కొసరి= ఇంకా ఇంకా కొసరి కొసరి; తిండియున్= ఆహారాదికం; ధనగుప్తిమీఁది= కోశాగారంలో ఉన్నధనం

కాపాడటంపట్ల ఉండే; భరమున్= బాధ్యత; తమలోన్= పరస్పరం; విరోధులై= శత్రువులై; పట్టి= ఆక్రమించి; మనసున్= మనస్సును; చిక్కు+పఱుపంగన్= కలతపెట్టగా; పెక్కండ్రు= పలువురు; సిరికిన్= తన సంపదకోసం; నడువన్= ప్రయత్నిస్తోంటే; పరిహరించుచున్= అటువంటివారిని పరిహరిస్తూ; రాజులు= పరిపాలకులు; బహుదుఃఖపరులు= అధికదుఃఖాలు కలవారూ; అల్పసౌఖ్యులును= తక్కువ సుఖాలు కలవారుగా; అగుచున్+ఉనికి= అవుతూ ఉండటం; రాజ్యంబు తెఱగు= రాజ్యం తాలూకు పద్ధతి.

తాత్పర్యం: రాజుల హృదయంలో ఎప్పుడూ వర్గత్రయకాంక్ష, సప్తాంగాలపట్ల జాగరూకత - ఇవే ఉంటాయి. వారి స్నానసంధ్యాదులు దాసదాసీజనం గుర్తుచేస్తే జరుగుతాయి. వారు చేసే ఏర్పాట్ల ప్రకారం ఉంటాయి. మంత్రులూ, తరుణులూ రాజులను పూర్తిగా అస్వతంత్రులను చేసేస్తారు. ధనాగారం కాపాడుకొనటం ఒకవైపూ, అర్థులకు దానం చెయ్యటం మరొకవైపూ రాజుల మనస్సులను పట్టిపీడిస్తూ ఉంటాయి. తన సిరికి ఆశపడేవాళ్ళను పరిహరించటం- అదొక బాధ్యత. మొత్తంమీద పరిపాలకులకు దుఃఖాలు ఎక్కువ - సౌఖ్యాలు తక్కువ. ఇదీ రాజ్యం పద్ధతి.

విశేషం: 'అర్థులకొసరి తిండియు - ధనగుప్తిమీఁది భరమున్' అనే పాఠంలో అన్వయం క్లిష్టంగా ఉన్నది. 'అర్థుల కొసఁగి తిండియు' అన్న పాఠాంతరంలో అన్వయసౌలభ్యం ఉన్నా అఖండయతి అవుతున్నది. 'అర్థులకున్+ఒసఁగి= అర్థుల కొసఁగి'లో 'కొ' కి గుప్తిలో 'గు'తో యతి. దీనికి మూలమైన సంస్కృతశ్లోకాలు **"అభిగమ్యాభిగమ్యైనం యాచంతే సతతం నరాః । న చాప్యుత్సహతే దాతుం విత్తరక్షీ మహాజనాత్॥ దానే కోశక్షమోహ్యస్య వైరం చాప్యప్రయచ్ఛతః । క్షణేనాస్యోపవర్తంతే దోషా వైరాగ్యకారకాః ॥"** స్పష్టంగా ఉన్నాయి. **(12-308-144).**

వ. వారలు ముక్తులు గామి దెల్లం బది యట్లుండె నీకు విశేషించియు. 201

ప్రతిపదార్థం: వారలు= అటువంటి రాజులు; ముక్తులు+కామి= ముక్తులు కాకపోవటం; తెల్లంబు= స్పష్టం; అది= ఆ విషయం; అట్లు+ఉండెన్= అట్లా ఉండనిమ్ము; నీకున్= నీకు; విశేషించి= విశేషంగా.

తాత్పర్యం: అటువంటి రాజులు ముక్తులు కాకపోవటం స్పష్టం, నీకు విశేషంగా చెప్పాలంటే.

చ. సదయ మనీషఁ బంచశిఖసంయమి మోక్షము దెల్పెనంటి, నీ
హృదయము నాదు చొచ్చుటకు నెంతయు రోసితి, ముక్తు చందమే
యిది? నిరపేక్షుఁడైన వినుమెయ్యది యెట్లయినం బ్రశాంతిసం
పద నొకయింతయుం గలఁగఁ బాఱకయుండఁడె నిర్వికారుఁడై? 202

ప్రతిపదార్థం: సదయమనీషన్= దయగల హృదయంతో; పంచశిఖ-సంయమి= పంచశిఖుడు అనే యోగీశ్వరుడు; మోక్షంబు= ముక్తివిధానం; తెల్పెన్+అంటి(వి)= తెలియజేశాడు అన్నావు; నీ హృదయమున్= నీ హృదయాన్ని; నాదు+చొచ్చుటకున్= నేను ప్రవేశించటానికి; ఎంతయున్+రోసితి(వి)= ఎంతగానో అసహ్యించుకున్నావు; ఇది= ఇట్లా అసహ్యించుకోవటం; ముక్తు+చందమే?= ముక్తుడి పద్ధతియేనా?; వినుము; నిరపేక్షుఁడైనన్= వ్యక్తినిజంగా విరక్తుడే అయితే; ఏ+అది+ఎట్లు+అయినన్= ఏది ఎట్లా జరిగినా; నిర్వికారుఁడై= ఏ రకమైన ప్రతిస్పందనా లేనివాడై; ప్రశాంతిసంపదన్= తన విలువైన మానసిక ప్రశాంతి విషయంలో; ఒక+ఇంతయున్= రవ్వంతకూడా; కలఁగన్+పాఱక= కలతచెందకుండా; ఉండఁడె?= ఉండడా?

తాత్పర్యం: మహారాజా! పంచశిఖమునీశ్వరుడు నీకు మోక్షపద్ధతిని ఉపదేశించాడు అన్నావు. నేను నీ హృదయంలోకి ప్రవేశించా నని అసహ్యించుకొంటున్నావు. ఇది ముక్తుడి పద్ధతేనా? నిజంగా విరక్తుడైన వ్యక్తి ఏది ఎట్లా జరిగినా నిర్వికారుడుగానే ఉంటాడు తప్ప ఎట్టి పరిస్థితులలోనూ తన మానసిక ప్రశాంతినికోల్పోడు,చలించడు, కలత చెందడు.

క. వినుఁ శూన్యస్థానంబున । నునికి యతికిఁ గృత్య మగుట నుర్వీశ్వర! ము
క్తుని మానసంబు శూన్యం । బని చొచ్చితి, ముక్తి లేమి నది తప్పయ్యెన్. 203

ప్రతిపదార్థం: ఉర్వీశ్వర!= భూపాలా!; వినుఁ; శూన్యస్థానంబునన్= శూన్యప్రదేశంలో (నిర్జన ప్రదేశంలో); ఉనికి= నివాసం; యతికిన్= యోగికి; కృత్యము+అగుటన్= కర్తవ్యం కాబట్టి; ముక్తుని= ముక్తుడైనవాడి; మానసంబున్= మనస్సుకూడా; శూన్యంబు+అని= శూన్యమే అని; చొచ్చితిన్= నీ మనస్సులోకి ప్రవేశించాను; ముక్తి= ముక్తి అనేది; లేమిన్= లేకపోవటంతో; అది= అట్లా నేను ప్రవేశించటం; తప్పు+అయ్యెన్= పొరపాటు అయ్యింది.

తాత్పర్యం: మహారాజా! యోగీశ్వరులు శూన్యప్రదేశాలలో నివసించటం పరిపాటి. యోగుల మనస్సులు కూడా రాగద్వేషాదిభావశూన్యాలుగానే ఉంటాయి. నీవు ముక్తుడవుకదా అనుకొని నీ మనస్సులోనికి ప్రవేశించాను. కానీ నీవు ముక్తుడవు కావు. అందుకని నేను చేసిన పని తప్పు అయింది. నీవు నిందిస్తున్నావు.

వ. అట్లుం గాక. 204

ప్రతిపదార్థం: అట్లున్+కాక= అదీకాక.

తాత్పర్యం: అదీకాక మరొక్క విషయం.

ఆ. కాలుఁజేయి మొదలుగాఁగల నాయంగ । కములలోన నిన్నుఁ గలయ దొకటి
యేని, రిత్త యిప్పుడేటికిఁ గటకటం । బడుచు నిట్లు దూరఁబలికి తధిప! 205

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; కాలున్= కాలూ; చేయిన్= చేయీ; మొదలుగాన్+కల= మొదలుగా ఉన్న; నా+అంగకములలోనన్= నా శరీరావయవాలలో; ఒకటియేనిన్= ఒక్కటయినా; నిన్నున్= నిన్ను; కలయదు= స్పృశించలేదు; రిత్త(న్)= వృథా(గా); ఇప్పుడు; ఏటికిన్= ఎందుకని; కటకటంబడుచున్= మనస్సు కష్టపెట్టుకుంటూ; ఇట్లు= ఇలా; దూరన్+బలికితి(వి)?= నన్ను నిందించావు?

తాత్పర్యం: రాజా! నా కాలుగానీ చేయిగానీ మరింక ఏ అవయవంగానీ నిన్ను తాకలేదు. ఎందు కింత వ్యథ చెందుతున్నావు? వృథాగా నన్ను ఎందుకు నిందిస్తున్నావు? ఇప్పుడు ఏమంత అపచారం జరిగిపోయిందని?

వ. అని యమాత్యుల దిక్కు సూచి. 206

ప్రతిపదార్థం: అని; అమాత్యుల దిక్కు= మంత్రులవైపు; చూచి= వీక్షించి.

తాత్పర్యం: అని మంత్రులవైపు చూచి.

ఆ. వీరు పెద్దవారు; వీరలు వినఁ నిట్టి । తులువమాటలాడ దొరకుఁదగునె?
యెదిరిఁ దూలవుచ్చు టే మంచివెరవు? గాం । భీర్యహాని దలఁచు పెంపు లేదె? 207

ప్రతిపదార్థం: వీరు= ఈ మంత్రులందరూ; పెద్దవారు= పెద్దలు; వీరలు= వీరంతా; వినన్= వింటూండగా; ఇట్టి= ఇటువంటి; తులువమాటలు= నీచమైన పలుకులు; ఆడన్= మాట్లాడటం; దొరకున్= ప్రభువుకు; తగునె?= తగునా?; ఎదిరిన్= ఎదుటి వ్యక్తిని; తూల+పుచ్చుట= కించపరచటం; ఏ మంచి వెరవు?= ఏమంత మంచి పద్ధతి?; గాంభీర్యహానిన్= ఉదాత్తత దెబ్బతింటోంది అనే విషయాన్ని; తలఁచు= గుర్తించేటువంటి; పెంపు= ఔన్నత్యం; లేదె?= నీకు లేదా?

తాత్పర్యం: వయోజ్ఞాన వృద్ధులూ, పెద్దలూ అయిన మంత్రులు ఇంతమంది వింటూ ఉండగా ఇట్లా నీచంగా మాట్లాడటం నీవంటి ప్రభువుకు తగిన విషయమేనా? ఎదుటివారిని కించపరచటమే మంచిపద్ధతి అనుకొంటున్నావా? నీ గాంభీర్యం దెబ్బతింటున్నది - అనే విషయాన్ని గమనించేపాటి ఔన్నత్యంకూడా నీకు లేదనుకోనా?

క. వనితల పురుషులయెడఁ బు । ట్టినయది వెల్లివిరిసేఁత డిమ్మరితన, మె
ట్టి నికృష్టుం డైనను ని । ప్పనికిఁ జొరఁడు; దగునె యిది నృపాలసుతునకున్? 208

ప్రతిపదార్థం: వనితల - పురుషుల+ఎడన్= స్త్రీపురుషుల మధ్య; పుట్టిన+అది= ఏర్పడిన సంబంధాన్ని; వెల్లివిరిసేఁత= బాగా ప్రచారం చేయటమనేది; డిమ్మరితనము= దుష్టుడి లక్షణం; ఎట్టి= ఎంతటి; నికృష్టుండు+ఐననున్= నీచుడైనా; ఇప్పనికిన్= ఈ పనికి; చొరఁడు= పూనుకోడు; నృపాలసుతునకున్= నీవంటి రాకుమారుడికి; ఇది; తగునె?= అర్హమా?

తాత్పర్యం: స్త్రీపురుష సంబంధాన్ని ఊరంతా వరదగట్టించటం దుష్టలక్షణం. ఎంతటి నీచుడైనా ఈ పని చెయ్యడు. అటువంటిది ఒక రాజకుమారుడవై నీవు చేయటం సమంజసమా? చెప్పుము.

చ. బిసరుహపత్రలగ్న జలబిందువు చాడ్పున సంగవర్జితో
ల్లసనమునన్ వసించితి నిలావర! నీ మది నిట్టిదానిఁగాఁ
బొసఁగ నెఱుంగవైతి నను; బొంకగు టేర్పడియెన్ విముక్తి చొ
ప్పు సదయవృత్తి నీకు మునిపుంగవు చెప్పుట మాటలేటికిన్? 209

ప్రతిపదార్థం: ఇలావర!= భూవిభూ!; బిసరుహపత్ర= తామరపాకుమీద; లగ్న= నిలిచిన; జలబిందువు చాడ్పునన్= నీటిబిందువువలె; సంగవర్జిత= సాంగత్యరహితమైన; ఉల్లసనమునన్= విలాసంతో; వసించితిన్= ఇంతకాలమూ జీవించాను; ఇట్టిదానిన్+కాన్= ఇటువంటి నిస్సంగగా; ననున్= నన్ను; పొసఁగన్= సముచితంగా; నీ మదిన్= నీ మనస్సులో; ఎఱుంగవు+ఐతి(వి)= తెలుసుకోలేకపోయావు; సదయవృత్తిన్= దయామయమైన ప్రవృత్తితో; నీకున్= నీకు; విముక్తి చొప్పు= మోక్షపద్ధతి; మునిపుంగవు చెప్పుట= పంచశిఖమునీశ్వరుడు ఉపదేశించటం; బొంకు+అగుట= అసత్యం కావటం; ఏర్పడియెన్= జరిగింది, సిద్ధించింది; మాటలు+ఏటికిన్= ఇంక వెయ్యిమాటలు ఎందుకు?

తాత్పర్యం: తామరాకుమీద నీటిబొట్టువలె నిస్సంగంగా జీవితం గడుపుతున్నాను. నన్ను నీవు తెలిసికొనలేకపోయావు. అంటే - పంచశిఖమునీశ్వరుడు దయతో నీకేదో ముక్తిమార్గం ఉపదేశించాడు - అన్నది అసత్యమని తేలింది. ఇంతకూ సారాంశం ఇదీ. ఇంక వేయిమాటలు ఎందుకు!

విశేషం: అలం: ఉపమ.

క. నీవు గృహధర్మ పరతయుఁ । బో విడిచితి; నీకు మోక్షమును విదితము గా
దేవలనికిఁ గా కిట్లు ధ । రావర! మిథ్యా ప్రబోధరతుఁడై తరయన్. 210

ప్రతిపదార్థం: ధరావర!= భూభర్తా!; నీవు; గృహధర్మపరతయున్= గృహస్థాశ్రమధర్మాన్ని ఆచరించటమూ; పోవిడిచితి(వి)= పూర్తిగా విడిచిపెట్టేశావు; నీకున్= నీకు; మోక్షమును= ముక్తిమార్గమంటామా - అదీ; విదితము+కాదు= అర్థం కాలేదు; అరయన్= ఆలోచిస్తే; ఏవలనికిన్+కాక= ఎటూ చెందకుండా; ఇట్లు= ఇట్లా; మిథ్యా ప్రబోధరతుఁడు(డవు)= మిథ్యాజ్ఞానంలో సంబరపడే వాడవు; ఐతి(వి)= అయ్యావు.

తాత్పర్యం: రాజా! నీవు అటు గృహస్థాశ్రమధర్మాలనూ విడిచి పెట్టేశావు. ఇటు మోక్షమార్గమూ నీకు అర్థం కాలేదు. రెంటికీ చెడ్డావు. ఒక మిథ్యాజ్ఞానంతో సంబరపడుతున్నావు.

క. ముక్తులు ముక్తులఁ గలయుట । యుక్తము - యది నభము నభము నొందు తెఱఁగు, నీ
ముక్తత బొంకని దీనిని । సక్తతగా నీవు గనుట సాలదె తెలుపన్? 211

ప్రతిపదార్థం: ముక్తులు= భవబంధాలనుండి మానసికంగా ముక్తిపొందినవారు; ముక్తులన్= అటువంటి ముక్తులతో; కలయుట= కలవటం; యుక్తము+అ= ఉచితమే; అది= ఆ కలయిక; నభము= ఆకాశం; నభమున్= ఆకాశాన్ని; ఒందు తెఱఁగు= పొందినట్లుంటుంది; దీనినిన్= ఈ కలయికను; సక్తతగాన్= సాంగత్యంగా; నీవు; కనుట= భావించటమనేది; నీ ముక్తత= నీవు ముక్తుడవనటం; బొంకు+అని= అబద్ధమని; తెలుపన్= తెలియజెయ్యటానికి; చాలదె?= సరిపోదా?

తాత్పర్యం: ముక్తులూ, ముక్తులూ కలవటం ఎప్పుడూ యుక్తమే - ఆకాశమూ, ఆకాశమూ కలిసినట్టుగా. రెండూ శూన్యాలే. కాబట్టి సక్తత అనేదే ఉండదు. కానీ, నీవు ఈ కలయికను సక్తతగా భావించావు. అంటే నీవు ముక్తుడవు కావన్నమాట. నీ ముక్తత అబద్ధ మనటానికి ఈ ఒక్క ఉదాహరణ చాలదా?

వ. మనము ముక్తులము గాకున్నను మనకు సాంగత్యము గలుగుట నింద్యంబుగా దెట్లంటేని. 212

ప్రతిపదార్థం: మనము= నీవు, నేనూ; ముక్తులము= ముక్తులం; కాకున్నను= కాకపోయినప్పటికీ; మనకు= మన ఇద్దరికీ; సాంగత్యము= కలయిక; కలుగుట= ఏర్పడటం; నింద్యంబు+కాదు= దుష్టం కాదు; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= అది ఎట్లా అంటే.

తాత్పర్యం: మనం ముక్తులం కాకపోయినప్పటికీ, మనకు కలయిక ఏర్పడటం దుష్టం కాదు. అది ఎట్లా అంటే చెప్పుతాను వినుము.

సీ. నిఖిలజన శ్రోత్రసుఖకరం బగు చరి । త్రమునఁ బెంపారెడు ప్రథన నృపతి
కులమునఁబుట్టితి, సులభ నా పేరు, మ । త్పూర్వులు శతశృంగమునను ద్రోణ
మునను శక్రద్వారమున మహాధ్వరములు । సేసిరి, విను పాకశాసనుండు
దమ పాలి కేతేరఁ దద్గోష్ఠిఁ బరమార్థ । చింత సేయుదురు, భూకాంత! యేను

తే. నాకు నెనయైన పురుషుండు లేకయునికి । మోక్షధర్మ ప్రవర్తనమునఁ జరింతుఁ,
గాన నీ చూచు వర్ణసాంకర్య మస్మ । దీయ సాంగత్యమున లేమి దెల్లమరయ. 213

ప్రతిపదార్థం: భూకాంత!= భూపతీ!; నిఖిలజన= సమస్తజనుల; శ్రోత్ర= చెవులకు; సుఖకరంబు+అగు= పండువుగా సుఖప్రదమైన; చరిత్రమునన్= చరిత్రతో; పెంపు+ఆరెడు= పెంపొందుతున్న; ప్రథననృపతి కులమునన్= ప్రథనుడు అనే పేరుగల రాజుగారి వంశంలో; పుట్టితిన్= జన్మించాను; నా పేరు; సులభ; మత్+పూర్వులు= మా వంశంలో పూర్వపు పెద్దలు; శతశృంగముననను= శతశృంగం అనే చోట; ద్రోణముననను= ద్రోణం అనే చోట; శక్రద్వారమునన్= శక్రద్వారం అనే చోట; మహా+అధ్వరములు= గొప్ప యజ్ఞాలు; చేసిరి= చేశారు; వినుము; పాకశాసనుండు= దేవేంద్రుడంతటివాడు; తమపాలికిన్= తమ సన్నిధికి; ఏతేరన్= రాగా; తద్+గోష్ఠిన్= అతడితో గోష్ఠిలో; పరమార్థ చింత= పరమార్థానికి సంబంధించిన ఆలోచనలు; చేయుదురు= చేస్తూ ఉండేవారు; నాకున్= నాకు; ఎనయైన= సాటియైన; పురుషుండు= మగవాడు; లేక+ఉనికిన్= లేకపోవటంతో; ఏనున్= నేను; మోక్షధర్మ ప్రవర్తనమునన్= మోక్షధర్మ ఆచరణతోనే; చరింతున్= సంచరిస్తున్నాను; కానన్= కాబట్టి; నీ+చూచు= నీవు చూస్తున్న;

వర్ణసాంకర్యము= బ్రాహ్మణ, క్షత్రియ వర్ణ సాంకర్యం అనేది; అస్మదీయ= మన ఇద్దరియొక్క; సాంగత్యమునన్= కలయికలో; లేమి= లేకపోవటం; అరయన్= పరిశీలించి చూస్తే; తెల్లము= తేటతెల్లం.

తాత్పర్యం: ఓ క్షత్రియా! నేను ప్రథనమహారాజు వంశంలో పుట్టిన దానను. మా వంశచరిత్ర జగదానందదాయకం. ప్రజల చెవులకు పండుగ. నా పేరు సులభ. మా వంశంలో పూర్వీకులు శతశృంగంలో, ద్రోణంలో, శక్రద్వారంలో మహాయజ్ఞాలు అనేకం చేశారు. దేవేంద్రుడంతటివాడు తానై తరలివచ్చి కూర్చుంటే మా పెద్దలు ఆయనతో పరమార్థగోష్ఠి నడిపేవాళ్ళు తెలుసా? వింటున్నావా? నాకు సాటివచ్చే పురుషుడు కనిపించకపోవటంతో నేను ఇట్లా మోక్షధర్మం పట్టి సంచరిస్తున్నాను. కాబట్టి మన ఇద్దరి సాంగత్యంలోనూ నీవు అనుకునే వర్ణసాంకర్యం ఏమీ లేదు. నేను బ్రాహ్మణిని కాను సుమా!

విశేషం: 'నీవు బ్రాహ్మణివి - నేను క్షత్రియుడను' మన ఇద్దరి సాంగత్యమూ నింద తేదా? - అని తిక్కన గారి జనకుడు చాలా సుకుమారంగా పలికాడు **(182)**. వ్యాసభారతంలో ఇది చాలా ఘాటుగా ఉన్నది. 'నీవు బ్రాహ్మణ కాంతవు - నేను క్షత్రియ పురుషుడను. కాబట్టి మొదటిది వర్ణసాంకర్యం. నీవు యోగినివి - నేను గృహస్థుడను. కాబట్టి రెండవది ఆశ్రమసాంకర్యం. నీ గోత్రమేమిటో నాకు తెలియదు. నా గోత్రం ఏమిటో నీకు తెలియదు. ఒకవేళ సగోత్రులమైతే మూడవది గోత్రసాంకర్యం. నీ భర్త జీవించి ఉన్నాడో - ప్రోషితుడయ్యాడో. ఏమయినా పరభార్యవు. పొందదగని దానవు. కాబట్టి నాలుగవది ధర్మసాంకర్యం. ఇన్ని అకార్యాలకు సిద్ధపడుతున్నావు. ఇది అజ్ఞానమో! మిథ్యాజ్ఞానమో!' అన్నాడు వ్యాసులవారి జనకుడు. **"వర్ణప్రవరముఖ్యాసి బ్రాహ్మణీ క్షత్రియో హ్యహమ్। నావయోరేకయోగోzస్తి మా కృథా వర్ణసంకరమ్. (12-308-59). వర్తసే మోక్షధర్మేషు గార్హస్థ్యే త్వహమాశ్రమే । అయం చాపి సుకష్టస్తే ద్వితీయోzzశ్రమసంకరః (60). సగోత్రాం వాసగోత్రాం వా న వేద త్వాం న వేత్థమామ్ । సగోత్రమావిశంత్యాస్తే తృతీయో గోత్రసంకరః (61). అథ జీవతి తే భర్తా ప్రోషితోzప్యథవా క్వచిత్ । అగమ్యా పరభార్యేతి చతుర్థో ధర్మసంకరః ॥ (62) సా త్వమేతాన్యకార్యాణి కార్యాపేక్షా వ్యవస్యసి । అవిజ్ఞానేన వా యుక్తా మిథ్యాజ్ఞానేన వా పునః॥' ' (63)**. ఇన్ని శ్లోకాల సారాంశాన్నీ ఒక తేటగీతిలోకి **(6-182)** సంగ్రహించాడు తిక్కన. వీటికి అన్నింటికీ సమాధానంగా మన కలయికలో ఏ సాంకర్యమూ ఏ అధర్మమూ లేదని ఈ సీసపద్యంలో సులభ స్పష్టం చేసింది. ప్రథననృపతి కులంలో పుట్టాను అనటం వలన వర్ణ గోత్రసూచన. అవివాహితనూ, కన్యనూ అని చెప్పటం వలన ఆశ్రమ-ధర్మ సాంకర్యాలు లేవని సూచన.

క. నను డాఁప నేల దానం । గనియెడునది గలదె? ముక్తి గలదో? లేదో?
జనకున కరసెదఁ గా కని । చనుదెంచితిఁ, దప్పె యది విచారింపంగన్.' 214

ప్రతిపదార్థం: ననున్= నన్ను నేను; డాఁపన్+ఏల= దాచుకోవటం ఎందుకు?; దానన్= అట్లా దాచుకున్నందు వలన; కనియెడునది= పొందేది; కలదె?= ఏమైనా ఉన్నదా?; జనకునకున్= ఈ జనకమహారాజుకు; ముక్తి= ముక్తి అనేది; కలదో?= ఉన్నదో?; లేదో?; అరసెదన్+కాక= పరీక్షించెదను; అని; చనుదెంచితిన్= వచ్చాను; విచారింపంగన్= ఇప్పుడు ఆలోచించి చూస్తే; అది; తప్పె= తప్పయిపోయింది, వ్యర్థమని తేలింది.

తాత్పర్యం: నన్ను నేను కప్పి పుచ్చుకొనవలసిన అవసరం ఏముంది? అట్లా చేసినందువలన నాకు కలిగేది ఏముంది? జనకమహారాజు ముక్తుడా? కాదా? - పరిశీలిద్దామని వచ్చాను. ఇప్పుడు ఆలోచిస్తే అది తప్పే అని తేలింది.'

క. అని యిట్లు పలుకు పలుకులు । విని పలుకకయున్న జనకవిభు నాననముం
గనుఁగొని సులభ నగుచు ని । ట్లనియె నతనితోడఁ గౌరవాన్వయముఖ్యా! 215

ప్రతిపదార్థం: కౌరవాన్వయముఖ్యా!= కౌరవవంశంలో ప్రధానమైనవాడా! ఓ ధర్మరాజా!; అని; ఇట్లు= ఈ ప్రకారంగా; పలుకు= పలుకుతున్న; పలుకులు= మాటలు; విని= ఆలకించి; పలుకక+ఉన్న= మాట్లాడకుండా కూర్చున్న; జనకవిభు+ఆననమున్=

జనకమహారాజుయొక్క ముఖాన్ని; కనుఁగొని= చూచి; సులభ= ఆ సులభ; నగుచున్= నవ్వుతూ; అతనితోడన్= ఆ జనకుడితో; ఇట్లు+అనియెన్= ఇలా అంది.

తాత్పర్యం: (ఇదంతా భీష్ముడు ధర్మరాజుతో చెప్పుతున్నాడు) ఓ ధర్మరాజా! సులభ ఇట్లా మాట్లాడుతుంటే వింటూ జనకమహారాజు మౌనంగా ఉండిపోయాడు. ఆ రాజుగారి ముఖం చూసి నవ్వుతూ మళ్ళీ సులభ ఇట్లా అన్నది.

తే. 'అగ్ని వెచ్చనొ? చల్లనో? యని మనమునఁ । గరము సందియ మందుట గాదె నిన్ను
నధిప! ముక్తుండవో? కావొ? యని తలంచు । టది మదీయ బాలిశభావ మని తలంపు. 216

ప్రతిపదార్థం: అధిప!= జనకమహారాజా!; నిన్నున్= నిన్ను; ముక్తుండవో?= ముక్తి పొందినవాడవో?; కావొ?= కావో?; అని; తలంచుట+అది= ఆలోచించటమనేది; అగ్ని= నిప్పు; వెచ్చనొ?= వేడిగా ఉంటుందో?; చల్లనో?= చల్లగా ఉంటుందో?; అని; మనమునన్= మనస్సులో; సందియము+అందుట+కాదె= సందేహించటం కాదా!; మదీయ= నాయొక్క; బాలిశభావము= అవివేకం; అని; తలంపు(ము)= భావించుము.

తాత్పర్యం: 'రాజా! నీవు ముక్తుడవు అవునో కాదో అని నేను సంశయించటం - అగ్ని వేడిగా ఉంటుందో చల్లగా ఉంటుందో అని సందేహించటంతో సమానం. ఇది కేవలం నా అజ్ఞానమనీ మూర్ఖత్వమనీ భావించుము.

విశేషం: అలం: దృష్టాంతం.

చ. జనవర! నీ సుభాషల నసత్యమొకండును లేదు నీవు స
న్మునిగణకీర్తనీయుఁడవు మోక్షము నీ కఱచేతిలోనిదై
యునికి దృఢంబుగాఁ గనియు నొండొక చందము మాటలాడితిన్
నిను నగుపింపఁగా వలసి నీదగు మన్నన శంక వాసినన్. 217

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా!; నీ= నీయొక్క; సుభాషలన్= మంచి మాటలలో; అసత్యము= అబద్ధమనేది; ఒకండునున్= ఒక్కటికూడా; లేదు; నీవు; సత్+మునిగణ= మహాముని బృందంచేత; కీర్తనీయుఁడవు= స్తుతింపదగినవాడవు; మోక్షము= ముక్తి అనేది; నీకున్= నీకు; అఱచేతిలోనిది= అరచేతిలోది; ఐ+ఉనికి= అయి ఉండటం; దృఢంబుగాన్= గట్టిగా; కనియున్= తెలిసికొని కూడా; నీది+అగు= నీవు ఇచ్చినటువంటి; మన్ననన్= గౌరవంవల్ల (చనవువలన); శంక+పాసినన్= (అయ్యో); మహారాజు కదా; నేను ఇట్లా మాట్లాడవచ్చునా? - అనే శంక తొలగిపోవటంతో; నినున్= నిన్ను; నగుపింపఁగాన్+వలసి= నవ్విద్దామనిపించి; ఒండొక చందము= మరొకరకం; మాటలు= పలుకులు; ఆడితిన్= పలికాను.

తాత్పర్యం: రాజా! నీవు మాట్లాడిన వాక్యాలలో ఒక్కటయినా అసత్యం లేదు. మునీశ్వరులచేతకూడా కీర్తనీయుడవు. మోక్షం నీకు అరచేతిలోనిది. ఇన్నీ తెలిసినా - నీవు ఇచ్చిన మన్ననతో జంకు వదిలిపోయి, నిన్ను నవ్విద్దా మనిపించి (ఆటపట్టిద్దామని) మరోరకంగా మాట్లాడాను. అంతే సుమా!

క. అవియెల్ల నసత్యంబుల । యవనీశ్వర! యరయవచ్చుటది యొక్కఁడు ని
క్కువ మీ యపరాధము భవ । దవిరళ సౌజన్యమగ్న మగుఁగాక తగన్. 218

ప్రతిపదార్థం: అవనీశ్వర= మహారాజా!; అవి+ఎల్లన్= ఆ నా మాటలన్నీ; అసత్యంబులు+అ= అబద్ధాలే; అరయన్+వచ్చుట= నిన్ను పరీక్షించటానికి నేను రావటం అనేది; అది+ఒక్కఁడు= ఆ ఒక్కటీ; నిక్కువము= నిజం; ఈ+అపరాధము= ఈ తప్పు;తగన్= తగినట్టు; భవత్= నీయొక్క; అవిరళ= చిక్కనైన; సౌజన్య= ఔదార్యంలో(సజ్జనత్వంతో); మగ్నము+అగున్+కాక= మునిగిపోవుగాక!

తాత్పర్యం: ఓ రాజా! ఇంతవరకూ నేను మాట్లాడినవన్నీ అసత్యాలే. అయితే - నిన్ను పరీక్షించాలి అని రావటం ఉన్నదే - అదొక్కటే నిజం. నా ఈ అపరాధం నీ స్నిగ్ధమైన సౌజన్యంలో (మంచితనంలో) మునిగి, మరుపున పడిపోవాలని ఆశిస్తున్నాను.

క. సులభానామము సంసృతి । పాలమొల్లక తిరుగుటయును భూలోకవరా!
కలరూప నేఁటి కిచ్చట । నిలిచెద నీవు మునిసేవనీయుఁడ వగుటన్.' 219

ప్రతిపదార్థం: భూలోకవరా!= భూపాలా!; సులభానామము= సులభ అనే పేరు; సంసృతి పాలము= సంసార పరిధి; ఒల్లక= ఇష్టపడక; తిరుగుటయును= దేశసంచారం చేయటం; కల+రూపు+అ= (ఇవి రెండూ) ఉన్న స్వరూపమే.; నీవు; ముని= మునులకు కూడా; సేవనీయుఁడవు= సేవింపదగినవాడవు; అగుటన్= కాబట్టి; నేఁటికిన్= ఈ రోజుకి; ఇచ్చటన్= ఇక్కడే; నిలిచెదన్= ఉంటాను.

తాత్పర్యం: జనకమహారాజా! నా పేరు సులభ అనేదీ, నేను సంసార బంధం ఇష్టపడక దేశసంచారం చెయ్యటమనేదీ - ఇవి రెండూ ఉన్న నిజాలు. నీవేమో మునులకుకూడా అర్చనీయుడవు. కాబట్టి ఈ రోజు ఇక్కడే నీ అతిథిగా ఉంటాను.'

తే. అనినఁ దానును మంత్రులు నవ్విభుండు । సులభఁ గొనియాడె; నాఁడెల్ల నలఘుగోష్ఠిఁ
బ్రియము రెట్టింప నయ్యోగినియును దారు । నెమ్మి నొక్కట నుండిరి నృపవరేణ్య! 220

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజశ్రేష్ఠా! ధర్మరాజా!; అనినన్= సులభ ఇట్లా అనేసరికి; ఆ+విభుండు= ఆ జనకమహారాజు; మంత్రులున్= మంత్రులూ; తానునున్= తానూ; సులభన్= సులభాదేవిని; కొనియాడెన్= ప్రశంసించాడు; నాఁడు+ఎల్లన్= ఆ రోజంతా; అలఘుగోష్ఠిన్= సుదీర్ఘమైన చర్చలో (విలువైన గోష్ఠి); ప్రియము= ప్రీతి; రెట్టింపన్= రెట్టింపుకాగా (ఇబ్బడికాగా); ఆ+యోగినియును= ఆ సులభాదేవీ; తారును= రాజూ, మంత్రులూ; నెమ్మిన్= మైత్రితో (ఆదరంతో); ఒక్కటన్+ఉండిరి= ఒకేచోట కాలక్షేపం చేశారు.

తాత్పర్యం: ఇట్లా సులభాదేవి పలికేసరికి జనకుడూ అతడి మంత్రులూ ఆమెను ఎంతగానో కొనియాడారు. ధర్మరాజా! ఆ రోజంతా వారందరికీ విలువైన విషయాలతో గోష్ఠి నడిచింది. ప్రేమాదరాలతో ఒకేచోట కాలక్షేపం చేశారు.

వ. మఱునాఁ డజ్జనపతి యనుమతిసేయ నమ్మహానుభావ నిజేచ్ఛం జనియె' నని చెప్పిన నప్పారవోత్తముండు
ప్రమోదాయత్తస్వాంతుండయి శాంతనవునితో 'శుకుని కెవ్విధంబున వైరాగ్యంబు సొప్పడియెం జెప్పవే?'
యనుటయును నతం డా ధర్మ సుతున క్లినియె. 221

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజు; ఆ+జనపతి= ఆ జనకమహారాజు; అనుమతి+చేయన్= అనుమతించగా; ఆ+మహానుభావ= ఆ మహాత్ముడాలు - సులభాదేవి; నిజ+ఇచ్ఛన్= తన కోరిక ప్రకారం; చనియెన్= వెళ్ళిపోయింది; అని; చెప్పినన్= భీష్ముడు వివరించేసరికి; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశంలో ఉత్తముడైన ఆ ధర్మరాజు; ప్రమోద= ఆనందానికి; ఆయత్త= స్వాధీనమైన; స్వాంతుండు+అయి= హృదయం కలవాడై (మనస్సులో సంతోషించి); శాంతనవునితోన్= శంతనుమహారాజు పుత్రుడైన భీష్ముడితో; శుకునికిన్= శుకమహర్షికి; ఏ+విధంబునన్= ఎట్లాగ; వైరాగ్యంబు= విరక్తి అనేది; చొప్పడియెన్= ఏర్పడింది?; చెప్పవే?= దయచేసి వివరించవా?; అనుటయున్= అనటమూ; అతండు= ఆ భీష్ముడు; ఆ; ధర్మసుతునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మరుసటిరోజు జనకుడి అనుమతితో ఆ సులభాదేవి వెళ్ళిపోయింది' అని భీష్ముడు వివరించగా, ధర్మరాజు 'శుకుడికి వైరాగ్యం ఎట్లా కలిగింది?' అనే ప్రశ్న వేశాడు. దానికి బదులుగా భీష్ము డీ విధంగా చెప్ప సాగాడు.

వేదవ్యాసుఁడు శుకున కుపదేశించిన వైరాగ్యప్రకారము (సం. 12-309-2)

సీ. 'ప్రాకృతజనుల వర్తనములవెంటఁ జి । త్తమున జరామరణముల కలిమి
దలఁపక యేమఱి మెలఁగెడు శుకుఁజూచి । విపులధర్మజ్ఞాన నిపుణ ధిషణుఁ
డైన వేదవ్యాసుఁ డాతని కిట్లను । 'మనసు నింద్రియములు మర్దితములు
గాఁ జేయు ముత్పథగాములు గానీకు । మక్రోధసత్య శమార్జవములుఁ

తే. దపము దమము నహింసయు ధర్మమునకు । నాకృతులు వీనిఁ బాలింపు మాఁకలియును
నీరువట్టును దగియెడు నెఱి నడంచి । దేవతాతిథి శేషోపజీవి వగుము. 222

ప్రతిపదార్థం: ప్రాకృతజనుల= పామరజనులయొక్క; వర్తనములవెంటన్= నడవడికలను అనుసరిస్తూ; జరామరణముల= ముసలితనం, మరణం అనే విషయాలయొక్క; కలిమిన్= ఉనికిని; చిత్తమునన్= ఎడదలో; తలఁపక= ఆలోచించకుండా; ఏమఱి= ఏమరుపాటుతో; మెలఁగెడు= జీవిస్తున్న; శుకున్= తన పుత్రుడైన శుకుడిని; చూచి= తిలకించి; నిఖిల= సమస్తమైన; ధర్మ= ధర్మాలకు సంబంధించిన; జ్ఞాన= ఎరుకతో; నిపుణ= నిపుణమైన; ధిషణుఁడు= బుద్ధికలవాడు; ఐన= అయిన; వ్యాసుఁడు= వ్యాసభగవానుడు; ఆతనికిన్= ఆ శుకుడికి; ఇట్లు; అనున్= చెప్పుతున్నాడు; మనసున్= మనస్సునూ; ఇంద్రియములున్= జ్ఞానకర్మేంద్రియాలనూ; మర్దితములుగాన్= అణచివేయబడినవిగా; చేయుము; ఉత్పథగాములు= తప్పుడు మార్గాలలో ప్రయాణించేవిగా; కానీకుము= కానీయకుము; అక్రోధ= క్రోధం లేకపోవటం; సత్య= సత్యం; శమ= అంతరింద్రియనిగ్రహం; ఆర్జవములున్= ఋజుత్వం అనే ఇవీ; తపమున్= తపస్సూ; దమమున్= బాహ్యేంద్రియ నిగ్రహం; అహింసయున్= హింసాప్రవృత్తి లేకపోవటం - ఇవన్నీ; ధర్మమునకున్= ధర్మానికి; ఆకృతులు= స్వరూపాలు; వీనిన్= వీటిని; పాలింపుము= ఆచరించుము; ఆఁకలియును= ఆకలీ; నీరువట్టును= దప్పికా; తగియెడు నెఱిన్= తగిన పద్ధతిలో; అడంచి= అణచివేసికొని; దేవతా+అతిథి= దేవతలకూ, అథితులకూ సమర్పించాక; శేష= మిగిలినదానితో; ఉపజీవివి= జీవించేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'జీవుడికి జరామరణాలు ఉన్నాయి అనే విషయమే మర్చిపోయి పామరజనులతో కలిసి అజాగ్రత్తగా జీవితం గడిపివేస్తున్న శుకుడిని చూసి వ్యాసుడు ఇట్లా ఉపదేశించాడు. 'మనస్సునూ, ఇంద్రియాలనూ మర్దించి స్వాధీనం చేసికొమ్ము. వాటిని ఎప్పుడూ తప్పుడు దారులలోనికి రానివ్వకుము. అదుపులో ఉంచుకొమ్ము. క్రోధత్యాగం, సత్యం, నిగ్రహం, ఋజుత్వం, తపస్సు, అహింస - అనేవి ధర్మానికి ఆకారాలు. వీటిని పరిపాలించుము. ఆకలి దప్పికలను నేర్పుగా తగ్గించుకొమ్ము. దేవతలకూ, అతిథులకూ సమర్పించాక మిగిలినదానితో జీవితం గడుపుకొనటం అలవాటు చేసికొమ్ము.

క. నురువున నొనరించిన పం । జరంబులో నున్న పులుఁగు చాడ్పున మేనం
బురుషవర! జీవ ముండుట । పరికింపక యేమఱంగఁ బాడియె నీకున్? 223

ప్రతిపదార్థం: పురుషవర!= ఓ మానవోత్తమా!; నురువునన్= ఫేనంతో(నీటి నురుగుతో); ఒనరించిన= తయారుచేసిన; పంజరంబులోన్= పంజరంలో; ఉన్న= ఉన్నటువంటి; పులుఁగు చాడ్పునన్= పిట్టవలె; మేనన్= శరీరంలో; జీవము= ప్రాణం; ఉండుట= ఉండటాన్ని; పరికింపక= గమనించకుండా; ఏమఱంగన్= ఇట్లా ఏమరుపాటుతో ఉండటం; నీకున్= నీకు; పాడియె?= తగునా?

తాత్పర్యం: నాయనా! నురుగుతో చేసిన పంజరంవంటిది ఈ శరీరం. ఇందులో ఒక పిట్టవలె ఉంటున్నది ప్రాణం. ఈ పరిస్థితిని గమనించకుండా ఏమరుపాటుతో ఉండటం నీకు తగునటరా! (ఈ నురుగు పంజరం ఏ క్షణంలోనైనా

చితికిపోవచ్చును. పిట్ట తుర్రుమనవచ్చును. తలచుకొంటేనే భయంగా ఉంటుందే - నీకసలు నిద్ర ఎట్లా పట్టుతున్నది పుత్రకా! అని భావం.)

విశేషం: అలం: ఉపమ. దీనికి సంస్కృత మూలం: **"ఫేనపాత్రోపమే దేహే జీవే శకునివత్ స్థితే । అనిత్యే ప్రియసంవాసే కథం స్వపిషి పుత్రక॥" (సం. 12-309-6)**

తే. ఎన్నికొనుచుండఁ జనుచుండు నేండ్లు లివ్వి । ధమున నాయువు దోడ్తోడఁ దఱిఁగి జీవ
హాని వాటిల్లఁగాఁ బుత్ర! యనవధాన । నిద్ర మోహితుఁడై యున్కి నీకుఁ దగునె? 224

ప్రతిపదార్థం: పుత్ర!= బిడ్డా!; ఎన్నికొనుచుండన్= లెక్కపెట్టుకొంటూంటే; ఏండ్లులు= సంవత్సరాలు; చనుచుండున్= వెళ్ళిపోతూ ఉంటాయి; ఈ+విధమునన్= ఈ విధంగా; ఆయువు= ఆయుర్దాయం; తోడ్తోడన్= క్రమక్రమంగా; తఱిఁగి= తరిగిపోయి; జీవహాని= ప్రాణవియోగం; పాటిల్లఁగాన్= జరిగే పరిస్థితి ఉండగా; అనవధాన= ఏమరుపాటు అనేటటువంటి; నిద్రన్= నిద్రలో; మోహితుఁడై= సమ్మోహితుడై; ఉన్కి= ఉండటమనేది; నీకున్= నీకు (నీ వంటి వాడికి); తగునె?= అర్హమా? - సమంజసమా?

తాత్పర్యం: తనయా! లెక్కపెట్టుతూ ఉంటే వెళ్ళిపోతూనే ఉంటాయి సంవత్సరాలు. ఇట్లా క్రమక్రమంగా ఆయుర్దాయం తరిగిపోయి, చివరికి హంస ఎగిరిపోతుంది. ఇది తెలిసి నీవంటివాడు ఏమరుపాటుతో నిద్రపోతూ ఉండటం తగునా? చెప్పుము. లేచి పరుగెత్తవద్దూ?

విశేషం: దీని మూలశ్లోకం ఇట్లా ఉన్నది. **"గణ్యమానేషు వర్షేషు క్షీయమాణే తథాయుషి జీవితే శిష్యమాణే చ కిముత్థాయ న ధావసి?"** (12-309-8). 'గణ్యమానేషు' అనే పదానికి అనువాదంగా ఎన్నికొనుచుండన్ అన్నాడు తిక్కన. ఎన్నటం, ఎంచటం అనేవి లెక్కపెట్టటం అనే అర్థంలో నెల్లూరు మాండలికాలట.

క. వినుము మాంసశోణిత వివ । ర్ధనమగు నైహికమునందుఁ దత్పరులు పరం
బని యొకటి కలిమి దలఁపరు । గొనరు బుధులమాట నాస్తికులు వినయనిధీ! 225

ప్రతిపదార్థం: వినయనిధీ!= వినయానికి నిధీ!; వినుము; మాంస= మాంసంతోనూ; శోణిత= రక్తంతోనూ; వివర్ధనము+అగు= వృద్ధిపొందేటువంటి; ఐహికమునందున్= ఈ శరీరంపట్లా, ఈ జన్మపట్లా; తత్పరులు= సంసక్తులైనవారు; పరంబు+అని= పరము అంటూ; ఒకటి; కలిమి= ఉండటాన్ని; తలఁపరు= అసలు ఆలోచించరు; నాస్తికులు= పరము లేదు అనే ఈ నాస్తికులు; బుధుల= పండితులయొక్క; మాట= ఉపదేశాన్ని; కొనరు= స్వీకరించరు.

తాత్పర్యం: ఓ వినయశీలీ! ఇహలోకం అంతా మాంసశోణితాలతో వృద్ధి పొందుతూ ఉంటుంది. దానిలో సంసక్తులైనవారు పరలోకం అంటూ ఒకటి ఉన్నది - అనే విషయాన్ని గ్రహించరు (నాస్తికులు). వీళ్ళు పెద్దల మాట చెవిని పెట్టరు.

తే. బుద్ధిమంతుల తెరువునఁ బోక యుత్ప । థప్రవర్తుల నడచు పథంబునందుఁ
జనుట వినుము మప్పటికిఁ జూడఁ దనకుఁ జాల । నించియుండు నాపద యొనరించుఁ బిదప. 226

ప్రతిపదార్థం: వినుము; బుద్ధిమంతుల= బుద్ధిమంతులయొక్క; తెరువునన్= మార్గంలో; పోక= నడవకుండా; ఉత్పథవర్తులు+అ= దుష్టులు మాత్రమే; నడచు= ప్రయాణించే; పథంబునందున్= మార్గంలో; చనుట= నడవటం; అప్పటికిన్ చూడన్= అప్పటికి చూస్తే; తనకున్= తనకు; చాలన్= బాగా; ఇంచియుండున్= నచ్చి కనపడుతుంది - ఆనందదాయకంగా ఉంటుంది; పిదపన్= తరువాత; ఆపద+ఒనరించున్= ఆపద కలిగిస్తుంది.

తాత్పర్యం: బుద్ధిమంతుల మార్గంలో పోకుండా దుష్టులమార్గంలో నడిస్తే అది అప్పటికి బాగానే ఉంటుంది. తృప్తిగానూ, ఆనందంగానూ ఉంటుంది. కానీ, ఆలోచించి చూడగా - అది చిట్టచివరకు ఆపద తెచ్చిపెట్టుతుంది.

చ. తన తన ధర్మమున్ నడపి దానన సంతసమంది శాంత భా
వనరతినుండు వారిఁ గని, వారల చెప్పెడు ధర్మవృత్తి ని
చ్చెనయుఁగ నూఁది సత్పదముఁ జెందుట కెక్కుము, పాత్తినూలి ప్రు
వ్వునెనయుఁగాకు, బంధకుఁడవుం దన కజ్ఞుఁడు దాన యెమ్మెయిన్. 227

ప్రతిపదార్థం: తన తన ధర్మమున్= తమకు విధ్యుక్తమైన ధర్మాన్ని; నడపి= ఆచరించి; దానన్+అ= దానితోనే; సంతసము+అంది= ఆనందించి; శాంతభావన రతిన్= ప్రశాంతమైన భావనపట్ల ప్రేమతో; ఉండువారిన్= జీవిస్తున్నవారిని; కని= దర్శించి; వారల= వారియొక్క; చెప్పెడు= ఉపదేశించేటువంటి; ధర్మవృత్తి= ధర్మప్రవృత్తి; నిచ్చెనయుఁగన్+ఊఁది= నిచ్చెనగా ఆలంబనం చేసికొని; సత్పదమున్= సత్ స్థానాన్ని; చెందుటకున్= అందుకోవటానికి; ఎక్కుము; పొత్తినూలిప్రువ్వు+ఎనయున్+కాకు= సాలీడుకి సాటి కాకుము (ప్రువ్వు= పురుగు, ఎన= సాటి); అజ్ఞుఁడు= మూర్ఖుడు; ఏ+మెయిన్= ఎలాగయినా; తనకున్= తనకు; తాను+అ= తానే; బంధకుఁడు+అవున్= బంధనం కల్పించుకొనేవాడు అవుతాడు.

తాత్పర్యం: ధర్మాచరణంతో ఆనందిస్తూ శాంతచిత్తులై జీవితం గడిపేవారిని దర్శించుము. వారి ధర్మోపదేశాలు నిచ్చెనగా సత్పదం అందుకొమ్ము. సాలీడువలె నీకు నీవే బంధనాలు కల్పించుకొనవద్దు. అది అజ్ఞుడి లక్షణం.

విశేషం: అలం: ఉపమ. శాంతభావ నిరతినుండు వారిఁ గని - అనే పాఠాంతరంలో అన్వయసౌలభ్యం ఉన్నది.

తే. అస్థిరేంద్రియ సలిలమయంబుఁ గామ । రోషదారుణ గ్రాహ ప్రదూషితంబు
నైన సంసారసాగర మతులధైర్య । పోతపాత్రిక నిస్తరింపుము కుమార! 228

ప్రతిపదార్థం: కుమార!= పుత్రకా!; అస్థిర= చంచలమైన; ఇంద్రియ= ఇంద్రియాలు అనేటటువంటి; సలిలమయంబున్= నీటితో నిండినదీ; కామ= కామమూ; రోష= క్రోధమూ అనేటటువంటి; దారుణ= భీషణమైన; గ్రాహ= మొసళ్లతో; ప్రదూషితంబున్= నింద్యమైనదీ; ఐన= అయినటువంటి; సంసారసాగరమున్= సంసారము అనే సముద్రాన్ని; అతుల= సాటిలేని; ధైర్య= ధీరత్వం అనే; పోతపాత్రికన్= ఈతకాయతో; నిస్తరింపుము= పూర్తిగా తరించు - దాటు.

తాత్పర్యం: కుమారా! ఈ సంసారం ఒక సముద్రం. చంచలమైన ఇంద్రియాలే నీళ్ళు. అరిషడ్వర్గమే మొసళ్ళు. దీనిని దాటటానికి ధైర్యం ఒక్కటే తెప్ప. దానితో తరించవయ్యా!

విశేషం: అలం: ఉపమ. దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **"కామం క్రోధం చ మృత్యుం చ పంచేంద్రియజలాం నదీమ్ । నావం ధృతిమయీం కృత్వా జన్మదుర్గాణి సంతర ॥"** (12-309-16). పోతము అంటే నావ, తెప్ప, దోనె ఇట్లాంటి అర్థాలు ఉన్నాయి. ఇవన్నీ నీటిని దాటటానికి ఉపయోగించే సాధనాలే. ఈతకొట్టే వ్యక్తి సులువుగా ఎక్కువదూరం ఈదటానికని సొరకాయ కానీ కుండగానీ బిందెగానీ గుండెలకింద అదుముకుంటాడు. ఆ పాత్రను 'ఈతకాయ' అంటారు. ఈదటానికి ఉపయోగించే కాయ. పాండురంగమాహాత్మ్యంలో (ద్వితీయాశ్వాసం) దశావతార వర్ణన చేస్తూ కూర్మావతారాన్ని 'ఈతకాయరూపై పృథుకర్పరంబనర... (2.57)' అన్నాడు తెనాలి రామకృష్ణుడు. పోతపాత్రిక అంటే పోతంవలె - తెప్పవలె - ఉపయోగించే చిన్నపాత్ర (పాత్రిక) అని తాత్పర్యార్థం. అలాగే సంసారసాగరాన్ని ఈదటానికి కూడా గుండె ధైర్యంకలిగి ఉండాలి.

క. కామాదితృప్తుఁడై నరుఁ । డేమఱియుండంగ గొఱియనెత్తెడు పులి యు
ద్దామత మృత్యువు గొని చను । నామూఢుని యట్లుగాకు మతుల వివేకా! 229

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని తెలివికలవాడా!; కామ+ఆది= కామము మొదలైన సుఖాలలో; తృప్తుఁడై= తృప్తిపొందినవాడై; నరుఁడు= జీవుడు; ఏమఱియుండంగన్= ఏమరుపాటుతో ఉంటే; గొఱియన్+ఎత్తెడు= గొర్రెను వేసుకుపోయే; పులి= పులియొక్క; ఉద్దామతన్= ఔద్ధత్యంతో; మృత్యువు; కొని చనున్= తన్నుకుపోతుంది; ఆ మూఢుని+అట్లు= అటువంటి మూర్ఖునిలాగా; కాకుము= కావద్దు.

తాత్పర్యం: నాయనా! నీకు గొప్ప వివేకం ఉన్నది. గ్రహించగలవు. అందుకే చెప్పుతున్నాను వినుము. కామాది సౌఖ్యాలతో తృప్తుడై జీవుడు ఏమరితే గొర్రెను ఎత్తుకుపోయే పులివలె మృత్యువు తన్నుకొనిపోతుంది. నీవు మాత్రం అట్లాంటి మూఢుడివి కావద్దు.

తే. బ్రాహ్మణత్వంబు గడు దుర్లభంబు; దాని । నెట్టకేలకుఁ గని కడయెయ్దఁ జేయ
వలదె తపము దమంబు నిశ్చలవివేక । సంపదయు నూఁది నరుఁడు దుస్సంగ ముడిగి? 230

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వంబు= బ్రహ్మపరాయణుడుగా ఉండటమనేది; కడున్= మిక్కిలి; దుర్లభంబు= దుర్లభం; దానిన్= ఆ బ్రాహ్మణత్వాన్ని; ఎట్టకేలకున్= ఎట్లాగో ఎన్నిజన్మలకో; కని= పొంది(న); నరుఁడు= జీవుడు; దుస్సంగము+ఉడిగి= చెడు సాంగత్యాన్ని విడిచిపెట్టి; తపమున్= తపస్సునూ; దమంబున్= ఇంద్రియనిగ్రహాన్నీ; నిశ్చల వివేక సంపదయున్+ఊఁది= స్థిరమైన జ్ఞానసంపత్తినీ ఆసరా చేసికొని (ఆ బాహ్మణత్వాన్ని); కడఎయ్దన్+చేయన్+వలదె?= ఈ జన్మ ముగిసేంతవరకు ఆచరించవద్దా?

తాత్పర్యం: నాయనా! బ్రాహ్మణత్వమనేది బహుజన్మదుర్లభం. ఎట్టకేలకు దానిని పొందిన నీవంటివాడు ఏం చేయాలి? దుస్సాంగత్యాలు విడిచిపెట్టి, తపస్సునూ, ఇంద్రియనిగ్రహాన్నీ, స్థిరమైన జ్ఞానసంపత్తినీ ఊతగా తీసికొని ఈ జన్మ ముగిసేంతవరకు ఆచరించవద్దా?

క. వినుఁ విప్రశరీరము సుఖ । మునకే? బహునియమదుఃఖముల నిహమునఁ జెం
దను నిత్యసౌఖ్యముం బర । మునఁ బొందను బుట్టఁ గాక బోధప్రవణా! 231

ప్రతిపదార్థం: బోధప్రవణా!= జ్ఞానం పట్ల ఆసక్తి కలవాడా!; వినుఁ; విప్రశరీరము= బ్రాహ్మణజన్మ అనేది; సుఖమునకే?= సుఖాలు అనుభవించటానికా?; బహునియమ= అనేక నియమాలవలన కలిగే; దుఃఖములన్= క్లేశాలను; ఇహమునన్= ఈ లోకంలో; చెందనున్= అనుభవించటానికీ; పరమునన్= పరలోకంలో; నిత్యసౌఖ్యమున్= శాశ్వతమైన సౌఖ్యాన్ని; పొందనున్= అనుభవించటానికీ; పుట్టెన్+కాక!= పుట్టిందే తప్ప!

తాత్పర్యం: అబ్బాయీ! నీకు జ్ఞానంమీద శ్రద్ధ ఉన్నది. ఆలకించుము. బ్రాహ్మణజన్మ అనేది ఇహలోకంలో నియమనిష్ఠలవలన కలిగే దుఃఖాన్ని అనుభవించటానికీ, పరలోకంలో శాశ్వతమైన సౌఖ్యాన్ని చవిచూడటానికీ లభిస్తుందే తప్ప ఇహంలో సుఖపడటానికి కాదురా నాయనా!

క. బలితపుటురిఁ గామంబున । నిలుచుట యా రజ్జుఁద్రెవ్వ నీలిగి సుమతుల్
వెలువడి చని సుఖి లగుదు ర । వ్వల నెఱుఁగరు పడుదు రంద వత్స! దురాత్ముల్. 232

ప్రతిపదార్థం: వత్స!= బిడ్డా!; కామంబునన్= కామసౌఖ్యంలో; నిలుచుట= ఉండటం అనేది; బలితపు+ట్+ఉరి= దృఢమైన ఉరి; సుమతుల్= బుద్ధిమంతులు; ఆ రజ్జున్= ఆ ఉరిత్రాడును; త్రెవ్వన్+నీలిగి= తెగిపోయేటట్టు లాగి; వెలువడి చని= బయటకు వచ్చి; సుఖులు+అగుదురు= సుఖవంతులు అవుతారు; దురాత్ములల్= దుర్బుద్ధులు; ఆ+వలను= ఆ ఉపాయాన్ని; ఎఱుఁగరు= గుర్తించలేరు; అందున్+అ= దానిలోనే; పడుదురు= పడిపోతూ ఉంటారు.

తాత్పర్యం: నాయనా! కామసుఖాలు అనుభవించటమంటే మనకు మనం బలమైన ఉరిత్రాడు బిగించుకొనటం. బుద్ధిమంతులు ఎవ్వరూ అట్లా చెయ్యరు. ఆ ఉరిత్రాడును తెగద్రెంచుకొని బయటపడతారు. నిత్యమూ - శాశ్వతమూ - సత్యమూ అయిన సుఖాలను అనుభవిస్తారు. అజ్ఞానులు మాత్రం ఆ వలను గుర్తించలేరు. అందులోనే పడి అట్లాగే కొట్టుకొంటూ ఉంటారు.

తే. తాను దెగునేని బాంధవదారపుత్ర । మిత్రు లను నజ్ఞనంబు లేమిటికి? విగత
చింతుఁడై గుహసొచ్చి యశ్రాంతబుద్ధిఁ । దడవి కానంగ వలవదె తన్నుఁ దాన? 233

ప్రతిపదార్థం: తాను= నరుడు తాను; తెగున్+ఏని= మరణించినట్లయితే; బాంధవ= బంధువులూ; దార= భార్య; పుత్ర= సంతానం; మిత్రులు= స్నేహితులూ; అను= అనేటువంటి; ఆ+జనంబులు= ఆ మనుష్యులంతా; ఏమిటికిన్?= ఎందుకు?; విగతచింతుఁడు+ఐ= చింత తొలగినవాడై; గుహ+చొచ్చి= ఏ కొండగుహలోకో ప్రవేశించి; అశ్రాంత= అలిసిపోని; బుద్ధిన్= బుద్ధితో; తడవి= అన్వేషించి; తన్నున్= తనను; తాను+అ= తానే; కానంగన్+వలవదె?= దర్శించవద్దా?

తాత్పర్యం: నరుడు తాను మృతి చెందాక బంధుమిత్ర భార్యాపుత్ర బృందం ఉండీ ఏమి లాభం? ఏమి ప్రయోజనం? కాబట్టి జ్ఞాని చింతాసక్తుడు కాకుండా, ఏకాంతంగా ఏ కొండగుహలోనికో వెళ్ళి (అంతర్దర్శనం) మేల్కొన్న బుద్ధితో అన్వేషించి తనను తాను తెలిసికొనాలి. ఆత్మసాక్షాత్కారం పొందాలి.

తే. జరయు మరణంబు మర్త్యుని జన్మమాది । గాఁగ వెనువెంటఁ దగులు నగ్గంబు వేచి
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు । తనయ! వార్చునె మృత్యువు జనుల పనులు! 234

ప్రతిపదార్థం: తనయ!= పుత్రుడా!; జరయున్= ముసలితనమూ; మరణంబున్= మృత్యువూ; మర్త్యునిన్= మానవుడిని; జన్మము+ఆది+కాఁగన్= పుట్టుక మొదలుగా; వెనువెంటన్= వెంటబడినే; తగులున్= అనుసరించి ఉంటాయి; అగ్గంబు= తగిన సమయం; వేచి= వచ్చేదాకా ఆగి; ఎల్లి= రేపు; చేసెదన్= చేస్తాను; అనక= అనకుండా; మేలు= మంచిని (మంచి పనులను); ఇపుడు+అ= ఈ క్షణంలోనే; చేయు(ము); మృత్యువు= మరణమనేది; జనుల= ప్రజల; పనులు= కార్యాలు; వార్చునె?= ప్రతీక్షిస్తూ ఆగుతుందా?

తాత్పర్యం: జరామృత్యువులు మనిషిని పుట్టుకనాటినుండి వెన్నంటే ఉంటాయి. కాబట్టి 'అనుకూల ముహూర్తం వరకూ వేచి వేచి ఎప్పుడో మంచి పనులు' చేస్తాను అంటే కుదరదు. చేద్దామనుకొన్న మంచిని వెంటనే ఆ క్షణంలోనే చేసివేయ్యాలి. నీవు చేసే మంచిపనులు పూర్తి అయ్యేవరకూ నిరీక్షిద్దామని మృత్యువు అనుకోదు సుమా!

ఆ. ఆశ్మశాన గమను లంతియ చుట్టంబు । లగ్నిఁ గలిపి మరలు నఖిలమైన
జ్ఞాతిజనము దీనిఁ జర్చింప కందఱి । యందు మమతఁ బెనుచు నజ్ఞుఁ డనఘ! 235

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; చుట్టంబులు= బంధువులు; ఆశ్మశాన గమనులు= శ్మశానం వరకూ తోడు వచ్చేవారు; అంతియ= అంతే; అగ్నిన్= అగ్నిలో; కలిపి= భస్మంచేసేసి; అఖిలమైన= సమస్తమైన; జ్ఞాతిజనమున్= బంధువర్గమూ; మరలున్=

వెనక్కి మరలి వెళ్ళిపోతారు; దీనిన్= ఈ సత్యాన్ని; చర్చింపక= ఆలోచించకుండా; అజ్ఞుఁడు= మూర్ఖుడు; అందఱియందున్= అందరిపట్లా; మమతన్= అనురాగాన్ని; పెనుచున్= పెంచుకుంటాడు.

తాత్పర్యం: నాయనా! బంధువర్గం ఎంత రక్తసంబంధీకులైనా చచ్చినవాడితో తామూ చావరు. కాటిదాకా సాగనంపి, కళేబరాన్ని అగ్నికి ఆహుతి చేసి, తిరిగి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వచ్చేస్తారు. అంతే! ఎవరి లోకయాత్ర వారు హాయిగా సాగిస్తారు. దీనిని గుర్తించకుండా అందరిపట్లా అనురాగం పెంచుకొనటం, మమకారం పెంచుకొనటం - ఇది అజ్ఞుడి లక్షణం.

క. లోకము కాలముచే ని । ట్లాకుల పడుచునికి గాంచి యధికధృతిని ధ
ర్మైకాంతతా నిరూఢిం । గైకొని త్రోవంగవలదె కాలవికృతులన్? 236

ప్రతిపదార్థం: లోకము= ప్రపంచం (ప్రాణికోటి); కాలముచేన్= కాలంచేత; ఇట్లు= ఈ రకంగా; ఆకులపడుచున్+ఉనికి= వ్యాకులం చెందుతూ ఉండటాన్ని; కాంచి= చూచి(గ్రహించి); అధికధృతిని= అత్యంత ధైర్యంతో; ధర్మ+ఏకాంతతా+నిరూఢిన్= ధర్మాచరణం ఒక్కటే శాశ్వతం అనే నిశ్చయాన్ని;కైకొని= స్వీకరించి; కాలవికృతులన్= కాలం తెచ్చే వికారాలను; త్రోవంగన్+వలదె?= పారద్రోలవద్దా?

తాత్పర్యం: కాలం ఇన్ని ఇబ్బందులపాలు చేస్తోంది లోకాన్ని. అది గమనించి, అత్యంత ధైర్యంతో ధర్మాచరణం ఒక్కటే ఏకాంతం అనే నిర్ణయం తీసికొని కాలవికారాలను జయించగలగాలి.

క. మానుషము దుర్లభము, సో । పానంబగు నది విముక్తి పదము గనుటకున్,
దానిఁ గని తొంటి చందము । రానీక, సముద్యమమునఁ బ్రాఁకఁగ వలదే? 237

ప్రతిపదార్థం: మానుషము= మానవజన్మ అనేది; దుర్లభము= దుర్లభం; ముక్తిపదము= మోక్షపదవి; కనుటకున్= పొందటానికి; అది= ఆ మానవజన్మ; సోపానంబు+అగున్= ఒక మెట్టు అవుతుంది; దానిన్= ఆ విషయాన్ని; కని= గ్రహించి; తొంటిచందము= పూర్వపు జన్మల పద్ధతి; రానీక= దరికి రానివ్వకుండా; సముద్యమమునన్= గొప్ప ప్రయత్నంతో; ప్రాఁకఁగన్+వలదే?= పై మెట్టులకు ప్రాకవద్దా?

తాత్పర్యం: మానవజన్మ బహు దుర్లభం. దాన్ని ఒక సోపానంగా చేసికొని నిచ్చెన ఎక్కి, మోక్షపదం అందుకొనాలి. పూర్వజన్మల లక్షణాలు దరికి రానివ్వకూడదు.

విశేషం: అలం: రూపకం.

క. అనఘా! తపోవనమునన । జననంబును మరణదశయు సంప్రాప్తము ల
య్యెనయేని వాఁడు ముక్తుఁడె । మనంబు బహుకామవికృతి మగ్నంబైనన్. 238

ప్రతిపదార్థం: అనఘా!= పావనుడా!; జననంబునున్= పుట్టుకా; మరణదశయున్= మరణమూ; తపోవనమునన్+అ= ఆశ్రమంలోనే; సంప్రాప్తములు+అయ్యెను+అ+ఏనిన్= ప్రాప్తించినట్టయితే; మనంబు= వాడి హృదయం; బహు= పలురకాలైన; కామవికృతి= కామ వికారాలలో; మగ్నంబు+ఐనన్= మునిగిపోయినచో; వాఁడు= ఆ వ్యక్తి; ముక్తుఁడె?= ముక్తుడు అగునా?

తాత్పర్యం: పావనుడా! జననమూ మరణమూ అనేవి తపోవనంలోనే జరిగినప్పటికీ జీవించి ఉన్నకాలంలో వాడి మనస్సు ఎన్నో కామవికారాలకు లోనైతే వాడు ముక్తుడు కాగలడా? (కాలేడని భావం).

తే. భోగములు సంపరిత్యక్తములుగఁ జేసి । కేవలాంగుఁడై నిర్మలభావయుక్తిఁ
దపము గృహముననేనియుఁ దత్పరతఁ జ । రించి సంసారజలధిఁ దరించు నరుఁడు. 239

ప్రతిపదార్థం: భోగములు= భోగాలు; సంపరిత్యక్తములుగన్+చేసి= పూర్తిగా విడిచిపెట్టి; కేవల+అంగుఁడై= శరీరమాత్రుడుగా మిగిలి; నిర్మల= మలినరహితమైన; భావయుక్తిన్= హృదయస్పందనలతో; నరుఁడు= మానవుడు; గృహమునన్+ఏనియున్= ఇంటిలోనే అయినా; తత్పరతన్= తాదాత్మ్యంతో; తపము= తపస్సు; చరించి= ఆచరించి; సంసారజలధిన్= సంసారము అనే సముద్రాన్ని; తరించున్= దాటుతాడు.

తాత్పర్యం: భోగాలను విడిచిపెట్టి, నిస్సంగుడై, నిర్మలాంతరంగుడై ఇంటిలోనైనా తాదాత్మ్యంతో తపస్సు చేసికొనే నరుడు సంసారసముద్రాన్ని తేలికగా తరిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

క. వినుఁ దారపుత్రమిత్రులు । సనిరి కొడుక! మున్ను చనిన జన్మంబుల, నీ
కును వారు, వారలకు నీ । వును మఱుపుట్టువులఁ గొఱయవుట గల్గెనొకో? 240

ప్రతిపదార్థం: కొడుక!= పుత్రుడా!; వినుఁ; మున్ను= ఇంతకుముందు; చనిన= కడచిన; జన్మంబులన్= పుట్టుకలలో; దార= భార్యలూ; పుత్ర= సంతానం; మిత్రులు= స్నేహితులూ - ఎంతోమంది; చనిరి= గతించారు; నీకును= నీకు; వారున్= వారూ; వారలకున్= వారికి; నీవునున్= నీవూ; మఱుపుట్టువులన్= అనంతర జన్మలలో; కొఱ+అవుట= శేషంగా కొనసాగటం; కల్గెనొకో?= జరిగిందా?

తాత్పర్యం: నాయనా! ఇప్పటికి నీవు ఎన్ని జన్మలు ఎత్తి ఉంటావు? ప్రతిజన్మలోనూ భార్యాపుత్ర మిత్రులు ఉంటూనే ఉన్నారు కదా! వారంతా గతించిపోయారు. ఒక జన్మలో వారు మరొక జన్మలోనికి అదే బంధుత్వంతో శేషంగా కొనసాగటమనేది నీకుగానీ వారికిగానీ జరిగిందంటావా? నీ అంతట నీవూ - వారంత వారుగా జన్మపరంపరలలో యాత్ర సాగిస్తున్నారు. ఇది తెలిసికొనరా తండ్రీ!

ఆ. ఏన కలను నాకు, నెవ్వరివానిఁగా । నాత్మఁ దలఁతు?, నన్ను నట్టివాని
నెందుఁగానఁ, గాన యెవ్వరివాఁడను । గా ననంగవలదె మాననీయ! 241

ప్రతిపదార్థం: మాననీయ!= గౌరవింపదగినవాడా!; ఏను+అ= నేనే; నాకున్= నాకు; కలను= ఉన్నాను; ఎవ్వరివానిన్+కాన్= ఎవ్వరివాడనుగా; ఆత్మన్= అంతరంగంలో; తలఁతున్= (నన్ను నేను) భావిస్తాను?; నన్నున్+అట్టివానిన్= నావంటి వాడిని; ఎందున్= ఎక్కడా; కానన్= చూడను; కాన= కాబట్టి; ఎవ్వరివాఁడనున్+కాను= నేను ఎవరివాడినీ కానే కాను; అనంగన్+వలదె?= అనుకోవద్దా?

తాత్పర్యం: మాన్యుడా! నాకు నేనే ఉన్నాను. మరెవ్వరూ లేరు. నేను ఎవరివాడను అని అనుకోను? నావంటివాడు మరొకడు ఎక్కడా లేడు, ఉండడు. అందుచేత నేనే ఎవ్వరివాడనూ కాను. జ్ఞాని అయినవాడు ఇట్లా భావించాలి నాయనా!

క. దారాపేక్షం గష్ట । ప్రారంభముఁ బూని యిహమునందుఁ బరమునన్
వారని సంక్లేశంబులఁ । గూరు నరుఁడు దానిఁ జేయ గొనకొండ్రె బుధుల్? 242

ప్రతిపదార్థం: నరుఁడు= పురుషుడు; దార+అపేక్షన్= భార్యావ్యామోహంతో; కష్టప్రారంభమున్= కష్టాల ఆరంభాన్ని; పూని= పొంది; ఇహమునందున్= ఈ లోకంలోనూ; పరమునన్= పరలోకంలోనూ; వారని= ఎడతెగని; సంక్లేశంబులన్= క్లేశాలలో; కూరున్= కూరుకుపోతాడు; దానిన్= అటువంటి దారాపేక్షను; చేయన్= పెట్టుకోవటానికి; బుధుల్= జ్ఞానులు; గొనకొండ్రె?= పూనుకొంటారా?

తాత్పర్యం: భార్యపట్ల వ్యామోహం (అపేక్ష) అనేది కష్టాలకు ప్రారంభం. ఇహంలోనూ పరంలోనూ అది అంతులేని క్లేశాలను కల్పిస్తుంది. అందుచేత తెలివిగలవారెవ్వరూ దారాపేక్షకు పూనుకోరు, కష్టాలలో కూరుకోరు.

చ. ధన మది యేల భోగమును దానము లేదగునేని? శత్రు మ
ర్దన మొనరింపఁడేని బలదర్పము లేల? సధర్మవృత్తికిన్
గొనకొనఁడేని విన్కి మునికుంజర! యేల జితేంద్రియుండు గాఁ
డనఁ జనునేని నాత్మవిధ మారయు నా క్రమమేల చెప్పుమా!' 243

ప్రతిపదార్థం: మునికుంజర?= మునిశ్రేష్ఠా!; భోగమును= అనుభవించటమూ; దానమున్= త్యాగం చెయ్యటమూ అనేవి; లేదు+అగున్+ఏని= లేకపోయినది అయినట్లయితే; ధనము+అది= ఆ ధనం; ఏల?= ఎందుకు?; శత్రుమర్దనము= శత్రువులను మర్దించటం; ఒనరింపఁడు+ఏనిన్= చేయనివాడు అయినట్లయితే; బల దర్పములు= బలమూ పౌరుషమూ అనేవి; ఏల?= ఎందుకు?; సధర్మవృత్తికిన్= ధర్మసహితమైన ప్రవర్తనకు; గొనకొనఁడు+ఏనిన్= పూనుకోనివాడు అయినట్లయితే; విన్కి= బహుశ్రుతత్వం (వేదాలూ, శాస్త్రాలూ గురుముఖతః వినటం); ఏల?= ఎందుకు?; జిత+ఇంద్రియుండు+కాఁడు= ఇంద్రియనిగ్రహం కలవాడు కాదు; అనన్= అనటానికి; చనున్+ఏని= వీలు కలిగినట్లయితే; ఆత్మవిధము= ఆత్మతత్త్వం; ఆరయు= తెలిసికొనే; ఆ+క్రమము= ఆ వరుస అంతా; ఏల?= ఎందుకు?; చెప్పుమా!= చెప్పు చూద్దాం!

తాత్పర్యం: మునివరా! శుకా! భోగానికీ, త్యాగానికీ కాని ధనం ఎందుకు? శత్రు సంహారం చేయలేని బలదర్పాలు ఎందుకు? ధర్మాచరణానికి పూనుకోని జ్ఞానం ఎందుకు? జితేంద్రియుడు కాలేనప్పుడు ఆత్మతత్త్వం గురించి శ్రమపడి తెలిసికొని ఏమి లాభం - చెప్పుము!'

క. అని యి ట్లుపదేశించిన । విని శుకుఁడు విముక్తిమార్గవిదుఁడై చనియెన్
జనకుఁ దొఱఁగి నిశ్చలదీ । పనిభాత్మం డగుచుఁ గురునృపాలవరేణ్యా!' 244

ప్రతిపదార్థం: కురునృపాల వరేణ్యా!= కురురాజోత్తమా! ధర్మరాజా!; అని; ఇట్లు= ఈ ప్రకారంగా; ఉపదేశించినన్= వ్యాసుడు ఉపదేశించేసరికి; విని= ఆలకించి; శుకుఁడు; విముక్తిమార్గ విదుఁడై= మోక్షమార్గం తెలిసికొన్నవాడై; జనకున్= తండ్రిని; తొఱఁగి= విడిచిపెట్టి; నిశ్చల= చలించని; దీప= దీపంతో; నిభ= సాటివచ్చే; ఆత్ముఁడు+అగుచున్= ఆత్మ కలవాడు అవుతూ, నిశ్చలదీపంలా; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వ్యాసుడు ఇట్లా ఉపదేశించేసరికి శుకుడికి ముక్తిమార్గం తెలిసిపోయింది. ఆత్మ నివాత నిశ్చలదీపంవలె ప్రకాశించింది. తండ్రిని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు'.

విశేషం: అలం: ఉపమ.

క. అనిన విని దేవతటినీ । తనయునితోఁ బాండురాజ తనయాగ్రజుఁ డి
ట్లనుఁ బ్రీతియు వినయము నా । ననమునఁ దళుకొత్త నరతనయవంశవరా! 245

ప్రతిపదార్థం: నర= అర్జునుడియొక్క; తనయ= కుమారుడైన అభిమన్యుడి; వంశ= వంశంలో; వరా!= శ్రేష్ఠమైనవాడా ఓ జనమేజయా!; అనినన్= అని భీష్ముడు చెప్పగా; విని= ఆలకించి; పాండురాజతనయ+అగ్రజుఁడు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; దేవతటినీ+తనయుతోన్= గంగాపుత్రుడైన భీష్ముడితో; ప్రీతియున్= ప్రేమా; వినయమున్= వినయమూ; ఆననమునన్= ముఖంలో; తళుకొత్తన్= వికసించగా; ఇట్లు; అనున్= అన్నాడు.

తాత్పర్యం: జనమేజయా! ఇట్లా గాంగేయుడు చెప్పినది అంతా శ్రద్ధగా ఆలకించాడు ధర్మరాజు. అతడి ముఖంలో ఒక తృప్తి, ఒక వినయం వికసించాయి. జనమేజయా! ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అంటున్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు సెప్పుట (సం. 12-310-1)

వ. 'కృష్ణద్వైపాయన పుత్రుండను మాత్రమ కాని శుకుని జన్మంబు తెఱంగును నతని తల్లిని నతండు బాల్యంబున మహానుభావుం డగుటకుం గతంబును నతండు సిద్ధివొందిన భంగియు నెఱుంగ నవియెల్ల నెఱింగింపుము.' 246

ప్రతిపదార్థం: కృష్ణద్వైపాయన పుత్రుండు= వ్యాసుడి కుమారుడు; అను మాత్రము+అ+కాని= అని మాత్రమే కానీ; శుకుని= శుకునియొక్క; జన్మంబు తెఱంగునున్= జన్మప్రకారమూ; అతని= అతడియొక్క; తల్లిని= తల్లినిగురించీ; అతండు= ఆ శుకుడు; బాల్యంబునన్= పిన్నవయస్సులోనే; మహానుభావుండు= మహాత్ముడు; అగుటకున్= కావటానికి గల; కతంబునున్= కారణమూ; అతండు= ఆయన; సిద్ధి+పొందిన భంగియున్= సిద్ధుడు అయిన విధానమూ; ఎఱుంగన్= ఇవి ఏవీ నేను ఎరుగను; అవి+ఎల్లన్= ఆ విశేషాలన్నీ; ఎఱింగింపుము= దయచేసి తెలియజెప్పుము.

తాత్పర్యం: శుకుడు వ్యాసుడి పుత్రుడనే విషయం తప్పించి, ఆతడు ఎట్లా జన్మించాడు? చిన్నతనంలోనే అంతటి మహానుభావు డెట్లా అయ్యాడు? అతడు సిద్ధు డెట్లా అయ్యాడు - ఈ వివరాలను అన్నింటినీ నే నెరుగను. అవి నాకు తెలుపవలసింది'. (అని ధర్మరాజు భీష్ముడిని అడిగాడు).

సీ. అనవుడు నతఁడిట్టులను నాతనికిఁ గర్ణి । కారవనం బనఁ గలదు మేరు
తటమున నం దద్రితనయయుఁ దానును । పశుపతి లీలమైఁ బ్రమథగణము
గొలువనుండఁ దనూజుఁగోరి వేదవ్యాస । సంయమి దత్ప్రదేశమున యోగ
బలమూర్జితముగఁ దపంబొనరించె యో । గమునకు రాజసూయములు నశ్వ

తే. మేధములును నపరిమితములైనను సరి । గావు సూవె వినుము కౌరవేంద్ర!
తత్తపోవిశిష్టతకు మెచ్చి శివుఁడు ప్ర । త్యక్షమై యభీష్టమడుగు మనిన. 247

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= ధర్మరాజా!; అనవుడున్= అని ధర్మరాజు అడిగేసరికి; అతఁడు= ఆ భీష్ముడు; ఆతనికిన్=ఆ ధర్మరాజుతో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనున్= చెబుతున్నాడు; మేరుతటమునన్= మేరు పర్వతపార్శ్వంలో; కర్ణికార వనము+అనన్= కర్ణికారము అనే పేరుతో ఒక వనం; కలదు= ఉన్నది; అందున్= ఆ వనంలో; పశుపతి= శివుడు; ప్రమథగణము= ప్రమథుల సమూహం; కొలువన్= సేవిస్తూండగా; తానున్= తానూ; అద్రితనయయున్= పార్వతీదేవీ; లీలమైన్= విలాసంగా; ఉండన్= క్రీడిస్తూ ఉన్న కాలంలో; వేదవ్యాస సంయమి= మునీశ్వరుడైన వేదవ్యాసుడు; తనూజున్= ఒక పుత్రుడిని; కోరి= కోరుకుని; తద్+ప్రదేశమునన్= ఆ ప్రదేశంలో; యోగబలము= యోగశక్తి; ఊర్జితముగన్= అతిశయించేటట్టు; తపంబు= తపస్సు; ఒనరించెన్= చేశాడు; వినుము; రాజసూయములున్= రాజసూయ యజ్ఞాలూ; అశ్వమేధములున్= అశ్వమేధాలూ; అపరిమితములైననున్= అసంఖ్యాకంగా చేసినా; యోగమునకున్= యోగమార్గానికి;

సరి+కావు+చూవె!= సాటిరావు సుమా!;

తద్= ఆ వ్యాసుడియొక్క; తపఃవిశిష్టతకున్= విశిష్టమైన తపస్సుకు; మెచ్చి= సంబరపడి; శివుఁడు= పశుపతి; ప్రత్యక్షమై= దర్శనం అనుగ్రహించి; అభీష్టమున్= కోరుకొన్నదానిని; అడుగుము= అడుగుమని; అనినన్= అనేసరికి.

తాత్పర్యం: (భీష్ముడు చెప్పుతున్నాడు) 'ధర్మరాజా! మేరుపర్వత సానువులలో కర్ణికారవనం ఉన్నది. అందులో పార్వతీపరమేశ్వరులు ప్రమథుల సేవలు అందుకొంటూ విహరిస్తుంటారు. ఒకప్పుడు వేదవ్యాసుడు ఆ ప్రదేశంలో పుత్రుడిని కోరి తపస్సుకు పూనుకొన్నాడు. ఇక్కడ ఒకమాట చెప్పుతాను వినుము. రాజసూయాలూ, అశ్వమేధాలూ ఎన్నయినా యోగనిష్ఠకు సాటిరావు సుమా! వ్యాసుడి తపస్సుకు శివుడు సంతోషించి ప్రత్యక్షమయ్యాడు. ఏమి కావాలో కోరుకొనుమన్నాడు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అ మ్మునీశ్వరుండు భక్తి సంభ్రమభరితుం డగుచుం దండప్రణామంబు చేసి. 248

ప్రతిపదార్థం: ఆ+ముని+ఈశ్వరుండు= ఋషీంద్రుడైన ఆ వ్యాసుడు; భక్తి= భక్తితో; సంభ్రమ= భరితుండు+అగుచున్= దండప్రణామంబు= సాష్టాంగనమస్కారం; చేసి= ఆచరించి.

తాత్పర్యం: ఆ వ్యాసుడు ఆనందభరితుడై భక్తితో సాష్టాంగనమస్కారం చేసి.

క. 'జల పవనాంబరవసుధా । నల సమవీర్యుఁడగు పుత్రు నా కొసఁగంగా
వలయు' ననుడు నిచ్చితి నని । పలికి చనియె నమ్మహాకృపామూర్తి నృపా! 249

ప్రతిపదార్థం: నృపా!= ధర్మరాజా!; జల= నీటితో; పవన= వాయువుతో; అంబర= ఆకాశంతో; వసుధా= భూమితో; అనల= అగ్నితో; సమ= సమానమైన; వీర్యుఁడు= శక్తికలవాడు; అగు= అయిన; పుత్రున్= కుమారుడిని; నాకున్= నాకు; ఒసఁగంగాన్+వలయున్= ఇమ్ము; అనుడున్= అని అనటంతోనే; ఇచ్చితిన్= ఇచ్చాను; అని; పలికి= చెప్పి; ఆ+మహా కృపామూర్తి= గొప్ప దయా స్వరూపుడైన ఆ శివుడు; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'ధర్మజా! 'పంచభూతాలతో సమానమైన శక్తియుక్తులు కలిగిన పుత్రుడిని వరప్రసాదంగా అనుగ్రహించుము' అని వ్యాసుడు శివుడిని వేడుకొన్నాడు. 'ఇచ్చాను' అని చెప్పి శివుడు అంతర్ధానం అయ్యాడు. శివుడు గొప్ప దయామయుడు.

వ. ఇట్లు లబ్ధవరుం డగుచు సత్యవతీసుతుం డగ్నికార్యపరుండై యరణి వుచ్చికొని మథింపం దొడంగిన ఘృతాచి యను నప్సరోవనిత లోచనగోచరం బగుటయుఁ దానునుం గామగోచరత్వంబు నొందిన నయ్యిందువదన యమ్మని తెఱంగి వంచనం జిలుకయై యుండె నతండును ధైర్యం బవలంబించి యరణికార్య ప్రవణుండై యుండం బ్రబలుండగు నంగజుని చెయ్ది నప్సరోరూపాతిశయసక్తచిత్తుండైన యా సంయమి శుక్లం బయ్యరణియందుఁ బడియె. నవ్విప్రుండు నిర్విశంకంబగు నంతఃకరణంబుతో నరణిమథనం బొనరించిన. 250

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; లబ్ధవరుండు= పొందినవరం కలవాడు; అగుచున్= అయి (వరం పొందినవాడై); సత్యవతీసుతుండు= సత్యవతి కుమారుడైన ఆ వ్యాసుడు; అగ్నికార్యపరుండు+ఐ= అగ్నికార్యం నిర్వహిద్దామనే పూనికతో; అరణి+వుచ్చికొని= అరణిని అందుకొని; మథింపన్+తొడంగినన్= మథించటం మొదలు పెట్టేసరికి; ఘృతాచి= ఘృతాచి; అను= అనే పేరుగల; అప్సరస్+వనిత= అప్సరస; లోచనగోచరంబు+అగుటయున్= కన్నుల ఎదుట కనిపించటంతో; తానునున్= ఆ వ్యాసుడు కూడా; కామగోచరత్వంబున్+ఒందినన్= ఇంద్రియాలు కామప్రకోపాన్ని పొందేసరికి; ఆ+ఇందువదన = ఆ చంద్రముఖి;

ఆ+ముని+తెఱంగు= ఆ మునీశ్వరుడి పరిస్థితి; ఎఱింగి= గుర్తించి; వంచనన్= వంచనతో; చిలుక+అయి+ఉండెన్= చిలుకగా మారిపోయింది; అతండును= ఆ వ్యాసుడుకూడా; ధైర్యంబు= ధీరత్వాన్ని; అవలంబించి= వహించి; అరణికార్యప్రవణుండు+ఐ= అరణిని మథించే పనిలో నిమగ్నుడై; ఉండన్= ఉండగా; ప్రబలుండు+అగు= మిక్కిలి బలశాలియైన; అంగజుని= మన్మథుడియొక్క; చెయ్దన్= చేష్టవలన; అప్సరస్+రూప+అతిశయ= ఘృతాచియొక్క సౌందర్యాతిశయం పట్ల; సక్త= లగ్నమైన; చిత్తుండు+ఐన= మనస్సు కలవాడైన; ఆ+సంయమి= ఆ ఋషియొక్క; శుక్లంబు= వీర్యం; ఆ+అరణియందున్= ఆ అరణిలో; పడియెన్= పడింది; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; నిర్విశంకంబు+అగు= ఏ సంశయమూ లేని; అంతఃకరణంబుతోన్= హృదయంతో; అరణిమథనంబు= అరణిని మథించటం; ఒనరించినన్= కొనసాగించేసరికి.

తాత్పర్యం: ధర్మరాజా! వరం పొందిన వ్యాసుడు ఒకరోజున తన ఆశ్రమంలో అగ్నికార్యాలు నిర్వహించటం కొరకని అరణిని మథిస్తున్నాడు (గుండ్రటి చెక్కమీద పుల్లతో మథించి అగ్నిని పుట్టిస్తారు. ఆ చెక్కను అరణి అంటారు). ఆ సమయంలో ఘృతాచి అనే అప్సరస కనిపించింది. మహర్షికి ఆమెను చూసి కామప్రకోపం కలిగింది. దానిని గమనించిన అప్సరస భయపడిందో ఏమో ఎందుకయినా మంచిదని వంచనతో చిలకగా మారిపోయింది. వ్యాసుడు మనస్సు చిక్కబట్టుకొని అరణిని చిలకటం కొనసాగించాడు. కానీ, మన్మథుడు మహాబలశాలి కదా! వ్యాసుడి మనస్సులో అప్సరస రూపమే నిలిచిపోయింది. దాని కారణంగా వీర్యస్ఖలనం అయింది. అది అరణిలో పడింది. అయినా వ్యాసుడు నిర్వికారచిత్తంతో అరణిమథనం కొనసాగించాడు.

తే. అయ్యరణిఁ బుట్టి జనకసమాకృతియును । భూరి కాంతియు వెలుఁగంగఁ బొలిచె శుకుఁడు
యాగకాల సుసంభృత హవిరవాప్తి । మహితతేజస్కుఁడగు హుతవహుని మాడ్కి 251

ప్రతిపదార్థం: ఆ+అరణిన్= ఆ అరణిలో; పుట్టి= ఉద్భవించి; జనకసమ= తండ్రితో సమానమైన; ఆకృతియును= ఆకారమూ; భూరి= గొప్ప; కాంతియున్= తేజస్సూ; వెలుఁగంగన్= ప్రకాశించగా; శుకుఁడు= వ్యాసపుత్రుడు శుకుడు; యాగకాల= యజ్ఞసమయంలో; సుసంభృత= సమృద్ధిగా సమర్పించబడిన; హవిస్+అవాప్తి= హవిస్సుయొక్క (నెయ్యి) ప్రాప్తితో; మహిత= గొప్ప; తేజస్కుఁడు+అగు= తేజస్వంతుడయ్యే; హుతవహుని+మాడ్కిన్= అగ్నిలాగా; పొలిచెన్= విరాజిల్లాడు.

తాత్పర్యం: ఆ అరణినుంచి ఒక మగపిల్లవాడు జన్మించాడు. అతడే శుకుడు. రూపంలో ముమ్మూర్తులా వ్యాసుడే. యజ్ఞకుండంలో ఆజ్యంపోస్తే అగ్ని ఎట్లా ప్రకాశిస్తుందో శుకుడు గొప్ప తేజస్సుతో. అట్లా వెలిగిపోతున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. అపుడు మందాకిని సాకారయై వచ్చి । మంగళస్నాన సమన్వితుఁడు గ
నొనరించె నాకసంబుననుండి పడియెఁ గృ । ష్ణాజినదండంబు లతని యెదుర
దివ్యదుందుభులును దేవాంగనాగాన । ములును వీతెంచె నద్భుతముగాఁగఁ
గుసుమవర్షంబులు గురిసె నింద్రాది దే । వతలు గారవమున వచ్చి రంబి

తే. కాసమేతుఁడై యేతెంచి కామవైరి । యతని నుపనీతుఁ గావించె నమరనాథుఁ
డుజ్జ్వలంపుఁ గమండలు వొసఁగె నిచ్చి । రమరు లెన్నండు మాయని యంబరములు. 252

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; మందాకిని= గంగానది; సాకారయై= ఆకారం ధరించి; వచ్చి; మంగళస్నానసమన్వితుఁడుగన్= వచ్చి మంగళస్నానంతో కూడుకొన్నవాడిగా శుకుడిని; ఒనరించెన్= చేసింది (మంగళస్నానం చేయించింది); ఆకసంబుననుండి=

ఆకాశంనుంచి; కృష్ణాజినదండంబులు= నల్లని జింకతోలూ, బ్రహ్మచారి ధరించే ఒక దండమూ; అతని+ఎదురన్= అతడి ఎట్టఎదుట; పడియెన్= పడ్డాయి; దివ్యదుందుభులును= దేవతల దుందుభులూ; దేవాంగనా= అమరకాంతల; గానములును= పాటలూ; వీతెంచెన్= వినవచ్చాయి; అద్భుతము+కాఁగన్= ఆశ్చర్యజనకంగా; కుసుమవర్షంబులు= పూలవానలు; కురిసెన్= కురిశాయి; ఇంద్ర+ఆది+దేవతలు= ఇంద్రుడు మొదలైన దేవతలు; గారవమునన్= గౌరవసూచకంగా; వచ్చిరి= వచ్చారు; కామవైరి= మన్మథసంహారకుడైన శివుడు; అంబికా సమేతుఁడై= పార్వతితో కూడినవాడై; ఏతెంచి= వచ్చి; అతనిన్= ఆ బాలుడిని; ఉపవీతున్= ఉపనయనం జరిగినవాడిగా; కావించెన్= చేశాడు (పార్వతీ పరమేశ్వరులు వచ్చి అతడికి ఉపనయనం చేసి జందెం వేశారని భావం); అమరనాథుఁడు= దేవనాయకుడు ఇంద్రుడు; ఉజ్జ్వలంపు= ప్రకాశిస్తున్న; కమండలుపు= కమండలువును; ఒసఁగెన్= బహూకరించాడు; అమరులు= దేవతలు; ఎన్నండున్= ఎప్పటికీ; మాయని= మాసిపోని; అంబరములు= వస్త్రాలను; ఇచ్చిరి= సమర్పించారు.

తాత్పర్యం: పాండవా! సరిగ్గా అప్పుడే గంగానది స్త్రీరూపంలో వచ్చింది. ఆ బిడ్డకు మంగళస్నానం చేయించింది. ఆకాశంనుండి కృష్ణాజినమూ దండమూ వచ్చి పడ్డాయి. దుందుభులు మ్రోగాయి. దేవతాంగనల గానాలు వినిపించాయి. ఆశ్చర్యజనకంగా పూలవాన కురిసింది. ఇంద్రాది దేవతలు గౌరవంతో వచ్చారు. పార్వతీపరమేశ్వరులు శుకుడికి ఉపనయనం చేశారు. దేవేంద్రుడు తళతళలాడే కమండలం ఇచ్చాడు. దేవతలేమో ఎప్పుడూ మాసిపోని దివ్యమైన వస్త్రాలు బహూకరించారు.

క. మృగపక్షి సమూహము లా । దిగఁ గల్గు చరాచరముల దివ్యప్రభవుం
డగు శుకుని పుట్టొనర్చెం । బ్రగాఢతమ సంప్రమోద భరితంబులుగాన్. 253

ప్రతిపదార్థం: దివ్యప్రభవుండు+అగు= మానవాతీతమైన జన్మకలవాడైన; శుకుని= శుకుడియొక్క; పుట్టు= పుట్టుక; మృగపక్షి సమూహములు= జంతుబృందాలూ పక్షిసమూహాలూ; ఆదిగన్= మొదలుగా; కల్గు= ఉన్న; చరాచరములన్= జంగమస్థావరాలను; ప్రగాఢతమ= మిక్కిలిగాఢమైన; సంప్రమోద= ఆనందంతో; భరితంబులు+కాన్= నిండినవాటిగా; ఒనర్చెన్= చేసింది.

తాత్పర్యం: శుకుడిది దివ్యమైన పుట్టుక. అది మృగపక్షి సమూహాలతో కూడిన సకలచరాచర జగత్తులోనూ ప్రగాఢమైన ఆనందాన్ని నింపివేసింది.

క. జనియించిన మాత్రన య । మ్మునిప కిశోరమును వేదములు వొందెను ద
జ్జనకుని మును పొందిన తెఱఁ । గున, నబ్బాలుఁడు వరించె గురుఁడుగ ధిషణున్. 254

ప్రతిపదార్థం: జనియించిన మాత్రన్+అ= పుట్టటంతోనే; ఆ+మునిప+కిశోరమును= మునీశ్వరుడి బిడ్డ అయిన ఆ శుకుడిని; వేదములు= వేదాలు; మునుపు= పూర్వం; తద్+జనకున్= అతడితండ్రి వ్యాసుడిని; పొందిన తెఱఁగునన్= పొందినట్లే; పొందెను= వరించాయి; ఆ+బాలుఁడు= ఆ కుమారుడు; ధిషణున్= బృహస్పతిని; గురుఁడుగన్= తనకు గురువుగా; వరించెన్= కోరుకొన్నాడు;

తాత్పర్యం: మునుపు వ్యాసుడు పుట్టగానే వేదాలు అతడిని పొందాయి. ఇప్పుడూ అట్లాగే శుకుడిని వచ్చి చేరాయి. శుకుడేమో బృహస్పతిని తనకు గురువుగా వరించాడు.

వ. ఆచారపరిపాటి యవలంబించి యి ట్లుపాధ్యాయవరణంబు సేసి. 255

ప్రతిపదార్థం: ఆచార పరిపాటి= ఆచారవిధానం; అవలంబించి= స్వీకరించి; ఇట్లు; ఉపాధ్యాయవరణంబు= ఉపాధ్యాయుడిని కోరుకోవటం అనేది; చేసి= చేసి.

తాత్పర్యం: ఆచారవిధానం స్వీకరించి ఉపాధ్యాయుడిని కోరుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అతఁడు సదివింప వేదవేదాంగధర్మ । శాస్త్రరాజనీత్యాదిక సకల విద్య
లును గ్రమంబునఁ జదివి యమ్మునికుమారుఁ । డచ్చటన యుండె వ్రతచర్యలందుఁ దగిలి. 256

ప్రతిపదార్థం: అతఁడు= ఆ బృహస్పతి; చదివింపన్= చదివిస్తూంటే; వేద= వేదాలూ; వేదాంగ= ఛందోవ్యాకరణ జ్యోతిషాదులైన షడంగాలూ; ధర్మశాస్త్ర= ధర్మశాస్త్రాలూ; రాజనీతి+ఆదిక= రాజనీతి మొదలైన; సకలవిద్యలును= సమస్తవిద్యలనూ; క్రమంబునన్= వరుసగా; చదివి= అభ్యసించి; ఆ+మునికుమారుఁడు= ఆ శుకుడు; వ్రతచర్యలందున్= బ్రహ్మచర్యవ్రతనియమాలపట్ల; తగిలి= ఆసక్తి కలవాడై; అచ్చటన్+బృహస్పతి సన్నిధిలోనే; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: బృహస్పతి చదివిస్తూంటే శుకుడు వేదాలూ వేదాంగాలూ సకల శాస్త్రాలూ క్రమంగా అభ్యసించాడు. బ్రహ్మచర్య వ్రతదీక్షతో ఆ నియమాలు పాటిస్తూ గురువుగారి దగ్గరే ఉండిపోయాడు.

వ. దేవతలకు లోనుగా నామంత్రణీయుండును మాననీయుండును నగుచు నట్లుండు నయ్యారణీయుండు నిజాశ్రమంబున నున్న తండ్రిపాలికిం జనుదెంచి తదనుసరణ ప్రక్రియం బ్రవర్తించునెడ నచ్చేరువం జరించు మునికుమారులతోడి మాటలు మరిగి లోకంబుతోడి పాటియై యాత్మానుసంధానంబు సేయలేక మెలంగుచున్నం జూచి యా సత్యవతీసుతుండు సాంఖ్యయోగశాస్త్రంబు లతనికి నధిగతంబులు గావించె మఱియు దేహంబునందలి యహంకారంబంతయు బంధులవలని మమతయుం బాయునట్టి వాక్యంబు లుపదేశించె దానం బ్రబోధం బుదయించుటం జేసి యమ్మహామతికి బ్రహ్మచర్యగార్హస్థ్యవానప్రస్థధర్మంబులను నాశ్రమంబులు మూఁటను బుద్ధి రమింపదయ్యె నయ్యుఁ బరమపరుం డప్పారాశర్యుతో మోక్షప్రదం బెయ్యది దాని నెఱింగింపవే యనుటయు. 257

ప్రతిపదార్థం: దేవతలకులోనుగాన్= దేవతలకుకూడా; ఆమంత్రణీయుండున్= ఆహ్వానింప దగినవాడును; మాననీయుండును= గౌరవింపదగినవాడును; అగుచున్= అవుతూ; అట్లు+ఉండు= అలా ఉన్న; ఆ+ఆరణీయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; నిజ+ఆశ్రమంబునన్+ఉన్న= తన ఆశ్రమంలో తానుగా ఉన్న; తండ్రిపాలికిన్= తండ్రిదగ్గరకు (వ్యాసాశ్రమానికి); చనుదెంచి= వచ్చి; తద్+అనుసరణ= ఆ తండ్రిని అనుసరించే; ప్రక్రియన్= విధానంతో; ప్రవర్తించునెడన్= ప్రవర్తిస్తున్న సమయంలో (తండ్రిని అనుసరించి మెలగుతున్న తరుణంలో); ఆ+చేరువన్= ఆశ్రమానికి సమీపంలో; చరించు= సంచరిస్తున్న; మునికుమారులతోడి= మునిబాలకులతోటి; ఆటలు మరిగి= క్రీడలకు అలవాటుపడి; లోకంబుతోడి పాటియై= మిగతా ప్రపంచంతో సమానుడైపోయి; ఆత్మ+అనుసంధానంబు= ఆత్మధ్యానం; చేయలేక; మెలంగుచున్నన్= కాలం గడుపుతూండగా; చూచి; ఆ సత్యవతీసుతుండు= సత్యవతి కుమారుడైన ఆ వ్యాసుడు; సాంఖ్య - యోగ శాస్త్రంబులు= సాంఖ్యమూ, యోగమూ అనే శాస్త్రాలు; అతనికిన్= ఆ శుకుడికి; అధిగతంబులు+కావించెన్= బోధించి నేర్పాడు;మఱియున్= ఇంకా; దేహంబునందలి= జీవోపాధిలో ఉండే; అహంకారంబు+అంతయున్= అహంకారమంతటినీ; బంధులవలని= బంధువులపట్ల; మమతయున్= మమకారాన్నీ; పాయునట్టి= విడిచిపెట్టేటువంటి; వాక్యంబులు= పలుకులు; ఉపదేశించెన్= ఉపదేశించాడు; దానన్= దానితో; ప్రబోధంబు= జ్ఞానం; ఉదయించుటన్+చేసి= కలగటంచేత; ఆ+మహామతికిన్= ఆ గొప్ప ధీశాలికి; బ్రహ్మచర్య= బ్రహ్మచర్యం; గార్హస్థ్య= గార్హస్థ్యం; వానప్రస్థధర్మంబులు= వానప్రస్థధర్మాలు; అను= అనేటువంటి; ఆశ్రమంబులు= ఆశ్రమాలు; మూఁటను= మూడింటిలోనూ; బుద్ధి= అంతరంగం; రమింపదు+అయ్యెన్= ఆసక్తం కాలేదు; అయ్యున్= అయినప్పటికీ; పరమపరుండు= పరమాత్మపట్లనే ఆసక్తి కలిగిన ఆ శుకుడు; ఆ+పారాశర్యుతోన్= ఆ వ్యాసుడితో; మోక్షప్రదంబు= మోక్షాన్ని ఇచ్చేది; ఎయ్యది= ఏది; దానిన్= దానిని; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనుటయున్= అని అడగటంతో.

తాత్పర్యం: దేవతలచేతకూడా గౌరవించబడే ఆ శుకుడు తన తండ్రిని అనుసరిస్తూ ఉండేవాడు. తోటి మునికుమారుల సహవాసంవలన ఆటలలోపడి ధ్యానం చేయలేకపోతున్న కుమారుడికి సాంఖ్యయోగ శాస్త్రాలను బోధించి అహంకారమమకారాలను విడిచిపెట్టే పద్ధతిలో బోధచేశాడు, దానితో జ్ఞానోదయమైన శుకుడు విరాగి అయ్యాడు. అయినా కూడా 'మోక్షాన్ని ఇచ్చేది ఏది?' అనే విషయమై తనకు తెలియజెప్పుమని తండ్రిని ప్రార్థించగా.

ఆ. అతఁడు మోక్షదర్శి యగుట నిరూపించి । యమ్మహామునీంద్రుఁ డతనితోడ
వత్స! కానఁ బొమ్ము వైదేహుఁడగు జన । క క్షితీశు వినయగౌరవమున. 258

ప్రతిపదార్థం: అతఁడు= తన కుమారుడైన ఆ శుకుడు; మోక్షదర్శి= మోక్షాన్ని దర్శించాలి (తెలుసుకోవాలి) అనే శీలం కలవాడు; అగుట= కావటాన్ని; నిరూపించి= నిర్ధారించుకొని; ఆ+మహాముని+ఇంద్రుఁడు= ఆ మహామునీశ్వరుడైన వ్యాసుడు; అతనితోడన్= ఆ శుకుడితో; వత్స!= నాయనా! (బిడ్డా!); వైదేహుఁడు+అగు= విదేహ రాజ్యాధిపతి అయిన; జనక క్షితీశున్= జనకమహారాజును; వినయగౌరవమునన్= వినయాతిశయంతో; కానన్+పొమ్ము= దర్శించటానికి వెళ్ళు.

తాత్పర్యం: తన కుమారుడు మోక్షాన్ని సందర్శించాలి అనే కోరికతో ఉన్నాడు - అనే విషయాన్ని వ్యాసుడు గమనించాడు. ఇట్లా అన్నాడు: నాయనా! విదేహాధిపతి జనకమహారాజు ఉన్నాడు. నీవు వినయంగా, గౌరవంగా ఆయన దగ్గరకు వెళ్ళుము.

క. గగనంబునఁ జను టుడుగుము । తగంగఁ బాదప్రచారితన చను మిథిలా
నగరమునకు నమ్ముని మా । న్యగుణుం గను మోక్షధర్మ మతఁ డెఱిఁగించున్. 259

ప్రతిపదార్థం: గగనంబునన్= ఆకాశమార్గంలో; చనుట= ప్రయాణంచేసి వెళ్ళటం; ఉడుగుము= మానివేయుము; తగంగన్= తగినట్టు; పాదప్రచారితన్+అ= పాదసంచారంతోనే; మిథిలానగరమునకున్= మిథిలాపట్టణానికి; చను(ము)= వెళ్ళుము; ఆ+మునిమాన్యగుణున్= మునులకు కూడా గౌరవింపదగిన గుణాలుకల ఆ జనకుడిని; కను(ము)= సందర్శించు; మోక్షధర్మము= ముక్తిమార్గం; అతఁడు= ఆయన; ఎఱిఁగించున్= తెలియజెబుతాడు.

తాత్పర్యం: నాయనా! ఆకాశమార్గంలో వెళ్ళవద్దు. పాదచారివై ప్రయాణం చేసి, మిథిలానగరం చేరుకొమ్ము. జనకుడంటే మునులకు కూడా గౌరవింపదగినవాడు. ఆయన నీకు మోక్షధర్మం ఉపదేశిస్తాడు.

క. ఆ రాజన్యునెడ నహం । కారిత మమకారితయును గర్తవ్యముగా
దేరికినైనను బూజ్యుం । డారయ నాతఁడు వినీతియ తగుం జుమ్మీ! 260

ప్రతిపదార్థం: ఆ రాజన్యునెడన్= ఆ జనకమహారాజుపట్ల; అహంకారిత= అహంకారం చూపడం; మమకారితయును= మమకారం చూపటం; కర్తవ్యము+కాదు= చెయ్యదగినపని కాదు; ఆరయన్= పరిశీలించి చూస్తే; ఆతఁడు= ఆయనగారు; ఏరికిన్+ఐనను= ఎవ్వరికైనా; పూజ్యుండు= అర్చింపదగినవాడు; అందుచేత - వినీతి+అ= వినయమే; తగున్+చుమ్మీ= తగును సుమా!

తాత్పర్యం: తనయుడా! ఆ జనకమహారాజు పట్ల అహంకారం చూపటంగానీ, మమకారం ప్రదర్శించటం కానీ ఎవ్వరికీ తగదు. ఎవ్వరికైనా అతడు పూజింప దగినవాడు. అందుచేత వినయం ఒక్కటే కర్తవ్యం సుమా!

ఆ. అనిన నట్లకాక యని మేరుముఖనగం । బులు ననేకనదులుఁ బలుదెఱఁగుల
దేశములను వివిధతీర్థంబులును జుల్కఁ । గడచి వచ్చె భరతఖండమునకు. 261

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు చెప్పగా; అట్లు+అ+కాక= అట్లాగే; అని; మేరుముఖ= మేరువు మొదలైన; నగంబులున్= పర్వతాలూ; అనేక నదులున్= అనేక ప్రవాహాలూ; పలుతెఱగుల దేశములను= రకరకాల దేశాలలో; వివిధ= అనేకమైన; తీర్థంబులును= పుణ్యక్షేత్రాలూ; చుల్కన్= వేగంగా; కడచి= దాటి; భరతఖండమునకున్= భరతభూభాగానికి; వచ్చెన్= శుకుడు వచ్చాడు.

తాత్పర్యం: వ్యాసుడు చెప్పినదానికి అట్లాగే అని ఒప్పుకొన్నాడు శుకుడు. వెంటనే పాదచారిగా బయలుదేరాడు. మేరువు మొదలైన పర్వతాలు దాటాడు. నదులు ఈదాడు. పలు దేశాలలో అనేక పుణ్యతీర్థాలు అతిగమించాడు. తేలికగా, వేగంగా ప్రయాణం సాగించి సాగించి, భరతఖండం చేరుకొన్నాడు.

వ. వచ్చునప్పు డెయ్యెడ నే పదార్థంబులఁ జూచినం జూడనివాఁడపోలె వచ్చె. నిట్టు వచ్చి విదేహజనపదంబు సొచ్చి మిథిలాపురంబు నుపవనంబు దఱిసి చని తదీయప్రాకారద్వారదేశంబు సేరిన సమయంబున. 262

ప్రతిపదార్థం: వచ్చునప్పుడు= వస్తున్నప్పుడు; ఏ+ఎడన్= ఎక్కడ; ఏ పదార్థంబులన్= ఏ వస్తువులను; చూచినన్= చూచినా; చూడనివాఁడు+అ+పోలెన్= చూడనివాడివలెనే; వచ్చెన్= ప్రయాణం సాగించి వచ్చాడు; ఇట్టు= ఇట్లా; వచ్చి= విచ్చేసి; విదేహజనపదంబు= విదేహరాజ్యం; చొచ్చి= ప్రవేశించి; మిథిలాపురంబు+ఉపవనంబు= మిథిలాపట్టణంయొక్క ఉద్యానవనం; తఱిసి= సమీపించి; చని= ఇంకా ముందుకు నడిచి; తదీయ= జనక మహారాజు గారి మిథిలాపట్టణంయొక్క; ప్రాకార= కోటగోడతాలూకు (ప్రహరి); ద్వారదేశంబు= ప్రధానద్వారాన్ని; చేరిన సమయంబునన్= చేరుకున్న సమయంలో.

తాత్పర్యం: దారిలో దేనిని చూచినా చూడనివాడివలె దానిని ఉపేక్షిస్తూ ప్రయాణించి, మిథిలా నగరాన్ని చేరుకొన్నాడు శుకుడు. ఉద్యానవనాన్ని దాటి, ప్రధానద్వారాన్ని చేరుకొన్న సమయంలో.

ఆ. ద్వారపాలు రచట వారింప శాంతిమై । నూరకున్నఁ జూచి వారు వెఱచి
లోని కెఱుకచేసి లోఁగుచు వారు ద । న్ననుప నరిగె నృపగృహంబు సేర. 263

ప్రతిపదార్థం: ద్వారపాలురు= ద్వారపాలకులు (గుమ్మం కావలివారు); అచటన్= అక్కడ; వారింపన్= ఆపివేస్తే; శాంతిమైన్= ప్రశాంతంగా (కిమ్మనకుండా); ఊరకున్నన్= శుకుడు ఊరుకునేసరికి; చూచి; వారు= ఆ ద్వారపాలకులు; వెఱచి= భయపడి; లోనికిన్= ప్రాకారంలోపలికి; ఎఱుకచేసి= తెలియజెప్పి; లోఁగుచున్= వినయంగా వంగుతూ; వారు= ఆ కావలివారు; తన్మున్= తనను; అనుపన్= లోపలికి పంపగా; నృపగృహంబు= రాజప్రాసాదం; చేరన్+అరిగెన్= సమీపించటానికి వెళ్ళాడు, ప్రాసాదం సమీపించాడు.

తాత్పర్యం: ప్రాకారద్వారం దగ్గర కావలివారు అడ్డగించారు. శుకుడు కోపించలేదు. ప్రశాంతంగా నిలిచాడు. ఆ ప్రశాంతిని చూచి, ద్వారపాలకులు భయపడి, లోపలికి వర్తమానం పంపి సగౌరవంగా రాజగృహం వైపు పంపించారు. అట్లా రాజప్రాసాదం చేరుకొన్నాడు శుకుడు.

క. అచటఁ బ్రతిహారు లాఁగిన । నచలిత శమవృత్తినుండె నవ్వేత్రధరుల్
ప్రచలితమతులై యా తెఱఁ । గుచితంబుగఁ జెప్ప నృపతియుఁ బురోహితునిన్. 264

ప్రతిపదార్థం: అచటన్= రాజగృహద్వారంలో; ప్రతిహారులు= సేవకులు; ఆఁగినన్= ఆపితే; అచలిత= చలించని; శమవృత్తిన్= శాంతప్రవత్తితో; ఉండెన్= నిలబడ్డాడు; ఆ+వేత్రధరుల్= బెత్తాలు ధరించిన ఆ ప్రతిహారులు; ప్రచలిత= కంపించిన; మతులు+ఐ= మతికలవారై; ఆ+తెఱఁగున్= ఆ విధానమంతా; ఉచితంబుగన్= తగినరీతిలో; చెప్పన్= లోపలికి వచ్చి వివరించేసరికి; నృపతియున్= ఆ జనకమహారాజు కూడా; పురోహితునిన్= తన పురోహితుడిని.

తాత్పర్యం: రాజగృహద్వారంలో సేవకులు ఆపివేశారు. అక్కడా శుకుడు అట్లాగే చలించని ప్రశాంతితో నిలబడ్డాడు. ప్రతిహారుల గుండెలు చలించిపోయాయి. బెత్తాలు ఊపుకొంటూ గబగబా లోపలికి వెళ్ళి రాజుగారికి విషయమంతా వివరించారు. అప్పుడు జనకుడు తన పురోహితుడిని పిలిచి (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అరయఁ బుత్తెంచె నాతఁడు నరసిపోయి । నిజ మెఱిఁగింప భక్తి వినీతి సంభ్ర
మములు ముప్పిరిగొనఁగ నమ్మనుజనాథుఁ । డఖిల మంత్రులు బుధులుఁ దో నరుగుదేర. 265

ప్రతిపదార్థం: అరయన్= చూచి రావటానికి; పుత్తెంచెన్= పంపించాడు; ఆతఁడున్= ఆ పురోహితుడు కూడా; అరసి= చూచి; పోయి= తిరిగి లోపలికి వెళ్ళి; నిజము= ఉన్న పరిస్థితిని; ఎఱిఁగింపన్= తెలియ జెప్పేసరికి; ఆ+మనుజనాథుఁడు= ఆ జనక మహారాజు; భక్తి; వినీతి= వినయం; సంభ్రమములు= హడావిడి అనేవి; ముప్పిరిగొనన్= మూడూ ఒక్కసారిగా చుట్టుముట్టగా;అఖిల మంత్రులున్= తన మంత్రులు అందరూ; బుధులున్= ఆస్థాన పండితులూ; తోన్+అరుగుదేరన్= తనతోపాటు బయలుదేరిరాగా.

తాత్పర్యం: జనకుడు తన పురోహితుడిని పంపించాడు. ఆయన వెళ్ళి ద్వారదేశంలో శాంతచిత్తంతో నిలబడి ఉన్న శుకుడిని చూచి వచ్చి మహారాజుకు విన్నవించాడు. రాజుగారి మనస్సులో భక్తీ, వినయమూ, సంభ్రమమూ ముప్పేటగా అలుముకొన్నాయి. తన మంత్రులూ, పండితులూ వెంటరాగా బయలుదేరాడు.

చ. శిరమున నర్ఘ్యపాత్రఁగొని చెచ్చెర వచ్చి ప్రియం బెలర్ప న
గ్గురుసుతుఁగాంచి యంతిపురి కోటకు లోనగు నొక్క సౌమ్యమం
దిరమున కమ్మునిం గొనుచు దేవసమప్రతిపత్తి నేఁగి ర
త్నరుచిర కాంచ నాసనమునం దగనుంచి సునీతపాద్యుఁడై. 266

ప్రతిపదార్థం: శిరమునన్= శిరస్సుమీద; అర్ఘ్యపాత్రన్= అర్ఘ్యంతో నిండిన పాత్రను; కొని= వహించి; చెచ్చెరన్= గబగబా; వచ్చి= శుకుడు నిలబడ్డ ద్వారం దగ్గరికి వచ్చి; ప్రియంబు+ఎలర్పన్= ప్రీతి చిగురింపగా; ఆ+గురుసుతున్= గురుపుత్రుడైన ఆ శుకుడిని; కాంచి= దర్శించి; అంతిపురి= అంతఃపురమూ; కోటకున్= రాజప్రాసాదానికీ; లోన్+అగు= మధ్యలో ఉన్న; ఒక్క= ఒకానొక; సౌమ్యమందిరమునకున్= సౌమ్యమైన మందిరానికి; ఆ+మునిన్= ఆ శుకుడిని; కొనుచున్= నడిపిస్తూ; దేవ= దేవుడితో; సమ= సమానమైన; ప్రతిపత్తిన్= గౌరవం చూపుతూ; ఏఁగి= తీసుకువెళ్ళి; రత్న= రత్నాలతో; రుచిర= అందమైన; కాంచన+ఆసనమునన్= బంగారుగద్దెమీద; తగన్+ఉంచి= తగినట్టు కూర్చోబెట్టి; సునీతపాద్యుఁడై= కాళ్ళు కడిగినవాడై.

తాత్పర్యం: జనకమహారాజు స్వయంగా అర్ఘ్యపాత్రను (పూజాద్రవ్యాలు ఉంచిన పాత్ర) నెత్తిమీద పెట్టుకొని గబగబా ఎదురువెళ్ళాడు. గురుపుత్రుడిని చూసేసరికి ఎంతో ప్రీతి కలిగింది. తన కోటలో ఒక చంద్రశాలకు శుకుడిని వెంట ఉండి తీసికొని వెళ్ళాడు. దేవుడివలె చూచుకొంటూ తీసికొనివెళ్ళాడు. రత్నాలు పొదిగిన బంగారు ఆసనంమీద కూర్చోబెట్టి కాళ్ళు కడిగాడు.

విశేషం: సౌమ్యము= సోమసంబంధమైనది. (సోముడు= చంద్రుడు). (తెల్లని మందిరానికి అనిగానీ, చంద్రశాలకు అనిగానీ). పై అంతస్తులో విశాలమైన ముంగిలితో నిర్మించిన ఒంటరిగదిని చంద్రశాల అంటారు. చంద్రకాంతపు మణులు పొదిగిన మందిరమైనా కావచ్చును.

క. లలితాక్షతములఁ గుసుమం । బులఁ బూజితుఁ జేసి యర్ఘ్యమును గోవును న
క్కులపతికి నిచ్చె విధిపరి । కలనజ్ఞుండైన యతఁడుఁ గైకొనియెఁ దగన్. 267

ప్రతిపదార్థం: లలిత= మనోజ్ఞమైన; అక్షతములన్= అక్షతలతోనూ (అక్షింతలు అంటారు. బియ్యమూ, పసుపూ, కుంకుమ కలిపి చేసినవి); కుసుమంబులన్= పువ్వులతోనూ; పూజితున్= పూజింపబడినవాడినిగా; చేసి= పూజించి; అర్ఘ్యమును= అర్ఘ్యమును; గోవునున్= ఒక ఆవును; ఆ+కులపతికిన్= ఆ శుకుడికి; ఇచ్చెన్= జనకుడు సమర్పించాడు; విధిపరికలనజ్ఞుండు+ఐన= అతిథిపూజా నియమాలు తెలిసినవాడైన; అతఁడున్= ఆ శుకుడున్నూ; తగన్= తగినట్లు; కైకొనియెన్= వాటిని స్వీకరించాడు.

తాత్పర్యం: జనకమహారాజు అక్షతలూ కుసుమాలూ తీసికొని అతడిని అర్చించాడు. అర్ఘ్యం ఇచ్చాడు. గోవును బహూకరించాడు. అతిథులను అర్చించే విధులు తెలిసిన వాడు కాబట్టి శుకుడు వాటిని స్వీకరించాడు.

విశేషం: పదివేలమందికి అన్నపానాదులు ఇచ్చి విద్యను బోధించే బ్రహ్మర్షిని కులపతి అంటారు. వ్యాసుడు కులపతి. ఆయన కుమారుడు కాబట్టి శుకుడికీ ఆ విశేషణం కుదురుతుంది. వంశశ్రేష్ఠుడని కూడా అర్థం ఉన్నది కాబట్టి అట్లాగయినా చెల్లుతుంది.

వ. జనకుండు సవినయంబుగా నిలుచుండి యమ్ముని యనుమతి సేసిన మఱి మహియంద సమాసీనుండై తానును మంత్రులు విద్వజ్జనంబులు గొలిచియుండె నట్టియెడ నన్నరపతి పరివారజాతం బెల్లను గౌతుకంబునం జనుదెంచి యంతంత మ్రొక్కుచుం జూచుచుండ. 268

ప్రతిపదార్థం: జనకుండు= జనకమహారాజు; సవినయంబుగాన్= వినయం ఉట్టిపడేట్టు; నిలుచుండి= నిలబడి; ఆ+ముని= ఆ శుకుడు; అనుమతి+చేసినన్= అనుమతించగా; మఱి= అప్పుడు; మహి+అందున్+అ= నేలమీదనే; సమాసీనుండై= కూర్చుని; తానునున్= తానూ; మంత్రులున్= తన అమాత్యులూ; విద్వత్+జనంబులున్= పండితులూ; కొలిచియుండెన్= సేవిస్తూ ఉన్నాడు; అట్టియెడన్= ఆ సమయంలో; ఆ+నరపతి= ఆ రాజుగారి; పరివారజాతంబు+ఎల్లనున్= సేవకసమూహం అంతా; కౌతుకంబునన్= కుతూహలంతో; చనుదెంచి= వచ్చి; అంతంతన్= అంతంత దూరంలో; మ్రొక్కుచున్= వంగివంగి నమస్కరిస్తూ; చూచుచుండన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: సవినయంగా నిలబడిన జనకమహారాజును కూర్చోమన్నాడు శుకుడు. అప్పుడు రాజుగారూ అతడి మంత్రులూ, పండితులూ అంతా నేలమీదనే ఆసీనులయ్యారు. ఇది చూచి, పరిజనమంతా ఆశ్చర్యపోయి వాళ్ళూ వంగి వంగి అల్లంత దూరంలో నమస్కరిస్తూ నిలబడ్డారు.

తే. రూపవిభ్రమముల నప్సరోజనంబుఁ । గ్రేణిసేయు వారాంగనాశ్రేణి గీత
నృత్యనిరతి నారాధింప నిర్విశేష । యోజితేంద్రియుఁడై యతఁ డుండె నధిప! 269

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; రూప= సౌందర్యంలోనూ; విభ్రమములన్= విలాసాల్లోనూ; అప్సరస్+జనంబున్= దేవకాంతా సమూహాన్ని; క్రేణి+చేయు= తిరస్కరించేటటువంటి; వారాంగనాశ్రేణి= వేశ్యాబృందం; గీతనృత్య నిరతిన్= సంగీత నాట్యాల ప్రదర్శనతో; ఆరాధింపన్= అర్చించగా; అతఁడు= ఆ శుకుడు; నిర్విశేష= నిర్వికారంగా; యోజిత= నిగ్రహింపబడిన; ఇంద్రియుఁడై= ఇంద్రియాలు కలవాడై; ఉండెన్= కూర్చున్నాడు, ఆరాధన స్వీకరించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! సౌందర్యంలోనూ, విలాసాలలోనూ అప్సరసలను మించిన వేశ్యలు వచ్చి తమ సంగీతంతో, నృత్యప్రదర్శనతో శుకుడిని అర్చించారు. ఇంద్రియ వికారాలు ఏమీ లేని నిశ్చలస్థితితో శుకుడు వాటిని ఆలకించాడు, తిలకించాడు.

చ. అతనికి నన్నపానముల నంచితభక్తి నొనర్పఁగాఁ బురో
హితు నియమించి యవ్వసుమతీశ్వరుఁ డద్దినశేషయామినుల్
చతురము భక్తియుక్తమును సంప్రమదంబునుఁ గా నయించె స
మ్మితమృదు సారభాషణసమీరణతం దదుపాంతవర్తియై. 270

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ శుకుడికి; అన్నపానములన్= భోజనపానీయాదులను; అంచిత భక్తిన్= గొప్పభక్తితో; ఒనర్పఁగాన్= సమకూర్చటానికి; పురోహితున్= తన కులబ్రాహ్మణుడిని; నియమించి= నియోగించి; ఆ+వసుమతీ+ఈశ్వరుఁడు= ఆ జనకభూపాలుడు; ఆ+దినశేష+యామినుల్= ఆ రోజులో అప్పటికి శేషించి ఉన్న సమయాన్నీ, ఆనాటి రాత్రినీ; చతురమున్= చతురంగానూ (నేర్పుగా); భక్తియుక్తమును= భక్తియుక్తంగానూ; సంప్రమదంబునున్+కాన్= సంతోషంగానూ; సమ్మిత= అంగీకారయోగ్యమైన; మృదు= సుకుమారమైన; సార= విలువైన; భాషణ= సంభాషణలయొక్క; సమ్+ఈరణతన్= ప్రసారంతో; తద్= ఆ శుకునియొక్క; ఉపాంత= సమీపంలో; వర్తియై= కూర్చున్నవాడై; నయించెన్= కడపాడు.

తాత్పర్యం: ఒప్పిన భక్తితో శుకుడికి అన్నపానాదులు సమకూర్చటానికని జనకుడు తన పురోహితుడిని నియమించాడు. అవి అయిన తరువాత ఆ దినశేషాన్నీ, ఆ రాత్రినీ హాయిగా, నేర్పుగా, భక్తి ప్రపత్తులతో సారవంతమూ సజ్జనసమ్మతమూ అయిన సంభాషణలతో గడిపాడు జనకమహారాజు. అతడి సన్నిధిని విడిచిపెట్టి మరి ఎక్కడికీ వెళ్ళలేదు. పనికిరాని మాటలు దొర్లలేదు.

వ. మఱునాఁ డమ్మహీపాలుండు గాలోచితకృత్యంబు లాచరించి కృతకరణీయుండును సుఖాసీనుండునునై యున్న యమ్మునిపాలికి సూరిజన సమేతంబుగాఁ జని పరివేష్టించి యుండి కేలుమోడ్చి 'మీరిట విచ్చేయుటకుం గతంబేమి?' యని సవినయంబుగా నడిగిన నమ్మహాత్ముండు 'మా తండ్రి పంపున మోక్షమార్గబోధార్థినై వచ్చితి విప్రునకుం గర్తవ్యం బెయ్యది? మోక్షం బేమిటం బడయవచ్చు? నెఱింగింపవే!' యనుటయు నతండు సవిశేష సమాదరుండై - 271

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజున; కాల+ఉచితకృత్యంబులు= ఉదయకాలానికి చేయవలసిన స్నానాది విధులను; ఆచరించి= చేసి; కృతకరణీయుండునున్= చేయవలసినవి చేసినవాడూ; సుఖ+ఆసీనుండును+ఐన= సుఖంగా ఆసీనుడై ఉన్నవాడూ అయి; ఉన్న= ఉన్నటువంటి; ఆ+ముని+పాలికిన్= ఆ శుకుడి దగ్గరికి; సూరిజనసమేతంబుగాన్= పండితజన సహితంగా; ఆ+మహీపాలుఁడు= ఆ జనకమహారాజు; చని= వెళ్ళి; పరివేష్టించి ఉండి= ఆయనకు చుట్టూ కూర్చుని; కేలుమోడ్చి= నమస్కరించి; మీరు= తమరు; ఇటన్= ఇక్కడికి; విచ్చేయుటకున్= రావటానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి; అని; సవినయంబుగాన్= వినయంతో; అడిగినన్= అభ్యర్థించేసరికి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు శుకుడు; మా తండ్రి పంపునన్= మా తండ్రిగారి ఆజ్ఞమీద; మోక్షమార్గ= ముక్తిమార్గానికి సంబంధించిన; బోధ= జ్ఞానాన్ని; అర్థినై= కోరినవాడనై; వచ్చితిన్= ఇక్కడకు వచ్చాను; విప్రునకున్= బ్రాహ్మణుడికి; కర్తవ్యంబు= చెయ్యదగినది; ఏ+అది= ఏది?; మోక్షంబు= ముక్తి అనేది; ఏమిటన్= దేనితో; పడయన్ వచ్చున్?= పొందవచ్చును?; ఎఱింగింపవే!= తెలియజెప్పవా! - అనుటయున్= అని శుకుడు అనటమూ; అతండు= ఆ జనకుడు; సవిశేష+సమాదరుండై= విశిష్టమైన ఆదరం కలవాడై.

తాత్పర్యం: మరుసటిరోజున ఉదయకాలానికి చేయవలసిన స్నానాది విధులను నిర్వహించి, సుఖాసీనుడైన ఆ శుకుడి దగ్గరికి, పండితజన సహితంగా ఆ జనకమహారాజు వెళ్ళి ఆయన దగ్గర కూర్చుని నమస్కరించి, 'మీరు ఇక్కడికి రావటానికి కారణం ఏమి?' టని సవినయంగా అడిగేసరికి, శుకుడు 'మా తండ్రిగారి ఆజ్ఞమీద, ముక్తి మార్గానికి సంబంధించిన జ్ఞానాన్ని కోరినవాడనై ఇక్కడకు వచ్చాను. బ్రాహ్మణుడు చేయదగినది ఏది? ముక్తి అనేది దేనితో పొందవచ్చును? తెలియజెప్పు'మని జనకుడిని అడుగగా, జనకుడు విశిష్టమైన ఆదరంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మ ప్రకారము: (సం. 12-313-9)

సీ. 'వినుఁ ముపనీతుఁడై విప్రుండు బ్రహ్మచ । ర్యంబు వేదాభ్యసనంబు నడపి
దారసంగ్రహము సంతానసంపాదనం । బును నధ్వరక్రియయును నొనర్చి
దేవపిత్రతిథిపూజా విధిపరుఁడగు । చుండి వనమునకు హుతవహప్ర
యుతముగఁ జని యందు నతిథులఁ గొనియాడి । వ్రతము గషాయపక్వత నొనర్పఁ

తే. నగ్నులాత్మయంద యారోపితములుగఁ । జేసి వీతరాగ చిత్తవృత్తిఁ
బరమశాంతిఁ బొంది బ్రహ్మాశ్రమపదంబుఁ । బొందువాఁడు లోకపూజ్యచరిత!' 272

ప్రతిపదార్థం: లోకపూజ్యచరిత!= లోకానికి పూజింపదగిన ప్రవర్తనకలవాడా! ఓ శుకమహర్షీ!; వినుము; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉపనీతుఁడై= ఉపనయనం చేసికొని; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్యాన్నీ; వేద+అభ్యసనంబున్= వేదాధ్యయనాన్నీ; నడపి= నిర్వర్తించి; దారసంగ్రహమున్= భార్యను పొందటం (వివాహంతో గృహస్థాశ్రమం స్వీకరించటం); సంతాన సంపాదనంబునున్= పుత్రపౌత్రాదికంగా సంతానం కలగటం; అధ్వరక్రియయునున్= యజ్ఞాలు చెయ్యటం అనేవాటిని; ఒనర్చి= నిర్వహించి; దేవ= దేవతలు; పిత్ర= పితృదేవతలు; అతిథి= అతిథులు - వీరిని; పూజా= అర్చించటమనే; విధి= కర్తవ్యంపట్ల; పరుఁడు= తత్పరుడు; అగుచుండి= అవుతూ (గృహస్థాశ్రమాన్ని) గడపి; హుతవహప్రయుతముగన్= అగ్నిహోత్రంతో సహా; వనమునకున్= అరణ్యానికి; చని= వెళ్ళి (వానప్రస్థం స్వీకరించి); అందున్= అక్కడ కూడా; అతిథులన్= అతిథులను; కొనియాడి= అర్చించి; వ్రతమున్= వానప్రస్థ దీక్షను; కషాయ పక్వతన్= కషాయం పరిపక్వతను పొందినట్లు ('కాషాయపక్వతన్' - అనే పాఠాంతరం ఉంది. 'వైరాగ్య పరిపక్వతలో' అని దాని అర్థం); ఒనర్పన్= నిర్వహించుటకై; అగ్నులు= అగ్నిహోత్రాలను; ఆత్మయందున్+అ= అంతరంగంలోనే; ఆరోపితములుగన్+చేసి= ఆరోపించి; వీతరాగచిత్తవృత్తిన్= తొలగిపోయిన రాగబంధంతో కూడిన మనఃప్రవృత్తితో (వైరాగ్య సంపన్నమైన మనస్సుతో అని); పరమశాంతిన్= గొప్ప ప్రశాంతిని; పొంది= అనుభవించి; బ్రహ్మ+ఆశ్రమపదంబున్= బ్రహ్మాశ్రమము అనబడే జ్ఞానమయ సన్న్యాసాశ్రమాన్ని; పొందువాఁడు= పొందుతాడు. (పొందేవాడు అవుతాడు).

తాత్పర్యం: లోకాలకు ఆరాధనీయమైన ప్రవర్తన కలవాడా! అడిగావు కనుక చెప్పుతున్నాను. ఆలకించుము. బ్రాహ్మణుడు ముందు ఉపనయనం చేసికొని, బ్రహ్మచర్యాశ్రమం స్వీకరించాలి. వేదాధ్యయనం చేయాలి. అటుపైని వివాహం చేసికొని గృహస్థాశ్రమంలోనికి ప్రవేశించాలి. పుత్రపౌత్రాదికంగా సంతానం పొందాలి. గృహస్థుడు చేయవలసిన యజ్ఞయాగాదులు చేయాలి. దేవపూజలూ, పితృపూజలూ, అతిథిపూజలూ తత్పరతతో నిర్వహించాలి. అటుపైని తన నిత్యాగ్నిహోత్రాలతో సహా అరణ్యానికి వెళ్ళి వానప్రస్థం స్వీకరించాలి. అక్కడకూడా అతిథిపూజలు జరపాలి. ఆ దీక్షలో కషాయసమపాకంగా పరిపక్వతను పొందటానికై అగ్నిహోత్రాలను ఆత్మలో నిక్షేపించుకొని, వైరాగ్యపూర్ణమైన మనఃప్రవృత్తితో పరమప్రశాంతిని పొంది, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలి. అటువంటి వాడే ఆ బ్రహ్మాశ్రమపదవికి అర్హుడు అవుతాడు'.

వ. అనిన విని యమ్మునివరుండు. 273

ప్రతిపదార్థం: అనినన్= జనకుడు ఇట్లా అనేసరికి; విని= ఆలకించి; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడైన శుకుడు.

తాత్పర్యం: దీనినంతా ఆ శుకుడు ఆలకించి. (ఇట్లా అంటున్నాడు).

క. 'జ్ఞానోదయమైయుండఁగ । మానక వెండియును నాశ్రమత్రయవాసుం
డై నిలిచి తక్రియానం । స్థానము గ్రమవృత్తి నడపుటయు వలయు నొకో? 274

ప్రతిపదార్థం: జ్ఞాన+ఉదయమై+ఉండఁగన్= తనంత తాను జ్ఞానోదయమై ఉన్నప్పటికీ; మానక= విడువకుండా; వెండియును= మళ్ళీ; ఆశ్రమత్రయవాసుండై= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం అనే ఈ మూడు ఆశ్రమాలలోనూ నివసించినవాడై; నిలిచి= ఉండి; తద్= ఆయా ఆశ్రమాలకు చెప్పిన; క్రియా= విధులయొక్క; అనుష్ఠానమున్= ఆచరణను; క్రమవృత్తిన్= యథాక్రమంగా (క్రమప్రక్రియగా); నడపుటయున్= నిర్వహించటంకూడా; వలయున్+ఒకో?= అవసరమంటావా?

తాత్పర్యం: జ్ఞానోదయమై ఉండగా విడువకుండా మళ్ళీ మూడు ఆశ్రమాల్లోనూ ఉండి ఆయా ఆశ్రమాల విధులను యథాప్రకారంగా నడపడం అవసరమా!

తే. జ్ఞానవిజ్ఞాన దృష్టి శాశ్వతిక తత్త్వఁ। డయ్యెనేనియు విడువరా దాశ్రమముల
క్రమ సమారూఢి యనునె వేదములు? దీనిఁ। దెలియఁజెప్పవె మోక్షవిత్తిలకజన్మ .' 275

ప్రతిపదార్థం: మోక్షవిత్= ముక్తివేత్తలయందు; తిలక= శ్రేష్ఠమైన; జన్మ!= పుట్టుక కలవాడా! - జనకమహారాజా!; జ్ఞాన= జ్ఞానమూ; విజ్ఞాన= వివేకమూ అనేవాటితో కూడిన; దృష్టిన్= దర్శనంతో; శాశ్వతిక తత్త్వఁడు= శాశ్వతమైన పరమాత్మ తత్త్వం తెలిసికొన్నవాడు; అయ్యెన్+ఏనియున్= అయినప్పటికీ; వేదములు= వేదాలు; ఆశ్రమముల= బ్రహ్మచర్యాది ఆశ్రమాల; క్రమసమారూఢి= క్రమ నివాసాన్ని; విడువన్+రాదు= వదలటానికి వీలు లేదు; అనునె?= అంటున్నాయా?; దీనిన్= ఈ విషయాన్ని; తెలియన్= నాకు తెలిసేట్టు; చెప్పవె?= చెప్పవా?

తాత్పర్యం: "మోక్షవేత్తలయందు శ్రేష్ఠమైనజన్మకలవాడా! జ్ఞానము వివేకమూ కలిగి శాశ్వతమైన పరమాత్మతత్వాన్ని తెలుసుకొన్నాకుండా(బ్రహ్మచర్యాలు) ఆశ్రమాలన్నింట క్రమంగా నివసించడం విడువరాదని వేదాలంటాయా? దీనిని తెలియజేప్పుము".

వ. అనవుడు నతం డతని కిట్లనియె. 276

ప్రతిపదార్థం: అనవుడున్= అని శుకుడు అనేసరికి; అతండు= ఆ జనకుడు; అతనికిన్= శుకుడికి; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని శుకుడు అనగా జనకుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

తే జ్ఞానవిజ్ఞానములు మోక్షసాధనములు। గురుని యుపదేశమున నవి దొరకొనంగ
వాన మోక్షంబు గాంచినవాఁడు విడుచు। నయ్యుపాయద్వయమ్మును నతులబుద్ధి. 277

ప్రతిపదార్థం: జ్ఞానవిజ్ఞానములు= విద్యావివేకాలు; మోక్షసాధనములు= మోక్షానికి ఉపకరణాలు; గురుని= గురువుయొక్క; ఉపదేశమునన్= ఉపదేశంతో; అవి; దొరకొనంగన్= లభిస్తే; వానన్= వాటితో; మోక్షంబు= ముక్తి; కాంచినవాఁడు= పొందినవాడు; అతులబుద్ధిన్= సాటిలేని ధీశక్తితో; ఆ+ఉపాయద్వయమ్మును= ఆ రెండు ఉపాయాలనూ; విడుచున్= విడిచిపెట్టేస్తాడు.

తాత్పర్యం: మోక్షసాధనాలైన జ్ఞానవిజ్ఞానాలను సద్గురుడి ఉపదేశం వలన పొంది వాటితో ముక్తి సంపాదించినవాడు కట్టకడపటికి తన బుద్ధిపటిమతో ఆ రెండుసాధనాలనూ కూడా వదిలివేస్తాడు. (అతులబుద్ధి అనే సమాసాన్ని బహువ్రీహిగా శుకుడికి సంబోధనకూడా చేయవచ్చును.)

క. లోకోచ్ఛేదముఁ గర్మ। వ్యాకులతయుఁగాక యుండవలయుటకై సు
శ్లోకా! చతురాశ్రమములు। గైకొని నడిపిరి దృఢంబుగాఁ బూర్వమునుల్. 278

ప్రతిపదార్థం: సుశ్లోకా!= పొగడదగినవాడా!; లోక+ఉచ్ఛేదమున్= లోక వినాశమూ; కర్మవ్యాకులతయున్= కర్మాచరణలోసాంకర్యమూ

(కలత); కాక= జరగకుండా; ఉండన్+వలయుటకై= ఉండటంకోసం; పూర్వమునుల్= మన పూర్వమహర్షులు; చతుర్+ఆశ్రమములు= నాలుగు ఆశ్రమాలు; కైకొని= స్వీకరించి; దృఢంబుగాన్= కట్టుదిట్టంగా; నడిపిరి= నడిపారు (సమాజాన్ని నడిపారు).

తాత్పర్యం: స్తుతింపదగినవాడా! లోకవినాశమూ, కర్మసాంకర్యమూ జరగకుండా ఉండటంకొరకే బ్రహ్మచర్యాది ఆశ్రమాలను నాల్గింటిని ఏర్పాటుచేసి మన పూర్వమహర్షులు ఆ ఆశ్రమధర్మాలను దృఢంగా నడిపారు, నడిపించారు.

తే. అందుఁ దుదముట్ట నడచిన నందవచ్చు । ముక్తి బహుజన్మ సంసిద్ధమోక్షకార
ణముల శుద్ధుఁడై ప్రథమాశ్రమమునయంద । కాంచు మోక్ష మెందేని నొక్కరుఁడు మునిప! 279

ప్రతిపదార్థం: మునిప!= మునీశ్వర!; అందున్= ఆశ్రమచతుష్టయమార్గంలో; తుదముట్టన్= కట్టకడపటిదాకా; నడచినన్= నడిచినట్లయితే; ముక్తిన్= మోక్షాన్ని; అందవచ్చున్= పొందవచ్చు; ఎందేనిన్= ఎక్కడయినా (అరుదుగా); ఒక్కరుఁడు= ఒక వ్యక్తి; బహుజన్మ= పూర్వానేక జన్మలలో; సంసిద్ధ= లభించిన; మోక్షకారణములన్= మోక్షసాధనాలతో; శుద్ధుఁడై= శుద్ధి పొందినవాడై; ప్రథమ+ఆశ్రమున+అందున్+అ= మొదటిదైన బ్రహ్మచర్యాశ్రమంలోనే; మోక్షమున్= ముక్తిని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: మునీశ్వరా! ఈ ఆశ్రమాల వరుసలో ప్రయాణం చేసేవాడు కట్టకడపటిదాకా యథావిధిగా నడిస్తే ముక్తి పొందుతాడు. అట్లాకాక అరుదుగా ఎక్కడైనా ఒక వ్యక్తికి పూర్వజన్మల సంస్కారం వలన ముక్తిహేతువులు సిద్ధిస్తే అతడు ఈ జన్మలో ప్రథమాశ్రమంలోనే - బ్రహ్మచర్యాశ్రమంలోనే - ముక్తిని కైవసం చేసికొంటాడు. అట్లా జరుగవచ్చును.

క. వానికి మూఁడాశ్రమముల । లో నిలువఁ బ్రయోజనంబులుం గలవె? తమోz
ధీనతను రజఃపరత । న్మానవలయుఁ గాక? సత్త్వనైష్ఠికమతియై. 280

ప్రతిపదార్థం: సత్త్వనైష్ఠికమతియై= సత్త్వనిష్ఠకుదురుకొన్న మతికలవాడై; తమః+అధీనతను= తమోగుణానికి లొంగిపోవటం; రజఃపరతన్= రజోగుణానికి పరతంత్రు కావటం అనేవాటిని; మానవలయున్+కాక= విడిచిపెట్టాలే తప్ప; వానికిన్= అటువంటి అరుదైన వ్యక్తికి; మూఁడు+ఆశ్రమములలోన్= బ్రహ్మచర్యాదికమైన మొదటిమూడు ఆశ్రమాలలోనూ; నిలువన్= ఉండటంవలన; ప్రయోజనంబులున్+కలవె?= ఉపయోగాలు ఏమయినా ఉన్నాయా? (లేవు అని భావం.)

తాత్పర్యం: పూర్వజన్మల సంస్కారాలవలన మోక్షహేతులు ఈ జన్మలో సిద్ధించిన అరుదైన వ్యక్తి మొదటి మూడు ఆశ్రమాలలోనూ వరుసగా కాలం గడపవలసిన అవసరం ఏమీ లేదు. అట్లా గడపినందువలన ప్రత్యేక ప్రయోజనమూ లేదు. కాకపోతే అతడు తమోగుణానికీ రజోగుణానికీ లొంగిపోకుండా సత్త్వగుణనిష్ఠ కలిగినవాడై ఉండాలి. అంతే.

తే. సత్త్వమార్గాభిరతి యాత్మతత్త్వదర్శ । నంబు గావింపఁ దనుఁ దాన నరుఁడు గాంచు
విశ్వమునఁ దానుఁ దనయందు విశ్వమును వ । సించుటయుఁ జూచుచును ముక్తిఁ జెందియుండు.281

ప్రతిపదార్థం: సత్త్వ= సత్త్వగుణసంపన్నమైన; మార్గ= విధానంలో; అభిరతి= ఆసక్తి అనేది; ఆత్మతత్త్వ= ఆత్మతత్త్వానికి సంబంధించిన; దర్శనంబు= దర్శనాన్ని (ఆత్మసాక్షాత్కారాన్ని); కావింపన్= కలిగిస్తే; నరుఁడు= సాధకుడు; తనున్= తనను; తాను+అ= తానే; కాంచున్= దర్శిస్తాడు; విశ్వమునన్= ప్రపంచంలో; తానున్= తానూ; తనయందున్= తనలో; విశ్వమును= ప్రపంచం; వసించుటయున్= ఉండటం అనేదాన్ని కూడా; చూచుచును= దర్శిస్తూ; ముక్తిన్= విముక్తిని; చెందియుండున్= పొందుతాడు.=

తాత్పర్యం: నరుడు సాత్త్వికప్రవృత్తివలన ఆత్మతత్త్వాన్ని తెలిసికొంటాడు. దానివలన తనను తాను దర్శించగలుగుతాడు. ఆత్మజ్ఞుడు అవుతాడు. అప్పుడు విశ్వంలో తననూ, తనలో విశ్వాన్నీ చూడగలుగుతాడు. రాగద్వేషాది బంధాలనుంచి విముక్తి పొందిన స్థితితో జీవిస్తూ ఉంటాడు.

వ. ఇవ్విషయంబున యయాతి వాక్యంబులు గల వాకర్ణింపుము. 282

ప్రతిపదార్థం: ఈ+విషయంబునన్= ఈ అంశంలో; యయాతి వాక్యంబులు= యయాతి చెప్పిన మాటలు; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఈ విషయమై యయాతి చెప్పిన మాటలను వినుము.

ఆ. జ్యోతి యాత్మయంద యున్నది కాన శ । క్యము సమాహితాత్ముఁడైన మునికి
నొరులవలనఁ దనకు నొరులకుఁ దన దెస । భయము లేకయున్నఁ బరముఁ గాంచు. 283

ప్రతిపదార్థం: జ్యోతి= తేజస్సు (పరమాత్మ); ఆత్మయందున్+అ= నరుడి ఆత్మలోనే; ఉన్నది= ఉంది; సమాహిత+ఆత్ముఁడు+ఐన= ఏకాగ్రచిత్తం కలవాడైన; మునికిన్= జ్ఞానికి; కానన్= ఆ జ్యోతిని దర్శించటం; శక్యము= సాధ్యమే; ఒరులవలనన్= ఇతరులవలన; తనకున్= తనకూ; ఒరులకున్= ఇతర జీవులకూ; తనదెసన్= తనవలనా; భయము= భీతి అనేది; లేక+ఉన్నన్= లేకపోయినట్లయితే (నిర్భయస్థితిలో); పరమున్= పరమాత్మను; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: జ్యోతిస్స్వరూపమైన పరతత్త్వం ప్రతివ్యక్తికీ ఆత్మలోనే ఉంటుంది. ఏకాగ్రత సాధించిన మునీశ్వరుడు ఆ జ్యోతిని తనలో తాను దర్శించగలుగుతాడు. ఇతరులవలన తనకూ, తనవలన ఇతరులకూ ఏ విధమైన భయమూ లేని నిర్భయస్థితి అలవడినప్పుడు పరమాత్మను సాధకుడు చూడగలుగుతాడు.

క. కోరికయు నొల్లమియు లే । కే రూపున భూతములకు నెగ్గు తెఱఁగుం
జేరక యకామవృత్తిఁ ద । పోరతి నున్నతఁడు బ్రహ్మముం బ్రాపించున్. 284

ప్రతిపదార్థం: కోరికయున్= ఒకటి కావాలి అనుకోవటంగానీ; ఒల్లమియున్= ఒకటి వద్దు అనుకోవటంగానీ; లేక= లేకుండా; ఏ రూపునన్= ఏ రకంగానూ; భూతములకున్= ప్రాణికోటికి; ఎగ్గు+అగు+తెఱఁగున్= అపకారం చేసే పద్ధతిని; చేరక= చేరకుండా; అకామవృత్తిన్= నిష్కామప్రవర్తనతో (కోరికలు లేని జీవనవిధానంతో); తపోరతిన్= తపస్సు పట్ల గాఢమైన ఆసక్తితో; ఉన్న+అతఁడు= ఉన్న వ్యక్తి; బ్రహ్మమున్= పరమాత్మను (పరబ్రహ్మను); ప్రాపించున్= పొందుతాడు (బ్రహ్మసాక్షాత్కారం అతడికి అవుతుంది).

తాత్పర్యం: రాగమూ, ద్వేషమూ అనేవి లేకుండా ఏ ప్రాణికీ అపకారం చెయ్యకుండా సర్వభూతహితుడై, నిష్కామంగా తపస్సు చేసికొనే సాధకుడు పరబ్రహ్మను పొందగలుగుతాడు.

క. వినఁ జూడం బడు నం దె । ల్లను సమతం బరముఁ గనుచు లౌల్యనిరసనం
బున సుఖదుఃఖాదిద్వం । ద్వనిరూఢుఁడు గాక యున్నతఁడు ముక్తిఁ గనున్. 285

ప్రతిపదార్థం: వినన్+పడునందెల్లనున్= వినబడే అన్నింటిలోనూ; చూడన్+పడునందున్+ఎల్లనున్= కనపడే అన్నింటిలోనూ; సమతన్= సమదృష్టితో; పరమున్= పరమాత్మను; కనుచున్= దర్శిస్తూ; లౌల్య= లోలత్వంయొక్క; నిరసనంబునన్= పరిత్యాగంతో (లోలుడు కాకుండా); సుఖదుఃఖాది= సుఖదుఃఖాలూ - రాగద్వేషాలూ మొదలైన; ద్వంద్వ= జంటలలో; నిరూఢుఁడు+కాక= తగుల్కొనవాడు కాకుండా; ఉన్న+అతఁడు= జీవించగలిగిన వ్యక్తి; ముక్తిన్= విముక్తిని (మోక్షాన్ని); కనున్= పొందుతాడు.

తాత్పర్యం: వినబడే, కనబడే సర్వవిషయాలలోనూ సమదృష్టితో పరమాత్మనే చూడగలిగి, దేనిలోనూ లోలుడు కాకుండా, రాగద్వేష సుఖదుఃఖాదికమైన ద్వంద్వాలకు అతీతంగా, జీవితం గడపగలిగినవాడు తప్పకుండా ముక్తి పొందుతాడు.

క. ఇనుమును గనకము నిందయు । వినుతియు సమములుగఁ గొనుచు వివిధాంగకముల్
దనలోన నడఁచు కమఠము । ననువున నింద్రియము లడఁచునతఁడు గను శివున్.' 286

ప్రతిపదార్థం: ఇనుమును= ఇనుమునూ; కనకమున్= బంగారాన్నీ; నిందయున్= నిందనూ; వినుతియున్= స్తుతినీ; సమములుగన్= సమానంగా; కొనుచున్= పరిగణించి పరిగ్రహిస్తూ; వివిధ+అంగకముల్= అన్ని అవయవాలనూ; తనలోనన్= తన డిప్పలోనే; అడఁచు= ముడుచుకొనే; కమఠము (యొక్క)+అనువునన్= తాబేలు చందంగా; ఇంద్రియములు= తన ఇంద్రియాలను; అడఁచు+అతఁడు= నిగ్రహించేవాడు; శివున్= పరమాత్మను; కనున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: ఇనుమునూ, బంగారాన్నీ సమానంగా చూడగలగాలి. పొగడ్తనూ, తెగడ్తనూ ఒక్కలాగే స్వీకరించగలగాలి. తాబేలు తన కాళ్ళూ, చేతులూ, తలా మొదలైన అన్ని అవయవాలనూ సాచి మళ్ళీ డిప్పలోకి ఉపసంహరించు కొంటున్నట్లుగా- లేదా - సంకోచపరచుకొంటున్నట్లుగా సాధకుడు సర్వేంద్రియాలను నిగ్రహించుకొనగలగాలి. అటు వంటి వ్యక్తి మాత్రమే శివుడిని దర్శించగలుగుతాడు.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి. 287

ప్రతిపదార్థం: అని= యయాతి వాక్యాలుగా వీటిని; చెప్పి= జనకుడు వినిపించి-

తాత్పర్యం: అని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అవ్విశేషంబు లెల్ల నీయందుఁ గలుగు । టనఘ! భవదీయ జనకదయాసమృద్ధి
సిద్ధ దివ్యబోధంబునఁ జేసి తోఁచె । నవ్విధముకంటె నీ చంద మధికతరము. 288

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా!; ఆ+విశేషంబులు+ఎల్లన్= పైని చెప్పిన ఆ విశేషాలు అన్నీ; నీయందున్= నీలో; కలుగుట= ఉండటం; భవదీయ= నీయొక్క; జనక= తండ్రియైన వ్యాసుని; దయాసమృద్ధి= పుష్కలమైన కృపచేత; సిద్ధ= సిద్ధించిన; దివ్యబోధంబునన్+చేసి= దివ్యజ్ఞానం చేత; తోఁచెన్= జరిగినది; ఆ+విధముకంటెన్= ఆ సాత్త్విక పద్ధతికన్నా; నీ చందము= నీ విధం; అధికతరము= మిక్కిలి గొప్పది.

తాత్పర్యం: పవిత్రుడా! పైని చెప్పిన సాత్త్వికపద్ధతులన్నీ నీలో ఉన్నాయి. అది మీ తండ్రిగారి దయావిశేషంవలన నీకు లభించిన జ్ఞానంతో సిద్ధించింది. నిజం చెప్పాలంటే నీ పద్ధతి అంతకన్నా గొప్పది.

క. నీ వట్టిఁడ వగు టెఱుఁగవు । భావంబున సంశయమును భయమును బాల్యం
బావేశింపఁగఁ జేయ న । భావితనిశ్చయుఁడ వగుటఁ బరమమునీంద్రా! 289

ప్రతిపదార్థం: పరమమునీంద్రా!= అత్యుత్తమ మహర్షీ!; బాల్యంబు= పిన్నవయస్సు అనేది; భావంబునన్= అంతరంగంలో;

సంశయమును= సంశయమూ; భయమును= భయమూ (వెరపూ) అనేవాటిని; ఆవేశింపఁగన్+చేయన్= ఎక్కువగా కలిగి స్తున్నందువలన; అభావితనిశ్చయుఁడవు= నిశ్చయం లేనివాడవు; అగుటన్= కావటంచేత; నీవు; అట్టిఁడవు= అంతటివాడవు (అటువంటి గొప్పవాడవు); అగుటన్= కావటం; ఎఱుఁగవు= గుర్తించలేకపోతున్నావు.

తాత్పర్యం: ఓ ఉత్తమోత్తమ మునీశ్వరా! నిజానికి నీవు మీ తండ్రి అంతటివాడవే. కానీ నీ బాల్యమనేది నీ మనస్సులో కొంత సంశయాన్నీ, కొంత భయాన్నీ ఆవేశింపజేస్తున్నది. దానితో నీ వొక నిశ్చయానికి రాలేక నిన్ను నీవు అంతటి వాడుగా గుర్తించలేకపోతున్నావు. అంతే సుమా!

విశేషం: బాల్యం సంశయభయాలను ఆవేశింపజేస్తున్నది అన్నట్టుగా అన్వయిస్తున్నది ఈ పద్యం. కానీ మూలంలో బాల్యం కూడా ఒక హేతువుగా కనపడుతున్నది. **"బాల్యాద్వా సంశయాద్వాపి భయాద్వాప్యవిమోక్షజాత్ । ఉత్పన్నే చాపి విజ్ఞానే నాధిగచ్ఛతి తాం గతిమ్॥" (12-313-45)**

క. జ్ఞానము విజ్ఞానము నీ । మానిత గుణము లగు నవి సమగ్రములైనం
గానేరదు మోక్షపదము । గానుపు - దృఢనిశ్చయుండు గాకున్నేనిన్. 290

ప్రతిపదార్థం: జ్ఞానము= జ్ఞానమూ; విజ్ఞానము= విజ్ఞానమూ; నీ= నీయొక్క; మానితగుణములు+అగున్= గొప్ప గుణాలు అయ్యాయి - నిజమే; అవి= ఆ రెండూ; సమగ్రములు+ఐనన్= పరిపూర్ణాలు అయినా; దృఢనిశ్చయుండు= దృఢమైన నిశ్చయం కలవాడవు; కాకున్న+ఏనిన్= కానట్లయితే; మోక్షపదము+కానుపు= మోక్షపదం యొక్క దర్శనం; కానేరదు= జరగబోదు.

తాత్పర్యం: శుకమహర్షీ! జ్ఞానం, విజ్ఞానం అనేవి నీ గొప్ప గుణాలు అనటం నిజమే. అవి ఎంత సమగ్రంగా నీలో ఉన్నా నీవు బాల్యం వలన కలిగే సంశయభయాలను విడిచిపెట్టి దృఢనిశ్చయానికి రాకపోతే ముక్తిపదవీదర్శనం జరుగదు సుమా!

తే. ఒక్క కొఱతయు లేదు నీ వుదితమోక్ష । బోధుఁడవు సంశయములెల్లఁ బోవవిడిచి
నిశ్చయింపుము నీ కన్న నెలవు శాశ్వ । తంపు నెలవుగ విషయావికంపితాత్మ!' 291

ప్రతిపదార్థం: విషయ= నృత్యగీత సౌందర్యాదులూ ద్వంద్వాలూ మొదలైన విషయాలకు; అవికంపిత= చలించని; ఆత్మ!= అంతరంగం కలవాడా!; ఒక్క కొఱతయున్= ఒక్కటంటే ఒక్క లోటుకూడా; లేదు= నీలో లేదు; నీవు; ఉదిత= సిద్ధించిన; మోక్షబోధుఁడవు= మోక్షజ్ఞానం కలవాడవు; సంశయములు+ఎల్లన్= సందేహాలన్నీ; పోవన్+విడిచి= పారద్రోలి; నీ+కన్న+నెలవు= నీవు దర్శించిన చోటు; శాశ్వతంపు+నెలవుగన్= శాశ్వతస్థానంగా; నిశ్చయింపుము.

తాత్పర్యం: నిశ్చలమైన మనస్సు కలవాడా! నీకు ఏ లోటూ లేదు. నీవు మోక్షజ్ఞానివి. సంశయాలు అన్నీ విడిచిపెట్టుము. నీవు దర్శించిన చోటునే ఈ శాశ్వతనివాసంగా నిశ్చయించుకొమ్ము.

విశేషం: ఇక్కడ మూలభారతంలో శుకుడిని ప్రశంసించే శ్లోకాలు మూడు ఉన్నాయి. 'మహర్షీ! నీకు సుఖదుఃఖాలకు తేడా లేదు. దేనికీ లోలుడవు కావు. నృత్తగీతాలపట్ల ఔత్సుక్యం లేదు. రాగమూ లేదు. బంధువులపట్ల అనుబంధం లేదు. భయమూ లేదు. మట్టినీ, బంగారాన్నీ సమానంగా చూడగలిగిన మహానుభావుడవు నీవు. అక్షయమూ, అనామయమూ అయిన మోక్షమార్గాన్ని పొందినవాడవుగా నిన్ను నేనూ తక్కిన ఈ మనీషులూ భావిస్తున్నాం. **"నాస్తి తే సుఖదుఃఖేషు విశేషో నాస్తి లోలుపా(?) నౌత్సుక్యం నృత్తగీతేషు న రాగ ఉపజాయతే** (48). **న బంధుషు నిబంధస్తే న భయేష్వస్తి తే భయమ్ । పశ్యామి త్వాం మహాభాగ తుల్యలోష్టాశ్మకాంచనమ్ ॥** (49). **అహం చ త్వామనుపశ్యామి యే చాప్యన్యే మనీషిణః । ఆస్థితం పరమం మార్గమక్షయం**

తమనామయమ్॥" (50). ఈ మూడు శ్లోకాల సారాన్ని తిక్కన 'విషయాకంపితాత్మ!' అనే సంబుద్ధిలోనికి సంగ్రహించాడు.

శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట (సం. 12-314-2)

క. అని బోధించిన జనకు వ । చనములు విని శుకుఁడు విగతసంశయుఁడై శాం
తినిరూఢిఁ బరమసౌఖ్యం । బు నొంది తనుఁ దాన కనుచుఁ బోవుచునుండెన్. 292

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; బోధించిన= ఉపదేశించిన; జనకు= జనకమహారాజుగారి; వచనములు= పలుకులు; విని= ఆలకించి; శుకుఁడు= శుకమహర్షి; విగత= తొలగిపోయిన; సంశయుఁడై= సంశయాలు కలవాడై (సంశయాలు తొలగినవాడై); శాంతి= మనశ్శాంతియొక్క; నిరూఢిన్= స్థిరసంప్రాప్తితో; పరమసౌఖ్యంబున్= గొప్ప సౌఖ్యాన్ని; ఒంది= పొంది; తనున్= తనను; తాను+అ= తానే; కనుచున్= దర్శిస్తూ; పోవుచున్+ఉండెన్= ప్రయాణం సాగిస్తున్నాడు.

తాత్పర్యం: జనకుడి ఉపదేశంతో శుకుడి సంశయాలు తీరిపోయాయి. శాంతీ సౌఖ్యమూ గాఢంగా లభించాయి. అంతర్దర్శనం ఏర్పడింది. ప్రయాణం అయ్యాడు.

తే. మారుతముతో సమానధర్మత్వమొంది । యతఁ డుదఙ్ముఖుడై నిఖిలామరులును
మునులు గరుడగంధర్వాదులును గుతూహ । లమున వసియించు శిశిరశైలమున కరిగె. 293

ప్రతిపదార్థం: మారుతముతోన్= వాయువుతో; సమానధర్మత్వము= సమానమైన లక్షణాన్ని; ఒంది= పొంది; అతఁడు= ఆ శుకుడు; ఉదక్+ముఖుడు+ఐ= ఉత్తరదిక్కుకు అభిముఖుడై; నిఖిల+అమరులును= సమస్తదేవతలూ; మునులున్= మునులూ; గరుడగంధర్వ+ఆదులును= గరుత్మంతుడూ, గంధర్వులూ మొదలైన దివ్యజాతులవారూ; కుతూహలమునన్= ఉత్సుకతతో; వసియించు= నివసించే; శిశిరశైలమునకున్= చలిమలకు (హిమవత్పర్వతానికి); అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శుకుడు ఉత్తరదిశగా బయలుదేరాడు. వాయువేగంతో ఆకాశమార్గాన సాగిపోయాడు. సకలదేవతలూ, మునులూ గరుడగంధర్వాదులూ ముచ్చటపడి నివసించే హిమశైలానికి వెళ్ళాడు.

సీ. కురువంశముఖ్య! యగ్గిరి పుణ్యవిభవస । మేతంబు వినుమమ్మహీధరమునఁ
బరమేశ్వరుండు దపం బేకపాదస్థుఁ । డై బహువర్షంబు లాచరించెఁ,
బుత్రలాభార్థిత్వమునఁ గృష్ణుఁ డుత్కృష్ట । నియమాచరణములు నిష్ఠ సలిపె,
షణ్ముఖుం డాత్మీయశక్తి ప్రభావంబుఁ । దెలిపి దేవాధికతేజుఁ డయ్యె,

తే. మఱియుఁ బెక్కండ్రు మునులు నమర్త్యులును సు । చరితములఁ బెంపునొంది, రా శైల మా వృ
షాంకునకుఁ గూఁతునిచ్చె, యాగాంగయోని । యగుట నజుఁడు దదాత్మత్వమర్థిఁబొందె. 294

ప్రతిపదార్థం: కురువంశముఖ్య!= కురువంశంలో ప్రధానుడవైన ఓ ధర్మరాజా!; ఆ+గిరి= ఆ హిమవత్పర్వతం; పుణ్యవిభవ= పుణ్యవైభవంతో; సమేతంబు= కూడుకొన్నది; వినుము; ఆ+మహీధరమునన్= ఆ పర్వతంమీద; పరమేశ్వరుండు= శివుడు; ఏకపాదస్థుఁడై= ఒంటికాలిమీద నిలిచి; తపంబు= తపస్సు; బహువర్షంబులు= చాలా సంవత్సరాలు; ఆచరించెన్= చేశాడు; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; పుత్రలాభ+అర్థిత్వమునన్= తనకు కొడుకు పుట్టాలి అనే కోరికతో; ఉత్కృష్ట= శ్రేష్ఠమైన; నియమ= తపోనియమాల; ఆచరణములు= ఆచరణాలను (నియమాలను ఆచరించటాలు); నిష్ఠన్= దీక్షతో (నిష్ఠతో); సలిపెన్= జరిపాడు; షట్+ముఖుండు= ఆరు ముఖాలుగల కుమారస్వామి; ఆత్మీయ= తనయొక్క; శక్తి= శక్తి అనే ఆయుధం తాలూకు; ప్రభావంబున్= మహిమను; తెలిపి= ప్రకటించి; దేవ+అధిక= దేవతలందరిలోకీ అధికమైన; తేజుఁడు= పరాక్రమం కలవాడు; అయ్యెన్= అయ్యాడు-

సకలదేవతలలోకీ అధికతేజస్వి అయ్యాడు; మఱియున్= ఇంకా; పెక్కండ్రు= పలువురు; మునులు= ఋషులూ; అమర్త్యులును= దేవతలూ; సుచరితములన్= మంచి చరిత్రలతో - తపోనియమాల ఆచరణలతో; పెంపున్+ఒందిరి= ప్రసిద్ధి పొందారు (అతిశయించారు); ఆ+శైలము= ఆ హిమవత్పర్వతం; వృష+అంకునకున్= వృష(భ) వాహనుడైన శివుడికి; కూఁతున్+ఇచ్చెన్= కూతురునిచ్చి వివాహం చేశాడు; యాగ+అంగ+యోని= యజ్ఞయాగాలకు అవసరమైన వస్తువులకు (అంగాలకు) జన్మస్థలం; అగుటన్= అవ్వటంవలన; అజుఁడు= బ్రహ్మదేవుడు; తద్+ఆత్మత్వము= హిమవంతుడి హృదయస్థానాన్ని; అర్థిన్= కోరికతో; పొందెన్= పొందాడు; బ్రహ్మదేవుడే తానై కోరి హిమశైలాత్మ అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరమపవిత్రమూ, పుణ్యప్రదమూ అయిన ఆ హిమవత్పర్వతం గురించి చెప్పుతాను వినుము. పరమేశ్వరుడు ఒంటికాలిమీద నిలబడి వేల సంవత్సరాలు అక్కడ తపస్సు చేశాడు. కొడుకు పుట్టాలి - అనే కోరికతో విష్ణుమూర్తి (శ్రీకృష్ణుడు) కఠిన నియమాలతో తపస్సు చేసింది అక్కడే. షణ్ముఖుడు తన శక్త్యాయుధం మహిమను దేవతలకందరికీ ప్రదర్శించి అత్యధిక తేజస్వంతుడుగా నిరూపణ పొందిందీ అక్కడే. ఇంకా చాలామంది మునులూ, దేవతలూ తమ తమ తపోదీక్షలతో ప్రశస్తి పొందిందీ అక్కడే. ఆ శైలరాజే తన కూతురు పార్వతిని శివుడికి ఇచ్చి వివాహం చేశాడు. యజ్ఞావసర వస్తువుల కన్నింటికీ ఆ పర్వతం పుట్టిల్లు. అందుకని బ్రహ్మదేవుడు కోరి ఆ పర్వతాత్మ అయ్యాడు. (అంటే హిమవత్పర్వతం పరబ్రహ్మస్వరూపం అని. ఇంకా భీష్ముడు చెప్పుతున్నాడు.)

వ. అట్టి మహామహిమ గలుగు నా హిమవంతంబునకు మున్న వచ్చి సుమంతు వైశంపాయన జైమిని పైలనామధేయు లగు శిష్యులం గరుణావిధేయుండగు సాత్యవతేయుం డధ్యయనంబు సేయించుచుండం బుణ్యతమంబగు తదాశ్రమంబు భానుప్రభానిభంబగు నిజకాంతి విసరంబున వెలుంగ నయ్యారణేయుం డమ్ముని పాలికింజని తాను యోగబలంబున ననేకంబులైన గిరిసరిదరణ్యంబులు గడచి యెందునుం దగులువడక కార్ముకజ్యానిర్ముక్త శరంబుచందంబున నేతెంచుటకుం బ్రీతుండగు నప్పరాశరనందను పాదంబుల కభివందనంబు సేసిన నతం డభినందింప నాసన్నక్షమాసీనుండై జనకజననాథసంవాదవిధంబు విన్నవించి విశేషసమ్మదం బావహించె నిట్లరణిసుతు సమాగంబు నొంది. 295

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; మహామహిమ= గొప్ప మహత్తు; కలుగు= కలిగిన; ఆ హిమవంతంబునకున్= ఆ హిమవత్పర్వతానికి; మున్ను+అ+వచ్చి= ముందే చేరుకుని; సుమంతు= సుమంతుడూ; వైశంపాయన= వైశంపాయనుడూ; జైమిని; పైల= పైలుడూ అనే; నామధేయులు+అగు= పేర్లు కలవారైన; శిష్యులన్= శిష్యులను; కరుణావిధేయుండు+అగు= దయకు లొంగిపోయినవాడైన (దయాశీలి); సాత్యవతేయుండు= సత్యవతీదేవి కుమారుడు - వ్యాసుడు; అధ్యయనంబు= వేదాభ్యాసం; చేయించుచుండన్= చేయిస్తూ ఉండగా; పుణ్యతమంబు+అగు= అధికపుణ్యప్రదమైన; తద్+ఆశ్రమంబు= ఆ ఆశ్రమం; భానుప్రభా= సూర్యకాంతితో; నిభంబు+అగు= సాటివచ్చేదయిన; నిజ= తనయొక్క; కాంతివిసరంబునన్= తేజఃపుంజంతో; వెలుంగన్= ప్రకాశించగా; ఆ+ఆరణేయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; ఆ+ముని+పాలికిన్= ఆ వ్యాసమహర్షి సమీపానికి; చని= వెళ్ళి; తాను; యోగబలంబునన్= యోగశక్తితో; అనేకంబులు+ఐన= అసంఖ్యాకాలైన; గిరి= పర్వతాలూ; సరిత్= నదులూ; అరణ్యంబులు= అడవులూ; కడచి= దాటుకుంటూ; ఎందునున్= ఎక్కడా కూడా; తగులు+పడక= మనస్సు సంలగ్నంకాక; కార్ముక= ధనుస్సుయొక్క; జ్యా= అల్లెత్రాడునుంచి; నిర్ముక్త= విడువబడిన; శరంబు+చందంబునన్= బాణంవలె; ఏతెంచుటకున్= తిరిగివచ్చినందుకు; ప్రీతుండు+అగు= సంతోషించినవాడైన; ఆ+పరాశరనందను= ఆ వ్యాసునియొక్క; పాదంబులకున్= చరణాలకు; అభివందనంబు= నమస్కారం; చేసినన్= చేసేసరికి; అతండు= ఆ వ్యాసుడు; అభినందింపన్= మెచ్చుకోగా; ఆసన్న= సమీపమందలి; క్షమా= నేలమీద; ఆసీనుండై= కూర్చున్నవాడై; జనక జననాథ= జనకమహారాజుతో జరిగిన; సంవాద=

సంభాషణయొక్క; విధంబున్= పద్ధతిని; విన్నవించి= మనవిచేసి; విశేష= అత్యధికమైన; సమ్మదంబున్= సంతోషాన్ని; ఆవహించెన్= కలిగించాడు; ఇట్లు; అరణిసుతు= శుకమహర్షియొక్క; సమాగమంబున్= కలయికను; ఒంది= పొంది.

తాత్పర్యం: అటువంటి హిమాలయానికి శుకుడికంటే ముందే వ్యాసుడు చేరుకున్నాడు. సుమంతు వైశంపాయన జైమిని పైలులనే నలుగురు శిష్యులకు వేదం నేర్పుతున్నాడు. అటువంటి దయాశాలి నివసిస్తున్న ఆశ్రమం సూర్యకాంతితో ప్రకాశిస్తోంది. శుకుడు అక్కడికి చేరుకొన్నాడు. తాను యోగబలంతో నానాగిరినదీనదాలు దాటి ఎక్కడా చిక్కుపడక ధనుస్సునుండి వెలువడిన బాణంవలె తన పుత్రుడు తిరిగిరావటాన్ని వ్యాసుడు సంతోషించాడు. శుకుడు పాదాభివందనం చేసి చేరువలో నేలమీద కూర్చున్నాడు. జనకుడితో జరిపిన సంభాషణ అంతా విన్నవించాడు. వ్యాసుడికి పరమానందం అయింది.

విశేషం: అలం: ఉపమ.

క. అమ్మునియును శిష్యులతో । నమ్మహితాత్ము నునుచికొని యధ్యాపనశీ
లమ్మగు చిత్తముతోడ సు । ఖమ్ముండఁగ నొక్కనాఁడు గౌరవమొప్పన్. 296

ప్రతిపదార్థం: ఆ+మునియును= ఆ వ్యాసుడుకూడా; శిష్యులతోన్= తన నలుగురు ఛాత్రులతోనూ; ఆ+మహితాత్మున్= ఆ మహానుభావుడైన శుకుడిని; ఉనిచికొని= కలుపుకొని; అధ్యాపనశీలమ్ము+అగు= నిరంతరం చదువు చెప్పే స్వభావం కలదైన; చిత్తముతోడన్= హృదయంతో; సుఖమ్ము+ఉండఁగన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున; గౌరవము+ఒప్పన్= గౌరవం స్ఫురించేట్టు.

తాత్పర్యం: వ్యాసుడు ఆ శుకుడిని తన నలుగురు శిష్యులతోనూ కలిపి మొత్తం అయిదుమందికీ అధ్యాపనం చేస్తున్నాడు. వ్యాసుడు అనారతాధ్యాపన తత్పరుడు. అదే ఆయనకు ఆనందం. అట్లా సుఖంగా కాలం గడుస్తోంది. వ్యాసుడిని గౌరవంగా సేవించుకొనే శిష్యులంతా ఒకరోజున ఇట్లా అన్నారు: (తరువాతి వచనంతో అన్వయం).

వ. కొలిచియుండు సుమంతుప్రభృతులు నలువు రతనితో 'దేవా! శుకుండు మొదలుగాఁ గల యేమేవురము
వేదవిషయప్రఖ్యాతి నెల్లవారికంటె నెక్కుడు గావలయు, మమ్ముంబోలె నొడ్ల నాదరాధిక్యంబున భరంపడి
సవిశేషంబుగా నధ్యయనంబు సేయింపకుండుట మాకు వరం' బని విన్నవించిన వీత పక్షపాత చిత్తుండగు
నత్తాపసోత్తముండు. 297

ప్రతిపదార్థం: కొలిచియుండు= సేవిస్తూండే; సుమంతుప్రభృతులు= సుమంతుడూ మొదలైన; నలువురు= నలుగురూ; అతనితోన్= ఆ వ్యాసుడితో; దేవా!= గురుదేవా!; శుకుండు= శుకుడు; మొదలుగాన్= మొదటివాడుగా; కల= ఉన్న; ఏము+ఏవురమున్= మేము అయిదుగురమూ; వేదవిషయ= వేదాలు కారణంగా లభించే; ప్రఖ్యాతిన్= ప్రసిద్ధి విషయంలో; ఎల్లవారికంటెన్= అందరికన్నా; ఎక్కుడు= ఎక్కువ; కావలయున్= కావాలి; మమ్మున్+పోలెన్= మాలాగా; ఒడ్లను= ఇతరులను; ఆదర+ఆధిక్యంబునన్= అధికాదరంతో; భరంపడి= పూచీవహించి (బాధ్యత వహించి); సవిశేషంబుగాన్= అత్యధికంగా; అధ్యయనంబు+చేయింపక+ఉండుట= వేదాధ్యయనం చేయించక పోవటం (ఇతరులకు మాకంటే అధికంగా వేదాలు నేర్పకపోవటం); మాకున్= మాకు; వరంబు+అని= మంచిది అని (నీవు ఈయవలసిన వరం అని); విన్నవించినన్= మనవి చేసేసరికి; వీతపక్షపాత= పక్షపాతం లేని; చిత్తుండు+అగు= హృదయం కలవాడైన; ఆ+తాపస+ఉత్తముండు= ఆ ఋషీశ్వరుడు-

తాత్పర్యం: 'గురుదేవా! వేదాలవలన లభించే ప్రసిద్ధిలో మేము అయిదుగురమూ అందరికంటే ఎక్కువగా ఉండాలి.

మమ్మల్ని మించినవారు ఉండకూడదు. అంటే నీవు మరింకెవరికీ ఇంతకన్నా ఆదరంతో ఇంతకన్నా అధికంగా వేదాలు నేర్పకూడదు. ఈ వరం అనుగ్రహించు' మని శిష్యులు అభ్యర్థించేసరికి పక్షపాతరహితుడైన ఆ వ్యాసుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

తే. భక్తుఁడగు బ్రాహ్మణునకు వాఙ్మహ్మ మఖిల । మును బ్రియంబున నిచ్చు సజ్జనుని చేతి
లోనియది బ్రహ్మలోకంబు దీని మీర । లేర్పడఁగ నెన్నఁడును విని యెఱుఁగ రెట్లు! 298

ప్రతిపదార్థం: బ్రహ్మలోకంబు= బ్రహ్మలోకం; భక్తుఁడు+అగు= భక్తుడైన (ఆసక్తి కలవాడైన); బ్రాహ్మణునకున్= విప్రుడికి; వాక్+బ్రహ్మము= వాగ్రూపమైన (బ్రహ్మము) వేదాన్ని; అఖిలమున్= పూర్తిగా; ప్రియంబునన్= ప్రేమతో; ఇచ్చు= నేర్పేటువంటి; సజ్జనుని= సత్పురుషుడియొక్క; చేతిలోని+అది= చేతిలోది; దీనిన్= ఈ విషయాన్ని; మీరలు= మీరు; ఏర్పడఁగన్= స్పష్టపడేట్టు; ఎన్నఁడునున్= ఏనాడూ; విని+ఎఱుఁగరు+ఎట్లు!= విని ఎరగరా ఏమి! (విని ఉండలేదా!).

తాత్పర్యం: 'భక్తుడైన బ్రాహ్మణుడికి వేదమంతా ప్రేమతో నేర్పే సత్పురుషుడికి బ్రహ్మలోకమనేది అరచేతిలో వస్తువు. అతడు అంత అనాయాసంగా బ్రహ్మలోకం పొందుతాడు. దీన్ని మీరు ఎప్పుడూ ఎక్కడా విని ఉండలేదా! ఆశ్చర్యమేనే!

క. వినుఁ డెల్లవారు దుర్గం । బును గడచి శుభంబునొంది పురుషార్థములం
గనువార కాక యనియెడు । ననుగ్రహము వలదె? యిట్టులనఁ దగ వగునే? 299

ప్రతిపదార్థం: వినుఁడు= శిష్యులారా! వినండి; ఎల్లవారున్= చతుర్వర్ణాలవారు అందరూ; దుర్గంబును= కష్టాన్ని; కడచి= దాటి; శుభంబున్= మంచిని; ఒంది= పొంది; పురుష+అర్థములన్= ధర్మార్థకామ మోక్షాలను; కనువారు+అ+కాక!= పొందేవారే కదా!; అనియెడు= అనేటువంటి; అనుగ్రహము= అనుగ్రహం; వలదె?= ఉండవద్దా?; ఇట్టు= ఇలా; అనన్= అనటం; తగవు= న్యాయం; అగునే?= అవుతుందా? - ధర్మమేనా?

తాత్పర్యం: శిష్యులారా! ఆలకించండి. ప్రపంచంలో ప్రతివాడూ కష్టాలు గడచి శుభాలు పొందాలి, పురుషార్థాలను అనుభవించాలి - అనివారిపై అనుగ్రహం మనకు ఉండవద్దా! మీరు ఇట్లా స్వార్థంతో అడగటం సమంజసమా? అది ధర్మమా? చెప్పండి?

విశేషం: అందరూ కష్టాలను గట్టెక్కుదురుగాక! భద్రాలను పొందుదురుగాక! బ్రాహ్మణుడిని అగ్రభాగంలో కూర్చోబెట్టుకుని నాలుగువర్ణాలవారికీ వేదాలు వినిపింతురుగాక! - అని ఉంది మూలంలో. **"సర్వస్తరతు దుర్గాణి సర్వో భద్రాణి పశ్యతు । శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణమగ్రతః ॥" (12-314-45).**

చ. అనుటయు వార లొండొరుల యాననముల్ గనుఁగొంచు నవ్వి యి
ట్లని రటులేనిఁ బోదుమె దయాపర! శైలము డిగ్గి భూమి నెం
దును జరియించి యధ్యయన దోహలులం జదివించి యాజనం
బు నడపి నీ కృపారసము పొంగు నిగుడ్తుమె యెల్ల చోటులన్? 300

ప్రతిపదార్థం: అనుటయున్= వ్యాసుడు అలా అనేసరికి; వారలు= ఆ శిష్యులు నలుగురూ; ఒండొరుల+ఆననముల్= ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు; కనుఁగొంచున్= చూసుకుంటూ; నవ్వి= చిరునవ్వుల చిందించి; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు: దయాపర!= ఓ కృపాళూ!; శైలమున్= ఈ హిమవత్పర్వతాన్ని; డిగ్గి= దిగి; పోదుమె?= వెళ్ళమా?; భూమిన్= భూలోకంలో; ఎందున్= అంతటా; చరియించి= సంచారం సాగించి; అధ్యయనదోహలులన్= వేదాలు అధ్యయనం చేయాలి అనే ఉత్సాహమూ, కోరికా కలవారిని, చదివించి; యాజనంబున్= యజ్ఞాలు చెయ్యించటాన్ని; నడపి= నిర్వహించి; ఎల్లచోటులన్= అన్ని ప్రదేశాల్లోనూ; నీ= నీయొక్క;

కృపారసము+పొంగున్= దయామృతపు వెల్లువను; నిగుడ్తుమె?= ప్రవహింప చెయ్యమా?

తాత్పర్యం: వ్యాసుడి మాటలకు ఆ శిష్యులు నలుగురూ ముఖముఖాలు చూచుకొన్నారు. చిన్నగా నవ్వులు చిందించి ఇట్లా అన్నారు: ఓ దయాళూ! అయితే మరి మమ్మల్ని ఈ హిమాలయం దిగి భూమిమీదకు వెళ్ళుమంటారా? అక్కడ అంతటా సంచరిస్తూ, వేదాలు నేర్చుకొనాలి - అనే కోరిక కలవాళ్ళను గుర్తించి వాళ్ళకు నేర్పుమంటారా? యజ్ఞయాగాదులు చేయించమంటారా? మీ దయామృతం వెల్లువలను అంతటా ప్రవహింపజేయుమంటారా?

విశేషం: ఇక్కడ మూలంలో శిష్యులు పరమవైదికంగా మాట్లాడారు. 'మహామునీ! వేదాలను బహుశాఖలుగా విస్తరింపజేయాలి అనే కోరికతో మేమంతా ఇక్కడినుండి భూమికి దిగాలని కోరుకొంటున్నాం. సమ్మతమేనా?' అన్నారు. **'శైలాదస్మాన్మహీం గంతుం కాంక్షితం నో మహామునే, వేదా ననేకధా కర్తుం యది తే రుచిరం ప్రభో (4).** కృపారసము పొంగు నిగుడ్తుమె' అనే కవితామయోక్తి తిక్కన కల్పన.

చ. అనవుడు 'మున్న యిట్టు లన రైతిరి వోవఁగనీను మిమ్ము నెం
దును గడు వెడ్డువెట్టితిరి దోహల మిమ్మెయినుండ జాణలై
నను నిటు వేఱొకం డడిగి నా వచనంబులు మీ మనోరథం
బున కిటు సాధనంబులుగఁ బోకలఁ బోయితి' రంచు నవ్వుచున్. **301**

ప్రతిపదార్థం: అనవుడున్= అని శిష్యులు అడిగేసరికి - వ్యాసుడు ఇట్లా అంటున్నాడు; మున్ను+అ= ముందుగానే; ఇట్టులు= ఇట్లా; అనరు+ఐతిరి= మీరు అనకపోయారు; మిమ్మున్= మిమ్ములను; ఎందున్= ఎక్కడికీ; పోవఁగన్+ఈను= వెళ్ళనీయను; కడున్= బాగా; వెడ్డు+పెట్టితిరి= నన్ను మోసగించారు; దోహలము= మీ ఉత్సాహం; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఉండన్= ఉంటే (ఉండగా); జాణలై= చతురులై; ననున్= నన్ను; ఇటు= ఇట్లా; వేఱు+ఒకండు= మరొకటి; అడిగి= అభ్యర్థించి; నా+వచనంబులు= నా సమాధానవాక్యాలు; మీ+మనోరథంబునకున్= మీ కోరికకు; సాధనంబులుగన్= అనుకూలముగా ఉండేట్టు; పోకలన్+పోయితిరి= వేషాలు వేసారు; అంచున్= అంటూ; నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: శిష్యులు అట్లా అడిగేసరికి వ్యాసుడికి అసలు సంగతి అర్థమయింది. నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'శిష్యులారా! ముందుగానే మీరు ఇట్లా అడిగి ఉంటే బాగుండేది. అడుగలేదు. నన్ను మోసం చేశారు. మీ మనస్సులో కోరిక ఇట్లా భూమిమీదకు వెళ్ళాలి అని ఉంటే మరో విధంగా మాట్లాడి నా మాటలు మీ కోరికలకు అనుకూలంగా ఉండేటట్లు పన్నాగం పన్నారు. జాణతనం చూపించి వేషాలు వేశారు.' అంటూ నవ్వుతూ.

విశేషం: ఈ సరస సంభాషణ పూర్తిగా అమూలకం. తిక్కన కల్పన.

తే. తమ్ము సంప్రీతిఁ గనుఁగొను నమ్మునీంద్రు । చరణకమలంబులకుఁ జక్కఁ జాఁగి మ్రొక్కి
రన్నలువురును వారల నతఁడు దివిచి । కరుణ సిగురొత్త బిగియారఁ గౌఁగిలించి. **302**

ప్రతిపదార్థం: తమ్మున్= తమ నలుగురినీ; సంప్రీతిన్= ప్రేమతో; కనుఁగొను= తిలకిస్తున్న; ఆ+మునీంద్రు= ఆ వ్యాసమహర్షి యొక్క; చరణకమలంబులకున్= పాదపద్మాలకు; ఆ+నలువురును= ఆ నలుగురూ; చక్కన్= (వెంటనే) చక్కగా; చాఁగిమ్రొక్కిరి= సాష్టాంగ నమస్కారం చేశారు; వారలన్= ఆ నలుగురినీ; అతఁడు= ఆ వ్యాసుడు; తివిచి= లేవనెత్తి; కరుణ+చిగురు+ఒత్తన్=

దయ పల్లవింపగా; బిగియారన్= గట్టిగా; కొఁగిలించి= ఆలింగనం చేసుకొని.

తాత్పర్యం: ప్రేమ నిండిన కన్నులతో తమను వీక్షిస్తున్న ఆ వ్యాసుడికి నలుగురూ సాష్టాంగపడ్డారు. వారిని లేవనెత్తి ఆ మహర్షి దయ పల్లవించగా గట్టిగా కౌగిలించుకొన్నాడు. అటుపైని దీవించాడు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. దీవించి 'యెయ్యది సేసిన నప్రమాదాయత్త చిత్తులరై చేయుండు త్రిలోకంబు లందును మీకుం బ్రియంబైన చోటుల వర్తిల్లుం'డని వీడుకొలిపినఁ జని వార లధ్యాపనయాజన విశేషంబుల నశేషదేశంబులు నలంకరించుచుండి; రట్టియెడ. 303

ప్రతిపదార్థం: దీవించి= ఆశీర్వదించి; ఏ+అది+చేసినన్= ఏది చేసినా; అప్రమాద+ఆయత్త+చిత్తులరు+ఐ= పొరపాటుపడని మనస్సుకలవారై (జాగరూకులై); చేయుండు= చేయండి; త్రిలోకంబులందునున్= ముల్లోకాలలోనూ; మీకున్= మీకు; ప్రియంబైన చోటులన్= ఇష్టమైన (నచ్చిన) ప్రదేశాలలో; వర్తిల్లుండు= సంచరించండి; అని= అని చెప్పి; వీడుకొలిపినన్= వ్యాసుడు పంపిస్తే; చని= వెళ్ళి; వారలు= ఆ నలుగురూ; అధ్యాపన= వేదాలు చదివించటం; యాజన= యజ్ఞాలు చేయించటం అనే; విశేషంబులన్= విశేషకార్యక్రమాలతో; అశేషదేశంబులన్= అన్ని రాజ్యాలనూ (ప్రదేశాలనూ); అలంకరించుచుండిరి= శోభిల్లజేస్తున్నారు; అట్టియెడన్= అప్పుడు.

తాత్పర్యం: వ్యాసుడు ఆ శిష్యులను దీవించి, 'ఏది చేసినా, జాగరూకులై చెయ్యండి. ముల్లోకాలలోనూ, మీకు ఇష్టమైన ప్రదేశాలలో సంచరించండి' అని చెప్పి పంపగా వెళ్ళి ఆ నలుగురూ వేదాలు చదివించటం, యజ్ఞాలు చేయించటం వంటి కార్యక్రమాలతో అన్ని రాజ్యాలనూ శోభింపజేస్తున్నారు. అప్పుడు.

క. నారదుఁడు వచ్చి ప్రీతిం । బారాశర్యమునిఁ గాంచి 'బ్రహ్మనినాదం
బీ రున్నచోట లేమికిఁ । గారణమేమియొకొ?' యనుడు గారవమెసఁగన్. 304

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; వచ్చి= విచ్చేసి; ప్రీతిన్= ప్రియంగా; పారాశర్యమునిన్= పరాశరుడి సంతానమైన వ్యాసమునీంద్రుడిని; కాంచి= దర్శించి; ఈరు= మీరు; ఉన్నచోటన్= ఉన్నస్థలంలో; బ్రహ్మనినాదంబు= వేదధ్వని; లేమికిన్= లేకపోవటానికి; కారణము+ఏమియొకొ?= హేతువు ఏమిటిచెప్మా?; అనుడున్= అనటంతో; గారవము+ఎసఁగన్= గౌరవం స్ఫురించేట్టు.

తాత్పర్యం: శిష్యులు నలుగురూ వెళ్ళిపోయారు. తండ్రీకొడుకులు ఇద్దరే ఆశ్రమంలో ఉంటున్నారు. ఆ సమయంలో ఒకరోజున నారదమహర్షి వ్యాసాశ్రమానికి వచ్చాడు. వస్తూనే ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. 'మహర్షీ! మీరు ఉన్నచోట వేదధ్వనులు వినిపించకపోవటం ఏమిటి? వింతగా ఉందే? దీనికి కారణం ఏదయినా ఉన్నదా?' అని అడిగాడు. సగౌరవంగా వ్యాసుడు (బదులు పలికాడు).

క. అతఁ డతనితోడ 'శిష్య । ప్రతతి యిచట లేమి' యనుడు 'బ్రహ్మర్షివరా!
సుతుఁడును నీవైనను ద । ద్వ్రతంబు సెల్లించుచుండవలదే?' యనినన్. 305

ప్రతిపదార్థం: అతఁడు= ఆ వ్యాసుడు; అతనితోడన్= ఆ నారదుడితో; శిష్యప్రతతి= శిష్యబృందం; ఇచటన్= ఇక్కడ; లేమి= లేకపోవటమే(కారణం); అనుడున్= అనేసరికి; బ్రహ్మర్షివరా!= బ్రహ్మర్షులలో ఉత్తముడా! ఓ వ్యాసా!; సుతుఁడును= నీ కుమారుడూ; నీవు+ఐనను= నీవు అయినా; తద్+వ్రతంబు= ఆ వేదాధ్యయన వ్రతాన్ని; చెల్లించుచుండన్+వలదే= నిర్వహిస్తూ ఉండవద్దా? (దానికి అంతరాయం రాకూడదు కదా!); అనినన్= అనేటప్పటికి.

తాత్పర్యం: 'శిష్యబృందం ఇప్పుడు ఇక్కడ లేకపోవటమే వేదధ్వని వినిపించక పోవటానికి కారణం' అని వ్యాసుడు సగౌరవంగా బదులు పలికాడు. 'వేదాధ్యయనం నిరంతరంగా కొనసాగాలి కదా! అందుచేత నీవూ నీ కుమారుడూ అయినా ఆ వ్రతాన్ని కొనసాగించకపోయారా? అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'నీవును నైనను వ్రతమది సెల్లించుచుండవలదే?' - అని పాఠాంతరం ఉన్నది. 'నీవును నైనను' అనే సముచ్చయార్థకంలో అన్వయసౌలభ్యమూ వాక్యవిన్యాసంలో వ్యావహారికతా మరింత ఎక్కువగా ఉన్నాయి.

క. నారదుని వచనములుఁ బెం । పారం గొనియాడి భువనమంతయు నాదా
పూరితముఁ జేసె నమ్ముని । సారాధ్యయనమునఁ బుత్రసంయుక్తుండై. 306

ప్రతిపదార్థం: నారదుని= నారదుడియొక్క; వచనములున్= సూచనలనుకూడా; పెంపారన్= అతిశయించేట్టు; కొనియాడి= ప్రశంసించి; ఆ+ముని= ఆ వ్యాసుడు; పుత్రసంయుక్తుండై= పుత్రుడితో కలిసినవాడై; సార+అధ్యయనమునన్= సారభూతమైన వేదాధ్యయనంతో; భువనము+అంతయున్= లోకమంతటినీ; నాద= వేదధ్వనితో; ఆపూరితమున్= నిండిపోయిన దానినిగా; చేసెన్= చేసివేశాడు.

తాత్పర్యం: నారదుడినీ అతడి సూచననూ వ్యాసుడు ఎంతగానో ప్రశంసించాడు. తన పుత్రుడితో కలిసి ఉత్తమోత్తమమైన వేదాధ్యయనం తత్క్షణమే ప్రారంభించి ముల్లోకాలనూ వేదధ్వనితో నింపివేశాడు.

వ. ఇట్లయ్యిరువురు నధ్యయనంబు సేయ మహావాయువు బెట్టు వీచిన నవిశేషజ్ఞుండు పుత్రుతో ననధ్యయన సమయం బగుట సెప్పి తదధ్యయనంబు వారించి తానును నూరకున్న నయ్యారణీయుండు 'నియ్యత్యధికమారుతం బెక్కడిది?' యని యడిగిన నఖిల భూతవేదియగు వేదవ్యాసుండు దేవయానంబున విష్ణుండును పితృయానంబున భానుండును నూర్ధ్వోగమన పర్యాయరూపంబునం బ్రవర్తిల్లుదు రది పవనాలంబనకలితంబై చెల్లుఁ బవనుల వినుము సెప్పెద సమానుండు ధైవతసంఘసంభవుం డతనికి నుదానుండును నుదానునికి వ్యానుండును వ్యానునికి నపానుండును నపానునికిఁ బ్రాణుండును జనియించిరి. జగంబులు వీరిచేత సంవ్యాప్తంబులైయుండుం బ్రవహుం డావహుం డుద్వహుండు సంవహుండు వివహుండు పవహుండు పరాహుం డనం బవనులు సప్తసంఖ్యు లదితిపుత్రు లఖిల భువనవ్యాప్తులై చరియింతురు. వారు సమానాదిపవనపంచక మహితాత్ములు. వారలవలన వర్షంబులకుం బ్రవర్తన నివర్తనంబులు గలుగుచుండు. వివిధధైవత విమానంబులకును మహితయానం బావహిల్లు నొక్కొక్కనాఁడు విష్ణుని నిశ్వాసవేగంబు. 307

ప్రతిపదార్థం: ఇట్లు; ఆ+ఇరువురున్= ఆ తండ్రీకొడుకు లిద్దరూ; అధ్యయనంబు+చేయన్= వేదాధ్యయనం చేస్తుంటే; మహా వాయువు= పెద్దగాలి; బెట్టువీచినన్= భయంకరంగా వీచేసరికి; ఆ+విశేషజ్ఞుండు= విశేషజ్ఞానం కలిగిన ఆ వ్యాసుడు; పుత్రుతోన్= కుమారుడితో; అనధ్యయన సమయంబు= అది వేదాధ్యయనం చెయ్యకూడని సమయం; అగుట= కావటాన్ని; చెప్పి= తెలియపరిచి; తద్= అతడి; అధ్యయనంబు= వేదాధ్యయనం; వారించి= నిలుపుదల చేయించి; తానునున్= తాను కూడా; ఊరక+ఉన్నన్= ఆపివేసి ఉండగా; ఆ+ఆరణీయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; ఈ+అత్యధిక మారుతంబు= ఈ మహావాయువు; ఎక్కడిది?= ఎక్కడినుంచి వీస్తున్నది; అని; అడిగినన్= అడిగితే; అఖిలభూతవేది+అగు= పంచభూతాలనూ ఎరిగినవాడైన; వేదవ్యాసుండు= ఆ వేదవ్యాసుడు; దేవయానంబునన్= దేవతావిమానంలో; విష్ణుండును= విష్ణుమూర్తి; పితృయానంబునన్= పితృదేవతలు ప్రయాణించే విమానంలో; భానుండును= సూర్యుడూ; ఊర్ధ్వ+అధః+గమన+పర్యాయరూపంబునన్= పైకీ కిందికీ ఒకరి తరువాత ఒకరుగా; ప్రవర్తిల్లుదురు= ప్రయాణం చేస్తారు; అది= ఆ ప్రయాణం; పవన+ఆలంబన+కలితంబై= వాయువే

ఆధారంగా కలదై; చెల్లున్= జరుగుతుంది; పవనులన్= వాయువులనుగురించి; చెప్పెదన్= వివరిస్తాను; వినుము; సమానుండు= సమానుడు అనే పేరుగల వాయువు; దైవతసంఘ సంభవుండు= దేవతల జాతిలో (సమూహంలో) జన్మించాడు; అతనికిన్= ఆ సమానుడికి; ఉదానుండును= ఉదానుడనే వాయువూ; ఉదానునికిన్= ఆ ఉదానుడికి; వ్యానుండును= వ్యానుడు అనే వాయువూ; వ్యానునికిన్= ఆ వ్యానుడికి; అపానుండును= అపానుడు అనే వాయువూ; అపానునికిన్= ఆ అపానుడికి; ప్రాణుండును= ప్రాణుడు అనే వాయువూ; జనియించిరి= జన్మించారు; జగంబులు= లోకాలన్నీ; వీరిచేతన్= ఈ వాయుదేవతలచేత; సంవ్యాప్తంబులై= నిండినవై; ఉండున్= ఉంటాయి; ప్రవహుండు= ప్రవహుడూ; ఆవహుండు= ఆవహుడూ; ఉద్వహుండు= ఉద్వహుడూ; సంవహుండు= సంవహుడూ; వివహుండు= వివహుడూ; పవకుండు= పవకుడూ; పరాహుండు= పరాహుడూ; అనన్= అనే పేర్లతో; అదితిపుత్రులు= అదితికుమారులైన; పవనులు= వాయుదేవతలు; సప్తసంఖ్యులు= ఏడుగురు; అఖిలభువనవ్యాప్తులై= అన్ని లోకాలకూ వ్యాపించినవారై; చరియింతురు= సంచరిస్తూ ఉంటారు; వారు= ఆ ఏడుగురూ; సమాన+ఆది= సమానుడూ మొదలైన; పవనపంచక= అయిదుగురు పవనులతో; మహిత+ఆత్ములు= కలిసిన మహానుభావులు; వారలవలనన్= వారివల్లనే; వర్షంబులకున్= వానలకు; ప్రవర్తన+నివర్తనంబులు= ప్రవృత్తి - నివృత్తులు; కలుగుచుండున్= కలుగుతూ ఉంటాయి; వివిధ= పలురకాలైన; దైవతవిమానంబులకున్= దేవవిమానాలకు; మహితయానంబు= వేగవంతమైన కదలిక; ఆవహిల్లున్= సంభవిస్తుంది; ఒక్కొక్కనాఁడు= ఎప్పుడైనా ఒక్కొక్కరోజున; విష్ణుని= విష్ణుమూర్తియొక్క; నిశ్శ్వాసవేగంబు= నిట్టూర్పు వాయువుల వేగం. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఈ విధంగా ఆ ఇద్దరూ వేదాధ్యయనం చేస్తుంటే భయంకరంగా పెద్దగాలివీచింది. వ్యాసుడు ఆనాడు అనధ్యయనదినంగా ప్రకటించాడు. శుకుడు 'ఈ పెనుగాలి ఎక్కడినుండి వీస్తున్నది?' అని అడిగాడు. విశ్వభూత జ్ఞానంగల వ్యాసుడు దానికి కారణం చెప్పాడు. 'దేవతావిమానంలో విష్ణుమూర్తీ, పితృదేవతల విమానంలో సూర్యుడూ క్రిందికీ మీదికీ ప్రయాణం చేయటం వలన ఈ పెనుగాలి ఏర్పడింది. ఆ వాయువులను గురించి వివరిస్తాను. వినుము. సమానుడు అనే వాయువు దేవతలగణంలో పుట్టాడు. సమానుడికి ఉదానుడూ, ఉదానుడికి వ్యానుడూ, ఆ వ్యానుడికి అపానుడూ, అపానుడికి ప్రాణుడూ పుట్టారు. లోకాలన్నీ ఈ వాయువులతో నిండి ఉన్నాయి. ప్రవహుడూ, ఆవహుడూ, ఉద్వహుడూ, సంవహుడూ, వివహుడూ, పవహుడూ, పరాహుడూ అనే పేర్లతో అదితిపుత్రులైన వాయుదేవతలు ఏడుగురు లోకాలన్నీ వ్యాపించి తిరుగుతూ ఉంటారు. ఈ ఏడుగురూ సమానాది పంచవాయువులతో కలిసి ఉండే గొప్పవారు. వారివలననే వానలు కురవటం, కురవకపోవటం కలుగుతూ ఉంటాయి. వివిధ దేవవిమానాలకు వేగవంతమైన కదలికలు కలిగితే, ఒక్కొక్కనాడు విష్ణుదేవుడి నిట్టూర్పు గాలుల వేగం (తరువాతి పద్యంతో అన్వయం).

క. అప్పవనములను గలఁచిన । నిప్పరుసగు వికృతవాయు విది దీని రయం
బిప్పుడు మహనీయంబగు । నిప్పర్వతమునుఁ జలింప నెసకం బెసఁగెన్. 308

ప్రతిపదార్థం: ఆ+పవనములను= ఆ సప్తవాయువులనూ; కలఁచినన్= కలచివేస్తే; ఈ+పరుసు+అగు= ఈ విధంగా జరుగుతుంది; వికృతవాయువు+ఇది= పిచ్చిగాలి ఇది; దీని= ఈ వెర్రిగాలియొక్క; రయంబు= వేగం; ఇప్పుడు; మహనీయంబు+అగున్=పరమపవిత్రమైన; ఈ+పర్వతమునున్= ఈ హిమవత్పర్వతం కూడా; చలింపన్= కదలిపోయేట్టు; ఎసకంబు+ఎసఁగెన్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: విష్ణుమూర్తులవారి నిట్టూర్పు గాలుల వేగం సప్తపవనాలనూ కలచి వేస్తే అప్పుడు ఇటువంటి వెర్రిగాలి ఆవిర్భవిస్తుంది. ఈ హిమాలయాన్ని కూడా కదలించేస్తుందా అన్నంతగా ఉంటుంది దీని అతిశయం.

తే. ఇట్టియప్పుడు సదివిన నెల్లభంగి । నెడరువుట్టుఁ గావునఁ జదు వుడుగవలసె'
ననియెఁ బదపడి ప్రకృతిస్థమయ్యెఁ బవన । మఖిల భూతంబులకు సౌఖ్య మావహిల్లె. 309

ప్రతిపదార్థం: ఇట్టి+అప్పుడు= ఇటువంటప్పుడు; చదివినన్= వేదాధ్యయనం చేస్తే; ఎల్లభంగిన్= అన్నివిధాలా; ఎడరు+పుట్టున్= కీడు సంభవిస్తుంది; కావునన్= కాబట్టి; చదువు= అధ్యయనం; ఉడుగన్+వలసెన్= ఆపివెయ్యవలసి వచ్చింది; అనియెన్= అని వ్యాసుడు; చెప్పాడు పదపడి= క్రమంగా (కొంతసేపటికి); పవనము= ఆ వికృతవాయువు; ప్రకృతిస్థము+అయ్యెన్= సహజస్థితికి వచ్చింది; అఖిల= సమస్తమైన; భూతములకున్= ప్రాణులకూ; సౌఖ్యము+ఆవహిల్లెన్= సౌఖ్యం కలిగింది.

తాత్పర్యం: నాయనా! ఇటువంటి సమయంలో వేదాధ్యయనం చేస్తే అది అన్నివిధాలా కీడు కలిగిస్తుంది. అందుకని చదువు ఆపవలసి వచ్చింది' అని వ్యాసుడు వివరించాడు. అటుపైని క్రమంగా సుడిగాలి సద్దు మణిగింది. ప్రాణికోటి అంతా హమ్మయ్య అనుకొన్నది, సుఖపడింది.

వ. స్నానకాలం బయ్యెనని పలికి పుత్రునకు 'నీవు చదువుచుండు' మని చెప్పి యప్పారాశర్యుం డాకాశగంగా ప్రపాతప్రదేశంబునకుం జనియె నయ్యారణీయుండును నారదుం డాకర్ణింపఁ గొంతసే పధ్యయనంబుసేసిన నద్దేవముని మెచ్చి యతనితో 'నీకు మేలొనర్చెద నిష్టంబు సెప్పు' మనిన నతం 'డీలోకంబునం బుట్టినవానికి హితం బెయ్యది దానిం జెప్పవే?' యనుటయు నమ్మహాత్ముండు దొల్లి సంయములకు సనత్కుమారుండు సెప్పిన వాక్యంబు లేతత్ప్రయోజనంబు లయియుండు వానిం జెప్పెద వినుమని యిట్లనియె. 310

ప్రతిపదార్థం: స్నానకాలంబు= స్నానానికి వేళ; అయ్యెన్+అని= అయింది అని; పలికి= అంటూ; నీవు; చదువుచుండుము= వేదపాఠం కానిస్తూండుము; అని; పుత్రునకున్= శుకునికి; చెప్పి= ఆజ్ఞాపించి; ఆ+పారాశర్యుండు= పరాశరుడి కుమారుడైన ఆ వ్యాసుడు; ఆకాశగంగా= ఆకాశగంగయొక్క; ప్రపాత= జలపాతాలు ఉన్న; ప్రదేశంబులకున్= ప్రాంతాలకు; చనియెన్= వెళ్ళాడు; ఆ+ఆరణీయుండును= ఆ శుకమహర్షి; నారదుండు; ఆకర్ణింపన్= వింటూండగా; కొంతసేపు= కొంచెంసేపు; అధ్యయనంబు= వేదపఠనం; చేసినన్= చేసేసరికి; ఆ+దేవమునిని= దేవముని అయిన ఆ నారదుడు; మెచ్చి= మెచ్చుకొని; అతనితోన్= ఆ శుకుడితో; నీకున్= నీకు; మేలు+ఒనర్చెదన్= మేలు చేస్తాను; ఇష్టంబు= నీకు ఇష్టమైనది ఏమిటో; చెప్పుము; అనినన్= అంటే; అతండు= ఆ శుకుడు; ఈ లోకంబునన్= ఈ లోకంలో; పుట్టినవానికిన్= జన్మించిన వ్యక్తికి; హితంబు= హితమైనది; ఎయ్యది= ఏది?; దానిన్= అటువంటి దాన్ని గురించి; చెప్పవే?= వివరించవా?; అనుటయున్= అనటమూ; ఆ+మహాత్ముండు= మహానుభావుడైన ఆ నారదుడు; తొల్లి= పూర్వకాలంలో; సంయములకున్= మునీశ్వరులకు; సనత్కుమారుండు= సనత్కుమారుడు అనే మహర్షి; చెప్పిన= వివరించినటువంటి; వాక్యంబులు= మాటలు; ఏతద్+ప్రయోజనంబులు= ఇదే ప్రయోజనంగా కలవి; అయి+ఉండున్= అవుతాయి నీవు అడిగిన ప్రయోజనానికి సరిపోతాయి; అని; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: ఇక నాకు స్నానానికి వేళ అయింది' అని వ్యాసుడు లేచి, ఆకాశగంగా జలపాతా లున్న చోటికి వెళ్ళిపోయాడు. శుకుడు నారదుడు వింటూండగా కొంతసేపు వేదపఠనం చేశాడు. దానికి మెచ్చి నారదుడు 'నీ కేమి కావాలో కోరుకొమ్ము' అని అడుగగా 'మానవుడికి హితమైనదానిని తెలియజెప్పు' మని శుకుడు అడిగాడు. దానికి నారదుడు 'మునుపు సనత్కుమారుడనే ఋషి కొందరు మునులకు ఇదే విషయాన్ని వివరించాడు. ఇదే ప్రయోజనంకొరకు ఆ వివరాలను విశదీకరిస్తాను' అంటూ నారదుడు మొదలుపెట్టాడు.

నారదుఁడు శుకున కుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-316-5)

తే. తపము సత్యంబ, కన్ను విద్యయ, సుఖంబు । విడుప, దుఃఖంబు రాగంబ, వినుఁడు నరుఁడు
ముక్తి కుత్సహింపక భవసక్తుఁ డైన । నొండు పుట్టువునం దది యొందరాదు. 311

ప్రతిపదార్థం: సత్యంబు+అ= సత్యమే; తపము= తపస్సు; విద్యయ= విద్యయే (జ్ఞానమే); కన్ను= నేత్రం; విడుపు+అ= త్యాగం చెయ్యటమే; సుఖంబు= సుఖం; రాగంబు+అ= అనురాగమే; దుఃఖంబు= దుఃఖం; వినుఁడు= మహర్షులారా! ఆలకించండి; నరుఁడు= జీవుడు; ముక్తికిన్= మోక్షానికి; ఉత్సహింపక= ఉత్సాహం చూపకుండా; భవసక్తుఁడు+ఐనన్= సంసారంలో తగుల్కొన్న వాడైతే; ఒండు పుట్టువునందున్= మరొకజన్మలో; అది= ఆ ముక్తి; ఒందన్+రాదు= పొందటం సాధ్యం కాదు.

తాత్పర్యం: సత్యమే తపస్సు. జ్ఞానమే కన్ను. త్యాగమే సుఖం. రాగమే దుఃఖం. మునులారా! వినండి. నరుడుమోక్షానికి ప్రయత్నించకుండా సంసార బంధాలలో తగుల్కొన్నట్లయితే మరొక జన్మలోకూడా ఆ ముక్తి సాధ్యం కాదు.

విశేషం: దీనికి మూలమైన సంస్కృతశ్లోకం చతురస్రంగా ధారణయోగ్యంగా క్లుప్తంగా ఉన్నది. **"నాస్తి విద్యాసమం చక్షుः నాస్తి విద్యాసమం తపः । నాస్తి రాగసమం దుःఖం నాస్తి త్యాగసమం సుఖమ్॥" (12-316-6)**

క. ఆరయఁ గామముఁ గ్రోధము । వైరులు ముక్తి కవి రెండు వారించిన సం
సార మనాకారం బగు । నేరిమి యొండేల ముక్తి నెలవు గనుటకున్? 312

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించి చూసినట్టయితే; కామమున్= కామమూ; క్రోధమున్= క్రోధమూ; ముక్తికిన్= మోక్షానికి; వైరులు= శత్రువులు; అవి రెండున్= ఆ రెండింటినీ; వారించినన్= అడ్డుకోగలిగినట్టయితే; సంసారము= భవము అనేది; అనాకారంబు+అగున్= ఆకారరహితం అయిపోతుంది - సంసారం తన ఉనికిని కోల్పోతుంది; ముక్తి నెలవు= మోక్షపదాన్ని; కనుటకున్= పొందటానికి; నేరిమి= నేర్పు; ఒండు= ఇంతకన్నా మరొకటి; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: కామక్రోధాలే ముక్తికి శత్రువులు. ఆ రెండింటినీ జయించి పారద్రోలినట్లయితే మానవుడికి సంసారమనేది రూపరహితం అయిపోతుంది. ముక్తి పదం పొందటానికి ఇంతకన్నా మరొక నేర్పరితనం ఎవరికిమాత్రం ఎందుకు?

తే. అపరిగ్రహ సర్వారం । భ పరిత్యాగములు గలుగు పండితునకు దుः
ఖపుఁ దెరువు వాటిలదు మో । క్షపదము సొప్పడి తదాత్మక సుఖం బొందున్. 313

ప్రతిపదార్థం: అపరిగ్రహ= ఏ దానాన్నీ స్వీకరించటకపోవటం; సర్వ= సమస్తవిధాలైన; ఆరంభ= ప్రయత్న - క్రియాప్రారంభాల; పరిత్యాగములు= త్యాగం (విడవటం) అనేవి రెండూ; కలుగు= ఉన్నటువంటి; పండితునకున్= జ్ఞానికి; దుఃఖపున్ తెరువు= దుఃఖమార్గం అనేది; పాటిలదు= సంభవించదు; మోక్షపదము= ముక్తిస్థానం; చొప్పడి= లభించి; తదాత్మక= తాదాత్మ్యరూపమైన; సుఖంబున్= సౌఖ్యాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అపరిగ్రహం - సర్వారంభపరిత్యాగం అనేవి రెండూ ఉన్న జ్ఞానికి అసలు దుఃఖమనేదే ఉండదు. మోక్షపదాన్ని తాదాత్మ్యంతో పొందటం, సుఖపడటం - అనేవి అతడికి సిద్ధిస్తాయి.

క. భూతంబుల దర్శింపమి । భూతాస్పర్శనము భూతములయెడ సంభా
షా తరలత నొందమి సూ । రే తెరువు విమోక్ష సుఖగరిష్ఠత వడయన్. 314

ప్రతిపదార్థం: భూతంబులన్= ప్రాణికోటిని; దర్శింపమి= చూడకపోవటం; భూత= ప్రాణికోటియొక్క; అస్పర్శనము= తాకకపోవటం (వాటిని); భూతములయెడన్= ప్రాణులతో; సంభాషాతరలతన్= సంభాషించాలి అనే ఉబలాటాన్ని; ఒందమి= పొందకపోవటం అనే ఇవి; విమోక్ష= విముక్తికి సంబంధించిన; సుఖ= సుఖంయొక్క; గరిష్ఠతన్= ఆధిక్యాన్ని; పడయన్= పొందటానికి; తెరువు= మార్గం; చూరే= చూడండి. (తెలుసుకోండి సుమా!)

తాత్పర్యం: మహర్షులారా! ప్రాణికోటిని దర్శించకుండా, స్పృశించకుండా, సంభాషించకుండా నిగ్రహంతో దూరంగా ఉండటమే విముక్తికి మార్గం. దయచేసి గుర్తించండి.

విశేషం: చూరె - చూరే అనేవి అన్వయాలు. ప్రసిద్ధినీ ఆభిముఖ్యాన్నీ తెలియజేస్తాయి. **"అదర్శనమసంస్పర్శః తథాఽసంభాషణం సదా। యస్య భూతైస్సహ మునే స శ్రేయో విందతే పరమ్॥"** [1](12-316-17)

ఆ. ' హింసలేక యునికి యింద్రియ జయము నై! । రాశ్య మచపలత్వ మను గుణములు
నాల్గుఁ గలుగునట్టి నరునకుఁ గరతలా । మలక మంతరాత్మ మహిమ యెల్ల. 315

ప్రతిపదార్థం: హింసలేక+ఉనికి= హింసాప్రవృత్తి లేకపోవటం; ఇంద్రియజయము= ఇంద్రియనిగ్రహమూ; నైరాశ్యము= ఆశారహితత్వమూ; అచపలత్వము= చాపల్యం లేకపోవటమూ; అను= అనే; గుణములు= సద్గుణాలు; నాల్గున్= నాలుగూ; కలుగునట్టి= ఉన్నటువంటి; నరునకున్= జీవుడికి; అంతరాత్మ మహిమ ఎల్లన్= అంతరాత్మయొక్క గొప్పతనం అంతా; కరతల+ఆమలకము= అరచేతిలోని ఉసిరికపండు;

తాత్పర్యం: అహింస, ఇంద్రియనిగ్రహం, నైరాశ్యం, అచపలత్వం అనే ఉత్తమగుణాలు నాలుగూ ఉన్న వాడికి అంతరాత్మ తత్త్వం తేటతెల్లమవుతుంది. అరచేతిలో ఉసిరికపండంత సులభంగా అనుభవంలోకి వస్తుంది.

విశేషం: 'నైరాగ్యము' అనే సంశోధిత ముద్రణపాఠంలో యతిభంగం. నిర్+ఆశా... 'నైరాశ్యము' - ఇది వావిళ్ళవారి పాఠం. 'నైరాగ్య' అయినా 'నైరాశ్య అను' అయినా, రెండవ పాదంలోని మొదటి అక్షరం 'రా' కదా! 'రా'కు 'మ'కు యతి ఉంటే ఉన్నట్లు - లేకపోతే రెండు పాఠాలలోనూ లేనట్లే కదా! గమనించగలరు.

క. ' అమ్మునిపతి వాక్యముల వి । ధమ్మిది దీనం బ్రగాఢ తత్పరతం జి
త్తమ్మున నిడి తెలిసినడవు । మిమ్మెయి సమకూరు నీకు నిహపర సుఖముల్.' 316

ప్రతిపదార్థం: ఆ+మునిపతి= మునీశ్వరుడైన ఆ సనత్కుమారుడు చెప్పిన; వాక్యముల= మాటలయొక్క; విధమ్ము+ఇది= పద్ధతి ఇది - ఇట్లా ఉన్నది; దీనిన్= ఈ విధాన్ని; ప్రగాఢతత్పరతన్= ప్రగాఢమైన ఆసక్తితో; చిత్తమ్మునన్= మనస్సులో; ఇడి= పెట్టుకుని; తెలిసి నడవుము= ఎరుకతో సంచరించుము (ప్రవర్తించుము); ఇహపరసుఖముల్= ఇహానికీ పరానికీ చెందిన సుఖాలు; ఈ+మెయిన్= ఇట్లా (ఇకనుండి); నీకున్= నీకు; సమకూరున్= వాటంతట అవి లభిస్తాయి.

తాత్పర్యం: సనత్కుమారుడు ఆ మహర్షులకు చెప్పిన మాటల సారాంశం ఇది. దీన్ని నిజమైన ఆసక్తితో మనసులో పెట్టుకొని తెలిసి నడిచావంటే ఇహపరసుఖాలు వాటంతట అవి నీకు సమకూరుతాయి.'

వ. అని చెప్పి వెండియు. 317

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పి= నారదుడు చెప్పి; వెండియున్= తిరిగి ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా నారదుడు చెప్పి ఇంకా.

ఆ. ' పుత్రదార బంధుమిత్ర సక్తుఁడు రొంపిఁ । బడిన గజము నట్ల యెడరునొందు
భోగజాలపరుఁడు వాగురాజాలసం । పతిత మృగరుషముల భంగిఁ దలరు. 318

ప్రతిపదార్థం: పుత్ర= సంతానమూ; దార= కళత్రమూ; మిత్ర= నెచ్చెలులూ - వీరిపట్ల; సక్తుఁడు= వ్యామోహితుడైనవాడు; రొంపిన్+పడిన= ఊబిలో కూరుకుపోయిన; గజము+అట్లు+అ= ఏనుగువలెనే; ఎడరున్+ఒందున్= దుఃఖాన్ని పొందుతాడు; భోగ=

సుఖాల; జాల= సమూహంలో; పరుఁడు= ఆసక్తుడైన వ్యక్తి (భోగసమూహంలో లాలసుడైనవాడు); వాగురా= వలల; జాల= సమూహంలో; సంపతిత= చిక్కుకొన్న; మృగ= లేడి; ఋషముల= చేపల; భంగిన్= పోలికగా; తలరున్= దుఃఖిస్తాడు.

తాత్పర్యం: 'శుకమహర్షీ! పుత్రికాపుత్రులు, భార్యలూ, బంధువులూ, మిత్రులూ - వీరిపట్ల వ్యామోహితుడైనవాడు ఊబిలో దిగిన ఏనుగువలె హింస పడతాడు. భోగలాలసుడు వలలో చిక్కుకొన్న మృగంవలె చేపవలె గిలగిలలాడతాడు.

విశేషం: పుత్రులు అంటే కేవలం మగబిడ్డలే కా నవసరం లేదు. 'పుత్రాశ్చ పుత్ర్యశ్చ - పుత్రాః' అని ఏకశేషసమాసం. 'పుమాన్ స్త్రియా' - అని పాణినీయసూత్రం). పుత్రికలూ, పుత్రులూ కలిపి పుత్రులు అనవచ్చును. పుత్రదార బంధుమిత్ర- అన్నచోట పుత్రికా పుత్రరూపమైన సంతానం అంతా - అని అర్థం. మిత్రపదంకూడా అట్లాగే ఏకశేషసమాసం అనుకుంటే స్నేహితురాండ్రూ స్నేహితులూ ఇద్దరూ వస్తారు. నెచ్చెలి అనేది స్త్రీ పురుషులకు సమానం.

వ. ధర్మాధర్మంబులును సత్యాసత్యంబులును దొఱంగవలయుఁ దొఱంగుటెట్లు సొప్పడు నంటేని. 319

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మంబులును= ధర్మాధర్మాలూ; సత్య+అసత్యంబులును= సత్యాసత్యాలూ; తొఱంగన్+వలయున్= విడిచిపెట్టెయ్యాలి; తొఱంగుట= ఆ విడవటం; ఎట్లు= ఎలా; చొప్పడున్= సాధ్యమవుతుంది; అంటి(వి)+ఏనిన్= అన్నావనుకో.

తాత్పర్యం: ధర్మాధర్మాలను, సత్యాసత్యాలను విడనాడాలి. అ దెట్లా సాధ్యమంటే.

సీ. వినుమధర్మం బహింసనమున నెడలు ధ । ర్మంబు సంకల్పవర్జనముచేత
నవ్యాప్తిఁ బొందు సత్యాసత్యములు బుద్ధిఁ । గొని త్రోవనగు' నని మునివరుండు
మఱియును జెప్పు 'నాత్మవిభావనంబున । బుద్ధివిలీనతఁబొందు శోక
భయహేతువులు నిచ్చఁ బదివేలు వాటిల్లుఁ । బండితుం డందుఁ బొందండు భూత

తే. ములును నింద్రియములు నొక్క ప్రోవు గట్టి । యున్న వీనికి వగఁ బొందు టూరివారి
కొలయు నెడరుల కెల్లఁ దా నుమ్మలికము । గట్టికొని కుందునట్టులు గాదె? వత్స!' 320

ప్రతిపదార్థం: వినుము= శుకమహర్షీ! ఆలకించుము; అధర్మంబు= అధర్మము అనేది; అహింసనమునన్= అహింసవలన; ఎడలున్= తొలగిపోతుంది; ధర్మంబు= ధర్మమనేది; సంకల్ప= సంకల్పాల యొక్క; వర్జనముచేతన్= విడుమరతో (సంకల్పరాహిత్యంతో); అవ్యాప్తిన్+పొందున్= వ్యాప్తిని కోల్పోతుంది; సత్య+అసత్యములు= సత్యాసత్యాలు అనేవాటిని; బుద్ధిన్+కొని= బుద్ధియొక్క సహకారం స్వీకరించి; త్రోవన్+అగున్= పారద్రోలవచ్చును; అని; మునివరుండు= నారదుడు; మఱియునున్= ఇంకా; చెప్పున్= ఉపదేశిస్తున్నాడు; బుద్ధి= ఈ బుద్ధి అనేది; ఆత్మవిభావనంబునన్= ఆత్మసందర్శనంలో; విలీనతన్+పొందున్= లీనమైపోతుంది; శోకభయహేతువులు= శోకకారణాలూ, భయహేతువులూ అనేవి; నిచ్చన్= ఎల్లప్పుడూ; పదివేలు= అసంఖ్యాకంగా; వాటిల్లున్= ఏర్పడుతూనే ఉంటాయి; పండితుండు= జ్ఞాని; అందున్= వాటిలో; పొందండు= సంలగ్నుడు కాడు; వత్స!= నాయనా!; భూతములును= పంచభూతాలూ; ఇంద్రియములును= పది ఇంద్రియాలూ; ఒక్కప్రోవుగట్టి= ఒక పోగులాగా (మూట) చర్మంతో కట్టి; ఉన్నన్= ఉండగా; వీనికిన్= ఈ శరీరాలకోసమని; వగన్= దుఃఖాన్ని; పొందుట= పొందటం; ఊరివారికిన్= ఊళ్ళో జనానికి; ఒలయు= వచ్చే; ఎడరులకున్= క్లేశాలకూ, కీడులకూ; ఎల్లన్= అన్నింటికీ; తాను; ఉమ్మలికము+కట్టికొని= దిగులు పెట్టుకొని; కుందునట్టులు+కాదె!= బాధపడినట్లు కాదా!

తాత్పర్యం: అహింసను అలవాటు చేసికొనటంతో అధర్మాన్ని విడిచిపెట్టవచ్చును. సంకల్పాలను పరిత్యజించటంతో ధర్మాన్ని వదిలించుకొనవచ్చును. బుద్ధిబలంతో సత్యాసత్యాలను తొలగించుకొనవచ్చును. శుకా! ఆలకించుము.

ఆత్మజ్ఞానంతో బుద్ధినీ వికసింపజేసికొనవచ్చును. శోకహేతువులూ, భయహేతువులూ నిత్యజీవితంలో రోజూ వేలకువేలు ఉంటూనే ఉంటాయి. జ్ఞాని అయినవాడు వాటిలో తగుల్కొనడు. పంచభూతాలనూ పది ఇంద్రియాలనూ పోగుచేసి చర్మంతో మూటగట్టిన ఈ శరీరంకొరకు దుఃఖించటమా? ఊళ్ళోవాళ్ళ దుఃఖాలకు మనం ఏడవటం వంటిది కాదూ ఇది!

చ. అన విని సంశయం బురివి యమ్మునితో నరణీతనూజుఁ డి
ట్లను 'భవదీయ దివ్యవచనామృత మాని యరోగచిత్తతం
గని కృతకృత్యతం బొరయఁ గాంచితిఁ బొందెద యోగసిద్ధి సూ
ర్యుని మహితప్రసారమున, నూని సమస్తము డిగ్గఁ ద్రావెదన్.' 321

ప్రతిపదార్థం: అనన్= అని (నారదుడు) చెప్పగా; విని= ఆలకించి; సంశయంబు= సందేహం; ఉరివి= తొలగి; ఆ+మునితోన్= ఆ నారదమహర్షితో; అరణీతనూజుఁడు= అరణీ సంభవుడైన శుకుడు; ఇట్లు+అనున్= ఇలా అంటున్నాడు; భవదీయ= నీయొక్క; దివ్య= దివ్యమైన (పవిత్రమైన); వచన+అమృతము= వాగమృతాన్ని; ఆని= క్రోలి (త్రాగి); అరోగచిత్తతన్= రోగరహితమైన మానసికస్థితిని; కని= పొంది; కృతకృత్యతన్= చరితార్థతను; పొరయన్+కాంచితిన్= పొందగలిగాను; సూర్యుని= సూర్య భగవానుడియొక్క; మహిత= గొప్పదైన; ప్రసారమునన్= ప్రసరణంతో (దయాప్రసారం వలన); యోగసిద్ధిన్= యోగంలో సిద్ధిని; పొందెదన్= పొందుతాను; ఊని= ప్రయత్నించి; సమస్తమున్= అన్నింటినీ; డిగ్గన్+త్రావెదన్= పరిత్యజిస్తాను.

తాత్పర్యం: నారదుడి ఉపదేశంతో శుకుడికి సంశయాలు తొలగిపోయాయి. అతడితో అంటున్నాడు 'మహర్షీ! నీ వాగమృతం గ్రోలటంతో నా మనస్సుకు స్వస్థత చేకూరింది. చరితార్థుడను అయాను. సూర్యభగవానుడి దయవలన యోగసిద్ధి పొందుతాను. రాగద్వేషాలూ, ధర్మాధర్మాలూ, సత్యాసత్యాలూ మొదలైనవన్నీ పరిత్యజిస్తాను.'

క. అని పలికి యమ్మునీశ్వరు । ననుజ్ఞఁ గొని తండ్రికడకు నరిగి వినతుఁడై
తన నిశ్చయంబు సెప్పిన । విని యతఁ డలరెం దదీయ విజ్ఞానతకున్. 322

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఆ+మునీశ్వరు+అనుజ్ఞన్= ఆ నారదమహర్షి అనుమతిని; కొని= స్వీకరించి; తండ్రికడకున్= తండ్రియైన వ్యాసుడి దగ్గరకు; అరిగి= వెళ్ళి; వినతుఁడై= నమస్కరించి; తన= తనయొక్క; నిశ్చయంబు= నిర్ణయం; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అతఁడు= ఆ వ్యాసుడు; తదీయ= ఆ పుత్రుడియొక్క; విజ్ఞానతకున్= తెలివికి; అలరెన్= సంతోషించాడు.

తాత్పర్యం: శుకమహర్షి తన ఆకాంక్షను చెప్పి నారదుడి అంగీకారం పొంది వెళ్ళి వ్యాసుడికి నమస్కరించాడు. తన నిశ్చయం తెలియజేశాడు. వ్యాసుడు పుత్రుడి విజ్ఞతకు సంతోషించాడు.

క. సంప్రమోదమందు సాత్యవతేయునిఁ । గని ప్రదక్షిణంబుగాఁగ వచ్చి
నరుగ నుత్సహించె నారణీయుఁడు దానిఁ । గాంచి వత్సలత్వగౌరవమున. 323

ప్రతిపదార్థం: సంప్రమోదము= ఆనందాన్ని; అందు= పొందుతున్న; సాత్యవతేయునిన్= వ్యాసుడిని; కని= చూచి; ప్రదక్షిణంబుగా ఁగన్= ప్రదక్షిణం అయ్యేట్టు; వచ్చి= చుట్టి వచ్చి; ఆరణీయుఁడు= శుకుడు; అరుగన్+ఉత్సహించెన్= వెళ్ళటానికి ఉత్సాహపడ్డాడు; దానిన్= ఆ ఉత్సాహాన్ని; కాంచి= గమనించి; వత్సలత్వ= వాత్సల్యరూపమైన; గౌరవమునన్= గురుత్వంతో - గారాబంతో.

తాత్పర్యం: ఆనందిస్తున్న తండ్రికి ప్రదక్షిణం చేసి శుకుడు బయలుదేరబోయాడు. ఆ ఉత్సాహాన్ని గుర్తించిన వ్యాసుడు పుత్రప్రేమతో, గారాబంతో (ఇట్లా అన్నాడు).

వ. ఆ బ్రహ్మర్షి సత్తముండు. **324**

ప్రతిపదార్థం: ఆ బ్రహ్మర్షి సత్తముండు= బ్రహ్మర్షులలో ఉత్తముడైన ఆ వ్యాసుడు.

తాత్పర్యం: ఉత్తముడైన ఆ వ్యాసుడు.

క. 'ప్రమద మొనర్చెదు నా నయ । నములకు నంత కటు నిలుము నాఁగా' నిఃస్నే
హము నిస్సంశయముం దన । యమలమతిం బల్లవింప నా శుకుఁ డరిగెన్. **325**

ప్రతిపదార్థం: నాయనా! నా = నాయొక్క; నయనములకున్= కన్నులకు; ప్రమదము= ఆనందాన్ని; ఒనర్చెదు= కలిగిస్తున్నావు; అంతకున్= అంతదాకా; అటు= అట్లా; నిలుపుము= ఆగుము; నాఁగాన్= అని వ్యాసుడు అనగా; ఆ శుకుఁడు= ఆ శుకర్షి; నిస్స్నేహమున్= మైత్రీరాహిత్యమూ; నిస్సంశయమున్= సంశయరాహిత్యమూ; తన= తనయొక్క; అమలమతిన్= నిర్మలమైన మనస్సులో; పల్లవింపన్= చిగురొత్తగా; అరిగెన్= ఆగకుండా వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'నాయనా! నా కన్నులకు ఆనందం కలిగిస్తున్నావు. కొంచెం సేపు (ఈపూటకు) ఇక్కడ ఉండవయ్యా!' అని వ్యాసుడు అడిగాడు. కానీ, శుకుడి మనస్సులో ఏ స్నేహమూ లేదు. ఏ సంశయమూ లేదు. నిర్మమంగా బయలుదేరి వెళ్ళిపోయాడు.

విశేషం: ఇక్కడ మూలంలో శ్లోకం ఇట్లా ఉన్నది. **"శ్రుత్వా ఋషిస్తద్వచనం శుకస్య ప్రీతో మహాత్మా పునరాహ చైనమ్ । భోభోః పుత్ర! స్థీయతాం తావదద్య యావచ్చక్షుః ప్రీణయామి త్వదర్థమ్॥" (12-318-62)** ఎంతవరకూ నా కన్నులు ఆనందిస్తాయో అంతవరకూ నీవు ఈ రోజు ఇక్కడ ఉండుము - అని యావత్తావత్ శబ్దాలతో ఉన్న వాక్యాన్ని 'అంతకిటు నిలుపుము' అని తిక్కన ఆంధ్రీకరించాడు.

ఆ. జనకు విడిచి యిట్లు సని సిద్ధచారణ । సముదయోపసేవితమును యోగ
సేవనార్హ విధమునై వెలుఁగొందు కై । లాసశిఖరితట మలంకరించె. **326**

ప్రతిపదార్థం: జనకున్= తండ్రియైన వ్యాసుడిని; విడిచి= వదలి; ఇట్లు; చని= వెళ్ళి; సిద్ధ= సిద్ధులూ; చారణ= చారణులూ అనే దేవజాతులయొక్క; సముదయ= సమూహంతో; ఉపసేవితమును= సేవింపబడేదీ; యోగసేవన= యోగాభ్యాసానికి; అర్హవిధమును+ఐ= అనువైన పద్ధతిలో ఉండేదీ అయి; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; కైలాసశిఖరి= కైలాసము అనే పేరుగల పర్వతంయొక్క; తటమున్= చరియను; అలంకరించెన్= అలంకరించాడు.

తాత్పర్యం: ఇట్లా తండ్రిని విడిచిపెట్టి వెళ్ళిన శుకుడు కైలాసపర్వతం చేరుకొన్నాడు. అక్కడ సిద్ధులూ, చారణులూ మొదలైన దేవతలు నివసిస్తూ ఉంటారు. అది యోగసాధనకు చాలా అనుకూలమైన ప్రదేశం. అందుకని అది ఎంచుకొని వెళ్ళాడు శుకుడు.

సీ. వినుఁ మందు సమము వివిక్తంబు నగుచోటఁ । బ్రాఙ్ముఖాసీనుఁడై పరమయోగ
రతిఁ బదప్రభృతిగాత్రములఁ గ్రమంబుగ । నాత్మధారణము సేయంగ నంత
నినుఁ డుదయించినం గని పాణిపాదసం । యమ మొప్ప నద్దేవు నాశ్రయించి
నిర్విషయంబగు సర్వాత్మ తత్త్వంబు । గాంచి విశిష్టయోగక్రమంబుఁ

తే. బొంది నారదముని యలవోక యచటి । కరుగుదెంచిన వినతుఁడై యాత్మయోగ
సిద్ధి యెఱిఁగించి' నీ కృపఁజేసి తెరువు । గంటి నరిగెద విగతసంగత్వమొంది.' **327**

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! ఆలకించుము; అందున్= ఆ కైలాసపర్వతంమీద; సమము= ఎత్తుపల్లాలు లేనిదీ; వివిక్తంబున్= ఏకాంతం కలదీ; అగు= అయిన; చోటన్= స్థలంలో; ప్రాక్+ముఖ+ఆసీనుఁడై= తూర్పు ముఖంగా కూర్చున్నవాడై; పరమ యోగరతిన్= శ్రేష్ఠమైన యోగంపట్ల గాఢమైన అభినివేశంతో (కోరికతో); పదప్రభృతి= పాదాలు మొదలుకొని; గాత్రములన్= సర్వావయవాల్లోనూ; క్రమంబుగన్= వరుసగా; ఆత్మధారణము+చేయంగన్= ఆత్మధారణ చేయగా; అంతన్= అప్పుడు; ఇనుఁడు= సూర్యుడు; ఉదయింపన్= సాక్షాత్కరిస్తే; కని= దర్శించి; పాణి= చేతులూ; పాద= కాళ్ళూ వీటి; సంయమము+ఒప్పన్= పొందిక అతిశయించేట్టు; ఆ+దేవున్= ఆ సూర్యభగవానుడిని; ఆశ్రయించి= శరణువేడి; నిర్విషయంబు+అగు= విషయవాసనా రహితమైన; సర్వాత్మ తత్త్వంబున్= సర్వాత్మయొక్క తత్త్వాన్ని; కాంచి= తెలిసికొని; విశిష్ట= అసాధారణమైన; యోగక్రమంబున్= యోగమార్గాన్ని; పొంది= అందుకొని; నారదమున్= నారదమహర్షి; అలవోక= యథాలాపంగా; అచటికిన్= అక్కడికి; అరుదెంచినన్= వచ్చేసరికి; వినతుఁడై= శుకుడు నమస్కరించి; ఆత్మయోగసిద్ధి= తనకు కలిగిన ఆత్మ యోగం యొక్క సిద్ధిని; ఎఱిఁగించి= నారదుడికి చెప్పి; నీ= నీయొక్క; కృపన్+చేసి= దయచేత; తెరువు= సరియైన మార్గం; కంటిన్= దర్శించాను; విగతసంగత్వము+ఒంది= నిస్సంగస్థితిని పొంది; అరిగెదన్= ప్రయాణం సాగిస్తాను.

తాత్పర్యం: కైలాసపర్వతంమీద అనువైన చోటు చూచికొని శుకుడు తూర్పుముఖంగా కూర్చున్నాడు. సర్వాంగాలలోనూ ఆత్మధారణ చేశాడు. అంతలో సూర్యుడు సాక్షాత్కరించాడు. శుకుడు సాష్టాంగపడ్డాడు, సమాశ్రయించాడు. సర్వాత్మతత్త్వాన్ని గ్రహించాడు. అప్పుడు యథాలాపంగా నారదుడు వచ్చాడు. శుకుడు తన యోగసిద్ధిని తెలియజేశాడు. 'దేవర్షీ! నీ దయవలన సరియైన మార్గం దొరికింది. నిస్సంగుడినై ఈ యోగమార్గంలో ప్రయాణిస్తాను.' (అన్నాడు.)

క. అని పలికి విమలయోగం । బున నాకసమునకు నెగసిపోయె గరుత్మం
తుని భంగి నపుడు సాధ్యులు । మునులుంగని విస్మయమున మునుఁగుచుఁ దమలోనన్. 328

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; విమలయోగంబునన్= పవిత్రమైన యోగశక్తితో; ఆకసమునకున్= ఆకాశానికి; గరుత్మంతుని భంగిన్= గరుత్మంతుడిలా; ఎగసి+పోయెన్= శుకుడు ఎగిరి వెళ్ళాడు; అపుడు= ఆ సమయంలో; సాధ్యులు= సాధ్యులు అనే దేవతలూ; మునులున్= మహర్షులూ; కని= చూచి; విస్మయమునన్= ఆశ్చర్యంలో; మునుఁగుచున్= మునుగుతూ; తమలోన్= తమలో తాము.

తాత్పర్యం: నారదుడితో ఆ రెండుమాటలూ పలికి శుకుడు తన యోగశక్తితో గరుత్మంతు డిలా ఆకాశంలోకి ఎగిరి వెళ్ళాడు. చాలాకాలం ఆ పర్వతంమీదనే యోగాభ్యాసం చేస్తున్న సిద్ధులూ, సాధ్యులూ, మహర్షులూ - వీరంతా అది చూచి ఆశ్చర్యంలో మునిగిపోతూ తమలో తాము. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' అచిరకాలంబునన యమ్మహాత్ముఁ డిట్లు । యోగసిద్ధిఁ బ్రాపించునె? యుల్ల మెంత
నిర్మలమొ! పితృభక్తి వినిశ్చలత్వ । సంపదన చూవె యీతఁ డీ పెంపువడసె. 329

ప్రతిపదార్థం: అచిరకాలంబునన్+అ= అనతికాలంలోనే; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు - శుకుడు; ఇట్లు; యోగసిద్ధిన్= యోగసిద్ధిని; ప్రాపించునె?= పొందగలిగాడా!; ఉల్లము= అతడి హృదయం; ఎంత నిర్మలమొ!= ఎంత నిర్మలమైనదో కదా!; పితృభక్తి= పితృభక్తి రూపమైన; వినిశ్చలత్వ= స్థిరత్వంయొక్క; సంపదన్+అ= సంపత్తితోనే; చూవె!= సుమా!; ఈతఁడు= ఈ శుకుడు; ఈ పెంపున్= ఈ గొప్పదనాన్ని; పడసెన్= పొందాడు!

తాత్పర్యం: 'అనతికాలంలోనే ఈ మహాత్ముడు యోగసిద్ధిని ఎట్లా పొందగలిగాడో! ఈయన మనస్సు ఎంత నిర్మలమో! పితృభక్తిపట్ల ఇతడి కున్న నిశ్చలత్వం వల్లనే సుమా - ఇతడికి ఈ పెంపు లభించింది!' అనుకొన్నారు.

వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున నదృశ్యుండగుట (సం. 12-320-2,3)

వ. అని మఱియు ననేకభంగులం బ్రస్తుతించుచుండి రట్టియెడ శుకుండు మృగపక్షిశైలసరిత్సరసీతరుగుల్మలతలం గలయం గనుంగొని 'మా తండ్రి నా వెనుకం జనుదెంచి నాదగు పేరం బిలిచెనేని మీరెల్ల నో యనవలయుంజుండీ!' యనిన నవి యట్ల చేసెదమనియె. నా బ్రహ్మర్షివరుండు దమోరజస్సత్త్వంబులం గ్రమంబున డిగ్గఁ ద్రావియు నుత్తరాభిముఖుండై పోవ నొక్క మహాపర్వతంబు శృంగంబులు రెండత్యంతపీతశ్వేతంబులై మేరు హిమవంతంబులం దెగడుచుం గదిసి యనేక యోజనాయామ విస్తారంబులు గలిగి మార్గంబున కడ్డపడియుండె నతం డప్రతిహతగమనంబునం జన నవి దుత్తుమురై రాలె నద్భుతభంగియగు నా సిద్ధపుంగవుపైఁ బుష్పవర్షంబు గురియుచు నమరగణంబు బహువిధంబులం బ్రణుతించె నప్పారాశర్యపుత్రుం డయ్యెడం బ్రవహించు మందాకిని మీఁదం జదలఁ జేరువం జనియె నట్లు సను సమయంబున. 330

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; అనేకభంగులన్= పలురకాలుగా; ప్రస్తుతించుచున్+ఉండిరి= పొగడుతున్నారు; అట్టియెడన్= అప్పుడు; శుకుండు= ఆ శుకమహర్షి; మృగ= జంతువులనూ; పక్షి= పక్షులనూ; శైల= పర్వతాలనూ; సరిత్= నదులనూ; సరసీ= సరోవరాలనూ; తరు= వృక్షాలనూ; గుల్మ= పొదలనూ; లతలన్= తీగెలనూ; కలయన్+కనుంగొని= అన్నివైపులా తేరిపార చూచి; మా తండ్రి= మా నాన్నగారు (వ్యాసుడు); నా వెనుకన్= నా వెన్నంటి; చనుదెంచి= ఇక్కడికి వచ్చి; నాది+అగు+పేరన్= నా పేరుతో; పిలిచెన్+ఏని= పిలిచినట్లయితే; మీరు+ఎల్లన్= మీరంతా; ఓ+అనవలయున్+చుండీ= 'ఓ' అని బదులు పలకాలి సుమండీ! - అనినన్= అనేసరికి; అవి= ఆ మృగపక్షిశైలాదులన్నీ; అట్లు+అ= అట్లాగే; చేసెదము= చేస్తాం; అనియెన్= అన్నాయి; ఆ+బ్రహ్మ+ఋషి+వరుండు= బ్రహ్మర్షులలో అగ్రగణ్యుడైన ఆ శుకుడు; తమః= తమోగుణాన్నీ; రజః= రజోగుణాన్నీ; సత్త్వంబులన్= సత్త్వగుణాన్నీ; క్రమంబునన్= ఇదే వరుసలో; డిగ్గఁద్రావియున్= పరిత్యజించి; ఉత్తర+అభిముఖుండు+అయి= ఉత్తరదిక్కువైపు; పోవన్= వెళ్ళగా; ఒక్క= ఒకానొక; మహాపర్వతంబు= మహాగిరియొక్క; శృంగంబులు= శిఖరాలు; రెండు; అత్యంత= మిక్కిలి; పీత= పసుపూ; శ్వేతంబులై= తెలుపూ అయి; మేరు= మేరు పర్వతాన్నీ; హిమవంతంబులన్= హిమవత్పర్వతాన్నీ; తెగడుచున్= తిరస్కరిస్తూ; కదిసి= క్రిక్కిరిసి; అనేకయోజన= పలు యోజనాల; ఆయామవిస్తారంబులు= పొడుగూ, వెడల్పులు; కలిగి; మార్గంబునకున్= శుకుడు ప్రయాణిస్తున్న ఆకాశమార్గానికి; అడ్డపడి+ఉండెన్= అవరోధంగా ఉన్నాయి; అతండు= ఆ శుకుడు; అప్రతిహత= నిరాటంకమైన; గమనంబునన్= సంచారంతో; చనన్= ప్రయాణించేసరికి; అవి= ఆ రెండుపర్వత శిఖరాలూ; తుత్తుమురై= తునకలు తునకలై; రాలెన్= నేలకు రాలిపోయాయి; అద్భుతభంగి+అగు= ఆశ్చర్యకరమైన పద్ధతి కలవాడైన; ఆ; సిద్ధపుంగవుపైన్= యోగసిద్ధులలో అగ్రగణ్యుడిమీద (శుకుడిమీద); పుష్పవర్షంబు= పూలవాన; కురియుచున్= కురిపిస్తూ; అమరగణంబు= దేవతల సమూహం; ప్రణుతించెన్= స్తుతించింది; ఆ+పారాశర్యపుత్రుండు= వ్యాసపుత్రుడైన ఆ శుకుడు; ఆ+ఎడన్= ఆ సమీపంలో; ప్రవహించు= ప్రవహిస్తున్న; మందాకినిమీఁదన్= గంగానదిమీద నుండి; చదలన్= ఆకాశంలో; చేరువన్= తక్కువ ఎత్తున; చనియెన్= వెళ్ళాడు; అట్లు; చను+సమయంబునన్= వెడుతున్న తరుణంలో.

తాత్పర్యం: అని అనేకవిధాలుగా పొగడుతున్నారు. అప్పుడు శుకుడు మృగాలనూ, పక్షులనూ, పర్వతాలనూ, నదులనూ, కొలకులనూ, చెట్లనూ, గుట్టలనూ, తీగలనూ చూచి 'మాతండ్రి నా వెంట వస్తూ నాపేరుతో పిలుస్తూ ఉంటే మీరు 'ఓ' అని బదులు పలకాలి సుమా!' అనగానే అవి దానికి అంగీకరించాయి. శుకుడు త్రిగుణాలనూ త్యజించి ఉత్తరంగా వెళ్ళుతుండగా, మహాపర్వత శిఖరాలు రెండు పసుపూ, తెలుపు రంగులలో ఉండి మేరు హిమనగాలను ధిక్కరిస్తూ శుకుడి పయనానికి అడ్డం వచ్చాయి. శుకుడు నిరాఘాటంగా ముందుకు సాగేసరికి ఆ శిఖరాలు ముక్కలు ముక్కలై కూలిపోయాయి. దేవతలు అతడిమీద పూలవాన కురిపించారు. శుకుడు గంగానది మీద ఆకాశంలో తక్కువ ఎత్తున వెళ్ళే సమయంలో.

తే. నగ్నలై యప్సరస్త్రీజనములు సలిల । కేళి సలుపుచునుండి శంకింప కమ్మ
హాత్ముఁ గనుఁగొను చెప్పటియట్ల నిర్వి । కారవృత్తి వర్తించిరి కౌరవేంద్ర! 331

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధర్మరాజా!; అప్సరస్+స్త్రీ+జనములు= అప్సరసలు; నగ్నలు+ఐ= దిగంబరలై; సలిలకేళి= జలక్రీడను; సలుపుచున్+ఉండి= ఆ గంగానదిలో జరుపుతూ; శంకింపక= అయ్యో!- పురుషుడే అని సంకోచించకుండా; ఆ+మహాత్మున్= మహానుభావుడైన ఆ శుకుడిని; కనుఁగొనుచున్= అట్లా చూస్తూ; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటిలాగానే; నిర్వికారవృత్తిన్= ఏ వికృతీ లేని ప్రవృత్తితో; వర్తించిరి= జలకేళి కొనసాగించారు.

తాత్పర్యం: ధర్మరాజా! తక్కువ ఎత్తులో శుకుడు అట్లా వెళ్ళుతున్నప్పుడు క్రింద ఆ గంగానదిలో అప్సరసలు దిగంబరంగా జలకేళి ఆడుతున్నారు. వారంతా శుకుడిని చూచారు. కానీ, ఏ వికారమూ పొందలేదు, శంకించలేదు. సిగ్గు అనుకోలేదు. ఎప్పటివలె జలక్రీడలు కొనసాగించారు.

వ. అయ్యవసరంబున సత్యవతీసుతుండు నిజసుతు వెనుక మహాయోగ గమనంబు గైకొని తగిలె నంతకు
నయ్యారణేయుండు వాయుపథం బతిక్రమించి సర్వభూతాత్మకుం డయ్యె నప్పుడు. 332

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సత్యవతీసుతుండు= వ్యాసుడు; నిజసుతు (యొక్క); వెనుకన్= తన కుమారుడి వెనకాల; మహాయోగ గమనంబు= గొప్ప యోగవిద్యవలన లభించిన (గతిని) గమనాన్ని; కైకొని= స్వీకరించి (చేపట్టి); తగిలెన్= వెంటపడ్డాడు; అంతకున్= అప్పటికి; ఆ+ఆరణేయుండు= ఆ శుకుడు; వాయుపథంబు= వాయుమార్గం; అతిక్రమించి= దాటి; సర్వభూతాత్మకుండు= పంచభూతాలకూ అంతర్యామి; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో వ్యాసుడు తన కుమారుడి వెనుక గొప్ప యోగవిద్యవలన లభించిన గమనాన్ని స్వీకరించి వెంటపడ్డాడు. అప్పటికి ఆ శుకుడు, వాయుమార్గం దాటి పంచభూతాలకూ అంతర్యామి అయ్యాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వెనుక నరుగుచునున్న యవ్వేదమూర్తి । తోడ సిద్ధచారణులు దత్సుతుఁడు శైల
శృంగ విధ్వంసియై పోక సెప్ప నెలుఁగు । పెంపు మిగుల 'శుకా!' యని పిలిచె నతఁడు. 333

ప్రతిపదార్థం: వెనుకన్= శుకుని వెనకాల; అరుగుచునున్న= వెడుతున్న; ఆ+వేదమూర్తితోడన్= వేదస్వరూపుడైన ఆ వ్యాసుడితో; సిద్ధచారణులు= సిద్ధులూ, చారణులూ; తద్+సుతుఁడు= ఆయన పుత్రుడైన శుకుడు; శైలశృంగ= పర్వతశిఖరాల; విధ్వంసియై= వినాశకుడై; పోక= వెళ్ళటం; చెప్పన్= చెప్పేసరికి; అతఁడు= ఆ వ్యాసుడు; ఎలుఁగుపెంపు= కంఠధ్వని; మిగులన్= అతిశయించేట్టు; శుకా!= ఓ శుకా!; అని; పిలిచెన్= కేకవేశాడు;

తాత్పర్యం: కొడుకును వెదుక్కొంటూ వెనకాలే బయలుదేరిన బ్రహ్మశ్రీవేదమూర్తులైన వ్యాసులవారిని చూచి సిద్ధచారణులు ఇట్లా అన్నారు: 'స్వామీ! మీ అబ్బాయి రెండు పర్వతశృంగాలను విధ్వంసం చేసి ఇటే వెళ్ళాడు' అని. ఇది విన్న వ్యాసుడు గొంతెత్తి గట్టిగా 'శుకా!' అని అరచి పిలిచాడు.

వ. పిలిచిన నా సర్వగతుండు నిజప్రకారం బంతర్హితం బగుట దేటపడ బయల నో యను నాదంబు నిగుడునట్లు
సేసెం దదనంతరంబ. 334

ప్రతిపదార్థం: పిలిచినన్= వ్యాసుడు అట్లా పిలిస్తే; ఆ సర్వగతుఁడు= సర్వభూతాత్మకుడుగా మారిపోయిన ఆ శుకుడు; నిజప్రకారంబు= తన స్వరూపం; అంతర్హితంబు+అగుటన్= అదృశ్యమైపోవటం; తేటపడన్= స్పష్టపడేట్టు; బయలన్=

ఆకాశంలో; ఓ+అను+నాదంబు= ఓ అనే ధ్వని; నిగుడునట్లు+చేసెన్= వ్యాపించేట్టు చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వ్యాసుడు అట్లా పిలిచేసరికి శుకుడికి తెలిసింది. అత డిప్పుడు సర్వభూతాత్మకుడుగా మారిపోయాడు. కాబట్టి రూపం కనపడదు. అయినా వ్యాసుడికి వినిపించేటట్లు ఓ అనే ధ్వని ఆకాశమంతటా వ్యాపించి మారుమ్రోగేటట్లు చేశాడు. అప్పుడు ఏమి జరిగిందంటే.

విశేషం: 'అంతర్హితంబగుటఁ దేటపడ' అని అన్నిప్రతులలోనూ అరసున్న ఉన్నది. అంతర్హితం అవటంచేత తేటపడేటట్లు - అంటే ఏది తేటపడేటట్లు? అన్న ప్రశ్న పుట్టుతుంది. దానికి సమాధానం లేదు. అరసున్న తీసేస్తే - తన స్వరూపం అంతర్హిత మవ్వటం అనేది తండ్రికి తేటపడేట్టు ఓ అనే ధ్వని నిగుడించాడు - అని అన్వయం హాయిగా కుదురుతుంది. ఈ సందర్భంలో మూలశ్లోకం ఇట్లా ఉన్నది. **"అంతర్హితః ప్రభావం తు దర్శయిత్వా శుకస్తదా । గుణాన్సంత్యజ్య శబ్దాదీన్ పదమధ్యగమత్పరమ్ ॥" (12-320-26)**. అంతర్హితుడైన శుకుడు తన ప్రభావాన్ని ప్రదర్శిస్తూ శబ్దాదిగుణాలను కూడా విడిచిపెట్టి పరమపదాన్ని పొందాడు అని ఈ శ్లోకానికి భావం. పై అన్వయానికి అనువైనది.

తే. సకలజంగమ స్థావర సమితు లెల్ల । నో యనిన నద్భుతం బెడ్డ నుద్భవింప
సత్యవతి కొడ్కు - కొడుకు విశాలమహిమఁ । దెలిసి యప్పర్వతముమీఁద నిలువఁబడియె. 335

ప్రతిపదార్థం: సకల= సమస్తమైన; జంగమ= కదిలేవీ; స్థావర= కదలినివీ; (చరాచర) అయిన; సమితులు+ఎల్లన్= (వస్తు) సమూహం అంతా; ఓ+అనినన్= ఓ అనేసరికి; అద్భుతంబు= ఆశ్చర్యం; ఎడ్డన్= హృదయంలో (ఎఱఁద-ఎడ్డ-ఎడ్డ-ఎద,ఎడ); ఉద్భవింపన్= కలగగా; సత్యవతి కొడ్కు= సత్యవతీ సుతుడైన వ్యాసుడు; కొడుకు= తన కొడుకు శుకుడియొక్క; విశాలమహిమన్= విస్తారమైన మహత్తును; తెలిసి= గ్రహించి; ఆ+పర్వతముమీఁదన్= అదే కొండమీద; నిలువన్+పడియెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: చరాచర వస్తుసమూహం అంతా 'ఓ' - అని ధ్వనించింది. వ్యాసుడు ఆశ్చర్యపోయాడు. తన కుమారుడి అనంతమైన మహిమ తెలిసికొన్నాడు. అదే పర్వతశిఖరం మీద అట్లాగే నిలుచుండిపోయాడు.

వ. ఇట్లు నిలిచిన యవ్వేదవ్యాస మునీశ్వరుం గాంచి జలవిహారంబు సలుపు నయ్యప్సరోజనంబులు సిగ్గు నగ్గలికగ్రందుకొన నందఱు నంబరంబులు ధరియించి రద్దివ్యబోధమహనీయుండు నిజతనయు చనునప్పుడు వారు శంకలేక యునికిఁ గని యతని ముక్తతయుఁ దన సక్తతయు నిరూపించి ప్రియంబును లజ్జయు నొక్కటఁ బొడమ నున్నంత. 336

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; నిలిచిన= ఆగిపోయిన; ఆ+వేదవ్యాసముని+ఈశ్వరున్= ఆ వ్యాసమహర్షిని; కాంచి= చూసి; జలవిహారంబు+సలుపు= (అప్పటికీ) గంగానదిలో (ఇంకా) జలవిహారం చేస్తున్న; ఆ+అప్సరోజనంబులు= ఆ దేవకాంతలు; సిగ్గున్+అగ్గలిక= లజ్జాతిశయం (మిక్కిలి సిగ్గు); క్రందుకొనన్= ఆవహించగా; అంబరంబులు= వస్త్రాలు; ధరియించిరి= ధరించారు; ఆ+దివ్యబోధ+మహనీయుండు= దివ్యజ్ఞానంతో మహానుభావుడైన ఆ వ్యాసుడు; నిజతనయు= తన కుమారుడు; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; వారు= ఆ అప్సరసలు; శంకలేక+ఉనికిన్= ఏ సంకోచమూ లేకుండా ఉండటాన్ని; కని= చూసి; అతని= ఆ శుకుడి యొక్క; ముక్తతయున్= విముక్తస్థితీ; తన= తనయొక్క; సక్తతయున్= సక్తస్థితీ (సాంసారిక స్పృహ); నిరూపించి= గ్రహించి; ప్రియంబునున్= (కుమారుడి స్థితికి) సంతోషమూ; లజ్జయున్= (తన స్థితికి) సిగ్గూ; ఒక్కటన్= ఒకేసారి; పొడమన్= కలగగా; ఉన్నంత= అలా ఉన్న సమయంలో.

తాత్పర్యం: ఇట్లా ఆగిపోయిన వ్యాసుడిని చూచి, అక్కడ జలకాలాడుతున్న అప్సరసలు సిగ్గు ఎక్కువ కాగా, అందరూ బట్టలు కట్టుకొన్నారు. దివ్యజ్ఞానం కలిగిన ఆ వ్యాసుడు తన కుమారుడు అదే దారిలో వెళ్ళినప్పుడు వారికి శంకలేదన్న

నిజాన్ని గ్రహించి, కుమారుడి విముక్తస్థితిని, తన ఆసక్తస్థితినీ గ్రహించి కుమారుడి ఔన్నత్యానికి సంతోషించాడు. తన స్థితికి సిగ్గుపడ్డాడు. అట్లా ఆయన ఉండగా.

క. సుర ముని సిద్ధగణంబులు । పరివేష్టింపంగ నతని పాలికి గంగా
ధరుఁ డేఁగుదెంచి నెవ్వగఁ । బొరయు నతనితోడఁ గరుణ వొంపిరివోవన్. 337

ప్రతిపదార్థం: సుర (గణంబులు)= దేవతాబృందాలూ; ముని (గణంబులు)= ముని సమూహాలూ; సిద్ధగణంబులు= సిద్ధుల గుంపులూ; పరివేష్టింపంగన్= గుమిగూడి రాగా; గంగాధరుఁడు= శివుడు; అతనిపాలికిన్= ఆ వ్యాసుడి దగ్గరకు; ఏఁగుదెంచి= వచ్చి; నెవ్వగన్ (నెఱ+వగన్)= పెద్ద దిగులు; పొరయు= పొందుతున్న; అతనితోడన్= ఆ వ్యాసుడితో; కరుణ= దయ; పొంపిరి+పోవన్= అతిశయించేటట్టు.

తాత్పర్యం: దిగులుపడుతున్న వ్యాసుడిదగ్గరకు సాక్షాత్తూ గంగాధరుడు విచ్చేశాడు. సురలూ, మునులూ, సిద్ధులూ- ఇత్యాదులందరూ గుంపులు గుంపులుగా ముందు వెనుకల నడుస్తూంటే పెద్ద కోలాహలంగా వచ్చాడు పరమేశ్వరుడు. దిగులుపడుతున్న వ్యాసుడిని చూచి దయ తొణికిసలాడేటట్టు ఓదార్పు మాటలు పలికాడు.

వ. అనునయ పూర్వకంబుగా నిట్లనియె. 338

ప్రతిపదార్థం: అనునయ పూర్వంబుగాన్= బుజ్జగింపుగా; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= పలికాడు - శివుడు.

తాత్పర్యం: బుజ్జగింపుగా శివుడు ఇట్లా అన్నాడు.

క. ‘ జలపవనాంబర వసుధా । నల సమవీర్యుఁడగు పుత్రు నాకొసఁగంగా
వలయు’నని యడిగి తిచ్చితి । నలఘు తపోవిభవ! యేను నట్టికుమారున్. 339

ప్రతిపదార్థం: అలఘు!= గొప్ప; తపోవిభవ!= తపోవైభవం కలవాడా!; జల= నీరు; పవన= వాయువు; అంబర= ఆకాశం; వసుధా= నేల; అనల= అగ్ని - ఈ పంచభూతాలతో; సమ= సాటివచ్చే; వీర్యుఁడు+అగు= శక్తి కలవాడైన; పుత్రున్= కుమారుడిని; నాకున్= నాకు; ఒసఁగంగాన్+వలయున్= ఇవ్వాలి; అని; అడిగితి(వి)= అలనాడు అడిగావు; ఏనున్= నేనుకూడా; అట్టికుమారున్= అటువంటి పుత్రుడిని; ఇచ్చితిన్= నీకు వరంగా ఇచ్చాను.

తాత్పర్యం: ‘ఓ తపస్వీ! అలనాడు నీ తపస్సుకి మెచ్చి నేను ప్రత్యక్షమయినప్పుడు ‘పంచభూత సమవీర్యుడిని కొడుకుగా అనుగ్రహించు’మని నీవు వరం అడిగావు. నేను అట్లాగే అటువంటి వాడినే ఇచ్చాను.

వ. వాఁడును మత్ప్రభావంబునను భవత్తపోవిశేషంబునను బ్రహ్మతేజోమయుండై దేవతలకుం బొందరానిపరమగతిం బ్రాపించె దీనంజేసి మోదంబు నందవలదె? విషాదంబునకుం బనియేమి?’ యని పలికి వెండియు. 340

ప్రతిపదార్థం: వాఁడునున్= ఆ శుకుడు; మత్+ప్రభావంబుననున్= నా ప్రభావంవల్లనూ; భవత్= నీ; తపోవిశేషంబుననున్= నీ విశిష్ట తపస్సువల్లనూ; బ్రహ్మతేజోమయుండు+ఐ= బ్రహ్మతేజస్సుతో కూడినవాడై; దేవతలకున్= దేవతలకైనా; పొందరాని= పొందటానికి శక్యంకాని; పరమగతిన్= ఉత్తమోత్తమ గతిని; ప్రాపించెన్= పొందాడు; దీనన్+చేసి= దీనితో; మోదంబున్+అందన్+వలదె?= సంతోషించవద్దా?; విషాదంబునకున్= దుఃఖానికి; పని+ఏమి?= అవసరం ఏముంది?; అని పలికి= అని మాట్లాడి; వెండియున్=తిరిగి.

తాత్పర్యం: ఆ శుకుడు నా ప్రభావంవలన, నీ విశిష్టమైన తపస్సువలనా, బ్రహ్మతేజస్సుతో కూడినవాడై, దేవతలకైనా, పొందటానికి శక్యంకాని ఉత్తమోత్తమ గతిని పొందాడు. దీనితో సంతోషించాలి. దుఃఖపడవలసిన అవసరం ఏముంది?’ అని చెప్పి తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' ఇలయు గిరులును శరధులు నెంతదాఁకఁ । గలుగు నంతకాలంబును వెలయుచుండు
శుకుని కీర్తియు నీదు యశోవిభూతి । యును జనంబుల వీనుల కుత్సవముగ.' 341

ప్రతిపదార్థం: ఇలయున్= ఈ భూమీ; గిరులునున్= పర్వతాలూ; శరధులున్= సముద్రాలూ; ఎంతదాఁకన్= ఎంతకాలం; కలుగున్= ఉంటాయో; అంతకాలంబునున్= అంతకాలమూ; శుకుని= శుకమహర్షియొక్క; కీర్తియున్= యశస్సూ; నీదు= నీయొక్క; యశఃవిభూతియునున్= కీర్తి మహిమ (ఇవి రెండూ); జనంబుల= ప్రజల; వీనులకున్= చెవులకు; ఉత్సవముగన్= పండువుగా; వెలయుచుండున్= ప్రకాశిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: 'వ్యాసమహర్షీ! ఈ నేలా, ఈ కొండలూ, ఈ సముద్రాలూ ఉన్నంతకాలమూ నీ పుత్రుడి కీర్తీ, నీ యశోవిభూతీ ఉంటాయి. తరతరాలకూ ప్రజలకు చెవులపండువు చేస్తాయి. '

వ. అని నిర్దేశించి 'వలయునేనిఁ బుత్రసదృశయైన ఛాయ నిన్నెప్పుడు ననుగమింప దర్శించువాఁడవు గా'కనియె నిట్లనుగ్రహించి యా బ్రహ్మర్షిప్రవరుని సంప్రీతునింజేసి వీడుకొల్పి విశ్వేశ్వరుండు నిజేచ్ఛం జనియె నింతవట్టు నారదుండు నాకుం జెప్పె. 342

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి= అలా నిర్దేశం చేసి; వలయునేనిన్= అంతగా కావలిస్తే; పుత్ర సదృశ+అయిన= నీ కుమారుడిలాంటి; ఛాయ= నీడ ఒకటి; నిన్నున్= నిన్ను; ఎప్పుడున్= ఎల్లవేళలా; అనుగమింపన్= అనుసరిస్తూంటే; దర్శించువాఁడవు+కాక= దర్శిస్తావు గాక; అనియెన్= అని అనుగ్రహించాడు; ఇట్లు= ఇలా; అనుగ్రహించి= దయచూపించి; ఆ= ఆ ప్రసిద్ధుడైన; బ్రహ్మ+ఋషి+ప్రవరునిన్= బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడైన వ్యాసుడిని; సంప్రీతునిన్= సంతోషించినవాడినిగా; చేసి; వీడుకొల్పి= వీడ్కోలు చెప్పి; విశ్వేశ్వరుండు= గంగాధరుడు; నిజ+ఇచ్ఛన్= తన ఇచ్ఛమేరకు; చనియెన్= వెళ్ళిపోయాడు; ఇంతవట్టున్= ఇంతమట్టుకే; నారదుండు= నారదుడు; నాకున్+చెప్పెన్= నాకు చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి, 'నీకు అంతగా కావాలని అనిపిస్తే, అతడివంటి నీడ నిన్ను అనుసరించగా చూడగలవు' అని అనుగ్రహించి, శివుడు వెళ్ళిపోయాడు. ఇంతవరకూ నాకు నారదుడు చెప్పాడు.

క. ఇది యితిహాసవరము దనుఁ । జదివిన వారలకు వినిన జనముల కాయుఃప్రదమగు లక్ష్మీ కీర్త్య, భ్యుదయంబుల నిచ్చు సుగతియును గావించున్. 343

ప్రతిపదార్థం: ఇది; ఇతిహాసవరము= శ్రేష్ఠమైన ఇతిహాసం (కథ); తనున్= తనను; చదివినవారలకున్= చదివినవారికీ; వినిన జనములకున్= విన్న ప్రజలకూ; ఆయుఃప్రదము+అగున్= దీర్ఘాయుస్సును ఇస్తుంది; లక్ష్మీ+అభ్యుదయంబులన్= సంపదల అభివృద్ధినీ; కీర్తి+అభ్యుదయంబులన్= యశస్సుల అభివృద్ధినీ (లక్ష్మినీ, కీర్తినీ ఇంకా పలురకాల అభ్యుదయాలనూ); ఇచ్చున్= ఇస్తుంది; సుగతియునున్= సద్గతిని కూడా (ముక్తిని); కావించున్= కలిగిస్తుంది;

తాత్పర్యం: ధర్మరాజా! ఉత్తమోత్తమమైన ఇతిహాసం ఇది. దీనిని చదివినవారికీ, విన్నవారికీ దీర్ఘాయుర్దాయం లభిస్తుంది. సకలసంపదలూ యశస్సులూ ఇంకా అనేకమైన అభ్యుదయాలూ కలుగుతాయి. కట్టకడపటికి సద్గతులను (ఉత్తమలోకాలను) ప్రసాదిస్తుంది. (అని ఫలశ్రుతి కూడా చెప్పాడు నారదుడు.)'

వ. అనియె నద్దేవమునిచేత నా వినినచొప్పున నీకుం జెప్పితి నీవింక నేమి వినవల తనుటయ ధర్మతనయుండు శంతనుతనయుతో బ్రహ్మచర్యాదులగు నాలుగాశ్రమంబుల వారును దమకు నుత్తమపదసిద్ధిం గోరి యారాధించు దైవం బెయ్యది దయ పల్లవింప నా కెఱిఁగింపుము. 344

ప్రతిపదార్థం: అనియెన్= అని ముగించాడు నారదుడు; ఆ+దేవమునిచేతన్= దేవర్షి అయిన ఆ నారదుడిచేత; నా+వినిన చొప్పునన్= నేను విన్నది విన్నట్టు; నీకున్= నీకు; చెప్పితిన్= చెప్పాను; నీవు; ఇంకన్= ఇంకా; ఏమి= ఏమిటి; వినన్+వలతు(వు)?= వినగోరుతున్నావు?; అనుటయున్= అని భీష్ముడు అడిగేసరికి; ధర్మతనయుండు= యమునికుమారుడైన ధర్మరాజు; శంతను తనయుతోన్= శంతనుమహారాజుగారి కుమారుడైన భీష్ముడితో; బ్రహ్మచర్య+ఆదులు+అగు= బ్రహ్మచర్యం మొదలుగాగల; నాలుగు+ఆశ్రమంబులవారునున్= నాలుగు ఆశ్రమాలలోనూ ఉండేవారు; తమకున్= తమకు; ఉత్తమపదసిద్ధిన్= ఉత్తమమైన మోక్షసిద్ధిని; కోరి= కాంక్షించి; ఆరాధించు= కొలిచే; దైవంబు= దైవం; ఏ+అది= ఏది (నాలుగు ఆశ్రమాలవారికీ ఆరాధింపదగిన దైవం ఎవరు?); దయ పల్లవింపన్= కృప చిగురొత్తగా; నాకున్= నాకు; ఎఱిఁగింపుము= తెలియజేయుము.

తాత్పర్యం: నారదు డిట్లా చెప్పగా నేను విన్నంతమేరకు నీకు చెప్పాను. నీ వింకా ఏమి వినగోరుతున్నావు?' అని భీష్ము డడుగగా ధర్మరాజు 'నాలుగు ఆశ్రమాలలోనూ ఉండేవాళ్ళు కొలిచే దైవం ఏది? నాకు తెలియజెప్పుము.' అని అడిగాడు.

క. అనియె నని చెప్పి గురుభ । క్తి నిరూఢుఁడు లోకమాన్య తేజుఁడు విద్యా
ఘనుఁడగు నా వైశంపా । యనమునివరుఁ డిట్టు లనియె నాతనితోడన్. **345**

ప్రతిపదార్థం: అనియెన్= అని అడిగాడు ధర్మరాజు; అని చెప్పి= అని; గురుభక్తినిరూఢుఁడు= గొప్పభక్తితో స్థిరంగా కూడినవాడూ; లోక= ప్రజలకు; మాన్య= గౌరవింపదగిన; తేజుఁడు= తేజస్సుకలవాడూ; విద్యాఘనుఁడు= విద్యచేత గొప్పవాడూ; అగు= ఐన; ఆ+వైశంపాయన+మునివరుఁడు= మునివరేణ్యుడైన ఆ వైశంపాయనుడు; ఆతనితోడన్= శ్రోతగా ఉన్న జనమేజయుడితో; ఇట్టులు+అనియెన్= ఇంకా ఇలా అన్నాడు.

తాత్పర్యం: (ఇప్పుడు కథను జనమేజయ వైశంపాయనులతో కలుపుతున్నాడు కవి.) ధర్మరాజు భీష్ముడిని ఇట్లా అడిగాడు అని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు. ఈ వైశంపాయనుడు గురుభక్తి కలవాడు. (సకలలోకాల చేత) లోకులు అందరిచేత గౌరవించబడేవాడు. విద్యావిషయకంగా ఘనుడు. ఆయన తన ప్రధానశ్రోత అయిన జనమేజయుడితో ఇట్లా అన్నాడు:

తే. వ్యాసమునినాథు షడ్గుణైశ్వర్యధుర్యు । నాగమవ్యాసకర్మరు నమితతేజుఁ
గొలిచి తత్ప్రసాదంబున వలనుఁ బెంపుఁ । గలిగి యేను నారాయణు కథ ఘటింతు. **346**

ప్రతిపదార్థం: షట్+గుణ= ఆరువిధాలైన; ఐశ్వర్యధుర్యున్= సౌభాగ్యం కలవాడూ; ఆగమ= ఆగమాలలో (ధర్మశాస్త్రాలలో); వ్యాస= వివరింపబడిన; కర్మరున్= కర్మలను ఆచరించేవాడూ (కర్మఠః= కర్మాచరణ పరాయణుడు); అమితతేజున్= మహాతేజస్వంతుడూ అయిన; వ్యాసమునినాథున్= మునీశ్వరుడైన వ్యాసుడిని; కొలిచి= సేవించి; తద్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంవలన; వలనున్= సామర్థ్యమూ; పెంపున్= అతిశయమూ; కలిగి= పొంది; ఏను= నేను; నారాయణు (యొక్క) కథన్= నారాయణుడి ఇతిహాసాన్ని; ఘటింతున్= (నీ వీనులకు) పొందుపరుస్తాను.

తాత్పర్యం: ఆరు రకాలైన ఆధ్యాత్మిక ఐశ్వర్యాలు కలవాడూ, ఆగమశాస్త్రాలలో చెప్పబడినట్లుగా కర్మాచరణం చేసేవాడూ, మహాతేజస్వంతుడూ అయిన వ్యాసమునీశ్వరుడిని సేవించి వారి దయవలన సామర్థ్యమూ, ప్రావీణ్యమూ పొందిన నేను నారాయణుడి కథను నీకు వివరించి చెప్పుతాను. అని వైశంపాయనుడు. జయమేజయునితో అన్నాడు

వ. అని భక్తిపూర్వకంబుగాఁ బలికి జనమేజయున కిట్లనియె న ట్లజాతశత్రుం డడిగిన నయ్యాపగాపుత్రుం డతనితో నారాయణనారద సంవాదం బను నితిహాసంబు మా తండ్రి నాకుం జెప్పె దాన నీయడిగిన యర్థంబు దేటపడం జెప్పెద. 347

ప్రతిపదార్థం: అని= ఇలా; భక్తిపూర్వంబుగాన్= భక్తిపురస్సరంగా; పలికి= మాట్లాడి; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= వైశంపాయనుడు చెప్పాడు; అట్లు= ఆ విధంగా; అజాతశత్రుండు= ధర్మరాజు; అడిగినన్= అడిగితే; ఆ+ఆపగాపుత్రుండు= గంగా పుత్రుడైన ఆ భీష్ముడు (ఆపగ= నది); అతనితోన్= ఆ ధర్మరాజుతో; నారాయణ నారదసంవాదంబు= నారాయణ, నారద సంవాదం; అను= అనే; ఇతిహాసంబు= వృత్తాంతం; మా తండ్రి= మా తండ్రిగారైన శంతనుమహారాజు; నాకున్= నాకు; చెప్పెన్= చెప్పాడు; దానన్= దానితో; నీ+అడిగిన= నీవు అడిగిన; అర్థంబు= ప్రయోజనం (విశేషం); తేటపడన్= స్పష్టపడేట్టు; చెప్పెదన్= వివరిస్తాను; ఈ ఇతిహాసం ద్వారా నీ సందేహం తీరుస్తాను అని భావం.

తాత్పర్యం: ఇట్లా చెప్పి వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: 'ధర్మరాజు ప్రశ్నకు బదులుగా భీష్ముడు 'మా తండ్రి శంతనుడు నాకు నారాయణనారద సంవాదాన్ని చెప్పాడు. అది నీ సందేహాన్ని తీర్చగలదు.'

క. అని పలికి యాదరంబున । మనంబు మేదురము గాఁగ మనుజేశ్వర! య
జ్ఞనపతి వీను లమృతరస । మున నించినయట్టి చందముగ నిట్లనియెన్. 348

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర= జనమేజయమహారాజా!; అని పలికి= భీష్ముడు అట్లా పలికి; ఆదరంబునన్= ప్రేమతో; మనంబు= హృదయం; మేదురము+కాఁగన్= క్రిక్కిరియగా; ఆ+జనపతి= ఆ ధర్మరాజుయొక్క; వీనులు= చెవులు; అమృతరసమునన్= అమృతరసంతో; నించిన+అట్టి చందముగన్= నింపినట్టుగా; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆదరంతో మనస్సు మేదురం కాగా భీష్ముడు ధర్మజుడి చెవులలో అమృతరసం నింపినట్లుగా ఆ ఇతిహాసాన్ని ఇట్లా వివరించాడు.

భీష్ముఁడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు నెప్పుట: (సం. 12-321-7)

సీ. 'వినుము మవ్యయుఁడు సనాతనుఁడు విశ్వాత్ముఁడు । నైన నారాయణుండను మునీంద్రు
బదరికాశ్రమమున భక్తిమైఁ గొలిచి నా । రదుఁ డెద్ది సిద్ధి కారాధనీయ
మానతి యిమ్మన్న నతఁడుఁ ధ్రువం బచ । లం బింద్రియాగోచరంబు సూక్ష్మ
మనుపమ మన సర్వమున కంతరాత్మయై । వెలుఁగు తత్త్వము దక్క వేఱు కలదె?

తే. అరయ నారాధ్యమై యజుఁ డాదిగాఁగ । సకల భూతంబులకును బూజ్యంబు దాన
యనియె నిట్లన్న నరసఖుఁ డతికృపార్ద్ర । భావుఁడై చెప్ప నప్పద్మభవసుతుండు. 349

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! ఆలకించుము; అవ్యయుఁడు= వ్యయంకానివాడూ; సనాతనుఁడు= సనాతనుడూ; విశ్వాత్ముఁడు= విశ్వస్వరూపుడూ; ఐన= అయినటువంటి; నారాయణుండు= నారాయణుడు; అను= అనే; మునీంద్రున్= మునీశ్వరుడిని; బదరికాశ్రమమునన్= బదరికాశ్రమంలో; భక్తిమైన్= భక్తితో; కొలిచి= సేవించి; నారదుఁడు= నారదమహర్షి; ఎద్ది= ఏది; సిద్ధికిన్= మోక్షసిద్ధికి; ఆరాధనీయము= ఆరాధింప దగినదో; ఆనతి+ఇమ్మన= ఆజ్ఞాపించుమని; అన్నన్= అడిగితే; అతఁడు= ఆ నారాయణుడు; ధ్రువంబు= ధ్రువమైనదీ; అచలంబు= చలించనిదీ; ఇంద్రియ+అగోచరంబు= ఇంద్రియాలకు అందనిదీ; సూక్ష్మము= సూక్ష్మమైనదీ; అనుపమము= సాటిలేనిదీ; అనన్= అనబడుతూ; సర్వమునకున్= సమస్తానికీ; అంతరాత్మయై=లోపలి ఆత్మయై; వెలుఁగు= ప్రకాశించే; తత్త్వము= ఆ తత్త్వం ఒక్కటి; తక్కన్= తప్ప; వేఱు+అ= వేరే మరొకటి; అరయన్= ఎంత

పరిశీలించినా; ఆరాధ్యము+ఐ= ఆరాధనీయమైనది; కలదె?= ఉన్నదా?; అజుఁడు+ఆదిగాఁగన్= బ్రహ్మదేవుడు మొదలుగా; సకల భూతంబులకున్= సమస్త ప్రాణులకూ; పూజ్యంబు= ఆరాధింపదగినది; తాను+అ= అదే; అనియెన్= అని చెప్పాడు; ఇట్లు+అన్నన్= ఇట్లా అన్నటువంటి; నరసఖుఁడు= నరుడి మిత్రుడైన (నరనారాయణులే అర్జున కృష్ణులు) నారాయణుడు; అతి కృపా+ఆర్ద్రభావుఁడై= మిక్కిలి దయతో చెమ్మగిల్లిన హృదయం (భావం) కలవాడై; చెప్పన్= వివరించేసరికి; ఆ+పద్మభవ+సుతుండు= బ్రహ్మదేవుని (పద్మభవుడు) కుమారుడైన ఆ నారదుడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పుతున్నాడు. 'ధర్మరాజా! వినుము. నారాయణుడు అనే మునీంద్రుడిని బదరికాశ్రమంలో సందర్శించి సంసేవించి నారదుడు ఒక ప్రశ్న వేశాడు. మోక్షసిద్ధికి ఆరాధనీయమైనది ఏది?- అని. 'సమస్తానికీ అంతరాత్మగా వెలిగే తత్త్వం ఒక్కటే తప్ప మరొకటి ఆరాధనీయం ఏముంది? బ్రహ్మాదులకూ సకల భూతాలకూ అదే ఆరాధనీయం'. అని నరసఖుడైన నారాయణుడు తెలిపేసరికి నారదుడు విని సంప్రీతుడయ్యాడు.

వ. సంప్రీతుండై సవిశేష వినయంబున నమ్మహాత్మున కిట్లనియె. 350

ప్రతిపదార్థం: సంప్రీతుఁడు= నారదుడు ఆనందించి; సవిశేషవినయంబునన్= విశిష్టమైన వినయంతో; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడికి; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నారదుడు ఆనందించి, సవినయంగా ఇట్లా అడిగాడు.

క. ' లోకేశ! నీవు ధర్మ । శ్రీ కావలి గాఁగ నవతరించుట విద్వ
ల్లోకంబు సెప్పు నమ్మా । లాకృతి యెట్లుండునో? దయాత్మకమూర్తీ! 351

ప్రతిపదార్థం: లోక+ఈశ= జగన్నాయకా!; నీవు; ధర్మశ్రీ= ధర్మసంపదకు (లక్ష్మి యొక్క); కావలి+కాఁగన్= రక్షకుడవుగా; అవతరించుట= జన్మించటం; విద్వత్+లోకంబు= పండితుల సమూహం; చెప్పన్= చెప్పుతోంది; ఆ+మూల+ఆకృతి= నీ దయిన ఆ అసలు స్వరూపం; దయా+ఆత్మకమూర్తీ!= ఓ దయాస్వరూపుడా!; ఎట్లు+ఉండునో?= ఎలా ఉంటుందో?

తాత్పర్యం: ఓ జగన్నాయకా! ఓ దయాస్వరూపా! నీవు ధర్మసంరక్షకుడవుగా ఈ అవతారం ధరించావని విజ్ఞులంతా చెప్పుతున్నారు. మరి నీదయిన అసలు సిసలు మూలాకారం ఎట్లా ఉంటుందో కదా!

క. శ్రుతిపరతయు గురుభక్తియు । మతిఁ గల వొకకొంత కొంత మన్నింపఁగఁ బా
త్రత గలిగెనేని నా కొసఁ । గు తదీయాలోకనం బగు తెఱంగు కృపన్. 352

ప్రతిపదార్థం: శ్రుతిపరతయున్= వేదనిష్ఠ; గురుభక్తియున్= గురువుపట్ల భక్తి అనేవి; మతిన్= నా హృదయంలో; కలవు= ఉన్నాయి; ఒక కొంతకొంత= ఏ కొంచెమయినా; మన్నింపఁగన్= గౌరవించటానికి; పాత్రత= అర్హత; కలిగెన్+ఏనిన్= నాకు ఉన్నట్టయితే; తదీయ= ఆ మూలాకృతియొక్క; ఆలోకనంబు= దర్శనం; అగు= అయ్యే; తెఱంగున్= పద్ధతిని (ఉపాయాన్ని, మార్గాన్ని); కృపన్= దయతో; నాకున్= నాకు; ఒసఁగు(ము)= ఇమ్ము (అనుగ్రహించు - తెలియజేయుము).

తాత్పర్యం: మహానుభావా! నాకు వేదాలపట్ల నిష్ఠ ఉన్నది . గురువులపట్ల భక్తి ఉన్నది. వీటివలన ఏ కొంచెమయినా గౌరవార్హత నాకు కలిగినట్టయితే దయచేసి నీ మూలస్వరూపాన్ని దర్శించే అవకాశం కల్పించుము.

వ. అని వేఁడిన భక్తపరాధీనుండైన యమ్మహానుభావుం డద్దేవసంయమితోఁ బరమైకాంతి వగుము. నీ కట్టి పెంపు సంపాదించెదం బొ మ్మని యత్యాదరంబున వీడుకొలిపినం బ్రీతుండై యవ్వియద్వీథిం జని యమ్ముని

గనకనగంబునందు నియతాత్ముండయి యుండి దుగ్ధార్ణవంబు నుత్తరంబు చేరువ నున్న శ్వేతద్వీపంబునం దనాహారులు నింద్రియవృత్తిరహితులు నస్వేదులు సుగంధిశ్వేతాంగులు నగు పురుషులం గాంచె ననిన విని ధర్మపుత్రుం డవ్విశేషంబులు ముక్తలక్షణంబులై యున్నయవి యప్పురుషుల తెఱం గెఱింగింపవే ? యని యడిగిన శంతనునందనుం డతని కిట్లనియె. 353

ప్రతిపదార్థం: అని; వేఁడినన్= అభ్యర్థించగా; భక్తపరాధీనుండైన= భక్తులకు పరవశుడైన; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడు; ఆ+దేవసంయమితోన్= ఆ దేవర్షి నారదుడితో; పరమ+ఏకాంతివి= మిక్కిలి ఏకాగ్రచిత్తుడవు; అగుము= కమ్ము; నీకున్= నీకు; అట్టి= అటువంటి; పెంపున్= శక్తిని (మహత్తును); సంపాదించెదన్= కలిగిస్తాను; పొమ్ము= వెళ్ళుము; అని; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; వీడుకొలిపినన్= సాగనంపగా; ప్రీతుండు+ఐ= సంతుష్టుడై; వియత్+వీథిన్= ఆకాశమార్గంలో; చని= ప్రయాణించి; ఆ+ముని= ఆ నారదుడు; కనకనగంబునందున్= మేరుపర్వతంమీద; నియత+ఆత్ముండు+అయి= నియమబద్ధుడై; ఉండి= (తపోదీక్షతో) ఉండి; దుగ్ధ+అర్ణవంబు+ఉత్తరంబు+చేరువన్= క్షీరసముద్రం యొక్క ఉత్తరతీరంలో; ఉన్న; శ్వేతద్వీపంబునందున్= శ్వేతద్వీపంలో; అనాహారులున్= ఆహారం తీసికొననివారూ; ఇంద్రియవృత్తి రహితులున్= ఇంద్రియవ్యాపారాలనన్నింటినీ వదిలించుకొన్నవారూ (జితేంద్రియులు); అస్వేదులున్= స్వేదం (చెమట) పట్టనివారూ; సుగంధి= పరిమళించే; శ్వేత+అంగులున్= తెల్లని శరీరాలు కలవారూ; అగు= అయినటువంటి; పురుషులన్= పురుషులను; కాంచెన్= (నారదుడు) దర్శించాడు; అనినన్= అని భీష్ముడు చెప్పగా; విని= ఆలకించి; ధర్మపుత్రుండు= ధర్మరాజు; ఆ+విశేషంబులు= ఆ విశేషాలు; ముక్తలక్షణంబులు+ఐ= ముక్తి పొందినవారి చిహ్నాలై; ఉన్నయవి= ఉన్నాయి; ఆ+పురుషుల= ఆ పురుషులయొక్క; తెఱంగున్= పద్ధతి అంతా; ఎఱింగింపవే?= తెలియజేయవా?; అని; అడిగినన్= అడిగితే; శంతనునందనుండు= భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని వేడగా నారాయణుడు నారదుడితో ఇట్లా అన్నాడు: 'నీవు మిక్కిలి ఏకాగ్రచిత్తుడవు కమ్ము. నీకు కూడ అటువంటి మహత్తును కలిగిస్తాను పొమ్ము' అని ఆదరంతో వీడుకొల్పాడు. నారదుడు గగనమార్గంలో పయనించి మేరుపర్వతంమీద నియమనిష్ఠలతో, క్షీరసముద్రపు టుత్తరతీరంలో ఉన్న శ్వేతద్వీపంలో నిరాహారులై, జితేంద్రియులై, చెమట పట్టనివారై, పరిమళయుతమైన తెల్లని మేనులతో ఉన్న పురుషులను చూచాడు.' అని భీష్ము డనగా 'ఆ లక్షణాలు ముక్తులైన పురుషుల చిహ్నాలై ఉన్నాయి. ఆ పురుషులపద్ధతి నాకు తెలియజెప్పు' మని అడిగాడు. భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. ' వారల కథ మా తండ్రికి । గారవమున బుధులు సెప్పఁగా నే వింటిం
గౌరవముఖ్య! విశిష్టా । చారుఁడు నృపుఁ డొక్కఁ డుపరిచరవసు వనఁగన్. 354

ప్రతిపదార్థం: కౌరవముఖ్య!= ధర్మరాజా!; వారలకథ= ఆ పురుషుల వృత్తాంతం; మా తండ్రికిన్= మా నాన్నగారికి; గారవమునన్= గౌరవంతో (ప్రేమతో); బుధులు= దేవతలు లేదా పండితులు; చెప్పఁగాన్= చెపుతుండగా; ఏన్= నేను; వింటిన్= విన్నాను; విశిష్ట+ఆచారుఁడు= విశిష్టమైన ఆచారాలు కలిగినవాడైన; నృపుఁడు= రాజు; ఒక్కఁడు= ఒకానొకడు; ఉపరిచరవసువు= ఉపరిచర వసువు; అనఁగన్= అనే పేరుతో.

తాత్పర్యం: 'ధర్మరాజా! సుగంధిశ్వేతాంగులైన ఆ పురుషుల వృత్తాంతం ఒకప్పుడు బుధులు మా తండ్రిగారికి చెప్పుతుంటే నేను విన్నాను. అది నీకు చెప్పుతాను. ఉపరిచరవసువు అనే పేరుతో ఒక రాజు ఉండేవాడు. ఆయన ఆచారపరాయణుడు.

ఆ. కలిగెఁ దొల్లి భూమి గలయంతయును నేలు । సత్యమును దమంబు శమము విష్ణు
భక్తియును నయంబు బలిమియుఁ గ్రతుకుతూ । హలము బ్రాహ్మణ ప్రియంబుఁ గలఁడు. 355

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; కలిగెన్= (ఉపరిచరవసువు అనే రాజు) ఉన్నాడు; భూమి+కల+అంతయునున్= మొత్తం ఉన్న భూమిని అంతటినీ (భూగోళం మొత్తాన్ని); ఏలున్= పరిపాలిస్తూ ఉండేవాడు; సత్యమునున్= సత్యవాక్య పరిపాలనమూ; దమంబున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; శమము= అంతరింద్రియ నిగ్రహమూ; విష్ణుభక్తియునున్= విష్ణుమూర్తి పట్ల భక్తీ; నయంబు+బలిమియున్= నైతిక బలమూ (రాజనీతివలన కలిగే బలం. లేదా నయంబున్= రాజనీతి; బలిమియున్= సైన్యబలమూ - స్వీయబలమూ); క్రతు= యజ్ఞాలపట్ల; కుతూహలమున్= చేయాలనే ఉత్సాహమూ; బ్రాహ్మణ= బ్రాహ్మణులపట్ల; ప్రియంబున్= ఇష్టమూ; కలఁడు= కలిగినవాడు అతడు.

తాత్పర్యం: ఆ ఉపరిచరవసువు మొత్తం భూగోళాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు సత్యసంధుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, విష్ణుభక్తుడు, రాజనీతికుశలుడు. అదే అతడికి బలం. యజ్ఞయాగాదులు చేయటమంటే ఆయనకు ఎంతో సంబరం. బ్రాహ్మణులపట్ల చాలా ప్రేమగా ఉండేవాడు.

వ. అమ్మహాత్ముండు. 356

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముఁడు= మహానుభావుడైన ఆ ఉపరిచరవసువు.

తాత్పర్యం: మహానుభావుడైన ఆ ఉపరిచరవసువు.

చ. అలఘు తపంబుఁగోరి వసుధాధిపతిత్వము డిగ్గఁద్రావి కా
నలఁ జరియించుచుండ సురనాయకుఁ డాతని పాలికేఁగి 'నె
చ్చెలివయి నా కడం దగ వసింపుము వచ్చుచుఁ బోవుచున్న మే
లిలయును నేలు దివ్యతయు నిచ్చితి మెచ్చితి నీదు నిష్ఠకున్. 357

ప్రతిపదార్థం: అలఘు తపంబున్= మహాతపస్సును; కోరి= చేయగోరి (ఆ వసురాజు); వసుధా+అధిపతిత్వము= రాజ్యాధికారాన్ని; డిగ్గఁద్రావి= పరిత్యజించి; కానలన్= అడవుల్లో; చరియించుచుండన్= సంచరిస్తుండగా; సురనాయకుఁడు= దేవేంద్రుడు; ఆతనిపాలికిన్= ఆ వసురాజుదగ్గరకు; ఏఁగి= వెళ్ళి; నెచ్చెలివి+అయి= మంచి మిత్రుడవై; నాకడన్= నా దగ్గర; తగన్= తగినట్లు; వసింపుము= ఉండుము; వచ్చుచున్+పోవుచున్నన్= (లేదంటే) మా నగరానికి వస్తూ పోతూ ఉంటే; మేలు= మంచిది; ఇలయునున్= భూమినికూడా; ఏలు(ము)= పరిపాలించుము; దివ్యతయున్= దివ్యత్వాన్ని కూడా; ఇచ్చితిన్= నీకు ఇచ్చాను; నీదు నిష్ఠకున్= నీ తపోదీక్షకు; మెచ్చితిన్= మెచ్చాను.

తాత్పర్యం: ఆ వసురాజు మహాతపస్సును చెయ్యాలని నిశ్చయించుకొని రాజ్యభారాన్ని వదలి అరణ్యాలలోనికి వెళ్ళిపోయాడు. ఒక రోజున దేవేంద్రుడు అతడి దగ్గరకు వచ్చాడు. 'వసురాజా! నాతో స్నేహం చేయుము. నాతో ఉండుము. మా నగరానికి (అమరావతికి) వస్తూ పోతూ ఉండుము. ఈ భూమినికూడా పరిపాలించుము. నీకు దివ్యత్వాన్ని ఇస్తున్నాను. నీ తపోనిష్ఠకు మెచ్చుకొంటున్నాను.

తే. దేవభావంబునకుఁ దగ దీనినెక్కి । తిరుగు మెల్లెడ' నని రత్నదీప్తమైన
యొక విమానంబు సంప్రీతి నొసఁగె నతఁడు । నతని మాటకు మిగులక యట్ల చేసె. 358

ప్రతిపదార్థం: దేవభావంబునకున్= దివ్యత్వానికి; తగన్= తగినట్లుగా; దీనిన్= ఈ విమానాన్ని; ఎక్కి= అధిరోహించి; ఎల్ల+ఎడన్= అంతటా (సకలలోకాలూ); తిరుగుము= విహరించుము; అని; రత్న= రత్నాలతో; దీప్తమైన= ప్రకాశించే; ఒక+విమానంబున్= ఒక విమానాన్ని; సంప్రీతిన్= ప్రేమతో; ఒసఁగెన్= బహూకరించాడు; అతఁడున్= ఆ వసురాజుకూడా; అతని మాటకున్= ఆ ఇంద్రుడి మాటకు; మిగులక= జవదాటకుండా; అట్లు+అ= అలాగే; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: దివ్యత్వానికి అనువుగా ఇదిగో - ఈ విమానాన్ని స్వీకరించి దీనిమీద సకలలోకాలకూ రాకపోకలు చేయుము.' అంటూ ఇంద్రుడు రత్నఖచితమైన ఒక విమానం వసురాజుకు బహూకరించాడు ఇంద్రుడిమాట కాదనలేక వసురాజు అట్లాగే నని స్వీకరించాడు.

వ. దానం జేసి వసునామధేయుండైన యతండుపరిచరుఁడనం బరఁగె నదియునుం గాక వేఱొక్కటి యవ్విభుని విశేషంబు వినుము -కల్పాదియందు మరీచి యత్రి అంగిరసుండు పులహుండు పులస్త్యుండు క్రతువు వసిష్ఠుండనియెడు మహామునులు చిత్రశిఖండినామధేయులు స్వాయంభువుండను మనువుం దారు ననేకవర్షంబులు విష్ణు నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుం డదృశ్యరూపంబున వారల కట్టెదుర నిల్చి వారితో 'మీరు ధర్మశాస్త్రకరణ ప్రవణులరై నన్నాశ్రయించితిరి. భారతి మీయందు నిలువ నియోగించితి. మీచేతం బ్రణీతంబై సకల జగంబులకు హితంబును మర్యాదాప్రవర్తకంబును నై శాస్త్రంబు వెలుంగు నంగిరసువలన బృహస్పతి యను నొక్క మహామతి జన్మించు వానియం దాసందర్భంబు ప్రతిష్ఠించునది' యని యానతిచ్చి వెండియు. 359

ప్రతిపదార్థం: దానన్+చేసి= అట్లా విమానం ఎక్కి తిరగటంచేత; వసునామధేయుండైన= వసువు అనే పేరుగలిగిన; అతండు= ఆ రాజు; ఉపరిచరుఁడు+అనన్+పరఁగెన్= ఉపరిచరుడు అనే ప్రఖ్యాతిని పొందాడు; అదియున్+కాక= అదీకాక; ఆ+విభుని= ఆ వసురాజుగారి; వేఱొక్కటి+విశేషంబు= మరొక విశేషం; వినుము; కల్ప+ఆదియందున్= ఈ కల్పానికి ఆదిలో, మరీచి - అత్రి - అంగిరసుండు, పులహుండు, పులస్త్యుండు, క్రతువు, వసిష్ఠుండు; అనియెడు= అనేటువంటి; మహామునులున్= మహర్షులూ; చిత్ర - శిఖండి నామధేయులున్= చిత్రుడు, శిఖండి అనేవారూ; స్వాయంభువుండు+అను= స్వాయంభువుడు అనే; మనువున్= మనువూ; తారున్= తామంతా; అనేకవర్షంబులు= అనేక సంవత్సరాలపాటు; విష్ణున్+ఉద్దేశించి= విష్ణుమూర్తిని మనస్సులో పెట్టుకొని; తపంబు+చేసినన్= తపస్సు చేస్తే; ఆ+దేవుండు= ఆ విష్ణు భగవానుడు; అదృశ్యరూపంబునన్= అదృశ్యరూపంలో; వారల= వారియొక్క; కట్టెదురన్= ఎట్టఎదుట; నిల్చి= నిలబడి; వారితోన్= వారందరితోనూ; మీరు= మీరంతా; ధర్మశాస్త్ర కరణ= ధర్మశాస్త్రాలను రచించటంలో; ప్రవణులరు+ఐ= తత్పరులై; నన్నున్= నన్ను; ఆశ్రయించితిరి= ఆశ్రయించారు; భారతిన్= సరస్వతిని; మీయందున్= మీలో; నిలువన్= నివసించటానికి; నియోగించితిన్= ఆజ్ఞాపించాను; మీచేతన్= మీచేత; ప్రణీతంబై= రచింపబడి; సకలజగంబులకున్= సమస్తలోకాలకూ; హితంబునున్= మేలునూ; మర్యాదాప్రవర్తకంబునున్+ఐ= కట్టుబాటుల అమలునూ చేసేదై; శాస్త్రంబు= ధర్మశాస్త్రం; వెలుంగున్= ప్రకాశిస్తుంది; అంగిరసువలనన్= అంగిరసుడికి; బృహస్పతి+అను= బృహస్పతి అనేటువంటి; ఒక్క= ఒకానొక; మహామతి= మహాధీశాలి; జన్మించున్= ప్రభవిస్తాడు; వానియందున్= ఆ బృహస్పతిలో; ఆ+సందర్భంబు= ఆ శాస్త్రగ్రంథం; ప్రతిష్ఠించునది= నెలకొల్పండి (బృహస్పతికి బోధించి, ఆ శాస్త్రానికి అతడిని వారసుడిని చేయండి); అని; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞాపించి; వెండియున్= తిరిగి ఇట్లా.

తాత్పర్యం: వసువు అనే పేరుగల ఆ రాజు అట్లా విమానం ఎక్కి తిరగటంచేత ఉపరిచరుడు అనే ప్రఖ్యాతిని పొందాడు. మరొకవిశేషం వినుము. కల్పాదిలో మరీచి మొదలైన మునులూ, చిత్తుడు, శిఖండి, స్వాయంభువుడు (మనువు), అనేక సంవత్సరాలు విష్ణువును గూర్చి తపస్సు చేశారు. ఆ దేవుడు వారికి అదృశ్యరూపంలో వారి ఎదుట నిలిచి 'మీరంతా ధర్మశాస్త్రాలు రచించటంలో ఆసక్తులై నన్ను ఆశ్రయించారు. సరస్వతిని మీలో నిలవాలని

ఆజ్ఞాపించాను. మీ వలన ధర్మశాస్త్రం సమస్త లోకాలకూ మేలును, మర్యాదలను కలిగించేటట్లు వెలుగొందుతుంది. అంగిరసుడికి బృహస్పతి పేర ఒక మేధావి జన్మిస్తాడు. అతడి ద్వారా శాస్త్ర గ్రంథాన్ని నెలకొల్పండి' అని ఆజ్ఞాపించి మరల ఇట్లా అన్నాడు:

తే. ' ఉపరిచరవసు వను నొక్క నృపతి వుట్టు । నాతఁ డర్హు డా శాస్త్రంబు నధిగమింప
నా బృహస్పతి సెప్పంగ నధిగమించి । తత్సమాచార నాయకత్వము వహించు. 360

ప్రతిపదార్థం: ఉపరిచరవసువు= ఉపరిచరవసువు; అను= అనేటటువంటి; ఒక్క నృపతి= ఒక రాజు; పుట్టున్= జన్మిస్తాడు; ఆతఁడు= ఆయన; ఆ శాస్త్రంబున్= ఆ ధర్మశాస్త్రాన్ని; అధిగమింపన్= పొందటానికి (నేర్చుకోవటానికి); అర్హుఁడు= యోగ్యుడు; ఆ బృహస్పతి= అంగిరసుడి కుమారుడై పుట్టబోయే ఆ బృహస్పతి; చెప్పంగన్= నేర్పగా; అధిగమించి= నేర్చుకొని; తద్+సమ= ఆ శాస్త్రంతో సమానమైన; ఆచార= ఆచరించటానికి నాయకత్వమున్= నేతృత్వాన్ని; వహించున్= వహిస్తాడు.

తాత్పర్యం: 'మహర్షులారా! ఉపరిచరవసువు అనే ఒక మహారాజు జన్మిస్తాడు. అతడు మీరు రచించబోయే ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటానికి యోగ్యుడు. బృహస్పతి నేర్పగా అతడు నేర్చుకొని శాస్త్రప్రకారం ఆచరిస్తూ యజ్ఞయాగాది ఆచారాలకు నాయకుడు ఔతాడు.

వ. ' అమ్మహితాత్ముండు మద్భక్తుండు మీకు సంభావనీయుం' డని పలికి చనియె నత్తెఱంగునన యా పెంపు నొందినయట్టి యవ్వసువు హయమేధంబునకుం బ్రవర్తించిన నమ్మరీచ్యాదులగు సప్తసంఖ్యులును మఱియునుం దత్సములగు మహానుభావులును ఋత్విక్కరణంబు లాచరించిరి, బృహస్పతి యుపదర్శనంబు నడపెఁ, బ్రజాపతిపుత్రు లగు నేకతుండును ద్వితుండును త్రితుండును ననుమునిసత్తములు సదస్యులై రిట్లు సెల్లు నయ్యధ్వరంబునందు. 361

ప్రతిపదార్థం: ఆ+మహిత+ఆత్ముండు= మహానుభావుడైన ఆ వసురాజు; మత్+భక్తుండు= నా భక్తుడు; మీకున్= మీ కందరికీ; సంభావనీయుండు= గౌరవింపదగినవాడు; అని; పలికి= చెప్పి; చనియెన్= విష్ణుమూర్తి వెళ్ళిపోయాడు; ఆ+తెఱంగునన్+అ= అదే విధంగా; ఆ+పెంపున్= ఆ అభివృద్ధిని; ఒందినయట్టి= పొందినటువంటి; ఆ+వసువు= ఆ వసుమహారాజు; హయమేధంబునకున్= అశ్వమేధయజ్ఞం చేయటానికి; ప్రవర్తించినన్= పూనుకొంటే; ఆ+మరీచి+ఆదులు+అగు= మరీచిప్రభృతులైన ఆ; సప్తసంఖ్యులునున్= ఏడుగురూ; మఱియునున్= ఇంకా; తద్+సములు+అగు= వారితో సమానులైన; మహానుభావులునున్= మహాత్ములూ; ఋత్విక్+కరణంబులు= ఋత్విక్కులు చేసే పనులు (యాజ్ఞికత్వాలను); ఆచరించిరి= చేశారు; బృహస్పతి= ఆంగిరసుడు; ఉపదర్శనంబున్= పెత్తనాన్ని; నడపెన్= నడిపాడు; ప్రజాపతిపుత్రులు+అగు= బ్రహ్మదేవుడి కుమారులైన; ఏకతుండును= ఏకతుడూ; ద్వితుండునున్= ద్వితుడూ; త్రితుండునున్= త్రితుడూ; అను= అనే; మునిసత్తములు= మునిశ్రేష్ఠులు; సదస్యులు+ఐరి= సభ్యులయ్యారు; ఇట్లు; చెల్లు= నడుస్తున్న; ఆ+అధ్వరంబునందున్= ఆ యజ్ఞంలో.

తాత్పర్యం: మహానుభావుడైన ఆ వసురాజు నా భక్తుడు, గౌరవింపదగినవాడు' అని చెప్పి విష్ణువు వెళ్ళిపోయాడు. వసుమహారాజు అభివృద్ధి పొంది అశ్వమేధయాగం చేశాడు. అందులో మరీచి మొదలైన సప్తర్షులు, మరికొందరు ఋత్విక్కులుగా పాల్గొన్నారు. బృహస్పతి దర్శకత్వం వహించాడు. బ్రహ్మ పుత్రులైన ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ సదస్యులయ్యారు. అట్లా నడుస్తున్న ఆ యజ్ఞంలో.

తే. అన్నరేంద్రుం డహింసకుం డగుటఁ జేసి । పశు విశసనంబు లేకుండఁ బరమనిష్ఠ
నాతఁ డారణ్యకోద్గీత మైన వాక్య । సంచయము విష్ణుగుఱిచి పలించె నధిప! 362

ప్రతిపదార్థం: అధిప= ధర్మరాజా!; ఆ+నరేంద్రుండు= ఆ వసుమహారాజు; అహింసకుండు= ప్రాణిహింసకు వ్యతిరేకి; అగుటన్+చేసి= కావటంచేత; పశువిశసనంబు= యజ్ఞంలో పశువును బలి ఇవ్వటం అనేది; లేకుండన్= లేకుండా దాని బదులు; పరమనిష్ఠన్= అత్యంతనిష్ఠతో; ఆతఁడు= యజమానుడైన ఆ వసురాజు; ఆరణ్యక+ఉద్గీతము+ఐన= ఆరణ్యకాలు అనే వేదభాగాలలో చెప్పబడిన; వాక్యసంచయమున్= మంత్రసమూహాన్ని; విష్ణుగుఱిచి= విష్ణుమూర్తినుద్దేశించి; పఠించెన్= జపించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ వసుమహారాజు జీవహింసకు వ్యతిరేకి. అందుచేత అశ్వమేధంలో పశుసంహారానికి అంగీకరించలేదు. దానికి బదులుగా ఆరణ్యకాలలో చెప్పబడిన కొన్ని మంత్రాలను పరమనిష్ఠతో ఆ మహారాజు విష్ణుమూర్తి నుద్దేశించి పఠించాడు.

క. కరుణావిధేయుఁ డగు నా । హరి యతనికిఁ గానవచ్చు నట్టులుగాఁ జె
చ్చెర వచ్చి హవిర్భాగా । హరణం బొనరించి చనుడు నతికుపితుండై. 363

ప్రతిపదార్థం: కరుణా విధేయుఁడు+అగు= దయకు వశంవదుడైన; ఆ+హరి= ఆ విష్ణుమూర్తి; అతనికిన్= ఆ వసురాజుకు మాత్రమే; కానవచ్చునట్టులుగాన్= కనిపించేటట్టు; చెచ్చెరన్+వచ్చి= వేగమే వచ్చి; హవిర్భాగ+ఆహరణంబు+ఒనరించి= యజ్ఞ హవిర్భాగాన్ని (పురోడాశం) స్వీకరించి; చనుడున్= వెళ్ళిపోగా; అతికుపితుండై= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: దయాపరుడైన విష్ణుమూర్తి సంతోషించి యజమానుడైన వసురాజుకు మాత్రమే కనిపించేటట్లు వచ్చి తనకు ఉద్దేశించిన హవిర్భాగాన్ని స్వీకరించి వెంటనే వెళ్ళిపోయాడు. ఆధ్వర్యం వహిస్తున్న బృహస్పతికి కోపం వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. దివ్యధిషణుం డగు ధిషణుండు గన్నీ రొలుక నన్నరపతితోఁ దనకై యెత్తిన పురోడాశభాగంబు విష్ణుం డెల్ల వేలుపులుంబోలె నాకు దర్శనగోచరుండై కొనక యదృశ్యుండై కొనియె నని యుగ్గడించిన నయ్యుపరిచరుండు భరితవినయుండై యతని ననునయించె. సదస్యులు సంభ్రమంబు లేక యన్నాకేశమంత్రితో నిట్లనిరి. 364

ప్రతిపదార్థం: దివ్య= దివ్యమైన; ధిషణుండు= బుద్ధికలవాడు; అగు= అయిన; ధిషణుండు= బృహస్పతి; కన్నీరు+ఒలుకన్= శోకిస్తూ; ఆ+నరపతితోన్= ఆ వసుమహారాజుతో; విష్ణుండు= విష్ణుమూర్తి; తనకై= తనకొరకని; ఎత్తిన= మీదుగట్టిన; పురోడాశభాగంబున్= హవిర్భాగాన్ని; ఎల్ల+వేలుపులున్+పోలెన్= తక్కిన అందరు దేవతలవలె; నాకున్= నాకు; దర్శనగోచరుండై= కనబడుతూ; కొనక= స్వీకరించకుండా; అదృశ్యుండై= అదృశ్యరూపంలో; కొనియెన్= స్వీకరించాడు(డా); అని; ఉగ్గడించినన్= పలికేసరికి; ఆ+ఉపరిచరుండు= ఆ ఉపరిచరవసువు; భరితవినయుండై = నిండా (నిండిన) వినయంతో; అతనిన్= ఆ బృహస్పతిని; అనునయించెన్= ఊరడించాడు (బుజ్జగించాడు); సదస్యులు= సదస్యులుగా వచ్చిన ప్రజాపతి పుత్రులు; సంభ్రమంబు లేక= కంగారుపడకుండా; ఆ+నాక+ఈశమంత్రితోన్= దేవేంద్రుడి మంత్రియైన ఆ బృహస్పతితో; ఇట్లు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ధీమంతుడైన బృహస్పతి కన్నీరు కారుస్తూ వసుమహారాజుతో ఇట్లా అన్నాడు: 'అందరు దేవతలవలె కాక విష్ణువు తన కిచ్చే హవిర్భాగాన్ని ప్రత్యక్షంగా కాక అదృశ్యుడై స్వీకరించా' డని చెప్పాడు. వసుమహారాజు బృహస్పతిని ఊరడించాడు. అప్పుడు ప్రజాపతి పుత్రులు బృహస్పతితో ఇట్లా అన్నారు:

ఏకతద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట (సం. 12-323-19)

సీ. ' అలుక మానుము హరికై సముద్యతమైన । భాగంబు హరిగొన్నఁ బదరనేల?
యతని దర్శింప శక్యమె నీకు మాకును? । నజుని మానస పుత్రు లైన యేము
హరిదర్శనముఁ గోరి యధికతపం బాచ । రించుచుండఁగ నశరీరవాణి
దుగ్ధార్ణవంబునందు విశాల రమణీయ । మగు నొక్కదీవి దెల్పారియుండు

తే. నచటి కరుగుఁ డనుచు నతి సితవర్ణుల । స్వేదు లింద్రియప్రవృత్తి విముఖు
లధిక సురభిదేహు లాహార రహితులు । హరిపరాత్ములైన నరులు గలరు. 365

ప్రతిపదార్థం: ఓ బృహస్పతీ! అలుక= కోపం; మానుము= విడిచిపెట్టుము; హరికై= విష్ణుమూర్తికోసం; సముద్యతము+ఐన= మీదుగట్టిన; భాగంబున్= హవిర్భాగాన్ని; హరి= విష్ణుమూర్తి; కొన్నన్= స్వీకరిస్తే; పదరన్+ఏల= బాధ పడటం ఎందుకు?; అతనిన్= ఆ విష్ణుమూర్తిని; దర్శింపన్= చూడగలగటమనేది; నీకున్= నీకూ; మాకునున్= మాకూ; శక్యమె?= సాధ్యమా?; అజుని= బ్రహ్మదేవునియొక్క; మానసపుత్రులు+ఐన= మనస్సు నుంచి జన్మించిన కుమారులమైన; ఏము= మేము ముగ్గురమూ; హరిదర్శనమున్= విష్ణుమూర్తి దర్శనాన్ని; కోరి; అధికతపంబు= గొప్ప తపస్సు; ఆచరించుచున్+ఉండఁగన్= చేస్తూండగా; అశరీరవాణి= ఆకాశవాణి; దుగ్ధ+అర్ణవంబునందున్= క్షీరసముద్రంలో; విశాల= విశాలమూ; రమణీయము= రమణీయమూ; అగు= అయిన; ఒక్క= ఒకానొక; దీవి= ద్వీపం; తెలుపు+ఆరి+యుండున్= తెల్లగా ఉంటుంది; అచటికిన్= అక్కడికి; అరుగుఁడు= వెళ్ళండి; అచటన్= ఆ ద్వీపంలో; అతిసితవర్ణులు= మిక్కిలి తెల్లని రంగు కలవారూ; అస్వేదులు= చెమటపోయనివారూ; ఇంద్రియప్రవృత్తి= ఇంద్రియవ్యాపారాలపట్ల; విముఖులు= వైముఖ్యం కలవారూ; అధిక= బాగా; సురభి= పరిమళాలు విరజిమ్మే; దేహులు= శరీరాలు కలవారూ; ఆహారరహితులు= ఆహారం ఏమీ తీసికొననివారూ; హరి+పర+ఆత్ములు= విష్ణుమూర్తి పట్ల సంలగ్నమైన ఆత్మలు కలవారూ; ఐన= అయినటువంటి; నరులు= పురుషులు; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: 'ఓ బృహస్పతీ! ఎందుకయ్యా అనవసరంగా అలుగుతావు? కోపం వదలుము. విష్ణుమూర్తికొరకని ఎత్తిన హవిరంశాన్ని విష్ణుమూర్తి తీసికొనివెళ్ళాడు. దానికి నీవు అలగటం ఎందుకు? నీవు బాధపడటం ఎందుకు? ఆయనను దర్శించటమనేది నీకూ మాకూ అవుతుందా! సాక్షాత్తూ బ్రహ్మమానసపుత్రులమైన మాకే సాధ్యం కాలేదు. విష్ణుమూర్తి దర్శనం కోరి మేము ముగ్గురమూ బ్రహ్మాండమైన తపస్సు చేశాం. అపుడు అశరీరవాణి మాకు వినిపించేటట్లు ఇట్లా చెప్పింది. క్షీరసముద్ర మధ్యభాగంలో ఒక శ్వేతద్వీపం ఉన్నది. అక్కడికి వెళ్ళండి. ఆ ద్వీపంలో మిక్కిలి తెల్లని రంగువారూ, చెమట పట్టనివారూ, జితేంద్రియులూ, పరిమళాలు విరజిమ్మే శరీరం కలవారూ, నిరాహారులూ, హరిభక్తి పరాయణులూ అయిన నరులు ఉంటారు.

క. వారలకుఁ జూపు నిజతే । జోరూపము విష్ణుఁ డపుడు సూడఁగనైనన్
మీరును జూతు రనినఁ బ్రియ । మారిన చిత్తములతోడ నందఱము వెసన్. 366

ప్రతిపదార్థం: వారలకున్= ఆ నరులకు; విష్ణుఁడు= విష్ణుమూర్తి; నిజ= తనయొక్క; తేజస్+రూపమున్= కాంతిమయమైన రూపాన్ని; చూపున్= చూపిస్తూ ఉంటాడు (కాంతి స్వరూపుడుగా దర్శనం అనుగ్రహిస్తాడు); అపుడు= ఆ సమయంలో; చూడఁగన్+ఐనన్= చూడగలిగితే (చూడటం తటస్థపడితే); మీరునున్= మీరుకూడా; చూతురు= చూద్దురుగాని; అనినన్= అని అశరీరవాణి చెప్పగా; ప్రియము+ఆరిన= ప్రీతినిండిన; చిత్తములతోడన్= హృదయాలతో; అందఱమున్= మేము ముగ్గురమూ; వెసన్= వెంటనే.

తాత్పర్యం: ఆ నరులకు విష్ణుమూర్తి తన తేజోరూపాన్ని చూపిస్తూ ఉంటాడు. అప్పుడు చూడగలిగితే మీరూ చూద్దురుగాని - అని ఆకాశవాణి చెప్పింది. ఆ మాటలకు మా హృదయాలు ఆనందపరవశాలు అయ్యాయి. ముగ్గురమూ వెంటనే బయలుదేరాము.

వ. శ్వేతద్వీపంబునకుం జని యశరీరవాణి సెప్పిన చందంబు మానవులం గంటి మట్టి దీప్తి విశేషంబు లే లోకంబుల నెజ్జాతులకు లేవు. వారలు మానసజప పరాయణులైయున్నవా రే మయ్యెడ నేకాంతిజనుల కింతనంత నున్నంత భాను సహస్ర ప్రభాభాసితంబగు నొక్కదివ్య తేజోరూపంబు వారి యగ్రభాగంబునం దోఁచిన వారు గూడుకొని భక్తిమయ ప్రణామంబులు సేయుచుం జేరి జయ పుండరీకాక్ష! జయ హృషీకేశ! జయ విశ్వభావన! నమస్తే నమస్తే యను నెలుంగులు నింగిముట్టం గొల్పి రట్టియెడ. 367

ప్రతిపదార్థం: శ్వేతద్వీపంబునకున్= ఆ శ్వేతద్వీపానికి; చని= వెళ్ళి; అశరీరవాణి= ఆకాశభారతి; చెప్పిన+చందంబు+మానవులన్= చెప్పిన తీరులోనే ఉన్న నరులను; కంటిమి= చూశాము; అట్టి= అటువంటి; దీప్తివిశేషంబులు= విశిష్టమైన శరీరకాంతులు (రూపప్రకాశం); ఏ లోకంబులన్= ఏ లోకాలలోనూ; ఏ+జాతులకున్= ఏ జాతులవారికీ; లేవు= ఉండవు; వారలు= ఆ శ్వేతశరీరాలు; మానస+జప+పరాయణులు+ఐ= మనస్సులో ధ్యానతత్పరులై; ఉన్నవారు= ఉన్నారు; ఏము= మేము; అయ్యెడన్= అక్కడ; ఏకాంతిజనులకున్= ఏకాగ్రచిత్తులైన ఆ విష్ణుభక్తులకు; ఇంతన్+అంతన్= చేరువలో (ఇంతా అంతా దూరాలలో); ఉన్నంతన్= నిలువగా; భానుసహస్ర= వేయిమంది సూర్యబింబాల; ప్రభా= వెలుగులతో; భాసితంబు+అగు= ప్రకాశించే; ఒక్క= ఒకానొక; దివ్యతేజోరూపంబు= దివ్యమైన కాంతిమయ స్వరూపం; వారి= ఆ శ్వేతవర్ణుల; అగ్రభాగంబునన్= ఎట్టయెదుట; తోఁచినన్= ప్రత్యక్షమయ్యేసరికి; వారు= ఆ నరులందరూ; కూడుకొని= సామూహికంగా; భక్తిమయ= భక్తితో నిండిన; ప్రణామంబులు= నమస్కారాలు; చేయుచున్= చేస్తూ; చేరి= సమీపించి; పుండరీకాక్ష!= తెల్లతామరల వంటి కన్నులుకలవాడా!; జయ= నీకు జయము; హృషీకేశ!= ఓ విష్ణూ!; జయ= జయము; విశ్వభావన!= విశ్వరూపా!; జయ= నీకు జయము నమః+తే= నీకు నమస్కారము; నమః+తే= నీకు నమస్కారము; అను= అనే; ఎలుంగులు= కంఠధ్వనులు; నింగి+ముట్టన్+కొల్పిరి= ఆకాశం అంటేటట్లు చేశారు (మిన్ను ముట్టేలా బిగ్గరగా జయజయ ధ్వానాలు చేశారు); అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ శ్వేతద్వీపానికి వెళ్ళి, ఆకాశవాణి చెప్పినట్లుగా ఉన్న మానవులను చూచాం. అటువంటి విశిష్టమైన శరీరరూపాలు ఏ లోకాలలోనూ ఏ జాతులవారికీ ఉండవు. ఆ శ్వేతశరీరులు మనస్సులో ధ్యానతత్పరులై ఉన్నారు. మేము అక్కడ ఏకాగ్రమైన మనస్సుతో ఆ విష్ణుభక్తుల చెంత నిలువగా వేయిమంది సూర్యబింబాల వెలుగులతో ప్రకాశించే ఒకానొక దివ్యమైన కాంతిమయ స్వరూపం ఆ శ్వేతవర్ణుల ఎట్టయెదుట ప్రత్యక్షమయ్యేసరికి ఆ నరులందరూ సామూహికంగా భక్తితో నిండిన నమస్కారాలు చేసి 'తెల్లతామరలవంటి కన్నులుకలవాడా! నీకు జయము! హే విష్ణూ! నీకు జయము. విశ్వరూపా! నీకు జయము జయము.' అంటూ మిన్నుముట్టేటట్లు జయజయధ్వానాలు చేశారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: హృషీకము= ఇంద్రియము. హృషీక+ఈశుఁడు= ఇంద్రియాలను స్వాధీనపరచుకొన్నవాడు - విష్ణువని అర్థం.

క. మా నయనంబులు దత్తే। జోనిహతము లగుడుఁ దెలియఁ జూడ నశక్యం
బైనం జేడ్పడి యుండం। గా నొక భూతంబు వలికె గగనతలమునన్. 368

ప్రతిపదార్థం: మా నయనంబులు= మా కన్నులు; తత్+తేజోనిహతములు= ఆ కాంతిచేత చూడలేనివి; అగుడున్= కావటంచేత; తెలియన్= స్పష్టంగా; చూడన్= చూడటానికి; అశక్యంబు+ఐనన్= సాధ్యం కాకపోగా; చేడ్పడి+ఉండన్= నివ్వెరపాటుచెంది ఉండగా; ఒక భూతంబు= ఒక మహాశక్తి; గగనతలమున్= ఆకాశభాగాన; పలికెన్= మాట్లాడింది.

తాత్పర్యం: ఆ కాంతిచేత మా కన్నులు చూడలేకపోవటంతో ఆ దివ్యరూపాన్ని స్పష్టంగా తెలిసికొనటం సాధ్యంకాక మేమందరం నివ్వెరపాటుచెంది ఉండగా ఒక భూతం ఆకాశపుటంచున ఈ విధంగా పలికింది.

క. ఈ దేవునిఁ గన్నట్టుల । కాదే? యిప్పురుషవరులఁ గాంచుట మీకున్
ఖేదంబు వలదు నియమ త । పోదానము లితనిఁ జూపఁ బూఁటవడియెనే? 369

ప్రతిపదార్థం: ఈ+పురుషవరులన్= నరులలో శ్రేష్ఠులైన ఈ శ్వేతశరీరులను; కాంచుట= చూడటం అనేది; ఈ దేవునిన్= ఈ విష్ణుమూర్తిని; కన్న+అట్టుల+కాదే?= చూసినట్టుకాదా?; మీకున్= మీకు; ఖేదంబు= దిగులు; వలదు= వద్దు (దిగులుపడకండి); నియమ= మీరు ఆచరించిన నియమాలూ; తపః= తపస్సులూ; దానములు= దానాలూ; ఇతనిన్+చూపన్= ఈ దేవుడిని దర్శింపజేయటానికి; పూఁట+పడియెనే= పూచీపడ్డాయా?

తాత్పర్యం: బ్రహ్మమానసపుత్రులారా! విష్ణుమూర్తిని దర్శించలేకపోయామే అని ఖేదపడకండి. ఈ శ్వేతశరీరులైన దివ్యపురుషులను దర్శించారు. చాలు. సంతృప్తి పడండి. విష్ణుమూర్తిని దర్శించినట్లే. ఇంతకాలమూ మీరు ఆచరించిన నియమనిష్ఠలూ, తపస్సులూ, దానాలూ ఇవన్నీ విష్ణుమూర్తి దర్శనం మీకు ఇప్పించటానికి ఏమయినా పూచీపడ్డాయా? (మీ తపస్సులు ఇంకా చాలవు సుమా! అని భావం).

క. ఏకాంతిక భక్తిరతి న । నేకములగు వత్సరముల కివ్విష్ణుని నా
లోకింపంగా దొరకొనుఁ । గా కిటు వేగపడ మీకుఁ గానఁగ వశమే? 370

ప్రతిపదార్థం: ఏకాంతిక= తదేకమైన; భక్తి రతిన్= భక్తినిరతితో (దీక్షతో); అనేకములు+అగు+వత్సరములకున్= అనేక సంవత్సరాలకు; ఈ+విష్ణునిన్= ఈ విష్ణుమూర్తిని; ఆలోకింపంగాన్= చూడటానికి; దొరకొనున్+కాక= అవకాశం లభిస్తుందే తప్ప; ఇటు= ఇట్లా; వేగపడన్= తొందరపడితే; మీకున్= మీకు; కానఁగన్+వశమే?= దర్శించటం సాధ్యమా?

తాత్పర్యం: తదేకభక్తితో, దీక్షతో అనేక సంవత్సరాలు తపస్సు చేస్తే, అప్పటికి ఈ విష్ణుమూర్తి దర్శనం లభిస్తుంది. అంతే కాని ఇట్లా తొందరపడితే దొరుకుతుందా? అది అంత తేలిక విషయం కాదు.

క. అని పలికిన విని క్రమ్మఱ । జనుదెంచితి మేము విష్ణు చందం బిది నీ
కనఘా! యలుగం బనిలే । దనూనములు గాఁగ నడపు మధ్వరవిధులన్.' 371

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా!; అని; పలికినన్= (ఆకాశవాణి) పలికితే; విని; ఏము= మేము ముగ్గురమూ; క్రమ్మఱన్= తిరిగి; చనుదెంచితిమి= వచ్చేశాం; విష్ణు+చందంబు= విష్ణుమూర్తియొక్క పద్ధతి; ఇది; నీకున్= నీకు; అలుగన్+పనిలేదు= అలగవలసిన అవసరంలేదు; అధ్వరవిధులన్= ఈ యజ్ఞకర్తవ్యాలను; అనూనములు+కాఁగన్= ఏ లోటూ లేనివిగా; నడపు(ము)= జరిపించుము.

తాత్పర్యం: ఆకాశవాణి ఇట్లా చెప్పేసరికి మేము ముగ్గురం మళ్ళీ తిరిగి వచ్చాం. విష్ణుమూర్తులవారి పద్ధతి అది. అట్లా ఉంటుంది. అందుచేత ఓ బృహస్పతీ! కనిపించకుండా వెళ్ళిపోయాడే విష్ణుమూర్తి - అని నీవు అలగవలసిన పనిలేదు. ఈ అశ్వమేధయజ్ఞంలో ఇంకా మిగిలిపోయిన విధుల నన్నింటినీ ఏ లోటూ రాకుండా శ్రద్ధగానడిపించుము.'

వ. అని యిట్లేకతద్వితత్రితులు సెప్పినం బ్రశాంతుండై పురుహూతపురోహితుం డయ్యాగంబు సుప్రయోగంబుగాఁ
జెల్లించె నా భూవల్లభుం డట్లు పుణ్యపరుం డగుచుఁ బ్రజాపరిపాలనం బొనరించె నట్టియెడ నాకలోకంబునన
సురమునిగోష్ఠి యందు సుర లధ్వరంబుల నజంబుల విశసింపవలయు నని పలికిరి మును లజంబు లన్నంతన

యెల్లయుగంబులను ఛాగంబులఁగాఁ గొనరాదు. కృతయుగ విషయంబుగా వేదంబు లజంబు లోషధులని చెప్పెంగాన యని రిట్లు వివాదంబైన సమయంబున నలవోక నుపరిచరవసు వయ్యెడకుం జనిన నా రెండు దెఱంగులవారును జయాపజయంబులకు నతనిమాట పాటిగా నూఁది యడిగిన నాతండు. 372

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఏకత, ద్విత, త్రితులు= ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ అనే ముగ్గురూ; చెప్పినన్= చెప్పేసరికి; ప్రశాంతుండై= కోపం తగ్గి ప్రశాంతి పొందినవాడై; పురుహూత పురోహితుండు= దేవేంద్రుడి పురోహితుడైన బృహస్పతి; ఆ+యాగంబున్= వసురాజు చేస్తున్న ఆ అశ్వమేధ యజ్ఞాన్ని; సుప్రయోగంబుగాన్= బాగా చేయబడినదానిగా; చెల్లించెన్= పూర్తిచేయించాడు; ఆ+భూవల్లభుండు= ఆ వసుమహారాజు; అట్లు; పుణ్యపరుండు+అగుచున్= పుణ్యతత్పరుడు అవుతూ; ప్రజాపరిపాలనంబు= లోకపరిపాలన; ఒనరించెన్= చేశాడు; అట్టియెడన్= అట్లా ఉండగా ఒకనాడు; నాకలోకంబునన్+అ= దేవలోకంలోనే; సురమునిగోష్ఠియందున్= దేవతలూ, మునులూ జరుపుతున్న ఒక చర్చలో; సురలు= దేవతలు; అధ్వరంబులన్= యజ్ఞాలలో; అజంబులన్= మేకలను (గొర్రెలు); విశసింపన్+వలయున్= బలి ఇవ్వాలి; అని; పలికిరి= అన్నారు; మునులు= మునులేమో; అజంబులు+అన్నంతన= అజములు అనగానే; ఎల్లయుగంబులను= అన్ని యుగాలలోనూ; ఛాగంబులన్+కాన్+కొనరాదు= మేకలు అనే తీసుకోవటానికి వీలులేదు; వేదంబులు= వేదాలు; కృతయుగ విషయంబుగాన్= కృతయుగంలో మాటగా; అజంబులు+ఓషధులు= అజములంటే ఓషధీలతలూ; అని; చెప్పెన్= చెప్పింది; కానన్= కాబట్టి అజములు అంటే అన్ని యుగాల లోనూ ఛాగాలు కాదు యుగయుగానికీ దీని అర్థం మారిపోతూ ఉంటుంది కాబట్టి; అనిరి= అన్నారు; ఇట్లు; వివాదంబు+ఐన+సమయంబునన్= వాదం నడుస్తున్న తరుణంలో; అలవోక+పోలెన్= యథాలాపంగా అన్నట్టు; ఉపరిచరవసువు; అయ్యెడకున్= వివాదం జరుగుతున్న ఆ చోటికి; చనినన్= (తన విమానంమీద) వెళ్ళేసరికి; ఆ+రెండు తెఱంగులవారునున్= ఆ రెండు పద్ధతులవారూ; జయ+అపజయంబులకున్= గెలుపూ ఓటములకు; అతనిమాట= వసురాజుగారి వాక్కే; పాటిగాన్+ఊఁది= ఆధారంగా భావించి (తుదినిర్ణయంగా ఒప్పుకొని); అడిగినన్= అడిగితే; ఆతండు= ఆ వసురాజు.

తాత్పర్యం: ఈ విధంగా ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ అనే ముగ్గురూ చెప్పేసరికి కోపం తగ్గి ప్రశాంతుడై బృహస్పతి వసుమహారాజుయొక్క యజ్ఞాన్ని పూర్తిచేయించాడు. ఆ వసుమహారాజు పుణ్యతత్పరుడై లోకపరిపాలన చేశాడు. అట్లా ఉండగా ఒకనాడు దేవలోకంలోనే దేవతలూ, మునులూ జరుపుతున్న ఒక చర్చలో దేవతలు యజ్ఞాలలో మేకలను బలిఇవ్వాలి అన్నారు. మునులేమో 'అజములు అనగానే అన్ని యుగాలలోనూ మేకలు అనే అర్థాన్ని తీసికొనటానికి వీలులేదు. కృతయుగంలో అజములంటే ఓషధులనే అర్థం గ్రహించాలి' అని అన్నారు. యథాలాపంగా అక్కడకు వెళ్ళిన ఉపరిచరవసువును చూచి, తుదినిర్ణయాన్ని ఉభయపక్షాలవారూ అతడికి వదలివేశారు. దానికి అతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఛాగమ విశసనయోగ్యము । యాగంబుల నెల్ల యుగములందు ననియెం

దా గీర్వాణుల పక్షం । బై గెలు పది యపుడు వారి కగుటకు నధిపా! 373

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; తాన్= ఆ వసురాజు; గీర్వాణుల పక్షంబై= దేవతల పక్షంచేరి; అపుడు= అప్పటికి; గెలుపు+అది= జయమనేది; వారికిన్= దేవతలకు; అగుటకున్= కావటం కోసం; ఎల్లయుగములందున్= అన్ని యుగాలలోనూ; యాగంబులన్= యాగాలలో; ఛాగము+అ= మేకయే; విశసనయోగ్యము= బలి ఇయ్యదగినది; అనియెన్= అన్నాడు;

తాత్పర్యం: అప్పుడు ఆ వసురాజు అన్ని యుగాలలోనూ యజ్ఞాలలో బలి ఇవ్వదగినది మేక ఒక్కటే అని దేవతలను అప్పటికి గెలిపించటంకొరకు వారి పక్షం చేరి వారికి అనుకూలంగా తీర్పు చెప్పాడు.

వ. అనిన విని వేదార్థాపలాపంబునకుం గోపంబు నొందిన మునుల శాపంబున నతండు భూవివరపతితుండై యుండ నమరు లేతెంచి యతని యంతరంగంబునకుం దెలివును నంగంబునకు డప్పి లేకునికియు నొసంగి విష్ణుప్రసాదంబునఁ బ్రత్యాపన్నుండ వగు దని యూఱడించి యరిగి రన్నరవరుండును విష్ణుధ్యాన జపపరాయణుం డగుచుండ నచిరకాలంబునకు విష్ణుండు విహగపతిం బుత్తెంచి యెత్తించికొనిపోయి శరీరంబుతోడన బ్రహ్మలోకగతుం గావించి సంభావించిన నమ్మహానుభావుండు పరమానందంబునొంది వెలింగె. 374

ప్రతిపదార్థం: అనినన్= వసురాజు అట్లా అనేసరికి; విని= మునులు విని; వేదార్థ+అపలాపంబునకున్= వేదార్థాన్ని అన్యథాకరించినందుకు; కోపంబున్+ఒందిన= కోపించిన; మునుల= మునులయొక్క; శాపంబునన్= శాపంతో; అతండు= ఆ వసురాజు; భూవివర+పతితుండు+ఐ+ఉండన్= భూమిరంధ్రంలో పడిపోయినవాడై ఉండగా; అమరులు= దేవతలు; ఏతెంచి= అక్కడికివచ్చి; అతని= ఆ వసుమహారాజుగారి; అంతరంగంబునకున్= (మనస్సుకు) ఆత్మకు; తెలివును= కాంతీ, (జ్ఞాపకం); అంగంబునకున్= శరీరానికి; డప్పి= దప్పికా; లేక+ఉనికియున్= లేకపోవటాన్ని; ఒసంగి= ఇచ్చి (మనస్సుకు తెలివీ, శరీరానికి డప్పికా లేకుండా చేశారు); విష్ణు= విష్ణుమూర్తియొక్క; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; ప్రతి+ఆపన్నుండవు= మళ్ళీ యథాస్థితికీ వచ్చినవాడవు; అగుదు(వు)+అని= అవుతావు అని (మళ్ళీ సురలోకానికి తిరిగి వస్తావని); ఊఱడించి= ఉపశమన వాక్యాలు పలికి; అరిగిరి= వెళ్ళిపోయారు; ఆ+నరవరుండునున్= ఆ వసుమహారాజు; విష్ణుధ్యాన జప పరాయణుండు= విష్ణుమూర్తిని ధ్యానించేవాడూ, జపించేవాడూ; అగుచుండన్= అవుతూ ఉండగా (ధ్యానజపాలు చేస్తూండగా - అని); అచిరకాలంబునకున్= స్వల్పకాలంలోనే; విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; విహగపతిన్= పక్షిరాజయిన గరుత్మంతుడిని; పుత్తెంచి= పంపించి; ఎత్తించి కొనిపోయి= వసురాజును పైకి లేవనెత్తించి తీసికొనివెళ్ళి; శరీరంబుతోడన్+అ= సశరీరంగానే; బ్రహ్మలోకగతున్= బ్రహ్మలోకం పొందిన వాడినిగా; కావించి= చేసి (బ్రహ్మలోకంలో ఆవాసం కల్పించి); సంభావించినన్= గౌరవించేసరికి; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడు; పరమానందంబున్+ఒంది= గొప్ప ఆనందం పొంది; వెలింగెన్= విరాజిల్లాడు.

తాత్పర్యం: వసురాజు అట్లా అనేసరికి వేదార్థాన్ని అన్యథాకరించినందుకు కోపించిన మునులు శపించగా అతడు నేలపై పడ్డాడు. దేవతలు అక్కడికి వచ్చి అతడి మనస్సుకు తెలివీ, శరీరానికి దప్పికా లేకుండా చేశారు. 'విష్ణుదేవుడి ప్రసాదం వలన మరల సురలోకానికి వస్తా'వని ఊరడించి వెళ్ళారు. వసురాజు విష్ణుదేవుడిని ధ్యానించి, జపించి సేవించగా కొద్దికాలంలోనే విష్ణువు గరుత్మంతుడిని పంపి, అతడిని సశరీరంగా బ్రహ్మలోకానికి తెప్పించాడు. ఆ గౌరవానికి వసురాజు పరమానందం పొందాడు.

విశేషం: 'అంతరంగంబునకుం - 'దెలివును' అనే పాఠానికి 'తెవులును' అని మరొకపాఠం ఉన్నది. సంస్కృతమూలంలో **"మా చ త్వాం గ్లాని రాప్నుశేత్"** (13-324-24) అని ఉన్నది. 'గ్లాని'కి 'తెవులు' అనే పాఠం సముచితమని తోస్తున్నది.

క. కురునాథ! యుపరిచరవసు । చరితంబు ప్రసంగకలన సంప్రాప్తంబై
బెరసెను నీ వడిగిన య । ప్పురుషుల దివ్యానుభావముం జెప్పంగన్.' 375

ప్రతిపదార్థం: కురునాథ!= ఓ ధర్మరాజా!; నీవు; అడిగిన= అడిగినటువంటి; ఆ+పురుషుల= ఆ శ్వేతశరీరుల; దివ్య+అనుభావమున్= దివ్యమైన ఆకార చేష్టాదికాన్ని; చెప్పంగన్= చెప్పతూ ఉంటే; ప్రసంగకలనన్= ప్రసంగవశాత్తూ; ఉపరిచరవసు= ఉపరిచరవసుమహారాజు యొక్క; చరితంబు= కథ; సంప్రాప్తంబై+బెరసెను= వచ్చి కలిసింది. (బెరయు= కలియు)

తాత్పర్యం: ధర్మరాజా! శ్వేతద్వీపంలో ఉండే దివ్యపురుషుల ఆకారాదులను నీ కోరికపై చెప్పబోతే మధ్యలో ఈ ఉపరిచరవసువు వృత్తాంతం ప్రసంగవశాత్తూ వచ్చిపడింది.'

వ. అని పలికి భీష్ముం డా భూపతితో 'నారదు వృత్తాంతంబు వివరించెద నాకర్ణింపుము.' 376

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముండు= భీష్మాచార్యుడు; ఆ+భూపతితోన్= ఆ ధర్మరాజుతో; నారదు= నారదుడి యొక్క; వృత్తాంతంబు=(349వ పద్యంతో ప్రారంభించిన) కథ; వివరించెదన్= (మిగిలినది) వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని భీష్ముడు నారదుడి కథను ధర్మరాజుకు చెప్పటం మొదలుపెట్టాడు.

సీ. అని చెప్పి యిట్లను 'నధిప! నారదుఁ డట్టు । లద్వీపియును నద్భుతాంగులైన
యమ్మానవులుఁ దన యంతరంగంబునఁ । దోఁచినఁ బ్రీతి నందులకు నేఁగి
యమ్మహాత్ములు దన్ను నాత్మల నాదరిం । పంగఁ దా నత్యంతభక్తిఁ బ్రణతుఁ
డై పరమైకాంతులగువారి కింతింత । నిలిచి దుష్కరతపోనిష్ఠఁ బూని

తే. యూర్ధ్వబాహుతఁ గదలకయుండి వివిధ । గూఢ దివ్యనామోక్తి సంప్రౌఢి యచటి
సకలజీవుల నానంద సంభృతములఁ । జేయుచుండ విష్ణుస్తుతి సేయుచుండె. 377

ప్రతిపదార్థం: అని చెప్పి= అని; ఇట్లు+అనున్= ఇట్లా కొనసాగిస్తున్నాడు; అధిప!= ఓ ధర్మరాజా!; అట్టులు= ఆ రకంగా; నారదుఁడు= నారదమహర్షి; ఆ+దీవియునున్= ఆ శ్వేతద్వీపమూ; అద్భుత+అంగులైన= ఆశ్చర్యకరమైన శరీరాలు కలిగిన; ఆ+మానవులున్= ఆ దివ్యపురుషులూ (నరులు); తన= తనయొక్క; అంతరంగంబునన్= హృదయంలో (మనస్సులో); తోఁచినన్= కనిపించేసరికి; ప్రీతిన్= ప్రేమతో; అందులకున్= ఆ శ్వేతద్వీపంలోకి; ఏఁగి= వెళ్ళి; ఆ+మహాత్ములు= ఆ శ్వేతశరీరులైన మహానుభావులు; తన్నున్= తనను; ఆత్మలన్= వారి హృదయాలలో; ఆదరింపంగన్= గౌరవించగా; తాన్= తాను(నారదుడు); అత్యంతభక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణతుఁడై= నమస్కరించినవాడై; పరమ+ఏకాంతులు+అగు= మిక్కిలి ఏకాగ్రచిత్తులైన; వారికిన్= ఆ శ్వేతశరీరులకు; ఇంతింతన్= చేరువలో; నిలిచి= నిలబడి; దుష్కర= కఠినమైన; తపోనిష్ఠన్= తపోదీక్షను; పూని= వహించి; ఊర్ధ్వబాహుతన్= చేతులు పైకి చూపిన భంగిమలో (స్థితిలో); కదలక+ఉండి= నిశ్చలంగా ఉండి; వివిధ= పలురకాలైన; గూఢ= రహస్యమైన; దివ్యనామ= మంత్రప్రాయమైన విష్ణునామాల; ఉక్తి= తన ఉచ్చారణతో ఏర్పడిన; సంప్రౌఢి= ప్రౌఢత్వం; అచటి= అక్కడ ఉన్న; సకలజీవులన్= సమస్త ప్రాణికోటినీ; ఆనంద= ఆనందంతో; సంభృతములన్= నిండినవిగా (నిండినవానిఁగా); చేయుచుండన్= చేస్తూఉంటే (దివ్యనామాల ఉచ్చారణ వీటిని ఆనందపరుస్తోంది - అని); విష్ణుస్తుతి= ఇట్లా విష్ణుమూర్తికి సంబంధించిన స్తోత్రం; చేయుచుండెన్= (నారదుడు) చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! నారదుడి మనస్సులో శ్వేతద్వీపమూ శ్వేతశరీరులైన దివ్య పురుషులూ రూపుగట్టారు. వెంటనే బయలుదేరి ఆ ద్వీపం చేరుకొన్నాడు. ఆ మహాత్ములను దర్శించాడు, నమస్కరించాడు. వారంతా నారదుడిని ఆత్మీయంగా గౌరవించారు. వారికి చేరువలోనే నారదుడు కూడా తపస్సుకు పూనుకొన్నాడు. ఊర్ధ్వబాహుడై నిలబడి విష్ణునామాలను ఉచ్చరించటం మొదలుపెట్టాడు. అవి నిగూఢమైన దివ్యనామాలు. వాటి ఉచ్చారణ ఆ ప్రాంతంలో ఉన్న సకలప్రాణులనూ ఆనందింపజేసింది. ఇట్లా నారదుడు ధ్యానమూ విష్ణుస్తోత్రమూ చేస్తున్నాడు.

వ. ఇవ్విధంబున నేకాంతియై సంస్తుతింప సితాసితపీతారుణ పిశంగ హరిత వర్ణంబులను బహుశిరోబాహుపాదంబులను వేది - కమండలు - స్రుక్స్రు వాగ్ని ధారణంబున నోంకారసావిత్రీ చతుర్వేదో చ్చారణంబులను మహాద్భుతంబయిన నిజదివ్యరూపంబు నారదునకు దర్శనగోచరంబుగా నిలిచి విష్ణుండు వినయ సంభ్రమోపేతభక్తి ప్రణతుండగు నప్పరమముని నాదరించి యిట్లనియె. 378

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఏకాంతియై= ఏకాగ్రచిత్తుడై; సంస్తుతింపన్= స్తుతించేసరికి; సిత= తెలుపు; అసిత= నలుపు (నీలం); పీత= పసుపు; అరుణ= ఎరుపు; పిశంగ= పుప్పొడి రంగు; హరిత= ఆకుపచ్చ; వర్ణంబులను= రంగులతోనూ;

బహు= అనేకమైన; శిరః= తలలూ; బాహు= చేతులూ; పాదంబులను= కాళ్ళతోనూ; వేది= కుండమూ; కమండలు= కమండలువూ; స్రుక్+స్రువ= హోమం చెయ్యటానికి నెయ్యి పోసే చెక్క గరిటెలు రెండూ (పాత్రలోనుండి నెయ్యి తీయటానికి ఉపయోగించేది - స్రువం. అగ్నిలో ఆ నెయ్యిని పోయటానికి ఉపయోగించే పొడవాటిది - స్రుక్కు); అగ్ని= హోమాగ్ని - వీటి; ధారణంబునన్= వహనంతో (వీటిని ధరించటంతోపాటు); ఓంకార= ప్రణవమూ; సావిత్రీ= గాయత్రీ మంత్రమూ; చతుర్వేద= నాలుగువేదాలూ - వీటి; ఉచ్చారణంబులను= ఉచ్చారణలతోనూ; మహా (హత్)+అద్భుతంబు+ఐన= మిక్కిలి ఆశ్చర్యకరమైన; నిజ= తనయొక్క; దివ్యరూపంబు= దివ్యస్వరూపం; నారదునకున్= ఆ నారదమహర్షికి; దర్శన+గోచరంబుగాన్= చూపులకు (కన్నులకు) కనిపించేటట్టు; నిలిచి= ప్రత్యక్షమై నిలబడి; విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; వినయ= వినయమూ; సంభ్రమ= కంగారూ - వీటితో; ఉపేత= కూడుకొన్న; భక్తి= భక్తితో; ప్రణతుండు+అగు= నమస్కరిస్తున్న; ఆ+పరమమునిన్= ఆ దేవర్షి నారదుడిని; ఆదరించి= గారవించి; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా నారదుడు ఏకాగ్రచిత్తుడై ధ్యానం చేస్తుండగా విష్ణుమూర్తి ప్రత్యక్షం అయ్యాడు. ఆయన తెలుపూ, నలుపూ, పసుపూ, ఎరుపూ, గోరోచనమూ, ఆకుపచ్చ రంగులలో ఉన్నాడు. సహస్రశిరస్సులూ, సహస్రబాహువులూ, సహస్రపాదాలూ ఉన్నాయి. హోమవేదిక, కమండలువూ, స్రుక్కూ, స్రువమూ, అగ్నీ - వీటినన్నింటిని ధరించి ఉన్నాడు. ఓంకారాన్ని ఉచ్చరిస్తున్నాడు. గాయత్రీమంత్రాన్ని జపిస్తున్నాడు. ఇట్లా అత్యద్భుతమైన దివ్యరూపంతో స్వామి ప్రత్యక్షమయ్యాడు. నారదుడి కన్నులకు కనిపించాడు. వినయసంభ్రమాలతో భక్తిగా నారదుడు నమస్కరించాడు. స్వామి ఆతడిని ఆదరించి ఇట్లా అన్నాడు:

శ్వేతద్వీపవాసియగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము (సం. 12-326-10,11)

క. ‘ననుఁ గానఁ బడయ రెవ్వరు । ననఘా! యేకాంతికులక యర్హము మద్ద
ర్శన మీ వేకాంతికుఁడవు । ననహంకారుఁడవుఁ గాన యబ్బెం జూడన్.’ **379**

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; ఎవ్వరున్= ఎవరు ఎంతటివారైనప్పటికీ; ననున్= నన్ను; కానన్+పడయరు= చూడటం పొందరు (చూడలేరు - అని); ఏకాంతికులకున్+అ= ఏకాగ్రచిత్తులకే; మత్+దర్శనము= నా దర్శనం; అర్హము= యోగ్యం. (వారే పొందగలరు - అని); ఈవు= నీవు; ఏకాంతికుఁడవు= ఏకాగ్రచిత్తం కలవాడవు; అనహంకారుఁడవు= అహంకారం లేనివాడవు; కాన= కాబట్టే; చూడన్= నన్ను దర్శించటం; అబ్బెన్= (అబ్బింది) నీకు లభించింది.

తాత్పర్యం: ‘ఓ పవిత్రుడా! ఎవ్వరూ నన్ను దర్శించలేరు. ఏకాగ్రచిత్తులే నా దర్శనం పొందటానికి అర్హులు. నీవు ఏకాగ్రచిత్తుడవు. అహంకార రహితుడవు. కాబట్టి నా దర్శనం నీకు లభించింది.’

వ. అని పలికి వరంబు వేడుమనుటయు నతండు ‘దేవా! భవద్దర్శనంబుకంటె మిగుల వరంబునుం గలదే?’
యనుటయు నద్దేవుండు సవిశేషప్రసాదభరితుండై. **380**

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; వరంబున్= ఏదయినా ఒక వరాన్ని; వేడుము= కోరుకొమ్ము; అనుటయున్= అనటమూ; అతండు= ఆ నారదుడు; దేవా!= మహానుభావా!; భవత్= నీ; దర్శనంబుకంటెన్= దర్శనంకన్నా; మిగుల= మించి (అతిశయించి); వరంబునున్+కలదే?= వరం ఒకటి ఏదయినా ఉన్నదా?; అనుటయున్= అనటమూ; ఆ+దేవుండు= ఆ విష్ణుమూర్తి; సవిశేష= విశేషంతో కూడిన; ప్రసాద= అనుగ్రహంతో (విశిష్టమైన అనుగ్రహంతో); భరితుండు+ఐ= నిండినవాడై.

తాత్పర్యం: అని చెప్పి ఏదయినా వరాన్ని కోరుకోమన్నాడు. నారదుడు ‘దేవా! నీ దర్శనభాగ్యానికి మించి వేరొక వరం ఉన్నదా?’ అన్నాడు. అపుడు విష్ణుమూర్తి అనుగ్రహం నిండిన మనస్సు కలవాడై. (తరువాతి పద్యంతోఅన్వయం).

సీ. ఇంద్రియంబుల కందఁ డెల్ల భూతంబులుఁ । దెగినను దెగకుండుఁ బ్రిగుణరహితుఁ
డఖిలంబునకు నాత్మ యన సర్వసాక్షినా । నజుఁ డన నిష్కళుండన వెలుంగు
క్షేత్రజ్ఞుఁ డాతండు జీవుండు వాసుదే । వుండును సంకర్షణుండుఁ జూవె
వారు మనం బహంకారంబు వరుసఁ బ్ర । ద్యుమ్నానిరుద్ధనామోపహితము

తే. లింతయును మన్మయంబ యే నిరువదియును । నాల్గునగు తత్త్వకోటికి నాథుఁడైన
పంచవింశకాభిఖ్యుండఁ బరమపురుషుఁ । డనియు నాపేరు మఱి పర మరయ లేదు. 381

ప్రతిపదార్థం: క్షేత్రజ్ఞుఁడు= క్షేత్రజ్ఞుడు అనబడేవాడు (ఆత్మ); ఇంద్రియంబులకున్= ఇంద్రియాలకు; అందఁడు= లొంగడు; ఎల్ల+భూతంబులున్= సకలప్రాణులూ (పంచభూతాలూ); తెగినను= నశించినా; తెగకుండున్= తాను నశించకుండా ఉంటాడు; త్రిగుణ రహితుఁడు= సత్త్వరజస్తమోగుణాలు లేనివాడు; అఖిలంబునకున్= సమస్తానికీ; ఆత్మ+అనన్= ఆత్మ అనీ; సర్వసాక్షి+నాన్= సర్వసాక్షి అనీ; అజుఁడు+అనన్= అజుడు అనీ; నిష్కళుండు+అనన్= నిష్కళుడు అనీ - వ్యవహరింపబడుతూ; వెలుంగున్= ప్రకాశిస్తాడు; ఆతండు= ఆతడే; జీవుండున్= జీవుడూ; వాసుదేవుండును= వాసుదేవుడూ; సంకర్షణుండున్+చూవె= సంకర్షణుడూ సుమా!; మనంబు= మనస్సూ; అహంకారంబున్= అహంకారమూ అయిన; వారు= వాసుదేవ సంకర్షణులు; వరుసన్= క్రమంగా; ప్రద్యుమ్న+అనిరుద్ధ= ప్రద్యుమ్నమూ అనిరుద్ధమూ అనేటువంటి; నామ= పేరులతో; ఉపహితములు= చెప్పబడేవి; ఇంతయునున్= ఇదంతా; మత్+మయంబు+అ= నా వికృతియే (నా మయమే); ఏను= నేను; ఇరువదియును నాల్గునగు= ఇరవై నాల్గుగా చెప్పబడిన; తత్త్వకోటికిన్= తత్త్వసమూహానికి; నాథుఁడు+ఐన= ప్రభువైన; పంచవింశక+అభిఖ్యుఁడన్= పంచవింశకుడు అనే పేరుగలవాడిని (ఇరవై అయిదవ తత్త్వాన్ని నేనే); పరమపురుషుఁడు+అనియున్= పరమపురుషుడు అని కూడా; నాపేరు= నా నామధేయం; మఱి= ఇంతకన్నా; పరము= పరము అనేది; అరయన్= ఎంత చూసినా; లేదు= లేదు.

తాత్పర్యం: నారదా! క్షేత్రజ్ఞుడూ, జీవుడూ, వాసుదేవుడూ, సంకర్షణుడూ - అందరూ ఒక్కటే. అంతా నేనే. వాసుదేవుడే మనస్సు. అదే ప్రద్యుమ్నం. అహంకారమే సంకర్షణుడు. అదే అనిరుద్ధం. ఇరవైనాలుగు తత్త్వాలకూ ప్రభువైన ఇరవై అయిదవ తత్త్వం నేనే. నన్ను అందుకే పంచవింశకుడు అంటారు. పరమపురుషుడిని నేనే. నాకంటె పరం (శ్రేష్ఠం) మరొకటి లేనేలేదు.

క. వినుఁ మేకాంతికుఁ డెవ్వనిఁ । గని నిత్యానందపదము గను నప్పరమా
త్ముని వాసుదేవు నిష్కలు । ననుపముఁగా నను నెఱుంగు టాత్మహితమగున్. 382

ప్రతిపదార్థం: వినుము= నారదా! ఆలకించుము; ఏకాంతికుఁడు= ఏకాగ్రచిత్తుడైన యోగి; ఎవ్వనిన్+కని= ఎవరిని దర్శించి; నిత్య+ఆనందపదము= ఎల్లప్పుడూ ఆనందమయమైన స్థానాన్ని (నిత్యానంద స్థితి); కనున్= పొందుతాడో; ఆ+పరమాత్మునిన్= ఆ పరమాత్మగా; వాసుదేవున్(కాన్)= వాసుదేవుడిగా; నిష్కలున్ (కాన్)= నిష్కలుడిగా; అనుపమున్+కాన్= సాటిలేనివాడినిగా; ననున్= నన్ను; ఎఱుంగుట= తెలియుట; ఆత్మహితము+అగున్= ఆత్మకు మేలు అవుతుంది.

తాత్పర్యం: ఏకాగ్రచిత్తులైన యోగీశ్వరులు ఎవరిని దర్శించి నిత్యానందస్థితి పొందుతారో ఆ పరమాత్మగా, ఆ వాసుదేవుడిగా, ఆ నిష్కలుడిగా, ఆ సాటిలేనివాడిగా నన్ను తెలిసికొనటం నీకు ఆత్మహితం. గ్రహించుము దేవర్షీ!

క. భూతాత్మకమైన యఖిల । ధాతుచయము వెలిగ లేదు తను నా మొత్తం
బాతతజీవవ్యాప్తి స । మేతము గాకున్నఁ జేష్ట నెసఁగదు వత్సా! 383

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; భూత+ఆత్మకమైన= సకల జీవులకూ ప్రాణభూతమైన; అఖిల ధాతుచయము= సమస్తవిధాల ధాతుసమూహం (అంతశ్శక్తి); వెలిగన్+లేదు= నాకన్నా భిన్నంగా (వెలుపలగా) లేదు; తను= అది; నా= నాయొక్క; మొత్తంబు= మొత్తం (అది సమస్తం నేను, నా సమస్తం అదీ); ఆతత= నిడుపైన; జీవ= జీవశక్తియొక్క (ప్రాణం); వ్యాప్తి= వ్యాపనంతో;సమేతము= (ధాతుచయం) కూడుకొన్నది; కాకున్నన్= కాకపోయినట్టయితే; చేష్టన్= కదలికతో (క్రియాశక్తితో); ఎసఁగదు= అలరారదు.

తాత్పర్యం: నాయనా! నారదా! ఈ సృష్టిలో సకలప్రాణికోటిలో అంతర్గతంగా ఉన్న ధాతుశక్తి నాకంటె భిన్నమైనది కాదు. నాలోనే ఉన్నది. అది నా మొత్తం. జీవశక్తి అనేది సర్వత్ర పరివ్యాప్తం కాకపోతే చేష్టలూ చైతన్యాలూ ఉండవుగదా!

క. జీవశరీరములు పృథ । గ్భావాకలితములు గాఁగఁ గనుటయు వలయున్
జీవునిఁ గంటి ననుట మా । యావిలసన మస్మదీయ మది మునివర్యా! 384

ప్రతిపదార్థం: మునివర్యా!= మునిశ్రేష్ఠా!; జీవ+శరీరములు= జీవమూ, శరీరమూ అనేవాటిని; పృథక్+భావ+ఆకలితములు కాఁగన్= వేరు వేరు అనే భావంతో; కనుటయున్= చూడటంకూడా; వలయున్= అవసరం; జీవునిన్= జీవుడిని; కంటిన్= దర్శించాను; అనుట= అనటం; మాయా+విలసనము= ఒక మాయావిలాసం; అది= ఆ మాయావిలాసం; అస్మదీయము= నాదే.

తాత్పర్యం: మునీశ్వరా! జీవుడు వేరు, శరీరం వేరు అనే విషయాన్ని గ్రహించటం చాలా అవసరం. ఎవరయినా జీవుడిని చూశాను అని అంటే అదంతా మాయ. ఆ మాయావిలాసానికి సృష్టికర్తను నేనే.

క. జీవుఁడు మత్సముపేతుఁడు । గావు టెఱుఁగవలయు దృఢముగా భక్తిమయం
బై వఱలు నాశ్రయంబున । నేవాఁ డొందు ననువాని కిత్తు విముక్తిన్. 385

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ (ఎప్పుడూ); మత్+సమ్+ఉపేతుఁడు= నాతో గాఢంగా కూడి ఉన్నవాడే (నాలో భాగం); కావుట= కావటాన్ని; ఎఱుఁగన్+వలయున్= (నీవు) తెలిసికోవాలి; దృఢముగాన్= గట్టిగా (నిశ్చలంగా); భక్తిమయంబు+ఐ= భక్తితో నిండినదై (భక్తిమయం అయి); వఱలు= ఒప్పేటటువంటి; ఆశ్రయంబునన్= ఆధారంతో (సాధనంతో); ఏ వాఁడు= ఎవడు; ననున్= నన్ను; ఒందున్= పొందుతాడో; వానికిన్= ఆ భక్తుడికి; విముక్తిన్= మోక్షాన్ని; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: జీవుడు నాకంటె భిన్నుడు కాదు. నాతోనే కలిసి ఉంటాడు. ఈ విషయాన్ని కూడా గ్రహించటం అవసరం. భక్తిమయమైన సాధనంతో ఎవడు నన్ను పొందుతాడో వాడికి విముక్తిని అనుగ్రహిస్తాను.

క. ఆదిత్య మరు ద్వసురు । ద్రాది దివిజగణము నంబుజాసనుఁడుఁ జతు
ర్వేదములు మదాత్మకతం । గాదే తత్తద్విశేష గౌరవమొందున్! 386

ప్రతిపదార్థం: ఆదిత్య= ఆదిత్యులూ; మరుత్= మరుత్తులూ; వసు= వసువులూ; రుద్ర= రుద్రులూ; ఆది= మొదలైన; దివిజగణమున్= దేవతాసమూహమూ; అంబుజ+ఆసనుఁడున్= పద్మాసనుడైన బ్రహ్మదేవుడూ; చతుర్వేదములున్= నాలుగు వేదాలూ; మత్+ఆత్మకతన్+కాదే!= నా స్వరూపాలు కావటం వల్లనేకదా!; తత్తత్= ఆయా; విశేషగౌరవమున్= విశేషమైన గౌరవాన్ని; ఒందున్= పొందేది.

తాత్పర్యం: ఆదిత్యులూ, మరుత్తులూ, వసువులూ, రుద్రులూ మొదలైన దేవగణాలూ, బ్రహ్మదేవుడూ, చతుర్వేదాలూ ఆయా గౌరవాలను పొందటం నా మహిమవలననే.

తే. కమలగర్భు సృజించి సకలజగద్ధు । రానియుక్తునిఁ గావించి యే నివృత్తి
పరత నేకాకినై దివ్యభవ్య మగు స । హాయముగ సంచరింతు మధ్యస్థవృత్తి. 387

ప్రతిపదార్థం: కమలగర్భున్= బ్రహ్మను; సృజించి= సృష్టించి; సకలజగత్= సకలప్రపంచం యొక్క; ధురా= భారవహనంపట్ల; నియుక్తునిన్+కావించి= నియమించి; ఏన్= నేను; నివృత్తిపరతన్= నివృత్తిమార్గంలో తత్పరత కలిగి; ఏకాకిని+ఐ= అద్వితీయుడిని అయి (ఏకాంతం అనుభవిస్తూ); మధ్యస్థవృత్తిన్= మధ్యస్థుడుగా ఉంటూ (ఏ పక్షపాతమూ లేకుండా); దివ్య= దివ్యమూ; భవ్య= భవ్యమూ; అగు= అయిన; సహాయముగన్= సహాయంగా; సంచరింతున్= వ్యవహరిస్తూ ఉంటాను.

తాత్పర్యం: బ్రహ్మదేవుడిని నేనే సృష్టించాను. ప్రపంచభారాన్ని అప్పగించాను. నేను నివృత్తి మార్గం చేపట్టాను. ఏకాంతంగా గడుపుతాను. మధ్యస్థుడుగా ఉంటూ బ్రహ్మాదులకు అవసరాన్ని బట్టి దివ్యమూ, భవ్యమూ అయిన సహాయం చేస్తుంటాను.

వ. ఒక్కొక్కకాలంబుల జగద్ధితంబుగా జన్మకర్మంబులం బూనుదు వినుము వారాహ రూపంబు దాల్చి హిరణ్యాక్షుని నారసింహమూర్తి ధరియించి హిరణ్యకశిపుని భృగువంశంబున జామదగ్న్యుండన జనియించి సర్వక్షత్రంబును దశరథుండను రాజునకు రామనామంబునం బుట్టి రావణాసురుం బరిమార్పంగలవాఁడ. భూభారంబు వాపుటకై యాదవకులంబునఁబ్రభవించి పురందరనందనుండై యవతరించిన నరుండు దోడ్పడ నక్కార్యంబు నిర్వహింతు. నేను దొల్లి నరనారాయణు లనియెడు నామంబుల మూర్తిద్వయంబును ఋషిత్వంబును వెలయ నొలసి లోకరక్షణం బాచరించుచున్నవాఁడ. నమ్మూర్తుల పదంపడి కేళీమానుషత్వంబు గైకొని యిట్లు సేయు నయ్యవతారంబునఁ గంస కాలయవన మురనరక బాణప్రముఖులైన కంటకులం జెఱుతు. నందు బాణాసురుం గాతునని పూని మహాదేవుండు మహాసేనానీసహితుండై యడ్డపడ నమ్మహాత్ముని జయించి బాణునిం బరాభవింతు. నింతకుమున్ను మత్స్యత్వంబుకూర్మత్వంబుల నొంది నిఖిలచ్ఛందోబృందారక హితం బొనర్చితి మచ్చరితంబులు నీకుం గర్ణగోచరంబులు గాకుండెడునే? మఱియు ధర్మరక్షణార్థంబుగా నేమేమి సేయవలయు నవియెల్లనుం జేయువాఁడఁ గృత్యంబులు గృతంబులైన మదీయ ప్రకృతిం బొందుదుఁ బరమేష్ఠినందనా! నీ వేకాంతికుండ వగుట నీకు నా తెఱంగెల్ల నెఱింగించితి' నని చెప్పి యమ్మునిం గని యనాహారులు ననింద్రియులు నస్వేదులు సుగంధి శ్వేతదేహులు నగు నమ్మానవులం జూపి 'వీరేకాంతికులు' మన్మయధ్యానపరులునై యున్నవారు వీరలకు సమ్మర్దంబుగా మెలఁగం దగదు. నీవింకం బొ'మ్మని పరమాదరంబునం బలికి వీడ్కొలిపిన నద్దేవమునిసత్తముండు పరమానందభరితుఁ డై బదరికాశ్రమంబునకుం జనుదెంచి నరనారాయణులం గాంచి. 388

ప్రతిపదార్థం: ఒక్కొక్కకాలంబులన్= కొన్ని కొన్ని సమయాలలో; జగత్+హితంబుగాన్= ప్రపంచానికి మేలు అయ్యేట్టు; జన్మకర్మంబులన్= జన్మలనూ, కర్మాచరణాలనూ (జన్మల రూపమైన కర్మలను); పూనుదున్= వహిస్తూ ఉంటాను; వినుము; వారాహరూపంబున్+తాల్చి= వరాహావతారం ధరించి; హిరణ్య+అక్షునిన్= హిరణ్యాక్షుడు అనే రాక్షసుడినీ; నారసింహ+మూర్తిన్= నరసింహరూపాన్ని; ధరించి= వహించి; హిరణ్యకశిపునిన్= హిరణ్యకశిపుడు అనే రాక్షసుడినీ; భృగువంశంబునన్= భృగు మహర్షి వంశంలో; జామదగ్న్యుండు+అని= పరశురాముడు అనే రూపంతో (జమదగ్ని కుమారుడు); జనియించి= జన్మించి; సర్వక్షత్రంబునున్= సకల క్షత్రియసమూహాన్ని; దశరథుండు+అను= దశరథుడు అనే; రాజునకున్= రాజుగారికి; రామనామంబునన్= రాముడు అనే పేరుతో; పుట్టి= ప్రభవించి; రావణ+అసురున్= దశగ్రీవుడు అనే రాక్షసుడినీ; పరిమార్పన్+కలవాఁడన్= సంహరిస్తాను; భూభారంబు= భూమి బరువును; పాపుటకై= తగ్గించటంకోసం; యాదవకులంబునన్= యదువు అనే రాజుగారి వంశంలో; ప్రభవించి= జనించి; పురందర= ఇంద్రుడియొక్క; నందనుండై= కుమారుడై; అవతరించిన= పుట్టిన; నరుండు= అర్జునుడు; తోడ్పడన్= సహకరించగా; ఆ+కార్యంబున్= భూభారాన్ని తొలగించటమనే ఆ పనిని (కురుక్షేత్ర సంగ్రామంతో); నిర్వహింతున్= నిర్వహిస్తాను; ఏను= నేను; తొల్లి= పూర్వకాలంలో; నరనారాయణులు+అనియెడు= నరనారాయణులు అనే; నామంబులన్= పేరులతో; మూర్తిద్వయంబును=

రెండు రూపాలూ; ఋషిత్వంబునున్= ఋషిత్వమూ; వెలయన్= పరిఢవిల్లగా (ఒప్పగా); ఒలసి= పొంది; లోకరక్షణంబు= ప్రపంచ సంరక్షణ (ప్రాణిరక్ష); ఆచరించుచున్నవాఁడన్= చేస్తున్నాను; ఆ+మూర్తుల= ఆ నరనారాయణ అవతారాల; పదంపడి= తరువాత; కేళీమానుషత్వంబున్= విలాసార్థంగా మానవరూపం; కైకొని= చేపట్టి; ఇట్లు= ఇట్లా; చేయు+ఆ+అవతారంబునన్= చేసే ఆ శ్రీకృష్ణావతారంలో; కంస= కంసుడూ; కాలయవన= కాలయవనులూ; మురు= మురుడూ; నరక= నరకుడూ; బాణ= బాణుడూ; ప్రముఖులైన= మొదలైన; కంటకులన్= పీడకులను (లోక కంటకులు= లోకానికి ముళ్ళవంటివారు); చెఱుతున్= నాశనం చేస్తాను (కంటకాలను చెఱపటం అంటే చెక్కివేయటం); అందున్= వారిలో (ఆ పని చేస్తున్నప్పుడు); బాణ+అసురున్= బాణుడు అనే రాక్షసుడిని; కాతున్+అని= రక్షిస్తాను అని; పూని= పూనుకొని (బాధ్యత మీద వేసికొని); మహాదేవుండు= శంకరుడు; మహాసేనానీసహితుండై= ప్రమథసేనాపతి అయిన కుమారస్వామితో కలిసి (సేనాని= కుమారస్వామి); అడ్డపడన్= నాకు (బాణాసుర సంహారంలో) అడ్డురాగా; ఆ+మహాత్మునిన్= మహానుభావుడైన ఆ శివుడిని; జయించి= జయించి; బాణునిన్= (శివరక్షణలో ఉన్న) బాణాసురుడిని; పరాభవింతున్= అవమానపరుస్తాను (ఉషానిరుద్ధుల వివాహంతో ఆ రాక్షసుడిని అవమానించటం); ఇంతకున్+మున్ను= ఇంతకుపూర్వం; మత్స్యత్వ+కూర్మత్వంబులన్= మత్స్యావతారాన్ని, కూర్మావతారాన్నీ (తాబేలు); ఒంది= ధరించి; నిఖిల= సమస్తమైన; ఛందఃలన్= వేదాలకూ (మత్స్యావతారంలో సోమకాసురుడిని జయించి వేదాలను ఉద్ధరించటం); బృందారక= దేవతలకూ (క్షీరసముద్రమథనం - అమృతోత్పత్తి - కూర్మావతారం); హితంబు= మేలు; ఒనర్చితిన్= చేశాను; మత్+చరితంబులు= నా ప్రవర్తనలు (చరిత్రలు - కథలు); నీకున్= నీకు; కర్ణగోచరంబులు= చెవులకు వినిపించినవి; కాకుండెడునే?= కాకుండా ఉన్నాయా? (ఇవి వినే ఉంటావు - అని); మఱియున్= ఇంకా; ధర్మరక్షణార్థంబుగాన్= ధర్మాన్ని రక్షించటంకోసమని; ఏమేమి+చేయన్+వలయున్= ఏమిటేమిటి చేయాలో; అవి+ఎల్లనున్= అవి అన్నీ; చేయువాఁడన్= చేస్తాను - చేస్తుంటాను; కృత్యంబులు= చేయవలసినవి; కృతంబులు+ఐనన్= చేయబడినవి అయినట్టయితే (చేయవలసినవన్నీ చేశాక); మదీయ ప్రకృతిన్= నా సహజస్వభావాన్ని (స్థితిని); పొందుదున్= పొందుతాను; పరమేష్ఠినందనా!= బ్రహ్మదేవుని పుత్రుడా! నారదుడా!; నీవు; ఏకాంతికుఁడవు+అగుటన్= ఏకాగ్రచిత్తం కలవాడవు అవటంచేత; నీకున్= నీకు; నా+తెఱంగు+ఎల్లన్= నా పద్ధతి (విధం) అంతా; ఎఱింగించితిన్= తెలియజెప్పాను; అని; చెప్పి= పలికి; ఆ+మునిన్= ఆ నారదమహర్షిని; కని= తిలకించి; అనాహారులు= ఆహారం తీసికోనివారూ; అనింద్రియులున్= ఇంద్రియచాంచల్యం లేనివారూ; అస్వేదులున్= చెమటపట్టనివారూ; సుగంధి= పరిమళించే; శ్వేతదేహులున్= తెల్లని శరీరాలు కలవారూ; అగు= అయినటువంటి; ఆ+మానవులన్= ఆ నరులను; చూపి= చూపించి; వీరు= వీరంతా; ఏకాంతికులున్= ఏకాగ్రత కలవారూ; మత్+మయ+ధ్యానపరులై= నాతో నిండిన ధ్యానం కలవారూ అయి (నన్నే ధ్యానిస్తూ); ఉన్నవారు= ఉన్నారు; వీరలకున్= ఈ దివ్యపురుషులకు; సమ్మర్దంబుగాన్= ఒత్తిడి అయ్యేట్టు (ఇబ్బంది అయ్యేట్టు); మెలఁగన్+తగదు= సంచరించటం పనికిరాదు (నీ సంచారమూ నీ ఉనికీ వాళ్ళ ఏకాగ్రతను భంగపరుస్తుంది - అని); నీవు; ఇంకన్= ఇంక; పొమ్ము= తిరిగివెళ్ళుము; అని; పరమ+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో (ప్రేమతో, ఆత్మీయతతో); పలికి= చెప్పి; వీడ్కొలిపినన్= వీడ్కోలు ఇచ్చేసరికి; ఆ+దేవముని+సత్తముండు= దేవర్షులలో ఉత్తముడైన ఆ నారదుడు; పరమ+ఆనంద భరితుండై= బ్రహ్మానందంతో నిండినవాడై; బదరికా+ఆశ్రమంబునకున్= తానుండే బదరికాశ్రమానికి (బదరి= రేగుచెట్టు); చనుదెంచి= తిరిగి వచ్చి; నరనారాయణులన్= నరనారాయణులు ఇద్దరినీ; కాంచి= దర్శించి.

తాత్పర్యం: కొన్ని కొన్ని సమయాలలో లోకహితం కొరకు జన్మకర్మలను పూనుతూ ఉంటాను. వరాహరూపం తాల్చి హిరణ్యాక్షుడిని, నరసింహరూపం ధరించి హిరణ్యకశిపుడినీ, భృగువంశంలో పరశురాముడై పుట్టి క్షత్రియలోకాన్నంతటినీ, దశరథరాముడిగా జన్మించి రావణుడినీ సంహరిస్తాను. యాదవకులంలో కృష్ణుడినై పుట్టి అర్జునుడి సహాయంతో భూభారాన్ని తొలగిస్తాను. నేను పూర్వం నరనారాయణు లనే పేర్లతో రెండు రూపాలతో, ఋషిత్వంతో వెలసి జగద్రక్షణాన్ని చేస్తున్నాను. ఆ మూర్తులే తరువాత లీలామానుష రూపాలతో తమ కార్యాలను నిర్వహిస్తూ కంసుడు, కాలయవనుడు, మురుడు, నరకుడు, బాణుడు మొదలైన కంటకులను రూపుమాపుతారు. అందులో బాణాసురుడిని రక్షిస్తానని పూనుకొని శివుడు కుమారస్వామితో కలిసి అడ్డగించగా ఆ మహాత్ముడిని జయించి బాణుడిని అవమానించాను. ఇంతకు ముందు మత్స్యకూర్మభావాలను పొంది దేవగణాలకు మేలు చేశాను.

నా లీలలు నీవు వినకుండా ఉన్నావా? ఇంకా ధర్మరక్షణం కొరకు ఏయే పనులు చేయాలో వాటిని తప్పక నిర్వహిస్తాను. నా కర్తవ్యాలు పూర్తి కాగానే నా మూలప్రకృతిని మరల పొందుతాను. నారదా! ఏకాగ్రచిత్తుడవు కావటంచేత నా తీరునంతా నీకు తెలిపాను' - అని పలికి ఆ మునిని చూచి నిరాహారులూ, ఇంద్రియ నిగ్రహులూ, స్వేదం లేనివారూ, సుగంధి శ్వేతదేహులూ అయిన ఆ మానవులను చూపి, వారు ఏకాగ్రచిత్తులు, నన్నే స్మరించేవారూ అయి ఉన్నారు. వారికి ఇబ్బంది కలిగేటట్లు వ్యవహరించరాదు. నీ వింక పొమ్ము' అని పలికి గౌరవంగా వీడ్కోలు పలుకగా, నారదుడు పరమానందంగా బదరికాశ్రమానికి వచ్చి నరనారాయణులను దర్శించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. భక్తి వీడ్కొని చని మునిప్రతతి కెందు । నచ్యుతాననోద్గతము వేదార్థమయము
యోగసాంఖ్యాత్మకమునైన వాగమృతముఁ । గర్ణపుటపేయముగఁ జేయు గారవమున. 389

ప్రతిపదార్థం: భక్తిన్= భక్తితో; వీడ్కొని= (విష్ణుమూర్తి దగ్గర) సెలవు తీసికొని; చని= నారదుడు వెళ్ళి; మునిప్రతతికిన్= మునిబృందానికి; ఎందున్= అంతటా; అచ్యుత= విష్ణుమూర్తియొక్క; ఆనన= ముఖంనుండి; ఉద్గతమున్= వెలువడినదీ; వేద+అర్థమయమున్= వేదసారంతో నిండినదీ; యోగ+సాంఖ్య+ఆత్మకమున్= యోగరూపమూ, సాంఖ్యరూపమూ; ఐన= అయినటువంటి; వాక్+అమృతమున్= వాగ్రూపమైన అమృతాన్ని; గారవమునన్= ప్రేమతో; కర్ణపుట= (చెవులు అనే దొప్పలతో) చెవులతో; పేయముగన్= క్రోలబడేదిగా; చేయున్= చేశాడు (వాగమృతాన్ని మునుల చెవులకు పానీయంగా అందించాడు - అని).

తాత్పర్యం: విష్ణుమూర్తి దగ్గర సెలవు తీసికొని వెళ్ళిన నారదుడు తాను స్వామినుండి గ్రహించిన ఉపదేశామృతాన్ని తక్కిన మహర్షులందరికీ కర్ణరసాయనంగా అందించాడు. అదియే వేదసారం. యోగసారం. సాంఖ్యసారం.

వ. నారదుం డట్లు విష్ణుని దివ్యవాక్యవితతి విద్వజ్జనంబులకు వినిపించుచు బ్రహ్మసభ కరిగి యందునుం బ్రకటించె' ననుటయు 'నప్పద్మభవునకు నది వింతయే?' యనిన నక్కొంతేయాగ్రజుతో శాంతనవుం 'డా శతానందునకు నపరిజ్ఞాతంబునుం గలదే? యతనిం గొలువ వచ్చినట్టి సిద్ధసాధ్యాదులకు వినిపించెఁగాక' యని పలికి వెండియు నిట్లనియె. 390

ప్రతిపదార్థం: నారదుండు; అట్లు; విష్ణుని= విష్ణుమూర్తియొక్క; దివ్య= దివ్యమైన; వాక్య+వితతిన్= వాక్సమూహాన్ని; విద్వత్+జనంబులకున్= పండితులకు; వినిపించుచున్= వినిపిస్తూ; బ్రహ్మసభకున్= బ్రహ్మదేవుడి సభకు; అరిగి= వెళ్ళి; అందునున్= ఆ సభలోకూడా; ప్రకటించెన్= అందరికీ వినిపించాడు; అనుటయున్= అని భీష్ముడు చెప్పటంతోనే; ఆ+పద్మభవునకున్= ఆ బ్రహ్మదేవుడికి; అది= ఆ విషయం; వింతయే?= అంత కొత్తదా (ఎరుగనిదా)?; అనిన= అని అడిగిన; ఆ+కొంతేయ+అగ్రజుతోన్= కుంతీపుత్రులలో (మొదటివాడైన) పెద్దవాడైన ఆ ధర్మరాజుతో; శాంతనవుండు= శంతను సుతుడు ఆ భీష్ముడు - ఇట్లా అన్నాడు: ఆ+శతానందునకున్= ఆ బ్రహ్మదేవుడికి; అపరిజ్ఞాతంబునున్+కలదే?= తెలియనిది కూడా ఉన్నదా? (ఆయనకు అన్నీ తెలుసు అని); అతనిన్= ఆ బ్రహ్మను; కొలువన్= సేవించటానికి; వచ్చినట్టి= వచ్చినటువంటి; సిద్ధసాధ్య+ఆదులకున్= సిద్ధులూ,సాధ్యులూ ఈ మొదలైన జనాలకు; వినిపించెన్+కాక= (నారదుడు) వినిపించాడు కానీ - అని పలికి= అని భీష్ముడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అట్లా నారదుడు బ్రహ్మలోకానికి కూడా వెళ్ళాడు. అక్కడ కూడా ఆ ఉపదేశామృతాన్ని ప్రకటించాడు' అని భీష్ము డనగా, 'ఆ విషయం బ్రహ్మకు క్రొత్తదా?' అని ఆ ధర్మరాజు అడిగాడు. 'బ్రహ్మకు తెలియదని కాదు. ఆ సభకు వచ్చిన సిద్ధసాధ్యాదులకొరకు ఆయన అట్లా చేశాడు' అని భీష్ముడు బదులిచ్చి, చెప్పటం మొదలుపెట్టాడు.

క. 'క్రమమున వాఙ్మయమగు న । య్యమృతము లోకమునఁ బరఁగె నది మజ్జనకుం
డమితదయఁ జెప్పె నాకును । శమయుత! యేఁజెప్పితిని విశదముగ నీకున్. 391

ప్రతిపదార్థం: శమయుత!= ఇంద్రియనిగ్రహం కలవాడా!; క్రమమునన్= క్రమక్రమంగా (ఆనోటా ఆనోటా); వాక్+మయము+అగు= వాగ్రూపమైన; ఆ+అమృతము= ఆ ఉపదేశామృతం; లోకమునన్= భూలోకమంతటా; పరఁగెన్= వ్యాపించింది; అది= దాన్ని; మత్+జనకుండు= మా తండ్రిగారు; అమితదయన్= మిక్కిలి దయతో; నాకునున్= నాకు; చెప్పెన్= తెలియజేశారు; ఏన్= నేను; నీకున్= నీకు; విశదముగన్= స్పష్టంగా; చెప్పితిని= తెలియజెప్పాను.

తాత్పర్యం: 'ఓ శాంతస్వభావా! విష్ణుమూర్తి అందించిన ఆ ఉపదేశామృతం క్రమక్రమంగా కర్ణాకర్ణికగా లోకమంతటా వ్యాపించింది. మా తండ్రి దానిని నాకు అత్యంతదయతో బోధించాడు. నేనేమో నీకు విశదంగా తెలియజెప్పాను.

క. మునులును సురలును దీనిని । విని కొనియాడుదురు విష్ణు వినుతింతురు భ
క్తినిరూఢులై జపింతురు । మనమునఁ జపింతు రతిసమాహితు లగుచున్. 392

ప్రతిపదార్థం: మునులునున్= మహర్షులూ; సురలునున్= దేవతలూ; దీనినిన్= ఈ ఉపదేశసారాన్ని; విని= ఆలకించి; కొనియాడుదురు= ప్రశంసిస్తారు; విష్ణున్= విష్ణుమూర్తిని; వినుతింతురు= స్తుతిస్తారు; భక్తి+నిరూఢులై= గాఢమైన భక్తి కలవారై; మనమునన్= మనస్సులో; జపింతురు= జపిస్తారు; అతి= మిక్కిలి; సమాహితులు+అగుచున్= సావధానులు అవుతూ; చర్చింతురు= (దీన్ని పలురకాలుగా) చర్చిస్తారు.

తాత్పర్యం: ధర్మరాజా! విష్ణుమూర్తి అందించిన ఈ ఉపదేశసారాన్ని మునులూ, ఋషులూ మెచ్చుకొంటారు. విష్ణుమూర్తిని స్తుతిస్తారు. భక్తితో దీన్ని జపిస్తారు. నలుగురూ కలిసినచోట ఏకాగ్రచిత్తులై దీనినే చర్చిస్తారు. ఇవన్నీ జరగటం నేను ఎరుగుదును.

తే. నీవు నిట్టుల చేయు వినీతిపరుఁడు । విష్ణుభక్తుండు శమదమాన్వితుఁడు నైన
యట్టివానికిఁ జెప్పుమీ యచ్యుతాన । నోద్గతంబైన యిప్పురాణోత్తమంబు. 393

ప్రతిపదార్థం: నీవున్= నీవుకూడా; ఇట్టులన్= ఇట్లాగే; చేయు(ము)= స్తుతించటం, జపించటం, చర్చించటం చేయుము; వినీతి పరుఁడున్= వినయ సంపన్నుడూ; విష్ణుభక్తుండున్= విష్ణుభక్తుడూ; శమ+దమ+అన్వితుఁడున్= అంతర్బహిరింద్రియ నిగ్రహం కలవాడూ; ఐన+అట్టివానికిన్= అయినటువంటి వాడికి; అచ్యుత= విష్ణుమూర్తియొక్క; ఆనన= ముఖంనుంచి; ఉద్గతంబు+ఐన= వెలువడిన; ఈ+పురాణ+ఉత్తమంబున్= ఈ ఉత్తమ పురాణగాథను; చెప్పుమీ!= ఉపదేశించు సుమీ!

తాత్పర్యం: ధర్మరాజా! నీవు కూడా ఇట్లాగే విష్ణుమూర్తిని స్తుతించుము. ఈ ఉపదేశం చర్చించుము. ఈ మంత్రం జపించుము. అంతేకాదు, నీవు ఎవరికైనా ఈ ఉత్తమపురాణాన్ని చెప్పదలచుకొంటే వినయపరుడూ, విష్ణుభక్తుడూ ఇంద్రియనిగ్రహం కలవాడూ అయిన వ్యక్తికే ఉపదేశించుము.

క. నీ వినిన యుపాఖ్యానము । లేవియు సరిగావు దీని కిది దీర్ఘాయుః ।
శ్రీవిభవారోగ్యములం । గావించుఁ బఠించినం దగం దను వినినన్.' 394

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; వినిన= (ఇంతవరకూ) విన్నటువంటి; (నీవు విన్న - అని); ఉపాఖ్యానములు= ఉపకథలు; ఏవియున్= ఏవీ కూడా; దీనికిన్= ఈ ఉపాఖ్యానానికి; సరిగావు= సాటిరావు (సమానం కావు); ఇది= ఈ ఉపాఖ్యానం; తగన్= శ్రద్ధగా; తనున్= తనను; పఠించినన్= చదివినా; వినినన్= ఆలకించినా; దీర్ఘాయువుఁ= దీర్ఘమైన ఆయుర్దాయాన్నీ; శ్రీవిభవ= సంపద్వైభవాన్నీ; ఆరోగ్యములన్= ఆరోగ్యాన్నీ (ఆయుశ్శ్రీ= ఆయుస్సంపదనూ); కావించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ధర్మజా! ఇంతవరకూ నీవు విన్న ఉపాఖ్యానాలు ఏవీ దీనికి సరిపోలవు. దీనిని శ్రద్ధగా చదివినా, వినినా అట్టివారికి దీర్ఘాయుస్సూ, సకల సంపదలూ, వైభవాలూ, ఆరోగ్యమూ అన్నీ సమకూడుతాయి.'

క. అని శాంతనవుఁడు సెప్పిన । విని మోదమునొంది పాండవేయులు దీనిన్
వినుచుఁ బఠించుచు విష్ణుం । గొనియాడుదు రధికభక్తిఁ గురువంశవరా!' 395

ప్రతిపదార్థం: కురువంశవరా!= కురువంశంలో ఉత్తముడా! ఓ జనమేజయుడా!; అని= ఈ ప్రకారంగా; శాంతనవుఁడు= శంతనుకుమారుడైన భీష్ముడు; చెప్పినన్= చెబితే; విని= ఆలకించి; మోదమున్+ఒంది= సంతోషించి; పాండవేయులు= పాండుపుత్రులు; దీనిన్= ఈ ఉపాఖ్యానాన్ని; వినుచున్= వింటూ; పఠించుచున్= పఠిస్తూ; విష్ణున్= విష్ణుమూర్తిని; అధికభక్తిన్= అత్యంతభక్తితో; కొనియాడుదురు= స్తుతించేవారు.

తాత్పర్యం: (కథను మళ్ళీ జనమేజయ వైశంపాయనులకు కలుపుతున్నాడు.) 'ఓ జనమేజయా! భీష్ముడు ఇట్లా చెప్పితే శ్రద్ధగా విన్న పాండుపుత్రులు దీనినే వింటూ, పఠిస్తూ భక్తితో విష్ణుమూర్తిని స్తుతిస్తూ కాలం గడిపారు.'

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు. 396

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వైశంపాయనుండు= వ్యాసశిష్యుడైన వైశంపాయనముని; వెండియున్= తిరిగి ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఇంకా వ్యాసశిష్యు డైన వైశంపాయనముని ఇట్లా చెప్పాడు.

ఉ. ' సాత్యవతేయుఁ డీ పరమ జప్యము భక్తిఁ బఠించుచున్ వియ
ద్గత్యభిరాముఁడై నియమతత్పరతం జను దుగ్ధవార్ధికిన్
నిత్యము విష్ణుఁగాంచి మహనీయతరం బగు పూజనంబు సం
స్తుత్యముగాఁగఁ జేఁతకుఁ గుతూహలసంపద పల్లవింపఁగన్.' 397

ప్రతిపదార్థం: నిత్యమున్= ప్రతిరోజూ; విష్ణున్= విష్ణుమూర్తిని; కాంచి= దర్శించి; మహనీయతరంబు+అగు= మిక్కిలి పవిత్రమైన (విలువైన); పూజనంబు= అర్చనను; సంస్తుత్యము+కాఁగన్= పొగడొందేట్టు; చేఁతకున్= చేయటానికి; కుతూహల సంపద= ఉత్సాహశ్రీ; పల్లవింపఁగన్= చిగురొత్తగా; సాత్యవతేయుఁడు= సత్యవతీ తనయుడైన వ్యాసుడు; ఈ+పరమ+జప్యమున్= ఉత్తమమూ జపించదగినదీ అయిన ఈ ఉపాఖ్యానాన్ని; భక్తిన్= భక్తితో; పఠించుచున్= పఠిస్తూ; వియత్+గతి+అభిరాముఁడై= ఆకాశగమనంతో శోభిల్లినవాడై; నియమతత్పరతన్= నియమనిష్ఠాపరుడై; దుగ్ధవార్ధికిన్= క్షీరసముద్రానికి; చనున్= వెడతాడు.

తాత్పర్యం: ఈ పరమపవిత్రమైన ఉపాఖ్యానాన్ని భక్తితో జపిస్తూ వ్యాసుడు ఆకాశమార్గాన ప్రయాణం చేసి క్షీరసముద్రానికి వెళ్ళుతాడు. నిత్యమూ విష్ణుమూర్తిని దర్శించాలి, ఉత్తమపూజలు ఆచరించాలి అనే కుతూహలం వ్యాసుడి మనస్సులో ఎప్పుడూ పల్లవిస్తూ ఉంటుంది.'

వ. అనిన విని జనమేజయుండు మోదంబునొంది యమ్ముని సత్తమునితోడ నీవు మోక్షం బత్యంత సుఖం బని చెప్పుదు. సకలజనంబులు నభ్యుదయకరంబులైన కర్మవిశేషంబులం దగిలి యుండుదు 'రొరుల ననేల? దేవతలును దద్ధర్మంబు వాటింపక హవ్యభోజనపరత్వం బూని యుండుదు రమ్మహాత్ము లట్లగుట యెట్లొకో? యని యేను విచారించుచుండుదు నత్తెఱంగు దేటపడ నెఱింగింపవే?' యని యడిగిన నప్పారాశర్యశిష్యుం డా భూవరున కిట్లనియె. 398

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెబితే; విని= ఆలకించి; జనమేజయుఁడు= జనమేజయుడు; మోదంబున్+ఒంది= సంతోషించి; ఆ+మునిసత్తమునితోడన్= ఆ మునీశ్వరుడితో (వైశంపాయనుడితో); నీవు; మోక్షంబు= ముక్తి అనేది; అత్యంత సుఖంబు= మిక్కిలి సుఖమైనది; అని; చెప్పుదు(వు)= చెబుతావు; కానీ - సకలజనంబులున్= జనులందరూ; అభ్యుదయ కరంబులు+ఐన= భౌతికంగా అభివృద్ధిని కలిగించే; కర్మవిశేషంబులన్= ఆయా విశేషమైన పనులలో; తగిలి+ఉండుదురు= సక్తులై ఉంటున్నారు; ఒరులన్= ఇతరులను; అనన్+ఏల= అనటం ఎందుకుగానీ; దేవతలునున్= దేవతలుకూడా; తద్+ ధర్మంబున్= మోక్షధర్మాన్ని; పాటింపక= ఆచరించకుండా; హవ్యభోజన పరత్వంబున్= పురాడోశాన్ని తినటమే పనిగా; ఊని= స్వీకరించి; ఉండుదురు= జీవిస్తుంటారు (ఊనియుండుదురు); ఆ+మహాత్ములు= ఆ మహనీయులు; అట్లు= ఆ విధంగా; అగుట= కావటం; ఎట్లొకో!= ఎట్లా సమంజసం!; అని; ఏనున్= నేను; విచారించుచుండుదున్= ఆలోచిస్తూ ఉంటాను; ఆ+ తెఱంగున్= వారు అట్లా ఉండటానికి కారణాన్ని; ఎఱింగింపవే= తెలియజెప్పవా!; అని; అడిగినన్= అడిగితే; ఆ+పారాశర్యశిష్యుండు= ఆ వ్యాసశిష్యుడైన వైశంపాయనుడు; ఆ+భూవరునకున్= ఆ జనమేజయ మహారాజుకి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని వైశంపాయనుడు చెప్పగా విని, జనమేజయుడు ఆ మునీశ్వరుడితో 'నీవు ముక్తి అనేది మిక్కిలి సుఖమైనది అని చెప్పుతావు కానీ, జనులందరూ కేవలం భౌతిక విషయాలపైన మాత్రమే ఆసక్తి చూపుతున్నారు. అంతే కాదు, దేవతలు కూడా మోక్షధర్మాన్ని ఆచరించకుండా పురోడాశాన్ని తినటమే పనిగా జీవిస్తుంటారు. ఇదేమిటి?- వీరెందుకు ఇట్లా అయ్యారు? అని నేను ఆలోచిస్తూ ఉంటాను. వారు అట్లా ఉండటానికి గల కారణాన్ని తెలియజెప్పు' మని అడుగగా వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ విధంగా తెలిపాడు.

క. విమలాత్ముఁడు పారాశ । ర్యమునీంద్రుఁడు శిష్యులను మహాభారతపం
చమములగు వేదముల మే । రుమహీధరవాసియై కరుణఁ జదివించెన్. 399

ప్రతిపదార్థం: విమల+ఆత్ముఁడు= నిర్మలాంతరంగుడైన; పారాశర్యమునీంద్రుఁడు= ఆ వ్యాసుడు; మేరుమహీధర+వాసియై= మేరుపర్వతంమీద నివసిస్తున్నవాడై; శిష్యులను= తన శిష్యులను; మహాభారత పంచమములు+అగు= మహాభారతం అయిదవదిగా కలదైన; వేదములన్= వేదాలను (వేదాలు నాలుగయితే మహాభారతం అయిదవది. పంచమవేదం); కరుణన్= శిష్యులపట్ల దయతో; చదివించెన్= చదివించాడు (వేదాలను శిష్యులతో చదివించాడు అంటే నేర్పాడు అని).

తాత్పర్యం: నిర్మలమనస్సి ఆ వ్యాసుడు మేరుపర్వతంమీద నివసిస్తూ తన శిష్యులకు నాలుగు వేదాలూ, పంచమవేదమైన మహాభారతమూ దయతో నేర్పాడు.

వ. అట్టియెడ నేనును సుమంతు - పైల - జైమినులు నీ విప్పుడు నన్నడిగిన చందంబున నమ్మహాత్ము నడిగితిమి దానికి సుముఖుండయి సర్వజ్ఞుండును సదయహృదయుండును నగు సాత్యవతేయుండు మాకు నిట్లని యానతిచ్చె. 400

ప్రతిపదార్థం: అట్టియెడన్= అలా చదివిస్తున్న సమయంలో; ఏనునున్= నేనూ; సుమంతు= సుమంతుడూ; పైల= పైలుడూ; జైమినులు= జైమిని - అనే మేము నలుగురమూ; నీవు; ఇప్పుడు; నన్నున్= నన్ను; అడిగిన+చందంబునన్= అడిగినట్టే; ఆ+ మహాత్మున్= ఆ మహానుభావుడు వ్యాసుడిని; అడిగితిమి= అడిగాం; దానికిన్= ఆ విషయానికి; సుముఖుండు+అయి= అనుకూలుడై; సర్వజ్ఞుండునున్= అన్నీ తెలిసినవాడూ; సదయ+హృదయుండునున్= దయతో కూడిన హృదయం కలవాడూ; అగు= అయిన; సాత్యవతేయుండు= సత్యవతీతనయుడు - వ్యాసుడు; మాకున్= మాకు; ఇట్లు+అని= ఇట్లాగని; ఆనతి+ఇచ్చెన్= సెలవిచ్చాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నేనూ, సుమంతుడూ, పైలుడూ, జైమిని అనే నలుగురమూ నీవు ఇప్పుడు నన్ను అడిగినట్టే ఆ వ్యాసభగవానుడిని అడుగగా ఆయన ఇట్లా బదులిచ్చాడు.

తే. ఏ నతీతంబులును వర్తమానములు న । నాగతమ్ములు నగు జగదఖిలవర్త
నంబులును గను దివ్యబోధంబు గోరి । పాలకడలి తీరమునఁ దపంబుసేసి. 401

ప్రతిపదార్థం: ఏను= నేను; అతీతంబులును= కడచిపోయినవీ; వర్తమానములున్= జరుగుతున్నవీ; అనాగతమ్ములున్= (ఇంకా రానివీ) జరగబోయేవీ; అగు= అయిన; జగత్= ప్రపంచంయొక్క; అఖిల= సమస్తమైన; వర్తనంబులును= నడవడికలూ; కను= తెలిసికొనేటువంటి (దర్శించే); దివ్యబోధంబు= దివ్యజ్ఞానం; కోరి= వాంఛించి; పాలకడలి+తీరమునన్= క్షీరసముద్రతీరంలో; తపంబు+చేసి= తపస్సు చేసి.

తాత్పర్యం: శిష్యులారా! భూతభవిష్యద్వర్తమానాలలో ప్రపంచప్రవర్తనను తెలిసికొనగలిగిన దివ్యదృష్టిని పొందాలని కోరి నేను క్షీరసముద్రతీరంలో తపస్సు చేశాను.

వ. నారాయణప్రసాదంబునం జేసి సిద్ధమనోరథుండ నైతిం గావునం గల్పాదియందుఁ గమలసంభవప్రముఖ బృందారకు లాచరించిన కృత్యంబులు గానవచ్చు వానిం జెప్పెద దాన మీ యడిగిన యర్థంబు దేటపడు వినుండు. 402

ప్రతిపదార్థం: నారాయణప్రసాదంబునన్+చేసి= నారాయణుడి అనుగ్రహంచేత; సిద్ధమనోరథుండను+ఐతిన్= సిద్ధించిన కోరిక కలవాడను అయ్యాను (నా కోరిక సిద్ధించి ఆ దివ్యజ్ఞానమూ, దివ్యదృష్టీ లభించాయి అని); కావునన్= కాబట్టి; కల్పాదియందున్= సృష్టి ప్రారంభంలో; కమలసంభవ= బ్రహ్మదేవుడూ; ప్రముఖ= మొదలైన; బృందారకులు= దేవతలు; ఆచరించిన= చేసినటువంటి; కృత్యంబులు= పనులు; కానవచ్చువానిన్= కనిపించే వాటిని (ఏవి ఎంత కనిపిస్తే అంత); చెప్పెదన్= చెబుతాను; (కానవచ్చున్= కనబడతాయి వానిన్= వాటిని, చెప్పెదన్= చెప్పుతాను); దానన్= దానివలన; మీ+అడిగిన+అర్థంబు= మీరు అడిగిన విషయం (ప్రయోజనం); తేటపడున్= స్పష్టపడుతుంది; వినుండు= వినండి.

తాత్పర్యం: నారాయణుడి అనుగ్రహంచేత నా కోరిక సిద్ధించి, ఆ దివ్యజ్ఞానమూ, దివ్యదృష్టీ లభించాయి. కాబట్టి, సృష్టి ప్రారంభంలో బ్రహ్మదేవుడూ మొదలైన దేవతలు చేసినటువంటి పనులు చెప్పుతాను. దానివలన మీకు ప్రయోజనం సిద్ధిస్తుంది. మీ రడిగిన విషయం స్పష్టమౌతుంది.

క. ఆదిత్యమరుద్వసురు । ద్రాదిసురులు మునులు నంబుజాసనుఁగని మా
కేది కరణీయ మీశ? ద । యా దృష్టిని మమ్ముఁ జూచి యానతి యీవే? 403

ప్రతిపదార్థం: ఆదిత్య= ఆదిత్యులూ; మరుత్= మరుత్తులూ; వసు= వసువులూ; రుద్ర= రుద్రులూ; ఆది= మొదలైన; సురులున్= దేవతలూ; మునులున్= ఋషులూ; అంబుజ+ఆసనున్= పద్మగర్భుడైన బ్రహ్మదేవుడిని; కని= దర్శించి; ఈశ!= ప్రభూ!; మాకున్= మాకు; ఏది; కరణీయము?= కర్తవ్యం?; దయాదృష్టిని= దయగల దృష్టితో; మమ్మున్= మమ్మల్ని; చూచి= వీక్షించి; ఆనతి+ఈవే?= ఆజ్ఞాపించవా?

తాత్పర్యం: ఆదిత్యాది సమస్తదేవతలూ, మహర్షులూ ఒకరోజున బ్రహ్మదేవుడిని దర్శించి ఇట్లా అడిగారు: 'ప్రభూ! మాకు కర్తవ్యం ఏమిటో దయతో ఆజ్ఞాపించవా?' - అని.

వ. అని విన్నవించిన విని భరితాదరుండగుచు నప్పరమేష్ఠి వారితో 'మీ కెయ్యది కర్తవ్యంబో యను తలంపు మున్ననా చిత్తంబునం బొడమి యున్నయది. మీరు నిమ్మాట సెప్పి మేలు సేసితిరి. మీకును నాకును బ్రబలత్వం

బెద్దానం గలుగు దాని నుపదేశించుటకుం బురుషోత్తము శరణు సొత్తురం' డని పలికి వారునుం దానును దుగ్ధవారాశితీరంబునకుం బోయి ఘోరంబగు తపంబు బహుసహస్ర సఖ్యంబులగు దివ్యవర్షంబు లాచరించిన వారలకు గంభీరమధురప్రకారయగు వాణి యిట్లని వీతెంచె. 404

ప్రతిపదార్థం: అని; విన్నవించినన్= విజ్ఞప్తి చేస్తే; విని= ఆలకించి; భరిత+ఆదరుండు+అగుచున్= ఆదరంతో నిండినవాడు అవుతూ; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వారితోన్= వారితో; మీకున్= మీకు; ఎయ్యది= ఏది; కర్తవ్యంబో= కర్తవ్యమో; అను= అనేటటువంటి; తలంపు= ఆలోచన; మున్ను+అ= మునుపే; నా చిత్తంబునన్= నా హృదయంలో; పొడమి+ఉన్నయది= పుట్టి ఉన్నది; మీరున్= మీరూ; ఈ+మాటన్= ఇదే మాట; చెప్పి= అడిగి; మేలు+చేసితిరి= మేలు చేశారు; మీకునున్= మీకూ; నాకునున్= నాకూ; ప్రబలత్వంబు= పుష్టి (ఆధిక్యం); ఎద్దానన్= దేనివలన; కలుగున్= కలుగుతుందో; దానిన్= దానిని; ఉపదేశించుటకున్= ఉపదేశించటానికి; పురుష+ఉత్తమున్= శ్రీమన్నారాయణుడిని; శరణు+చొత్తము= శరణువేడుదాం; రండు= రండి; అని పలికి= అని చెప్పి; వారునున్= వారందరూ; తానునున్= తానూ; దుగ్ధవారాశి తీరంబునకున్= క్షీరసముద్రతీరానికి; పోయి= వెళ్ళి; ఘోరంబు+అగు= తీవ్రమైన; తపంబు= తపస్సు; బహుసహస్ర సంఖ్యంబులు+అగు= వేలకువేల సంఖ్య కలవైన; దివ్యవర్షంబులు= దివ్యసంవత్సరాలు (మానుష సంవత్సరాలు కాదు - వేలకు వేల దివ్యసంవత్సరాలు); ఆచరించినన్= చేస్తే; వారలకున్= వారికి; గంభీర= గంభీరమూ; మధుర= మధురమూ అయిన; ప్రకార+అగు= విధానం కలదైన; వాణి= (సరస్వతి) ఒక వాక్కు; ఇట్లు+అని= ఇలాగని; వీతెంచెన్= వినవచ్చింది (గాలిలో తేలివచ్చింది).

తాత్పర్యం: అని వారు అడుగగా, ఆదరంతో ఆ బ్రహ్మ వారితో 'ఇదే ఆలోచన మునుపే నా హృదయంలో పుట్టి ఉన్నది. మీరూ ఇదే మాట అడిగారు. మీకూ, నాకూ ఆధిక్యం దేనివలన కలుగుతుందో, దానిని ఉపదేశించు మని శ్రీమన్నారాయణుడిని శరణు వేడుదాం రండి' అని చెప్పి వారందరూ తానూ క్షీరసముద్రతీరానికి వెళ్ళి, తీవ్రమైన తపస్సు వేలకువేల దివ్యసంవత్సరాలు చేయగా వారికి గంభీరమూ, మధురమూ అయిన ఒక వాక్కు ఈ విధంగా వినవచ్చింది.

విష్ణుఁ డదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హితప్రకారము: (సం. 12-327-47,48,49)

క. 'మీ వచ్చినపని యెఱుఁగుదు । నీ వనజభవుండు జగము లిన్నిటికి గురుం
డే విధిఁ బనిచిన నది శ్రుతి । భావితకర్మంబు దానఁ బరఁగుదుఁ దగఁగన్. 405

ప్రతిపదార్థం: మీ+వచ్చినపని= మీరు వచ్చిన పని ఏమిటో; ఎఱుఁగుదున్= ఎరుగుదును; ఈ+వనజభవుండు= ఈ బ్రహ్మ (వనజము= పద్మం); జగములు+ఇన్నిటికిన్= ఈ జగత్తులు అన్నింటికీ; గురుండు= గురువు(తండ్రి); ఏ విధిన్= ఏ కర్తవ్యాన్ని; పనిచినన్= ఆజ్ఞాపించినా; అది; శ్రుతి= వేదాలలో; భావిత= ప్రతిపాదింపబడిన; కర్మంబు= పనే (అయి ఉంటుంది); దానన్= ఆ వేదంలోనే; తగఁగన్= తగినట్టు; పరఁగుదున్= నేనూ ఉంటాను (దానన్ అంటే ఆ ఆజ్ఞలోనే అనీ చెప్పవచ్చును).

తాత్పర్యం: 'దేవతలారా! మునులారా! మీరు వచ్చిన పని ఏమిటో నేను ఎరుగుదును. ఈ బ్రహ్మాదేవుడు ముజ్జగాలకూ గురువు (సృష్టికర్త, తండ్రి). ఈయన ఏ కర్తవ్యాన్ని నిర్ణయించినా అది వేదప్రతిపాదితమే. నేనూ అందులోనే చరిస్తాను.

వ. ఏనునుం జెప్పెద వినుండు వేదహితం బగు నొక్క యాగంబు సేయుం డందు భాగంబు నాకుం గల్పింపవలయు' ననిన వారుం బ్రీతిఁ బొంది. 406

ప్రతిపదార్థం: ఏనునున్= నేనుకూడా; చెప్పెదన్= చెబుతాను; వినుండు= ఆలకించండి; వేదహితంబు+అగు= వేదవిహితమైన (వేదాలకు హితమైన); ఒక్క= ఒకానొక; యాగంబు= యజ్ఞం; చేయుండు= చెయ్యండి; అందున్= ఆ యాగంలో; నాకున్= నాకు; భాగంబు= భాగం; కల్పింపన్+వలయున్= కల్పించాలి; అనినన్= అని ఆకాశంలో ఒక కంఠం వినిపించేసరికి; వారున్= వారందరూ; ప్రీతిన్= సంతోషాన్ని; పొంది= పొంది;

తాత్పర్యం: నేను కూడా చెప్పుతాను వినండి. వేదవిహితమైన యజ్ఞం చెయ్యండి. ఆ యాగంలో నాకు భాగం కల్పించాలి' అని ఆకాశంలో ఒక కంఠం వినిపించే సరికి వారందరూ సంతసించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కమలజు పంచిన క్రియ యా । గము వైష్ణవ మనఁగఁ జేసి, కల్పించిరి భా
గము విష్ణున కం, దతఁ డ । య్యమరుల మునివరులపై దయను గగనమునన్. 407

ప్రతిపదార్థం: కమలజు= పద్మసంభవుడైన బ్రహ్మదేవుడియొక్క; పంచిన= ఆజ్ఞాపించిన; క్రియన్= విధంగా (బ్రహ్మ ఆజ్ఞాపించినట్టు); వైష్ణవము+అనఁగన్= వైష్ణవం అనేటటువంటి; యాగము= యజ్ఞం; చేసి= నిర్వహించి; అందున్= ఆ యాగంలో; విష్ణునకున్= విష్ణుమూర్తికి; భాగము= భాగం; కల్పించిరి= కల్పించారు; అతఁడు= ఆ విష్ణుమూర్తి; ఆ+అమరుల= ఆ దేవతల; మునివరుల= మహర్షుల; పైన్= పైని; దయను= కృపతో; గగనమునన్= ఆకాశంలో.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించిన విధంగా 'వైష్ణవం' అనే యజ్ఞం చేసి దేవతలూ, మునులూ అందులో విష్ణుమూర్తికి భాగం కల్పించారు. దానికి సంతోషించి ఆ విష్ణుమూర్తి వారిపై దయతో ఆకాశంలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అదృశ్యుండై నిలిచి వారలతో నిట్లనియె. 408

ప్రతిపదార్థం: అదృశ్యుండు+ఐ= కంటికి కనబడకుండా; నిలిచి= ఆకాశంలో నిలబడి; వారలతోన్= బ్రహ్మాదిదేవతలతో, ఋషులతో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అదృశ్యరూపంలో ఆకాశంనుండి బ్రహ్మాదిదేవతలతో విష్ణుమూర్తి ఈ విధంగా అన్నాడు:

క. నా పంపునను బ్రవృత్తి । వ్యాపకయైనట్టి సత్క్రియం జేసితి రి
ట్లీ పుణ్యంబునకును ఫల । రూపంబగుదాని నే నిరూపింతుఁ దగన్. 409

ప్రతిపదార్థం: నా= నాయొక్క; పంపునను= ఆజ్ఞతో; ప్రవృత్తి వ్యాపక+ఐనట్టి= విస్తరించి జరిగినటువంటి; సత్క్రియన్= మంచిపనిని (సత్కార్యాన్ని); చేసితిరి= చేశారు; ఇట్లు= ఇట్లా చేసినటువంటి; ఈ పుణ్యంబునకున్= ఈ సుకృతానికి; ఫలరూపంబు+అగుదానిన్= ప్రతిఫలమైనదాన్ని; నేన్= నేను; తగన్= తగినట్టు; నిరూపింతున్= మీకు నిర్ణయిస్తాను.

తాత్పర్యం: మహర్షులారా! నా ఆజ్ఞమేరకు విస్తరించే ప్రవృత్తి కలిగిన ఒక మంచిపనిని చేశారు. ఇట్లా చేసిన ఈ పుణ్యానికి ఫలితాన్ని తగినట్లు మీకు నేను నిర్ణయిస్తాను.

వ. మరీచి యంగిరసుం డత్రి పులస్త్యుండు పులహుండు క్రతువు వసిష్ఠుఁ డను వీర లవ్వారిజభవునకు మానసపుత్రు లిమ్మహాత్ములు నట్టివార; వేదాచార్యులు యజ్ఞకార్యధుర్యులు; వీరు విధింప సర్వయజ్ఞంబులును మానవులు మాననీయంబులుగా నడప మీ కెల్లను నయ్యాగంబుల భాగంబులు గలిగి తద్భాగంబుల నాప్యాయితులై యుపబృంహణంబు నొందువారలు సన సనక సనందన సనాతన కపిల సనత్కుమారులు

పరమేష్ఠిమనోనిర్మితులు సహజజ్ఞాన విజ్ఞానులు నివృత్తిపరులునై సాంఖ్యయోగంబులకుం బ్రవర్తకులగుచుండుదురు. వీరలచేత మోక్షధర్మంబులు సువ్యంజితంబులగు. మీకుం దల్లియుం దండ్రియు గురుండును నివ్వరించియ. మదీయానుశాసనంబున నితండు సర్వానుశాసకుండై వర్తిల్లువాఁడు. మత్ఫాలప్రభవుండైన రుద్రుండు సర్వలోకారాధనీయుండును సకలవరప్రదుండునుం జుండీ! మీరు వొండు ; వేదోదితకర్మంబు లిక్కమలభవుండును మరీచ్యాది ప్రజాపతులునుం బంచినట్లు నడవం గలయవి. యిది కృతయుగం బను పేరింటి యుత్తమకాలంబు; దీనియందుఁ బశువులు హింస్యంబులు గావు సంశయంబు వలవదని నిర్దేశించిన.

410

ప్రతిపదార్థం: మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అను వీరలు= అనే వీరంతా; ఆ+వారిజభవునకున్= ఆ బ్రహ్మకు; మానసపుత్రులు= మనస్సు నుండి ప్రభవించిన కుమారులు; ఈ+మహాత్ములున్= ఈ మహానుభావులందరూ కూడా; అట్టివారు+అ= అంతటివారే (బ్రహ్మతో సమానులు); వేద+ఆచార్యులు= వీరు వేదాలకు గురువులు; యజ్ఞకార్య= యజ్ఞకృత్యాలకు; ధుర్యులు= నిర్వాహకులు; వీరు= ఈ మరీచి ప్రభృతులు; విధింపన్= నియమాలు చేయగా; సర్వ యజ్ఞంబులును= అన్ని యజ్ఞాలూ; మానవులు= మనుష్యులు; మాననీయంబులుగాన్= గౌరవింపదగినవిగా; నడపన్= నిర్వహించగా; మీకున్= మీకు; ఎల్లను= అందరికీ; ఆ+యాగంబులన్= ఆ యజ్ఞాలలో; భాగంబులు= భాగాలు; కలిగి= లభించి; తద్+భాగంబులన్= ఆ భాగాలతో; ఆప్యాయితులై= తృప్తిపొందినవారై; ఉపబృంహణంబున్= వృద్ధిని; ఒందువారలు= మీరంతా పొందుతారు; సన, సనక, సనందన, సనాతన, కపిల, సనత్కుమారులు= సనుడు, సనకుడు, సనందనుడు, సనాతనుడు, కపిలుడు, సనత్కుమారుడు - అనే వీరు; పరమేష్ఠి= బ్రహ్మయొక్క; మనః= మనస్సుచేత; నిర్మితులు= సృష్టింపబడినవారు (సంకల్పమాత్ర సంభవులు); సహజ= జన్మసిద్ధంగానే; జ్ఞానవిజ్ఞానులు= జ్ఞానవిజ్ఞానాలు కలవారు; నివృత్తిపరులునై= ముక్తి పరాయణులూ అయి (ప్రవృత్తి= విస్తరించటం; నివృత్తి= మరలటం); సాంఖ్యయోగంబులకున్= సాంఖ్యానికీ, యోగానికీ; ప్రవర్తకులు+అగుచుండుదురు= ప్రచారకులు అవుతుంటారు; వీరలచేతన్= వీరిచే; మోక్షధర్మంబులు= ముక్తికి సంబంధించిన ధర్మాలు; సువ్యంజితంబులు+అగున్= స్పష్టం చేయబడతాయి; మీకున్= మీకందరికీ; తల్లియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; గురుండున్= గురువూ; ఈ+విరించి+అ= ఈ బ్రహ్మదేవుడే; మదీయ= నాయొక్క; అనుశాసనంబునన్= ఆజ్ఞతో; ఇతండు= ఈ బ్రహ్మ; సర్వ+అనుశాసకుండై= సమస్తాన్నీ శాసించేవాడై; వర్తిల్లువాఁడు= వర్తిస్తాడు; మత్= నాయొక్క; ఫాల= నుదుటినుంచి; ప్రభవుండైన= పుట్టినవాడైన; రుద్రుండు= శివుడు; సర్వలోక= సమస్తలోకాలకూ; ఆరాధనీయుండును= పూజింపదగినవాడూ; సకల= సమస్తమైన; వర= వరాలనూ; ప్రదుండునున్= ఇచ్చేవాడూ; చుండీ!= సుమా!; మీరు+పొండు= ఇంక మీరు వెళ్ళండి; వేద+ఉదిత= వేదాలలో చెప్పబడిన; కర్మంబులు= పనులు; ఈ+కమలభవుండును= ఈ బ్రహ్మదేవుడూ; మరీచి+ఆది+ప్రజాపతులునున్= మరీచి మొదలైన ప్రజాపతులూ (బ్రహ్మతుల్యులు అన్నాడు కనక ప్రజాపతులే); పంచినట్లు= ఆజ్ఞాపించినట్టుగా; నడవన్+కలయవి= నడుస్తాయి; ఇది= ఇప్పుడిది; కృతయుగంబు అను+పేరిట= కృతయుగం అనే పేరుగల; ఉత్తమకాలంబు= ఉత్తమమైన కాలం; దీనియందున్= ఈ యుగంలో; పశువులు= జంతువులు; హింస్యంబులు= హింసించదగినవి (యజ్ఞాలలో పశుబలి); కావు= కాదు; సంశయంబు+వలవదు= సందేహం వద్దు; అని; నిర్దేశించినన్= ఆజ్ఞాపించేసరికి.

తాత్పర్యం: మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అనే బ్రహ్మమానసపుత్రులూ, ఈ మహాత్ములూ సమానులే. వీరు వేదపండితులు, యజ్ఞకార్య నిర్వాహకులు. వేదం నిర్దేశించగా మానవులు యజ్ఞాలన్నీ గౌరవంగా నిర్వహించి మీకందరికీ హవిర్భాగాలు కల్పించగా వాటిని మీరు గ్రహించి తృప్తిపడి అభివృద్ధి పొందండి. సన, సనక, సనందన, సనాతన, కపిల, సనత్కుమారులు బ్రహ్మ మానసపుత్రులు. వారు సహజజ్ఞానులు. ముముక్షువులు అయి సాంఖ్యయోగ మార్గాలను ప్రవర్తింప చేస్తారు. వీరిచేత మోక్షధర్మాలు స్పష్టమౌతాయి. మీకు తల్లీ, తండ్రీ, గురువు ఈ బ్రహ్మయే. నా ఆజ్ఞచేత బ్రహ్మ సర్వశాసకుడిగా ఉంటాడు. నా నుదురునుండి పుట్టిన

రుద్రుడు లోకాలన్నింట పూజించదగినవాడు, వరాల నిచ్చేవాడు సుమా! ఇక మీరు వెళ్ళండి. ఈ బ్రహ్మదేవుడూ, మరీచి మొదలైన ప్రజాపతులూ ఆజ్ఞాపించినట్లు నడుచుకొనండి. ఇప్పుడు ఉత్తమకాలమైన కృతయుగం. దీనిలో పశువులను చంపకూడదు. అనుమానం వద్దు' అని ఆదేశించగా.

క. మునులును సురలును విష్ణు । న్వినుతించి నమస్కరించి నిజపదములకుం
జనిరి పరమేష్ఠి యొకరుఁడ । చన కచ్చట నిలిచె హరియు సన్నిహితుండై. 411

ప్రతిపదార్థం: మునులునున్= మహర్షులూ; సురలునున్= దేవతలూ; విష్ణున్= విష్ణుమూర్తిని; వినుతించి= స్తుతించి; నమస్కరించి= మ్రొక్కి; నిజపదములకున్= తమ తమ స్థానాలకు (నెలవులకు); చనిరి= వెళ్ళిపోయారు; పరమేష్ఠి= బ్రహ్మ; ఒకరుఁడు+అ= ఒక్కడే; చనక= వెళ్ళకుండా; అచ్చటన్= అక్కడ; నిలిచెన్= నిలబడ్డాడు; హరియున్= విష్ణుమూర్తికూడా; సన్నిహితుండు+ఐ= బ్రహ్మదేవుడి చేరువకు వచ్చి -

తాత్పర్యం: విష్ణుమూర్తి ఆజ్ఞను శిరసావహించి మునులూ, దేవతలూ నుతించి, నతించి ఎవరి నెలవులకు వారు వెళ్ళిపోయారు. బ్రహ్మ ఒక్కడే వెళ్ళకుండా అక్కడే నిలబడ్డాడు. అప్పుడు విష్ణుమూర్తి ఆయన సమీపానికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. హయశిరోభాసితుండును హస్తకలిత । లలిత దండకమండలూజ్జ్వలుఁడు సాంగ
వేదముఖరముఖుండునై యాదరార్ద్ర । దృష్టి నిగుడంగ నిలిచి యద్దివిజముఖ్యు. 412

ప్రతిపదార్థం: హయశిరః= గుర్రపు తలతో; భాసితుండునున్= ప్రకాశిస్తున్నవాడూ (హయగ్రీవుడు); హస్త= చేతిలో; కలిత= ధరించిన (అలరారుతున్న); లలిత= (సుకుమారమైన) అందమైన; దండ= దండమూ; కమండలు= కమండలువు-వీటితో; ఉజ్జ్వలుండున్= ప్రకాశిస్తున్నవాడూ; స+అంగ= ఛందోజ్యోతిషాది షడంగాలతో కూడిన; వేద= వేదంతో; ముఖర= మారుమ్రోగుతున్న; ముఖుండును= వదనంకలవాడు; ఐ= అయి; ఆదర+ఆర్ద్ర+దృష్టి= ఆదరంతో (ప్రేమతో); చెమ్మగిల్లిన చూపు; నిగుడంగన్= ప్రసరించగా; నిలిచి= చేరువలో నిలిచి; ఆ+దివిజముఖ్యున్= దేవతలలో ముఖ్యుడయిన ఆ బ్రహ్మను (కౌగిలించుకొని).

తాత్పర్యం: విష్ణుమూర్తి హయగ్రీవుడుగా దర్శనమిచ్చాడు. చేతులలో దండకమండలువులు భాసిస్తున్నాయి. సాంగంగా వేదధ్వని ముఖంలో మారుమ్రోగుతున్నది. ఆదరంతో నిండి చెమ్మగిల్లిన కన్నులతో చూస్తూ బ్రహ్మను. (తరువాతి వచనంతో అన్వయం).

వ. కౌఁగిలించుకొని నీవు సర్వంబునకును విధాతవు గురుండవు ప్రభువవు నయి నడపుము. నీయందు సర్వభారంబునుం బెట్టి సుఖినై యుండెద. నడపుట నీకెప్పుడేనిఁ గడిందియై తోఁచె నప్పు డేను దోఁచి సమస్తంబును సునీతంబు సేయంగలవాఁడ ననియెఁ దదనంతరం బావిష్ణుం డంతర్హితుం డయ్యె. నిట్లు యజ్ఞంబు లందగ్రభాగార్హుండును యజ్ఞధారియునైన యప్పద్మనాభుండు ప్రవృత్తిధర్మంబు బ్రహ్మాదులకుం గృత్యంబు సేసి నివృత్తిధర్మంబునందు నిష్ఠుండును విద్యాసహాయుండునునై సర్వగతుం డగుచుఁ జరియించు నని చెప్పి యప్పారాశర్యుండు. 413

ప్రతిపదార్థం: కౌఁగిలించుకొని= బ్రహ్మను ఆలింగనం చేసికొని; నీవు; సర్వంబునకునున్= సమస్తానికీ (యజ్ఞాలు అన్నింటికీ); విధాతవు= సృష్టికర్తవూ; గురుండవు= గురువువు; ప్రభువవు= అధికారివీ; అయి; నడపుము= నడిపించుము; నీయందున్= నీమీద; సర్వభారంబునున్= సమస్తభారాన్నీ (మొత్తం బాధ్యతల బరువునంతటినీ); పెట్టి= ఉంచి; సుఖినై= నేను సుఖిగా; ఉండెదన్=

ఉంటాను; నడపుట= ఈ కార్యభారాన్ని సాగించటం; నీకున్= నీకు; ఎప్పుడేనిన్= ఎప్పుడయినా; కడిందియై= కష్టమై; తోఁచెన్= తోస్తే (కష్టమనిపిస్తే); అప్పుడు; ఏనున్= నేను; తోఁచి= ప్రత్యక్షమై; సమస్తంబునున్= అంతటినీ; సునీతంబు= బాగా నడప బడినదిగా; చేయంగలవాఁడన్= చేస్తాను; అనియెన్= అన్నాడు విష్ణుమూర్తి; తద్+అనంతరంబు= ఆ తరువాత; ఆ+విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; అంతర్హితుండు+అయ్యెన్= అంతర్ధానం చెందాడు; ఇట్లు; యజ్ఞంబులందున్= యాగాలలో; అగ్రభాగ+అర్హుండున్= అగ్రస్థాన గౌరవానికి యోగ్యుడూ (అగ్రతాంబూలం అందుకుంటూ); యజ్ఞధారియున్+ఐన= యజ్ఞాలను ధరించేవాడూ అయిన; ఆ+పద్మనాభుండు= ఆ విష్ణుమూర్తి (పద్మం నాభియందు కలవాడు); ప్రవృత్తి ధర్మంబు= క్రియాశీలమైన ప్రవృత్తిధర్మాన్ని (కర్మాచరణమే ప్రవృత్తి); బ్రహ్మాదులకున్= బ్రహ్మాదిదేవతలకూ, ఋషులకూ; కృత్యంబు+చేసి= కర్తవ్యంగా ఏర్పరిచి; నివృత్తి ధర్మంబునందు= (నిష్క్రియారూపమై అంతర్ముఖలక్షణమైన) నివృత్తిధర్మంలో; నిష్ఠుండునూ= (స్థిరపడినవాడూ) నిష్ఠ కలవాడూ; విద్యా+సహాయుండునున్= జ్ఞానమే సహాయంగా కలవాడూ; ఐ= అయి; సర్వగతుండు అగుచున్= అన్నింటా ఉన్న వాడవుతూ (సర్వత్ర నివసిస్తూ); చరియించున్= సంచరిస్తూ ఉంటాడు; అని చెప్పి= అని వివరించి; ఆ+పారాశర్యుండు= ఆ వ్యాసుడు - ఇంకా ఇట్లా అంటున్నాడు. (అగ్రభాగ+హరుండు= ప్రథమభాగం లేదా ఉత్తమభాగం అందుకొనేవాడు - అని పాఠాంతరం.)

తాత్పర్యం: బ్రహ్మను ఆలింగనం చేసికొని, 'నీవు యజ్ఞాల కన్నిటికీ సృష్టికర్తవు, గురువువు, అధికారివీ అయి నడిపించుము. నీమీద భారమంతా ఉంచి సుఖంగా ఉంటాను. నీ కెప్పుడైనా కష్టమనిపిస్తే నేను ప్రత్యక్షమై అన్నీ నడిపిస్తాను' - అని చెప్పి విష్ణువు అంతర్ధాన మయ్యాడు. ఇట్లా యజ్ఞాలలో అగ్రభాగానికి యోగ్యుడూ, యజ్ఞధారీ అయిన ఆ విష్ణువు కూడా జ్ఞానకారకుడై, అన్నిటా ఉన్నవాడై ప్రవర్తిల్లుతూ ఉంటాడు' అని చెప్పి ఆ వ్యాసుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మొదలఁ గలిగించి జగములఁ । బదిలంబుగ నునిచి వానిఁ బదపడి తనయం
దొదిఁగించి మఱియు నెమ్మెయి । నుదారగతి నడపు చిన్మయుని గొలుతు హరిన్. 414

ప్రతిపదార్థం: జగములన్= లోకాలను; మొదలన్= ముందుగా; కలిగించి= సృష్టించి; పదిలంబుగన్= జాగ్రత్తగా; ఉనిచి= ఉంచి (పోషించి); వానిన్= ఆ లోకాలను; పదపడి= ఆ తరువాత; తనయందున్= తనలో; ఒదిఁగించి= లీనం చేసికొని; మఱియున్= ఇంకా; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; ఉదారగతిన్= ఉదారమైన పద్ధతిలో; నడపు= నిర్వహించే; చిన్మయునిన్= జ్ఞానమయ స్వరూపుడైన; హరిన్= విష్ణుమూర్తిని; కొలుతున్= (సేవిస్తాను) సేవిస్తున్నాను.

తాత్పర్యం: లోకాలను సృష్టించి, పోషించి, కట్టకడపటికి వాటిని తనలోనే లీనం చేసికొని అన్నివిధాలా ఉదారంగా నడిపించే జ్ఞానమయుడు విష్ణుమూర్తి. ఆ దేవుడిని నేను సేవించుకొంటున్నాను.

ఆ. అజుని విశ్వరూపు నమరుని సర్వామ । రాధినాథు నాద్యు సాంగవేద
వేదితవ్యు నాత్మవేద్యు నీశాను న । వ్యయుఁ దపఃఫలాత్ము నాశ్రయింతు. 415

ప్రతిపదార్థం: అజునిన్= పుట్టుకలేని వాడినీ; విశ్వరూపున్= విశ్వస్వరూపుడినీ; అమరునిన్= మృతిలేనివాడినీ (శాశ్వతుడు); సర్వ+అమర+అధినాథున్= సకలదేవతలకూ నాయకుడినీ; ఆద్యున్= తొట్టతొలివాడినీ; సాంగవేద= షడంగసహితాలైన వేదాలతో; వేదితవ్యున్= తెలుసుకోదగినవాడినీ; ఆత్మవేద్యున్= ఆత్మతోమాత్రమే తెలియదగినవాడినీ; ఈశానున్= ఈశ్వరుడినీ; అవ్యయున్= వ్యయంలేనివాడినీ (మార్పులేనివాడు లేదా వినాశం లేనివాడు); తపః= తపస్సులకు; ఫల+ఆత్మున్= ఫలస్వరూపమైనవాడూ - అయిన శ్రీ మహావిష్ణుమూర్తిని; ఆశ్రయింతున్= ఆశ్రయిస్తున్నాను (శరణు వేడుతున్నాను).

తాత్పర్యం: అజ, విశ్వరూప, అమర, అమరాధినాథ, ఆద్య, వేదవేద్య, ఆత్మవేద్య, ఈశాన, అవ్యయ, తపఃఫలాత్మ అనే విశేషణాలు ఆయా లక్షణాలను బట్టి విష్ణుమూర్తికి ఏర్పడ్డాయి. ఏవంవిధ లక్షణలక్షితుడైన ఆ దేవదేవుడిని సేవించుకొంటున్నాను.

వ. అని మఱియు ననేకప్రకారంబుల నప్పరమముని యప్పుడు భావంబున నెలకొన్న నారాయణుం బ్రస్తుతించి మమ్ముం గలయ నవలోకించి పూర్వవృత్తాంతంబు ప్రజ్ఞాదృష్టిని నా కన్నయది మీ కెఱింగించితి విష్ణుని దివ్యవచనంబుల చొప్పున నడచునది. యప్పరమేశ్వరుం గొలువుండు; వేదవాక్యంబులం దత్ప్రకీర్తనంబు సేయుం డనియె; నేము నట్లకాక యని ఋగ్యజుస్సామంబుల నా త్రిధాముం బ్రస్తుతించి మనంబుల నారాధించితి' మని చెప్పి వైశంపాయనుండు వెండియు. 416

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియున్= ఇంకా; అనేకప్రకారంబులన్= చాలా విధాలుగా; ఆ+పరమమునిన= ఆ దివ్యర్షి వ్యాసుడు; అప్పుడు= ఆ సమయంలో; భావంబునన్= హృదయంలో; నెలకొన్న= నివసిస్తున్న (నెలవు+కొను= నెలకొను); నారాయణున్= శ్రీమహావిష్ణుమూర్తిని; ప్రస్తుతించి= బాగా స్తుతించి; మమ్మున్= శిష్యులమైన మమ్ములను; (వైశంపాయన పైల సుమంతు ప్రభృతులను); కలయన్+అవలోకించి= పరిశీలనగా చూచి; పూర్వవృత్తాంతంబు= కడచిన కథను; ప్రజ్ఞాదృష్టిని= దివ్యదృష్టితో (తెలివి అనే చూపుతో); నా+కన్న+అది= నేను చూచినది; మీకున్= మీకు; ఎఱింగించితిన్= తెలియజేశాను; విష్ణుని= విష్ణుమూర్తి చెప్పినటువంటి; దివ్యవచనంబుల+చొప్పునన్= దివ్యమైన వాక్కుల ప్రకారం; నడచునది= వర్తించండి; ఆ+పరమేశ్వరున్= ఆ పరమేశ్వరుడిని; కొలువుండు= సేవించండి; వేదవాక్యంబులన్= వేదమంత్రాలతో; తద్= ఆ స్వామియొక్క; ప్రకీర్తనంబు= సంస్తుతి; చేయుండు= చేయండి; అనియెన్= అని చెప్పాడు వ్యాసుడు; ఏమున్= మేముకూడా; అట్లకాక= అట్లాగే; అని; ఋక్+యజుస్+సామంబులన్= మూడు వేదాలతోనూ; ఆ+త్రిధాముస్= ఆ విష్ణుమూర్తిని; ప్రస్తుతించి= బాగా స్తుతించి; మనంబులన్= మనస్సులలో; ఆరాధించితిమి= పూజించాము; అని చెప్పి= అని పలికి; వైశంపాయనుండు= ఆ వైశంపాయనమహర్షి; వెండియున్= తిరిగి ఇలా అంటున్నాడు:

తాత్పర్యం: అని, ఇంకా పెక్కు విధాలుగా వ్యాసుడు భావనాపథంలో నిలిచిన నారాయణుడిని కీర్తించి, మమ్ముల నందరినీ తేరిపారచూచి, 'దివ్యదృష్టితో నేను చూచిన పూర్వవృత్తాంతం మీకు తెలియజెప్పాను. విష్ణుదేవుడి దివ్య వచనాల నాశ్రయించి ముందుకు నడవండి. పరమేశ్వరుడు కొలువుండే వేదవాక్యాలను గానం చేయండి.' అన్నాడు. 'అట్లాగే చేస్తా' మని మేము ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదంలో నివసించే విష్ణువును స్తుతించాము' అని చెప్పి వ్యాసుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు).

సీ. సర్వజ్ఞుఁడగు పరాశరనందనుని చేత । భాషితంబైన యప్పరమపుణ్య
వృత్తంబు సదివిన విన్నను విప్రుండు । వేదవేదియు, రాజు విజయశాలి
యును, వణిజుండు లాభోపేతుఁడును, శూద్రుఁ । డత్యంతసుఖియును నగు నరేంద్ర!
కన్య సద్వరకరగ్రహణంబు వడయు, గ । ర్భిణియైన కాంత సద్గుణునిఁ బుత్రుఁ

ఆ. గాంచుఁ, బ్రసవకాలకలయందు నెఱి దప్పి । యున్న బిడ్డగలుగునువిద సుఖక
రప్రసూతి నిర్భరతనొందు, వంధ్య సం । తానసిద్ధి సమ్మదంబు నొందు. 417

ప్రతిపదార్థం: సర్వజ్ఞుఁడు= సమస్తమూ తెలిసినవాడైన; పరాశరనందనునిచేతన్= వ్యాసునిచే; భాషితంబైన= చెప్పబడిన; ఈ+పరమపుణ్య వృత్తంబు= మిక్కిలి పావనమైన ఈ కథను; చదివినన్= చదివినా; విన్ననున్= విన్నా; విప్రుండు= బ్రాహ్మణుడు;

వేదవేదియున్= వేదాలను తెలిసికొన్నవాడూ; రాజు= క్షత్రియుడు; విజయశాలియునున్= విజయవంతుడూ; వణిజుండు= వ్యాపారస్థుడు; లాభ+ఉపేతుఁడునున్= అధికలాభాలు పొందేవాడూ; శూద్రుఁడు= నాల్గవజాతివ్యక్తి; అత్యంత సుఖియునున్= మిక్కిలి సుఖాలు పొందేవాడూ; అగున్= అవుతాడు; నరేంద్ర= జనమేజయా!; కన్య= కన్య ఎవరయినా ఇది చదివినా, విన్నా; సత్+వర= ఉత్తమవరుడియొక్క; కరగ్రహణంబు= పాణిగ్రహణం (వివాహం); పడయున్= పొందుతుంది; గర్భిణియైన+కాంత= గర్భిణీస్త్రీ అయితే; సద్గుణునిన్= మంచి గుణవంతుడైన; పుత్రున్= తనయుడిని; కాంచున్= ప్రసవిస్తుంది; ప్రసవకాల+కలయందున్= ప్రసవించే ముహూర్తంలో ఈ కథ వింటే (కళ= ముప్పది కాష్ఠలకాలం); నెఱిదప్పియున్న బిడ్డ గలుగు నువిద= గర్భకోశంలో ఉండవలసిన తీరును తప్పి ఉన్న శిశువును ధరించిన స్త్రీ (గర్భంలో బిడ్డ అడ్డంతిరిగితే); సుఖకరప్రసూతి నిర్భరతన్= సుఖంగా ప్రసవించే స్థితిని; ఒందున్= పొందుతుంది (సుఖప్రసవం అవుతుంది - అని); వంధ్య= గొడ్రాలు; సంతానసిద్ధి= సంతానప్రాప్తి వలన కలిగే; సమ్మదంబున్= సంతోషాన్ని; ఒందున్= పొందుతుంది (గొడ్రాలు కూడా సంతానవతి అవుతుందని ఈ కథ విన్నా చదివినా అని).

తాత్పర్యం: వ్యాసుడు మాకందరికీ చెప్పిన ఈ పవిత్రకథను విన్నా, చదివినా విప్రుడు వేదవేత్త అవుతాడు. రాజు విజయశాలి అవుతాడు. వ్యాపారి అధికలాభాలు పొందుతాడు. శూద్రుడు సుఖాలు పొందుతాడు. కన్యకు మంచి వరుడు దొరుకుతాడు. గర్భిణీస్త్రీకి గుణవంతుడైన కొడుకు పుట్టుతాడు. గర్భకోశంలో బిడ్డ అడ్డం తిరిగి ఉన్న స్త్రీకయితే సుఖంగా ప్రసవం అవుతుంది. గొడ్రాలు సంతానవతి అవుతుంది. అంత పరమపావనమైనది ఈ కథ' అని వైశంపాయనుడు ఫలశ్రుతి చెప్పాడు.

విశేషం: నెఱి దప్పియున్న బిడ్డ గలుగునువిద - ప్రసవకాల కళయందున్ - సుఖకర ప్రసూతి నిర్భరతన్ - ఒందున్ అనే దానికి సంస్కృతమూలం ఇట్లా ఉన్నది: **"లగ్నగర్భా విముచ్యేత గర్భిణీ జనయేత్సుతమ్."**

భగవన్నామ నిర్వచన ప్రకారము (సం. 12-328-3)

వ. ' మఱియు నెవ్విధంబు మనోరథంబులైనను సఫలంబు లను ననిన విని జనమేజయుండు 'గూఢంబు లగు విష్ణునామంబు లనిర్వచనంబులు వినవలతు వివరింపవే' యనుటయు వైశంపాయనుం డమ్మహీనాయకులతో నర్జునుం డడుగం గృష్ణుండు వివరించిన నిజనామంబుల నిరుక్తి తెఱంగెఱింగించెద నాకర్ణింపు మప్పార్థుని బోధించుటకై యద్దేవుం డిట్లనియె. 418

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఏ+విధంబు= ఏ రకమైన; మనోరథంబులైనను= కోరికలైనా; సఫలంబులు+అగున్= ఫలిస్తాయి; అనినన్= అని చెబితే; విని; జనమేజయుండు= ఆ జనమేజయుడు; గూఢంబులు+అగు= రహస్యాలైన; విష్ణు నామంబులు= విష్ణుమూర్తి నామధేయాలు; అనిర్వచనంబులు= నిర్వచనాలకు లొంగేవి కావు; వినన్+వలతున్= వినాలి అని కోరుకుంటున్నాను; వివరింపవే= దయచేసి వివరించవా?; అనుటయును= అనటంతోనే; వైశంపాయనుండు= వైశంపాయనుడు (ఇలా చెబుతున్నాడు); అర్జునుండు= కిరీటి; అడుగన్= అడిగినప్పుడు; ఆ+మహీ+నాయకులతోన్= ఆ పాండవులకు(తో); కృష్ణుండు= శ్రీకృష్ణపరమాత్మ; వివరించిన= వివరించి చెప్పినటువంటి; నిజనామంబుల= తన నామధేయాల; నిరుక్తి= నిర్వచనంయొక్క; తెఱంగున్= పద్ధతిని; ఎఱింగించెదన్= నీకు తెలియజెపుతాను; ఆకర్ణింపుము= వినుము; ఆ+పార్థునిన్= ఆ అర్జునుడిని; బోధించుటకై= జ్ఞానవంతుడిని చెయ్యటంకోసం; ఆ+దేవుండు= ఆ శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'ఇంకా ఎటువంటి కోరికలైనా ఫలిస్తాయి' - అనగా విని జనమేజయుడు 'గూఢములైన విష్ణువు నామాలు నిర్వచనాలకు లొంగేవికావు. అయినా వాటిని వినాలని ఉన్నది. చెప్పుము' అనగా వైశంపాయనుడు జనమేజయుడితో - 'ఇదే ప్రశ్నను అర్జునుడు అడుగగా విష్ణువు తన నామాలను నిర్వచించిన విధం చెప్పుతాను వినుము' అని ఇట్లా అన్నాడు.

తే. ' నరుఁడు నారాయణుండు ననంగఁ బరఁగు । నిత్యపురుషులు నీవును నేనుఁ జుమ్ము,
భువనహిత మాచరింపఁగాఁ బూని వేడ్క । వచ్చి యిమ్మహిఁ బుట్టినవార మనఘ! 419

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా! అర్జునా!; నరుఁడున్= నరుడూ; నారాయణుండున్= నారాయణుడూ; అనంగన్= అని; పరఁగు= ఒప్పే; నిత్యపురుషులు= సదాతన పురుషులు; నీవునున్= నీవూ; నేనున్= నేనూ; భువన= లోకాలకు; హితము= మేలు; ఆచరింపఁగాన్= చెయ్యటంకోసం; పూని= పూనుకొని; వేడ్కన్= వేడుకగా (లీలావిలాసంగా); వచ్చి= అవతరించి; ఈ+మహిన్= ఈ భూలోకంలో; పుట్టినవారము= మనం ఇద్దరమూ జన్మించాం. చుమ్ము= సుమా!;

తాత్పర్యం: 'పావనా! అర్జునా! నీవూ నేనూ - నరుడూ నారాయణుడూ అనే నిత్యపురుషులం. లోకహితం కోరి ఈ భూలోకంలో ఇట్లా జన్మించాం సుమా!

వ. గూఢంబులగు మదీయాభిధానంబుల యర్థంబులు దేటపఱిచెద నాకర్ణింపుము. 420

ప్రతిపదార్థం: గూఢంబులు+అగు= అతి నిగూఢాలైన; మదీయ= నాయొక్క; అభిధానంబుల= నామధేయాల; అర్థంబులు= అర్థాలు; తేటపఱిచెదన్= నీకు విశదపరుస్తాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అతి నిగూఢాలైన నా నామధేయాల అర్థాలు నీకు విశదపరుస్తాను. ఆలకించుము.

క. నారము లనఁగా జలముల । పే రయనం బనఁగ నెలవు ప్రీతిగ నాకున్
నారము లయనం బగుటను । నారాయణుఁ డండ్రు జనులు నన్నుఁ గిరీటీ! 421

ప్రతిపదార్థం: కిరీటీ!= అర్జునా!; నారములు+అనఁగాన్= నారములు అంటే; జలముల+పేరు= నీటికి పర్యాయపదం (పేరు); అయనంబు+అనఁగన్= అయనము అంటే; నెలవు= స్థానం అని అర్థం; ప్రీతిగన్= ఇష్టంగా; నాకున్= నాకు; నారములు= నీళ్ళు; అయనంబు= నివాసస్థానం; అగుటను= అవ్వటంవలన; నన్నున్= నన్ను; జనులు= ప్రజలు; నారాయణుఁడు+అండ్రు= నారాయణుడు అంటారు.

తాత్పర్యం: అర్జునా! నారములు అంటే నీళ్ళు. అయనము అంటే నివాసం. నాకు నారములు అయనం కాబట్టి (నార+అయన - నార మయనం యస్య సః - నారాయణః) నన్ను ప్రజలంతా నారాయణుడు అంటారు.

క. వసియింతు నే జగములన్ । వసియించున్ జగములెల్ల నాయం దిమ్మె,
పాసఁగి వెలుంగుచునుండుట । నసదృశగుణ! వాసుదేవుఁ డనఁగఁ బరఁగుదున్. 422

ప్రతిపదార్థం: అసదృశగుణ!= సాటిలేని సద్గుణాలు కలవాడా!; ఏన్= నేను; జగములన్= జగత్తులలో; వసియింతున్= నివసిస్తూంటాను; జగములు+ఎల్లన్= జగత్తులన్నీ; నాయందున్= నాలో; ఇమ్ము+ఐ= నెలకొన్నవై (స్థానం కల్పించుకొని, ఇమ్ము= స్థానం); వసియించున్= నివసిస్తూ ఉంటాయి; పాసఁగి= అట్లా పాల్పారి; వెలుంగుచున్+ఉండుటన్= విరాజిల్లుతూండటంచేత; వాసుదేవుఁడు+అనఁగన్= వాసుదేవుడు అనే పేరుతో; పరఁగుదున్= ఒప్పుతాను.

తాత్పర్యం: సద్గుణసంపన్నా! నేను జగత్తులన్నింటా ఉంటాను. అన్ని జగత్తులూ నాలో ఉంటాయి. ఇట్లా ఒప్పెసలారటంవలన నన్ను 'వాసుదేవుడు' అంటారు.

క. వ్యాపించి రోదసీకుహ । రాపూర్ణత్వమున మునికి నధికక్రమణ
శ్రీ పాలుపున విష్ణుండను । దీపితనామంబునను బ్రతీతుఁడ నగుదున్. 423

ప్రతిపదార్థం: వ్యాపించి= విస్తరించి; రోదసీకుహర= అంతరిక్షగుహలో (కుహరం= గుహ); ఆపూర్ణత్వమునన్= పూర్తిగా పిక్కటిల్లి; ఉనికిన్= ఉండటంచేత; అధిక= అధికంగా; క్రమణ= ఆక్రమించటమనే; శ్రీ= సంపత్తియొక్క; పొలుపునన్= అందంచేత (జగద్వ్యాపకత); విష్ణుండు= విష్ణుడు (వ్యాపనశీలుడు); అను= అనేటువంటి; దీపిత= ప్రకాశించే; నామంబునను= పేరుతో; ప్రతీతుఁడన్+అగుదున్= ప్రసిద్ధిపొందాను (పొందుతాను).

తాత్పర్యం: రోదసీకుహరంలో నేనే పిక్కటిల్లి ఉంటాను. మిగతా జగత్తు అంతటా ఆక్రమించి ఉన్నవాడినీ నేనే. ఈ రెండు లక్షణాలవలనా నాకు 'విష్ణుడు' అనే పేరు ప్రసిద్ధికెక్కింది.

తే. దమమునాఁ గల యుత్తమధర్మ మెడఁద । నలవఱిచి నన్నుఁ గామించు నార్యజనము
దివియు భువియు నా నడుమన తేజరిల్లు । నట్టు లగుట దామోదరుఁ డండ్రు నన్ను. 424

ప్రతిపదార్థం: దమము+నాన్= దమం అనే పేరుతో (ఇంద్రియ నిగ్రహం); కల= ఉన్న; ఉత్తమ ధర్మము= ఉత్తమగుణం; ఎడఁదన్= హృదయంలో; అలవఱిచి= అభ్యసించి; నన్నున్= నన్ను; ఆర్యజనము= సజ్జనసమూహం; కామించున్= కోరుకొంటుంది; దివియున్= ఊర్ధ్వ లోకమూ; భువియున్= భూలోకమూ; నా+నడుమన్+అ= నా పొట్టలోనే (ఉదరంలోనే); తేజరిల్లున్= ప్రకాశిస్తూంటాయి; అట్టులు+అగుటన్= అలా కావటం వలన; నన్నున్= నన్ను; దామ+ఉదరుఁడు= దామోదరుడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: దమము అనే ఉత్తమ లక్షణం ఉన్న సజ్జనులు నన్ను ధ్యానిస్తూ ఉంటారు. ఊర్ధ్వలోకమూ, భూలోకమూ నా ఉదరంలోనే ఉంటాయి. ఈ రెండు కారణాలవలనా నాకు దామోదరుడు అనే పేరు ఏర్పడింది.

విశేషం: దీని మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **"దమాత్సిద్ధిం పరీప్సంతో మాం జనాः కామయంతి హి । దివం చోర్వీం చ మధ్యం చ తస్మాత్ దామోదరో హ్యహమ్ ॥" (12-328-39). "దామ్ని ఉదరే మనసి కుర్వంతి ధ్యాయంతీతి దామోదరః"** అని వ్యాఖ్యానం.

ఆ. అన్నమును జలంబు నమృతంబు వేదంబుఁ । బృశ్ని యనఁగ నొప్పుపేరఁ బరఁగు,
నది మదీయగర్భ మగుట విద్వజ్జను । లనఘ! పృశ్నిగర్భుఁ డండ్రు నన్ను. 425

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! పార్థా!; అన్నమును= అన్నమూ (తినేది ఏదయినా); జలంబున్= నీరూ; అమృతంబున్= అమృతమూ (సు ధ); వేదంబున్= వేదమూ; పృశ్ని+అనఁగన్= పృశ్ని అని; ఒప్పు= ఒప్పేటటువంటి; పేరన్= పేరుతో; పరఁగున్= అలరారుతూ ఉంటాయి; అది= ఆ పృశ్ని అనేది; మదీయ= నాయొక్క; గర్భము+అగుటన్= గర్భంలో ఉండటంచేత (అదే నా గర్భం కావటంచేత); విద్వత్+జనులు= పండితులు; నన్నున్= నన్ను; పృశ్ని గర్భుఁడు= పృశ్నిగర్భుడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పార్థా! అన్నమూ, జలమూ అమృతమూ, వేదమూ - వీటికి పృశ్ని అని పేరు. అదే నా గర్భం. అందుచేత పండితులు నన్ను పృశ్నిగర్భుడు (పృశ్ని గర్భంగా కలవాడు) అంటారు.

విశేషం: "పృశ్ని రిత్యుచ్యతే చాన్నం వేదా ఆపోzమృతం తథా। మమైతాని సదా గర్భే పృశ్నిగర్భస్తతో హ్యహమ్ ॥" అని దీని మూలశ్లోకం.

క. ఇనరశ్ములుఁ జంద్రాంశులు । ననలశిఖలు గేశ సంచయము నాకుం గా
వునఁ గేశవాభిధానం । బునఁ గొనియాడుదురు ననుఁ బ్రబుద్ధజనంబుల్. 426

ప్రతిపదార్థం: ఇనరశ్ములున్= సూర్యకాంతులూ; చంద్ర+అంశులు= చంద్రకాంతులూ; అనల+శిఖలు= అగ్నిజ్వాలలూ (శిఖ= చివరిభాగం); నాకున్= నాకు; కేశసంచయము= కేశసమూహం; కావునన్= కాబట్టి; ననున్= నన్ను; ప్రబుద్ధజనంబుల్= జ్ఞానులైన ప్రజలు (మహర్షులు); కేశవ+అభిధానంబునన్ (అభిధానమునన్)= కేశవ అనే పేరుతో; కొనియాడుదురు= స్తుతిస్తూ ఉంటారు.

తాత్పర్యం: సూర్యకిరణాలూ, చంద్రకిరణాలూ, అగ్నిజ్వాలలూ నాకు కేశసమూహం. అందుచేత జ్ఞానులైన పెద్దలు నన్ను కేశవనామంతో స్తుతిస్తూ ఉంటారు.

క. క్షత్రము బ్రహ్మము నై లో । కత్రాణన మాచరింపఁ గావలసి పృథా
పుత్రా! యగ్నీషోములు । చిత్రస్థితి వెలుఁగుదురు ప్రసిద్ధాకృతులన్. 427

ప్రతిపదార్థం: పృథా+పుత్రా= పృథాదేవి కుమారుడా! పార్థా!; క్షత్రము= క్షత్రియత్వమూ; బ్రహ్మమున్= బ్రహ్మత్వమూ; ఐ= పొంది; లోక+త్రాణనమున్= లోకాలను రక్షించటం; ఆచరింపన్+కావలసి= చేయవలసి వచ్చి; అగ్నీషోములు= అగ్ని,చంద్రుడూ; చిత్రస్థితిన్= విచిత్రమైన స్థితితో; ప్రసిద్ధ+ఆకృతులన్= ప్రసిద్ధమైన రూపాలతో వెలుఁగుదురు= ప్రకాశిస్తూ ఉంటారు.

తాత్పర్యం: పార్థా! లోకరక్షణకొరకు క్షత్రియత్వమూ, బ్రాహ్మణత్వమూ స్వీకరించి అగ్ని, చంద్రుడు విచిత్రస్థితితో ప్రసిద్ధమైన ఆకారాలతో ప్రకాశిస్తూ ఉంటారు.

వ. అని చెప్పి బ్రహ్మక్షత్రపదంబులు విప్రరాజ నిర్దేశంబులగుట దేటపడంబలికి విప్రుల రాజుల మహానుభావంబులు విలసిల్లినయెడలు నిదర్శనంబులుగా నిరూపించి యుపన్యసించి యవియెల్ల నగ్నీషోమమాహాత్మ్యంబు గావు టెఱింగించి. 428

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; బ్రహ్మక్షత్రపదంబులు= బ్రహ్మ అనే పదమూ, క్షత్ర అనే పదమూ; విప్ర -రాజ - నిర్దేశంబులు= విప్రుడికీ, రాజుకీ నిర్దేశకాలు (వాచకాలు); అగుట= అవ్వటం; తేటపడన్= స్పష్టపడేట్టు; పలికి= వివరించి; విప్రుల= బ్రాహ్మణుల యొక్క; రాజుల= రాజులయొక్క; మహానుభావంబులు= మాహాత్మ్యాలు; విలసిల్లిన ఎడలు= విరాజిల్లిన తావులు; నిదర్శనంబులుగాన్= సాక్ష్యాలుగా; నిరూపించి= చూపించి; ఉపన్యసించి= ప్రసంగించి; అవి ఎల్లన్= అవి అన్నీ; అగ్నీషోమ మాహాత్మ్యంబు= అగ్నీషోమ మాహాత్మ్యము; కావుట= కావటం; ఎఱింగించి= తెలియజెప్పి -

తాత్పర్యం: అని బ్రహ్మ, క్షత్రపదాలు వరుసగా విప్రుడికీ, రాజుకీ నిర్దేశకాలు కావటం వివరించి, బ్రాహ్మణులయొక్క, రాజులయొక్క మాహాత్మ్యాలు విరాజిల్లిన తావులు సాక్ష్యాలుగా చూపి, అవి అన్నీ అగ్నీ షోమ మాహాత్మ్యము కావటం తెలియజెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బోధనస్థాపనంబులు బుధవరేణ్య! । యగ్నియును సోముఁడును జేసి యఖిలజగము
నఖిలహర్షంబుఁ బొందింతు రవ్యయప్ర । వర్తనత్వంబు దమయందు వఱలుచుండ. 429

ప్రతిపదార్థం: బుధవరేణ్య!= ఓ పండితాగ్రణీ! విజయా!; బోధన= మేలుకొల్పటం (వికాసం); స్థాపనంబు= స్థిరపరచటం లేదా వృద్ధిపొందించటం అనే పనులను; అగ్నియును= అగ్నిదేవుడూ (ఇతడే సూర్యుడు); సోముఁడును= చంద్రుడూ; చేసి= నిర్వర్తించి; అవ్యయ= వ్యయంకాని; ప్రవర్తనత్వంబు= చైతన్యం (జగత్తును ప్రవర్తింపజేసే అవ్యయ శక్తి - సూర్యచంద్రులు); తమయందున్= తమలో; వఱలుచున్+ఉండన్= ఒప్పి ఉండటంచేత; అఖిలజగమున్= సకల ప్రపంచాన్నీ; అఖిలహర్షంబున్= అంతులేని ఆనందం (ఖిలము కానిది అఖిలం= వినాశం లేనిది); పొందింతురు= పొందేటట్లు చేస్తారు.

తాత్పర్యం: మేలుకొల్పటం, వృద్ధిపొందించటం అనే పనులు వరుసగా అగ్నిదేవుడూ, చంద్రుడూ చేస్తారు. ప్రపంచానికి అవ్యయమైన చైతన్యాన్ని వీరు ప్రసాదించి ఆనందింపజేస్తుంటారు.

విశేషం: దీనికి మూలమైన శ్లోకాలు ఇట్లా ఉన్నాయి. **"సూర్యాచంద్రమసౌ శశ్వత్ కేశైర్మేzంశుసంజ్ఞితైః । బోధయం స్తాపయంశ్చైవ జగదుత్తిష్ఠతః పృథక్ ॥ బోధనాత్తాపనాచ్చైవ జగతో హర్షణం భవేత్। అగ్నీషోమకృతైరేభిః కర్మభిః పాండునందన ॥" (12330 - 1,2).** వీటిలో 'స్థాపనాత్' అనేది పాఠాంతరంగా కనపడుతున్నది. దానినే తిక్కన స్వీకరించాడు. తాపనం అంటే వేడితో తపింపజేయటం. అది చంద్రుడి పనిగా మూలశ్లోకం చెప్పుతున్నది. ప్రకృతివిరుద్ధం. కాబట్టి స్థాపనాత్ అనేదే సాధుపాఠంగా భావించాలి. చంద్రుడు ఓషధీకారకుడూ, వృద్ధికారకుడూను. సూర్యాచంద్రమసౌ అని మొదటి శ్లోకంలోనూ, అగ్నీషోమౌ అని రెండవశ్లోకంలోనూ ఉన్నది. సూర్యాగ్నులకు అభేదం. సూర్యుడు అస్తమిస్తూ తన తేజస్సును అగ్నిలో నిక్షేపిస్తాడని వేదోక్తి. 'దినాంతే నిహితం తేజః సవిత్రేవ హుతాశనః' అని కాళిదాససూక్తి. (రఘు - 4-1).

క. అనఘా! యగ్నీషోముల । ననుఁగా భావింప జగమునకు నెపుడు హితం
బొనరింతుఁ దత్సుకృతములఁ । బొనరిన మద్భవ్యనామముల వివరింతున్. 430

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అగ్నీషోములన్= ఈ సూర్యచంద్రులను; ననున్+కాన్= నన్నుగా; భావింపన్= తెలిసికొంటే; జగమునకున్= ప్రపంచానికి; ఎపుడున్= ఎల్లవేళలా; హితంబు+ఒనరింతున్= మేలు చేకూరుస్తాను; తద్= అలా చేసిన; సుకృతములన్= మంచిపనులవలన; ఒనరిన= నాకు దక్కిన; భవ్యనామములన్= పవిత్రమైన నామధేయాలను; వివరింతున్= వివరిస్తాను - విను.

తాత్పర్యం: అర్జునా! అగ్నీషోములను నన్నుగా భావించుము. సూర్యచంద్ర రూపాలలో నేను ఎల్లవేళలా ప్రపంచానికి మేలు చేకూరుస్తూ ఉంటాను. అలా మేలు చేసినందువలన నాకు కొన్ని భవ్యనామధేయాలు ఏర్పడ్డాయి. వాటిని వివరిస్తాను. ఆలకించుము.

ఆ. పరమ వరద, లోకభావనేశ్వర హృషీ । కేశనామకము లహీనచిత్త!
యనియు మఱియు నిట్టు లను యాగముల భాగ । మాహరింతుఁ గాన హరియునండ్రు. 431

ప్రతిపదార్థం: అహీనచిత్త!= ఓ ఉత్తమచిత్తం కలవాడా!; పరమవరద= వరాలను ఇచ్చే (వరద) పరముడు; లోకభావన= లోకభావనుడు; ఈశ్వర= ఈశ్వరుడు; హృషీకేశ= హృషీకేశుడు అనే; నామకములు= ప్రసిద్ధనామధేయాలు (ఏర్పడ్డాయి); అనియున్= అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్టులు= ఇట్లా; అనున్= అంటున్నాడు శ్రీకృష్ణుడు; యాగములన్= యజ్ఞాలలో; భాగము= పాలు; ఆహరింతున్= రాబట్టుకుంటాను; కానన్= కాబట్టి; హరియున్= నన్ను హరి అనికూడా; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఓ అహీనచిత్తా! వరదుడు, లోకభావనుడు, ఈశ్వరుడు, హృషీకేశుడు అనే ప్రసిద్ధనామధేయాలు నాకు ఏర్పడ్డాయి' అని చెప్పి శ్రీకృష్ణుడు ఇంకా ఇట్లా అంటున్నాడు: 'అర్జునా! యాగాలలో భాగాలు ఆహరిస్తాను కాబట్టి నన్ను హరి అని కూడా అంటారయ్యా!

విశేషం: జగత్తును హర్షింప చేస్తారు కనుక సూర్యచంద్రులు - హృషీ (ద్వివచనం). వారి కిరణాలే కేశాలుగా కలవాడు హృషీకేశుడు. సంస్కృతవ్యాఖ్యానం ఇట్లా ఉన్నది: **"జగద్ధర్షయతో యస్మాత్తస్మాత్తౌ హృషీ - అగ్నీషోమౌ కేశా అంశూ యస్య స హృషీకేశ:. హృషీరితి ఈకారాంతం పదం వా తదా హృష్యా కేశా యస్యేతి సమాసః."**

సీ. గో వన మహి యది గుహలోనఁ బడకుండ । జెంది యెత్తుటను గోవిందుఁడనియు
వీతంపు రోమంబుచేత నొప్పార నా । విష్ణం డగుట శిపివిష్టుఁడనియుఁ,
గర్షణక్రియ భూమిఁ గావింతుఁ, జాయయుఁ । గృష్ణంబు గావునఁ గృష్ణుఁడనియు,
నలవడ సదసద్ద్వయంబును నాయందు । సమవేతమై యున్కి సత్యుఁడనియుఁ,

తే. దాత్త్వికంబైన నాకు జాతత్వవికృతి । లేమి నజుఁడనియును, నది లేకపోయి
నపుడు తదనంతరక్షయ మంద కునికి । బుధు లధోక్షజుఁడనియుఁ జెప్పుదురు నన్ను. 432

ప్రతిపదార్థం: గోవు+అనన్= గోవు అంటే; మహి= భూమి; అది= ఆ భూమి; గుహలోనన్= (యుగాంతంలో ఏర్పడిన) గుహలో; పడకుండన్= పడిపోకుండా; చెంది= (వరాహరూపంలో) సమీపించి; ఎత్తుటన్= (భూగోళాన్ని జలప్రళయంనుంచి) ఉద్ధరించాను కనుక; గోవిందుఁడు+అనియున్= గోవిందుడు అనీ; వీతంపు+రోమంబుచేతన్= తొలగిపోయిన రోమాలతో (రోమాలు తొలగిపోవటంతో); ఒప్పారన్= అందంగా; ఆవిష్టుఁడన్= కూడుకొన్నవాడిని; అగుటన్= కావటంచేత (నీరోమత్వం వలన); శిపివిష్టుఁడు; అనియున్= అనీ; కర్షణక్రియన్= దున్నటం అనే పనిని; భూమిన్= ఈ భూమిమీద; కావింతున్= చేస్తాను; చాయయున్= నా శరీరం రంగుకూడా; కృష్ణంబు= నలుపు; కావునన్= అందుచేత (ఈ రెండు కారణాలతోనూ); కృష్ణుఁడు+అనియున్= నన్ను కృష్ణుడు అనీ; అలవడన్= కుదురుగా; సత్+అసత్+ద్వయంబునున్= సత్తూ, అసత్తూ (చిత్తు) అనే జంట; నాయందున్= నాలో; సమవేతమై+ఉన్కిన్= కూడి ఉండటం వలన (చేరి ఉండటంతో); సత్యుఁడు+అనియున్= సత్యుడు అనీ; తాత్త్వికంబు+ఐన= తత్త్వసిద్ధమైన; నాకున్= నాకు; జాతత్వ= పుట్టుక అనే; వికృతి= వికారం; లేమిన్= లేకపోవటంచేత; అజుఁడు+అనియునున్= అజుడు అనీ; అది= ఆ పుట్టుక అనేది; లేకపోయినపుడు= లేకపోయాక; తద్+అనంతర= దానికి తరువాతిదైన; క్షయమున్= మరణం అనేదాన్ని; అందక+ఉనికిన్= పొందకపోవటంచేత; బుధులు= పండితులూ, దేవతలూ; అధోక్షజుఁడు+అనియున్; నన్నున్= నన్ను; చెప్పుదురు= వివరిస్తారు, కీర్తిస్తారు.

తాత్పర్యం: గోవు అంటే భూమి. దానిని కాపాడాడు కనుక గోవిందుడు. రోమరహితంగా ఒప్పారటం వలన శిపివిష్టుడు. భూమిని దున్నటంవలనా, నల్లగా ఉండటంవలనా కృష్ణుడు. సత్తూ, అసత్తూ ఆయనలోనే ఉండటం వలన సత్యుడు. పుట్టుక అనేది లేదు కాబట్టి అజుడు. క్షయము అనేదీ లేదు కాబట్టి అధోక్షజుడు. అర్జునా! ఇట్లా ఈ పేర్లు నాకు ఏర్పడ్డాయి.

విశేషం: సంస్కృతమూలంలో ఈ పేర్లను రెండు గణాలుగా విభజించాడు వ్యాసుడు. గుణాలను బట్టి ఏర్పడినవి కొన్నీ, చేసిన పనులనుబట్టి వచ్చినవి కొన్నీ. **"గౌణాని తత్ర నామాని కర్మజాని చ కానిచిత్ । నిరుక్తం కర్మజానాం శృణుష్వ ప్రయతోఽనఘ॥" (12-328-10).** నారాయణాదులు గౌణనామాలు. హృషీకేశ గోవిందాదులు కర్మజనామాలు. ఈ రెండింటినీ వేర్పరచటంకొరకూ, మూలంలో విస్తృతంగా ఉన్న అగ్నీషోమమాహాత్మ్యాన్ని రెండు పంక్తులలోనికి సంగ్రహించటం కొరకూ నాలుగువందల ఇరవై ఎనిమిదవ వచనం అవతరించింది.

క. సత్త్వముననుండి తొలఁగమి । సత్త్వము నాచేతఁ జేసి సత్తఁ బొరయుటన్
సత్త్వమయజన్ముఁ డగుటను । సాత్త్వతుఁ డను నామ మయ్యె జనవర! నాకున్. 433

ప్రతిపదార్థం: జనవర!= నరవరా!; సత్త్వముననుండి= సత్త్వగుణంనుంచి; తొలఁగమిన్= తప్పుకోకపోవటంచేతా (సత్త్వగుణాన్ని ఎప్పుడూ విడవకుండా ఉండటంచేత); సత్త్వము= ఆ సత్త్వగుణం అనేది; నా= నాయొక్క; చేఁతన్+చేసి= పనితో (చేతలు); సత్తన్= అస్తిత్వాన్ని; పొరయుటన్= పొందటంచేతా; సత్త్వమయ= సత్త్వరూపమైన; జన్ముఁడు= జన్మ కలవాడు; అగుటన్= కావటంచేతా; నాకున్= నాకు; సాత్త్వతుఁడు+అను= సాత్త్వతుడు అనే; నామము= పేరు; అయ్యెన్= ఏర్పడింది.

తాత్పర్యం: నేను ఏనాడూ సత్త్వగుణాన్ని వదలిపెట్టను. నా పనులవలననే సత్త్వగుణానికి ఉనికి ఏర్పడుతున్నది. నా జన్మ సత్త్వమయం. కాబట్టి నన్ను సాత్త్వతుడు అంటారు.

తే. చ్యుతము లేకున్కిఁ జేసి యచ్యుతుఁడ వాత । ముఖ్య ధాతుత్రయాకారమున శరీర
ధారకుండనై యున్కిఁ ద్రిధాతువును న । నంగఁ బరఁగుదు మునివచనంబులందు. 434

ప్రతిపదార్థం: చ్యుతము= జారుపాటు (వినాశం); లేక+ఉన్కిన్+చేసి= లేకపోవటం చేత; అచ్యుతుఁడన్= నేను అచ్యుతుడిని; వాతముఖ్య= వాయువు మొదలైన (వాత - పిత్త - శ్లేష్మాలు); ధాతుత్రయ= మూడు ధాతువుల; ఆకారమునన్= రూపంతో; శరీర= ప్రాణులదేహాలకు; ధారకుండను= పోషకుడను (ఆధారం); ఐ+ఉన్కిన్= అయి ఉండటం చేత; త్రిధాతువును= త్రిధాతువు; అనంగన్= అని; మునివచనంబులందున్= ఋషివాక్కులలో; పరఁగుదున్= అలరారుతాను.

తాత్పర్యం: చ్యుతము అనేది నాకు లేదు. కాబట్టి నేను అచ్యుతుడను. వాతపిత్తశ్లేష్మాల రూపంలో నేనే జీవుల శరీరాలకు ధారకం. కాబట్టి నన్ను ఋషులు త్రిధాతువు అంటారు.

క. ఘృత మర్చిస్సంపద యయి । ఘృతార్చి రభిధాన మొందెఁ గ్రీడి! వృషము వి
శ్రుత ధర్మము - ధర్మమయ । స్థితి కతమున వృషుఁడనం బ్రసిద్ధి వహింతున్. 435

ప్రతిపదార్థం: క్రీడి!= ఓ అర్జునా!; అర్చిః+సంపద= నా తేజస్సంపత్తిచే ఘృతము+అయి= నేయి ఏర్పడటం కారణంగా; ఘృతార్చిః+అభిధానము= ఘృతార్చి అనే పేరు; ఒందెన్= నాకు ఏర్పడింది; విశ్రుత= ప్రసిద్ధికెక్కిన; ధర్మము= ధర్మమే; వృషము= వృషము అనబడుతోంది; ధర్మమయ= ధర్మస్వరూపమైన; స్థితి+కతమునన్= నా స్థితివలన; వృషుఁడు+అనన్= వృషుడు అని; ప్రసిద్ధిన్+వహింతున్= ప్రసిద్ధి పొందాను.

తాత్పర్యం: కిరీటీ! నా తేజస్సంపద వలననే ఆయా జంతువులలో ప్రాణధారకమైన ఘృతం ఏర్పడుతున్నది. కాబట్టి నన్ను ఘృతార్చి అంటారు. "ఘృతం మమార్చిషో లోకే జంతూనాం ప్రాణధారణం। ఘృతార్చి రహమవ్యగ్రైః వేదజ్ఞైః పరికీర్తితః ॥" ధర్మానికే వృషము అని పేరు. నేను ధర్మమయుడను. కాబట్టి నాకు వృషుడు అని ప్రసిద్ధి ఏర్పడింది.

తే. ఆదిమధ్యాంతములు నాకు నరయ లేమి । నై యనాది యమధ్యుఁ డనంతుఁ డనఁగఁ
జెల్లు పేళ్ళులు, శుచులు నా చెవుల కింపు । లగుట మునులు శుచిశ్రవుఁ డండ్రు నన్ను. 436

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఆది= మొదలూ; మధ్య= నడుమా; అంతములు= అంతమూ అనేవి; అరయన్ లేమిన్+ఐ= ఎవరూ తెలిసికొనలేరు కనక; అనాది= అనాది; అమధ్యుఁడు= అమధ్యుడు; అనంతుఁడు= అనంతుడు; అనఁగన్= అని; పేళ్ళులు= పేర్లు; చెల్లున్= చెల్లుతున్నాయి; నా+చెవులకున్= నా చెవులకు; శుచులు= శుచి అయిన మాటలు; ఇంపులు+అగుటన్= ఇంపు కూర్చేవి అవుతాయి కనక; మునులు= ఋషులు; నన్నున్= నన్ను; శుచిశ్రవుఁడు= శుచిశ్రవుడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: అర్జునా! నాకు మొదలూ నడుమా అంతమూ అనేవి లేవు. ఎవరూ వీటిని తెలిసికొనలేరు. అందుకని అనాది, అమధ్యుడు, అనంతుడు అనే పేర్లు ఏర్పడ్డాయి. శుచి అయిన పలుకులే నా చెవులకు హితవుగా ఉంటాయి. వాటినే వింటాను. అందుచేత నన్ను శుచిశ్రవుడు (శుచిశ్రవసుడు) అంటారు మహర్షులు.

ఆ. ఒక్క శృంగమునన యుర్వి యెత్తితి వరా । హావతారలీల యతిశయిల్ల
నట్టు లగుటఁ జేసి యార్యజనప్రియ । నాకు నేక శృంగనామ మయ్యె. 437

ప్రతిపదార్థం: ఆర్యజనప్రియ!= సజ్జనులకు ప్రియమైనవాడా!; ఒక్క శృంగమునన్+అ= ఒకే ఒక్క కోరతోనే; ఉర్వి= భూమిని; వరాహ+అవతార+లీల= వరాహావతారం తాలూకు విలాసం; అతిశయిల్లన్= అతిశయించేట్టు; ఎత్తితిన్= ఉద్ధరించాను; అట్టులు+అగుటన్+చేసి= అట్లా కావటం వలన; నాకున్= నాకు; ఏకశృంగనామము= ఏకశృంగుడు అనే పేరు; అయ్యెన్= ఏర్పడింది.

తాత్పర్యం: ఆర్యజనప్రియా! వరాహావతారంలో ఒకే కోరతో మొత్తం భూగోళాన్ని ఎత్తి రక్షించాను. అప్పటినుండీ నాకు ఏకశృంగుడు అనే పేరు వచ్చింది.

క. వినుత మగు లోకరేచన । మున నన్ను విరించుఁ డంద్రు బుధనుత! రవియం
దనుపాధిక విద్యాస్థితి । నునికిం గపిలాభిధాన ముల్లసిత మగున్. 438

ప్రతిపదార్థం: బుధనుత!= పండితులచే స్తుతింపబడేవాడా!; వినుతము+అగు= ప్రసిద్ధి కెక్కిన; లోకరేచనమునన్= ప్రపంచకోత్తేజనంవలన (లోకాన్ని చైతన్యవంతం చేయటంవలన); నన్నున్= నన్ను; విరించుఁడు+అండ్రు= విరించుడు అంటారు; అనుపాధిక= శరీరంలేని; విద్యాస్థితిన్= విద్యారూపంతో; రవియందున్= సూర్యుడిలో; ఉనికిన్= ఉండటంచేత; కపిల+అభిధానము= కపిలుడు అనే పేరు; ఉల్లసితము+అగున్= నాకు ప్రకాశిస్తోంది.

తాత్పర్యం: పండితస్తవనీయా! లోకాన్ని చైతన్యవంతం చేస్తాను కాబట్టి (రేచనం) నన్ను విరించుడు అంటారు. నిరుపాధికమైన జ్ఞానరూపంతో సూర్యుడిలో ఉంటాను కాబట్టి కపిలుడు అంటారు నన్ను.

క. విను యోగంబు హిరణ్యం । బనఁ బరఁగును యోగగర్భుఁడగుటను విద్వ
జ్జనములు హిరణ్యగర్భం । డని ననుఁ గొనియాడుదురు మహాగుణశాలీ! 439

ప్రతిపదార్థం: మహాగుణశాలీ!= గొప్ప గుణవంతుడా!; విను= వింటున్నావా? వినుము; యోగంబు= యోగమే; హిరణ్యంబు+అనన్= హిరణ్యము అని; పరఁగున్= ఒప్పుతోంది; యోగగర్భుఁడు+అగుటను= నేను యోగగర్భుడను కనుక; విద్వత్+జనములు= పండితులు; హిరణ్యగర్భుండు+అని= హిరణ్యగర్భుడు అని; ననున్= నన్ను; కొనియాడుదురు= స్తుతిస్తారు.

తాత్పర్యం: సద్గుణసంపన్నా! యోగాన్నే హిరణ్యం అంటారు. నేను యోగగర్భుడను. అందుచేత నన్ను హిరణ్యగర్భుడు అని కూడా అంటారు.

తే. నరుఁడు నారాయణుండు ననంగ లోక । రక్షణార్థంబు గాఁగ ధర్మమున కేను
బుట్టినాఁడఁ గావున బాండుభూపతనయ! । నాకు ధర్మజుఁ డనియెడు నామమయ్యె. 440

ప్రతిపదార్థం: పాండుభూపతనయ!= పాండురాజుగారి కుమారుడా!; నరుఁడున్+నారాయణుండున్+అనంగన్= నరనారాయణులు అనే పేరుతో; లోకరక్షణార్థంబు+కాఁగన్= లోకాలను రక్షించటం కోసం కాగా; ధర్మమునకున్= ధర్మరక్షణార్థం; ఏను= నేను; పుట్టినాఁడన్= జన్మించాను; కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ధర్మజుఁడు+అనియెడు= ధర్మజుడు అనే; నామము+అయ్యెన్= పేరు ఏర్పడింది.

తాత్పర్యం: అర్జునా! నరుడూ నారాయణుడూ అనే అవతారాలు లోకరక్షణార్థం కాగా ధర్మరక్షణార్థం నేను జన్మించాను కాబట్టి నన్ను ధర్మజుడు అంటారు.

వ. ఇట్లు వుట్టి గంధమాదనంబున నేను దపంబు సేయుచుండ నక్కాలంబునఁ గాలాంతకుండు దక్షునియజ్ఞంబున
కలిగిన నది భీతిం బఱతెంచి నా యురఃస్థలంబు నొందిన మదీయ కేశంబులు ముంజనిభంబులగుటం జేసి

ముంజకేశుండనుపేరు గలిగె నా రుద్రుండు రౌద్రాకారంబున నయ్యజ్ఞంబు వెనుకొని నాపయిం గవిసిన నొక్క యిషీక పరశురూపంబుగా నభిమంత్రించి యతనిపయిం బ్రయోగించిన నతండు దాని ఖండితధారంబు సేయుటంజేసి ఖండపరశు వను నభిధానంబునుం గలిగె ననుటయు. 441

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; పుట్టి= జన్మించి; గంధమాదనంబునన్= గంధమాదన పర్వతంమీద; నేను; తపంబు= తపస్సు; చేయుచుండన్= చేస్తూండగా; ఆ+కాలంబునన్= ఆ సమయంలో (ఆ రోజుల్లోనే); కాలాంతకుండు= కాలాంతకుడైన శివుడు (యముడిని జయించినవాడు); దక్షుని= దక్షప్రజాపతిచేసే; యజ్ఞంబునకున్= యజ్ఞానికి; అలిగినన్= కోపించగా (యజ్ఞంమీద కోపించితే); అది= ఆ యజ్ఞం; భీతిన్= భయంతో; పఱతెంచి= పారిపోయి వచ్చి; నా+ఉరః స్థలంబున్= నా వక్షఃస్థలాన్ని; ఒందినన్= శరణుజొచ్చితే; మదీయ= నాయొక్క; కేశంబులు= (గుండెపై) వెంట్రుకలు; ముంజనిభంబులు= ముంజగడ్డిలాగా; (గోధుమరంగు); అగుటన్+చేసి= కావటం చేత; ముంజకేశుండు= ముంజకేశుడు; అను పేరు= అనే పేరు; కలిగెన్= ఏర్పడింది; ఆ+రుద్రుండు= ఆ శివుడు; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన ఆకారంతో; ఆ+యజ్ఞంబున్= ఆ యజ్ఞాన్ని; వెనుకొని= వెన్నంటి (తరుముకు వస్తూ); నాపయిన్= నామీదకు; కవిసినన్= కలియబడితే; ఒక్క= ఒకే ఒక్క; ఇషీక= బాణం; పరశురూపంబుగాన్= గొడ్డలి రూపం ధరించేట్టు; అభిమంత్రించి= మంత్రం పెట్టి; అతనిపయిన్= ఆ శివుడిమీద; ప్రయోగించినన్= ప్రయోగిస్తే; అతండు= శివుడు; దానిన్= ఆ పరశువును; ఖండిత= ఖండింపబడ్డ; ధారంబు= అంచుకలదిగా (అంచు ఖండింపగా); చేయుటన్+చేసి= చేయటంచేత; ఖండపరశువు= ఖండపరశువు; అను= అనేటటువంటి; అభిధానంబు= పేరు; కలిగెన్= నాకు సిద్ధించింది; అనుటయున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా.

తాత్పర్యం: ఈ విధంగా పుట్టి నేను గంధమాదన పర్వతంమీద తపస్సు చేస్తున్నప్పుడు దక్షప్రజాపతి యాగం చేస్తున్నాడు. ఆ యాగానికి శివుడు కోపించాడు. అప్పుడు ఆ యజ్ఞం భయంతో హడలిపోయి నా వక్షఃస్థలాన్ని ఆశ్రయించింది. ఆ కారణంవలన అక్కడి నా రోమాలు ముంజగడ్డివలె మారాయి. అందువలన నాకు ముంజకేశుడనే పేరు వచ్చింది. రుద్రుడు ఆ యజ్ఞాన్ని తరుముకొని వచ్చి నన్ను తాకగా నేనొక బాణాన్ని పరశురూపంలో ప్రయోగించగా శివుడు దాని అంచును ఖండించాడు. అందువలన నాకు 'ఖండపరశువు' అనే పేరు వచ్చింది.

క. ' విని పార్థఁ డిట్లు గలిగిన । యనియం దా రుద్రునొకొ జయము నీకో క
లైను? దాని తెఱంగేర్పడ । వినఁ గౌతుక మొలసెఁ జెప్పవే విశ్వాత్మా!' 442

ప్రతిపదార్థం: విని= ఆలకించి; పార్థఁడు= అర్జునుడు; ఇట్లు= ఇట్లా; కలిగిన= ఏర్పడ్డ; అనియందున్= యుద్ధంలో; జయము= జయమనేది; ఆ రుద్రునకొ= ఆ శివునికో; నీకో= నీకో; కల్గెను?= కలిగింది?; దాని తెఱంగు= ఆ యుద్ధం పద్ధతిని; ఏర్పడన్+వినన్= స్పష్టంగా వినాలని; కౌతుకము= ఉత్సాహం; ఒలసెన్= కలుగుతోంది (కలిగింది); విశ్వాత్మ= విశ్వరూపా!; చెప్పవే?= చెప్పవా?

తాత్పర్యం: అర్జునుడు అంతా విని ఇట్లా అన్నాడు: 'ఓ విశ్వరూపా! ఆ యుద్ధంలో నీవు గెలిచావా? శంకరుడు గెలిచాడా? ఆ కథ అంతా వినాలనే కుతూహలం కలిగింది దయచేసి వివరంగా చెప్పవా?'

వ. అనిన విష్ణుం డర్జునున కిట్లనియె. 443

ప్రతిపదార్థం: అనినన్= అని అడిగేసరికి; విష్ణుండు= శ్రీకృష్ణుడు; అర్జునునకున్= పార్థుడికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు:

తాత్పర్యం: అని అడుగగా శ్రీకృష్ణుడు పార్థుడితో ఇట్లా అన్నాడు:

శివకేశవుల పరస్పరకోపప్రసాదముల విధము (సం. 12-309-2)

సీ. రుద్ర నారాయణరూప ప్రవర్తిత । మూర్తి ద్వయము రణమునకుఁ జొచ్చి
పరమసంరంభంబు వాటింప, నుద్వేజి । తములయ్యె నఖిలభూతములు, శ్రుతులు
మునులకుఁ దోఁపవ, యనలంబు లాహుతుల్ । గొనవయ్యెఁ, బగిలె దిక్కులు నభంబు
ధరణి వడంకె, భూధరములు దిర్దిరం । దిరిగె, దేవతలకు దిగులు సొచ్చె

తే. నాననము పల్లటిల్లంగ నజుఁడు గలఁగె, । నిట్టు లెందును సంక్షోభ మెసకమెసఁగ,
నా విధాత - మునీంద్రులు దేవతలును । దన్ను వేష్టింప వచ్చె సత్వరముగాఁగ. 444

ప్రతిపదార్థం: రుద్ర (రూప)= రుద్రరూపంతోనూ; నారాయణ రూప= నారాయణ రూపంతోనూ; ప్రవర్తిత+ప్రవృత్తిని పొందిన; మూర్తిద్వయము= మూర్తుల జంట; రణమునకున్= యుద్ధానికి; చొచ్చి= దిగి (పూనుకొని); పరమ సంరంభంబు= గొప్ప హడావుడి; పాటింపన్= చేసేసరికి; అఖిలభూతములున్= పంచభూతాలూ (సకలప్రాణులూ); ఉద్వేజితములు+అయ్యెన్= ఏమి జరుగుతుందో అనే ఉద్వేగం పొందాయి; మునులకున్= మహర్షులకు; శ్రుతులు= వేదమంత్రాలు; తోఁపవు+అ= స్ఫురించటమే లేదు (మంత్రాలు దర్శనం ఇవ్వటమే లేదు); అనలంబులు= హోమాగ్నులు; ఆహుతుల్= ఆహుతులను (ఆజ్యంతో అగ్నిలో వేల్చే వస్తువుల్నీ - వేల్చటాన్నీ ఆహుతులు - ఆహుతి అంటారు); కొనవు+అయ్యెన్= స్వీకరించటం లేదు (హోమాగ్నిలో ఏదీ ఆహుతి కావటం లేదు అని); దిక్కులున్= దశదిశలూ; నభంబున్= ఆకాశమూ; పగిలెన్= బ్రద్దలయ్యాయి; ధరణి= భూమి; వడంకెన్= కంపించింది; భూధరములు= పర్వతాలు; దిర్దిరన్+తిరిగెన్= గిరగిరా తిరిగాయి; దేవతలకు= అమరులకు; దిగులు= దిగులు(కుందు); చొచ్చెన్= ప్రవేశించింది(మొదలయ్యింది); ఆననము= ముఖం; పల్లటిల్లంగన్= వాడిపోగా; అజుఁడు= బ్రహ్మదేవుడు; కలఁగెన్= కలతచెందాడు; ఇట్టులు= ఇలా; ఎందునున్= అంతటా; సంక్షోభము= అల్లకల్లోలం; ఎసకము+ఎసఁగన్= వ్యాపించగా; ఆ విధాత= ఆ బ్రహ్మదేవుడు; మునీంద్రులున్= మహర్షులూ; దేవతలునున్= అమరులూ; తన్నున్= తనను; వేష్టింపన్= చుట్టూ చేరిరాగా; సత్వరము+కాఁగన్= సత్వరంగా (వేగంగా); వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: అర్జునా! రుద్రుడూ, నారాయణుడూ యుద్ధానికి దిగారు. భయంకరమైన సంక్షోభం ఏర్పడింది. సకలప్రాణులూ ఉద్వేగం పొందాయి. (ఊపిరి బిగ్గబట్టుకొన్నాయి). మహర్షులకు వేదమంత్రాలు స్ఫురించటం లేదు. హోమాగ్నికుండాలలో వేల్చిన ఆహుతులు ఆహుతి కావటం లేదు. దశదిశలూ ఆకాశమూ బీటలు వారుతున్నాయి. భూమి, పర్వతాలు బొంగరాలవలె తిరుగుతున్నాయి. దేవతలకు ఎక్కడ లేని దిగులూ పట్టుకుంది. దేవతలతో, మునీంద్రులతో కలిసి బ్రహ్మదేవుడు యుద్ధభూమికి వచ్చాడు.

వ. వచ్చి రుద్రునకుం బ్రణమిల్లి సంప్రార్థనంబు దోఁప నిట్లనియె: 445

ప్రతిపదార్థం: వచ్చి= అలా వచ్చి; రుద్రునకున్= శివుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; సంప్రార్థనంబు= అభ్యర్థన; తోఁపన్= స్ఫురించేట్టు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అట్లా వచ్చి శివుడికి నమస్కరించి, ఈ విధంగా శివుడిని అభ్యర్థించాడు.

క. ‘ శివుఁడవు నీవు జగములకు । శివ మొనరింపంగ వలదె? చేయుము క్రోధ
ప్రవిహతి, విష్ణుండనఁగా । శివుఁడన నొకఁడౌట దివ్యచిత్తమ యెఱుఁగున్. 446

ప్రతిపదార్థం: నీవు శివుఁడవు; జగములకున్= ప్రపంచాలకు; శివము= శుభం; ఒనరింపంగన్+వలదె?= చేయవద్దా?; క్రోధ= నీ కోపంయొక్క; ప్రవిహతిన్= విడుమరను; చేయుము= చేయుము (క్రోధం విడిచిపెట్టుము అని); విష్ణుండు+అనఁగాన్= విష్ణుమూర్తి

అన్నా; శివుఁడు+అనన్= శివుడు అన్నా; ఒకఁడు+ఔట= ఒక్కడే అవటాన్ని; దివ్యచిత్తము+అ= తమ దివ్యచిత్తమే; ఎఱుఁగున్= ఎరుగును. (శివకేశవుల అభేదాన్ని దివ్యమైన హృదయమే తెలుసుకోగలదు అని కానీ)

తాత్పర్యం: 'రుద్రా! నీవు శివుడవు. లోకాలకు శివం (శుభం) కలిగించాలి కానీ ఇదేమిటి? కోపం ఉపసంహరించుకొనుము. విష్ణువు అన్నా శివుడు అన్నా ఒక్కరే అని నీ దివ్యచిత్తానికి తెలుసును కదా!

తే. నిగమవేద్య మద్వంద్వంబు నిర్గుణం బ । మూర్తమనియెడు తత్త్వంబు మూర్తిభేద
కలనమున లోకమున ద్విధాకారి యయ్యెఁ । గాక - హరియన నీవనఁ గలదె వేఱు!' 447

ప్రతిపదార్థం: నిగమ= వేదాలతో; వేద్యము= తెలిసికొనదగినదీ; అద్వంద్వంబు= రెండు కానిదీ (ఒక్కటే అని); నిర్గుణంబు= సత్త్వరజస్తమోగుణాలకు అతీతమైనదీ; అమూర్తము= రూపం లేనిదీ; అనియెడు= అని చెప్పబడే; తత్త్వంబు= ఒకానొక మూలతత్త్వం; మూర్తిభేదకలనమునన్= రూపభేదాన్ని (భిన్న రూపాలను) పొందటంవలన; లోకమునన్= లోకంలో; ద్విధాకారి+అయ్యెన్+కాక= రెండుగా అయ్యింది గానీ - నిజానికి; హరి+అనన్= విష్ణుడు అనీ; నీవు+అనన్= నీవనీ (శివుడు అనీ); వేఱు= భేదం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: వేదవేద్యమూ, అద్వంద్వమూ, నిర్గుణమూ, అమూర్తమూ అయిన ఒకే ఒక్క మూలతత్త్వం లోకం కొరకని రెండు రూపాలు ధరించింది. అందులో ఒకటి నీవూ, మరొకటి విష్ణుడూను. అంతేకానీ నిజానికి శివకేశవులకు భేదం లేదు.'

వ. అని బోధించి వెండియు. 448

ప్రతిపదార్థం: అని= ఇలా; బోధించి= ఉపదేశించి; వెండియున్= మళ్ళీ కొనసాగించాడు.

తాత్పర్యం: ఇట్లా ఉపదేశించి మళ్ళీ.

క. ' నరనారాయణు లనఁగాఁ । బురహర! జగదాదియైన పురుషులు, మనముం
బరికింపఁ దన్మయత్వ । స్ఫురితులము ప్రసన్న దివ్యబుద్ధిం గనుమా! 449

ప్రతిపదార్థం: పురహర!= త్రిపురాసుర సంహారం చేసిన ఓ రుద్రుడా!; నరనారాయణులు+అనఁగాన్= నరనారాయణులు అంటే; జగత్+ఆదియైన+పురుషులు= ఈ జగత్తుకు ముమ్మొదటి పురుషులు; పరికింపన్= లోతుగా ఆలోచించి చూస్తే; మనమున్= మనమందరం కూడా; తద్+మయత్వ+స్ఫురితులము= వారి అంశలతో ఏర్పడినవాళ్ళమే; ప్రసన్న= కోపం విడిచి తేరుకున్న; దివ్యబుద్ధిన్= దివ్యమైన బుద్ధితో; కనుమా!= ఒక్కసారి చూడుము.

తాత్పర్యం: 'త్రిపురాంతకా! నరనారాయణులు అంటే జగదాది పురుషులు. ఇంకాస్త లోతుగా ఆలోచిస్తే నీవూ నేనూ ఈ దేవతలూ, ఋషులూ అందరమూ తదంశలతో స్ఫురించిన వాళ్ళమే. ప్రసన్నమూ, దివ్యమూ అయిన బుద్ధితో ఆలోచించి చూడుము. నీకే తెలుస్తుంది.

ఆ. తెలుపు మితని, ననుడుఁ దేఱి కోపంబు వో । విడిచి నన్నుఁ గొలిచె మృడుఁడు పార్థ!
యేను నతనితోడ నిట్లంటి మృదుసత్య । పథ్య ముని మనోజ్ఞ భంగికముగ. 450

ప్రతిపదార్థం: పార్థ!= పృథానందనా! అర్జునా!; ఇతనిన్= ఈ విష్ణుమూర్తిని; తెలుపుము= ప్రసన్నుడిని చేయుము; అనుడున్= అని బ్రహ్మ చెప్పగానే; మృడుఁడు= శివుడు; తేఱి= తేరుకొని; కోపంబు= క్రోధం; పోన్+విడిచి= విడిచిపెట్టి; నన్నున్= నన్ను;

కొలిచెన్= శరణు వేడాడు(సేవించాడు); ఏనున్= నేను; అతనితోడన్= ఆ శివుడితో; మృదు= సుకుమారమూ; సత్య= సత్యమూ; పథ్య= హితమూ; మునిమనోజ్ఞ= మునులకు మనోహరమూ అయిన; భంగికముగన్= భంగిగా; ఇట్లు+అంటిన్= ఇలా అన్నాను.

తాత్పర్యం: రుద్రా! ఈ విష్ణుమూర్తిని ప్రసన్నుడిని చేసికొమ్ము' అని బ్రహ్మదేవుడు చెప్పగానే కోపం వదిలి శివుడు నన్ను (విష్ణువును) శరణువేడాడు. అప్పుడు నేను శివుడితో మృదువుగా సత్యమూ, పథ్యమూ అయ్యేటట్లూ మునులు హర్షించేటట్లూ ఇట్లా అన్నాను.

క. ' నిను నెవ్వఁ డెఱిఁగె నాతఁడు । నను నెఱిఁగినవాఁడ, నిన్ను నమ్మిక సేవిం
చిన నదియ నన్నుఁ గొల్చుట । యను వాసిగ లేదు భేద మరయఁగ మనకున్. 451

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; ఎవ్వఁడు= ఏ వ్యక్తి; ఎఱిఁగెన్= తెలుసుకున్నాడో; ఆతఁడు= ఆ వ్యక్తి; ననున్= నన్నుకూడా; ఎఱిఁగినవాఁడు+అ= తెలిసికొన్నవాడే; నినున్= నిన్ను; నమ్మికన్= విశ్వాసంతో; సేవించినన్= సేవిస్తే; అది+అ= అదే; నన్నున్= నన్ను కూడా; కొల్చుట= సేవించటం; అను= అనేటువంటి; వాసిగన్= పద్ధతిగా; మనకున్= మన ఇద్దరికీ; అరయఁగన్= పరిశీలిస్తే; భేదము= వేర్పాటు (భిన్నత్వం); లేదు= లేదంటే లేదు.

తాత్పర్యం: 'శివా! నిన్ను తెలిసికొంటే నన్ను తెలుసుకొన్నట్లే. నిన్ను సేవిస్తే నన్నే సేవించినట్లే. ఈ పద్ధతిగా మన ఇద్దరికీ భేదం అనేది లేనే లేదు.

క. శ్రీవత్సము శూలాంకిత । మై వెలయుంగాక యిప్పు డాదిగ నాకున్
నీవును మత్పాణ్యంకో । ద్భావన శ్రీకంఠుఁడనఁగఁ బరఁగుము శర్వా!' 452

ప్రతిపదార్థం: శర్వా!= ఓ శివా!; ఇప్పుడు+ఆదిగన్= ఇది మొదలుగా; నాకున్= నాకు; శ్రీవత్సము= గుండెపై ఉన్న శ్రీవత్సము అనే పుట్టుమచ్చ; శూల+అంకితమై= త్రిశూలచిహ్నమై; వెలయున్+కాక= ఒప్పునుగాక!; నీవునున్= నీవుకూడా; మత్= నా; పాణి+అంక= చేతిముద్ర యొక్క; ఉద్భావనన్= ప్రస్ఫుటీకరణంతో; శ్రీకంఠుఁడు+అనఁగన్= శ్రీకంఠుడు అనే పేరుతో; పరఁగుము= ఒప్పుము.

తాత్పర్యం: ఓ శర్వా! ఈ రోజునుండీ నా గుండెలపై శ్రీవత్సం నీ త్రిశూలానికి ప్రతీకగా గుర్తించబడుతుంది. నీ కంఠంమీద ఉన్న నలుపు నా చేతిముద్రగా నీకు శ్రీకంఠుడు అనే పేరు సార్థకమవుతుంది.' (విష్ణుమూర్తి శివుడిని కంఠాలింగనం చేసికొంటే గళం చుట్టిన చేతి నలుపురంగుగా అతడు శ్రీకంఠుడు అయ్యాడని భావం).

వ. అని యివ్విధంబున. 453

ప్రతిపదార్థం: అని; ఈ+విధంబునన్= ఈ విధంగా.

తాత్పర్యం: అనిచెప్పి, కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు:

క. ' ఇతరేతర మతి సంభా । విత లక్షణకలన మొంది వృషవాహనుతో
నతినిర్మల సఖ్యము సే । సితి బ్రహ్మేదులును సంతసిల్లిరి విజయా! 454

ప్రతిపదార్థం: విజయా!= ఓ అర్జునా!; ఇతర+ఇతర= పరస్పరం; మతి= బుద్ధితో; సంభావిత= (గౌరవించుకొన్న) ఆలోచించి ఏర్పరుచుకొన్న; లక్షణకలనము= చిహ్నాధారణం; ఒంది= పొంది; వృషవాహనుతోన్= వృషభవాహనుడైన శివుడితో; అతి నిర్మలసఖ్యము= మిక్కిలి పావనమైన (నిర్మలినమైన) మైత్రి; చేసితిన్= కుదుర్చుకొన్నాను - చేశాను; బ్రహ్మేదులునున్= బ్రహ్మదేవుడూ (దేవతలూ, మునులూ) మొదలైనవారుకూడా; సంతసిల్లిరి= సంతోషించారు.

తాత్పర్యం: 'అర్జునా! ఇట్లా పరస్పరం ఆలోచించి ఏర్పరుచుకొన్న మైత్రీచిహ్నాలను ధరించాం. నిర్మలమైన సఖ్యాన్ని శివుడితో కుదుర్చుకొన్నాను. దీనికి బ్రహ్మాదులు అందరూ ఎంతో సంతోషించారు.

మ. మదీయనామ నిర్వచనంబులును రుద్రునితోడి రణంబుననైన జయంబు తెఱంగును నీ కెఱింగించితి. 455

ప్రతిపదార్థం: మదీయ= నాయొక్క; నామ= నామధేయాల; నిర్వచనంబులునున్= వ్యుత్పత్తులూ; రుద్రునితోడి= శివుడితో జరిగిన; రణంబునన్= యుద్ధంలో; ఐన= లభించిన; జయంబు= విజయం తాలూకు; తెఱంగునున్= విధానమూ; నీకున్= నీకు; ఎఱింగించితిన్= తెలియజేశాను.

తాత్పర్యం: నా నామధేయాల వ్యుత్పత్తులూ, శివుడితో చేసిన యుద్ధంలో లభించిన విజయవిధానమూ నీకు తెలియజేశాను.

క. నానారూపంబుల ని । ట్లేను బ్రవర్తింతు జగము లిన్నింటను, నీ
శానుఁడు నభవుఁడు నమృతుఁడు । నైన శివుని నీవుఁ గొలువు మర్జున! యెపుడున్. 456

ప్రతిపదార్థం: అర్జున!; నానారూపంబులన్= అనేక రూపాలతో; ఇట్లు= ఇలా; ఏను= నేను; జగములు+ఇన్నింటనున్= ఇన్ని జగత్తులలోనూ; ప్రవర్తింతున్= సంచరిస్తూ ఉంటాను; నీవున్= నీవు కూడా; ఎపుడున్= ఎల్లవేళలా; ఈశానుఁడున్= ప్రభువూ; అభవుఁడున్= పుట్టుకలేనివాడూ; అమృతుఁడున్= మృతిలేనివాడూ; ఐన= అయినటువంటి; శివునిన్= శివుడిని; కొలువుము= సేవించుము.

తాత్పర్యం: అర్జునా! ఇట్లా అనేకరూపాలలో నేను ఈ జగత్తులన్నింటా సంచరిస్తూ ఉంటాను. ఈశానుడూ, అభవుడూ, అమృతుడూ అయిన శివుడిని నీవు కూడా ఎల్లవేళలా అర్చించుము. (12-330-67,81).

తే. ఏను రక్షింప జయము నీ కెసకమెసఁగె । సమరమున శూలపాణియై శత్రుకోటి
నీదు మునుమున వధియించు నిరుపమాన । తేజు రుద్రుఁగా నెఱుఁగుము ధీరచిత్త!' 457

ప్రతిపదార్థం: ధీరచిత్త!= ధీరమైన హృదయం కలవాడా!; సమరమునన్= కురుక్షేత్ర సంగ్రామంలో; ఏను= నేను; రక్షింపన్= కాపాడటం వలన; జయము= విజయం; నీకున్= నీకు; ఎసకము+ఎసఁగెన్= ఒప్పించింది; నీదు+మునుమునన్= నీ మునుముందట (అగ్రభాగంలో); శూలపాణియై= శూలం చేతబట్టినవాడై; శత్రుకోటిన్= శత్రుసమూహాన్ని; వధియించు= సంహరించేటువంటి నిరుపమాన తేజున్= సాటిలేని తేజస్సుకల వానిని; రుద్రున్+కాన్= రుద్రుడుగా; ఎఱుఁగుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: ధీర హృదయుడా! నేను రక్షించాను కాబట్టి కురుసంగ్రామంలో నీకు జయం లభించింది. నీ అగ్రభాగంలో శూలపాణిగా రుద్రుడు సంచరిస్తూ నీకంటె ముందే నీ శత్రువులను సంహరించాడు. ఇదికూడా నీవు తెలిసికొనటం మంచిది.'

వ. అనియె నని చెప్పిన విని జనమేజయుండు. 458

ప్రతిపదార్థం: అనియెన్= శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు; అని చెప్పినన్= అని వైశంపాయనుడు తెలియజేస్తే; విని= ఆలకించి; జనమేజయుఁడు= జనమేజయమహారాజు - ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడని వైశంపాయనుడు తెలుపగా, జనమేజయమహారాజు మరల ప్రశ్నిస్తున్నాడు.

క. ' అరుదే సర్వేశ్వరుఁ డగు । హరి తోడుగ జయము గొనుట యర్జునునకు? న
ప్పురుషోత్తము బాంధవులై । పరఁగిరి; పెఱ వినుతు లేల పాండుసుతులకున్?' 459

ప్రతిపదార్థం: సర్వేశ్వరుఁడు+అగు= సర్వేశ్వరుడైన; హరి= విష్ణుమూర్తి; తోడుగన్= సహాయుడుగా ఉండగా; జయము+కొనుట= జయాన్ని పొందటం; అర్జునునకున్= కిరీటికి; అరుదే?= దుర్లభమా?; ఆ+పురుషోత్తము= ఆ పురుషోత్తముడైన ఆ శ్రీకృష్ణుడికి; బాంధవులై= బంధువులై; పరఁగిరి= అలరారిరి; పాండుసుతులకున్= ఆ పాండవులకు; పెఱ వినుతులు= మరింక వేరే స్తుతులు; ఏల?= ఎందుకూ?

తాత్పర్యం: వైశంపాయనా! సర్వేశ్వరుడైన హరి తోడుగా ఉంటే కురుసంగ్రామంలో అర్జునుడు విజయుడయ్యాడు. ఇందులో ఆశ్చర్యం ఏముంది? అదీగాక ఆ పురుషోత్తముడికి మా పాండవులు బంధువులయ్యారు. ఇంతకన్నా ప్రశంసావాక్యాలు ఏమి కావాలి చెప్పుము?

వ. అని పలికి యిట్లనియె. 460

ప్రతిపదార్థం: అని= అని; పలికి= మాట్లాడి; ఇట్లు+అనియెన్= ఇంకా జనమేజయుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి జనమేజయుడు మళ్ళీ ఇట్లా అడుగుతున్నాడు.

క. నారదుఁడు పరమపురుషుని । కారుణ్యము వడసి వచ్చి క్రమ్మఱ నరునిన్
నారాయణునిం గాంచుట । సారమతిం జెప్పి తీవు సంయమివర్యా! 461

ప్రతిపదార్థం: సంయమివర్యా!= నిగ్రహ సంపన్నులలో (మునులలో) అగ్రగణ్యుడా!; నారదుఁడు= నారదమహర్షి; పరమపురుషుని= పరాత్పరుడైన శ్రీమహావిష్ణువుయొక్క; కారుణ్యమున్= దయను; పడసి= శ్వేతద్వీపంలో పొంది; వచ్చి; క్రమ్మఱన్= మళ్ళీ; నరునిన్= నరుడినీ; నారాయణునిన్= నారాయణుడినీ; కాంచుట= బదరికాశ్రమంలో దర్శించటం; సారమతిన్= శ్రేష్ఠమైన మతితో; ఈవు= నీవు; చెప్పితి(వి)= చెప్పావు.

తాత్పర్యం: ఓ వైశంపాయనా! శ్వేతద్వీపానికి వెళ్ళి నారదమహర్షి శ్రీమహావిష్ణువును సందర్శించుకుని తిరిగివచ్చి బదరికాశ్రమంలో నరనారాయణులను కలిసికొన్నాడు - అన్నదాకా ఆ కథ చెప్పావు. సారమతితో వివరించావు. బాగుంది.

వ. తదీయసల్లాప విశేషంబులు వినవలతుం జెప్పుమనిన నప్పుడమిఱేనికి వైశంపాయనుం డిట్లనియె. 462

ప్రతిపదార్థం: తదీయ= ఆ ముగ్గురి; సల్లాప= సంభాషణల; విశేషంబులున్= వివరాలూ; వినన్+వలతున్= వినాలని అనుకుంటున్నాను; చెప్పుము+అనినన్= చెప్పు అని అడిగితే; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుగారికి; వైశంపాయనుండు= వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: వారి సంభాషణలను వినగోరుతున్నాను చెప్పు మని ఆ రాజు అడుగగా వైశంపాయనుడు ఇట్లా వివరించసాగారు.

నరనారాయణ నారద సల్లాపప్రకారము (సం. 12-331-36)

క. నారదుఁడు వచ్చి నరునిన్ । నారాయణుఁగాంచి భక్తినమ్రుండైనన్
వా రతనికి నాతిథ్యము । గారవమున నడపి యడుగఁగా వారలతోన్. 463

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; వచ్చి= శ్వేతద్వీపంనుంచి బదరికాశ్రమానికి వచ్చి; నరునిన్= నరుడినీ; నారాయణున్= నారాయణుడినీ; కాంచి= దర్శించి; భక్తినమ్రుండైనన్= భక్తితో వంగి నమస్కరించగా; వారు= నరనారాయణులు; అతనికిన్= ఆ నారదమహర్షికి; ఆతిథ్యమున్= అతిథిమర్యాదను; గారవమునన్= ప్రేమతో (గౌరవంతో); నడపి= చేసి; అడుగఁగాన్= కుశల విశేషాదులు అడిగితే; వారలతో= ఆ ఇద్దరితోనూ.

తాత్పర్యం: నారదమహర్షి శ్వేతద్వీపంనుండి బదరికాశ్రమానికి తిరిగి వచ్చాడు. నరనారాయణులను మళ్ళీ దర్శించాడు. వారు ఆ మహర్షికి ఆదరంతో అతిథిమర్యాదలు జరిపారు. కుశలం అడిగారు. శ్వేతద్వీపం విశేషాలు అడిగారు. అప్పుడు వారితో. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. అద్దేవముని యిట్లనియె. **464**

ప్రతిపదార్థం: ఆ+దేవముని= దేవర్షి అయిన ఆ నారదుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: దేవర్షి నారదుడు ఇట్లా చెప్పాడు.

క. శ్వేతద్వీపంబున భవ । దాతతకృపఁ గానఁ బోలె నచ్యుతుఁ దద్రూ
పాతిశయము మీ చందమ । యాతని కడఁ గంటి మిమ్ము నద్భుత మెసఁగన్. **465**

ప్రతిపదార్థం: భవత్= మీయొక్క; ఆతత కృపన్= విస్తారమైన దయవలన; శ్వేతద్వీపంబునన్= శ్వేతద్వీపంలో; అచ్యుతున్= శ్రీమహావిష్ణువును; కానన్+పోలెన్= దర్శించటమయ్యింది (దర్శించగలిగాను); తద్= ఆ విష్ణుమూర్తియొక్క; రూప+అతిశయము= రూపవైభవం; మీ+చందము+అ= అచ్చం మీవంటిదే; ఆతని కడన్= ఆయన సన్నిధిలో; అద్భుతము+ఎసఁగన్= ఆశ్చర్యజనకంగా (ఆశ్చర్యం ఎసగేట్టు); మిమ్మున్= మీ ఇద్దరినీ; కంటిన్= దర్శించాను.

తాత్పర్యం: 'నరనారాయణులారా! మీ దయావిశేషంవలన నేను శ్వేతద్వీపంలో శ్రీమహావిష్ణువును దర్శించగలిగాను. ఆయన రూపం అచ్చం మీవలెనే ఉన్నది. తేడా ఏమీ లేదు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే - మిమ్ములను ఇద్దరినీ ఆయన సన్నిధిలోనూ చూశాను.

క. శ్వేతులు నింద్రియ వర్జిత । చేతస్కులునైన నరులఁ జెలువుగ మౌనో
పేతులఁ గంటి నచట వా । రాతేజోమూర్తికిని దయాపాత్రంబుల్. **466**

ప్రతిపదార్థం: అచటన్= ఆ శ్వేతద్వీపంలో; శ్వేతులు= తెల్లని శరీరంకలవారూ; ఇంద్రియవర్జిత= ఇంద్రియాలచే విసర్జించబడిన; చేతస్కులున్= మనస్సులు కలవారూ (ఇంద్రియ వికారాలకు లొంగని మనస్సులు కలవారూ); చెలువుగన్= అందంగా; మౌన+ఉపేతులన్= మౌనదీక్షతో ఉన్నవారూ; ఐన= అయినటువంటి; నరులన్= పురుషులను; కంటిన్= చూసాను. (చెలువుగన్+కంటిన్= అందంగా తిలకించాను); వారు= ఆ శ్వేతశరీరులైన నరులు; ఆ+తేజోమూర్తికిని= తేజఃస్వరూపుడైన ఆ విష్ణుమూర్తికి; దయాపాత్రంబుల్= కృపాపాత్రులు (దయకు అర్హమైనవారు).

తాత్పర్యం: ఆ శ్వేతద్వీపంలో ఇంద్రియనిగ్రహం కలిగి, మౌనదీక్షతో తపస్సు చేసికొంటున్న శ్వేతశరీరులైన నరులను దర్శించాను. వారందరూ విష్ణుమూర్తికి దయాపాత్రులు కావటాన్ని గుర్తించాను.

వ. అద్దేవుండు వత్సలుండయి వారలతోడం గూడి విహరించుచుండు నామీఁదం గృపసేసి క్షేత్రజ్ఞప్రకారంబు సకలంబును దేటపడ ననుగ్రహించి యాగామినిజప్రాదుర్భావంబుల తెఱంగెల్ల నెఱిఁగించె. శ్వేతద్వీపం

బనునది శాంతిస్వరూపం బందు సూర్యసోమాంశువ్యాప్తియు వాయుసంచారంబును లే దా లోకనాథునకు నేకాంతిక జనంబులం గడచిన ప్రియులు లేకునికి యెఱింగి యేకాంతినై యుండితి; నవ్విభుండువీడుకొలుప మీకడకు వచ్చితి; నిచ్చట మీకుం గారుణ్యభాజనంబనై యుండెద ననుటయు వార లతని కిట్లనిరి. 467

ప్రతిపదార్థం: ఆ+దేవుండు= ఆ విష్ణుమూర్తి; వత్సలుండయి= వాత్సల్యం కలవాడై; వారలతోడన్= ఆ శ్వేతశరీరులతో; కూడి= కలిసి; విహరించుచుండున్= విహరిస్తుంటాడు; నామీఁదన్= నా పట్ల; కృప+చేసి= దయను వహించి; క్షేత్రజ్ఞప్రకారంబు= క్షేత్రజ్ఞుని పద్ధతి; సకలంబును= అంతా; తేటపడన్= స్పష్టమయ్యేట్టు; అనుగ్రహించి= నాకు ఉపదేశించి; ఆగామి= రాబోయే; నిజ= తనయొక్క; ప్రాదుర్భావంబులన్= జన్మలయొక్క (అవతారాల); తెఱంగు+ఎల్లన్= విధానమంతా; ఎఱింగించెన్= తెలియజేశాడు; శ్వేతద్వీపంబు+అనునది= శ్వేతద్వీపం అనేది; శాంతి స్వరూపంబు= పూర్తిగా శాంతియే రూపంగా ధరించిన చోటు; అందున్= అక్కడ; సూర్యసోమ= సూర్యచంద్రుల; అంశు= కిరణాల; వ్యాప్తియున్= ప్రసారంకానీ; వాయు= గాలియొక్క; సంచారంబునున్= సంచారంకానీ; లేదు= లేనేలేదు; ఆ+లోకనాథునకున్= జగదీశ్వరుడైన ఆ విష్ణుమూర్తికి; ఏకాంతికజనంబులన్= ఏకాగ్రచిత్తులైన వ్యక్తులను; గడచిన= మించిన; ప్రియులు= ఇష్టులు; లేక+ఉనికి= లేకపోవటం (లేరన్న సంగతి); ఎఱింగి= గుర్తించి; ఏకాంతినై= నేను కూడా ఏకాగ్రచిత్తుడనై; ఉండితిన్= ఉన్నాను; ఆ+విభుండు= ఆ ప్రభువు; వీడుకొలుపన్= సాగనంపగా; మీకడకున్= మీ దగ్గరకి; వచ్చితిన్= వచ్చాను; ఇచ్చటన్= ఇక్కడ ఈ బదరికాశ్రమంలో; మీకున్= మీ ఇద్దరికీ; కారుణ్యభాజనంబను+ఐ= దయాపాత్రుడనై; ఉండెదన్= ఉంటాను (నివసిస్తాను); అనుటయున్= అనేసరికి; వారలు= ఆ నరనారాయణులు; అతనికిన్= ఆ నారదమహర్షికి; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: ఆ విష్ణుమూర్తి వాత్సల్యంతో వారితో కలిసి విహరిస్తుండగా, నామీద గల దయతో క్షేత్రజ్ఞుడిని గురించినదంతా తేటపడేటట్లు చేసి, రాబోయే తన జన్మలను తెలియచేశాడు. శ్వేతద్వీపం అనేది శాంతి స్వరూపం. అందులో సూర్యచంద్రకాంతులుగానీ, వాయుప్రసారంగానీ లేవు. విష్ణువుకు ఏకాగ్రచిత్తుల కంటె మించిన ఇష్టులు లేరని తెలిసికొని నేనుకూడా ఏకాంతినై ఉన్నాను. విష్ణువు వీడ్కొల్పగా మీ దగ్గరకు వచ్చాను. ఇక్కడ మీఇద్దరి దయకూ పాత్రుడనై నివసిస్తాను' అనగా ఆ నరనారాయణులు నారదుడితో ఇట్లా అన్నారు:

తే. ' పడసి తద్దేవుఁ గానఁ , దద్భాషణములు । వింటి, నీవు ధన్యుండవు, గంటి మేము
నచట నీయున్న తెఱఁగెల్ల, నిచట నునికి । మేలకాక - యుండుము - పరమేష్ఠితనయ! 468

ప్రతిపదార్థం: పరమేష్ఠితనయ!= బ్రహ్మపుత్రా! ఓ నారదా!; ఆ+దేవున్= ఆ విష్ణుమూర్తిని; కానన్= దర్శించటం; పడసితి(వి)= పొందావు (కానన్+పడసితివి= దర్శించగలిగావు); తద్= ఆయనయొక్క; భాషణములు= పలుకులు; వింటి(వి)= విన్నావు; నీవు; ధన్యుండవు= నిజంగా చరితార్థుడవే ; ఏమున్= మేము కూడా; అచటన్= ఆ శ్వేతద్వీపంలో; నీ+ఉన్న= నీవు నివసించిన (ప్రవర్తించిన); తెఱఁగు+ఎల్లన్= తీరు అంతా; కంటిమి= చూశాం; ఇచటన్= ఈ బదరికాశ్రమంలో; ఉనికి= నీవు ఉండటం; మేలు+అ+కాక= మేలే కదా!; ఉండుము.

తాత్పర్యం: 'ఓ నారదా! విష్ణుమూర్తిని దర్శించగలిగావు, ఆయనతో సంభాషించగలిగావు. నీవు నిజంగా ధన్యుడవయ్యా! మేము కూడా అక్కడి నీ ప్రవర్తనను తిలకించాము. ఇక్కడ ఉంటాను - అంటున్నావు. మంచిదే. ఉండుము.

క. దైవముఁ బిత్వ్యంబును ద । ద్దేవసమారాధనంబు దెల్లము శ్రుతి సం
భావిత మది తత్పరతన్ । నీ వేకాంతివయి నిలువు నిర్మలహృదయా!' 469

ప్రతిపదార్థం: నిర్మలహృదయా!= నిర్మలమైన హృదయం కలవాడా!; దైవమున్= దైవమూ (దేవసంబంధమైనది= దైవము, ఇష్టదేవతారాధన); పిత్ర్యంబునున్= పిత్ర్యమూ (పితృదేవతారాధన) అనే పేరులతో ఉన్న; తద్+దేవ+సమారాధనంబు= ఆ దైవార్చన; అది; శ్రుతి+సంభావితము= వేదప్రతిపాదితం; తెల్లము= స్పష్టం (అది తెల్లము= ఆ విషయం స్పష్టం); తత్పరతన్= వాటిపట్ల ఆసక్తితో; నీవు; ఏకాంతివి+అయి= ఏకాగ్రచిత్తుడవై; నిలువు(ము)= ఉండుము.

తాత్పర్యం: నిర్మలాంతరంగా! దైవమూ, పిత్ర్యమూ అనే ఆరాధనలు వేదప్రతిపాదితాలు అన్న సంగతి స్పష్టమేకదా! నీవు వాటిపట్ల భక్తిశ్రద్ధలతో (తాత్పర్యంతో) ఇక్కడ ఉండుము.'

ఆ. అనిన సంతసిల్లి యద్దేవమునిఁ వేయు । దివ్యవత్సరములు భవ్యతపము
నియతి నాచరించెఁ బ్రియమున వారు ద । న్నాదరింపఁగాఁ దదాశ్రమమున. 470

ప్రతిపదార్థం: అనినన్= అని నరనారాయణులు అనుమతించగా; సంతసిల్లి= సంబరపడి; ఆ+దేవమునిన్= ఆ నారదమహర్షి; వారు= నరనారాయణులిద్దరూ; ప్రియమునన్= ప్రేమతో; తన్నున్= తనను; ఆదరింపఁగాన్= ఆదరిస్తూండగా; తద్+ఆశ్రమమునన్= వారి ఆశ్రమంలో; వేయు= వెయ్యి; దివ్యవత్సరముల్= దివ్యసంవత్సరాలు (మానుష సంవత్సరాలు కాదు - దివ్యవత్సరాలు); భవ్యతపమున్= పవిత్రమైన తపస్సును; నియతిన్= నియమంతో; ఆచరించెన్= చేసాడు.

తాత్పర్యం: నరనారాయణులు ఇట్లా అనుమతించేసరికి నారదుడు సంతోషించాడు. ఆ బదరికాశ్రమంలోనే వేయి దివ్యసంవత్సరాలపాటు భవ్యమైన తపస్సు చేసాడు. అంతకాలమూ నరనారాయణులు ప్రేమగా నారదుడిని ఆదరించారు.

వ. అ ట్లేకాంతియై తపంబుసేసి యత్యంతశాంతి నొంది నారదుండు నరనారాయణుల వీడ్కొని హిమవన్నగంబునకుం జని తన యాశ్రమంబునందు బృందారకాది విశిష్టపూజితుండై యుండె నని చెప్పిన విని సంప్రీతుండైన జనమేజయుతో వెండియు వైశంపాయనుం డిట్లనియె. 471

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఏకాంతియై= ఏకాగ్రచిత్తుడై; తపంబు+చేసి= తపస్సుచేసి; అత్యంతశాంతిన్= మిక్కిలి శాంతిని; ఒంది= పొంది; నారదుండు= నారదమహర్షి; నరనారాయణులన్= నరనారాయణులనిద్దరినీ; వీడ్కొని= విడిచి; హిమవత్+నగంబునకున్= హిమవత్పర్వతమునకు; చని= వెళ్ళి; తన= తనయొక్క; ఆశ్రమంబునందున్= తపోవనంలో; బృందారక+ఆది= దేవతలూ మొదలైన; విశిష్ట= విశిష్టులచేత; పూజితుండై+ఉండెన్= అర్చించబడుతూ ఉన్నాడు; అని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; సంప్రీతుండైన= సంతోషించినవాడైన; జనమేజయుతోన్= జనమేజయుడితో; వెండియున్= మళ్ళీ; వైశంపాయనుండు= వైశంపాయనుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఏకాగ్రచిత్తుడై తపస్సుచేసి నారదుడు ప్రశాంతిని పొందాడు. వారివద్ద సెలవు తీసికొని, హిమాలయాలకు వెళ్ళి తన ఆశ్రమంలో గొప్పవారిచేత సేవించబడ్డాడు' అని చెప్పగా జనమేజయుడు సంతసిల్లాడు. వైశంపాయనుడు ఇట్లా కొనసాగించాడు.

ఉ. ' పాండవవంశవర్య! పటుపాపవినాశనియైన యిక్కథన్
నిండుమనంబుతో వినుట నీవు గృతార్థుఁడ వైతి శాశ్వతా
ఖండసుఖాత్ము విష్ణు నధికస్థిరభక్తి సమాశ్రయింపు నీ
కొండొకఁ డేల? యిమ్మెయి మహోన్నతిఁ జేయు జగత్త్రయంబునన్. 472

ప్రతిపదార్థం: పాండవ వంశ= పాండవవంశంలో; వర్య!= శ్రేష్ఠమైనవాడా!; పటుపాప= మహాపాపాలను; వినాశని+ఐన= విధ్వంసం చేయగలిగిన; ఈ+కథన్= ఈ వృత్తాంతాన్ని; నిండు మనంబుతోన్= నిండు మనస్సుతో; వినుటన్= వినటంచేత; నీవు; కృతార్థుడవు+ఐతి(వి)= కృతకృత్యుడవయ్యావు; శాశ్వత= శాశ్వతమైన; అఖండ= అఖండమైన (పరిపూర్ణమైన); సుఖ+ఆత్మున్= ఆనందమయుడైన (ఆనందరూపి); విష్ణున్= విష్ణుమూర్తిని; అధిక= అధికమైన; స్థిర= స్థిరమైన; భక్తిన్= భక్తితో; సమాశ్రయింపు(ము)= శరణుపొందుము; నీకున్= నీకు; ఒండొకఁడు= ఇతరులకు; ఏల?= ఎందుకు?; ఈ+మెయి= ఈ విధానం; జగత్+త్రయంబునన్= ముల్లోకాలలోనూ; మహోన్నతిన్+చేయున్= (నీకు) గొప్ప ఉన్నతిని కలిగిస్తుంది.

తాత్పర్యం: ఓ పాండవోత్తమా! మహాపాపాలను కూడా కడిగివేయగలిగిన ఈ కథను నీవు నిండుమనసుతో ఆలకించావు. కృతార్థుడవయ్యావు.శాశ్వత అఖండ సుఖస్వరూపుడైన విష్ణుమూర్తిని సుస్థిరభక్తితో సమాశ్రయించుము. ఇతర దైవాలు ఎందుకు! విష్ణుమూర్తినే ఆశ్రయించుము. ఆ విష్ణుభక్తి నిన్ను ముల్లోకాలలోనూ మహోన్నతుడిని చేస్తుంది.

క. లే వుభయలోకములు హరి । పై విద్వేషంబు గలుగు పాపాత్ములకున్,
భూవర! యట్టి జనుల పితృ । దేవతలకు నరక మగుటఁ దెలుపును శ్రుతులున్. 473

ప్రతిపదార్థం: భూవర!= జనమేజయ మహారాజా!; హరిపైన్= విష్ణుమూర్తిమీద; విద్వేషంబు+కలుగు= ద్వేషం పెంచుకున్న; పాపాత్ములకున్= పాపిష్ఠులకు; ఉభయలోకములున్= ఇహపరలోకాలు రెండూ; లేవు; అట్టి జనుల= అటువంటి పాపాత్ముల; పితృదేవతలకున్= పితృదేవతలకు కూడా (పెద్దలకు); నరకము= నరకలోకం; అగుటన్= ప్రాప్తించటాన్ని; శ్రుతులున్= వేదాలుకూడా; తెలుపును= తెలియజేస్తున్నాయి.

తాత్పర్యం: జనమేజయమహారాజా! హరిని ద్వేషించే పాపాత్ములకు ఇహపరలోకాలు (పుట్టగతులు) ఉండవు. వారి పితృదేవతలకు కూడా నరకమే ప్రాప్తిస్తుం దని వేదాలు చెబుతున్నాయి.

క. హరి యాత్మ యెల్లవారికి । నరవర! తన యాత్మపై మనంబున దృఢత
త్పరభావము లేని కుజనుఁ । బొరయవె యాపదలు? వేఱ బోధన మేలా? 474

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఎల్లవారికిన్= అందరికీ; హరి= విష్ణుమూర్తి; ఆత్మ; తన+ఆత్మపైన్= ఇలా తనదే అయిన ఆత్మమీద; దృఢ+తత్పర+భావము= దృఢమైన (భక్తి) తాత్పర్యం; లేని= లేనటువంటి; కుజనున్= దుర్జనుడిని; ఆపదలు= దుఃఖాలు; పొరయవె?= చుట్టుముట్టవా?; వేఱు+అ= వేరే; బోధనము= జ్ఞానం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: మహారాజా! అందరికీ శ్రీ విష్ణువే ఆత్మ. మరి తమ ఆత్మమీద తమకే భక్తితాత్పర్యాలు లేవంటే ఆ దుర్జనులు ఆపదలపాలు కారా?

క. మునివరుఁడు గంధవతి నం । దనుండు నా గురుఁడు గరుణ దళుకొత్తఁగఁ జె
ప్పిన వాక్యంబుల యర్థము । లనఘా! యివి నీవు వీని నలవఱుపు మదిన్. 475

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా!; గంధవతి= మత్స్యగంధి అయిన సత్యవతియొక్క; నందనుండు= కుమారుడూ; నా+గురుఁడు= నాకు గురువుగారూ అయిన; మునివరుఁడు= వ్యాసమునీంద్రుడు; కరుణ= దయ అనేది; తళుకొత్తఁగన్= చిగురించగా (ప్రకాశించగా); చెప్పిన= నాకు ఉపదేశించిన; వాక్యంబుల= వాక్యాల; అర్థములు= భావాలు; ఇవి= ఇవి (ఇంతవరకూ నేను నీకు చెప్పినవి); నీవు= నీవునూ; మదిన్= మనస్సులో; వీనిన్= వీటిని; అలవఱుపు(ము)= అలవరుచుకొమ్ము (అభ్యసించుము).

తాత్పర్యం: జనమేజయా! నా గురువు సాత్యవతేయ మునీంద్రుడు దయతో నాకు చెప్పిన మాటల సారాంశం అంతా నీకు చెప్పాను. వీటిని నీవు అర్థం చేసికొని ఆచరణలో అలవాటు చేసికొమ్ము.

శా. విద్వన్మోదవిధాయి నిర్మలవచోవిస్ఫూర్తి విఖ్యాతుఁ గృ
ష్ణద్వైపాయను నీ వెఱుంగుము విభున్ నారాయణుం గా విప
శ్చిద్వంద్యంబగు భారతాధ్యయనముం జేయంగ శక్తుండు ధ
ర్మాద్వైతుండు సరోజలోచనుఁడకా కన్యుండు తద్వాచ్యుఁడే! 476

ప్రతిపదార్థం: విద్వత్= విద్వాంసులకు; మోదవిధాయిన్= ఆనందాన్ని కలిగించేవాడూ; నిర్మల= పావనమైన; వచః= వాక్కుల యొక్క; విస్ఫూర్తి= విస్ఫురణతో; విఖ్యాతున్= ప్రఖ్యాతి పొందినవాడూ అయిన; కృష్ణద్వైపాయనున్= కృష్ణద్వీపంలో పుట్టిన వ్యాసుడిని; నీవు= నీవునూ; విభున్= ప్రభువైన; నారాయణున్+కాన్= విష్ణుమూర్తిగా; ఎఱుంగుము= తెలిసికొమ్ము; విపశ్చిత్= పండితులచేత; వంద్యంబు+అగు= నమస్కరింపదగినది అయిన; భారత+అధ్యయనమున్+చేయంగన్= భారతాన్ని అవగాహన చేసికొనటానికి; శక్తుండు= సమర్థుడు; ధర్మ+అద్వైతుఁడు= ధర్మానికి అభిన్నుడు (ధర్మస్వరూపుడు) అయిన; సరోజలోచనుఁడు+అ+కాక= పుండరీకాక్షుడే తప్ప; అన్యుండు= మరొకడు; తద్= శక్తుడు అనే ఆ మాటతో; వాచ్యుఁడే= చెప్పబడతాడా?

తాత్పర్యం: మహావిద్వాంసులకు ఆనందాన్ని కలిగించే వచోవిలాసానికి పెట్టిందిపేరు మా గురువుగారు వ్యాసులవారు. ఆయనను సాక్షాత్తూ నారాయణుడుగా తెలియుము. మహాభారతానికి పండితులంతా నమస్కారం పెడతారు. అటువంటి భారతాన్ని అధ్యయనం చేయాలి అంటే ధర్మస్వరూపుడైన పుండరీకాక్షుడికి తప్ప మరొకరికి ఎవరికైనా అయ్యే పనేనా!

క. బహు విధ ధర్మంబులు లో । క హితంబుగ నిట్లు సెప్పఁగా నిర్మలతా
మహనీయధిషణుఁడగు న । మ్మహాత్మునక తీరుఁ గురుసమాజవరేణ్యా!' 477

ప్రతిపదార్థం: కురుసమాజవరేణ్యా!= కురువంశంలో ఉత్తముడా (కౌరవసమూహంలో అగ్రగణ్యుడా!) ఓ జనమేజయా!జనమేజయుడా!; బహువిధ= రకరకాలైన; ధర్మంబులు= ధర్మాలు; లోకహితంబుగన్= లోకానికి హితంగా; ఇట్లు= ఈ విధంగా; చెప్పఁగాన్= చెప్పటానికి; నిర్మలతా= నిర్మలత్వంతో; మహనీయ= గొప్పదైన; ధిషణుఁడు+అగు= బుద్ధి కలిగిన; ఆ+మహాత్మునకున్+అ= ఆ మహానుభావుడు వ్యాసుడికే; తీరున్= చెల్లును (తగును).

తాత్పర్యం: కురువంశసంభవుల బృందంలో ఉత్తముడవైన ఓ జనమేజయా! రకరకాల ధర్మాలు ఇట్లా లోక శ్రేయస్సుకొరకు చెప్పటమంటే అది మా గురువుగారికే తగును. ఆయన మహానుభావుడు. నిర్మలమూ, మహనీయమూ అయిన బుద్ధివైభవం కలవాడు. అందుకని అది ఆయనకే చెల్లింది.'

విశేషం: సమాజం అంటే మానవసమూహం అని అర్థం. సమజం అంటే పశువుల గుంపు అని. కురుసమాజమంటే కురువంశజులైన మానవుల సమూహం. అందులో జనమేజయుడు వరేణ్యుడు అని సంబోధన.

హయగ్రీవదేవ మాహాత్మ్యాభివర్ణనము (సం. 12-335-9,10)

వ. అనిన విని సవిశేష సమ్మదుండై జనమేజయుండు వైశంపాయనుతో 'హయశిరోభాసితుం డగు విష్ణుండు వేధకు సన్నిహితుండయ్యె నని చెప్పితి వప్పురుషోత్తముం డప్పు డేమిటికై యా మూర్తి వహించె? నత్తెఱం గెఱింగింపు' మని యడిగిన నమ్మునిం య మ్మనుజపతి కిట్లనియె.. 478

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సవిశేష= అత్యధికంగా; సమ్మదుండై= సంతోషించినవాడై; జనమే జయుండు= జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయన మహర్షితో; హయశిరః= గుర్రపుతలతో; భాసితుండు+అగు= విరాజిల్లేవాడై; విష్ణుండు= విష్ణుమూర్తి; వేధకున్= బ్రహ్మదేవునికి; సన్నిహితుండు= దగ్గరకి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు (ఆ రూపంలో బ్రహ్మను సమీపించాడు); అని= అని; చెప్పితి(వి)= చెప్పావు (శాంతి - 6-412); ఆ+పురుషోత్తముండు= ఆ విష్ణువు; అప్పుడు= ఆ సమయంలో; ఏమిటికై= ఎందుకోసమని; ఆ మూర్తి= ఆ రూపం (హయగ్రీవ రూపం); వహించెన్?= వహించాడు?; ఆ+తెఱంగున్= ఆ రీతి అంతా; ఎఱిఁగింపుము= తెలియజెప్పుము; అని= అని; అడిగినన్= అడిగితే; ఆ+ముని= ఆ వైశంపాయనముని; ఆ+మనుజపతికిన్= ఆ జనమేజయమహారాజుకి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు చెప్పినదంతా వినిన జనమేజయుడు 'గుర్రపుతలతో ఒప్పే విష్ణువు బ్రహ్మను సమీపించా డని చెప్పావు. ఎందు కాయన ఆ రూపాన్ని ధరించాడు? ఆ వివరములు చెప్పు' మని అడుగగా వైశంపాయనుడిట్లా చెప్పసాగాడు.

సీ. ప్రళయకాలంబున జలముల విష్ణుండు । యోగనిద్రారతి నొంది మేలు
కాంచి లోకంబులు గావింపఁ దలఁప న । హంకార మెసఁగె బ్రహ్మాభిధాన
కలితమై తన్నాభికమలంబునం బిట్లు । జనియించి యా బ్రహ్మ సకలసృష్టి
కాదిభూతములుగ వేదముల్ నాలుగు । గలిగించె నప్పు డక్కమలనాభు

తే. నందు మును లయించినట్టి గుణంబులు । మూఁటఁ దొలుత సత్త్వమునకుఁ దోఁపు
కలిమి దాననుండెఁ గమలోద్భవుఁడు రజ । స్తమము లసురలయ్యె ధరణినాథ! 479

ప్రతిపదార్థం: ధరణినాథ!= జనమేజయమహారాజా!; ప్రళయకాలంబునన్= సృష్టి అంతం అయినప్పుడు (జలప్రళయం వచ్చినపుడు); జలములన్= నీటిలో; విష్ణుండు= విష్ణుమూర్తి; యోగనిద్రారతిన్= యోగనిద్రపట్ల ఆసక్తి; పొంది= పొంది (యోగనిద్ర కానిచ్చి); మేలుకాంచి= మేల్కొని; లోకంబులు= లోకాలు; కావింపన్+తలఁపన్= సృష్టిస్తాను అనుకునేసరికి; బ్రహ్మ= బ్రహ్మ అనే; అభిధాన= పేరుతో; కలితమై= ఒప్పినదై; అహంకారము+ఎసఁగెన్= అహంకారం జనించింది; తద్+నాభికమలంబునందున్= ఆ విష్ణుమూర్తి పొక్కిలినుంచి (బొడ్డునుంచి) పుట్టిన పద్మంలో; ఇట్లు= ఈ విధంగా; జనియించి= జన్మించి; ఆ+బ్రహ్మ= ఆ బ్రహ్మదేవుడు; సకలసృష్టికిన్= మొత్తం (జరగబోయే) సృష్టికి అంతటికీ; ఆదిభూతములుగన్= మొట్టమొదటివిగా; వేదముల్= వేదాలు; నాలుగు= నాల్గు; కలిగించెన్= సృష్టించాడు; అప్పుడు= ఆ సమయాన; ఆ+కమలనాభునందున్= ఆ విష్ణుమూర్తిలో (కమలం నాభియందు కలవాడు); మును= (యోగనిద్రాసమయంలో) పూర్వకాలం; లయించినట్టి గుణంబులు= లీనమైన సత్త్వరజస్తమోగుణాలు; మూఁటన్= మూడింటిలోనూ; తొలుతన్= మొట్టమొదట; సత్త్వమునకున్= సత్త్వగుణానికి; తోఁపు+కలిమిన్= ఆవిర్భావం జరగటం వలన (తోఁచు-తోఁపు. తోఁచుట= ఉదయించుట); దానన్= ఆ సత్త్వగుణంలో (నాభికమలంలో);కమలోద్భవుఁడు= బ్రహ్మ; ఉండెన్= స్థిరపడ్డాడు; రజః+తములు= రజోగుణతమోగుణాలు; అసురలు= రాక్షసులు; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: జనమేజయా! ప్రళయకాలంలో యోగనిద్రకు ఉపక్రమించిన విష్ణుమూర్తి మేల్కొని 'జగత్తులను సృష్టిద్దాం' అనుకొన్నాడు. అనుకొనటమేమిటి - అహంకారం ఆవిర్భవించింది. దానికి బ్రహ్మ అనే పేరు ఏర్పడింది. విష్ణుమూర్తి నాభికమలంనుండి ఇట్లా జన్మించిన ఆ బ్రహ్మదేవుడు సృష్టికి శ్రీకారంగా వేదాలను నాల్గింటిని సృష్టించాడు. ప్రళయవేళ యోగనిద్రాసమయాన విష్ణుమూర్తిలో లీనమైపోయిన సత్త్వరజస్తమోగుణాలలో మొట్టమొదటగా సత్త్వగుణం ఆవిర్భవించింది. బ్రహ్మ ఆ సత్త్వగుణంలోనే ఉన్నాడు. తరువాత వెలువడ్డ రజస్తమోగుణాలు రాక్షసులు అయ్యాయి.

క. వినుఁ కైటభుండు నా మధు । వనఁ బేర్చిన యద్దురాత్ము లవ్వేదములం
గొని వేగ చని రసాతల । మున వైచిరి గాఢబంధములు సేసి నృపా! 480

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; వినుఁ= ఆలకించుము; కైటభుండు+నాన్=కైటభుడు అనీ; మధువు+అనన్= మధువు అనీ;పేర్చిన= విజృంభించిన; ఆ+దురాత్ములు= ఆ దుష్టులు (రాక్షసులు); ఆ+వేదములన్+కొని= ఆ వేదాలను నాల్గింటినీ అపహరించి; వేగ+చని= వేగంగా వెళ్ళి (పారిపోయి); గాఢబంధములు+చేసి= గట్టిగా కట్టివేసి; రసాతలమునన్= పాతాళంలో; వైచిరి= విసిరివేశారు (దాచారు).

తాత్పర్యం: రాజా! కైటభుడు అనీ, మధువు అనీ ఇద్దరు దుష్టస్వభావులు ఉండేవారు. వాళ్ళు నాలుగు వేదాలనూ అపహరించుకొనిపోయి గట్టిగా కట్టేసి పాతాళంలో పారవైచారు.

వ. దాన నవ్వేధ విహ్వలించి. 481

ప్రతిపదార్థం: దానన్= అందువల్ల; ఆ+వేధ= ఆ బ్రహ్మదేవుడు; విహ్వలించి= బాధపడి.

తాత్పర్యం: దానితో ఆ బ్రహ్మదేవుడు బాధపడి.

క. ‘ లావును దృష్టియు గతియును । నా వేదచయంబ నాకు నవి యడఁగిన నే
నేవిధి సృజింతు లోకము? । లే వాఁ డీ యెడరు తలఁగు నిం కెట్లొక్కో?’ 482

ప్రతిపదార్థం: నాకున్= నాకు; లావును= బలమూ; దృష్టియున్= చూపూ; గతియునున్= ఆధారమూ (నడవడిక); ఆ+వేదచయంబు+అ= ఆ వేదసమూహమే; అవి= ఆ వేదాలు; అడఁగినన్= అంతరించిపోతే; నేను= నేను; ఏ విధిన్= ఏ విధంగా; లోకములు= లోకాలు; సృజింతున్?= సృష్టిస్తాను?; ఏవాఁడు= ఏ వ్యక్తి; ఈ+ఎడరు= ఈ ఆపదను; ఇంకన్= ఇక ఏవిధంగా; ఎట్లు+ఒక్కో?= ఎట్లాగో ఏమిటో కదా; తలఁగున్= తప్పిస్తాడు;

తాత్పర్యం: ‘నాకు బలమూ, చూపూ, ఆధారమూ - అన్నీ వేదాలే. అవే నశించిపోతే నే నింక జగత్తులను ఎట్లా సృష్టిస్తాను? ఈ ఆపదనుంచి నన్ను ఎవరు ఎలా తప్పించగలరు?

వ. అని పలవించి. 483

ప్రతిపదార్థం: అని= ఇట్లాగ; పలవించి= దుఃఖించి.

తాత్పర్యం: ఇట్లా దుఃఖించి.

ఆ. విష్ణు బహువిధముల వినుతింప నజ్జల । శాయి హయశిరంబు సకలవర్ణ
భాసురంబునైన పరమాద్భుతంపు రూ । పంబు దాల్చి వేదపరత నొందిం. 484

ప్రతిపదార్థం: విష్ణున్= విష్ణుమూర్తిని; బహువిధములన్= అనేక ప్రకారాలుగా; వినుతింపన్= స్తుతించేసరికి; ఆ+జలశాయి= ప్రళయ జలధిలో శయనించిన ఆ విష్ణుమూర్తి; హయశిరంబున్= గుర్రపు తలకలదీ; సకలవర్ణ= అన్ని రంగులూ కలిగి; భాసురంబు= ప్రకాశిస్తున్నదీ; ఐన= అయినటువంటి; పరమ+అద్భుతంపు+రూపంబు= మిక్కిలి ఆశ్చర్యకరమైన మూర్తి; తాల్చి= ధరించి; వేదపరతన్= వేదాన్వేషణ తత్పరతను; ఒందిం= పొంది - ‘నానామూర్తిభిరావృతమ్’ - అని మూలంలో ఉంది. సకలవర్ణ భాసురము అన్నాడు తిక్కన.)

తాత్పర్యం: బ్రహ్మదేవుడు విష్ణుమూర్తిని బహువిధాలుగా స్తుతించాడు. ప్రళయజలధిలో నిద్రిస్తున్న విష్ణువు అప్పుడు హయగ్రీవరూపం ధరించాడు. గుర్రపుతల, వివిధ వర్ణాలతో ప్రకాశించే శరీరం - ఈ రూపంతో వేదాన్వేషణకు ఉపక్రమించాడు.

క. పాతాళమునకుఁ జని యం । దాతతమై ప్రణవరూప మగు నాదం బు
ద్యోతితము సేసె నది యా । దైతేయులు విని పటుప్రతాపం బెసఁగన్. 485

ప్రతిపదార్థం: పాతాళమునకున్= పాతాళలోకానికి; చని= వెళ్ళి; అందున్= అక్కడ; ఆతతమై= సుదీర్ఘమూ; ప్రణవరూపము= ఓంకారరూపమూ; అగు= అయిన; నాదంబున్= ధ్వనిని; ఉద్యోతితము+చేసెన్= మారుమ్రోగించాడు; అది= ఆ ప్రణవధ్వని; ఆ+దైతేయులు= ఆ రాక్షసులు ఇద్దరూ (మధుకైటభులు); విని= ఆలకించి; పటుప్రతాపంబు+ఎసఁగన్= గొప్ప శౌర్యం అతిశయించేటట్టు.

తాత్పర్యం: హయగ్రీవరూపంలో విష్ణువు పాతాళానికి వెళ్ళి అక్కడ సుదీర్ఘంగా ప్రణవధ్వని చేసాడు. అది విన్న మధుకైటభులు మహాప్రతాపంతో అటువైపు వచ్చారు.

క. ఆ నాదము దెసకుం జన । దానవరిపుఁ డొండువలనఁ దా నరిగి తదీ
యానూనబంధపీడిత । లైన శ్రుతులు విడిచి తెచ్చి యజునకు నిచ్చెన్. 486

ప్రతిపదార్థం: ఆ+నాదము+దెసకున్= ఆ ప్రణవధ్వని వైపు; చనన్= మధుకైటభులు రాగా; దానవరిపుఁడు= రాక్షసుల శత్రువైన విష్ణువు; ఒండువలనన్= మరొకవైపు; తాన్+అరిగి= తాను వెళ్ళి; తదీయ= వారియొక్క; అనూన= దృఢమైన; బంధ= బంధనాలతో; పీడితలు+ఐన= హింసింపబడుతున్న; శ్రుతులు= వేదాలు; విడిచి= కట్లు విప్పి (విడిపించి); తెచ్చి= తీసుకువచ్చి; అజునకున్= బ్రహ్మకు; ఇచ్చెన్= సమర్పించాడు.

తాత్పర్యం: ఆ ప్రణవధ్వని వినవస్తున్న వైపు పరుగుతీసారు మధుకైటభులు. అప్పుడు హయగ్రీవుడు మరొకవైపు వెళ్ళి, అక్కడ బంధపీడితాలై పడి ఉన్న వేదాలకు కట్టలు విప్పి వాటిని తీసికొనివచ్చి, బ్రహ్మకు అప్పగించాడు.

తే. ఇచ్చి యెప్పటి యట్ల యహీంద్రతల్ప । శయనుఁడై యుండె నటఁ దమ చనినచోట
నెవ్వరినిఁ గాన కా దైత్యు లెచట శ్రుతులు । దారు మును వెట్టి రందు సత్వరముగాఁగ. 487

ప్రతిపదార్థం: ఇచ్చి= బ్రహ్మకు అప్పగించి; ఎప్పటియట్లు+అ= ఎప్పటిలాగానే; అహి+ఇంద్ర+తల్ప+శయనుఁడై - అహీంద్ర= సర్పరాజయిన ఆదిశేషుడు అనే; తల్ప= శయ్యమీద; శయనుఁడు+ఐ= శయనించినవాడై; ఉండెన్= ఉన్నాడు; అటన్= ఆ పాతాళంలో; తమ+చనిన+చోట= తాము వెళ్ళినవైపున; ఎవ్వరినిన్= ఎవరినీ; కానక= చూడక (ఎవ్వరూ కనపడకపోవటంతో); ఆ+దైత్యులు= ఆ మధుకైటభ రాక్షసులు; ఎచటన్= ఏ ప్రదేశంలో; శ్రుతులు= వేదాలు; తారు= తాము; మును= ఇంతకుపూర్వం; పెట్టిరి= దాచారో; అందున్= ఆ ప్రదేశంలోకి; సత్వరము+కాఁగన్= గబగబా వెళ్ళిచూశారు.

తాత్పర్యం: వేదాలను బ్రహ్మకు అప్పగించి విష్ణుమూర్తి వెళ్ళి ఏమీ ఎరగనట్లు ఎప్పటివలె శేషతల్పంమీద శయనించాడు. ఇంక పాతాళంలో సంగతి - ఓంకారం వినిపించిన వైపు పరుగుపరుగున వెళ్ళిన మధుకైటభులకు అక్కడ ఎవ్వరూ కనబడలేదు. వాళ్ళు మునుపు వేదాలు ఎక్కడ దాచారో గబగబా అక్కడికి వెళ్ళిచూశారు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అరిగి యచట వాని నరసి కానక రభ । సమునఁ గలయఁ దిరిగి శార్ఙ్గిఁ గాంచి
యుద్ధమునకుఁ బిల్వ నద్ధరణీధరుం । డడరి సమయఁ జూచె ననురయుగము. 488

ప్రతిపదార్థం: అరిగి= వెళ్ళి; అచటన్= అక్కడ; వానిన్= ఆ వేదాలను; అరసి= వెదికి; కానక= (చూడక) కనిపించకపోవటంతో; రభసమునన్= కంగారుగా; కలయన్+తిరిగి= చిందులొక్కి (అంతటా వెదకి); శార్ఙ్గిన్= విష్ణుమూర్తిని; కాంచి= చూచి;

యుద్ధమునకున్= యుద్ధానికి; పిల్వన్= పిలిచేసరికి; ఆ+ధరణీధరుండు= ఆ విష్ణుమూర్తి (వరాహావతారంలో భూగోళాన్ని ధరించినవాడు); అడరి= విజృంభించి; అసురయుగమున్= ఆ రాక్షసుల జంటను; సమయన్+చూచెన్= చనిపోవటం చూచాడు. (చనిపోయేట్టు చేసాడు - సంహరించాడు అని ఫలితార్థం.)

తాత్పర్యం: వేదాలను ఎక్కడ దాచారో అక్కడ అంతా వెదికారు. అవి కనిపించలేదు. అంతటా గాలించారు. యోగనిద్రలో ఉన్న విష్ణుమూర్తి కనిపించాడు. వీళ్ళు యుద్ధానికి ఆహ్వానించారు. కయ్యానికి కాలుదువ్వారు. స్వామి చూశాడు, యుద్ధం చేశాడు. సంహరించాడు.

వ. ఇట్లు విష్టరశ్రవుండు సృష్టకార్యంబు నిర్విఘ్నంబుఁ జేసిన విధాత యప్పని సునీతంబు సేసె నాఁటనుండియు హయశిరోమహితయగు నమ్మూర్తి దక్కిన మూర్తులకంటె నెక్కు డయ్యె నా జగత్కర్తను వేదంబులు నాశ్రయించియుండు'నని చెప్పి వెండియు. 489

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; విష్టరశ్రవుండు= విష్ణుమూర్తి; సృష్టికార్యంబున్= జగత్తులను సృష్టించటం అనే పనిని; నిర్విఘ్నంబున్+చేసినన్= (ఆటంకం తొలగించి) నిర్విఘ్నం చేస్తే; విధాత= బ్రహ్మదేవుడు; ఆ+పని= ఆ సృష్టికార్యాన్ని; సునీతంబు+చేసెన్= నెరవేర్చాడు (కడతేర్చాడు); నాఁటినుండియున్= ఆ రోజునుంచీ; హయశిరః= గుర్రపుతలతో; మహిత+అగు= కూడినదైన; ఆ+మూర్తి= ఆ స్వరూపం; తక్కిన= మిగిలిన; మూర్తులకంటెన్= స్వరూపాలకన్నా; ఎక్కుడు+అయ్యెన్= ఎక్కువది అయ్యింది; ఆ జగత్కర్తను= లోకకారకుడైన ఆ విష్ణుమూర్తిని; వేదంబులున్= వేదాలుకూడా; ఆశ్రయించి+ఉండున్= ఆశ్రయించుకొని ఉంటాయి; అని చెప్పి= అని వివరించి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఇట్లా విష్ణువు జగత్తును సృష్టించటంలో ఉన్న ఆటంకాన్ని తొలగించగా, బ్రహ్మ సృష్టికార్యాన్ని నెరవేర్చాడు. ఆనాటినుండి హయగ్రీవమూర్తి తక్కిన మూర్తులకంటె మహిమాన్వితమయింది. వేదాలు కూడా ఆ విష్ణువును ఆశ్రయించి ఉన్నాయి' అని చెప్పి తిరిగి.

క. ' హరి సత్త్వాదిగుణంబులఁ । బొరిఁబొరిఁ గలిగింపఁ బెంపఁ బొలియింపఁగ భూ
వర! యవి యెక్కువఁ దక్కువఁ । బొరయుచుఁ బరివర్తనంబుఁ బొందుచునుండున్. 490

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; హరి= విష్ణుమూర్తి; సత్త్వ+ఆది+గుణంబులన్= సత్త్వరజస్తమోగుణాలను; పొరిన్+పొరిన్= క్రమక్రమంగా; కలిగింపన్= కల్గించటం; పెంపన్= పెంచటం; పొలియింపఁగన్= త్రుంచటం చేస్తే; అవి= ఆ గుణాలు; ఎక్కువన్+పొరయుచున్= ఎక్కువ అవుతూ; తక్కువన్+పొరయుచున్= తక్కువ అవుతూ (పొరయు= పొందు); పరివర్తనంబున్= ఇలా మార్పును; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాయి.

తాత్పర్యం: 'ఓ జనమేజయ మహారాజా! విష్ణుమూర్తి తన చిత్తం వచ్చినట్లు సత్త్వరజస్తమో గుణాలను కలిగిస్తూ పెంచుతూ తగ్గిస్తూ ఉంటాడు. దానినిబట్టి అవతారమూర్తులలో ఎక్కువలూ, తక్కువలూ వస్తూ ఉంటాయి. ఇట్లా మార్పులు జరుగుతుంటాయి.

క. గుణవంతుఁడు గుణరహితుఁడు । గుణకల్పనతత్పరుండు గుణనాశనునై
పుణశాలి గుణనిబద్ధుఁడు । గుణమోక్షణకరుఁడు శార్ఙ్గి కురుకులముఖ్యా! 491

ప్రతిపదార్థం: కురుకుల= కురువంశంలో; ముఖ్యా!= ముఖ్యుడా! ఓ జనమేజయా!; శార్ఙ్గి= విష్ణుమూర్తి (విష్ణుమూర్తి ధనుస్సుపేరు శార్ఙ్గం. అది కలవాడు కాబట్టి శార్ఙ్గి); గుణవంతుఁడు= త్రిగుణాలూ కలవాడూ; గుణరహితుఁడు= గుణాలు లేనివాడు,

గుణకల్పన తత్పరుడు= గుణాలకల్పనలో ఆసక్తి కలవాడూ (గుణాలను కల్పించేదీ అతడే); గుణనాశన= గుణాలను నాశనంచేసే; నైపుణశాలి= నేర్పరీ అతడే; గుణ= గుణాలకు; నిబద్ధుఁడు= కట్టుబడి ఉండేవాడూ; గుణ= గుణాలకు; మోక్షణ+కరుఁడు= విముక్తి కలిగించేవాడూ అతడే.

తాత్పర్యం: జనమేజయా! విష్ణుమూర్తి తత్త్వం చాలా విచిత్రంగా ఉంటుంది. గుణవంతుడూ ఆతడే, గుణరహితుడూ ఆతడే. గుణాలను సృష్టించేదీ అతడే, తుదముట్టించేదీ అతడే. గుణాలకు నిబద్ధుడై ఉండేదీ అతడే, విముక్తి కలిగించేదీ అతడే.

క. వినుఁ నారాయణపరములు । జననాయక! వేదములును జన్నంబులుఁ ద
క్కిన పుణ్యసమారంభము । లును రసముఖగోచరంబులును భూతములున్. 492

ప్రతిపదార్థం: జననాయక!= నరాధిపా!; వినుఁ= వినుము; వేదములును= వేదాలూ; జన్నంబులున్= యజ్ఞాలూ; తక్కిన= ఇంకా మిగిలిన; పుణ్యసమారంభములును= పవిత్రకార్యక్రమాలూ; రసముఖ= నీరు మొదలుగా; గోచరంబులును= ఇంద్రియగ్రాహ్యాలైన (తెలిసే); భూతములున్= పంచభూతాలూ; నారాయణపరములు= నారాయణాత్మకాలు.

తాత్పర్యం: రాజా! వేదాలూ, యజ్ఞాలూ, సకలపుణ్యకార్యాలూ, పంచభూతాలూ - ఇవన్నీ నారాయణ స్వరూపాలూ, నారాయణపరాలూను.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'నేకాంతికజనులు లోకోత్తరులని చెప్పి; తయ్యేకాంతికత్వం
బెట్టిది? యెఱింగింపవే?' యనుటయు నతం డతని కిట్లనియె. 493

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలించి; జనమేజయుండు= ఆ జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయన మహర్షితో; ఏకాంతికజనులు= ఏకాగ్రచిత్తం కలవారు; లోక+ఉత్తరులు+అని= చాలా గొప్పవారని (లోకంలో - లోకులలో గొప్పవారు - లోకోత్తరులు); చెప్పితి(వి)= అన్నావు; ఆ+ఏకాంతికత్వంబు= ఆ ఏకాగ్రచిత్తత; ఎట్టిది= ఎటువంటిది?; ఎఱింగింపవే?= తెలియజెప్పవా?; అనుటయున్= అని అడగగానే; అతండు= ఆ వైశంపాయనుడు; అతనికిన్= ఆ జనమేజయుడికి; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అంతా విని, జనమేజయుడు 'ఏకాగ్రచిత్తం అంటే ఏమిటి? తెలుపుము.' అని అడుగగా దానికి వైశంపాయనుడు ఇట్లా బదులిచ్చాడు.

ఆ. ' సాంఖ్యయోగ పరమసారభూతం బిది । మున్ను వింటి యుద్ధమునకుఁ జొరక
కరుణ నార్ద్రుడైన గాండీవి బోధింపఁ । గృష్ణ చెప్పినట్టి గీత లందు. 494

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పబోయే ఏకాంతికత్వం అనేది; సాంఖ్య-యోగ= సాంఖ్యమూ, యోగమూ అనే రెండింటియొక్క; పరమసారభూతంబు= ఉత్తమసారమయినది; యుద్ధమునకున్= కురుక్షేత్రంలో యుద్ధానికి; చొరక= దిగకుండా; కరుణన్= దుఃఖంతో; ఆర్ద్రుఁడు+ఐన= మెత్తబడిపోయిన; గాండీవిన్= గాండీవధారి అయిన అర్జునుడిని; బోధింపన్= మేలుకొల్పటంకోసం (జ్ఞానిని చేయటంకోసం); కృష్ణ= కృష్ణుడు; చెప్పినట్టి= ఉపదేశించిన (కృష్ణుడు ఉపదేశించిన - అని); గీతలందున్= భగవద్గీతలలో; ఇది= దీనిని; మున్ను= వెనుకటికి; వింటిన్= విన్నాను (అది నీకు చెబుతున్నాను అని).

తాత్పర్యం: 'జనమేజయా! నీవు అడిగిన ఏకాంతికత్వం అనేది సాంఖ్యయోగశాస్త్రాల సారం. వెనుకటికి - కురుక్షేత్ర సంగ్రామంలో యుద్ధవిముఖుడైన పార్థుడిని ప్రబోధించటానికి శ్రీకృష్ణుడు ఉపదేశించిన గీతలలో ఉన్న విషయం ఇది. దీనిని అప్పు డెప్పుడో విన్నాను. ఇప్పుడు నీకు చెప్పుతున్నాను.

వైశంపాయనుఁడు జనమేజయున కేకాంతికధర్మ మెఱిఁగించుట (సం. 12-336-8)

క. నిర్మలమగు నేకాంతిక । ధర్మము నారాయణోదితంబై క్రియలం
గర్మఠుఁడగు బ్రహ్మమతిని । ధార్మికవర! యొలసె, నతఁడు దయ సిగురొత్తన్. 495

ప్రతిపదార్థం: ధార్మికవర!= ధార్మికులలో ఉత్తముడా!; నిర్మలము+అగు= పవిత్రమైన; ఏకాంతిక ధర్మము= ఈ ఏకాంతిక లక్షణం; నారాయణ+ఉదితంబై= విష్ణుమూర్తిచేత చెప్పబడినదై; క్రియలన్= పనులలో; కర్మఠుఁడు+అగు= కర్మిష్ఠి (నైష్ఠికుడు) అయినటువంటి; బ్రహ్మమతినిన్= బ్రహ్మదేవుని బుద్ధిని; ఒలసెన్= పొందింది; (నారాయణుడు చెప్పగా బ్రహ్మదేవుడుగ్రహించాడు) - అని; అతఁడు= ఆ బ్రహ్మ; దయ= కరుణ; చిగురొత్తన్= పల్లవించగా.

తాత్పర్యం: ధర్మాచరణంలో ఉత్తముడవైన ఓ జనమేజయా! ఏకాంతికతత్వాన్ని ముందుగా నారాయణుడు బ్రహ్మకు చెప్పాడు. అటుపైన బ్రహ్మదేవుడు దయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దక్షునకు నెఱిఁగించిన । దక్షుఁడు బోధించెఁ దనదు దౌహిత్రు జగ
చ్చక్షుని నా సవితృండు మ । నుక్షితిపతి కిచ్చె నవ్వినుతధర్మంబున్. 496

ప్రతిపదార్థం: దక్షునకున్= దక్షప్రజాపతికి; ఎఱిఁగించినన్= బ్రహ్మదేవుడు చెప్పగా; దక్షుడు= ఆ దక్షప్రజాపతి; తనదు+దౌహిత్రున్= తన మనుమడూ (కూతురి కొడుకు); జగత్+చక్షునిన్= లోకనేత్రమూ అయిన సూర్యుడిని ఉద్దేశించి; బోధించెన్= ఉపదేశించాడు; ఆ+సవితృండు= ఆ సూర్యుడు; ఆ+వినుత+ధర్మంబున్= నుతింపదగిన ఆ ధర్మాన్ని; మనుక్షితిపతికిన్= మను మహారాజుకి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు దక్షప్రజాపతికీ, దక్షుడు సూర్యుడికీ, సూర్యుడు మనువుకూ ఈ ఏకాంతికధర్మాన్ని ఉపదేశించారు.

క. మను విక్ష్వాకున కొసఁగె న । తని వలనఁ దదీయ యోగ్యతా కలితులు స
జ్జనములు వడసి రనేకులు । వినु నారాయణునిచేత విని నారదుఁడున్. 497

ప్రతిపదార్థం: మనువు= ఆ మనువు; ఇక్ష్వాకునకున్= ఇక్ష్వాకుమహారాజుకు; ఒసఁగెన్= ఇచ్చాడు; అతనివలనన్= ఆ ఇక్ష్వాకువు నుండి; తదీయ= దానికి అవసరమైన; యోగ్యతా= అర్హతలతో; (ఆ) కలితులు= కూడుకొన్న; సత్+జనములు= సత్పురుషులు; అనేకులు= చాలామంది; పడసిరి= పొందారు; విను= జనమేజయా! ఆలకించుము; నారాయణునిచేతన్= నారాయణునినుంచి; విని= తెలిసికొని; నారదుఁడున్= నారదమహర్షి కూడా.

తాత్పర్యం: మనువునుండి ఇక్ష్వాకుమహారాజుకూ, అతడినుండి దానిని అందుకొనే యోగ్యత ఉన్న సజ్జనులకు చాలామందికీ ఆ ఏకాంతికధర్మం అందింది. సాక్షాత్తూ నారాయణుడినుండి తెలిసికొన్న నారదుడు కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తగియెడు శిష్యుల కొసఁగెను । జగతీశ్వర! యిట్టు లది ప్రశస్తంబై యి
జ్జగములను గలిగె విను మ । య్యగాధ ధర్మంబు దుష్కృతాప్రాప్యమగున్. 498

ప్రతిపదార్థం: జగతీ+ఈశ్వర!= మహారాజా!; తగియెడు= తగిన; శిష్యులకున్= శిష్యులకు; ఒసఁగెను= (ఉపదేశం) ఇచ్చాడు;ఇట్టులు= ఇలా; అది= ఆ ఏకాంతికధర్మం; ప్రశస్తంబు+ఐ= ప్రసిద్ధికెక్కి; ఈ+జగములను= ముల్లోకాలలోనూ; కలిగెన్= వెలిసింది; వినుము= విను; ఆ+అగాధధర్మంబు= లోతైన (అంతుచిక్కని) ఆ ఏకాంతికధర్మం; దుష్కృత= పాపాత్ములకు; అప్రాప్యము+అగున్=అందదు.

తాత్పర్యం: ఆ నారదుడు తగిన శిష్యులకు నేర్పాడు. ఇట్లా పరంపరగా ఈ ఏకాంతికధర్మం సకల లోకాలలోనూ ప్రసిద్ధికెక్కింది. అగాధమైన ఈ ధర్మం పాపాత్ములకు మాత్రం అందదు.

క. దాని కహింసయ మూలము । దానన హరి ప్రీతుఁ డగు నతం డన ధరణీ
జానీ! క్షేత్రజ్ఞుం డనఁ । గా నొక్కఁడ యగుట దెలియఁగా వలయుఁ గడున్. 499

ప్రతిపదార్థం: ధరణీజానీ!= (భూమి భార్యగా కలవాడా!) ఓ రాజా!; దానికిన్= ఆ ఏకాంతికధర్మానికి; అహింస+అ= అహింస ఒక్కటే; మూలము= (ఆధారం) మూలం; దానన్+అ= దానితోనే; హరి= విష్ణుమూర్తి; ప్రీతుఁడు+అగున్= సంతుష్టుడు అవుతాడు; అతండు+అనన్= విష్ణుమూర్తి అన్నా; క్షేత్రజ్ఞుండు+అనఁగాన్= క్షేత్రజ్ఞుడు అన్నా; ఒక్కఁడ+అగుట= ఒక్కడే కావటం (ఇద్దరూ అభిన్నం); కడున్= బాగా; తెలియఁగాన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: ఈ ఏకాంతికధర్మానికి అహింస ఒక్కటే మూలం. ఈ ధర్మంతోనే హరి సంప్రీతుడు అవుతాడు. హరి అన్నా క్షేత్రజ్ఞుడన్నా ఒక్కడే అనే విషయం తప్పక గుర్తించాలి.

క. ఏకద్విత్రిచతుర్వ్యూ । హాకారతఁ దోఁచుచుండు హరి భక్తజనా
లోకమున వాసుదేవా । ద్యేకః ప్రాప్తముగఁ దత్తదుచితస్ఫూర్తిన్. 500

ప్రతిపదార్థం: ఏక(వ్యూహ+ఆకారతన్)= ఒక వ్యూహంతోనూ; ద్వి+వ్యూహాకారతన్= రెండు వ్యూహాల ఆకారంతోనూ; త్రివ్యూహాకారతన్= మూడు వ్యూహాల ఆకారంతోనూ; చతుఃవ్యూహాకారతన్= నాలుగు వ్యూహాల ఆకారంతోనూ; హరి= విష్ణుమూర్తి; భక్తజన+ఆలోకమునన్= భక్తులైన జనుల చూపులకు (అంతర్ దృష్టికి); వాసుదేవ+ఆది= వాసుదేవుడూ మొదలైన; ఓకః= నివాసాల (ఉపాధులు); ప్రాప్తముగన్= ప్రాప్తితో (వాసుదేవాది వ్యూహాలను ధరించి అని); తత్తత్= ఆయావాటికి; ఉచిత= తగిన; స్ఫూర్తిన్= ప్రకాశంతో (స్ఫురణతో); తోఁచుచుండున్= దర్శనం ఇస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఒక్కొక్కటీ రెండేసీ మూడేసీ నాలుగేసీ వ్యూహలతో వాసుదేవాది ఉపాధులను (జీవుడికి నివాసం శరీరం కనుక అదే ఉపాధి. దానినే 'ఓకస్' అన్నాడు తిక్కన.) ఉచితరీతిలో స్వీకరించి విష్ణుమూర్తి భక్తుల చూపులకు దర్శనం అనుగ్రహిస్తూ ఉంటాడు. ఏకవ్యూహం ద్వివ్యూహం - అంటూ ఇక్కడ వ్యూహాల సంఖ్య పెరిగినా, ప్రథమవ్యూహం ద్వితీయవ్యూహం ఇత్యాదిగా పరిగణించటమే సంప్రదాయం.

విశేషం: దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది - **"ఏకవ్యూహ విభాగో వా క్వచిద్ ద్వివ్యూహసంజ్ఞితః । త్రివ్యూహశ్చాపి సంఖ్యాతః చతుర్వ్యూహశ్చ దృశ్యతే" (53)** వ్యూహం అనేది ఆధ్యాత్మికంగా ఒక పారిభాషికపదం. అవతార ప్రణాళిక లేదా తత్త్వం అని తేలికగా చెప్పుకొనవచ్చును.

తే. వాసుదేవుండు ప్రథమంబు వసుమతీశ! । యొలి సంకర్షణుండుఁ బ్రద్యుమ్నుఁడును ద్వి
తీయకంబుఁ దృతీయంబుఁ దెల్ల మచ్చ । తుర్థ మనిరుద్ధుఁ డిట్లు చతుర్విధములు. 501

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమీశా! జనమేజయా! ఈ వ్యూహంలో; వాసుదేవుండు= వాసుదేవవ్యూహం; ప్రథమంబు= మొదటిది; ఓలిన్= క్రమంగా; సంకర్షణుండున్= సంకర్షణవ్యూహమూ; ప్రద్యుమ్నుఁడునున్= ప్రద్యుమ్నవ్యూహమూ అనేవి; ద్వితీయకంబున్= రెండవదీ; తృతీయంబున్= మూడవదీను; తెల్లము= స్పష్టం(గా); ఆ+చతుర్థము= నాల్గవది; అనిరుద్ధుఁడు= అనిరుద్ధవ్యూహం; ఇట్లు= ఈ విధంగా; చతుర్విధములు= వ్యూహాలు నాలుగు విధాలు.

తాత్పర్యం: జనమేజయా! వాసుదేవావతారం ప్రథమవ్యూహం. సంకర్షణుడు అనేది ద్వితీయవ్యూహం. ప్రద్యుమ్నుడు -తృతీయవ్యూహం. అనిరుద్ధుడు చతుర్థవ్యూహం. ఇట్లా ఇవి నాలుగు విధాలు.

క. ఈ నెలవులఁ దోఁచును హరి । దా నొక్కఁడ; యింద్రియప్రతతి కందం; డే
కానూనభక్తి కగపడు; । దానికిఁ దపమును శమంబు దమమును వలయున్. 502

ప్రతిపదార్థం: ఈ నెలవులన్= ఈ స్థానాలలో (వ్యూహాలలో - ఉపాధులలో); హరి= విష్ణువు; తోఁచును= కనిపిస్తుంటాడు; తాను+ఒక్కఁడు+అ= అతడు ఒక్కడే; ఇంద్రియ ప్రతతికిన్= ఇంద్రియ సమూహానికి; అందండు= అందడు; ఏక= అద్వితీయమూ; అనూన= అత్యధికమూ అయిన; భక్తికిన్= భక్తికి; అగపడున్= కనపడతాడు; దానికిన్= అటువంటి భక్తికి (అంతటి/భక్తి/కుదరాలంటే); తపమును= తపస్సూ; శమంబున్= అంతరింద్రియ నిగ్రహమూ; దమమునున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; వలయున్= కావాలి.

తాత్పర్యం: మహారాజా! శ్రీమహావిష్ణువు ఈ నాలుగు నెలవులలోనూ దర్శనమిస్తాడు. ఇంద్రియాలకు గోచరుడు కాని దైవం అత డొక్కడే. అద్వితీయమూ అత్యధికమూ అయిన భక్తికి మాత్రమే అతడు కనపడతాడు. అంతటి భక్తి కుదరాలి అంటే తపస్సూ ఇంద్రియ నిగ్రహమూ ఉండాలి.

క. శాంతిపరినిష్ఠునకు నే । కాంతికధర్మంబు గరతలామలక మగుం
జింతాతంతుత్రుటనా । త్యంతవిదగ్ధంబు సూవె యది మనుజేంద్రా! 503

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= మానవనాయకా! (ఇంద్రశబ్దం శ్రేష్ఠతార్థకం కూడా); శాంతిపరినిష్ఠునకున్= శాంతిపట్ల పరినిష్ఠ కుదిరిన వ్యక్తికి (శమగుణ ప్రధానుడికి - లేదా - శాంతిపరినిష్ఠకల వ్యక్తికి); ఏకాంతిక ధర్మంబు= ఈ ఏకాంతిక లక్షణం; కరతల+ఆమలకము= అరచేతిలో ఉసిరిక పండు; అగున్= అవుతుంది (కైవసమై ఉంటుంది - అని); అది= ఆ ఏకాంతికధర్మం అనేది; చింతాతంతు త్రుటనాత్యంత విదగ్ధంబు సూవె - చింతా= దిగుళ్ళు అనే; తంతు= దారాలను; త్రుటనా= తుంపివెయ్యటంలో; అత్యంత= మిక్కిలి; విదగ్ధంబు= (నేర్పు కలది) సమర్థం; చూవె= సుమా!

తాత్పర్యం: మానవేంద్రా! శాంతిపట్ల ప్రగాఢమైన నిష్ఠ కల వ్యక్తికి ఏకాంతికధర్మమనేది కరతలామలకం, అత్యంత సులభం. అది చింతలు అనే దారాలను తెంపివెయ్యటంలో మిక్కిలి సమర్థం సుమా!

క. అనిన నతఁ 'డిట్టి ధర్మముఁ । గొనియాడక వ్రతము లొండు గోరి నడపఁగాఁ
బని యేమి? యెఱింగింపుము । జనముల చందంబు నాకు సంయమివర్యా!' 504

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; అతఁడు= ఆ జనమేజయుడు ఇట్లా అన్నాడు; సంయమివర్యా!= మునీశ్వరా!; ఇట్టి= ఇంతటి ఉత్తమమైన; ధర్మమున్= ఏకాంతికధర్మాన్ని; కొనియాడక= స్వీకరించి ఆచరించకుండా (స్తుతించక); ఒండు వ్రతములు= ఇతర వ్రతాలను (ధర్మాలను); కోరి= కావాలని చేపట్టి; నడపఁగాన్= ఆచరించటానికి; పని+ఏమి?= అవసరం ఏమిటి?; జనముల+చందంబు= ఈ ప్రజల తీరు; నాకున్= నాకు ఎఱింగింపుము= అర్థమయ్యేటట్టు చెప్పుము.

తాత్పర్యం: 'వైశంపాయనా! ఇంత గొప్పదయిన ఈ ఏకాంతిక ధర్మాన్ని ఆచరించకుండా ఇతర వ్రతాలు ఏవేవో చేపట్టవలసిన అవసరం ఏముంది అసలు? ప్రజలు ఇట్లా ఎందుకు చేస్తున్నారు? వీరి తీరు ఏమిటో నాకు కొంచెం తెలియజెప్పుము.'

క. అని యడిగిన వైశంపా । యనుఁ డతనికి నిట్టు లనియె 'నది గల దధిపా!
విను సాత్త్వికమును రాజస । మును దామసమును వికారములు మానసముల్. 505

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడిగేసరికి; వైశంపాయనుఁడు= వైశంపాయన మహర్షి; అతనికిన్= ఆ జనమేజయుడికి; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; అధిపా!= జనమేజయా!; అది= అటువంటిది; కలదు= ఉంది; వినుము= ఆలకించుము; సాత్త్వికమును= సాత్త్వికమూ; రాజసమును= రాజసమూ; తామసమును= తామసమూ అనే; వికారములు= వికృతులు; మానసముల్= మనస్సుకు సంబంధించినవి.

తాత్పర్యం: జనమేజయుడు ఇట్లా అడిగేసరికి వైశంపాయనుడు వివరిస్తున్నాడు. 'ఓ రాజా! సాత్త్వికం, రాజసం, తామసం అని మనోవికారాలు మూడురకాలు.

తే. వికృతు లందును సత్త్వస్థ విధము మేలు । దాన హరిఁ బొందవచ్చు నతండు నడపుఁ
దత్ప్రకారుల కుశలంపుఁ దంత్ర మెల్ల । వార లేకాంతికులు పెఱవారి వినుము. 506

ప్రతిపదార్థం: వికృతులందునున్= ఈ మనోవికారాలలో; సత్త్వస్థ+విధము= సాత్త్వికవికారం పద్ధతి; మేలు= ఉత్తమం; దానన్= దానితో; హరిన్= విష్ణువును; పొందవచ్చున్= పొందవచ్చు; తద్+ప్రకారుల= ఆ సాత్త్వికుల; కుశలంపున్+తంత్రము+ఎల్లన్= యోగక్షేమాల కార్యక్రమమంతా; అతండు= ఆ విష్ణువే; నడపున్= నడిపిస్తాడు (చూచుకుంటాడు); వారలు= ఆ సత్త్వనిష్ఠకలవారే; ఏకాంతికులు= ఏకాంతికులంటేను (ఏకాగ్రచిత్తులు-అద్వితీయులు); పెఱవారిన్= తక్కినవారిని గురించి; వినుము= వినుము.

తాత్పర్యం: పైన చెప్పిన మూడు మనోవికారాలలోనూ సాత్త్వికం ఉత్తమం. అది కలవారి యోగక్షేమాలన్నీ ఆ విష్ణువే చూచుకొంటాడు. వారే ఏకాంతికు లంటేను. ఇంక మిగతావారిని గురించి చెప్పుతాను ఆలకించుము.

క. కలగొన రాజసతామస । ము లయిన భావములు వికృతిఁ బొందింపఁగ మ
ర్త్యుల కేకాంతికవృత్తిని । నెలకొనఁగా నెట్లువచ్చు? నిర్మలధిషణా! 507

ప్రతిపదార్థం: నిర్మలధిషణా!= నిర్మలమైన బుద్ధికలవాడా!; కలగొనన్= క్రమ్ముకొనేట్టు (కలపు+కొను= కలగొను= వ్యాపించు; క్రమ్ము. కలఁక+కొను= కలగొను= క్షోభించు, వ్యాకులపడు); రాజసతామసములు+అయిన+భావములు= రాజసములయిన భావాలూ తామసములయిన భావాలూ; వికృతిన్+పొందింపఁగన్= వికారాన్ని కలిగిస్తూంటే; మర్త్యులకున్= మానవులకు; ఏకాంతికవృత్తిని= ఏకాంతికవ్రతదీక్షతో; నెలకొనఁగాన్= ఉండటం; ఎట్లు వచ్చున్?= ఎట్లా కుదురుతుంది?

తాత్పర్యం: మలినరహితమైన హృదయం కలవాడా! జనమేజయా! పరస్పరం ఆవరించి రాజసతామసభావాలు మానవుల హృదయాలను వికారపరుస్తూంటే వారు ఏకాంతికధర్మాన్ని అవలంబించటం ఎట్లా సాధ్యపడుతుంది?

క. వారికిఁ బ్రవృత్తి లక్షణ । తారూఢంబైన ధర్మ మలవడు హరికిం
గారుణ్య పాత్రములు గా । రారయ వా రన్యపథసమాశ్రితు లగుటన్. 508

ప్రతిపదార్థం: వారికిన్= అటువంటి వారికి; ప్రవృత్తి లక్షణతా= సంసారంలో ప్రవర్తించే లక్షణంతో (నివృత్తి లక్షణం కానిది); ఆరూఢంబైన= స్థిరపడిన; ధర్మము= మార్గం (వ్రతం); అలవడున్= అలవడుతుంది; (నివృత్తిధర్మం అలవడదు-అని); ఆరయన్= చూడగా; వారు= అటువంటివారు; అన్యపథ= వేరేమార్గాలను; సమాశ్రితులు+అగుటన్= ఆశ్రయించినవారు కావటంవలన; హరికిన్= విష్ణుమూర్తికి; కారుణ్యపాత్రములు= దయాపాత్రులు; కారు= కాలేరు.

తాత్పర్యం: రాజసతామసగుణాలు కలవారికి ప్రవృత్తి లక్షణమే అలవడుతుంది కాని నివృత్తి లక్షణమైన ఏకాంతికధర్మం అలవడదు. అన్యమార్గాలను అవలంబించారు కాబట్టి వారు హరికి దయాపాత్రులుకూడా కాలేరు.

క. ఏకాంతికజనంబులు సు । శ్లోకుండగు హరిమనంబులో నుండుదు రా
లోకింప వారి కతనికి । నేకత్వము గలదు దెల్లమిది వేదములన్. 509

ప్రతిపదార్థం: ఏకాంతికజనంబులు= ఏకాంతికధర్మాన్ని అనుష్ఠించేనరులు (అద్వితీయులు); సుశ్లోకుండు+అగు= స్తుతిపాత్రుడైన; హరి= విష్ణుమూర్తియొక్క; మనంబులోన్= హృదయంలో; ఉండుదురు= ఉంటారు; ఆలోకింపన్= చూడగా; వారికిన్= వారికీ; అతనికిన్= హరికీ; ఏకత్వము+కలదు= అభేదముంది; ఇది= ఈ విషయం; వేదములన్= వేదాలలో; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: ఏకాంతిక ధర్మాన్ని అనుష్ఠించే ఉత్తములు ఎప్పుడూ విష్ణుమూర్తి మనస్సులోనే ఉంటారు. నిజానికి వారికీ హరికీ అభేదమే. ఇదే చెప్పుతున్నాయి వేదాలు.

క. ఈ తెరువు మద్గురుఁడు సం । ప్రీతిని దయ నన్ను నాదరించుచుఁ జెప్పెం
జేతశ్శుద్ధికలనమెయి । వీతదురితమైన భంగి విన్నది యధిపా! 510

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయా!; ఈ తెరువు= ఈ మార్గం; మద్గురుఁడు= మా గురువుగారు వ్యాసమునీంద్రుడు; సంప్రీతిని= ప్రేమతో; దయన్= దయతో; నన్నున్= నన్ను; ఆదరించుచున్= ఆదరిస్తూ; చెప్పెన్= ఉపదేశించాడు; చేతఃశుద్ధి= మనశ్శుద్ధి; కలనమెయిన్= ఉండటంతో; వీత= పోగొట్టబడిన; దురితము+ఐన భంగిన్= పాపాలు కలదయ్యేట్టు; విన్నది= నేను విన్నది - ఈ తెరువు (నాకు చేతశ్శుద్ధికలనమెయిన్ ఉండటంచేత, మద్గురుఁడు చెప్పెన్ అని కూడా అన్వయించవచ్చును).

తాత్పర్యం: మా గురువుగారు నామీద ప్రేమతో దయతో నాకు ఈ మార్గం ఉపదేశించారు. నాకు అంతశ్శుద్ధి ఉన్నది కనుక ఉపదేశించారు. నేను కూడా పాపాలు అన్నీ పోగొట్టుకొనగలిగిన పద్ధతిలో దీనిని విన్నాను. ఇది వినటంతో ఆచరించటంతో పాపాలు తొలగిపోయి పవిత్రుడను అయ్యాను.

క. చాలిన నీవును హరి ని । ట్లాలోకింపుము నిరంతరానందశ్రీ
శాలివగు దనిన నా భూ । పాలోత్తముఁ డా తపస్విపతి కిట్లనియెన్. 511

ప్రతిపదార్థం: చాలినన్= సమర్థుడవైతే - లేదా - ఇష్టపడితే; నీవునున్= నీవుకూడా; హరిన్= విష్ణుమూర్తిని; ఇట్లు+ఆలోకింపుము= ఇలా దర్శించుము (ఈమార్గంలో చూడుము); నిరంతర= ఎడతెరిపిలేని; ఆనంద+శ్రీశాలివి= ఆనందమనే భాగ్యం కలవాడివి (ఆనందభాగ్యశాలివి); అగుదు(వు)= అవుతావు; అనినన్= అని చెప్పగా; ఆ+భూపాల+ఉత్తముఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; ఆ+తపస్విపతికిన్= ఆ మునీశ్వరునికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: రాజా! ఇష్టపడితే, నియమాలను పాటించగలను అనుకొంటే నీవుకూడా ఏకాంతికధర్మాన్ని ఆచరించి ఈ మార్గంలో హరిని దర్శించుము. ఎడతెరిపి లేని నిజమైన ఆనందం అనే సౌభాగ్యాన్ని (ఆనందశోభను) పొందగలుగుతావు' అనేసరికి వైశంపాయనుడితో జనమేజయుడు ఇట్లా అంటున్నాడు మళ్ళీ.

తే. ' వేదములు సాంఖ్యమును యోగవిధియుఁ బాశు । పతముఁ బాంచరాత్రంబు నా బహువిధములఁ
జెల్లు బోధసాధనముల కెల్ల నిష్ఠ । యొక్కటియొ? యివి భిన్ననిష్ఠోదితములొ? 512

ప్రతిపదార్థం: వైశంపాయనా! వేదములున్= వేదాలూ; సాంఖ్యమునున్= సాంఖ్యమూ; యోగవిధియున్= యోగశాస్త్రమూ; పాశుపతమున్= పాశుపతమూ; పాంచరాత్రంబున్= పాంచరాత్రమూ; నాన్= అని; బహువిధములన్= పలు రకాలుగా; చెల్లు= ఒప్పుతున్న; బోధసాధనములకున్+ఎల్లన్= జ్ఞానమార్గాలకు అన్నింటికీ (సాధనం= ఉపకరణం); నిష్ఠ= (శ్రద్ధ) ఆశ్రయం; ఒక్కటియొ?= ఒకటేనా?; ఇవి= ఇవన్నీ; భిన్ననిష్ఠా+ఉదితములొ?= వేరువేరు ఆధారాలనుండి ఆవిర్భవించాయా?

తాత్పర్యం: మహర్షీ! వేదాలనీ, సాంఖ్యమనీ, యోగశాస్త్రమనీ, పాశుపతమనీ, పాంచరాత్రమనీ ఇట్లా రకరకాలుగా ఉన్నాయి జ్ఞానాన్ని ఇచ్చే మార్గాలు. వీటికి అన్నింటికీ నిష్ఠ అనేది ఒకటేనా? లేకపోతే దేనికదిదే విభిన్న నిష్ఠలూ ఆశ్రయాలూ ఉన్నాయా?

వ. నా కెఱింగింపవే వీనికిఁ బ్రవర్తకు లెవ్వరు? వారలం జెప్పు'మని యడిగిన జనమేజయునకు వైశంపాయనుండు. 513

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఎఱింగింపవే?= తెలియజేయవా?; వీనికిన్= ఈ విభిన్న సాధనాలకు (మార్గాలకు); ప్రవర్తకుల్= (ఆదిలో కర్తలై అమలు జరిపినవారు) ఉపదేశకులు; ఎవ్వరు= ఎవరు?; వారలన్= వారిని గురించి; చెప్పుము= తెలియజెప్పుము; అని= అని; అడిగిన= అడిగినటువంటి; జనమేజయునకున్= జనమేజయుడికి; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి (ఇట్లా చెబుతున్నాడు).

తాత్పర్యం: వీటి ప్రవర్తకు లెవరు? ఈ వివరాలు నాకు తెలియజెప్పవలసినది' అని జనమేజయుడు అడుగగా తిరిగి వైశంపాయనుడు చెప్పుతున్నాడు.

ఉ. ద్వీపమునం బ్రబోధపరిదీప్తుని వేదనిధానమున్ జగ
ద్వ్యాపకతేజు గంధవతియందుఁ బరాశరసంయమీశ్వరుం
డే పురుషోత్తముం బడసి యీడ్యతమోన్నతి నొందె లోకశి
క్షాపరు భారతాధ్యయన కారకుఁ గొల్చెద నమ్మహాత్మునిన్. 514

ప్రతిపదార్థం: ద్వీపమునన్= కృష్ణద్వీపంలో; ప్రబోధ= జ్ఞానంతో; పరిదీప్తునిన్= ప్రకాశించినవాడూ; వేద= వేదాలకు; నిధానమున్= నిధి అయినవాడూ (ఆకరమైనవాడూ); జగత్= ప్రపంచమంతటా; వ్యాపక= విస్తరించే; తేజున్= తేజస్సుకలవాడూ; (మరియు) పరాశర= పరాశరుడు అనే; సంయమీశ్వరుఁడు= ఋషీశ్వరుడు; ఏ పురుషోత్తమున్= ఏ ఉత్తమ మానవుడినీ; గంధవతియందున్= మత్స్యగంధియందు (సత్యవతియందు); పడసి= పుత్రుడుగా పొంది; ఈడ్యతమ= మిక్కిలి స్తుతించదగిన; ఉన్నతిన్= ఔన్నత్యాన్ని (గౌరవాన్ని); ఒందెన్= పొందాడో; లోక= ప్రపంచానికి (ప్రజలకు); శిక్షా= విద్యనేర్పటంలో; పరున్= ఆసక్తి కలవాడూ; భారత+అధ్యయన+కారకున్= భారత అధ్యయనానికి హేతువైనవాడూ (మాకు భారతం రచించి నేర్పినవాడు) అయిన; ఆ+మహాత్మునిన్= మహానుభావుడైన ఆ వ్యాసుడిని; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: రాజా! ముందుగా వ్యాసమహర్షికి నమస్కరిస్తున్నాను. ఆయన కృష్ణద్వీపంలో పరాశరుడికీ మత్స్యగంధికీ జన్మించి జ్ఞానతేజస్సుతో ప్రకాశిస్తున్నవాడు. ప్రపంచమంతటా ఆయన తేజస్సు వ్యాపించింది. ఆయన వేదాలకు నిధి. ఆయనను పుత్రుడుగా పొందటంవలన పరాశరుడికి లోకోన్నత ఖ్యాతి కలిగింది. ఆయనే లోకాల కన్నింటికీ ఉపదేశకుడు. భారతాధ్యయనానికి సృష్టికర్త.

వ. అనుచుం గృష్ణద్వైపాయనధ్యానపరాయణుం డగుచుం బలికి యా భూవిభున కభిముఖుండై. 515

ప్రతిపదార్థం: అనుచున్= అని; కృష్ణద్వైపాయన+ధ్యాన+పరాయణుండు+అగుచున్= వ్యాసుడిని తత్పరతతో ధ్యానిస్తూ; పలికి= మాట్లాడి; ఆ+భూవిభునకున్= ఆ జనమేజయ మహారాజుకు; అభిముఖుండై= ముఖాముఖిగా కూర్చుని.

తాత్పర్యం: ఇట్లా వ్యాసుడిని ధ్యానించుకొని, రాజైన జనమేజయుడికి ఎదురుగా కూర్చొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుము మీ తంత్రంబుల కె । ల్లను నరయ బరాయణం బలఘుతరసంవి
త్తనుఁడగు నారాయణుఁడ, య । తనిఁ బొందఁగ ఋజువులగు పథములివి యధిపా! 516

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వినుము; ఈ+తంత్రంబులకున్+ఎల్లను= ఈ శాస్త్రాలకు అన్నింటికీ; అరయన్= పరిశీలించి చూసినట్టయితే; అలఘుతర= మిక్కిలి గొప్పదయిన; సంవిత్+తనుఁడు+అగు= జ్ఞానమే శరీరంగా (రూపంగా) కలవాడైన; నారాయణుఁడు+అ= నారాయణుడే; పరాయణంబు= ఆశ్రయం (గమ్యం); అతనిన్= ఆ శ్రీమన్నారాయణుడిని; పొందఁగన్= చేరటానికి; ఇవి= ఈ తంత్రాలన్నీ; ఋజువులు+అగు= తిన్ననైన; పథములు= మార్గాలు.

తాత్పర్యం: రాజా! వేదసాంఖ్యాదిశాస్త్రాలక న్నింటికీ పరమగమ్యం, ఆశ్రయం శ్రీమన్నారాయణుడే. ఆయన జ్ఞానస్వరూపుడు. ఆయనను అందుకొనటానికి ఈ శాస్త్రాలు ఋజుమార్గాలు. (ఇక్కడికి నిష్ఠనుగురించి ప్రథమభాగానికి సమాధానం అయ్యింది).

వ. వేదంబులకుం బ్రవర్తకుండు నారాయణనందనుం డపాంతరతముం డనుపేరం బ్రసిద్ధుండగు వేదవ్యాసుండు, సాంఖ్యంబునకుం గపిలుండును, యోగంబునకు హిరణ్యగర్భుండును, బాశుపతంబునకు శివుండును బాంచరాత్రంబునకు విష్ణుండును బ్రవర్తకులు. పాంచరాత్రంబు వైష్ణవం బనం బరఁగు' ననిన విని యజ్జనపతి యమ్మునిపతితో 'వేదవ్యాసుండు పరాశరపుత్రుండని చెప్పి తప్పరమమునికి నారాయణనందనత్వం బెట్లు వచ్చె? ననుటయు నతం డతని కిట్లనియె. 517

ప్రతిపదార్థం: (ఇంక ప్రవర్తకులను గురించిన రెండవభాగానికి సమాధానం చెబుతున్నాడు) వేదంబులకున్= వేదాలకు; ప్రవర్తకుండు= ఉపదేశకుడు; నారాయణనందనుండు= శ్రీమన్నారాయణుని పుత్రుడూ; అపాంతరతముండు= అపాంతరతముడు; అనుపేరన్= అనే పేరుతో; ప్రసిద్ధుండు= విఖ్యాతుడూ; అగు= అయిన; వేదవ్యాసుండు= వేదవ్యాసుడే; సాంఖ్యంబునకున్= సాంఖ్యశాస్త్రానికి; కపిలుండును= కపిలుడూ; యోగంబునకున్= యోగశాస్త్రానికి; హిరణ్యగర్భుండునున్= బ్రహ్మదేవుడూ; పాశుపతంబునకున్= పాశుపతానికి; శివుండునున్= శివుడూ; పాంచరాత్రంబునకున్= పాంచరాత్రానికి; విష్ణుండునున్= విష్ణువూ; ప్రవర్తకులు= ఉపదేశకులు; పాంచరాత్రంబు= ఈ పాంచరాత్రమే; వైష్ణవంబు+అనన్+పరఁగున్= వైష్ణవమనీ పిలవబడుతుంది; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ నరేంద్రుడు; ఆ+మునిపతితోన్= ఆ మునీంద్రుడితో; వేదవ్యాసుండు; పరాశరపుత్రుండు+అని= పరాశరమహర్షికి కుమారుడు అని; చెప్పితి(వి)= చెప్పావు; ఆ+పరమమునికిన్= ఆ వ్యాసమహర్షికి; నారాయణనందనత్వంబు= నారాయణుడికి పుత్రుడు కావటం అనేది; ఎట్లు= ఏ విధంగా; వచ్చెన్?= సిద్ధించింది?; అనుటయున్= అని అడిగేసరికి; అతండు= ఆ వైశంపాయనుడు; అతనికిన్= ఆ జనమేజయునికి; ఇట్లు+అనియెన్= ఇట్లా బదులు పలికాడు.

తాత్పర్యం: వేదాలకు ఉపదేశకుడు అపాంతరతముడనే పేరుకల వేదవ్యాసుడు. సాంఖ్యానికి కపిలుడు, యోగానికి హిరణ్యగర్భుడు, పాశుపతానికి శివుడు, పాంచరాత్రానికి విష్ణువూ ప్రవర్తకులు. పాంచరాత్రం వైష్ణవం అనబడుతుంది' అనగా విని ఆ రాజు ఆ మునితో 'వేదవ్యాసుడు పరాశరుడి కుమారు డని చెప్పావు; ఆ మునిశ్రేష్ఠుడిని నారాయణ పుత్రుడు అనే మాట ఎట్లా కలిగింది?' అని అనగా వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా బదులు చెప్పాడు.

సీ. హిమవన్నగంబు పాదమున మహాభార । తం బొనర్చి పరిశ్రమంబు దోఁప
భావించి శిష్యులు గావించు పరిచర్యఁ । దద్వినోదనపరత్వమున నొంది
వారికి వేదార్ధభారతార్థంబులు । సాత్యవతేయుండు సదయబుద్ధి
నెఱిఁగించు చున్నట్టియెడ నేను లోనుగాఁ । గొందఱు దత్పాదవందనంబు

తే. భక్తిఁ జేసి నారాయణప్రభవుఁ డండ్రు । నిన్నుఁ గృపఁ జెప్పవే మాకు నిర్మలాత్మ!
యత్తెఱం గని యడిగిన నమ్మహాను । భావుఁ డత్యంతకరుణా ర్ద్రభావుఁ డగుచు. 518

ప్రతిపదార్థం: హిమవత్+నగంబు= హిమవత్పర్వతంయొక్క; పాదమునన్= సమీపంలో (ప్రత్యంత పర్వతంమీద. (పెద్దపర్వతానికి చుట్టూ ఉండే చిన్నపర్వతాలను ప్రత్యంత పర్వతాలనీ పాదపర్వతాలనీ అంటారు); మహాభారతంబు+ఒనర్చి= మహాభారతరచన పూర్తిచేసి; పరిశ్రమంబు= అలసట; తోఁపన్= కనిపించగా; భావించి= గుర్తించి; శిష్యులు= ఛాత్రులు; కావించు= చేసిన; పరిచర్యన్= సేవకు; తద్= ఆ శిష్యులను; వినోదనపరత్వమునన్+ఉండి(ఒంది)= ఆనందింపజేస్తూ ఉండి (ఆనందపరచటం మొదలుపెట్టి); వారికిన్= శిష్యులకు; వేదార్థ= వేదార్థమూ; భారతార్థంబులు= భారతార్థమూ; సదయబుద్ధిన్= కరుణ కలిగిన మనస్సుతో; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఎఱిఁగించుచున్నట్టి ఎడన్= నేర్పుతున్న సమయంలో; నేను లోనుగాన్= నేను మొదలుగా; కొందఱు= కొందరు శిష్యులం; తద్+పాద+వందనంబు= వ్యాసుడి పాదాలకు నమస్కారం; భక్తిన్= భక్తితో; చేసి= చేసి; నిర్మలాత్మ!= పవిత్రమనస్వీ!; నిన్నున్= నిన్ను; నారాయణప్రభవుఁడు+అండ్రు= నారాయణాత్మజుడు అంటారు; ఆ+తెఱంగు= (అది ఎట్లా వచ్చిందో) ఆ తీరు; మాకున్= మాకు; కృపన్= దయతో; చెప్పవే?= తెలియజేయవా?; అని= అని; అడిగినన్= ప్రార్థించేసరికి; ఆ+మహానుభావుఁడు= ఆ మహాత్ముడు-వ్యాసుడు; అత్యంత= మిక్కిలి; కరుణా+ఆర్ద్ర+భావుఁడు+అగుచున్= దయతో చెమ్మగిల్లిన హృదయం కలవాడు అవుతూ -

తాత్పర్యం: వ్యాసమునీంద్రుడు హిమాలయాలలో భారతరచన పూర్తిచేసి అలసిపోయి ఉన్న సమయంలో మేమంతా ఆయనకు పరిచర్యలు చేశాము. దానికి ఆయన సంతోషించి, మమ్ములను వినోదింపజేయటానికి వేదార్థమూ భారతార్థమూ చెప్పుతూ వచ్చాడు. ఆ సమయంలోనే మేము కొందరం ఆయనకు సాష్టాంగపడి, 'గురుదేవా! నారాయణాత్మజుడు అని నిన్ను పెద్దలు చెప్పుతుంటారు. అది ఎట్లా? తెలియజేయవా?' అని ప్రార్థించాము. అప్పుడు వ్యాసుడు దయబూని. (తరువాతి వచనంతో అన్వయం).

వ. మాతోడ నిట్లనియె. 519

ప్రతిపదార్థం: మాతోడన్= మాతో; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మాతో ఈ విధంగా అన్నాడు.

వేదవ్యాసునకు నారాయణనందనత్వంబు గలిగిన ప్రకారము (సం. 12-336-24)

సీ. ఆదికాలమునఁ బ్రజాభిసర్గమునకు । నారాయణుఁడు నిజనాభిపద్మ
మున బ్రహ్మఁ గల్పింప భూతసంఘమ్ముల । నెల్ల నాతఁడు సృజియించె నతని
ముఖమున బహువేదములు ప్రసరింపఁగఁ । జేసి వానికి మేలుసేఁత బుద్ధిఁ
దలఁచి యవ్విష్ణుండు నలఘుబోధుని నపాం । తరతముం డనియెడు తనయుఁ జిత్త

తే. మునన కల్పించి యతిభక్తి మ్రొక్కి నిలిచి । యున్న యక్కుమారుని శ్రుతు లన్నియును ధృ
ఢావధానుండవై విని నీవు వాని । నంచితవ్యాస మొందింపు మనియెఁ బ్రీతి. 520

ప్రతిపదార్థం: ఆదికాలమునన్= సృష్టికన్నా ముందరికాలంలో; నారాయణుఁడు= శ్రీమహావిష్ణువు; ప్రజా+అభిసర్గమునకున్= జీవ సృష్టికోసమని; నిజ= తనయొక్క; నాభి= పొక్కిలినుంచి వికసించిన; పద్మమునన్= పద్మంలో; బ్రహ్మన్= బ్రహ్మదేవుడిని; కల్పింపన్= ఉత్పాదించగా; ఆతఁడు= ఆ బ్రహ్మదేవుడు; భూతసంఘములన్+ఎల్లన్= ప్రాణికోటినంతటినీ; సృజియించెన్= సృష్టించాడు; అతని ముఖమునన్= ఆ బ్రహ్మదేవుని ముఖంనుంచి; బహువేదములు= అనేక వేదాలు; ప్రసరింపఁగన్+చేసి= ప్రసారం అయ్యేట్టు తానే చేసి; వానికిన్= ఆ వేదాలకు; మేలుచేఁతన్= మేలు చెయ్యటం అనే విషయాన్నికూడా; బుద్ధిన్= బుద్ధిలో; తలఁచి= ఆలోచించి; ఆ+విష్ణుండు= ఆ శ్రీమన్నారాయణుడు; అలఘు= గొప్పదైన; బోధునిన్= జ్ఞానం కలవాడూ; అపాంతరతముండు+అనియెడు= అపాంతరతముడు అనే పేరున్నవాడూ అయిన - తనయున్= కుమారుడిని; చిత్తమునన్+అ= మనస్సులోనే; కల్పించి= సృష్టించి; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; మ్రొక్కి నిలిచియున్న= నమస్కరిస్తూ నిలబడ్డ; ఆ+కుమారునిన్= ఆ తనయుడిని; దృఢ= గాఢమైన; అవధానుండవు+ఐ= ఏకాగ్రత కలవాడవై; శ్రుతులు+అన్నియును= వేదాలు అన్నీ; విని= ఆలకించి; నీవు= నీవు; వానిన్= ఆ వేదాలను; అంచితవ్యాసమున్= అందమైన విభజనను (వ్యాసము= విడమరిచినది); ఒందింపుము= పొందించుము; అనియెన్+ప్రీతిన్= అని ప్రేమతో ఆజ్ఞాపించాడు - చెప్పాడు.

తాత్పర్యం: ఆదికాలంలో శ్రీమన్నారాయణుడు ప్రజాసృష్టి చేయటంకొరకని తన నాభికమలంనుండి బ్రహ్మను సృష్టించాడు. ఆయన సకలభూతాలనూ సృష్టించాడు. బ్రహ్మదేవుడి ముఖంనుండి వేదాలు ప్రసరించేటట్లు చేశాడు. ఆ వేదాలకు మేలు చేయటంకొరకని ఒక మహాజ్ఞానిని పుత్రుడుగా పొందాడు. ఆయన పేరే అపాంతరతముడు. ఆ కుమారుడు తండ్రికి భక్తితో నమస్కరించి నిలబడ్డాడు. 'నాయనా! ఏకాగ్రతతో వేదాలను అధ్యయనం చేయుము. వాటిని అందంగా విభజించుము' అన్నాడు.

ఆ. అనిన నట్లకాక యని యయ్యపాంతర । తముఁడు వేదభేదనము నొనర్చె
దాని కవ్విభుండు దద్దయుఁ బ్రీతుఁడై । వత్సలత్వ గౌరవం బెలర్ప. 521

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీమన్నారాయణుడు చెప్పగానే; అట్లు+అ+కాక= అట్లాగే; అని; ఆ+అపాంతరముఁడు= ఆ అపాంతరముడు; వేదభేదనమున్= వేదాల విభజనను (వేదాలను నాలుగుగా); ఒనర్చెన్= చేశాడు; దానికిన్= ఆ విభాగానికి; ఆ+విభుండు= ఆ శ్రీమన్నారాయణుడు; తద్దయున్= మిక్కిలి; ప్రీతుఁడై= సంతోషించి; వత్సలత్వగౌరవంబు= వాత్సల్యాతిశయం (వాత్సల్యరూపమైన గౌరవం); ఎలర్పన్= వికసింపగా.

తాత్పర్యం: శ్రీమన్నారాయణుడి ఆజ్ఞను స్వీకరించి, అపాంతరతముడు వేదాలను అధ్యయనం చేసి, వాటిని నాలుగుగా విభజించాడు. దానికి నారాయణుడు చాలా సంతోషించి వాత్సల్యంతో ఇట్లా అన్నాడు.

క. వేదవ్యాసుఁడ! రమ్మని । యాదరమునఁ బిలిచి నాకు నాత్మజుఁడై సం
పాదించువాఁడ వధికా । హ్లాదము మన్వంతరంబు లన్నిటియందున్. 522

ప్రతిపదార్థం: వేదవ్యాసుఁడ= ఓ వేదవ్యాసుడా!; రమ్ము= ఇట్లా రావయ్యా!; అని= అంటూ; ఆదరమునన్= ఆదరంతో; పిలిచి= ఆహ్వానించి; నాకున్= నాకు; ఆత్మజుఁడై= కుమారుడవై; మన్వంతరంబులు+అన్నిటియందున్= అన్ని మన్వంతరాలలోనూ (కల్పాలలోనూ); అధిక+ఆహ్లాదము= మిక్కిలి ఆనందం; సంపాదించువాఁడవు= పొందుతావు.

తాత్పర్యం: 'ఓ వేదవ్యాసుడా! రమ్ము. నాకు పుత్రుడవై నీవు అన్ని మన్వంతరాలలోనూ అత్యధికంగా ఆహ్లాదించుము.'

క. అని యానతిచ్చి మఱియును । జననంబులు నీకుఁ గల్గు సంయమిమాన్యా!
యనియుఁ బలికి వెండియు ని । ట్లనియెను విష్ణుండు పేర్చు నర్మిలితోడన్. 523

ప్రతిపదార్థం: అని=అంటూ; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞాపించి; సంయమిమాన్యా!= మునీశ్వరా!, వేదవ్యాసా!; మఱియునున్= ఇంకా; జననంబులు= జన్మలు; నీకున్= నీకు; కల్గున్= లభిస్తాయి; అనియున్= అనికూడా; పలికి= చెప్పి; వెండియున్= మళ్ళీ; విష్ణుండు= ఆ నారాయణుడు; పేర్చు+నర్మిలితోడన్= అతిశయించే ప్రేమతో; ఇట్లు= ఈ విధంగా; అనియెను= అన్నాడు.

తాత్పర్యం: అని ఆనతిచ్చిన విష్ణుమూర్తి వేదవ్యాసుడికి ఇంకా మరికొన్ని జన్మలు లభిస్తాయని చెప్పాడు. ఇంకా ప్రేమతో ఇట్లా అన్నాడు.

క. 'నా చరితంబులుఁ ద్రైలో । క్యాచరణంబులును ధర్మ మఖిలంబు మదిం
జూచి త్రికాలజ్ఞత్వస । మీచీనత వెలయు - మునులు మేటి యనంగన్. 524

ప్రతిపదార్థం: మునులు= మహర్షులు; మేటి+అనంగన్= గొప్పవాడు - అని నిన్ను పొగడేటట్టు; నా+చరితంబులున్= నా కథలూ; త్రైలోక్య= ముల్లోకాలకూ; ఆచరణంబులునున్= ఆచరించదగిన అంశాలూ; అఖిలంబు= సమస్తమైన; ధర్మము= ధర్మమూ; మదిన్= అంతరంగంలో; చూచి= దర్శించి; త్రికాలజ్ఞత్వ= భూతభవిష్యద్వర్తమానాలను తెలియటం అనే; సమీచీనతన్= సామంజస్యంతో, వెలయు(ము)= విరాజిల్లుము.

తాత్పర్యం: 'నా కథలూ, ముల్లోకాలూ ఆచరించవలసిన అంశాలూ, అఖిలధర్మాలూ మనస్సులో దర్శించి త్రికాలజ్ఞుడవై మహర్షులలోకెల్లా ఉత్తముడవుగా విరాజిల్లుము నాయనా!

క. ఉత్తరకాలంబున లో । కోత్తరుఁడు వసిష్ఠపౌత్రుఁ డుదితజ్ఞానో
దాత్తుఁడు పరాశరుండను । నుత్తమసంయమికిఁ బుట్టు దుజ్జ్వలతేజా! 525

ప్రతిపదార్థం: ఉజ్జ్వలతేజా!= అధికంగా ప్రకాశించే తేజస్సుకలవాడా!; ఉత్తరకాలంబునన్= భవిష్యత్కాలంలో; లోక+ఉత్తరుఁడు= లోకంలో ఉత్తమోత్తముడూ; వసిష్ఠపౌత్రుఁడూ= వసిష్ఠమహర్షికి మనుమడూ (పౌత్రుడు= పుత్రుని పుత్రుడు); ఉదిత= ఆవిర్భవించిన; జ్ఞాన= జ్ఞానంతో; ఉదాత్తుఁడు= గొప్పవాడూ; పరాశరుండు+అను= పరాశరుడనే; ఉత్తమసంయమికిన్= గొప్ప మహర్షికి; పుట్టుదు(వు)= కుమారుడుగా జన్మిస్తావు.

తాత్పర్యం: ఓ వేదవ్యాసా! భవిష్యత్కాలంలో నీవు పరాశరుడికి పుత్రుడుగా జన్మిస్తావు. ఆ పరాశరుడు లోకోత్తరుడు. జ్ఞాని. వసిష్ఠుడికి మనుమడు. ఆయనకు నీవు పుత్రుడుగా జన్మిస్తావు.

క. నీ వలనన కలిగి కురు । క్ష్మావలయం బేలునట్టి జనపతు లన్యో
న్యావిష్టరోషులై రణ । సేవనమునఁ గులము తఱచు సెఱుతురు వత్సా! 526

ప్రతిపదార్థం: వత్సా!= తనయుడా! (అపాంతరతమా! వ్యాసా!); నీవలనన్+అ= నీవల్లనే; కలిగి= జన్మించి; కురుక్ష్మావలయంబు= కురు సామ్రాజ్యాన్ని; ఏలునట్టి= పరిపాలించే; జనపతులు= రాజులు (కౌరవపాండవులు); అన్యోన్య= పరస్పరం; ఆవిష్ట= ఏర్పడ్డ (నాటుకొన్న); రోషులై= రోసం కలవారై; రణసేవనమునన్= యుద్ధాన్ని ఆశ్రయించటంతో (ఆచరించటంతో); కులము+తఱచున్= వంశపు ఆధిక్యాన్ని; చెఱుతురు= నాశనం చేస్తారు.

తాత్పర్యం: నాయనా! అపాంతరతమా! నీవలన జన్మించినవాళ్ళే కురుసామ్రాజ్యాన్ని పరిపాలిస్తారు. ఆ రాజులకు పరస్పరం రోషాలు పెరుగుతాయి. యుద్ధానికి దిగుతారు. వంశవినాశనం అవుతుంది.

తే. కాలముల కీడు కతమునఁ గలఁగఁ బడిన । వేదముల నీవు నాఁడును విమలబుద్ధి
నంచితవ్యాస మొందించి యఖిల దివిజ । మునిగణముల కొనర్తు సమ్మోద మనఘ! 527

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; కాలముల= కాలాలు గలిగించిన; కీడుకతమునన్= కీడు కారణంగా; కలఁగఁబడిన= కలగాపులగం అయిపోయిన; వేదములన్= వేదాలను; నీవు= నీవు; నాఁడునున్= అప్పుడు కూడా మళ్ళీ; విమలబుద్ధిన్= నిర్మలమైన బుద్ధితో; అంచితవ్యాసము= అందంగా విభజనం; ఒందించి= చేసి; అఖిల= సమస్తమైన; దివిజ= దేవతలూ; మునిగణములకున్= ఋషి బృందాలకూ; సమ్మోదము= ఆనందం; ఒనర్తు(వు)= కలిగిస్తావు.

తాత్పర్యం: పవిత్రుడా! ఓ అపాంతరతమా! (వ్యాసా!) కాలం కలిగించిన కీడు కారణంగా వేదాలు అన్నీ మళ్ళీ కలగాపులగం అయిపోతే నీవు మళ్ళీ నీ బుద్ధివైభవంతో వాటిని నాలుగుగా విభజిస్తావు. దేవతలకూ, ఋషులకూ ఆనందం కలిగిస్తావు.

తే. ధర్మసందేహములు నీవు నిర్మలంపు । వాక్యములఁ బాపి జగములవార లెల్ల
నఖిల సంశయచ్ఛేత్త పుణ్యాత్మకుండు । లోకహితవాణి యనఁగ సుశ్లోకుఁ డగుదు. 528

ప్రతిపదార్థం: ధర్మసందేహములు= ధర్మానికి సంబంధించిన సందేహాలు; నీవు= నీవు; నిర్మలంపు వాక్యములన్= నిర్మలమైన వాక్యాలతో; పాపి= తీర్చి; జగములవారలు+ఎల్లన్= ప్రపంచంలోని ప్రజలు అందరూ; అఖిల సంశయచ్ఛేత్త= అన్ని సంశయాలనూ ఛేదించేవాడు; పుణ్యాత్మకుండు= పుణ్యాత్ముడు; లోకహితవాణి= లోకానికి హితం కలిగించే వాక్కు కలవాడు; అనఁగన్= అనేట్టు; సుశ్లోకుఁడు= స్తుతింపబడేవాడవు; అగుదు(వు)= అవుతావు.

తాత్పర్యం: ప్రపంచంలో ప్రజలకు వచ్చే ధర్మసందేహాలన్నీ నీ మాటలతో తీరుతాయి. నిన్ను అఖిలసంశయ విచ్ఛేదకుడ వనీ, పుణ్యాత్ముడ వనీ లోకానికి హితం కలిగించే వాక్కు కలవాడ వనీ ప్రజలు స్తుతిస్తారు.

క. రాగిత్వము విడువదు నిను, । రాగవిదూరుఁడగు సుతుఁడు ప్రభవించును నీ,
కాగమ విధానబుద్ధియు । యోగము సాంఖ్యంబు మది సముదితంబు లగున్. 529

ప్రతిపదార్థం: వ్యాసుడా!; నినున్= నిన్ను; రాగిత్వము= అనురాగసహితత్వం అనేది (లోకమూ కుటుంబమూ - వీటిపట్ల ప్రేమ); విడువదు= విడిచిపెట్టదు (నీవు విరాగివి కాలేవు అని); నీకున్= నీకు; రాగవిదూరుఁడు+అగు= రాగరహితుడైన (విరాగి అయిన); సుతుఁడు= తనయుడు; ప్రభవించును= జన్మిస్తాడు (శుకుడు నీకు కుమారుడుగా జన్మిస్తాడని); ఆగమవిధాన= శాస్త్ర సమ్మతమైన; బుద్ధియున్= మతియూ; యోగమున్= యోగమూ; సాంఖ్యంబున్= సాంఖ్యమూ; మదిన్= అంతరంగంలో; నీకున్= నీకు; సముదితంబులు+అగున్= ఉదయిస్తాయి (ప్రకాశిస్తాయి, ఆవిర్భవిస్తాయి).

తాత్పర్యం: తనయుడా! నీవు విరాగివి కాలేవు. కాని, ఒక విరాగి నీకు కుమారుడుగా జన్మిస్తాడు. శాస్త్రాలనూ, ఆగమాలనూ అనుసరించే బుద్ధితోపాటు నీ అంతరంగంలో సాంఖ్యయోగాలు కూడా వికసిస్తాయి.

వ. అని నిర్దేశించి నీవు నిజేచ్ఛం బ్రవర్తింపు మని పలికి యద్దేవుం డంతర్హితుం డయ్యె నిది మదీయ నారాయణసంభవత్వంబు తెఱం గేను యమనియమనిరూఢి నిర్మలతపఃకరణంబు చిరకాలం బాచరించి యప్పురుషోత్తము కారుణ్యంబు నామీఁద నంతకంతకు నెక్కుడగునట్లు సేసితి నని మద్గురుండును త్రికాల వేదియు నగు వేదవ్యాసుండు సెప్పె నని చెప్పి వైశంపాయనుండు జనమేజయునితో వెండియు నిట్లనియె. 530

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; నిర్దేశించి= ఆజ్ఞాపించి; నీవు= నీవు; నిజ+ఇచ్ఛన్= నీ కోరికమేరకు; ప్రవర్తింపుము= సంచరించుము; అని= అట్లా; పలికి= అనుమతించి; ఆ+దేవుండు= ఆ శ్రీమన్నారాయణుడు; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; ఇది= ఇంతవరకూ చెప్పినది; మదీయ= నాయొక్క; నారాయణసంభవత్వంబు= నారాయణపుత్రత్వం తాలూకు; తెఱంగు= తీరు. (నేను నారాయణపుత్రుడిని ఎట్లాగయ్యానో తెలియజేసే కథ - అని); ఏనున్= నేను; యమ= ఇంద్రియనిగ్రహమూ; నియమ= ఇంకా తక్కిన నియమాలయొక్క; ఆరూఢిన్= గాఢతతో (ప్రసిద్ధితో); నిర్మల= పవిత్రమైన; తపఃకరణంబు= తపస్సుమాచరణ; చిరకాలంబు= చాలాకాలం; ఆచరించి= చేసి; ఆ+పురుషోత్తము= ఆ పురుషోత్తముడైన విష్ణుమూర్తియొక్క; కారుణ్యంబు= దయ; నామీఁదన్= నాపైని; అంతకంతకున్= పోనుపోనూ; ఎక్కుడు+అగునట్లు= అధికం అయ్యేట్టు; చేసితిన్= నడచుకొన్నాను (చేసికొన్నాను); అని= ఆ విధంగా; మత్+గురుండును= నా గురువుగారూ; త్రికాల+వేదియున్= భూత భవిష్యద్వర్తమానాలను ఎరిగినవాడూ; అగు= అయిన; వేదవ్యాసుండు= వేదవ్యాసుడు; చెప్పెన్= చెప్పాడు; అని చెప్పి= ఇట్లా వివరించి; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; జనమేజయునితోన్= ఆ జనమేజయ మహారాజుతో; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించి 'నీ కోరిక ననుసరించి నడచుకొనుము' అని పలికి నారాయణుడు అంతర్ధానమొందాడు. ఇదీ నేను నారాయణుడికి పుట్టిన విధం. నేను యమ నియమాలతో నిర్మలమైన తపస్సు చాలాకాలం చేసి విష్ణుదేవుడి దయ నామీద అంతకంతకూ ఎక్కువయ్యేటట్లు చేసికొన్నాను' అని నా గురువు, త్రికాలజ్ఞుడు అయిన వేదవ్యాసుడు చెప్పాడు - అని వైశంపాయనుడు జనమేజయుడితో మరల ఇట్లా అన్నాడు:

**సీ. అట్లు ధర్మజుఁడు నారాయణనారద ।
సంవాదకథ విన్న సమయమునను
నారదుఁ డచ్యుతు కారుణ్య మమ్మెయిఁ ।
బడసి క్రమ్మఱి వచ్చి బదరికాశ్ర
మమున నారాయణు మన్ననతోడి సం ।
భాషణంబును గాంచి పరమతపము
దాఁ జేఁత యెఱిఁగించి తదనంతరంబ య ।
య్యమరమునీంద్రుఁ డే మడిగినట్ల**

**ఆ. యడుగ ధర్మనందనాదులుఁ గృష్ణుండు ।
వినఁగ మద్గురుం డతనికిఁ జెప్పె
సురలు మోక్షధర్మపరులు గా కధ్వరా ।
యత్తచిత్తులైన యత్తెఱంగు. 531**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారం; ధర్మజుఁడు= ధర్మరాజు; నారాయణ నారద సంవాదకథ= నారాయణ నారద సంభాషణ రూపమైన ఇతివృత్తాన్ని; విన్న సమయమునను= ఆలకించిన వేళలో; నారదుఁడు= నారదమహర్షి; అచ్యుతు+కారుణ్యము= విష్ణుమూర్తి దయను; ఆ+మెయిన్= ఆ విధంగా; పడసి= పొంది; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= వచ్చి; బదరికా+ఆశ్రమమునన్= బదరి కాశ్రమంలో; నారాయణు= నారాయణునియొక్క; మన్ననతోడి= మన్ననతో (గౌరవం) కూడిన; సంభాషణంబును= సల్లాపాన్ని; కాంచి= పొంది (నారాయణుడితో సంభాషించగలిగి అని); పరమతపము= గొప్ప తపస్సును; తాన్= తాను(నారదుడు); చేఁత= చేయటం; ఎఱిఁగించి= తెలియజేసి; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; ఆ+అమరమని+ఇంద్రుడు= దేవఋషి వర్యుడయిన నారదుడు; ఏము+అడిగినట్ల= మేము అడిగినట్టే; అడుగన్= అడిగితే; ధర్మనందనాదులున్= ధర్మజాది పాండవులూ; కృష్ణుండున్= శ్రీకృష్ణుడూ; వినఁగన్= వినేటట్టు (తెలిసికొనేటట్టు); మత్+గురుండు= మా గురువుగారు వ్యాసుడు; అతనికిన్= ఆ నారదుడికి; సురలు= దేవతలు; మోక్షధర్మపరులు+కాక= మోక్షధర్మంపట్ల ఆసక్తులు కాకుండా; అధ్వర+ఆయత్త+చిత్తులైన= యజ్ఞయాగాదుల పట్ల సంసక్తమైన హృదయాలు కలవారుగా అయినటువంటి; ఆ+తెఱంగున్= ఆ తీరును; చెప్పెన్= వివరించాడు.

తాత్పర్యం: (ఇంక శ్రోతల పరంపరను కలుపుతున్నాడు.) నారదనారాయణ సంవాదకథను శ్రీకృష్ణుడు చెప్పగా ధర్మరాజాదులు విన్నారు. ఆ కథలో నారదుడు శ్వేతద్వీపంనుండి తిరిగి బదరికాశ్రమానికి రావటం, అక్కడ నరనారాయణులతో సంభాషించటం ఉన్నది. ఆ తరువాత అదే ఆశ్రమంలో నారదుడు వారి అనుమతి పొంది

నివసిస్తూ తపస్సు చేసికొంటున్నాడు. జనమేజయా! ఒకరోజున మేము అడిగినట్లే నారదుడు మా గురువు గారిని అడిగాడు. దేవతలు మోక్షపరులు కాకుండా పురోడాశపరాయణులు అవుతున్నారు ఇ దేమిటి స్వామీ! - అని (చూ. శాంతి-6-400). వారు అట్లా ఉండటానికి కారణం ఏమిటో మా గురువుగారు చెప్పారు. అప్పుడు దానిని ధర్మజాదులూ, శ్రీకృష్ణుడూ అంతా విన్నారు.

వ. ఇట్లు సెప్పి. **532**

తాత్పర్యం: ఇట్లా వివరించి.

క. వేదవ్యాసుఁడు సుముఖత । నా దైవతమునికిఁ జెప్పె హయశిరుఁడగు దా
మోదరుని దివ్యలీల స । మాదరమున ధర్మనందనాదులు వినఁగన్. **533**

ప్రతిపదార్థం: వేదవ్యాసుఁడు= ఆ వ్యాసమునీంద్రుడు; సుముఖతన్= ఆనుకూల్యంతో; ఆ+దైవతమునికిన్= ఆ దేవర్షికి (నారదుడికి); హయశిరుఁడు+అగు= హయగ్రీవుడైన; దామోదరుని= శ్రీమహావిష్ణువుయొక్క; దివ్యలీలన్= దివ్యవిలాసాన్ని; సమాదరమునన్= ఆదరంతో (అనురక్తితో); ధర్మనందన+ఆదులు= ధర్మరాజు మొదలైనవారు; వినఁగన్= వింటూండగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: వేదవ్యాసుడు సుముఖుడై ఆ నారదుడికి ఆదరంతో హయగ్రీవుడి దివ్యవిలాసాన్ని వివరించాడు. ధర్మరాజూ, ఆయన సోదరులూ ఆదరంతో దానిని ఆలకించారు.

వ. అని చెప్పి వెండియు. **534**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మళ్ళీ; వైశంపాయనుడే అంటున్నాడు.

తాత్పర్యం: అని పలికి మరల.

క. నిజనామ నిర్వచనములు । విజయుం డడుగంగ నెల్లవియు నెఱిఁగించెం
ద్రిజగద్భజనీయపదాం । బుజుఁ డగు కృష్ణుండు భరితపుణ్యచరిత్రా! **535**

ప్రతిపదార్థం: భరిత= వహించబడిన; పుణ్యచరిత్రా!= పవిత్రగాథ కలవాడా! (పవిత్రమైన చరిత్ర కలవాడా!); త్రిజగత్= ముల్లోకాలచేతనూ; భజనీయ= సేవింపబడే; పద+అంబుజుఁడు= పాదపద్మాలు కలవాడు; అగు= అయిన; కృష్ణుండు; నిజ= తనయొక్క; నామ= నామధేయాల; నిర్వచనములు= వ్యుత్పత్తులు (వివరాలు); విజయుండు= అర్జునుడు; అడుగంగన్= అడగగా; ఎల్ల+అవియున్= అన్నీ; ఎఱిఁగించెన్= తెలియజెప్పాడు.

తాత్పర్యం: పవిత్రచరిత్ర కలిగిన ఓ జనమేజయా! ముల్లోకాలకూ ఆరాధ్యుడైన శ్రీకృష్ణుడు తన నామధేయాల గాథలనూ అంతరార్థాలనూ విజయుడు అడిగితే తానే స్వయంగా అన్నీ వివరించాడు.

వ. ఇ ట్లగుట ము న్నెఱిఁగించితి. **536**

ప్రతిపదార్థం: ఇట్లు; అగుట= కావటం; మున్ను= ఇంతకుపూర్వమే; ఎఱిఁగించితిన్= నీకు తెలియజెప్పాను.

తాత్పర్యం: దీనిని ఇంతకు పూర్వమే నీకు తెలియజేశాను.

క. వేదాదులైన పథము ల । భేదప్రాప్యంబు లగుట ప్రియ మెసఁగఁగ న
వ్వేదవ్యాసుఁడు సెప్పె స । మాదరమునఁ బార్థుఁ డడుగ నందఱు వినఁగన్. 537

ప్రతిపదార్థం: వేద+ఆదులు+ఐన= వేదమూ, సాంఖ్యమూ మొదలైన (యోగ-పాశుపత-పాంచరాత్రాలు ఆదిపదంతో గ్రహించాలి చూ. శాంతి - 6-512); పథములు= మార్గాలు; అభేద= భేదంలేకుండా (ఉత్తమమనీ మధ్యమమనీ ఇట్లాంటి తేడాలు లేకుండా); ప్రాప్యంబులు= పొందదగినవి; అగుట= కావటాన్ని; పార్థుఁడు+అడుగన్= అర్జునుడు అడిగినప్పుడు; అందఱున్+వినఁగన్= అందరూ వినేట్టు; ఆ+వేదవ్యాసుడు= ఆ వేదవ్యాసుడు; ప్రియము+ఎసఁగఁగన్= ప్రేమ అతిశయించేటట్టు; చెప్పెన్= నిర్ధారించి చెప్పాడు.

తాత్పర్యం: వేదమూ, సాంఖ్యమూ, యోగమూ, పాశుపతమూ, పాంచరాత్రమూ అని ఉన్న మార్గాలలో భేదాలూ హెచ్చుతగ్గులూ ఏమీ లేవు - అని ఆ వేదవ్యాసుడు పార్థుడి సందేహానికి సమాధానంగా చెప్పాడు. దీనిని అందరూ అప్పుడు విన్నారు.

క. ఏకాంతికధర్ముము సు । శ్లోకుండగు నాతఁ డడుగ లోకోత్తర! యా
లోకారాధ్యుఁడు సెప్పె ద । యాకరమతి కృష్ణధర్మజాదులు వినఁగన్. 538

ప్రతిపదార్థం: లోకోత్తర!= ఓ సర్వోత్తమా!; సుశ్లోకుండు+అగు= స్తుతింప దగినవాడైన; ఆతఁడు= ఆ అర్జునుడు; ఏకాంతిక ధర్మమున్= ఏకాంతిక లక్షణాన్ని; అడుగన్= అడిగితే; ఆ+లోక+ఆరాధ్యుఁడు= సకలలోకాలకూ ఆరాధింపదగినవాడైన ఆ వేదవ్యాసుడు; దయా+ఆకర+మతిన్= కృపకు నిలయమైన మనస్సుతో; కృష్ణ ధర్మజ+ఆదులు= శ్రీకృష్ణుడూ, ధర్మరాజూ ఇంకా మొదలైనవారు; వినఁగన్= వినేటట్టు; చెప్పెన్= వివరించాడు. (వారు వింటూండగా దయతో వివరించాడు - అని).

తాత్పర్యం: ఓ లోకోత్తరుడా! ఏకాంతికధర్మాన్ని గురించి అర్జునుడు అడిగితే వేదవ్యాసుడు దయతో వివరించాడు. అప్పుడు దానిని కృష్ణుడూ, ధర్మరాజూ ఇంకా మరికొందరూ (భీమ నకుల సహదేవాదులు) విన్నారు.

క. దైవవశంబున నేఁడును । నీ వడుగఁగ నింతవట్టు నిస్సందేహం
బై వఱలఁగ నేఁ జెప్పితిఁ । బావన మిది యసదృశంబు పౌరవముఖ్యా!' 539

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో ముఖ్యుడైనవాడా!; దైవవశంబునన్= అదృష్టవశాత్తూ; నేఁడునున్= ఈ రోజయినా; నీవు= నీవు; అడుగఁగన్= అడిగావు కాబట్టి; ఇంతవట్టు= ఇంతవరకూ (ఇంతమటుకు); నిస్సందేహంబు+ఐ+వఱలఁగన్= సందేహరహితమై అతిశయించేటట్టు; నేన్= నేను; చెప్పితిన్= చెప్పాను; ఇది= ఈ ఏకాంతిక ధర్మం; పావనము= పవిత్రం; అసదృశంబు= సాటిలేనిది.

తాత్పర్యం: ఓ కౌరవశ్రేష్ఠా! అదృష్టవశాత్తూ ఈరోజు అడిగావు కాబట్టి నీ సందేహం నివృత్తి అయేటట్లుగా నేను చెప్పాను. ఈ ఏకాంతిక ధర్మం సాటిలేనిది.'

వ. అని పలికి నారాయణ నారద సంవాదాదికంబైన యివ్వాఙ్మయం బంతయుం బేర్కొని. 540

ప్రతిపదార్థం: అని పలికి= అని వివరించి; నారాయణనారద సంవాద+ఆదికంబైన= నారద నారాయణ సంవాదమూ మొదలైన; ఈ+వాఙ్మయంబు+అంతయున్= ఈ వాక్యరూపమైనది (సాహిత్య రూపమైనది) అంతా; పేర్కొని= చెప్పి.

తాత్పర్యం: ఈ విధంగా వివరించి, ఈ సంవాదం మొదలైన సాహిత్యాన్నంతా చెప్పి.

క. నారాయణీయమగు నీ । సారాఖ్యానంబు వినినఁ జదివిన సంప
త్తారోగ్యాయుస్సద్గతు । లేరికినైనం గురుక్షితీశ్వర! కలుగున్. 541

ప్రతిపదార్థం: కురుక్షితి+ఈశ్వర!= కౌరవసామ్రాజ్యాధిపతీ!; నారాయణీయము+అగు= నారాయణుడికి సంబంధించినదైన; ఈ= ఈ; సార= శ్రేష్ఠమైన; ఆఖ్యానంబున్= కథను; వినినన్= విన్నా; చదివినన్= చదివినా; సంపత్తు= సకలసంపదలూ; ఆరోగ్య= ఆరోగ్యమూ; ఆయుస్= ఆయుర్దాయమూ; సద్గతులు= ఉత్తమలోకాలూ; ఏరికిన్+ఐనన్= ఎవ్వరికైనా; కలుగున్= లభిస్తాయి.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! నారాయణీయమైన ఈ పవిత్రగాథను విన్నవారికీ, చదివినవారికీ సకల సంపదలూ సిద్ధిస్తాయి. ఆయురారోగ్యాలు ఇహంలోనూ, సద్గతులు పరంలోనూ లభిస్తాయి.

వ. అనిన విని యత్యంతాహ్లాద భరితాంతఃకరణుం డయిన యక్కౌరవేంద్రుతో నమ్మునీంద్రుం డిట్లను నిట్లు సకలలోకసంభావనీయ సత్కథ లాకర్ణించి సముదీర్ణ సంప్రీతుండగు నప్పాండవాగ్రజుండు. 542

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; అత్యంత= మిక్కిలి; ఆహ్లాద= ఆనందంతో; భరిత= నిండిన; అంతఃకరణుండు+అయిన= మనస్సు కలవాడైన; ఆ+కౌరవేంద్రుతోన్= ఆ జనమేజయుడితో; ఆ+మునీంద్రుండు= ఆ వైశంపాయనుడు; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; ఇట్లు= ఈ ప్రకారంగా; సకలలోక= సర్వలోకాలలోనూ; సంభావనీయ= గౌరవింపదగినవైన; సత్కథలు= మంచి ఉపాఖ్యానాలు; ఆకర్ణించి= భీష్ముడినుండి విని; సముదీర్ణ= వికసించిన; సంప్రీతుండు+అగు= సంతృప్తి కలవాడైన; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: ఇది విన్న జనమేజయుడు చాలా సంతోషించాడు - అని భీష్ముడి నుండి విన్న ధర్మజుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అమరతటినీసుతున కిట్టు లనియె రాజ । ధర్మముఖ్యంబులగు సర్వధర్మముల ను
దాత్తకృప నెఱిఁగించి తత్యుత్తమంపు । ధర్మమెయ్యది సెప్పుము ధర్మనిత్య! 543

ప్రతిపదార్థం: అమరతటినీ+సుతునకున్= గాంగేయునికి (అమరులనది - గంగ. గంగానది పుత్రుడు - భీష్ముడు); ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; రాజధర్మముఖ్యంబులు+అగు= రాజనీతి మొదలైన; సర్వధర్మములన్= అన్ని ధర్మాలనూ; ఉదాత్తకృపన్= గొప్ప దయతో; ఎఱిఁగించితి(వి)= తెలియజెప్పావు; ధర్మనిత్య!= ధర్మస్వరూపా!; అత్యుత్తమంపు= అత్యుత్తమమైన; ధర్మము= ధర్మం; ఏ+అది= వీటిలో ఏది; చెప్పుము= చెప్పు.

తాత్పర్యం: ఓ ధర్మనిత్యుడా! రాజనీతి మొదలుకొని అన్ని ధర్మాలూ చెప్పావు. వీటిలో ఏది ఉత్తమధర్మమో చెప్పుము. అని గాంగేయుడిని ధర్మరాజు అడిగాడు.

వ. అనుటయు నా దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 544

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; ఆ+దేవవ్రతుండు= దేవవ్రతుడు అనేపేరుగల భీష్ముడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజులలో ఉత్తముడైన ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు (దేవవ్రతుడు అనేది తల్లిదండ్రులు చేసిన నామకరణం. భీష్ముడు అనేది ప్రతిజ్ఞతో ఏర్పడినది).

తాత్పర్యం: అనగా ఆ భీష్ముడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

చ. అరయఁగ ధర్మతంత్రములయందు నిరర్థములే దొకండు, నె
వ్వరిమది యెందు వ్రాలెఁ దగ వారలు దానిని పూని యాచరిం
తు, రదియ వారి కిష్టఫల దోహనకార్య మొనర్చు, నెల్లెడం
బురుషులఁ జూడమే తమకుఁ బోలిన ధర్మములన్ వెలుంగఁగన్? 545

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించి చూస్తే; ధర్మతంత్రములయందున్= ఈ ధర్మశాస్త్రాలలో; ఒకండున్= ఒక్కటికూడా; నిరర్థము= నిష్ప్రయోజనమైనది; లేదు= లేదు; ఎవ్వరి+మది= ఎవరి మనస్సు; ఎందున్= ఏ ధర్మశాస్త్రంలో; వ్రాలెన్= మొగ్గు చూపుతుందో; తగన్= అందంగా; వారలు= వారు; దానినిన్= ఆ శాస్త్రాన్ని; ఆచరింతురు= అనుసరిస్తారు; అది+అ= అదే; వారికిన్= వారికి; ఇష్టఫల= కోరుకొన్న ఫలితాలకు సంబంధించిన; దోహనకార్యము= పెంపుదలను; ఒనర్చున్= చేస్తుంది; తమకున్= తమకు; పోలిన= (అనుకూలమైన) తగిన; ధర్మములన్= ధర్మాలతో; వెలుంగఁగన్= ప్రకాశిస్తున్న; పురుషులన్= మానవులను; ఎల్లెడన్= ప్రపంచంలో అంతటా; చూడమే?= మనం చూడటం లేదా?

తాత్పర్యం: ధర్మశాస్త్రాలలో అన్నీ పనికివచ్చేవే. ఒక్కటికూడా పనికిరానిది అంటూ లేదు. ఎవరికి నచ్చిన ధర్మశాస్త్రాన్ని వారు అనుసరిస్తారు. అదే వారి కోరికలు పండటానికి దోహదం చేస్తుంది. తమకు తగిన ధర్మాలను ఆచరిస్తున్నవారిని లోకంలో ఎంతమందిని మనం చూడటంలేదు కనుక?

ఇంద్రునకు నారదుఁడు సెప్పిన భృగునామక విప్రుని చరిత్రము (సం. 12-340-4, 5)

వ. అది యట్లుండె; నప్రతిహతగతియై చరించుచుండి యొక్కనాఁడు నారదుం డాఖండలు పాలికిం జనిన నతం
డతనికి సముచిత సత్కారంబు లాచరించి సుఖాసీనుండై యున్న యమ్మునివరు నాననంబునం జూడ్కి
నిలిపి నీవు మెలంగునెడ నెద్దియేనియు నాశ్చర్యంబు గన్నయది గలదే?యని యడిగిన నమ్మహితాత్ము
డమ్మహేంద్రునకుం జెప్పిన కథ సెప్పెద; నది భవత్ప్రశ్నంబున కుత్తరం బైయుండు. దాని వినుము.
భాగీరథీదక్షిణతీరంబున మహాపద్మం బనియెడు పురవరంబునఁ గులశ్రేష్ఠుండగు భృగుండను విప్రుండు గలం;
డప్పురుషవరుండు. 546

ప్రతిపదార్థం: అది+అట్లుండెన్= అది అట్లా ఉండగా ; నారదుండు= నారదమహర్షి; అప్రతిహతగతియై= నిరాటంకమైన గమనం కలవాడై; చరించుచుండి= లోకాలన్నీ సంచరిస్తూ; ఒక్కనాఁడు= ఒకరోజున; ఆఖండలు పాలికిన్= ఇంద్రుడి సన్నిధికి; చనినన్= వెళ్ళగా; అతండు= ఆ ఇంద్రుడు; అతనికిన్= నారదుడికి; సముచిత సత్కారంబులు= తగిన మన్ననలు; ఆచరించి= చేసి; సుఖ+ఆసీనుండై+ఉన్న= సుఖంగా ఆసనంపై కూర్చుని ఉన్న; ఆ+మునివరు= ఆ నారదుడియొక్క; ఆననంబునన్= ముఖంమీద; చూడ్కి= తన దృష్టి; నిలిపి (నారదుడి ముఖం చూస్తూ); నీవు= నారదా! నీవు; మెలంగునెడన్= సంచరించే చోటులలో; ఎద్ది+ఏనియున్= ఏదయినా; ఆశ్చర్యంబు= అద్భుతం; కన్న+అది= నీవు చూచినది; కలదే?= ఉన్నదా?; అని; అడిగినన్= అడిగితే; ఆ+మహితాత్ముండు= ఆ మహాత్ముడు నారదుడు; ఆ+మహేంద్రునకున్= ఆ దేవేంద్రుడికి; చెప్పిన= చెప్పినటువంటి; కథ= వృత్తాంతం; చెప్పెదన్= నీకు చెబుతాను; అది= ఆ కథ; భవత్+ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు+ఐ+ఉండున్= సమాధానం అవుతుంది; దానిని= దాన్ని; వినుము= వినుము; భాగీరథీ= గంగానదియొక్క; దక్షిణతీరంబునన్= దక్షిణపు ఒడ్డున; మహా పద్మంబు+అనియెడు= మహాపద్మం అనే; పురవరంబునన్= గొప్పపట్టణంలో; కులశ్రేష్ఠుండు+అగు= వంశంలో ఉత్తముడైన; భృగుండు+అను= భృగుడు అనే; విప్రుండు= బ్రాహ్మణుడు; కలండు= ఉన్నాడు; ఆ+పురుషవరుండు= ఆ మానవోత్తముడు.

తాత్పర్యం: అది అట్లా ఉండగా, నారదుడు నిరాటంకంగా లోకాలన్నిటినీ సంచరిస్తూ, ఒకనాడు ఇంద్రుడి వద్దకు వెళ్ళగా అతడు నారదుడిని సత్కరించి 'నారదా! నీవు తిరిగిన చోటులలో ఏదైనా అద్భుతం చూచావా?' అని అడిగాడు.

అప్పుడు నారదుడు ఇంద్రుడికి చెప్పిన కథ వినిపిస్తాను. అది నీ ప్రశ్నకు ఉత్తర మౌతుంది. వినుము. గంగానది దక్షిణతీరాన మహాపద్మ మనే మహానగరంలో భృగుడు అనే బ్రాహ్మణుడు ఉన్నాడు. ఆ ఉత్తముడు (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ధర్మనిత్యుండు సత్యవ్రత పరుఁ డహిం । సాశాలి యింద్రియజయ విభాసి
నిజకర్మతృప్తుండు నిష్క్రోధుఁ డంచిత । న్యాయసంప్రాప్త ధనముల దేవ
పిత్రతిథిజ్ఞాతి మిత్రకార్యములు ని । ర్వర్తించు, సువినయవంతులైన
తనయులఁ గన్నాఁడు, ద న్నెల్లవారును । వినుతింప మన్నాఁడు, దన మనమున

తే. నెట్టి కృత్యంబు మేలొ యే నెద్దిసేసి । కృతపరాయణ ధర్మతా స్థితి వహింతు
నొక్కొ?యని చింతఁ బొందుచు నుండు నాత్మ । నిష్ఠ యలవాటు కాంక్షించి నృపవరేణ్య! 547

ప్రతిపదార్థం: ధర్మనిత్యుండు= ధర్మంపట్ల నిత్యస్పృహ కలవాడు - ఎప్పుడూ ధర్మం తప్పనివాడు; సత్యవ్రతపరుఁడు= సత్యంపట్ల దీక్ష కలిగినవాడు; అహింసాశాలి= అహింసావ్రతం వహించినవాడు; ఇంద్రియజయ= ఇంద్రియాలను జయించి; విభాసి= ప్రకాశించేవాడు (ఇంద్రియజయంతో విరాజిల్లేవాడు); నిజకర్మ= తన పనులతో; తృప్తుండు= సంతుష్టి పడేవాడు (ఆత్మసంతృప్తిగా కర్మాచరణం చేసేవాడు); నిష్క్రోధుఁడు= క్రోధం అనేది లేనేలేనివాడు; అంచిత= ఒప్పిన; న్యాయ= ధర్మబద్ధంగా; సంప్రాప్త= లభించిన; ధనములన్= డబ్బుతో (సంపదలతో); దేవ (కార్యములు)= దేవతల; పితృ= పితృదేవతల; అతిథి= అతిథుల; జ్ఞాతి= దాయాదుల; మిత్ర= స్నేహితుల; కార్యంబులు= పనులు (విధులు); నిర్వర్తించున్= నిర్వహిస్తూ ఉంటాడు; సువినయవంతులైన= మంచి వినయసంపన్నులైన; తనయులన్= పుత్రులను; కన్నాఁడు= పొందాడు; తన్నున్= తనను; ఎల్లవారున్= అందరూ; వినుతింపన్= స్తుతించగా; మన్నాఁడు= జీవితం గడిపాడు (మనుట= జీవించుట); నృపవరేణ్య!= రాజోత్తమా!; ఆత్మనిష్ఠ= ఆత్మనిష్ఠయొక్క (పరమాత్మపట్ల నిష్ఠ); అలవాటు= అభ్యాసాన్ని; కాంక్షించి= కోరి; తన= తనయొక్క; మనమునన్= మనస్సులో - ఎట్టి= ఎటువంటి; కృత్యంబు= పని; మేలొ= మంచిదో; ఏను= నేను; ఎద్ది= ఏది; చేసి= ఆచరించి; కృత= చేయబడిన; పరాయణ= ఉత్తమోత్తమ; ధర్మతా= ధర్మాలు కలిగిన; స్థితి= దశ (ఉత్తమ ధర్మాలను ఆచరించిన స్థితి); వహింతునొక్కొ?= వహిస్తానో?; అని= అనే; చింతన్= ఆలోచనను; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు (ఎప్పుడూ అదే ఆలోచనతో ఉంటాడు అని).

తాత్పర్యం: ఆ భృగువు ధర్మనిత్యుడు. సత్యవ్రత పరాయణుడు. అహింసాపరుడు. ఇంద్రియనిగ్రహం కలవాడు. తన కర్మాచరణం పట్ల తృప్తికలవాడు. క్రోధం ఎరుగనివాడు. న్యాయంగా లభించిన ధనంతో దేవకార్యాలూ, పితృకార్యాలూ, అతిథి సత్క్రియలూ, మిత్రకార్యాలూ నిర్వర్తిస్తూ ఉంటాడు. అతడికి వినయవంతులైన కుమారులు కలిగారు. లోకంలో అందరి మన్ననలూ పొందాడు. అతడికి ఎప్పుడూ ఒక్కటే ఆలోచన - ఏవి మంచి పనులు? వేటిని ఆచరిస్తే మేలు? ధార్మికుడను ఎలా అవుతాను? నాకు ఆత్మనిష్ఠ ఎట్లా అలవాటవుతుంది? - ఇదే అతడి చింత.

వ. అట్లుండ నొక్కనాఁడు. 548

ప్రతిపదార్థం: అట్లు+ఉండన్= అలా ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: అట్లా ఉండగా ఒకరోజున.

తే. తన గృహంబున కతిథి యుదాత్తుఁ డొక్క । బ్రాహ్మణుఁడు వచ్చె; వచ్చినఁ బరమభక్తి
యుక్తి నాతిథ్య మొనరించియున్నయప్పు । డమ్మహోద్విజుతోడ నిట్లనియె భృగుఁడు. 549

ప్రతిపదార్థం: తన= ఆ భృగువుయొక్క; గృహంబునకున్= ఇంటికి; ఉదాత్తుఁడు= గొప్పవాడైన; ఒక్కబ్రాహ్మణుఁడు= ఒక విప్రుడు; అతిథి= అతిథిగా; వచ్చెన్= వచ్చాడు; వచ్చినన్= వస్తే; పరమభక్తియుక్తిన్= మిక్కిలి భక్తితో (భక్తియొక్క యుక్తితో= కూడికతో); ఆతిథ్యము= అతిథిమర్యాద; ఒనరించి= చేసి; ఉన్న+అప్పుడు= ఉన్న సమయంలో; ఆ+మహాద్విజుతోడన్= ఆ ఉత్తమ విప్రుడితో; భృగుఁడు= భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఒక ఉత్తమబ్రాహ్మణుడు తన ఇంటికి అతిథిగా వచ్చాడు. భృగువు అతిథిమర్యాదలన్నీ యథావిధిగా జరిపాడు. అది అయ్యాక నెమ్మదిగా ఇట్లా అడిగాడు.

సీ. ‘ అనఘ! నీ మధుర వాక్యంబులఁ జేసి మి । త్రత్వంబు నొంది మద్భాగవతము
నీ కెఱింగించెద నీవు నెయ్యమెలర్ప । హిత ముపదేశింపు మేను నియతి
నాత్మావలోకన మాచరించెద నని । తొడఁగుదు నది యలవడదు నాకు
లోకసామాన్య గుణాకలనంబున । బద్ధుండ నగుట నెబ్భంగి నాత్మ

తే. నాత్మయంద కని యనామయత్వముఁ బొంది । ఖండరహిత మగు సుఖమున మునిఁగి
యుండువాఁడ? భూసురోత్తమ! చెప్పవే । యనిన నతని కిట్టు లనియె నతఁడు. 550

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; నీ= నీయొక్క; మధురవాక్యంబులన్+చేసి= తీయని మాటలచేత; మిత్రత్వంబు= స్నేహం; ఒంది= కుదిరి(పొంది); మత్+భాగవతమున్= నా భాగవతాన్ని (భగవద్భక్తికి సంబంధించిన విషయాన్ని); నీకున్= నీకు; ఎఱింగించెదన్= తెలియజేస్తాను (చెప్పుతున్నాను); నీవు= నీవు; నెయ్యము+ఎలర్పన్= స్నేహం వికసించేట్టు; హితము= మేలు చేకూర్చేదానిని; ఉపదేశింపుము; ఆత్మావలోకనము= ఆత్మదర్శనం; ఆచరించెదన్= ఆచరిస్తాను; అని= ఆ విధంగా; ఏనున్=నేను; నియతిన్= నియమబద్ధంగా (నిష్ఠతో); తొడఁగుదున్= పూనుకొంటాను; అది= (కానీ) అది; నాకున్= నాకు; లోకసామాన్య= సర్వజనసాధారణమైన; గుణ= సత్త్వాదిగుణాల; ఆకలనంబునన్= సమ్మిశ్రణంలో; బద్ధుండను+అగుటనన్= తగుల్కొన్నవాడిని కావటం వలన; అలవడదు= కుదరటంలేదు (ఆత్మదర్శనం కావటంలేదు); ఏ+భంగిన్= ఎలా; ఆత్మన్= ఆత్మను; ఆత్మ యందున్+అ= ఆత్మలోనే; కని= దర్శించి; అనామయత్వమున్= ఆరోగ్యాన్ని; పొంది= పొంది; ఖండరహితము+అగు= అఖండమైన; సుఖమునన్= సుఖంలో; మునిఁగి+ఉండువాఁడన్?= మునిగి ఉండిపోగలుగుతాను?; భూసుర+ఉత్తమ!= ఓ బ్రాహ్మణోత్తమా!; చెప్పవే?= దయచేసి తెలియజేయవా?; అనినన్= అని అడిగేసరికి; అతనికిన్= ఆ భృగువుకు; అతఁడు= ఆ అతిథి; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ‘ఓ రాజోత్తమా! నీ తీయనిమాటలు మనకు మైత్రి కలిగించాయి. కనుక నా భక్తివిషయం నీకు వినిపిస్తున్నాను. ఆలకించి, మేలైన సలహా చెప్పుము. నేను నియమనిష్ఠలతో ఆత్మావలోకనానికి కూర్చుంటాను (పూనుకొంటాను) కానీ’ అది నాకు సిద్ధించటం లేదు. లోకసాధారణమైన సత్త్వరజస్తమోగుణాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే ఎట్లా సిద్ధిస్తుంది మరి? అందుచేత ఆత్మసందర్శనం పొంది అఖండమైన ఆనందాన్ని పొందుతూ అట్లా ఉండిపోవాలి - అంటే దానికి మార్గం ఏమిటి? దయచేసి అది ఉపదేశించవా?’ అని అడుగగా ఆ బ్రాహ్మణుడు భృగువుతో ఇట్లా అన్నాడు:

క. ఏనును నిట్టుల మోహా । ధీనుఁడ నై యాత్మఁగాంచు తెఱఁ గొలయుటకుం
బూని వడుదు, నెయ్యదియో! । కానం దెరు వా శుభప్రకలనంబునకున్. 551

ప్రతిపదార్థం: ఏనునున్= నేనుకూడా; ఇట్టులన్= ఇలా నీవలెనే; ఆత్మన్= ఆత్మను; కాంచు= దర్శించే; తెఱఁగు= విధానం; ఒలయుటకున్= పొందటానికి; పూని= పూనుకొని; మోహ+అధీనుఁడను+ఐ= మోహానికి లొంగిపోయి; పడుదున్= జారిపోతూ

ఉంటాను; ఆ+శుభప్రకలనంబునకున్= ఆత్మసందర్శనం అనే ఆ శుభాన్ని పొందటానికి; తెరువు= మార్గం; ఎయ్యదియో!=ఏదోకదా!

తాత్పర్యం: ఓ భృగూ! నేనూ నీవలెనే ఆత్మదర్శనంకొరకు ప్రయత్నించి సఫలం కాలేక జారిపోతున్నాను. మోహం అడ్డు వస్తున్నది. మరి ఆ శుభసందర్శనానికి సరియైన దారి ఏదో మరి!

ఉ. కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థధర్మముం
బొందుటఁ గొంద ఱిద్ధ తపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ గొందఱు యజ్ఞవిధాన శాలితం
గొంద అనూనదానములఁ గోరి యొనర్తురు నిత్యసౌఖ్యమున్. 552

ప్రతిపదార్థం: నిత్యసౌఖ్యమున్= నిరంతరం ఆనందస్థితిని; కోరి= కాంక్షించి; కొందఱు= కొంతమంది; బ్రహ్మచర్యమునన్= బ్రహ్మచర్యంద్వారా; ఒనర్తురు= ఆత్మసందర్శనం చేస్తారు; కొందఱు= మరికొంతమంది; భవ్య= పవిత్రమైన; గృహస్థధర్మమున్= గృహస్థాశ్రమ ధర్మాన్ని; పొందుటన్= పొందటంద్వారా; ఒనర్తురు= ఆత్మసందర్శనం చేస్తారు; కొందఱు= ఇంకా కొంతమంది; ఇద్ధతపమున్= గొప్ప తపస్సును; వనభూమిన్= అరణ్యంలో; తగన్= తగినట్లు; చరించుటన్= ఆచరించటంద్వారా; ఒనర్తురు= ఆత్మదర్శనం చేస్తారు; కొందఱు= ఇంకొంతమంది; నిష్క్రియత్వమునన్= నిష్కర్మత్వం ద్వారా; కొందఱు= మరికొంతమంది; యజ్ఞవిధానశాలితన్= యజ్ఞాలను చెయ్యటంపట్ల తత్పరులై (నేర్పరులై); కొందఱు= మరికొందరు; అనూన= అత్యధికమైన; దానములన్= దానాలను చెయ్యటం ద్వారా; ఒనర్తురు= (ఆ శుభప్రకలనంబు) ఆత్మసందర్శనం చేస్తారు.

తాత్పర్యం: బ్రహ్మచర్యంద్వారా కొందరూ, గృహస్థ ధర్మాచరణంద్వారా కొందరూ, తపస్సుతో కొందరూ, నిష్కర్మత్వంతో కొందరూ, యజ్ఞాలద్వారా కొందరూ, దానధర్మాలద్వారా కొందరూ ఆత్మసందర్శనం పొందుతూ ఉంటారు.

క. జననీజనకారాధన । మున గురుభక్తిని సువృత్తమున శాంతిని దాం
తిని సత్యమున నహింసను । విను కాంతురు మోక్షపదము వేర్వేఱ జనుల్. 553

ప్రతిపదార్థం: ఓ భృగూ! వినుము= వినుము; జననీజనక= తల్లిదండ్రులను; ఆరాధనమునన్= సేవించటంద్వారా; గురుభక్తినిన్= గొప్ప భక్తితోనూ (గురువుపట్ల భక్తితోనూ); సువృత్తమునన్= మంచి నడవడికతోనూ; శాంతినిన్= శాంతస్వభావంతోనూ; దాంతినిన్= ఇంద్రియనిగ్రహంతోనూ; సత్యమునన్= సత్యవాక్య నియమపాలనంతోనూ; అహింసనున్= అహింసతోనూ ఇట్లా= ఈ విధంగా; జనుల్= ప్రజలు; వేర్వేఱ= వేరువేరుగా (ఎవరిదారిని వారు ప్రయాణించి); మోక్షపదము= ముక్తిపదవిని; కాంతురు= పొందుతారు (దర్శిస్తారు).

తాత్పర్యం: ఓయీ భృగూ! తల్లిదండ్రులను సేవించి కొందరూ, భక్తితో కొందరూ, మంచి శీలంతో కొందరూ, శాంతస్వభావంతో కొందరూ, ఇంద్రియ నిగ్రహంతో కొందరూ, సత్యవాక్య నియమంతో కొందరూ, అహింసావ్రతంతో కొందరూ - ఇట్లా ప్రజలు వేరే వేరే మార్గాలలో ముక్తిపదం పొందుతారు.

వ. అట్లు బహువిధంబు లగు ధర్మద్వారంబులు గలవు?; గలిగిన కలుచ నెల్లవారికి నాత్మానందం బలవడ నేర్చునే?
యొకటి యుపదేశించెద నాకర్ణింపుము. 554

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; బహువిధంబులు+అగు= అనేక విధాలయిన; ధర్మద్వారంబులు= ముక్తిమార్గాలు; కలవు= ఉన్నాయి; కలిగిన కలుచన్= (ముక్తిపొందాలి అనే) బుద్ధి పుట్టినప్పుడల్లా (కోరినప్పుడల్లా - అనికానీ. కలుచన్ అనే మాటకు

క్రోధము - క్షోభ - దోషము అనే అర్థాలను నిఘంటువులు చెబుతున్నాయి; అవి ఏవీ ఇక్కడ కుదరటంలేదు. కారణము అనే అర్థాన్ని శబ్దార్థ చంద్రిక ఇచ్చింది. ఈ వాక్యార్థానికి అది కొంత సరిపోతోంది. కోరిక పుట్టటమే కారణం కనుక); ఎల్లవారికిన్= అందరికీ; ఆత్మానందంబు= ఆత్మానందం అనేది; అలవడన్+నేర్చునే?= దొరుకుతుందా?; ఒకటి= ఒక్కవిషయం; ఉపదేశించెదన్= చెబుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మద్వారాలు ఎన్నో ఉన్నాయి. మోక్షం కావాలి అనుకొనగానే అందరికీ వెంటనే అది లభిస్తుందా? ఒక విషయం చెప్పుతాను. వినుము.

తే. నైమిశారణ్యమునయందు గోమతి యనఁ । బరఁగు నుత్తమనది, మహాపద్మ మనఁగఁ
గలదు పుణ్యహ్రదము దాని యలఘుతటత । లంబు నెలవుగానుండు నాగం బొకండు. 555

ప్రతిపదార్థం: నైమిశ+అరణ్యమున+అందున్= నైమిశారణ్యంలో; గోమతి+అనన్= గోమతి అనే పేరుతో; ఉత్తమనది= ఒక ఉత్తమమైన నది; పరఁగున్= ఉన్నది; మహాపద్మము+అనఁగన్= మహా పద్మము అనే పేరుతో; పుణ్యహ్రదము= పవిత్రమైన మడుగు; కలదు= అక్కడే ఉన్నది; దాని= దానియొక్క; అలఘు= పెద్దదయిన; తట= ఒడ్డుయొక్క; తలంబునన్= పరిసరం (తటతలంబు= ఒడ్డు); నెలవుగాన్= నివాసస్థలంగా; ఒకండు= ఒక; నాగంబు= సర్పం; ఉండున్= నివసిస్తోంది.

తాత్పర్యం: నైమిశారణ్యంలో పవిత్ర గోమతీనదీతీరంలో మహాపద్మమనే పవిత్ర తటాకం ఉన్నది. దాని ఒడ్డున ఒక సర్పం నివసిస్తున్నది.

క. ఆ తీర్థోత్తమమున మాం । ధాతృఁడు లోనుగ విశిష్టతపముల నిహలో
కాతిశయముఁ బరలోక । ద్యోతనముం బడసినారు దొల్లి యనేకుల్. 556

ప్రతిపదార్థం: ఆ+తీర్థ+ఉత్తమమునన్= ఉత్తమమైన ఆ తీర్థంలో (జలాశయంలో, రేవులో); మాంధాతృఁడు లోనుగన్= మాంధాతృడు మొదలుగా; అనేకుల్= చాలామంది; తొల్లి= పూర్వకాలంలో; విశిష్ట తపములన్= ప్రత్యేకమైన (విశిష్టమైన) తపస్సులతో; ఇహలోక= ఈ లోకంలో; అతిశయమున్= ఔన్నత్యాన్నీ; పరలోక= పరలోకానికి చెందిన; ద్యోతనమున్= తేజస్సునూ (పరలోక స్ఫూర్తినీ); పడసినారు= పొందారు.

తాత్పర్యం: 'మహాపద్మము' అనే ఆ తటాకప్రాంతంలో గొప్పగొప్ప తపస్సులు చేసి మాంధాతృడు మొదలుగా చాలామంది పూర్వకాలంలో ఇహపర శ్రేయస్సులు పొందారు.

వ. అప్పుణ్యక్షేత్రంబున. 557

ప్రతిపదార్థం: ఆ+పుణ్యక్షేత్రంబునన్= ఆ పవిత్రస్థలంలో.

తాత్పర్యం: ఆ పవిత్రస్థలంలో.

తే. పద్ముఁడను పేరి యన్నాగపతి యుదాత్తుఁ । డఖిల ధర్మజ్ఞుఁ డతుల దయాన్వితుండు
సుజన సంభావ్యమానుఁ డస్తోకపుణ్య । నియత నిత్యుఁ డాగంతుకప్రియతముండు. 558

ప్రతిపదార్థం: పద్ముఁడు+అను+పేరి= పద్ముడు అనే పేరు కలిగిన; ఆ+నాగపతి= ఆ సర్పరాజు; ఉదాత్తుఁడు= గొప్పవాడు; అఖిలధర్మజ్ఞుఁడు= సమస్త ధర్మాలూ తెలిసినవాడు; అతుల= సాటిలేని; దయా+అన్వితుండు= దయతో కూడినవాడు; సుజన= సజ్జనులతో; సంభావ్యమానుఁడు= గౌరవింపబడేవాడు; అస్తోక= అధికమైన; పుణ్య= పుణ్యకార్యాలతో; నియత= నియతమైన;

నిత్యుఁడు= ప్రతిక్షణమూ కలవాడు. (అనుక్షణం - నిత్యం - పుణ్యకార్యాలను నియతంగా - విధిగా - ఆచరించేవాడు అని); ఆగంతుక= అతిథులకు; ప్రియతముండు= మిక్కిలి ఇష్టుడు (ఆగంతకులే ప్రియతములుగా కలవాడు అని కానీ).

తాత్పర్యం: ఆ పుణ్యక్షేత్రంలో ఉండే నాగరాజు పేరు పద్ముడు. అతడు ఉత్తముడు. అన్ని ధర్మాలూ తెలిసినవాడు. గొప్ప దయాశాలి. సజ్జనులతో గౌరవించబడే వ్యక్తిత్వం కలవాడు. నిరంతరం పుణ్యప్రదమైన కార్యక్రమాలను ఆచరిస్తూ ఉంటాడు. అతిథులంటే అతడికి వల్లమాలిన ప్రేమ. అతిథులకూ అతడు ప్రియతముడే.

ఉ. అతనిఁ గానఁ బొమ్ము ప్రచురాదరణంబున నీదుకోర్కి సం
ప్రీతిగఁ దీర్చు నా గుణగరిష్ఠుఁడు నా పలుకూఁదు మన్న మో
దాతిశయంబు నొంది భృగుఁ డా ధరణీసురవర్యుతో మహా
త్మా! తెలివొందె నా మనము తావక పావన వాక్యసంపదన్. 559

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ పద్ముడిని; కానన్= దర్శించటానికి; పొమ్ము= వెళ్ళుము; ఆ+గుణగరిష్ఠుఁడు= గుణాలలో దొడ్డవాడైన ఆ పద్ముడు; ప్రచుర+ఆదరణంబునన్= విస్తృతమైన ఆదరంతో; సంప్రీతిగన్= ప్రీతి కలిగేటట్టు (నీకు తృప్తికలిగేటట్టు); నీదుకోర్కి= నీ కోరిక; తీర్చున్= తీరుస్తాడు; నా పలుకున్= నామాటను; ఊఁదుము= ఆధారంగా స్వీకరించుము (విశ్వసించుము); అన్నన్= అని అతిథి చెప్పేసరికి; భృగుఁడు= భృగుడు; మోద+అతిశయంబున్= అతిశయించిన ఆనందాన్ని (ఆనందాధిక్యాన్ని); ఒంది= పొంది; ఆ+ధరణీసుర+వర్యుతోన్= బ్రాహ్మణోత్తముడైన ఆ అతిథితో; మహాత్మా!= మహానుభావా!; తావక= నీయొక్క; పావన= పవిత్రమైన; వాక్యసంపదన్= మాటల సంపత్తితో; నా మనము= నా మనస్సు; తెలివి+ఒందెన్= తెలివిని (జ్ఞానాన్ని) పొందింది.

తాత్పర్యం: ఓ భృగూ! ఆ పద్ముడిని దర్శించుము. అతడు నీ కోరిక తీరుస్తాడు' అని అతిథి చెప్పాడు. దానికి భృగువు ఎంతో సంతోషించాడు. 'మహాత్మా! నీ మాటలతో నాకు జ్ఞానోదయమయింది' అన్నాడు.

క. అని పలికి యిట్లనియె ని । ద్దినశేషము రాత్రియును మదీయనివాసం
బున నిలువు నిలిచి మత్పా । వనుఁడవు గావలయు గౌరవశ్రీభరితా! 560

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా అన్నాడు; గౌరవశ్రీ= గౌరవశోభతో; భరితా!= నిండినవాడా!; ఈ+దినశేషమున్= ఈ పగటిపూటలో మిగిలిన ఈ కాస్తసేపూ; రాత్రియునున్= ఈ రాత్రీ; మదీయనివాసంబునన్= మా ఇంటిలో; నిలువు(ము)= ఆగుము; మత్పావనుఁడవు= నన్ను పవిత్రుడిని చేసేవాడవు; కాన్+వలయున్= అవ్వాలి.

తాత్పర్యం: ఇంకా, గౌరవసంపన్నుడా! ఈ పూటకూ ఈ రాత్రికీ నీవు నా నివాసంలోనే ఉండాలి. నన్ను పావనుడిని చేయాలి' అన్నాడు.

క. అనిన నతఁడట్ల చేయ న । తనిఁ బూజించుటను మధురతరసల్లాపం
బున ధర్మసత్కథావ । ర్తనమున నక్కాల మతఁ డుదాత్తతఁ గడపెన్. 561

ప్రతిపదార్థం: అనినన్= అని అభ్యర్థించగా; అతఁడు= ఆ అతిథి; అట్లు+అ= అట్లాగే; చేయన్= చేయగా; అతనిన్= ఆ అతిథిని; పూజించుటను= అర్చించటంతోనూ; మధురతర= మిక్కిలి మధురమైన; సల్లాపంబునన్= సంభాషణతోనూ; ధర్మ= ధర్మంతో కూడిన (ధర్మాలను ఉపదేశించే); సత్కథా+ఆవర్తనమునన్= మంచి కథలను కలబోసికొనటంతోనూ; ఆ+కాలమున్= ఆ సమయాన్ని; అతఁడు= ఆ భృగువు; ఉదాత్తతన్= ఉత్తమంగా(ఉదాత్తంగా); కడపెన్= కడపాడు.

తాత్పర్యం: భృగువు అభ్యర్థనను అతిథి అంగీకరించి ఆగిపోయాడు. అతడిని అర్చించటంలోనూ, మధుర సంభాషణలతోనూ, ధార్మికగాథలను ఆలకించటంలోనూ ఉదాత్తంగా ఆ సమయాన్ని భృగువు గడిపాడు.

క. వేగిన నామంత్రితుఁడై । యా గుణనిధి వీడుకొలిపి యతఁడు ప్రయాణో
ద్యోగంబు సమీచీనవి । ధా గరిమప్రౌఢవృత్తిఁ దగ నొనరించెన్. 562

ప్రతిపదార్థం: వేగినన్= తెల్లవారింది - అప్పుడు; ఆమంత్రితుఁడై= వీడ్కొల్పబడినవాడై; ఆ గుణనిధిన్= గుణసంపన్నుడైన ఆ అతిథిని (గుణాలకు నిధి); వీడుకొలిపి= పంపించి (పరస్పరం వీడ్కోలు చెప్పుకొని - అని); అతఁడు= ఆ భృగువు; సమీచీన= సరియైన; విధా= విధానం యొక్క; గరిమ= గొప్పదనంతో కూడిన; ప్రౌఢవృత్తిన్= నేర్పరితనంతో; ప్రయాణ+ఉద్యోగంబు= తన ప్రయాణ ప్రయత్నాన్ని; తగన్+ఒనరించెన్= తగినట్టుగా చేశాడు.

తాత్పర్యం: మధురసంభాషణలతో తెల్లవారింది. అప్పుడు అతిథి భృగువుకు వీడ్కోలు చెప్పాడు. భృగువు అతిథిని వీడ్కొలిపాడు. ఆ తరువాత తన ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లను సరియైన పద్ధతిలో నేర్పుగా తగిన రీతిలో చేశాడు.

భృగుం డను విప్రుండు పద్మం డను సర్పరాజుం గనవచ్చుట (సం. 12-343-2)

వ. ఇవ్విధంబున నుద్యుక్తుండై భృగుండు బంధుమిత్రజన సమ్మతం బగు తెఱంగునం గదలి యెడనెడ బహుతీర్థసేవనంబు సేయుచుం జని పుణ్యంబగు నైమిశారణ్యంబు సొచ్చి గోమతీతీరంబు సేరి, సుప్రసిద్ధం బగు మహాపద్మహ్రదంబు తటంబునం బొలుచు భుజగేంద్రమందిరంబు గాంచి తగం బ్రవేశించి నట్టియెడ. 563

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా ఉద్యుక్తుండై= సన్నద్ధుడై; భృగుండు= భృగువు; బంధు(జన)= బాంధవులకూ; మిత్రజన= మిత్రులకూ; సమ్మతంబు+అగు= అంగీకార యోగ్యమైన; తెఱంగునన్= పద్ధతిలో; కదలి= బయలుదేరి; ఎడనెడన్= అక్కడక్కడా; బహుతీర్థ సేవనంబు= అనేక తీర్థాలను సేవించటం; చేయుచున్= చేస్తూ; చని= వెళ్ళి; పుణ్యంబు+అగు= పుణ్యప్రదమైన; నైమిశ+అరణ్యంబు= నైమిశారణ్యం; చొచ్చి= ప్రవేశించి; గోమతీతీరంబు= గోమతీ నది ఒడ్డు; చేరి= సమీపించి; సుప్రసిద్ధంబు+అగు= మిక్కిలి ప్రసిద్ధమైన; మహాపద్మ హ్రదంబు= మహాపద్మము అనే తటాకంయొక్క; తటంబునన్= ఒడ్డున; పొలుచు= ఒప్పారుతున్న; భుజగేంద్ర మందిరంబు= నాగేంద్రుడి గృహం; కాంచి= చూచి; తగన్= తగినట్టు; ప్రవేశించినట్టి+ఎడన్= ప్రవేశించిన సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పూనుకొని భృగుడు బంధుమిత్రుల అనుమతిగల పద్ధతిలో పయనించి, అక్కడక్కడ పుణ్యతీర్థాలను సేవిస్తూ వెళ్ళి, పవిత్ర నైమిశారణ్యంలో ప్రవేశించి, గోమతీనది తీరం చేరి, ప్రసిద్ధమయిన మహాపద్మ మనే సరస్సు గట్టుమీద ఉన్న నాగేంద్రమందిరం చూచి, సముచితంగా అందులో ప్రవేశించే సమయంలో.

తే. భక్తితోడ నన్నాగేంద్రుపత్ని యెదురు । వచ్చి తోడ్కొని చని యర్చలిచ్చి 'మీర
లిందు రాకకుఁ గారణమేమి సెప్పుఁ । డెద్ది పనిచినఁ జేసెద నిద్ధచరిత!' 564

ప్రతిపదార్థం: ఆ+నాగేంద్రు= ఆ నాగేంద్రుని; పత్ని= భార్య; భక్తితోడన్= భక్తితో; ఎదురువచ్చి= ఎదురువచ్చి; తోడ్కొని చని= వెంట తీసికొనివెళ్ళి; అర్చలు+ఇచ్చి= (అతిథి మర్యాదలుగా) పూజలు చేసి; ఇద్ధచరిత!= పవిత్రమైన నడవడి కలవాడా!; మీరలు= తమరు; ఇందున్+రాకకున్= ఇక్కడకు రావటానికి; కారణము= కారణం (హేతువు); ఏమి= ఏమిటో; చెప్పుఁడు= దయచేసి చెప్పండి; ఎద్ది= ఏది; పనిచినన్= ఆజ్ఞాపించినా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆ నాగేంద్రుడి భార్య ఎదురువచ్చి భృగువును భక్తితో ఇంటికి తీసికొనివెళ్ళింది. అతిథిపూజలు చేసింది. 'మీరు ఏమి పనిమీద ఇక్కడికి వచ్చారో చెప్పండి. ఏది ఆజ్ఞాపిస్తే అది చేస్తాను' అన్నది.

వ. అనుటయు నమ్మహీదేవుండు 'దేవీ! భవదీయపతిం గాన వచ్చితి నెచ్చోనున్నవాఁ డవ్విభుం గానిపింపు' మనిన నతని కా భుజంగాంగన యిట్లనియె. 565

ప్రతిపదార్థం: అనుటయున్= అని ఆవిడ అనేసరికి; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు - భృగువు; దేవీ!= అమ్మా!; భవదీయపతిన్= నీ భర్తను; కానన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను; ఎచ్చోన్= ఎక్కడ; ఉన్నవాఁడు= ఉన్నాడు?; ఆ+విభున్= ఆ నీ భర్తను; కానిపింపుము= చూపించుము; అనినన్= అంటే; అతనికిన్= భృగువుకు; ఆ భుజంగ+అంగన= ఆ సర్పకాంత; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పింది.

తాత్పర్యం: దానికి ఆ బ్రాహ్మణుడు 'అమ్మా! నీ భర్తను కలిసి వెళ్ళటానికి వచ్చాను. ఆయన ఎక్కడున్నాడో తెలుపుము' అనగా ఆ సర్పకాంత ఇట్లా అన్నది.

క. ' తనకు నెలవరుస వచ్చిన । నినరథ వహనమున కాతఁడేఁగినవాఁ డే
డెనిమిది దివసములకు నిట । నునుదెంచుం దథ్యమిది ప్రసాద ప్రవణా! 566

ప్రతిపదార్థం: ప్రసాద= ప్రసన్నతాగుణంపట్ల; ప్రవణా!= తత్పరత కలవాడా! (ప్రసన్నమైన ఆకృతి కలవాడా! - అని అర్థం); తనకున్= నా భర్తకు; నెలవరుస= నెలవారీవంతు; వచ్చినన్= వచ్చి; ఇనరథ+వహనమునకున్= సూర్యరథాన్ని మోయటానికి; ఆతఁడు= ఆయన; ఏఁగినవాఁడు= వెళ్ళాడు; ఏడు+ఎనిమిది= ఏడులేక ఎనిమిది; దివసములకున్= రోజులకు; ఇట= ఇక్కడికి; చనుదెంచున్= తిరిగి వస్తాడు; ఇది= ఇది; తథ్యము= నిజం.

తాత్పర్యం: 'ఓ ప్రసన్నమూర్తీ! నెలవారీ వంతు రావటంతో నా భర్త సూర్యరథాన్ని మోయటానికి వెళ్ళాడు. ఏడు ఎనిమిది రోజులలో వస్తాడు. ఇది నిజం. (సూర్యరథానికి సర్పాలే రజ్జువులని పురాణప్రసిద్ధి.)

క. అతని తెఱంగిట్టిది వాం । ఛిత మెయ్యది యిత్తు ననఘ! చెప్పు' మనుడు నా
సతి కిట్లను భృగుఁడు 'భవ । త్పతిఁ గనుటయ కాక వాంఛ దక్కును గలదే? 567

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; అతని తెఱంగు= నా భర్త (ఉద్యోగ) పద్ధతి; ఇట్టిది= ఇటువంటిది (నెలనెలా ఒక వారం రోజులు సూర్యరథవహనానికి వెళ్ళటం); వాంఛితము= నీ కోరినది; ఏ+అది?= ఏమిటి?; ఇత్తున్= ఇస్తాను; చెప్పుము; అనుడున్= అనేసరికి; ఆ సతికిన్= ఆ పతివ్రతతో; భృగుఁడు= భృగువు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; భవత్= నీయొక్క;పతిన్= భర్తను; కనుట+అ+కాక= దర్శించటం ఒక్కటే తప్ప; తక్కును= మరొక; వాంఛ= కోరిక; కలదే?= నాకు ఉన్నదా?(లేదని అర్థం).

తాత్పర్యం: ఓ పావనుడా! నా భర్త చేసే ఉద్యోగం పద్ధతి ఇది. నెలనెలా ఒకవారం రోజులు సూర్యరథ వహనానికి వెళ్ళుతాడు. నీ కోరిక ఏమిటో చెప్పుము, తీరుస్తాను' అన్నది ఆ పతివ్రత. 'అమ్మా! నీ భర్తను దర్శించటంకంటె నాకు వేరే కోరిక ఏమీ లేదు' అని అన్నాడు భృగువు.

వ. అయ్యురగవల్లభు వచ్చునంతకు నుల్ల వనంబున నిలిచెద; నవ్విభుండు వచ్చినప్పుడు మఱవక నా తెఱం గెఱింగింపవలయు' నని పలికి పోయి భృగుండు గోమతీతట పుణ్యారణ్యంబున జప్యపరుండును నిరాహారుండునునై యుండె; నట్లుండ నా భుజంగపతి బాంధవులు దదీయ పత్నీపుత్ర సహితంబుగా నమ్మహీసురవరు పాలికిం జనుదెంచి మృదుమధురవాక్యంబుల ననునయించి 'నీ వాహారంబుగొనక నిలువం దొడంగిన నాఁటికి నేఁ డాఱవదినం బయ్యె నే మతిథిపూజా పరులము మాకు ధర్మవిరోధంబు గాకుండ మా చేయు నాతిథ్యంబు నాదరింపు మస్మత్ప్రార్థనంబున నన్నంబు ఫలంబు మూలంబు మఱియు నెయ్యదియైనను భుజించి మమ్ము రక్షింపవే?' యనిన వారలతో నా సువ్రతశీలుం డిట్లనియె. 568

ప్రతిపదార్థం: ఆ+ఉరగవల్లభుండు= ఆ సర్పరాజు; వచ్చునంతకున్= వచ్చేదాకా; ఉల్ల= అదిగో అల్లంతదూరంలో ఉన్న (ఉల్ల= అల్ల); వనంబునన్= అరణ్యంలో; నిలిచెదన్= వేచి ఉంటాను; ఆ+విభుండు= ఆ నాగరాజు; వచ్చినప్పుడు+అ= వచ్చిన వెంటనే; మఱవక= మరచిపోకుండా; నా తెఱంగు= నా విషయం; ఎఱింగింపన్+వలయున్= తెలియజేయాలి సుమా!; అని పలికి= అని చెప్పి; పోయి= వెళ్ళి; భృగుండు= భృగువు; గోమతీతట= ఆ గోమతి ఒడ్డున ఉన్న; పుణ్య+అరణ్యంబునన్= పవిత్రమైన అడవిలో; జప్యపరుండును= జప తత్పరుడూ; నిరాహారుండును+ఐ= ఆహారం తీసికోనివాడూ అయి; ఉండెన్= ఉన్నాడు; అట్లుండన్= అట్లా ఉండగా; ఆ భుజంగపతి= ఆ సర్పరాజు; బాంధవులు= బంధువులు; తదీయ= అతడి; పత్నీపుత్ర సహితంబుగాన్= భార్యాపుత్రులతో సహా; ఆ+మహీసురవరు= ఆ బ్రాహ్మణుడి; పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వచ్చి; మృదు= సున్నితమైన; మధుర= తీయనైన; వాక్యంబులన్= మాటలతో; అనునయించి= బుజ్జగించి; నీవు; ఆహారంబు+కొనక= ఆహారం తీసుకోకుండా; నిలువన్+తొడంగిన+నాఁటికిన్= ఇక్కడ ఉండటం మొదలుపెట్టినరోజుకు; నేఁడు= ఈనాడు; ఆఱవదినంబు= ఆరవ రోజు; అయ్యెన్= అయింది; ఏము= మేమంతా; అతిథిపూజాపరులము= అతిథులను అర్చించటమే వ్రతంగా కలవారం; మాకున్= మాకు; ధర్మవిరోధంబు= ధర్మలోపం (అతిథులను అర్చించకపోవటం అనే ధర్మవిరోధం); కాకుండన్= జరగకుండా; మా చేయు= మేము చేస్తున్న; ఆతిథ్యంబున్= అతిథిమర్యాదను; ఆదరింపుము= మన్నించి స్వీకరించుము; అస్మత్= మా; ప్రార్థనంబునన్= అభ్యర్థనతో; అన్నంబు= అన్నమో; ఫలంబు= ఫలమో; మూలంబు= దుంపయో; మఱియున్= ఇంకా; ఏ+అది+ఐనన్= ఏదయినా; భుజించి= ఆహారంగా తీసికొని; మమ్మున్= మమ్ములను; రక్షింపవే!= కాపాడవా! (ధర్మలోపం నుంచి రక్షించుము); అనినన్= అనివారు అభ్యర్థించగా; ఆ సువ్రతశీలుండు= మంచిదీక్ష, మంచి శీలమూ కలిగిన ఆ భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ నాగరాజు వచ్చేంతవరకు ఆ వనంలో ఉంటాను. ఆ రాజు రాగానే నా సంగతిని తెలపండి' అని చెప్పి, భృగుడు గోమతీపుణ్యారణ్యంలో జపం చేస్తూ, నిరాహారుడై ఉన్నాడు. అట్లా ఉండగా ఆ నాగరాజు బంధువులు అతడి భార్యాపుత్రులతో కలిసివచ్చి భృగువును తియ్యనిమాటలతో అనునయించి, 'నీవు ఆహారం తీసికొనక నేటికి ఆరునాళ్ళయింది. మేము అతిథిపూజాప్రియులం. మాకు ధర్మలోపం జరుగకుండా మా ఆతిథ్యం స్వీకరించుము. మా కోరిక మన్నించి అన్నమో, పండ్లో, కందమూలాలో - ఏవైనా తిని మమ్ములను రక్షించుము' అని అనగా, ఆ నిష్కామపరుడైన భృగువు ఇట్లా అన్నాడు:

ఉ. 'ఇంతన నేల? యేను భుజగేశ్వరు రాకయ వార్చినాఁడ, నా
కం తవునంతకుం గుడువ నాఁకలి నీళ్ళు త్రావఁ దృష్ణ యొ
క్కింతయు లేదు గా కలిగి యే యటవీస్థలి కేఁగుదెంచి యే
కాంతము యున్నవాఁడ? నియమాభరతున్ ననుఁ నేఁపనేటికిన్? 569

ప్రతిపదార్థం: ఇంత+అనన్+ఏల?= ఇంతగా చెప్పటం ఎందుకు?; ఏను= నేను; భుజగ+ఈశ్వరు= ఆ సర్పరాజు యొక్క; రాకయ= రాకకే; వార్చినాఁడన్= ఎదురుచూస్తున్నాను; అంత+అవునంతకున్= అంతవరకూ (అది సిద్ధించే దాకా); నాకు; కుడువన్= భుజించటానికి; ఆఁకలి= ఆకలీ; నీళ్ళులు= నీరు; త్రావన్= త్రాగటానికి; తృష్ణ= కోరికా; ఒక్కింతయున్= కాసింతకూడా; లేదు; (ఆకలీ ఉండదు దప్పికా ఉండదు అని - లేదు+కాక= ఉండనే ఉండదు - అని కానీ); కాక= అట్లా కాక; అలిగియే= కోపించినందువలనా; అటవీస్థలికిన్= ఈ అరణ్యప్రదేశానికి; ఏఁగుదెంచి= వచ్చి; ఏకాంతము+అ= ఒంటరిగా; ఉన్నవాఁడన్?= నేను ఉన్నది? (అలిగి ఇక్కడికి రాలేదు కదా!- అని); నియమ= ఒక నియమంపట్ల; అభిరతున్= పట్టుదల గలవాడనైన; ననున్= నన్ను; ఏఁపన్+ఏటికిన్= ఇట్లా బాధపెట్టటం ఎందుకు? (ఇబ్బంది పెట్టటం దేనికి?)

తాత్పర్యం: 'అయ్యా! ఇంతంతమాటలు అనటం ఎందుకు? సర్పరాజు రాకకొరకు ఎదురు చూస్తున్నాను. అది సిద్ధించేవరకూ నాకు ఆకలీ ఉండదు, దప్పికా ఉండదు. అంతేకాని, నేను అలిగి ఇట్లా వచ్చేసి ఈ అడవిలో ఏకాంతంగా కూర్చుండలేదుగదా! ఒక నియమంతో ఉన్నాను. నన్ను బాధపెట్టటం ఎందుకు చెప్పండి!

క. మీకును ధర్మవిరోధము । గాకుండుట కేన పూఁట గారవమున నా
లోకింపుఁ డింక దివసయు । గాకలనమునఁ గల్గ వ్రతసమాప్తియుఁ గలుగున్. 570

ప్రతిపదార్థం: మీకునున్= మీకు కూడా; ధర్మవిరోధము= ధర్మలోపం; కాకుండుటకున్= కాకుండా ఉండటానికి; ఏను+అ= నేనే; పూఁట= పూచీ (ఆ బాధ్యతనాది - అని); గారవమునన్= ప్రేమతో; ఆలోకింపుఁడు= చూడండి (వేచి ఉండండి); ఇంకన్= మరొక; దివసయుగ= రెండురోజులు; ఆకలనమున్= కడవటంకూడా; కల్గన్= జరిగితే; వ్రతసమాప్తియున్= నా (నిరాహార) దీక్షాసమాప్తి కూడా; కలుగున్= జరుగుతుంది.

తాత్పర్యం: మీకు ధర్మవిరోధం జరుగకుండా ఉండటానికి నాదీ పూచీ. కాస్త గౌరవంతో వేచి చూడండి. మరొక రెండురోజులు ఇట్లాగే గడిస్తే నా వ్రతం కూడా పూర్తి అయిపోతుంది.

క. వినుఁ డష్టమమగు దివసం । బున ముదమారంగ నిందు భుజగేంద్రుఁడు రా
కునికి గలిగెనేనియుఁ బర । దినమునఁ గుడిచెద భవన్మతిం బ్రియ మెసఁగన్. 571

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; అష్టమము+అగు= ఎనిమిదవదైన; దివసంబునన్= రోజున; ముదమారంగన్= సంతోషకరంగా; ఇందున్= ఇక్కడికి; భుజగ+ఇంద్రుఁడు= ఆ సర్పరాజు; రాక+ఉనికి= రాకపోవటం; కలిగెన్+ఏనియున్= జరిగినట్టయితే (రాకపోతే); పరదినమునన్= ఆ మరుసటిరోజున; భవత్+మతిన్= మీ కోరికమేరకు (మీ ఆలోచన ప్రకారం); ప్రియము+ఎసఁగన్= ఇష్టం అతిశయించేట్టు (పూర్తి ఇష్టంతో); కుడిచెదన్= భుజిస్తాను.

తాత్పర్యం: అయ్యా! వినండి. ఎనిమిదవ రోజుకు ఆ సర్పరాజు రావాలి. ఒకవేళ రాకపోతే ఆ మర్నాడు మీరు కోరినట్లే హాయిగా ఇష్టపడి భోజనం చేస్తాను.

వ. మీర లిత్తెఱంగున కనుజ్ఞ సేయవలయు' నని సంప్రార్థనీయస్వరంబునం బలికిన వారలందఱు నొడంబడి నిజనివాసంబులకుం జని రయ్యష్టమ దివసంబున. 572

ప్రతిపదార్థం: మీరలు= మీరు; ఈ+తెఱంగునకున్= ఈ పద్ధతికి; అనుజ్ఞ= అనుమతి; చేయవలయున్= ఈయవలెను; అని= అని; సంప్రార్థనీయ+స్వరంబునన్= వేడుకొనే కంఠస్వరంతో; పలికినన్= అడిగేసరికి; వారలు+అందఱున్= వారంతా; ఒడంబడి= అంగీకరించి; నిజనివాసంబులకున్= తమ తమ గృహాలకు; చనిరి= వెళ్ళారు; ఆ+అష్టమ దివసంబునన్= ఆ ఎనిమిదవ రోజున-

తాత్పర్యం: మీరు దీనికి అంగీకరించాలి' అని ఆయన వేడుకొనగా, వాళ్ళందరూ దానికి అంగీకరించి తమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఎనిమిదవ రోజున. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వరుస దినంబులు దీఱిన । నరవిందాప్తుండు దనకు ననుమతి సేయం
గురువంశముఖ్య! తగ న । య్యురగాధీశుండు విభవమొప్పఁగ వచ్చెన్. 573

ప్రతిపదార్థం: కురువంశముఖ్య!= కురువంశంలో ప్రధానమైనవాడా (పెద్దవాడా) ఓ ధర్మరాజా!; వరుసదినంబులు= తనవంతు రోజులు (తన చుట్టు రోజులు); తీఱినన్= తీరిపోగా; అరవింద+ఆప్తుఁడు= పద్మాలకు మిత్రుడైన సూర్యుడు; తనకున్= తనకు;

అనుమతి+చేయన్= వెళ్ళటానికి అనుమతి ఈయగా; తగన్= తగినట్లు; ఆ+ఉరగ+అధీశుండు= ఆ సర్పరాజు; విభవము+ఒప్పఁగన్= తన వైభవం అతిశయించేటట్టు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజా! సర్పరాజుకు సూర్యరథాన్ని మోయవలసిన తనవంతు రోజులు గడిచిపోయాయి. సూర్యుడు అనుమతి ఇచ్చాడు. ఆ సర్పరాజు వైభవంగా ఇంటికి తిరిగివచ్చాడు.

ఉ. వచ్చిన సంభ్రమంబు గరువంపు టెలర్పును నుల్లసిల్లి మే
నచ్చు పడంగఁ జేయఁ జెలు వా భుజగేశ్వరుపత్ని యాతనిం
జెచ్చెరఁ దా నెదుర్కొని విశిష్టసమాదరయై యుపాయనం
బిచ్చి తదీయచిత్తమునకిం పెసలారఁగఁ బాద్య మిచ్చినన్. 574

ప్రతిపదార్థం: వచ్చినన్= వచ్చేసరికి; సంభ్రమంబున్= హడావుడీ; గరువంపు+ఎలర్పునన్= అతిశయం తాలూకు విజృంభణలతో; ఉల్లసిల్లి= సంతోషించి; మేను= శరీరం (ఆకారం); చెలువున్= ఆ సౌందర్యాన్ని (సంభ్రమమూ గరువమూ - వీటి విలాసాన్ని); అచ్చుపడంగన్+చేయన్= స్పష్టపడేటట్టు చేయగా (స్వేదరోమాంచాదులతో అవి స్పష్టపడ్డాయి - అని); ఆ+భుజగ+ఈశ్వరు+పత్ని= ఆ సర్పరాజుగారి భార్య; ఆతనిన్= ఆ సర్పరాజును; చెచ్చెరన్= వెంటనే (వేగంగా); తాను= సర్పరాజు భార్య; ఎదుర్కొని= ఎదురు సన్నాహం వెళ్ళి; విశిష్ట= విశేషమైన; సమాదరయై= ఆదరంతో కూడినదై; ఉపాయనంబు+ఇచ్చి= ((ప్రేమసూచకంగా) బహుమతి ఇచ్చి; తదీయ= ఆతని; చిత్తమునకున్= హృదయానికి; ఇంపు+ఎసలారఁగన్= ఇంపు కలిగేటట్టు; పాద్యము= పాదోదకం; ఇచ్చినన్= ఈయగా (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: సర్పరాజు భార్య హడావుడిగా 'నా భర్త ఇంటికి వచ్చాడు' అనే అతిశయంతో ఎదురువెళ్ళి ఆదరంగా బహూకరించి తీసికొని వచ్చింది. కాళ్ళకు నీళ్ళు ఇచ్చింది. సర్పరాజు మనస్సు ఈ ఆదరానికి సంతోషించింది.

వ. సంప్రీతుండై సముచితప్రకారంబున నుండె నట్లున్న యన్నాగేంద్రుండు సమీపాసీనయైన యద్దేవి నాలోకించి. 575

ప్రతిపదార్థం: సంప్రీతుండై= సంతోషించినవాడై; సముచితప్రకారంబునన్= తగిన పద్ధతిలో; ఉండెన్= ఉన్నాడు; అట్లు+ఉన్న= అలా ఉన్నటువంటి; ఆ+నాగేంద్రుండు= ఆ నాగరాజు; సమీప= తనకు దగ్గరగా; ఆసీనయైన= కూర్చునిఉన్న; ఆ+దేవిన్= ఆమెను (తనభార్యను); ఆలోకించి= చూచి.

తాత్పర్యం: సర్పరాజు సంతోషించాడు. తనకు దగ్గరగా ఉన్న భార్యను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'అతివ! సేమమె? తగ దేవతాతిథి ప్ర । పూజనంబులు నడచునే? పూర్వవృత్తి
యెడలి యేను లేకునికి నేమేని వికల । మయ్యెనో? చెప్పు' మనవుడు నా మృగాక్షి. 576

ప్రతిపదార్థం: అతివ= ఓ మగువా! సేమమె?= క్షేమమేనా?; తగన్= తగిన పద్ధతిలో; దేవతా+అతిథి+ప్రపూజనంబులు= దేవతాపూజలూ, అతిథిసేవలూ; నడుచునే?= సాగుతున్నాయా?; ఏనున్= నేను; లేకునికిన్= లేకపోవటంతో; పూర్వవృత్తి+ఎడలి= మునుపటి పద్ధతి తప్పిపోయి; ఏమేనిన్= ఏదయినా; వికలము+అయ్యెనో?= పొరపాటు జరిగిందా?; చెప్పుము; అనవుడున్= అనగానే; ఆ+మృగాక్షి= లేడి కన్నులవంటి కన్నులుగల ఆ వనిత.

తాత్పర్యం: 'ఓ అతివా! క్షేమమే కదా! దేవతాపూజలూ, అతిథి పూజలూ యథావిధిగా జరుగుతున్నాయా? నేను ఊళ్ళో లేనుకదా అని మునుపటి పద్ధతి తప్పిపోయి ఏమయినా మార్పులూ పొరపాట్లూ జరిగాయా? చెప్పుము' అని ఆ సర్పరాజు ప్రేమగా అడిగాడు.

ఉ. ఆతనితోడ నిట్లనియె 'నంత యెఱుంగమి రాదు నీదు శి
క్షాతిశయంబు గల్మి భుజగాధిప! నాకుఁ దగన్ సమస్తదే
వాతిథి పూజనంబులు సమగ్రములై నడచెన్ సుహృజ్జన
ప్రీతియు మున్నపోలె నవిభేదత యొప్పఁగ నిర్వహించితిన్.' 577

ప్రతిపదార్థం: ఆతనితోడన్= ఆ సర్పరాజుతో; ఇట్లు+అనియెన్= ఆమె ఇలా అంది; భుజగ+అధిప!= ఓ సర్పరాజా!; నీదు= నీవు ఇచ్చిన; శిక్షా= అభ్యాసంతాలూకు (తర్ఫీదు); అతిశయంబు+కల్మిన్= ఔన్నత్యం ఉండటంవల్ల; నాకున్= నాకు; అంత+ఎఱుంగమి= ఆ మాత్రం ఎరగకపోవటం; కాదు= లేదు (ఆమాత్రం ఎరుగుదునులెమ్ము - అని); తగన్= తగినపద్ధతిలో; సమస్తదేవ= సకలదేవతల; అతిథి= అతిథుల పూజనంబులు= అర్చనలు; సమగ్రములై= పరిపూర్ణాలై; నడచెన్= సాగాయి; సుహృద్+జన= స్నేహితుల; ప్రీతియున్= సంతృప్తికూడా (వారిని గౌరవించి ఆనందింపజేయటమనేది సైతం); మున్ను+అ+పోలెన్= మునుపటివలెనే; అవిభేదతన్= ఏమీ తేడా లేకుండా; ఒప్పఁగన్= ఒప్పేట్టు; నిర్వహించితిన్= నిర్వహించాను.

తాత్పర్యం: 'ఓ సర్పరాజా! నే నేమీ ఆమాత్రం ఎరుగనిదానిని కాదు. ఇంతకాలమూ నీవు ఇచ్చిన శిక్షణ ఉన్నది కదా! దేవతాపూజలూ అతిథిసత్కారాలూ అన్నీ సమగ్రంగా యథావిధిగా జరిగాయి. స్నేహితులను గౌరవించి సంప్రీతులను చేయటమనేది కూడా మునుపటివలెనే ఏమీ తేడా లేకుండా నిర్వహించాను' అని బదు లిచ్చింది.

వ. అని వెండియు. 578

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. గురుభక్తి శిష్యులకును, వేదపరత వి । ప్రులకును, జనరక్ష భూపతులకు,
న్యాయార్జనంబు వైశ్యజనంబులకుఁ ద్రివ । ర్ణారాధనంబు శూద్రావళికిని,
బతివాక్య కరణంబు భటులకు, సర్వోప । కారక్షమంబైన సారభూత
మనఁగఁ బెంపొందు గృహస్థాశ్రమంబుపై । వారని ప్రియ మెల్లవారలకును,

తే. లోక మేల? యేనేల? యి ట్టేకతంబ । యింద్రియంబులఁ గుదియించి యిచ్ఛ నడఁచి
యుండువాఁడఁ గాకను మతి యోగికిని, బ । తివ్రతాత్వంబు భార్యకు సువ్రతములు. 579

ప్రతిపదార్థం: గురుభక్తి= గురువుపట్ల భక్తి; శిష్యులకును= శిష్యులకూ; వేదపరత= వేదాలపట్ల తత్పరత; విప్రులకును= బ్రాహ్మణులకూ; జనరక్ష= ప్రజలను రక్షించటం; భూపతులకున్= రాజులకూ; న్యాయ+ఆర్జనంబు= న్యాయంగా ధనాన్ని సంపాదించటం; వైశ్యులకున్= కోమటులకూ; త్రివర్ణ= పై మూడు వర్ణాలవారినీ; ఆరాధనంబు= అర్చించటం; శూద్ర+ఆవళికిని= శూద్రుల సమూహానికీ; పతి= ప్రభువుయొక్క; వాక్య= ఆజ్ఞను; కరణంబు= చేయటం; భటులకున్= సేవలకూ(సైనికులకూ); సర్వ= అందరికీ; ఉపకార= ఉపకరించటంలో; క్షమంబు+ఐన= సమర్థమైన; సారభూతము= సారప్రాయమయినది; అనఁగన్= అని; పెంపొందు= ప్రశస్తిని పొందిన; గృహస్థ+ఆశ్రమంబుపైన్= గృహస్థాశ్రమం మీద; వారని= వారింపరాని; ప్రియము= ప్రేమ; ఎల్లవారలకును= అందరికీ; (సువ్రతములు); లోకము+ఏల?= ఈ లోకం ఎందుకు? ఏను+ఏల?= నేను ఎందుకు?; ఇట్టు= ఇట్లా; ఏకతంబు+అ= ఒంటరిగా (ఏకాంతంలో)నే; ఇంద్రియంబులన్= ఇంద్రియాలను; కుదియించి= నిగ్రహించి; ఇచ్చన్= కోరికను; అడఁచి= అణచివేసి; ఉండువాఁడన్+కాక= ఉండిపోతానే తప్ప; అను= అనేటటువంటి; మతి= బుద్ధి; యోగికినిన్= యోగికీ; పతివ్రతాత్వంబు= పాతివ్రత్యం; భార్యకున్= భార్యకూ; సువ్రతములు= ఆచరించదగిన వ్రతాలు (నియమాలు).

తాత్పర్యం: గురువుపట్ల భక్తి శిష్యులకు వ్రతం. వేదతత్పరత బ్రాహ్మణులకు వ్రతం. లోకరక్షణ రాజులకు వ్రతం. న్యాయంగా ధనం సంపాదించటం వైశ్యులకు వ్రతం. పై మూడు వర్ణాలవారినీ సేవించటం శూద్రులకు వ్రతం. రాజాజ్ఞను శిరసావహించటం భటులకు వ్రతం. సర్వాశ్రమాల వారికీ ఉపకారం అందించే గృహస్థాశ్రమం మీద ప్రేమ అందరికీ వ్రతం. లోకం ఏమిటి? నే నేమిటి? ఇవన్నీ నాకెందుకట! హాయిగా ఏకాంతంలో తపస్సు చేసికొంటూ ఇంద్రియాలను జయిస్తాను, కోరికలను జయిస్తాను - అనే బుద్ధి కలిగి ఉండటం యోగికి వ్రతం. పాతివ్రత్యం భార్యకు వ్రతం.

వ. కావున ధర్మసూక్ష్మ సంవేది వగు నీదు చిత్తంబున భేదం బొక్కింతయేనియు దొడరునట్టి విధంబున వర్తింతునే? యొకండు విన్నపంబు సేయంగల దవధరింపుము. పరమపావనమూర్తి యొక్క మహీసురోత్తముం డిచ్చటికి వచ్చి యభ్యర్చితుండై భవత్పతి దర్శింప వచ్చితిననియెఁ గార్యంబేమి? యని యడిగిన నాకుం జెప్పకుండె; నేను నీ వట సనుటం జెప్పిన విని యట్లయిన నా భుజంగవిభుండు వచ్చునంతకు నుల్ల వనంబున నుండెద నతండు వచ్చిన నా తెఱం గెఱింగింపు మని చని యేడెనిమిది నాళ్ళేని జప్యపరుండును నిరాహారుండునై యున్నవాఁడు; నీ వచ్చటి కరిగి యతని సంభావింపవలయు నని చెప్పిన నా సర్ప గ్రామణి గుపితచిత్తుండై. 580

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ధర్మసూక్ష్మ= ధర్మసూక్ష్మాలను; సంవేదివి+అగు= తెలిసినవాడవైన; నీదు= నీయొక్క; చిత్తంబునన్= మనస్సులో; భేదంబు= బాధ; ఒక్కింత+ఏనియున్= కొంచెమయినా; తొడరునట్టి= కలిగేటటువంటి; విధంబునన్= విధంగా; వర్తింతునే?= ప్రవర్తిస్తానా?; ఒకండు= ఒకానొకటి; విన్నపంబు= విజ్ఞాపన; చేయన్= చేయటానికి; కలదు= ఉంది; అవధరింపుము= దయతో ఆలకించుము; పరమపావనమూర్తి= మిక్కిలిపవిత్రమైన ఆకారం కలవాడు; ఒక్క= ఒకానొక; మహీసుర+ఉత్తముండు= బ్రాహ్మణోత్తముడు; ఇచ్చటికిన్= ఇక్కడికి (మన ఇంటికి); వచ్చి= విచ్చేసి; అభ్యర్చితుండై= పూజింపబడినవాడై; భవత్= (అమ్మా!) నీయొక్క; పతిన్= భర్తను; దర్శింపన్= దర్శించటంకోసం; వచ్చితిన్= వచ్చాను; అనియెన్= అన్నాడు; కార్యంబు= పని; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడిగితే; నాకున్= నాకు; చెప్పక+ఉండెన్= చెప్పలేదు; నేనున్= నేను; నీవు; అట= సూర్యరథవహనం కోసమని అట్లా; చనుటన్= వెళ్ళటాన్ని; చెప్పినన్= తెలియజేస్తే; విని; అట్లు+అయినన్= అట్లాగైతే; ఆ+భుజంగవిభుండు= ఆ సర్పరాజు; వచ్చునంతకున్= వచ్చేదాకా; ఉల్ల= అల్లదిగో ఆ; వనంబునన్= అరణ్యంలో; ఉండెదన్= (నిరీక్షిస్తూ) ఉంటాను; అతండు= ఆ సర్పరాజు; వచ్చినన్= వస్తే (రాగానే); నా తెఱంగున్= నా విషయం; ఎఱింగింపుము= తెలియచేయుము; అని; చని= వెళ్ళి; ఏడు+ఎనిమిదినాళ్ళు+ఏనిన్= ఏడెనిమిది రోజులయినా; జప్యపరుండును= జపతత్పరుడూ; నిరాహారుండునున్+ఐ= ఆహారం ఏమీ తీసికోనివాడుగా; ఉన్నవాఁడు= ఉన్నాడు; నీవు= నీవు; అచ్చటికిన్= అక్కడికి; అరిగి= వెళ్ళి; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; సంభావింపన్+వలయున్= గౌరవించాలి; అని= అని; చెప్పినన్= ఆమె చెప్పేసరికి; ఆ సర్పగ్రామణి= ఆ నాగరాజు (గ్రామణి= నాయకుడు); కుపిత= కోపించిన; చిత్తుండై= హృదయం కలవాడై (కోపించిఅని).

తాత్పర్యం: కాబట్టి ధర్మరహస్యం తెలిసిన నీదు హృదయంలో ఏమాత్రం భేదం కలిగే విధం వర్తిస్తుందా? నాది ఒక విన్నపం ఉన్నది. వినుము. పవిత్రుడైన ఒక బ్రాహ్మణోత్తముడు ఇచ్చటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించి 'మీ భర్తను దర్శించటానికి వచ్చాను' అన్నాడు. 'పని ఏమిటి?' అని అడిగాను. దాని కతడు సమాధానం చెప్పలేదు. నేను-నీవు అక్కడికి వెళ్ళటం తెలిపాను. 'అయితే, ఆ నాగరాజు వచ్చేంతవరకు అల్లంత దూరంలో ఉన్న వనంలో ఉంటాను. ఆయన వస్తే నా సంగతి తెలియజేయుము' అని వెళ్ళి, ఏడెనిమిది నాళ్ళైనా జపంలో ఉండి, నిరాహారుడై ఉన్నాడు. నీవు అక్కడికి వెళ్ళి అతడిని పలుకరించాలి' అని చెప్పగా, ఆ నాగరాజు కుపితుడై.

క. ‘ ఏనటె! యొక్కెడ కొక్కొరుఁ । గానఁగఁ బోదు నటె! దేవగణము నసురులున్
లోనుగ నన్నే చందము । మానుగ నడపుదురు తలఁపుమా చతురమతీ! 581

ప్రతిపదార్థం: చతురమతీ!= ఓ నెఱజాణా! (చతురమైన మతి కలదానా!); ఏనటె!= నేనా!; ఒక్క+ఎడకున్= మరొకచోటుకు; ఒక్కొరున్= మరొకరిని; కానఁగన్= దర్శించటానికి; పోదునటె!= వెడతానా! (వెళ్ళటమా!); దేవగణమున్= దేవతల సమూహమూ; అసురలున్= రాక్షసులూ; లోనుగన్= మొదలైనవారు; నన్నున్= నన్ను (నాపట్ల); ఏ చందము= ఏ ప్రకారం; మానుగన్= గౌరవంగా (ఏ చందమునానుగన్= ఏ ప్రకారంగా); నడపుదురు= నడుపుతూ ఉంటారో (నన్ను ఎట్లా గౌరవిస్తుంటారో); తలఁపుమా= ఒకసారి గుర్తుచేసుకో.

తాత్పర్యం: ‘ఓ నెఱజాణా! నేనా! ఇంకొక చోటికి ఎక్కడికో వెళ్ళి ఎవరినో దర్శించటమా! అసంభవం. దేవతలూ, రాక్షసులూ ఇంకా తక్కినవారూ నాపట్ల ఎట్లా ఉంటారో, ఎంత గౌరవం చూపుతారో నీవు ఎరుగుదువు అది ఒకసారి గుర్తుకు తెచ్చుకొమ్ము. వా డెవడి దర్శనానికో నన్ను వెళ్ళమంటా వేమిటి!

తే. అనిన నీ రాక వార్చి మహాశతోడ । నున్న విప్రుని యభిలాష మొక్కభంగిఁ
దీర్పకుండుట ధర్మువే? ధీరశాంత । చిత్త! నీయట్టి యాచారవిత్తమునకు. 582

ప్రతిపదార్థం: అనినన్= అనేసరికి; ధీర శాంత చిత్త!= గంభీరమైన శాంతమైన చిత్తం కలవాడా!; నీ రాక= నీ ఆగమనం; వార్చి= (ఎదురుచూస్తూ) ప్రతీక్షించి; మహా+ఆశతోడన్= పెద్ద ఆశతో; ఉన్న= ఉన్నటువంటి; విప్రుని= బ్రాహ్మణుడియొక్క; అభిలాషము= కోరికను; ఒక్కభంగిన్= ఒక విధంగా; తీర్పక+ఉండుట= తీర్చకపోవటం; నీ+అట్టి= నీవంటి; ఆచారవిత్+తమునకున్= సదాచారం తెలిసినవారిలో గొప్పవాడికి; ధర్మువు+ఏ ?= ధర్మమా? (న్యాయమా?)

తాత్పర్యం: ధీరశాంతచిత్తుడా! నీ రాకకొరకు వేచి ఆశతో ఎదురుచూస్తున్న ఒక బ్రాహ్మణుడి కోరికను తీర్చకపోవటం నీవంటి ధర్మవేత్తకు న్యాయమా? చెప్పుము.

క. ధరణీసురు నాస సెఱిచినఁ । బొరసిన పాపాగ్నిఁ గాల్పఁ బూనెదవే? నీ
పురుషార్థంబును సముచిత । పరత్వమును గృపయు ధర్మపాండిత్యంబున్. 583

ప్రతిపదార్థం: ధరణీసురు= బ్రాహ్మణుడియొక్క; ఆస= ఆశను; చెఱిచినన్= నాశనం చేసినందువలన; పొరసిన= ఉత్పన్నమైన; పాప+అగ్నిన్= పాపము అనే అగ్నిలో; నీ= నీయొక్క; పురుషార్థంబునున్= ముక్తినీ; సముచిత పరత్వమునున్= ఉచితజ్ఞతను (సముచితమైన దానిపట్ల తత్పరత కల్గి ఉండుట) లేదా సత్ప్రవర్తననూ; కృపయున్= దయనూ; ధర్మపాండిత్యంబున్= ధర్మాలపట్ల నీకున్న పాండిత్యాన్నీ; వీటన్నింటినీ; కాల్పన్+పూనెదవే?= దగ్ధం చెయ్యటానికి పూనుకొంటావా?;

తాత్పర్యం: ఒక బ్రాహ్మణుడిని నిరాశపరిచి, ఆ పాపాగ్నిలో నీ ముక్తినీ, ఔచిత్యాన్నీ, దయనూ, ధార్మిక పాండిత్యాన్నీ - వీటన్నింటినీ తగులబెట్టుకొంటావా?

క. వినుమాశావిచ్ఛేదన । మునఁ బాటిలు బ్రహ్మహత్య, భుజగోత్తమ! ధ
ర్మనిరూఢుఁడైన పురుషున । కును దద్విజనాస దీర్పఁగోరుట వలదే? 584

ప్రతిపదార్థం: భుజగ+ఉత్తమ!= ఓ సర్పరాజా!; వినుము= వినండి; ఆశా+విచ్ఛేదనమునన్= ఆశను సంహరించటంవలన; బ్రహ్మ హత్య= బ్రాహ్మణుడిని సంహరించిన దోషం; పాటిలున్= కలుగుతుంది (చుట్టుకొంటుంది); ధర్మ= ధర్మంపట్ల; నిరూఢుఁడు+ఐన=

నిష్ఠకల్గినవాడైన; పురుషునకును= మానవుడికి; తద్= ఆ; ద్విజు= బ్రాహ్మణుడి; ఆస= కోరిక; తీర్పన్+కోరుట+వలదే?= తీర్చాలి అనుకోవటం అవసరంలేదా?

తాత్పర్యం: ఓ సర్పరాజా! బ్రాహ్మణుడి ఆశను ఖండిస్తే బ్రాహ్మణుడినే సంహరించినంతటి పాపం చుట్టుకొంటుంది. నీవు ధర్మపరుడవు. అట్లాంటి విప్రుల కోరిక తీర్చటం నీవు కోరుకొనవలసింది కాదంటావా!

క. మౌనమున దృఢజ్ఞానము । దానంబున నభ్యుదయము ధర్మనిరత! యా
శా నిర్వహణంబున నర । కానీక నిహరణ సౌఖ్య మగునండ్రు బుధుల్. 585

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ఓ ధర్మతత్పరుడా! (ధర్మంపట్ల నిరతి కలవాడా!); మౌనమునన్= మౌనంవలన; దృఢజ్ఞానము= నిశ్చలమైన (గాఢమైన); జ్ఞానమున్= జ్ఞానమూ; దానంబునన్= దాతృత్వంవలన; అభ్యుదయమున్= అభివృద్ధి; ఆశా నిర్వహణంబునన్= ఆశలు తీర్చినందువలన; నరక+అనీక= నరకలోకాల (అనీకం= గుంపు); నిహరణ= పరిహరణరూపమైన (పరిహరణంతో కలిగిన); సౌఖ్యము= సుఖమూ; అగున్= కలుగుతాయి అని; బుధుల్= పండితులు; అండ్రు= అంటూ ఉంటారు.

తాత్పర్యం: ఓ ధార్మికా! మౌనంవలన దృఢజ్ఞానమూ, దానంవలన అభ్యుదయమూ, ఆశలు తీర్చినందువలన నరకలోక బాధ తప్పిపోయి స్వర్గలోకసుఖాలు లభిస్తా యని పెద్దలు చెప్పుతూ ఉంటారు.

తే. చాతకము వానఁగోరెడు చందమొంద । నెదురుచూచుచు నున్నవాఁ డిందు నీదు
రాక కక్కట! యడవిలో బ్రాహ్మణుండు । రోష ముడుగుము ధర్మనిరూఢ హృదయ!' 586

ప్రతిపదార్థం: ధర్మ= ధర్మంపట్ల; నిరూఢ= గాఢంగా నాటుకొన్న; హృదయ!= హృదయం కలవాడా!; చాతకము= చాతకపక్షి; వానన్= తొలకరివానను; కోరెడు+చందము+ఒందన్= కోరినరీతిలో పొందేవిధంగా; ఇందున్= ఇక్కడ; అడవిలోన్= అరణ్యంలో; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; నీదు= నీయొక్క; రాకకున్= ఆగమనానికి; ఎదురుచూచుచున్నవాఁడు= నిరీక్షిస్తున్నాడు; అక్కట!= అయ్యో!; రోషము= రోషాన్ని (నేనా! వెళ్ళటమా! అనే రోషాన్ని); ఉడుగుము= విడిచిపెట్టుము.

తాత్పర్యం: ధర్మనిరూఢమైన హృదయం కలిగిన ఓ సర్పరాజా! తొలకరి వానకొరకు చాతకం ఎదురుచూసేటట్లు నీ రాకకొరకు ఎదురుచూస్తూ ఆ విప్రుడు ఇక్కడే ఈ అడవిలోనే ఉన్నాడు. అయ్యో! నీ రోషం చాలించుము.

విశేషం: అలం: ఉపమ.

వ. అని పత్ని బోధించిన. 587

ప్రతిపదార్థం: అని; పత్ని= భార్య; బోధించినన్= బోధించేసరికి.

తాత్పర్యం: అని భార్య బోధించగా.

చ. అనయముఁ దేఱి నాగపతి యక్కమలానన మోము సూచి యి
ట్లను 'నొరుఁ గానఁ బొమ్మనిన యంతన రోషము వచ్చి యిట్టు లొ
ప్పని పలుకుల్ సగర్వమునఁ బల్కితి దానికి శంకలేక చె
ప్పిన జతనంపు ధర్మమునఁ బేర్మియు నాకు నొనర్చి తుగ్మలీ! 588

ప్రతిపదార్థం: అనయమున్= పూర్తిగా (నయము= నీతి. అది కానిది అనయము= అధర్మం. దానినుండి); తేఱి= తేరుకొని; నాగపతి= ఆ నాగరాజు; ఆ+కమల+ఆనన= ఆ పద్మముఖి; మోము= ముఖం; చూచి; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు (అన్నాడు);

ఉగ్మలీ!= ఓ వనితా!; ఒరున్= పరుడిని; కానన్= దర్శించటానికి; పొమ్ము= వెళ్ళు; అనిన+అంతన= అన్న వెంటనే; రోషమువచ్చి= నాకు రోషం పొడుచుకు వచ్చి; ఇట్టులు= ఇట్లా; ఒప్పని= తగని; పలుకుల్= మాటలు; సగర్వమునన్= అహంకారంతో; పల్కితిన్= పలికాను; దానికిన్= అలా చేసినదానికి; శంకలేక= జంకూ గొంకూ లేకుండా (ఇంక ఎంత మండిపడతానో - అనే శంక పెట్టుకోకుండా); చెప్పిన= నీవు ఉపదేశించినటువంటి; జతనంపు ధర్మమునన్= ప్రయత్నధర్మంవలన (ఆచరించవలసిన ధర్మంవలన); నాకున్= నాకు; పేర్మియున్= ప్రతిష్ఠను; ఒనర్చితి(వి)= సమకూర్చావు.

తాత్పర్యం: భార్య చేసిన ఉపదేశంతో నాగరాజు తేరుకొన్నాడు. సౌమ్యంగా మాట్లాడుతున్నాడు. 'ఓ వనితా! ముక్కూ మొగమూ తెలియనివాడిని దర్శించి రమ్మని నీవు అనటంతోనే నాకు రోషం పొడుచుకొని వచ్చింది. ఆ గర్వంతో అనరాని మాటలు అన్నాను. అయినా నీవు జంకకుండా, నన్ను శంకించకుండా నాకు చేయవలసిన ధర్మాన్ని తెలియచేశావు. దానితో నా ప్రతిష్ఠను కాపాడావు. లేకపోతే ఎంత అప్రతిష్ఠపాలు అయ్యేవాడినో కదా!

ఆ. కార్తవీర్య దశముఖ ప్రముఖులు జమ । దగ్ని తనయ రాఘువాదులైన
పురుషవరులచేతఁ బొలియరే సక్రోధ । వృత్తిఁ గాన యలుకవిడుపు మేలు. 589

ప్రతిపదార్థం: కార్తవీర్య= (వేయిబాహువులు కల) కార్తవీర్యార్జునుడూ; దశముఖ= పది తలకాయలు గల రావణుడూ; ప్రముఖులు= ఇత్యాదులు; జమదగ్నితనయ= పరశురాముడూ; రాఘవ+ఆదులైన= దశరథ రాముడూ మొదలైన; పురుషవరులచేతన్= మహాపురుషుల చేతులలో; సక్రోధవృత్తిన్= క్రోధంతో కూడిన ప్రవర్తనవల్ల; పొలియరే!= నశించిపోలేదా! (చనిపోలేదా); కాన= కాబట్టి; అలుక విడుపు= కోపాన్ని విడిచిపెట్టటం; మేలు= మంచిది.

తాత్పర్యం: క్రోధం కారణంగానే కార్తవీర్యార్జునుడు పరశురాముడి చేతిలో మరణించాడు. క్రోధం కారణంగానే దశకంఠుడు దశరథరాముడి చేతిలో సమసిపోయాడు. ఇంకా చాలామంది కోపంవలన దెబ్బతిన్నవారు ఉన్నారు. కాబట్టి కోపాన్ని వదలుకొనటం ఎవరికైనా ఎప్పటికైనా మేలు.

క. నీయట్టి భార్య కలుగుటఁ । దోయజదళనయన! యిట్లు దొలఁగితి దురితా
పాయంబునఁ బొరయక, యేఁ । బోయెద నవ్విప్రు కోర్కి పూర్ణము సేయన్. 590

ప్రతిపదార్థం: తోయజదళ= పద్మదళాలవంటి (తామరపువ్వు రేకులవంటి); నయన!= నేత్రాలు కలదానా!; నీ+అట్టి= నీలాంటి; భార్య= ధర్మపత్ని; కలుగుటన్= లభించటంవలన; ఇట్లు; దురిత= పాపరూపమైన; అపాయంబునన్= ప్రమాదంలో; పొరయక= నశించిపోకుండా; తొలఁగితిన్= తప్పించుకున్నాను; ఆ+విప్రు= ఆబ్రాహ్మణుడి; కోర్కి= కోరిక; పూర్ణము+చేయన్= నిండించటం కోసం (తీర్చటానికి); ఏన్= నేను; పోయెదన్= ఇదే పోతున్నాను.

తాత్పర్యం: ఓ పద్మాక్షీ! నీవంటి భార్య దొరకటంవలన గొప్ప ప్రమాదంనుండి తప్పించుకొనగలిగాను. లేకపోతే మహాపాపకూపంలో పడి నశించిపోయి ఉండేవాడిని. సరే. ఆ విప్రుడిని దర్శించటంకొరకు ఇదిగో ఇప్పుడే వెళ్ళుతున్నాను.

క. అని పలికి సత్వరంబుగఁ । జని భృగునిం గాంచె వినయసంభ్రమములతో
జనపాలోత్తమ! యతఁడు న । తనిఁగని యుల్లమునఁ బ్రియము దలకొత్తంగన్. 591

ప్రతిపదార్థం: జనపాల+ఉత్తమ= రాజోత్తమా! ధర్మజా!; అని పలికి= అని చెప్పి; సత్వరంబుగన్= మిక్కిలి వేగంగా; చని= వెళ్ళి; వినయ+సంభ్రమములతోన్= వినయంతోనూ, సంభ్రమంతోనూ; భృగునిన్= భృగువును; కాంచెన్= సర్పరాజు దర్శించాడు;

అతఁడున్= ఆ భృగువుకూడా; అతనిన్+కని= ఆ సర్పరాజును చూచి; ఉల్లమునన్= హృదయంలో; ప్రియము= ప్రేమ(ఇష్టం); తళుకు+ఒత్తంగన్= ప్రకాశించగా.

తాత్పర్యం: అని భార్యను మెచ్చుకొని, ఆ సర్పరాజు వేగాతివేగంగా వెళ్ళి భృగువును వినయసంభ్రమాలు ఉట్టిపడేటట్లు దర్శించాడు. సర్పరాజును చూసి భృగువుకూడా సంతోషించాడు. హృదయంలో ప్రేమ తళుక్కుమనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

పద్మఁడను సర్పరాజు భృగుఁడను విప్రుఁ గానవచ్చుట (సం. 12-349-2,3)

వ. అంగంబులు వొదల నెదురుకొనియె; ని ట్లిరువురు సుసంగతులై సుసంగతపత్ర ప్రకరతరుచ్ఛాయాశీతల సికతాతలంబున సుఖాసీనులై; రయ్యహీంద్రుం డా మహీసురవరునితో మధురస్వరంబున నిట్లనియె.592

ప్రతిపదార్థం: అంగంబులు= శరీరావయవాలు; పొదలన్= ఉప్పొంగగా; ఎదురుకొనియెన్= భృగువు ఎదురుసన్నాహం వెళ్ళాడు; ఇట్లు= ఈ విధంగా; ఇరువురున్= ఇద్దరూ; సుసంగతులై= కలిసినవారై; సుసంగత= దట్టంగా అలుముకున్న; పత్రప్రకర= ఆకుల గుబురులు కలిగిన; తరు= చెట్లయొక్క; ఛాయా= నీడతో; శీతల= చల్లనైన; సికతాతలంబునన్= ఇసుక తిన్నెమీద; సుఖ+ఆసీనులై= సుఖంగా కూర్చున్నవారై; ఆ+అహి+ఇంద్రుండు= ఆ సర్పరాజు; ఆ+మహీసురవరునితోన్= ఆ బ్రాహ్మణోత్తమునితో; మధురస్వరంబునన్= తియ్యని కంఠధ్వనితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శరీరం ఉప్పొంగుతుండగా భృగువు ఎదురు వెళ్ళాడు. ఇట్లా ఇద్దరూ కలిసికొని, చెట్లనీడలో ఇసుకతిన్నెమీద కూర్చొన్నారు. ఆ సర్పరాజు ఆ బ్రాహ్మణుడితో తీయనైన స్వరంతో ఇట్లా అన్నాడు:

తే. ‘ అనఘ! నా రాక వార్చి నీ వధికనిష్ఠ । నిట్టు లునికికిఁ గారణమేమి గోర్కి
యెవ్విధంబైన దాని నే నిపుడ నిర్వ । హించి పుచ్చెద నత్తెఱం గెఱుఁగఁ జెపుమ! 593

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా!; నా రాక!= నా ఆగమనాన్ని; వార్చి= ప్రతీక్షించి; నీవు= మహర్షీ; అధికనిష్ఠన్= పెద్ద నియమంతో; ఇట్టులు= ఇట్లా; ఉనికికిన్= ఉండటానికి; కారణము= హేతువు; ఏమి?= ఏమిటి?; కోర్కి= నీ కోరిక; ఏ+విధంబు+ఐనన్= ఎటువంటిదయినా; దానిన్= దానిని; ఏన్= నేను; ఇప్పుడు+అ= ఇప్పుడే; నిర్వహించి= తీర్చి; పుచ్చెదన్= పంపుతాను; ఆ+తెఱంగు= ఆ తీరు ఏదో; ఎఱుఁగన్= తెలిసేటట్టు; చెపుమ!= దయచేసి చెప్పుము.

తాత్పర్యం: ‘పావనుడా! ఓ బ్రాహ్మణోత్తమా! నా రాకను ప్రతీక్షిస్తూ నిరాహార దీక్షతో ఇట్లా నీవు ఉండటానికి కారణం ఏమిటి? నీ కోరిక ఏమిటో చెప్పుము. అది ఎటువంటిదైనా సరే తీరుస్తాను. ఇప్పుడే తీర్చివేస్తాను (తీర్చి పంపుతాను). అదేమిటో తెలియజెప్పుము.

వ. స్వజనంబులచేత నిచ్చట నీయునికి వినియభగమ్యుండ వగు నీ కడకుం జనుదెంచితి; ననవుడు నద్ధరామరవరుండు ధర్మారణ్యంబుననుండి నిన్నుం గాన వచ్చితి; మాననీయమహీసురసూనుండ; భాను నారాధింప నీ చనుట భవదీయ వల్లభవలన నెఱిఁగి వాడిన చేనివాఁడు వానకెదురుచూచునట్లు భవదాగమనంబు వార్చి నియతవృత్తి నున్నవాఁడ. మదీయమనఃక్లేశంబు నిరసింప నీవ యర్హుండ' వనుటయు. 594

ప్రతిపదార్థం: స్వజనంబులచేతన్= మావాళ్ళవలన; ఇచ్చట= ఇక్కడ; నీ+ఉనికిన్= నీవు నివసించటాన్ని; విని= ఆలకించి; అభిగమ్యుండవు+అగు= నిన్నుచేరి దర్శింపదగిన వాడవైన; నీ కడకున్= నీ దగ్గరకు; చనుదెంచితిన్= వచ్చాను; అనవుడున్= అని సర్పరాజు పలకగా; ఆ+ధరా+అమరవరుండు= ఆ బ్రాహ్మణోత్తముడు (ఇట్లాఅన్నాడు); ధర్మారణ్యంబుననుండి=

ధర్మారణ్యంనుంచి; నిన్నున్= నిన్ను; కానన్+వచ్చితిన్= దర్శించటానికి వచ్చాను; మాననీయ= గౌరవింపదగిన; మహీసుర బ్రాహ్మణుని; సూనుండన్= కుమారుడను; భానున్= సూర్యుడిని; ఆరాధింపన్= అర్చించటం కోసం; నీ చనుట= నీవు వెళ్ళటం; భవదీయ= నీయొక్క; వల్లభవలనన్= భార్యనుంచి; ఎఱింగి= తెలిసికొని; వాడిన= వడలిపోయిన; చేనివాఁడు= చేను కలవాడు (రైతు); వానకున్= వానకోసం; ఎదురుచూచునట్లు= ఎదురుచూసినట్టు; భవత్+ఆగమనంబు= నీ రాకకై; వార్చి= నిరీక్షించి; నియతవృత్తిన్= నియమ సహితమైన ప్రవర్తనతో (నిష్ఠతో); ఉన్నవాఁడన్= ఈ అడవిలో ఇక్కడ ఉన్నాను; మదీయ= నాయొక్క; మనః= మనస్సుకు సంబంధించిన; క్లేశంబు= కష్టం; నిరసింపన్= తొలగించటానికి; నీవు+అ= నీవే; అర్హుండవు= తగినవాడవు; అనుటయున్= అనటంతో.

తాత్పర్యం: మా వాళ్ళు నీ విక్కడ ఉన్నావని చెప్పగా విని, దర్శనీయుడవైన నీవద్దకు వచ్చాను' అని సర్పరాజు అనగా, దానికి ఆ బ్రాహ్మణుడు 'నే నొక బ్రాహ్మణకుమారుడను. నీవు సూర్యార్చనకై వెళ్ళినట్లు నీ భార్య చెప్పగా విని, ఈ అడవిలో నీకొరకు నిరీక్షిస్తున్నాను. నా మనసులోని బాధను తొలగించటానికి నీవే అర్హుడవు' అనగా.

తే. ' నీవు కల్యాణమూర్తివి నీ మనోర । థంబు సఫలంబు సేసికదా మదీయ
జనన సఫలత గలిగింతు' నను భుజంగ । మాధిపతి మోముఁ జూచి యిట్లనియె నతఁడు. 595

ప్రతిపదార్థం: నీవు= ఓ భృగూ! నీవు; కల్యాణమూర్తివి= శుభస్వరూపుడవు; నీ; మనోరథంబు= కోరిక; సఫలంబు+చేసి కదా!= నెరవేర్చి కదా!; మదీయ= నాయొక్క; జనన= జన్మకు; సఫలత= చరితార్థత; కలిగింతున్!= కల్పించుకుంటాను!; అను= అన్నటువంటి; భుజంగమ+అధిపతి= ఆ సర్పరాజుయొక్క; మోమున్= ముఖాన్ని; చూచి= వీక్షించి; అతఁడు= ఆ భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ఓ భృగూ! నీవు శుభస్వరూపుడవు. నీ కోరిక తీర్చినప్పుడే నా జన్మ చరితార్థం అవుతుంది. చరితార్థం చేసికొంటాను' అన్నాడు సర్పరాజు. అప్పుడు భృగువు ఇట్లా అంటున్నాడు.

క. నా కోర్కి పిదపఁ జెప్పెద । లోకనుతా! యొకటి యడుగ లోలత్వము చి
త్తాకలితమయ్యెఁ బ్రార్థన । సేకొని యది నాకు మున్ను చెప్పఁగవలయున్. 596

ప్రతిపదార్థం: లోకనుతా!= లోకంలో నుతిపొందినవాడా! (లోకంచేత నుతింపబడినవాడా!); నా కోర్కి= నా కోరిక ఏమిటో; పిదపన్= తరవాత; చెప్పెదన్= చెప్పుతాను; ఒకటి= ఒక్కవిషయం; అడుగన్= అడగడానికి; లోలత్వము= చపలత్వం; చిత్త+ఆకలితము+అయ్యెన్= మనస్సులో పుట్టుతోంది; ప్రార్థనన్= నా అభ్యర్థనను; చేకొని= విని (స్వీకరించి); అది= ఆ విషయం; నాకున్= నాకు; మున్ను= ముందుగా; చెప్పఁగన్+వలయున్= చెప్పాలి.

తాత్పర్యం: లోకస్తుత్యా! నా కోరిక ఏమిటో తరవాత చెప్పుతాను కాని, నిన్ను మరొకటి అడగాలని మనస్సు తొలుస్తున్నది. అది అడుగుతాను. విని ముందు అది చెప్పుము.

వ. అనుటయు నయ్యురగ వల్లభుం 'డది యెయ్యది యడుగు' మనిన భృగుండు 'నీవు రవిరథంబు వహింపం
జనినయెడఁ గనిన వినినయట్టి యాశ్చర్యంబులు గలవేని వాని నా కెఱింగింపవే?' యనిన నతం డతని కిట్లనియె. 597

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; ఆ+ఉరగవల్లభుండు= ఆ సర్పరాజు; అది= నీవు అడగాలి అనుకొంటున్నది; ఏ+అది= ఏది?; అడుగుము; అనినన్= అనేసరికి; భృగుండు= భృగువు; నీవు= ఓ సర్పరాజా! నీవు= అడుగుము; రవిరథంబున్= సూర్యరథాన్ని; వహింపన్= మోయటానికి; చనినయెడన్= వెళ్ళినపుడు; కనిన= చూచిన; వినిన+అట్టి= విన్నట్టి; ఆశ్చర్యంబులు= అద్భుతాలు;కలవేనిన్=

ఉన్నట్టయితే; వానిన్= వాటిని; నాకున్= నాకు; ఎటింగింపవే?= తెలియజెప్పవా?; అనినన్= అని అడిగితే; అతండు= ఆ సర్పరాజు; అతనికిన్= ఆ భృగుడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దానికి సర్పరాజు 'నీవు అడుగవలెనని అనుకొంటున్న దేదో అడుగుము' అన్నాడు. బదులుగా దానికి భృగువు ' ఓ సర్పరాజా! నీవు సూర్యరథాన్ని మోయటానికి వెళ్ళినపుడు నీవు చూచిన, విన్న అద్భుతాలు ఏవైనా ఉంటే నాకు చెప్పాలి' అన్నాడు. దానికి సర్పరాజు తిరిగి ఈ విధంగా బదులిచ్చాడు.

సీ. ' ఆశ్చర్యములకెల్ల నాస్పదం బాదిత్యఁ । డాతని వలనన భూతజాల
మఖిలంబుఁ జరియించు నది యచ్చెరువు గాదె! । యద్దేవు నంశువులందుఁ బ్రీతి
నమరులు వాలఖిల్యాదిమునీంద్రులు । సిద్ధులు శాఖలఁ జెంది యుండు
విహగకులంబుల విధమున వసియింతు । రంతకంటెను నెక్కు డద్భుతంబు

తే. గలదె! యమ్మహాత్ముఁవలనన వాయువు । వెడలి యతని నడిమి విపుల రశ్మిఁ
బొంది వృష్టి గురియు నెందును నట్టి చో । ద్యములు గలవె? భూసురాగ్రగణ్య! 598

ప్రతిపదార్థం: భూసుర+అగ్రగణ్య= బ్రాహ్మణులలో మొదట లెక్కింపదగినవాడా! ఓ బ్రాహ్మణోత్తమా!; ఆశ్చర్యములకున్= అద్భుతాలకు; ఎల్లన్= అన్నింటికీ; ఆదిత్యుఁడు= సూర్యుడు; ఆస్పదంబు= స్థానం; ఆతనివలనన్+అ= ఆ సూర్యుడివల్లనే; భూతజాలము= ప్రాణిసమూహం; అఖిలంబున్= అంతా; చరియించున్= చైతన్యవంతమై సంచరిస్తూ ఉంటుంది (జనియించున్= పుట్టుతుంది - అని పాఠాంతరం); అది= ఆ విషయం; అచ్చెరువు+కాదె!= ఆశ్చర్యం కాదా!; ఆ+దేవు= ఆ సూర్యభగవానుడియొక్క; అంశువులందున్= కిరణాలలో; ప్రీతిన్= ప్రేమతో; అమరులున్= దేవతలూ; వాలఖిల్య+ఆది= వాలఖిల్యులు మొదలైన; మునీంద్రులున్= మహామునులూ; సిద్ధులున్= సిద్ధులూ - వీరంతా; శాఖలన్= కొమ్మలను; చెంది= ఆశ్రయించి; ఉండు= ఉండే; విహగకులంబుల+విధమునన్= పక్షులవలె; వసియింతురు= నివసిస్తూ ఉంటారు; అంతకంటెనున్= అంతకన్నా; ఎక్కుడు= అధికమైన; అద్భుతంబు+కలదె!= ఆశ్చర్యం ఉన్నదా?; ఆ+మహాత్ముఁవలనన్+అ= ఆ మహానుభావుడివల్లనే; వాయువు= (ఒకానొక విధమైన) గాలి; వెడలి= బయలుదేరి; అతని= ఆ సూర్యుడి; నడిమి= (గోళం) మధ్యలో ఉన్న; విపులరశ్మిన్= దట్టమైన కాంతిని; పొంది= కలిసి; వృష్టి+కురియున్= వర్షం కురుస్తుంది; ఎందునున్= ఎక్కడయినా; అట్టి= అటువంటి; చోద్యములు= అద్భుతాలు; కలవె?= ఉన్నాయా?;

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణోత్తమా! ఆశ్చర్యాలకన్నింటికీ నిలయం సూర్యుడే. అతడినుండే సకలప్రాణికోటీ జన్మిస్తున్నదంటే ఇంతకంటె ఆశ్చర్యం ఏమి ఉంటుంది! వాలఖిల్యాది ఋషులూ, సిద్ధులూ, దేవతలూ అందరూ సూర్యుడి కిరణాలలోనే - చెట్టుకొమ్మలమీద పిట్టలున్నట్లు - నివసిస్తూ ఉంటారు. ఇది అద్భుతం కాదా! సూర్యగోళంనుండి వెలువడే వాయువు గోళం మధ్యలో ఉండే దట్టమైన కాంతితో కలిసి వర్షం కురుస్తుంది. ప్రపంచంలో ఎక్కడయినా ఇట్లాంటి అద్భుతాలు ఉన్నాయా?

క. రవి సృజియించును వర్షము । రవియ మగుడఁ గిరణతతుల రస మంతయుఁ దాఁ
దివుచును విస్మయకారక । మవనీసురవర్య! దాని కధికము గలదే? 599

ప్రతిపదార్థం: అవనీసురవర్య!= ఓ బ్రాహ్మణోత్తమా!; రవి= సూర్యుడు; వర్షమున్= వానను; సృజియించును= సృష్టిస్తాడు; రవి+అ= సూర్యుడే; మగుడన్= మళ్ళీ; కిరణతతులన్= కిరణసమూహాలతో; రసము+అంతయున్= నీటినంతటినీ; తాన్= తాను; తివుచును= వెనుకకు లాగుకొంటాడు (ఎండిస్తాడు, ఆవిరిచేస్తాడు); దానికిన్= దానికన్నా; విస్మయకారకము= ఆశ్చర్యకరమైన విషయం; అధికము= గొప్పది (మరొకటి); కలదే?= ఉన్నదా? (ఉంటుందా?)

తాత్పర్యం: ఓ బ్రాహ్మణోత్తమా! సూర్యుడే వర్షాలు కురిపిస్తాడు. మళ్ళీ అతడే తన కిరణాలతో నీటినంతటినీ వెనుకకు లాగుకొంటాడు. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన సంగతి ఈ సృష్టిలో మరొకటి ఉంటుందా?

క. ఇనువేఁడిమి శోషించిన । జనములయం దాత్మనిష్ఠ శాశ్వతికత్వం
బున వెలుఁగుచుండు దానికి । ననఘా! మిగులంగఁ జిత్రమైనది గలదే! 600

ప్రతిపదార్థం: అనఘా!= పావనుడా!; ఇను= సూర్యుడియొక్క; వేఁడిమి= ఉష్ణత; శోషించినన్= ఎండిపోతే; జనములయందున్= ప్రజలలో; ఆత్మనిష్ఠ= మోక్షం; శాశ్వతికత్వంబునన్= శాశ్వతమై; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; దానికిన్= దానికన్నా మిగులంగన్= మించిన; చిత్రమైనది= ఆశ్చర్యకరమైన విషయం; కలదే!= ఉన్నదా!

తాత్పర్యం: పాపరహితుడా! సూర్యుడి వేడిమి తగ్గిపోతే ప్రజలలో ఆత్మనిష్ఠ అనేది శాశ్వతంగా ప్రకాశిస్తుంది. ఇంతకంటె ఆశ్చర్యకరమైన అంశం ఏముంది చెప్పుము.

తే. సూర్యువలనన బీజంబు ధార్యమాణ । మగుఁ జరాచరధారిణియైన ధరణి
చేత నంతకు మిగులఁ జర్చింప నక్క । జంబు లెందును గలవె? నిష్ఠానిరూఢ! 601

ప్రతిపదార్థం: నిష్ఠానిరూఢ!= నియమాసక్తా!; చరాచర= జంగమస్థావరాలను; ధారిణి+అయిన= ధరించేదయిన; ధరణిచేతన్= ఈ భూమిచేత; బీజంబు= విత్తనం; సూర్యువలనన్+అ= సూర్యుడివలననే; ధార్యమాణము+అగున్= జీవింపజేయబడుతోంది - మొలకెత్తుతోంది; చర్చింపన్= ఆలోచిస్తే; అంతకున్+మిగులన్= అంతకంటె మించి; అక్కజంబులు= అద్భుతాలు; ఎందునున్= ఎక్కడైనా; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: సూర్యుడివలననే విత్తనాలు భూమిలో మొలకెత్తుతున్నాయి. ఇంతకంటె అద్భుతాలు ఎక్కడ ఉంటాయి స్వామీ!

క. పరముండు నిరంజనుఁ డ । క్షరుఁ డజరుం డద్వయుండు శాశ్వతుఁ డగు న
ప్పురుషుఁడు రవియంద వెలుఁగు । నరుఁ దంతటికంటెఁ గలదె? యగ్రిమవర్ణా! 602

ప్రతిపదార్థం: అగ్రిమవర్ణా!= అగ్రవర్ణంలో జన్మించినవాడా! (బ్రాహ్మణుడా!); పరముండు= పరాత్పరుడూ; నిరంజనుఁడు= నిర్గుణుడూ; అక్షరుఁడు= నాశనం లేనివాడూ; అజరుండు= ముసలితనం లేనివాడూ; అద్వయుండు= ద్వయము కానివాడూ (అద్వితీయుడు); శాశ్వతుఁడు= శాశ్వతమైనవాడూ; అగు= అయినటువంటి; ఆ+పురుషుఁడు= ఆ మహాపురుషుడు; రవియందున్+అ= సూర్యుడిలోనే; వెలుఁగున్= ఒప్పారుతుంటాడు; అంతటికంటెన్= అంతకన్నా; అరుదు= అద్భుతం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలంలోనే ప్రకాశిస్తుంటాడు. ఓ బ్రాహ్మణుడా! అంతకంటె ఆశ్చర్యం ఏముంది చెప్పుము!

వ. అని వెండియు. 603

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

ఉంఛవృత్తి మహిమ (సం. 12-350-8)

క. వినుము మత్యాశ్చర్య మొకటి । మనుజోత్తమ! యొక్కనాఁడు మధ్యాహ్నమునం
దన వెలుఁ గినుని వెలుఁగుతో । నెనగా గగనమున నొక్కఁ డేతెంచె వడిన్. 604

ప్రతిపదార్థం: మనుజ+ఉత్తమ!= ఓ మానవోత్తమా!; అతి+ఆశ్చర్యము= ఎంతో ఆశ్చర్యకరమైనది; ఒకటి= ఒక్కటి ఉంది ; వినుము; ఒక్కనాఁడు= ఒకరోజు; మధ్యాహ్నమునన్= మధ్యాహ్నసమయంలో; ఒక్కఁడు= ఒకానొక పురుషుడు; తన= తనయొక్క; వెలుఁగు= తేజస్సు; ఇనుని= సూర్యుడి; వెలుఁగుతోన్= కాంతితో; ఎనగాన్= సాటిరాగా; గగనమునన్= ఆకాశంలో; వడిన్= వేగంగా; ఏతెంచెన్= ఎదురు వచ్చాడు.

తాత్పర్యం: ఓ మానవోత్తమా! అత్యాశ్చర్యకరమైన విషయం ఒకటి చెప్పుతాను. శ్రద్ధగా వినుము. ఒకరోజున మధ్యాహ్నం ఆకాశంలో ఒక పురుషుడు ఎదురయ్యాడు. ఆయన తేజస్సు సూర్యుడి తేజస్సుతో పోటీ పడుతున్నట్లు అనిపించింది.

క. అంబరపాటనమునఁ బో । లెం బెద్దయు మెఱయు తనదు లీలాగతి క
య్యంబరమణి యధికప్రమ । దంబున నభిముఖుఁడుగా నుదగ్రస్ఫూర్తిన్. 605

ప్రతిపదార్థం: అంబరపాటనమునన్+పోలెన్= ఆకాశాన్ని బద్దలు కొట్టేస్తుందా అన్నట్టు (బద్దలు కొట్టిందా అన్నట్టు); పెద్దయున్= ఎక్కువగా; మెఱయు= ప్రకాశించే; తనదు= అతడియొక్క; లీలాగతికిన్= సవిలాసగమనానికి; ఆ+అంబరమణి= ఆ సూర్యుడు; అధికప్రమదంబునన్= అత్యధిక సంతోషంతో; ఉదగ్రస్ఫూర్తిన్= ఇంకా అతిశయించిన స్ఫురణతో; అభిముఖుఁడుగాన్= ఎదురుగా.

తాత్పర్యం: ఆకాశాన్ని పగులగొట్టేస్తాడా? - అన్నంతటి తేజస్సుతో సవిలాసంగా వస్తున్న ఆ పురుషుడికి సూర్యుడు చేయిసాచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. కదియఁగఁ బాఱుతెంచిన వికాసవిభాసిముఖారవిందుఁడై
యెదురుగఁ జేయి సాఁచె దివసేశుఁ డతండును లీలఁ గేలు నొ
ప్పిదముగఁ బట్టి రూపము లభిన్నతఁ బొందఁగఁ జొచ్చె బింబమున్
సదనముఁ జొచ్చునట్ల విలసద్గతి నింకిట యేమి సెప్పుదున్? 606

ప్రతిపదార్థం: కదియఁగన్= తనను సమీపించటానికి; పాఱుతెంచినన్= ఆ తేజస్వి పరుగు పరుగునరాగా; దివస+ఈశుఁడు= దినపతి అయిన సూర్యుడు; వికాస= ఆనందంతో (వికాసంతో); విభాసి= వెలిగిపోతున్న; ముఖ+అరవిందుఁడై= ముఖపద్మం కలవాడై; ఎదురుగన్= ఆతనికి అభిముఖంగా; చేయి సాఁచెన్= చెయ్యి చాపాడు; అతండునున్= ఆ పురుషుడు సయితం; లీలన్= విలాసంగా; కేలున్= ఆ చేతిని; ఒప్పిదముగన్= అందంగా; పట్టి= పట్టుకొని; రూపములు= ఆకారాలు; అభిన్నతన్= అభేదాన్ని; పొందఁగన్= పొందుతూండగా (ఒకటే అయిపోతూండగా); విలసత్+గతిన్= అందమైన పద్ధతిలో (సవిలాసగమనంతో అని కానీ); సదనమున్+చొచ్చునట్లు= గృహంలోకి ప్రవేశించినట్లు; బింబమున్= ఆ సూర్యబింబంలోకి; చొచ్చెన్= ప్రవేశించాడు; ఇంకన్+ఇటన్= ఇంక ఇక్కడ; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పను!

తాత్పర్యం: ఆ దివ్యతేజస్వి తనకు ఎదురుగా వేగంగా వచ్చేసరికి సూర్యుడి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. సాదరంగా చేయి చాపాడు. ఆతడు దానిని ఒయ్యారంగా అందుకొన్నాడు. ఇద్దరి ఆకారాలూ క్రమక్రమంగా ఏకమయిపోతున్నాయి. ఇంటిలోనికి ప్రవేశించినంత విలాసంగా ఆ తేజస్వి సూర్యబింబంలోనికి ప్రవేశించాడు.

వ. అట్టియెడ. 607

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. అరదముమీఁద మున్ పొలుచునాతఁడొ? యిప్పటియాతఁడో? దివా
కరుఁ డను సందియంబు భుజగంబుల చిత్తము లందుఁ బుట్టి యొం
డొరువులతోడ వారు గడు నొయ్యనఁ బల్కఁగ నే వినీతసు
స్థిరమృదుభాషినై యడిగితిం బ్రభువున్ ధరణీసురోత్తమా! 608

ప్రతిపదార్థం: ధరణీసుర+ఉత్తమా!= ఓ బ్రాహ్మణోత్తమా!; అరదముమీఁదన్= రథంపైని; మున్= అంతకుముందు; పొలుచునాతఁడొ?= ఉన్నవాడో?; ఇప్పటియాతఁడో?= ఇప్పుడు వచ్చి ఉన్నవాడో?; దివాకరుఁడు= సూర్యుడు; అను= అనే; సందియంబు= సందేహం; భుజగంబుల= సర్పాల; చిత్తములందున్= హృదయాలలో; పుట్టి= కలిగి; ఒండొరువులతోడన్= పరస్పరం; వారు= ఆ సర్పశ్రేష్ఠులు; కడున్+ఒయ్యనన్= మెల్లమెల్లగా; పల్కఁగన్= గుసగుసలు పోతోంటే; ఏన్= నేను; వినీత= వినయ సంపన్నమైన; స్థిర= నిశ్చలమైన; మృదుభాషిన్+ఐ= మృదుభాషలు కలవాడనై (మృదువుగా పలుకుతూ); ప్రభువున్= మా అధిపతిని (సూర్యుడిని); అడిగితిన్= అడిగాను.

తాత్పర్యం: ఓ బ్రాహ్మణోత్తమా! ఇప్పటిదాకా రథంమీద ఉన్నవాడా? లేకపోతే ఇప్పుడు వచ్చినవాడా? - ఎవరు సూర్యుడు? అనే సందేహం రథం లాగుతున్న మా సర్పరాజుల కందరికీ కలిగింది. పరస్పరం గుసగుసలు పోతున్నారు అందరూ. అప్పుడు వినయంగా మృదువుగా నిశ్చలంగా నేనే మా ప్రభువును అడిగాను.

క. ఇతఁ డెవ్వం?డని యమ్మెయి । నతిచకితాత్ముండ నగుచు నడుగుటయు నహఃపతి నా మీఁదఁ గృపాసం । గతమగు తన చూడ్కి వొలయఁగా వత్సలుఁడై. 609

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= అట్లా; అతిచకిత+ఆత్ముండన్+అగుచున్= మిక్కిలి ఆశ్చర్యపోయిన వాడిని అవుతూ; ఇతఁడు= ఈయన; ఎవ్వండు= ఎవరు?; అని; అడుగుటయున్= నేను అడగటంతో - అహఃపతి= దివసనాథుడు (సూర్యుడు); నామీఁదన్= నా పైని; కృపాసంగతము+అగు= దయతో కూడిన; తన= తనయొక్క; చూడ్కి= చూపు; పొలయఁగాన్= వ్యాపించేట్టు (చూసి); వత్సలుఁడై= ప్రేమ కలవాడై.

తాత్పర్యం: ఇతడు ఎవరు? - అని నేను చాలా ఆశ్చర్యపోయి అడిగాను. దానికి సూర్యుడు నా వైపు ఒకసారి దయనిండిన కన్నులతో చూచి ప్రేమగా ఇట్లా అన్నాడు.

సీ. ‘ సురయక్ష గంధర్వ గరుడోరగాదుల । లోన నెవ్వఁడు గాఁ డలోలుపాత్ముఁ
డుంఛవృత్తి మహీసురోత్తముం డస్థల । నియముండు ఫలమూల నీరమారు
తాహారుఁడగు ముని యాకాంక్ష సేయఁడు । ప్రాప్తంబు గాని పదార్థములకు
సర్వభూత హితత్వశాలి యిమ్మెయి సిద్ధిఁ । బ్రాపించె నని చెప్పెఁ బ్రకటఫణితి

తే. ననఘ! యిట్టి విశేషంబు గనుఁగొనంగ । వినను గాంచితి’ ననిన నవ్విప్రవరుఁడు
ప్రమద మెద నిండి పొంగారఁ బాపఱేని । యాననము సూచి యిట్లను మానవేంద్ర! 610

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పావనుడా! ; ఓ పద్ముడా! ఈ వచ్చిన వ్యక్తి -సురయక్షగంధర్వగరుడ+ఉరగ+ఆదులలోనన్= సురలలో, యక్షులలో, గంధర్వులలో, ఉరగులలో (సర్పజాతి), ఇంకా తక్కిన జాతులలో; ఎవ్వఁడున్+కాఁడు= ఎవ్వడూ కాడు; ఇతఁడు - అలోలుప+ఆత్ముఁడు= దేనిపట్ల తగులు చెందని మనస్సుకలవాడు (నిరీహుడు - నిశ్చలాత్ముడు); ఉంఛవృత్తి= నూర్చిన పొలాలలో చెదిరిపడిన ధాన్యపుగింజలను ఏరుకొని వాటితో పొట్టగడుపుకొనే; మహీసుర+ఉత్తముండు= బ్రాహ్మణోత్తముడు; అస్థల= చెదరని; నియముండు= నియమాలు కలవాడు (స్థిరనిష్ఠ కలవాడు); ఫల= పళ్ళూ; మూల= దుంపలూ; నీర= నీళ్ళూ; మారుత= వాయువూ; ఆహారుఁడు= ఆహారంగా కలవాడు - అగు= అయిన; ముని= ఒక ముని ఈయన; ప్రాప్తంబు+కాని= తనకు ప్రాప్తంలేని; పదార్థములకున్= వస్తువులకోసం; ఆకాంక్ష+చేయఁడు= కోరిక పెట్టుకోడు; సర్వభూత= సమస్తప్రాణులకూ; హితత్వశాలి= మేలుకోరేవాడు - మేలు చేసేవాడు; ఈ+మెయిన్= ఇలా; సిద్ధిన్+ప్రాపించెన్= సిద్ధిపొందాడు; అని; ప్రకటఫణితిన్= స్పష్టమైన మాటలతో (శైలితో); చెప్పెన్= (సూర్యుడు నాకు) చెప్పాడు; ఇట్టి= ఇటువంటి; విశేషంబున్= విశేషాన్ని; కనుఁగొనంగన్+విననున్+కాంచితిన్= చూడగలిగాను; వినగలిగాను (కనుగొనంగన్/కాంచితిన్. వినునున్/కాంచితిన్); అనినన్= అని పద్ముడు చెప్పేసరికి; ఆ+విప్రవరుఁడు= ఆ బ్రాహ్మణోత్తముడు - భృగువు; ప్రమదము= ఆనందం; ఎదన్= హృదయంలో; నిండి+పొంగారన్= నిండి పెల్లుబుకగా; పాపఱేని= ఆ సర్పరాజుయొక్క; ఆననము+చూచి= ముఖంలోకి చూసి; మానవేంద్ర!= ఓ ధర్మరాజా!; ఇట్లు= ఇలా; అనున్= అన్నాడు (అంటున్నాడు).

తాత్పర్యం: ఓ పద్ముడా! ఈ వచ్చినవాడు సురయక్ష గంధర్వ గరుడోరగాదులలో ఎవ్వడూ కాడు. నిశ్చలమైన మనస్సు కలవాడూ, ఉంఛవృత్తితో జీవించే బ్రాహ్మణుడూ, నిశ్చలమైన నియమాలు కలవాడూ, కందమూల ఫలోదక మారుతాలు మాత్రమే ఆహారంగా స్వీకరించేవాడూ, నిరాకాంక్షుడూ, సర్వభూతహితం కోరుకొనేవాడూ, మునీశ్వరుడూ అయిన ఒక మహానుభావుడు. ఇట్లా సిద్ధి పొందాడు - అని సూర్యుడు స్పష్టం చేశాడు. ఓ భృగూ! అటువంటి అద్భుతం చూడగలిగాను, వినగలిగాను' అని పద్ముడు చెప్పేసరికి ఆ భృగువు పరమానంద సంభరితుడై ఇట్లా అన్నాడు.

క. ' ఇవి యన్నియు నాశ్చర్యము । లవుఁ దెరువును నాకుఁ జూపి తన్వర్థత నొ
ప్పు వివిధ శబ్దంబుల బో । ధవరేణ్యా! పోయి వచ్చెదం బ్రియమొందన్. 611

ప్రతిపదార్థం: బోధవరేణ్యా!= జ్ఞానంచేత ఉత్తముడా! (గురూత్తమా!); ఇవి= నీవు చెప్పిన ఈ విషయాలు; అన్నియున్= అన్నీ; ఆశ్చర్యములు= అద్భుతాలు; అవున్= అవును (నిజమే); అన్వర్థతన్= సార్థకంగా; ఒప్పు= ఒప్పేటటువంటి; వివిధ శబ్దంబులన్= వివిధ పదాలతో; నాకున్= నాకు; తెరువునున్= మార్గంకూడా; చూపితి(వి)= చూపించావు; ప్రియము+ఒందన్= ప్రియం కలిగేటట్టు; పోయివచ్చెదన్= నేనింక వెళ్ళివస్తాను.

తాత్పర్యం: 'ఓ పద్ముడా! నీవు ఇంతవరకూ చెప్పినవి అన్నీ అద్భుతాలే. అవును. నిజమే. వీటిని చెప్పటంలోనే సార్థకపదాలతో నాకు మార్గంకూడా చూపించావు. ఓ గురూత్తమా! చాలాసంతోషం! నే నింక వెళ్ళివస్తాను.

క. నను మఱవక పనుపం దగు । పనులెల్లను బనుపు శిష్యభావశుభము నా
కనఘా! కలిగెను నీ దెస । ననూనభద్రములు నీకు నయ్యెడు మెపుడున్.' 612

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా, పద్ముడా!; ననున్= నన్ను; మఱవక= మర్చిపోకుండా; పనుపన్+తగు= ఆజ్ఞాపించదగిన; పనులు+ఎల్లనున్= పనులు అన్నీ; పనుపు(ము)= ఆజ్ఞాపించు; నీదెసన్= నీపట్ల; నాకున్= నాకు; శిష్యభావ= శిష్యుడను అనే భావం తాలూకు; శుభము= పుణ్యం; కలిగెను= కలిగింది (నీకు శిష్యప్రాయుడను అనే భావం నాకు కలిగింది - అని); నీకున్= నీకు; ఎపుడున్= ఎల్లవేళలా; అనూన= అత్యధికమైన; భద్రములు= అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: ఓ పద్ముడా! నన్ను మరిచిపోవద్దు. ఆజ్ఞాపించదగినవన్నీ నాకు ఆజ్ఞాపించుము. నీకు శిష్యుడను అనే భావం నాకు ఏర్పడింది. అది శుభప్రదం. నీకు ఎల్లవేళలా శుభాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను.'

విశేషం: అయ్యెడున్+ఎపుడున్. ఆశీరర్థంలో 'ఎడున్' లోని నకారం మకారంగా మారింది. ఎడుతల ద్రుతంబున కచ్చు పరంబగునపుడు మకారంబగు (క్రియ-18) అని బాలవ్యాకరణం.

చ. అన విని, నన్నుఁ గాంచితి ప్రయత్నమునన్, వినిపింపు మీవు వ
చ్చిన పని నాకు, నీ కొకటి సేసితినే? యిటు వృక్షమూల వా
సుని క్రియ లేచిపోక తగుచొ ప్పగునే? భవదీయవాంఛ సె
ప్పిన నది యేను దీర్తు, మఱి పెం పెసఁగం జను భూసురోత్తమా!' 613

ప్రతిపదార్థం: అనన్= అని భృగుడు పలికేసరికి; విని= ఆలకించి; పద్ముడు ఇట్లా అంటున్నాడు - నన్నున్= నన్ను; ప్రయత్నమునన్= ప్రయత్నపూర్వకంగా (ఇంతదూరం వచ్చీ ఎనిమిదిరోజులు ఉపవాసం ఉండీ); కాంచితి(వి)= చూశావు; ఈవు= నీవు; వచ్చిన పనిన్= వచ్చిన పని ఏమిటో దానిని; నాకున్= నాకు; వినిపింపుము= వినిపించవయ్యా!; నీకున్= నీకు; ఒకటి= ఒక్కటయినా; చేసితినే?= (ఉపకారం) చేసానా? (నీకు ఇంతవరకూ ఏ ఉపకారమూ చెయ్యనే లేదుగదా నేను); ఇటు= ఇట్లా; వృక్షమూలవాసుని+క్రియన్= చెట్టు మొదట్లో కాపురం ఉన్నవాడివలె; లేచిపోక= చటుక్కున లేచి ఉన్నపళంగా వెళ్ళిపోవటం; తగుచొప్పు+అగునే?= తగిన పద్ధతేనా (మంచి పద్ధతే అవుతుందా చెప్పుము!); భవదీయ= నీయొక్క; వాంఛ= కోరిక; చెప్పినన్= చెబితే; అది; ఏనున్= నేను; తీర్తున్= తీరుస్తాను; మఱి= అటుపైని; భూసుర+ఉత్తమా!= ఓ బ్రాహ్మణోత్తమా!; పెంపు+ఎసఁగన్= గొప్పదనం అతిశయించేట్టు; చను(ము)= వెళ్ళుము (వెడుదువుగాని).

తాత్పర్యం: భృగువు చెప్పిన పలుకులు ఆలకించి పద్ముడు ఇట్లా అన్నాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! కష్టపడి ప్రయత్నపూర్వకంగా వచ్చి నన్ను చూచావు. ఇంతకీ నీవు వచ్చిన పని ఏమిటో చెప్పనే లేదు. చెప్పుము. ఇంతవరకూ నీకు నే నేమీ చేయనే లేదు. చెట్టుక్రింద కాపురం ఉన్నవాడివలె ఉన్నపళంగా ఇట్లా దులుపుకొని లేచి చక్కా పోవటం భావ్యమా? సమంజసమా? నీ కోరిక ఏమిటో చెప్పుము. తీరుస్తాను. అటుపైని వెళ్ళిపోదువుగాని.'

వ. అని వెండియు. 614

ప్రతిపదార్థం: అని= అని; వెండియున్= ఇంకా ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని ఇంకా ఈ విధంగా అంటున్నాడు.

తే. ' అనఘ! నాయందు నీవు నీయందు నేనుఁ । గలము నీకు నీ సర్వలోకంబుఁ గలదు
చింత కవకాశ మెద్ది? నిశ్చింతభావ । మొందు' మనియె నా దండశూకోత్తముండు. 615

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పావనుడా! భృగూ!; నాయందున్= నాలో; నీవున్= నీవూ; నీయందున్= నీలో; నేనున్= నేనూ; కలము= ఉన్నాం; నీకున్= నీకు (ఇంకా); ఈ సర్వలోకంబున్= ఈ సమస్త ప్రపంచమూ; కలదు= ఉంది; చింతకున్= దిగులుకు; అవకాశము+ఎద్ది?= చోటు ఏది?; నిశ్చింతభావమున్= నిశ్చింత అయిన స్థితిని; ఒందుము= పొందు - అని; ఆ+దండశూక+ఉత్తముండు= సర్పశ్రేష్ఠుడైన ఆ పద్ముడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'ఓ భృగూ! నాలో నీవు ఉన్నావు. నీలో నేను ఉన్నాను. నీకు ఇంకా ప్రపంచమంతా ఉన్నది. దిగులు పడకుము. నిశ్చింతగా ఉండుము' అని ఆ సర్పరాజు పలికాడు.

వ. అనిన విని భృగుండు పద్మునకి ట్లనియె. 616

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= ఆలించి; భృగుండు; పద్మునకున్; ఇట్లు; అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆలకించి, భృగుడు పద్ముడితో ఇట్లా అన్నాడు:

తే. 'భోగివర! యిది యిట్టిద భూతములును । నీవు నేనును సర్వగతావిశిష్ట
విధములము వేదితవ్యంబు విదితమయ్యె । నిట్టి సందర్శనము వ్రతమింక నాకు. 617

ప్రతిపదార్థం: భోగివర!= ఓ సర్పరాజా! (భోగము= పడగ. అది కలది -భోగి); ఇది= నీవు అన్నది; ఇట్టిది+అ= నిజమే (ఇంతటిదే); నీవున్= నీవూ; నేనునున్= నేనూ; భూతములును= పంచభూతాలూ (నిఖిలప్రాణికోటీ); సర్వగత= అన్నిటా అంతటా వ్యాపించిన; అవిశిష్ట= భేదంలేని; విధములము= తీరు కలవాళ్ళం; వేదితవ్యంబు= తెలుసుకోవలసింది; విదితము+అయ్యెన్= తెలిసింది; ఇట్టి= ఇటువంటి; సందర్శనము= తత్త్వదర్శనం; ఇంకన్= ఇటుపైని; నాకున్= నాకు; వ్రతము= నియమం.

తాత్పర్యం: 'ఓ సర్పరాజా! నీవు అన్నది నిజమే. నీవూ నేనూ ఈ ప్రాణికోటీ, పంచభూతాలూ అంతటా వ్యాపించి ఏ భేదమూ లేని వాళ్ళం. అభిన్నులం. సమానులం. తెలిసికొనదగినది ఏదో తెలిసిపోయింది. ఇదే తత్త్వదర్శనం - సర్వసమతాదృష్టి ఇకపైని నాకు వ్రతం.

క. ఈ విధము నిశ్చయము నే । భావింపఁగఁ గంటి నీ కృపారతివలనన్
నీవు కృతార్థుఁడవు సుజన । సేవిత! యామంత్రణంబు సేసినవాఁడన్.' 618

ప్రతిపదార్థం: సుజనసేవిత!= సజ్జనులచేత సేవింపబడినవాడా!; ఈ విధము నిశ్చయము= ఇటువంటి నిశ్చయాన్ని (పుంప్వాదేశం చేయలేదు); నీ= నీయొక్క; కృపారతివలనన్= దయారూపమైన ఆసక్తివలన; భావింపఁగన్+కంటిన్= ఆలోచించగలిగాను (చేసికోగలిగాను - అని); నీవు= నీవు; కృతార్థుఁడవు= చరితార్థుడవు; ఆమంత్రణంబు= వీడ్కోలు; చేసినవాఁడన్= చెప్పుతున్నాను; (ఆమంత్రణశబ్దానికి ఆహ్వానమూ వీడ్కోలు అని రెండు అర్థాలూ ఉన్నాయి. నమస్కారం అనే అర్థంలో కూడా దీని వాడుక ఉంది. నమస్కారం చేస్తున్నాను అనే అర్థం ఇక్కడ ఇంకా బాగా కుదురుతుంది).

తాత్పర్యం: సజ్జనసేవితా! నీ దయావిశేషంవలన నేను ఈ రకం నిశ్చయానికి రాగలిగాను. అటువంటి పరిణతి నీ మాటలవలన నాకు వచ్చింది. నీవు చరితార్థుడవు. నీకు నమస్కరించి సెలవు తీసికొంటున్నాను.'

వ. అని పలికి యివ్విధంబునఁ గృతనిశ్చయుండై భృగుండు భుజంగవిభు వీడ్కొని దీక్షావిశేషకాంక్షం జేసి భార్గవకుల పవిత్రుం జ్యవనుం గాంచి నిజవృత్తాంతంబు సెప్పి తత్కృతసంస్కారంబునం గృతకృత్యుం డయ్యె; నిప్పుణ్యకథ యబ్భార్గవుండు జనకసదనంబున నారదునకు వివరించె; నద్దేవమునివరుండు దేవతావరునకు వినిపించె నమ్మహాత్ముండు వసువులకుం జెప్పె జామదగ్న్యతోడి సంగ్రామంబున నుద్దామచిత్తుండనైన నన్నుం దేర్చుటకై వసువులు సకలభూత సమదర్శిత్వ సంపాదకంబైన యీ యితిహాసంబు నాకుం జెప్పిరి. నీవు పరమధర్మం బెయ్యది? యని యడిగిన నేను నీకుం జెప్పితి సర్వసమతాసముపహితంబైన యనాకాంక్షిత్వంబు ధర్మోత్తమంబు నిరతిశయానందంబునకు నిధానంబు.' 619

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఈ విధంబునన్= ఈ ప్రకారంగా; కృతనిశ్చయుండై= నిశ్చయం చేసుకున్నవాడై; భృగుండు= భృగుడు; భుజంగవిభున్= సర్పరాజును; వీడ్కొని= విడిచిపెట్టి; దీక్షా= దీక్షపట్ల; విశేష= విశేషమైన; కాంక్షన్+చేసి= కోరికచేత

(దీక్షవిశేషం పట్ల కోరికతో అని కానీ); భార్గవకుల= భృగువంశంలో; పవిత్రున్= పావనుడైన; చ్యవనున్= చ్యవన మహర్షిని; కాంచి= దర్శించి; నిజ= తనయొక్క; వృత్తాంతంబు= కథ; చెప్పి= వివరించి; తద్= ఆ చ్యవనునిచేత; కృత= చేయబడిన; సంస్కారంబునన్= (దీక్ష ఇచ్చేటప్పుడు కులంపెద్ద చెయ్యవలసిన) మంత్ర సంస్కారంతో; కృతకృత్యుండు+అయ్యెన్= చరితార్థుడు అయ్యాడు; ఈ+పుణ్యకథ= ఈ పవిత్రకథ; ఆ+భార్గవుండు= ఆ చ్యవనుడు (పరశురాముడు); జనకసదనంబునన్= జనకమహారాజుగారి నివాసంలో; నారదునకున్= నారదమహర్షికి; వివరించెన్= తెలియజేశాడు; ఆ+దేవమునివరుండు= ఆ దేవర్షివర్యుడు - నారదుడు; దేవతావరునకున్= ఇంద్రుడికి; వినిపించెన్= వివరించాడు (దేవేంద్రసన నివేశనే -4); ఆ+మహాత్ముండు= మహానుభావుడైన ఆ ఇంద్రుడు; వసువులకున్= అష్టవసువులకూ; చెప్పెన్= చెప్పాడు; జామదగ్న్యుతోడి= పరశురామునితో ఏర్పడిన; సంగ్రామంబునన్= యుద్ధంలో; ఉద్దామచిత్తుండను+ఐన= కలతచెందిన హృదయం కలవాడనైన; నన్నున్= నన్ను; తేర్చుటకై= ప్రసన్నపరచటం కోసం; వసువులు= ఆ వసువులు; సకలభూత= సమస్తప్రాణికోటినీ; సమ= సమానంగా; దర్శిత= చూడటం అనే గుణాన్ని; సంపాదకంబైన= కలిగించేదైన; ఈ+ఇతిహాసంబు= ఈ వృత్తాంతం; నాకున్= నాకు; చెప్పిరి= తెలియజేశారు. (భీష్ముడు పూర్వజన్మలో అష్టవసువులలో ఒకడు); నీవు= ధర్మరాజా! పరమధర్మంబు= అత్యుత్తమధర్మం; ఏ+అది= ఏది; అని; అడిగినన్= అడిగితే; నేనున్= నేను; నీకున్= నీకు; చెప్పితిన్= తెలియజేశాను; సర్వసమతా= సర్వప్రాణి సమానత్వంతో; సముపహితంబైన= కూడుకొన్న; అనాకాంక్షిత్వంబు= వాంఛారహితస్థితి (ఏ కోరికలూ లేకపోవటం - నిష్కామత్వం); ధర్మ+ఉత్తమంబు= ధర్మాలలోకెల్లా శ్రేష్ఠమైనది; నిరతిశయ+ఆనందంబునకున్= సర్వోత్కృష్టమైన ఆనందానికి; నిధానంబు= నిలయం.

తాత్పర్యం: అని పలికి, ఈ విధంగా గట్టిగా నిశ్చయించుకొన్నవాడై భృగుడు నాగరాజును వీడ్కొని, విశేషదీక్షకొరకు భార్గవకులశ్రేష్ఠుడైన చ్యవనమహర్షిని దర్శించి, తన కథ చెప్పుకొని, అతడు చేసిన సంస్కారంతో ధన్యుడయ్యాడు. ఈ పుణ్యకథ జనకుడి గృహంలో భార్గవుడు నారదుడికి వివరించాడు. నారదుడు ఇంద్రుడికి చెప్పాడు. అతడు వసువులకు చెప్పాడు. పరశురాముడితో కలిగిన యుద్ధ సందర్భంలో కలత చెందిన నన్ను తేర్చటానికై వసువులు సకలభూత సమభావాన్ని పొందాలని ఈ ఇతిహాసం నాకు తెలిపారు. 'పరమధర్మం ఏది?' అని నీవు అడుగగా నేను నీకు చెప్పాను. సమస్త భూతాలను సమదృష్టితో కూడిన నిష్కామత్వం ఉత్తమధర్మం. ఉత్తమమైన ఆనందానికి అది నిలయం.'

క. అని యిట్లు ధర్మసుతునకు । ననిమిషతటినీతనూజుఁ డధికప్రేమం
బునఁ బెప్పట వైశంపా । యనుఁడును జనమేజయునకు నర్థిం జెప్పెన్. 620

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇలా; ధర్మసుతునకున్= ధర్మరాజుకు; అనిమిషతటినీ= గంగాదేవి; తనూజుఁడు= కుమారుడైన భీష్ముడు (అనిమిషులు= దేవతలు, తటిని= నది); అధిక(ప్రేమంబునన్= మిక్కిలి ప్రేమతో; చెప్పుట= చెప్పటాన్ని; వైశంపాయనుఁడు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడికి; అర్థిన్= కోరికతో; (ఇష్టంతో) చెప్పెన్= వినిపించాడు.

తాత్పర్యం: అని ఇట్లా భీష్ముడు ధర్మరాజుకు చెప్పటాన్ని వైశంపాయనుడు తన శ్రోత అయిన జనమేజయుడికి వివరించాడు.

వ. చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనుతో నిత్తెఱంగునఁ బితామహుండు హితోపదేశంబు సేసిన నమ్మహీశుం డెవ్విధంబు దశావిశేషంబు నొందె మునీంద్రా! చెప్పవే' యనుటయు. 621

ప్రతిపదార్థం: చెప్పినన్= చెబితే; విని= ఆలకించి; జనమేజయుండు= ఆ జనమేజయమహారాజు; వైశంపాయనుతోన్= ఆ వైశంపాయనమహర్షితో; ఈ+తెఱంగునన్= ఇలా; పితామహుండు= భీష్ముడు; హిత+ఉపదేశంబు= మేలును గురించిన

ఉపదేశం; చేసినన్= చేస్తే; ఆ+మహీ+ఈశుండు= ఆ మహారాజు ధర్మజుడు; ఏ+విధంబు= ఏ రకమైన; దశావిశేషంబున్= విశిష్టమైన అవస్థను (దశను); ఒందెన్= పొందాడో; మునీంద్రా!= ఓ మహామునీ!; చెప్పవే= తెలియజెయ్యవా!; అనుటయున్= అనటమూ.

తాత్పర్యం: దీనినంతా విని జనమేజయుడు వైశంపాయనుడితో 'భీష్ముడి ఉపదేశం విని ధర్మజుడు ఎట్టి అనుభూతిని పొందాడు?' నాకు తెలిసికొనాలని ఉన్నది. తెలియజేయుము' అని అడుగగా. (తరువాతి పర్వంలోని కథతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. ఆగమపుష్ప సౌరభశుభాంగ! నివాస బుధాంతరంగ! వి
ద్యా గృహమేధితా సుభగతా మహనీయ! సురార్చనీయ! ని
ర్భోగ సభోగ సంపదనిరూప్య! సుసంవిదవాప్య! భక్తి ల
క్ష్మీగురునిత్య యోగిజన సేవిత! శాంతిసుఖైకభావితా! 622

ప్రతిపదార్థం: ఆగమ= వేదాలూ, శాస్త్రాలూ అనేటువంటి; పుష్ప= పూవులయొక్క; సౌరభ= సుగంధంతో కూడిన; శుభ= శుభప్రదమైన; అంగ= శరీరంకలవాడా!; నివాస= ఆవాసమైన; బుధ= పండితుల (దేవతల) యొక్క; అంతరంగ!= హృదయాలు కలవాడా! (బుధుల హృదయాలే నివాసంగా కలవాడా! - అనే భావంలో వ్యధికరణ బహువ్రీహిగా దీనిని సంభావించటమైనది- ఆలోచించాలి); విద్యా= జ్ఞానానికి; గృహమేధితా= యజమానత్వం వల్లనైన; సుభగతా= సౌందర్యంతో; మహనీయ!= మహనీయుడా! (గృహమేధి= కుటుంబయజమానుడు, అధికారి); సుర= దేవతలచే; అర్చనీయ!= పూజింపదగినవాడా! నిర్భోగ= భోగరహితమైన; సంపద్= సంపదలతోనూ; సభోగ= భోగసహితమైన; సంపద్= సంపదలతోనూ; అనిరూప్య!= నిరూపించటానికి శక్యం కానివాడా! (నిర్గుణసంపత్తి - సగుణ సంపత్తి. రెండింటికీ అందనివాడా!); సుసంవిత్= సరియైన జ్ఞానంతో (ఆత్మజ్ఞానంతో); అవాప్య= పొందదగినవాడా!; (జ్ఞానైకసులభుడా!); భక్తి= భక్తి అనేటువంటి; లక్ష్మీ= లక్ష్మికి (సంపదకు); గురు= గురువులైన; నిత్యయోగిజన= నిత్యయోగులచేత; సేవిత!= భజింపబడేవాడా!; శాంతిసుఖ+ఏక= శాంతిసుఖాలతో మాత్రమే; భావితా!= భావింపబడేవాడా!; శాంతిసుఖస్వరూపా - అని; (ఆగమపుష్పసౌరభశుభాంగనివాస! - అటువంటి శరీరాంగాలకు నివాసమైనవాడా అని; బుధాంతరంగ విద్యాగృహమేధితా సుభగతామహనీయ! - అంతరంగ విద్య అంటే ఆత్మజ్ఞానం. దానికి అధికారి - పరమాత్మ. ఇట్లా కూడా అన్వయించవచ్చునంటున్నారు కొందరు పెద్దలు).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! ఆగమాలు అనే పుష్పాల సౌరభంతోకూడిన శరీరం కలవాడా! బుధుల అంతరంగాలే నివాసంగా కలవాడా! విద్యకు అధికారివైన సౌందర్యంతో విరాజిల్లేవాడా! (జ్ఞానసౌందర్యం - తేజస్సు). దేవతలచేత అర్చించబడేవాడా! నిర్భోగ సభోగసంపదలకు అందనివాడా! ఒక్క ఆత్మజ్ఞానానికే అందేవాడా! భక్తి అనే లక్ష్మికి గురువులైన నిత్యయోగీశ్వరులతో సేవించబడేవాడా! శాంతిస్వరూపా! సుఖస్వరూపా!

క. అభిమతఫల సంపాదన । విభవమహీయః ప్రసాద! విశ్రుతవేదా!
బుభు విభు విలోచనాంబుజ । శుభద రవిత్వా! హరిత్వ సుభగహరత్వా! 623

ప్రతిపదార్థం: అభిమత= కోరుకొన్న; ఫల= ఫలాలను; సంపాదన= సమకూర్చటమనే; విభవ= సంపదతో (వైభవంతో); మహీయః= గొప్పదైన; ప్రసాద= అనుగ్రహం కలవాడా!; విశ్రుత+వేద= చెవికెక్కిన (వీను మిగిలిన) వేదాలు కలవాడా!; బుభువిభు= దేవతల నాయకుడైన దేవేంద్రుడియొక్క; విలోచన+అంబుజ= నేత్రపద్మాలకు; శుభద= శోభను కలిగించే; రవిత్వా!= సూర్యత్వం కలవాడా!;

హరిత్వ= విష్ణుత్వంతో; సుభగ= అందమయిన (సొంపిల్లిన); హరత్వా!= శివత్వం కలవాడా! (హరిత్వమూ హరత్వమూ పరస్పర సౌందర్యదాయకాలుగా విరాజిల్లుతున్నవాడా! - అని).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! భక్తులకు కోరుకొన్న ఫలాలను అందించటంలో ఘనత వహించింది నీ అనుగ్రహం. వేదాలను నిరంతరం వింటూ ఉంటావు. దేవేంద్రుడి నేత్రపద్మాలను వికసింపజేసే సూర్యుడివి నీవే. నీలో హరిత్వమూ హరత్వమూ సొగసుగా జతగూడి ఉన్నాయి.

మాలిని.

వరబహునుత వేదవ్యాస! విశ్వాత్మభాసా!
నిరుపమతను లీలానిత్య! సత్యాధికృత్యా!
నిరతిశయ సమత్వోన్నిద్ర! కారుణ్యభద్రా!
భరితభువనవర్గా! భాస్వదానందమార్గా! **624**

ప్రతిపదార్థం: వర= ఉత్తమంగా; బహు= (అధికంగా) బహువిధాలుగా; నుత= నుతించిన; వేదవ్యాస!= వేదవ్యాసుడు విశ్వ+ఆత్మ+భాసా!= విశ్వాత్ముడవై ప్రకాశించేవాడా! (విశ్వాత్మకమైన తేజస్సు కలవాడా!); నిరుపమ= సాటిలేని; తను= అవతార రూపాలయొక్క (శరీరాలయొక్క); లీలా= విలాసాలతో; నిత్య!= నిత్యుడా!; సత్య+అధికృత్యా!= సత్యస్వామీ! (సత్యరూపా!); నిరతిశయ= సాటిలేని; సమత్వ= సకలప్రాణి సమానత్వంతో; ఉన్నిద్ర!= తేజరిల్లేవాడా!; కారుణ్యభద్రా!= దయానిలయా! (కృపారూపమైన శుభస్వరూపా!); భరిత= భరింపబడిన; భువనవర్గా!= లోకసమూహం కలవాడా!; భాస్వత్= ప్రకాశించే; ఆనందమార్గా!= ఆనందమార్గం కలవాడా! (ప్రకాశించే ఆనందానికి మార్గమైనవాడా!)

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నిన్ను వేదవ్యాసుడు ఉత్తమంగా బహువిధంగా నుతించాడు. నీ తేజస్సు విశ్వవ్యాప్తమై విశ్వాత్మగా ఉంటుంది. నీ అవతారలీలలు నిత్యాలూ నిరుపమాలూ. సత్యస్వరూపుడవు నీవే. సర్వప్రాణి సమతాభావంతో నీవెప్పుడూ జాగరూకుడవై ఉంటావు. నీవు కారుణ్యమూర్తివి. భద్రప్రదాతవు. సకల భువనాలనూ నీవే భరిస్తావు. నీవే నిజమైన ఆనందమార్గానివి, ఆనంద స్వరూపుడవూ, ఆనందప్రదాతవూ - అని హరిహరనాథుడిని స్తుతించే స్తోత్రములు.

విశేషం: మాలినీ వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న,న,మ,య,య అనే గణాలుంటాయి. తొమ్మిదవ అక్షరానికి యతిమైత్రి ఉంటుంది. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున శాంతిపర్వమునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరులైన ఉభయ (సంస్కృతాంధ్ర) కవులకు మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను ఆరాధించటంచేత ప్రకాశించేవాడూ (పండితులచేత ఆరాధించబడి రాజిల్లేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని శాంతిపర్వం ముగించే ఆరవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని ఆరవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని శాంతిపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వము

(రెండవ భాగము)

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అ		అట్టియెడఁ దత్త్వజ్ఞాన	638	అతనిఁ బొదువు సంకల్పం	701
అంగంబులు వొదల నెదరు	1087	అట్టియెడ నేనును	1024	అతనికి నన్నపానముల	974
అంతంతకు సత్కర్మము	812	అట్లకాక యని ప్రియంబు	761	అతనికి సరిత్సముద్ర	866
అందుఁ దుదముట్ట	978	అట్లుంగాక	952	అతని తలఁపున	536
అందు మూఁడేసి ఋతువుల	691	అట్లుంగాక ధర్మా	544	అతని తెఱం గిట్టిది	1078
అంబర పాటవమునఁ బో	1091	అట్లుండ నొక్కనాఁడు	1072	అతనితోడ నిట్లనియె	1082
అకట! భవిచ్చిత్తము నిర్వికార	671	అట్లు కల్పించి జలముల	588	అతనివలన భూతములకు	723
అక్షరంబగు పంచ	933	అట్లు ధర్మజుఁడు	1067	అతివ! నేమమె? తగ	1081
అక్షరము విక్రియా	886	అట్లు బహువిధంబులగు	1074	అతులవేదాంతశాస్త్ర	727
అఖిల కర్మఫలము	609	అట్లు మ్రోసిన విని	751	అత్రిముని యింద్ర దైవత్య	626
అఖిలరత్నపూర్ణయగు	905	అట్లు సనుదెంచు	767	అది తిర్యఙ్మనుష్యా	891
అగమనునిన్	596	అట్లు సాకారమై వచ్చి	559	అది ధర్మంబుల కెల్లం	734
అగుణం బయ్యును	889	అట్లు సిద్ధుండగుటయు	790	అది భావనీయంబు	690
అగు నీ తత్త్వము సత్త్వా	542	అట్లేకాంతియై తపంబు	1048	అది యట్టులుండె నీతో	661
అగ్గోవున కతం డిట్లనియె	774	అడవి సొచ్చి యంత	619	అది యట్లుండె నప్రతి	1071
అగ్నినోషధి వృక్ష	816	అడిగితి లెస్సగ	875	అది యట్లుండె వినుము	778
అగ్ని వెచ్చనొ? చల్లనో	956	అడిగి మేలు సేసి	795	అది యెట్లంటేని	911
అచటఁ బ్రతిహారు	972	అతండతని కిట్లనియె	637	అది యెట్లంటేని దేవ	694
అచరములు జరంబు	602	అతం డతని కిట్లనియె	762	అది యోగి కొప్పదు	630
అచలు సూక్ష్మ వరేణ్య	593	అతండు ననేకవర్షం	569	అది యోగిజనంబుల	691
అచిర కాలంబునన	996	అతఁ డతనితోడ శిష్య	987	అది లెస్సగ విడిచి	936
అజగరచరితము	536	అతఁడు కాలకలితమైన	622	అది సిద్ధత్వసంపదకు	922
అజము లవ్రణంబు	932	అతఁడు గడంగ	814	అదృశ్యుండై నిలిచి	1027
అజుండు జగంబులు	743	అతఁడు చిరకాల	762	అద్దేవముని యిట్లనియె	1046
అజుని విశ్వరూపు	1030	అతఁడు మోక్షదర్శి	971	అద్దేవుండు వత్సలుం డయి	1046
అట్టి మహామహిమ	983	అతఁడు రాత్రి నిద్రించు	696	అధిప! లఘ్వాశియై	803
అట్టియెడ	1092	అతఁడు సదివింప వేద	970	అధిప! సర్గముఁ బ్రళయంబు	910

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అనఘ! దివసంబు రాత్రియు	740	అన విని సంశయం	944	అని చెప్పి యంత నిలువక	669
అనఘ! దురన్నము	828	అనవుడు నతండు నీవీ	659	అని చెప్పి యంత నిలువక	755
అనఘ! దేహంబు కంటె	739	అనవుడు నతఁ డిట్టులను	966	అని చెప్పి యనిమిష	662
అనఘ! నాయందు నీవు	1094	అనవుడు నతనికి నత	685	అని చెప్పి యప్పరాశర	724
అనఘ! నా రాక వార్చి	1087	అనవుడు నతనితో	865	అని చెప్పి యప్పారాశర్యుం	714
అనఘ! నీ మధురవాక్యం	1073	అనవుడు నద్దేవి	681	అని చెప్పి యప్పురుష	792
అనఘ! బ్రహ్మంబు	696	అనవుడు ననిమిషవతి	652	అని చెప్పి యబ్బలము	815
అనఘ! మూఢాత్ము	847	అనవుడు నమ్మహాను	832	అని చెప్పి యమరతటినీ	822
అనఘ! యింద్రియముల	708	అనవుడు నరనాథుఁడు	566	అని చెప్పి యిట్లను	1015
అనఘ! యింద్రియములు	731	అనవుడు నాతఁడిట్లను	754	అని చెప్పి వెండియు	847
అనఘ! యిది భార్గవుండు	831	అనవుడు భీష్ముఁ డిట్లనియె	829	అని చెప్పి వెండియు	852
అనఘ! యిది యోగ	923	అనవుడు మున్న యిట్లు	986	అని చెప్పి వెండియు	866
అనఘ! యుత్తర దక్షిణా	692	అనహంకారము నప్రార్థన	824	అని చెప్పి వెండియు	877
అనఘ! వినుఁ కామ	714	అనహంకారుఁడు నక్రో	781	అని చెప్పి వెండియు	887
అనఘ! విష్ణు విహారంబు	810	అని కామం బనునది	523	అని చెప్పి వెండియు	907
అనఘ! సుఖదుఃఖ	839	అని గలిగి పరాక్రమ	659	అని చెప్పి వెండియు	992
అనఘ! సుఖాసీనుఁడైన	885	అని గురుఁ డుపదేశించిన	587	అని చెప్పి వెండియు	1068
అనఘా! తపోవనము	963	అని చెప్పి	180	అని చెప్పి వెండియుం బరా	843
అనఘా! దుఃఖాత్మక	545	అని చెప్పి తపము పెంపును	838	అని చెప్పి వెండియు నిట్లనియె	557
అనఘా! భవదీయ	789	అని చెప్పినం బ్రమదంబు	761	అని చెప్పి వెండియు నిట్లను	762
అనఘా! మర్త్యుల	836	అని చెప్పినం బ్రియం	909	అని చెప్పి వైశంపాయను	1023
అనఘా! మృత్యువు	801	అని చెప్పినం బ్రీతుండై	749	అని చెప్పె నగ్గుణంబు	689
అనఘా! మోక్షము తెఱఁగిది	904	అని చెప్పిన నమ్ముని	799	అని చెప్పె ననిన విని	521
అనఘా! యగ్నీషోముల	1036	అని చెప్పిన ముదితుండై	939	అని చెప్పె ననిన విని	742
అనఘా! విధివిహితంబుం	650	అని చెప్పిన రాయంచతో	857	అని చెప్పె ననుడు	687
అనఘా! వినుఁ మవ్యక్తం	633	అని చెప్పిన విని యప్పాండ	653	అని చెప్పె ననుడు	825
అనఘుం డింద్రియహయ	833	అని చెప్పిన విని యజాత	518	అని చెప్పె నిట్టు లయ్యని	610
అనఘుఁ బరాశర	689	అని చెప్పిన విని విద్య	718	అని చెప్పె నియతుఁడై	906
అనఘులార! సంసిద్ధు	571	అని చెప్పిన విని విశ్వా	934	అని జపించి సర్వావస్థల	607
అనయముఁ దేటి నాగ	1085	అని చెప్పి పారాశర్యుం	702	అని తన వైరాగ్యంబును	946
అనయము నీసు వొనర్చిన	807	అని చెప్పి ప్రకృతి	916	అని తెలిపి మఱియును	932
అనలము దోఁచునే	577	అని చెప్పి బ్రహ్మక్షత్ర	1035	అని ధర్మం బగ్గించి	791
అనలునకు రవికిని	595	అని చెప్పి భీష్ముండు	858	అనిన జనకుడిట్టు	841
అన విని నన్నుఁ గాంచితి	1094	అని చెప్పి భృగుండు	550	అనిన జాజలి యట్లేని	754
అన విని బలి	655	అని చెప్పి మఱియు నిట్లను	925	అనిన ధర్మసుతుండు	850
అనవుడు నతం డతని	977	అని చెప్పి మఱియును	732	అనినం గర్మంబు విడువమి	719

పద్యము	పుట
అనినం దొల్లియు నిది	747
అనినం బితామహునితో	646
అనినఁ గపిలుఁ డిట్టు	778
అనినఁ దదీయయబోధనంబు	752
అనినఁ దానను మంత్రులు	957
అనినఁ దేజస్వి జేసి	831
అనినఁ బ్రియమంది	829
అనిన నజాతశత్రుం	864
అనిన నట్లుకాక యని	971
అనిన నట్లకాక యని	1064
అనిన నట్లకాక యూచ	789
అనిన నట్లకాక వినుము	809
అనిన నతండు ప్రీతుండై	818
అనిన నతఁ డట్లచేయ	1076
అనిన నతఁ డతని	671
అనిన నతఁ డిట్టి ధర్మము	1058
అనిన నద్దేవముని	590
అనిన నభినందించి	760
అనిన నాతఁడు భయమంది	569
అనిన నీ రాక వార్చి	1084
అనిన భృగుఁ డిట్టులను	541
అనిన వారు కృతార్థులై	805
అనిన వారు మరాళంబున	856
అనిన విని కురుపతి	556
అనిన విని కౌంతేయా	535
అనిన విని కౌంతేయా	647
అనిన విని జనకజన	640
అనిన విని జనకజనే	846
అనిన విని జనకపతి	918
అనిన విని జనకభూవిభు	843
అనిన విని జనకుం డమ్మునీ	891
అనిన విని జనకుండు	840
అనిన విని జనమేజయుం	1023
అనిన విని జనమేజయుం	1055
అనిన విని జాజలి	753
అనిన విని దేవతటినీ	965
అనిన విని ధర్మంబు	565
అనిన విని ధర్మజుఁడు	684
అనిన విని ధర్మతనయుండు	644
అనిన విని ధర్మతనయుండు	867
అనిన విని ధర్మనందనుండ	859
అనిన విని ధర్మనందనుండు	799
అనిన విని భృగుండు	1095
అనిన విని ధర్మపుత్రుండు	770
అనిన విని పరమ	587
అనిన విని పాకశాసనుం	674
అనిన విని ప్రీతుఁడై పాండ	637
అనిన విని బలి దేవతా	655
అనిన విని బలి యతని	667
అనిన విని భరద్వాజు డా	546
అనిన విని భరద్వాజుండు	547
అనిన విని భరితా	690
అనిన విని భృగుఁడ	541
అనిన విని మేధావి	514
అనిన విని యజాత	531
అనిన విని యజ్ఞనపతి	508
అనిన విని యత్యంతా	1070
అనిన విని యమ్మహా	745
అనిన విని యమ్ముని	559
అనిన విని యమ్ముని	976
అనిన విని యా నృపతి	909
అనిన విని యుధిష్ఠిరుండ	552
అనిన విని యుధిష్ఠిరుండు	860
అనిన విని యుధిష్ఠిరుండు	872
అనిన విని యుధిష్ఠిరుండె	803
అనిన విని యొండు	661
అనిన విని విస్మయము	652
అనిన విని విప్రుండ	562
అనిన విని వృత్తుం	813
అనిన విని వేదార్థ	1014
అనిన విని శుకుం డా	710
అనిన విని శుకుండు	716
అనిన విని శుకుండు	734
అనిన విని సవిశేష	1050
అనిన విని స్యామరశ్మి	777
అనిన విని స్యామరశ్మి	782
అనిన విని హిరణ్య	648
అనిన విష్ణుం	1040
అనిన సంతసిల్లి యద్దేవ	1048
అని నిర్దేశించె నట్లా	770
అని నిర్దేశించిన	780
అని నిర్దేశించి నీవు	1066
అని నిర్దేశించి వలయు	1000
అని నిర్దేశించి వెండియు	583
అని పత్ని బోధించిన	1085
అని పలవించి	1052
అని పలికిన ధర్మం	560
అని పలికిన విని	1012
అని పలికి తొల్లి	750
అని పలికి నారాయణ	1069
అని పలికి పుత్రుండు	800
అని పలికి భీష్ముండా	1015
అని పలికి భీష్ముండు	815
అని పలికి భీష్ముఁడు	906
అని పలికి మఱియు నిట్లను	804
అని పలికి యధిప!	747
అని పలికి యమ్మునీశ్వరు	994
అని పలికి యాజ్ఞవల్క్య	927
అని పలికి యాదరంబున	1003
అని పలికి యిట్లనియె	612
అని పలికి యిట్లనియె	1045
అని పలికి యిట్లనియె నిద్దిన	1076
అని పలికి యివ్విధంబు	526
అని పలికి యివ్విధంబునఁగృత	1095
అని పలికి యుచితముగ	675
అని పలికి యుద్దామంబై	523
అని పలికి వరంబు	1016

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అని పలికి విమల	996	అని యడిగిన హంస	856	అని విన్నవించిన విని	1025
అని పలికి వెండియు	650	అనియతంబులైన	530	అని విప్రుం డుపదేశించిన	512
అని పలికి వెండియు	669	అని యతఁడు నిజనివా	791	అని వెండియు	529
అని పలికి సత్వరంబుగ	1086	అని యతని మనశ్శుద్ధి	807	అని వెండియు	543
అని పలికి సమ్యగ్జ్ఞానంబు	581	అని యధ్యాత్మప్రకారం	554	అని వెండియు	549
అని పలికి సాధ్యులకు	858	అని యభ్యర్థించిన	823	అని వెండియు	576
అని పలికె నిట్లు లక్ష్మి	660	అని యమాత్యుల దిక్కు	952	అని వెండియు	631
అని పలుకుటయు	746	అని యమ్ముని పలు	636	అని వెండియు	696
అని పలుకుటయు స్యామరశ్మి	787	అని యానతిచ్చి మఱి	1065	అని వెండియు	735
అని ప్రార్థించె నప్పుడు	566	అని యిట్లాడిన మాటలు	671	అని వెండియు	759
అని పుత్రుం డుపదేశించిన	517	అని యిట్లు ధర్మతనయు	676	అని వెండియు	919
అని పుత్రు నుద్దేశించి	768	అని యిట్లు ధర్మసుతు	1096	అని వెండియు	935
అని బోధించిన జనకు	982	అని యిట్లు నముచి	664	అని వెండియు	1082
అని బోధించిన సగరుం	829	అని యిట్లుపదేశించి	736	అని వెండియు	1090
అని బోధించి వెండియు	1042	అని యిట్లుపదేశించి	786	అని వెండియు	1094
అని బోధించె నిట్లు	643	అని యి ట్లుపదేశించిన	965	అని వెండియు విరోచన	656
అని భక్తి పూర్వకంబుగా	1003	అని యిట్లు పరబోధన	902	అని వేఁడిన నమ్ముని	892
అని భీష్ముం డుపదేశించిన	611	అని యిట్లు పెక్కుభంగుల	767	అని వేఁడిన భక్తపరా	1004
అని భృగుండు సెప్పిన	539	అని యిట్లు పెక్కుభంగుల	850	అని శాంతనవుఁడు	1023
అని మఱియు దయ	592	అని యిట్లు ప్రబోధించి	905	అని సత్యక్షమాదమ	855
అని మఱియు ననేక	997	అని యిట్లు పలుకు పలుకులు	955	అనుచు	947
అని మఱియు ననేక	1031	అని యిట్లేకతద్విత	1012	అనుచుం గృష్ణద్వైపా	1061
అని మఱియు నిట్లను	758	అని యిట్లొలయు వితర్కం	631	అనుచుం జనుదెంచి	769
అని మఱియును	533	అని యివ్విధంబున	1043	అనుటయు	573
అని మఱియును	544	అని యుపదేశించి మఱియును	705	అనుటయు	856
అని మఱియును	577	అని యుపదేశించి వెండియును	924	అనుటయు దేవవ్రతుం	532
అని మఱియును	844	అని యుపదేశించిన విన	938	అనుటయు దేవవ్రతుఁడ	797
అని మఱియును	908	అని యుపదేశించి యింక	728	అనుటయు ధర్మంబు	560
అనిమిత్తము భూతం	527	అనియె నద్దేవముని	1000	అనుటయు నతఁడిట్టు	748
అనిమిషనాథు తోడి	808	అనియె నని చెప్పి గురు	1002	అనుటయు నమ్మహీ	795
అని యడిగిన నతం	826	అనియె నని చెప్పిన	1044	అనుటయు నమ్మహీ	1078
అని యడిగిన నతనికి	794	అనియె నని చెప్పిన విని	773	అనుటయు నమ్ముని	710
అని యడిగిన నమ్మహా	823	అనియె నయ్యిరువుర	571	అనుటయు నయ్యిన	563
అని యడిగిన నయ్యుధిష్ఠిరు	664	అనిలముఖదోషము	632	అనుటయు నయ్యిరగ	1088
అని యడిగిన నాదరించి	852	అని విచారించి తలంచు	764	అనుటయు నా కృష్ణుం	688
అని యడిగిన వైశం	1059	అని వితర్కించియు	765	అనుటయు నాతఁడిట్టు	805

పద్యము	పుట
అనుటయు నా దేవవ్రతుం	1070
అనుటయు నిట్లనుం	776
అనుటయుఁ బరాశరుం	841
అనుటయు మహేంద్రుండు	661
అనుటయు వార లొండొ	985
అనుటయు స్యామరశ్మి	775
అనుటయు హంస మిట్టు	857
అనుడు నజాతశత్రుఁడిటు	796
అనుడు నతఁడు కర్మమఖిలంబు	719
అనుడు ననపాయమగు	795
అనునయపూర్వకంబుగా	1000
అనుపమ మజర మతీంద్రియ	892
అనుభవము మ్రింగు శాంతిం	585
అనులోమంబున సృష్టియు	897
అన్నమును జలంబు	1034
అన్నరేంద్రుం డహింసకుం	1008
అపరిగ్రహసర్వారంభ	991
అపుడు మందాకిని సాకార	968
అపునరావృత్తి పదంబగు	937
అప్పని మనచేత నయ్యెడి	756
అప్పరమేశ్వరుండు	821
అప్పవనములను గలఁచిన	989
అప్పుడ యసమర్థుండగు	766
అప్పుడు తదీయ బ్రహ్మ	572
అప్పుణ్య క్షేత్రంబున	1075
అప్పురుషుండు	542
అభినందించిరి దేవ	683
అభిమతఫల సంపా	1097
అమరతటినీసుతున	1070
అమరుం డవ్యయుఁ డజరుం	616
అమరులు విమల శ్రద్ధా	757
అమలంబగు నీ యితి	644
అమలవాయుసేవనము	890
అమల హృదయవేద్యా	677
అమలిన గృహస్థ	776
అమృతం బచ్యుతమమలం	586
అమృతపానంబుఁ జేసిన	675
అమృతము నభవము	890
అమృతము మృత్యువు	515
అమ్మహాత్ముం డమ్మహా	688
అమ్మహాత్ముండు	1006
అమ్మహితాత్ముండు మద్భ	1008
అమ్మునిపతి వాక్యము	992
అమ్ముని యును శిష్య	984
అమ్మునీశ్వరుండు భక్తి	967
అమ్మొయి నిలుచుటకును	830
అయనవశంబునఁ దేజో	661
అయిదు దెఱఁగుల	597
అయినను నా యెటింగి	775
అయ్యరణిఁ బుట్టి జనక	968
అయ్యవసరంబున సత్య	998
అయ్యురగవల్లభు	1078
అరదముమీఁద మున్	1092
అరయంగా శబ్దంబును	699
అరయంగా శబ్దంబును	782
అరయఁగాఁమము	991
అరయఁగ ధర్మతంత్రముల	1071
అరయఁగ విషయము	627
అరయఁగ సంస్పర్శము	626
అరయఁ బుత్తెంచె	973
అరయ మే లసంగ	846
అరసి చూడ సత్త్వంబు	554
అరిగి యచట వాని	1053
అరుదే సర్వేశ్వరుఁడగు	1045
అరులు మిత్రులుదాసీను	949
అర్థంబుల యస్థిరత్వంబ	807
అర్థముల్ దుఃఖదోషా	797
అలఘుతపంబు గోరి	1006
అలఘుమతిని యజ్ఞా	775
అలసులు ధనహీనులు	777
అలుక మానుము హరికై	1010
అల్పమైన యగ్ని	861
అవనిఁ బొందదు దివ	725
అవమానమునకు	686
అవయవము లెట్లు	728
అవి గలిగి పరాక్రమ	659
అవి ప్రయోజనపడుట	810
అవి యెల్ల నసత్యం	956
అవి వినఁగ నెఱుఁగ	613
అవ్యక్తు శాశ్వతు నఖిల	592
అవ్విధంబున మహాను	790
అవ్విప్రవరుం డతని	640
అవ్విశేషంబులెల్ల నీ	980
అశని నిర్ఘోషంబు	540
అశ్వమేధ సహస్రంబు	610
అష్టమియగు దేవత	683
అసమాలంబ శబ్దము	576
అసితుండగు దేవలుండు	685
అస్థిరేంద్రియ సలిల	960

ఆ

ఆకర్ణింపుము	692
ఆకసమును మనసు	701
ఆగమపుష్ప	1097
ఆగమ సత్యధర్మాచార	543
ఆ గుణములు మఱియు	660
ఆచారనేమియుఁ బ్రాణ	706
ఆచార పరిపాటి	969
ఆ చూపు మరిగి చిత్తం	625
ఆతఁ డతిభక్తిఁ దలఁచె	790
ఆతత సంసారము తృష్ణా	636
ఆతనిఁ గానఁ బొమ్ము	1076
ఆ తీర్థోత్తమమున	1075
ఆ తెరువులు రెంటికి	859
ఆ తెఱఁ గఘములఁ బాచు	853
ఆత్మయం దగ్ని సమా	722
ఆత్మునకు రెండు రూపంబు	870
ఆదికాలమున బ్రజాభి	1063
ఆదిత్యమరుద్వసు	677

పద్యము	పుట
ఆదిత్యమరుద్వసు	1018
ఆదిత్య మరుద్వసు	1025
ఆదినిధనరహితుఁడగు	733
ఆదిమధ్యాంతములు	1038
ఆదియు మధ్యము నంతము	585
ఆ ధర్మతనయుతోడ	590
ఆనతవైరి! యిట్టులను	856
ఆ నదియం దాచరిత	680
ఆ నరపతి శాంతనవుని	664
ఆ నాదముదెసకుం జన	1053
ఆ బ్రహ్మ యఖిల భూతా	537
ఆ బ్రహ్మర్షి సత్తముండు	995
ఆ యుగంబులు నాల్గు	695
ఆయువు దఱుఁగు నంతం	800
ఆ యైశ్వర్యము గ్రమ్మఱ	808
ఆరయఁ గదళీగర్భా	848
ఆరయఁ గామముఁ గ్రోధము	991
ఆరయ నధ్యాత్మ మహం	915
ఆ రాజన్యునెడ నహం	971
ఆర్జవంబు ప్రసన్నత	652
ఆర్యులుఁ బ్రవృత్తి లక్షణ	618
ఆ వణిజుఁడు ధర్మస్థితి	761
ఆ వాసవు చందంబున	818
ఆ విధము శుక్లగతి	626
ఆశయ యింద్రియజయ	512
ఆశ్చర్యములకెల్ల నాస్పదం	1089
ఆశ్మశాన గమను లంతియ	962
ఆ సుకృతము గడయెయ్ది	791
ఆహితాగ్ని బుణ్యుఁడను	835

ఇ

పద్యము	పుట
ఇంతకాలమేని యెఱుఁగక	900
ఇంతకు మును సూచితి	673
ఇంతకు మూలము దృష్ణా	622
ఇంతననేల? యేను భుజ	1079
ఇందుల తాత్పర్యము నీ	684
ఇంద్రియంబుల కంద	1017
ఇంద్రియంబుల నాటింటి	734
ఇంద్రియంబులు దమ	580
ఇంద్రియంబులు నవ్యక్తం	910
ఇంద్రియంబులు మనము	922
ఇంద్రియముల గెల్చి హృద	687
ఇంద్రియములలో నొక్కటి	715
ఇంద్రియములెల్ల నట్టివ	912
ఇంద్రియార్థంబుల నేనింట	869
ఇంద్రుఁ డబ్జజుకడ	653
ఇంద్రుఁడుజ్జ్వల రథం	813
ఇంద్రునకు రుద్రుఁ డత్తఱి	814
ఇంద్రు లెందఱు వో రింద్రు	670
ఇచ్చి యెప్పటి యట్ల	1053
ఇచ్ఛానిరసనంబు	524
ఇటు గర్వించుట నీచత	657
ఇట్టి జనని వధించుట	767
ఇట్టి మహిమ గలిగి	697
ఇట్టి యప్పుడు సదివిన	990
ఇట్టివాఁడు వెడల	704
ఇట్లగుట మున్నెఱింగించితి	1068
ఇట్లయ్యిరువురు నధ్య	988
ఇట్లాయురంశంబులు	722
ఇట్లు కృతయుగంబునకు	694
ఇట్లు గలిగి వర్తిలుచున్న	698
ఇట్లు కృతయుగంబునకు	693
ఇట్లు నిలిచిన యవ్వేద	999
ఇట్లు ప్రణామంబుసేసి	611
ఇట్లు ముక్తుండనై యున్న	945
ఇట్లు లబ్ధవరుండగుచు	967
ఇట్లు విష్టరశ్రవుండు	1054
ఇట్లు వుట్టి గంధమాద	1039
ఇట్లు సెప్పి	1068
ఇతఁ డబీజుం డదేహుం	893
ఇతఁ డెవ్వండని యమ్మెయి	1092
ఇతరేతర మతి సంభావిత	1043
ఇత్తెఱుగునఁ బురుషుం	825
ఇది కర్మభూమి భోగా	548
ఇది నా కయ్యెం గాఁగల	663
ఇది నాయదియనుఁ నూత	509
ఇది బ్రహ్మచారి ప్రకారం	721
ఇది బ్రహ్మ వసిష్ఠునకు	906
ఇది మేలపుమాట సుమీ	658
ఇది యక్షరక్షర వివేకం	894
ఇది యితిహాసవరము	1001
ఇది యేమి? శోకమున	507
ఇది యోగప్రకారంబు	707
ఇది యోగ ప్రకారంబు	897
ఇది విజ్ఞానము కృత్యము	937
ఇది శమ ప్రకారంబని	530
ఇది శ్రీమదుభయకవిమిత్ర	678
ఇది సాంఖ్యప్రకారంబు	873
ఇది సాంఖ్యానుభావంబు	920
ఇద్ధమైన యగ్ని యింధన	862
ఇనరశ్ములుఁ చంద్రాంశులు	1034
ఇనరుచిఁ బాషాణము	847
ఇను నడుమ వెలుంగుచు	598
ఇనుమును గనకము	980
ఇనురూపము జలముల	739
ఇను వేఁడిమి శోషించిన	1090
ఇయ్యఖిలము సృజియిం	709
ఇరుప్రొద్దు గుడుచుచు	646
ఇల జలంబుల జలం	604
ఇలయు గిరులును శర	1001
ఇవి కర్మస్థుల తెఱంగులు	699
ఇవి పుణ్యలోక విషయ	549
ఇవి యన్నియు నాశ్చర్యము	1093
ఇవ్విధంబున నుద్యుక్తుం	1077
ఇవ్విధంబున నేకాంతియై	1015
ఇవ్విధంబున శాంతినొంది	735
ఇవ్విధమున నతండు	927
ఇవ్విషయంబునకు నొక్క	680
ఇవ్విషయంబున యయాతి	979

పద్యము	పుట
ఇవ్విషయంబున వృత్ర	806
ఇవ్వెరవునకు వైరాగ్యంబు	642
ఈ	
ఈ చక్రంబున సకల	617
ఈ చతుర్వింశతి తత్త్వం	887
ఈ తెరువునఁ జరియిం	879
ఈ తెరువున వేదవిదుఁడు	706
ఈ తెరువు మద్గురుఁడు	1060
ఈ తెఱంగు లేనెఱుంగుదు	528
ఈ దేవునిఁ గన్నట్టుల	1012
ఈ నెఱి పురుషునకుం	904
ఈ నెలవులఁ దోఁచును	1058
ఈ యయిదింటన కాదె	539
ఈ రెండు ప్రకారంబుల	708
ఈ లోకంబుల నెల్లం	713
ఈ లోకము దుఃఖ	548
ఈ విధము నిశ్చయము	1095
ఈ వెరవూఁదుము	939
ఈ సర్వము దేహత్వా	615
ఉ	
ఉండెం బాండవా	940
ఉత్తమం బెద్ది	851
ఉత్తమమెయ్యది? నావుడు	506
ఉత్తరకాలంబున లోకో	1065
ఉత్తరాయణమును	845
ఉత్సవంబు మీఁద	533
ఉదయమగు సూర్యు	551
ఉదిత సమగ్ర	922
ఉపరిచరవసు వను	1008
ఉముక దినుచు	655
ఎ	
ఎక్కుడు చాయ శుక్ల	812
ఎచటినుండి యెచటి	942
ఎచ్చోటనైన నధనుఁడు	519
ఎట్లంటేని	921
ఎన్నికొనుచుండఁ	959
ఎన్ని రూపులు గొని	902
ఎప్పుడు పురుషుండు	900
ఎలమియు వాడుట	657
ఎల్లకడలకు వెలువడు	734
ఎవ్వఁడు రమించు	856
ఎవ్వఁడు సచరాచర	594
ఏ	
ఏకత్వం బన్యత్వ	602
ఏకద్విత్రి చతుర్వ్యూ	1057
ఏకరసమయక్షేత్ర	583
ఏకాంతిక భక్తి రతి	1012
ఏకాంతి జనంబులు	1060
ఏకాంతిక ధర్ముము	1069
ఏతద్విషయంబైన	665
ఏదియుఁ దలఁప	785
ఏన కలను నాకు	964
ఏనటె! యొక్కెడ	1084
ఏ నతీతంబులును	1025
ఏనిది యంతయు	807
ఏనుఁగులు సుట్టిరాఁ	654
ఏనుఁ గర్త ననుట	650
ఏనునుం జెప్పెద	1026
ఏనును నిట్టుల మోహా	1073
ఏను రక్షింప జయము	1044
ఏను వసిష్ఠ వచనముల	906
ఏను వేఁదుఱుడు	511
ఏ నెట్లు ముక్తుండఁ	950
ఏమి గతి లక్ష్యభేదము	863
ఏమిట రూపగు	679
ఏమిట లోకం	855
ఏము సాధ్యులమని	851
ఏవాఁడెమ్మెయిఁ	637
ఏ విధము కాంతనైనన్	779
ఏ విధమున దుర్దశలకు	664
ఐ	
ఐనను గాఢనిరూపణ	535
ఒ	
ఒకటి గోరి దాని	686
ఒకఁడు గోదానమొనరింప	567
ఒక్క కొఱఁతయు లేదు	981
ఒక్క మేనియంద	948
ఒక్క శృంగమునన	1038
ఒక్కొక్క కాలంబున	1019
ఒడ లెట్లు విడువ	560
ఒదవు వృత్రు రక్తమున	817
ఒరులకుఁ దా వెఱవక	737
ఒరుల పనికిగా	848
ఒరులేమేమి యొనర్చిన	749
ఒలయు జరావ్యాధి	545
ఒలసి లోభమోహములు	639
క	
కట్టిన చీరయునుం	634
కడుపులోన నుండి	830
కదియఁగ బాఱుతెంచిన	1091
కదియుం గాష్ఠము గాష్ఠము	508
కనకమయ యూపమొప్ప	654
కనుఁ గవ్వై వినుఁ జెవియై	731
కనుఁగొని యించుక సేపు	928
కనుట వినుట యాదిగా	711
కపిలదర్శన విదులగు	875
కమలగర్భు సృజించి	1018
కమలజు పంచిన క్రియ	1027
కమలభవుండు దాఁదపము	839
కరచరణాది సంఘటిత	765
కరణంబులు దొడరిన	740
కరము నియతుఁడై కొంతేసి	921
కరుణావిధేయుఁ డగు	1009

పద్యము	పుట
కర్మంబునం గానిది	718
కర్మేంద్రియంబులకు	899
కఱవుపయిఁ గఱవు	533
కలగొన రాజసతామస	1059
కలదు నానాత్వమేకత్వ	895
కలయంగ నెల్లయెడలం	600
కలవాఁడు లేనివాఁడు	766
కలిగెఁ దొల్లి భూమిగల	1006
కలిగె వినుమహంకారము	614
కలిమియును లేమియును	806
కలిమి లేమి యనఁగఁ	648
కలుగుం దోషమి యమవసఁ	579
కళలుం గాష్ఠలు లోనుగఁ	672
కాదిది విక్రమకాలము	669
కామంబుం బెడఁబాచు	714
కామ క్రోధాద్యములగు	517
కామసుఖ దివ్యసుఖములు	526
కామాదితృప్తుఁడై నరుఁ	961
కారణము గలిగియును	641
కారణములవలనఁ గృత	755
కారణము లేక దాపలి కను	926
కార్తవీర్య దశముఖ	1086
కార్యవిచారము చిరముగ	769
కాలంబెడలిన విద్యో	701
కాల కబళనైక శీలుఁడై	927
కాలగతి గనుట శాంతికి	674
కాలచక్రంబు నిరవధికంబు	612
కాలప్రకారం బెఱుంగుదుం	671
కాల మడగించు జను	673
కాలముల కీడు కతమున	1066
కాలముఁ బర్జన్యుండును	594
కాలములకు భూతములకు	690
కాలవిధములు భూత	690
కాలుఁజేయి మొదలుగా	952
కావున	522
కావున	724
కావునన్	811
కావునఁ గురువంశోత్తమ	770
కావునఁ బ్రకృతి యచేతన	919
కావునఁ బ్రార్థన సెఱుపం	570
కావున గుణములు ప్రకృతి	894
కావున గృహస్థ వృత్తి	828
కావున ధర్మసూక్ష్మ	1083
కావున నింద్రియ చేష్టల	912
కావున నీకే జెప్పిన	609
కావున నీవును	517
కావున నీవు ముక్తుఁడవు	950
కావున ఫలమిట్టిది	563
కావున భూతానిత్యత	651
కావున లోకసంక్షయము	802
కావున శుక్లస్థితికిం	627
కీడాడిన మేలాడుచు	853
కీడుగని యొకండు	944
కుపితుఁడగు నంతకుండు	862
కుపితుఁడగువాని వ్రతము	854
కురిసెఁ బుష్పవృష్టి	684
కురునాథ! యుపరిచర	1014
కురువంశముఖ్య యగ్గిరి	982
కృతమిది యకృతంబిది	801
కృష్ణద్వైపాయన పుత్త్రుండ	966
కృష్ణుఁడు బ్రభవిష్ణుండగు	587
కెలనికిఁ జూడఁగ దైన్యా	675
కేవల వైరాగ్యము	640
కైలాసశైల శిఖరమున	536
కొంచెపు టశనంబు	896
కొందఱు కర్మకరణ	717
కొందఱు బ్రహ్మచర్యమున	1074
కొనువారు ప్రవృత్తులు	562
కొలిచియుండు సుమంతు	984
కోపంబును లోభంబును	519
కోరికయు నొల్లమియు	979
కౌఁగిలించుకొని నీవు	1029
క్రతువులఁ దీర్థయాత్రలను	889
క్రతువులు సేఁతయు దేవ	670
క్రతువుసేఁత సేయించుట	703
క్రమమున జలపవనము	789
క్రమమున వాఙ్మయమగు	1021
క్రమమున సంధ్యలు	694
క్రమయుక్తిని శబ్ద	697
క్రియ లహంకారమునఁ	621
క్షత్రము బ్రహ్మమునై	1035
క్షమఁగ్రోధమకృత సంకల్పత	795
క్షమ క్రోధమునకు సంకల్ప	873
క్షమయును దమమును	852
క్షమయును సత్యంబును	624
క్షయవృద్ధులఁ జంద్రుఁడు	872
క్షరమండ్రు దానివలనను	886
క్షరమయ్యిరువది నాలుగు	887
క్షరము నక్షరంబుఁగానంగఁ	933
క్షరము నక్షరమును ననం	712
క్షరము నక్షరమును	899
క్షుద్ర జంతువులకు గురులకు	766
క్షేత్రంబన నవ్యక్తంబనం	898
క్షేత్రజ్ఞుం డనఁగ నిఖిల	542

గ

గంధరసాదుల కాంక్ష	794
గగనంబునఁ జనుటుడుగు	971
గగనపవన తేజో	729
గతహర్ష భయక్రోధుఁడు	705
గాడిద రూపు దాల్చి	657
గుణములకు నాదియై	599
గుణమూర్తి మాయ దానిని	582
గుణవంతుఁడు గుణ	1054
గుమ్మడిపువ్వుఁ దేనియయు	717
గురుఁడెవ్వఁడైన నగు	939
గురునకు భక్తుఁడై	546
గురుని వచనంబు తెఱఁగు	877

పద్యము	పుట
గురుభక్తి నిరతులు	682
గురుభక్తి శిష్యులకును	1082
గూఢంబులగు మదీయా	1033
గోవన మహి యది	1037
గ్రంథంబు ధరియింతు	893

ఘ

ఘనఝషమున్ సముద్ధత	861
ఘనతర ప్రజ్ఞయను	705
ఘృతమర్చిస్సంపద యయి	1038

చ

చంపఁగఁ జూచియు	772
చక్కఁగఁ జాఁగి మ్రొక్కుట	790
చతురాశ్రమముల వృత్త	825
చనినఁ జను నున్ననుండు	534
చలనంబు లేక జాజలి	750
చలనమేది పుట్టుఁ జావు	529
చాతకము వాన గోరెడు	1085
చాలిన నీవును హరి	1060
చిత్తశుద్ధి మాత్రఁ జేసె	717
చిరకారి యెట్లునుం దన	767
చిరముగ గర్భవాసమున	768
చుట్టము పగయను భేదం	687
చెందుచునుండుఁ బుణ్యములు	871
చెప్పిన విని జనమేజయుండు	1096
చెప్పుచున్నాఁడఁ గాలంబు	672
చెప్పెద నాకర్ణింపుము	507
చెలులుం జుట్టలును	668
చైతన్యశక్తిఁ బురుష	614
చ్యుతము లేకున్కిఁ జేసి	1038

ఛ

ఛాగము విశసన	1013

జ

జంతు పదములెల్ల	723
జగవతీవర! యోగస్థాల	863
జగముల కెల్ల శరణ్యం	724
జనకజనేశ్వరు బోధించు	886
జనకభూపతి యడిగినఁ	832
జనకుండు సవినయంబుగా	974
జనకుఁడ యేనై జన్మించిన	764
జనకుఁడు దపమును	764
జనకునికడకు మాండవ్యుండు	797
జనకు విడిచి యిట్లు	995
జననజరామృత్యుభయం	936
జననము జరయును	628
జననాథ మనోధారణ	921
జననాథ! యక్షరం బెందును	888
జననికరములకుం	723
జననీ జనకారాధన	1074
జననీ వధంబు సేసిన	763
జనములను స్మృతిఁ	608
జనములు దను నవమానించి	852
జనవర! కృషిఁబశు	837
జనవర! నీ సుభాషల	956
జనవర! యసిధారావ్రత	865
జనవర! శుక్లము లోహిత	889
జనవర! సాంఖ్య మిట్టిది	878
జనవర! సౌఖ్యముం	642
జనియించిన మాత్రన	969
జనియించి విప్రుండు	702
జప ఫలమున సగమిచ్చెద	563
జపయజననిషేవ్యా	882
జరయు మరణంబు	962
జలధితరంగల చాడ్పునఁ	552
జలపవనాంబర వసుధా	967
జలపవనాంబర వసుధా	1000
జలముఁ గదిసియుండ	920
జలము పృథివికంటె	584
జలములందు నిలిచి	732
జాతుఁడు మృతుఁడగుట	845
జాపకులకు యోగులకును	573
జీవశరీరములు పృథ	1018
జీవుండుఁ బ్రకృతియు	900
జీవుఁడు మత్సముపేతుఁడు	1018
జీవుఁడు శుక్లచ్ఛాయా	812
జ్ఞానంబు దృష్టి నరునకుఁ	623
జ్ఞానంబు నాశ్రయించిన	781
జ్ఞానంబు వడయుటకు	706
జ్ఞానధ్యాన పరాయణు	597
జ్ఞానము యింధనముగ	630
జ్ఞానము గేవలకృప	609
జ్ఞానము ధర్మమున కధిష్ఠానము	785
జ్ఞానమునకు నగ్గుణ	620
జ్ఞానమునన కాని జన్మ	938
జ్ఞానమునన కాని మానిని	945
జ్ఞానమును గర్మమును	943
జ్ఞానము విజ్ఞానము	981
జ్ఞానయోగము కృపా	575
జ్ఞాన విజ్ఞానదృష్టి	977
జ్ఞానవిజ్ఞానములు మోక్ష	977
జ్ఞానాజ్ఞానంబులకుం	622
జ్ఞానోదయమై యుండగ	976
జ్వరకథ వినినఁ బఠించిన	822
జ్యోతి యాత్మయంద యున్నది	979

డ

డెందమున కింద్రియములకు	578

త

తగియెడు శిష్యుల కొసఁగె	1056
తగులువాసి షడ్వింశకత్వ	904
తత్ప్రకారం బెట్టిదనిన	696
తత్స్వభావ మెఱిఁగి	732
తదనంతరంబ యంతర్హితుం	574
తదనంతరంబ యద్దేవుం	929
తదనుష్ఠాన ప్రకారంబు	896
తదీయసల్లాప విశేషంబులు	1045

పద్యము	పుట
తనకుందా నెరవనినను	509
తనకుఁ దానబంధమొనరించు	890
తనకు నెలవరుస వచ్చిన	1078
తనకు మహితప్రసాదం	726
తన కుసుమంబులన్ ఫల	735
తన గృహంబున కతిథి	1072
తన గృహమున నభ్యాసం	848
తన తన తెరువునఁ గర్మం	760
తన తన ధర్మమున్ నడిపి	960
తనతోఁ దుల్యుండైనను	844
తనది యనక యేమి	738
తన దేహము దోషములం	872
తన పతికి భాగకల్పన	819
తనయంద తోఁచువిషయము	553
తన లోచనదీప్తుల	942
తనుఁ దనయంద నిలిపి	606
తను నెఱిఁగిన నవ్యక్తము	918
తనుయాత్రకుఁగా నశనము	779
తనువు దొఱఁగి సను	559
తను వొప్పెడునది యౌవన	946
తను సరకుసేయకిట్ల	947
తన్ను నుత్తము మధ్యమాధమము	811
తపములును యజ్ఞములు	753
తపము సత్యంబ కన్ను	990
తమ్ము సంప్రీతిఁ గనుఁగొను	986
తలఁచు మనమందు నిశ్చయ	730
తలఁపఁగ నాయు వింతియ	868
తలఁపులు గ్రందుగఁ బొడముట	641
తల్లి ధాత్రిక బీజంబు	764
తాన సుతుఁ డగుట దెలియం	841
తాను గ్రోధాదు లెడలించుఁ	796
తాను దెగునేని బాంధవ	962
తాను బ్రకృతిఁ బ్రకృతి	920
తాను మున్న వినీతుఁడై	772
తాలిమి లేని జనంబులు	762
తెలియ మేల్కనియుండుట	633
తెలివొంది మనసు నిశ్చల	555
తెలిసికొనఁ బడయ రొరు	534
తెలుపుదురు సాంఖ్యులును	859
తెలపుమితని ననుడుఁ	1042
తేజోరూపము బ్రహ్మము	698
తేనియకుండఁ గొనుచు	923
తేరక యుండఁగ జేరుం	649
తొలి తొలి యిమ్మంత్రము	592
తొల్లిటి సచ్చారిత్రము	660
తోఁచిన నత్యంతభక్తిం	930
తోలు దిగవిడిచి నాగము	643
త్యాగమొక నెలవు	786
త్రినయనుఁడు వచ్చి	743
త్వరితము సేయక కార్యము	762

ద

దండముఁ గాషాయంబును	944
దక్షునకు నెఱింగించిన	1056
దనుజనాథ! యివ్విధంబునఁ	674
దమంబు సద్గుణంబుల	645
దమమునఁ గర్మేంద్రియముల	853
దమమునాఁ గల యుత్తమ	1034
దాంతుఁడు బ్రజ్ఞావంతుఁడు	651
దానం జేసి వసునామధేయుం	1007
దానగుణము శ్రద్ధలేని	759
దాన నవ్వేధ విహ్వలించి	1052
దానములఁ బుణ్యతీర్థ	846
దానాధ్యయన యజనముల	704
దానాధ్యయనాతిథి	682
దానానుష్ఠానంబు సర్వ	703
దాని కహింసయ మూలము	1057
దానికి నరవింద సంభవుం	744
దారధన మిత్రపుత్ర	839
దారాపేక్షం గష్టప్రారంభ	964
దివ్యధిషణుండగు ధిషణుం	1009
దీని నెఱిఁగించినపుడు	905
దీపమున ననేకములగు	916
దీవించి యెయ్యది సేసిన	987
దురమున జయము గొనుట	843
దురితంబులు దొడరు	833
దేవతలకు లోనుగా	970
దేవత లచ్చెరువడి	573
దేవతలను బ్రార్థించిన	789
దేవభావంబునకుఁ దగ	1006
దేవా! మోక్షార్థిజనము	590
దేవా! వైశంపాయనుండు	505
దేవా! వైశంపాయనుండు	679
దేవా! వైశంపాయనుండు	883
దేవి చిత్తమెఱింగి దేవుండు	820
దేహస్థు నదేహు నఖిల	601
దైవతమానుష తిర్య	807
దైవముఁ బిత్ర్యంబును	1047
దైవవశంబున నేఁడును	1069
దొరకొన్న ననుభవించు	798
దోష మరసి కామంబు	772
ద్వంద్వములు లేక పేర్మికి	780
ద్వారపాలు రచట వారింప	972
ద్వారములు నాల్గు మూయంగ	780
ద్వీపమునం బ్రబోధ	1061
ద్వేష్యంబుఁ బ్రియము	603

ధ

ధను మది యేల భోగము	965
ధనమించుకేని ధర్మం	834
ధనము కలిమియు	518
ధనము గలవాఁడు	519
ధనము చేటునవిసి	525
ధనములు బంధులు	640
ధనమేటికి? నీ విప్రుని	788
ధనయోగము దుర్లభమని	828
ధనవత్త్వము దుఃఖకరం	520
ధరణి పాదంబు లతని	810

పద్యము	పుట
ధరణి మొదలయిన	584
ధరణివల్లభ! చిత్త	915
ధరణీసురు నాస	1084
ధరణీసురుఁడును జప	558
ధర్మంబు తెఱంగిట్టిదని	748
ధర్మంబు తెఱంగు సూక్ష్మం	748
ధర్మంబుఁ బరిజ్ఞానము	908
ధర్మనిత్యుండు సత్య	1072
ధర్మ మధర్మము వోలె	705
ధర్మయమాదులను	571
ధర్మలబ్ధమైన ధనము	836
ధర్మసందేహములు నీవు	1066
ధర్మాధర్మంబులును	993
ధర్మారాముఁడు సంతత	755
ధీరుఁడై యభేద దృష్టి	850
ధూతపాపుఁడైన పూతాత్మకుం	704
ధృతి యారోగ్యము నొసగు	665
ధృతి లేమింగాదె మహాభి	909
ధైర్యంబునఁ వీర్యంబున	663
ధ్యానయోగ నిశ్చలము	581
ధ్యానైక తత్పరాత్ముఁడు	922
ధ్రువమండలమున	925

న

నగము లెల్లఁ బుణ్య	755
నగ్నలై యప్సర స్త్రీజనం	998
నదిరయము వారణేందుఁ	862
ననుఁ గానఁ బడయ రెవ్వరు	1016
నను డాఁప నేల దానం	955
నను నెవ్వరాశ్రయించిన	790
ననుబోఁటికిఁ బశుయజ్ఞం	801
నను మఱవక పనుపం	1093
నన్నూఱులు మున్నూఱులు	694
నయనముఖపాణిపాద	886
నరనాథ! యమృతమగు	803
నరనాథ! యుగ్రసేనుఁడు	688
నరనాథ! యుత్క్రమణ	924
నరనాథ! సుఖము దుఃఖము	509
నరనాయక! శిశ్నోదర	849
నరనారాయణులనఁగాఁ	1042
నరనారీ సంబంధము	892
నరసుత! వినుమీ సప్త	697
నరవర దానముఁ	532
నరుఁడు నారాయణుండు	1033
నరుఁడు నారాయణుండు	1039
నరుఁడు సుఖదుఃఖముల	643
నరుల నెలలు నేఁడులుఁ	692
నా కలిమితోడ నిచ్చెద	561
నాకు నా తపంబునకు	768
నాకు నీకు నేల నాకేశ	669
నాకుఁ బ్రజగతి నిచ్చు	516
నాకోర్కి పిదపఁ జెప్పెద	1088
నాకెఱిగింపవే వీనికిఁ	1061
నా చరితంబులు ద్రైలో	1065
నానారూపంబుల నిట్లేను	1044
నానా శాస్త్రంబుల నర్థా	823
నా పంపునను బ్రవృత్తి	1027
నా మనంబు సందియంబుఁ	782
నారచీరయేనిఁ జూరు	529
నారద పర్వత దేవల	835
నారదుం డట్లు విష్ణుని	1021
నారదుఁడు పరమపురుషు	1045
నారదుఁడు వచ్చి నరునిన్	1045
నారదుఁడు వచ్చి ప్రీతిం	987
నారదుని వచనములు	988
నారము లనఁగా జలముల	1033
నారాయణప్రణీతంబై	880
నారాయణప్రసాదంబు	1025
నారాయణీయమగు	1070
నాలుగింటను వెండియు	595
నా వలని రాగముననే	946
నావుడు నల్లనగుచు	821
నిక్కంబునకు నెవ్వరు	948
నిక్కమ కాలంబు నీకు	514
నిఖిల జనశ్రోత్రసుఖ	954
నిగమవేద్య మద్వంద్వంబు	1042
నిజనామ నిర్వచనము	1068
నిత్యతృప్తి శౌచనిరతి	530
నిత్యతృప్తుఁడైన సత్య	754
నిను డాఁచి కుటిలభావం	946
నిను నెఱుఁగకున్న	600
నిను నెవ్వఁ డెఱిఁగె	1043
నిను నే గెలుచుట	668
నిన్ను నెప్పుడుఁ దలఁచెద	606
నియమాచరణ కృశం	941
నిర్మలమగు నేకాంతిక	1056
నిశ్చేతనయును నెంత	902
నీ కడుపున జన్మించుట	831
నీ మూలంబే నెఱిఁగితిఁ	523
నీ యట్టి భార్యగలుగుటఁ	1086
నీ వట్టిఁడ వగు టెఱుఁగవు	981
నీ వడిగి తేను నిచ్చితి	564
నీవలనన కలిగి కురు	1065
నీ వాసపఱుప ధనములు	524
నీ వినిన యుపాఖ్యానము	1022
నీవు కల్యాణమూర్తివి	1088
నీవు గృహాధర్మ పరత	953
నీవు నిట్టుల చేయు	1022
నీవు నీయందు నినుఁగను	949
నీవు మును హీనుఁడగుట	667
నుతియు నమస్కృతియు	719
నురువున నొనరించిన	958
నృపధర్మ వైశ్యధర్మము	837
నృప నీవు మదీయం	568
నెట్టన చూడమి నయ్యెడు	937
నేతికుండ మోచి యే	864
నేలయెల్లను నేలిన	828
నైమిశారణ్యమున	1075

పద్యము	పుట
న్యాయంబులు ధర్మంబులు	695
న్యాయమున సంగరంబుం	844
న్యాయాద్యనేక తంత్రము	613
ప	
పంచశిఖుండను పరమ	942
పడయరాని యాయు వొడలి	833
పడసి తద్దేవుఁ గానఁ	1047
పడినం బాటినఁ గైదువు	844
పడియెడు దుఃఖము	849
పద్మభవముఖబాహూరు	840
పద్ముఁడను పేరి యన్నాగ	1075
పరతత్త్వోపాసన	738
పరమ బ్రహ్మపదము	710
పరమబ్రహ్మమ భూతో	700
పరమమునీంద్ర సంయమన	676
పరమర్మ భేదులును	852
పరమవరద లోక	1036
పరమ సుఖము దృష్ణ	510
పరమాత్ముని నారాయణుఁ	606
పరముండు నిరంజనుఁడ	1090
పరము నక్షరు విష్ణుని	590
పరితాప మనభితోషము	641
పరిపాటిఁ గర్మ మెడలఁగ	739
పరిహాసము భాషణమును	624
పర్వములయందు విప్ర	818
పలుకఁ డసత్యము	779
పలుకక యుండు కంటె	854
పలుకు వడినతనిఁ	854
పవనం బేకము ప్రాణా	870
పాండవవంశవర్య	1048
పాణి యుపస్థం బుదరము	778
పాతాళమునకుఁ జని	1053
పాదపాయూపస్థపాణి	914
పాదములకుం బ్రణమిల్లి	612
పాపకర్మంబు లెల్లను	824
పాపక్షయమున బోధం	581
పాప మించుక దొడరిన	836
పామెఱుగుఁ బాముకాళులు	579
పింగళయను వేశ్య దన	511
పిచ్చికలు గూఁడు శిరమునఁ	752
పిలిచిన నా సర్వగతుండు	998
పుచ్చికొనఁడు ముందట	779
పుట్టి దక్షిణాభిముఖియై	744
పుత్ర! వినుము నవద్వార	615
పుత్రదార బంధుమిత్ర	992
పునరావర్తన రహితుం	877
పురము శరీరంబు	741
పురుషుం డేమిటఁ బాపా	793
పురుషుఁడు చైతన్యాత్ముఁడు	917
పురుషుఁడును నంగనయు	746
పురుషున కవ్యక్తపరి	935
పురుషుని కల రూపెఱిఁగెడు	919
పురుషుని నవ్యక్తము	933
పురుషుని నింద్రియంబు	876
పురుషుని వలన	897
పురుషు లఖిలభూతముల	623
పురుషోత్తమ షడ్వింశక	933
పురుషోత్తముండుఁ బురుషుఁడు	937
పురహూతున కభిముఖియై	681
పులుగులలోఁ బూత్యండక	533
పూజారూపంబున నిచ్చిన	562
పొంతకు వచ్చినవాని	511
పొందు సత్త్వ రజ	617
పొరి బొరి భూతముల	738
పొరి నర్ధంబు	656
పౌరుషంబు సూవె ఫలద	699
ప్రకృతికి నాకును నుదకము	901
ప్రకృతికిని గుణములు	917
ప్రకృతి గుణంబులఁగొని	901
ప్రకృతి దనయిచ్చఁ గ్రీడా	916
ప్రకృతి దొఱఁగి తన్నుఁ	903
ప్రకృతి దొఱఁగి తన్న	936
ప్రకృతి పదాఱు	869
ప్రకృతి పురుషునిఁ గానదు	935
ప్రకృతి యలింగ తజ్జనిత	894
ప్రకృతి వాదులవ్యక్తంబు	897
ప్రకృతియు, బుద్ధ్యహం	601
ప్రకృతి సేసెనె యీ యపరాధ	901
ప్రజ యేనా కాన నన్నుం	802
ప్రజల హరియించుటిది	745
ప్రజలు దల్లిఁ జెందు పగిది	777
ప్రజ్ఞయ ప్రతిష్ఠలాభము	531
ప్రణవ పూర్వకమగు	591
ప్రత్యక్షహేతు	859
ప్రమద మొన	995
ప్రసన్నైకా	935
ప్రళయకాలంబున	1051
ప్రళయప్రకారంబు	913
ప్రాక్కృతజనుల	958
ప్రాజ్ఞుఁడు రమించు	857
ప్రాణాయామము గ్రమమునఁ	921
ప్రియములు నప్రియములును	507
ప్రియములు నప్రియములును	639
ప్రీతిం గడుఁ బొందలు విషాద	731
ప్రీతిగ నధ్యాత్మమునధి	913
ఫ	
ఫలకాంక్షి గాక నియతిం	547
ఫలములు గోరక కర్మం	601
బ	
బంధనంబులలో నెల్లఁ	737
బలమును నొప్పు బుద్ధియు	656
బలితపు టురిఁ గామంబున	961
బలి ప్రహ్లాద	531
బహువిధ ధర్మంబులు	1050

పద్యము	పుట
బాలభాను బింబంబు	680
బాలుఁడైనఁ గొడుకు	766
బిసరుహపత్రలగ్న	953
బుధుఁడు సూక్ష్మవిమల	542
బుద్ధికి మహత్తను	614
బుద్ధిఁగొని మనంబు వోనిక	629
బుద్ధిమంతుల తెరువునఁ	959
బుద్ధి యధ్యాత్మ మనఁ జను	915
బుద్ధియు ధృతియును	683
బుద్ధియును బ్రాణమును నిన్నుఁ	605
బోధనస్థాపనంబులు	1035
బ్రహ్మచర్య మహింస	635
బ్రహ్మచర్యసమేత తపంబు	719
బ్రహ్మచర్యాదులగు నాల్గు	784
బ్రహ్మరంధ్ర నిర్గతుఁడైన	573
బ్రహ్మహత్య దన్నుఁ బట్టిన	816
బ్రాహ్మణత్వంబు గడు	961
బ్రాహ్మణ ప్రార్థితము	908
బ్రాహ్మణివి యోగినివి	945
బ్రాహ్మణునకుఁ బ్రధాన	709

భ

పద్యము	పుట
భక్తి గలవు నాకుఁ బ్రజ్ఞాన	612
భక్తితోడ నన్నాగేంద్రుపత్ని	1077
భక్తి వీడ్కొని చని ముని	1021
భక్తుఁడగు బ్రాహ్మణునకు	985
భవదీయ వాక్యవైదగ్ధ్యం	948
భావములు నిజస్వభావం	650
భీమనాదుండు భీమ	747
భీరుఁడు శూరుఁడు జడుఁడు	515
భూతంబులఁ బచరించుచు	728
భూతంబుల దర్శింపమి	991
భూతజాలంబుతో	613
భూతతారతమ్యంబులు	708
భూతదయయు న హంకారాన	783
భూతములను గుణంబుల	877
భూతముల పుట్టుఁ జేష్టయుఁ	827
భూతము లవ్యక్తంబున	616
భూతంబులు నింద్రియ	845
భూతాత్మకమైన యఖిల	1017
భూమిజయము దొడఁగి	707
భూమి మొదలుగఁ గల	620
భూముఖ్యంబగు భూత	541
భూవర! నాకుం జూడంగా	842
భూసురవర! వేదము	928
భేరీ శంఖాదిక నానా	923
భోగంబుఁ దపముఁ బొరిఁబొరి	863
భోగములు సంపరిత్యక్త	964
భోగివర! యిది యిట్టిద	1095

మ

పద్యము	పుట
మంకినాఁ బరగు బ్రాహ్మణుఁడు	521
మగువా! దుఃఖము	944
మణిమయములుఁ గనక	583
మతిగల సాంఖ్యులు	598
మత్సరాది చిత్తమాలిన్యములు	760
మదీయనామ నిర్వచనం	1044
మన మధ్యాత్మము దానికి	914
మనమునకు సుఖము	522
మనమున నెద్దియుఁ గోరం	783
మనము మక్తులము గాకున్న	954
మనసు గొని మనసు	586
మనసు చేతివ యింద్రియ	912
మనసు నింద్రియములఁ	726
మనసును నింద్రియములనుం	715
మనసు నియమింప భూతా	711
మనసును వాక్కును గాయం	628
మనుసును వాక్కును రక్షం	854
మన సేకాగ్రతఁ బొంద	715
మనుజుల హరించి బాంధవ	744
మను విక్ష్వాకున కొసఁగె	1056
మమతంగాదే బహు	902
మరీచి యంగిరసుం	1027
మరీచియు నత్రియు నంగి	588
మఱియు నిత్తెఱంగు	880
మఱియు నెవ్విధంబు	1032
మఱియు నొక్కతెఱంగు	715
మఱియు నొక్క విశేషంబు	746
మఱునాఁ డజ్జనపతి	957
మఱునాఁ డమ్మహీపాలుండు	975
మలమూత్రంబుల కాలం	896
మహనీయ తపమున	928
మాతోడ నిట్లనియె	1063
మా నయనంబులు దత్తేజో	1011
మానవపతి సత్తమ!	938
మానవులకుఁ దలపఁగ	845
మానితముని యొకఁడు	611
మానుషజన్మము మేలతి	846
మానుషము దుర్లభము	963
మాయాశబలుండై యటు	729
మారుతముతో సమాన	982
మిత్రత్వము శత్రుత్వముఁ	769
మిత్రులు భార్యలు భ్రాతలుఁ	850
మీకును ధర్మవిరోధము	1080
మీరలిత్తెఱంగున కనుజ్ఞ	1080
మీ వచ్చినపని యెఱుఁగుదు	1026
ముక్కు వ్రాలుట కర్ణముల్	926
ముక్తుల ములుకులఁ గలయుట	954
మునిగోష్ఠివలని కొఱత	934
మునిజన వినుత చరిత్రా	589
మునివర! ధర్మదేవత	756
మునివరుఁడు గంధవతి	1049
మునుల ఋణ	834
మునులవలన దత్త్వం	760
మునులును సురలును	1022
మునులును సురలును	1029
మూఁడు పదులు ముహూర్తముల్	691
మూత్రమునఁ బురీషమున	621

పద్యము	పుట
మృగపక్షి సమూహము	969
మేలర్థింపను గీడున	528
మేలు గీడుమ నరుఁ బొందు	663
మేలొనరింపగ దొరకొను	811
మైత్రిం బోలెడు ధర్మము	710
మొదలఁ గలిగించి జగము	1030
మౌనమున దృఢజ్ఞానము	1085

య

పద్యము	పుట
యక్షవరునితోడ	788
యజ్ఞధరుడు పంచయజ్ఞుడు	596
యజ్ఞపరుడు రక్షకుఁడు	836
యజ్ఞార్థమొక్క బ్రాహ్మణుఁడు	787
యాగంబునందు శ్రద్ధా	758
యోగంబుఁ దపంబు	802
యోగతంత్రంబు సకల	867
యోగనిరూఢుఁడు	866
యోగబలము లేని యొక	861
యోగసాంఖ్యసిద్ధి నొంది	929
యోగి చూచు	879
యోగి యెట్టి యాహారంబు	864
యోగులకు యోగబలమున	860
యోగులును సాంఖ్యులును	878

ర

పద్యము	పుట
రజతాచలంబున రత్న	819
రథికునకుఁ గలమరికి	864
రవిబింబము రాహువు	579
రవి సృజియించును వర్ష	1089
రసకర్మజ్ఞుఁడు దారము	811
రసగంధప్రముఖంబుల	720
రాగపరిలిప్తమానస	623
రాగిత్వము విడువదు	1066
రాజభావంబు తొడుసునఁ	805
రాజునకు ధర్మము	837
రాజులకు యుద్ధంబు	564
రాజోచిత ధర్మంబు	506
రుద్రనారాయణరూప	1041
రూపవిభమముల నప్సరో	974
రోషముఁ గామము రాగ	600

ల

పద్యము	పుట
లలితాక్షతముల గుసుమం	973
లావును దృష్టియు గతియు	1052
లీలాస్వీకృతచక్రశూల	881
లేవు భయలోకములు	1049
లోకంబంతయు నెవ్వ	597
లోకంబెల్లను నేఁ జిత్రాకార	753
లోకము కాలముచే నిట్లాకుల	963
లోకము చందము గనికొని	520
లోక మెల్లను నఱచేతిలో	675
లోకేశ! నీవుధర్మ	1004
లోకోచ్ఛేదముఁ గర్మ	977

వ

పద్యము	పుట
వచ్చిన సంభ్రమంబు	1081
వచ్చి పోయి చూచువాఁడు	765
వచ్చి యభిపూజితుండై	809
వచ్చి రుద్రునకుం బ్రణమిల్లి	1041
వచ్చునప్పు డెయ్యెడనే	772
వధము ధర్మంబుగా బుధులు	771
వనితకుఁ బురుషునకుం	891
వనితగుణంబులు	891
వనితల పురుషులయెడ	953
వనితా చందనమున	943
వరధర్మము నర్థంబును	840
వరబహునుత వేదవ్యాస	1098
వరుసఁ గృత త్రేతా	695
వరుసదినంబులు దీఱిన	1080
వరుసన ధరణీ	707
వర్గత్రయంబున వలనను	950
వఱదఁగాష్ఠముల్	527
వల యురి యోదము	578
వసియింతు నే జగముల	1033
వాఁడును మత్ప్రభావంబు	1000
వాకును మనసును	635
వాఙ్మనఃకాయములు	628
వానప్రస్థ ప్రక్రియ	722
వానిం జెప్పెద నవహితుండ	826
వానికి మూఁడాశ్రమ	978
వాయువు చేష్టారూపము	539
వాయువుల నియత	572
వారక వడ్డికిచ్చి కుడువన్	759
వారల కథ మా తండ్రికి	1005
వారలకుఁ జూపు నిజ	1010
వారలకు వేదవిహితా	775
వారలు ముక్తులు గామి	951
వారికిఁ బ్రవృత్తిలక్షణ	1059
వారి కిట్లనియె నిష్మా	804
వాసవునకును బలికి	653
వాసుదేవుండు ప్రథమంబు	1057
వికసిత తృష్ణాలతికకు	636
వికృతులందును	1059
వికృతులు మహదాదిక	615
విడువరాదు దుర్మతు	798
విదితము గర్భాధానము	778
విద్వన్మోదవిధాయి	1050
విద్యయనఁగఁ బంచ	899
వినఁ జూడం బడునందె	979
వినయము విద్యయుం	712
విని నిద్రాదోషంబున	630
విని పార్థుఁ డిట్లు గలిగిన	1040
విని భరద్వాజుండు	538
వినుఁ డష్టమమగు	1080
వినుఁడెల్లవారు దుర్గం	985
వినుఁ! కామముఁ గ్రోధము	872
విను కుసుమంబుల	812
విను కేవలుఁడగు జీవుఁడు	904

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
వినుఁ కైటభుండు నా	1052	వినుఁ మజ్ఞానంబున	939	వినుఁ మునివర! వాగ్వృత్తి	758
వినుఁ! గర్భవాస దుఃఖం	871	వినుఁ మజ్ఞానకును	776	వినుము నివాత స్థానం	727
వినుఁ గుడిలో నున్న	926	వినుమత్యాశ్చర్య	1091	వినుఁ ముపనీతుఁడై	976
వినుఁ గుణములు	554	వినుఁ మధర్మం బహింస	993	వినుము ప్రకృతి పురుషుల	892
వినుఁ చంపఁ దగిన	772	వినుఁ మనఘ! యింక	808	వినుము ప్రతిగ్రహంబును	842
వినుటకును గనుట	911	వినుఁ మని ముని యిట్టులను	720	వినుము పురాతన జన్మం	510
వినుఁ డెల్లవారు	985	వినుఁ మనేక విధంబుల	506	వినుము బ్రహ్మోదితంబు	634
వినుఁ తత్ప్రసాద	727	వినుఁ మమకార వివర్జిత	549	వినుము! మృణాళంబున	848
వినుతమగు లోక	1039	వినుఁ మరిష్ట నేమియను	826	వినుము యోగమథనమున	616
వినుత జ్ఞానాభ్యాసం	631	వినుఁ మర్ష్టుఁడగు ననర్ష్టుం	835	వినుము వినుతస్వర	929
వినుతించిన నిందించిన	686	వినుఁ మలసుండును	825	వినుము విప్రకామార్థ	646
వినుఁ తెవు లుడుపఁగ	619	వినుఁ మవిద్య గాముము	639	వినుము శ్రద్ధ గలుగు	759
వినుఁ తొల్లి ధర్మవర్తనము	838	వినుఁ మవ్యయుఁడు	1003	వినుము సకలలోక	910
వినుఁ తృష్ణారాహిత్యంబున	784	వినుఁ మహంకార జయము	707	వినుము సత్త్వాది గుణముల	642
వినుఁ దారపుత్రమిత్రులు	964	వినుమహంకారమా	887	వినుము సుమతి	847
వినుఁ దేవతా ప్రసాదం	629	వినుఁ! మహన్మనో	697	వినుఁ మూర్ణనాభి తంతువు	732
వినుఁ దుఃఖంబులుఁ దెగ	546	వినుఁ మహింస విప్ర	773	వినుఁ మెఱుక గలర	781
వినుఁ దృశ్యంబు నదృశ్యం	903	వినుఁ మాంసశోణిత	959	వినుఁ మేకాంతికుఁ డెవ్వని	1017
వినుఁ నవద్వారపురమున	713	వినుఁ మాంసాస్థిమయం	624	వినుఁ మైదింద్రియములకును	729
వినుఁ నారాయణవరములు	1055	వినుఁ మాచార్యులు నూర్వురు	637	వినుఁ మొక్క కారణంబున	763
వినుఁ నృప! హర్షంబు	641	వినుఁ! మాత్మతీర్థ సంసే	725	వినుఁ మోక్షము గార్హస్థ్యం	777
వినుఁ పర్యాయంబున	667	వినుఁ మాత్ముఁడు క్షేత్రజ్ఞుం	553	వినుఁ మోహబీజ	740
వినుఁ పశుయజ్ఞము	516	వినుఁ మానస ప్రసన్నత	580	వినుఁ యోగంబు హిరణ్యం	1039
వినుఁ పాంసూదకముల	948	వినుఁ మాయావిధమిట్టిది	582	వినుఁ యోగివరుఁ డరిష్టము	927
వినుపించునది యను	608	వినుఁ మాఱుంచులు	725	వినుఁ! రేఖామాత్రపు	718
వినుఁ పురుషున కింద్రియ	577	వినుఁ మాశావిచ్ఛేదన	1084	వినుఁ! లోభము సంతోషం	839
వినుఁ ప్రవృత్తి కర్మ	717	వినుఁ మింద్రియ సహితము	876	వినుఁ విధికృత్యము	651
వినుఁ బీజంబున బీజంబును	893	వినుఁ మిచ్చెదనని	564	వినుఁ విప్రశరీరము	961
వినుఁ భావాభావంబులు	673	వినుఁ మీ తంత్రంబుల	1062	వినుఁ విష్ణుని సంస్పర్శం	815
వినుఁ మంచివారిచే	756	వినుమీ సంహరణం	701	వినుఁ వీతకల్మషున	591
వినుఁ మంతర్నాడిం జన	555	వినుము ఘటము సేయుట	795	వినుఁ వేదవేద్యము	932
వినుఁ మందు నొక విశేషం	711	వినుము జీవావస్థలు	810	వినుఁ శాంతులైన విప్రులు	784
వినుఁ మందు మనుము	995	వినుము దనుజనాథ	809	వినుఁ శూన్యస్థానంబున	952
వినుఁ మకంపనుఁడను	742	వినుము దేహాభిమానికి	619	వినుఁ సంసృతి మృత్యువు	515
వినుఁ మచిరవృత్తిఁ జేసిన	770	వినుము నృప సత్యమును	582	వినుఁ సత్త్వరజస్తమముల	634
వినుఁ! మజుఁడు శ్రద్ధ	758	వినుము నిమేషంబులు	691	వినుఁ సత్త్వరజస్తమముల	888

పద్యము	పుట
వినుఁ సర్వభూతముల	824
వినుఁ సాంఖ్యమ్మును యోగము	879
వినుఁ సాంఖ్యసమజ్ఞానం	920
వినుఁ సాత్త్వికములు	621
వినుఁ సుమతి విషయముల	847
విప్రుఁ డేమిట దేవత్వ	857
విబుధుల పండ్రెండు	692
విమలాత్ముఁడు పారాశర్య	1024
విముఖుం డగుటయు	866
విలయం బింద్రియము	631
విలుచుట నమ్ముట	752
విష్ణు బహువిధముల	1052
వీడ్కొని చని జగతిఁ జరియించి	654
వీరు పెద్దవారు వీరలు వినినిట్టి	952
వృద్ధకళత్రంబు బుద్ధి	827
వెడపనికి నాలిఁ జంప	767
వెడలుమని తెరువు సూపిన	830
వెనుక నరుగుచునున్న	998
వెలుఁగుచుండెడి దీపంబు	576
వేఁట వేడుక నడవికి	907
వేగిన నామంత్రితుఁడై	1077
వేదంబులకుం బ్రవర్తకుండు	1062
వేదతాత్పర్య మారసి	785
వేద మాచారములఁ జెప్పు	750
వేదములవలన నాకు	774
వేదములుఁ దదంగములు	737
వేదములు డాంబికత్వా	774
వేదములు సాంఖ్యమును	1060
వేదవిదుండగు విప్ర	513
వేదవేదాంగ సంవేది	558
వేదవ్యాసుడ! రమ్మని	1064
వేదవ్యాసుడు సుముఖత	1068
వేదశాస్త్ర పురాణ	878
వేదశాస్త్ర సరణి విడుచు	782
వేదసారంబు సత్యంబు	853
వేదాంతవిదు లనుమోదించు	556
వేదాంతవిదుఁడు దుర్లభు	618
వేదాదులైన పథముల	1069
వేదాధ్యయనంబుఁ దదంగా	825
వేదితవ్యంబన విదితంబు	786
వైష్ణవియుఁ గల్మష	607
వ్యక్త మవ్యక్తమును	633
వ్యక్తమునకుఁ బ్రభవం	596
వ్యక్త సప్తధార మవ్యక్త	617
వ్యాపకుఁడు సృష్ట బ్రహ్మ	698
వ్యాపించి రోదసీకుహరా	1033
వ్యాసమునినాథు	1002
వ్రేఁగు పెద్దినవోడ వారిధి	849

శ

శతమఖ కమలావాసా	684
శత్రుజనులు చెఱుచుట	649
శమనిరతియు నాత్మ	733
శమము దమము లేమి	843
శమసంపద బ్రాహ్మణ	733
శాంతము ధర్మప్రచయం	736
శాంతి పరినిష్ఠనకు	1058
శాంతిమంతులైన సౌమ్యుల	685
శాంతుఁడ వగు మని	658
శాకకణ మూలఫల	629
శారీర మానసములగు	545
శారీరస్థితికిఁ బ్రథమ	625
శాస్త్రతత్వ మెఱుంగక	822
శిరమున నర్ఘ్యపాత్ర	973
శిరమును నాభియు	864
శివకరము దపము	699
శివమును బరమబ్రహ్మము	905
శివుఁడవు నీవు జగములకు	1041
శిశ్నము నుదరమును	714
శుక్లమునకు మనసు	627
శూల ముగ్రతనెత్తి	830
శైలాదులయందు నిట్లు	540
శోకప్రమదాది ద్వంద్వా	798
శోకశ్రమ తృష్ణలకున్	524
శౌచమక్రోధంబు సంతోష	645
శౌచాదిగుణము లెడలుట	557
శౌర్యముననొ వృద్ధ	666
శ్రద్ధయును బలంబు	570
శ్రద్ధ ఋషితనయ!	757
శ్రమమున నింద్రియములు	632
శ్రీ కరణనిపుణ	679
శ్రీయును భూతియు	659
శ్రీవత్సము శూలాంకిత	1043
శ్రీశ్రితవక్షస్థల	505
శ్రీసంధాన ప్రౌఢదయా	883
శ్రుతము నాచారంబు	688
శ్రుతిపరతయు గురు	1004
శ్రోతకుఁ దనకుం	947
శ్వేతద్వీపంబునకుం	1011
శ్వేతద్వీపంబున భవ	1046
శ్వేతులు నింద్రియ	1046

స

సంతోషంబున నేగతి	785
సంతోషామృత సుఖిత	784
సంపద లేమికి మది	648
సంప్రమోదమందు	994
సంప్రీతుండై సముచిత	1081
సంప్రీతుండై సవిశేష	1004
సకల జంగమస్థావర	999
సకల దుఃఖభేషజం	614
సకల భూతంబులకును	663
సకల రత్నపూర్ణ సర్వ	727
సకల లోకములను	949
సగుణం బగుణంబగునే	919
సజ్జనులం దురాచార	550
సత్త్వగుణంబులు	916
సత్త్వమార్గాభిరతి	978

పద్యము	పుట
సత్త్వముననుండి	1037
సత్త్వరజస్తమోగుణ	888
సత్త్వరజస్తమోగుణ	917
సత్యక్షమాదమంబులు	855
సత్య ధర్మపరుండవగుటం	682
సత్యమ తపము	565
సత్యమ బ్రహ్మము	544
సత్పాత్ర దానక్రియ	567
సదయమనీషఁ బంచ	951
సదోపవాసియు సదా	646
సన్నిధిసేసి తపము	745
సమదర్శియై యఖిల	834
సమదృష్టిని ఱాయియు	716
సమయంబైనను గుసుమ	534
సరకు సేయవను చసడ్డ	667
సరసాన్నము పిణ్యాకము	528
సర్వజ్ఞుఁడగు పరాశర	1031
సరిపెంపునఁ గడు	670
సర్వ వర్ణాశ్రమములకు	644
సర్వసంకల్ప రహితుఁడై	726
సవినయంబునఁ దన	721
సాంఖ్యయోగ పరమ	1055
సాత్యవతేయుఁడీ పరమ	1023
సాదరవృత్తి సాధ్యుల	858
సారమతిఁ బరికింపంగ	522
సిత రక్తపీత నీలము	544
సిరిఁ బాసియును నొక్క	662
సుజనసంగతి కర్తవ్య	835
సుత! నీవు సుప్రసన్నా	736
సుత! వినుఁ శబ్దబ్రహ్మము	716
సురయక్ష గంధర్వ	1092
సురతంబు గుప్తమగు	551
సురపితృ పూజల	607
సురమకుట ఘటితరత్న	881
సురమునిసిద్ధ గణంబు	1000
సురలార్చిరి తూర్యం	815
సురలు మునులు భయ	820
సురసంయమి గరుడోరగ	698
సురసరిదాత్మజుతో	761
సులభమొ దుర్లభంబొ	525
సులభానామము సంస్కృతి	957
సులభాభిధానయగు	941
సూర్యవలనన బీజంబు	1090
సృష్టి తెఱంగు మున్నెఱిం	700
సొమ్ము గోరిన యంతన	524
సోమార్కాగ్నిమయము	599
స్పర్ధ సద్ధర్మమునకు	757
స్మృతియు సంప్రీతి	620
స్వజనంబులచేత	1087
స్వతంత్రవై నీవు చేసిన	946
స్వస్థతయు దుఃస్థతయు	730
స్థావరములు జంగమములు	594
స్థావరముల జంగమముల	712
స్థావరములు జంగమములు	700
స్థూలభంగులు	625
స్నానకాలం బయ్యెనని	990
స్వాధ్యాయంబు దపంబు	699
స్వాపావస్థం బ్రకృతి	632
స్వామీ కోపంబు	820
స్త్రీ పున్నపుంసకత్వము	576
స్రోతోవేగము పటుగతి	862

హ

హయ శిరోభాసితుండును	1029
హరియం దేనును	605
హరియాత్మ యెల్లవారికి	1049
హరిసత్త్వాది గుణంబులు	1054
హరునకు మ్రొక్కి మీ	816
హర్షంబును మానంబు	686
హస్తిమశకాంతరము	548
హింస లేక యునికి	992
హిమవన్నగంబు	1063
హీనస్థానమున	666
హృదయవేదిక	724
హేతురహితుఁడవు	603